త

త్రివర్ణచిత్రముల అకారాది సూచి సంచిక

ప్రకటన

ఈక్రింది కనబరచిన నెంబర్లవారికి ఈనెల భారతి (1938 సం. డిసంబరు నెల)తో ఇదివరకు చెల్లించిన చందా పూర్తి యగుచున్నది. తిరిగి ఇంకొక సంవత్సరమున కగు చందా మాకు చేరునట్లు ఈనెలాఖరులోగా మనియార్డరు చేసినచో తెంపు లేకుండ పత్రికను పంపుచుందుము. అట్లు తమ యొద్దనుండి 30-వ తేది లోపుగ సొమ్ము రానిచో సహజభాషాభిమానులగు తాము తిరిగి ఇంకొక సంవత్సరమువఱకు భారతి చందాదారులుగ నుందురను నమ్మకముతో 1939 సం జనవరి 10-వ తేదిని రూ 6—4—0 లకు వి. పి పంపుచున్నాము. గావున తా మెప్పటివలెనే పత్రికయం దభిమాన ముంచి సొమ్ము చెల్లించి వి. పి. నిగ్గెకొన ప్రార్థితులు. ఒకవేళ తమకి పత్రిక ప్రస్తుత మనవసరముగ దోచినచో మాకావిషయమును వెంటనే తెలియజేసిన యెడల వి. పి. పంపుట నాపుదుము.

A 4 13 14, B 17 18 19 21, C 5 6, D 4 5, G 8 12, H 18 21 55 56 58, K 1 4 5 18, L 10 11 12, M 12 13, N 21 22 23, P 33 36 37 38 39 40 41 42 44, R 43 42 43 44, S 26 29 30 32 33 34 35 38 39 106 107 108 109 112 115 116 117 118 119 120 121 123 124 125 126 127 128 129 130 131 132, V 28 29 30 31 32 33 34 35 38 Z 1 2

భారతి

సచిత్ర మాసపత్రిక

సంపాదకుడు

శి. శంభుప్రసాద్

ఆంధ్రపత్రికా ముద్రాలయము,

మద్రాసు.

౧౯౩౮


సంపుటము ౧౫, సంచిక ౮

ప్రకటన

ఈక్రింది కనబరచిన నెంబర్లవారికి ఈనెల భారతి (1938 సం. జూలైనెల)తో ఇదివరకు చెల్లించిన చందా పూర్తి యగుచున్నది తిరిగి ఇంకొక సంవత్సరమునకగు చందామాకు చేరునట్లు ఈనెలాఖరులోగా మనియార్డరు చేసినచో తెంపులేకుండ పత్రికను పంపుచుందుము అట్లు తమ యొద్దనుండి 30-వ తేది లోపుగ సొమ్మురానిచో సహజభాషాభిమానలగు తాము తిరిగి ఇంకొక సంవత్సరమువరకు భారతి చందాదారులుగ నుందురను నమ్మకముతో 1938 సం ఆగస్టు 10-వ తేదిని రూ 6—4—0 లకు వి పి పంపుచున్నాము గావున తామెప్పటివలెనే స్వదభిమానముంచి సొమ్ము చెల్లించి వి. పి. స్వీకరింప ప్రార్థితులు. ఒకవేళ తమకీ పత్రిక ప్రస్తుత మనవసరముగ దోచినచో మాకా విషయము వెంటనే తెలియజేసిన యెడల వి. పి పంపుట నాపుదుము

A 3, 4. C 2, 7. H 25, 26, 27, 28, 59. J 8 K 12. N 12, 13, 24 P 15, 16, 17, 31. R 16, 19, 20, 21, 45. S 52, 53, 54, 59, 60, 61, 62, 66, 138, 147. V 15, 18, 19, 37

విషయసూచిక



ఉ ప లా ల న ము



సంపు. ౧౫ బహుధాన్య, ఆషాఢమాసము (జూలై 1938) సంఖ్య ౭

శాంతి

పాటిబండ మాధవ శర్మ

విరిసిన తీవమల్లియల వెక్కసపాటును దూరుకొంటి నీ
చిరునగవుం బసందులకు చెందిన మోహాభరమ్ములోన; సుం
దరదరహాస తావకసుధామధురాధర లక్ష్యసిద్ధిచే
ఉరవగుచున్న సాత్త్వికమహోదయలుప్తబహిఃప్రవృత్తినై.

విమలవిభాతవేళ అరవిచ్చిన కన్నెగులాబికెంపుమ
వ్వము గని లేతగా అధరపార్శ్వములన్ స్పృశియించివచ్చితిన్;
క్రమపరిణామసిద్ధ మిది కారణజన్మముకాక రూపని
ష్ఠమొ, గుణనిష్ఠమో యగు జడప్రణయమ్మగు టేల కల్గెడున్ ?

నడకలలోననే త్రిభువనమ్ముల బందెలవెట్టు నీదు రా
కడ పసికట్టె నాయెడద; గాటపు నిద్దురలోన సైతమున్
వెడవెడ లేతనవ్వు ప్రసవించును; రాగతృషాభరమ్మునన్
బడలిన ఈసుధాధరముపై మృదుచుంబనముద్ర లుంతువో.

ఆపత్రనాత్రిమోహనము, ఆసుకుమారకరమ్ము నీదె! ని
ద్రాపరతంత్ర మీతనువు స్పర్శసుఖజ్ఞము గుర్తెఱుఁగ ట్లై; నా
లోపలిచూపులోపల వెలుంగు స్వరూపము నీవసుమ్ము; నీ
రూపము గానిరూపము నెఱుంగను స్వప్నములందు నైననున్.

శాసితమామకాస్వనిలచాలనముల్ వికచారవిందనూ
త్నాసపవాసనామృదువు, లార్యములో భవదీయమందని
శ్వాసము లాని ఘ్రాణములు శాంతి వహించెను సంతదాక నీ
కోసముగాక ఇంకెవరికోసము గానము సేతు పక్షినై ?

మది మృదులమ్ము, మాట లతిమంజులముల్, క్రియ లార్ద్రిభంగులై
గడరినగాక ప్రేమ మనగా ఒకడున్నె! ప్రసన్నవాంఛమై
మొదలు పరస్పరమ్ము పలికించు ప్రవృత్తియుకాక ప్రేమయ
న్నది ఒకడున్నె? ఒండుగతి నైజమెఱుంగునె ప్రేమభావమున్?

ప్రేమ స్థిరత్వమున్ బొరయు ప్రేరణ కామము; కామముగ్గమై
ప్రేమ పరస్పరమ్మును భరించు, క్షమించు, తనించు ప్రేమమున్;
కామము గాని ప్రేమము జగమ్మున మిథ్య; అకాములౌఋషి
స్వాములు నీరసుల్! జగము వారికి వారలగోల యేటికిన్ ?

భావన చేసినంతయును పల్కక, పల్కినయంత చేయకే
లా వధియింపజూతు వబలమ్మగు నాహృదయమ్ము? నింక నీ
త్రోవలు మాని నీదు కలరూపము జూపుము; దీర్ఘయత్నసం
భావితమైన నిశ్చలసమాధి మునింగెద, శాంతి బొందెదన్!

'వేనరాజు'

కీ. శే. కొంపెల్ల జనార్దనరావు

[సరిగా సంవత్సరమయింది సాహిత్యసేవకులు శ్రీ కొంపెల్ల జనార్దనరావుగారు తమ భౌతిక దేహం చాలించి. తమ జీవితమంతా నవ్యసాహిత్యాభ్యుదయానికి ధారవోసిన ఆయన వ్రాసి పెట్టిన గ్రంథాలేమీ లేవు. అమూల్యములైన ఒకటి రెండు విమర్శనములు మాత్రమున్నాయి. వాటిలో ఈ 'వేనరాజు' విమర్శ ఒకటి. ఈ విమర్శ పూర్తికాకుండానే ఆయన పరలోకగతులయినారు. అందువల్ల దీనిని సంపూర్ణంగా చదివి ఆనందింపగలిగే భాగ్యం ఆంధ్రసాహిత్యలోకానికి శాశ్వతంగా కొరవడిపోయింది. ఈ విమర్శను ఆయన తన 'ఉదయిని' రెండవ సంపుటం మొదటి సంచిక కిచ్చారు. కాని దురదృష్టవశంచేత అచ్చయివున్న ఆ సంచిక యిప్పటికీ బయటపడడానికి నోచుకోలేదు. ఆయన పరమపదించి సంవత్సరమవడంచేత ఆయన జ్ఞాపకార్థమవుతుందనిన్నీ, ఆయన వ్రాసిన విమర్శలలో ఇది ముఖ్యమయినదనిన్నీ యెంచి, అసంపూర్తిగా వున్నా దీనిని ప్రకటిస్తున్నాను.—మ. సో. శర్మ.]

మిక్కిలి చర్చకూ, సమాలోచనకూ పాల్పడ్డ యిటీవలి ప్రచురణాలలో విశ్వనాథ సత్యనారాయణగారి 'వేనరాజు' నాటకం ఒకటి. ఇందలి రచనకంటె కవిభావాలు, విశ్వాసాలు ఎక్కువ విమర్శ తెచ్చుకొన్నవి. ఏకవి అయినా తనకు మానసికముగా ఏర్పడ్డ ఒకానొక 'అవసరము'వల్ల ఒక గ్రంథము వ్రాయవచ్చు. అప్పు డా గ్రంథము, అది కళావీథికి చెందిన దైనప్పుడు, కళాపరమైన సమాలోచనలో మొదట నిల్చదగును. అయితే కవిభావాలు కళాత్మకముగా రచనయందు ప్రవేశించనప్పుడు ఆభావాలు ప్రత్యేకముగా, స్వాధికారతః, విమర్శ పొందడమున్నూ, కళాభంజకములని విమర్శ పొందడమూ సమంజసము కాకపోదు కాని, అవి తీవ్రాకలవై పాఠకుని మనస్సుకు నచ్చనివైనప్పుడు రచనలో అవి అతికినవో లేవో అనే ఆలోచనకు తావని విమర్శ సాధారణముగా వెలువడుట ఆశ్చర్యము కాదు. కాని అభినివేశములకు లొంగక రచనమును పరిశీలించుట సహృదయులకు మొదటి కర్తవ్యము.

వేనుడు ఆర్యఋషుల ఆలోచనకు విరుద్ధములైన ఆలోచనలు కలవాడు. ఆతడు తన నమ్మకములూ, ఆలోచనలూ తాను సాకుకొనడముతో ఆగక, భగవంతుడు లేడని చెప్పుటతో ఆగక, సంఘమర్యాదలకు విరుద్ధముగా నడచెను; ఇతరులను బాధించి తన ఆశయములను లోకములో నెలకొల్పసాగెను: తండ్రిరాజ్యమును తా నాక్రమించి తాను రాజై ప్రజలను తన మతమున కనుకూలపడునట్లు దండింపసాగెను.

ఈతడు నాటకములోని వేనుడు. పురాణములలోని వేనుడు తండ్రిని వెడలగొట్టి రాజ్య మాక్రమించలేదు. తండ్రి అంగరాజు

కొడుకు దుష్ప్రవర్తనకు ఖిన్నుడై తానే రాజ్యము వదలి అడవులు పట్టెను. మునులు, లోకక్షేమమును అపేక్షించేవారు కాబట్టి, రాజులేనిరాజ్యము ఉపద్రవముల పాల్పడునని అంగపుత్రుడైన వేనుని పట్టము గట్టిరి. ఆతడు రాజ్యమునకు వచ్చినందులకు, చోర సంఘములు భయత్రస్తములై గుహలు చొచ్చినవి. కాని ఆతడు సంఘ మర్యాదలకు మాత్రము వ్యతిరిక్తముగా పోయినాడు. వానిని భంగపరుప యత్నించినాడు: అందులకు తన రాచరికమున్ను వినియోగపరిచినాడు.

దివ్యులు వెఱఁగందఁగ, పృ
థ్వీవ్యోమము లగల, భేరి వ్రేయించె 'నయ
ష్టవ్య మహోత్సవ్య మదా
తవ్యం విప్రా' యనుచు నుదాత్తస్వనులన్.

ఇది ఒక ఉపద్రవమే అయినది ఆర్యమతావలంబి అయిన సంఘానికి. కాని వేనుని వాద మొక్కటి: దేవాంశసంభూతుడైన రాజు ప్రజకు పూజ్యుడు; ప్రత్యక్షదైవతము. అతని యిచ్ఛానుసారము, ఆతని ప్రీతికై ప్రజ ప్రవర్తిల్లవలెనే కాని రాజుకంటె పూజ్యముగా ఈశ్వరుని నిలిపి వ్యభిచరించరాదు. రాజు దేవాంశసంభూతుడని దిక్పాలురు ఆతనిలో కళలు కలిపినారని ఆర్యులు చెప్పినట్టిదే: అదొక ఆయుధముగా వేనుడు వారి నెత్తి కెత్తినాడు. ఈతనికి నహుషుని గతివంటి గతి పట్టినది. తదంశసంభూతుని పూజించవలెనని బోధించగలిగితే, ఆ ఈశ్వరునే పరమముగా పూజించే పూనికలు ఖండించుట సమంజసము కాక పురాణ వేనుడు దుర్బలత కనబరిస్తే, నాటకవేనుడు అది తప్పకొని, ఈశ్వరుడు లేడని ఒక కొత్త 'మతము'నే కట్టుకొని స్వతంత్రముగా నడప బూనినాడు. పురాణవేనుడు చిన్నతనములో దుర్మార్గవర్తియై ప్రవర్తించినాడు; మునులాతని రాజును చేసిన తర్వాతను తన మార్గమును తన మార్గమున నడిపినాడు కాని, తాను రాజు కా ప్రయత్నించలేదు; కాని నాటకవేనుడు స్వయముగా ఒక ప్రయత్నమును చూపి, జిగీష కనబఱిచి, నాటక నాయకత్వమునకు సంస్కారము పొందినాడు.

... ...

దురాశాపిశాచావేశపరుడనై నీవు బ్రాహ్మణులు నాతోఁ జెప్పిన సర్వపాపములను జేసితిని.

(అంకము ౧౧, పుట ౧౩౮)

అని వేనుడు మరణవేళను గౌతమునితో పలికినాడు. నాయకుని యీ కాంక్ష నాటకమును నడిపిన ప్రధానభావమని, 'నిమిత్త'మని (motive) యిందువల్ల స్పష్టము. అడవులు పట్టిన అంగరాజు — పిచ్చిరాజు — వేనుని, పృథువునూ కలిసినప్పుడెల్ల వేనుని దురాశాగ్రస్తతను ఉగ్గడిస్తాడు. ఆ దురాశాగ్రస్తత అంగరాజుకు తనయందు బాగా నాటిన అంశము. వేనునిదురాశ తొలినుండి కనిపట్టినాడు కనుకనే అంగరాజు పృథువును వేనునికి చెల్లెలుగానే ప్రకటించి అంతఃపురములో పెంపసాగినాడు. వేనునియెదుటబడ్డ అంగరాజు వేనుడు తనమతముగా చెప్పుకొనే సిద్ధాంతాలను, భావాలను అసమంజసములని వెక్కిరించి, యింతకూ మూలము నిజమైన మతాభినివేశము కాక ఆదురాశ సుమా అని నిరూపిస్తూ వస్తాడు. ఆ దురాశ, ఆకాంక్ష, పైకి వెల్లడికాకుండా వుండగలందులకైయే ఒకానొక మతము జనకోటికి

నచ్చజెప్పుతూ, అంగులకందులకై తాను రాజ్యము చేపట్టినట్లు, ప్రజలకు సరియైన నడవడి నేర్పుతున్నట్లు అది వేనుని నటన మాత్రమే అని అంగరాజు వెల్లడిస్తూ వస్తాడు.

కాని గౌతమునికి వేనుని భావములతోనే ప్రసక్తి. గౌతముడు ఆర్షధర్మపక్షపాతి. ప్రాణాధికమిత్రమైన వేనుని ప్రీతికై ఆతని యిష్టము ననుసరించి తన మతమునకు తానే విరుద్ధముగా నడుచుకొంటూ ఉంటాడు; కాని వేనుని ప్రతిఘటించి వాదిస్తూనూ ఉంటాడు వీరి యీ వాదముతోనే నాటకము ప్రారంభమవుతుంది. వేనుని బుద్ధి విపరీతపుత్రోవలు పోవుట, తనబుద్ధి సనాతనధర్మము పట్టుట వ్యక్తమైన గౌతముడు వేనుని తిరస్కరించి ప్రభువైన ఆతని కోపమును రెచ్చగొట్టి ఆతని మైత్రిని స్నేహమునకు తుదిచీటి ఇచ్చిపోతాడు.

వేనునికి ఎవ్వరూ తనకు కైవారము చేయుట ఇష్టము లేదు. అట్లు చేస్తే అది పెద్ద నేరము. అది తప్పని అనేకంటె, ముఖ్యముగా అట్లు చేయుట రాజాజ్ఞను తిరస్కరించినట్టు. శ్రీధరభట్టు కుఱ్ఱవంది: దూరపు పల్లెటూరునుండి వచ్చినవాడు. అతడు రాజాజ్ఞలు తెలియక, చదువులలో తాను నేర్చిన ఆచారముల ననుసరించి రాజును కైవారము చేస్తాడు. ఉగ్రుడైన వేను డాతనికి మరణదండము విధిస్తాడు. శ్రీధరభట్టు తాత వినీతభట్టు వేనునిఆజ్ఞలు దాటనిభృత్యుడు. ఆతడు మనుమని తెలియనితనము విన్నవించి, ఆతనిచావుతో తనచావున్ను తప్పదని బతిమాలినా వేనుడు క్షమ చూపడు: మాటలు చెవినేపెట్టడు. రెండుప్రాణాలు ఆతని పట్టుదలలో నలిగినవి. తన అనుయాయి అయిన వినీతభట్టును పోగొట్టుకొన్న వేనుడు తన మతమునందు చాలా అభినివేశము, ప్రత్యయము కలవాడుగానే కానవచ్చినాడు. కాక, తన కంతటి అభినివేశమున్నట్టు జగత్తుకు ప్రకటించేనిమిత్తమై ఆలాగు చేసినాడా? అసలు లోపలిదృష్టి రాజ్యకాంక్షయేనా?

కుఱ్ఱవంది ఉద్ధతుడు కాడు. కాడని వేనునికి తెలియును. తెలియవలెను. తెలియదనుకొంటకు వీలు లేదు. వేనుని ఆజ్ఞ రాజధానికి దూరపు పల్లెటూర నున్న కుఱ్ఱవానికి తెలియలేదన్నమాట. చదువులు పూర్వపువే అన్నమాట. అది వేనునికి తెలుస్తున్నది. కుఱ్ఱవంది విద్యాప్రకాశన లోభమున తాతగారికి తెలియకుండ వేనునికి కైవారము చేయవచ్చినది ప్రమాదమని తన నమ్మినవారివల్లనే తెలిసినది వేనునికి. ఆ తాతగారున్ను ఆప్తుడు. ఆతడే వచ్చి బతిమాలుకొన్నాడు, — తన నిష్కళంకమైన అనుచరత్వము అగ్రహతగా చూపెన్ని, తనప్రాణములు పోగలవన్నది విన్నవించిన్ని. కుఱ్ఱవంది కవితలోని పస మెచ్చినాడు వేనుడు.

"ఉత్తేజితమైన ప్రకృతినుండి రాదగిన కవిత్వము గూడ కులక్రమాగత విద్య యైనదే. ఆహా! దివ్యమైన మానవశక్తుల నన్నిటిని కులవిద్య లను సన్నని కృత్రిమపు బోదెలలో నొదిగించినారు!

ఇందులకుగాను కుఱ్ఱవంది, పుచ్ఛప్రాయముగా వినీతభట్టు, మరణించుట వేనునికి కంటిననలక నలుపుకున్నట్టు కాదు. ఆ పల్లెటూర వేనుని ఆనతి తెలియకపోవుట వేనునికి ఆశ్చర్యమే అయి సిగ్గుపడవలె. అంతటిపనికి

పూనుకొన్న అతని ఔద్ధత్యము, పట్టుదల వలని క్రౌర్యము, నాటకవస్తునిర్వహణానికి ఉపకరించే మానుషచౌర్యాల్యము అయినది. కాని అది దర్బలమైన దౌర్బల్యము. ఇది కారణముగా ఒక ప్రతివాహిని ఉబికి చివర వరకు నడిచింది.

వేనుడు స్వయముగా చెప్పిన దేమయినా, అతని పనులే కాక, అతని ఆలోచనలు కూడా మనకు తెలుసు. అతనికి కొన్ని స్వతంత్రములైన భావము లున్నవి. అతని మనస్సులో గుప్తమైయున్న రాజ్యకాంక్షను గుర్తించిన అంగరాజు ఒక ప్రతిద్వంద్వి ఉన్నాడు కాని, గౌతముడూ శ్రీధరభట్టుకోవామాత్రం అతని భావాలవల్ల లేచిన ప్రతిద్వంద్వులు.

అంతే కాదు. పృథువు వేనుని చెల్లెలుగా పెరుగుతుండెను. చెల్లెలంటే వేనునికెంతో మక్కువ. వివాహము వలదని భావించిన వేనుడు, పోనీ, తోబుట్టువును వివాహమాడెద నంటాడు. 'వివాహము లేక జారత్వము లేదు, జారత్వము లేక పాపము లేదు' అన్న వాదముతో వివాహము వలదన్నవాడు, ఆస్తివిషయమై భేదములు రాకుండునని తోబుట్టువును చేపట్టెద నన్నందుకు గౌతముడింకొకసారి ప్రజ్వరిల్లి వెళ్లిపోతాడు; అతని సిద్ధాంతములు నచ్చని పృథువు మృదువుగా ధిక్కరిస్తుంది. 'నీ సిద్ధాంతములకు నే నెన్నడు నొప్పుకొనలేదని నీకు తెలియునుగదా' అని చెప్పినది పృథువు: అతనికి కొన్ని సిద్ధాంతము లున్నవి; వాటిని పృథువుకూడా ప్రతిఘటిస్తున్నది. కాని అంగరాజు మాత్రము వేనునికి దేనియందును నమ్మకము లేదనిన్ని, కొన్ని నమ్మకములు లోకమును మోసగించుటకు పలికినవ ననిన్ని నిరూపించక మానదు.

వేనుడు గౌతమునితో యుద్ధము చేస్తూ (అంకము ౩ ద), తాను గౌతమునిచేత చచ్చుటయే కోరికగా అంపలకు పూనుకొనిన్ని, అతని పడనేయగలిగిన వీరావేశములో, 'నేను గౌతమునే చంపెదను. మరల నా రాజ్యము స్థాపించెదను. పారిపోయిన సైన్యాల నందరిని పిలిపించి నా మతము మరల నిలువ ద్రొక్కెదను' అని విజృంభించినాడు. వేనునికి నిజ మత మొకటి ఉన్నది. దానియందంతటి నమ్మకమూ, పట్టుదలా ఉన్నదన్న మాట. (లేదా, బూటకమే తిరిగి నొక్కొనెంచినాడు.) కాని కొంచెము సేపటికే, తిరిగి వేనుడు తనభావములవల్ల ఏర్పడ్డవని చెప్పగగ్గ పాపములే 'దురాశాపిశాచావేశవికలుండనై' చేసితినని వెల్లడించుట గమనిస్తే, ఆ భావాలలో దాగి, ఆ భావాలు ఏర్పడుటకుకూడా కారణమైనది దురాశ ఉన్నదని స్ఫురిస్తుంది. కాని ఆభావములు అతని ఆశా నిర్వహణానికి తోడుపడ్డవి కాని, దానిని బయటపరిచేవి కాని కావు. వేను డీరాగా రాజ్యము సంపాదించినాడు. తన చండశాసనత్వమువల్ల అది నిలద్రొక్కుకొంటున్నాడు. ఇక అంగరాజు పిచ్చివాడని చెప్పుటకు నూతనభావజాలం ప్రజలచేత నమ్మించుటకు, ప్రజలున్న పిచ్చివారే, అతని ప్రకారము కూడా. మరి రాజ్యము నిలద్రొక్కుకొంటకే కాక ఆ నూత్నభావములు వ్యాపింపజేసికొనుటకున్న చండశాసనత, చండతరశాసనత కావలసివస్తున్నది. తన చండశాసనత్వముతో ప్రజల నోరు మూసి రాజ్యమేలక, వారిని మరింత రెచ్చగొట్టి మరింత

ప్రయత్నముతో అణగద్రొక్కుట, దురాశా పరత్వమే ఆనిపత్త్వమయితే, ఆవశ్యకము కాదు. కాని ఆతడు తన భావాలు ప్రసారించి, తోడుగా చండశాసనత్వము పంపినాడు ప్రజలపైకి. దురాశకు తప్పిన స్వాతంత్రములైన భావము లాతనిని ఆవేశించి ఉన్నవి కనుక. క్రమముగా వేనమతము ప్రజలలో వ్యాపించి ప్రజ రెండు పక్షములైనది. ప్రజలు వేనుని అనుగ్రహమునకై పాకులాడుటగూర్చి గౌతముడు ఖేదపడతాడు. ప్రభుప్రసాదమునకై పాకులాడగల ప్రజనే అయితే, తన రాచరికము బలపరుచుకొనుటకే అయితే, ఈ నూత్నభావములు లేకుండా మరింత త్వరలో వశపరుచుకొని ఉండవచ్చు వేనుడు: అంగరాజు పిచ్చివాడు కాకపోతే మాత్ర మేమి?

... ...

వేనునికీ గౌతమునికీ స్నేహ మొక వంక, వైర మొకవంక లాగులాడుతవి. వేనుడు గొప్పగాయకుడు. సౌందర్య మెరిగిన మనస్సు వాడు. వేనాసురవధార్థము బయలుదేరి వచ్చిన గౌతముడు ఆతని సంగీతము విని కరిగిపోయినాడు. మరెందులకూ వేనుడు బ్రదుక అనర్హుడైనను, ఆతని సంగీత, శిల్ప, కవిత్వ మాధుర్యములకైనా బ్రదుకతగిన వాడని కొనియాడినాడు. గౌతమునిసుముఖతకై యేమి చేయుమన్నా చేయగలంతటి స్నేహము వేనునికి. వేనుని ఆజ్ఞ ధిక్కరించి తాను వివాహమాడిన సంగతి గౌతముడు వెల్లడిస్తాడు. రహస్యముగా దేశములో అట్టి వివాహములు పెక్కులు జరుగుతున్నవనిన్ని. వేనుడు గౌతము నేమీ అనడు. ఆతని భార్యకుగాను ఉంగరము కానుక ఇస్తాడు. మరిన్ని, తన భావములను సౌమ్యముగా వెల్లడించి, 'లోకము...వినదు. పదిమంది నడచినదే త్రోవ. మన మేమి చేయగలము?' ని తన నిజమైన విశ్వాసము ప్రకటించి, గౌతముని మెప్పు పొందినాడు: 'నీవంటిదివ్యపురుషులు జన్మించనే జన్మించరు. జన్మించినను నీవంటి ప్రత్యేకతాగుణములు గల వారివలన లోకమునకు లాభము లేద'న్న గౌతమునివాక్యము వేనుని నాయకత్వములోని ఒకఛాయ వెల్లడిస్తున్నది. వేనుడు కేవలము దురాశాపిశాచగ్రస్తుడైమాత్రమే ప్రవర్తించలేదు.

.. ..

వేనునితల్లి సునీథ అంగరాజు పదభ్రష్టుడైనపిదప కూడ అంతఃపురములోనే ఉండెను. అంగరాజు ఒకరాత్రి వచ్చి సునీథను తీసుకొనిపోయినాడు. 'కోటతలుపులు వానియంతట నవియే తెరచుకొనిపోవును' అంగరాజునకు. ఆతనికి నమ్మిన బంట్లు ఉండనే ఉన్నారు రాజుకొలువులో ఇంకను. ఆతడు వేనుని పదభ్రంశమునకూ, పృథువు పట్టమునకూ ఎత్తులు వేస్తూనేవుంటాడు. కాపీతకుడు వేనుని భృత్యుడు అంగరాజునకు అనుకూలించే సూచనలు చూచి వేను డాతనికురి విధించెను. కాని, అంగరాజును కారాగారబద్ధుని చేస్తే, సునీథ వెడలిపోయినందుకే చిక్కిసగమైన పృథువు మరింత భరించలేక పోతుం దని ఊరకుంటాడు. పృథువూ, గౌతముడూ వేనుని స్నేహాత్మకమానుషదౌర్బల్యానికి ప్రతిరూపములు. శ్రీధరభట్టూ, వినీతభట్టూ మరణించిన వెనుక వారి బంధువులొకరొకరుగా వేనునికి కైవారములు కవితకట్టి ఆజ్ఞోల్లంఘనమునకు ప్రాణము లిచ్చిరి.

వారికవిత మెచ్చుతూ వేనుడు తన ప్రభుత్వ మును మాత్రము ముద్రించుట మానడు. కాని గౌతముడు ధర్మాభినివేశముతో ప్రజలలో విప్లవము లేపుతున్నా, వేను డాతని నేమీ చేయలేడు: చేసుకొంటే గౌతముని పెళ్లి చేసుకొంటా నన్నవాడు మొదట: ఆ స్నేహము అతిగాఢ మైనది. మరి పృథువు కోసమని అంగరాజు నేమీ చేయడు. పృథువును పురస్కరించుకొని అంగరాజు ప్రతిక్రియ కొనలు సాగుతుంది. వేనుని రాజ్యకాంక్ష సూచనలు చిన్ననాటినుండీ పొడగట్టి అంగరాజు పృథువును మగబిడ్డను ఆడపిల్లగానే పెంచినాడు. ఇప్పుడు వీలునుబట్టి ప్రజను తిరుగబెట్టి పృథువును రాజును చేయ ఆతని యత్నము. అప్పుడు పృథువు కాకపోతే అంగరాజు తానే రాజు కావచ్చును కాని, పృథువుకోసము కాకపోతే వేనుడు అంగరాజు తరవాయి చూచియే ఉండును.

అంగరా జొకవిస్తారపువ్యక్తి. ప్రత్యక్షవాదిమైన వేనునికి అప్రత్యక్షమూలాల నుండి ప్రతిఘటనము దింపినాడు. వేనునికి అట్టియెడ ఒక సహజమైన అచ్చెరుపాటు ఉన్నది. తొలిఅంకములో గౌతముని అమర్షమూ, శ్రీధరుని చావూ మాత్రమే కాదు ఏర్పడిన కాలువలు. అంగరాజు ప్రసంగము పృథువుతో వస్తుంది వేనునికి. అంగరాజు తోటలోని పూవులు కోసుకొని ఒడలంతా అలంకరించుకొని పోతూఉంటాడు. అతనికి కోటతలుపులు తీయరాదు కాని, తలుపులవే తెరచుకొంటవట. అతనిని చూచినవారు పట్టియీయవలయును వేనునికి. వేనుడే చూచినాడు కాని మాటాడలేదు. ఎల్లో అతనికీ తెలియదు. కాని యేపూవులు పృథువు ధరిస్తే త్రిలోకసుందరివలె ఉంటుందో అవి అంగరాజు ఒడల బూదికలవలె ఉంటవి. పుష్పాడి బూడిదవలె ఉంటుంది అవి యేని కలనుకొన్న శ్లథాంగుడు శ్లథబుద్ధి — అవి పూవులు, వేనునికి తెలియును.

అయితే పృథువు రాజ్యశ్రీకి ఆటపట్టు. అంగరాజులో కళలు జారినవి. వేనుడున్ను పృథువు అలంకరించుకొంటేనే కాని ఆమె సౌందర్యము చూడ నొల్లడు. పూవులు రాజ్యశ్రీ.

రాజ్యలక్ష్మీదేవతయైన సుశోభను చాప్పించుకపోయి అంగరాజు పూవులు వదలివేసినాడు. అవి పృథువుకు శ్రీకరాలంకారములు. మొదట పూవులు కోసికొనిపోయి నప్పుడున్ను అంగరాజు ఒక్క మందారపూవు వదలిపోయినాడు. అది పృథువు తలకు పెట్టుకోవలసిన దని వేనునియిచ్ఛ. అప్పుడు పృథువొకకథ చెప్పింది. ఆపూవు మాటాడి ఒక పాట పాడిందట: తాను తెగకొట్టబడ్డ రాజు తలకాయవలె నెత్తుట పొరలాడుతుండగా ఇంకా తనను త్రుంచడ మెందుకు ?—అని. ఇది విని పృథువుకు పిచ్చియెక్కిన దంటాడు వేనుడు. ఈ మందారపూవులో కవి ఒక ప్రతీకము (symbol) రచించ నెంచినాడు. దానిలో భావ్యర్థసూచనము ఉద్దేశించినాడు. కాని యిట కథాక్రమములో జరిగిపోయే అంశములో ధ్వని యిమడ్చడము కాక ప్రత్యేకము ఆసూచననే వాచ్యపరిచి పూవుచేత పాట పాడించి భావ్యర్థము సంకేతించినాడు. ఒకమూల కుర్రవంది చావు విన వచ్చింది. కాని వేనునికి పృథువు సౌందర్యము మీదనే దృష్టి.

వేనుడు:— పృథూ! నీ వా మందారపుష్పము తలకు పెట్టుకొనుము.

పృథువు:— వేనా! నీ వీకుర్రవందితల మొలకు కట్టుకొనుము.

ఈ మాటలతో అంకము ముగుస్తుంది. రాజదండమున మరణించిన కుర్రవందితల రాజు మొలకు కట్టుకున్నట్టే. ప్రసంగశక్తి వల్ల, మందారమును పృథువున్ను తలకు పెట్టుకొన్నట్టే. అయితే ఆమందారము తెగ కొట్టబడ్డ రాజుతలకాయవలె ఉన్నది. అది వేనుడు స్వయముగా పృథువును ధరించమని బలవంతపెట్టుతున్నాడు. వేనుడు తన అంతము తానే ఏర్పరుచుకొనేలాగున ఉన్నాడు. మనుమని ప్రాణములు కాపాడ వేనుని వేడుకొన్న విసీతభట్టు 'మందారసుమము వంటి వాడు. వానిమెడ యేల నులిమెదవు?' అని కుర్రవందికికూడా మందారము ఉపమగా ఇచ్చి, యీ మందారమునకు ఇంకొక ప్రతీకముకై ఛాయ విసరుతాడు. మందారము అప్పుడే తెగకొట్టబడ్డ రాజు తలకాయకు ప్రతీకమై కూర్చున్నది. కుర్రవందిమెడ నులిమినాడు వేనుడు. రాజే రాజుతలకాయకు ముప్పు తెచ్చుకొన్నాడు!

వేరొకచోట (మూడవఅంకమున) అంగరాజు, వేనుడు, పృథువుల ప్రసంగములో ఒక పెంపుడు గోరవంక తన ప్రభువునకే అమంగళము పలుకుతుంది. ఆ మాటలు తనకు గౌతముడు నేర్పెనన్నది. గౌతమునికి వేనుడు నేర్పెనట 'ఆ వక్రపుం గూంతలు'. కాబట్టి 'నీ ప్రాణములమీంద నీకే విరోధమని తెలుచున్నది' అని పృథువు చదివినది. ఈ సూచన చివరంట మనసు తరుముతూనే ఉన్నది. చివరకు వేనుడు తత్త్వము తెలుసుకొన్నాడు. తన చేసికొన్న కర్మము తనచుట్టు సాలీనిగూడ డల్లినదట; ఒక పెనుభూతముగా తన్ను నాశము చేయుటకై వేచియున్నది నారాయణుడట. ఆనానారాయణుడు లేడని తాను వాదించినందుకు అనుతపించినాడు.

ఆతడు నారాయణుడు లేడన్నాడు. ఒకసారి ఆతనికి గౌతమునియెడ స్నేహము ముంచినప్పుడు, ఆతని వాదము కొంతవరకు గంభీరముగా తోచినది. కాని తా నిన్నాళ్లు కట్టిన సిద్ధాంతములు తప్పులని నమ్మకము కలుగలేదు. కౌషీతకుని మరణానంతరము అతని తమ్ముడు ద్వ్యాషీతకుడు వేనుని భృత్యుడవుట చూచి గౌతముడు వేనుని స్వార్థపరత్వమునకు నిందిస్తాడు: ప్రజలలో కొందరు పరప్రత్యయనేయబుద్ధులు, అవివేకులు ఉండనే ఉందురు, వారిని స్వార్థాభిలాషియై వేనుడు రాజ్యము కట్టుకొంటున్నాడని.

గౌతముడు సహా ఉగ్గడించిన యీ వేనుని స్వార్థపరత అతని సిద్ధాంతపరత్వముతో అన్వయించుకొంటే మేలు (అప్పుడు దానిని స్వార్థపరత అనడము కష్టమే కాని). అప్పుడు రాచరికం మొకపరికరము. అంగరాజు వేనునిచేత ఇడుములుగుడిచి రాజ్యము తొలగించబడ్డది నాటకములో జరిగిన తప్పిదము కాదు. నాటకములో వేనుడు కావించినవి భట్టుల ఉరి మొదలైనవి ఆతని సిద్ధాంతపరత్వమునకు చెందినవి. ఈ నిమిత్తమునసే వికసించిన నాటకమందు, నిర్మాణవశముచేత, వేనుని రాజ్యకాంక్షకు బలి అయిన అంగరాజున్ను స్థానము పొందకపోడు.

వేనుని కర్మసూత్రములు ఏలాగు బహిర్గతములై ఆతని చుట్టినవో నిరూపించడమే ఇక్కడ వస్తుగతి. అయితే ఇది వేను డనే ఒకానొకవ్యక్తి చరిత్రము చెప్పుట కాదు. వేను డనేపాత్రము కల్పించి రుచికి సాన బెట్టిన నిర్మితి. అటు కాగా వేనునియందు ఒక తీర్చిన స్వరూపము కవివల్ల లభ్యము కావలె. కవి వేనునికంటె భిన్నభావుడై ఆతనిని తన భావాలతో విమర్శ కగ్గము చేసినదెల్ల ఆపాత్రకు దారిద్ర్యమే. గౌతముడు, అంగరాజు, పృథువు అనేవారే కాక కవికూడా వేనునికి విరుద్ధముగా నిలిచి వారితో కుట్రచేయడము గోచరిస్తూవస్తుంది. వేనునిబుద్ధి యెంత పెడత్రోవ పట్టినా దాని నైశిత్య మప్రతిమానమైనది అని అంగరాజే చివర ప్రశంసిస్తాడు. కాని తొలినుండీ ఆతని సంభాషణలలో ఆనైశిత్య మంతగా గోచరించదు. తద్విపరీతమైన మాటలు ఆడి ఓడిపోతాడుకూడా. కవి ఆపాత్రను రచించేటప్పుడు తదుచితమైన మనఃప్రకృతి సాంగోపాంగముగా నిరూపించుకోగలిగితే ఫలితము వేరుగా ఉండేది. కాని గౌతమాదుల వాదమున్ను తెలివికంటె పట్టుదలయే ప్రధానముగా చూపుతుంది. ఈ పట్టుదలకు కవి అభినివేశము వెనుక నిలుస్తుంది. కాకపోతే వేనుడు వానిని ఎగురగొట్టి ఉండును. ఆతని బుద్ధినైశిత్య మప్రతిమానము కాబట్టి. గౌతమునియందు బుద్ధియన్నది ప్రధానముగా, నిశితముగా కానరాదు కాబట్టిన్ని.

కాదు. గౌతము డసలు వేనునికి తగినంత మాటాడ వీలీయడు. అడుగడుగునా మతాభినివేశపు టుద్రేకముతో గొంతెత్తుతాడు. వేనుడు వాదమురకముగా మాటా[illegible] స్నేహముపై మీ[illegible]. [illegible] కోపములో ఉడుకుతాడు. ఇంకెవరు ఎదురు తిరిగినా వేనునికి లెక్క లేదు కాని, [illegible] ముని ప్రతిఘటిస్తే ఆతడు భరించలేడు. ఈ మానుషప్రకృతి సౌందర్యవిశేషము తొలి నుండీ వేనుని మనకు సన్నిహితుని చేసినది. సంభాషణాయందలి లోకమునుండి ఈ సౌందర్యము ఒకప్రక్క[illegible] పొడసూపుతుంది. అదిన్ని నాటకోచితమైన మానుష దౌర్బల్యముగా అంకురించినదై ఒక [illegible] మనస్తత్త్వ[illegible] అవలంబిస్తున్నది.

.. ..

వేనునియెడ పగరగిలిన [illegible] పిచ్చియెక్కి అడవులుపట్టిన అంగరాజును చూచినాడు. ఆతనికిగల తాను తీర్చుతానని శపథముపట్టి ఆతని ననుసరిస్తాడు. ఆతని ధోరణిలో ఆతనివద్ద ఏదో మహారహస్యమున్నదని గ్రహించి, ఆతనిని వదలడు. వేనుడున్ను అంగరాజు నేమి చేయనొల్లడు సరే, ఆతనివద్ద రహస్యమొకటున్నదని గుర్తిస్తాడు. తనకు ఆతనివల్ల హాని లేదని యెంచినాడు. కాని ఆతని వదలలేక పృథునికోసమై సాకుపెట్టి అంతఃపురమున రక్షింపజూస్తాడు. వేనునికి కాని గౌతమునికి కాని అంగరాజు లొంగడు.

రానురాను అంగరాజు తన విచిత్రమైన వ్యక్తిత్వముతో వేనుని సున్నితమైన మనోభావమును వశపరుచుకో గలిగినాడు. అమనస్సులోనే విప్లవము లేపినాడు. పిశాచము లున్నవేమో అని వేనునకే అనుమానము పుట్టెను. నిజముగా అతనికి పిశాచములు కన్పించినవికూడా. తనచేత చావుకోరి పడసిన నిపీతభట్టు బంధువర్గము, కాపీత

కును పిశాచములై అతనికి ప్రత్యక్షము. అతనితో చర్చలు చేసినారు, తిరిగి అతనికి తనకిరాని కైవారములు చేసి తీరినారు. ఈ పిశాచములు ఆతని మనోవైకల్యములు స్థూలముగొన్న సూక్ష్మమూర్తులు కాదు. ద్యాపీతకునికి కనబడలేగట కాని, అది వాటి తప్పు కాదు. పోసీ వేనుని కొక్కనికే కన్పించినా, అది వేనునిభావములో భాగములని చెప్పలేము. వినీతభట్టు ముసలివియ్యపుగాలు కైవారము చేసి తన దుఃఖమును బాపుకొందా మని వస్తే వేను డామెను చంపడు. బంధిస్తాడు. ఆమెకూడా దయ్యమవుతుందని భయం. కాని ఆమెయే ఉరిపోసుకొని చనిపోయి దయ్యమైతీరినది. వేనుని యీ పిశాచభీతికి గౌతము డాశ్చర్యపోయినాడు

'హిమవంతమువంటి ధైర్యముకల వేనుడు భయపడెనా? కారణమేదియో పెద్దదే యుండవలయును.'

ఉన్నది కారణము.

అంగరాజు తిరిగి తోటలోని పూవులన్నీ కోసుకొని పోయినాడు. వాటితో ఆతడు రాజ్యలక్ష్మీదేవి యైన సునీథాదేవి పాదములు పూజిస్తాడుకాబోలు. పృథువుతో భూదేవి చెపుతుంది, సునీథాదేవియందు అంగరాజు రాజ్యలక్ష్మీదేవిని ఆరోపిస్తున్నాడుకాని, అసలు రాజ్యలక్ష్మి తా నని— పృథువు ఆపూవులన్నీ తెచ్చి తన్నుపూజించ దగునని. గోమూర్తిగా, స్త్రీమూర్తిగా భాసించి భూదేవి పృథువునందు పురుషత్వము రేపి, తనయందు కాంక్ష కట్టింది. వేనుడు ఆ హృదయపరిణామవేళను పృథువును చూచి,

'ఇదేమి? పృథు పృథుగా లేదు. ఈమెలో నేదియో మార్పు కలుగుచున్నది. నాకు మిగిలిన బంగారమె యొక్క తెయే? ఇదికూడ నన్ను త్రెంచుకొని పోవునా?'

అని బెదరినాడు.

సంప్రదాయములు కిట్టని వేనునికి తనను అందరూ 'వేనా' అని పిలువవలసినదే కాని రాజనికాని, అన్న అని కాని అనుబంధ ద్యోతకమైన పేర పిలువరాదు. ఆతనిసిద్ధాంతములకు ఒప్పుకపోయినా తనవిషయములందు ఎదురొడ్డనని వేనునికి వాగ్దానమిచ్చిన పృథువు వేనుడు తోబుట్టువును వివాహమాడెద నని గౌతమునితో స్వసిద్ధాంతసమర్థనములు చేసే ప్రసంగము విని అదిమొదలు తా నా వాగ్దాన ముపసంహరించుకొని ఆతనిని 'అన్నా' అని పిలుచుటయే నిజమని చెప్పి, ఆతని పూర్వానుబంధమునుండి ఒక అడుగు ఈవలకు వచ్చిఉండెను. భూదేవి వల్ల తాను పురుషత్వము ప్రవేశిస్తూ, వేనుని పిలుపునకు 'వేనా' అని మారుపలికినపుడు, ఆతడు "నన్ను ఇంక 'అన్నా' యనియే పిలిచెద నంటివిగదా?" అని జ్ఞాపకముచేస్తే, "కాదు, 'వేనా' యనియే పిలిచెదను" అంటాడు పృథువు. వేను డొకసారి తన అతిలోకమైన వీణావాదన సామర్థ్యము నెరపుకొని స్నేహము నిండిన మనస్సుతో దివ్యపురుషునివంటివాడై, ఆ గానమాధురి కందని తృప్తి యిచ్చే గౌతముని సాన్నిధ్యమందు, పృథువు 'వేనా'అని పలికితే, 'అన్నా'అనియే పిలువుమని స్నిగ్ధమైన అనుబంధములో పృథువునూ తననూ బిగించుకొని ఉండెను. ఇప్పుడు తిరిగి పృథువు అది భంగపరిచి 'వేనా' అనియే పిలుస్తాడు. ఈ పిలుపు మొదట పిలిచిన 'వేనా' అన్న పిలుపువంటిదికాదు. పృథువు వేనుని కట్టు తెంచుకొన్నాడు.

సునీథ లేదు. సునీథను అంగరాజునుండి రక్షించుకోలేదు వేనుడు. అంగరా జామెను కడతేర్చినాడా అని బెంగకూడా అతనికి. తోటలో పూవులు లేవు. పృథువు లేడు. అణగిమణగిన రాజ్యలక్ష్మి విడి పృథువును వరించినది. వేనునియందు కళలు జారినవి. హిమవంతమువంటి ధైర్యము సడలినది.

ఇందులకు పునాది, అధికారము, వేనుని ప్రకృతియందు ఉన్నది. వేనునిబుద్ధి నైశిత్యముకంటె, ఆతని మానుషత్వమూ, అమానుషత్వమూ కొట్టవచ్చినట్టు కన్పడు తవి. రెంటనూ ఆతని కర్మసూత్రములు పెరిగి ఆతనిచుట్టు పెద్దసాలీని కన్పరిచినవి. కాని ఆ కర్మసూత్రాలఅల్లిక తోలుత కన్పడ్డది ఒకానొక విచిత్రమార్గాన. వేనరాజు స్నేహ శాలి, కళాశాలి. ఆతని సున్నితమైనప్రకృతిపై అంగరాజు అనే పెద్దపిశాచము పని చేసి, వేనుడు అమానుషముగా చంపిన వారికి ప్రాణము పోసి పిశాచములను చేసి, పిశాచము లంటే వేనునికి భయమూ, అధ మము, అనుమానమూ కల్పించినాడు. అంతతో వేనునికి తన నమ్మకములు, ధైర్యము సడలసాగినవి. అసలు వేనరాజులోనే ఒక పిశాచమును పుట్టించినాడు అంగరాజు. ప్రజలధనమూ మతమూ ఆరగించి, అవే వారిప్రాణములు కాన ప్రాణము లారగించి, ఆతడు పిశాచమే అంటాడు. మాంసపు తృష్ణ ఎడదలో కలదట అతనికి. ఒంటరిగా విడువబడ్డ వేనుడు ప్రకృతియందు పిశాచ చ్ఛాయలు ఊహించినాడు.

అదిగో! ప్రొద్దుక్రుంకుచున్నది కత్తితో నఱుకఁబడి రక్తసిక్తమైన శిరస్సువలె సూర్యుఁడు పశ్చిమశిఖరిఁ దోఁచుచున్నాఁడు. పిశాచములు తమ ముంగిళ్లు నెత్తురులతో నలుకుకొన్నట్లు దిక్కు లన్నియు నెఱ్ఱవాఱినవి. ఓహో! ఈడేగ యాకాశమునఁ గాను పక్షులనన్నింటిని వేటాడివేటాడి ప్రొద్దుక్రుంకుటచేఁ గనులు గానక పత్త్రములు డిగినట్లు వ్రాలఁబోవుచున్నది. క్రమముగాఁ జీఁకట్లు హెచ్చుచున్నవి. ఇదిగో యీ సన్నని గూబ పిశాచమువలె నా చెట్టుకొమ్మలోఁ గూర్చుండి యున్నది. నిజముగాఁ బిశాచము లున్నవా? లేవు లేవు.

'ఉన్నవి ఉన్నవి' అని పిశాచములు వల్లనే అతనికి సమాధానము వచ్చినది. పిశాచములంటే అతనికి నమ్మకములేదు. కాని వట్టి కవితాసామగ్రిగా ఆతడు పిశాచములు మాట యెత్తుకొన్నాడు. ఆతడు కవి. అతని కవిత్వములో కవి కవిత్వము కలిసి వేనుని చరిత్రమునే చాలావరకు కీర్తించింది. వేనుని చరిత్ర ప్రొద్దుక్రుంకు వేళ పిశాచములకు పని ఉన్నది.

కవితాధోరణిలో పిశాచములు వేనుని మనస్సులో లేచుటకుపూర్వము అంగరాజు ప్రసంగములో పిశాచములను తాండవింప చేసిఉండెను.

ఒకపిశాచము కోటకొమ్మన నరిమిచూచినది.
ఒకపిశాచము కోటముందర నురుకుపెట్టినది.
ఒక పిశాచము రాజుగదిలోనుండి పోయినది.
ఈ పిశాచము రాజుముందర నీడులాడినది.

అంగరాజొక విడ్డూరపువ్యక్తి. విడ్డూరమైన వస్తువులయెడ, అట్టిభావములయెడ వేనునికి సహజమైన విస్మితత్వమున్నది. ఒకసారి అంగరాజును గొలుసులతో బంధించిన వాడు ఆతడు అద్భుతావహముగ విడిపించుకొనగా చూచి ఊరకున్నాడు. వేనుని యీ గుణమొకటి ఆతనిప్రకృతిని మెత్తగా చేతికందిస్తున్నది. ఈగుణముపై వేనుని కళాచిత్తము శబలిత మవుతున్నది.

కవి యీనాటకములో కవితాశక్తివల్ల సాధారణీకృతి (Universalization) ఎక్కువగా సాధించినాడు. వేనుని కళాశాలిత ఇందుకు తోడుపడ్డది ముఖ్యముగా ఈపిశాచము లవతరించిన ఘట్టములో వేనునినోట, మనసా వెలువడ్డ యీ చిన్నకవితా శకలము వల్ల వేనుడు కవియన్న అంశమూ, వేనుని విస్మితత్వమూ, కవితాప్రయోగ కౌశలమూ నాటకదృష్ట్యా సార్థకములైనవి. ఏమంటే, ఈ పిశాచావతరణము మిక్కిలి ముఖ్యమైన సంఘటనము. అది యేర్పడుటకు ఈ కవితా శకలము తగిన పరిసర మేర్పరిచింది.

పిశాచముల ఉనికియందు నమ్మకము లేని వేనునికి పిశాచములస్థితి తెలియవచ్చుటతో ఆతనికి ఆత్మప్రత్యయము సడలసాగింది. తన నమ్మకములయందు ధైర్యము వ్రీలసాగింది. తన కర్మసూత్రాలు కాబోలు అతనికి ప్రత్యక్షము కాజొచ్చినవి!

ఉప్పాలం

కవికొండల వేంకటరావు

గుంటూరు, రేపల్లె, చీరాల, బందరు ఆ ప్రాంతపు సముద్రతీరపువంచకు "ఉప్పాలం" అని పేరు. చవుడు దేరి నేల మృదువుగా నుండి ఉప్పుజాడతో కూడుకొన్నదై చాల భాగము పెద్దబయలుగా తోస్తూ సిరు గాలి తోమ మైకంగా చల్లందనం, మన కనురెప్ప లెగయ, గుప్పిస్తుంది. దూరదూరంగా ఎత్తైన సరుకుమొక్కలచాళ్లు తూగుతూ వినువాడెంతపరధ్యానంగా వున్నా తమసంగీతాన్ని వినిపిస్తూవుంటాయి. అక్కడక్కడ నివాస యోగ్యాలుగా భావించి మానవులు నిర్మించుకొన్న ఊళ్లు రెండుకోసుల్లో మూడుకోసుల్లో అడ్డదిడ్డపుతోవలతో అల్లుకుపోయి కనబడతాయి. ఆ గ్రామాదుల పేళ్లుకూడా సముద్రతీరప్రాంతాన్ని బట్టి పుట్టివుంటాయి అని అనుకోనేటట్టుగా — ఇసుకపల్లె, దిండి, కట్టువ, యిలా పిలవబడుతూవుంటాయి. కొండల్లో పుట్టి కొండల్లో పెరిగిన కోయవాని కలాంటితా వొకటి భూమ్మీద వుంటుందా అని అనిపించకమానదు.

కట్టువ! అది ఒకానొకప్పుడు సముద్రానికి చెలియలికట్టగా పనిచేసి వుండాలి! దాని వీథుల్లోనికి నిసర్గమైన ఉప్పునీటివెల్లువ అంత ఎత్తు లేచిపడి ప్రవహించి వెనక్కు తగ్గి వుండాలి! కట్టువ! క్షుద్రగ్రామం. ఒకటో రెండో వేపచెట్లు, రెండో, మూడో తాటిచెట్లు దాని గుర్తింపులు: పదిపదేను ఇళ్లు దానిసొంపులూ, వంపులూ కనిపింపులూను. చుట్టూ ఆవరించుకున్నాయి. [illegible]. ఇప్పుడు దాన్ని మాపి ఏ సముద్రమూ లేదు. సముద్రము దాన్ని విడిచిపెట్టి ఏనాడైనదో! మానవు డెరుగడు.

అయినా మిక్కిలి [illegible] వొకడు నాకగపడ్తావున్నాడు, [illegible] వెలువడి పెద్దబయలున నడుస్తూ. తలవెంట్రుకలూ కనుబొమ్మలూ నెరిసిపోయినాయి. అయినప్పటికిన్నీ వానివొళ్లు [illegible] నలుపుదేఱి, కళ్లల్లోని రక్తపుజీరలు అగ్నిజ్వాలల్లా కాంతిమీఱి, కాగి [illegible] కగపించేడు.

"ఎందాకా పోతున్నావు? తాతా!" అన్నాను. "సముద్రపువంచకు" అన్నాడు. మఱి వొకరికొకళ్లం మాట్లాడుకోకుండా నే అతను ముందు నేను వెనక, అతను ముందు నేను వెనక, సన్నని సందంట పోతూన్న మాదిరిగా నిబ్బరపుచూపుతో వెళ్లిపోతున్నాం.

కార్తి — కత్తిరి కొంకం పడపో, రోహిణి కొంకింతముందో చెప్పలేనుకాని, కాలం అప్పట్లో మండువేసంగి అనిమాత్రం చెప్పగలను. భూమేకాకుండా ఆకాశంకూడా కనకనమంటూవున్నట్టుగా వుండి కుతకుత ఉడికిపోతూ వుంది.

అంత ఎండలో, అంత మండువేసంగిలో ఎందు కానడక అంటే అది చెప్పేవాడో!

నే నతణ్ణి అడగలేదు. కాని అతడు తను దరిగి నన్నడిగేదా నేను ఒక్కటేమాట చెప్పదలచుకొన్నాను. "నీవు నడుస్తున్నావు. నీ వెనకాలే నేను నడవాలని నాకు బుద్ధిపుట్టింది. నేను నడుస్తున్నాను. నా కేమున్న ఎండ కనిపించడంలేదు" అని ఘంటాపథంగా చెప్పదలచుకొన్నాను.

నిశ్శబ్దదేవత మమ్మల్నిద్దర్నీ ఆ ఘడియ తనకు అనుచరులుగా గావించుకొని నడిపిస్తూవుంది. ఏలా మాటాడుకుంటాం పరస్పరం?

సూర్యునియొక్క ఏటవాలుకిరణాలు పగలామైని జాం జాంన్నరికంటె ఎక్కువ వుండనేరదని అనిపిస్తున్నాయి. నేలంట ఎండమావులు వ్యాప్తమై అక్కడికి సముద్ర మనతిదూరం అన్నట్టు కంటికి తట్టిస్తున్నాయి.

ఆప్రాంతంలో సముద్రతీరాన్ని "ఉప్పాలం" అని ఏలా వాడుతారో "ఎండమావి"ని "అగ్గిపాలు" అని అనడం పరిపాటి. మే మిద్దఱం ఒక ఎండమావి దాటినాము. ఎండమావి దాటడ మేమిటి? అది దానంత టదే మా ముందు ఒత్తిగిలి వెనక్కు జరిగింది అని అనవచ్చును.

"అగ్గిపాల" ఒయ్యారం జగన్మోహనాకారం అని అనుకోండి. అనిగో నీళ్ళన్నట్టుగా తోపిస్తూ నీళ్లు కనిపించవు. నీలనీలాంబుధి మల్లేనే ఆలోలంగా అగపిస్తుంది. కాని కెరటంయొక్క హోరు శూన్యము.

మేం నడుస్తూన్నకొద్దీ ఎండమావిస్వరూపం అంతగా మారకపోయినా నేల మారింది. రయితు లక్కడక్కడ పండించి కోసికొన్న వోడిమల్లు దాటి, ఉప్పుటేళ్ల నఱపుచప్పికకయిళ్ల నడవసాగినాము. అవి దాటి క్రమంగా యిసకమిట్టల కెక్కినాము. మిట్టలు మైదానంగా కొంతలెక్క నడిచినాము. ఆ మైదానపుటంచునే సరుకుతోపులు రంయిరంయి సముద్రపుగాలికి వ్రాగిసలాడుతూ గోచరించినాయి. అంటితో మఱిమృగతృష్ణలు రావని నేను వోనిర్ధారణకు వచ్చివేసినాను.

నాముందు నడుస్తూవున్న అతడు "సముద్రం అదిగో చూచినావా? దొరా!" అన్నాడు, ఉత్సాహపూరితుడై —. ఎందుకు అతని కంతసంతోషం కలగాలి ఆసముద్రం చూడగానే? అత డెందుకు తలపోయాలి సముద్రంచూడ్డానిగ్గాను, దారి తెలీక అతణ్ణి నేను వెంబడించినానని? అతడు నాకు మృగతృష్ణనే సముద్రంఅని చూపక సముద్రాన్నే సముద్రం అని ఎందుకు చూపించాలి? ఇలాగ్గా పరిపరివిధాలుగా ఆలోచింప దొడగింది నామనస్సు - వాని చూపుడు వ్రేలినే సముద్రాన్ని సందర్శిస్తూ.

గబుక్కున యిసకమైదానం దిగినట్టయింది. మాకాలికింద ఇసకంతా చెమ్మదనమే. తీరపుటిసకరేణువు ఏకమొత్తంగా కెరటాలదెబ్బలు తింటూ జిలజిల మంటూవుంది.

ఆసన్నని సున్నితపు తేమదేఱిన యిసకరేణువులమీద వేలకువేలుగా కోట్లకుకోట్లుగా ఎఱ్ఱపీతలు బాడితపూతల్లే విశ్రమించియున్నాయి!

సరిగా అదేముహూర్తం! భానుమండలం ఈశాన్యదిక్కుగా ఓ మేఘం జొచ్చి అందులోనుంచి క్రింది కోమూలకు సముద్ర

మున్ను నల్లని జీమూతంలాంటి సరుకుతోట యున్నూ కలిసిపోయిన ట్టగపించే వొకానొక మలుపులోనికి, తనకాంతిపుంజాన్ని సింజె వోసి దిగజార్చినట్లు వాల్చింది. క్రమంగా బింబం మేఘం వెలువడి జారిపోతూ అపరిమిత మైన అరుణచ్ఛవిని విరాజిల్లింది. తాత్కాలికపు తుదిసంజయొక్క శాంతిప్రకాశం ధాత్రి నలముకొన్ననై ప్రత్యేకత నక్కడ ఆ ఎఱ్ఱపీతలయొక్క ఎఱ్ఱందనాన్ని ఇనుమడింప జేస్తూవుంది.

"అలికిడి సేయకుండా రా! దొరా!" అన్నాడు తాత. "ఏం?" అన్నాను. "ఆ ఎఱ్ఱ పీతలన్నీ యిట్టే బొత్తల్లోదూరి మనకు మఱి దొఱకవు. నేను వాటికోసమే యింత దూరం నడిచివచ్చింది." అన్నాడు తాత. అంటూనే పొట్ట ముమ్మడతలు పడిపోయే టట్టుగా వొదిగి వంగి వాలి ఓ పీతచాయకు సాగిలబడి దాన్ని పట్టుకో చేతులు సాచి నాడు. పీత వాని గుప్పిట చిక్కింది. గుప్పిలి నొక్కడా? చచ్చిందే కటక్కని!

దాని సూదుల్లాంటి మిడిగ్రుడ్లు వాడి వ్రేళ్ల సందుల్లోనుంచి కనిపిస్తూ యింకా మూతలువడ్డం విడివడ్డం మానలేదు. దాని పదికాళ్లు పదికాళ్లుగానే వున్నాయి.

నేను వానితో "ఆచిన్న పీత నెందుకు పట్టుకు చంపుతావు? అదిగో ఆ పెద్దపీతను పట్టుకో" అని తప్పెట తట్టాను. నా ఆ తప్పెటతో తీరాన్ని వున్న సమస్తజీవరాసులు దాక్కుడుండిపోయినాయి. "సమస్త జీవరాసులు" అనడంలో అర్థముంది. వానిచేతిలోని చిన్నపీతకూడా, యిష్టారాజ్యంగా నామాట పుచ్చుకు అస్వాతంత్ర్యం వదిలిపెట్టేసినట్లు, స్వేచ్ఛను పొంది, చూస్తూనే చెయిజారి చేసుకు మటుమాయమైంది; కాబట్టి "సమస్త జీవరాసులు" అనడంలో అర్థముంది.

ముసిలివాడు నిట్టూర్పు విడుస్తూ, ఆ దిగ్గాంతరాళంలోనే నిరాశ చూపుతూ "ఏది చిన్నపీత! అన్నింటినీ నీ తప్పెటచేత చెదరగొట్టినావు దొరా!" అన్నాడు.

"అదిగో! ఎఱ్ఱెఱ్ఱగా — ఆ సరుగుడు మొక్కలున్నూ కెరటాలున్నూ మసకమసగ్గా వున్న ఈశాన్యదిఙ్మండలంలోనికి సాగిపోతుమకు పోతూవున్నదే—అదే నే సన్నపీత. దాన్ని వెంటాడించు" అన్నాను.

"అది పీతగాదు దొరా! సూర్యభగవానుడు! రోజూ అలా క్రుంకుతూనే వుంటాడు స్వామి! రోజూ ఆస్వామిని పట్టుకోబోయి పట్టుకోలేక ముందుకు పడి విఱిగి ముక్కలై పోతూ నేవుంటుంది ఆలా ఆమూల ఆకెరటం! ఎవకీ దొఱకని పెద్దపీత ఆ బింబం!" అన్నాడు నామాట చిక్కులి రెట్టించి అమ్మహావృద్ధు.

వాని ఆకలిచూపుక్క లింకా లోపలకు దించుకుపోతువున్నా "సముద్రాని కెంతతీరని ఆకలో!" అని ఉచ్చైశ్రుతంగా అనుకున్నాడు.

కడలికరళ్ల ప్రతిబింబించినట్లే ఆదయా ఘనికళ్ల నోనిమేషం సాయంసంధ్యారాగం ప్రతిఫలించింది. ఉప్పాలమంతా చిట్టిజాబిల్లి కితకితలెట్టినట్టు కిలకిలా నవ్వింది.

---

౧. స్త్రీలకు లేఖలు:

ప్రజాప్రభుత్వం నశించిందా?

సామ్యవాదావతార ఘట్టము

కొచ్చెర్లకోట సత్యనారాయణమూర్తి

క. "భద్రగుణా! యాహారము
నిద్రా భయమైథునములు నిఖిలయను తనూభృ
ద్రాజికి సాధారణ
ముద్రలు, మఱితారతమ్యముల పను లేలా?

సీ. హంసతూలిక పాన్పులందు రానేలను
శయనించువారికి సరియె నిద్ర
మెఱుఁగుదీఁగలఁబోలు మెలఁత లెందఱు గల్గి
నప్పుడు నొక్కతొయ్యలియ రతికి
దప్పికి నీరు వంటక మాఁకలి కశేష
జంతుసంతతి కాత్మ శక్తి కొలఁది
యాకీట మాకైటభాసురాంతక మెల్ల
ప్రాణకోటికిఁ బ్రాణభయము సమము
తే. గానఁ దనయట్ల యెదిరిని కాన్పు గాన్పు
జీవులకుఁ దార తమ్యంబు సెప్పఁదగదు
సర్వభూతములందును సమత మేలు
కరుణ చేపట్టవలయుఁ గాఁగాదు హింస.

తే. చెలఁగి యీర్పేను మశకంబు చీమ నల్లి
యల్పమను బుద్ధి హింస సేయంగఁదగదు
వాని హృదయంబులం దున్నవాఁడు జీవుఁ
డాతఁ డల్పుండె యితరజీవాత్మ కంటె?"

(బౌద్ధధర్మాలు; శ్రీనాథుని కాశీఖండము; ౬. ఆ.)

"స్వాతంత్ర్యం చచ్చిపోయింది. శవం అప్పుడే కుళ్లుతోంది"

—ముసోలినీ.

15 7. 3

సోదరీ !

నువ్వు మొన్నటి మునిసిపలు ఎన్నికల్లో గెలిచావనీ, ఇకముందు రాజకీయవిషయాల్లో చురుగ్గా పని చేయదలచావనీ, 'సోషలిజము' అంటే నీకు అభిమానం హెచ్చుతోందనీ విని సంతోషించాను. మనస్త్రీలు రాజకీయవ్యవహారాల్లో ప్రవేశించడం ముందుకు శుభసూచకమని చెప్పాలి. ఇంతకాలమూ మగవాళ్లీ వ్యవహారాలను ఎట్లా చిక్కుపెట్టారో చూడు! నీతిపేర, జాతిపేర, దైవంపేర ఎక్కడచూచినా కపటాలే, కృత్రిమాలే, కల్మషాలే, కలహాలే! ఏళతాబ్దాని కాశతాబ్దమే పట్టుమని పదేళ్లకాలమైనా శాంతిసౌఖ్యాలను నిరాటంకంగా అనుభవించలేదుకదా! ఇప్పటికైనా మనస్త్రీలు మేలుకొని తమమగవారి వ్యవహారాలను ఎట్లా చిక్కుపెడుతున్నారో కనుక్కోవడానికి ఉద్యుక్తులవడం సంతోషకరమైనవిషయం కాదా? ముఖస్తుతికోసం యిట్లా వ్రాస్తున్నానని అనుకోవద్దు. శౌర్యధైర్యాలలోమాత్రమే కాకుండా ప్రజల శాంతిసౌఖ్యాలకోసం ఇదివరలో మనదేశంలో బయలుదేరిన ఉద్యమాలన్నిటిలోకూడా మగవారితో సమానంగా ముందంజవేయడం ఆంధ్రవనితలు నేడుగా నేర్చిన విద్య కాదు. ఒక్క ఉదాహరణ చూడు. పూర్వకాలంలో యజ్ఞయాగాదులపేరా యుద్ధాలపేరా మగవాళ్లు జీవహింసా రక్తపాతమూ చేస్తూవుండిన రోజుల్లో భూతదయే భగవంతుడనీ, సర్వభూతాలనూ తనవలె చూచుకోవడమే ముక్తిమార్గమనీ బోధించిన బుద్ధభగవానుని పవిత్రమతాన్ని తెలుగుదేశంలో ప్రవేశపెట్టి వ్యాప్తిజేసినవారు ఆంధ్రవనితలు అని చరిత్రకారు లంగీకరించారు. ప్రపంచమంతా తిరిగి అదేమోస్తరు తాపంతో బాధపడుతూవున్న యీ రోజుల్లో, రాజకీయ రంగంలోకి ప్రవేశించడానికి మీరు అర్హులవడానికి ఇంతకంటె మహత్తరమైన యోగ్యతాపత్రం మీకెందుకు?

ప్రపంచవ్యవహారాలిప్పుడు చిక్కుల్లో పడడానికి కారణం ఏమిటి? ఆ చిక్కులను విడదీయడానికి ఇప్పుడు జరుగుతూవున్న ప్రయత్నాలేమిటి? 'సోషలిజము' అని కొత్తగా వినబడే యీమాట కర్థమేమిటి? 'సోషలిస్టులు'ని పేరుపెట్టుకొని బెజవాడలో మన డాక్టరు అచ్చమాంబగారి యింటికి వస్తూపోతూవుండే ఆ సంఘులవాళ్లు ఎవరు? వాళ్లు దేశంలోవున్న డబ్బు అంతా బీదవాళ్లకు పంచిపెడతారటనే, అది యెట్లా? అసలు వాళ్లకూ గాంధీమహాత్మునికీ పడనే పడదటగా? 'పులిమీద పుట్ర' అన్నట్లు ఈ గొడవఅంతా యేమిటి?

ఈ సంగతులను నీకు కొంతవరకు ఈ వుత్తరాల ద్వారా తెలియజేయదలచాను.

వారు చెప్పేది వీరికి తెలియక వీరు చెప్పేది వారికి తెలియక తుదకు ఎవరు చెప్పేది వారికే తెలియని పక్షాన్ని దానిని 'వేదాంతం' అన్నారు పెద్దలు. అటువంటి వేదాంతచర్చలోకి దిగకుండావుండడానికి సాధ్యమైనంత వరకు ప్రయత్నించేస్తాను

అసలు చిక్కేమిటంటే పెద్దలన్నా, పెద్దల సంప్రదాయాలన్నా భయమూ భక్తీ పొత్తిగా నశించాయి. లోకమంతటా ఇదే జబ్బు. అందులో మరీ మొన్నటి యుద్ధానంతరం, ఇన్‌ఫ్లుయెంజా విషగాలితో పాటు ఈ విషగాలికూడా ప్రపంచమంతా వ్యాపించింది. 'జమీందారులను ఎందుకు పీకివేయగూడదు?', 'పెళ్లిళ్లను ఎందుకు రద్దుచెయ్యగూడదు?', 'భూమి ఎవరిది?', 'దేశంలో వున్న డబ్బుఅంతా ఎవరిది?', 'భాగ్యవంతులూ బీదవాళ్లూ అనే తారతమ్యాలను తెచ్చిపెట్టిన దెవరు భగవంతుడా? మనుష్యులా?', 'భాగ్యవంతు డెవడు? బీదవా డెవడు?' 'ఎవడు దొంగ? ఎవడు దొర?'-ఏదేశంలో చూచినా ఇటువంటి విపరీతపుప్రశ్నలు బయలుదేరాయి; అన్నిదేశాలతో పాటు మనదేశంలోకూడా ఇప్పుడిప్పుడే తీవ్రంగా బయలుదేరుతున్నాయి. లోకమంతటా యీజబ్బు ఇట్లా తీవ్రంగా వ్యాపించడానికి కారణం ఏమిటి? ఈజబ్బుయొక్క ముఖ్యలక్షణా లేమిటి? అందుకు తగిన చికిత్స యేమిటి? ఇవి, మన మాలోచించవలసిన విషయాలు.

గడచిన నూటయేభై యేళ్లలో ఇంచుమించు పశ్చిమదేశా లన్నిటిలోను ప్రజాప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అదివరకు ప్రజ లనుభవిస్తూవున్న బాధలన్నీ అంతటితో విరగడ యైనాయనిన్నీ, ప్రజలందరకూ ఇక

మీద జాతిజన్మవివక్షతలు లేకుండా స్వాతంత్ర్యమూ సమానత్వమూ సోదరత్వమూ సమకూరుతాయనిన్నీ, అందరూ జీవితంలో పైకిరావడానికి సమానమైన అవకాశాలు ఏర్పడ్డాయనిన్నీ సంతోషించారు. ప్రపంచ చరిత్రలో కొత్తశకం ప్రారంభమైందన్నారు. ఈతి బాధ లికముం దుండవన్నారు. ఫ్రాంసుదేశంలో రాజును రాణిని వురిదీసి కొత్తపద్ధతులను బలాత్కారంగా అమలులో పెట్టారు. ఇంగ్లాండు, బెల్జియం, ఇటలీదేశాల్లో రాజును పేరుకుమాత్రం నిలిపి అసలు రాజ్యాధికారాన్ని ప్రజాప్రతినిధులపరం చేశారు. రష్యా, టర్కీలలోమాత్రం ఈగాలి సోకలేదు. అచ్చటి చక్రవర్తి, సుల్తానుల నిరంకుశాధికారాలు సైనికబల సహాయంతో సాగుతూవుండేవిగాని ప్రజల కిష్టంలేని ఆ ప్రభుత్వాలు ఎన్నాళ్లో సాగవన్నవిషయం అందరూ యెరిగినదే.

స్వాతంత్ర్యానికీ, నిరంకుశాధికారానికీ ఇంత కాలమూ జరుగుతూవచ్చిన పోరాటము ఇప్పటికి ముగిసిందనిన్నీ, ఆపోరాటంలో గెలుపు, ఖండితంగా, శాశ్వతంగా, స్వాతంత్ర్యానిదే అనిన్నీ, నాగరికత చెంది ముందుకు వచ్చిన దేశాలన్నిటిలోను వాక్స్వాతంత్ర్యం ప్రధాన సూత్రంగా ఇన్నాళ్లకి అంగీకరింపబడిన దనిన్నీ ౧౯౧౩ లో బ్యూరీపండితుడు వ్రాశాడు. ౧౯౧౪ లో ఐరోపాయుద్ధం ప్రారంభమయింది. ప్రజాప్రభుత్వానికి కంటకాలేవీ లేకుండా చెయ్యడానికీ, లోకంలో యుద్ధాలికముందు రాకుండాచేయడానికీ యుద్ధం చేస్తున్నామని మిత్రమండలి తరఫున ప్రెసిడెంటు విల్సను ప్రకటించాడు.

మిత్రమండలియొక్క ఆ సంకల్పబల మెటువంటిదోగాని నాటికి నేటికీ స్వాతంత్ర్యము ఎన్నడూ తలయెత్తుకొని తిరగనేలేదు. అన్నిచోట్లా ప్రజాప్రభుత్వాలు తలలు వేళ్లాడవేసినాయి. కొన్ని దేశాల్లో ఆమొక్కలు సంపూర్ణంగా ఎండిపోవడంవల్ల పీకి పారవేశారు. రాజు, సుల్తాను, చక్రవర్తుల వద్దనుండి గెలిచిన రాజ్యాధికారాన్ని మరొకవిధమైన నిరంకుశాధికారుల చేతుల్లో పెట్టారు. పర్యవసాన మేమిటి? నేడు జర్మనీ, ఇటలీ, ఆస్ట్రియా, హంగరీ, టర్కీ, పోలండు, రష్యా, అమెరికాదేశాలలో నిరంకుశాధికారాలు చెలరేగుతున్నాయి. జర్మనీ, ఇటలీ, ఐర్లాండు పోలండు, బల్గేరియా, రుమేనియా, రష్యా, జపాను దేశాల్లో వాక్స్వాతంత్ర్యం చచ్చిపోయింది అధికారుల నెదిరించడం దేవుణ్ణి ఎదిరించిన పాపంతో సమానమైంది.

ఈ కొత్తనిరంకుశాధికార్లు తమని నెదిరించిన వారిని దయాదాక్షిణ్యాదులు లేకుండా శిక్షిస్తున్నారు. ఐర్లండులోకి బెర్నార్డుషాగారి పుస్తకాలు రాకూడదు. కెనడాదేశంలోకి రాగూడని పుస్తకాలజాబితా అచ్చులో ఆరు పెద్దకాగితాలైంది. ఒకప్పుడు ఇంగ్లాండుదేశములో ప్రధానమంత్రిగా వుండిన రామ్సే మాక్డొనాల్డు గారి గ్రంథాలు ఆయన ప్రధానమంత్రిగావుండిన రోజుల్లోనే హిందూదేశానికి రానీయలేదు!

అంతే కాదు. అధికారులకు వ్యతిరేకంగా వున్న వ్రాతలను ప్రజలు చదువగూడదు. ఐర్లండులో డి వెలీరాకు, ఇటలీలో ఫాసిస్టుపార్టీకి, జర్మనీలో నాజీ పార్టీకి, రష్యాలో స్టాలినుకు ఇష్టంలేని వ్రాతలను ప్రజలు చదవరాదు. సోవియటురష్యానుగూర్చిన వ్రాతలు మొన్నటిదాకా ఇండియాకు రాలేదు.

"ఈ కొత్తనిరంకుశాధికారుల అధికారం మునపటి సుల్తాను, చక్రవర్తి, కైజరుల అధికారాలను మించి పోతోంది" అని డీన్ ఇంజి వ్రాసినాడు.

టోకియో మునిసిపాలిటీవారు ౧౯౩౪ లో ప్రజ లేవిధమైన ఆలోచనలు చేస్తున్నారో కనుక్కోడానికి 'థాట్ ఇనస్పెక్టర్ల'ను ఏర్పాటుచేసినారు. ౬౫,౦౦౦ ల మంది సాంఘికవాదులు ౧౯౩౩ డిసెంబరులో జపాను దేశములో ఖైదులలో ఉండిరి హిందూదేశంలో ఈ మధ్య ఒకయేడు ౫౦,౦౦౦ మంది రాజకీయఖైదీ లుండిరి. ఇక జర్మనీ, ఇటలీదేశాలసంగతి వ్రాయ నక్కరలేదు. ౧౯౩౩ లో జర్మనీదేశంలో ఒక నిర్బంధపు క్యాంపులో వున్న రాజకీయఖైదీలను, వాళ్ల రాజకీయ అభిప్రాయాలనుబట్టి ఈవిధముగా నాలుగుతరగతులుగా విభజించారట :—

౧. నూటికి ౨౫గురు; కొంచెము చెడినవాళ్లు వీళ్లను సులభముగానే బాగుచేసి త్వరలోనే మంచిజర్మ

సోదరీ !

నువ్వు మొన్నటి మునిసిపలు ఎన్నికల్లో గెలిచావనీ, ఇకముందు రాజకీయవిషయాల్లో చురుగ్గా పని చేయదలచావనీ, 'సోషలిజము' అంటే నీకు అభిమానం హెచ్చుతోందనీ విని సంతోషించాను. మనస్త్రీలు రాజకీయవ్యవహారాల్లో ప్రవేశించడం ముందుకు శుభసూచకమని చెప్పాలి. ఇంతకాలమూ మగవాళ్లీవ్యవహారాలను ఎట్లా చక్కబెట్టారో చూడు! నీతిపేర, జాతిపేర, దైవంపేర ఎక్కడచూచినా కక్షలే, కృత్రిమాలే, కల్మషాలే, కలహాలే! ఏశతాబ్దాని కాశతాబ్దమే పట్టుమని పదేళ్లకాలమైనా శాంతిసౌఖ్యాలను నిరాటంకంగా అనుభవించలేదుకదా! ఇప్పటికైనా మనస్త్రీలు మేలుకొని తమమగవారివ్యవహారాలను ఎట్లా చక్కబెడుతున్నారో కనుక్కోవడానికి ఉద్యుక్తులవడం సంతోషకరమైనవిషయం కాదా? ముఖస్తుతికోసం యిట్లా వ్రాస్తున్నానని అనుకోవద్దు. శౌర్యధైర్యాలలోమాత్రమే కాకుండా ప్రజల శాంతిసౌఖ్యాలకోసం ఇదివరలో మనదేశంలో బయలుదేరిన ఉద్యమాలన్నిటిలోకూడా మగవారితో సమానంగా ముందంజవేయడం ఆంధ్రవనితలు నేడుగా నేర్చిన విద్య కాదు. ఒక్క ఉదాహరణ చూడు. పూర్వకాలంలో యజ్ఞయాగాదులపేరా యుద్ధాలపేరా మగవాళ్లు జీవహింసా రక్తపాతమూ చేస్తూవుండిన రోజుల్లో భూతదయే భగవంతుడనీ, సర్వభూతాలనూ తనవలె చూచుకోవడమే ముక్తిమార్గమనీ బోధించిన బుద్ధభగవానుని పవిత్రమతాన్ని తెలుగుదేశంలో ప్రవేశపెట్టి వ్యాప్తిజేసినవారు ఆంధ్రవనితలు అని చరిత్రకారు లంగీకరించారు. ప్రపంచమంతా తిరిగి అదేమోస్తరు తాపంతో బాధపడుతూవున్న యీ రోజుల్లో, రాజకీయ రంగంలోకి ప్రవేశించడానికి మీరు అగ్రులవడానికి ఇంతకంటె మహత్తరమైన యోగ్యతాపత్రం మీకెందుకు ?

ప్రపంచవ్యవహారా లిప్పుడు చిక్కుల్లో పడడానికి కారణం ఏమిటి ? ఆ చిక్కుల్ను విడదీయడానికి ఇప్పుడు జరుగుతూవున్న ప్రయత్నా లేమిటి ? 'సోషలిజము' అని కొత్తగా వినబడే యీమాట కర్థమేమిటి ? 'సోషలిస్టుల'ని పేరుపెట్టుకొని బెజవాడలో మన డాక్టరు అచ్చమాంబగారి యింటికి వస్తూపోతూవుండే ఆ సంఘపువాళ్లు ఎవరు ? వాళ్లు దేశంలోవున్న డబ్బు అంతా బీదవాళ్లకు పంచిపెడతారటనే, అది యెట్లా ? అసలు వాళ్లకూ గాంధీమహాత్మునికీ పడనే పడదటగా? 'పులిమీద పుట్ర' అన్నట్లు ఈ గొడవఅంతా యేమిటి?

ఈ సంగతులను నీకు కొంతవరకు ఈ వుత్తరాల ద్వారా తెలియజేయదలచాను.

వారు చెప్పేది వీరికి తెలియక వీరు చెప్పేది వారికి తెలియక తుదకు ఎవరు చెప్పేది వారికే తెలియని పక్షాన్ని దానిని 'వేదాంతం' అన్నారు పెద్దలు. అటువంటి వేదాంతచర్చలోకి దిగకుండా వుండడానికి సాధ్యమైనంత వరకు ప్రయత్నించేస్తాను

అసలు చిక్కేమిటంటే పెద్దలన్నా, పెద్దల సంప్రదాయాలన్నా భయమూ భక్తీ పూర్తిగా నశించాయి. లోకమంతటా ఇదే జబ్బు. అందులో మరీ మొన్నటి యుద్ధానంతరం, ఇన్‌ఫ్లుయెంజా విషగాలితోపాటు ఈ విషగాలికూడా ప్రపంచమంతా వ్యాపించింది. 'జమీందారులను ఎందుకు పీకివేయగూడదు ?', 'పెళ్లిళ్లను ఎందుకు రద్దుచెయ్యగూడదు ?', 'భూమి ఎవరిది ?', 'దేశంలో వున్న డబ్బుఅంతా ఎవరిది ?', 'భాగ్యవంతులూ బీదవాళ్లూ అనే తారతమ్యాలను తెచ్చిపెట్టిన దెవరు భగవంతుడా ? మనుష్యులా ?', 'భాగ్యవంతు డెవడు ? బీదవా డెవడు ?' 'ఎవడు దొంగ ? ఎవడు దొర ?'—ఏదేశంలో చూచినా ఇటువంటి విపరీతప్రశ్నలు బయలుదేరాయి; అన్నిదేశాలతోపాటు మనదేశంలోకూడా ఇప్పుడిప్పుడే తీవ్రంగా బయలుదేరుతున్నాయి. లోకమంతటా యీజబ్బు ఇట్లా తీవ్రంగా వ్యాపించడానికి కారణం ఏమిటి ? ఈజబ్బుయొక్క ముఖ్యలక్షణా లేమిటి ? అందుకు తగిన చికిత్స యేమిటి ? ఇవి, మన మాలోచించవలసిన విషయాలు.

గడచిన నూటయేభైయేళ్లలో ఇంచుమించు పశ్చిమదేశాలన్నిటిలోను ప్రజాప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అదివరకు ప్రజ లనుభవిస్తూవున్న బాధలన్నీ అంతటితో విరగడయైనాయనిన్నీ, ప్రజలందరకూ ఇక

మీద జాతిజన్మవివక్షతలు లేకుండా స్వాతంత్ర్యమూ సమానత్వమూ సోదరత్వమూ సమకూరుతాయనిన్నీ, అందరూ జీవితంలో పైకిరావడానికి సమానమైన అవకాశాలు ఏర్పడ్డాయనిన్నీ సంతోషించారు. ప్రపంచ చరిత్రలో కొత్తశకం ప్రారంభమైందన్నారు. ఈతిబాధ లికముందుండవన్నారు. ఫ్రాంసుదేశంలో రాజును రాణిని వురిదీసి కొత్తపద్ధతులను బలాత్కారంగా అమలులో పెట్టారు. ఇంగ్లాండు, బెల్జియం, ఇటలీదేశాల్లో రాజును పేరుకుమాత్రం నిలిపి అసలు రాజ్యాధికారాన్ని ప్రజాప్రతినిధులపరం చేశారు. రష్యా, టర్కీలలోమాత్రం ఈగాలి సోకలేదు. అచ్చటి చక్రవర్తి, సుల్తానుల నిరంకుశాధికారాలు సైనికబల సహాయంతో సాగుతూవుండేవిగాని ప్రజల కిష్టంలేని ఆప్రభుత్వాలు ఎన్నాళ్లో సాగవన్నవిషయం అందరూ యెరిగినదే.

స్వాతంత్ర్యానికీ, నిరంకుశాధికారానికీ ఇంత కాలమూ జరుగుతూవచ్చిన పోరాటము ఇప్పటికి ముగిసిందనిన్నీ, ఆపోరాటంలో గెలుపు, ఖండితంగా, శాశ్వతంగా, స్వాతంత్ర్యానిదే అనిన్నీ, నాగరికత చెంది ముందుకు వచ్చిన దేశాలన్నిటిలోను వాక్స్వాతంత్ర్యం ప్రధానసూత్రంగా ఇన్నాళ్లకి అంగీకరింపబడినదనిన్నీ ౧౯౧౩ లో బ్ర్యాసుపండితుడు వ్రాశాడు. ౧౯౧౪ లో ఐరోపాయుద్ధం ప్రారంభమయింది. ప్రజాప్రభుత్వానికి కంటకాలేమీ లేకుండా చెయ్యడానికీ, లోకంలో యుద్ధాలికముందు రాకుండాచేయడానికీ యుద్ధం చేస్తున్నామని మిత్రమండలితరఫున ప్రెసిడెంటు విల్సను ప్రకటించాడు.

మిత్రమండలియొక్క ఆ సంకల్పబల మెటువంటిదోగాని నాటికి నేటికీ స్వాతంత్ర్యము ఎన్నడూ తలయెత్తుకొని తిరగనేలేదు. అన్నిచోట్లా ప్రజాప్రభుత్వాలు తలలు వేళ్లాడవేసినాయి. కొన్ని దేశాల్లో ఆమొక్కలు సంపూర్ణంగా ఎండిపోవడంవల్ల పీకి పారవేశారు. రాజు, సుల్తాను, చక్రవర్తుల వద్దనుండి గెలిచిన రాజ్యాధికారాన్ని మరొకవిధమైన నిరంకుశాధికారుల చేతుల్లో పెట్టారు. పర్యవసాన మేమిటి? నేడు జర్మనీ, ఇటలీ, ఆస్ట్రియా, హంగేరీ, టర్కీ, పోలండు, రష్యా, అమెరికాదేశాలలో నిరంకుశాధికారాలు చెలరేగుతున్నాయి. జర్మనీ, ఇటలీ, ఐర్లాండు, పోలండు, బల్గేరియా, రుమేనియా, రష్యా, జపాను దేశాల్లో వాక్స్వాతంత్ర్యం చచ్చిపోయింది. అధికారుల నెదిరించడం దేవుణ్ని ఎదిరించిన పాపంతో సమానమైంది.

ఈ కొత్తనిరంకుశాధికార్లు తమని నెదిరించిన వారిని దయాదాక్షిణ్యాదులు లేకుండా శిక్షిస్తున్నారు. ఐర్లండులోకి బెర్నార్డుషాగారి పుస్తకాలు రాకూడదు. కెనడాదేశంలోకి రాకూడని పుస్తకాలజాబితా అచ్చులో ఆరు పెద్దకాగితాలైంది. ఒకప్పుడు ఇంగ్లాండుదేశములో ప్రధానమంత్రిగా వుండిన రామ్సే మాక్డొనాల్డుగారి గ్రంథాలను ఆయన ప్రధానమంత్రిగావుండిన రోజుల్లోనే హిందూదేశానికి రానీయలేదు!

అంతే కాదు. అధికారులకు వ్యతిరేకంగా వున్న వ్రాతలను ప్రజలు చదువకూడదు. ఐర్లండులో డి వెలీరాకు, ఇటలీలో ఫాసిస్టుపార్టీకి, జర్మనీలో నాజీపార్టీకి, రష్యాలో స్టాలినుకు ఇష్టంలేని వ్రాతలను ప్రజలు చదవరాదు. సోవియటురష్యానుగూర్చిన వ్రాతలు మొన్నటిదాకా ఇండియాకు రాలేదు.

“ఈ కొత్తనిరంకుశాధికారుల అధికారం మునుపటి సుల్తాను, చక్రవర్తి, కైజరుల అధికారాలను మించిపోతోంది” అని డీన్ ఇంజి వ్రాసినాడు.

టోకియో మునిసిపాలిటీవారు ౧౯౩౪ లో ప్రజలేవిధమైన ఆలోచనలు చేస్తున్నారో కనుక్కోడానికి ‘థాట్ ఇనస్పెక్టర్ల’ను ఏర్పాటుచేసినారు. ౬౫,౦౦౦ లమంది సాంఘికవాదులు ౧౯౩౩ డిసెంబరులో జపాను దేశములో ఖైదులలో ఉండిరి. హిందూదేశంలో ఈమధ్య ఒకయేడు ౫౦,౦౦౦ మంది రాజకీయఖైదీ లుండిరి. ఇక జర్మనీ, ఇటలీదేశాలసంగతి వ్రాయనక్కరలేదు. ౧౯౩౩ లో జర్మనీదేశంలో ఒక నిర్బంధపు క్యాంపులో వున్న రాజకీయఖైదీలను, వాళ్ల రాజకీయ అభిప్రాయాలనుబట్టి ఈవిధముగా నాలుగుతరగతులుగా విభజించారట :—

౧. నూటికి ౨౫గురు; కొంచెము చెడినవాళ్లు. వీళ్లను సులభముగానే బాగుచేసి త్వరలోనే మంచిజర్మ

నులుగ తయారుచేయవచ్చును ; అనగా, ప్రభుత్వానికి అనుకూలంగా అనిఅర్థం.

౨. ౨౫ సరు : అంతకంటె పాడైనవాళ్లు : వాళ్లనుకూడా త్వరలో బాగుచేయవచ్చును.

౩. ౨౫ సరు : చికిత్స చాలా జరిగితేనేగాని వీళ్లు బాగువుతారని నమ్మకం లేదు.

౪. నూటికి ౨౦, ౨౫మంది : వీళ్లు సాంఘికో ద్యమాలవల్లా శాంతిఉద్యమాలవల్లా పూర్ణంగా పాడై నారు. బహుశా వీళ్లు ఎప్పటికీ బాగుపడరు.

ఇక వీళ్లను బాగుచేయడానికి ఉపయోగించే సాధనాలు ? క్రూరమైన శరీరశిక్షలు. ప్రజాప్రభుత్వా లింకా మిగిలివున్న ఇంగ్లాండు, ఫ్రాంసు, అమెరికా దేశాల్లోకూడా ప్రజాస్వాతంత్ర్యం, ప్రజాప్రభుత్వం ఇంచుమించుగా ఈపద్ధతులమీదనే నడుస్తున్నాయి. ఈ దేశాల్లోనూ ప్రజాప్రతినిధుల అధికారం చాలావరకు నశించింది.

అధికారమంతా కార్యనిర్వాహకవర్గం వారి పరమైంది ప్రజాప్రభుత్వవిధానంయొక్క ఉద్దేశాలు అనుకున్న ప్రకారం జరగడం లేదు. ఆవుద్దేశా లేమిటి? ప్రజా ప్రభుత్వమంటే ప్రజలను, ప్రజలే, ప్రజలకోసమే పరిపాలించడం అని అర్థం చెప్పారు. 'మనిషి పుట్టుక తోనే స్వతంత్రుడు. స్వాతంత్ర్యం అతని జన్మహక్కు. వయసువచ్చిన ప్రతివ్యక్తీ తనమంచిచెడ్డలను, లాభనష్టా లను గుర్తెరుగగలడు. కాబట్టి ఒరులకు హాని జరక్కుండా, ఒకరిస్వాతంత్ర్యాన్ని ఒకరు అరికట్టకుండా ఎవరి యిష్టంవచ్చినట్లు వారు నడుచుకోడానికి వయసువచ్చిన ప్రతివ్యక్తికీ స్వాతంత్ర్య ముండాలి. రాజ్యాంగవిధానం ఆవ్యక్తిస్వాతంత్ర్యాన్ని కాపాడాలి, పోషించాలి. ఆస్తులు, వుద్యోగాలు, ఉన్నతపదవులు, విద్యాబుద్ధులు మొదలైనవాటిని సంపాదించుకోడానికి ప్రతిజీవికి జాతి జన్మవివక్షతలూ, తారతమ్యాలూ లేకుండా సమానమైన అవకాశా లుండాలి. రాజ్యాంగవ్యవహారాల్లో ప్రత్య క్షంగాగాని, పరోక్షంగాగాని పాల్గొనడానికి వయసు వచ్చిన ప్రతివ్యక్తికీ హక్కుండాలి. తల కొకవోటు చొప్పున వయసువచ్చిన ప్రతివ్యక్తికీ వోటిచ్చే అధికా రం వుండాలి'.

ఈసిద్ధాంతాలు ఆచరణలో తప్పదారులు పట్టాయి పూర్వం కథలో పులీ మేకా గడ్డిమోపూ వక్క తెప్పలో నీరుదాటడం అసాధ్యమైనట్లే. స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరత్వం కలిసివుండడం అసంభవ మైంది. స్వాతంత్ర్యం వున్నచోట సమానత్వం, సోదరత్వం అంతరించాయి. సమానత్వం, సోదరత్వం వున్నచోట స్వాతంత్ర్యానికి తావులేక పోయింది. పైగా స్వాతంత్ర్యం, సమానత్వం, సోదరత్వం ఎంత వరకు ? ఏ విషయాల్లో ? ఏ విధంగా ? అనేప్రశ్నలకి జవాబు చెప్పడంలో, జీవాత్మ పరమాత్మలనుగురించి మహా ర్షులమతాలు భిన్నమైనట్లే, అభిప్రాయభేదాలు ఏర్ప డ్డాయి. చీట్లపేకను ఎన్నిసార్లు కలిపినా రెళ్లు రెళ్లుగాను మూళ్లు మూళ్లుగాను, పదులు పదులుగాను, రాజులు రాజు లుగాను ఉండిపోయినట్లే సంఘాన్ని ఎన్నిసిద్ధాంతాల, ఎన్నివిధాల తలకిందులుచేసినా ధనికులూ, బీదవాళ్లూ, అదృష్టవంతులూ, దురదృష్టవంతులూ అన్నతార తమ్యాలు నశించలేదు. ప్రజాప్రభుత్వా లన్నిటిలోను అసలు అధికారమంతా ధనికులపరమైంది. ఉన్నతపద వులనూ, ఉద్యోగాలనూ పొందడానికి కావలసిన విద్యా, ధనమూ, తెలివితేటలూ, విరామమూ ధనికులకు మోస్త రుగా బీదవాళ్లకుండకపోవడంచేత అధికారపదవులను ఇంచుమించు అన్నిటినీ ధనికు లాక్రమించుకొన్నారు. ధనికులు తమచుట్టూ గిరిగీసికొని తమ ఆవరణలోకి కింది వారిని రానీయకుండా మడిగట్టుకొని కూర్చున్నారు. రూల్సుప్రకారం అందరూ చదువుకోవచ్చును. అందరూ వుద్యోగాలు చేయవచ్చును. అందరూ ప్రధాన మం త్రులు కావచ్చును. క్రియలోమాత్రం బీదవారికి ఆఅవకా శాలు తక్కువ. రూల్సుప్రకారం వోటర్లు తమ ప్రతినిధుల ద్వారా రాజకీయతంత్రాన్ని నడిపిస్తున్నారు. క్రియలో మాత్రం వర్తకవ్యాపారాలను నడిపించే ధనికులే అసలు సూత్రధారులు — ఇంగ్లాండు దేశంలో చూడు. రూల్సు ప్రకారం అసలు అధికారంఅంతా ప్రజాప్రతినిధులది; అనగా వోటర్లది. కాని ప్రజాప్రతినిధులసభ కార్య నిర్వాహకులైన మంత్రివర్గంవారి చేతుల్లో కీలుబొమ్మ అయింది. ఆ మంత్రివర్గాలను నడిపించే కథానాయకు లెవరు ? ధనికులు : పెట్టుబడిదార్లు : వర్తకవ్యాపారాల అధ్యక్షులు. పేరుకు వారిని లిబరల్సు అనుకో, కన్సెర్వ

టివులు అనుకో — ఏ పేరుతో పిలిచినా పర్యవసానం వకటే. ప్రభ అంతా ధనికులదే. నక్క నీలిరంగులో పడినంతమాత్రాన దాని జాతిస్వభావం మారుతుందా ?

కార్మికపక్షంవారిమాట ఎన్నడూ సరిగ్గా చెల్లనే లేదు. కొంతకాలం వారు అధికారాన్ని నడిపారుగాని ఆ కొద్దికాలమేనా వారికి పలుకుబడి వుండేదిగాదు. అమెరికా, ఫ్రాంసు దేశాల్లోకూడా — కారణాలేమైతేనేం — ప్రజాప్రతినిధుల అధికారం చెల్లడంలేదు. కార్యనిర్వాహకవర్గంవారిదే పైచెయ్యిగా వుంది. తుదకు న్యాయస్థానాల్లో అయినా అందరికీ న్యాయంజరగడం దుర్లభం అవుతోంది. ఎందుకంటే :

౧. వ్యాజ్యాలఖర్చులు దుర్భరమవడంచేత న్యాయస్థానాలు బీదవారికి అందుబాటులో లేవు.

౨. న్యాయాధికారులలో చాలామంది పెద్ద తరగతులకు చెందిన మనుష్యులు బీదవాళ్ల కష్టసుఖాలను బీదవాళ్లు గుర్తెరిగేనంత సానుభూతితో, స్వానుభవంతో గుర్తెరుగలేరు. కాబట్టి బీదవాళ్లకి న్యాయం జరగడానికి అవకాశాలు తక్కువ. ఏ దేశంలోనైనాసరె పెట్టుబడిదార్లను ఎదిరించి పనివాళ్లు కోర్టుకు పోయినా, సమ్మెకట్టినా పనివాళ్లకు న్యాయస్థానాల్లో న్యాయం జరగడం కష్టంగా వుంది. న్యాయస్థానాలలోనే, న్యాయంయొక్కటనే అందరికీ సమానత్వం లేకపోతే, స్వాతంత్ర్యం లేకపోతే ప్రజాప్రభుత్వం సరిగ్గా నెరవేరుతోందని ఎట్లా చెప్పగలం ?

కాని ఈ విషయం మొన్నమొన్నటిదాకా స్పష్టం కాలేదు. స్పష్టమైనా ఎవరికీ కష్ట మనిపించ లేదు. ఎందువల్లనంటే :

౧. ప్రజాప్రభుత్వానికి కావలసిన బాహ్యసాధనాలలో, పైవేషాలలో, తదంగాలలో, హంగామాలలో, ఆర్భాటలలో ఎక్కడా లోపం జరగడంలేదు. వోట్లు రహస్యంగానే పడుతున్నాయి ; వోటర్ల జాపితాలు సరిగ్గానే తయారు అవుతున్నాయి ; చట్టనిర్మాణ సభలలో తంతు సక్రమంగానే శాస్త్రోక్తంగానే జరుగుతోంది. మంత్రులను జాగ్రత్తగానే ఏర్పాటుచేస్తున్నారు. ఈ బాహ్యలక్షణాల్లో పటాటోపాలలో, హడావుళ్లలో అసలు ప్రజాప్రభుత్వతత్వమే నశించిందన్న సంగతి ఎవ్వరూ గుర్తించలేదు. ఇది ఎట్లా ఉందంటే,

పూర్వం ఒకరాజుగారు తమ పెంపుడు చిలకకి చదువుచెప్పించాలిఅని నిశ్చయించేశారు. చిలక చదువుకోసం బ్రహ్మాండమైన భవనాలు కట్టించారు. చాలా డబ్బు ఖర్చుపెట్టి దూరదేశాలనుంచి చదువుచెప్పే పండితులను రప్పించారు ఎక్కడ చూచినా కోలాహలంగా వుంది. కాని ఈలోగా చిలకసంగతి కనుక్కునేవారు ఎవరూ లేకపోయారు. నీళ్లూ, తిండీ ఇచ్చేవారులేక చిలక మెడవాల్చి ప్రాణాలు వదిలింది. ఇంతవైభవమూ, విద్యా అనుభవించే అదృష్టం చిలకకి లేదన్నారు చివరకి పెద్దలందరూను.

౨ పందొమ్మిదో శతాబ్దంలో పశ్చిమదేశాల్లో ఫ్యాక్టరీ పరిశ్రమలూ విదేశవర్తకమూ విరివిగా సాగడంచేత ఆ దేశాలలో డబ్బు పుష్కలంగా చేరుతూ వుండేది. అందరిచేతుల్లోనూ డబ్బు ఆడుతూవుండడంచేత మొత్తంమీద బీదసాదల జీవనం ఇప్పటికన్న సుఖంగా జరిగేది. ఫ్యాక్టరీలలో పనిచేసే పనివాళ్ల సౌఖ్యంకోసం కొన్నిచట్టాలను ఏర్పాటుచేసి, వాళ్లకు కొన్ని సౌకర్యాలను, కొంత స్వాతంత్ర్యాన్ని కల్పించి, పెట్టుబడిదార్లు పనివాండ్రను తమ అదుపాజ్ఞల్లో వుంచుకొని తమఅధికారాన్ని సాగించుకొనేవారు. ఇండియా, చీనా, టర్కీ, పర్షియా, ఆఫ్రికా మొదలైన దేశాలు పశ్చిమదేశపు మరసరకులను విరివిగా కొంటూవుండిన రోజులవి — కాని ఇప్పటి రోజులు వెళ్లిపోయినాయి. ఈమధ్య అన్నిదేశాలలోను మరలు, ఫ్యాక్టరీలు, పరిశ్రమలు వృద్ధిఅవడంచేత ఏదేశానికాదేశంలోనే కావలసిన అన్నిసరకులూ తయారవుతున్నాయి. అందుచేత ప్రతిదేశంలోను విదేశవాణిజ్యవ్యాపారాలూ, ఎగుమతులూ తగ్గిపోయినాయి. ప్రతిదేశంలోనూ ఇతరదేశపు సరకుల్ని తమదేశంలోకి రాకుండా చేయడానికి అనేకవిధాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాజకీయ స్వాతంత్ర్యంలేని యే హిందూ దేశంలోనో తప్ప తక్కిన దేశాలన్నిటిలోనూ ఇదే తంతు. ఎగుమతులు తగ్గి సరుకు అమ్ముడుకాకపోవడంచేత ఫ్యాక్టరీలు

నిలుపుచేయవలసివచ్చింది. పనులు తగ్గాయి జీతాలు తగ్గాయి, పనివాండ్రసమ్మెలు, నిరుద్యోగసమస్యా ప్రతిచోట — ఇవి సర్వసాధారణమైనాయి. ఈ బాధలన్నిటికీ కారణం ప్రజాప్రభుత్వవిధానమనీ, కాబట్టి ఆ విధానాన్ని పెకిలివేయాలనీ ప్రజలు తిరగబడ్డారు. ఈ తిరుగబాటు క్రమంగా ప్రతిదేశానికీ వ్యాపించింది.

ఇంతకాలమూ ప్రజాప్రభుత్వవిధానమే సర్వోత్కృష్టమైన విధానమని వాదించిన పండితులు ఆలోచనలోకి దిగారు. ఆర్థికస్థితికీ రాజ్యాంగవిధానానికీ చాలా దగ్గరసంబంధమున్నదనీ, ఒకదానిమీద ఇంకొకటి ఆధారపడి వుంటవనీ, ప్రస్తుతపు ఆర్థికపరిస్థితులు చెడిపోవడంచేత రాజ్యాంగవిధానం యొక్క గౌరవం కూడా తగ్గిందనీ తేలింది.

"ఏసంఘంలో అయినా, ప్రజలు ఎట్లా పొట్టపోసుకుంటున్నారు? అన్నదే మూలవిషయం. కూడు, గుడ్డ మొదలైన ఐహికవాంఛలను తీర్చే ఏర్పాట్లపైనే వారిలో వారి కుండే ఇతర సంబంధాలన్నీ కూడా ఆధారపడి వుంటాయి" అని లాస్కీ పండితుడు. అతని అభిప్రాయం ఏమిటంటే, నేటి కాలపు రాజ్యాంగ విధానాల్లో ఆర్థికవిధానమూ, తక్కిన రాజ్యాంగవిధానమూ వేరువేరు భాగాలైనాయి. ఈ రెంటినీ ఏకం చెయ్యాలంటే రష్యాలో చేసినట్లు పెట్టుబడిదారుల అధికారాన్నైనా పూర్తిగా చంపివెయ్యాలి; లేదా ఇటలీ జర్మనీలలో జరిగినట్లు ప్రజాప్రభుత్వాన్నైనా పూర్తిగా చంపివేయాలి. అంతేకాని మూలధనానికి లోబడి ప్రజాప్రభుత్వం సాగదు. మూలధనానికీ ప్రజాప్రభుత్వానికీ పరస్పరవిరోధం వుండడంచేత ఆ రెంటికీ పొత్తు కుదరదు.

ఇప్పటి ప్రజాప్రభుత్వాలలో ఆర్థికస్వాతంత్ర్యమూ సమానత్వమూ లోపించాయి. అందువల్ల ప్రజాప్రభుత్వ విధానం చక్రాలు విరిగిన బండివలె నేలను కూలింది. జీవనసాధనాలన్నీ, ధనసాధనాలన్నీ ధనికులపాలై వారి యదువాజ్ఞలకు లోబడివున్న సంఘంలోని ప్రజలకు స్వాతంత్ర్యమూ, సమానత్వమూ ఎక్కడివుంటాయి? ప్రజాప్రభుత్వనాటకం ఎట్లా సాధ్యమవుతుంది? అటువంటి సంఘం ప్రజాప్రభుత్వవిధానాన్ని ఎట్లా భరిస్తుంది? ఎంతకాలం భరిస్తుంది? ప్రధానావసరాలైన ఆర్థిక స్వాతంత్ర్యమూ, సమానత్వమూ లోపించినతర్వాత ప్రజాప్రభుత్వ విధానానికి పైపూతలు ఎన్ని కల్పిస్తే మాత్రం ప్రాణంపోయగలవు? అసలు అందం జీవకళా సహజంగా వుండాలిగాని సరిగలతోనూ, నగలతోనూ ఆకారానికి అందం తెచ్చిపెట్టగలమా? రాజ్యాంగవిధానము ఎప్పటి కప్పుడు తీసి, వేసుకునే అంగీ కాదు. అందాలకోసం ధరించే నగ కాదు. ఆసల మనిషి వుండి ఆడించే బొట్టుబొమ్మ కాదు. సారంకొద్దీ పంట; నూనెకొద్దీ కాంతి; జనసామాన్యపు తెలివితేటలు ఆర్థికనియమాలు, కట్టుబాట్లు, ఆచారవ్యవహారాలు — వీటికొద్దీ రాజ్యాంగవిధానం. ఇవి యేయెత్తున వుంటే రాజ్యాంగ విధానంకూడా ఆయెత్తుననే వుంటుంది. నీరు నేల యొక్క ఎత్తుపల్లాలను కొలిచేటట్లే రాజ్యాంగవిధానం కూడా వీటి నన్నిటినీ ఎప్పటికప్పుడు కొలుస్తూనే వుంటుంది. కాబట్టి ఆర్థికస్వాతంత్ర్యం, సమానత్వం లేని ప్రజాప్రభుత్వం ఇంట్లో నోరెత్తడానికి అధికారం లేకుండా బైట మీటింగులలో మాత్రం వుపన్యాసాలిచ్చే కొందరు స్త్రీల స్వాతంత్ర్యంలా వుంటుంది. "ఆర్థికాధికారం లేకుండా రాజకీయాధికారంమాత్రం ప్రజలలో వ్యాపించడం నిష్ప్రయోజనం. ధనికులు, బీదవాళ్లు అని రెండుతరగతులుగా విడిపోయిన ప్రజల అంతఃకరణాలుమాత్రం "మనమందరం ఒక్కటే" అన్న ఐక్యభావంతో ఎట్లా వుంటాయి? వేర్వేరుభాగాల జీవించేవారి ఆలోచనలుకూడా వేర్వేరుమార్గాలనే పోవడం, వేర్వేరు మార్గాల ఆలోచనలు పోయేవారిలో 'మనమంతా ఒక్కటే' అన్న బంధుభావం నశించడం — ఇవి ప్రపంచచరిత్రలో బహుసామాన్యమైన విషయాలు" అని లాస్కీ పండితుడు.

ఉత్పత్తి ఆదాయసాధనాలను ధనవంతులచేతులలోనుంచి తొలిగిస్తేనేగాని ఈ తారతమ్యాలు నశించవు. ప్రజాప్రభుత్వం లోకంలో నిలిచివుండాలంటే ఈమార్పు రాకతప్పదు. పైగా ఈమార్పు బలవంతంగా రాకూడదు. ప్రజలు తిరగబడడమూ, పట్టీలు, ద్వేషాలు, రక్తపాతాలు, కుట్రలు, అంతఃకలహాలు,

పోలీసు దురంతాలు, సైనికబలాలు— ఈమార్గాలను రానూపేదు. ఆర్థికస్థితిలో మార్పులు అగత్యమని ప్రజలకు బోధించి వారిఅభిప్రాయాలను నెమ్మదిగా క్రమంగా శాంతియైన మార్గాలను మార్చడం ఒక్కటే దీనికి సాధనం. కత్తి సహాయంతో ప్రారంభమైన ప్రజాస్వాతంత్ర్యం బానిసత్వంలోకి దిగుతుంది. ద్వేషం, ద్వేషాన్ని పెంచుతుంది. కుట్ర కుట్రను పెంచుతుంది. అపోహలు, అపనమ్మకాలు, స్వార్థపరత్వాలు, కల్మషాలు, కృత్రిమాలు, కుట్రలు, కలహాలు — వీటికీ ప్రజాస్వాతంత్ర్యానికీ చుక్కెదురు. ఇవన్నీ దేశద్రోహానికి బీజాలు; ప్రజాస్వాతంత్ర్యానికి విషపురుగులు. ఈసందర్భాల్లో ప్రజాప్రభుత్వం పేరుమాత్రం మిగిలివున్నా అసలు అధికారమంతా కొద్దిమంది స్వార్థపరుల పరమవుతుంది. ప్రజాస్వాతంత్ర్యం చస్తుంది. "ఆర్థికమైన అధికారాన్ని ఎప్పుడూ తమచేతుల్లో వుంచుకోవలసిన అగత్యం పెద్దవ్యాపారులకుంటుంది. కనకనే ప్రజాప్రభుత్వవిధానం కుంగిపోయింది. ఆర్థికతారతమ్యాలున్నంతకాలం రాజకీయంలో ప్రజాప్రభుత్వం సాధ్యం కాదు. ఆర్థికసమానత్వం వుండాలంటే వృత్తులనూ పరిశ్రమలనూ ధనికులచేతుల్లోనుంచి తప్పించాలి. ప్రస్తుతపు ఆర్థికవిధానాన్ని అంతనీ కొత్తపద్ధతులమీద తిరిగి ఏర్పాటుచేయాలి. అటువంటిమార్పు వక్కసారిగా ప్రజ తిరగబాట్లవల్లగాని, సమ్మెలవల్లగాని, కత్తిబెదిరింపులవల్లగాని రాదు. ఒకవేళ బలవంతంగా వచ్చినా, అసలు అధికారం ప్రజలచేతుల్లో మిగలదు" అని హాబ్సను పండితుడు—.

ప్రజాప్రభుత్వం అంటే ప్రజలు ప్రజల లాభంకోసం ప్రజలను పరిపాలించడమని అర్థమని చెప్పినట్లు ఇదివరలో వ్రాసివున్నాను. ఈ అర్థంలో రెండవ, మూడవభాగాలు సాధ్యమేకాని మొదటిభాగంమాత్రం అసాధ్యమవుతూ వుంది. ప్రజలలాభంకోసం ప్రజలను పరిపాలించవచ్చునుగాని ప్రజలే ఆ పరిపాలనను నడపడం ఆచరణలో అసంభవంగా అగపడుతోంది. ఇందుకు ఇదివరకు చెప్పినకారణంమాత్రమే కాకుండా ఇతరకారణాలుకూడా వున్నాయి:

౧ ప్రతిదేశానికీ ప్రపంచకంలో వున్న ఇతరదేశాలతో సంబంధం ఎక్కువైంది. ఏమూల, ఏదేశంలో ఏసంగతి జరిగినా దానిఫలితం ఎంతదూరం పోతుందో ఎవ్వరూ చెప్పలేకుండా వున్నారు. ఆర్థికంగా ప్రపంచకమంతా ఒక కోటికి వస్తోంది. పైగా ప్రతిదేశంలోనూ ప్రభుత్వాధికారముయొక్క పరిమితి హెచ్చుతోంది. ప్రభుత్వాలు కొత్త అధికారాలనూ, కొత్తబాధ్యతలనూ వహిస్తోంది. ప్రభుత్వపుశాఖలు విరివి అవుతున్నాయి. సామాన్యవోటరుకు ఈ సంగతులన్నీ అర్థమవడానికి తగిన సావకాశంగాని, ఓపికగాని, తెలివితేటలుగాని లేవు. అయిదేళ్ల కొకసారి తన ప్రతినిధికి వోటుమాత్రం ఇస్తున్నాడు. రాజకీయవ్యవహారాల్లో తనకంతశ్రద్ధ చూపడం లేదు. తన ఆర్థికస్థితిగతులు, వృత్తివ్యాపారాలు సరిగా జరక్కపోతే అధికారవర్గంమీద తిరగబడుతున్నారు. సమ్మెలు కడుతున్నారు. ఓటిచ్చేటప్పుడు, పన్ను కట్టేటప్పుడు— ఇటువంటి సందర్భాలలో తప్ప ఇతరకాలంలో ప్రభుత్వానికీ అతనికీ యేమీ ప్రత్యక్షసంబంధం కనపడడం లేదు. పైగా ఎక్కడచూచినా యుద్ధప్రయత్నాలూ, ఒడుదుడుకులూ వున్న రోజుల్లో ప్రజాప్రభుత్వమూ పార్లమెంటు అధికారమూ మామూలుగా జరగడం అసాధ్యమైనపని. రహస్యంగా, సాహసంగా, త్వరితంగా రాజకార్యాలు జరగాలంటే పార్లమెంటుపద్ధతి పనికిరావడం లేదు. పార్లమెంటు చర్చలూ, పార్టీప్రభుత్వమూ రాజ్యాంగవిధానాన్ని నడపడానికి అడ్డంవస్తున్నాయని అందరూ ఒప్పుకొన్నారు. ప్రజాప్రభుత్వాలలో ఉపన్యాసాలేగాని పనులు జరగవనిన్నీ, మంత్రివర్గంవారిని ప్రతివిషయంలోనూ ఎల్లప్పుడూ ఎదిరిస్తూవుండడమే ఎదురుపార్టీవారి పని అనిన్నీ, అందువల్ల మంత్రివర్గం వారి కాలమంతా తమచర్యలను సమర్థించుకోవడంతోటే సరిపోతుందనిన్నీ, వారు ఏపని చేయదలచినా 'ఇది చేయతగునా? తగదా?' అని ఆలోచించడానికి బదులు 'ఇల్లా చేస్తే వోటర్లకు కోపంవస్తుందా? ఈ విషయంలో వోటర్లను సంతోషపెట్టడం యెట్లా?' అని ఆలోచించవలసి వస్తూవుందనిన్నీ, మంత్రివర్గానికి పరిపాలనాశక్తి మార్గదృష్టి మొదలగు వాటికంటె వాగ్ధాటి

యొక్క వ అవసరంగా వుందనిన్నీ పెద్దలంతా అంగీకరించారు. వెల్సు మొదలైన పండితులందరూ సామాన్య వోటరుయొక్క అశ్రద్ధనూ అజ్ఞానాన్నీ చాలా ఖండించారు. వోటరు వ్యక్తి నాయకుల చేతుల్లో కీలుబొమ్మలైనారు. "రాజకీయవ్యవహారాల్లో ఏమి జరుగుతోందో తెలుసుకునేటంత తెలివి తేటలుగాని, శ్రద్ధగాని సామాన్యపు వోటర్లకు లేవు. ప్రజాప్రభుత్వవిధానంలో వున్న గొప్పలోపమే అది. ప్రజాప్రతినిధులను ఎన్నుకొనే వోటర్లలో పదింటిలో తొమ్మిందుగురికి మెదడు ఖాళీ" అని వెల్సు పండితుడు. "మన స్వాతంత్ర్యం నటన; ప్రజాప్రభుత్వం బూటకం; వార్తాపత్రికల ప్రభువులు ప్రజాభిప్రాయాన్ని శాసిస్తున్నారు; వోటువల్ల పొట్టలో వున్న ఆకలి తీరడంలేదు" అని బెర్నార్డుషా. ఇతడు ప్రజాప్రభుత్వాన్ని చాలా తీవ్రంగా ఖండించాడు. ఇతని అభిప్రాయం యేమిటంటే:—

—సామాన్యంగా మనిషి స్వాతంత్ర్యంకోసం తపిస్తున్నాడని అనుకోవడం పొరబాటు. అతనికి 'ఇల్లా చెయ్యాలి' అని చెప్పేవాడు కావాలి. ఎవడు అట్లా ధైర్యంగా చెప్పగలిగితే వాడిని అనుసరిస్తాడు. ఆలోచనలలోకూడా అంతే. ఏసంగతులను నమ్మవచ్చునో చెప్పు; ఎల్లా నడచుకోవచ్చునో చెప్పినట్లుగానే కళ్లె నద్దుకుంటాడు. అందుచేతనే లోకంలో సైన్యమన్నా, మతమన్నా చేరడానికి సిద్ధంగా వుంటాడు. అంగట్లో తన కాలిజోడునూ, బట్టలను కొనుక్కున్నట్టుగానే నీతిని గురించీ, రాజకీయ వ్యవహారాలను గురించీ సంఘం అనే అంగటిలో తయారై సిద్ధముగావున్న అభిప్రాయాలను తెచ్చుకొని తనవిగా వాడుకుంటాడు. ఈ విషయాలలో స్వంతంగా ఆలోచించుకోవడం అతనికిదుస్సహమైన పని. అతనికి గురివున్నచోట నుంచి ప్రమాణవాక్యాలు వస్తే చాలు, వాటిని నమ్మడానికి సిద్ధంగావుంటాడు. స్మృతులు, చట్టాలు, నిబంధనాలు, శాస్త్రప్రమాణాలు వుంటే అతనిమనసు కుదుటబడుతుంది. వాటిని నిలబెట్టడానికి, కాపాడడానికి తనరక్తాన్ని ధారపోయడానికి సిద్ధంగా వుంటాడు. అందుకొరకై తన్నెదిరించినవాళ్ల రక్తమును కళ్లచూడడానికి సందేహించడు రాజకీయవిషయాలలోకూడా అతనికి కావలసినది స్వాతంత్ర్యం కాదు తనపై అధువాజ్ఞలు. తనకు అధిపతి కావాలి. నాథుడు కావాలి. అతను వోటు నిచ్చేది మనిషినిబట్టిగాని పద్ధతుల లాభనష్టాలనుబట్టి గాదు. తనకు నమ్మకమున్నవాడు చెప్పేది అంతా నిజమే అయియుంటుంది. దానినిగురించి వేరే ఆలోచించనక్కరలేదు. తగిననాయకుణ్ని ఏర్పాటుచేసుకొని అన్నివిషయాల్లోను అతన్ని అనుసరించడం మానవస్వభావం. కాబట్టి ప్రజలు తమరిని తమ్ము పరిపాలించుకోలేరు. ప్రభుత్వానికి నిరంకుశాధికారం తప్పదు. వోటర్లను పొగడి, వారియిష్టమునచ్చినట్లు తాళం వేస్తేనేగాని ప్రజానాయకులకు అధికారం చేతజిక్కదు. అబద్ధాలకు, అన్యాయాలకు వెనుకదీయనివాళ్లే ప్రజాప్రభుత్వాల్లో నాయకు లవుతారు. అటువంటి నాయకులు ప్రజాభిప్రాయంకోసం దేశక్షేమాన్నికూడా గమనించరు. అందుచేత ప్రజాప్రభుత్వం వోటర్లనుసంతోషపెట్టడంలోకి దిగుతుంది.—

అందుచేతనే చాలాదేశాలలో ఎన్నిక లన్నా, వోట్లు అన్నా, వోటర్లు అన్నా, ప్రజాప్రతినిధు లన్నా, ప్రజాప్రభుత్వాలన్నా గౌరవం నశించింది. కొన్నిచోట్ల ఆ ప్రభుత్వవిధానాన్నే రద్దుచేశారు.

కాబట్టి పర్యవసాన మేమిటంటే — ప్రజాప్రభుత్వవిధానం క్షీణించడానికి కారణం దాని వుద్దేశాలలో లోపంకాదు. క్రియలో, అధికారమంతా స్వార్థపరులైన ధనికులపరం కావడం. వోటర్లు స్వతంత్రాలోచన లేకుండా తలవంచుకొని వాళ్ల ననుసరించడం. ఈకారణంచేత ధనికులదే పైచెయ్యి అవుతోంది. క్షీణించినది అసలు ప్రజాప్రభుత్వం కాదు. ధనికుల ప్రజాప్రభుత్వం; ధనికులపరంగా చెలామణీ అవుతూవచ్చిన ప్రజాప్రభుత్వవిధానం.

సంఘంలోవున్న ప్రతివ్యక్తికీ సమానగౌరవమూ, స్వాతంత్ర్యమూ లేనంతకాలం ప్రతివ్యక్తియొక్క ఆత్మ మనోవికాసాలకీ, శక్తిసామర్థ్యాలకీ నిరాటంకమైన అవకాశాలు లేనంతకాలం, ఒకనిజౌన్నత్య మింకొకని పత్ర

నానికి వేరే సువర్ణావకాశం, మానవుడు తనఆత్మ గౌరవాన్నీ, స్వాతంత్ర్యాన్నీ సన్నగింపలేని స్థితిలో ఉండే అంతకాలం ప్రజాప్రభుత్వవిధానం నిర్విఘ్నంగా కొనసాగించ కల్ల.

తే. తెలిగి యార్పాస మొశకంబు చీమ నల్లి
యల్పములుగ్గ హింస చేయంగఁ దగదు
నాని హృదయంబులం గున్నవాఁడు శివుఁ
డాతఁ డెల్లెడల యిట్టి జీవాత్మకం బె?"

అన్న భావం లేని ప్రజకు, ఆత్మస్వాతంత్ర్యమూ ఆర్థికస్వాతంత్ర్యమూ లేని ప్రజకు రాజకీయాధికారం ఇవ్వడం పసిపిల్లవాని చేతికి పదునైనకత్తి యివ్వడం వంటిది; నిరతపస్సుచేసి బ్రహ్మరాక్షసిని సృష్టించడం వంటిది.

"పాప మార్జించుకొనుటకుఁగాక ప్రాభవంబు
పరుల గూల్పఁగ వాసనఁ బడుగదయ్య"

అన్న కవిశ్యాగుని మాట నిజమవుతుంది. ఈ పరిస్థితులు మారడానికిముందు ఆర్థికపరిస్థితులను చక్కబెట్టాలి. ధనికులను, దరిద్రులనుకూడా కిందికి దిగలాగుతూవున్న విపరీతమైన యీ ఆర్థికతారతమ్యాలు నశించాలి.

"బ్రదుకు పైఁగూడ ఆకలను బాడుచేయు
ఘోరదారిద్ర్యదుఃఖంబుఁ గుడుచు చకట
ఏగతిని బల్కె పోతన్న భాగవతము?"

అని యొకకవి ఆశ్చర్యపడ్డాడు. దుఃఖ దారిద్ర్యబాధలు దిగమింగి ఇట్లా పైకి వచ్చే, కార్యాలు సాధించే పోతన్నలాంటివాళ్లు నూటికీ, కోటికీ ఎంద రుంటారు? ఒక్కడయినా ఉంటాడో ఉండడో. కాని అటువంటి ప్రతిభా, ప్రజ్ఞా బయిటికి రావాలంటే వ్యక్తి తారతమ్యాలూ, హెచ్చుతగ్గులూ, కొద్దిగొప్పలూ అనే వివక్షతలు లేకుండా ఉండాలి; 'ఘోర దారిద్ర్యదుఃఖం' సంఘంలో పూర్తిగా నశించాలి. ప్రతిజీవికి ఆత్మమనో వికాసాలకి అవసరమైనంతవరకూ సుఖజీవనాన్ని సంఘమే యేర్పాటుచెయ్యాలి. ఎవరికీ ఆసుఖజీవనానికి తగ్గి ఉండకూడదు; అంతకుమించి సౌఖ్యభోగాలకూ అక్కర లేదు. అప్పుడే ప్రజాప్రభుత్వానికి నిజమైన సోపానాలు ఏర్పడతాయి. స్వాతంత్ర్యమూ, సమానత్వమూ, సోదరత్వమూ ఆచరణలో యథార్థమవుతాయి.

ఈవుద్దేశాలు నెరవేరడ మెట్లా? దేశంలో ఉన్న ఆర్థికసంపదను, అర్థోత్పత్తిమార్గాలను ఏవిధంగా మారిస్తే ఈ వుద్దేశాలు సక్రమంగా నెరవేరుతాయి? ఈ ప్రశ్నలకు ముందు ఉత్తరంలో జవాబు వ్రాస్తాను.



పరతత్త్వపరిశోధనము

వడ్డాది సీతారామాంజనేయకవి

వందే కామకలాం మాతాం
సచ్చిదానందవిగ్రహాం,
దివ్యశక్తిమయీం ధాత్రీం
తీర్థపాదస్వరూపిణీమ్.

"నే నెవఁడను? నాపరమావధి యేది? నే నెక్కడ నుండి వచ్చితిని? నే నెక్కడకుఁ బోవుచున్నాను? నేను గమ్యస్థానమును జేరుటకుఁ జేయవలసినవిధు లేవి?" యని ప్రపంచములో నున్న ప్రతివ్యక్తియుఁ దనజీవితకాలములో నెపుడో యొకప్పుడు తలపోయక తప్పదు. ఇట్టివారే జిజ్ఞాసువులు. పైవిషయములనుగూర్చి తలపెట్టక యలక్ష్యభావముతో నుండువారే యజ్ఞానులు. ప్రతి మానవమాత్రుని హృదయమందును జీవితాంతములోపల నేదో యొకయవస్థలో నీప్రశ్నావళి తప్పక పొడమితీరు ననుట నిర్వివాదాంశము. ఏమా? తా నెక్కడనుండి వచ్చెనో, వర్తమానమునఁ దా నెట్లున్నాఁడో, తా నెక్కడకుఁ బోవలసియున్నదో మానవుఁడు తెలిసికొనకున్నంతకాలము, గమ్యస్థానమును జేరువిధానములపై దృష్టి ప్రసరింపదు. అట్టిపరిస్థితులలో నామార్గముల ననుసరించుటకును, గమ్యస్థానమును జేరుకొనుటకును వానికి నవకాశ మెట్లుండును? కాఁబట్టి యీపరమతత్త్వమును నాయోపినంతవఱకుఁ బరిశోధింపఁ బ్రయత్నింతును.

ఈవిషయమును నిర్ధారణచేయుటకుఁ దగినప్రమాణమును మొట్టమొదట మనము చూపవలసియున్నది. బాహ్య(ప్రాపంచిక)దృష్టితోఁ బరిశోధించువా రొక్క ప్రత్యక్షమునే తత్త్వజ్ఞతకు మార్గముగాఁ బరిగణింతు మందురు. ఇది, నిశ్చయముగా, దోషభూయిష్ఠభావము. దీనిని ఖండించుటకుఁ బ్రత్యేకముగా శ్రమపడనక్కఱ లేదు. ఏమా? ఇంద్రియములచేతఁ దెలిసికొనుటకు వీలైన వస్తువులను, అనూహ్యమగు నీప్రపంచకములోని వస్తువులను సరిగాఁ దెలిసికొనలేకుండుచున్నప్పుడు భూతభవిష్యత్కాలములతోను, వివిధావస్థలతోను సంబంధించియున్న యింద్రియాతీతవస్తుతత్త్వము నెట్లు తెలిసికోఁగలము?

తత్త్వజ్ఞతకు ననుమానమును దృష్టాంతముగా మఱి కొందఱు చెప్పుదురు. ఐహికవిషయములలో నీవాదము కొంతవఱకు మన కుపచరించినప్పటికిని, ప్రతివ్యాపారములలోను మన కిది సరిపడదు. మనలౌకికవ్యవహారములలో సైతము పరులమాటమీఁద మన మాధారపడియుండవలసి యున్నది. ఒకయుదాహరణము :— మన మొకతల్లికడుపునఁ బుట్టితి మని యనుమానముమీఁద నిర్ధారణచేయఁ గలము. అనుమానవాదజ్ఞాన మెంతగా నున్నప్పటికి నది మన తల్లిని నిర్ధారణచేయఁజాలదు. నమ్మికయే యిందు మనకు శరణ్యము. ఈయనుమానసిద్ధాంత మింద్రియాతీతపారలౌకికవిశేషములనుగూర్చి యెంతయుఁ గూడ మనకుఁ దెలియఁజేయజాలదు అందుచేతనే మనమతవాఙ్మయము, "జ్ఞానసంపాదన మెప్పుడును విశ్వసనీయులగు మహోపదేష్టలవలననే కావలయు" నని ఘోషించుచున్నది. దీనినే యాప్తవాక్య మందురు. ఈవిషయమును శ్రుతులు (ఉపనిషత్తులు) ను, వేదాంతసూత్రములును, శ్రీమద్భగవద్గీతాశాస్త్రమును దృఢీకరించుచున్నవి.

వానియభిప్రాయ ముపదేశములను మనము గ్రుడ్డిగా నమ్మవలె నని కాదు. హేతువాదము, సమాలోచనము, విచక్షణత్వము తత్త్వపరిశోధనముపట్ల నుండనక్కఱలే దని దుర్భ్రమపడరాదు. తత్త్వద్రష్టయైన శ్రీతీర్థుల(గురుదేవుని) ముఖమునుండి పరతత్త్వోపదేశమును బొందవలయు నని చెప్పుటయే వానిసారాంశము. ఇందుచేతనే శ్రుతిస్మృతు లిట్లు వాకొనుచున్నవి:-

"శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః" (శ్రుతి)
"యస్తర్కేణానుసంధత్తే స ధర్మం వేద నేతరః"
(స్మృతి.)

శ్రీకృష్ణభగవానుఁడుకూడ జ్ఞానోపలబ్ధికిఁ 'బరిప్రశ్న'శబ్దము నుచ్చరించును సమాలోచన మవసర మని నొక్కి చెప్పియున్నాఁడు.

అర్జునుఁడు తనకు రూఢియగు నాజ్ఞను దయచేయ వలసినదని శ్రీ కృష్ణభగవానుని బ్రార్థింపఁగా, శ్రీకృష్ణభగవానుఁ డర్జును నాజ్ఞాపించుటకుబదు లాతనితో హేతువాదము చేసి, సందేహము లన్నియుఁ దీర్చి "కచ్చి దేత చ్ఛ్రుతం పార్థ!" యని తన సంభాషణము నాతఁడు సావధానచిత్తుఁడై వినెనో లేదో పరీక్షించెను. అప్పుడు పార్థుఁ డిట్లనెను: "స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ" శిష్యుఁడు శ్రద్ధతో శుశ్రూష యొనర్చి తీర్థోపదేశమును సదా మననము చేయుచు స్థిరముగా నచంచల విశ్వాసముతో నుండవలయు నన్న మర్మమును శ్రీకృష్ణపరమాత్మ స్వయముగా జగత్తునకుఁ బ్రదర్శించెను. మీఁది విషయమును బురస్కరించుకొని మన మతగ్రంథము లాత్మ, జీవాత్మ, జగత్తు ననునీమూఁటినిగూర్చి యేమి చెప్పుచున్నవో పరిశీలింతము. తరువాత సిద్ధాంతమును బరిశోధించి హేతుపూర్వకముగా నిశ్చయింపవచ్చును. ఈ విషయమును గుఱించి వేదనిర్ణయముతో మనకుఁ బ్రసక్తి లేదు. ఏమా? జిజ్ఞాసువులై వేదములను జదువువారు శాఖాభేదములను, ద్వైతభావములను, అవిద్యను, సాక్షికత్వమును విసర్జించినవారై యాత్మ జీవాత్మ జగత్తుల కైక్యమును వేదము ప్రతిపాదించుటఁ దెలియఁగలరు. ఎచ్చటను వీనికి ద్వైవిధ్యము చెప్పఁబడి యుండలేదు, సరిగదా వాని భిన్నత్వమును బెక్కుతావుల వేదము ఖండించియున్నది. ఉపనిషన్మత మేమో తెలిసికొనుట కొక్క మాండూక్యోపనిషత్తే చాలును. మాండూక్యోపనిషత్తు తొలుదొల్తనే అద్వైతమతమును బ్రతిపాదించుచున్నది. ఇంతేకాక మాండూక్యోపనిషత్తు, జాగ్రత్స్వప్న సుషుప్తులయందుండు చైతన్యము యొక్క తాదాత్మ్యమును, వివిధావస్థలను సమన్వయము చేసెడు నేకత్వ సిద్ధాంతముతోఁ గూడుకొన్నట్టియు, గుణవిశిష్టము కానట్టియు, అ, ఉ, మ యను నక్షరత్రయముతోఁ గూడు కొన్న ఓంకారముతో సాదృశ్యమును గల్పించి, పరమాత్మ, జీవాత్మ, జగత్తుల యేకత్వమును స్ఫుటముగాఁ బరివ్యక్త మొనర్చుచున్నది. అంతే కాదు; మాండూక్యోపనిషత్తునుబట్టియే మాండూక్యోపనిషత్తును విశ్వసించువా రద్వైతమతమును దిరస్కరింప వశము కాదని సులువుగాఁ జెప్పవచ్చును. ఉపనిషత్తులచే నిరూపింపఁబడిన విశ్వోత్పత్తిక్రమము నంగీకరించినవా రద్వైతమతము నంగీకరించితీరవలసినదే. తైత్తిరీయోపనిషత్తు జగత్పరిణామమునుగూర్చి సృష్టికిఁ బూర్వముండేయున్న పరమేశ్వరుఁడు చైతన్యముగను సమస్తజడపదార్థములుగను దనకుఁ దానే వ్యక్తమయ్యె నని వాకొనుచున్నది. సృష్టి నభివ్యక్తము చేయుటలోఁ గల భగవత్సంకల్పమును గుఱించి తైత్తిరీయోపనిషత్తు మఱియు నిట్లు నడుపుచున్నది; "బహు స్యాం ప్రజాయేయేతి."

తా ననేకస్వరూపములతోఁ బ్రవర్తిల్లుటయే భగవత్సంకల్పము గాని యనేకమును సృజించుట కాదు. దివ్యశక్తి సృష్టిగాఁ బరిణమించినప్పుడును, మన మందఱమును భగవంతుని సర్వజ్ఞునిగను, సర్వశక్తిసమన్వితునిగను, నిర్వికల్పసంకల్పునిగను సమ్మతించియుండుటచేతను, భగవంతుఁడు విశ్వరూపధారియై, సర్వాంతర్యామియై యున్నాఁడని మన మంగీకరింపక తప్పదు. అట్లు కానిచోఁ దాను వివిధాకృతులతోఁ బ్రకాశింప సంకల్పించియుఁ దద్వ్యతిరేకముగాఁ బ్రవర్తించెననియుఁ, దనకు భిన్నముగ నుండు నట్లు సృష్టినొనర్చె ననియు మన మనవలసివచ్చును.

కొందఱు ఉపనిషత్ప్రామాణ్యము నంగీకరింపక వేదములయందలి పూర్వభాగములైన సంహితలనే పరిగణింతురు. వేదము లద్వైతమతమునే ప్రతిపాదించుచున్న వని వారి నంగీకరింపఁజేయుటకు సంహితలలోని పురుషసూక్తములోఁ జెప్పఁబడినయీ క్రిందిసూక్తి చాలును.

"ప్రజాపతి శ్చరతి గర్భే అంతరజాయమానో బహుధా విజాయతే."

ఏదివ్యశక్తి యాత్మజ్ఞానము నావరించి, యనేకత్వమును సృష్టియందుఁ బ్రదర్శించుచున్నదో యది మాయ యని పిలువఁబడుచున్నది. దీనిని మాయావాదసిద్ధాంతము విశదీకరించుచున్నది. కొందఱీ సిద్ధాంతకారకత్వమును శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యులవారికి నారోపించి వెక్కిరించుచున్నారు. కాని యిది

నూత్నసిద్ధాంత మెంతమాత్రమును గాదు. ఉపనిషత్తులును, శ్రీమద్భగవద్గీతాశాస్త్రమును దీనిని వాక్రుచ్చుచునే యున్నవి. అంతేకాక శ్రీమద్భాగవతముకూడ నీమాయావాదమును బెక్కుచోట్లఁ జాటుచున్నది.

"మాయాంతు ప్రకృతిం విద్యా
న్మాయినం తు మహేశ్వరమ్"
(శ్వేతాశ్వతరోపనిషత్)

"దైవీ హ్యేషా గుణమయీ
మమమాయా దురత్యయా" (గీత)

"య దిదం మనసా వాచా
చక్షుర్భ్యాం శ్రవణాదిభిః,
నశ్వరం గృహ్యమాణం చ
విద్ధి మాయా మనోమయమ్." (భాగవతమ్)

శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్యులవారిచేతఁ బరివ్యాప్తమొనర్పఁబడిన యద్వైతమతమును, జగన్మిథ్య యను వివర్తవాదమును ఋజువుచేయుటకు నిట్టియుపపత్తు లసంఖ్యాకముగ మనవాఙ్మయమునుండి ప్రదర్శింపవచ్చును.

ఇఁక బైబిలుకూడ నద్వైతమునే పురస్కరించుకొని యున్నదని గట్టిగఁ జెప్పనగు. 'మీరే దేవతలు', 'దేవుని రాజ్యము మీలోనే యున్న' దని క్రీస్తు వాక్యము. పాలస్టయినులోఁ గ్రీస్తు అద్వైతమతమును బ్రచారము చేయుచుండఁగా నక్కడనున్న ద్వైతులఁ కొందఱు రోమదేశపుఁ బ్రభుత్వమును బురికొల్పి యతనిని పిలువపైఁ బెట్టి చీలలుకొట్టి చంపించిరి. అయినప్పటికి నిష్పాక్షికులను సత్యాన్వేషకు లందఱును నేఁటి పాశ్చాత్యలోకమునకుఁ బ్రభువు, యజమాని, రక్షకుఁడునైన క్రీస్తుయొక్కమత మద్వైతప్రతిపాదక మని యొప్పుకొనితీరవలసినదే.

మహమ్మదీయులలోఁ గూడ సూఫీతెగకుఁ జెందినవారు జ్ఞానమునకే ప్రాధాన్య మొసంగియున్నారు. వారి మతము కేవల మద్వైతము.

అద్వైతమును గూర్చి యతివిస్తర మేల? ప్లాటో, స్వీడెన్‌బర్గు, వర్డ్సువర్తు, బ్రౌనింగ్, కార్లైల్, ఎమర్సన్ మున్నగు పాశ్చాత్యవేదాంతులెల్ల రంటియు నద్వైతమునే దృఢముగా విశ్వసించియుండిరి.

శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్యులవారిచే బరివ్యాప్త మొనర్పఁబడిన యద్వైతమతము నేటికిని పాశ్చాత్యుల హృదయములలో ప్రతిష్ఠితమై సమున్నత గౌరవస్థానమును బొందియున్నదని మనము ముఖ్యముగా స్మరింపవలసి యున్నది. 'హైందవ వేదాంత' మనుమాట పాశ్చాత్యులచెవిని సోకఁగానే శంకరునివేదాంత మనియే వారు గ్రహింతురు. మిగుల నాశ్చర్యకరమగు వృత్తాంతము విన్నారా ఇదే, "మన ప్రాచీనగ్రంథములను శేవధులను విడిచిపెట్టి మన వేదాంతమతము ప్రతిపాదించుచున్న యద్వైతసిద్ధాంతమునందె స్వేచ్ఛాలోచన పరులగు పాశ్చాత్యులకు దృఢముగా విశ్వాస మెట్లు కుదురుకొన్నదో" యని మనకు సందేహము కలుగవచ్చును. దీని కొక్కటే సమాధానము. హేతువాదమును బురస్కరించుకొనియున్న దీయొక్క మతమే. అందుచేతనే స్వేచ్ఛాలోచనపరులైన పండితులు కూడఁ దమ కంగీకారము కాకున్నను నీ సిద్ధాంతము విధిగా శిరసావహింపవలసి వచ్చెను.

అద్వైతమతమే, యీవ్యాసారంభమున వేయఁబడిన ప్రశ్నలకు యుక్తియుక్తమైన ప్రత్యుత్తరముల నొసంగుటకు, సర్వసమర్థమై యున్నది. ఆత్మయొక్క స్వరూప లక్షణములను నిరూపించుటకుఁ బూర్వము స్వరూపలక్షణము లనఁగా నెట్టివో పరిశీలింతము. ఆత్మతో సహజాన బంధము కలిగినట్టివియు, నాశ్రయముఁ దమస్వరూపము నారోపించునట్టివియు, నాకస్మికముగాని, యనిశ్చలముగాని కాకుండునట్టివియుఁ, గాలవశమునఁ దమంతట నదృశ్యమగునట్టివియుఁ, దాత్కాలికముగాఁదమచే నిగ్రోధింపఁబడినముఖ్యగుణములను బునరుద్ధరించునట్టివియు స్వరూపలక్షణములు. అగ్నిచేతనుగాని, సూర్యునిచేతనుగాని క్రాఁగిన నీటియొక్క వేఁడిమి క్రమముగాఁ జల్లారి, కొసకు నంతరించును. అంతేకాని యావేఁడిమి స్థిరముగా నుండఁజాలదు. అందుచేతనే యట్టి గుణములనుగూర్చి "యీవేడికిఁ గారణమేమి?" యని ప్రశ్నించుట తటస్థించుచున్నది. నీటికి నుష్ణత సహజగుణము కాదని పై ప్రశ్నయే విశదీకరించుచున్నది.

ఈవిధముగానే మనము తర్కించుకొన్నయెడల దుఃఖ మాత్మకు సహజగుణము కాదని వ్యక్తమగుచున్నది. ఎవ్వఁడైన నేడ్చుచున్నయెడల వానిని జూచినవారు, "వాఁడు దుఃఖించుటకుఁగల కారణమేమి?" యని యడుగుదురు. ఈ ప్రశ్న యబట్టి మానవునకు శోక మాకస్మిక మేకాని సహజగుణము కాదని స్పష్టము; అనఁగా నాత్మ, స్వభావసిద్ధముగా నానందమయ మన్నమాట. ఆనందము లేకున్న నిలువలేకుండుటయు, నానందము కొఱకే నిరంతర మన్వేషించుచుండుటయు మనకు స్వాభావికము.

శ్లో. "ఆనన్దః కిల మన్యతే విభుతయా
వేదేఽపి లోకే చిరా
దానన్దం ప్రవిశత్యసౌ వయమివా
నన్దేన యో జీవతి,
ఆనన్దాయ కరోతి యత్నమధునా
నన్దాదిహోయాత్సదా
నన్దస్యానుభవ త్యశో రణుక మా
నన్దేఽన్తతో లీయతే."

(తీర్థులవారు)

మనము వ్యాధి నసహ్యించుకొని యారోగ్యము నపేక్షింతుము. వ్యాధికాక యారోగ్యమే మనకు స్వాభావిక మైయుండుట దీనికి కారణము. మనము కష్టమును గోరుకొనము. ఎల్లప్పుడును మనకు సుఖమే కావలయును. ఏమా? సుఖము నేకాని, కష్టమును వాంఛించుట మానవస్వభావము కాదు. సుఖమును బడయుట కెన్నెన్నో మార్గము లున్నవి. కాని మనపరమావధిమాత్ర మొక్కటే. దీనినిగుఱించి భేదాభిప్రాయ మెవ్వరికిని లేదు. కావున స్వాభావికముగా నాత్మ యానందమయము. మన మందఱమును నిర్మలానందమునే కోరుదుముకాని లవలేశమైనను దుఃఖము దరిఁ జేరుట కిష్టపడము. కాఁబట్టి యాత్మ దుఃఖరహితమైనదియు, స్వచ్ఛమై, యఖండమై యపారమైయుండు నానందముతో నిండి యుండునదియు నైయున్నది.

చావును కోరకుండుట మానవస్వభావము. మన మెప్పుడును జీవించియుండవలె ననియే యాశించుచుందుము. కాఁబట్టి శాశ్వతత్వము సహజము కాని మృత్యువు కాదు. ఆత్మ అవ్యక్తమైనది శ్రీకృష్ణభగవానుఁడుకూడ గీతలలోని విషయమునే చెప్పియున్నాఁడు "నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః". "పదార్థముకాని శక్తికాని యెన్నఁడును నశింప" దని పాశ్చాత్యప్రకృతిశాస్త్రవేత్తలుకూడ నంగీకరించియున్నారు. కాఁబట్టి యాత్మకు నాద్యంతములు లేవు. అది సర్వదా ఉన్నదియే. దీనినే వేదాంతపరిభాషలో 'సత్త'ని యందురు. మనము జ్ఞానాన్వేషణతత్పరుల మగుచుండుటయుఁ, దత్త్వప్రాప్తికి భంగముకలిగినప్పుడు దుఃఖితుల మగుచుండుటయు నానందమున నంతర్యాఖ్యాతమై యున్నవి. దీనిచే నాత్మ జ్ఞానమయమేకాని యజ్ఞానావృతము కాదని యగును. శ్రీకృష్ణపరమాత్మ 'అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జన్తవః.' 'తేషామాదిత్యవజ్జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్' అని పలికియున్నాఁడు. మబ్బుచేఁ గప్పఁబడిన సూర్యుఁడు మన కగోచరుఁడై, మబ్బులు విడిపోయినంతనే కనఁబడునట్లే యజ్ఞానము విరిసిపోవఁగనే జ్ఞానము ప్రత్యక్ష మగుచున్నది. సర్వత్ర నిగూఢముగనున్న యగ్నికాని, విద్యుత్తుకాని రాపాడుటచేతఁగాని, యేదేని మఱియొకసాధనముచేతఁగాని ప్రజ్వరిలఁజేయఁబడునట్లో, లేక శిల్పకుఁడు చిరకాలమునుండియుఁ జలపోయుచున్న విగ్రహమును రాతిపలకలో నంతకుముందే గుప్తమై యున్న దానిని మలఁచినట్లో యప్రత్యక్షమైయున్న వనజ్ఞానమును విద్యవలనఁ బ్రకాశింపఁజేయఁబడునని మనశాస్త్రములు ఘోషించుచున్నవి. జ్ఞానము, వెలుపల నెచ్చట నుండియో మనలోనికిఁ బ్రవేశపెట్టఁబడదు. అది లోన నుండియే బహిర్గత మగును. అది వెలినుండియే లోనఁ బ్రవేశపెట్టఁబడునెడల సన్నగిలి తరచు కంతరించును. నీటికిఁ గలిగింపఁబడిన వేఁడిమివలెనే యదియును స్థిరముగా నిలువదు. కావుననే బోధను విద్య యనిరి. ఆత్మ తెంపులేని జ్ఞానముతో నిండియున్నది. వేదాంతపరిభాషలో దీనిని 'చిత్త'ని యందురు.

మానవుల మగు మనమే కాక చిన్నపురుగుకూడఁ బారతంత్ర్యరహితమైన స్వతంత్రజీవితమునే పొందఁ జూచు ననుట మూఁడవ ముఖ్యవిషయము. ఇది ప్రపం

చమున సర్వత్ర సమానమే. స్వాతంత్ర్యమేకాని దాస్యత యాత్మయొక్క స్వభావము కాదని దీనివలన స్పష్టము. ఈ సందర్భమున మన మొక యద్భుత విషయమును గమనింపవలసియున్నది. మనమందఱమును స్వతంత్రతకై యత్నించుచుండినదాగ మయ్యెను, ప్రతివాడును మనయాజ్ఞకు బద్ధుడు కావలెననియు, మన మాట ప్రకారము నడచుచుండవలెననియు నభిలషింతుము. దీని పర్యవసానమేమనగా, భగవంతుడున్నాడో లేడో మనకు దెలియకపోయినను, భగవంతునిలో నున్న దివ్యశక్తిని బొందగోరుచున్నాము. కావున మనము సహజముగా నిజమైన దివ్యశక్తిసంపన్నులమే.

ఈపైని తర్కించిన విషయముల నన్నిటినిబట్టి చూచినచో బరమాత్మ జీవాత్మ జగత్తుల యేకత్వము స్థిర మని రూఢియగుచున్నది.

భగవంతుడు సర్వవ్యాపకుడైనచో సర్వము తానేయనుట నిశ్చయము. భాండము మృత్తుతో జేయబడు ననుట సర్వజనవిదితము. మృత్తు భాండములోని ప్రత్యణువునందును నున్నదేకాని కుమ్మరిమాత్ర మందు లేదు. అట్లే నూలు - బట్ట, బంగారము - నగలుకూడను. కనుక సృష్టి భగవంతునిచేతనుగాక భగవంతునితో జేయబడియుండెనేని భగవంతుడు సర్వవ్యాపి కాగలడు; అనగా భగవంతుడు జగత్తునకు నుపాదాన కారణమునుబట్టియే సర్వవ్యాపకుడుకాని, సమవాయ కారణమునుబట్టి కాదు. శ్రీమచ్ఛంకర భగవత్పాదుల వారు—

"సువర్ణాజ్జాయమానస్య సువర్ణస్య వినిశ్చితమ్,
బ్రహ్మణో జాయమానస్య బ్రహ్మత్వస్య హి వినిశ్చితమ్"
అని చెప్పియున్నారు.

పైనుదాహరింపబడిన వాక్యము భగవంతుని సర్వవ్యాపకత్వమును జాటుచున్నది. ఈవిషయముల నన్నిటిని గాఢముగ మననముచేసినవారికి నద్వైతతత్త్వము నిస్సంశయముగ హృదయమున నాటుకొనును.

"ఓంపూర్ణమదః పూర్ణ మిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే,
పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమేవావశిష్యతే"

అను శ్రుతివలన భగవంతుడు వివిధ జీవులును జగత్తును వ్యక్తమైన తర్వాతనుగూడ నఖండముగనే యుండు నని పరిస్ఫుటమగుచున్నది. క్రమముగా, కుండ, కుర్చీ, బట్ట, నగ రూపములను బడసినప్పుడు మృత్తిక, దారువు, తంతువు, స్వర్ణము మొదలైనవి తమయథాస్థితిని విడిచిపెట్టుట సర్వజనవిదితము. అయినను మూల పదార్థమునకు జేటులేదు. వివర్తవాదమనబడు బింబ ప్రతిబింబవాదమును మనము విశ్వసించిననే యియ్యది సుసాధ్యము.

పరిణామవాదసిద్ధాంతమే సరియైనదైనచో, ననగా భగవంతుడు వివిధవస్తురూపములలో దాను వ్యక్తమై యుండెనేనియును, తత్ఫలితముగా వచ్చిన జగత్తు నిజమయ్యెనేనియును నామరూపములుగల యీ యజ్ఞానహేతుక లౌకికజ్ఞాన మజ్ఞాన మనియు, మాయ యనియు, భ్రమ యనియు నిరసింపబడియుండదు. ఈయజ్ఞాననిర్మూలనార్థమై కర్మ, యుపాసన, యోగాభ్యాసము, శుశ్రూష, తర్కము మొదలగు వివిధ మార్గములు నిర్ణయించుట కావశ్యకమును గనుపింపదు. ఈ యంశముల నన్నిటిని సమగ్రముగ జర్చించి, మనము శాశ్వతుల మనియు, వికారరహితుల మనియు, ప్రబుద్ధుల మనియు, స్వతంత్రుల మనియు, సత్త్వసంపూర్ణ దివ్యప్రకృతిలో భాగస్వాముల మనియు, జ్ఞానానందమయుల మనియు, దత్త్వసముద్భవుల మనియు, గాలక్రమమున దత్త్వమందే లీనమైపోవువార మనియు మనము నిర్ణయమునకు రాకతీరదు. తత్త్వమునకు మన మెంతదవ్వైన మన కంత తీవ్రమగు నశాంతి తప్పదు. కావున మనము గమ్యస్థానమును జేరుకొనుటకు మార్గమేదో పరికింతము. భగవద్గీతలో నరనారాయణులైన యర్జునునకును శ్రీకృష్ణపరమాత్మకును జెప్పబడిన సంబంధమునుబట్టి యీసమస్యను గడుసులభముగ బరిష్కరింపవచ్చును. ప్రశాంతమును, ఆనందమును నైన నారాయణత్వమును బొందుటకై పార్థునివలె దుఃఖమగ్నుడైయున్న మానవుడు తనసర్వస్వమును శ్రీమన్నారాయణునకు సమర్పించి, తత్ప్రసన్నతనే యర్థించుచు, నద్వైతభావమును విస్మరింపక భజింపుచుండుటొక్కటే మార్గము.

ఇట్లు నరనారాయణులకుగల యనుబంధమే జీవాత్మ పరమాత్మలకు జేకూరినప్పుడు సంజయుడు వాకొన్న యీ క్రిందివాక్యమమోఘమై సిద్ధింపగలదు.

"యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః,
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ."

రాధపిలుపు

"సంకేత్"

కొంచెము కొంచమై పెదవికోనల మోసులువోవు నవ్వు నం
దించిన కౌముదీప్రభలు నిల్చిన యాకడకంటిచూపు సా
రించి మసారహారపటలీ పరిభూషిత రాధికావధూ
కుంచితదేహవల్లి నుపగూహనలో నొకమారు నింపరా!

నీమురళీరవమ్ము విని నీకడకున్ జనుదెంచి చూచినా
స్వామి! యిదేమి నాగళము సన్నవడెన్ చెమరించె దేహమున్
నామిసివిర్గతాశ్రువులు జాలయి పారెను కల్లగల్లపున్
హ్రీమధురమ్ముగా పులకరించిన నీమృదుమాలతీగతిన్.

స్వామి! పునఃపునారచితచంద్రకచారు పురఃప్రసారముల్
నామనమున్ హరించె పరిణద్ధకలాపికలాప కైశిక
శ్రీమహనీయతల్ సతులలేమెడదల్ హరియించుటబ్బురా
ఏమి ఘటించు నీకు కిమురించుట నీకనియమ్యెనే ప్రభూ!

ఓయదువంశపాళీ! రుచిరోజ్జ్వలమీనపతాక మెత్తిద
ర్పాయుతశింజినీరవములన్ మదనాహ్వయుడేయు బాణముల్
నీయెద తాకి తూలిపడునేమొ సుమమ్ములపోల్కి — రాధకున్
తీయనిమంటలై యుసురుతీయునురా జగదేకసుందరా!

శారదయామినీమధురచంద్రిక లిమ్ముగ నింబవాటికన్
తీరిచి ముగ్గువెట్టి నవనీతలమున్ మలుపచ్చిముత్యపున్
పేరుల నందగించె రజనీరమణీకచసక్తసూనక
శ్రీరమణీయమై పొలిచె శీతమయూఖుడు షోడశాంశుడై.

లోకముకూడ మైమరపులో పులకించి రహస్సమాధిలో
తా కనుమూసుకొన్నది సితద్యుతికాంతుల ముస్కులాడి ల
జ్జాకలనన్ కనుల్ మొగిచి శార్వరియున్ నిదురించెనేమొ హే
వాకమునన్ ప్రమోదసుఖవార్నిధి క్రుంకిడి సోలిపోవుచున్.

వలపులు ముమ్మరించు రసవన్నవహృచ్చషకమ్ము నీకునై
నిలిపితి, త్రావి పొమ్ము నవనీతదయాగుణశాలి! ఆవలన్
వలచిన నుంచునో మరి రవంతయు నుండక యెండిపోవునో
మొలచిన కూర్మి కన్నుగవ మూసిన నేమగునో జగత్ప్రభూ!
నిలువున చిచ్ఛవిచ్ఛటలు నిండిన సహృదయమ్ము తోయిగా
జాలదు సరసాకృతికి జాలద ఈనిఖిలప్రపంచముల్
చాలని నాయలంతియును చారములన్ గొనుమీ పవిత్రపూ
జాలనసాల్ పుష్పముగ నస్మదుదాత్తసమాధి మాధవా!




హిమాలయవైభవము:
కైలాసయాత్ర

కొ. సత్యనారాయణ

హిమాలయములపై నెన్నియో పుణ్యక్షేత్రము లున్నవి. ప్రతివత్సరమును జను లెందరో యాత్రికుల కరుగుచుందురేగాని యచ్చటి విషయములను మనకు దెలిపి యుండలేదు. నేనిపుడు కైలాసపర్వతము మానససరస్సులగూర్చి కొన్ని విషయముల దెలుపదలచినాను.

కైలాసమునకు బలుమార్గములు కలవు. అన్నియు దుర్గమకాంతారములగుండను, దుస్తరమగు కనుమలమీదుగను కల వనుట సామాన్యవచనము. కాని ప్రకృతిసౌందర్యమచ్చటనే చూచి తరింపవలెను.

కైలాసమున కాల్మోరా నుండి పోవుమార్గమే తేలిక. అచ్చటనుండి వాగేశ్వరము, తాకులా గ్రామముల దాటి సరయూతీరముననుసరించిదాని సుందర మర్మరధ్వనులు వీనుల విందు సలుపుచుండ ప్రయాణ మొనర్చవలెను. పిమ్మట కాప్కోట, శ్యామాధురాలను దాటి రామగంగాతీరము నాశ్రయించి మనశ్యారీ గడచి తేజమునకు పత్తుము. ఆల్మోరానుండి తేజ 'మువరకు హిందూసభ్యత, ఆర్య జాతివర్ణరూపములు గనుపట్టును. ఆల్మోరా నుండి తేజమునకు 86 మైళ్లు. ఆల్మోరా జిల్లాయంతటను భీరువులగు దుకాణదారులు, కుటిలనతిజ్ఞులు, దాస్యాపేక్షులు, దుర్బలులు నగు వ్యవసాయదార్లు వసింతురు. ఇక్కడ నుండి ఉద్యోగులు, సాహసులు, వ్యవసాయ ప్రియులు, దృఢకాయులు, శిక్షావిహీనులగు భుటియాలు వసింతురు. ఇచ్చటనుండియే కుమాయూన్ పర్వతము లారంభించును. 'శ్వేతభవనము'లోనికి ప్రథమద్వార



మిది యే. ఇచ్చటికి సమీపముననే గోరీనది యొక్క అఖండ జలప్రపాత మున్నది. భయంకరమగు మంచుప్రవాహములు (Glaciers) పర్వతశిఖరములనుండి జారుచు వింతను, విభ్రాంతిని ఒకేసరి కలిగించును. తేజమునుండి గిర్గాం, పిమ్మట మీలం. ఇది యానందకరమగు ప్రదేశము. మీలమునకు పడమర గఢవాల్ వైపున నందదేవీశిఖరములు ౨౫౬౪౦ అడుగుల యెత్తున నాకాశమును చుంబించుచుండును దీనికి ౨౦౦౦౦ అడుగుల యెత్తుకు తగ్గని పదునైదుమంది నెచ్చెలు లున్నారు. నందదేవికి దక్షిణమున త్రిశూలి ౨౩౦౦౦ అడుగుల యెత్తున నున్నది. వాయవ్యమున ౨౨౬౪౦ అడుగులయెత్తున నందికోటశిఖరము తన నవ యౌవనమును ప్రదర్శించుచుండును. మీలముచెంత హిమాలయ శ్వేతభవనమున ప్రసిద్ధమగు జలపాత మున్నది. దీని వేగమున రెండుమూడు పిండిమరలు పనిచేయుచున్నవి. ఇచ్చట లండన్ మిషనువారి చర్చి యున్నది. వీరు భుటియాలతో జూన్ లో వచ్చి మరల సెప్టెంబరులో క్రిందికి పోదురు. నందదేవిపర్వతముపై విషవృక్షము లున్నవని ప్రతీతి గాన జనులు అచటికి పోరు. ఇచ్చట మిషనరీపాఠశాల యున్నది. గార్హ్వాల్ (గఢవాల్) దుర్గమపర్వతము లొకవైపునను, పంచచూలీపర్వతమాల మరొకదిక్కునను, కుంగరీ బింగరీ శిఖరములు వేరొకదిశను, భయంకరమయిన యగాధమగు గోరీనది వేరొకదిశను జేరి మీలంగ్రామమును శత్రువులనుండి కాచుచున్నవి. ఇచటివారు సంవత్సరమున నేడుమాసములు ఎండను చూడరు. కాని ఇచట అరటులు, నారింజలు, ముల్లంగి, బంగాళాదుంపలు, యజ్ఞస్తంభములు సర్వత్ర చూడుదుము. మీలమునకు దాపున గోరీనది గలమునుండి రెండుమైళ్లు దూరమున శాండిల్య మహాముని యాశ్రమ మున్నది. ఇచ్చట శ్వేతభవన ప్రవేశము.

సింహావలోకనము

౧౮౩౦౦ అడుగులయెత్తున నిలిచి వెనుకకు జూచిన నేమి కనుపట్టును? చుట్టుప్రక్కల నిరువదిముప్పదిమైళ్లవరకు ప్రకృతిసౌందర్య మవర్ణనీయశోభతో దృష్టిగోచర మగును. సర్వత్ర ఈశ్వరుని ఉత్కృష్టవిభూతియొక్క యద్వితీయచిత్రము కనుపట్టును. ఈ స్వర్గముపై నింతటిమనోహరమును, ఉజ్జ్వలమును, అప్రతిమమును, రమణీయమునగు స్థానము మరెచ్చటనైన గలదా? విశ్వకర్తనగు నీశ్వరునితో సంభాషించ ననువగు నింతటి నిర్మల ప్రదేశము మరెచట గాదు? ప్రభాతమున భానురశ్మి యీ కొండలపై ప్రసరించునప్పటి యలౌకికశోభ యేలేఖినికైనను వర్ణింపసాధ్యమా. "నశక్యతే వర్ణయితుం గిరాం తత్" యనిన కవికేసరివాక్యము లసత్యములా? ఇట్టిప్రదేశముల కేతెంచి పవిత్రదేవమందిరములను స్థాపించి వారి భావిసంతానమునకు యాత్రామాహాత్మ్యమును బోధింపదలచిన యార్యుల ప్రజ్ఞావైదుష్యము లెంతని యనవలె! విషయపంకమున గుత్తుకబంటిగ మునిగియుండెడివ్యక్తు లీప్రదేశములకొక్క తూరియైన వచ్చి ఈశ్వరుని యలౌకికశక్తిని గానమొనర్చినది కృతార్థులు కాజాలరు. ఇది తపోభూమియని వక్కాణించిన ప్రాచీన ఋషు లెంతటిసత్యవంతులు! చిత్తమును ధ్యానావస్థలో నుంచి ఏకాగ్రతనవలం

బింప జేయుట కింతకన్న నుత్కృష్ట ప్రదేశ మేమున్నది? చెంతనే నందదేవి సఖులతో గూడి సాభిమానముగ నిలిచి ప్రభుని గుణసంకీర్తనము చేయుచున్నది దాని కించుక క్రింద త్రిశూలి తన మూడుశిఖరములతో నలరారుచున్నది. చెంతనే నందకోట ౨౨౫౩౦ అడుగుల యెత్తున భారతమాతకు జయగీతి పాడుచున్నది. నందదేవికి తూర్పుగ పంచచూలి తన ఐదుగురుసఖులతో కేళీకందుకము లాడుచున్నది. నందదేవికి పశ్చిమమున కేదారము, బదరీనాథము మొదలగు ప్రసిద్ధశిఖరములు నీరాజన మొసంగుచున్నవి. పూర్వు లిట్టిక్షేత్రయాత్రలను నెలకొల్పినచో నిట్టిప్రకృతిరమణీయతనుండి మన నేత్రములు వంచింపబడెడివే!

ఎన్నడు నిష్కామకర్మనిష్ఠులగు ఋషులీ తపోభూమి నలంకరించి మానవలోక కల్యాణమున కుపాయములను జింతించియుండిరో, ఎన్నడు బౌద్ధభిక్షువులు ధర్మప్రచారమునకై యిట్టికఠినమగు పర్వతముల దాటి పూజ్యులగు తమగురువుల సందేశమును తిబెత్తునకు గొనిపోయిరో! ఆహా! నాడు భారతవర్షమున కెంతగౌరవ ముండెనో, ఎంతయానంద ముండెనో ఎవడు పలుకును! కేవలము తమకర్తవ్యపాలనముకొరకే యిట్టికఠినమగు పర్వతముల దాటిపోయిన భారతీయు లెంతటినిష్కపటులు! ఎంతటి నిరీహులు! ఎంతటి సత్యవాదులు! ఎట్టిసాహసులు! ఏవిధమైనవాణిజ్యలోభమునను కాదు, కుటిలనీతిచాపల్యమున గాదు, రాజకీయముగ విజయపతాక నెత్తుటకు గాదు వారచటికి బోవుట. కాని యేది ప్రాణిజాతమున కభయహస్త మొసంగునో యానిస్పృహమగు ప్రేమకు వశీభూతులై వెడలియుండిరి. ఆర్యవీరుల యాదర్శచరిత్రములు ప్రాతగిలి మఱవబడినను గూడ నీ హిమాలయములోని శ్వేతభవనమున వారి కీర్తి ప్రకాశముయొక్క ధ్వజము లింకను యెగురుచున్నవి.

తిబెత్తునకు బోవుట చాలకష్టము కావునను, అది మహాత్ము లుండెడి ప్రదేశ మనువాడుకచేతను, జను లెక్కువగ బోరు. ఇచ్చట నన్నిరకముల ఓషధులు నున్నవి. ధాతువు లున్నవి. బంగారు గను లున్నవి. ఉప్పు, వెలిగారము, సూరేకారము చాల దొరకును. సరస్సులు హెచ్చుగ నున్నవి. వీనిప్రకృతి రామణీయక మతుల్యము. సింధు, శతద్రువు, బ్రహ్మపుత్ర మొదలగు పెద్దనదు లిచ్చటనే పుట్టినవి. చలి జాస్తి. ఐదారుకంబళ్లు గప్పుకొనవలెను. ఇచ్చటి జనులు హుణియేలు. వీ రొకచోట స్థిరముగ నుండరు; పశువులతో వసతులు గలచోట్లకు బోవుచుందురు.

కుంగరీ బింగరీ దాటిన కొన్ని మకాములకు పిమ్మట గుణవస్తీ, దమయంతీనదులు గలవు. పిదప గ్యాచిమామండీయను పెద్దవర్తకస్థాన మున్నది. పిమ్మట తీర్థపురి యనునది. ఇచట చాల గుహాలు గలవు. ఇచ్చటనే భస్మాసురుడు విష్ణువుచే మోసగింపబడి తనహస్తమునే శిరమున నిడుకొని భస్మమైపోయినది. ఈ భస్మమును యాత్రికులు గొనిపోయి శరీరమున కలదుకొందురు. కైలాసమునుండి గలగలబారుచుండెడి మూడు వాహినుల సంగమమున, శతద్రునదీతీరమున విశాలములును సుందరములు నగు పచ్చికబయళ్లనడుమ కన్నులపండువుగ నీతీర్థపురి యలరారుచున్నది. తీర్థపురినుండి

కైలాసమునకు మూడురోజుల ప్రయాణము. త్రోవలో పెద్దరాళ్లతో నిర్మింపబడిన "డొంగే"లను మందిరములలో వసింపవలెను మార్గములు సరిగలేవు. అభ్యాసవశమున బోవలసినదే. ఇచ్చట పచ్చిమొక్కలు గూడ మండును. ఈశ్వరమాయ.

పిమ్మట సింధునదీరము. ఈ సింధునది కైలాసపంక్తిని బ్రద్దలుకొట్టుకొని పోవును.

కైలాసము

కైలాసపర్వతముచుట్టును గుహ లుండును. నాలుగైదు మైళ్లపిమ్మట నొకమందిరమున్నది. పుస్తకాలయ మున్నది. లామాలు, సన్న్యాసినులు రాత్రింబవళ్లు జపము చేయుచుందురు. కైలాసప్రదక్షిణము 33 మైళ్లు. మూడుమొదలు ఏడుదినములు పట్టును. మార్గమున అడవి పావురములు గలవు. ఈ మంచుకొండలలో నీపిట్టల నివాసము వింతగా నున్నది. రెండుజలపాతము లున్నవి. మంచు కైలాసమునుండి ఈశ్వరుని అపారకృపారసమువలె అహర్నిశలు ప్రవహించుచుండును.

ఏ మాయలౌకికదృశ్యము! అనుపమమగు వెలుంగు! కైలాస మీశ్వరసృష్టిలో నలౌకికమగు చమత్కారము. ఎన్నియో శివాలయములు దర్శించితిని కాని యిట్టి ప్రాకృతికశివాలయమును జూచియెుఱుంగను. భూమిపై మొట్టమొదటి శివాలయమునిర్మాణమునకు గడంగిన శిల్పిహృదయపటమున నీనైసర్గికశివాలయపుచిత్ర మవశ్యముగ నుండి యుండును. ప్రకృతి తననిర్మాణకౌశలమును, తనరచనాపద్ధతిని, తనసౌందర్యమునంతటిని మంచుతో కైలాసపర్వతనిర్మాణమున వ్యయపరచెను. ౨౧,౯౭౦ అడుగులయెత్తునున్న దీనిమహిమ నెన్న నెవరితరము? ఈ దివ్యదృష్టి భారతవర్షముపై ప్రసరించ జను లందరు నామూర్తిపవిత్రమహాత్మ్యమును గాంచి పొంగిపొరలి "హర హర మహాదేవ" యని కీర్తించుచు ధన్యులగుచున్నారు. ఈ పరమేశ్వరస్వయంవిరచితకైలాసమందిర మెంతకాలము నిలిచి యుండునో అంతవరకు స్వచ్ఛందభారతీయులు చీనా జపాను బాలురతో గూడి ప్రేమానిగత్తుల పఠించుచు దీనికి ప్రదక్షిణము చేయుచుందురు. కైలాసమునకు తూర్పున నొకబావి నానుకొని గౌరీహ్రద మున్నది. ఈ హ్రదము పన్నెండుమాసములును మంచుతో గప్పబడి యుండి గౌరీశంకరులయన్యోన్యానురాగమును, అర్ధాంగత్వమును లోకమునకు ప్రదర్శించుచుండును. కొంతదూర మరిగిన పిమ్మట నాగగుహలో రామరావణులు పరివారసముల విగ్రహములు గలవు. కైలాసముమీద నిచ్చెనవలె నేదియో గనుపట్టును. పైన దాని చుట్టు చారవలె నొకగీత గనుపట్టును. రావణు డెత్తినపుడు అది పడిన దందురు. కైలాసమునుండి సట్లెజ్ పడమరగను, బ్రహ్మపుత్ర తూర్పుగను బయలుదేరును. న్యాగ గుహకు సమీపమున కొన్ని యుష్ణకుండములు కలవు. వానిలో తీర్థమాడినచో రోగములు నివారణ యగును. ఇచటనే మాంధాత యజ్ఞము చేసినాడని చెప్పుదురు. మాంధాతతపస్సుచే మానససరోవరము పుట్టె నందురు.

మానససరోవరము

మానససరోవరముతీరమున తొమ్మిది గుహలు గలవు. దానికి సమీపముననే రాక్షసతల (రాకాసతాల) మను మరొకసరోవరము గలదు. దీనితీరమున పడిపోయిన ధర్మశాల

యొకటియున్నది. దీనినడుమ చిన్నలంక యొకటున్నది. దానిపై రావణుడు తపస్సొనర్చి ఈశ్వరుని గాంచెనని ప్రతీతి కలదు. రెండు సరోవరములకును మధ్యదూరము మూడుమైళ్లు. అవి పన్నెండుసంవత్సరముల కొకతూరి కలియునని చెప్పుదురు. దానికి తగిన ప్రాకమూల సెలయేరొకటి రెంటిని కలుపుచున్నది. ఇట్టిది మరొకటి ప్రపంచమున లేదని పలుకవచ్చును. మానససరోవరము సుమారు ౭౦ మైళ్లు చుట్టుకొలత గలిగియుండును. నలుప్రక్కల నుండి ఏడుచిన్ననదులు దానిలో ప్రవేశించును. రాయంచలు, చక్రవాకములు మొదలగు వివిధవర్ణముల పక్షులు సానందముగ మధురధ్వనుల సలుపుచు నిర్మలమగు నాజలముల స్వేచ్ఛావిహారము సలుపుచుండును. పెద్దకలలుగల చిన్నచిన్న చేపలు పలురంగులవి యలలవెంట తీరమునకు గొట్టుకొనివచ్చును. యాత్రికులు వానినిగొనిపోయి తమపిల్లలకు భూతములగాలి సోకకుండునట్లు ధూపముల వేయుదురు. నిర్మలజలతరంగపూరితమగు మానసరోవరపు రామణీయకమును, విశాలమును, మనోహరములు నగుపచ్చిక బయళ్లను, ఆకాశచుంబితంబులగు కైలాస శిఖరములను ప్రదర్శించు నాప్రకృతి వైచిత్ర్యమును వర్ణింప నాకేమిశక్తి గలదు? సరోవరము చెంతనే వేడినీటిబూటలు ఉండుటచే జలమంత శీతలముగ నుండక స్నానయోగ్యముగ నుండును. తరంగము లించుక పెద్దవిగనే యుండును. తీరములయందు దట్టముగ దర్భ పెరిగియున్నది. దృశ్యము మనోహరమై యొక్కపరిచూచిన జీవితాంతమువరకు మరపునకు రాకుండును. తూర్పుగా నిలిచి చూచిన కుడియెడమల చాలదూరము శిథిలమైన గోడవలె పర్వతపంక్తి మిట్టపల్లములుగ గనుపట్టును. దక్షిణమున మాంధాత పర్వతశిఖరములు సరోవరజలమున ప్రతిబింబించుచుండును. పూర్వతీరమున లపర్వతమాల కనుపట్టును. ఉత్తరమున కైలాసము తన శిఖరమును చెలువుతో విహరించుచుండును. సరోవరము చాలలోతు; నీరు నిర్మలముగా నుండును. దీని యధిత్యకము ౧౫౦౦౦ లు. అచ్చట దొంగల భయము గాన రాత్రికాలముల నుండుటకు వీలులేదు. మానససరోవరమునకు కొన్ని మైళ్లదూరములో, గౌరీ ఉదయూర్ అను మూడు గుహ లున్నవి. వానిలోనే గణేశుడు జననమందెనని పలుకుదురు.

పూర్వము వర్ణించిన నందదేవి పర్వతపాదమున చిన్నయేరొకటి కలదు. దానిని వైతరణి యందురు. ఆవైతరణి యమపట్టణము చెంత నుండు వైతరణియే. ఆ నందదేవి ద్వారము నరకద్వారమే. దానిని దాటిన స్వర్గమార్గమే. అప్పటికి నా మాటను తలంచిననే శరీరము గగుర్పొడుచును.

సమాప్తి

ఆర్యుల భావనాశక్తి నెంత కొనియాడగలము! కైలాసమే శివలింగ మయ్యెను. అచ్చట బుట్టెడు సెలయేళ్లు జటాజూటమయ్యెను. గంగ యా జటాజూటమునే యలంకరించెను. త్రిశూలిపర్వతమాలయే త్రిశూలము. కరగిన మంచుచే నేర్పడు ఝురులచే నలంకృతమైన కైలాసము నాగభూషణుడే. నిర్మానుష్యమై, శ్యామాయమానమగు శాద్వలములచే కన్నులపండు

పొంగర్చు నాకాననము దివ్యమగు నానందకాననమేల కాకుండును? స్వచ్ఛమగు మంచుచే గప్పబడియుండుటచే ఈశ్వరుడు భస్మధారి యేల కాడు? నిరంతరము స్రవించెడు ప్రేమప్రవాహము నాబడు సూచుచే గప్పబడియుండు గౌరీకుండమును పార్శ్వమున గలిగియుండుటచే ఈశ్వరుడు అర్ధనారీశ్వరు డేల కాడు? అంసుగామై మన మా ప్రదేశముల కరుగకుండినను పూర్వులగు మహాఋషుల కా ప్రదేశములన్నియు కొట్టిన పిండియే. కాకున్న నా ప్రకృతివర్ణనాశక్తియు, భావౌన్నత్యము నెచ్చటినుండి కలిగెనందురు? కాళిదాసునకు కైలాసము నిజావాసమే.

దుర్గమకాంతారమయిన నేమి, దుస్సహహిమాలయమైన నేమి? రాక్షసులకు దేవతలువోలె మిషనరీలకు హిమాలయములు లోబడినవే. కైలాసపర్వతము రకు గల ముఖ్యపట్టణము లన్నిటిలో వారి చర్చి, పాఠశాలలు తప్పక పెంపొందుచున్నవి. అమాయకులగు నచ్చటి జనులు మిషనరీల దుండగములకు పాలగుచున్నారు.

ఇచ్చట స్త్రీలకు పాశ్చాత్యస్త్రీలకన్న నెక్కుడు స్వాతంత్ర్యము కలదు. "రంగ్ భంగ్" అను దురాచార మొకటి ప్రబలుచున్నది. ఇది పాశ్చాత్యనాగరికతఫలితమనక తప్పదు. గ్రామములలో ప్రత్యేక మీస్వాయంవర ములకు గృహము లుండును. రాత్రిపూట యువకులు తమ యువతులతో నా "రంగ భంగ" లేక (Club H. m s లో చేరి శృంగార గీతముల బాడుచు మద్యపానము, ధూమపాన మొనర్చుచు, రాత్రియంతయు గడపి యుదయమున నింటికి చేరుచుందురు. తల్లిదండ్రులే మిషనరీలపల్కులకు లోనై తమసంతానముల నీగృహములకు బంపుదురు. యౌవనము, ఏకాంతము, మద్యపానము, స్వాతంత్ర్యము, రాత్రికాలము — ఈ కారణము లన్నిటిచే ఆర్యసభ్యతలోని సర్వోత్తమమైన పాతివ్రత్య ధర్మము ఈభటియాలలో నశించిపోవుచున్నది. దూరదేశమైనను మహాత్ములీదురాచారమును మాన్పింప యత్నింపవలెను.

కొన్నిప్రదేశములలో గోరీ, కాలీనదులఖండమగులోతున నతివేగముగ బ్రవహించుచుండుటచే దాటుటకు వశములుగానందున నా ప్రక్క కొండపైనుండి యీప్రక్క కొండపైకి త్రాటిచూయలలు గట్టబడియుండును. జనులు వీనికి దగిలించియుండు కడియములను నడుమునకు వైచుకొని దాటిపోవుచుందురు. ఇట్టి వింత లెన్నియో గలవు. ప్రత్యక్షముగ జూడవలెనేగాని ప్రకృతిసౌందర్యము నెంతని వర్ణింపగలము?

కర్మవీర!

కొండూరు వీరరాఘవాచార్యులు

౧

భరతధాత్రీశిరము, ఫలమురూపయి వచ్చి
చీకటుల ముగ్గిన, లోకాల దేర్పంగ
నడయాడుచున్నావటే
దాస్యంబు
నెడద్రోల నున్నావటే ?

౨

కూడుగుడ్డయులేక, కుందుబీదలగతుల్
తలపోసి తలపోసి, పలవించి వారలను
గాపాడదలచినావా
కష్టాలు
రాపాడబూనినావా !

౩

పుస్తకము కత్తిగా, బూని పగతుర గెల్వ
శాంతిభేరికలు దిగంతాల మ్రోగంగ
సమరాన లంఘింతువా
విజయంబు
సాధించి చూపింతువా ?

౪

ఎండినయెడదలో, నెన్నెన్నిభావాలు
నిండి లోకాలకై, పండించె భాగ్యాలు
భావాలబరిగొనెయటరా ?
డెందంబు
భాగ్యాలకుప్పయటరా ?

౫

మూడుముడుకలబొజ్జ, ముద్దులూరెడుబొజ్జ
మూడులోకాలను, మురిపించుచిరుబొజ్జ
స్వాతంత్ర్యఫలము గనురా !
ఓగాంధి !
సర్వసౌఖ్యము లీనురా ?

౬

ఆనందరసము వెల్లావరించినమోము,
వికారమ్ములకు, నెడమీని నగుమోము
భువనశాంతిని జూపెరా !
జనులలో
నవజీవముల నిల్పెరా !

౭

తల్లిదాస్యపుద్రాళ్లు, తగద్రెంచుబాహువులు
ఘోరాటవీశిష్యులను, దాకుపెనుబాహువులు
అభయదానము జేసెరా !
ఆర్తులను
ఆదరింపగబూనెరా !

౮

విశ్వమంగళమునకు, వెలసియున్నావంచు
విశ్వాన శాంతిని, వెలుగజేసెదవంచు
నీకు జేజే పెట్టురా !
ద్వీపాలు
నీచరిత్రలు పాడురా !



అఖిలభారత రేడియో స్టేషనుల వి వీలగు క్రొత్త

"హిస్ మాస్టర్స వాయ్స్"

రేడియో రిసీవరు

మాడల్

650. A. C.
50-100 సైకిల్సు
195 255 వోల్టులు

వెల రూ 500/-

"HIS MASTER'S VOICE"

★ ఈ రేడియో రిసీవరునందు అఖిల భారత రేడియో స్టేషనులే గాక 5 2000 మీటర్లలోని సర్వదేశముల వార్తలను, సంగీతమును గూడ శుద్ధముగా విన వీలగును.

ముఖ్యాంశములు

- విశాలమైన డయల్
- అధికమైన శబ్దప్రసారము
- అతి సున్నితమైన పరికరములు
- పికప్ ఉపయోగింపనగును.

నేడే మా యనుమతిపొందిన రేడియో వ్యాపారియొద్ద ఈ మాడలును, తదితరములను చూడుడు.

ది గ్రామఫోన్ కంపెని, లిమిటెడ్.,

45, సౌత్ పెరేడ్

బెంగుళూరు.

'సూరన్నప్రభావతి'

పుట్టపర్తి నారాయణాచార్యులు

సూరన్న పెద్దనగారి మనుమరాలి మగడట. ఒకనాడు తాతగారు మనుమని జూచి "నాయనా! చల్లగా నొకపద్యమల్లరా చూతము" అని తమాష కడిగిరట. సూరన్నయు గొంతు సవరించుకొని తిన్నగా బ్రారంభించినాఁడు. "తలఁక జొప్పడి యొప్పె నప్పుఁడు" అని కూనిరాగము మొదలిడినతోడనే యనుభవశాలి యగు పితామహుఁడు "చాలుచాలులే! నీరచనయు నీవు, మొదటనే నాలుగు విరుపులా" యని మాట ముడిచెనట. సూరన్న రోషము దెచ్చుకొని మిగిలిన మూడుపాదములును, నొకడే సమాసమున వెళ్లబాదెనట. ఒకగాథ. మనకవులనుగుఱించి, యిట్టి కాళ్లులేనికథ లెన్నియో యున్నవి. అసలు, పెద్దన్నసూరన్నలకుసంబంధముండెనో లేదో, యున్న నది యేపాటిదో మన మెఱుఁగము. కాని, యీగాథ యొకవిశేషమునకై పుట్టి యుండును. సూరనశైలి లలిత గంభీరము. మృదుమధురము. తిక్కన్నచాయలు సాధారణముగా గానిపించుచుండును. కొన్ని యెడల నప్పటప్పుసరకే దించినాఁడా యనియు సందేహము గలుగును. శ్రీనాథుని "ఘనఘనా ఘనగర్జా నిర్ఘోషముల"బోలు రచనలును నరుదుగా దట్టును. పెద్దనసమాసములలో బినవీరభద్రుని మేలిమి యున్నది. పోతనతరువాత సంస్కృతపు సమాసముల నచ్చుకట్టుకు దించి, నయమగుచాయ నిచ్చిన నీతడే. పెద్దనలోని పనితనమే సూరనయందును గిరికొన్నది. మరల నింతలలితగంభీరములగు సమాసముల వాడినవారు లేరు. పెద్దన సమకాలికుడగు ముక్కుతిమ్మన కీవాసన కొద్దిగా నంటినది. చేమకూరవాడు వాడినచోట మధురముగనే యుండును. కాగా సూరన కవిత్వమును గురించియే యీగాథ నల్లియుందురు. అతని తెనుగులు వజ్రపుదునుకలు. తెనుగు సమాసములు నిడుదలుగా నేర్పరచి కూచిమంచి తిమ్మనవలె రసాభాసము జేయడు. మధురములై సన్నివేశమునకు సరిపోవు పూమొగ్గలవంటి తెనుగులే వాడును. సూరన్న సంస్కృత సమాసములు కంచుమ్రోతవలె విన నింపు గలిగించును. రాయని కవితయందువలె భావ నూతనత లేదు. ఆధర్మ మితనికి జాల తక్కువ. కాని, భావముల దన పలుకుపొందునగూర్చి తనకేయనిపించు చిత్రవిద్య యీతనిది. పండితుడుమాత్రమే గాడు, ప్రపంచ మెఱిగిన ప్రోఢ. అనుభవశాలిమాత్రమే గాడు, అనుభవము నక్షరమూర్తితో జోడించి యానందించిన రసికుడు. అలంకారము, భరతశాస్త్రము తర్కమీమాంసలు, ధర్మశాస్త్రము అన్నిటికి జేయివేసినాడు. కలముబట్టినపు డన్నిటికి దొలగి నిలిచినాడు. నిజముగా గొప్ప సంస్కారము గలవాడు సూరన్న.

తక్కిన యుత్కృష్టగుణము లటుండ నితడు ముఖ్యముగా పాటించినది యౌచితి. పాత్రముల నాడించు సూత్రధారి యితడు. ఇతడు చెప్పినట్లు చూపించునట్లు, వేషము లాడుచుండును. ఆన దాటిన "కోగంఢ శిక్ష" తప్పదు. కొలిచిచూపిన ట్లీత డౌచితీ సన్నివేశమును గానిపించినపు "డౌరా! పనితన"మని యాశ్చర్యము గలుగును. సూరన్న గొప్పమేధావియని యప్రయత్నముగా నాలుగులొట్టలు వేయవలసివచ్చును. నాకపు రాధీశ్వరుడగు దేవేంద్రుడు ద్వారకను దూరమునుండి చూచినాడు. చాలనాశ్చర్య కరముగా నున్నది. "అతని వేయికన్నులును జాలక వెఱగుపడినాడట", కాని యా ధీరో దాత్తచక్రవర్తి యొక్కసారి "శిరఃకంపంబు" సేసినాడు. మనవంటిసామాన్యుడు గాడు గదా దేవేంద్రుడు - కొంచె మాశ్చర్య మైనవెంటనే గ్రుడ్లు మిణకరించి నాలు కల్లార్చి శరీరము కొయ్యబారి చెమటచే గుడ్డలు తడిసి బీభత్సమూర్తియగుటకు. ఆ రాజస మూర్తి శిరఃకంపము - వేయిభావముల గూర్చుకొన్నది. "నిలింపవల్లభుని పెంపు పరికించిన" మాతలియు "కించి దుల్లసితలోచను" డైనాడట. ఈ రెంటిని పరీక్షించుపాఠకు డౌచితీనిర్వహణమునందు సూరనదృష్టి యెంత గంభీర మైనదో తేల్చుకొనవచ్చును. కవి స్వతంత్రించి పలుకువోటులలోగూడ సూరన్నకు చాపల్యము తక్కువయే. కథో ద్వేగమున కడ్డుగలిగించి ఛీ యనిపించు తెగ బారెడువర్ణన లెక్కడను జేసినవాడు గాడు. ఇంద్రుడు కృష్ణభగవానుని జూచి నపుడు మనకవుల సంప్రదాయము ననుస రించి—యొకయిరువదిస్తుతిపద్యములు విసర వలసియుండెను. కాని మహాకవియగు సూరన్న యనుచితస్థానమునకు పోకుండనే ముందు కరిగెను. కృష్ణుని సన్నిధానమును గూడ మట్టసముగా రెండు పద్యములలోనే ముగించినాడు. సమయము గాదని "చాలు రా" యని పీరావేశమెత్తి [illegible] కవికి చాల తక్కువ. శుచిముఖి [illegible] వర్ణించుఘట్టమున మాత్రము "[illegible]" లెంచి వ్రాసినాడు— రసికతాలోలుడు గదా, పాపము! [illegible] వాడుగాడు. ఈ ప్రభావతీ[illegible] వర్ణించుకున్న ప్రద్యుమ్నుడు [illegible] కగునామరి!

కాగా - సూరన్నయందు [illegible] జీవుల కుండదగు, అవశ్యముగానుండు, [illegible] చెడ్డలన్నియు గుదురుకొన్నవి. [illegible] "[illegible] నత"యను ధర్మము తక్కువ యని నాకు దోచును. ఆవేశము ఔచితి యనునవి పరస్పరవిరుద్ధములగు శక్తులు. ఆ రెంటిని సమన్వయించుకొనువాడు మహాయోగి గావలెను. నాదృష్టి కొక్కటితక్కనయందుదప్ప సమన్వయం దీసమన్వయశక్తి యంతగా గానరాదు. సంస్కృతమునను జాలమంది కీ ధర్మము దక్కువ. ఆ "విలీనత" యనునది తక్కువగుటచేతనే - కొన్నిగభీరములు- గంభీరములగు ఘట్టములయందు హేతువాదము మొదలగు తేలికపనులు బయలుదేరును. పాత్రము యెదుట నిలిచి వెక్కిరించిన ట్లుండును. ప్రద్యుమ్నుడు విరహవేదనచే బొరలు చున్నాడు. అతనిదృష్టికి సర్వము ప్రభావతీ మయముగ (3-౧౮) నున్నది. వానితో బాటు విలీనులమై మనమును వాపోవు చున్నాము. అట్టియెడ కవి మధ్య నిలిచి "నెఱ

యంగ నిదిసుమీ-యొకటిగోర వేఱయొకటి యగుట" యని హెచ్చరించి మనభావన కద్దపైచి తట్టి లేపుచున్నాఁడు. ఈ ఘట్టముననే సూరన్న తిక్కనమహాకవి ననుసరించి తీర్చిన పద్య మొకటి గలదు. అ దిది. రెంటిని పరామర్శింతముగాక—

"తరుణికెంగే లందుఁ దమిఁ బట్టి కటకటా
చిగురాకె యిది యంచుఁ జిన్నవోయి
నలఁచి పాలిండ్లంటు వెస నంటి చెల్లఁబో
పూగుత్తులే యంచుఁ బొలుపు దఱిఁగి
నెలవపయ్యెద యంచుఁ జేపాఁది యక్కొ ప
రాగోదయమె యంచు రహిఁ దొలంగి
రమణివేనలి యంచు రతికాంక్ష నొడిపి హా
కేటి మొత్తమె యంచుఁ డెల్లఁబాఱి
యకట యనిమిత్తకృపఁ దాన యరుగుదెంచి
హితవు నెఱపెడి హంసిలో హృదయ మిచ్చి
పలుకని కృతఘ్నునకు నాకుఁ బ్రాప్త మగునె
యట్టియువతిపొం దనుచుఁ దానాత్మఁ గుందు" (౩-౨౧)

విరాటపర్వమున తిక్కన కీచకు నున్మాదిని జేసిపైచి వానియవస్థ నీరీతి వర్ణించినాఁడు—

"పొడసూపినట్లైన వడిఁ బట్ట సమకట్టి
పరికించి కానక బమ్మరించు
మొలఁగినయట్లైనఁ బలికింపఁ దలఁచి ని
రూపించి లేమి నవ్రపలు వహించు
గదిసినయట్లైనఁ గౌఁగిలింపఁగడ గి
యూరకే బొంకైన నలఁతనొందు
నొడఁబడ్డయట్లైన నపరి పైకొనఁ జూచి
చెన్నఁటియగుట నిశ్చేష్టఁ బొరయు
లలితవివిధవిహారంబులకు లతాంగి
ఎలసిసొలసినయట్లైన నెలమిఁ గలసి
యభిమతక్రీడ సలుపంగ నప్పళించి
విదకి రిత్తబయ ల్గని విహ్వలించు" (౨-౩౦౧)

తిక్కనపద్య మమృతమధురముగ నున్నది. పాషాణముల గరఁగించుశక్తి ప్రత్యక్షరమునను నిండి తొణికిసలాడుచున్నది. అతఁడు భావమును నడపుటయందు పాటించినక్రమము, మహత్తరమై గభీరమై అనిర్వచనీయ మహిమావిశోభితమై పాఠకుని హృదయపుస్తకమున మాసిపోని మదనాస్త్రమై నిలుచుచున్నది. సూరన్నపద్యమో - వెక్కిరించిన ట్లున్నది. శాఖాచంక్రమణము అక్రమము గిరికొన్నవి. అంతకుమునుపు మనకన్నుల గారిన కొంచెముకన్నీరును నీ పరిహాసచిత్రముతో నిమిరిపోవును. ఇట్టి వెన్నియో కలవు. మచ్చున కొకటిచూపితిని. ఇక నీతనిపరమార్థమగు నౌచితి నెంతవరకు సాధించెను? ఇతని కళాపూర్ణోదయమున కన్న - ప్రభావతీప్రద్యుమ్న మౌచిత్యమున నొకమెఱుగు దక్కువ. మొదటిదాన లేదు- రెండవదాన లేదు—ముసలిముప్పున మూఁడవదాని కంటినది శాస్త్రపుదెవులు. బహుశః వార్ధక్యము రెండవబాల్యముగదా! అందుకేనా యింతచాపల్య మణచుకొనలేకపోయినాఁడు? ఇతనిప్రభావతి సామాన్యురాలు గాదు, శాస్త్రములు గాలించినది, అడుగడుగున కొక మీమాంసాన్యాయము వల్లించనిదామెకు నిద్రరాదు! ప్రద్యుమ్నుఁడు పడకటింటి కాలస్యము జేసినాఁడు. అపు డెన్నియో సంశయము లామెహృదయము నాక్రమించినవి. అందులో నామె గౌరీపూజఁ జేయునపుడు - కర్తృకర్మవ్యత్యాసము గలిగెగా బోలు(౩-౪౩)నను ననుమానమే పెద్దదై కూర్చుండినది. శుచిముఖితో మాటాడుచు "సఖ్యము సాప్తపదీనముగదా" యని ధర్మశాస్త్రపుదస్త్రము విప్పినది. ఆమె గురువెవ

రో యెన్నియేండ్లవిద్యాభ్యాసమో - మనకు దెలియదు. ఏమో! దేవతల శాంబరీవిశేషము మన మెఱుగదగుదుమా?

అసలు ప్రభావతి పుట్టుకయందే కనుకట్టువిద్య గలదు. గౌరీవరముననే యామె జనించెనట. ప్రద్యుమ్నునిపై "మోజు" పడుటకుగూడ, గౌరీదేవియే కారణము. చక్కనిమగని వెదకిన దాపెద్దముత్తైదువ. ఒకనాడట ప్రభావతి నిద్రపోయినదట. గౌరీదేవి స్వప్నమున సాక్షాత్కరింపకుండునా? రానే వచ్చినది. ప్రేమతో దల నిమిరి తా నదివరకు దయతో దాచుకొనివచ్చిన యొకవర్ణచిత్రము నొసగి "బిడ్డా! ఈ చిత్రమున నున్నవాడు నీమగడు. వా డీపురినేలు" నని మాయమైనది. అదివరకు బిలువని పేరంటమున కాశ్చర్యపడుచుండిన ప్రభావతికి పెనిమిటిపేరు జెవిసోకినంతనే పరమానందమైనది. శివ మాయమైనది. చిత్రము మాత్రము మిగిలినది. అది నేరుగా భవానీదేవియే వ్రాసినదట. పైగా వేకువజామున గలిగిన కల గావున శీఘ్రఫలప్రదము, ఖండితము నని చెలికత్తె యాశీర్వదించినది. మన కేమియు కథాభాగము మిగిలించలేదు సూరన్న; అంతయు ముసుగులోననే ముగించినాడు.

చిత్రపటము జూచినతరువాత ప్రభావతికి విరహము గలుగకుండునా? కలుగకున్న మనకవు లుండనిత్తురా! అది లేకున్న ప్రబంధమే గాకపోయెను. ఆలంకారికులు గీరె గీచినారుగదా! పటము జూచినదిమొదలు - బట్టినది దయ్యము. "ఆత్మసంకల్పవాసనాధిశేషవశంబున" చిత్రమును జూచి [illegible] పల్లుపోకలు పోయినది. కందర్పరాగము డిందుపడుట కుద్యానవనమునకు వచ్చినదట. వచ్చి యూరకున్నదా! ఊరకున్న ప్రబంధము పూర్తియగునా? తన "నిజేశు" రూపమును జూచి కన్నురు గార్చినది. "అయ్యో వాఁడు నాసరసకు రాకపోయెనే" యని యాకాంక్షించినది. వానితో ననగిపెనగు భాగ్యమే బట్టెనో - ఇప్పటి రసభావము లెట్లుండునో యని లొట్టలువైచినది. ఔరా! వలపు! ఆమెకు నాసి యూరిసి పెరు దెలియదు. కులశీలము లెఱుగదు. అసలు అట్టిపురుషు డున్నాడో లేడో యను సందేహముగూడ (౩-౮౭) నామెకు లేకపోలేదు. అట్టిదో పటమును జూచిన మరు నిముసముననే కాకరకాయవంటి పులకలు చనుకెలకుల మొలచునా? ఎంత దానవకాంతయైనను నింత తామసము దగునా? ఎంతటి యసభ్యమీవర్ణనము. పాపం యామె యూర్చియూర్చి కాంతాళమున(?) బొరలినదట. సూరన్న కీమాత్రము దెలియకుండునా? ఇటనౌచిత్య మెంతపాడయినది! ప్రభావతి రాకొమరిత. చిననాటనుండియు వైభవములనే యనుభవించినది. ఆనాటి సౌందర్యవంతురాండ్రలో తొలుత నిలుచునది ప్రభావతి. రతిసింబగుకన్న ప్రభావతీరూపసౌందర్యము ముమ్మడియట. ఎట్లున్నను నామెచక్కనిది. వైభవములతోవచ్చు నహంకృతి యుదాత్తత యామెకు రేఖగానైన నుండదా? అట్టియెడ కేవల చిత్రదర్శనముననే చిత్తము నప్పగించు వికలస్వాంతయా యామె? కన్నీరు గారినదట. శరీరము శుష్కించినదట. ఊర్మికలు కంకణములైనవట. చెక్కులు తెల్లనై యాడ్చుకొనిపోయినవట. ఏమియొయ్యారము! మగవారిసో కోర్వరేమో ప్రబంధకాంతలు! ఎంత

యతిశయోక్తి యని యాలంకారికులు పేరు దట్టినను నింత వికటతాండవము రసాభాసము గాకుండునా? మనవారి కివి రసాభాసములు గావుగాబోలు. ముక్కుసూటిగా నడచిన జాలును. నడుమ నెన్నివంకర లున్నను అన్నిటికిని మాఫీ.

ఏనాటిలపులుగు శుచిముఖి వీరివెనుకనే యున్నది. వీరివాహ్యాళి యంతయు జూచినది. ప్రభావతిసోలడము, రాగవల్లరి పట్టుకొనడము, ఆమె హా యనడము, ఈమె యయ్యో యనడము- పెద్ద గందరగోళముగ నున్నది. ఇంకను నేమిజరుగునోయని యట్లే కాచుకొన్నది. ప్రభావతిదేవి తనయవస్థ యంతయు బనవినది. చిత్రపటములోని వాడే నామగడగునని ప్రతినవట్టినది. ఇంతవర కూరకుండిన శుచిముఖి యిక కార్యము సాగ దని తిన్నగా రంగములోనికి దిగినది. చిత్రమును బరిశీలించువప్పుడు వారికంట బడినది. నిజముగా శుచిముఖి పరమాద్భుత సృష్టి. కవి తనదృష్టియంతయు శుచిముఖి పాత్రముననే లగ్నముగావించినాడు. తక్కిన వంత పసందుగా కుదురలేదు. దొడ్డిదారిబడినవి. చిత్రమును జూచినశుచిముఖి వెంటనే ప్రసంగమునకు దగక కొంత యాడువారి బిగుమానము జూపించినది. ప్రభావతీ రాగవల్లరు లూరకుందురా? ఆమెను మధ్యస్థమునకు బిలిచినారు. పిలువనిపేరంటముగా దనుకొన్నది. తిన్నగా ప్రసంగము దిగిచినది. తాను గుట్టు వెంటనే బయటబెట్టలేదు. చమత్కారముగా వారిమనసులలోని కోరికను రాబట్టుకొన్నది. కడకు వాడు ప్రద్యుమ్నుడనియు, వానికి రతియనుభార్య యొకతె యీవరకే యున్నదనియు, యాదవుడనియు విలాసమును బూర్తిగా నొసగినది. పట్టు దొరకకముందే పరవళ్లు ద్రొక్కుచుండినది ప్రభావతి. ఇంతమాత్ర మవకాశము దొరకిన నడుగవలెనా? చూడుడు. ప్రారంభించినది యుపన్యాసము.

"ఆరతికిఁ గెంబులై తిరే నవ్విభు
గౌఁగిలింపఁగ నబ్బు కరములార!
మాయింతికిఁ గుచంబులై తిరె నతనివ
క్షోనికేఁడన మబ్బు కుచములార!
యాలతాంగికిఁ జెక్కులై తిరే నారమ్య
శీలుచుంబన మబ్బుఁ జెక్కులార!
యా నెలఁతకు వీనులై తిరే నాకళా
విదుమంతనము లబ్బు వీనులార!
యట్లు గానోచ కేల నాకైతి రకఁట
యని నిజావయవంబుల కాత్మ వగచు
బాల్యమునఁ దన్ను రమణసౌభాగ్యకలిత
యనిన సాముద్రికులమాట లరసి తిట్టు" (౩-౧౦౫)

ఇంతకన్న నసహ్యావువర్ణన మేవ్రాత గాడును వ్రాయలేడు. సూరన్న యుత్తమ కవి. ఆత డెందులకో యీనికృష్టరచనకు గడంగినాడు. అందులో నేమి హాయిగలదు? ఓ చేతులారా! ఓపాదములారా! ఓ చెక్కులారా! ఓ పక్కలారా! అని యెవరైన వాపోవుదురా? సామాన్య మనస్తత్వమునకు గూడ భరింపరాని దీవ్రాత. అట్టియెడ రాజకుమారితయు నుదాత్తయు నగుప్రభావతి యిట్టి తలతిక్కమాటలు పలుకనగునా? అత్యంత మనుచిత మిది. ఈ గడబిడలో దన్నుగన్న నాయనకుగూడ నాలుగుపూజానామములు వడ్డించినది (౩-౧౮౨). ఇది యెక్కడి పడుచుదనమురా దైవమా! ప్రపంచమును దల్లక్రిందు గావించుచున్న దీయార్భాటము!

ఆమెవిలాపమంతయు బూర్తియైనతరు వాత, పండితురాలగు శుచిముఖి, శాస్త్రీయముగా (౮–౫౦) నోదార్చినది. కాని ప్రభావతీప్రద్యుమ్నుల గలుపుట యెట్లు? అయ్యవారు ద్వారకలో-అమ్మవారు వజ్రపురిలో- ఎన్నాళ్లీ విరహగీతికలు? శుచిముఖి యొక చక్కని యుపాయ మాలోచించిచెప్పినది. శుచిముఖి మహాపండితురాలని చెప్పి యెట్లు లైనను దన్నువజ్రనాభునెదుట బడనేయు మన్నది. ప్రభావతి "అచ్ఛా! బహద్ద"రని యూపనికి దానే యొప్పుకొన్నది. ఇంతే గాదుసుడీ. తొలిరతినాడు పానుపు తానే స్వయముగా సవరించినదట. చక్కని వార కాంత ప్రభావతి. శుచిముఖియు సీసంతోష వార్త నపుడే ప్రద్యుమ్నున కందజేసినది. ప్రభావతియు దిన్నగా నాయనగారికి శుచిముఖివృత్తాంతమును జెప్పినది. వాడును రానిమ్మన్నాడు. శుచిముఖి యసాధారణ మేధశ్శాలినిగదా! అతనితో భద్రుదనటుని వృత్తాంతమునుగూర్చియు, వానినాట్యమునుగూర్చియు విశేషముగ ముచ్చటించినది. వానిని బిలిపించి దేవరవా రనుగ్రహించవలెనని ప్రార్థించినది. రాక్షసేశ్వరుడు వల్లె యనినాడు.

ప్రద్యుమ్నుడు గుఱ్ఱముపై గంతు లేకనే యెగురువాడు. ప్రభావతికి చిత్రపట దర్శనమైనను కలదు. వాని కదియు లేదు. వానిది కేవలము వినుకలివలపు. "ఉపమాతిశయోక్తికామధేను"వగు శుచిముఖి వాని యెదుట ప్రభావతి నూరక తనివిదీర వర్ణించినది. దానితో జిఱ్ఱదిరిగినాడు ప్రద్యుమ్నుడు. ఎడదకంటిన వేదురుతో తలపిచ్చియెత్తినది. చిలుకలను కొంగలను పిట్టలను వజ్రపురప్రయాణమునకై యారంభించినారు. వజ్రనాభునితోడి యుద్ధము - ప్రభావతితోడి యుద్ధ మొకయెత్తుగా భావించినారు. ప్రతి వానిభావము లివి.

సీ. "అమరారికరుల కుంభములు ప్రయ్యగ నొత్తు
రమణిచన్నులు పక్షాగ్రముల నొత్తి
సమదరాక్షసరథచక్రంబు లిలఁ గూల్చఁ
గాంతశ్రోణికి నూడిగంబు సల్పి
అసురేంద్రజయశంఖ మవనిపై ద్రోయింప
గామినికంఠంబు గౌఁగిలింప
వజ్రనాభుని ధనుర్వ్యాప్తులు గడపి
బచెంతికనొమసంస్కృ బలులొసఁగె."

ఇట్టివా డాలస్యమున వచ్చునా! శుచిముఖి రాలేదేయని ఒక మొకదోడుగా గడుపుచున్నాడు. ఆమెయు వచ్చి సహజముగ కృష్ణునితో మాటలాడినది. గవసాంబులను దోడిచ్చి గోపాలు డనిపినాడు. ఒక వేళ గార్య మెట్లుపరిణమించునోయని. సర్వ సుదారుగదా గోపాంగనావల్లభుడు! అతనికి పదునారు వేలభార్యలట. వారందరును స్వామికి "ఉడుగరలు"గా వచ్చినవారే. అంగీరితో గాపుర మెట్లీడ్చునో యూసనాను? బ్రహ్మచారి! ప్రద్యుమ్నుడును నాయకుడుగా బయాణమైనాడు. తండ్రికొడుకులకు సైగకు సైగ. శుచిముఖి వజ్రపురమునకు బయలుదేరుచున్నోవన పెండ్లికొడుకునకు సీతులుగరపినది. భద్రవేషము తయారు. అంతఃపురములోని థియేటరులో ప్రదర్శనము. రాజుగారు రాణిగారు దయచేసినారు. ప్రభావతమ్మగారు హాజరు. ప్రద్యుమ్నునినాట్యము పరమాద్భుతముగా నున్నది. అందరు సంతసించినారు. రాజుగారు మూరెడు పెరిగినారు. ఆయూరులో నాయకుడు ప్రభావతిపై నొకకడగంటి

చూపు విసరి చమత్కారముగా క్షమాపణ జెప్పుకొన్నాడు. ప్రభావతిగారును దానిని చక్కగా "అక్సెప్టు" చేసినారు. ఖేల్ కిలోస్. అంత రింటిదారి బట్టినారు.

ఇక మిగిలినది ముఖ్యనాటిక. ప్రభావతి షోకుగా నలంకరించుకొన్నది. చాల కులాసాగా నున్నదిగదా! పడకటిల్లు సవరించినది. వాసనాద్రవ్యములు పూలుగీలు స్వయముగా సేకరించినది. ఇంకను నాథుఁడు రాలేదు. ప్రొద్దుపోవు టెట్లు? శుచీముఖి రాగవల్లరు లంతలనింతల లేరు. చంద్ర దూషణాదులు ప్రారంభించినది. ఒకయరగంట గడుప వచ్చునుగదా మరి. ప్రద్యుమ్న డీమొతల లోనే తుమ్మెదనై యున్నాఁడు. వాడును మహా యుద్వేగములో నున్నాఁడు గదా! పాపము! ప్రబంధనియమ మడ్డు వచ్చినది. చంద్రదూషణాదులు ముగియనిదే ప్రవేశించిన ప్రబంధత్వము పట్టదేయని ప్రాణములు బిగబట్టి యట్లే నక్కినాడు. ప్రభావతికి వేసరిక వచ్చువరకు బద్యములు విసరినది. ఆమె మాత్రము నిలుపక తిట్టగలదా? సుకుమారిగదా! కొంత సేపటి కలసి 'ఇంటర్ వెల్' గిసికొన్నది. "సమయము దొరికెరా! పద దేవుఁడా" యని నాయకుడు గప్పున దూకినాడు. ఇంతవరకు దహాతహలాడిన పిల్లి వంటి ప్రభావతి మగనిదర్శన మైనవెంటనే యుచ్చాటనమంత్రము బఠించినట్లు చప్రున లేచి యురికెనట! ఆయింతలోననే యలము కొన్నది మీరరాని మేరలేని సిగ్గు. ఔరా! యేమి యౌచిత్యము. సమయము మించిపోయె నని రాగవల్లరీ శుచిముఖులు వెంట దగిలినారు. ప్రభావతి యీడిగిలబడినది. ప్రార్థించినది, కంబముబట్టుకొని నిలిచినది, తాను ముగ్ధ ననుకొన్నది పాపము! ఏమేమో నటింపబోయినది. మహాచమత్కారిణిగదా యొక్కొక్కప్పుడు! కడకు శుచిముఖి చేయి పట్టి యీడ్చుకొనివచ్చినది. "ఏనుగు గంబానకు దిగిచిన ట్లుండె"నట నావ్యాపారము. శుచిముఖి వధూవరుల చేతులగలపి "అయం ముహూర్త స్సుముహూర్తోస్తు" అని చెలగి నవ్వినది. ప్రద్యుమ్నుని ప్రభావతిని వదలి సకియలు వెళ్ళినారు. మొదట సహసప్రవృత్తియు లజ్జాలోలతయు గల ప్రభావతి రాగ రాగ ప్రతిపీరుడై నిలిచినది. ఆరాత్రియంతయు నేవిఘ్నమునులేక వారి కన్నెరికపు రతి చెలగినది. ప్రద్యుమ్నుఁడు భూవివర మేర్పరచినాడు. ప్రతిదినము రాకపోకలు జరుగుచుండినవి. ఇది చాలక, ప్రద్యుమ్నుడు తనతమ్ములకు గూడ ననుకూలములు గల్పించినాడట. ఔరా! యెంతచక్కని యౌచిత్యము!

ప్రద్యుమ్నుడు భూవివర మేర్పరచినాడు గదా! ప్రతిదిన మావివరమార్గమున వచ్చుట, 'ప్రజెంటు'పలికిపోవుట-ఇట్లు కొన్ని దినములు జరిగినది. అమ్మగారికి దినదినము చీకటితప్పుచిన్నెలు పరీక్షించుకొనుటయందును, వింతవింతగా నలంకరించుకొనుటయందును సరిపోయినది. గర్భముతయారైనది. చిన్నప్రద్యుమ్నుడు అచ్చుపోతలో నున్నాడు. గుసగుసలు-ననననలు ప్రారంభమైనవి. ఈ వార్త బైట చిట్లినది. వజ్రనాభుఁడు మండిపడినాడు. ప్రద్యుమ్నుఁడు వజ్రనాభునకు "మదిచ్ఛ గైకొంటి నీకుమారితపొందుగా" అని సమాధాన మిచ్చినాడు. ఇది యెంతవరకు ధర్మమో నీతిమంతులు విచారింతురుగాత! ఇక ప్రభావతియూ, తనతండ్రిని నరకు

టకు దానే కరవాల మెత్తి యిచ్చినదట. పైగా బాగుగా నరకుడని యాశీర్వాదము. ఔరా! ఔచిత్యము. స్త్రీహృదయ మింత శుష్కమైనదా! ఒక్కనిట్టూర్పునకుగూడ గతి లేదయ్యెనా! అంత వెఱ్ఱివల వుండునా? పరమరాక్షసిగా నున్నదే ప్రభావతి! కన్న తండ్రిని నరకునపుడు కుళ్లి కుములవలెనా- వెనుకనిలిచి తప్పటుల జరచవలెనా? అసహ్యముగా నున్న దీఘట్టము. ప్రభావతియందే గుణములును పరిపూర్తిగా లేవు. మీదు మిక్కిలి చెఱచినఘట్టము లెక్కువ. మొదటి నుండియు భోగముదానిచిన్నెలే కనబడుచున్నవిగాని– "యప్పటము" రాజకాంతవలె లేదు. కలభాషిణివంటి మధురమూర్తిని సృష్టించిన యమృతహస్తము ప్రభావతివంటి రాక్షసిని సృష్టించె ననుట సమ్మతగినది గాదు. శుచిముఖిపాత్రపై సంపూర్ణదృష్టి యుంచినాడు రచయిత. తక్కినవాటిని జెఱచినాడు. నడుమనడుమ శాస్త్రపు ఊకదెబ్బలు. శుచిముఖవంటి నిత్యవర్చస్విని యెదుట-ప్రభావతి పరిహాసచిత్రముగ నున్నది. కలభాషిణి వారకాంతయైనను సౌభాగ్య సారికకన్న నుత్తమురాలు.

సూరన మహాకవి. చరమదశయందు కవిత్వము ముదురుపాకముపబడె నంతే. పాపము! విందులు జేసినాడు. భక్ష్యభోజ్యములు గడుపునిండ నారగింపజేసి కడకు గొంటువక్కతాంబూల మిచ్చినాడు.

'ఈ రాధేనా?'

యల్లాప్రగడ సీతాకుమారి

సాయంకాలం అయ్యేటప్పటికి రెసిడెన్సీచమన్, గాలిమేతకు వచ్చినయువకులతోటే, ఆటలకు వచ్చిన పిల్లలతోటే కిటకిటలాడిపోతుంటుంది.

అందులో ముందువైపు స్క్వేరులో రాజారావు కూచొని, అఖిలాంధ్రకథక సమ్మేళనానికి పంపడానికి ఏమికథ రాద్దామా అని ఆలోచనచేస్తున్నాడు: "కథకు ఎన్నివిధాల చూచినా మంచి 'థీము' దొరకడములేదు. అందులో టూకీగా రాశామూ అంటే పాఠకులు సందర్భాలు వివరంగాలేవు అంటారు. పోనీ వివరంగారాస్తే చాలా దీర్ఘంఅయింది మా కక్కుర్తె దంటారు సంపాదకులు. పైగా చిన్నకథకు పాతవిషయాలేమీ పనికిరావు, కొత్తపోకడలు ఏం పోదాము? ప్రణయరంగా లేమన్నా తీసుకుందామా? అబ్బె, ప్రణయమంతా పాతపడిపోయింది. పోనీ కర్షకకార్మికసమస్యలో?— చెత్త. ఎందుకూ మనకర్షక కార్మికులేమో రష్యాలోలాగ చదువుకోరు. ఇతర్లు చదివినా కార్యం శూన్యం. ఏదో కాస్త చదువుకున్న ఆడవాళ్లను తీసుకొని అవీ ఇవీ తగిలించిరాస్తే.. బాగానేఉంటుంది కాని ఇప్పటిస్త్రీలు ఊరుకోడంలేదు. మా తెలుగువాళ్ల డాబులూ, ఇంట్లో కోతలూ, బయట పిరికితనమూ.. ఉహూం. ఈ కుళ్లంతా పేపర్లకెక్కిస్తే బయటివాళ్లు ఎగతాళిపట్టించరూ!! పోనీ మా యువకుల్లో.. ..."

ఆకస్మికంగా అతని ఆలోచనలకి అంతరాయం కలిగింది ఎదురుగా ఒక పదహారేళ్లఅమ్మాయి పమిట చెంగుతో కన్నీళ్లు తుడుచుకుంటూ నిలుచొని ఉంది. ఆమె చూడ్డానికి ఎక్కువసౌందర్యవతి కాదు. చామన చాయా, సామాన్యమైన పొడుగూ, పల్చనిచెంపలూ, కొద్దిగా ముందుకు వాలిననుదురూ చూడ్డానికి చాలా సామాన్యంగా కనిపిస్తుంది. కాని ఆకళ్లూ ఆజుట్టూ...అవి రెండే ఆ అమ్మాయిని మనిషిని చెయ్యడానికి తోడ్పడ్డాయి. ఆ కళ్లుగూడా చాలా పెద్దవి కావు కాని నల్లగానూ, తీక్ష్ణంగానూ ఉండి ఒకవిధమైన వశీకరణ శక్తితో ప్రకాశిస్తూఉన్నాయి. జుట్టుకూడా ఒదుగుగానూ, వంకరలుగానూ ఉండి, ఆమెలోని ధృఢనిశ్చయాన్ని తెలియజేస్తున్నాయి.

రాజా ఆ అమ్మాయిని ముందుగా పలకరించడం ఎందుకని ఊరుకున్నాడు, కాని ఆమె మరికొంచెం సమీపానికి వచ్చి "క్షమించాలి, మీ పరిచయము లేకపోయినప్పటికీ, మీ వేషాన్నిబట్టి ఆంధ్రులేనని గ్రహించి మాట్లాడుతున్నాను. ప్రస్తుతము నేను కొంచెం ఇబ్బందిలో ఉన్నాను. ఇప్పు డెవరయినా ఒక పురుషునిసాయం కావలసివుంది. కనుక మీరేమయినా నాకు సాయం చెయ్యగలిగితే..." సగంలోనే అందుకొని రాజా "తప్పకుండా నా ప్రాణాల్నిచ్చైనా రక్షిస్తాను. మీకు వచ్చిన ఆపద ఏమిటో చెప్పండి. ఆంధ్రులకు ఆంధ్రులు కాకపోతే మరెవరు తోడ్పడుతారు?" అంటూ పొంగిపొయ్యే ఆంధ్రోత్సాహంతో తొందర పెట్టాడు.

"కృతజ్ఞురాలిని, నా స్థితి అంతా ఇప్పుడు చెప్పాలంటే చాలాకాలం పడుతుంది. టూకీగా చెబుతాను. మావాళ్లు నన్ను ఇప్పు డొకపల్లెటూరిముసలివాడికిచ్చి పెళ్లిచెయ్యాలని చూస్తున్నారు. నా కది ఇష్టం లేక, ప్రస్తుత మాముహూర్తం తప్పించాలని వీలయినంత వరకు ఒక వందరూపాయలవరకూ దొరికించుకొని ఇలా వచ్చాను. మీరు దయవుంచి నన్ను ఒక సంరక్షిత స్థానంలో జేరిస్తే కొన్నాళ్లుండి మళ్లీవస్తాను...ఏమంటారు?"

"మీ ధైర్యానికి నా అభినందనాలు. ఇలాటి అసందర్భపు బలాత్కారవివాహాలను బలవంతంగా ఫోర్సుచేసి అయినా తప్పించాలని మా యువకుల ఉద్దేశం తప్పకుండా మీరు కోరినచోట మిమ్మల్ని దిగబెట్టివస్తాను."

ఆ అమ్మాయి సంతృప్తనయనాలతో 'అలాగైతే మనం పాదునగరం వెళుదాము. ఈ రోజుల్లో అక్కడ కొంచెం చల్లగాకూడా ఉంటుందిట...' అంటూ వీధిలో పోతున్న ఒకమనిషిని చూచి కొంచెం భయంతో ముఖం పక్కకు తిప్పుకొని "చూచారా, ఆ ఎర్రకోటు మనిషి మాపక్కఇంట్లోనే ఉంటాడు. మనల్ని చూచి

నట్లు మావాళ్లతో చెప్పాడాలంటే మళ్లీ ప్రమాదంలో ఇరుక్కుపోతాను. సాధ్యమైనంత త్వరగా మనం వెళ్లిపోతే మంచిది" అంది.

రాజాకూడా కొంచెం తడబడి, "మీరు ఇక్కడే చెట్లచాటున కొంచెం నిలబడండి. నేను వెళ్లి టాక్సీని తెస్తాను" అని గబగబా క్లాకుటవరుదగ్గిరకు వెళ్లి ఐదు నిముషాల్లో ఒకకారు తీసుకువచ్చాడు. ఇద్దరూ కట్టుబట్టల్తో అందులో ఎక్కికూచొని కాచీగూడెం స్టేషనుకు పోనిమ్మన్నారు.

"ఇక్కడనుంచీ సౌకర్యంగా ఉండడానికి మీ పేరేమిటో చెప్పండి, నన్ను రాజారావు అంటారు" అన్నాడు రాజా.

ఆమె కొంచెం నెమ్మదిస్తున్న తొట్రుపాటుతో "రాధ అంటారు" అంది.

రైలు కదిలింతరువాత ఇద్దరూ సంభాషణలోకి దిగారు. "ఐతే మీవాళ్లు ఎందు కిస్తున్నారు అంత పెద్దవాడికి?"

"ఏమీ లేదు, ఎక్కడ చూచినా పెద్దపెద్ద కట్నాలు కావలెననేవాళ్లే, పోనీ కాలేజీస్టూడెంటైవరన్నా కట్నం లేకుండా వప్పుకుంటారేమోనంటే, వాళ్లరేటు మరీ ఎక్కువగా ఉంది అభివృద్ధిపక్షంలో యువకు లెవరన్నా కుదురుతారేమోనంటే వాళ్లకి నా చదువూ, చక్కదనమూ సరిపోలేదు. ఏంచేస్తారు మరి."

"ఐతే మరి నీవు పారిపోయిమాత్రం ఏంలాభం"?

"ఏదో తొందరపడకుండా విచారిస్తే, ఎవరైనా సంస్కారబుద్ధి ఉన్నవాళ్లు దొరక్కపోతారాఅని... మీ రేంచేస్తున్నా రిప్పుడు ?"

"ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాను. ఈయేడే ఎమ్, ఏ, అయిపోయింది. మానాన్నగా రెక్కడన్నా ఉద్యోగంలో ప్రవేశించమంటున్నారు. నాకేమో జర్మనీ వెళ్లి డాక్టరైటు తెచ్చుకుందామని ఉందికాని ఏదో ఆర్థికపుచిక్కుల్తో అనుకూలపడ్డం లేదు."

"భహుశా వివాహం అయిం దనుకుంటాను."

"ఇంకా లేదండీ, అదంతా ఓ రామాయణం. అసలు నాకు పెళ్లంటేనే ముందు అరోచికారం. అందులో నా ఉద్దేశాలకు తగిన ఆమె దొరకడం అంటే, కుందేటికొమ్ము సాధించడ మన్నమాట!"

"అలాగా, అయినా ఎలాంటి ఊహ లుండేవో.. ?

"అసలు నాకు మన తెలుగుపిల్లలంటేనే అసంతృప్తి; ఎక్కడైనా మగాడిమాట వినబడితే తుర్రున పారిపోవడమూ, ఏ సందర్భంలోనన్నా కాస్సేపు నలుగురు మగవాళ్లల్లో నుంచోవలిసివస్తే ఇక తొట్రుపాటు, పమిటసర్దుకూ, బెదురుచూపులూ ఇంగాటి వాళ్లతో మన కేంగోమాన్ను దొరుకుతుంది? ఏదో సందర్భపడితే జర్మనీనుంచే.. "

"పోనీ, మంచిచదువులు చదివినవా ళ్లెవరూ దొరకలేదూ ఇక్కడే?...

"ఇక్కడ ఒకటుంటే ఒకటుండదండీ. చదువుంటే చక్కదనం ఉండదు, రెండూ ఉంటే చలాకీగా ఉండదు. హైద్రాబాదులోనే ఎన్నో సంబంధాలున్నాయి. నాకొక్కటే నచ్చలేదు. మా మేనమామ కూతురే ఓ అమ్మాయి ఉంది. చిన్నప్పు డోకసారి చూచాను 'తోకఒకటి తక్కువగా' ఉంటుంది. మా వాళ్లంతా చేసుకోమన్నారు. కాని నేను ఒద్దుపొమ్మన్నాను. నాసంగతి విన్నారుకాదు, ఏదో కాస్త ఆంధ్రోద్యమంఅనీ, వైతాళికసమితిఅనీ, సమ్మేళనాలనీ,...ఏదో ఒకఉద్యమం నడిపిస్తూ ఉండాలిసిందే కాని ఊరికేఉండే ఘటం కాదు. ఇక తీరా చేసుకున్న తరువాత అవతలి మనిషికూడా కాస్త మనకు సరిపొయ్యేట ట్లుండాలెనా...!"

ఏదోస్టేషనులో బండాగింది. ఎవరో తెలుగువాళ్లే మొగుడూ పెళ్లామూ పిల్లల్తో వచ్చి ఎక్కారు. రాజా కొంచెం సర్దుకూచున్నాడు. రాధమాత్రం బెరుకులేకుండానే ఆవచ్చినవాళ్ల నడిగి ఒక చెంబు పుచ్చుకొని 'చూడండీ అక్కడ నల్లా ఉంది, మీరు కొంచెం తాగి నాకొంచెం తెచ్చిపెడుతారూ... ?" అంది.

రాజా నీళ్లు తీసుకువచ్చాడు. ఇంతలో రాధ అక్కడికి వచ్చిన ఫ్రూట్స్, బేరూ కొనిఉంచింది. ఇద్దరూ ఫలహారం మొదలెట్టారు.

రాజాతిల్లో ఆలోచనశకటాలు పరుగెత్తుతున్నాయి, "పాపం ఎప్పుడు తిన్నదో, ఏమో.. ? ఏనా ముఖంలో ఇందాకటిదైన్యం కొంచెం తగ్గింది. ఇప్పుడు మనిషిలో కొత్త చురుకుదనంకూడా కనిపిస్తున్నది, .. నేను కొత్తవాణ్ణే అయినా ఎవరికీ అనుమానం కలక్కుండాఉండడానికేమో, ఎంతో చనువుగా ఉంటున్నది ...? ఈ మాస్టరు"

పాదునగరంలో దిగి ఇద్దరూ బండిచేసుకొని వెళ్లి ఒక ఇంట్లో దిగి కావలసినసామాన్లన్నీ కొద్దికొద్దిగా తెచ్చుకున్నారు.

మర్నాడుసాయంత్రం రాజా ప్రయాణం అయినాడు. కాని రాధ విచారంతో వేడుకుంది. "ఈకొత్త వూళ్లో నేనొక్కదాన్నీ .. ఇంకో రెండురోజులుంటే ...ఎల్లుండే మావాళ్లు పెట్టినముహూర్తం .. అదయిపోతే మళ్లీ మనం ఇంటికి వెళ్లిపోవచ్చును."

నిజంగా రాజాకూడా వెళ్లలేకపోయినాడు. ఆరాత్రి రాజాహృదయంలో చిన్నకదలిక కలిగింది. రాధ నడత అతన్ని చాలా ఆకర్షించేస్తున్నది. ఆమెమాటల్లోనూ, నడతలోనూ, ఎక్కువఅనురాగమూ, పరిపూర్ణమైనజాగ్రతా, సూక్ష్మమైన విధేయతా, తొలుకాడుతూ కనిపించేవి. ఆమెఅంటే అతనికీ ఒకవిధమైన అవ్యక్త భావం ఎక్కువౌతూ ఉన్నది. పాపం. కష్టాల్లో ఉందికాదూ, సానుభూతేమో...ఏమో...త్వరగా వెళ్లిపోతే బాగుండును.

నిద్ర లేచేటప్పటికి రాధ ఫలహారమూ, కాఫీ తయారుచేసింది. చిన్నవయసేకాని చాలా రుచిగా ఉన్నాయి. రాజా కొద్దికొద్దిగా సంకోచం వదలిపెట్టి, అడిగి వేయించుకోడం మొదలుపెట్టాడు.

"పాపం నానుంచి మీకు చాలా కష్టం కలిగింది, అక్కడేమున్నా తొందరపనులున్నాయో ఏమో" అంది రాధ కాఫీ కలుపుతూ.

"అంత చెడిపోయ్యేపనులేమీ లేవులెండి. వచ్చే శుక్రవారంనాడు కళకసమ్మేళనం ఉంది. దాని కందుకుంటే సరి. కష్టంమాత్రం ఏముందీ నాకు. నాలుగుఉపన్యాసా లిచ్చేకంటే, ఒక అబలను కష్టాల్లోనుంచి తప్పిస్తే మంచిదికాదా ?"

గంభీరమయిన రాధముఖంలోనుంచి ఒక నిశ్వాసంతో కూడుకున్న మందహాసం బయటికొచ్చింది. "నిజంగా ఆ కష్టసమయంలో మీరు దొరికినందుకూ... మీలో ఇన్ని ఆదర్శకోద్దేశాలు ఉన్నందుకూ ...ఆ భగవంతుడికి పదివేలనమస్కారాలు."

"అబ్బే, అట్లాపొగడకండి నాకు కష్టంగా ఉంటుంది. ఎలాగైనా మిమ్మల్ని నిర్విచారంగా ఇంటికి చేరిస్తే..... "

రాధ సంతృప్తహృదయంతో వంటకు వెళ్లిపోయింది.

సాయంకాలం రాజా అక్కడక్కడ తిరిగి ఇంటికి వచ్చేసరికి రాధ తలంటిపోసుకొని క్రిందటిరోజే తెప్పించిన ఔరంగాబాదు తెల్లపట్టుచీర కట్టుకొని ఉతికి ఆరవేసిన పెద్దపోలోకాలరుజంపరు వేసుకొని ఇంకా సొమ్మేమీ పెట్టుకోకుండానే లోపలివాకిట్లో పారిజాతంచెట్టుకింద చాపవేసుకొని జడ అల్లుకుంటూ కూచున్నది. రాజాను చూడాగానే లేచి స్వాగతసూచకంగా చిన్నమందహాసంతో "వూరుచూడడానికి వెళ్లారు కాబోలు, చాలా సేపయింది. ఏమయినా విశేషాలున్నాయా ఇక్కడ చూడదగినవి?" అంటూ పలకరించింది.

రాజా కోటూ చెప్పులూ విప్పి వచ్చి కూచొని "అట్టేవిశేషా లేమీ లేవుకాని రెండుమూడు ఫర్లాంగుల దూరంలోనే చిన్నగుట్ట ఒకటుంది. దానిమీద కూర్చొని చుట్టూఉన్న మబ్బుల్నీ, పొలాల్నీ చూస్తూ ఉంటే బాగా సాయంకాలమైపోయిన సంగతే తెలీలేదు" అన్నాడు.

"ఎక్కడానికి బాగా వీలుగా ఉంటుందా?"

"ఫరవాలేదు. ఒకమోస్తరుగా ఉంటుంది కొంచెం కష్టంగానే. అయినా పైకిగనక వెళ్లితే...ఏదో మాలాటివాళ్లకి కొత్త మనోహరమైన దృశ్యాలు కనిపిస్తాయి."

"వంటయింది భోంచేద్దామా?"

ఆరాత్రి రాజాహృదయంలో పెద్దతుపాను రేగింది. "ఈ అమ్మాయి ఇదివరకు నేను భావస్వప్నాల్లో తిలకిస్తున్నంత చక్కంది కాదుకాని ఎందుకో నన్ను ఆకర్షించివేస్తూన్నది. ..... ఏమో, గృహిణిగా ఉండటానికి ఈ చక్కదనం చాలదా ఏమిటి ?...ఐనా మనిషినడకలో మంచిచక్కదనం ఉంది. మాటలు చాలా పొంకంగానూ, పొదుపుగానూ వాడుతుంది......... ...వంట మహారుచిగా చేస్తుంది. సాయంత్రం చెవులకీ, ముక్కులకీగూడా ఏమీ సొమ్ములు లేకుండా ఉంటే నిజంగా కళ్ళల్లోవున్న కాంతీ, చెంపల్లోవున్న స్నిగ్ధత్వమూ బయలుబడ్డాయి. ఈ ఆడాళ్లంతా సొమ్ములూ, పూలూ, రంగుచీరలూ వదిలిపెడితేనేకాని అసలు అందమనేది వాళ్ళల్లో కొంచెమయినా ఉందా, లేదా, అనే విషయం తేలదు,... పైగా రాధను నేనంటే ఎంతో ఇష్టంలాగా ఉన్నది. కొంత బయిటికి పోతేసరి. ఎంతో సేపయిం దంటుంది. కృతజ్ఞతేమో.. ? కాకపోయినా కష్టాల్లోనుంచి తప్పించడానికి తీసుకువచ్చి ఇప్పుడిలా అనుకోడం...?"

సగంరాత్రయింది; రాజాకు నిద్ర రాలేదు. రాధకుగూడా బహుశా నిద్రరాకుండవచ్చు. లేచి రాధ పడుకున్న వరండావైపు వెళ్లిచూచాడు.

రాధ నిర్విచారంగా నిద్రపోతూవున్నది. ఏసుఖస్వప్నం చూస్తున్నదో ఏమో, పెదవుల్లో చిన్నమందహాసం, ముఖంలో సంతృప్తీ, చెంపల్లో వికాసమూ తొలుకాడుతూ వున్నాయి.

నిశ్శబ్దంగా రాజా తనగదిలో కెళ్లి పడుకోని ఆలోచనల్లో మునిగిపోయినాడు.

మర్నాడుసాయంత్రం రాధచేసిన క్యాబేజీ పకోడీలు ఫలహారంచేస్తూ రాజా "చూడాలని ఉంటే, ఇవ్వాళ నువుగూడా రా, రాధా ! నిన్నటికొండ చూచివద్దాము. చిన్న దేవాలయంకూడా ఒక టుంది అక్కడ, నీకు దేవుడు కావాలెనంటే" అన్నాడు.

ఇద్దరూ కాఫీ ముగించి బయలుదేరారు. ఆఎగుడు దిగుడు కొండరాళ్లను, రాధకూడా అనాయాసంగానూ, ఉత్సాహంగానూ పమిట బిగించి ఎక్కుతూఉంటే రాజాకళ్లు కొత్తఆశల్తో నిండిపోతున్నాయి. రేగిపోతూ ఉన్న ఆమెజుట్టూ, జారిపోతూన్న ఆమెపూలూ, అలిసిపోతూవున్న ఆమెముఖమూ రాజాభావాలను తెలగొడుతూవున్నాయి. ఆమెతో ఎక్కలేక అడుగడుక్కీ తనే వెనకబడిపోతూవచ్చాడు

ఇక పైకి పోలేక ఇద్దరూ పడమటివైపున ఉన్న ఒకసమప్రదేశాన కూర్చున్నారు. అక్కడనుంచి చూస్తే చాలా దూరందాకా పరుచుకొనివున్న వరిచుళ్లు పచ్చిపసగళ్లలాగా కానిపిస్తున్నాయి. అక్కడక్కడ కాపువాళ్లు స్త్రీపురుషభేదం లేకుండా కలిసి పాటలు పాడుకుంటూ పనిచేసుకుంటున్నారు. ఉండడానికి కొంచెం దూరంలోనే వున్నా పంటచెరువు చూడ్డానికి కొండకిందనే ఉన్నట్లుండి నిర్మలంగా ఉండడంచేత రంగురంగుల పశ్చిమాకాశాన్నీ, అస్తమించబోతున్న రక్తసూర్యుణ్నీ ప్రతిఫలింపచేస్తున్నది. ఆ నిండుచేలల్లో గాలిపిల్లలు హృద్యంగా ఈలపాటలు పాడుతున్నాయి.

ఆయాసంచేత కొంచెం తీవ్రంగావస్తూన్న నిశ్వాసాలతో రాధ "చాలా హాయిగావున్నదండీ ఇక్కడ. మీరు చెప్పినమాటల్నిబట్టి ఏవో భావకవులకేగాని నాలాటివాళ్ల కేమీ బాగుండదేమో ననుకున్నాను. కాని తీరా వచ్చి ఈ దృశ్యాల్ని చూస్తుంటే చెప్పలేనంత తృప్తీ, హాయీ కలుగుతూ ఉన్నాయి" అని సంభాషణ ప్రారంభించింది.

"నేనూ అలాగే అనుకున్నానుసుమండీ మొదట్లో. ఆ తెల్లనిమేఘాలన్నీ కరుళ్లుకట్టి పాలసముద్రం ఇదేనా అనిపిస్తున్నాయి" అన్నాడు రాజా, రాధలోకూడా కొద్దిగా కళాపిపాస ఉన్నందుకు సంతృప్తిజెందుతూ.

"ఐతే రాధా, మరి మీవూరువెళ్లడం ఎప్పుడూ?"

"వెళ్లాలి మరి త్వరగానే, డబ్బుకూడా అయిపోతున్నది."

"వెళ్లితే మరి మీవాళ్లు ఏమీ అనకుండా ఊరుకుంటారా?

"ఆవిషయం తెలుసుకోడానికే భయానకంగా ఉంది. కోప్పడుతారని నాకు పెద్దభయంగా లేదుగాని మళ్లీ ఆబంధతనికే ఇచ్చే ప్రయత్నం చేస్తారని దిగులుగా ఉంది"

పాపం రాధకళ్లు మళ్లీ మొదటిరోజున లాగే దిగులుతో నిండిపోయాయి. రాజాహృదయం నీరయిపోయింది. తను రాధను వివాహం చేసుకుంటే ఇక చిక్కేమీ ఉండదనుకొని తన మహదాశయాలన్నీ నో? ...రాధ మరుపు కాదు, తెలివితక్కువదీ కాదు. పైగా తనమనసును ఎక్కువగా గుంజుకుంటూఉన్నది కూడా నూ...ఇంతకూ రాధ తన్నా ఉద్దేశంతో చూస్తున్నదో లేదో...? ఆమె ఏ ఐ. సి యస్. ఆఫీసర్ని చేసుకుందా మనుకుంటున్నదో!" రాధ ఇతనిహృదయ పరివర్తనాన్ని ఎంతవరకు కనిపెట్టుతున్నదో ఏమోగాని ముఖంలోమాత్రం ఏవిధా కల్లోలం కనిపించడము లేదు.

చివరకు రాజా ధైర్యం చేసి గొంతు సవరించుకొని చెప్పడానికి ఉపక్రమించాడు. "పోనీ రాధా! నీ కిష్టమైతే.. మావాళ్లతో చెప్పి...నేనే...మరిమన వివాహం...నీ కిష్టమేనా...?"

రాధ ఆకస్మికంగా 'షాకు' తగిలినట్టయిపోతుం దనుకున్నాడు రాజా. కాని రాధ సామాన్యమైనముఖంతోనే కొంచెం నిరాశాకంఠంతో, "ఏంలాభం, మీకుమాత్రం జయ్యా, రెండువేలూ కట్నం మావాళ్లెక్కడనుంచి తీసుకురాగలరు...?" అంది.

రాజా ఉద్వేగంతో "కట్న మెవరి క్కావాలి, పిల్ల నాకు అన్నివిధాలా నచ్చాలి. నాకళ్లోపాసనకు తోడ్పడాలి అనిగానీ,...అసలు నీకు నేను తగినవాణ్ణినో, కాదో...చూసుకో.. "అన్నాడు.

కళవళపాటేమీలేకుండానే రాధ స్థిరస్వరంతో "ఇప్పటికైనా మీకు నేను అర్హురాలినని తోస్తే...?"

క్షణం ఆలస్యం చెయ్యకుండా రాజా ఆమెను తనవొళ్లోకి తీసుకున్నాడు. విజయగర్వంతో రాధ వణికిపోయింది. గుండెలు ఆగిపోతాయేమోన్నంత తీవ్రంగా కొట్టుకున్నాయి. కళ్లు ఉద్రేకబాష్పాలతో నిండిపోయినాయి. రెండుచేతుల్తో రాజాతలను తనహృదయంలో చేర్చుకొని కంఠాన్ని పెనేసుకుపోయింది.

విజయధ్వజంలాగా పంచమిచంద్రరేఖ బయటకి వచ్చింది.

తేలికబడ్డహృదయాలతో ఇద్దరూ కిందికి దిగి వచ్చారు.

ఆమర్నాడుసాయంత్రం హైదరాబాదుస్టేషనులో, రాజా రాధతోగూడా దిగేటప్పటికి, ఎందుకొచ్చారో తెలియకాని వాళ్లవాళ్లంతా కనిపించారు. తనతండ్రీ తమ్ముడూ ఇంకో పెద్దమనిషీ... తెలుసు తన మేనమామే...మరోయువకుడూ...అవును మేనమామ కొడుకే...మరికొందరూ తమపెట్టెదగ్గరకే వచ్చారు. తనకోసమేనేమో...?

ఆశ్చర్యంతో చూస్తుండగానే ఆ మేనమామ దగ్గరకు వచ్చి, కొడుకుచేతులోని 'చెంగేరి' అందుకొని, రెండుపూలహారాలు తీసి ఇద్దరిమెళ్లో చెరొకటీ వేసి, రాజాను గట్టిగా కౌగలించుకొని, "మారాజా! ఇప్పటికి దారికి వచ్చావా ?" అని, రాధను దగ్గరకు తీసుకొని ఇప్పటికి నీపట్టు నెగ్గించుకున్నవా తల్లీ"అని బుజ్జగించి, "సరిగా ముహూర్తాని కందుకున్నారు" అన్నాడు.

రాజా విభ్రమంలో పడిపోయినాడు, "ఏమిటిది? తనమేనమామకూతురేనా, ఈరాధ? ఈరాధనేనా, చిన్నప్పటినుంచీ ఎంతమంది చెప్పినా చేసుకోనని కూచున్నది!! రాధ చేసినపన్నాగమంతా అందరికీ తెలిసిందేనా!! రాధ ఎంత మేధావి!! నింజంగా ఈ రాధే తనచేతినుంచి జారిపోయినట్టయితే, తనంత నిర్భాగ్యుడు ఇంకోడుండడు!! విధాతకు కృతజ్ఞుణ్ణి"

రెండోనాటి సాయంత్రం రాజా వాకిట్లో ఈజీచైర్లో కూచొని అఖిలాంధ్రకథక సమ్మేళనానికి పంపడానికి అఘటనాసంఘటితమైన తన వివాహాన్నే కథగా రాస్తున్నాడు.

వర్షారంభము

గుఱ్ఱము వేంకటసుబ్రహ్మణ్యము

మానిని చూడు మింట దెలిమబ్బులప్రోవులు సుందరంబులై
భానుకరాంచలస్పృశవిభాసురవాసరలక్ష్మి నవ్వులై
జానుగ మానుసంపెగల జల్లులరాల్చు సుధాంబుధారలై
కానుగనీడలై కడకు గార్కొనె, నీవపువుం గగుర్కొనెన్.

పచ్చనిపైరుపైట యిలపైదలి కల్లలనాడ, జాజిపూ
లచ్చి మొగంబు విచ్చి తరళస్ఫురణంబుగ నాట్యమాడ, నీ
ర్వచ్చినవెన్న రంగనిస్తవంబు దివంబును సోకబాడ, దా
నిచ్చమెయిన్ వినోదిలు నిదే పవనుండు నిజాంతరార్ద్రుడై.

తడిసిననేలతావి, జలదస్ఫుటమైత్రిని వృక్షసంతతిన్
జడిగొనుపూలతావి, వరుసం బురసౌధగవాక్షకోటి వె
ల్వడుపొగతావి, త్వద్వదనవారిజనిర్గత మూర్చుతావిలో
సుడియుచు నాయెదం గొలుపు సుందరి వేఱొకతావి యుత్తఱిన్.

చీకటిమొత్తముల్ క్షణము సించి మెఱుంగు రహింప, మానవా
లోకము విస్ఫురింప, మదిలో బరితోషము సందడింప, బెన్
వ్రేకము మ్రోయు నియ్యుఱుమువిన్కి దటాలున జీవరాశినిం
దాకుభయంబుదీఱు ద్వరితంబుగ దైవకృపాభరంబునన్.

మన్నును మిన్ను నేకముగ మిక్కుటమై కురియంగ వర్ష, మా
సన్న యువాంగనాశ్లిషణసంజనితాతిశయప్రమోద భా
గ్యోన్నతి లోకు లొప్పగ, కృశోదరి నీదరి నాదుకోర్కె లా
పన్నము లౌనె, నీకనులవాచిక మింక ననుగ్రహింపుమా.

మబ్బులు కేశపాశముల, మంజుమతీ, కనులన్ మెఱుంగులై,
నుబ్బు గగుర్పునన్ నవసుమోద్భవనీపవనంబు, దర్శనం
బబ్బని మిన్నుకౌనున, రసాతిశయంబు నెదన్ ధరింతు వీ
వబ్బుర మొప్ప వర్షపరమాద్భుతి మానుషియయ్యెనోయనన్.

ప్రాచీన అరబ్ నివాసులు హిందువులా?

శ్రీ జ్ఞానేంద్ర దేవ్ సూఫీ, మౌల్వీ ఫాజిల్

ప్రాచీనకాలమున ప్రపంచమునందు సర్వత్ర ఆర్యసభ్యతయు, ఆర్యధర్మమును ప్రచారమునం దుండియుండె నని అనేక హిందూ విద్వాంసుల అభిప్రాయము. వర్తమాన అన్వేషణ యుగమున భిన్నభిన్న దేశములందు ఉపర్యుక్తాభిప్రాయమును సమర్ధింపగల వస్తువు లనేకములు ప్రాప్తించియున్నవి.

అరబ్ దేశమునుగూర్చి పూర్వకాలపు చరిత్రకారులు వ్రాసినదానినిబట్టి ఇస్లాము మతావిర్భావమునకు చాలకాలము పూర్వము ఆదేశమున సెమిటిక్ సభ్యత ఉండె ననియు, తదనుకూలమగు వారి విగ్రహారాధనము ప్రాచీనకాలపు ఈజిప్టు, గ్రీసు దేశములందలి విగ్రహారాధనముతో సరిసమానమైనదిగ నుండెననియు విదితమగును. కాని ప్రాచీనకాలపు అరబ్ నివాసులు హిందూమతావలంబు లని రుజువుపరచగల యాధారములు కొన్ని నాకులభించియున్నవి.


ఉక్తదేశమందలి పురాతనకవులు వారి దేవతల విషయమునను, వారి ధార్మికాభిప్రాయముల విషయమునను లిఖించినవానిని అన్వేషించినచో మన దేశపువిగ్రహారాధనమునకు సంబంధించిన చిహ్నము లనేకములు దొరకగలవు. సెమిటిక్ సభ్యతనుండికాక ఆర్యసభ్యతనుండి గ్రహింపబడినవిషయము లనేకములు ఆకాలపు అరబ్బులయందు ప్రచారములో నుండెను. ఆకాలపు అరబ్బులు పునర్జన్మము నమ్ముచుండిరి. "బమినల్ అరబే మన యతా అక్కదోతనా సుఖా" అనగా ప్రాచీన అరబ్బులు పునర్జన్మమును విశ్వసించుచుండి"రని 'అల్ మిలల్ బన్హల్'నందు లిఖింపబడియున్నది.

మక్కానగరమును హజరత్ మహమ్మద్ సాహెబ్ జయించినపిదప నచటి ముఖ్యమందిరము (దేవాలయము)ను బగుల గొట్టి మసీదు నిర్మింపబడనున్నకాలమున నందలిపెద్దవిగ్రహమును అచటిపూజారి తీసికొని పరుగెత్తివచ్చి భారతవర్షమున సోమనాథమందిరమున మరల స్థాపించె నని 'తారిఖ్ ఫరిస్తా' యనుగ్రంథమున వ్రాయబడినది. బాగుగ నవలోకించినచో ఆర్యసభ్యతతో సంబంధమును సిద్ధపరచగలవిషయము లనేకములు ఇస్లాముమతమునందు గూడ గలవు. మనముసల్మాను సోదరులు హజ్జ్ - మక్కాయాత్ర - నొనరింపబోవుసమయమున మార్గమధ్యమం దొకవిధమైన 'అహరాం' అనుపేరుగల వస్త్రవిశేషమును ధరింతురు. దానిని ధరించియుండునంతకాలము ఏపశుపక్షినిగాని హింసింపరు. దీనివలన ఆర్యసభ్యతయందు ముఖ్యసిద్ధాంత

మగు అహింసయొక్క ప్రభావము కొంత వరకు మహమ్మద్‌సాహబ్ మీద బహుట నిశ్చయము ; ఎందుచేతనన సెమిటిక్ సభ్యత యందు హింసాహింసలవిషయమున విచారము లేకపోవుట యటులుండ ఈశ్వరప్రసన్నతను సంపాదించుకొనుటకు హింస ఒక ముఖ్యసాధనముగ గణింపబడినది. ఆర్య సభ్యతయొక్క ప్రభావము హజరత్ మహమ్మద్‌సాహబ్ మీద పడియేయుండనిమొడల అహింసాసిద్ధాంతమును అతడు స్వల్పకాలమునకుగూడ ఆమోదించియుండడు.


మునల్మానుల ముఖ్యతీర్థమగు మక్కానగరమున నిర్మింపబడిన మసీదుకు "మస్జిదుల్ అహరాం"అని పేరు. దీనియందలి మధ్యాంగణమందు ఒక చతుష్కోణపుగది కలదు. దీనిని 'బైతుల్లాహ్' (ఈశ్వరగృహము) అందురు. దీనికే అభిముఖులై మునల్మానులు నమాజుచేయుచుందురు. 'బైతుల్లాహ్'యొక్క ఈశాన్యదిక్కునందు నేలనుండి మూడుఅడుగుల ఎత్తున ఒకపెద్దగూడు కలదు. దానియందు మునల్మానుల కత్యంత పవిత్రమును, పూజనీయమునైన పాషాణము నెలకొల్పబడి యున్నది. దీనిని 'హజరుల్ అస్వద్' లేక 'సంగఅస్వద్' అని పిలుచుచుందురు. దీనిమొడల మునల్మాన్ సోదరులకు అతిగాఢమైనశ్రద్ధ. దీనిని దాకినగాని లేక చుంబించినగాని జన్మమందలి సమస్తపాపములు నశింప నాపుణ్యాత్మునకు పరమాత్మ స్వర్గము నొసంగు నని వీరిదృఢవిశ్వాసము.

ఈపాషాణ స్థాపనస్వరూపము సరాసరి శివలింగస్థాపనమును బోలియుండును. అడుగున 'జలహరీ' లేక ఉద్ధరిణె ఆకృతిగ గట్టబడి అందు మూర్తి స్థాపితమైయున్నది. ఆమూర్తి సుమారు ౧౨ అంగుళముల పొడుగును, సుమారు ౫, ౮ అంగుళముల గోళాకారస్థౌల్యమును గలిగియుండును; జలహరిమధ్య నిలువున స్థాపితమైయున్నది. అరబ్ సందలి ప్రాచీనకాలపు మూర్తిపూజకులు ఈస్థానమును మొదట నెట్లు కట్టించిరో అది నేటిపర్యంత మటులే యున్నదనునదియు, నం చే విధమైన మార్పును గలుగలే దనునదియు ఇతిహాసప్రసిద్ధమైన విషయము. మునల్మాన్ సర్దారులు కొందరు దీనియందు మార్పుచేయదలంచిరి కాని మహమ్మద్‌సాహెబ్ అట్లు చేయుటకు అనుమతింపలేదు. ఇందుచేత ప్రాచీన కాలమునందలి పూజకులు మహాదేవుని మూర్తివలె స్థాపింపబడు నొకవిగ్రహమును పూజించుచుండి రని విదిత మగుచున్నది. ఈరెండువిషయముల నాధారముగ గొనియే నేను అనంతరాన్వేషణకార్యమును ప్రారంభించితిని. క్రీ. శ. ౧౯౨౩-వ సంవత్సరము మార్చిమాసమున ఈజిప్టునందలి కెయిరోనగరమునుండి ప్రకాశితమైన 'అల్‌హిలాల్'నామక సమాచారపత్రికయందు, అజహార్‌యూనివర్సిటీ ప్రొఫెసరొకడు ఒక పద్యమును ప్రకటించెను. దీని అసలుకర్త 'అబుల్‌హాకం' అను ఉపనామముగల 'ఉమర్-బిన్-హాసిమ్' అనునతడు—అరబ్‌దేశ ప్రాచీనకవి. ఈయన 'హజరత్ మహమ్మద్'యొక్క పితృవ్యుడు. ధార్మికమతభేదమువలన పితృవ్యభ్రాతృజులలో గొప్ప శత్రుత్వ ముండెను. ఈ హేతువుచేత మహమ్మదీయులు జ్ఞానజనకు డని యర్థమిచ్చు 'అబుల్‌హాకం'అనుఅతనిపేరును మార్చి మూర్ఖులకు, అజ్ఞానులకు దండ్రియను నర్థమిచ్చు "అబుల్‌జహాల్" అని నామమును బెట్టిరి. కాని



శ్రీ జయపురము మహారాజులుంగారి శిలావిగ్రహము

దీనిని మద్రాసు ఆర్ట్సుకాలేజి ప్రిన్సిపాలుగారయిన శ్రీ దేవీప్రసాదరాయ చౌదరిగారు తయారుచేసిరి.
విశాఖపట్టణమున ఆంధ్ర విశ్వవిద్యాలయపు సైన్సుకళాశాలయెదుట ఇది యిటీవలనే ప్రతిష్ఠింపబడినది.



చిత్తూరుజిల్లాలో క్రొత్తగా కనిపెట్టిన బంగారు గని

గౌ॥ టి. ప్రకాశంపంతులుగారు, గౌ॥ బులుసు సాంబమూర్తిగారు మొదలగువారు ఆప్రదేశమును పరీక్షించుచున్నారు.

ఆయన మంచికవి. మక్కానగరమందు నొక ప్రతిష్ఠితవిద్వాంసుడు - సద్గ్రంథము నొకటి ప్రాచీనహస్తలిఖితరీతి ప్రకటితమైన యతని గ్రంథములు 'అల్ హిలాల్' నందు ప్రకటితమయ్యెను. వానిలోని కొన్నిమూలపద్యముల నిందు పొందుపరిచెదను.

"కఫ్నా ఇబనేకా శికంగా మిన ఉలూమిన తవ అకెమూ,
మీలూఖన అమూతకుల హవా బతెజక కమా" ౧
తజకేరోహా ఉదన్న ఎలల ఎపదే లిలబరా,
బలుకి యూనా జాతల్లాహే హౌనూ తవ అషేరూ. ౨
బఅవాల ' లహా అజహూ అరమీమన మహాదేవో,
బమనా ఇలా ఇలముద్దీనా మినహుమ వశీయత్తరూ. ౩
మఅస్సయరే అఖలాక ఫాసానన ఫల్లహుము,
నజూమున అజాఅల సమ్మాగాలల హింబాను. ౪
బహాబీ కసాహా ఫీల్మకామిల్ హింకో,
యకూనూనా లాకెహాజు ఫాఇన్నకలా తో వజ్జరూ. ౫

"ఎవని హృదయము కామవశీభూతమై మృతి నొందునో, ఎవడు దుష్కార్యమును ముఖ్యముగ నెంచి దానిని గావించుటయే తనకర్తవ్యముగ దలంచునో, అట్టి పతితుడగు మానవుడు బాగుపడునా ? అట్టి యతడు బాగుపడనెంచిన బాగుపడగలడు. అతడు తన జీవితమునందొక్కసారియైనను నిజమైనహృదయముతో మహాదేవుని ఉపాసన సలిపినయెడల ధర్మమార్గమందెన్ని సోపానములు కలవో వాని నన్నింటిని దాటగలడు. మనుష్యునకు భారతవర్షయాత్రవలన సమస్తశుభకార్యములు ప్రాప్తము లగును. ఎందుచేత ననగా భారతీయులు ధర్మమార్గమును జూపుటయందు ఆదర్శక గురువులు. హే ! ప్రభూ ! ఎచటి కేగుటచే మానవుడు దుఃఖములనుండియు, క్లేశములనుండియు ముక్తుడగునో యట్టిభారతవర్షమును దర్శింపగలుగు పవిత్ర ప్రాతఃకాల మెప్పుడు వచ్చును ? "

క్రీ. శ. ౧౮౭౮-వ సంవత్సరమున కాన్స్టాంటినోపుల్ నగరమునుండి ఒక గ్రంథము ప్రకాశితమైనది. దాని మాతృకయగు హస్తలిఖితగ్రంథమును ౧౮౭౮-వ సంవత్సరమున జెరూసలేమ్ పట్టణమందలి 'హామీదియా' పుస్తకాలయమున జూచియుంటిని. "ముసల్ము సుబూత ఫీల్ అహవాలున్ శాయిరా ఇలజహూద" యని యాగ్రంథము పేరు.

దీనిని లిఖించినయతడు 'ఆస్మఈ' అను కవి. అతడు హారూ రషీద్ పాదుషాదర్బారు నందు ముఖ్యకవిగ నుండెను. ఆగ్రంథము రెండుభాగములు. అందు మొదటిభాగమున అరబ్ దేశపు ప్రాచీనకవులవృత్తాంతమును, రెండవభాగమున మహమ్మద్ సాహెబ్ తరువాత 'హారూరషీద్' పర్యంతమైన కవుల చరిత్రమును లిఖింపబడియున్నది. మక్కానగరమందలి యన్నింటికంటె పెద్దదగు మందిరమును సమస్త అరబ్ నివాసులు తమప్రాజ్య తీర్థస్థానముగ నమ్ముచుండెడివారని ఆగ్రంథముయొక్క భూమిక (పీఠిక)యందు గలదు. సంవత్సరమున కొక్కమారు పర్విస్తృత అంతమున అచట నొకగొప్పయుత్సవము జరుగుచుండెడిది. అందు వేలు, లక్షలకొలది అరబ్ వాసులు గుమికూడుచుండిరి. 'ఓకాజ్' అని ఆయుత్సవముపేరు. ఆయవసరమును పురస్కరించుకొని ఒకగొప్ప కవిసమ్మేళనము నిచట జరుగుచుండెను. సర్వప్రథముడుగ దేలిన కవియొక్క కావ్యమును తామ్రపత్రముమీద లిఖించి మందిరాభ్యంతరమున వ్రేలాడదీయుచుండిరి. అన్యకవులయొక్క,

అనగా రెండవస్థానము మొదలుకొని దశమ స్థానమువరకు వచ్చుకవుల కవిత్వములను ఒంటెజిల్లిమీదగాని, లేక మేకచర్మముమీద గాని వ్రాయించి మందరపు వెలుపలిగోడల మీద వ్రేలాడగట్టుచుండిరి. ఇట్లు ప్రతిసంవత్సరమును పదికావ్యము లీమందిరమునకు లభించుచుండెను. ఈప్రకారము అరబ్ సాహిత్యపు అమూల్యరత్నములు వేల కొలదివర్షములుగ నీమందిరమున జెల్లింపబడుచుండెను. హజరత్ మహమ్మద్ సాహబ్ నాయకత్వమున ముసల్మాన్ సేన ఈనగరమును జయించినప్పుడు ఈ మందిరమును మసీదుగా మార్చుటకు అందలి విగ్రహములన్నియు బగులగొట్టబడినవి. ఈ తుపానులో నాకావ్యములును నష్టప్రాయము లైనవి. కాని ముసల్మానుసేనయందు ఒకకవియు నుండెను 'హస్సాన్ - బిన్ - సాబిత్' అని యతనిపేరు. అతని కీ కావ్యముల సర్వనాశనము జూచి మహాదుఃఖము కలిగెను. అతడెట్లో యక్కడ నున్నవారి కన్నులగప్పి కొన్ని కావ్యములను దనవద్ద భద్రపరచుకొనెను. చాలకాలము గతించినవెనుక ఆ కవియొక్క మూడవతరమున 'ముసలిమ్' అనునత డుదయించెను. ఇతడు దరిద్రుడైనందున ఆ కాలమున బగదాద్ రాజ్యమునేలు పాదుషా హారూరషీద్ విద్యను, విద్వాంసులను జాలగ నాదరించువాడని విని తనతాత సంగ్రహపరచియుంచిన కావ్యములనన్నింటిని దీసికొని ఆ నగరమునకు బోయి 'అస్మఈ' కవి ద్వారా దర్బారునందు బ్రవేశించి వానిని పాదుషాకు సమర్పించెను. 'అస్మఈ' లేఖానుసారము అవి ౧౯౫. కావ్యములు. వానిలో 'లబీబిన్ అఖతబ్ బిన్ తురఫా' యనుకవీశ్వరుని మూడు కావ్యములు తామ్రపత్రములపై చెక్కబడి యుండెను. ఈ సమాచార మంతయు ఉపర్యుక్త గ్రంథపీఠికయందే వ్రాయబడియుండినది. ఈగ్రంథమున కవివృత్తాంతము లారంభమైనచోట మొట్టమొదట 'లబీ బిన్ అఖతబ్ బిన్ తురఫా' నామము కలదు. ఇతడు హజరత్ మహమ్మద్ సాహబునకు వెయ్యిసంవత్సరములు పూర్వపువా డని నిరూపింపబడినది. ఇతడు 'ఓకాజ్' ఉత్సవపు కవిసమ్మేళనములందు వరుసగ ఆరుసంవత్సరములపర్యంతము పందెము గెలిచి ప్రథమస్థానమును ఆక్రమించియుండెననియు వ్రాయబడియున్నది.

క్రీ. శ. ౧౮౭౮-వ సంవత్సరమున టర్కీసుల్తానగు అబ్దుల్ హమీద్ పేరున నాజిమ్‌పాషా జెరూసలేమ్‌నగరమందు హమీదియాపుస్తకాలయమును స్థాపించియుండెను. నే నాపట్టణమునకు బోయినపుడు ఆపుస్తకాలయాధ్యక్షుడగు సైయద్ జమాల్ హుసేనీ తోడ నా కమితమగు మైత్రి కలిగెను. నేను దిగినదియు నతనిగృహమందే. ఒకదినమున ఆయన తనవద్ద ప్రాచీనకాలపు తామ్రపత్రిములమీద లిఖింపబడిన కావ్యములు కలవని, నన్ను వానిని జూడు మని యడుగుచు నొకరాగిరేకును దీసి నాయెదుట బెట్టెను. దాని పొడుగు సుమారు మూడుఅంగుళులును, వెడల్పు ఒకటింబావు అంగుళును ఉండును. దానియడుగున సుమారు నాలుగుఅంగుళముల ఖాళీస్థలమున 'ఫజల్-బిన్-యాహియా' యొక్క ముద్ర వేయబడియుండెను. 'ఫజల్-బిన్ - యాహియా 'హారూరషీద్ పాదుషా' యొక్క మహామంత్రి. ఇందు ౧౭౮ కావ్యము లుండెను. కవిపేరు 'లబీ-బిన్-అఖతబ్' అని మాత్ర ముండెను.

ఈ కావ్యములందు వర్ణింపబడిన యద్భుత విషయములును, వానివలన వెలియవచ్చు చమత్కారముంగొల్పు సమాచారములును ఇంతవరకే ఇతిహాసమునందుగాని సంకేతితములైన కాలేదు. అందలి నాలుగైదుపద్యముల నిం దుదాహరించెదను :

"అయా ముబారికల అరజా యోశయే నోహా మినల
[హింద్,
వ అరాద్ కల్లాహాన్ సైంయోనజ్జేలా జికరాతున్న. ౧
వహల్ల్ తజల్లీయతున ఐనకా సహబీ అఖ అతున్న
[జికరా,
వహాజేహీ యోన్న జేఉ రరసూలా మినల హింద తున్న.
యకూలూ నల్లాహా యా అహల్ల్ అరజే ఆలమీనా
[కల్లహుమ,
ఫత్తబేఊ జికరాతల్ వేదా హక్కన మాలమ యోన
[జేలా తున్న. ౩
వహోవా ఆలముస్సామా బలయుజరా మినల్లాహే తన
[జీలన్,
ఫఐనమా యా అఖీయో ముత్తబే అనయోవశ్శరో
[అబ్ జాజతున్. ౪
వఇస్సైనా హోమా రిక అ ర నాసేహీనాక్ అఖూబ
[తున్న,
వఅస్నాతా అలాఊదన వహోబా మశ్ అస్తున. ౫

"హే పవిత్రభారతభూమి! నీయందు ప్రభువు తనజ్ఞానమును ప్రకాశింపజేసి యున్నాడు. నీవు ధన్యవు. ఏజ్యోతులవలన మా నేత్రములు ప్రకాశమానము లగుచున్నవో యా జ్ఞానకాంతుల భండారముల నాల్గింటిని ప్రభువు తనదూతం ద్వారా భారతవర్షము నందు వెలుగొందు లాగున జేసెను. మనుజులారా! మీరు మీకల్యాణము నభిలషింతురేని వేదముల నాదరింపుడని ప్రభువు అజ్ఞాన భండరములుద్వారా మాకుమాత్రమె కాదు; సమస్త ప్రాణిమాత్రులకు ఉపదేశము చేయుచున్నాడు. సామయజస్సు లాజ్ఞాన భండారములు. సోదరులారా! మీరు మోక్షమును కల్యాణమును కోరెదరేని మీజీవితముల వాని కనుకూలముగ నుండులాగున దిద్దికొనుడు. ప్రపంచము నంతను, భ్రాతృభావముతో బరికింపవలయు నని వానియందలి ఋక్కులు, అతరులు మనకు ఉపదేశము చేయుచున్నవి. ఇవియే మోక్షము నొసంగు సుఖకల్యాణమార్గములు."

స్థానాభావమువలన నిపుడిక కావ్యముల చరిత్రమును వదలి కేవలము అర్థముమాత్రము కొన్నింటికి వ్రాసెదను. ఈ విషయమున త్వరలో నొకగ్రంథము ప్రకాశితముకానున్నది. దానివలన సమస్తవృత్తాంతము పాఠకులకు విశదము కాగలదు. హజరత్ మహమ్మద్ సాహెబ్ కంటె ౧౭౦౦ యేండ్లు పూర్వము ముండిన 'జరహమ్-బిన్ తా-ఈ' అను నొక కవి లిఖించిన కవిత — చర్మముమీద వ్రాయబడినది- కాన్‌స్టాంటినోపుల్ నందలి సుల్తానియా పుస్తకాలయమున నిప్పటికిని గలదు. అతడు వ్రాసినది చూడుడు :

"పాపాత్ములు పృథ్విని లోబరచుకొనుటచే ప్రపంచము పీడితమై, ధర్మము నష్టమై పాపము పెరిగిపోవునపు డంతయు భక్తుల నుద్ధరించుటకును, పాపుల దండించుటకును జన్మించెదనని స్వయముగ నీవు నీ గ్రంథమున వక్కాణించినవాడవై వడి హే ప్రభూ! ప్రపంచకల్యాణము నిమిత్తము అనేకపర్యాయములు అవతారము నుధరించితివి. హే ప్రభూ! నీవు జన్మించిన నగరము ధన్యమైనది. గోవుల మేపికొనుచు బాలసఖులతో నీవానందము నందిన నీ క్రీడారంగమగు మైదానము ధన్యమైనది. నీ శ్యామ

వర్ణముఖమును, నీ సుందరాకారమును తిలకించు ప్రతి మానవునకును సౌందర్యము మూర్తీభవించినట్లు తోచును. నీవు మురళీగాన మొనరింప తీయని మధురారావము ఆకసమున ప్రతిధ్వని నీన స్త్రీలు గృహములందు నిలువరు. పురుషు లేపనిపాటులు చేయరు. గర్భస్థ శిశువులు సైతము ఆగుదురు. స్త్రీలు తమ యొడియందలి బిడ్డలకు పాలిచ్చుటకూడ మరతురు. పతిసేవలుగూడ నుజ్జగించి పతంగములవలె నీ ముఖచంద్రుని పైబడుటకు తయారగుదురు. ప్రభూ! నీవు పీతాంబరమును గట్టి, మురళీహస్తుడవై, తలను మకుటమును, చెవులను కుండలములను దాల్చినరూపముతో నాకు దర్శన మొసంగుము. ప్రభూ! నీవు స్వర్గలోకపు అప్సరస నుద్ధరించితివి, కొండను వ్రేలితో నెత్తితివి. ఆదేవుడవున నన్ను నుద్ధరింపుము."

అరబ్ దేశపు మరియొక పూర్వకవి 'నో మాక్-బిక్-అదీ' యనునతని కావ్యమును కాన్‌స్టేంటినోపుల్ సుల్తానియాపుస్తకాలయమున గలదు. అందొకచోట

"విక్రమరాజు అతనికాలమున మంచి దాతయు, ధర్మాత్ముడునై యుండెను. అతని రాజ్యమున జన్మించి యతనిచే గర్వించిన జనులు ధన్యులు. మన మా కాలమున అవిద్యా మూర్ఖ్యములందు మునిగియుంటిమి. కటిక వానిచేతులందు దూడలాగు మనము స్వార్థపరులు, పాషండులు మొదలగువారి జాలముల దగుల్కొనియుంటిమి. అట్టియెడ ధర్మాత్ములిద్దరేతెంచి సత్యాసత్యజ్ఞానమును గలిగించి ధర్మము నుపదేశించిరి. ఈయిరువురు విద్వాంసులు విక్రమాదిత్యప్రేషితులు, భారతవర్షమునుండి వచ్చిరి" అని వ్రాయబడియున్నది.

ఇంతవర కిట్టి కావ్యములు ౨౨ లభించినవి. వీనియన్నింటియందు నిట్టి చమత్కారమును గొలుపువార్తలే కలవు. కావున ప్రాచీన అరబ్ నివాసులు హిందూధర్మమును విశ్వసించు ఆర్యసభ్యతయొక్క అనుయాయులనుటయందు సందేహ మేమికలదు? ఈ ప్రాచీనకావ్యములే యిందులకు సాక్షులు.

(అనువాదకుడు: వే. సు.)



శ్రీ నాగేశ్వరోదాహరణము

పుండిపాక పార్వతీశ్వరశాస్త్రి

శార్దూలము

శ్రీనీలాచల శేషశైల కటక
శ్రీపీఠసంజాతముల్
భూనాథ స్తవనీయ కావ్యరచనాం
భోధిప్రమోదప్రద
శ్రీనిత్యంబులు, నిష్కళంకములు, నాం
ధ్రీకీర్తిచాంద్రీతతుల్
నానాదేశములందుఁ గ్రమ్మి వెలుఁగున్
నాగేశ్వరోదాహృతిన్.

శార్దూలము

శ్రీ నాగేశ్వరపాదసేవకుఁడు, కా
శీనాథవంశాంబుధి
శ్రీనీహారకరుండు, సాధునికర
క్షేమంకర ప్రాభవ
శ్రీనిత్యుండు, దయాక్షమాదిసుగుణ
శ్రీరాజితుం డౌచు నా
శ్రీనాగేశ్వరుఁ డింపునం జెలఁగె నాం
ధ్రీపూర్వపుణ్యంబునన్.

కళిక

మఱియు భారతభూమిఁ బుట్టిన
మాన్యు లందఱిలో సమర్థుఁడు
మఱపు పుట్టఁగరాని త్యాగము
మై ధరించిన మొదటిపార్థుఁడు,
కలియుగంబున నవలిఁ బుట్టిన
కవులపాలిటి కామధేనువు,
తెలుఁగువారల తెలివితేటలఁ
దీర్చిపేర్చిన రత్నసానువు;
పరుస మెన్నఁడుఁ బలుకఁజాలని
పలుకుమెత్తని కనపుఁదోరము,
పసువులను గని యీవు లిచ్చెడు
బాగుమెచ్చెడి కల్పఁ దీరము;

ఉత్కళిక

దీనజనములఁ బ్రోవ నేర్చెను,
మానిజనములఁ గాచి పేర్చెను;
అడుగువారికి నన్న మిచ్చెను;
బడుగువారికి బలముఁ దెచ్చెను;
తెలుఁగుఁదల్లిని గొల్చుధన్యుఁడు
తెలుఁగుబిడ్డలఁ బ్రోచుమాన్యుఁడు
తెలుఁగుఁ దమ్ములకును శరణ్యుఁడు,
తెలుఁగుజనులకుఁ బ్రథమగణ్యుఁడు;

ఉత్పలమాల

ఆంధ్రజనమ్ములార! భవ
దభ్యుదయంబునకై, నితాంతనీ
రంధ్రమహోద్యమంబు లను
రాగమునన్ బచరించువాని, నై
రంధ్రిని బోలి యన్యులఁ గ
రమ్ము తిరమ్ముగఁ గొల్చెనుక్కు మీ

యాంధ్రినిఁ బ్రోచుశక్తి నల
రారుమహాత్మునిఁ జింత సేయరే!

కళిక

మఱియు దీనులఁ బ్రోవనేర్చిన
మహిమగల యౌదార్యవంతుని,
బిఱుదుమగ తెఱుఁగంగఁజాలని
పేరు గాంచిన పరమశాంతుని,
తెలుఁగుసీమకుఁ బేరు తెచ్చిన
దిట్టఁదనమునఁ దగుదయాళుని,
తెలుఁగుమొఱ విని కరఁగుమనమునఁ
దేజ మొందిన త్యాగశీలుని.

ఉత్కళిక

తెలుఁగువారికిఁ దెలుఁగువ్రాఁతలఁ
దెలుపఁగలిగిన తెలుఁగుసేఁతలఁ
తెలుఁగుసీమను విడిచి, దూరము
నిలిచి తెలుఁగున నిలిపె బీరము
తెలుఁగువారలు తెలుఁగుఁదనమున
వెలుఁగురీతులు పెలచి మనమున
తెలుఁగు సేమము తలఁచువానిని
తెలుఁగునిలువున నలరువానిని.

శార్దూలము

నానాఁటన్ గృశియించె నాంధ్రకవితా
నారీవతంసంబు; స
మ్మానంబుం గడియించి, క్రమ్మర రహిం
పం గల్గి వెల్గొందెఁ, గా
శీనాథాన్వయవార్ధిశీతకరుచే,
శ్రీమద్యశఃకాయుచే
శ్రీనాగేశ్వరుచే, మహామహిముచే,
శ్రేయస్కరత్యాగిచే.

కళిక

మఱియుఁ గవులకు నెల్ల మనసువచ్చినయీవి,
గుఱుతుగల్గినయీవి, కోరియిచ్చినయీవి,
యమరించువానిచే, నలరించువానిచే,
కమనీయమధురవాగ్గరిమగలవానిచే.

ఉత్కళిక

అమృతాంజన మొసర్చి, యమృతంబు చేకూర్చి
పసిఁడికొండ కరంచి, పస వారి యొసఁగి నించి,
యసదైన కలిమిచే, నలరారుబలిమిచే,
తెలుఁగుతల్లి వెలింగె, ధీరుచేతఁ జెలఁగె.

శార్దూలము

దేశోద్ధారకుఁడై, కళామహితుఁడై
ధీమంతుఁడై, శాంతుఁడై,
యాశాపూరణమే మహావ్రతముగా,
నాంధ్రప్రభావర్ధిమైఁ
గోశంబుల్ రచియింపఁ జేసి, తమకో
ర్కుల్ దీర్చియున్నట్టి నా
గేశాభిఖ్యునకై సమస్తవిబుధుల్
గేల్దోయి సంధింపరే!

కళిక

మఱియును భారతిమహిమను భారత
మహిలో నిల్పిన మాన్యునకై
ఎఱిఁగినవారల నెఱిఁగి, మఱిగి, తన
యీవులఁ దనుపువదాన్యునకై,
ఈవియె వ్రత మని మొదలో నెంచుచు,
నిచ్చుచు వగవని ధన్యునకై,
ఈవికి గనియై, తావికి జనియై,
యించినగురు సౌజన్యునకై;

ఉత్కళిక

ఆంధ్రులుకట్టిన చెన్నపురంబున
నాంధ్రకృత శూన్యాగనంద రయంబున
నాంధ్రపత్త్రికను గొల్పి, జయంబున
నాంధ్రహిత నల్పి నయంబున డంబున
నాంధ్రుల కుత్సాహము పుట్టించిన,
ఆంధ్రులప్రతిభకు నతులత నించిన,
ఆంధ్రపరేణ్యునకై, గణ్యునకై,
ఆంధ్రశరణ్యునకై, పుణ్యునకై.

శార్దూలము

వాగర్థంబుల కూరిమిం దెలిసి, కా
వ్యంబుల్ రచింపంగ, వి
ద్యాగారంబగు నాంధ్రపత్త్రిక సమ
స్తాంధ్రాళికిం గూర్చి, సీ
తాగప్రాగ్రిమమై విమర్శనములన్
వ్రాయించె నేగేయుఁ డా
నాగేశాఖ్యకళాప్రపూర్ణువలనం
ద్యాగంబు రాగిల్లెడున్.

కళిక

మఱియు భారతభూమి మనుపుధీరునివలన
చెఱ కేగి నేమంబు గుఱియుశూరునివలన
దవ్వ తెలుఁగులఁ బ్రేమఁ దనుపుమహితునివలన
మవ్వంపునెయ్యాలు మలపుహితునివలన,
ప్రత్యేకరాష్ట్రనిర్మాణదీక్షునివలన,
సత్యవాక్పాలనాచరణదక్షునివలన,
విశ్వవిద్యాలయాభీష్టపక్షునివలన,
శశ్వత్కళాపూర్ణచతురశిక్షునివలన;

ఉత్కళిక

యోగీశ్వరునివలన
వాగీశ్వరునివలన,
త్యాగేశ్వరునివలన,
నాగేశ్వరునివలన.

శార్దూలము

శ్రీగౌరీశ్వరునాజ్ఞ భారతధరి
త్రీపూర్ణ కామాప్తికై
భోగాసక్తిని వీడి, త్యాగమహిమం
బూర్ణంబుగాఁ జూపి, కా
రాగారంబునఁ గష్టముల్ గనిన ధైర్య
స్థైర్యవిస్ఫూర్తికిన్
నాగేశాగ్రణికిన్ సమస్తవిబుధా
నందానుసంధాయికిన్.

కళిక

మఱియునుభారతమహిళాసంతతి
మహిమను గాపాడినగుణికిన్
కొఱతలుగలిగిన కూరిమితమ్ముల
కొలఁదులునిలిపిన యగ్రణికిన్
దేశదేశముల నాంధ్రులమహిమను
ద్రిప్పిత్రిప్పి కాచినగుణికిన్
నాశ మెఱుంగని కీర్తి గడించిన
నవ్యమధురవాగ్ధోరణికిన్
ఖండాంతరములనిండినయాంధ్రుల
కష్టము లరయునుదారునకున్
పండితమండలిపై దయఁ జూపిన
భవ్యవిచార విహారునకున్
అమృతాంజనమను నద్భుతవస్తువు
నవనికిఁ దెచ్చిన వీరునకున్
అమరు లెఱుంగనియమృత మిచ్చి యఖి
లాంధ్రులఁ బ్రోచిన ధీరునకున్;

ఉత్కళిక

చేతులు మోడ్చెదను నాగేశునకున్
ప్రీతిని గొల్చెదను నాగేశునకున్
చేతలు రీతులు నాగేశునకున్
ఖ్యాతిగ నొసఁగెదను నాగేశునకున్.

శార్దూలము

శ్రీనిత్యంబయి యొప్పు బాంబయిపురిన్
శృంగారరూపంబుతోఁ
నానాంధ్ర స్తవనీయవాక్యరచనా
నవ్యప్రభావంబుతోఁ
దానాంధ్రంబునఁ బత్త్రికారచన సం
ధానించె నే భవ్యుఁ డా
శ్రీనాగేశ్వరునందుఁ జిత్తములు ని
ల్పన్ నేఁటియాంధ్రాళికిన్.

కళిక

మఱియు నాంధ్రులప్రతిభ
మనుపుకావ్యునియందు,
కొఱలేని నిబ్బరము
కూర్చుదివ్యునియందు
భారతీపత్త్రికా
ప్రకటసేవ్యునియందు,
భారతీయప్రేమ
భరణనవ్యునియందు,

ఉత్కళిక

పరమశాంతునియందు
సరసదాంతునియందు,
రాగశీలునియందు,
నాగేశ్వరునియందు;

శార్దూలము

నీవే తానని, నిన్నె నమ్మి మదిలోఁ,
నీచేత సత్కార్యముల్
నేవేల్ వెల్గఁగఁజేసె; నీకయి నిసు
ర్పించెన్ మహైశ్వర్యముల్;
తానన్నల్ నీవలనన్ గ్రహించె; సత్కీర్తుల్ నీకుఁ గాన్యంబులన్
నీవారై యొసఁగంగఁజేసెఁ గాంచెన్
నీయందు, నాంధ్రీశ్వరీ!

చంపకమాల

సముఁ డధికుండు లేఁడు పుర
శాసనుఁ డొక్కఁడు దక్క; చింతని
క్కము భవదీయవృద్ధికయి,
కాయము వాక్కును బారవోసి, ని
య మరత వెల్గఁజేయునమృ
తాంజనమున్ సృజియించె నాంధ్రి! స
వమలినమైన యాతనియు
దాహరణంబునఁ బ్రీతిఁ బొందుమీ.

ఉత్పలమాల

మండితమండపాకకుల
మండనకామకవీశ్వరాగ్రపు
త్త్రుండు, లసత్కవిత్వపరి
తోషితరాజసభాంతరస్థ సత్
పండిత పార్వతీశకవి
పౌత్త్రుఁడునై తగు పార్వతీశ్వరా
ఖ్యుండు రచించె నాంధ్రకవి
కుంజరతృప్తిగ నీయుదాహృతిన్.



స్వర్గీయ శ్రీ బారు

రాజారావు పంతులుగారు

నండూరి బంగారయ్య

౧

౧౯౩౭-వ సంవత్సరము ఏప్రిలు నెలకు పూర్వము శ్రీ బారు రాజారావుపంతులుగారిని నేను స్వయముగ నెరుగను. కాని వినుకలివలననే వారిపయి నాకు విశేష గౌరవ ముండెడిది.

శాసనసభకు కాంగ్రెసుతరఫున అభ్యర్థులను నిలువబెట్టుటలో బారు రాజారావుగారిని తప్పక నిలువబెట్టవలసిన దని మాయూరిలో ప్రముఖులు కొందరు వల్లభాయి పటేలుగారికి మహజరును బంపుచుండిరి. అప్పుడు నేనుకూడ సంతోషపూర్వకముగ నా కాగితముపయి సంతకము పెట్టితిని. సరి. తరువాత ఎన్నికలు వచ్చినవి. ప్రతికక్షుల కయినను రాజారావుగారిపయి నపవాదలు వేయుటలో వా రీనడుమ నీదేశములోనే లేకుండి రనియు, వారికి తెనుగు సరిగా రాద నియు ఏమేమో స్వల్పాంశములనే ఎత్తుకొనగలిగిరి. వారిగుణగణములనుగూర్చి కాని త్యాగశీలమునుగూర్చి కాని హృదయ పారిశుద్ధ్యమునుగూర్చి కాని ఆక్షేపించుట కే మాత్రము నవకాశము లేకపోయినది.

ఎన్నికకు పూర్వము పండిత జవహర్‌లాలు నెహ్రూగారు మాయూరు దయచేసిరి. విశాలముగ నుండవలెనని యెంచి కాబోలును మాయూరి కాంగ్రెసు కమిటీవారు వారికి పేపరుమిల్లులకు సంబంధించిన యొక జమీందారునింట బస నేర్పాటుగావించిరి. ఈ యేర్పాటును విని నెహ్రూగారు "రాజారావు రాజమహేంద్రవరములోనేగదా వసించు చున్నది?" అని ప్రశ్నించిరట. "అవును"ని ప్రత్యుత్తరము వచ్చెను. "అయితే బస నక్కడ నెందుల కేర్పాటు చేయలేదు?" అని వారు తిరుగ ప్రశ్నించిరట. "వారియింటిలో నిరుకుగ నుండునేమో - సదుపాయముగ

నుండ దేమో యను సంకోచముచే నిట్లు చేయవలసివచ్చినది" అను జవాబువచ్చెనట' అందుపై జవహరులాలుగారు "ఏమాత్రి మవ కాశమున్నను నాకు జాలును. రాజారావు 'నాయింటిలో బస వల్లపడ' దనినచో జూచు కొందము. లేకున్న నే నాతనియింటనే బస చేయుటకు నిశ్చయించితిని" అని పలికిరట. తరువాత మాయిరువురకును పరిచయము కలసిన వెనుక రాజారావుగా రీయుదంతమును గూర్చి ప్రసంగించుచు "ఇదిగో ఇపుడు మనము కూర్చుండిన ఈ గదిలోనే జవహర్ లాల్ జీ బసచేసెను" అని నుడివిరి.

తరువాత కొన్ని దినములకు సరోజినీ దేవి వచ్చెను. అప్పటికి ఎలెక్షనుదండయాత్ర తీవ్రముగ నడచుచుండెను. ఓటర్లను సందర్శించుటకయి పొరుగూరు పోయియుండుటచే రాజారావుగారు నాడు సభలో లేరు. కాని ఆమె రాజారావుగారినిగూర్చి అత్యుక్తి యేమోయని శంకింపదగినంతగ స్తుతించెను. ఆ మాటలు కేవలము ఎలెక్షనునిమిత్తము చెప్పినట్లుగ లేక ఆమె హృదయాంతరాళము నుండి వెలువడిన ట్లుండెను.

"ఇంతటి మహనీయుడు మనయూరిలో వసించుట మనభాగ్యమే. ఈయనకు జయము సిద్ధించును గాక" అని యనేకుల హృదయములలోగౌరవభావములు వికసించుచుండెను. "ఏమియు వోట్లు రానేరావేమో! ఈ ప్రాంతముల వీరి నెవ్వరును ఎరుగరుకదా!" అని కాంగ్రెసువారు జడియుచున్నను తుదకు వారే ప్రథమస్థాన మాక్రమించుచు విజయ మందుట తటస్థించెను. ఎలెక్షను లయిన వెనుక వెంటనే యొకతరుణమున గాంధీగారు వీరికి యాదృచ్ఛికముగ నెదురుపడి "Rajarao, It seems you topped the polls" (రాజారావూ! నీవు ప్రథమస్థాన మాక్రమించుచు విజయమందితివటనే!) అని యభినందించిరట!

౨

నాకును పంతులవారికిని పరిచయమేర్పడిన సన్నివేశములు కొంతవరకు విచిత్రములే. శ్రీరామకృష్ణపరమహంస శతవార్షికోత్సవసందర్భమున మాయూరిలోనున్న రామకృష్ణసేవాసమితివా రీయూర నొక రామకృష్ణమఠము స్థాపింపనెంచిరి. నే నాసమితిలో సభ్యుడను గాకున్నను దానికార్యదర్శియగు బిచ్చి వెంకట్రావుగారు నాకు రామకృష్ణపరమహంసపయి గౌరవ మున్నదని యెఱిగియుండుటచే రాజారావుగారిని తోడ్కొని నాయొద్దకు వచ్చిరి. రాజారావుగారికి రామకృష్ణపరమహంసపయి నున్న భక్తిప్రపత్తులకు మేర లేదు. అందుచే వారిరువురును గలసి రామకృష్ణమఠమునకు చందాలు ప్రోగుచేయుటకయి తమవెంట రావలసినదిగ నన్ను కోరిరి. ఏవో కొన్ని కారణములు చెప్పి నేను నిరాకరించితిని.

తణుకు శ్రీరామకృష్ణశతవార్షికోత్సవమున కధ్యక్షుడు కావలసివచ్చెను. తణుకు పురవాసియగు కీ. శే. ద్రోణంరాజు వేంకటరమణరావు పంతులుగారును, శ్రీ బారు రాజారావు పంతులుగారును నాయొద్దకు వచ్చి నన్ను దాని కధ్యక్షునిగ నుండవలసినదిగ కోరిరి. "మతవిషయములలో మాటాడుటకు నా కధికారము లేదు" అని వారెంత చెప్పినను వినిపించుకొనక నేను మొండిపట్టు పట్టి నిరాకరించితిని,

పై రెండు నిరాకృతులును ఎవ్వరికైన నాగ్రహమును బుట్టింపదగియున్నవి. కాని యవి రాజారావుపంతులుగారి కాగ్రహము నకు మారు ననురాగ ముదయింపజేసెను.

వారును నేనును కలసి సంచరించినది ఒకసంవత్సరముమీద రెండుమాసములకం టె నధికకాలము కాదు. కాని ఈ స్వల్ప కాలములోనే కొన్నిజన్మములకు సరిపోవున గాఢమైత్రిని మేమలవరచుకొంటిమి. ఎవ్వ రితోనయిన ప్రసంగము వచ్చినపుడు "వీరు నాకు ఏకోదరులయిన సోదరునికంటెను అధి కులు"అని వారు చెప్పుచుండగ విని నాలో నేను సిగ్గుపడుచుండువాడను.

వారు నాయెడ వర్షించినయనురాగరస మును వర్ణించుటకు మాటలు చాలవు. నేను వారియెడ పెక్కుసారులు మృదువు దప్పి మోటుదన మనుకొనదగినంత కఠినముగ కూడ వర్తించియుంటిని. వారు దాని కొక్క పర్యాయమైనను కోపగించుకొనుట గానను —అట్టియుదంతము లెన్నో ఇపుడు స్మరణకు వచ్చుచున్నను పరోక్షముగనైన వానిలో కొంతవరకు స్వోత్కర్ష యనివార్యమగుటచే వానిని వీడుచున్నాను. వారినిగూర్చి వ్రా యుటకు నాకున్న యధికారమును సూచిం చుటకయి ఈ మాత్రమయిన నుటంకింపవలసి వచ్చినది.

3

౧౯౧౮ మొదలుకొని ౧౯౩౪ వరకు కాబోలును వారు అఖిలభారతమహాసభకు కొంతకాలము సహాయకార్యదర్శిగను, మరి కొంతకాలము కార్యదర్శిగను ఉండిరి. ఈ యవకాశమును పురస్కరించుకొని గాంధీ, జవహరలాలు, సుభాష్‌చంద్రబోసు, మోతీ లాల్ నెహ్రూ, పటేలు, పండిత మదనమో హనమాలవ్యా మున్నగు మహాసియులతో వారికి పరిచయము లభించినది. కాంగ్రె సులో నుద్యోగములో నున్నంతకాలము నాయకుల కెల్ల వీరు తలలోనాలుకవలె మెలగుచు వారి యభిమానాదరములకు పాత్రు లగుచుండిరి. ఒకసందర్భమున మోతీ లాల్ నెహ్రూగారు "Rajarao is the power behind the throne" అని పలికిరట. వీరి సామర్థ్యమును మెచ్చుకొనుచు జవహర్ లాలు మున్నగువారు వ్రాసిన ప్రశంసలు కాంగ్రెసు రిపోర్టులలో కానవగును.

"ఇంతమంది మహాపురుషులతో పరి చయ మున్నదిగదా- వారిస్వభావ సౌశీల్యా దులకు సంబంధించిన విశేషాంశముల నన్ని టిని క్రోడీకరించుచు నొక చక్కనిపుస్తకము వ్రాయరాదా ?" అని ప్రస్తుతము నరసాపుర ములో న్యాయవాదిగనున్న శ్రీ భమిడిపాటి సత్యనారాయణ (బుల్లెన్న) గారు వీరిని పదే పదే ప్రోత్సహించుచుండిరి. సత్యనారాయణ గారిపట్ల నున్న యనురాగముచే నప్పటికి వీరు 'సరే'యని తలయూపినను ఎప్పుడును గ్రంథరచనమున కుపక్రమించినవారు కారు.

మోతీలాలు నెహ్రూగారితోడను, సి. ఆర్. దాసుగారితోడను వారి కుటుంబము లోనివానివలె సంచరించు చుండెడివారట. మే మిరువురమును కలసి కూర్చుండునపుడు తరచు నాయకులనుగూర్చి విశేషోదంతము లను నుడువుచుండువారు. దాసుగారి దాన మును, నెహ్రూల వైభవమును, మాలవ్యా గారి పవిత్రవర్తనమును నిరూపించుచు దేశ

మున కంతకును తెలిసినయుదంతములు గాక ప్రత్యేకము వీరికిమాత్రమే తెలిసిన యుదంతములు వీరినోట వినుచున్నపుడు ఎంతో యుత్సాహకరముగ నుండెడిది. మోతీలాల్ నెహ్రూగారి కెవరితోడనో కాంగ్రెసువిషయనిర్ధారకసభలో వివాదము తటస్థించినపుడు "భగవంతుడు వచ్చి నాలో తప్పున్నదని చెప్పినను తిరుగబడి నే నాతనితో నీదే తప్పుఅని వాదింపగలశక్తి నా కున్న" దని గద్దించిరట. ఎంత యాత్మ విశ్వాసము! (నెహ్రూగా రుపయోగించినమాటలనే హిందూస్థానిలో వీ రుదాహరించుచుండువారు. నాకు హిందూస్థాని రాకపోవుటచే వానినిట పొందుపరుపలేకుండ నున్నాను). ఒకనాడు కలకత్తాలో బసచేసియుండగ సి. ఆర్. దాసుగారియొద్దకు యాచననిమిత్త మొక యపరిచితుడు వచ్చెనట. అంతట డ్రాయరు తీసి చేతికి వచ్చిననోట్లను అతని కిచ్చిరట. అందులో వందరూపాయల నోట్లెన్నియున్నవో పదిరూపాయలనోట్లెన్నియున్నవో లెక్కచూడనైన లేదట! మరియొకనాడు వీరు దాసుగారితో కలకత్తాలోనున్న రామకృష్ణమఠమునుగూర్చియు, అందున్న శ్రీరామకృష్ణపరమహంస శిష్యులనుగూర్చియు ముచ్చటింపగ దాసుగారు మఠమునొకసారి సందర్శింపవలెనను సంకల్పమును వ్యక్తపరచిరట. "ఇన్నిదినములనుండి మీరీయూరిలోనుండి ఈమఠమునుగూర్చి వినకుండుట ఆశ్చర్యకరముగ నున్నదే" యని రాజారావుగారు పలుకగ "రాజారావు! మనము ఒకమనుష్యులలో లెక్కా?" అని దాసుగారు ప్రశ్నించిరట! ఏమి వినయము? ఇట్టి వింకను అసంఖ్యాకములుగ పేర్కొనవచ్చును. ప్రకృతమున కివి చాలును.

౪

ఒకదృష్టితో జూచినచో - అంతకాలము వీరు కాంగ్రెసులో నుద్యోగ మెట్లు నిర్వహింపగలిగిరాయని నాలో నే నాశ్చర్యపడుచుండువాడను. వీరిసామర్థ్యమును శంకించుటకాదు - వీరిస్వభావమును పురస్కరించుకొని. ఒకరికి లొంగియుండుట వీరిస్వభావములో లేదేమోయని నాయనుమానము. ఇటీవల నేను చూచినంతవరకు ఎవరితో మాటాడిననుసరే ఆజ్ఞాపించినట్లు మాటాడువారుకాని అనునయించుట యెన్నడును గానము వీరికంటె తక్కువవారితోడనే కాదు సమానులతోడను ఎక్కువవారితోడనుకూడ అట్లే మాటాడువారు. ఇంకొకటి, లోపలనున్న యభిప్రాయమును ఎంత యప్రియమయినదానినయిననుసరే మొగము ముందర బ్రద్దలుకొట్టి చెప్పవలసినదే కాని దాపరికము లేదు. అందరికంటెను జవహరులాలు నెహ్రూగారితో వీరి కనుబంధము మెండగుటచే నెహ్రూగారు "రాజారావు — నీవు ఇంతనిష్కపటముగ వర్తించినచో చాలబాధ లున్నవిసుమా" యని అనునయించువారట. అయితే మహాపురుషులమధ్య మెలగుట గనుక వా రంద రీనిష్కపటవృత్తికి మరింత మెచ్చుకొనువారు. అందుచే నక్కడ వీరిగుణగణము మిగుల రాణించెడిది.

ఇక్కడకు వచ్చి ఎలెక్షనులలో దిగిన వెనుకగూడ నిట్లే వీరు సంచరించుచుండువారు. ఏమాత్రము కృత్రిమముగాని కాపట్య

ముగాని సహించెడివారు కారు. ఎవరికడనైన కృత్రిమము కాపట్యము నున్నవని అనుమానము తోచిన జాలును- వీరు వారితో గర్భనిర్భేదకముగ మాటాడువారు. ఇందువలన నిచ్చటికొందరు ప్రముఖులకు వీరిపయి నాంతర్యమున నయిష్టత యుదయించియుండవచ్చును ఈ గుణము పూర్ణముగ మంచి దని నేను వాదింపను. ఒకరినిగూర్చి మన కెట్టి యభిప్రాయ మున్నను అది వారిముఖము మీద చెప్పుట మంచిది కాకపోవచ్చును కాని అది పంతులవారిస్వభావము. మరియు ఎట్టివారినయిన వీరు సులభముగ నమ్ముచుండువారు. "ఈ చెప్పెడివారి కేమయిన స్వప్రయోజనపరత్వముండి చెప్పకూడదా?" అనువిచక్షణ ముండెడిది కాదు.

అయితే వారిచరిత్రము స్ఫటికశిల వంటిది. మనసా - వాచా - కర్మణా రామ బాణమువలె దానికున్న లక్ష్యశుద్ధి అద్భుతావహము. చెప్పేమాటకు చేసే చేతకు ఏమాత్రము వ్యత్యాస ముండదు. శాసనోల్లంఘనోద్యమమున వీరు జెయిలుకు పోయివచ్చినారనుట సుప్రసిద్ధమే! అంతేగాదు. ఎందునను బొందకుండ నలువదిమూడవసంవత్సరమున కాంగ్రెసు ఉద్యోగమునుండి వీరు విరమింప వలసిన పరిస్థితు లేర్పడినవి. దానికయి ఎన్నడును వీరు చింతించి యెరుగరు. ఇటీవల శాసనసభలో ప్రవేశించిన వెనుక, వెనుక కాంగ్రెసులో వీరికున్న యనుభవము నుపయోగించుకొనుటకయిన కాంగ్రెసుపక్ష నాయకులు పార్లమెంటరీ సెక్రటరీపదవి నొకదానిని వీరి కిచ్చెద రేమో యని దేశమున ననేకు లాశపడిరి. దానికి భిన్నముగ పరిస్థితు లేర్పడినను కాంగ్రెసుపట్ల నున్న భక్తిప్రపత్తు లేమాత్రము వీరికి తగ్గలేదు.

అన్నిటికంటెను వీరిలో నా కాశ్చర్యముగ గనవచ్చినది వీరిధైర్యము. పెద్ద కుటుంబము. ఇంకను పెండ్లి చేయవలసిన యాడపిల్లలు- చదువుకొనుచున్న మగపిల్లలు నున్నారు. నిలువచేసిన ధనము లేదు. ఋణము చేసి ఎలెక్షనులలో దిగవలసివచ్చినది. ఇట్టి పరిస్థితులలో నయినను ఎన్నడును వీరు భావిగతినిగూర్చి యాందోళనపడుట లేదు. ఎప్పుడును ఆముఖారవిందము చిరునవ్వులతో కళలాడుచుండెడిది. ఎంతసేపు మాటాడినను హాస్యరసపూర్ణముగ కులాసాగా మాటాడుటయేగాని దైన్యమునకు తా విచ్చుటలేదు. ఈవిషయమున వారిని నే నెంతో శోధించిచూచితిని. కాని యెన్నడును వారు నిరుత్సాహముతో మాటలాడినది లేదు. పెక్కుఱు దీనికి కారణము జ్యోతిషములో వీరికున్న ప్రబలవిశ్వాసమే యనియు, ఇంకను ఏదో పెద్దపదవి వచ్చునను నాశ యుండుటచే నంత యుత్సాహము వహించుచుండి రనియు నాతో ననుచుండువారు.

కాని నాకు జూడగ భగవంతునియందు వీరి కున్న నమ్మకమే ఈ యుత్సాహమునకు కారణ మని తోచుచున్నది "పరిస్థితులు విషమముగ నున్నవే" యని అప్పుడప్పుడు నేను పలుకుచుండగ "ఏమియు భయము లేదు. అన్నిటికి "ఠాకూ" రున్నాడు" అని వారు ధైర్యము వహించుచుండిరి. "ఠాకూ" రనగ భగవంతు డని యర్థము. శ్రీరామకృష్ణపరమహంసను గూర్చి బంగాళీదేశమున వారిభక్తులు "ఠాకూ" రని వ్యవహరింతురు.

౪

కలకత్తాలో వీరు యూనివర్సిటీవిద్య నభ్యసించిరి. ఆతరుణమున వీరికి శ్రీరామ కృష్ణమఠమునందలిసన్న్యాసుల సాంగత్యము లభించెను. అప్పటికి రామకృష్ణుని భార్య బ్రదికియున్నది. పరమహంస శిష్యులలో వివేకానందుని తరువాత పేర్కొనదగిన బ్రహ్మానందస్వామి (రఖలుమహారాజు) మఠాధిపతిగ నుండువాడు, రాజారావు పంతులుగారు వీ రిరువురను బాగుగ నెరుగుదురు. మొన్నటివరకు మఠాధిపతిగనుండిన విజ్ఞానానందస్వామియు, వారికి పూర్వముండిన శివానందస్వామియుగూడ పంతులవారి నధికాదరముతో జూచుచుండిరి. కాంగ్రెసు వ్యాపారములనుండి తీరికయున్నపుడెల్ల, వీరు మఠములో గడపుచుండిరి. అందుచే శ్రీరామకృష్ణ పరమహంస భగవదవతారమని వీరికి గట్టినమ్మక ముండెను. ఈనమ్మకమే వీరిజీవితమునకు జీవగఱ్ఱ యని చెప్పవచ్చును.

దానికితోడు వీరికి కొన్ని విలక్షణములయిన యనుభవములుకూడ కలిగి ఈనమ్మకమును మరింత దృఢపరచినవి. ఒకమారు అలహాబాదులో నుండగ వీరికి జిగట విరేచనములు నెత్తురువిరేచనములు వెల్లుచుండినవట. ఒక్కొక్కప్పుడు పూర్ణముగ నెత్తురే పడుచుండెడిదట. ఆసమయమున జవహర్ లాల్ మున్నగు వీరిమిత్రులు వీరిజీవితమును గూర్చి నిరాశచేసికొనిరట. వీరుకూడ తమజీవితమునుగూర్చి నిరాశచేసికొనగ ఒకనాటి రాత్రి శ్రీ రామకృష్ణ పరమహంస దివ్యదర్శనము (Vision) లోన గనవచ్చి యభయహస్త మిచ్చెనట. అదిమొదలుకొని వ్యాధి నుల్లుమొగము పట్టెనట! ఇట్లే ఇంకను ఎన్నో యనుభవములను నిదర్శనములను వీరు వ్రాయుచుండువారు.

ఎవరిచిత్త సంస్కారమును బురస్కరించుకొని వారు వీనిని నమ్మిన నమ్మవచ్చును; నమ్మకున్న మానవచ్చును కాని వీనివలన పంతులవారి హృదయ మెంత సరళమయినదియు, విశ్వాస మెంతదృఢమయినదియు విస్పష్టము గాకమానదు. పసిబాలురను గూర్చి పలుకుచు ఏసుక్రీస్తు "Of such is the kingdom of Heaven" అన్నాడు— రాజారావుగారుకూడ శిశువువలె మిగుల సరళస్వభావులు; పవిత్రవర్తనులు.

౫

జూన్ ౭-వ తేదీని నేను హిందూసమాజములో గూర్చుండియుండగ మరువాడ్ పఠయనులుగారు వచ్చి "రాజారావుగారికి నిన్న రాత్రి ౧౨ గంటలు మొదలుకొని జ్వరముచే అపరిమితముగ బాధపడుచున్నారు" అని చెప్పిరి. ఇవి వేసంగిసెలవు లగుటచే నేను ఇంచుమించుగ ప్రతిదినము సాయంకాలమును సమాజమునకు పోవుటకుముందు రాజారావుగారియింటిలో కాలక్షేపము చేయుచుండువాడను. అక్కడకు చయనులుగారు కూడ వచ్చుచుండువారు - "అతిస్నేహః పాపశంకీ" యనినట్లు చయనులుగారికబురు వినగనే నాకు కంగారుతోచినది.

౯-వ తేదీని రాజారావుగారిని చూడ బోయితిని. అప్పటికే వారియవస్థ ప్రకోపించి యుండవచ్చును. అంతలో నిద్ర - అంతలో జాగ్రదవస్థ-దీనినే మనవారు మగతగమ్మట యని పేర్కొందురు. కాని యానాడు వారు నాతో మామూలుగ మాటాడిరి. నామీాఁద

చేయివైచి బుజ్జగించిరి. ఏవో కొన్ని హాస్యోక్తులుకూడ పలికిరి. అయినను అప్పటికే వారిబాధ మిగుల దుర్భరముగ నుండెను. ఆబాధను నేను చూడజాలకపోయితిని. ఒకటిరెండుగంటలు కూర్చుండి బలవంతముగ సెలవుపుచ్చుకొని యింటికి వచ్చితిని. మరునాడు పోవుదమని యెంతప్రయత్నించినను మనసు వెనుకకీడ్చినది. ఎవ్వరయిన బాధ కొంత తగ్గిన దని చెప్పువరకు పోరా దనుకొంటిని. అంతబాధపడుచున్నను మరణము వారి కంతసమీపముగ నున్నదని నేనుకూడ అప్పటిలో ననుమానింపలేదు.

ఆపరేషను చేయగ చీము వచ్చినదని కబురు వచ్చినది. దానితో నాకు కంగారు మరింత హెచ్చినది. ౮-వతేది మధ్యాహ్నము ఒంటిగంటకు వారిని చూచితిని. ఆయాసము హెచ్చుగ నున్నది. మొగము కళదప్పినది. పూర్ణముగ సంధించినది. వారు సన్నానవాలు పట్టలేదు. "ఇక్కడకు మీరేలాగున వచ్చితిరి ?" అని యేమేమో యసంగతముగ మాటాడజొచ్చిరి. నేనీవలకు వచ్చితిని. వారికుమారులు గోవిందుడు, కృష్ణుడు అనుబాలురు (మొదటివానికి పదునాల్గు, రెండవవానికి పదియేండ్లుండవచ్చును తండ్రి పరాకుమాటలకు నవ్వుచుండిరి. పాపము! వా రెట్టియవస్థలో నున్నదియు వారికి తెలియదు. నాకు గుండె చెరువయినది. అక్కడ నిలువలేకపోయితిని. వారు తెలివిగ నున్నప్పుడు మాటాడుట కయిదవతేదియే కడసారి. ఆరవతేదినుండియు సంధి ప్రవేశించినది.

* * *

వారివియోగము నన్నిప్పుడు తెలుగుట్టినట్లుగ బాధపెట్టుచున్నది. నాకే యిట్లుండగ వారికుటుంబమున కెట్లుండవలెనో ? చీము ; చితుకు ; పెండ్లికాని మూడుపిల్లలింకను పసివారు, మగపిల్లలయినను- పెద్దవాడు నాలుగవఫారము చదువుచున్నాడు. అన్నిటికంటెను హృదయవిదారకము డెబ్బదియేండ్ల వృద్ధురాలు- తల్లి జీవించియున్నది. "మాతల్లిగారి నెట్లయినను సుఖపెట్టుటయే నాజీవితమునకు పరమావధి" అని వారు నాతో ననుచుండువారు. జీవించినదినములలో మాతృదేవతను వారు కడు శ్రద్ధాభక్తులతో పూజించిరి.

వా రింక పదిపండ్రెండుదినములకు పోయెద రనగ నొకనాడు మట్టమధ్యాహ్నము ౨ గంటలకు మాయింటికి వచ్చిరి. కొంతసేపు సద్గ్రంథకాలక్షేపము నడచినది. ఒకయోగిశరీరత్యాగమునుగూర్చి మేము ముచ్చటించుకొనుచుంటిమి. అకస్మాత్తుగ పంతులవారు ధ్యాననిమగ్ను లయిరి. కొంతసేపటికి కనులు తెరచి "దివ్యదర్శనములో నా కొకమండుచున్నచితియు, దానిప్రక్కనే వేణు వూదుచున్న గోపాలుడును గోచరించిరి" అని పలికిరి. అప్పుడు నాకుగాని, వారికిగాని దానియర్థము బోధపడలేదు. ఇప్పుడు "దానియర్థ మిదియేకాబోలు" నని నేను పోల్చుకొనుచున్నాను. నాయూహ ఎంతవరకు సరియైనదో ఎవరు చెప్పగలరు ? ఏమయినను వారికి సద్గతి తప్పదనుటకు వారి పరిశుద్ధజీవితమే నిస్సందేహమైనతార్కాణము,

మధురగీతి

బొడ్డు బాపిరాజు

సుప్రసన్న శరచ్చంద్రికా ప్రశాంత
హృదయమును చీల్చుకొని ప్రవహించివచ్చు
మధురగీతిక ఏ రాగమయుని మురళి
తొనకినదో లేతగుండెలోతులను దడుము.

ప్రసవయౌవతనిశ్వాసపరిమళముల
బరువుతో తూలిపడు గాలిబాటలందు
క్రిక్కిరిసిపోవు ఆమురళీస్వరమ్ము
మారుమ్రోగెను వనధిగంభీరఘోష.

విపులసికతాతలమ్ము, నిర్వేలసలిల
నీరధి, సహస్రతారకాహారశోభి
తాంబరము, వేణుగీతారవంబు నన్ను
అమృతభావనాస్వప్నతీరముల దేల్చె!

కట్టెదుట లేచె నొకచిన్ని కారుమబ్బు
అది చెదర నిల్చె విశ్వమోహను డొకండు
అతడె కాబోలు నాయశోదార్భకుండు
తలను పింఛము, కెంగేల గలదు వంశి.

అబ్జసుందరనయనద్వయాంచలముల
విరియుదరహాసముల ప్రకాశించ మూగ
ఊగె నాలోని ప్రణయరసోజ్జ్వలమ్ము
లైనభావపరంపర లానుపూర్వి.

కోమలతమాలతరుసూచి శ్యామలమ్ము,
విమలయమునాసరిత్పులినగణములు, సుమ
లతాలయమ్ములు, బృందావనాభిరామ
శాద్వలము లొక్కటొకటి సాక్షాత్కరించె.

ఏను గోపిక నయి చిరాభీష్టసరణి
కనుచు సమ్మోదబాష్పవాహినుల మునిగి
హృదయసర్వస్వమును సమర్పించుకొనుటకు
కరములను మోడ్చుకొంటి శ్రీచరణసీమ.

ప్రాణవల్లభు డల్లగోపాలబాలు
కృష్ణపరదైవతమ్మంత కెంపుతాలుకు
పెదవి పిల్లనగ్రోవి పెంపెల్లగూయ
నరుణతరుణాంగుళీకలాస్యమ్ము నెరపె.

జాలుగా, తేనెచాలుగా సాగిపోవు
ఆమధురగీతికాప్రవాహమ్ములోన
అంబునిధి, తారకలు, భూనభంబులున్
భువనము మేనును లీనమైపోయినాము.


మృదుకరస్పర్శమున కైపువదలగనుల
నెదుట సఖి, పిమ్మట నగాధశూన్యత గంటి!
పొంగిపడి, సుళ్లుతిరిగి, తరంగలై
మనసులో ఘోషపెట్టు నామధురగీతి.

ఆణిముత్తెము

చివుకుల రామావధాని

సముద్ర జలమందు ముత్యపుచిప్పలు నీటిపై తేలుచు స్వాతికార్తియందు పడు వానకై ఎదురుచూచుచుండు ననియు, ఆవాన చినుకులు ఆచిప్పలందు పడినపు డవి మూసికొని అడుగెక్కి నీటిలో మునుగు ననియు, చిప్పలలో ఇమిడియున్న నీటిచుక్కలే ఆణిముత్తెము లగుననియు మనవా రందురు. మరియు ఫణిఫణములందును, ఏనుగు కుంభస్థలములందును మేఘములందును, వరాహ దంష్ట్రలందును, శంఖములందును, వెదుళ్లయందును కూడ ఆణిముత్తెములు దొరకునని మనవారి నమ్మకము. కాని, ముత్యపుచిప్పలందే ఆణిముత్తెము లేర్పడు నని శాస్త్రము చెప్పుచున్నది. ఎట్లనగా—

నత్తగుల్లలందు పురుగు లుండును. శంఖములందు పురుగులుండును. పిల్లలాడుకొను గవ్వలు సముద్రమందు దొరకును; ఇందు పురుగు లుండును. మన ముపయోగించునట్టి ఆల్చిప్పలందు పురుగు లుండును. మరియు సముద్రపుటొడ్డున మన మెన్నియో గుల్లలను చూచుచుందుము; కొన్ని కోలగాను, కొన్ని గుండ్రముగాను మరియు అనేక రూపములుగాను ఉండును. ఇట్టిగుల్లలందు అనేకరకముల పురుగు లుండును. ఈపురుగుల కన్నిటికి అవి యుండునట్టి గుల్లలే యిల్లు; పురుగులు తమయిల్లను తమతో మోసికొనిపోవుచుండును. ఇట్లే ముత్యపు చిప్పలందును పురుగు లుండును. ఈపురుగును ముత్యపుచిప్పపురు గందుము. ఒక్కొక్క పురుగునకు రెండువైపుల రెండుచిప్ప లుండును.



ముత్యపుచిప్ప - ముత్యములు

ముత్యపుపురుగున కీచిప్ప లెట్లు లభించును? పురుగు చర్మమునుండి 'కేల్సియమ్ కార్బొనేట్' (సున్నము సంబంధమగు పదార్థము) వెలువడి దానిరెండుప్రక్కల రెండు చిప్ప లేర్పడును. ఇవి శైశవదశయందే యేర్పడును. చిప్పలురెండును సన్నని కండరముల సహాయమున పురుగును అంటియుండును. మరియు నీచిప్పలు రెండును ఒకప్రక్క మాంససహాయమున అంటియుండును. ఈకీలు మడతబందువంటిది. బందును ఆధారముచేసికొని తలుపు లెట్లు ఆడునో అట్లే చిప్పలు కదలును. అపాయసూచనలు అగపడినపుడు పురుగు తన చిప్పలు రెండిటిని తనవైపులాగి ముడుచుకొనును. ఇతరవేళల విప్పును.

ముత్యపుపురుగు సముద్రపు కెరటములకు ఇటు నటు త్రోయబడును కావున కెర

టములతోపాటు అదియు తిరుగవలసివచ్చును. అందుచే నది ఒకచోట స్థిరముగానుండి ఆహారమును సంపాదించుకొనజాలదు. అట్లు కాకుండ దాని పాదమునుండి యొకవిధమగు జిగురుపదార్థము వెలువడును. నీరు తగిలిన తోడనే అది గట్టిపడి దారమువలె నేర్పడును. అట్టిదారముల సహాయమున పురుగు నీటియందలిరాళ్ల కంటియుండును. ఇచ్చ వచ్చినపు డీదారముల త్రెంచుకొని ముత్యపు పురుగు సంచరించును. ఇట్టిశక్తి కలిగియుండుటచేతనే కెరటములవలన త్రోయబడు ఇసుకలో ముత్యపుపురుగు కప్పవడకుండును.

ముత్యమెట్లగును ?

పురుగు చర్మమునకును, గుల్లకును నడుమనున్న సందున ఇసుకరేణువులు ఒక్కొక్కపుడు చిక్కుపడి చెప్పులోనిరాయివలె దానిని బాధించును. చెప్పులో దూరినరాతిని మనము బయటకుతీసి బాధనుండి విముక్తులమగుదుము. ముత్యపుపురుగన్ననో అట్లు తీయలేదు. బాధనుండి అది యెట్లు విముక్తిపొందును? చర్మమునుండి 'కేల్సియమ్ కార్బొనేట్'అను జిగురుపదార్థమును పొరలు పొరలుగా వదలి యిసుకరేణువును కప్పును. అప్పుడది క్రమేణ గుండ్రముగా నేర్పడును. ఇట్లేర్పడినపదార్థమే ఆణిముత్తెము. పొరల సంఖ్యనుబట్టి ముత్యము చిన్నదిగాకాని పెద్దదిగాకాని ఉండును. మరియు ఇతరపురుగులు ఈ పురుగుమాంసమును భుజించుటకు దాని చర్మమందు దూరి బాధించుటయు కలదు. అట్టిపురుగులకు పరాన్నభుక్కులు అనిపేరు; అనగా మానవులను ఆశ్రయించుకొని వారి తలలందుండి రక్తమును త్రాగునట్టి పేలవంటివి. అట్టిపురుగులబాధనుండి తప్పించుకొనుటకు ఆ పురుగుచుట్టు 'కేల్సియమ్ కార్బొనేట్'ను కప్పును. ఆణిముత్తెము లేర్పడు మార్గ మిది యొకటి. ఈ రెండువిధముల నేర్పడునవి శ్రేష్ఠమైనవి. ముత్యము లేర్పడు మార్గ మింకొకటికూడ గలదు. ముత్యపు చిప్పలకు ఒత్తిడితగిలినపుడు చిన్నచిన్న ముక్కలూడి పురుగుచర్మమునందు గ్రుచ్చుకొనును. అట్టిసమయమందు 'కేల్సియమ్ కార్బొనేట్'ను చర్మమునుండి విడిచి యా ముక్కలను కప్పును. మంచిముత్యము లేర్పడు మార్గ మిది యొకటి కాని యిట్లేర్పడునట్టి ముత్యములు గోళముగాకాని గుండ్రముగాకాని ఉండవు. ఇవి శ్రేష్ఠమైనవి కావు.

జపాను దేశీయులు మంచిముత్యములను తయారుచేయుటకు ముత్యపుపురుగులను పట్టి వానిశరీరమందు ఇతరపురుగులనుగాని ఇసుకరేణువులనుగాని గ్రుచ్చి పురుగులను నీటిలో వదలి అవి వేరొకచోటికి పోకుండ వలలు పన్నియుంచెదరు. కొంతకాల మగుసరికి పురుగులు 'కేల్సియమ్ కార్బొనేట్'ను విడిచి తమకు బాధనొసగు పదార్థములను కప్పును. అప్పుడు వానిని పట్టి ముత్యములు తీయుదురు.

ఇక ఆణిముత్తెము లెట్లు మనకు లభించునో యోచింతము. ముత్తెపుపురుగులు కొంతకాలమైనపిమ్మట చనిపోవును. అప్పుడు ముత్యపుచిప్పలు నీటియడుగుభాగమున పడును. మానవు లిట్టిచిప్పలను తీసి వాటియందలి ముత్యములను గ్రహించెదరు.

మనదేశమందు తూర్పుతీరమున సింహళద్వీపము మొదలు చెన్నపురిప్రాంతమువరకు ముత్యపుచిప్పలు దొరకును. ఇందు హిందూ

దేశము సింహాళములకు నడుమనున్న పాక్ జలసంధియందు ముత్యపుచిప్పలు ఎల్లప్పుడును దొరకును. మన్నారుసింధుశాఖయందును ఇవి దొరకును.

గంజామ్‌జిల్లాలో శోణపురపు ఉప్పుటేటి యందుకూడ ముత్యపుచిప్పలు దొరకును. అచ్చటిజాలరులు ఈ చిప్పలను తీయుచుందురు.

మరియు కచ్చిసింధుశాఖయందును ముత్యపుచిప్పలు దొరకును. నవనగరపుమహారాజు వీటిని తీయించుచుండును.

ముత్యములను గ్రహించినపిమ్మట చిప్పలను బొత్తములు చేయుటకును, చాకులకు పిడిగాను ఉపయోగింతురు. మరియు వాటిని అలంకారార్థము అనేకవిధములుగా నుపయోగింతురు. కొన్నికొన్ని ప్రదేశములందలి ముత్యపుచిప్పలు భోజనముచేయుటకు తగినంత పెద్దపాత్రలవలె నుండును

ముత్యములు కొన్నిపెద్దవి, కొన్ని నల్లపూసలవలె చిన్నవిగా నుండును. చిన్నముత్యములనే ముత్యపుచూ రనుటయు గలదు. కొన్నిముత్యములు కోలగా నుండును. మరికొన్ని గుండ్రముగా నుండును. ముత్యములన్నియు స్వల్పమగు పసుపువర్ణముతోగూడిన తెల్లనిరంగుగలవి ముత్యములు తళతళ మెరయుచుండును. వీనికి ప్రాశస్త్యము వీని తారళ్యమువలన కలుగుచున్నది. సముద్రపు నీటినుండి తీసిన ముత్యములకు రంధ్రములు గావింతురు. అట్టి ముత్యములను బంగారుతీగెలకు గ్రుచ్చి హారములుగాను పలువిధములగు ఇతర ఆభరణములుగాను ధనికు లుపయోగింతురు. చిన్నముత్యములను మందుగా నుపయోగింతురు.

బొగ్గు, వజ్రములవలెనే నీటియందుండు గుల్లలును ముత్యములును ఒకటే మూల ద్రవ్యముయొక్క రూపాంతరములు. గుల్లను కాల్చినచో సున్నమగును. అట్లే ముత్యములను కాల్చినను సున్నమగును. పూర్వకాలమందు గొప్పగొప్పరాజులు ముక్తాచూర్ణమును తాంబూలమందుపయోగించుచుండెడివా రందురు. భగవదారాధనమందు 'ముక్తాచూర్ణేన సంయుక్తమ్' అని చెప్పుటయు గలదు.

మన దేశమందు స్త్రీ సామాన్యము బొంబాయిముత్యముల నాభరణములందు వాడుచుందురు. బొంబాయినుండి ఈ ముత్యములు దిగుమతి యగుటచే వీనికి బొంబాయిముత్యము లని పేరు వచ్చినది. బొంబాయిముత్యములు గాజుతో తయారగును; పైపొర గాజు. ఈగుండ్రని గాజుగుల్లలందు మైనమును కూరుదురు. పిమ్మట దారములను గ్రుచ్చుటకు అనువగునట్టుల రంధ్రములు చేయుదురు. ఈ ముత్యములు చాల చౌక.

మా అన్నగారి

వకుళమాలిక

చదివిన తరువాత

చిలుకూరి నారాయణరావు

"పుష్పమాలికగనే
పుట్టియుండనయేని,
పూబోణిగా నేను
పుట్టగల్గితినేని,
అతనినే వరియించి
ఆత్మవల్లభునిగా
కౌగిలింతు తనీయ
కంఠమే నేవేళ"

అని పాడినది వకుళ - మాలిక
అనితరాలాపాల - మాలిక
కనికరము పుట్టగా - మాలిక
వినిపించె తన గీతి - మాలిక.

ఏమమ్మ, మాలికా!
యింత బేలవు నీవు,
ఇంత నిస్పృహ నీకు
నేమిటికి జనియించె!
ఎంతో జాణ వటంచు
నెంచియుండితి నిన్న
చెంతనని నీ నాథు
పంతమున గెలువంగ?

వాడిపోలేదు నీ
వన్నెసోయగ మింత,
వాసి తగ్గగలేదు
వలపు నెత్తావులును
సడలిపోలేదు నా
స్తవసూత్రబంధమ్ము,
బడలి యెడబడలేదు
పసనైన పుష్పాలు.

ఆశగలవా నాథు
నీడవై నేవేళ
పాడగలవా ప్రియుడి
ప్రణయ మధుగాథలను
చూడగలవా ధీరు
సుమనోహరాకార
మేడ పోయిన నిల్పి
యిటు చూడు మని పల్కి...

నాథు డేడకు పోయెనే ?—మాలికా !
నమ్మి నిన్నే పూనెనే.

ఎదపైని నీసోకు
గిలిగింతలుగ కదలి
పదనైన ముత్పులక
లుదయింపగా నవియు
ములుకులై గుండెలో
చలచల్లగా నాటి
మెలగి కెలకుచునుండ
నిలువగలడెటు యతఁడు ?

నంగనాచివె మూదువే—మాలికా !
నీనాథు డెటు పోయెనే ?

పూబోణి వౌతావటే—మాలికా !
పూబోణవే కదవటే.


నీరూపు చూపించి
సీతావి వెదజల్లి
నీతాకు నెరయించి
నీపాట వినిపించి
నీతేనె లానించి
నీనాథు చొక్కించి
పంచేంద్రియంబులను
పర్వి యూగిస్తావు,

నీ కేమి కొదవయ్యెనే—మాలికా !
నీ యెమ్మె లిక చాలునే.



బాలిద్వీపము

కే. వి. స్వామి



బాలిద్వీపమునందు నేటికినీ జనులు శివుని పూజించుచున్నారు. నేటికినీ 'బాలి' ద్వీప వాసులు హిందూమతమునే అవలంబించి యున్నారు. 'బాలి' ద్వీపమును 'బలి' ద్వీప మనియు వ్యవహరించుట కలదు.

బాలిద్వీపమునుండి "మేజువాణీ" కట్టు బాలి నాట్యకత్తెలు, ఇటీవల కలకత్తా మొద లగు గొప్పపట్టణములందు నాట్యమునలుపు టకు వచ్చుచు పోవుచునున్నారు. బాలిద్వీప మెచ్చటిది ? దీనికిని మన హిందూదేశమున కును గల లంకె యెద్ది ? కొంచెము పరిశీలిం చెదము.

తూర్పుద్వీప సముదాయముల (East Indies)లో, పెద్దసుండాద్వీపములు (Large Suuda Islands), చిన్న సుండాద్వీపములు (Lesser Sunda Islands), చేరినవి. బాలి (Bali), లంబక్ (Lombok), సంబవ (Sumbawa), ఫ్లోరిసు (Flores), తైమూరు (Timor) ద్వీపములు చేరి చిన్నసుండా ద్వీపము లనబడును. సుమత్రా (Sumatra), జావా (Java), బోర్నియో (Borneo), సెలిబెసు (Celebes), బన్కా (Banka), బిల్లిటన్ (Billiton) ద్వీపములు చేరి పెద్దసుండా ద్వీపము లని పిలువబడుచున్నవి.

బాలిద్వీపము జావాద్వీపమునకు తూర్పుగా నుండి బాలిజలసంధివలన వేరుచేయబడు చున్నది. బాలిద్వీపమునకుతూర్పుగా 'లంబక్' ద్వీప మున్నది. వాలేసులైను అను "ఛానలు" యీ రెండు ద్వీపములను వేరుచేయు చున్నది. 'బాలి'కి దక్షిణమున హిందూ

మహాసముద్రమును, ఉత్తరమున జావా సముద్రమును ఉన్నవి.

బాలిద్వీపముయొక్క విస్తీర్ణము ౨,౦౯౫ చదరపుమైళ్లు. ఇది 'డచ్' (Dutch) వారి స్వాధీనములో నున్నది. సముద్రతీరమున నుండి లోనికి పోను పోను కొండలమయము; అగ్నిపర్వతములు నున్నవి. అందు ముఖ్యమైన అగ్నిపర్వతము (Volc n) 'గునుంగగంగు' (Gununga gung) అని పిలువబడుచున్నది. దీని యెత్తు ౧౦,౪౯౭ అడుగులు. బాలిద్వీపమునకు ముఖ్యపట్టణము "బ్యూలిలెంగు" (ul leng).

బాలిద్వీప మత్యుష్ణ మండలములోని దైనప్పటికిని, ఎప్పుడును అంత వేడిగా నుండదు. దీని ఉష్ణము ౭౦° నుండి ౭౮° ల వరకే యున్నది. బాలియందు మూడువందల రకములయిన తాటిచెట్లు కలవు. ఇందు వాణిజ్యమునకు పనికివచ్చునవి, "సగ్గుతాడి" (Sago Palm), కల్లుతాడి (Todd Palm), చక్కెరతాడి (Sugar Palm). బలమైన సగ్గుతాడి ఒక్కటే ౨౫౦ పౌనుల సగ్గుబియ్యము నియ్యగలదు. క్రూర మృగములలో, పులులు, బన్టంగు (Banteng) అనబడు అడవిపశువులు, ఖడ్గమృగములు, అడవిపందులు, మొసలి కానవచ్చును. లేళ్లుకూడ కలవు.

బాలిద్వీపము చాలఅందమయినది. స్టీమరులో పోవు క్రొత్తవాండ్రు బాలిద్వీపమును తప్పక, దిగి చూడకుండా పోరు. బాలియందు ప్రథమమున హిందూమతము ప్రబలినది, అవతల బౌద్ధమతము ప్రబలినది. క్రీ. శ. ౧౫౧౮ సం॥మున అరబ్బులు తూర్పుద్వీపములందు ప్రవేశించి, మహమ్మదీయ మతమును ప్రవేశపెట్టిరి. ఈద్వీపమందు సముద్రతీరమున మహమ్మదీయు లున్నప్పటికిని, నేటికిని యెక్కువమంది, హిందూమతమునే, అవలంబించి యున్నారు. ఈ ద్వీపమందలి జన సంఖ్య పదిలక్షలు.

జావా ద్వీపమధ్యమున "బోరో బుదర్" (Boro Budur) అను బ్రహ్మాండమయిన రాతిదేవాలయ శిథిలములు నేటికిని గలవు. అవి మనహిందూదేశీయులు కట్టినవే. దేవాలయమును కట్టిన గోడ్లమీద శిల్పపు చిత్రములు వ్రాయబడినవి. జావాయందు ప్రాంబనన్ (Pramb nan), తుంపాంగ్ (Tum ang) అను ప్రదేశములందు కూడ పెద్ద దేవాలయ శిథిలములు కానవచ్చుచున్నవి. అందుచే హిందూమతము తూర్పు ద్వీపములందు బాగుగా ప్రాకుటచే, ఆ సమీపమునందు బాలిద్వీపమందు కూడ బాగా నాటుకొని, నేటికిని నిలిచియున్నది.

బాలిద్వీపమందుండువారిని "బాలినీసు" లని పిలిచెదరు. ఈ జనులు ముఖ్యముగా వ్యవసాయదారులు. వరి విస్తారముగా పండించుచున్నారు. వరిఅన్నమే, వారికి ముఖ్యమైన యాహారము. డచ్ గవర్నమెంటువారు, వీరిని చాల ప్రాముఖ్యతకు తెచ్చి తగిన సహాయము చేయుచున్నారు. వీరిభాష 'బాలినీసు' భాష. వరితరువాత ముఖ్యమైన పంటలు ప్రత్తి, కాఫీ, పంచదార, పొగాకులు.

బాలినీసుమనుష్యులు ఆజానుబాహులు కారు, కొంచెము పొట్టివారు. బహు దృఢకాయులు. బాలినీసు ఆడవాండ్రు అందమునకు ప్రపంచమందు పేరుపొందినారు. ఈ

ఆడవాండ్రు మనవారివలె చీరె కట్టరు, దక్షిణాదివారి గూడకట్టును పోలియుండు "సరాంగు" (Sarang) అను లుంగీని నడుమునకు కట్టుదురు. పైన భుజముల క్రిందనుండి "స్లెండాంగు" (Slendang) అను రంగు వస్త్రమును చుట్టుకొందురు. బీదవారు ఒక్క సరాంగు మాత్రము ధరించి, స్లెండాంగు లేకయే తిరుగుదురు.

ఉంగరములు, కడియములు, తోడాలు బంగారముతో చేయబడినవి ధరింతురు మనవలెనే వారునూ, వింతవింత ఆకారములు కలిగిన రాగిడీబిళ్లలను తలయందు ధరింతురు. వక్కను సున్నమును నమలి పెదవుల నెర్రగా జేసికొందురు. చేతిగోళ్లను గోరంట ఆకుచే యెర్రగా జేసికొనుటవలన పీడ, పిశాచములు వారిదగ్గరకు రావని వారి నమ్మిక.

'బాలిసు' జాతివారికి నాటకములు, కోడిపందెములు, నాట్యము అన్న ఎక్కువ యిష్టము. టోపెంగ్ డలాంగ్ (Topeng Dalang) అనునది, 'బాలి'వారికి చాల ప్రీతికరమగు ఆట. ఇది మన సినానాటకమును పోలియుండును; తోలుబొమ్మలాటవలె నుండును. కాని యిందు నటులు మాటలాడరు, పాడరు. కథమాత్రము నేరొకడు చదువుచుండును. దానికి తగినరీతిని నటులు అభినయమును చేయుదురు. ఇది ఆంగ్లేయదేశపు ("Panto-mime") "పాన్టొమైము" వలె నుండును.

బాలిద్వీపము డచ్ వారియధీనమునకు వచ్చినప్పటికిని, అందు కొంతభాగము, "నేటివ" (Native chiefs) రాజులక్రింద నున్నది. ఈ చిన్నరాజులు నాట్యమునందు నటులను పోషించి, ఆదరించుచున్నారు. ఈ నటులకు "స్రింపు" లని పేరు. మొన్న మొన్నటివరకును యీ స్రింపులు వారిదేశమును వీడి యితరదేశములకు పోవుట నిషేధింపబడెను. కాని యిప్పుడానిషేధము పోయి, విదేశములకు పోయి వారి నాట్యకౌశలమును చూపించుచున్నారు.

ఈ ద్వీపమునకు "బాలి" లేక, "బలి" ద్వీపమని పేరేల వచ్చెను?

కాంగ్రెసు చరిత్ర

(శ్రీ పట్టాభిసీతారామయ్యగారి ఇంగ్లీషుగ్రంథమునకు తెలుగు అనువాదము)

ప్రతి 1-కి ధర రూ. 2 8 0

కొద్దిప్రతులుమాత్రమే యున్నవి. గాన ఆశాభంగము కలుగకుండుటకై తత్‌క్షణమే ఆర్డరులను పంపుకొనుడు.

వర్తకులకు, ఎక్కువప్రతులను తీసుకొనువారికి ప్రత్యేకసదుపాయము గలదు. ఈప్రతులు ఆంధ్రపత్రిక ఏజెంట్లు అందరివద్దను దొరకును.

మదరాసు ప్రభుత్వము:
విద్యాశాఖ వ్యయము

సి. వి. దీక్షితులు

ఈ సంవత్సరము మన రాష్ట్రము యొక్క బడ్జెటునుగూర్చిన సాధారణ చర్చలో ప్రధానమంత్రి మాటలాడుచు హిందూదేశమునందలి పెద్దరాష్ట్రములలో కెల్ల మన రాష్ట్రమునందే విద్యావిషయకమగు వ్యయము అధికముగా నుండుట కొనియాడదగు విషయ మని సూచించియుండెను. కావున వివిధరాష్ట్రములలో విద్యాశాఖకగు వ్యయము, ఆసొమ్ము లభించుచున్న మార్గములు, ఆయాతరగతుల విద్యకు (అనగా ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నతవిద్యలకు ఈసొమ్ము ఏరీతిగా వ్యయ మగుచున్నదియు పోల్చి చూచి, వ్యయము విషయముననేగాక ఫలితములందుగూడ మనరాష్ట్రము మిగిలినరాష్ట్రములకంటె ముందంజ వైచినదా లేదా యను విషయము తరిచి చూచుటవలన కొంత ప్రయోజన ముండకపోదు.

పైనచెప్పిన పెద్దరాష్ట్రములు నాలుగు: మదరాసు, బొంబాయి, బెంగాలు, సంయుక్తరాష్ట్రములు. ఈక్రిందిపట్టికలో విద్యావిషయమై ప్రతిరాష్ట్రమునందును వివిధ ఆధారములనుండియును ఖర్చుపెట్టబడిన సొమ్ము యొక్క మొత్తము ఈయబడినది. విద్యాశాఖ వ్యయమందు సుమారు గత ౧౫ సంవత్సరములనుండియు కలుగుచున్న మార్పులను తెలిసుకొనుటకు వీలగునట్లు ఈ పట్టికయందు మూడు సంవత్సరముల వ్యయము ఈయబడినది. ఇందు ౧౯౨౦-౨౧-వ సంవత్సరము మాంటుఫర్డు సంస్కరణములు ప్రారంభమగుటకు ముందున్నస్థితిని సూచించును; ౧౯౨౭-౨౮-వ సంవత్సరము, సంస్కరణములు అమలులోనికి వచ్చినపిదప వివిధరాష్ట్రములును కేంద్రప్రభుత్వము వారికి చెల్లించవలసిన కప్పములు (మెస్టనుఅవార్డునుబట్టి) మాఫుచేయబడిన పిదప నున్నస్థితిని తెలుపును; ౧౯౩౩-౩౪-వ సంవత్సరము ఆర్థికదురవస్థ ప్రారంభించినపిదప నున్నస్థితి కుదాహరణము.

(1) విద్యాశాఖకయిన మొత్తమువ్యయము (లక్షలరూపాయలలో)

సంవత్సరము	మదరాసు	బొంబాయి	బెంగాలు	సంయుక్త రాష్ట్రములు
1920 - 21	319	268	309	242
1927 - 28	479	391	415	354
1933 - 34	540	398	423	370

(2) వివిధరాష్ట్రములలోని జనసంఖ్య (లక్షలలో)

సంవత్సరము	మదరాసు	బొంబాయి	బెంగాలు	సంయుక్త రాష్ట్రములు
1921	423	193	467	454
1931	467	219	501	484

(3) తల 1 కి విద్యావ్యయము (రూపాయలలో)

సంవత్సరము	మదరాసు	బొంబాయి	బెంగాలు	సంయుక్త రాష్ట్రములు
1921	0-12	1-5	0-11	0-9
1934	1-2	1-13	0-13	0-12

పై వివరములనుబట్టి తేలున దేమనగా ౧౯౨౦-౨౧-వ సంవత్సరముకంటె ౧౯౨౭-౨౮-వ సంవత్సరమున మదరాసులో ౧౬౦ లక్షలరూపాయలు (అనగా నూటికి ౫౦ వంతున) విద్యాశాఖకగు వ్యయము పెరిగినది. ౧౯౨౭-౨౮-వ సంవత్సరముకంటె ౧౯౩౩-౩౪-వ సంవత్సరమున ౬౧ లక్షలు (అనగా నూటికి పదమూడుచొప్పున) వ్యయము పెరిగినది. మొత్తముమీద ౧౯౨౦-౨౧ మొదలు ౧౯౩౩-౩౪-వ సంవత్సరము నాటికి మదరాసులో విద్యాశాఖవ్యయము నూటికి ౬౯ చొప్పున పెరిగినది. ఇక బొంబాయిలోనన్ననో ౧౯౨౭-౨౮-వ సంవత్సరమునాటికి ఈవ్యయము నూటికి ౪౯ చొప్పునను, అటుపిమ్మట నూటికి రెండుచొప్పునను మాత్రమే పెరిగినది. ఇట్లే బెంగాలులో మొదటిలో నూటికి ౨౪ పాళ్లును, పిదప నూటికి రెండుపాళ్లును, సంయుక్తరాష్ట్రములలో మొదటిభాగమున నూటికి ౩౪ పాళ్లును, రెండవభాగమున నూటికి ౫ పాళ్లును వ్యయము పెరిగినది. అన్ని రాష్ట్రములలో కూడ ఈకాలమున, అనగా సంస్కరణములు అమలులోనికి వచ్చినపిదప విద్యాశాఖావ్యయము అభివృద్ధి అయినది. అందునను మొదటిలో ఈ అభివృద్ధి అధికముగానుండుట సహజము; కాని ౧౯౩౩-౩౪-వ సంవత్సరమునాటికి ఈ అభివృద్ధి ఆగిపోయిన దనియే చెప్పవలెను; ఏమనగా ఆర్థికమాంద్యము తలసూపినపిదప వ్యయ మధికమగుటకు సావకాశముకలేదు. ప్రతిరాష్ట్రమును వ్యయము ..డును జనసంఖ్యనుబట్టి యుండవలెను.

తగ్గించుమార్గమునే అవలంబించవలసివచ్చినది; రాబడి తగ్గిపోయినది.

ఒక్కమొత్తమువ్యయమునుబట్టి చూచుటచేత మదరాసుప్రభుత్వమే మిగిలినప్రభుత్వములకంటె విద్యావిషయమున అధికముగా వెచ్చించుచున్నదని చెప్పవలసియున్నది. ఇక పైన ఈయబడిన మూడవపట్టీని బట్టి తలఒక్కంటికి ఎంతసొమ్ము ఖర్చగుచున్నదను విషయమును గమనింతుమేని మరికొంత సంగతి స్పష్టమగును. ఈ విషయమున ౧౯౨౦-౨౧-వ సంవత్సరమునకును, ౧౯౩౩-౩౪-వ సంవత్సరమునకును వివరము ఈయబడినవి. జనాభానుబట్టి తలఒక్కంటికి వ్యయము బొంబాయిలో అధికముగా నున్నది; మదరాసులో అంతకంటె తక్కువ; అటుపిమ్మట బెంగాలును, తుదను సంయుక్తరాష్ట్రములును లెక్కకువచ్చును. ఈ సంఖ్యలను మనము వేరు వేరుదృష్టులతో చూడవచ్చును. ఒకవిధముగా ఆలోచించినయెడల మదరాసుకంటె బొంబాయిలోనే విద్యాశాఖకై ఎక్కువ సొమ్ము ఖర్చగుచున్నది. ౧౯౩౩-౩౪ లో మనము తలఒక్కంటికి రు. ౧-౨-౦ ఖర్చుపెట్టగా బొంబాయిలో రు. ౧-౧౩-౦ ఖర్చుపెట్టినారు. కేవలము మొత్తములనుమాత్రమే తీసుకొని జనాభాను గణింపనియెడల మదరాసునకే అగ్రస్థానము లభించును; కాని అట్లుచేయుట సరియనితోచదు. ఖర్చు ఎప్పు

పైన ౧.వ పట్టికలో పెద్దరాష్ట్రములు నాలుగింటిలోను ఆయాసంవత్సరములలో విద్యాశాఖకై ఎంతద్రవ్యము ఖర్చగుచున్నదో చూచితిమి. ఆ మొత్తములలో కేవలము ప్రభుత్వముచే వెచ్చింపబడుచున్న మొత్తమే గాక, ఇతరబాపతులనుండి విద్యాశాఖకు వచ్చుచున్న రాబడులుకూడ చేరియున్నవి. అవి ఏవనగా — స్థానికసంస్థలు (అనగా లోకలుబోర్డులు, మునిసిపాలిటీలు మొదలైనవి); జీతములు (అనగా పాఠశాలలో విద్యార్థుల నుండి కైకొనబడుసొమ్ము; ఇతరచిల్లరబాపతులు (వీనియందు ప్రజాదాతృత్వముచే విద్యావిషయమున చేయబడుచున్న వ్యయము చేరెను). పై బాపతులనుండి విద్యాశాఖకై ఎంత ఎంత సొమ్ము ఖర్చగుచున్నదో తెలుసుకొనిననేగాని, ప్రభుత్వము ప్రతిసంవత్సరమును ఎంతసొమ్ము వ్యయ మొనర్చుచున్నదో తెలియదు. ఈ క్రిందిపట్టికలో ఆ వివరము లీయబడినవి; ఇందు రూపాయలు లక్షలలో చూపబడినవి.

సంవత్సరము	1920 - 21				1927 - 28				1933 - 34			
బాపతు	మదరాసు	బొంబాయి	బెంగాలు	సంయుక్త రాష్ట్రములు	మదరాసు	బొంబాయి	బెంగాలు	సంయుక్త రాష్ట్రములు	మదరాసు	బొంబాయి	బెంగాలు	సంయుక్త రాష్ట్రములు
ప్రభుత్వము	142	149	109	105	224	201	150	205	246	176	185	198
స్థానిక సంస్థలు	37	41	16	44	65	69	25	45	77	77	34	48
జీతములు	71	38	135	24	90	69	171	53	96	92	187	74
ఇతర బాపతులు	69	35	49	58	100	52	69	50	121	53	68	51
మొత్తము	319	263	309	242	479	391	415	354	540	398	424	371

దీనినిబట్టి తేలున దేమన మదరాసు, బొంబాయి, సంయుక్తరాష్ట్రములలో విద్యాశాఖకగు వ్యయములో ఎక్కువభాగమును ప్రభుత్వమును స్థానికసంస్థలును వహించుచుండగా ఒక్క బెంగాలులో మాత్రము విద్యార్థులవలన వచ్చు జీతములే చాల పెద్ద మొత్తములుగా నున్నవి. మదరాసులో ప్రభుత్వమును, స్థానికసంస్థలును విద్యావిష

యమై చేయు ఖర్చు ౧౯౨౦-౨౧-వ సంవత్సరమున నూటికి ౫౬ పాళ్లయి యుండగా ౧౯౩౩-౩౪-వ సంవత్సరమున ౬౦ పాళ్ల వరకును పెరిగినది. ఇట్టి హెచ్చుదల సంయుక్తరాష్ట్రములలోగూడ కాన్పించుచున్నది. కాని బొంబాయిలోమాత్రము ఈ రెండుబాపతుల వ్యయమును కలిపి ౧౯౨౦-౨౧-వ సంవత్సరములో నూటికి ౭౩ పాళ్లయియుండగా ౧౯౩౩-౩౪-వ సంవత్సరమున ౬౪ పాళ్లవరకును పడిపోయినది. అయితే జీతములవలని రాబడిమాత్రము మంచి అభివృద్ధి చూపినది. ఒక్క బెంగాలులోమాత్రము ఈ రెండుబాపతులును కలిపి ౧౯౨౦-౨౧ లోను, ౧౯౩౩-౩౪ లోను నూరింట నలుబది పాళ్లచొప్పననే నిలబడినది. ఈసందర్భమున ముఖ్యముగా గమనింపదగు విషయమేమనగా ౧౯౨౦-౨౧ మొదలు ౧౯౩౩-౩౪ వరకు గల కాలములో జీతములవలని ఆదాయము మదరాసులో సరియగు అభివృద్ధిని చూపలేదు. బొంబాయిలోను, సంయుక్తరాష్ట్రములలోను జీతములవలని ఆదాయము రెట్టింపుకంటెకూడ ఎక్కువైనది. బెంగాలులో నూరింట ముప్పదియారుపాళ్లు అధికమైనది కాని మదరాసులో హెచ్చుదల మిగిలిన రాష్ట్రములలోకంటె తక్కువగా నున్నది; ౧౯౨౦-౨౧ లో జీతములవలని రాబడి ౭౧ లక్షలు, ౧౯౩౩-౩౪ లో ౯౬ లక్షలు; అనగా వృద్ధి నూరింట **౩౫** పాళ్లుమాత్రమే. ఇందులకు కారణములు రెండని చెప్పవచ్చును; ఒకటి మాధ్యమికవిద్యయు, ఉన్నతవిద్యయు మదరాసులో మిగిలినరాష్ట్రములలో పొందినంత యభివృద్ధి పొందకుండుట, రెండవది మదరాసులో ప్రాథమికవిద్య కగు ఖర్చు అధికమగుటయు, దానికితోడు ప్రాథమికవిద్యను ఎల్లరకును అందుబాటులో నుంచు తలంపుతో ప్రైమరీ స్కూళ్లలో పిల్లలదగ్గరనుండి జీతములు వసూలు చేయుట మానుటయును; బెంగాలులో జీతములవలని రాబడి హెచ్చుగా నుండుట కొకముఖ్యకారణ మున్నది. అచ్చట మాధ్యమికవిద్యయు, ఉన్నతవిద్యయు విశేషవ్యాప్తి నొందుటచేత పైతరగతులలోను కళాశాలలోను చదువుకొనువారి సంఖ్య అధికముగా నున్నది. ప్రైమరీ స్కూళ్ల జీతములకంటె పైతరగతిపాఠశాలలోను కళాశాలలలోను జీతములు మిక్కిలి ఎక్కువగుటచే బెంగాలులో జీతములవలన ఎక్కువరాబడి వచ్చుచున్నది. సంయుక్తరాష్ట్రములలోకూడ జీతములవలని రాబడి హెచ్చుగా నుండుట కిదియే కారణము.

ఇంతవరకును విద్యాశాఖవిషయమున ఏయేబాపతులనుండి ఎంతెంత రాబడి వచ్చుచున్నదో చూచితిమి. ఇప్పుడు విద్యాశాఖకగు వ్యయములో ఏయేరకమువిద్యకై ఎంత సొమ్ము ఖర్చగుచున్నదో చూచుట మంచిది. విద్యాశాఖకగు వ్యయము రెండువిధములైనది; బోధననిమిత్తమగుఖర్చు, పరిపాలనకగుఖర్చు. ఈ రెండింటిలోను బోధనకగు ఖర్చే ప్రధానమైనది. విద్యాబోధన కగు ఖర్చును మూడువిధములుగా విభజించవచ్చును. మనదేశమున గరపబడువిద్య మూడు రకము లైనది: ప్రాథమికవిద్య, మాధ్యమికవిద్య; ఉన్నతవిద్య. ఎలిమెంటరీస్కూళ్లల్లో అయిదవతరగతివరకును గరపబడు విద్య

ప్రాథమికవిద్య. అటుపిమ్మట మిడిల్‌స్కూళ్ల లోను హైస్కూళ్లలోను స్కూలుఫైనలు వరకును నేర్పబడునది మాధ్యమికవిద్య, కళాశాలలలో నేర్పబడునది ఉన్నతవిద్య. ఈ మూడింటిక్రిందను పెద్దరాష్ట్రములు నాలుగింటిలోను ఎంతెంతసొమ్ము వ్యయమగుచున్నదియు ఈక్రిందిపట్టిక తెలుపును. ఇందు రూపాయలు లక్షలలో చూపబడినవి.

సంవత్సరము	1920 - 21				1927 - 28				1933 - 34			
బాపతు	మదరాసు	బొంబాయి	బెంగాలు	సంయుక్త రాష్ట్రములు	మదరాసు	బొంబాయి	బెంగాలు	సంయుక్త రాష్ట్రములు	మదరాసు	బొంబాయి	బెంగాలు	సంయుక్త రాష్ట్రములు
ఉన్నత విద్య	71	12	27	16	25	18	37	25	29	23	36	32
మాధ్యమిక విద్య	17	49	105	55	93	79	137	78	109	88	154	98
ప్రాథమిక విద్య	68	127	52	51	189	198	75	86	234	199	80	93

దీనినిబట్టి కొన్నివిశేషములు తెలుసుకొనదగును. మదరాసులో ౧౯౨౦-౨౧ — ౧౯౩౩-౩౪ సంవత్సరములమధ్య కళాశాలలపై వ్యయము నూటికి ౭౧ పాళ్లను, సెకండరీ స్కూళ్లకగు వ్యయము ౬౧ పాళ్లను, ప్రైమరీవిద్యకగువ్యయము ౧౨౧ పాళ్లను హెచ్చినది. దీనినిబట్టికూడ మదరాసు ప్రభుత్వము ప్రైమరీవిద్య విషయమున ఎక్కువశ్రద్ధ చూపుచున్నదనుట స్పష్టము. ౧౯౨౦-౨౧ లో మదరాసులో కళాశాలలు, సెకండరీస్కూళ్లు, ప్రైమరీస్కూళ్లు వీనికగు వ్యయము ౧: ౪: ౬ వరుసలో నుండగా ౧౯౩౩-౩౪-వ సంవత్సరమున ౧: ౪: ౮ వరుసగా మారినది. బొంబాయిలో ఈమూడింటిలోను హెచ్చుదల నూరింట ౯౨, ౮౦, ౫౭ పాళ్లు అయియున్నది; కావున బొంబాయిలో ప్రైమరీవిద్యకంటె మిగిలినవాని విషయమై ఎక్కువశ్రద్ధ తీసుకొనబడినదని చెప్పనగును. బెంగాలులోను, సంయుక్తరాష్ట్రములలోను ప్రత్యేకముగా గమనింపదగిన మార్పేదియును కానరాదు. ఇంకొకసంగతి ఏమనగా మదరాసులోనున్న, బొంబాయిలోనున్న ఎక్కువసొమ్ము ప్రాథమికవిద్యకై వ్యయమగుచుండగా, బెంగాలులో ఎక్కువసొమ్ము మాధ్యమికవిద్యకై ఖర్చుపెట్టబడుచున్నది. సంయుక్తరాష్ట్రములలో ప్రైమరీ సెకండరీ విద్యలకు మొత్తముమీద సమానముగానే వ్యయమగుచున్నది. ఈనాలుగు రాష్ట్రములలోను కళాశాలలకును సెకండరీ స్కూళ్లకును అగువ్యయమునందు బెంగాలు

అగ్రస్థానమును సహించుచున్నది. ప్రైమరీ విద్యావిషయమున మదరాసు అగ్రస్థానమున నున్నది. ఈ ఒక్కపట్టికను బట్టి మాత్రమే చూచినట్లయిన మదరాసులోను, బొంబాయిలోను నిరక్షరతను పోగొట్టుటకై గట్టి ప్రయత్నము జరుగుచున్నట్లు తెల్లమగును. ఆకారణము చేతనే ప్రైమరీ విద్యకై ఎక్కువ సొమ్ము ఖర్చుచేయ బడుచున్నది. బెంగాలులోను, సంయుక్తరాష్ట్రములలోను ఉన్నత విద్యకై జరుగుచున్న వ్యయము పనిలేని విద్యావంతులసంఖ్యను హెచ్చించుటకు కారణమగుచున్నదా యను సందేహమును కొంత మీయవచ్చును.

కాని ఈసందర్భమున ఇంకొక విషయము గమనింపవలసి యున్నది. వ్యయము యొక్క ప్రయోజనము ఫలితమును బట్టి చూడవలసి యున్నది. ఫలితమును నిర్ణయించుటకు మార్గములు రెండు; విద్య గరపబడుచున్నవారిసంఖ్య, అందులకు తలయొక్కంటికి అగు ఖర్చు. ఈక్రింది పట్టికలో ఆసంగతులు తీయబడినవి. విద్య నేర్చుకొనువారిసంఖ్య వేలలోను, తలయొక్కంటికి అగువ్యయము రూపాయలలోను చూపబడినది.

సంవత్సరము	1920 - 21				1927 - 28				1933 - 34			
బాపతు	మదరాసు	బొంబాయి	బెంగాలు	సంయుక్త రాష్ట్రములు	మదరాసు	బొంబాయి	బెంగాలు	సంయుక్త రాష్ట్రములు	మదరాసు	బొంబాయి	బెంగాలు	సంయుక్త రాష్ట్రములు
కళాశాల	8	5	20	5	13	7	23	10	12	11	25	15
తల 1 - కి	218	240	135	320	-	-	-	-	238	219	143	218
మాధ్యమిక	170	76	360	111	188	109	422	172	208	104	463	232
తల 1 - కి	40	65	29	50	-	-	-	-	52	66	33	42
ప్రాథమిక	1494	807	1457	848	2356	1022	1839	1157	2715	1169	2286	1239
తల 1 - కి	7	16	4	6	-	-	-	-	9	17	3	7

పై వివరమునుబట్టి విద్యాగరపుట బెంగాలులో చౌకయును, మదరాసులోను బొంబాయిలోను ప్రియమును అని తేలుచున్నది. ఏరకము విద్యలో చూచినను బెంగాలులో తలయొకటికి కగుఖర్చు చాల తక్కువగా నున్నది. మదరాసులో ప్రాథమికవిద్యకు తలయొకటికి కగుఖర్చు బెంగాలులో అగుఖర్చు కంటె మూడింతలు జాస్తిగా నున్నది; సంయుక్తరాష్ట్రములలో అగు దానికి $\frac{2}{3}$ రెట్లగుచున్నది (బొంబాయిలో అగు వ్యయములో సగముమాత్రమే యగుచున్న దనికూడ చెప్పవలెను). బెంగాలులో సెకండరీస్కూళ్లలోని ఉపాధ్యాయులు చాలమంది ట్రయినెంగు కానివారగుటచేత వారి జీతములు తక్కువగా నుండుట సహజమే. అయినను చదువుకొను ప్రతిపిల్లవాని విషయమునను బెంగాలులోకంటె మనకు మూడురెట్లు ఖర్చగుటకు అది తగినంత కారణముగా గన్పట్టదు.

వ్యయ మెక్కువయగుచున్నను అందులకు తగినఫలితములు కన్పట్టుచున్నట్లయిన ఖర్చు హెచ్చుగా నున్నదని చింతిల్లనక్కర యుండదు. హెచ్చువ్యయము విద్యచక్కగా కరపబడుటకు జరుగు ప్రయత్నము నైనను లేక సొమ్ము వృథాగా వ్యయమగుట నైనను సూచించవచ్చును. మనరాష్ట్రములో ఎందుచేత వ్యయ మధికముగా నున్నదియు కనిపెట్టవలెను. మదరాసులో ప్రాథమికవిద్య నేర్చుకొను ప్రతి పదుగురకున్ను ఒక్కడు మాత్రమే మాధ్యమికవిద్య నేర్చుకొనుచున్నాడు బొంబాయిలో తొమ్మిదింట ఒకడున్ను, బెంగాలులోను సంయుక్తరాష్ట్రములలోను అయిదింట ఒకడున్ను మాధ్యమికవిద్య నేర్చుకొనుచున్నారు. దీనిని బట్టిమదరాసులో ఎక్కువరద్దుపోవుచున్నదని చెప్పవచ్చును; ఏమన సెకండరీస్కూళ్లలో చదువువారిలో కొద్దిమందిమాత్రమే సెకండరీ స్కూళ్లలో ప్రవేశించుచున్నారు. ఒకతరగతినుండి ఇంకొకతరగతికి పోవువారిసంఖ్య గమనించితే నీరద్దుపోవుచున్నసంగతి ఇంకను స్పష్టమగును. మన మింతసొమ్ము ఖర్చు చేయుచున్నను సెకండరీతరగతుల బాలురకు విద్యయం దెక్కువాభిరుచి కలిగింపలేక పోవుచుంటిమని ఒప్పుకొనవలసి వచ్చుచున్నది. సెకండరీస్కూళ్లలో బాలురు నేర్చుకొను నది చాల తక్కువ. కొంచెము చదువను వ్రాయను అబ్బవచ్చును; కాని సరిక్రజ్ఞాన మంతగా కుదురదు. వారు నేర్చినది సంపూర్ణము కావలెనేని సెకండరీతరగతులలోని వారు సగమునకుపైగా పైతరగతులలో ప్రవేశింపవలెను; లేదా మన సెకండరీస్కూళ్లలో ప్రస్తుతము నేర్పబడుచున్న చదువు ఎక్కువ కట్టుదిట్టముగా నుండి ఇప్పటికంటె ఎక్కువ ప్రయోజనము కలదిగానైనను అయియుండవలెను. ఈవిషయమును బాగుగా పరిశీలించి వ్యయమునందున్న రద్దు తగ్గించి, విద్య యొక్క ప్రయోజనమును హెచ్చించుటకు గట్టియత్నము చేయవలసియున్నది. తలయొకటికగు ఖర్చును మనము తగ్గించగలిగి నట్లయిన ఇప్పుడు ఖర్చగుచున్న సొమ్ముతోనే ప్రాథమికవిద్యకు ఇంకను ఎక్కువ వ్యాప్తి నియగలిగినవార మగుదుము.

పైన ఈయబడిన వివిధములైన వివరములనుబట్టి తేలున దేమన; మాంటుఫర్డు సంస్కరణములకు పిదప విద్యాశాఖ మంత్రుల చేతిలోనికి వచ్చుటచే విద్యావ్యాప్తికి మంచి

అవకాశము లభించెను. అప్పటినుండియు మదరాసులో నిరక్షరతను పోగొట్టుటకై ప్రాథమిక విద్యవిషయమున ఎక్కువశ్రద్ధ తీసుకొనబడుచున్నది. ఇది ప్రశంసనీయమగు విషయమే. కాని ఒక్కవిషయమున మాత్రము మనము జాగ్రత్తగా ఆలోచించి లోపమును సవరించుకొనవలెను. మదరాసులో ప్రాథమికవిద్య విషయమున ఖర్చు ఎక్కువగుచుండుటేకాక రద్దుకూడ విస్తారముగా నున్నట్లగపడుచున్నది. ప్రాథమికవిద్యకు తల ౧ టికగుఖర్చు ఎక్కువగా నుండుటేగాక ప్రైమరీస్కూళ్లనుండి పైతరగతులకు పోవువారిసంఖ్యకూడ తక్కువగా నున్నది. కాబట్టి ప్రాథమికవిద్యకు సంబంధించినంత వరకు విద్యాక్రమము, వ్యయము- ఈ రెండింటినిగూడ ఎక్కువ జాగ్రత్తగా పరిశీలించి పై యధికారులు కట్టుదిట్టము చేయవలెను. ఇప్పుడు ఖర్చగుచున్న సొమ్ముతోనే అధిక సంఖ్యాకులకు ప్రాథమికవిద్య కరపుటకును, చాలచోట్ల ప్రాథమికవిద్య తప్పనిసరి చేయుటకును అవకాశములున్నట్లుతోచుచున్నది. ఒకతరగతినుండి పైతరగతికి పోవునప్పుడు విద్యార్థులసంఖ్య అంతగా తగ్గిపోకుండునట్లు విద్యాధికారులు జాగ్రత్తపడవలెను. ప్రజాసమ్మతమగు ప్రభుత్వము ఈమధ్య అధికారములోనికి వచ్చుటచే విద్యావిషయమున ఎక్కువశ్రద్ధ చూపబడునని ఎంచవచ్చును.

పర్యవసానము

(౧) జనాభానుబట్టి చూచినట్లయిన బొంబాయిలో తల ౧ టికి ఖర్చుపెట్టబడుచున్నంత విద్యావిషయమై మదరాసులో ఖర్చు పెట్టబడుటలేదు. మొత్తముమీద విద్యాశాఖావ్యయము మిగిలిన రాష్ట్రములలోకంటె అధికముగా నున్నను జనాభానుబట్టి చూచినయెడల మన మింకను ఎక్కువ సొమ్ము వ్యయముచేయవలసినట్లు కనబడుచున్నది.

(౨) విద్యాశాఖ వ్యయములో, ముందుగనను ప్రాథమికవిద్య విషయమున రద్దు తగ్గుటకు గట్టిప్రయత్నము చేయవలసియున్నది.

(౩) ప్రాథమికవిద్యయొక్క ప్రయోజనమధికముగా నుండుటకును, ప్రైమరీస్కూళ్లనుండి ఎక్కువమంది పైతరగతులలో చేరుటకును యత్నించవలెను.

(౪) ప్రాథమికవిద్యకు మదరాసులో ఎక్కువసొమ్ము వ్యయమగుచుండుట గర్హింపదగు విషయమే కాని అట్లని ఉన్నతవిద్యకగు ఖర్చును తగ్గించి ఆవిషయమున అనాదరము చూపకుండ జాగ్రత్తపడవలెను. ప్రాథమిక విద్య వృద్ధిచేయుట ఎంతఅవసరమో ఉన్నత విద్యను మంచిస్థితిలో నుంచుటకూడ అంత అవసరము. పనిలేని విద్యావంతులసంఖ్య తగ్గింపవలెనన్న ఉన్నతవిద్యయం దనాదరణము చూపుటకంటె ఉన్నతవిద్యయొక్క పద్ధతిని మార్చి పారిశ్రామికవిద్య నేర్పుటకు మార్గముల నన్వేషింపవలెను.

ఆంధ్రదేశముపైకి దక్షిణాదిబ్యాంకుల దండయాత్ర

దోర్బల శోభనాద్రి శాస్త్రి

ఆంధ్రదేశంలో సుమారు పదిహేను ఏళ్లకిందట బ్యాంకులంటే ఏమిటో జనసామాన్యానికి తెలియదు. అక్కడక్కడ ఇంపీరియలు బ్యాంకు బ్రాంచీలు వుండేవి. కాని వాటి ప్రాంతాలకు ఎవ్వరూ వెళ్లేవారు కారు. కారణం ఏమిటంటే వాటియాజమాన్యం దొరలచేతుల్లో వుండేదని కాదు (క్యాషుకీపర్లు మనవాళ్లే వుండేవాళ్లు). అప్పు కావలసినా సామాన్యులకు అప్పు పుట్టేదిగాదు. డబ్బుకలవారు ప్రోనోట్లపైన అప్పు లివ్వడమేగాని బ్యాంకులలో దాచుకోవడం ఎరగరు. అప్పులకోసం వర్తకులు మాత్రమే బ్యాంకులకు వెళ్లేవారు. గొప్ప గొప్ప గవర్నమెంటు వుద్యోగస్థులు 'గవర్నమెంటు బ్యాంకు' అనేనమ్మకంతో నైతేనేం, వారికుండే ఇతర సౌకర్యాలవల్లనైతేనేం, తమడబ్బును ఇంపీరియల్ బ్యాంకులోనే దాచుకుంటూ వుండేవారు. కాబట్టి దొరలకీ, గొప్ప గవర్నమెంటు వుద్యోగస్థులకీ, అప్పులు కావలసిన పెద్దపెద్ద వర్తకులకీ ఇంపీరియలు బ్యాంకువారు కావలసిన సదుపాయాలు చేసేవారుగాని జనసామాన్యానికి అందుబాటులో వుండేవారు గారు.

ఇట్టి సందర్భాల్లో సహకారోద్యమం ప్రారంభమైంది. ప్రతిపల్లెలోనూ, పట్టణంలోనూ కో-ఆపరేటివు బ్యాంకులు వెలిశాయి. ఇవి గవర్నమెంటువారి ఆధ్వర్యంలో వుండి, అందువల్ల ధనసహాయం బాగా వుండడంచేత వ్యవసాయదార్లకు అప్పులు ఇవ్వడం విరివిగాజరిగింది. కాని యీ బ్యాంకులమేనేజిమెంటు, వ్యవహారంలో అనుభవం లేనివారిచేతుల్లోను, లేదా కేవలం అప్పులు కావలసినవారి చేతుల్లోను పడడంవల్ల డబ్బున్నూ వ్యవహారజ్ఞానమున్నూ కలవారు ఈ ఉద్యమంలో చేరకుండా దూరంగా ఉండిపోయారు. కాబట్టి పట్నవాసాల్లో ఇంపీరియలు బ్యాంకుల మోస్తరుగానే పల్లెలలో కో ఆపరేటివు బ్యాంకులు కూడా కేవలం అప్పులు ఇచ్చే సంస్థలు అయినవి. కొంతమంది గవర్నమెంటు ఉద్యోగులు అక్కడక్కడ పట్నవాసాల్లో తమడబ్బును ఎక్కువవడ్డీ ఇస్తారు కాబట్టి ఇంపీరియలు బ్యాంకుకుబదులు వీటిలోనే వేసుకునేవారు



దోర్బల శోభనాద్రిశాస్త్రిగారు

పర్యవసానం ఏమిటంటే, డబ్బున్నవారు ఈ బ్యాంకులలో డబ్బును దాచుకోడానికి అలవాటుపడనూ లేదు; ప్రోనోట్లమీదా తణఖాలమీదా అప్పు లివ్వడం మాననూ లేదు.

ఈ కారణాలవల్ల ఆంధ్రదేశంలో బ్యాంకులంటే అప్పులుపుట్టే ఆఫీసు లనేతప్ప డబ్బు దాచుకునే సంస్థలన్న అభిప్రాయం కలగడానికి అవకాశం కించిత్తూ లేక

పోయింది. ఇట్టి పరిస్థితుల్లో చెన్నరాజధానిలో పెద్ద సంస్థయైనటువంటి ఇండియనుబ్యాంకువారు ౧౯౨౭ సంవత్సరంలో గుంటూరులోనూ ఆనుట్టు ప్రక్కలవున్న పట్టణాల్లోనూ బ్రాంచీలను పెట్టి లక్షలకొద్దీ డబ్బును వర్తకులకూ వ్యవసాయదార్లకూ అప్పులిచ్చారు. అంతే కాని డిపాజిట్లను ఆకర్షించడానికి ప్రయత్నంచేయ లేదు. వీరిని చూసి హిందూస్థాన్ బ్యాంకువారుకూడా బెజవాడలో బ్రాంచిపెట్టి అదేపంథా తొక్కారుగాని డిపాజిట్లసంగతి వారూ ఆలోచించలేదు. అందువల్ల బ్యాంకు లంటే అప్పులిచ్చే సంస్థలుమాత్రమే అన్న అభిప్రాయం దృఢపడ్డది.

బ్యాంకులనేవి తమ స్వంతధనంతో వ్యాపారం చేసే సంస్థలు కావు. ఇతరులసొమ్మును డిపాజిట్లుగా పుచ్చుకొని, ఆడిపాజిట్లమీద ఇచ్చేవడ్డీకంటె ఎక్కువ వడ్డీకి అప్పు లిచ్చి లాభం సంపాదించి వాటాదార్లకు పంచిపెట్టేవి.

ఇంపీరియలుబ్యాంకువారు గవర్నమెంటు, మునిసిపాలిటీలు, జిల్లాబోర్డుల బాపతు సొమ్మును వడ్డీ లేకుండాగాని, స్వల్పవడ్డీతోగాని తమవద్ద డిపాజిట్లుగా వుంచుకొని అప్పులిచ్చేవారు. కో ఆపరేటివు బ్యాంకులు తమ డిపాజిట్లలో విశేషభాగం మద్రాసులోవున్న కేంద్రసంస్థయైన ప్రావిన్షియలు కో ఆపరేటివు బ్యాంకు ద్వారా తెచ్చుకొనేవి. ఇండియనుబ్యాంకు, హిందూస్థానుబ్యాంకులు దక్షిణాదినుంచి వచ్చే తమ డిపాజిట్లను లాభకరంగా అక్కడ వినియోగపర్చడానికి తగిన అవకాశాలు లేక మనదేశానికి తెచ్చి, మనకు అప్పులిచ్చి లాభాలు సంపాదించి, ఆలాభాలను తమవాటాదార్లకు పంచిపెట్టుకునేవి.

ఆంధ్రదేశానికల్లా ఏరికోరినట్లు ఒక్కసంస్థ మాత్రం వుండేది ౧౯౨౩ లో ఆంధ్రబ్యాంకును బందరులో స్థాపించారు. లక్షరూపాయలు మూలధనం; అయిదారులక్షల రూపాయలు డిపాజిట్లు ; డిపాజిట్ల పైన అర్ధరూపాయి వడ్డీ; అప్పులపైన మూడుపావలాలు; ఈమాత్రం వ్యాపారంతోనే వాటాదార్లకు సాలుకు నూటికి ౧౨ రూపాయల చొప్పున ఐదు సంవత్సరాలు లాభాలు అవిచ్ఛిన్నంగా పంచిపెట్టారు.

ఆంధ్రదేశంలో బందరులాంటి పట్టణంలో ఒక చిన్న సంస్థను లేవదీసి ఇంత దిగ్విజయంగా ఐదు సంవత్సరాలు వ్యాపారం జరిపినప్పుడు ప్రతిపట్టణంలోనూ ఒక చిన్న బ్యాంకు లేవవలసింది. కాని బందరులో తప్ప తెలుగు దేశంలో కొంతనిరసన; కొంతనిర్లక్ష్యం. బందరువారు కొత్తదారులను తొక్కగలరా అని సందేహం, పైగా అనుమానం; తొక్కినా కొనసాగించలేరని అభిప్రాయం.

౧౯౩౦-వ సంవత్సరంలో ధాన్యపుధరలు హఠాత్తుగా పడిపోవడం, రైతులు కుంగిపోవడం, భూములధరలు పూర్తిగాతగ్గడం, ఋణదాతలు అపారంగా నష్టపడడం సంభవించింది. దేశకాలపరిస్థితులు మారేదాకా డబ్బు ఇతరులకు అప్పులివ్వడంకంటె బ్యాంకుల్లో దాచుకోవడమే శ్రేయస్కరమని అందరికి తోచింది. అప్పట్లో తణఖాపత్రావేజాలమీద కొంత వ్యామోహం వుండేది గాని ఋణసమస్య అమలులోకివచ్చిన ఋణశాసనంతోటి ఆవ్యామోహం నిర్మూలమైంది. అందువల్ల డబ్బు దాచు కోడానికి ఋణదాతలదృష్టి బ్యాంకులపైకి మళ్లింది.

ఆంధ్రబ్యాంకువారు ౧౯౩౫లో తమ పట్టణ దృష్టిని వదిలివేసి ఆంధ్రదేశమంతా తమ బ్రాంచీలను వ్యాపింపచేద్దామనే వుద్దేశంతో ప్రప్రథమంలో కాకి నాడలో బ్రాంచిని స్థాపించారు; ౧౯౩౮ సం||రం వచ్చే సరికి మొత్తంమీద ఆరు ఆఫీసులతో నడిచిస్థానికంగానూ ఇంపీరియలుబ్యాంకుతో సాటిగా వ్యవహారం నడిపేవారు. ప్రతిచోటా పేరూ ప్రతిష్ఠా సంపాదించారు.

కాని ఆంధ్రబ్యాంకు వంటి సంస్థ ఐదుసంవత్సరాలు దిగ్విజయంగా పనిచేసి ఆతరువాత పట్టణాల్లో బ్రాంచీలు పెట్టి ఇంపీరియలు బ్యాంకుతో పోటీగా పని చేస్తూవుంటే ౧౯౩౦ సంవత్సరం తరవాత, కాలమాన పరిస్థితులు మారి బ్యాంకులలో డబ్బు దాచుకోవడం వుత్తమమని అందరకూ తోచినప్పటికైనా మనవాళ్లు ఈబ్యాంకులలో డిపాజిట్లు వేసియుండలేదు. అందుకు కారణం కేవలం బందరుమీద నిరసనభావం మాత్రమే కాదు. మనవాళ్లకి మనవాళ్లమీద నమ్మకం లేకపోవడమే ముఖ్యమైన కారణం. ఈవిషయమై ఇంటింటికి తిరిగి ప్రచారంచేసినా, ఉపన్యాస వేదికలనుండి ఉద్బోధించినా, పత్రికలలో మాటిమాటికీ ప్రచురించినా

ఏమీ లాభంలేకపోయింది. ఆంధ్రబ్యాంకియొక్క అభివృద్ధి చీమ—గంగాయాత్రలాంటి దయిపోయింది.

మనవాళ్లకి దూరపు కొండలు చాలానునుపు. హిందూపత్రికలో ముఖపత్రం(front page)మీద అడ్వర్టైజుమెంట్లు వేయించటం; ఫైవరుపైటు కాగి తాలమీద ఆదాయవ్యయపట్టికలను ప్రచురించి చిన్న పుస్తకాలుగా కుట్టించి పోస్టుద్వారా ఇంటింటికీ పంపించడం; బ్రోకర్లు, వార్తాపత్రికలు, ఓరుదాంకికిలు మొదలైనవారి యోగ్యతాపత్రాలను ప్రతిచోటా ప్రద ర్శించడం—ఇత్యాది పనులుచేసే ఇతరబ్యాంకులంటే తాహతుగలవనిన్నీ, నమ్మదగ్గవనిన్నీ మనవాళ్ల కోఅపో హ. ఇవే అసలైన బ్యాంకులనీ, ఈమాత్రమైనా హంగా మాచేయలేనివి బ్యాంకులనిపించుకోవనీ భ్రమ. అంతే కాని రోజురోజూ కళ్లెదుట కనపడేడైరక్టర్లూ, లోటు పాటులు క్షణంలో తెలుసుకోడానికి అవకాశాలున్న టువంటి వ్యాపారమూ, 'రా' అంటే వెంటనే ఇంటికి పరుగెత్తుకునివచ్చి కావలసిన బ్యాంకు పనులను సవిన యంగా చేసిపెట్టే ఆఫీసుసిబ్బందీ కలిగినటువంటి తెలుగు బ్యాంకు అంటే నచ్చదు. దూరంగా వుండి ఏ సంగతులూ తెలియకపోవడమే మన వాళ్లకు నమ్మకా నికి, గౌరవానికీ ముఖ్య కారణం.

అర్బత్తునాటు కంపెనీ దివాలానుసరించి నా చిన్నతనంలో విపరీతంగా చెప్పుకుంటూ వుండేవారు. బందరు ఉప్పెనైనా ప్రతియేడూ దీపావళినాడు జ్ఞాప కం వస్తూవుంటుందిగాని అర్బత్తునాటు సంగతి మాత్రం యెన్నడూ జ్ఞాపకం వస్తూన్నట్లు కనపడదు. కుక్క గొడుగుల్లాగ బ్యాంకులు ౧౯౩౦-వ సంవత్సరం పిరిమి లాను ప్రతిచోటా బయలుదేరాయి. అవి ఎక్కడివో, ఎట్లా పనిచేస్తున్నాయో తెలుసుకోటానికి వార్తాపత్రి కల్లో వున్న ప్రచురణలద్వారా తప్ప వేరేసాధనం లేదు. కేవలం డిపాజిట్లను ఆకర్షించడానికిగాను డబ్బిచ్చి వేయించబడిన ప్రచురణలు ఆ బ్యాంకుల యొక్క నిజ స్థితిని యెంతవరకు వెల్లడిచేస్తాయో మన మూహించు కోవచ్చును. కాని ౧౯౩౦ సం||రం పరిమిలాను వచ్చిన ద్రవ్యనష్టాలవల్ల మహామహావారు అనేకమంది దివాలా తీశారుగాని బ్యాంకులేవీ పడిపోలేదు. కాబట్టి బ్యాంకు అనే పదంలోనే ఏదో లోకమహత్తు వుందని మనవాళ్లు వ్యామోహంపడ్డారంటే ఆశ్చర్యంలేదు. అందుచేత ఏ బ్యాంకులు ఆర్భాటం యెక్కువ చేస్తూ, వడ్డీ యెక్కువ ఇచ్చేవో వాటినే ఆదరించేవారు మనవాళ్లు. ఆంధ్ర బ్యాంకు లాటి సామాన్యపు సంస్థ వారి కంటికి ఆనేదికాదు.

ఈ సందర్భంలో డిపాజిట్లపైన వడ్డీరేటును బ్యాంకువారు దేనినిబట్టి నిర్ణయిస్తారు అన్నది ముఖ్యంగా తెలుసుకోవలసిన విషయం. ఇదివరలో బ్యాంకులంటే డిపాజిట్లు తక్కువ వడ్డీకి పుచ్చుకొని, అప్పులు ఎక్కువ వడ్డీకి ఇచ్చి, లాభాలుగడించే సంస్థలు అని చెప్పివున్నాను. కాబట్టి అప్పులపైన వచ్చేవడ్డీనిబట్టి డిపాజిట్లరేటు నిర్ణయ మవుతుంది. అప్పుతీసుకునేవారు ఎక్కడ డబ్బు చవుకగా దొరికితే అక్కడ తీసు కుంటారు. వారికి దేశాభిమానంతో సంబంధంలేదు. కులమతవిచక్షణలు వుండవు. ఈ రోజులో చవలన్నీ పెట్టుకుంటే వర్తకంసాగదు. ప్రతిబ్యాంకువారు అప్పు లిచ్చేటప్పుడు అసలుసొమ్ము జాగ్రత్త ముందు చూసుకుం టారు. వడ్డీ కిట్టుబాటుసంగతి రెండోపక్షం. ఇంపీరి యలుబ్యాంకువారు డిపాజిట్లపైన నూటికి సంవత్సరానికి వడ్డీ రు ౧-౮-౦ యిస్తారు. గవర్నమెంటువారి సొమ్ము మీద వడ్డీ యివ్వనక్కరలేదు వారికి. ఇంత చౌకగా డిపాజిట్లను సంపాదించడానికి అవకాశం హిందూ దేశపు బ్యాంకులలో దేనికీ లేదు. కాబట్టి వీరు ఇవ్వ గలిగినంత చౌకవడ్డీకి మరే బ్యాంకువారూ అప్పు లివ్వ లేరు. అయితే ఇంపీరియలుబ్యాంకువారి వడ్డీరేటు దేని మీద ఆధారపడివుండేదీ ఆలోచించాలి.

బ్యాంకురేటు అనేది ప్రతిదేశంలోను అమలులో వుంటుందన్న సంగతి చాలామందికి తెలిసినవిషయమే. మనదేశంలో ఈ రేటును నిర్ణయంచేసి ప్రచురించే వారు రిజర్వుబ్యాంకువారు. ఈ రేటుయొక్క తత్వం యేమిటంటే, గవర్నమెంటువారు కరెన్సీనోట్లను చలామణీచేసే అధికారం రిజర్వుబ్యాంకువారి కిచ్చి సరియైన హామీపైన ఇతర బ్యాంకులకు ఎంత అప్పు కావలిస్తే అంత అప్పు మంజూరుచేసేటందుకు అధికారం ఇచ్చారు. ఈ అప్పులపైన వడ్డీరేటు డబ్బు

అవసరాన్ని బట్టి నిర్ణయించుకోమన్నారు. రిజర్వు బ్యాంకివారు ఇట్లా నిర్ణయించేదే బ్యాంకురేటు. దీన్ని వారు ప్రచురంచేస్తూ వుంటారు. దీనిపై ఆధారపడి ఇతర బ్యాంకులవారు తా మిచ్చే అప్పులపైన వడ్డీరేటును నిర్ణయించుకుంటారు.

ప్రస్తుతం బ్యాంకురేటు సంవత్సరానికి నూటికి 3 రూపాయలు. బ్యాంకులకు అప్పు కావాలంటే ఈరేటున ఇవ్వవలసి వుంటుంది కాబట్టి సామాన్యంగా తా మిచ్చే అప్పులపైన ఇంతకంటె కొద్దోగొప్పో హెచ్చురేటు ఛార్జీ చెయ్యక తప్పదు. కాని పైన చెప్పినట్లు ఇంపీరియలు బ్యాంకువారు గవర్నమెంటు సొమ్మువల్లనైతేనేం, తమకుగల పరపతివల్లనైతేనేం తమ డిపాజిట్లను సగటున రూపాయవడ్డీకి సంపాదిస్తున్నారు. అందువల్ల దీనిపైకి స్వల్పలాభంవేసుకొని బ్యాంకురేటుకంటె తక్కువరేటుకుకూడా అప్పులిచ్చేటందుకు సమర్థత కలిగివున్నారు. అందువల్లనే డబ్బు చేతినిండా వున్నరోజుల్లో నూటికి సంవత్సరానికి రూపాయిన్నర వడ్డీకికూడా అప్పు లివ్వటం కద్దు. డబ్బు వత్తిడి రోజుల్లో, అనగా కిస్తీరోజుల్లో (busy season) బ్యాంకునుంచి అప్పుతీసుకోవలసిన అవసరంవచ్చేటప్పటికి తామే రిజర్వు బ్యాంకురేటుకంటె కనీసం నూటికి అర్ధరూపాయ ఎక్కువ, అనగా నూటికి రు. 3-౮-౦ చొప్పున ఛార్జీ చెయ్యడం తప్పదు.

ఈ విధంగా చాలాస్వల్పవడ్డీ రేటున అప్పులు పుట్టడానికి అవకాశం వున్నప్పుడు బ్యాంకువారి నిబంధనల ప్రకారం హామీయివ్వగల ప్రతి ఆసామీన్నీ తక్కువ రేటున అప్పు దొరికేచోటికి వెళతాడుగాని దేశాభిమానాన్నిగురించి ఆలోచించడు. తక్కువ వడ్డీకి అప్పు పుట్టనివాడే ఇతర బ్యాంకులకు వెళ్లి ఎక్కువవడ్డీ ఇస్తాడు. ఎక్కువవడ్డీ ఇచ్చే ఆసామీ సరియైన హామీ యివ్వలేడన్నమాట; అనగా రెండోరకం వ్యాపారం. అటువంటివానిని చేపట్టే బ్యాంకువారు ఎక్కువవడ్డీ రేటును సంపాదిస్తారు. గాని వారు చేసే వ్యాపారం అంత ఘరానా పద్దు కాదు. వారు డిపాజిట్లమీద ఎక్కువ వడ్డీరేటు ఇచ్చారంటే ఆశ్చర్యం లేదు. కాని అటువంటి బ్యాంకులో డిపాజిట్టు చేసేవారు వడ్డీ ఎక్కువ వచ్చిందని ఆట్టే సంతోషింపవలసిన పని వుండదు.

అయితే అప్పులపైన వడ్డీరేట్లలో ఒక బ్యాంకుకీ ఇంకొక బ్యాంకుకీ స్వల్పభేదాలు వున్నప్పుడు అప్పులు తీసుకొనేవాళ్లు కాస్త ఎక్కువవడ్డీ యివ్వటానికి సందేహించక పోవచ్చును. ఇందుకు వుదాహరణంగా ధాన్యంమీద అప్పులు తీసుకుందాం. ఒక కొట్లో ధాన్యంమీద ఒక బ్యాంకువారు వెయ్యిరూపాయల అప్పు నాలుగురూపాయల వడ్డీకి ఇస్తారని అనుకోండి. రెండో బ్యాంకువారూ అదే మొత్తం ఇస్తారుగాని వడ్డీ మాత్రం ౪-౮-౦ రూపాయలు ఛార్జీచేస్తా మంటారు. రెండోబ్యాంకువారు ఇంటికివచ్చి డబ్బుఇస్తారు. మచ్చులు తీసుకోడానికి గోతాలు ఇస్తారు. అర్ధరాత్రి వెళ్లినా విసుక్కోరు. సాయిలాఫాయిలాగా వస్తారు. మొదటి బ్యాంకువారు దొరల్లాగ ఇట్టి సౌకర్యాలు ఏవీ చేయకపోతే వక్క అర్ధరూపాయవడ్డీ ఎక్కువైనా రెండో బ్యాంకుకు వర్తకులు వెళ్లవచ్చు. ఇట్లా వెళ్లినమాత్రాన, వడ్డీ యొక్క విచ్చారగన్నంత మాత్రాన పైనజెప్పిన మాదిరి రెండోరకం పద్దుకా దిది; — కాని ఆకొట్లోవున్న సరుకుమీదనే ౧౨౦౦రూపాయ లిస్తారని రెండోబ్యాంకుకు వెళ్లితే ఆరెండో బ్యాంకువారు ఎంతవడ్డీ ఛార్జిచేసినప్పటికిన్నీ తీసివేతరకంగానే చూడవలసివుంటుంది. చిన్నరకం వర్తకులు అప్పు ఎక్కువపుడుతుందిగదా అని వడ్డీ ఇంకా ఎక్కువైనా లక్ష్యంచెయ్యరు. అంతకంటె చిన్నరకంవారు తాము సరుకుగాను వెచ్చించినసొమ్మంతా ఇంచుమించు అప్పుపుట్టేటటువంటి బ్యాంకు వుంటే అక్కడికే వెడతారు. అటువంటివాళ్లు ఎంత వడ్డీరేటైనా లక్ష్యంచెయ్యరు. అంతకంటె మరీ చిన్నరకంవారు సరకులేకుండానే వీలైతే అప్పుతీసుకొని నూటికి ౧౨ రూపాయలువడ్డీ అయినా ఇవ్వడానికి సిద్ధంగా వుంటారు.

ఈవిధంగా అప్పులిచ్చేటందుకు అనేకవిధాలు. ఒక్కొక్కవిధానానికి ఒక్కొక్క వడ్డీరేటు అములులో వుంటుంది. పైనచెప్పిన ప్రకారం ఆరేటుమీద ఆధారపడి డిపాజిట్లపై రేటు నిర్ణయ మవుతుంది. ఎంత

ఎక్కువరేటు డిపాజిట్లపై నిస్తే అంతనాసిరకం వ్యాపారం చేయవలసివస్తుంది. అందువల్లనే డిపాజిట్లపైన ఎక్కువరేటు వచ్చిందికదా అని అట్లా ఇచ్చే బ్యాంకుల్లో డిపాజిట్లు చెయ్యడం యుక్తమైనపనికాదని ఇదివరకే చెప్పివున్నాను.

పత్రికల్లో వేసే ప్రచురణ చూస్తే సంవత్సరానికి నూటికి 3 రూపాయల నుంచి ౬ రూపాయల వరకూ వడ్డీ ఇచ్చే బ్యాంకులు కనపడతాయి. బ్యాంకురేటు ప్రస్తుతం 3 రూపాయలు వుంది; అంటే రిజర్వుబ్యాంకు వారు ఇతరబ్యాంకులకు గవర్నమెంటు పత్రాదుల హామీపైన ఆరేటున అప్పలిచ్చేటందుకు సిద్ధంగా వున్నారన్నమాట. సరియైన హామీవుంటే ఇంచుమించు 3 రూపాయలరేటున అప్పపుట్టడానికి అవకాశం వున్నప్పుడు కొన్ని బ్యాంకులు ఇంతకంటె ఎక్కువరేటు డిపాజిట్లపైన ఇస్తారంటే వారు చేసేవ్యాపారం ఎటువంటిదై యుంటుందో ఊహించుకోవచ్చును

ఇందులో యింకొకచిన్నరహస్యంకూడా వుంది. ఈ బ్యాంకులు పేపర్లలో వేసేదానికంటె బేరంచేసే వాళ్లకు ఎక్కువ రేటివ్వడం కద్దు. నాఅనుభవంలో ఈ రకపు బ్యాంకుల్లో ఒకటి నేనడిగాను కాబట్టి, ప్రచురించే ౮ రూపాయల రేటుకంటె ఒక్కదమ్మిడి ఎక్కువ ఇవ్వము అన్నారు. వారే రహస్యంగా ౬ రూపాయల వడ్డీతో సొమ్ము పుచ్చుకొన్నబాపతు డిపాజిట్టు రశీదును ఒకదానిని దరిమిలాను నేను కళ్లారా చూశాను. అంతేకాకుండా మొదటిసారి డబ్బు వేసేటప్పుడు కొంచెం బెట్టుచేస్తారుగాని నాయిదా వచ్చినప్పుడు డబ్బు తీసుకొనిపోతామంటే ఎక్కువరేటివ్వడం మామూలు.

ఈసంగతికూడా చెప్పడం ఎందుకంటే పేపర్లలో ప్రచురించే రేటుమీదనే ఆధారపడి ఈరేటు తక్కువగా వుంది కాబట్టి ఒకవేళ ఈబ్యాంకు మంచిదే కదా అని కొంత అపోహ కలగవచ్చును. అందుకని బ్యాంకుయొక్క నిజపరిస్థితులు తెలుసుకోవాలంటే దాని ఆదాయ, వ్యయపట్టికను (balance sheet) జాగ్రత్తగా పరిశీలించాలి. ఈపరిశీలన సులభముగా అవగాహన అయ్యేది కాదు. అందువల్ల దీనినిగురించి మరొకప్పుడు విపులంగా వ్రాస్తాను.

౧౯౩౫ లో రిజర్వు బ్యాంకును స్థాపించారు. దీన్ని స్థాపించడంలో వుద్దేశం ఏమిటంటే, ఇతర బ్యాంకులతో పోటీ చేయకుండా వాటికి అవసరంవచ్చినప్పుడు సహాయంచేస్తూ వాటివ్యవహారాలను ఒకకంట కనిపెడుతూ వుండాలని. అందుకుగాను ఏవో కొన్ని నిబంధనలుకూడా పెట్టారు. పెద్దబ్యాంకులను అన్నింటినీ తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దేశంలో చిన్న బ్యాంకులు అనేకం వున్నాయి ఒక్క తిరువాన్కూరు సంస్థానంలోనే మొత్తం ౫౪౪ బ్యాంకులు వున్నాయి! కోయంబత్తూరుపట్నంలో సుమారు నూరు బ్యాంకులున్నాయి!! వీటి నన్నిటినీ తను అంటనుంచుకోవడం అలవిగాని పని కాబట్టి ఐదులక్షలకు తగ్గని మూలధనంగల బ్యాంకు లన్నిటినీ తమ షెడ్యూలులో చేర్చుకున్నారు రిజర్వుబ్యాంకువారు.

ఆంధ్రదేశంలో అన్నిటికంటె మొదట స్థాపింపబడి కొంత ప్రాముఖ్యానికి వచ్చినటువంటి ఆంధ్ర బ్యాంకు మూలధనం ఐదులక్షలకు తక్కువ కావడంవల్ల రిజర్వుబ్యాంకువారు తమషెడ్యూలులో దీనిని చేర్చుకోలేదు. రాబోయే ఆంధ్రరాష్ట్రానికి ఒక్క షెడ్యూలు బ్యాంకు అయినా లేకపోవడం గొప్ప కొరతగా వుంటుంది. రాష్ట్రంతోబాటు షెడ్యూలుబ్యాంకులుకూడా వాటంతట అవే వస్తాయి అని అనుకోవడం కేవలం భ్రమ. దక్షిణాదిని సుమారు పది షెడ్యూలు బ్యాంకులు వున్నాయి. రిజర్వు బ్యాంకువారు మన బ్యాంకులో పెద్దా చిన్నా విచక్షణ చేశారు. ఆ లెక్కప్రకారం తెలుగుదేశంలో ఒక్క పెద్ద బ్యాంకు అయినా లేకపోవడం ఆంధ్రులకు చాలా న్యూనతగా వుంది. ఇది మనం ముఖ్యముగా గమనించవలసిన విషయం. ఇందునుగురించి తగు ప్రయత్నాలు చేయడం అత్యవసరం.

ఈలోపుగా మారపు కొండల నునుపు చూసి మాత్రం భ్రమపడకూడదు ఇతర దేశాల్లో చిన్నచిన్న బ్యాంకు లనేకం వుండగా ఆంధ్రదేశం అంతా వెదికి చూసినా ఇట్టి చిన్నబ్యాంకులైనా అరడజను లేవు. ఉన్నవాటిని షెడ్యూలు బ్యాంకులుగా చేయవచ్చును;

లేకపోతే షెడ్యూల్డు బ్యాంకు హోదాగలవాటిని కొత్తగా పెట్టవచ్చును. ప్రతిపట్టణంలోనూ చిన్న చిన్న బ్యాంకులను లేవదీయవచ్చును. ఋణాల చట్టం వచ్చిన తరువాత ప్రైవేటుగా ప్రోనోట్లమీదా తణఖాల మీదా అప్పులివ్వడం అపాయకరమైన సంగతిఅని అందరికీ తెలిసింది. డబ్బుగలవారు బ్యాంకుమూలంగా లేవాదేవీలు పెట్టుకుంటే ఇదివరకుపడ్డ కష్టాలకు గురికారు. అంతేగాని, ఎక్కడో మూలాన వుండి మంచిచెడ్డలను తెలుసుకోడానికి అవకాశంలేకుండా కేవలం పేపర్లలో వున్న ప్రకటనలను బట్టి యోగం ఎరుకతో ఎక్కువ వడ్డీకి ఆశపడడంమాత్రం కేవలం పొరపాటు.

దక్షిణాది బ్యాంకుల దండయాత్రను అడ్డుకోడానికి వేరే సాధనంలేదు.

ఎంతకాలము?

పెనుమర్తి రామారావు

౧

ఏ సుముహూర్తమందుననొ యీ వసుదెంచి సువర్ణ పాదవి
న్యాసముతోడ, నాగృహము నంత పునీతము జేతు వంచు నే
నాసల మున్గిపోయి ప్రణయార్ద్రహృదంతరసీమయందు నీ
కై సఖి! దాచియుంచితి సుఖంబులప్రోవులు భావనామణుల్!

౨


ఆరని తృష్ణతో నహరహంబును నీ స్మరణంబు జేయుచున్
కోరిక లెల్ల దాచుకొని గోప్యముగా నెదలోన, వేదనా
భారముతోడ జీవితపుబాటలలో నడయాడుచుంటి, నిన్
జేరి సుఖించు టెన్నడొ యశేష మహోన్నతభాగ్యసంపదన్.

౩


జీవిత మెల్ల నీకొరకు చేయుచునున్న మహాతపస్సు! నె
త్తావులు గ్రుమ్మరించు సుమదామము నై భవదీయ కైశిక
స్థావర మాసజేతు, ప్రమదమ్మున నీవపువున్ స్పృశింపగా
నీ విరహార్తి నోర్చి హృదయేశ్వరి! యేతప మాచరించెదన్!

౪

ఆస యొకండె జీవితము నంతను కాచుచునుండె నేడు, నే
నో? సకలమ్ము నీ వనుచు నూహలమేడలు గట్టి గాలిలో,
వాసరముల్ నెలల్ తుదకు వత్సరముల్ గతియించిపోవ నే
మే సఖి! యెంతకాలము నిరీక్షణలో కృశియింపగావలెన్!



మద్రాసు, ఎగ్మూరులో క్రొత్తగా నెలకొల్పిన 'రేడియో' ప్రచారకేంద్రము
కడచిననెల 16-వ తేదినుండి ఇచట రేడియో ప్రచారము సాగుచున్నది.



మద్రాసు గిండిలో క్రొత్తగా కట్టిన లఘుతరంగవిద్యుద్వ్యాపినీయంత్రభవనము ; విద్యుత్ వ్యాపినీ శిఖరములను పటములో చూడనగును.

అమ్మరాజ విజయాదిత్యుని తాండికొండదానశాసనము

భావరాజు వేంకటకృష్ణారావు

ఇది చాళుక్యయుగమునా డాంధ్రదేశమునందు వర్ధిల్లిన శైవమతచరిత్రమునుగూర్చి నూతనవిషయము లను దెలుపు మిక్కిలి యుపయోగకరమైన శాసనము. ఈ దానశాసనము లిఖింపబడిన రాగిరేకులు కడు చిత్రముగా లభించెను. ఆవృత్తాంత మిది. గుంటూరు తాలూకా తాడికొండ గ్రామమునకు సమీపమున ఒరవకల్లు అను చిన్నగ్రామము కలదు. ఆగ్రామమునకు పశ్చిమముగా సుమారు ౨౫౦ అడుగులు యెత్తుగల నల్లరాతికొండ యొకటి కలదు. దానికి జేర్చి యొక పెద్ద బండరాయి కలదు. ఆరాతికి చుట్టుప్రక్కల చాలమేర పాటిమట్టి గలదు. ఆ ఒరవకల్లుగ్రామమున క్రైస్తవమతదీక్షగొన్న మాల, మాదిగ కుటుంబములు పెక్కు గలవు. అట్టివారిలో మాదిగకులస్థుడైన చిల్క సత్యానందమనువాని కొకనికి ఇప్పటికి సుమారు పాతికసంవత్సరములకుపూర్వము అచ్చట బండరాతిప్రక్కను ఇంటికి గోడలు కట్టుకొనుటకై పాటిమట్టిని త్రవ్వుకొనుచుండగా అయిదుమూరలలోతున ఒక మట్టిబాన కనుపించెనట! అందు అయిదురేకులు గుదిగా కడియమందు చేర్చబడిన యీ దానశాసనమును, మరికొన్ని చిన్నరేకులు గల గుదులున్ను భద్రపఱుపబడియుండి యాతనికి లభించెను. ఆచిన్నరేకుల గుదులును, పెద్దరేకుల గుదిలోని కడపటిరేకును ఎక్కువ యుపయోగకరమైనవి కావని యెవరో యాతనికి దెలిపినకారణమున వాటిని ఆతడమ్ముకొన్నాడు. వాటిగతి ఏమయినదో ఆనందము ఇపుడు స్పష్టముగా జెప్పడు. పిమ్మట కొంతకాలమయిన తరువాత శాసనపురేకులు దొరికినసంగతియును, కొన్నిరేకుల నాతడు అమ్ముకొనినట్లును ఇంకేమియో ధనము దొరికినట్లును కులస్థులకు దెలియుటతోడనే కొందఱాతని భయపెట్టిరి. మిగిలియున్న నాలుగు రేకులవలన తన కేమైనయాపద వాటిల్లగలదని ఆతడు భయపడి వాటిని భద్రముగా నొకమూట గట్టి చంకబెట్టుకొని ఒకనాటియర్ధరాత్రమున నెవరితో చెప్పకుండ తద్గ్రామసమీపమున మతప్రచారము నిమిత్తము వేంచేసియున్న క్రైస్తవమతాచార్యుడైన రెవరెండు డాక్టరు ఐజాక్ కెన్నడేగారిని సందర్శింపబోయెను. అది ౧౯౧౪-వ సంవత్సరము డిశెంబరునెల. అనివసరీతో సత్యానందము తనకథ నంతయు సవిస్తరముగా జెప్పి, అధికారులవల్ల తాను శిక్షకు బాల్పడకుండ జేయుమని రక్షింపుమని భీతుడై ప్రార్థించెను. తనకు శాసనపురేకులు దొరకినతావును జూపింపగలననియు, నచ్చట భూమిలో సుమారు ౫, ౬ గజములు ఆబండరాయిప్రక్కను త్రవ్వినయెడల చిత్రములయిన వస్తువులు విశేషముగా దొరకగల వనియు సత్యానందము చెప్పెను. రెవరెండు డాక్టరు కెన్నడేగారు అంతయు విన్నపిదప సత్యానందమునకు అభయహస్త మిచ్చి ఆతనికడనున్న నాలుగురేకులను దీసుకొని పంపివేసిరి. పిమ్మట నారాగిరేకులను గవర్నమెంటు అసిస్టెంటు ఆర్కియోలాజికలు సూపరెంటుగారయిన స్వర్గీయులు హొసకోట కృష్ణశాస్త్రిగారికి బంపిరి. ఆ శాసనపురేకులు ౧౯౧౪-౧౫ సంవత్సరపు ఎపిగ్రాఫికలు రిపోర్టులో ౧౧-వ నెంబరు తామ్రశాసనముగా గుర్తింపబడెను[1]. నాటినుండి దీనివిషయము కనుగొన్నవారు లేకపోయిరి. ఇటీవల నీరాగిరేకులను పరీక్షించి, వాటిపైగల అసంపూర్ణశాసనమును నింగ్లీషున ప్రకటించి

---

1. Madras Epigraphical Report for 1914-15, pp. 90 ff.

తిని[2]. ఈ శాసన మాంధ్రదేశ చరిత్రకు మిక్కిలి యుప యోగకరమైన దగుటచేత నాంధ్రమున నిపుడు ప్రకటించుచున్నాను.

ప్రస్తుతము మనకు లభించిన నాలుగురేకులలో మొదటిరేకుపై రెండవ (లోపల) ప్రక్కను, మిగిలిన మూడురేకులపైన రెండుప్రక్కలను వ్రాత కలదు. ఈ రాగిరేకు లించుమించుగా ౧౧ అంగుళములు పొడుపును ౫ అంగుళములు వెడల్పును గలిగియున్నవి. మొదటిరేకు రెండవపేజిపై ౯ పంక్తులును, మిగిలిన రేకులపై ఒక్కొక్కవైపున పదేసిపంక్తులును వ్రాత గలదు. మొత్తముమీద మనకు లభించిన శాసనమందు ౬౯ పంక్తుల వ్రాత గలదు. శాసనము అసంపూర్తిగనే మనకు లభించినదని చెప్పవలయును. శాసనపురేకులు కడుభద్రముగా దాచిపెట్టబడియుండుటచేత, వ్రాత ఏమాత్రము కూడ చెడియుండలేదు. శాసనపులిపి ప్రాచీనకాలపు తెలుగు. సుంద్రకత్తునందు అక్షరములు మిక్కిలి మనోహరముగా వ్రాయబడినవి. అక్షర పరిణామశాస్త్రమునుబట్టి ఈశాసనలిపి ౧౦-వ శతాబ్దము నాటి దని గుర్తింపవచ్చును. కాని యందు కొన్ని ప్రాచీనఅక్షరరూపములుగూడ కనుపించుచున్నవి. ఉదాహరణము: అచ్చులలో అ, ఆ లు. ఇక నకారపొల్లునకును (పంక్తులు ౧౦, ౨౦, ౨౯,) మకారపొల్లునకును (పంక్తులు ౧౧, ౧౬, ౨౧, ౩౧) ప్రత్యేకసంజ్ఞలు కలవు; కాని తకారపొల్లున కట్టి ప్రత్యేకగుర్తు ఏమియును లేదు. తకారపొల్లును సూచించుటకు లేఖరి 'త' వ్రాసి దానిమీద విరామమును జూపినాడు (పంక్తి ౭). సుణింతమందు ఓ, ఔ లకు భేదము గాన్పింపదు. సందర్భానుసారముగ వాటిని చదువుకొనవలసినదే. నడుమ నొక్కమాటతప్ప శాసనభాషయంతయు సంస్కృతము. దత్తగ్రామముయొక్క సరిహద్దులుమాత్రము దేశభాషయం దున్నవి. కట్టకడపటను మాములువ్యాసగీతములు విడిచిపెట్టినచో శాసనమునందు ౧౯-శ్లోకములు గలవు. శాసనము గద్యపద్యాత్మకముగా నున్నది. మధ్యమధ్య శ్లోకములతో, గద్యతో శాసనము హృదయంగమముగ రచింపబడినది. కవనము విద్వాంసుడును, కవియు, మహారాజునకు గురువర్యుడు నగు విద్యేశ్వరపండితునిది. శాసనమును లేఖరి మిక్కిలి సొగసుగా రేకులపై చెక్కినాడు. వర్ణవిన్యాసక్రమమునందు లేఖరి ఓష్ఠ్యములతో నారంభమగుపదములు వచ్చునపుడు తత్పూర్వము వచ్చిన విసర్గను ఉపధ్మానీయముగ వ్రాసినాడు. ఆగుర్తును చదువరి ౫౯-వ పంక్తిలో గాంచగలడు.

శాసనవిషయములు :

ఈశాసనము పూర్వచాళుక్యాన్వయతిలకుడగు విజయాదిత్యాపరనామ్నుడగు రెండవ లేక ఇమ్మడి అమ్మరాజుది. ఈమహారాజునకు రాజమహేంద్రుడని బిరుదము గలదు. 'సమస్తభువనాశ్రయ' యను కులక్రమాగతమైన పేరు గలదు. ఇతడు మహారాజు; అధిరాజపరమేశ్వరుడు, పరమభట్టారకుడు; పరమమాహేశ్వరుడు. సార్వభౌమ పదవితో నేకచ్ఛత్రాధిపత్యము వహించి సకలాంధ్రభూమిని నీరాజపరమేశ్వరుడు క్రీ. శ. ౯౪౫ డిశంబరు నెల మొదలుకొని క్రీ. శ. ౯౭౦ మార్చి నెలవఱకును, ౨౫ శకవర్షములు పాలించెను. ఇతడు సింహాసన మెక్కునాటికి పండ్రెండేండ్ల వయసువాడు. ఇతని మహిమ యెట్టిదోగాని ఎనిమిదవయేట యౌవరాజ్య పట్టమునకు నభిషిక్తుడయ్యెను[3]. ఈ మహారాజాధిరాజు ఒకవిధముగా నాగర్భశ్రీమంతుడని చెప్పవచ్చును ఇతని శాసనములన్నియు నేకగ్రీవముగ ప్రజానురాగమును బడసి తనకంటె జ్యేష్ఠుడైన సవతి అన్నగారుండగనే పండ్రెండవయేట ఆంధ్రమహీస్థలికి పట్టభద్రుడయ్యెనని తెలుపుచున్నవి. ఆనాడు రాజ్యాంగపరిస్థితులు దేశమున నెట్లుండెనో తెలుసుకొనుటకు ఆధా

---

2. Ep. Ind, Vol. XXIII, part. V, p. 161 ff.

౩. "స యౌవరాజ్యేష్టసమేభిషిక్తో ద్విషత్క సంవత్సరపట్టభద్రః" అని వేములూరుపాడు శాసనము తెలుపుచున్నది — Ep. Ind., Vol. XVIII, p. 226–235, ౧౩-వ శ్లోకము.

రము లేదు. ఇతనియన్న యితనిపై తిరుగబాటు గావిం పక తమ్ముని రాజ్యపాలనమునకు సమ్మతించియుండుట చూచి ఇతడు మహాసమర్థుడయియుండవలయునని తోచుచున్నది. అదియునుగాక నది అన్నదమ్ములకు గల పరస్పరానురాగమును వెల్లడిచేయుచున్నది

ఇమ్మడి అమ్మరాజు కరితురగాగమశాస్త్రములను పూర్తిగా నభ్యసించి కౌశలము గడించినాడు. ధరాధిపవిద్యయం దుత్తీర్ణుడు. వివిధాయుధకోవిదుడు. మహాయుద్ధములందు అనేక రిపుసమూహములను స్వయముగా నిర్జించిన మేటియోధాగ్రేసరుడు. కవిగాయకులకు కల్పతరువు. ద్విజ, ముని, దీన, అనాథ, బంధుజనులకు కామధేనువు. యాచకగణమునకు చింతామణి. అవనీశమణులలో ద్యుమణి(రవి)వంటివాడు. మహారాజాధిరాజు, రాజపరమేశ్వరుడు, పరమభట్టారకుడు; పరమమాహేశ్వరుడు. ఉమాసమానాకృతి గల లోకమహాదేవికి మాహేశ్వరమూర్తియైన రాజభీమాపరనామ్ము డను ఇమ్మడి చాళుక్యభీమునికి కలిగిన కుమారుడు. కుమారస్వామితో సరిపోల్పదగిన సుందరమూర్తి. జలజాతపత్ర, చామర, కలశ, అంకుశలక్షణములు గల కరచరణములు గల రాజశిఖామణి. బలిష్ఠములైన ఆజానుబాహువులు గలవాడు. గిరీంద్రునితో సమమైన విశాలవక్షస్థలము వాడు. కవాటములవంటి బాహువులుగలవాడు. ఇతని పట్టాభిషేకవృత్తాంతము శ్లోకరూపమున శాసనములందీవిధముగా వర్ణింపబడియున్నది :—

శ్లో. గిరిరసవసుసంఖ్యాబ్దేశకసమయేమార్గశీర్షమాసేఽస్మిన్
కృష్ణత్రయోదశిదినే భృగువారే మైత్రనక్షత్రే.
ధనుషి రవౌ ఘటలగ్నే ద్వాదశవర్షేతు జన్మనః
పట్టం యోధా దుదయగిరీన్ద్రోరివ లోకానురాగాయ.

గిరి=౭, రస=౬, వసు=౮ - అనగా శకవరుషములు ౮౬౭ కాగా మార్గశిరమాసమున బహుళత్రయోదశి శుక్రవారమునాడు అనూరాధానక్షత్రమందు చంద్రుడుండగా ధనుస్సునందు రవి యుండగా కుంభలగ్నమందు, ఉదయగిరిపై ఉదయించు బాలభాస్కరునివలె లోకానురాగముకొరకు పట్టభద్రు డయ్యెనని వీటి తాత్పర్యము. ఈ శకవర్షములకు శాసతిథివారములకును సరియైన ఇంగ్లీషు తేది క్రీ. శ. ౯౪౫ సంవత్సరము డిసెంబరు ౫-వ తేది శుక్రవారమగుచున్నది.

శాసనము శివపరమైన మంగళ శ్లోకముతో ప్రారంభమగుచున్నది. శాసనమును రెండుభాగములుగా విభజింపవచ్చును. మూడవభాగము కూడ నేమైన కలదేమోయని సంశయము కలుగును. ౬౯-వ పంక్తిలో శాసనము అసంపూర్తిగా తెగిపోవుటబట్టి యీయూహ కలుగుచున్నది. మొదటిభాగమున ౧ మొదలు ౫౧-వ పంక్తివరకు చాళుక్యాన్వయము వర్ణింపబడినది. ఇది రాజవాలుక్యవంశముయొక్క ప్రశస్తివిరుదు గద్యము మొదలగువాటితో ప్రారంభింపబడినది. పిమ్మట వేంగీచాళుక్య రాజవంశమునకు మూలపురుషుడైన కుబ్జవిష్ణువర్ధనుడు మొదలుకొని అమ్మరాజ విజయాదిత్యుని వరకుగల రాజులందరు వరుసగా వర్ణింపబడినారు. తరువాత దానవిషయము పూర్తిగా తెలుపబడినది. దత్తగ్రామములు, వాటి సీమావధులును చెప్పబడినవి. ౫౧-వ పంక్తి మొదలుకొని ౬౫ వఱకును రెండవభాగము. ఇందు ప్రసిద్ధులైన కాలముఖ-పాశుపతమునీశ్వరుల అన్వయపరంపర వర్ణింపబడినది. ఈశాసనముయొక్క విశేషము ఈ శైవాచార్యసంతతి వర్ణనయందే కలదు.

శాసనము మొదటి భాగమునందు శాసనోద్దేశము తెలుపబడినది. విజయవాటీనగరమున (అనగా నిప్పటి బెజవాడ) పూర్వము చాళుక్యకులతిలకుడును సమస్తభువనాశ్రయ బిరుదాంచితుడునగు నరేంద్రమృగరాజ విజయాదిత్యమహారాజు (ఇతడు క్రీ. శ. ౮౦౮ మొ. ౮౪౭ వరకు ౪౦ ఏండ్లు ఆంధ్రభూమినేలెను) తన పేరట 'సమస్తభువనాశ్రయ'మని దేవాలయము కట్టించి యందు ఉమామహేశ్వరుని ప్రతిష్ఠించెను. ఆదేవాలయము శిథిలము కాజొచ్చెను. ఆసమస్తభువనాశ్రయ దేవాలయమును తిరిగి కట్టుటకును, అచ్చటి మహాదేవునికి నిత్యము బలి నివేదనాదులు జరుగుటకును, తపస్వులు భుజించుటకొకసత్రము పెట్టుటకును, దేవాలయమునకు సున్నము మొదలగునవి చేయించుచు బాగుచేయించుచుండుటకును అమ్మభూపాలుడు తనప్రజల ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధికొరకు అల్పవృత్తితో ఉత్తరాయణ పుణ్యకాల

మందు సడ్లకండేఱువాటి విషయములోని తాండికొండ గ్రామమును, దానితోపాటు అమ్మలపూండి, ఆసులపట్లు, గొల్లపూండి గ్రామములను ఏవిధమయిన పన్నులబాధయు లేకుండ దేవభోగముగా నొనర్చి, ఉదకపూర్వకముగా ధారవోసెను. ఆదానవిషయమును ఆవిషయనివాసులయిన రాష్ట్రకూట ప్రముఖులకును కుటుంబినుల (రైతులు)కును ఆజ్ఞాపించెను. తనయాజ్ఞను పాలించుటకు కటకనాయకుని ఆజ్ఞప్తిగా నియమించెను. దానమివ్వబడిన తాండికొండకు సీమావధులు శాసనమందు నీరీతిగా తెలుపబడెను. తూర్పు తూండేఱు; ఆగ్నేయము గారలస్టణ్ణ; దక్షిణము లాముస యుత్తరంబున బూరుగు (చెట్టు); నైరృతి ఒడ్డసణ్ణ, పడుమట చయిత (చైత్య?) తటాకము; వాయవ్యము భీమసముద్ర మను తటాకము; ఉత్తరము ఎనుకజాలు; ఈశాన్యము రేగడుగుణ్ణ.

దానమీయబడినకాలము శాసనమందు స్పష్టముగా దెలుపబడలేదు. కాని యొకవిధముగా దానకాలము, శాసనకాలమును శాసనవిషయములనుబట్టి నిర్ణయింపవచ్చును. శాసనమును రాగిరేకులమీద కెక్కించినలేఖరి శాసనభాగములోని కొన్నిపంక్తులను విడిచిపెట్టి, కొంత తప్పుగా వ్రాసినట్లు కనబడుచున్నది. దానమీయబడిన శకవరుషములు దెలుపునపుడు తొట్రుపాటుపడి అమ్మరాజుయొక్క పట్టాభిషేకముహూర్తమును దానితో కలిపినాడు; అనగా, దానమిచ్చిన శకవరుషములు మనసులో నుంచుకొని అమ్మరాజు పట్టాభిషేకముహూర్తమును దెలిపియుండెను. చూడుడు, ౩౦ మొదలుకొని ౩౨వఱకు పంక్తులను. శకవరుషములు నభ వసు వసు, అనగా (నభ=౦ వసు=౮, వసు=౮) ౮౮౦ శకవర్ష మగుచున్నది. అమ్మరాజు రాజ్యాభిషిక్తుడయినది శకవరుషములు ౮౬౭. అప్పటి కామహారాజునకు ౧౨ ఏండ్లు వయస్సుండెను. శకము ౮౮౦ నాటికి పాతికేండ్లుండెను. అదియునుగాక దానము ఉత్తరాయణసంక్రమణనిమిత్తమున జేయబడినట్లు శాసనమందున్నది. శాసనమందు కొన్నిపంక్తులు వదలివేయబడినట్లును, దానము శకము ౮౮౦ సంవత్సరమున, ఉత్తరాయణపుణ్యకాలమున జేయబడినట్లును ఇందువలన నూహింప అవకాశ మేర్పడుచున్నది. ఈయూహా మరియొకయంశమునుబట్టిగూడ బలపడుచున్నది. అమ్మరాజ-విజయాదిత్యుడీదానమును ఉత్తరాయణ పుణ్యకాలమునందు "అస్మద్దేశ సంతత్యాయురారోగ్యైశ్వర్యాభివృద్ధ్యర్థ" మని చేసియున్నాడు. సాధారణముగా దానశాసనములం దిట్టివచన మగపడదు. కావున యీవచనమునకు విశేషార్థ ముండవచ్చును. ఈకారణమును బట్టియే దానము శ. ౮౮౦ సంవత్సరమున నుత్తరాయణపుణ్యకాలమందు చేయబడినట్లు ఊహింప వీలగుచున్నది. ఇంకను ప్రకటింపబడనట్టి దానార్ణవమహారాజుయొక్క మాంగల్లుదానశాసనమునం[4] దొక చరిత్రాంశము దెలుపబడియున్నది. అం దిట్లున్నది:— (పంక్తులు ౨౨–౨౫.)

"సూను స్తస్యామ్మరాజ స్సురపతివిభవో + + +
బ్ధో ధరిత్రీం రక్షన్నే కాదశాబ్దాం
జితరిపు మగమ త్కృష్ణకోపా త్కలింగాం।
తస్య ద్వైమాతుర శ్శ్రీమం సకలజనముదే
వల్లవాం + + + ద్య కవి ద్దానార్ణవో
శ్ప్యవతి మనునయా దంకిదేవీతనూజః॥"

"అతని (రాజభీముని) కుమారుడైన అమ్మరాజు-దేవేంద్రసన్నిభుడు - రాజ్యమునకు పట్టముగట్టుకొని పదకొండుసంవత్సరములు భూమిని రక్షించి, శత్రువులను జయించునుద్దేశముతో కృష్ణునిమీద కోపముబూని కళింగముపై దండెత్తిపోయెను. ఆసమయమున ఆరాజేంద్రుని సవతియన్నయు, అంకిదేవికుమారుడును, కవియునగు దానార్ణవేషుడు సకలజనులకు సమ్మోదమగునట్లుగా సకలమహీతలమును తమ్మని యిష్టానుసారముగ పాలింపసాగెను" అని పైశ్లోకముల తాత్పర్యము.

---

4. C. P. No 11 of 1916—17. ఈ శాసనమునుండి యెత్తి వ్రాసినపైపంక్తులను నేను ఎపిగ్రాఫికల్ డిపార్టుమెంటువారి యనుమతిచొప్పున ప్రకటించుచున్నాను. వా రిందుల కనుమతించినందులకు నేను కృతజ్ఞుడను.


ఇందు తెలుపబడిన కృష్ణుడు రాష్ట్రకూట చక్రవర్తియైన అకాలవర్ష - మూడవ కృష్ణరాజు. ఇతడు క్రీ. శ. ౯౩౯ మొదలుకొని ౯౬౭ వరకు పరిపాలించెను. కావున నితను అమ్మరాజ విజయాదిత్యునికి సమకాలికుడు. మూడవకృష్ణరాజునకును అమ్మరాజ-విజయాదిత్యునికిని ప్రబలవైరము వర్ధిల్లెను. ఈ వైరము కులక్రమాగతమైనది. ముమ్మడి కృష్ణరాజు తనసామ్రాజ్యమును వృద్ధిచేయుటకు వీలులేకుండ ఇమ్మడి అమ్మరాజు ప్రక్కలో బల్లెమై యుండెను. ఆంధ్రేశ్వరు నెట్లయిన ఉన్మూలించుటకు రాష్ట్రకూటచక్రవర్తి విశ్వప్రయత్నములు సలుపుచుండెను. అతని కపుడు మంచియదను దొరికెను. అమ్మరాజునకు దాయాదియైన బాదపుడు చిరకాలము ముమ్మడి కృష్ణరాజు నాశ్రయించి, వేంగీ మహారాజ్యసింహాసనమును అమ్మరాజుకడనుండి లాగుకొనుటకు సాహాయ్యముకోరెను. బాదపుడు, ఇమ్మడి యుద్ధమల్లుని పెద్దకుమారుడు. యుద్ధమల్లుని సంతతి మొదటినుండియు దాయాదవైరమును పెంచుకొని వర్ధిల్లినది. బాదప,అమ్మరాజ-విజయాదిత్యులవైరమును, వారికాలపు చరిత్రను స్వర్గీయులైన కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు బాదపుని ఆరంబాకతామ్రశాసనమును ప్రకటించుసందర్భమున వ్రాసిన పీఠికయందు విపులముగా చర్చించి విశదీకరించి యున్నారు. బాదపుడు ముమ్మడి కృష్ణరాజును సాహాయ్యము కోరినరీతిగనే కళింగభూపతినిగూడ కోరియుండవచ్చును. చాళుక్యులకు రాష్ట్రకూటులకు నెట్లు చిరకాలము కులవైరము వర్ధిల్లెనో ఆరీతిగనే గాంగవంశజులైన కళింగదేశాధీశులకును చాళుక్యులకునుకూడ చిరకాలము ప్రబలవైరము సాగియుండెను. అమ్మరాజ-విజయాదిత్యుని తండ్రి కాలమున కళింగభూపతి యోటువడి దురభిమానమున క్రుమ్గుచుండవచ్చును. అమ్మరాజును పదచ్యుతుని చేయుటకును, ఆతనికి దాయాదియు తనకు మిత్రుడునగు బాదపుడు వేంగీమహారాజ్యమున కభిషిక్తుడగుటకును ఆతడు సమయము నిరీక్షించుచుండవచ్చును. అట్టితరుణ మిపుడు తటస్థించెను. బాదపుడు ఒకవంక రాష్ట్రకూటచక్రవర్తిని, మరియొకవైపున కళింగాధీశుని సాహాయ్య మపేక్షించి యుండును. ముగ్గురికిని ఏమతమ యభీష్టము నీడేరునని ముగ్గురు నేకమైరి. కృష్ణరాజు పెద్దసైన్యమును నడిపించుకొని, బాదపుని వేంగీసింహాసనముపై నభిషిక్తుజేసి, తనసామ్రాజ్యము పూర్వపశ్చిమసముద్రములు తాకునట్లు చేయుతలంపుతో కళింగముద్వారా వేంగిపై దండెత్తివచ్చెను. ఆ విపత్సమయమున అమ్మరాజు కృష్ణరాజుపై పగదీర్చుకొనుటకు రాజ్యభారము అన్నభుజములపై బెట్టి, పెద్దబలమును గూర్చుకొని తాను సైన్యాధీశుడై కళింగముపై జైత్రయాత్ర వెడలెను. వేంగిపై దండెత్తివచ్చుటకు కళింగముకంటె తెఱచిన కవాటము లేదు.

అమ్మరాజు దండెత్తిపోవునాటికి పదకొండేడులు రాజ్యమును పాలించెను; అనగా ఆతడు దండెత్తిపోయినది శ. ౮౬౭ సంవత్సరము గావలయును. ఆయేటనే దానార్ణవుని పరిపాలన మారంభమయ్యెను. ఆతనిపాలనము ఎంతకాలముసాగెనో స్పష్టముగ దెలియరాదుగాని శ. ౮౮౦ నాటికి అమ్మరాజు తిరిగి పదస్థుడై రాజ్యభారము పూనియుండె ననుటకు మనశాసనము సాధనమగుచున్నది. మనశాసనమునందు దానము "అస్మద్దేశసంతత్యాయురారోగ్యైశ్వర్యాభివృద్ధ్యర్థం"మని తెలుపబడియుండుటచేత, మహాసంగ్రామానంతరము, అమ్మరాజు, తనప్రజలక్షేమము మనసునందుంచుకొనియే సమస్తభువనాశ్రయ మను ఉమామహేశ్వరశివాలయమును తిరిగి నిర్మించుటకు తాండికొండను దేవభోగముజేసి ఉదకపూర్వకముగా ధారవోసెనని యూహించుట కవకాశముకలదు. కావున దానకాలము కళింగదండయాత్ర జరిగిన రెండేండ్లలోపుగా నుండవచ్చును. అమ్మరాజు కృష్ణభూపతిని సమిత్రబాంధవముగా పూర్తిగా నోడించి నిజరాజధానికి మరలివచ్చిన పిమ్మటనే మనదానశాసనము నిచ్చియుండవచ్చును. అట్లయినచో శ. ౮౮౦ సంవత్సరపు టుత్తరాయణ పుణ్యకాలము క్రీ. శ. ౯౫౮ సంవత్సరము డిశంబరు ౧౪-వ తేదీ యగుచున్నది. ఇదియే శాసనకాల మని నిర్ణయింపవచ్చును.

ఇక శాసనమందలి రెండవభాగమున కాలముఖ-పాశుపతశివాచార్యుల సంతతి వర్ణింపబడినది. కాలముఖ శివయోగుల కాంధ్రదేశమున ప్రాచీనకాలమునుండియు ప్రసిద్ధి యెక్కువగా నుండినట్లు తోచును. కాలముఖ శివయోగులు ప్రసిద్ధులును, మహామహిమసంపన్నులు నగుటచేతగాబోలు రాజచాళుక్యవంశమునకు కులగురువులైరి. అదియుకాక వారి మాహేశ్వరసిద్ధాంతము లాంధ్రదేశమున విస్తారముగా వ్యాపించుటకు కారణములై యుండవచ్చును. మన శాసనమునందు కాలముఖులవృత్తాంతము దెలుపబడినది. ప్రతియుగమునందు ధర్మము నశించినపుడు శైవధర్మముల నుపదేశించి సుజనుల ననుగ్రహించుటకు లకులీశునివంటి స్వయంభువులైన మునీశ్వరులు రుద్రాంశయందు అవతరించుచుందురు. ధర్మపథప్రదర్శనులయిన యా మునీశ్వరులకు శ్రుతులు ప్రమాణములు. వారే కాలముఖులు. వారందరు స్వయంభువులయి వెలయుచు నీ ధరామండలి నేలు రాజులచే పూజింపబడుచుందురు. అట్టి కాలముఖశివయోగులకు సింహపర్షదమువంటి స్థానములు పెక్కులు గలవు. ఆ సింహపర్షదమునకు చెందిన కాలముఖమాహేశ్వరులు అమరవటేశ్వరాలయమువంటి — ఇదియే కృష్ణాతీరమున అమరావతియందున్న అమరేశ్వరాలయము — ప్రసిద్ధ దేవాయతనములందు నివాసమేర్పరచుకొని శైవధర్మములను బోధించుచుందురు. అట్టి కాలముఖసంతతియందు లకళిపుపశుపతి యను మునిపుంగవు డొకడు జనించెను. అతడు సుజల శాక పయః ఫలమూలకములచే తనధర్మశరీరమును బోషించుకొనెను. ఆతనిశిష్యుడు ప్రభూతరాశి పండితుడు.

అతడు సాక్షాద్ధర్మావతారు డని ప్రసిద్ధినొందెను. ఆతనికి విద్యేశ్వర, వామేశ్వరు లను ఇర్వురు శిష్యులుండిరి. ఆప్రభూతరాశిపండితునికి, భువనరాశిమునియని -భ్రాత—తమ్ముడొక డుండెను. 'భ్రాత'యని వర్ణించుటలో నతడు ఆశ్రమస్వీకరణముచేత భ్రాత యయ్యెనో, లేక తత్పూర్వమే సహోదరుడైయుండెనో ఎఱుకపడదు. భువనరాశిమునికి పశుపతి ప్రభూతరాశు లను ఇద్దరు శిష్యు లుండిరి. పశుపతికి కాలముఖేంద్రుడని రెండవ పేరుండెను. అతనికి 'పరహితవ్యసని'యని బిరుదముకూడ నుండెను. కాలముఖేంద్రునిశిష్యుడు విద్యేశ్వరుడు. సముద్రుడు సమస్తజలమును నెట్లు తనయం దుంచుకొనినాడో యారీతిగ విద్యేశ్వరుడు సకలవిద్యలను తనయం దిమిడ్చుకొనినాడు. అందుచేత నాతనికి విద్యేశ్వరుడని అన్వర్థనామమయ్యెను. అతడే అమ్మరాజ-విజయాదిత్యునికి దేశికుడు. ఆతనిశిష్యుడు ముమ్మడిప్రభూతరాశి. విద్యేశ్వరపండితుని ధర్మరాజ్యమునకు ముమ్మడి ప్రభూతరాశి యౌవరాజ్యపట్టము గట్టుకొనెను. ఆయౌవరాజ్యపట్ట మాతడు జగద్వ్యాప్తమైన కీర్తివల్ల గడించుకొనెను. ఆ ప్రభూతరాశిమునిపుంగవుడు లోకోపకారముచేయ దీక్ష గైకొనెను. తన్నాశ్రయించిన ప్రజలకును, ప్రభువునకును అభీష్టముల నెరవేర్చుచుండుటచేత ప్రభూతరాశి అన్వర్థనాముం డయ్యెను.

ముమ్మడి ప్రభూతరాశి గురునియాదేశానుసారముగ గురుసన్నిధియం దుండి, ఒక దేవాలయమును, దానికి జేర్చి శివయోగుల మఠముకొరకు మూడంతస్తులుగల సౌధమును కట్టించెను. ఆమఠమునందు చిత్రములయిన చిత్తరువులను వ్రాయించెను. అందులకై అమ్మభూపాలునివలన పూర్వోదాహృతములయిన అమ్మలపూండి, ఆసువుల పట్టు, గొల్లపూండిగ్రామములను, వేయిమేకలను పరిగ్రహించెను. సమస్తభువనాశ్రయ దేవాయతనమునందు నిత్యదీపారాధనకొరకును, సత్రము సాగించుటకును, మహాదేవునికి నిత్యనైవేద్యములకొరకును, దేవాలయమునకు సున్నము మొదలగునవి చేయించుటకును, వేయిమేకలు, అని అసంపూర్తిగా శాసనము ఆగిపోయినది. శాసనమందు దెలుపబడిన కాలముఖ-పాశుపతయోగులయొక్క సంతతి:



మనశాసనము రుద్రాంశసంభూతుడైన లకులీశ్వరుని పేర్కొనుటచేతను, ఆ మునీశ్వరుని యన్వయమున కాలముఖశివయోగులు జనించి రని తెలుపుటచేతను, లకులీశ్వరుని గురించియు, కాలముఖులను గురించియు సంగ్రహముగా నిచ్చట కొన్ని విషయములు చెప్పుట యావశ్యక మగుచున్నది. లింగ, వాయుపురాణములు రుద్రుని యవతారములలో కడపటివాడు లకులీశ్వరుడని వాకొనుచున్నవి. అంతకంటె లకులీశ్వరునిగురించి విశేషము లేవియు దెలుపకున్నవి: కర్ణాటదేశమందును, లాట (ఘూర్జర) దేశమందును శివాలయములందలి శిలాశాసనములందు లకులీశుని పేరు తరచుగా గనబడుచున్నది. లాటదేశమునందు లకులీశుని శిలాప్రతిమలుగూడ పెక్కుచోట్ల గానబడుచున్నవి. ఈ లకులీశునిగురించి చరిత్రకారులకు చాలకాలమువఱకు నేమియు దెలియరాకుండెను.

లాటదేశమును పరిపాలించిన సారంగదేవుని కాలమునాటి చింత్రప్రశస్తి అను శిలాశాసనము[5]వలన లకులి స్వీకృతరుద్రమూర్తియైన స్వయంభు వనియు, నతనికి, కుశిక, గార్గ్య, కౌరుష, మైత్రేయులను నల్వురు శిష్యు లుండి రనియు దెలియుచున్నది. ఈ వృత్తాంతమునే లింగ, వాయుపురాణములుగూడ దెలుపుచున్నవి. చింత్రప్రశస్తియందు లకులీశ్వరుని యవతార మీరీతిగా వర్ణింపబడినది.

శ్లో॥ భట్టారక శ్రీలకులీశమూర్త్యా
తపఃక్రియాకాండఫలప్రదాతా,
అవాతర ద్విశ్వమనుగ్రహీతుం
దేవః స్వయం బాలమృగాంకమౌళిః॥ ౧౪.

5. ఈ శాసనము ౨౦ అంగుళములు వెడల్పును, ౪౨ అంగుళములు పొడవును గల నల్లరాతిపై చెక్కబడినది. ఇందు ౭౦ పంక్తులు గలవు. ఇది తొలుత బడోదారాజ్యములో జేరిన సోరర్‌జిల్లాలోని దేవపట్టణమున నున్నసోమనాథుని దేవాలయములో నుండెను. ఎప్పుడో, ఎట్లో ఇది పోర్చుగలు దేశమునకు గొనిపోబడెను. ఇపు డిది లిజ్‌బన్ పట్టణమున మ్యూజియములో భద్రముగా నున్నది. ఇది మొదటిసారి ౧౭౯౫-వ సంవత్సరములో **'Murphy's Travel's in Portugal'** అను పుస్తకమునందు ఆంగ్లానువాదముతో సర్ చార్లెసు విల్కిన్సుచే ప్రచురింపబడెను. తరువాత ఎందరో దీనిని ప్రచురించిరి. వారి వెవ్వరికిని సరియైన శుద్ధపాఠములు గాకపోవుటచే సరియైనపాఠము తయారుచేసి, ఆంగ్లానువాదముతో జార్జ్ బూలరు పండితుడు కడసారి ఎపిగ్రాఫియా ఇండికా. సం. ౧లో, పుట. ౨౭౧ ఆదిగా ప్రకటించెను. ఈ ప్రశస్తి ౧౩-వ శతాబ్దమునాటిది. సారంగదేవుని కాలము ఇంచుమించుగా క్రీ. శ. ౧౨౭౪-౧౨౯౬ లగును.

అనుగ్రహీతుం చ చిరం విపుత్రకా
నులూకభూతా నభిశాపతః పితుః,
లలాటముర్వ్యా ఇవ లాటభూషణం
సమేత్య కారోహణ మధ్యవాస యః॥

అవతేరుశ్చత్వారః
పాశుపతవ్రతవిశేషచర్యార్థిణం,
ఇహ కుశిక గార్గ్య కౌరుష
మైత్రేయా ఇతి తదంతసదః॥ ౧౬.

తత స్తపస్వినాం తేషాం
చతుర్ధాజాతి రుద్గతా,
భువం విభూషయామాస
చతురర్ణవముద్రితాం॥ ౧౭.

తాత్పర్యము : బాలమృగాంకము తలపై దాల్చు వేల్పు, మహాదేవుడు, తపస్వులకు ఫలప్రదాత, లోకము నను గ్రహించుటకై లకులీశభట్టారకుడై యవతరించెను. పితృశాపవశమున చిరకాలము అపుత్రకుడైన ఉలూకు నను గ్రహించుటకు లాటదేశమున కలంకారమైన కారోహణమున నివాస మేర్పరచుకొనెను. పాశుపతవ్రత చర్యను లోకమున వ్యాపింపచేయుటకు దానిని వరుసగా కుశిక గార్గ కౌరుష మైత్రేయులను నల్వురుశిష్యుల కుపదేశించెను. ఈనల్వురును నాలుగన్వయములకు మూలపురుషులైరి.

లకులీశముని స్థాపించిన పాశుపతవ్రతమున కాది పీఠము లాటదేశమున కారోహణమునం దుండినట్లు ఈ చిత్రపశస్తివలననే తెలియుచున్నది. లాటదేశ మనగా నిప్పటి బరోడా (బడోదా) రాజ్యమునకు సరిపోవును. కారోహణగ్రామ మిపుడు కార్వాన్ అని బరగు చున్నది. అది మియాగాం-దభాయ్ రైలుమార్గము మీద నున్నది. కార్వానకు తొలుత 'కాయారోహణ' మనియు, కాయవిరోహణ మనియు, మరియు 'కాయా రహుణ్' అనియు పేరు లుండినట్లు స్థలమాహాత్మ్యము దెలుపుచున్నది. ఉల్కాపురీ లేక అవాఖల్ గ్రామ మున నొకవిప్రునియింట శ్రీమన్మహాదేవుడు లోకము నను గ్రహించుటకు లకులీశ్వరుడై యవతరించె ననియు, నామునిపుంగవుడు శివసాయుజ్యమును చెందిన తావు కాయవిరోహణ మనియు నచ్చటిస్థలపురాణము దెలుపు చున్నది. లకులీశ్వరునకు నకులీశ్వరుడని నామాంతరము గూడ గలదు. లింగపురాణమందు నకులి యనియే గలదు. దీనికి కారణము ఆంధ్రమునందువలెనే, ఘూర్జరభాష యందు గూడ 'న' 'ల' లకు భేదము లేదు. 'ల' 'న' యగుటయు, 'న' 'ల' యగుటయు ఘూర్జరభాషాసం ప్రదాయము. కాని 'లకులీశ' యను పేరే ప్రాచీనతర మైన దని బూలరుపండితునియభిప్రాయము.

లకులీశుని పాశుపతవ్రతము శైవాగమములందును, సాయణాచార్యుని సర్వదర్శనసారసంగ్రహమునందును వివరింపబడియున్నది. లింగ, వాయుపురాణములు లకు లీశ్వరు డుపదేశించిన పాశుపతయోగమును మాహేశ్వర యోగ మనికూడ పేర్కొనుచున్నవి. పాశుపతవ్రతము నందు పాశుపతయోగాభ్యాసమున శివయోగి మరణించు నపుడు తనప్రాణవాయువులను నాసికాపుటములనుండి విడువక బ్రహ్మరంధ్రమునుండి విడుచును. దానివలన కపాలము వ్రక్కలయి జీవములు దేహమును విడుచును.

లకులీశ్వరు డేకాలపువాడో నిర్ణయించుట కిపుడు కొన్ని ఆధారములు లభించినవి. చిత్రప్రశస్తియందు లకులీశుని రెండవశిష్యుడు గార్గ్యుడు లాటదేశమున పాశు పతపీఠమును స్థాపించినట్లు తెలుపబడినది. కాని యీ చిత్రప్రశస్తియందు లకులి యేకాలపువాడో తెలుసు కొనుటకు సాధనములు లేవు. ఇపుడు మరియొకశాస నము ఉత్తరహిందూస్థానమున మథురాపట్టణమున లభిం చినది. అచ్చట రంగేశ్వర మహాదేవుని ఆలయమునకు సమీపమున చందుల్‌మందుల్ బగీచీ అనుచోట నొక నూతిగోడకు స్థాపితము చేయబడి కల దొకగుప్తరాజుల కాలమునాటి ప్రాతశిలాశాసనము. అందు మాహేశ్వరు డైన ఆర్య ఉదితాచార్యుడు తాను భగవానుడైన కుశునికి పదియవతరమువా డనియు, మరియు పరాశరునకు నాల్గవ తరమువా డనియు, భగవానుండగు ఉపమితేశ్వరునకు ప్రశిష్యు డనియు, భగవానుండగు కపిలమునీంద్రునకు శిష్యు డనియు,మరియు తాను గుప్తశకము ౬౧-వ సంవత్స రమున ఆషాఢ శుద్ధ పంచమినాడు, స్వపుణ్యాప్యాయన నిమిత్తముగ, గురువుల కీర్తికొరకు, గురువుల ప్రతిమతో

గూడిన ఉపమితేశ్వర, కపిలేశ్వరలింగములను గుర్వాయతనమున[6] నందు ప్రతిష్ఠించెననియు నందు తెలిపినాడు.

ఇందు పేర్కొనబడిన భగవానుడను కుశికాచార్యుడు లకులీశుని యగ్రశిష్యుడనుటకు సంశయమక్కరలేదు[7]. దానినిబట్టి జూడ ఆచార్య కుశికుడుత్తరాపథమునందు మథురాపట్టణమున నివసించి లకులీశ్వరుని పాశుపతవ్రతమును లేక మాహేశ్వరయోగమును జనులకు అనుగ్రహించెనని తోచుచున్నది. లింగ, వాయుపురాణములందును, చింత్రప్రశస్తియందును దెలుపబడినవిషయముగా లకులీశ్వరుని నల్వురుశిష్యులును నాలుగు అన్వయములకు మూలపురుషులైనట్లుగా స్పష్టపడుచున్నది. మథురాశాసనకాలము గుప్తశకమున నీయబడినది. అది రెండవచంద్రగుప్త చక్రవర్తికాలము. గుప్తశకము ౬౧ సంవత్సరము క్రీ.శ. ౩౮౦-౮౧కి సరిపోవుచున్నది. కావున గురుప్రతిమాలింగములు ప్రతిష్ఠించినది సరిగా క్రీ. శ. ౩౮౦ సం॥ జూను ౨౩-వ తేదీ యగుచున్నది. ఈసంవత్సరమున ఆర్యఉదితాచార్యుడు- కుశికునకు పదియవతరమువాడు-జీవించియుండెను. సగటున తరమునకు ౨౫సంవత్సరముల చొప్పున లెక్కించిచూచిన భగవానుడను కుశికునికాలము క్రీ. శ. ౧౩౦ సంవత్సరప్రాంతమగుచున్నది. ఆతనికి గురువైన లకులీశ్వరుడు ఇంచుమించుగా క్రీ. శ. మొదటి శతాబ్దపు కడపటి భాగమునను రెండవశతాబ్దాదిని జీవించియుండినట్లు నిర్ధారణ చేయవచ్చును[8].

ఇంతవఱకు దెలిసినదానినిబట్టి, కుశికుని సంతతి యుత్తరాపథమునందును, గార్గ్యునిసంతతి లాటదేశమునందును నాసత్రయతనులు కొనసాగించుచుండిరి. వ్యాపింపజేసినట్లునిర్ణయింపవచ్చును. దక్షిణాపథమునకర్ణాటాంధ్రదేశములందు వీరిమతము స్థాపించినవారు కౌరుష, మైత్రేయులలో నెవరో యింకను నిర్ణీతము కాలేదు. ఆంధ్రకర్ణాటదేశములందు మాహేశ్వరయోగమును లకులిసిద్ధాంతమును బోధించుచువచ్చిన కాలముఖులు ప్రతులను ప్రమాణముగా గైకొని శైవసిద్ధాంతములను ప్రజలందు వ్యాపింపజేసియుండిరి. కాలముఖ - పాశుపతయోగీంద్రులు సాధారణముగా పురాణప్రసిద్ధశివాలయములందు నివాసమేర్పరచుకొనుచుండిరి. ఆంధ్రదేశమున అమరవటేశ్వరాలయమును, కర్ణాటదేశమున దక్షిణకేదారేశ్వరాలయమును వీరికి ప్రధానపీఠస్థానములు. అమరవటేశ్వరాలయము నేడు అమరేశ్వరాలయమని బరగుచున్నది గుంటూరు తాలూకా అమరావతియందున్నది. బళ్ళగామె, లేక బలగామి అని పూర్వము పిలువబడుచుండిన బెల్గామునందు దక్షిణకేదారేశ్వరుని దేవళమున్నది. ఈకాలముఖశైవులకు సింహపరిషదము శక్తిపరిషదము, పాతెయపరిషదము అనుపేర్లుగల పెద్ద సంఘములు గలవు. ఇవియన్నియు, ఒక్కొక్క 'ఆమ్నాయ' మునకు చెందినట్లు శాసనములవలన దెలియుచున్నది.

దక్షిణాపథమున కాలముఖయోగీంద్రుల ప్రశంస తొలుత కర్ణాటదేశమున మైసూరు ప్రాంతమున గానవచ్చుచున్నది. అచ్చట దొరకినట్టి క్రీ.శ. ౮౧౦-వ సంవత్సరమునాటి యొక తామ్రశాసనమునందు కాలముఖ-పాశుపతవ్రతులు పేర్కొనబడియున్నారు[9]. తరువాత ఆంధ్రదేశమున దొరకిన మనశాసనమందు గాన

---

6. గుర్వాయతన మనగా గురువులపేరట వారి ప్రతిమలతోగూడిన లింగములను వారి స్మారకచిహ్నముగ ప్రతిష్ఠింపబడిన గృహము. దానికే ప్రతిమాగృహమనిగూడ చెప్పవచ్చును.

7. ఇది దేవదత్త రామకృష్ణభండార్కరుగారియభిప్రాయము. నేనును ఈయభిప్రాయముతో నేకీభవింతును.

8. ఈయూహ దేవదత్తరామకృష్ణ భండార్కరుగారిమతము ననుసరించి చేసితిని. వారును లకులీశునికీకాలమే నిర్ణయించుచున్నారు. చూడుడు. **Ep. Ind., Vol. XXI. p. 7.**; మరియు **J. Bom. Br. A. S., Vol. XXII, p. 157.** ఈకాలనిర్ణయమునే డాక్టరు ఫ్లీట్ గూడ నంగీకరించినాడు. J. R. A. S, 1907, p 424.

9. **Mysore. Arch. Rep. for 1914, p. 29.** ఈ విషయమును నాకు దయతో తెలిపిన శ్రీ యస్. లక్ష్మీనారాయణరావుగారికి నేను మిక్కిలికృతజ్ఞుడను.

వచ్చుచున్నారు. పిమ్మట తమిళదేశముపాండ్యరాజ్యమున విక్రమకేసరి కాలమునాటి కొడుంబాలూరు శిలాశాసనమున గానవచ్చుచున్నారు 10. ఈ రెండును పదియవశతాబ్దమునాటివి. వీటి తరువాత బళగామి శాసనములందు పదకొండు, పండ్రెండు, పదమూడు శతాబ్దములందు వారి ప్రశంస గానవచ్చుచున్నది.

కొడుంబాలూరు శిలాశాసనమందు విద్యారాశి, తపోరాశి అను ఇద్దరకు శిష్యుడనని చెప్పుకొనిన మల్లికార్జునయోగి యొకడు పేర్కొనబడియున్నాడు. అందు విక్రమకేసరిమహారాజు తన యిరువురిగాణుల పేరను నొకశివాలయమును, తన పేరట మరియొకశివాలయమును మొత్తము మూడుశివాలయములను ప్రతిష్ఠచేసెనని తెలుపబడెను. విక్రమకేసరి తనగురువగు మల్లికార్జునశివాచార్యులకు నొక పెద్దమఠము (బృహన్మఠము) గట్టించెను. అసితవక్త్రులను మాహేశ్వరయోగులకు నిత్యము యేబదిమందికి మృష్టాన్నభోజనము పెట్టుటకు పదకొండుగ్రామములను దేవభోగముగా ధారవోసెను. ఆ శాసనము స్వర్గీయులైన రాయిబహాదూర్ వెల్వికుడి వెంకయ్యగారు పదియవశతాబ్దపు నడిమికాలమునాటిదని నిర్ణయించిరి 11. వారి నిర్ధారణమును ఆచార్య నీలకంఠశాస్త్రిగారుకూడ నంగీకరించియున్నారు 12. వీరి యభిప్రాయమునుబట్టి చూచిన మల్లికార్జునశివయోగి అమ్మభూపాలుని గురువులయిన విద్యేశ్వర ప్రభృతరాశులకు సమకాలికుడు గావచ్చునని తోచును. మల్లికార్జునయోగికి గురువులయిన విద్యారాశి తపోరాశులు పైనిచ్చిన వంశవృక్షములోని విద్యేశ్వర వామేశ్వరపండితు (౪, ౫ గురు) లగుదురాయని వారి సమకాలీనతనుబట్టి సంశయముకలుగుచున్నది. ఈసంశయమే యథార్థమయినచో కాలముఖ-పాశుపతవ్రతమును, లకులిసిద్ధాంతమును ఆంధ్రదేశమునుండి తమిళభూమికి వ్యాపించెనని యూహింపవచ్చును. కాలముఖులనుగూర్చి ప్రశంసచేయు శాసన మింకొకటి కలదు. రామనాథపురం జిల్లా తిరుచ్చులి గ్రామశివారు పల్లిమదంగ్రామమున కాలనాథస్వామిదేవాలయమునందు పూర్వ మొకప్పుడు కాలముఖులమఠ మొకటి యుండెను. అచ్చట నివసించిన శివయోగులు మహావ్రతులని పిలువబడుచుండిరి13.

కన్నడదేశమందు కాలముఖపాశుపతశైవము పదకొండవశతాబ్దమున గొప్ప వ్యాప్తికి వచ్చినట్లు శాసనములవలన దెలియుచున్నది. బళ్లారి జిల్లా, హడగల్లి తాలూకా మొరిగెరె గ్రామమున కల్లేశ్వరగుడి కలదు. అచ్చట మొదటి ఆహవమల్ల సోమేశ్వరునికాలమునాటి రెండు శాసనములు గలవు అవి రెండును శక ౯౭౭ సంవత్సరమున కార్తిక శుద్ధ పూర్ణిమ సోమవారమునాడు (క్రీ. శ. ౧౦౫౫ సం|| అక్టోబరు ౨౫-వ తేదీ) చంద్రగ్రహణనిమిత్తమున లకులీశ పాశుపతవ్రతులయిన శివయోగులకొరకు చేయబడిన దానములను దెలుపుచున్నవి. ఇక్కడ పేర్కొనబడిన కాలముఖశివయోగులు శక్తిపర్షదమునకు చెందినవారని తెలుపబడిరి. శక్తిపర్షదమునకు సింహపర్షదమునకుగల తారతమ్య మెట్టిదో వారిసిద్ధాంతములు దెలుపుగ్రంథములు దొరకినగాని తెలుసుకొన వీలుపడదు. ఈశక్తిపర్షదము మూవరకోణేయ సంతతిలోనిదనియు, శక్తిపర్షదములో పర్వతావలి లేక పర్వతామ్నాయమని యొకశాఖ కల దనియు కన్నడదేశములోని అబ్బలూరిశాసనములవల్లను, బళగామిలో దక్షిణకేదారేశ్వరునిగుడియందలి శాసనములవల్లను దెలియుచున్నది14. మూవరకోణేయసంతతిని స్థాపించిన శివయోగి కాలముఖుడేయైనను, కాలముఖసిద్ధాంతములకు కొంచెము భిన్నములయిన సిద్ధాంతములను బోధించు

10. Madras Ep. Colln., No. 129 of 1907.

11. Madras Epigraphical Rep. 1908, para. 85, p. 76.

12. J. Or. Res., Vol. VII, p p. 1–12.

13. Ep. colln. No., 428 of 1914.

14. Ep. Ind., Vol. V, pp. 218–222.

నొక ప్రత్యేకసంతతిని స్థాపించినట్లు తెలియుచున్నది. ఈ మూవరకోణేయసంతతిని స్థాపించిన ఆచార్యుడు కేదారశక్తియను యోగీంద్రుడు. ఇతనికాలము తెలియదు. ఇతడు బళ్ళిగామియందున్న పంచలింగేశ్వరుని గుడియందున్న కాలముఖమఠమును విడిచివచ్చి యాయూరనే దక్షిణ కేదారేశ్వరుని ప్రతిష్ఠచేసి, యందొక మఠము కట్టించి యచ్చట మూవరకోణేయసంతతికి పీఠమును స్థాపించెను. దానిపేరు కేదారమఠము లేక కేదారస్థానము. దానికే కోడిమఠమనికూడ పేరుండెను.

బళ్ళిగామిలోని పంచలింగేశ్వరాలయమున నొక శాసనమందు కాలముఖపాశుపతవ్రతమును బోధించిన లకులీశ్వరుడీక్రిందివిధముగా వర్ణింపబడినాడు.15. "సమస్తతర్క్యాది శాస్త్రపారావారపారగం, వాదిరుద్రం, వాదీభమస్తక నఖాస్ఫాటన కిశోరకేసరి, వాదిమహారణ్య దవదహనం, దుష్టవాదినిష్ఠుర పటిష్ఠ శార్దూలం, బౌద్ధాబ్ధిబడబాముఖం, మీమాంసక ధాత్రీధర వజ్రం, లోకాయతమహాతరువిదారణక్రకచం, సాంఖ్యాహీంద్రరుంద్రవైనతేయం, అద్వైతవాది భూజకుఠారం, అకలంక16 త్రిపురదహన త్రిణేత్రం, వాదిఘరట్ట దిశాపట్టం, మాధవభట్టఘరట్టం, జ్ఞానానంద మదభంజనం, విశ్వానంద ప్రళయోగ్రానలం, అభయచంద్రకాలానలం, వాదీభసింహశరభం, వాదిరాజముఖముద్రం, నయణందిదిశాపట్టం, నైయ్యాయిక సంరక్షైకదక్షం, స్వపక్షపోషణ పరపక్షదూషణ పటుతర విరించిం, వాగ్వధూమండనాస్థానపద్మాసనం, వివేక నారాయణం, గమకమహేశ్వర నుపనయాసామరాపగాప్రవాహం, వ్యాఖ్యాన కేళీలంపట మనోహరసరసీరుహభృంగం, అవదాతకీర్తిధ్వజం, అమలినచరితం, ద్విష్టదప్పిష్టపండితగళకాలపాశం, వాదిదిగంబర ధూమకేతువాది రుంద్రగుణ నామాంకితప్ప శ్రీమల్లకులీశ్వరపండితాయ".

సర్ రామకృష్ణగోపాలభండార్కరుపండితుడు "మహావ్రతుల"నుగూర్చి వ్రాయుసందర్భమున, కాపాలికులని, కాలముఖులని వ్యవహరింపబడుచుండిన శివయోగులే మహావ్రతులని నిర్వచించెను. విద్వాంసుడైన భండార్కరుని యభిప్రాయము సరియైనదిగాదనితోచుచున్నది. మహావ్రతులు కాలముఖులు కావచ్చునేమోగాని, కాపాలికులుమాత్రము కాజాలరు. కాలముఖులు వేరు, కాపాలికులు వేరు. ఉభయులసిద్ధాంతములును వేరువేరుగానున్నట్లు తోచును. కాపాలికులసిద్ధాంతము లకులీశుని పాశుపతసిద్ధాంతముకంటె ప్రాచీనతరమైనది. ఈరెండు సిద్ధాంతములయొక్క తారతమ్యమును విమర్శించి పండితులు మనకు తెలుపుటావశ్యకము.

దాన మివ్వబడిన గ్రామములనుగూర్చియు, వాటి సీమావధులనుగూర్చియు కొంత తెలుపవలసియున్నది. తాండికొండగ్రామము నేటి తాడికొండ యనుటకు సందియ మావంతయు లేదు. కాని గొల్లపూండి తప్ప మిగిలిన అమ్మలపూండి, ఆసువులపట్టు గ్రామములను గుర్తింపవీలులేదు. గొల్లపూండి నేటికిని నిలచియున్నది. తాడికొండకు పదిపండ్రెండు మైళ్లదూరముననున్న అనుమర్లపూడియగ్రహారము పూర్వపు అమ్మలపూండి గావచ్చునాయని సంశయము కలుగుచున్నది.

తాండికొండకు దక్షిణపుసీమగా చెప్పబడిన లాము నేటికిని గలదు. తాడికొండగ్రామ ముత్తరదిశను రెండు కొండల నానుకొనియున్నది. అందొకటి రేనుకతాలు గావచ్చును. పడమటిదిశను పెద్దతటాక ముండినట్లు చిహ్నములు గానుపించుచున్నవి. అదియే చయిత లేక చైత్యతటాకము గావచ్చును. ఆప్రాంతమున దొలుత బౌద్ధమును తరువాత శైవమును వర్ధిల్లినట్లు ఛాయలు కానుపించుచున్నవి. ఆతటాకపు తూర్పుటొడ్డున భీమలింగముదిబ్బయని యొక పెద్దమైదానము కలదు. అచ్చట శిథిలమయిన శివాలయమును, శివలింగములును గానవగును.

15. Mysore Inscriptions, p. 146.; Ep. Ind., Vol. X , p. 127.

16. ఈ అకలంకుడు ౮-వ శతాబ్దమువాడు. కాని యిచ్చట జైనుల నుద్దేశించి వ్రాయబడినపేరిది.

తాండికొండాదులు గుడ్లకండేఱువాటివిషయములోని వని తెలియుచున్నది. తాండికొండచుట్టును గలసీమయే పూర్వము గుండ్లకండేఱువాడియని పిలువబడుచుండినట్లు దీనినిబట్టి మన మూహించుకొనవచ్చును. గుడ్లకండేఱువాడి యనగా గుడ్లు(గుళ్లు) లేక దేవాలయములు గల కండేఱువాడియని యర్థము చెప్పవచ్చును. కండేఱువాడి యను పేరు ఒకప్పుడు ప్రసిద్ధమైయుండిన కండేరు లేక కంటేరువాకనుండి వచ్చియుండవచ్చునని స్వర్గీయులైన లక్ష్మణరావుగారు మొదలయినవారి యభిప్రాయము. అది సరియైనది గావచ్చును. అట్లయినచో నిప్పటి కంతేరు గ్రామము పూర్వము కండేఱువాటిక లేక కండేఱువాడ అని పిలువబడుచుండవలయును.

మొదటి కండేఱువాటి విషయము17 చాలా పెద్దదిగా నుండవలయును. ఇంచుమించుగా నది యిప్పటి గుంటూరు జిల్లాలోని తూర్పు తాలూకాలను చేరియుండవచ్చును. కొంతకాలమునకు కండేఱువాడివిషయము రెండు మూడు చిన్నవిషయములుగా విభజింపబడి యుండవలయును. అందువలన ఉత్తరకండేఱువాడి18 విషయ మనియు, ఈమనికండేఱువాడి19 విషయ మనియు, గుండ్లకండేఱువాటివిషయ మనియు పేర్లు శాసనములందు గానవచ్చుచున్నవి. ఉత్తరకండేఱువాడి విషయము గుంటూరు తాలూకాలో నుత్తరభాగమునకు వర్తించెనని తోచుచున్నది. గుండ్లకండేఱువాటి అమరావతి తాడికొండ మొదలగు గ్రామములు గల కృష్ణకు దక్షిణపుగొడ్డు సీమకు చేరై యుండెను. ఈమనికండేఱువాడివిషయము ఇప్పటి తెనాలితాలూకాలోని యుత్తరభాగము గావలయును. ఇదిగాక కొనకండ్రెవాడి20 యను యింకొక విషయము కలదు. అది బెజవాడ చుట్టునుగల ప్రాంతమునకు చెందియుండినట్లు గన్పట్టును. కండేఱువాడి ఇప్పటి గుంటూరు తాలూకాలోని కంతేరుగ్రామ మయియుండెనేని నది యొక్కప్పుడు ప్రసిద్ధమైన నగరమై యుండవలయును.

---

17. S. I. I., Vol. I, No. 86 (line 4); 3 No. 87 (line 21). మొదటి అమ్మరాజుయొక్కయు, రెండవచాళుక్య భీమునియొక్కయు శాసనములందు కనబడుచున్నది. Ep. Ind., Vol. XVIII, p. 258 కూడ చూడుడు.


18. Ep. Ind, Vol. V, p. 127, text line 23; C. P. No. 1 of 1913–14.

19. South Ind., Ins., Vol. IV, No. 681.

20. South Ind., Ins., Vol. IV, Nos. 781. 781–A

శాసనము : మూలపాఠము[1]

మొదటిరేకు : రెండవ వైపు



౧. ఓం [।*] శ్రీనాగేశకరాబ్జానాన్3 స్వపాద నఖచంద్రమాః [।*] దేయా త్రివస్వయం4 శం వః

౨. క్రియాకార్య్యాణాం హి కారణమ్ ॥ [౧*] స్వస్తి [।*] శ్రీమతాం సకలభువన సంస్తూయమాన మాన -

౩. వ్యసగోత్రాణాం హారీతి పుత్రాణాం కౌశికీ వరప్రసాదలబ్ధరాజ్యానా మ్మాతృగణపరిపాలితా -

౪. నాం స్వామిమహాసేనపాదానుధ్యాతానాం భగవన్నారాయణ ప్రసాద సమాసాదిత వ [ర *]

౫. వరాహలాఞ్ఛనేక్షణక్షణ వశీకృతారాతిమణ్డలానా మశ్వమేధావభృథస్నాన ప -

౬. విత్రీకృతవపుషాం చాలుక్యానాం కులమలంకరిష్ణో స్సత్యాశ్రయివల్లభేన్ద్ర -

౭. స్య భ్రాతా కుబ్జవిష్ణువర్ద్ధన నృపతి రష్టాదశవర్షాణి ।5 వేంగీదేశ మపాలయత్ ॥

౮. తదాత్మజో జయసింహ స్త్రయస్త్రింశత్ ॥ తదనుజేన్ద్ర రాజనన్దనో విష్ణువర్ద్ధనో నవ ॥ త -

౯. త్సూను మ్మఙ్గియువరాజః పంచవింశతిం [। *] తత్పుత్రో జయసింహ స్త్రయోదశ ॥ తదన -

---

1. నాకు డాక్టరు యన్. పి. చక్రవర్తిగారు పంపించిన సిరాబింబములనుండి ఇది వ్రాయబడినది.


2. అనుష్టుభ్ శ్లోకము.

3. °బ్జానాం° అని చదువుడు.

4 °స్స్వయం° అని చదువుడు.

5. ఈ స్తు అనవసరము.

రెండవ రేకు : మొదటివైపు



౧౦. రజః కొక్కిలి ష్షణ్మాసాన్ ॥ అస్య జ్యేష్ఠభ్రాతా విష్ణువర్ధనస్తముచ్చాట్య సప్తత్రింశతం ॥ తత్పు-
౧౧. త్రో విజయాదిత్యభట్టారకోఽష్టాదశ ॥ తత్సుతో విష్ణువర్ధన ష్షట్త్రింశతం ॥ [6]తత్సూను ర్బ్భాళ-
౧౨. ను భాసో రణవిగణనయా నీలకణ్ఠాలయానాం ॥[7] స గ్రామా రామకాణాం సలలితరమణీ సం-
౧౩. పదాం సత్పదానాం[।*] కృత్వా ప్రోత్తుంగ మష్టోత్తరశత మభున గ్వీరథీ రష్టయుక్తా[।*]శ్చత్వా-
౧౪. రింశత్సమాం ఙ్మాం జనసుత విజయాదిత్యనామా నరేన్ద్రః ॥ [౨] తత్పుత్రః కలివిష్ణువ-
౧౫. ర్ధనో ధ్యర్ధవర్షమ్। తత్సుతో గుణగాంకవిజయాదిత్య మహారాజ శ్చతుశ్చత్వా-
౧౬. రింశతమ్ । తదనుజ యువరాజ విక్రమాదిత్య నరపాత్మజః చాలుక్యభీమభూప స్త్రింశతమ్[।*]
౧౭. [8]తత్పుత్రో విజయాదిత్యో ద్విషత్సిన్ధనపావకః స షణ్మాసా నసౌ సాక్షా ద్దిన్ద్రో భోగేన భూ-
౧౮. మిపః ॥ [౩*] తత్సూను రమ్మరాజ స్సప్తవర్షాణి । తత్పితామహో గుణగాంకవిజయాదిత్యానుజ యు
౧౯. ద్ధమల్లాత్మజః తాలాధిపో మాస మేకమ్ । తం యుధి వినిహత్య చాలుక్యభీమాత్మజో విక్రమా-

---

6. స్రగ్ధరావృత్తము.
7. ఈగుర్తు అనవసరము.
8. శ్లోకము అనుష్టుభ్.

రెండవ రేకు : రెండవ వైపు

౨౦. దిత్యః అరినికరతిమిరదినకరః ద్విజదీనానాథబన్ధు రేకాదశమాసాన్ । 9తత స్తాలపరాజస్య-

౨౧. సూను స్సూనృతవాక్ప్రభుః। యుద్ధమల్ల స్సగాదీశ స్సప్తవర్షా ణ్యపాద్భువమ్॥[౮*] 10నిర్జిత్యోర్జితసన్ని-

౨౨. భో జనపదా త్త న్నిర్గమయ్యోద్ధతా న్దాగాద్యా నినభానులీనభగణాకారా న్విధా యేతరాన్[।*]

౨౩. వ్రశీవోర్జ్జిత నాక మమ్మనృపతే భ్రాతా కనీయా న్బవం భీమో భీమపరాక్రమ స్సమభునక్ సంవ-

౨౪. త్సరా న్ద్వాదశ ॥ [౯*] 11తస్య మహేశ్వరమూర్తి12రుమాసమానాకృతేః।13తనూ రాభూ[।*] లోక-

౨౫. మహాదేవ్యాః ఖలు య స్సమభవ దమ్మరాజాఖ్యః॥ [౧౦*] 14జలజాతపత్ర చామరక-

౨౬. లశాంకుశ లక్షణాంక కరచరణతలః[।*] లసదాజానువలంబిత భుజయుగపరిఘో నిర్ద్వి-

౨౭. సాహసరసికః ॥ [౧౧*] వివిధ ధరాధిపవిద్యో విని విధాయుకకోవిదో విలీనారికులః। కరితురగాగమ-

౨౮. కుశలో హరచరణాంభోజయుగలమధుపః శ్రీమాన్। [౧౨*] 15కవిగాయకకల్పతరు ద్విజముని దీ-

౨౯. నానాథబన్ధుజనసుగభిః[।*]గూచకగణచింతామణి రవనీశమణి ర్మూర్తిసహో గ్రమహసాద్యుమభిః॥16[౧౩*]

---

9. శ్లోకము అనుష్టుభ్.
10. వృత్తము శార్దూలవిక్రీడితము.
11. ఆర్యావృత్తము.
12. °మూర్తే° అని చదువుడు.
13. ఈగుర్తు అనవసరము.
14. ఈశ్లోకమును, తరువాతిది ఆర్యావృత్తములు.
15. శ్లోకము ఆర్యగీతి.
16. " ద్యుమణిః " అని చదువుడు.

మూడవ రేకు: మొదటివైపు



3౦. 17నభ వసు వసు సంఖ్యాబ్దే శకసమయే మార్గశీర్షమాసేస్మిన్ [।*] కృష్ణత్రయోదశ ది -

3౧. నే భృగువారే మైత్రనక్షత్రే [॥*౧౦] 18ధనుషి రసౌ ఘటలగ్నే ద్వాదశ వర్షేషు జన్మనః పట్టా-। మో

3౨. ధా రుదయ19గిరిన్ద్రో) రవిమివ లోకానురాగాయ ॥ [౧౧*] 20యస్మిన్ శాసతి నృపతౌ పరిపక్వానే -

33. క [సస్య *] సంపచ్ఛాలీ । సతత పయోధేను రభిన్నీ౼రీతి రపరుగ్నిర స్తచోరో పేశః ॥ [౧౨*]
21యస్మి న్వ్రిజతి క్షితి -

3౪. పే బ(హి*) రుద్యానావలోకనార్థం భీతాః । తద్దిగ్దేశాధీశాదిశన్తి మణి కనక హయ గజే -

3౫. న్ద్రి)ప్రతతిం22 ॥ [౧౩*] 23మో రూపేణ మనోజం విభవేన మహేన్ద్రి) మహిమకర సురుమహసా

3౬. (।) హార మరిపుర [ద*]హనేన న్య24కుర్వ్వ౼ న్భాతి వితత దిగవని కీర్త్తిః॥ [౧౪*] స సకలరిపున్నృపతిమకు-

3౭. టతటఘటిత మణిగణ మధుకరనికర పరిచుంబిత చరణ సరసి(సీ)రుహ యుగలో౨

3౮. యుగలోచన పదకమలవిలసన్మఘుపాయమానో మానోన్నతో (న)తోద్ధత స్సమస్త భు-

3౯. వనాశ్రయ శ్రీ విజయాదిత్య మహారాజాధిరాజపరమేశ్వరః పరమ భట్టారకః పరమ-

---

17, 18. ఆర్యావృత్తములు.

19. "మోఘాదుదయ" అని చదువుడు.

20. ఆర్యగీతిశ్లోకము; "యస్మిఞ్ఛాసతి" అనిచదువవలయును.


21. ఆర్యగీతి శ్లోకము.

22. °పదాతీన్° అని చదువుడు.

23. ఆర్యగీతి శ్లోకము.

24. °న్యక్కుర్వ్వ౼° అని చదువుడు.

మూడవరేకు : రెండవ వైపు



౪౦. మాహేశ్వరః ॥ గుడ్లకర్డ్డెవ్వాడివిషయనివాసినో రాష్ట్రకూటప్రముఖా న్కుటుంబినః స -
౪౧. మాహూయే త్థమాజ్ఞాపయతి విదితమస్తు వః ॥ విజయవాట్యాం చాలుక్య కులతిల
౪౨. క సమస్తభువనాశ్రయ విజయాదిత్యనరేన్ద్రి మృగరాజ ప్రతిష్ఠాపితాయ సమస్త-
౪౩ భువనాశ్రయ నామ దేవాలయ నివాసాయ ఉమామహేశ్వరాయ ఉత్తరాయణ నిమి
౪౪. త్త అస్మద్దేశ స న్త త్యాయురారోగ్యైశ్వర్య్యాభివృద్ధ్యర్థం తద్దేవాలయ ఖం
౪౫. డ స్ఫుటిత నవకర్మ్మ బలినివేద్యాతోద్య సత్రప్రవర్త్తనార్థం చ ॥25 అల్ప -
౪౬. వృత్తితయా ఆలూన విశీర్ణ్ణం పునర్ణ్ణవీ 26కర్త్తుం సర్వ్వకరపరిహారేణ దేవ(భో)గీ(కృ)
౪౭. 27తోదకపూర్వ్వం తాణ్డికొణ్డనామగ్రామః అమ్మలపూణ్డి గొల్లపూణ్డి ఆసువులపట్టు నా
౪౮. మాదిసమేతో స్మాభి ర్దత్త ఇతి ॥ అస్య స గ్రామస్యాటిక28 స్యావధయః ॥ పూర్వ్వతః తూ-
౪౯. ణ్డేలు ॥ ఆగ్నేయతః గారలగట్ట ॥ దక్షిణతి [ః*] లామున యుత్తరంబున బూరుగు ॥ నైరృత్యతః

---


25. ఈ సర్త్త అనవసరము.

26. °పునర్ణవీ° అని చదువుడు.

27. °కృతోదక° అని చదువుడు.

28. °సద్గ్రామటికస్య° అని కొబోలును అసలుపాఠము.

శాల్గవరేకు : మొదటివైపు



౫౦. ఒడ్డగుణ్ట ॥ పశ్చిమతః 29 చయితనామితటాతకమ్ ॥ వాయవ్యతః భీమసముద్రనా-
౫౧. మతటాక[మ్॥*] ఉత్తరతః ఎనుకటాలు ॥ ఈశానతః రేగడుగుణ్ట ॥ 30 యుగేయుగే |31
౫౨. స్వీకృతరుద్రమూర్త్తయో మునీశ్వరాః శ్రీకులీశ్వరాదయః | బభూవ రత్రానుగృహీతసజ్జనాః |32
౫౩. స్వయంభువో ధమ్మ్ర్మపథప్రదర్శినః ॥ [౧౫*] తదన్వయే కాలముఖాః శ్శ్రితిముఖ్యా స్స్వయంభువో భువి
౫౪. భూభృతా మభివన్ద్యా[ః*] త త్సింహపర్వతద స్తే స్థానస్యాస్యాధిపతయ 33 ఇహా హితచ-
౫౫. రితాః తేషా మమరవటేశ్వరా ద్యనేకపురాణ దేవాయతన నివాసి[నాం] కాలముఖాం
౫౬. నాం సంతతౌ ॥ 34 లకశిపు న్నిఖిలాగమ పారదృక్ పశుపతి మ్మునిపోపి పతిశ్శ్రియః ॥ సుజ-
౫౭. లశాకపయః ఫలమూలకై ర్విహిత ధమ్మ్ర్మశరీర వివర్ద్ధనః ॥ [౧౬*] య స్తస్మాన్నేశ్శిష్య[ః*] ప్రభూత
- రాశి న్నామ--
౫౮. పణ్డిత స్సాక్షాద్ధమ్మ్ర్మవతారః[।*] తచ్ఛిష్యౌ విద్యేశ్వర వామేశ్వరౌ॥ తత్ప్రిభూతరాశి 35 భ్రాతృ
భువనరా-
౫౯. శిమునే శ్శిష్యౌ పశుపతి[ః*] ప్రభూతరాశిశ్చ| కాలముఖేన్ద్రౌ ద్వ్యపరనామా|36 తచ్ఛిష్యః పశుపతిః పర-

---

29. 'చైత్య' యొక్క రూపాంతరమేమో 'చయిత' అనునది?
30. వంశస్థవృత్తము.
31. ఈగుర్తు అనవసరము.
32. ఈగుర్తు అనవసరము.
33. ° పరహిత ° అని చదువుడు.
34. ద్రుతవిలంబితవృత్తము.
35. ° రాశే ర్భ్రాతు ° అని చదువుడు.
36. ఈగుర్తు అనవసరము.

నాల్గవ రేకు : రెండవ ప్రక్క



౬౦ హితకస్య । తస్య సూనోర్యశ్చ [।*] 37విద్వాన్ విద్యేశ్వరో నామ కర్త్తా మాన్యశ్చ కల్పిజం సర్వవిద్యా స్వనూ-

౬౧. నౌ యథాంబూని మహాంబునిధిః ॥ [౧౮*] 38తత్కీర్త్తి లక్ష్మ్యా యువరాజ ఏకోప్యనేకలోకోప కృతావనేక ఏ-

౬౨. నామత । కేవలమర్థిత తెశ్చ ప్రభూత గాత్రైః ప్రభురా(కి)తానాన్ ॥ [౧౯*] ... యాజగ్నుని... [॥*] 39శిలా

౬౩. మయం దేవకులం మృగం గ త్రిభూమికం చిత్రితి మాత్రే కృత్వా । ... ప్రమాణక-

౬౪. రం ప్రసూతరాశి ల్లభతే స్వభూపాత్ ॥ [౨౦*] అస్యోపరి చ దేవ... కృత... | యా కతో

౬౫. తిన పంచభి మృహాపాతకై ల్లిప్యతే । ఉక్తం చ 40స్వదత్తాం పరదత్తాం వా యో హరేత వ-

౬౬. సుంధరామ్ । షష్టివర్ష సహస్రాని41 విష్ఠాయాం జాయతే క్రిమి ॥ [౨౧*] బహుభి ర్వసుధా దత్తా బహు-

౬౭. భి శ్చానుపాలితా ॥ యస్య యస్య యదా భూమి స్తస్య తస్య తదా ఫలం ॥ [౨౨*] 42నాసన్యే(దే)

౬౮. నాస్య దాతా స్యా దమ్మభూమిపః । విద్యేశ్వరో గుణః కర్త్తా కటకనాయకః ॥ [౨౩*] అస్య పమ-

౬౯. స్తభువనాశ్రయాఖ్య దేవాలయస్య దీపసుధాకమ్మసత్రనివేద్యనిమిత్తమాజ్ఞ—43

---

37 అనుష్టుభ్ శ్లోకము.

38 ఉపజాతి శ్లోకము.

39. శ్లోకము ఉపజాతి.

40. శ్లోకము అనుష్టుభ్.

41. °షష్టివర్షసహస్రాణి° అని చదువుడు.

42. అనుష్టుభ్ శ్లోకము.

43. ఇక్కడనుంచి శాసనము పోయినది. పోయిన ౫-వ రేకుపై తరువాతి భాగ ముండవచ్చును.

[ఈ శాసనపు దిమ్మలు తయారుచేయుటకు ప్రతిబింబములను ఎపిగ్రాఫీ సూపరెంటుగారగు శ్రీ. సి. ఆర్. కృష్ణమాచార్యులుగారు దయతో నొసంగిరి.]

ఉషశ్రీ

పి. గణపతిశాస్త్రి

హృజ్జంజదని శాంతి!
హే ఉషోరథకాంతి!

దీనదుర్దిన శాల,
తెరచి రమ్మా వేళ!

జీవనదిశాంగణము,
చైతన్యతరళితము!

వాయువసనాంచలము
వకుళదరసురభిళము!

ఈనవోదయ వేళ,
ఏయరుణలోకాల,

మందారవర్షాలా,
మానయనములరాలు!

కాంతికల్లోలికల
కనులు కలలై తేలు!

మృదుసుఖాందోళికల,
హృదయతంత్రులు సోలు!

దూరశంఖస్వనము!
తూర్యమంగళరవము!

ఏదో! మా బ్రదుకులో,
నూదు నేపెలుపులో!

చంచలవిలాసినీ!
సౌందర్యబర్హిణీ!

ఓ హృదయవల్లకీ!
ఓ ఉదయనర్తకీ!

రవితురగముల హేష,
రథఘంటికల ఘోష,

సప్తజలధులు మ్రోయ!
సుప్తవిహగము లెగయ!

తెరచి రమ్మా వేళ,
దీనదుర్దిన శాల!

హే ఉషశ్శ్రీకాంతి!
హృదపారవిశ్రాంతి!

'సినారియో'

యస్. జగన్నాథ్

ఈ మధ్యను అనేకసినిమా కంపెనీలు రిజిష్టరు అవుతున్నాయి, ధనము పోగుచేస్తున్నాయి; వాటిలో కొన్ని త్వరలో ఫిల్ములు కూడా తీస్తున్నాయి కాని ప్రతికంపెనీకూడా రిజిష్టరు అయినా, కాక మరోవిధంగా లేవదీయబడినా ఎదుర్కోవలసిన సమస్య-ఏంకథ తీస్తామా అని ఈ విషయం ఎంత ముఖ్యమయినదో చాలామంది గుర్తించటం లేదు; ఎందుచేతనంటే సాధారణంగా ఏఫిల్ముతీసినా నష్టంరాదుగదా అనేనమ్మకంవల్ల; అలాగనే బొత్తిగా అసభ్యంగాను, అసహ్యంగాను ఉన్న ఏ ఒకటిరెండు ఫిల్ములవిషయములోనో తప్ప నష్టం రాకపోవడంచేతనూ.

కాని ప్రతికంపెనీకూడా, ఈ కథను, ఏరుకోవడంలో 50 వేలో, లక్షవరకూనో రూపాయలు ఖర్చుపెట్టడానికి మూలము కథయేగదా అని గుర్తిస్తే ఈ రోజుల్లో జరుగుతూన్నట్లు అర్థములేని కథలు ఏరుకోవడం జరగదు.

అమెరికా, రష్యా మొదలయినదేశాలలో సినీమాకోసమే కథలు వ్రాస్తారు. ప్రతి పెద్దస్టూడియో వారికి 'సినారియో డిపార్టమెంటు' అని ఒకటి ఉండి, అందులో సంపాదకులు సహాయసంపాదకులు మొదలయిన సిబ్బందితో వారికి వచ్చినకథలు అన్నీ చదవడం, వాటిలో నచ్చినవాటిని కావలసిన మార్పులు చేయమని కథకులకి పంపి, ఫిల్ములు తీయడానికి హక్కులు వారివద్దనుంచి కొనుక్కోవడం జరుగుతోంది. ఈ దేశములో ఇంకా ఎవరూ స్వకపోలకల్పితమగు కథలు కావాలని అడగటంలేదు. అథవా అడగగా వస్తే అవి అక్కర్లేదని పంపినకర్తలకి త్రిప్పివేసి ఆకథనే పేర్లు మార్చి వాడిచేయటం జరిగి కాపీరైటుకోసము కోర్టులవెంట తిరగటం వరకూ వస్తోంది.

ఈ పరిశ్రమలో, ఒక ఆదర్శము గలిగి, ఖ్యాతి ధనము సంపాదించుకోవాలని ఉన్న ప్రతివారూకూడా గమనించవలసిన విషయాలు రెండు. మొదటిది సినీమాకు కావలసిన కథలు సినీమాకొరకు వ్రాయబడినవయితేనే ఉత్తమోత్తమమయినవని. రెండవది, ఏవైనా ఇదివరలో ప్రజారంజకములని పేరు పొందిన నవలలూ, నాటకాలూ, విదేశపు ఫిల్ముకథలూ మొదలయిన వాటినుంచి దేశకాలపరిస్థితులకు సరిపోయినట్లు మార్చి అనుసరించినట్టయితే ఆ అనుసరణము అనుభవజ్ఞులచే చేయబడినదా లేదా అని.

సినీమాకొరకే వ్రాయబడిన కథలలో రెండుతరహాలుండవచ్చును. ఒకటి: కేవలమూ కథయొక్క సారాంశమే ప్రధానముగా గలిగి తదనుకూలముగా నటీనటులను ఏరుకొనుట; స్టూడియో ఏర్పాటులు జరుపదగినవి. రెండు: ఇదివరకే యుండుకొన్న ఏదో గుణవిశేషము గలిగిన నటీనటుల

కొఱకుగాని, ఇతరవిధముగా అందుబాటులో నున్న సౌకర్యములకు తగినట్లుగాని క్రొత్త కథలు వ్రాసుకొనుట. దీని కుదాహరణము: క్వీన్ మేరీ (Queen Mary) అన్నవోడ చాలాదినములు హార్బరులో ఉండునని తెలిసి ఎమ్. జి. ఎమ్. వారు పెద్ద ఓడమీద చాలా సీనులు గలకథ ఒకటి కల్పించుకోవటం; కుస్తీ పోటీలు తీసే అవకాశము దొరికితే దాన్ని ప్రాముఖ్యంగా పెట్టుకొని ఒకకథ వ్రాసుకోవడం.

ఇక కథవ్రాయడంలో ఉన్న దశలను (Stages) గురించి.

ప్రతికథా కూడా, స్వకల్పితమయినా అనుసరణమయినా మొదట 'సినాప్సిస్' (Synopsis) గా అంటే సంగ్రహంగా చిన్న పిల్లలకు చెప్పినట్లు వ్రాసుకోవడం. ఆతరువాత 'ట్రీట్‌మెంటు' (Treatment)-అంటే సీనులవరుసని, సినిమాలో కనిపించవలసిన సీనులవరసని-వ్రాసుకోవటం. ఇది వ్రాసేవానికి మంచిసినిమాలు చూచి ఆకథాధోరణి గమనించటం, సినిమాతీయడంలో ఉన్న ప్రతివిషయము స్వయంగా అనుభవ ముండటం అవసరం. అటువంటివారు లేనప్పుడు అనుభవమున్న డైరక్టరుతోటికూడా కలిసి ఈసీనులక్రమము నిర్ణయించుకోవలసి ఉంటుంది కథకుడు. ఈదశలోనే కథకి సగము జీవము వస్తుంది. ప్రతిసీనుయొక్క భావము, రసము ఆసీనుయొక్క ముఖ్య అంశము అంటే కథకు ఏవిధముగా ఈసీను తోడ్పడుతుంది అని నిర్ణయించి ఆభావము ఆరసము వృద్ధిచేయటానికి సంకల్పించుకోవటం జరుగుతుంది కనుక ఒకొకప్పుడు డైరక్టరుగాని, కవిగాని ఈ సమయంలోనే, ముఖ్యమయిన సంవాదములు(dialogues)కాని 'టెక్నికల్', 'డైరెక్షనల్ హింట్సు', (Technical & Directional hints) కాని వ్రాసుకొన వచ్చును. ఇంతేగాక, ఏ యేసీనులో ఏమేమి 'ఏక్షన్' '(Action)' ఉంటుందో, ఎచ్చటెచ్చట పద్యములుగాని పాటలుగాని అవసరమో తేలిపోతుంది. అంతేగాక మొత్తము ఫిలిముకంతకీ ఎన్ని సెట్టింగులు కావాలో, ఎన్ని దుస్తులమార్పులు కావాలో ప్రతిపాత్రకు నిర్ధారణ అవుతుంది. ఈ నిర్ధారణనుబట్టి మిగిలిన విషయాలు తేల్చుకోవాలి. ఏ యే పాత్రకి ఎటువంటి నటీనటులు కావాలో, మొదలయినవి నిర్ణయించడంలోను, స్టూడియో (అద్దెకు తీసికొనేవారు) మాట్లాడుకొనేటప్పుడుకూడా ముందుగా కథ నిశ్చయించుకొని ఆకథకి ఈ 'ట్రీట్‌మెంట్' (Treatment) వ్రాసుకొంటేనేగాని, ఏవిషయమూ నిష్కర్షగా మాట్లాడుకోవటానికి వీలుండదు.

ఆదర్శప్రాయమైన పద్ధతి ఏమిటంటే ఇంతవరకూ అల్లినకథని అనుభవజ్ఞులయిన నలుగురు తర్కించటం, ఏమైనా అభిప్రాయ భేదాలుంటే. ఇట్టి సమావేశానికే 'స్క్రిప్ట్ కాన్ఫరెన్సు' (Script conference) అని పేరు. పేరెన్నికగన్న పెద్దపెద్దడైరక్టరులుకూడా ఈతర్కాలవల్లకొన్ని ఉపయోగకరమయిన సలహాలు వచ్చునని వ్రాశారు.

దానితరువాత ఎక్కువపని లేఖకుడిది. ఆయా సీనులయొక్క ముఖ్యోద్దేశము, మరవకుండా ప్రతిపాత్రనీ పోషిస్తూ సంవాదము(dialogue) వ్రాయటం. ఈసందర్భంలో లేఖకుడు (ఇతనిని కవి అనటంలేదు, ప్రత్యేకముగా; మంచిలేఖకుడు కవి అయిఉండవచ్చు

కాకపోవచ్చు) ఎట్టివాడయి ఉండాలో విచారించాలి.

సినీమాకు కథలు బాగా వ్రాయడానికి విపరీతమయిన శక్తి ఒకటి ఉండాలి — ఫిల్ము తీసేటప్పుడు సందర్భాలు ఎట్లా వుంటాయో, వాటి కనుగుణంగా ఉండాలంటే, వ్రాసిన సంవాదాలు ఎలా ఉండాలో తెలియటమే; గాన, సినీమా అనేది చలనచిత్రమనీ, చలనమే దానికి జీవమనీ, భావప్రకటనకి కావలసినంత అవకాశము ఉండాలనీ వ్రాసిన సీనులలో గుర్తించటమేకాక లేఖకుడు భాష, సమాసాలు, యతిప్రాసలు వగైరాలతో మనసుని నింపుకోక కేవలము అది చలనచిత్రమని భావించుకొని ప్రతిమాటా అనుభవించి వ్రాయాలి. దానికోసమూ అతను ఈ పరిశ్రమయొక్క వివరాలు (details) తెలిసికోవడానికితోడు మంచి నటుడుకూడా అయి వుండాలి, అధమపక్షము మానసికంగా; అంటే తాను వ్రాసే కథలోని ప్రతిభావమూ, రసమూ అనుభవించగలిగి ఉండాలి. ఈ చలనచిత్రాలని ఊహించుకోగలగటమే (Thinking in terms of pictures) ప్రప్రథమ నిబంధన సినీమాకి కథలు వ్రాయాలని పూనుకునే ప్రతివాడికీ.

ఇక కథ వ్రాయటంలో మూడవదశ ఇది - పాత్రలయొక్క సంవాదాలు పూర్తి చేయటం.

ఇది అయినతరువాతనే నటీనటులని కుదుర్చుకోవటం మంచిది. ప్రతివ్యక్తికీకూడా ఇదిగో ఈపాత్ర ధరించవలసిఉంటుంది, ఇలా వేషమువేయాలి, ఇలా ప్రేమగాని, బిచ్చమెత్తుకోవటంగాని, వింజామర వేయటంగాని చేయవలసిఉంటుంది అని విస్పష్టంగా చెప్పి ఒప్పించి నటీనటులని తీసుకొనినట్లైతే ప్రస్తుతము మనరాష్ట్రపు కంపెనీలలో వచ్చే తగాదాలలో నూటికి తొంభై రానడానికే అవకాశ ముండదు. ఇక నటీనటుల సమావేశము అయినతరువాత వారివారి సమర్థతనుబట్టి అవసరమయినచోట్ల వ్రాయవలసిన పాటలను పద్యములను వ్రాసికోవాలి. ఏ సందర్భాని (Situation) కైనా ఒకపాట అని నిర్ణయించుకుంటే దానికి సరిపోయినమట్లులు అరడజను ఉండవచ్చు. వాటిలో, ఆ పాత్రధారిన్నీ, మ్యూజికల్ డైరక్టరున్నూ, డైరక్టరున్నూ కలిసి ఏది అనుకూల మని అంగీకరిస్తే ఆ మట్టునిబట్టిపాట వ్రాయించవచ్చు. దానివల్ల అత్యంతసౌకర్య మున్నది కంపెనీకీ నటకులకూకూడాను.

ఈవిధంగా తయారయిన 'సినారియో' (Scenario) నిబట్టి రిహార్సల్సు జరిపించాలి.

ఈ రిహార్సల్సుని నడుపుతూ డైరక్టరు (మన రాష్ట్రాల్లో) 'షూటింగ్ స్క్రిప్ట్' (Shooting script)-అంటే ఏయేసంవాదము, ఏయే సంఘటన (incident) కెమెరా ఎంత దూరంగా పెట్టి తీయాలో, ఎచట ఏ శబ్దము, ఏ వాయిద్యము ఉండాలో వ్రాసుకొంటాడు.

ఈ 'షూటింగ్ స్క్రిప్ట్' (Shooting Script) చేతిలోవుంటే, ప్రస్తుతము అదిలేకుండా మూడురోజులు చేసే 'షూటింగు' ఒకరోజులో జరుగుతుంది.

కనుక సినీమాకి కథ వ్రాయడమంటే వ్రాయటంలో ఉన్న ఈ వివిధమయిన దశలూ, వాటిఅవసరమూ గ్రహించి, మంచి సినీమాలు చూసి వాటిలోని భావాలూ అవి

వ్రాసినవారి ఉద్దేశాలూ గ్రహించి, అధమ పక్షము ఒకసంవత్సరమయినా ప్రతిరోజూ పనిచేసి స్టూడియోలో అనుభవము సంపాదించాలి; అన్నిటికంటే ముఖ్యముగా, లేఖకుడు తాను వ్రాయదలచుకున్న కథనంతా, కండ్లుమూసుకొని సినిమాలాగా బొమ్మలుగా భావనచేసి వాటిని మాట్లాడించే శక్తి కలిగి ఉంటేనేతప్ప సినారియో వ్రాయడం ఉత్తమ స్థితికి రాదు. ప్రొడ్యూసర్లు, పెట్టుబడిదార్లు గూడా తాము ఖర్చుపెట్టబోయే ధనానికంతకీ కథయే పునాది అని గుర్తించి తగినశ్రద్ధ తీసుకోకపోతే తమ ధనమంతా బూడిదలో పోసిన పన్నీరవవచ్చని వారు గుర్తించటం అవసరం. కథను వ్రాసేవారిని ఏరుకోవటమే కాక, కథను ఏరుకోవటంలోకూడా మనరాష్ట్రపు ప్రొడ్యూసర్లు విదేశీయులవద్దనుంచి ఈ మార్గము నేర్చుకోవటం మంచిది. ఏదైనా 'సినారియో డిపార్ట్మెంటు' (Scenario Department)కి వ్రాసిగాని, లేక వారికినచ్చిన లేఖకులకువ్రాసిగాని, తమకు కావలసినది పౌరాణికమో చారిత్రకమో సాంఘికమో తెలియపరుస్తూ ఎవరైనా వ్రాసినకథ లుంటే ఆ అనుభవజ్ఞులు వ్రాసిన వాటిలో గాని వారికి నచ్చినకథను మర్యాదగా వారివద్ద ఫిల్ముహక్కులు కొనుక్కొని తీసికొంటే ధనమూ కాలమూకూడా కలిసిరావడమేగాక, ఫిల్ములు ఇప్పటికంటె చాలా బాగుపడతాయి.

ఈ ఉద్దేశములతో మొదటి 'సినారియో డిపార్టుమెంటు' (Scenario department) మద్రాసులో వకటి త్వరలో స్థాపిస్తారని తెలియవస్తోంది. ప్రొడ్యూసర్లకు అందరికీ ఇది కొంత చేయూతగా ఉండవచ్చును.



కట్టు అడ్డగీతగా గీచుకొంటనన దెందుకో? అచ్చులో తలకట్టుగానే నిర్మించితే వచ్చే బాధక మేమో తెలియ లేదు. అదీగాక ఈ విషయంలో మరొక్క సందేహం కలుగుచున్నది. అడ్డగీతనుగీయుట తీసివేయుట వ్రాతలో సాధ్యంగాని, యంత్రంలో విశిష్టంగానే అక్షరస్వరూపం తయారుచేయవలయును గదా! ఏనయెడల తలకట్టు - అనగా అడ్డగీతతో గూడిన రూపమొక్కటి, హాల్మాత్రవ్యంజకమైన, అడ్డగీత లేని రూపమొక్కటి, అని ప్రతియొక్క హల్లునకు రెండురూపములు నిర్మించవలసియుంటుంది. దీనివల్ల హల్లులవిషయం పరిశ్రమ ఇబ్బడియగుచున్నది. అక్షరసంఖ్య చూపించేటపుడు ఒక్కొక్కహల్లు కొక్కరూపమే చెప్పినను, 'అ'తో గూడిన అక్షరస్వరూపప్రదర్శనంలో అకారవిశిష్ట రూపంగానే వ్రాసిచూపినారు. అందువల్ల వారియభిప్రాయం స్పష్టంగా తెలియలేదు.

వారి అభిప్రాయ మేరీతిగా నున్నా, అక్షరస్వరూపం హల్మాత్ర మంగీకరించడం, మిగిలినఅచ్చులు అదికినట్టే తలకట్టుగూడా — అది తలకట్టేగాని, అడ్డగీతేగాని—ప్రత్యేకసంజ్ఞగా ప్రక్కన్నే అతకడం యుక్తమని తోస్తుంది.

"ఈ తెలుగులిపి హద్దులలోనణగి, మణగి యుండక సుంద్రసుంద్రముగా దొర్లిదొర్లి, అనంతమైన బ్రహ్మస్వరూపమును బొంది, ఇంపులు నింప నారంభించింది" అన్నారు. దీనిబిందుస్వరూపమే దీనికి సౌందర్యం చేకూరుస్తుంది. అలాంటప్పుడు సాధ్యమైనంతవరకు దానిబిందుత్వానికి హాని కల్గించరాదు. కాన, వత్తు అక్షరాలు తెలుపుటకు ప్రత్యేకముగా సంజ్ఞ నంగీకరించునపుడు, "△" ఇట్టి సంజ్ఞకన్నా, ఒక్కబిందువునే అంగీకరించుట అందం. హల్లుప్రక్కన "క." ఈ విధముగ అంగీకరించడం యుక్తం. ఇది మధ్యలోనుండడమే విరామచిహ్నముకన్న భేదకము. మన తెనుగులో 'ధ, ఢలకు భేదము తెలియజేయుటకు, నాగరమున 'డ (ड़), జ (ज़) ల కభేదము తెలియజేయుటకును ఈ చుక్కనే వాడుచున్నారు. కాన 'క, ఖ', మొదలైనవాటికి భేదము తెలుపుటకు అత్రికోణముకన్న ఈ '.' బిందువు బాగుండునని నాకు తోస్తుంది.

ఇక నేను ముందు చెప్పినట్లు అచ్చుగుర్తులకు భాషాంతరాలకు పోకుండా తెనుగులోనే ఎట్లు పయోగిస్తుందో చూతాము.

తలకట్టువిషయం ముందే చెప్పినాను, "క✓" ఇట్లా వ్రాయవలెనని. ఇక దీర్ఘం. దీర్ఘం కన్నడంలో ఇట్లా "ా" ఉందన్నారు. దాన్నే తీసుకొమ్మన్నారు. కాని తెనుగులో ఆకారసంజ్ఞ '—' ఇది. దీనినేకొంచెం సవరించి "—" ఇట్లా చేసుకుంటే సరిపోతుంది. "కా" వ్రాయవలెనంటే "క—" ఇట్లు వ్రాయవలె. ఇత్వ, ఉత్వములు వారూ తెనుగులోనివే తీసుకున్నారు. వాటికి దీర్ఘంతీయవలసివస్తే కన్నడదీర్ఘం విడచి, తెనుగుదీర్ఘం తీయమంటాను. ఋత్వాని వ్రాయుసుడి వారు విడచింది చేర్చుకోవలె. "కృ" అంటే "కృ" - ఇట్లన్నమాట. ఎత్వానికి తెనుగులో ప్రసిద్ధమైన "ె" ఈ గురుతే పెట్టుకొనేది. అట్లే ఒత్వానికి "ొ" ఈ గుర్తు. వీట్లకు దీర్ఘం కావాలంటే పైవాటే. ఐత్వానికి వారు చెప్పినట్టే, "ఐ" కారావయవమైన 'ై' ఈ గుర్తు సరిపోతుంది. ఔకారానికి ప్రత్యేకంగా "ౌ" ఈ గుర్తు నంగీకరించండి

ఇవన్నీ మామూలుగా తెనుగులోనుండేవే. ప్రత్యేకించి ప్రక్కన వ్రాయడమే సంస్కారం. భాషాంతర సంజ్ఞలకన్నా ఆంధ్రులకు వారిభాషలోని సంజ్ఞలే ఐతే ప్రయాసలేకుండా సులభంగా తెలుసుకోవచ్చు. ఇది సౌలభ్యం. ఆంధ్రత్వం. ఇతరులనాశ్రయించేపని లేకపోవడం.

దీన్నుంచీ అచ్చుశబ్దాలకు వారు ఏడుగుర్తులు చూపితే, నేను తొమ్మిది చూపినట్లయింది. ఒకటి వారు చెప్పని వ్రాయుసుడి "ృ" పోగా ఒక్కటే ఎక్కువన్నమాట. ఇది ఔత్వచిహ్నం. వారి వ్రాతప్రకారం "కౌ" అని వ్రాయవలసియుంటే, "కౌ" ఇట్లా వ్రాయవలె. దీనికి మూడుకిళ్లొత్తవలెనన్నమాట. ఇప్పుడు "కౌ" ఇట్లా రెండే. అట్లనే ఒత్వానికి మూడు గుర్తులు "కొ" ఇట్లా వ్రాయవలసియుండేది. ఇపుడు "కొ" ఇంతే చాలు. ఏత్వదీర్ఘానికి వారు "ే" ఈ గుర్తు నంగీకరించినందుకు, నేను దాన్ని ముందు నిర్ణ

యించిన"ొ ో" ఈ ఎత్వ, దీర్ఘములతో సరిపుచ్చి వారు అంగీకరించని ఒత్వం "ో" అంగీకరించినందుకు లెక్క సరిపోయింది. కాని, ఈ సంజ్ఞలో వారు చెప్పినవాటి కన్నా అధికమైనది ఒక్కటే. దానికి యీ ఆంధ్రత్వాభిమానమే గాకుండా మరొక్క ప్రయోజనంగూడా ఉంది; చూడండి.

వారు చెప్పినవాటికంటే అచ్చుల్లో "ఐ, ఔ" లు ఎక్కువ చేసుకోవలెనేగాని, అయి, అవులతోనే సరిపోదు అని రాసియుంటి. ఆ రెంటిని చేర్చుకుంటే అచ్చులు విధిలేక ఐదుగాక, ఏడుగావలసి వస్తుందిగదా! నేను చెప్పిన "ఐత్వ ఔత్వ" సంజ్ఞలు "ై, ౌ" అంగీకరించినామంటే, అచ్చుల్లో కొత్తగా రెండు చేర్చుకోకుండా, ఐదింటితోనే సరిపుచ్చుకోవచ్చునని తోస్తుంది.

మనము "ఔ" వ్రాయవలెనంటే "ఒ" వ్రాసి దానికి "ౌ" ఈ సర్తు పైన అతుకుతూన్నాము. అట్లనే "ఐ" కావాలంటే "ఎ" వ్రాసి, పైన "ై" ఈ సర్తును. ఎ, ఒ లను అచ్చుల్లో అంగీకరించే ఉన్నాము. వాటికి పైసర్తులు పక్కన అతికితే "ఐ, ఔ" లు సిద్ధించును.

ఐతే వారు చెప్పినదాంట్లోనూ, నేను చెప్పినదాంట్లోనూ హల్లులపై కొన్ని దీర్ఘాచ్చులు రావాలంటే మూడుకీళ్లు వత్తండే పని జరగదు. వత్తక్షరాలైతే నాల్గు వత్తవలసిందే.

అదీగాక, ఈ లిపిసంస్కారంనుంచీ అక్షరస్వరూపాన్ని హల్మాత్రంగా నిర్ణయించిందానివల్ల ఇంతవరకు తలకట్టులేకున్నా "అ"కారవిశిష్టంగా ఎంచబడుతూండే "జ, బ, ల"వంటి అక్షరాలక్కూడా, పక్కన తలకట్టు పెట్టవలసివస్తూంది. లేకుంటే "వల్కలం" అనేటప్పుడు, ఆమధ్య లకారాన్నే హల్స్వరూపంగా ఎంచుకుంటాము, గనుక, కడపటి లకారంపక్కన తలకట్టు తప్పక పెట్టవలసియుంటుంది. అప్పుడు 'వల్కలం' అనేది "వ‿లక‿ల‿ం" అని వ్రాయవలసియుంటుంది. అట్లనే మిగిలిన తలకట్టులేని అక్షరాలకు చూచుకోవలె. ఈఅవస్థంతా సమానం. అందరును పడవలసిందే.

కష్టంలో సుఖముంది. సుఖంలో కష్టముంది. వీటికి అవినాభావసంబంధం. అక్షరసంక్షేపానికోసరం ప్రత్యేకంగా అచ్చులను విడదీసినందువల్ల యీ క్లేశం లభిస్తూంది. కానీ ఇది యంత్రంలోనేగా! చేత్తో వ్రాసేవాండ్లు మామూలుగానే వ్రాయవచ్చును. దాంట్లో ఆక్షేపణేం లేదు. అచ్చులిపి వేరు, వ్రాతలిపి వేరు అని రెండులిపులు నేర్వవలసియుంటుంది. ఇందుచుంచీనే "ఖత్తువ్రాత నశించునే యని కొంద రాక్షేపింపదగును" అనే శ్రీ హరిసర్వోత్తమరావుగారి ఆక్షేపణా లేదు, 'అది ఎన్నడో నశించింది. దాని కేడ్వవలసినపనీ లేద'నే, సమాధానమూ లేదు. రెండులిపులు నేర్చేది కష్టమంటారా? నాల్గురకాల A B C D లు నేర్చుకునే వాండ్లకేమి కష్టమంటాను సంస్కారమైనవాటిలోగూడ తెలుసుగుర్తులేగదా!

ఇంక వారిసంస్కారానికీ నా సంస్కారానికీ భేదం కనుపరచి విరమిస్తాను. వత్తునకు త్రికోణాకారం తీసి చుక్క పెట్టమన్నాను. 'ర' కు తలకట్టు తీసేస్తే సున్నకు భేదం తేలేందుకుగూడా ఆ చుక్కనే పెట్టమంటాను, "ᶜ" ఇట్లు. వట్రుసుడిసర్తు విడిచింది చేర్చమన్నాను. అచ్చుసర్తులు తెలుసులే పెట్టమన్నాను. దాంతో "ఐ, ఔ"లుగూడా సిద్ధిస్తా యన్నాను. తలకట్టుమాత్రం పక్కనిమ్మన్నాను. మిగిలినవి వారు చూపినట్టే. అచ్చుగుణింతాలు ఒక్క కాకుమాత్రం వ్రాసి చూపుతాను.

క‿ (క), క ా (కా), క ి (కి), క ు (కు), క ూ (కూ), క ె (కె), క ే (కే), క ై (కై), క ొ (కొ), క ో (కో), క ౌ (కౌ), క ృ (కృ).

ఎట్లా చేసినా యంత్రాన్ని నిర్మించ దలచుకొన్నపుడు గద్యపద్యాలకు రెంటికీ తగినట్టు తయారు చేయడం యుక్తం.

కుంటిమద్ది శేషశర్మ

అనలపతాకం

పురిపండా అప్పలస్వామి

అనలపతాకం అనలపతాకం
అంబరవీథుల మెరసింది
కాంచనగంగా ధవళశిఖరిపై
రక్తకేతువులు విరిసాయి.

బానిసలారా! వంచితులారా!
గొలుసులు త్రెంపుకు లేవండి
జయజయజయజయ జయధ్వానులతో
కరములు చాచి మ్రొక్కండి.

అనలపతాకం అనలపతాకం
అనంతసీమల సాగింది
సాగరవేలా సైకతభూముల
ఝంఝాపవనం రేగింది.

అశ్రులు తుడిచీ అనలం నించీ
అతలవితలములు చూడండి
విషణ్ణహృదయం విశీర్ణకాయం
బలివేదికపై నిలవండి.

అనలపతాకం అనలపతాకం
అజస్ర మజస్ర మెగిరింది
తారాగ్రహములు తరుణాంగణమున
వజ్రకవాటం పగిలింది.

బానిసలారా! లేవండి
భైరవిమంత్రం చదవండి.
ఆకలిప్రాణం, వ్యాకులజీవం—
ప్రళయం ప్రణవం పాడండి.

అనలపతాకం అనలపతాకం
అనలం గరళం క్రక్కింది
ఉరుములు మెరుపులు ఉల్కాపాతం
ధరిత్రి గడగడ వణకింది.

బానిసలారా! వంచితులారా!
ప్రస్తరదైవం విడువండి
మంటలు! మంటలు!! ధరిత్రినిండా
మంటలనాట్యం సలుపండి.

అనలపతాకం అనలపతాకం
అంబరవీథుల మెరసింది
కాంచనగంగా ధవళశిఖరిపై
రక్తకేతువులు విరిసాయి.

విమర్శనము

SPECIMENS OF SANSCRIT DRAMATIC POEMS

(లేఖకుడు: వి. శ్రీరాములుగారు, యమ్. ఏ., యల్. టి., నర్సారావుపేట. ప్రకాశకులు:— పి. శ్రీనివాసరావుగారు, శర్వాణీ ప్రెస్. నర్సారావుపేట. ౧౫౦ పేజీలు. వెల ఒక రూపాయి.)

ప్రఖ్యాత నాటకకర్తలు వ్రాసిన సంస్కృత నాటకములలోని కొన్ని యంకముల కిది ఆంగ్లానువాదము. ఇందులో భాస, శూద్రక, కాళిదాస, శ్రీహర్ష, భవభూతి, విశాఖదత్త, భట్టనారాయణులు వ్రాసిన ప్రతిమా, మృచ్ఛకటికా, శకుంతలా, ప్రియదర్శికా, ఉత్తర రామచరిత్ర, ముద్రారాక్షస, వేణీసంహార నాటకములలోనుండి ఒక్కొక్క యంకమును గైకొని శ్రీరాములుగారు ఆంగ్లములోనికి అనువాదము గావించిరి. సంస్కృతము తెలియని, ఆంగ్లము తెలిసిన వారలకు సంస్కృత నాటకములలోగల సౌందర్యమును గనుపరచవలయు ననియే వీరి సంకల్పము. కావుననే "Our classical writers" అను పేరుతో సంస్కృత నాటకకారుల ఆశయములను గురించియు, వారి ఆదర్శములను గురించియు నొక చిన్నవ్యాసమును ఆంగ్లత్రివేణీ మాస పత్రికలో ప్రచురించగా దానిని చదివిన మిత్రులు కొందరు దానికి ఉదాహరణభూతముగ నుండులాగు నేమైన వ్రాయుడని యడుగుటచే తా మీ యనువాదముల సమకూర్చితిమని గ్రంథము మొదటిలోనే వీరు వ్రాసుకొనిరి. దీనివలన గ్రంథకారుని అభిలాష చాలవరకు నీడేర వచ్చును. కావలసినవారు పై యడ్రెసుకు వ్రాసినచో గ్రంథములను బడయగలరు.

'సు'

శిరోమణి కథలు

[రచయిత: శ్రీ శ్రీనివాస శిరోమణి; ప్రకటన కర్తలు — నమ్మాళ్వార్సు, పోస్టుబాక్సు ౨౫౧, మద్రాసు. వెల ఆరు అణాలు]

ఇది శ్రీనివాసశిరోమణిగారి కథలలో నాలుగుకథల సంపుటి. పదేళ్లనుంచీ కథారచయితలలో శ్రీనివాస శిరోమణిగారుకూడా ఒకఉత్తమస్థానాన్ని సంపాదించుకున్నారు. వీరికథలలో కొన్ని పంచవటి అనేపేరుతో ఇదివరకు ఒకసంపుటిగా వెలువడ్డాయి. ఇప్పుడు యీ పుస్తకం రెండోసంపుటి అన్నమాట—

దీనిలో నాలుగుకథ లున్నాయి: యోగ్యత, తాత, కామధేను, చదువుకున్నకూతురు—. కథలునాలు గూకూడా వివాహాసమస్యకు సంబంధించినవే. అయితే ఒక్కొక్క కథలో, ఒక్కొక్కతరహా మనస్తత్వాలు నిరూపింపబడ్డాయి. బ్రాహ్మణజాతియువకుడు, క్రైస్తవస్త్రీని వివాహం చేసుకోవడం యోగ్యత అనేకథ. ఈ కథ తక్కిన వాటన్నిటికన్న పెద్దది. చదువుకొన్నప్పటికీ, సంస్కార ఆశయాలు వున్నప్పటికీ, నిత్యజీవితంలో సంస్కారమూ, పరిశుభ్రతా మొదలైనవి ఆజన్మసిద్ధాలుగా వుండాలిగాని, తెచ్చిపెట్టుకుంటే రావని నిరూపించడానికి, శిరోమణిగారు ప్రయత్నించినట్టు యీ కథవల్ల తోస్తుంది. ఇది ఎట్లున్నా కథను పూర్తి చెయ్యడమూ, నడపడమూకూడా, ఆరంభించడంలో వున్నంత స్వాభావికంగా లేదు. సంభాషణలుకూడా ధారాళంగా, గబగబా సాగలేదు.

రెండోకథ చాలామంచికథ. తనయిష్టానికి వ్యతిరేకంగా వివాహంచేసకున్న కుమారుడిమీద ఆమగ్రహాంతమూ పగబూనినప్పటికీ మనమణ్ణి చూసీ చూడ్డంతోనే పొందే ప్రేమతో హృదయానికి అత్తుకున్న తాత కథ ఇది. తాత మనస్తత్వాన్నీ, కోడలి మనస్తత్వాన్నీ చాలా స్వాభావికంగా చిత్రించారు శిరోమణిగారు.—

మూడోకథ కామధేనులో, వివాహంచేసుకోడానికి రూపయౌవనభాగ్యాలనుకాక, కేవలమూ అభిమాన, ఆదరణ, ఆప్యాయాలను మాత్రం ప్రధానంగా తీసుకున్న క్రిస్టియను దంపతులను శిరోమణిగారు చక్కగా చిత్రించారు.

నాలుగోకథ 'చదువుకున్నకూతురు!'. భర్తలను ఎన్నుకోవడంలో చదువుకున్న అమ్మాయిలు చూపే విమర్శను యీకథలో బాగా చూపారుకాని, చదువుకున్న అమ్మాయిఅభిరుచికి తగినభర్తను లేకుండాచేశారు

కథకులు— అలాటి ఉదాహరణలు మనసంఘజీవితంలో అక్కడక్కడ వున్నాయికూడాను.

కథలు నాలుగూ చదవవలసినవే. వర్ణన బాగా చెయ్యటంలోనూ, కథను తాపీగా నడపటంలోనూ శ్రీనివాసశిరోమణిగారికి మంచి చాకచక్యం వుంది. ఆచాకచక్యం యీ కథలలోకూడా ఎంత మాత్రమూ తరుగు పడలేదు. —క. స.

స్తోత్రరత్నావళి (ప్రథమభాగము)

[ప్రకాశకులు: కాతు బుక్ డిపో, రాజమండ్రి. వెల రు 0—6—0 లు.]

భగవత్సేవాతత్పరుల కత్యంతోప యుక్తముగా నుండునట్లు శ్రీ నేదునూరి గంగాధరంగారును, శ్రీ పానుగంటి భీమశంకరమూర్తిగారును వీటిని సమకూర్చియున్నారు. ఇందు శివస్తోత్రములును, విష్ణుస్తోత్రములునుకూడ నున్నవి.

భక్తితత్వ సుధాలహరి

[కర్త: ముత్య చిన సుబ్బారాయుడుగారు, పాలకొల్లు, పశ్చిమగోదావరిజిల్లా. వెల రు 0-10-0లు.]

గ్రంథకర్తగారు తత్వవిషయమునుసరించి దేవీ స్తోత్ర రూపముగ జెప్పిన పద్యము లిందు ౧౩౭ వరకు గలవు. తత్త్వజిజ్ఞాసువుల కిది యెక్కువగ నుపకరించ గలదు. ధారాళమయిన కవనము. మచ్చునకు:

ఏకాంతంబున నిల్చి సర్వగత ది
వ్యైక స్వరూపంబు, లో
నేకాగ్రత్వముచేత గాంచి, సత
తం బిద్దాని సర్వత్ర నా
యాకర్మంబులగాంచు, చక్రియత నా
హ్లాద ప్రపూర్ణాత్ముడై
లోకంబందు వసించు టాగమవిధుల్
బోధించుగా ఈశ్వరీ.

రామలింగేశ్వరా.

[కర్త: కేచవర్తి సూర్యనారాయణ మూర్తిగారు, పాలంకి, తణుకుతాలూకా, పశ్చిమగోదావరిజిల్లా. వెల 0—2—0 అణాలు.]

రామలింగేశ్వరా! అనుమకుటముతో వ్రాసిన శతక మిది. భక్తిరసప్రధానము. ఇందలిపద్యములు గ్రంథకర్తగారికిగల దేశభక్తిని వెల్లడించుచున్నవి. మచ్చునకు

"పరభూమిజులు" రత్నగర్భయని
సంపాదింపఁగా జూచుచుం
డిరి యీ దేశము నెట్టులో, కరె
న్సీమాత్రమే యిచ్చిబం
గిరుముద్రల్ గొనిపోవుచుండి
రిబులిం గాలించు చుండెం శం
కర! నీపుత్రుల బ్రోవరాదొకో,
పరాకా? రామలింగేశ్వరా!

స్త్రీ ఋతు శాస్త్రము

[గ్రంథకర్త: నేదునూరి గంగాధరంగారు. ప్రకాశకులు: కొండపల్లి వీరవెంకయ్య, శ్రీ సత్యనారాయణ బుక్కుడిపో, రాజమండ్రి.]

'ఆర్తవ విషయమై తిథివారనక్షత్రయోగకరణ లగ్నవస్త్ర బిందుస్థలాది' ఫలితములనుగూర్చి అనేక గ్రంథములను పరికించి గ్రంథకర్తగారు దీనిని రచించినారు. ఇందు రజస్వలాఫలనిర్ణయము, శాంతి, నిషేకము, స్త్రీ సాముద్రికము మొదలయిన విషయములనుసరించి తెలుగు విభాగములు కలవు.

ప్రబోధ చింతామణి

[కర్త: కుప్పా సూర్య నారాయణగారు, కో ఆపరేటివ్ సూపరువైజరు, ముంజులూరు. వెల 0—2—0 అణాలు.]

ఇందలి వన్నియు గేయములు. "సహకారమనగా కేవలము అప్పులిచ్చు వ్యాపారము కా దనియు, పవిత్రమయినమత మనియు" గ్రంథకర్త అభిప్రాయము. "ఈగేయములు సహకార ఉద్యమ వ్యాప్తికి తోడ్పడ గలవని" గ్రంథకర్తతోపాటు మేమును ఆశించుచున్నాము.

గ్రంథస్వీకారము

హిందువులపండుగలు :— కర్త : సురవరము ప్రతాపరెడ్డిగారు, బి.ఏ.,బి.ఎల్., ట్రూప్ బజారు, హైదరాబాదు, దక్కన్. [వెల ౧-౦-౦ రు.]

'పారిస్ కమ్యూన్' :— కర్త : వి. ఐ. లెనిన్ అనువాదకులు : మహీధర జగన్మోహనరావుగారు, 'విశ్వసాహిత్యమాల'లోని ౧౩-వ ప్రచురణము ; ముంగండ, అంబాజీపేట పోస్టు, తూర్పుగోదావరిజిల్లా. [వెల ౬ అణాలు.]

'లెనిన్ ఉపదేశాలు' :— కర్త : పామిదత్తు అనువాదకులు : రామమోహన్ గారు. ఇది 'విశ్వసాహిత్యమాల'లోని ౧౨-వ ప్రచురణము. [వెల ౬ అణాలు.] ముంగండ, అంబాజీపేట పోస్టు, తూర్పుగోదావరిజిల్లా.

'భారతీయనాగరికతా విస్తరణము':— కర్త : మారేమండ రామారావుగారు, ప్రకాశకులు : వేంకటరామ అండ్ కో., ఏలూరు. [వెల ౮ అణాలు.]

'కర్షకా!'— కర్త: ఉభయభాషా ప్రవీణ, కొండవీటి వెంకయ్యగారు, విప్పర్ల, కోనూరుపోస్టు, సత్తెనపల్లి తాలూకా, గుంటూరుజిల్లా.

'శ్రీభగవద్గీత':— శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి టీకాతాత్పర్య విశేషవివరణసారాంశములతో ప్రకటితమయినది. ప్రకాశకులు : ఆంధ్రగ్రంథమాల, ౭, తంబుశెట్టివీథి, చెన్నపురి [వెల రూపాయి.]

'అనర్ఘరాఘవము' :— కర్త : సత్యవోలు కామేశ్వరరావుకవిగారు. గ్రంథము వలయువారు సత్యవోలు లక్ష్మీనారాయణరావుగారికి కాకినాడకు వ్రాయవలెను. [వెల ౧ రూపాయి.]

'శ్రీ భాగవతము' :— శ్రీ వ్యాసమహర్షి కృత సంస్కృత భాగవతానుసారము, (రెండవసంపుటము) ఏకాదశ, ద్వాదశ స్కంధములు— గ్రంథకర్త: సంపన్ముదుంబ సింగరాచార్యులుగారు. శ్రీ భాగవతగ్రంథమండలి, జగ్గయ్యపేట, కృష్ణాజిల్లా [వెల రు. ౨-౦-౦ లు.]

కన్నడదబావుట (కన్నడము) :— బెంగుళూరు, కర్ణాటక సాహిత్య పరిషత్తువారిచే ప్రకటితము, శ్రీ కృష్ణరాజేంద్ర పరిషన్మందిరము, చామరాజపేట, బెంగుళూరు: [వెల ౧ రూ.]

బుద్ధగీతావళి (కన్నడము) :— కర్త : శ్రీ ఎస్. నరసింహ శాస్త్రిగారు, విశ్వబుద్ధసంఘ, బెంగుళూరుసిటి.

భారతదేశమున బ్రిటీషు రాజ్యతంత్రము:— గ్రంథకర్త : దిగవల్లి వేంకట శివరావుగారు, బెజవాడ, [వెల రు. ౧-౪-౦.]

నెహ్రూ చరిత్రము:— గ్రంథకర్త : కొమాండూరి శఠకోపాచార్యులుగారు, కాకినాడ. [వెల రు. ౦-౮-౦ లు.]

'అన్నా':— కర్త: క్లా న్యూక్రాంజు (అనుజర్మను సామ్యవాది. అనువాదకులు : అశ్వినీకుమారదత్తుగారు, [వెల అర్ధరూపాయి]. వలయువారు, దర్భా శ్రీ రామమూర్తిగారు, న్యూస్ ఏజెంటు, భీమవరం, పశ్చిమగోదావరిజిల్లా అని వ్రాయవలెను

'ఈశ్వరసేవకులు': (ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖాన్; డా. ఖాన్ సాహేబుసోదరులు):— కర్త : మహాదేవదేశాయి : అనువాదకులు కొత్త సత్యనారాయణచౌదరిగారు, నిడుబ్రోలు, గుంటూరుజిల్లా. [వెల రు. 0-8-0 లు]

'భ్రమప్రమాదప్రహసనము' (Comedy of Errors)— షేక్స్పియరు మహాకవి విరచితము.—అనువాదకులు : శ్రీ పూచి నరసింహముగారు [వెల, రు. 0-10-0 లు.]

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad.

భారతి

సచిత్ర మాసపత్రిక

సంపాదకుడు

శి. శంభుప్రసాద్

ఆంధ్రపత్రికా ముద్రాలయము,
మద్రాసు.
౧౯౩౮

సంపుటము ౧౫, సంచిక ౮

ప్రకటన

ఈక్రింది కనబరచిన నెంబర్లవారికి ఈనెల భారతి (1938 సం ఆగస్టు నెల)తో ఇదివరకు చెల్లించిన చందా పూర్తి యగుచున్నది తిరిగి ఇంకొక సంవత్సరమునకగు చందా మాకు చేరునట్లు ఈనెలాఖరులోగా మనియార్డరు చేసినచో తెంపు లేకుండ పత్రికను పంపుచుందుము. అట్లు తమ యొద్దనుండి 30-వ తేది లోపుగ సొమ్మురానిచో సహజభాషాభిమానులగు తాము తిరిగి ఇంకొక సంవత్సరమువఱకు భారతి చందాదారులుగ నుందురను నమ్మకముతో 1938 సం సెప్టెంబరు 10-వ తేదిని రూ 6—4—0 లకు వి. పి. పంపుచున్నాము గావున తా మెప్పటివలెనే పత్రికయందభిమాన ముంచి సొమ్ము చెల్లించి వి. పి ని గైకొన ప్రార్థితులు. ఒకవేళ తమకీ పత్రిక ప్రస్తుత మనవసరముగ దోచినచో మాకావిషయము వెంటనే తెలియజేసిన యెడల వి. పి. పంపుట నాపుదుము.

A 2, 7 B 8, 9, 23 H 33, 34, 35. J 4. L 15. M 8 N 14. P 19, 20, 22, 43, 49. R 48. S 16, 69, 70, 72, 73, 74, 75, 145, 148, 149. T 1. V 21, 22.

విషయసూచిక

చిత్రములు


త్రివర్ణచిత్రము: తానాజీమాలుసురే.

చిత్రకారుడు: గోపాలకృష్ణగోఖలేగారు

వ్యాసలేఖకులకు మనవి

వ్యాసాలు ఎనిమిదిపుటలకు మించకుండా ఉండాలి. వ్యాసరచన రంజకంగా ఉండాలి. శాస్త్రీయవిషయాలనుగురించిన వ్యాసాలుకూడా ఎక్కువ పరిభాషా, ఎక్కువ వివరాలూ లేకుండా సంగ్రహంగాను, సామాన్యపాఠకునికి విషయం బోధపడేటట్టు సులభంగాను, మనస్సును కథలా ఆకర్షేటట్టు ఆకర్షకంగాను ఉండాలి. శాసనవ్యాసాలు పదిపన్నెండు పుటలకు మించేయెడల రెండుసంచికలలో ప్రకటింపవలసివచ్చును.

దేశాన్ని ఎక్కువగా కలవరపరుస్తున్న ఆర్థిక, రాజకీయాది విషయాలనుగురించీ, మనఆంధ్రుల ప్రత్యేకసమస్యలనుగురించీ ప్రత్యేకవ్యాసాలు కావాలి. సాధ్యమయినంతవరకు ఎత్తుకునే విషయంలోను, చూచేదృష్టిలోను, రచించేరచనలోను కొత్తదనం కావాలి. మన ఉద్యమాలూ, మనదేశం, మనసంఘం, మనఆశయాలు భారతిలో ప్రతిఫలించేటట్టు చూడవలసిందని వ్యాసకర్తలకు మనవి.—భా. సం.



తానాజీ మాలుసురే



సంపు. ౧౫ బహుధాన్య, శ్రావణమాసము (ఆగస్టు 1938) సంఖ్య ౮

ఉయ్యాలత్రాళ్లు

విశ్వనాథ సత్యనారాయణ

ఇవి యేమి మోపులే
ఇవి యేమి మోపులే
బండ్లపై నెచ్చటికి బంపింతురే
ఎడ్ల మెడలను గంట
ఎడ్ల కనులను గంత
లెచ్చటికి తోలుకొని యేగింతురే
అమ్మ, నీ గోల నీ
దడిగినది చెప్పవే
ఎచ్చటికి తోలుకొని యేగింతురే
బండ్లపై నెచ్చటికి బంపింతురే.

మన కెందు కామాట
మన కెందు కాజోలి
బండ్లపై నెచ్చటికి బంపింతురో
ఊరుకోరా తండ్రి
ఊరుకోరా బాబు
ఎచ్చటికి దోలుకొని యేగింతురో
ఎవరైన వినిపోదు
రెవరైన కనిపోదు
రెచ్చటికి దోలుకొని యేగింతురో
బండ్లపై నెచ్చటికి బంపింతురో.

ఎవరైన విన్నచో
ఎవరైన కన్నచో
కొంపమీదికి వచ్చి కూర్చుండునా
అవి యేమి మోపులని
అవి యెటకు బోవునని
అడిగినంతనకూడ నపరాధమా
పెదవి కదిపిన తప్పా
యెదియు నడిగిన తప్పా
కొంపమీదికి వచ్చి కూర్చుండునా
అడిగినంతనకూడ నపరాధమా.

ఉయ్యాల త్రాళ్లోయి
ఉయ్యాల త్రాళ్లోయి
కొంపమీదికి వచ్చి కూర్చుండునోయ్
త్రాళ్లు కట్టలు కట్టి
తరలించుచున్నారు
అడుగు టద్దియుగూడ నపరాధమోయ్
అమ్మవా రుత్సవము
లాపివేశా రోయ్
కొంపమీదికి వచ్చి కూర్చుండునోయ్
అడుగు టద్దియుగూడ నపరాధమోయ్.

అమ్మవా రుత్సవము
లాపివేయుట యేల
అమ్మ మాన్యపు పంట లయిపోయెనా!
ఎడ్ల మెడలను గంట
లేల కట్టిరి తల్లి
ప్రోత దిక్కులయందు ప్రోగించదా
ఎడ్ల కన్నుల గంత
లేల కట్టిరి తల్లి
అమ్మ మాన్యపు పంట లయిపోయెనా
ప్రోత దిక్కులయందు ప్రోగించదా.

ఎచటి మాన్యపు పంట
లచటనే తినివేసి
రమ్మ మాన్యపుపంట లయిపోయెనోయ్
ఎడ్లగంటల ప్రోత
లేమొ పండినయట్లు
ప్రోత దిక్కులయందు ప్రోగింతురోయ్
ఎడ్ల గంతలు కట్టి
యింత తిననీయరోయ్
అమ్మ మాన్యపుపంట లయిపోయెనోయ్
ప్రోతదిక్కులయందు ప్రోగింతురోయ్.

పూజారులునుగూడ
పోవుచున్నారమ్మ
నరి దొంగతన మంత సాగింతురా
వెట్టి నాయకు లల్ల
వెంట నేగెద రమ్మ
అంత నిర్భయముగా నాడింతురా
అమ్మవా రుత్సవము
లాపియే వేసినా
నరి దొంగతన మింత సాగింతురా
అంత నిర్భయముగా నాడింతురా.

అది యొక్క మెత్తోయి
ఆది యొక్క యొడుపోయి
సరి దొంగతన మల్లె సాగింతురోయ్.
అందఱను కట్టుకొని
ఆటలాడెద రోయ్
అంత నిర్భయముగా నాడింతురోయ్
అమ్మవా రుత్సవము
లవి జరుగుచున్న ప్లై
సరి దొంగతన మల్లె సాగింతురోయ్
అంత నిర్భయముగా నాడింతురోయ్.

త్రాళ్లనడుమ తుపాకి
దాచినా రో తండ్రి
అడ్డ మేగిన కాల్తు రో నాయనా
త్రాళ్లనడుమను మందు
దాచినా రో బాబు
అది యింతలో బేల్తు రో నాయనా
పూజారులను త్రావ
బోసినా రో తండ్రి
అడ్డ మేగిన గాల్తు రో నాయనా
అది యింతలో బేల్తు రో నాయనా.

ఎడ్ల నా పెదనమ్మ
ఎడ్ల తో లెదనమ్మ
ఎవ రడ్డమయి వత్తురో చూతునే
ఎడ్ల గంతలు విప్పి
ఎడ్ల పొలముల తోలి
ఎల్లరను నదలింపగా పోదునే
అమ్మవారుత్సవము
లవి మరల జరిగింతు
ఎవ తడ్డమయివత్తురో చూతునే
ఎల్లరను నదలింపగా పోదునే.

నేను చచ్చిన నేమి
నీకడుపు చల్లగా
ఉన్న నెప్పటికైన నొడ్డెక్కదా?
ఒకరి తరువాతగా
నొక్కరము మే మెల్ల
అడ్డుపెట్టుచు బండి యాగింతుమే.
ఇపుడు కాకుంటేను
ఏనాటికైననూ
అమ్మవా రుత్సవము లాడింతుమే
యుదరి ఉయ్యాల త్రా ళ్లాగింతుమే.

———

భావపరిశీలనము

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

కన్నుల నాకర్షించు ఉత్కృష్ట వస్తువులును, మనసుల నలరించు ఉదాత్తభావములును ఆనందాత్మకములైనవి. కాని ఆనందామృతమును గని గ్రోలజాలువా రెందరో ఉందురు. సుధాసృష్టిని గావించిన జగదీశుడు ప్రమోదభరితమనస్కుడైనను దాని నొరులు మక్కువమెయి గుటకలువేసినపుడే స్వీయసృష్టి సార్థకమైనదని యలరి భావబంధురమైన నృత్యము సలుపును. ఆత్మప్రకాశ మొనరించుకొనుటలో తా నందు సంతసముకంటె తన సృష్టి మనుష్యహృదయమున స్వాగత మందినపు డీత డందుపరితోషము పెక్కుమడుంగులు ఘనతరమైనది.

స్వర్ణకిరణములకు జిజ్ఞాసువులు జోహా రనినపుడును, పండువెన్నెలకు కవిచకోరములు కన్నులొగ్గినపుడును, వీరి గుణగ్రహణశక్తికతన, అనుభవసామర్థ్యమువలన తన రచనము సార్థకమైన దని ఈత డెంచును. పరప్రమోదమును కాంక్షించువాడేయయ్యు, ఇదియే తన పరమాశయ మని యూహించి, పరకీయశక్తి ననుసరించి, తనశక్తిని కుఱుచగావించి, వారిప్రశంసను పడయ నీత డభిలషింపడు.

మూర్ఖులు మౌఢ్యమునే ప్రేమింతురు. కలుషవర్తులు కలుషమునే కాంక్షింతురు. తమ మనసులకు వచ్చినవానినిగాక అన్యములను—అవి మహోత్కృష్టములే కానిండు—వీరు కోరరు. ఇట్లని సృష్టికర్త కలుషమును సృష్టించి, వీరిప్రమోదము నవలోకించి కులుకడు. త్రాగుబోతులు కలరని యీతడు తన కలశమందలి యమృతమును నేలపాలు చేసి, సుర నందు వోసి అభాగులకు పంచియిచ్చుటకై కల్లుపాకలకడ విడియునా?

ఎట్టికట్టిడియిక్కట్టులందైనను ఉత్కృష్టాశయమునకు బన్నము వాటిలరాదు. ఆత్మకును ఈయాశయమునకును సన్నిహిత సంబంధము కలదు కావున, దీనికి కలిగిన భంగపాటులో తన తలవంపును చూచి అది మిగుల వందురును

ఉదాత్తాశయము గుఱుతింపలేనిమానవుడు ఆనందము నందడు. ఆనందించువారి నెఱుగడు. ఆత్మానందమునకును, పరప్రమోదసృష్టికిని అనివార్యముగ అక్కఱైనది ఆత్మజ్ఞానము. ఆత్మజ్ఞాన, ఆత్మానందముల నందినవాడే అపూర్వసృష్టి గావింపగలడు. ఈమూటికిని అవినాభావ సంబంధము కలదు. "Self-knowledge and Self-realisation lead to sovereign power" అని వచించిన ఆంగ్లమహాకవి హృదయమహోదధియం దెట్టి భావజలచరములు చలించినవో!

జిజ్ఞాసానలమును మనసున రవుల్కొలిపి, ఎంతో తప సొనరించియే ఎవండుగాని విజ్ఞాని కాగలడు. లక్ష్మీప్రసన్నత పల్వురకు చేకురును. ఇంట శయింపక విపణిలో శ్రమించు వ్యక్తి స్వీయజీవితమున నాణెములు ప్రతిధ్వనించుట వినజాలును. వాణీప్రసన్నత ఎవ్వరికో కాని లభింపదు. విపణినుండి తరలి జిజ్ఞాసువు గభీరప్రశాంతిలో మానసమును, (కాసారమున హంసవు వదలులీల) విడువవలెను. సరస్వతిచేతి వీణెకును ఈతని గుండియకును తొలిభవమున దగ్గఱి చుట్టరికము చేకుఱియుండవలెను. ఇట్టి వియ్యమువలన వీణాతంత్రినుండి రాలు మధురగీతికా పరంపరకును వీని హృదయస్పందమునకును నెయ్యము కలుగును. నెయ్యంపు స్పర్శ ఎట్టిదో ఎఱుగరా? తన కిరణజాలముచే ప్రేమజాలము నల్లి జాబిల్లి గభీరసింధువు నాకర్షించుకొనదా? సుధాంశు సంశ్లేషము నాశించియేకదా మహోద్వేగమున మహోదధి ఉవ్వెత్తుగ లేచును. మంజులకళాస్పర్శకతన, ఆధ్యాత్మికమైన నెయ్యమెఱిగిన అదృష్టవంతునిహృదయము, కృష్ణసంశ్లేషమున తన్మయానంద మందు వ్రజనారివడువున,

పరమప్రమోద మంది విమలగాంధర్వవీచికలను బహుళ మానసములపై విహరింప బుత్తెంచును. కసువులోని కడలి నిండా కెరటాలతో వాక్కులం దుప్పొంగుచుండును. ఈతడు సృష్టించుకావ్యమును పరిశోధించితిమేని, అది యక్షరములం దవతరించిన సత్యలోక మని గుర్తింతుము. వాణీకారుణ్యము నందినవాని జీవితమున నెట్టిప్రభావము ప్రకటితమగుచుండునో యూహింపుడు. ఈరీతి తప సొనరించిన మఱొకవ్యక్తియే ఈ ప్రభావమును గుర్తించి ఆనందింపగలడు. భావబాంధవ్యము నెలసినపుడే ఈతని నాతడును, ఆతని నీతడును గుర్తింతురు; అపుడే అవార్యబాంధవ్యమున వీరు మెలంగెదరు. ఈశ్వరహృదయము కైలాసము, విష్ణుహృదయము వైకుంఠము. కైలాస వైకుంఠముల భావబాంధవ్యమువలననే శివకేశవులకు మైత్రికలిగెను. వీరిలో నొకరిని కవి యనుడు, రెండవవానిని విమర్శకు డనుడు. ఆతడే ఈత డని, ఈతడే ఆత డని వచించినను వచింపుడు. వీరిరువురికిని ఆంతరంగికమైన చుట్టఱికము న్నది. ఈ చుట్టఱిక మెందు లేదో ఆకవి కీతడు విమర్శకుడు కాడు; ఈ విమర్శకున కాతడు కవియును కాడు.

ఒండొరులసఖ్యము నపేక్షించువారే యయ్యు, అది చేకుఱునంతకు వీరు సత్త్వపు సంకెలలు కట్టరు. ఈ శక్తి గుండెయందు ఖైదీయై యుండదు.

జగదీశునిమనసున నుదయించిన ఉజ్జ్వలభావమే దిగ్వలయమున దినమణియై తేజరిల్లును. ప్రతిభకు అనివార్యమైనది ఆత్మప్రకాశము. తన గుండెలోని సుగంధమును వ్యక్తీకరించియే గులాబి తెప్పిరిలును. చిరతపఃఫలమైన మాధుర్యమును తన చిన్నిగుత్తుకనుండి వెలారించియే కోయిల డెందమున నానంద మందును.

అర్ధశర్వరీసమయమున శాంతియుతమై, కౌముదీస్నాతమై, గంధబంధురమై, మధుమయమైన వనస్థలి కలకంఠకుసుమ శీతాంశుల ప్రతిభకు ఆటపందిరి యగుచుండును. అడవి గాచిన వెన్నెల వ్యర్థమైన దని వచించుట విందుము. ఎడారిలోని పూవు ఒంటరిబ్రతు కీడ్చి కడతేఱు నని వాకొనుట వినుచుందుము. అడవి యని వెన్నెల అందుండి వెడలి పోదు. ఎడారియని ఇందుండి పూవు రెక్కలు కట్టుకొని ఎందేని ఎగసిపోదు. ఆకుమూకలలోని గూడు వీడి, ప్రకటన ప్రచారములలో మునుగుచు కోయిల పట్టణాలలో పాట కచేరి చేయదు. తమ మనసులకు వచ్చిన తావులను, తమ ప్రకృతి కనుకూలమైన నెలవున తమ గుండెలను విప్పి, తమప్రజ్ఞను ప్రకాశ మొనరించి ఆత్మానందమున నివి యోలలాడును. వ్యక్తమైన ఈనిశక్తి వ్యర్థమైనదని తలపరాదు. అడవిలోని మోడులును, ఎడారిలోని వాలుకాకణములును ఈశక్తిని గురుతింపక పోయిన నేమి? వనమందు వెలారిన వెన్నెలలో జలక్రీడ లాడని కొలకులు పెక్కు లున్న నేమి? వెన్నెలవాకకై కుత్తుక లొడ్డు రథాంగములు వనస్పతిపై ప్రక్కలెల్ల గ్రమ్ముటలేదా? సౌరభ మాధుర్యములను వశమొనరించుకొని, గాలిదిండులు ఘనము లెత్తి యాడుచుండవా? బజారుల బడి పోవువారును, కచేరులలో కాలక్షేపము చేయువారును, చిత్తమువచ్చినట్లు సమయసంహారమును సలుపువారును ఎందఱెందఱో ఉన్నారు. ఉన్న నేమి? సౌందర్యసౌరభమాధుర్యముల పిపాస దీర్చికొన నువ్విళ్లూరు కవికుమారుండును, ఆనందవృష్టికై ఆత్మనొడ్డు ఋషిపుంగవుండును, తనివార వీని నంది బహుసీమలకు, బహుళయుగములకును పంచియిచ్చెదరు. కాలక్రమమున నీవార్త విని కోయిలయును, పూవును, రేయెండయును ద్విగుణీకృతమైన ప్రమోదమును పడయును.

ఈసత్యము మహారచయితలయెడలకూడ జెల్లునని తెలుపుట నాయాశయము. వాల్మీకివ్యాసుల దృష్టాంతములనే పరికింపుడు. తమకావ్యములను సృష్టించుటకు మున్ను వీనిపై పూలుచల్లువారిని కనుటకై నగరవీథులందు వీ రల్లాడలేదు. మునిమానసములందు నుదయించి, ఆశ్రమములం దొప్పిన ఆరణ్యకములు అరణ్యములందే అడగి మడగియుండెనా?

అభివృద్ధిపథమున కదలిపోవుట ప్రతిభ—ప్రధాన లక్షణము. ఈపయన మాత్మప్రకాశమున గలదు. ఈ భావయాత్ర యెట్టిదో గమనింపవలెనన్న, మనుష్యప్రజ్ఞయొక్క పుట్టుపూర్వోత్తరములను పరిశోధించుట పాడి. ఈ పరిశోధన మాంతరంగికదృష్టికే శక్యము. శైశవమునుండి కవి కావించు పఠనపరిశ్రమ పర్యా

లోచన పరిశీలనములును, మనన నిదిధ్యాసనములును వీని చూడ్కి నాకర్షించిన ఉజ్జ్వలదృష్టాంతములునుమాత్రమే యీతని ప్రజ్ఞకు హేతువు లాయెనని ఊహింపరాదు. ఇట్టి వైజ్ఞానికఘట్టములు పూర్వభవములం దెన్నో యుండును. కారణసూత్రము పెక్కు పుట్టువులతో తెగునట్టిది కాదు. దీని ననుసరించియే ఆంతరంగికగమన ముండును.

బహుజన్మసంచితవిజ్ఞానానుభవములు కడలియడుగునగల మానికములట్లు మానసమున నడంగియుండును. ఆత్మసలుపు మజిలీలకు సంబంధించిన విపులోదంతము దివ్యసంక్షిప్తలేఖనమున హృదయమున నంకితమై యుండును. ఊర్ధ్వలోకములందును, అధోలోకములందును, చెప్పనేల అనంతభువనములందును కడచిన మజిలీ లవి!

భువనభువనములనుండి యీరీతి యాత్ర సాగించుచు వచ్చు తపస్వి తమోబద్ధుడు కాజాలడు; మొద్దువలె పడియుండ లేడు. గుండెలోని మరలు చలించుచుండ నింజను నిలిచియుండునా? వినోదమున కాలమును నెట్టించుటకు తపస్విస్వాంత మియ్యకొనదు.

ఒక్క చూడ్కిని చుక్కలందును, వేఱొక్క చూడ్కిని అంతరంగస్థ దివ్యసామగ్రియందును నిగిడించి, స్వీయజీవితమందలి భావిపంథ నీతడు నిర్ణయించును. ఒక్కొకపు డీతడు తన శరీరమును వీడి అనంతవిశ్వమున విహరించునని వచింతును. వేఱొకప్పుడు లోగల మున్నీట మునుంగునని వాకొందును.

అమృతజీవియైన ఆత్మ అనంతకాలమున సలిపిన యాత్రను కనులు మూసికొని, ఏకాంతమున నీతడు సింహావలోకన మొనరించునపుడు (దిగ్వలయమున కవ్వల నుండి చూడ్కి లోనికి చివాలున గంతువేసి, అంతర్హితమగు బంగారుతళుక్కువలె) ఒక్కొక యద్భుతాంశ మీతని యాంతరంగికదృష్టిలో మినుక్కు మనును. ఉదయాద్రిపై స్వర్ణద్యుతి తలయెత్తినంతన కులాయమునుండి తటాలున తూరుపున కెగయు పులుగువలె, వీని యాత్మ విహంగ మపుడు హృదయనందనమున నెగయును. తరుశాఖిదృశ్యమునకై తడయును. అది తోచినంతన నృత్య మొనరించును. అది యగపడనితఱి మునుల జాగులును. ఈతని యంతరంగమున నెట్టి చిత్రఖేలనము జరుగుచుండునో తలపోయుడు.

చిరతప మొనరించిన పిదప దివ్యస్పృశ్యసంపర్శన మైనంత, భక్తిపరవశుడై ఈ తపస్వి ఉపాస్యదేవత - చరణసరోజములను స్పృశించి తాను భృంగిరై, వాని యందలి మరందమున జొచ్చి, దానిని గ్రోలి కవితా ఝుంకృతులు సలుపును... అద్దమందు తోచిన రూపము పెక్కుమడుంగులు కాంతిమంతమై యుండువడువున, తలపున తగ్గొత్తిన ఉజ్జ్వలరూప ముజ్జ్వలతమ మగును. పట్టరాని యుద్వేగ మపుడు హృదయనిభృతమున నుద్భవించును. దీనిని ప్రకాశము గావించినగాని ఈతం డాంతరంగికశాంతి నందజాలడు కదా! ఉద్వేగభరమునకు సరిపడు మాట లీతని కవలీలగ లభింపవు. తనవాంఛ దెలుపలేని బాలకునివలె నీత డెంతో వాపోవును. దివ్యశక్తి మాతృశక్తిని బోలునది. కవిడింభకుని ఆంతరంగిక యావేదన నెఱిగిన దివ్యశక్తి మిన్నకొనియుండదు. అతని రసనమున కపూర్వప్రభావ మొసంగును. హృదయస్థభావబ్రహ్మాండ మపుడు క్షరము గాని యక్షరమాలయందు వెల్వడును. అక్షరములందే కాదు, నృత్తగీతములందును నది ప్రకాశమగును. ముద్దుకృష్ణుడు శ్రీ చైతన్యుని హృదయహ్రదమున, నెన్ని మడుగుల యందమంది జలక్రీడలు సలిపినాడో! ఆత్మప్రకాశమునకై గౌరాంగుడు వాపోయినాడు. పదపడి దివ్యావేశము నందినాడు; లోని నృత్తగీతములతో లయ గలిపి తాను నృత్యము సలిపినాడు. ఇట్లు శ్రీచైతన్యుడు కౌగలిగినవాడే కవీంద్రు డని నేను నొక్కి వక్కాణింతును.

మనుష్యుడు రక్తమాంసముల ముద్దమాత్రము కాడని, ఐహికజీవిత మీ ముద్ద దొరలు రాజమార్గము కాదని, అనంత భువనములను దండగ గ్రచ్చుకొనిన అనిర్వాచ్య ఆధ్యాత్మిక శక్తి ఈముద్దయందు వసించుచున్నదని, దీనిని తొంగియైన మాడక ముద్దకు సంబంధించిన పెనగులాటయందే జీవితము కడపువాడు మనుజుడే కాడని, ప్రతిభావంతు డిట్టి మానవుడు కాడని, రక్తమాంసముల ముద్దను కృశింపనిచ్చియైన నిమిషనిమిషము అంతరంగవీథియందు నవ్యదృశ్యముల నవలోకించి, హృదయస్థ మహోజ్జ్వల దీపాంకురమునకు జేజేలు పాడువాడని, ఈపాటయే ఈతని రచనమగునని పాఠకులు గ్రహించియే యుందురు.

ఆంతరంగిక భావ బాంధవ్యము గలవాడే, ఈ రచనలోని అతిలోక సౌందర్యమును గుర్తించి మిగుల నలరి, దానిని సృష్టించిన ప్రతిభావంతునకు ప్రణమిల్లును.

ఆదర్శ విమర్శకుడు కవి వాక్కును అవలీలగ దృష్టినుండి కదలనీయడు.

దాడిమఫలమును తెఱచితిమేని, రతనములు పోయి గింజలు జలజలరాలును. అల్లిబిల్లిగ నల్లుకొనిన లతాలయమును కదలించితిమేని, చుక్కచినుకులు పోయి పూలు ఒడిలో రాలును. మంచుతెఱ కదలినంతన కనకమరీచులు కసులపండు వొనరించుచు పొడుపుగొండపై చిట్టిగంతు లేయుచు. అందకత్తె అలరినంతన ఎఱ్ఱనివాతెరనుండి మల్లెలుపోలు నవ్వులు రాలును. కవివాక్కును విమర్శకుడు వాడిచూడ్కిచే కదలించినంతన, కనగురుభావరత్నము లందుండి జలజల రాలి, బంగారుబరణిపోలు వాని గుండెను నింపింపును.

సాహితీబదరికాశ్రమమున నరనారాయణులై తపసుసలిపినవారే ప్రత్యక్షకురుక్షేత్రమున నొండొరులను గుఱుతించి యొండొరుల బాసిని కృష్ణార్జును లయ్యెదరు. ఇట్టి నేస్తము పొసగుట యరిది. ఒకరి నొకరు బాయజాలని ప్రేమికులలీల, నొండొరుల గనలేని భక్తుడును, భగవంతుడునుభంగి కవియును, విమర్శకుడును (ఎంతకాలమో తెలుపలేము) వేరై యుందురు. కొంత కాలము కవిపై పడునవి వాడితూపులుకాని అనురాగపుజూపులు కావు; ముండ్లుగాని పూవులు కావు.

కవితారణ్యమున ప్రవేశించి కిచకిచలాడువారు పల్వు రుందురు. అందలి సొగసు చూచి మురియువారెందఱో యుందురు. కాలము కడచినపిదప సౌందర్యాన్వేషి అచ్చోఁ జేరి, తాను కలహంసయై అందలి పద్మాకరమున ప్రవేశించి ఆనందవీచికలందు మునుంగును.

పూవునకు సమీరుడు తోడుపడువడువున, సొగసైనకైతకు సద్విమర్శనము తోడగును.

సద్విమర్శనమునకు ఆవశ్యకమైనది సమానప్రతిభయే కాదు; విజ్ఞానదృష్టిమాత్రమే కాదు*; విశాలదృష్టియు ననివార్యమైనది. వీనిలో నేది కొఱవడినను విమర్శనమునకు మసలము కలుగును.

విజ్ఞానము బహుశాఖలు కలది. తాను విమర్శింపనెంచిన విజ్ఞానశాఖలో నిండుపాండితిని పడయుట విమర్శకుని ప్రధానకర్తవ్యము. ఇట్టి పాండితి నందినను ఈతనియభిరుచి వేరై యుండరాదు.

టాల్‌స్టాయ్ మహావిద్వాంసుడే! కాని, ఈతడు షేక్స్‌పియరును ప్రశంసింపజాలకపోయెను. "హామ్లెట్" మహానాటకమునుగుఱించి తీవ్రమైన ప్రతికూలాభిప్రాయమును వ్యక్తీకరించినాడు. భిన్నప్రకృతులు భిన్నరచనలనే మెచ్చుకొనును.

---

* చూపుగల కన్ను కావలెననినాడుగదా కార్లైల్.

హృదయస్థభావసామగ్రి ననుసరించియే దృష్టియు నుండును. రవిహృదయము తేజఃపూరితమైనది కావుననే, రవి దృక్కులు ప్రభాకలితకిరణము లయ్యెను. హోమగుండమున గూడిన నిప్పులు భగ్గుమనుకొలది, కీలికీలలు (పడగలెత్తియాడు పాములవలె) దివిదెస నెగయును. గుండెలోనిశక్తి ఉజ్జ్వలమగుకొలది కంటిలోని చూడ్కి కాంతిమంతమగును. సూర్యకిరణమును విభజించిచూచితిమేని సూర్యశక్తులన్నియు నందు కేంద్రీకరింపబడియుంట గనుగొందుము. విజ్ఞానిచూడ్కిని విభజించితిమేని అతని ప్రతిభావృద్ధి ఎట్టిదో, వాని హృదయవిభూతి ఎట్టిదో, మేధాసంపద ఎట్టిదో, ఆంతరంగికభాగ్య మెట్టిదో గ్రహింతుము.

విమర్శకునివిజ్ఞానము మూడుతెఱగులు కలదై యుండవలె నందును. పరిశీలనమునకై నిలిచినవిషయమందు పూర్ణపాండితి తోలుత నక్కఱైనది. విషయవిభాగ మొనరించి, కారణకార్యసంబంధము కని సత్యము గుర్తించుటకు వలసిన తార్కికజ్ఞానము తక్కువకానిదై యుండవలెను. కావ్యహృదయములను గుఱుతించుటకు నవసరమైన సౌందర్యజ్ఞానము మనసున నిండియుండవలెను. Logic ను Aesthetics ను ఎఱుగనివాడు (పూజాగృహమున చొరగూడని పశువువలె) పవిత్రసాహితీమందిరమున ప్రవేశింపరాదు. ఇతడు చొరవలసినది కట్టెలయంగడి లేక బొగ్గులదుకాణము.

విశాలదృష్టి లోపమయ్యేనేని, హృదయమున నీర్ష్యానలము రవుల్కొనును. ఏకైకవిజ్ఞానాంగణమున కృషిసలుపువారిలో తఱచుగ నీసు పొడసూపుచుండును. తక్కువ సత్తువగలవారియందును, తనుతలదాటిన శిరోమణి యొకండు సమ్మానపరంపర పడయుచుండె వెనుకబడికొరకొరలాడువారియందును అసూయ మిక్కుటమై యుండును. పగచే (దీని కనేక కారణము లుండవచ్చును) మనసును కలుషిత మొనరించుకొనువారియందును ప్రతిభావంతుని ప్రతిపక్షుల నలరించి స్వార్థమును తనుపెంచువారియందును, ఈ జాడ్యము ప్రబలమై యుండును. సహృదయుడును, దుర్విమర్శనమున నాటి తేటిన దుర్మతుల తూపులను లెక్కసేయనివాడును, తన విమర్శనమును సత్యముపై సద్భావముపై నిలిపినవాడును, ధైర్యమును ఆత్మవిశ్వాసమును గలవాడును, ఉత్తమసాహిత్యాశయముల నారాధించు మహావిజ్ఞానియుమాత్రమే సమకాలికులను మెచ్చగలడు. ఇట్టి మహాపురుషుడు గోచరించుట యరిది. కావుననే "ఏగతి రచియించిరేని సమకాలమువారలు మెచ్చరేకదా !" అని చామకూర కవి పలికినాడు. షేక్స్పియరుమహాకవి నెందఱు సమకాలికులు వెక్కిరించిరికారు ? "వన్నెవన్నెల యీకల దాల్చినకాకి" యనికదా గ్రీన్ పలికినాడు. కీట్సును సంహరించినది, 'బ్లాక్ వుడ్ మేగజిన్' (Black Wood Magazine) అని వచించినవా రున్నారు. వర్డ్స్ వర్త్ మహాకవినిగుఱిచి మెకాలే తన డైరీలో "He is a rat, a humbug, a bore" అని వ్రాసి యుండెను. కాళిదాసు షేక్స్పియరులను గుర్తించిన మహాకవి గేటే ! ఇరువది యేండ్లవయసునే దివి జేరకున్న యెడల కీట్సు రెండవషేక్స్పియరు కాజాలి యుండు నని వచించినవాడు మేథ్యూ ఆర్నాల్డ్. ఆంగ్లపద్యములలో సర్వోత్కృష్టస్థానము నందిన 'పేరడైజ్ లాస్ట్' (Paradise Lost) ను ముద్రించినవారు దానిని కొద్ది చూపుతో చూచిరి. మిల్టన్ కవిచంద్రునకు కొంత ఆయ కల్లమును పెట్టిరి. అంతియే ! స్కాట్ ప్రశంస నందిన జేన్-ఆస్టిన్ గ్రంథములు పొందిన మూల్య మెంత ? రవీంద్రునికథలలో చక్కనైన దానిని శ్రీ. శే. జగదీశ చంద్రబోసు ఒక సుప్రసిద్ధపత్రికకు పంపగా పనికిమాలిన దని యెంచి దానిని సంపాదకమహాశయుడు తిరిగి పంపివేసినాడు. బహుళదృష్టాంతములను పేర్కొనుట కిందు చోటు లేదు. సమకాలికులలో హృదయపూర్వకముగ మెచ్చగలవారిని కనుగొనవలెనన్న, స్వరాష్ట్రమునుండి, స్వదేశమునుండి తరలిపోవలెనేమో యని ఒక్కొకప్పుడు అపోహపడుచుందును. ఒక్క యంశమును విద్యార్థులైన పరితలు మది నిడికొందురుగాక! స్వాతివానబోలు కవిప్రతిభ ముత్తెపుచిప్పవంటి హృదయమునే స్పృశింపవలెను. కుండపెంకుపై స్వాతిచినుకు లెన్ని పడిననేమి ? మంచిముత్తెములంబోలు తలపులు కుండపెంకునకు సహపాఠియైన మనసున నెట్లుదయించును ?

మానససరోవరమున రాజహంస లుదయించునని, మురికిగుంటలో దోమలు పుట్టునని యెఱుగరా ? నాయనలారా ! కమలాకరము హృదయమందుగలవారును, క్రుళ్లుగోయి గుండెయందు గలవారును మానవులందు గలరుసుడీ !

దుష్టచిత్తుడు పాలవెల్లింబోలురచనము నెట్లు మెచ్చును ? విష్ణువువలె నందు వెలయు దివ్యభావము నెట్లు గుర్తించును? "పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా ?" "Throwing pearls before swine" అను ప్రసిద్ధవచనము ఆంగ్లమున గలదు. ముత్యాలసరములంబోలు భావములు మానవరూపులుగల వరాహములవలన పడయు నాదర మెట్టిదో యీ వచనము దృష్టాంతీకరించుచున్నది. మురికిగుంటలో వసంతము బోసె ప్రశంసకై గట్టుపై గూర్చుండువా డెట్టివాడు ?

విమర్శనమునకు తగినరచనలు కొన్నిమాత్ర ముండును. ఆవగింజలో నరవంతుగుణమును, గుమ్మడికాయకు పదిరెట్లైనదోషమును గుండెయం దిడికొనిన గ్రంథములోనికి తొంగి చూడనక్కఱలేదు. ఉదరగోళమున విషకుంభము నిడికొని ఇ దెంతకాలము నిలుచును ? కాటికై కాలుచాపుకొనిన దుష్టగ్రంథమును పరీక్షించుటకు భాషాభిమానులు పూనుకొనరాదు. గొనము మిన్నయై యున్నపుడు నెరసులను మృదువచనములతో పేర్కొనదగును. అప్రియమైనసత్యము ప్రియవాక్కులందే ప్రకాశముకావలెను.

దోషముల నెంచుటే తమ జీవితపరమావధియని, తమ ప్రధానకర్తవ్య మని యెంచువారు కొందఱుందురు. పెద్దవారిమీదికే వీరు చేతులు పోనిత్తురు. గొప్పవారిని వెక్కిరించియే యశస్సిలకులు కావలెనని వీ రాశపడు చుందురు. వీరి సందె క్రుళ్లుగొయ్యి; వీరి మూపు వంకరైనది; వీరిపల్కు పంకిలమయమై, దుర్గంధబంధురమై యుండును. చంద్రుని గూడి బింబమందలి మచ్చను మాత్రము వీరు పేర్కొందురు. సూర్యునందలి నల్లమచ్చలను కనుగొనుటకే వీరు శ్రమింతురు. తేజోమూర్తి ప్రత్యక్షమైనపుడు ముఖవికాసము నుపలక్షింపక, గిఱ్ఱున వాని వెనుక కరిగి అందలి పుట్టుమచ్చలను, కురుపుమచ్చలను వెదకి 'ఇఛీ!' యని తిట్టిపోయుదురు. గులాబితోచినపుడు కంటకములు గుఱించి జుగుప్సాగర్భితమైన ఉపన్యాస మొసగెదరు

తప్పులు వెతకుచో కాళిదాస మయూరాదికవులును, హోమరు షేక్స్పియరులును, రామకృష్ణులును మఱి మునిముఖ్యులును ఎందు తప్పించుకొని పోగలరు ? తమ యభిప్రాయములకు, తమ సిద్ధాంతములకు ఆధారముగ పేడను ముందే తమప్రాంగణమున దుర్మతులు ప్రోగుసరించుకొందురు. 'లాజిక్' (Logic) ను పాతిపెట్టి 'సోఫిస్ట్రీ' (Sophistry) మెడకు జేగంటగట్టెదరు. వీరిచేతి కలమునకును, కసాయి చేతికత్తికిని ఎంతో వియ్యము గలదు. గ్రంథకర్తల బ్రతుకులందు చిచ్చుపుట్టించు పాపాత్ములు వీరు. వీరు, ధనికులగుటచే, పలుకుబడిగలవారగుటచే, నిరంతరాయముగ తమపని నిర్వహించుకొని తమ పట్టువాగాలకు తురాయిచొనిపి వికృతనృత్యము సలిపెదరు. సంఘమునకు వీరిజాతి (క్రుళ్లులో కాపురముండు క్రిమిజాతివంటిదే యిది) చేయుచెఱుపు చెప్పరానిది. ఎంత పాపమో చూడుడు. ఈ పాపులను గుర్తించువారెందఱో ఉండరు. ఉన్న యల్పసంఖ్యాకులలో కొందఱు భయమువలన నాత్మరక్షణమునకై మూలకు తొలగి పోదురు. అనేకులు విచక్షణత తెలియనివారే! దుర్విమర్శన సద్విమర్శనల సత్యాసత్యములను, ఆదర్శరచనా సూత్రములను ఎంద ఱెఱుంగుదురు ? "Mankind is a flock of sheep" అనినాడు కార్లైలు మహాశయుడు. పలువు రజ్ఞానులై జ్ఞానులను హింసింతు రని జే. యస్. మిల్ ఎన్నో దృష్టాంతములను పేర్కొనినాడు. "To be great is to be misunderstood" అని మహావిజ్ఞాని ఎమర్సన్ పైథాగరస్, సాక్రటీస్, జీసస్, లూథర్, కోపర్నికస్, గలీలియో, న్యూటన్ ప్రభృతులకు లభించిన అత్యాచారము నుల్లేఖించినాడు.



స్మృతి

కందుకూరి రామభద్రరావు

రసికత నెఱుంగలేని లేఁబ్రాయమందు
చెక్కిలిని గీటి చిఱునవ్వు సిగ్గువార
మృదుల సుమదళంబులఁబోలు పెదవు లంటి
ముద్దుగొనినావు చూడ్కులు మోహరించి.

హేమకంకణకింకిణు లేమొ పలుక
ధ్వనిప్రధానమ్ముగా బాహువల్లరులను
నా భుజమ్ములఁ బెనవైచినావు; కాని
వెలవెలంబోయి నే నట్లె నిలచినాను.

పరిసరమ్ముల నిశ్శబ్దపరత దెలియ
నురుకుచాభోగ మొగసిపో నూర్చి నీవు
కదలిపోవఁగ రూక్షవీక్షణముఁ బఱపి
చరణమంజీరరవళి నన్ బరిహసించె.

స్మృతిపథాంకితములు నీవిచేష్టితముల
మధురమథనంబు నేఁడు నెమ్మదిని రేఁగు,
ఉజ్జ్వలంబయిపోవు నే నూర్చుకొలఁది,
నిర్మలంబౌను కన్నీరు నించుకొలఁది.

అందుకోలేని యమృత సౌఖ్యానుభూతి
కఱ్ఱుసాచుచుఁ దిరుగాడ వెఱ్ఱివోలె
ఎడద పిండెడి మాధురి మెలుఁగు దాల్చి
వనులు పులకింప, సెలయేఱు ధ్వనులు నింప.

పూర్వమాంధ్రదేశమున బానిసవ్యాపార ముండెనా?

'లెంక' యన్న నర్థమేమి?

డాక్టరు నేలటూరి వేంకటరమణయ్య

ప్రకృతము వ్యవహారమున నంతరించిపోయి, గ్రంథస్థములుమాత్రమేయైన కొన్ని ప్రాత తెలుగుపద ములవలన కొన్ని చరిత్రవిశేషములు బైలుపడుట కలదు. ఇట్టిపదములలో లెంక యొకటి. దీనివలన ఆంధ్ర దేశమున పూర్వము బానిసవ్యాపార ముండెనో లేవో తెలిసికొనుటకు కొంతవీలగునని తోచుచున్నది.

'లెంక'యన్న పదము క్రీ శ. ౧౩, ౧౪-వ శతాబ్దములయందు వ్యవహారభాషలో ప్రచారమున నుండి తరువాత కాలక్రమమున నుత్సన్నమైనది. ఈపదము అప్పటి వాఙ్మయమున తరుచుగ గానవచ్చుచున్నది. మఱియును కాకతియుగ శాసనములయందు లెంకాంకితులగు పురుషు లనేకులు పేర్కొనబడియున్నారు. ఉ : మాచయలెంక, సోమయలెంక, జుట్టయలెంక ఇత్యాది.

'లెంక' యనుమాట కర్థమేమి? భటుడు, సేవకుడు అని నిఘంటుకారు లర్థనిర్వచనము గావించియున్నారు కాని ఈయర్థము 'లెంక' శబ్దస్వభావమును విశదము చేయదు. 'లెంక'కు భృత్యుడు, భటుడను సామాన్యార్థము వచించిన దానివిశిష్టార్థము వెల్లడికాదు. కావున 'లెంక' శబ్దార్థవిచారము కొంత యవసర మగుచున్నది. ఈశబ్ద ముత్సన్న మగుటచేత తదర్థమును నిర్ణయించుటకు దగినసాధనములు ప్రాచీన ప్రయోగములే. ప్రాచీనగ్రంథములయందు లభ్యములగు ప్రయోగముల మూలమున దీని వాస్తవార్థమును గ్రహించవలసియున్నది.

'లెంకగ నేలుకోఁగలదులే మగనిం దరితీపుచేసి' అనుప్రయోగ మొకటి విజయవిలాసము (8 ; 34)లో గానవచ్చుచున్నది. కాని ఈ ప్రయోగము లెంక శబ్దార్థనిర్ణయమునకు అంతగా ననుకూలించదు. 'ఏలుకొను' అనుక్రియ లెంకకు భృత్యు డనునర్థమును సూచించుచున్నది. 'ఏలుకొను' క్రియకు కర్త 'సారసలోచన' లేక 'సుభద్ర'యని తెచ్చిపెట్టుకొనవలయును. 'ఏలుకొనుట'చేత సారసలోచన లేక సుభద్ర ప్రభ్వి. 'మగడు' ఈక్రియకు కర్మ. ఏలబడినవాఁడు మగడు-అగుటచేత అతడు సారసలోచనయధికారమునకు లొంగినవాడు, పనివాడు, సేవకుడు. లెంకశబ్దమునకు రామాభ్యుదయమునందు ప్రయోగాంతర మొకటి గాన్పించుచున్నది.

క. అవసర మక్కఱలం గై
దువుకర్జములందు వేట తోఁటలయందుఁ
దవులైన పాఁతలెంకల
నవుటఁ మముఁ జూడు మోపినపు డెపుడైనఁ.

ఈప్రయోగము లెంకార్థనిర్ణయమున కత్యంతోపయుక్తమైనది. ఇందువల్ల అవసరము, అక్కఱ, కైదువు కర్జము, వేట, తోటలయందు లెంకలు ప్రభువునకు దవులై నెరవేర్చు సేవాస్వభావము కొంత తెలియుచున్నది.

౧. 'అవసరము' అనగా 'వేళ', 'కరియూట' 'మంత్రవిశేషము' అను మూడర్థములను శబ్దరత్నాకరకారులు వ్రాసినారు. సూర్యారాయమున ఇంకను కొన్ని యర్థము లగపడుచున్నవి. అందు ముఖ్యమైనది "కార్యె

చితసమయము'. 'అవసరమువారు' అను మాటక్రింద 'సమయము నెఱింగించువారు', 'రాజద్వారపాలకులు' అను రెండుఅర్థములు గాన్పించుచున్నవి. కావున లెంకలు రాజమందిరంబున వసించుచు రాజునకు సమయోచిత కార్యముల నెఱింగించెడివా రని మనము గ్రహించ వచ్చును.

అవసరమువారు రాజద్వారపాలకు లని సూర్య రాయనిఘంటుకారులు వ్రాసిరి. ఇది తప్పు. 'అవసర ములవారు' 'ద్వారపాలకులు' గారు. ద్వారపాలకులు వాకిటివారు. అవసరములవారును, వాకిటివారును కూడి గములవారేయైనను వారి నియమితకృత్యములు వేర్వేరు. ఈవిషయము తిరువెంగళనాథుని ఈక్రింది ద్విపదల వల్ల తెల్లమగుచున్నది.

నీకు లోకములోని నృపులకుఁ బోలి
వాకిటి కావలివారి కట్టడయొ
యొకమంత్రి యాజ్ఞయొ యొకయవసరము
యొకరాయసము యొద్దియును నొల్ల నెపుడు.
—పర. ఆ, 3.

ఇచ్చట తిరువెంగళనాథుడు వాకిటి కావలి వారిని, అవసరమువారిని వేర్వేరుగ పేర్కొనియుంట చేత అవసరములవారు ద్వారపాలకులు గా రనుట స్పష్టము. 'అవసర' మన 'వేళ' యని బ. సీతారామా చార్యులు అర్థము వ్రాసి రని చెప్పియుంటిమిగదా. ఇది ఈమాటకు ముఖ్యార్థము. పూర్వము మన హిందూ రాజులు వా రొనర్చవలయు దినకృత్యములయం దొక్కొ క్కదానిని జేయుటకును నొకకాలమును నిర్ణయించు కొని యానిర్ణీతకాలక్రమమున దమదినచర్యను నడపు చుండువారు (చూ. ఆముక్త: ఆ, ౪). ఒకొక్కకార్య మును జేయుటకు నిర్ణయించినవేళ యాసన్నమైనపుడు ద్దాన్నిని ప్రభువునకు దెలుపుటకై కొంద అూడిగము వారు నియమితులై యుండెడివారు. చూడుడు:

జగన్నాథుఁ డపుడు మజ్జనభోజనాదు
లొనరించి నగరిలో నొకకొంత తడవు
పవళించియుండి యుప్పవడమై కొంత
నవసరంబులవార లపుడు కొల్వునకు
వేళయయ్యె నటంచు విన్నవించుటయు.
—పర. ఆ 3.

నవలాలిత యౌవనులగు
నవలా లంతఃపురంబున వడిలి దేవా
యవధారు జలకమున కిది
యవసర మనుటయు నతండు నంగీకృతితోన్.
—సాం. ౨-౩౭.

రయమున నిట్లు రానవసరం, బిపు డా దెసు రే కొల్వునే
ర యనుచుఁ దెల్పు యుక్తవిధు, లక్ష సముద్భవుఁ జేరి కానుకల్
శయములఁ గూర్చి నమ్రు లయి, చక్రధరుం గొలిచి గాంచి యుంచి తత్
ప్రియముల నర్మపీఠముల, శ్రీకరతల వసించి రత్తఱిన్॥
—లక్ష్మీ. నృ ౫ : ౭.

పై నుదాహృతి పద్యములవల్ల అవసరములవారు ప్రభువునకు దినకృత్యములు నడపుటకు తత్తదుచిత కాలంబులను దెల్పుటయేగాక రాజదర్శనార్థులై వచ్చు వారలకు రాజుం గాంచువేళ యెద్దియో, రాజాశ్రితుల కొలువువేళ యెప్పుడో దెల్పుచుండువా రని వ్యక్తమగు చున్నది. తత్కారణమున వాకిటివారు (ద్వారపాల కులు) అవసరమువారిని అడిగి తెలుసుకొని సెలవంగి రాజ దర్శనార్థ మేతెంచినవారిని నగరిలోనికి విడిచెడివారు.

వారలఁ జూచి తద్ద్వారపాలకులు
కేలి దండముల వాకిటి నడ్డగించి
నేల గుప్పన మూది నిలు నిలుం డనుచు
గుదిచి మూఁపులవారు కోలలు ద్రిప్పి
బెదర నూరక ఝళిపించి యిట్లనిరి.
అవసరంబులవారి నడుగక పలికి
నవసరం బిపు డెద్ది యని మనంబునను
అడయక యెపుడైన నపుడె లోఁ జొచ్చి
యడిగెద రేమని యనవచ్చు మిమ్ము.
—పర, ఆ. 3.

అవసరములవారి నడిగిన, వారు అవసరమో కాదో తెల్పెడివారలు.

సీ. పొడగనవచ్చు నాప్తుల వేళ గాదంచు
నవసరంబులవార లడ్డగింప
—కుక. ౪, ౧౦౧.

మఱియును రాజు అంతిపురమునం దున్నప్పుడు రాజదర్శనార్థము గొప్పవా రెవ్వరేని వచ్చినను, రాజునకు తత్క్షణమె యెఱుక పఱచవలసిన విషయము లుండిన నరసి పోయి రాజునకు నివేదించవలసిన బాధ్యయుఁగూడ అవసరములవారియం దుండెను.

"విచ్చేసియుండి రావృత్తాంత మెల్ల
నచ్చట నవసరం బరయు చేడియలు
ఇరవొంద నీకార్య మెఱిఁగింపకున్న
వరునిచే వడి నాజ్ఞ వచ్చుఁ బొమ్మనుచు."
—పర. ఆ, ౩.

కావున రామాభ్యుదయమున జెప్పినరీతిని లెంకలు రాజానువర్తులై, నిర్ణీతక్రమమున నాత డొనర్చ వలసిన నిత్యకృత్యముల కవసరములను దెల్పుచు నుండెడివారు.

(౨) ఇక లెంక లొనర్చు కార్యములలో రెండవదియగు 'అక్కఱ' యన నేమియో విచారించ వలసియున్నది. దీనికి శబ్దరత్నాకరమున 'అపేక్ష', 'అవశ్యకార్యము' అను రెండర్థములు చెప్పబడియున్నవి. సూర్యారాయనిఘంటుకారులు 'కొఱత (లోటు), ఇబ్బంది (కష్టము), ఆవశ్యకకార్యము (కావలసినపని; ఆవశ్యకత; అవసరము), అపేక్ష (కోరిక), పూజ్యుల యందలి యనురాగము అను పెక్కర్థములను జెప్పియున్నారు. రామాభ్యుదయపద్యములోని 'అక్కఱ' కిం దేయర్థము సరిపోవునో విచారించవలసియున్నది. సూర్యారాయమున జెప్పబడిన యర్థములలో నొక్కటియగు 'అవసరము'ను పైజెప్పబడిన యవసరమును సమానార్థకములు గావు. ఇచ్చట 'అవసరము' నకు 'ఆవశ్యకత' యని యర్థము. ఈయర్థమున నీపదము ఆధునికభాషయందే వాడబడుచున్నది. ప్రాచీనప్రయోగములు కానరావు. 'అక్కఱ'కు ఈసందర్భమున 'ఆవశ్యకత' యనునదియే తగిన యర్థము; అనగా లెంకలు రాజునకు 'ఆవశ్యక' సమయములయందు నతనికట్టి పనిసేయువారు. కాని, అట్టి యావశ్యకత ఎట్టిదియో తెలిసికొనుటకు తగినంత యాధారము లేదు. భాషాపరిశోధనవల్ల దాని స్వభావము బైలుపడవచ్చును.

మఱియు రామాభ్యుదయమున జెప్పఁబడిన లెంకల ఇతరకృత్యములను 'ఆయుధకర్షణము (యుద్ధము), వేట, తోఁట(వనవిహారము)లను గూర్చి విచారించ వలసిన యవసరము లేదు. ఈకృత్యములు స్పష్ట గ్రాహ్యములు.

ఇంతవఱకును లెంకలు స్వామిభృత్యసంబంధముగ నొనర్చు కార్యములను సాధ్యమైనంతవఱకును నిరూపించితిని. ఇక సంఘమునందు లెంకలస్థాన మెట్టిదియో, వారికి జెల్లుచుండిన మర్యాద యెట్టిదియో కనుగొన ప్రయత్నము సల్పెదను. ఈవిషయమై పాల్కురికి సోమన దన పండితారాధ్యచరిత్రయందు కొంత దెల్పియున్నాడు:

మహి ధవళేశు నామయ్యగా రంద
సహజైకలింగనిష్ఠావృత్తి నడుమఁ
దనతోడి లెంకలు గని యసహ్యమునఁ
జని యుదయావనీశ్వర నీకు పెద్ద
లెంక నామన మిమ్ము లెక్కసేయండు
కొంకక పెట్టెం మకొనియు మీతమ్మ
పారంగజైచును భక్తుండ నను చు
* * *
లెంక నామన భక్తి బింకంబు లుడుగ
కొంకక మీసాలెకును దప్పవట్టె
రా యింద కో తమ్మ రతి నొల్లవేని
మాయొడల్ మాకిమ్ము మాటలే లనుఁడు.

ఈద్విపదలవలన లెంకనుగూర్చి మూడువిషయములు వ్యక్తపడుచున్నవి.

(౧) లెంక స్వతంత్రజీవి గాడు. వానికి దన దేహము పైగూడ నధికారము లేదు. అతడు అంగవిక్రయ మొనర్చుకొనుటవలన (చూ. క్రింద) ఆతనిదేహము విలిచిన యొడయని సొమ్మగుచున్నది. అందువల్ల నాతడు పరాధీనుడుగాని స్వాధీనుడు గాడు.

(౨) తత్కారణమున నొడయ డెట్టికార్యము నొనర్చవలెనని కోరినను సమ్మతించవలయును. 'రా, యింద, కో తమ్మ' యన్నను కొనవలయును. నిగ్రహించరాదు.

(3) ఒడయుడు విల్చి పుచ్చుకొనిన లెంకని శరీరమును ఒడయ డేమేనియు జేయ వచ్చును. 'మారొయెడల్ మా కిమ్ము' అని తర్జించి కొనవచ్చును.

ఈపైనుడివిన విశేషములవలన పూర్వము మన దేశమున మనుష్యుల నమ్మటయు, కొనుటయు జరుగుచుండె ననియు, అట్టి బానిసలకు 'లెంక' యనుపదము చెల్లుచుండె ననియు విశదమగుచున్నది.

కాని లెంక యొనర్చు సర్వకర్మలకును నొడయడు పతియా? ఐహికకర్మల కాతడు పతి యని యందఱును ఒప్పుకొనిరి. దీనిపట్ల సందేహమునకు ఎడము లేదు. ఆముష్మిక కర్మలకునుగూడ పతియా అనువిషయము వివాదగ్రస్తము. ఆముష్మికకర్మలపై నొడయని కధికారము లే దని వాదించి వీరశైవులు దప్పించుకొన బ్రయత్నముసల్పిరి. వీరశైవవాదమును పాల్కురికి సోమన ఇట్లు విశదపఱచు చున్నాడు:

అమ్మహీశుఁడు నామ రమ్మని పిలిచి
కొమ్మిచ్చటన యుంచుఁ దమ్మ నెట్టుడును
తమ్మ భూమీశుయొద్దనె పారవైచి
వర సరు ధ్యానపూర్వక భస్మలిప్త
కరతలుం డగుచు స్రుక్కక పతిఁ జూచి
తగవను సేవకధర్మంబు దలఁప
యొగిఁ దమ్మకైన చె య్యొగ్గనె కాక
దగునె కేవలభక్తిధర్మంబుఁ దలఁప
మొగి ప్రసాదేతరంబునకుఁ జేసాఁప
నర్పింపఁగా రాదు హరున కీతమ్మ
యర్పితేతరవస్తు వది కొనరాదు
చోళవాళికిఁ గాక క్షోణీత లేశ
వేళవాళికిఁ గర్తవే యెట్టు లనిన
స్వార్థజంగమపూజనార్థ మీయర్థ
మర్థసంఘటనార్థ మది నీదు సేవ
అరయఁ దత్సేవార్థ మంగవిక్రయము
ధరణీశ యటుగాక దనశరీరంబు
నమ్మినవాఁడగా కాచారనియతి
నమ్మినవాఁడనే యనవుడు నృపతి.

—పండితారాధ్య.

ఇందువల్ల 'సేవక'ధర్మము భక్తిధర్మముతో విఘటించి నప్పుడు భక్తిధర్మమే యంగీకార్యము అని వీరశైవుల వాదమునుట తెల్లము. ఒడెయుడు లెంకని వృత్తిధర్మమున కధికారి కాని మతధర్మమునకు గాదు. ఈయర్థమునే సోమనాథుడు

చోళపాళికిఁ గాక క్షోణీత లేశ
వేళపాళికిఁ గర్తవే యెట్టు లనిన,

అనుద్విపదయందు బొందుపఱచినాడు. 'చోళపాళి', 'వేళపాళి' అను పదముల యర్థమును మొదట నిశ్చయించినగాని, వీరశైవుల వాదములోని ధర్మసూక్ష్మము తేటకాజాలదు.

ఈపదార్థవిచారమును పెక్కుపండితులు గావించియున్నారు. కీ. శే., కే. వి. లక్ష్మణరావుగారు 'చోళపాళి'యనగా 'చోళరాజ్యము; వేళపాళి యనగ 'కాలుని రాజ్యము' అని వ్యాఖ్యానము వ్రాసిరి ఇది సరియైన యర్థము కాదు. ఏలన ?

(౧) ఉదయావనీశు డేలిన రాజ్యమునకు 'చోళపాళి' అని పే రుండినట్లు నిదర్శన మెచ్చటను గానరాదు.

(౨) మఱియు నీమాటలను బసవపురాణమున చోడల బాచయ్య చరిత్రయందు సోమన మరల వాడియున్నాడు.

'ఇప్పరదైవంబు లిండ్లకు నితని
నేల రావనవచ్చునే? పతి వీవు
చోళవాళికిఁగాక వేళవాళికిని.'

ఉదయావనీశుడును బాచయ్యయు సమకాలికులు. వా రిద్దరు నేకకాలమున నొక్కదేశముపై నధికారము సల్పుట పొసగదు. కావున లక్ష్మణరావుగారు చెప్పినయర్థము సరిపడదు. ఇంతే కాదు పండితారాధ్యచరిత్రలోని ధవశేశు నాయయ్య వృత్తాంతము నంతటిని జదివిన 'చోళపాళి'కి 'చోళదేశ' మనునర్థము సందర్భోచితము కాదని తోచకపోదు. ఇంక, వేళపాళికి కాలుని రాజ్య మనునర్థ మప్రశస్తము. కాలుని రాజ్యమునుగూర్చి ప్రస్తావించవలసిన యవసర మిచ్చట కాన్పించదు. మహామహోపాధ్యాయ కీ. శే. ఆర్. నరసిం

హాచార్యులవారు కర్ణాటకగ్రంథములయందలి ప్రయోగములను జర్చించి 'చోళదపాళి'కి 'ఋణము', 'విశ్వాసము' అను రెండర్థములను నిర్ణయించినారు. దానిమీదట బ్ర శ్రీ. వే. ప్రభాకరశాస్త్రులవారు తమ బసవపురాణ పీఠిక (౧౧౩-వ పుట)యందు ఇట్లు వ్రాసియున్నారు.

"ఈప్రయోగములఁ జూడఁగా నాకిట్లర్థము తోచుచున్నది. చోళవాళి = జొన్నలకయిన నిర్ణయము. వేళవాళి = జీవితకాలమునకైన నిర్ణయము; అనఁగా, 'జీతము (తిండికిజొన్నలు) ఇచ్చినందులకుఁ జేయవలసిన సేవకే నీ వధికారివిగాని, జీవితకాలవిధానమున కెల్ల నీ వధికారివి గావు. వాళి = వతను, ఏర్పాటు, నిర్ణయము. కన్నడమున 'చోళదపాళి'యని యుండుటచేత నది షష్ఠీసమాసము. ఆకాలమున రాజసేవకులకు జీతము జొన్నలిచ్చుచుండి రనుటకు నన్నిచోడని ప్రయోగము,

మును మిడి వైరివాహినుల ముట్టి......
జొన్నలు గొన్న ఋణంబు నీఁగుదుగ."
—కుమా. ౧౧.

'చోళవాళి'కి ప్రభాకరశాస్త్రులవారు చెప్పిన యర్థము చాలవఱకును నంగీకరింపదగినదే; కాని జొన్నలాకాలమున రాజసేవకుల కందఱికిని జీత మిచ్చుచుండి రనుట విచారణీయమే. చోడల బాచయ్య బిజ్జలుని కొట్టరువుపై నధికారి. అట్టివానికుగూడ జొన్నలు జీతముగ నొసుచుండె ననుట విశ్వసించదగినదిగా దోచదు. జొన్నలే జీతమని యర్థముచేసుకొనవలసిన యవసరము లేదు. ఇచ్చట జొన్న లనగా భుక్తి. 'వానికూడు తిని', 'వాని యుప్పు దిని' యనుచోట్ల 'కూడు' 'ఉప్పు'ల కెట్టియర్థమో యట్టియర్థమే జొన్నలకును చెల్లగలదు; అనగా ప్రభువుసొమ్ము ననుభవించుటవల్ల పడినఋణము -అని సామాన్యమైన యర్థమును జెప్పుకొనవచ్చును.

'వేళపాళి'కి లక్ష్మణరావుగారుగాని, ప్రభాకరశాస్త్రులవారుగాని చెప్పినయర్థము లంగీకరింపదగినవి కావు. పాళి అనగా పాడి, ధర్మము. చోళపాళి = రాజుసొమ్ము తిని ఋణపడిన మనుజుడు ఆఋణ విముక్తి నందుటకై యనుష్ఠించవలసిన ధర్మము; లేక నడవడికపద్ధతి.

వేళ = సమయము = సిద్ధాంతము = ఆచారము. వేళపాళి = సమయధర్మము; అనగా, చోళవాళికి= సేవాధర్మమునకు నీ వధిపతి వౌదువు. (ఇచ్చట, 'తగవను సేవకధర్మంబు దలఁప' అను సోమనవాక్యమును స్మరణయం దుంచుకొనవలయును.) వేళవాళికి=సమయధర్మమునకు నీ వెట్లధిపతివి కాగలవు అని పై నుదాహరించిన ద్విపద కర్థము. 'వేళవాళి'నే సోమనాథుడు 'భక్తిధర్మము' అని 'తనకు కేవల భక్తిధర్మంబుఁ దలఁప' అను ద్విపదయందు తెల్పియున్నాడు. 'వేళవాళి'కి సమయధర్మమే సరియైన యర్థమని ఈక్రింది ద్విపదలో సోమనాథుడే సూచించియున్నాడు.

ధరణీశ యటుగాక దనశరీరంబు
నమ్మినవాఁడఁగా కాచారనియతి
యమ్మినవాఁడనే ?......

'వేళ' యనగా మతాచారము లేక సిద్ధాంతము అనుటకు తెనుఁగునందు ప్రయోగాంతరము లేకపోయినను కన్నడమునందు లేకపోలేదు. జీవసంబోధన యను ప్రాచీన (౧౨-వ శతాబ్దము) జైన చంపూగ్రంధమున నీక్రింది ప్రయోగము గాన్పించుచున్నది.

"ఎనె శాలిభద్ర నింతెందం-మనము నోడంబడిసదె వేళె గొండొడం ; తనువ నోడంబడిసదె తపం గొండొడం దోషం పుట్టనో డేగెయ్య లక్కుం" ఎనె. (మన సొప్పనిది మతాచారమునందు నమ్మికె పుట్టదు. అట్లే దేహము అనుకూలము కానిది తపస్సు చక్కగ నడవదు అని దీని తాత్పర్యము)—[జీవసంబోధన, వ్రాతప్రతి, పుట ౫౮ *]

---

* 'వేళ' శబ్దార్థచర్చా సందర్భమున, మద్రాసు విశ్వవిద్యాలయ కన్నడ జూనియర్ లెక్చరరగు మన్మిత్రులు హెచ్. శేష అయ్యంగారు తమయొద్దనున్న జీవంధర చరిత్రలోని పై ప్రయోగమును నాకు తెలియపఱచి వ్రాసియిచ్చిరి. వారికి కృతజ్ఞతాపూర్వక వందనములను సమర్పించుచున్నాను.

కావున, లెంకల వృత్తిసర్మమునకు వారి యొడయడు పతికాని సమయధర్మమునకు కాఁడని వీరశైవులు వాదించిరి; కాని యందులకు వీరశైవేతరు లొడంబడి నట్లు కానరాదు.

ఇట్లు లెంకలు వరవుడులైనను వారిస్థితి దుర్భరమైనది కాదు. వారు తమయొడియల యుచ్ఛిష్టము దిన్న నేమి, మఱి యంతకంటె నీచపుబను లొనర్చిన నేమి, శక్తి సామర్థ్యములు గలవారైనయెడ రాజ్యమున నున్నతపదవు లాక్రమించుకొనుటకు అడ్డంకి యుండెడిది కాదు. లెంకలు

'తమ్మలు దినువారు తమ్మిమ్మువారు
నమ్మిన మంత్రులై నడచెడివారు'

అని సోమనాథుఁ డీవిషయమును విశదీకరించియున్నాఁడు. కావున వీరి కెట్టిపదవి నందుటకైనను నర్హత కలదు. రాజమందిరమున నున్నతపదవులయం దున్న లెంకలను కొరవి గోపరాజు పేర్కొనియున్నాఁడు.

'నిజకోశగృహస్థితుఁ డైనలెంక' (సిం. ద్వా. ౧౧ : ౮౭)
'అర్థగృహస్థితుఁ డైనలెంక' (౧౧ : ౯౨)
గృహాధ్యక్షుఁ డైనలెంక (౧౨ : ౧౧)

ఇట్లు లెంకలు రాచనగరి పెత్తనకార్యములయందు నియోగించబడుచుండిరి. రాచనగరిని రాజ్యమును బోలి పాలించవలసిన యవసర ముండెడిది. అట్టి యవసరమును రాజు లెంకలమూలముగ దీర్చుకొనెడివాఁడు. ఇట్లు ఉన్నతపదవులలో నియోగింపబడుటవల్లనే లెంకలు బాహాత్తర నియోగములలో జేర్పబడిరి.

"హితులు భృత్యులు పురోహితులును రాజ
సుతులు బండరులు రాహుతులు లెంకలును
ననువీర లాదిగా నఖిలనియోగ
మును గొల్వ నృపతి......"

—పండి. ప్రక, ౩.

మఱియును బసవపురాణమున సోమనాథు డీని యోగులను నరువదివగలవారి నెన్నుగు వారిలో లెంకలనుగూడ జేర్చినాడు.

'లెంక దా మంచయ్య లీల మీనగరి
సుంకీడు సుంకేసు బంకయ్యగారు'

కాకతీయరాజులకాలమున నగరిపెత్తనముననే గాక రాజ్యపాలనయందు నియుక్తులై యుండిన లెంకలు కొందఱు శాసనములయందు పేర్కొనబడి యున్నారు. మఱియు రాష్ట్రసంరక్షణార్థము ప్రతాపరుద్రుఁడు నియమించిన డెబ్బదెద్దురునాయకులలో పెక్కండ్రు లెంకనామధారు లగపడుచున్నారు. వీ రెవ్వ రనిన, (౧) అన్నమదేవునిలెంక, (౨)ఝుట్టి (జుట్టయ) లెంక, (౩) గోపులెంక, (౪) మాచర్ల నాగులెంక, (౫) కాట మల్లు లెంక, (౬)మంకు గున్నలెంక, (౭)పారువార బ్రహ్మలెంక, (౮) ఉంచ విల్లులెంక, (౯) దిట్ట కాములెంక, (౧౦) డేగలన్నులెంక, (౧౧) పడిగెము పోచులెంక, (౧౨) బట్ట మాచులెంక, (౧౩) ఉగ్రాహిలెంక. వీరియందు (౨) కడపజిల్లా శాసనములయందును, (౧౦) హైద్రాబాదు శాసనములందును, (౧౧) గుంటూరుజిల్లా శాసనములయందును పేర్కొనబడియున్నారు.

'మీపెద్దలెంక' యని పండితారాధ్యచరిత్రయం దుండుటచేత నగరిలోని లెంకల నందఱ నొకపరిపాటిగ జేర్చి వారి శక్తిసామర్థ్యములను, బుద్ధికౌశల్యములను ననుసరించి పరిపాటియందు వారికి తగుస్థానమును నిర్ణయించుచుండి రని తోచుచున్నది. లెంకలు వివాహము చేసుకొనవచ్చును. ఇతరులవలె వారును భార్యలతో గాపుర మొనర్చి సంతానప్రాప్తి బడయవచ్చును. కాకతీయ ప్రతాపరుద్రునికాలమున గండికోట దుర్గాధ్యక్షుడై తత్ప్రాంతభూమి నేలిన గోంకారెడ్డి యొక లెంకనిపుత్రుడు. ఇతని తండ్రిపేరు జుట్టయలెంక.

లెంకసంతతివారు లెంకలా స్వతంత్రులా? లెంకలు స్వతంత్రులవలె ఆస్తినార్జించి తమసంతతికి జెందజేయవచ్చునా? అనువిషయములు విచారణీయములే; కాని వానినిగూర్చి చర్చించుటకు దగినసామగ్రి ఇంకను లభించినదికాదు. భావిపరిశోధనమూలమున వానినిగూర్చి కొంత తెలియవచ్చును.

వీడుకోలు

స్థానాపతి రుక్మిణమ్మ

ఓనమాలు మొదలుగాఁగ నొక్కబడికె
శ్రీకా చుక్కకా పోవుచుఁ జిత్తమలరఁ
దెలిసికోరాని నిద్దంపుఁ జెలిమితోడఁ
గలిసియుంటిమి నాల్గవ క్లాసువరకు.

మధురగళములఁ బాఠముల్ చదువుకొనుచు
రాగహృదయాల గురుమందిరమ్ము వీడి
చనెడువేళల మముఁ గాంచి జనము పలుకు
మోదమునఁ, జంద్రచంద్రికా మూర్తులనుచు.

వరుస నాల్గవతరగతి వచ్చుసరికి
మాయ మర్మము లెఱుఁగనిమా యెడఁదల
వలపుమొలకలు తలచూపెఁ, బంటనేల
నాట నిలిచిన పరువంపు నారువోలె.

అపుడు నానేత్రములలోన నతఁడు, నతని
కనులలో నేను, మఱియు నామనసె యతఁడు
నాతనిమనమ్ములో నేను, నైక్య మంది
యర్థిమై మెలఁగితిమి వాగర్థములటు.

* * *

ముగ్ధభావైకవేద్యమై ముద మెలర్ప
నరుగుదెంచెను మెల్లగా నట్లుతదియ;
నాఁ డనంతనియతిఁ బసుపాడి, నిదుర
నిరుపమ నితాంత సుస్వప్న నిధులఁ గంటి.

మలయపవమానగానమ్ము, పులుగుగముల
కలకలమ్ములు, కొదమకోకిలరుతమ్ము,
పశ్చిమాశను జాబిల్లి పలవరింత
హృదయముకుళము విదళింప నిదురలేచి,

ఆప్రశాంతనిశీథనిర్యాణవేళ
శారదాంబాదిప్రియవయస్యలను గూడి
ఆడుకొని యేగి పాడితి నతనివీధి
భావగర్భిత మొక్క ప్రభాతగీతి.

అటుల నెన్నియో పాడుచు నాడుకొంచు
కనులు రెండును వీఁపునఁ గట్టివైచి
డోలికల నూఁగ నుద్యానపాళి కంత
మందమందయానమ్మున మరలినాను.

ఇద్దఱిద్దఱే రాగానుబద్ధు లగుచు
డోలికల నూఁగి లోఁదోఁటఁ బూలుకోయఁ
జెలియ లెల్లరు నేఁగిరి, చిన్నవోయి
అలరుపూఁదోఁట కనులుగా నిలిచినాను.

పాలిపోయెడు వెన్నెలబయలునందు
తీఁగెలా నీడ వెనుముందు సాగ - సాగి,
కనులు గప్పెను; వెచ్చనికరయుగమ్ము
నరయఁగల్గితి పరిచితహస్త మగుట.

ప్రేమ నిండార సాక్షాత్కరించె నతఁడు
చేతికిం జేయిఁ జేరిచి సిగ్గుమీఱ
విరియఁబూసిన మాలతీవీథిలోనఁ
గూరుచున్నాము మూగగాఁ గొంతసేపు.

"లేతమనంబులం దడఁగి
లేచినకోరిక లెల్లఁ దీర నీ

రాతిరి లోకమే మఱచి
          రాగగళమ్ముల ప్రేమగీతికా
వ్రాతము పాడుకొందము ప్ర
          భాతపు మందసమీరణశ్రుతిన్
ఊఁతగ మేళవించుకొని
     యూయెలనూఁగుచు రమ్ము నెచ్చెలీ!”

అనిన ప్రియతముమాట లాహ్లాద మొసఁగ
నతనియురమున వక్షమ్ము నదిమి చేరి
రాచుకోఁ జరణాలు తారాపథాన
డోల నూఁగితి హాయిగా కాల మెఱుఁగ.

చిత్త మానందమోహవీచికలఁ దేల,
తనువు పులకించి పరవశత్వమ్ముఁ జెంద,
ఆత్మలో నాత్మ యొక్కట నైక్యమంద,
వలపుకంఠాన నేమేమొ పలికినాము.

చీల్చినారము తిమిరంపుజిలుగు తెరలఁ,
గాంచినారము దివ్యమార్గాల వెలుగు,
నందినారము శాశ్వతానందపదవిఁ,
దలఁచినారము భావి సద్ధర్మగరిమ.

అరసినారము జీవంపుటాశ, లపుడె
కర్ణముల సోకెఁ జెలుల యాగమనరవళి
పరిమళము లీను వరవనస్పతులతోడ
వీడుకో లిచ్చెఁ దూర్పున వేగుఁజుక్క.

* * *

“సెలవు - దయచేయు -
     మఱవకు - చిన్నవాఁడ!”
సెలవు - దయచేయు -
     మఱవకు - చిన్నదాన!”



దోమరాజా!

భమిడిపాటి కామేశ్వరరావు

దోమలమాట చెబుతా! పక్షికిలాగ రెక్కలు రెండూ ఏనుక్కిమల్లే తొండం ఒకటీ భగవంతుడు కట్టబెట్టాడూ! పండితులంతా విధంచెడి ఏకమై ఏనుగుతో జోడించి సమాసించారూ! వృత్తిరహితదీపాలొచ్చి వహ్నిశలభ న్యాయాన్ని రద్దుచేస్తున్నాయీ! మునిసిపాలిటీలు జనంయొక్క నీటియిబ్బంది గమనించి జనానికి ఇన్నినీళ్లు వదులుకుని, తద్వారా పగటివేళకూడా పనికలిపించాయీ! ఇవతల వాళ్లకి — దానిమొహం ఈడ్చా — చెముడనేది ఉందో లేదో కాస్త కనుక్కోడమేనా లేకుండా అడ్డంపడి చెవులుకొరకడం సహజంగా చేతవునూ! ఇహ, దోమలు మిడిసిపడ్డాయీ అంటే, వింతేమిటి విడ్డూర్యమేమిటి నామొహం! ఇంత కహా మిషున్నప్పుడు వాటిని మిడిసేనాపడకుండా చావమన్నారా ఏమిటి! వాటి ప్రయోజకత్వానికి సాయం అవి ఏమూలో పడి ఉండకూడదూ అని కొందరు కోప్పడేది. కాని అది వ్యర్థకోపం. మూలాధారంగా ఉండే పదార్థాలు వ్యాపకం కాకమానవు. పోనీ అందుకు ఒప్పగోవచ్చుగాని, రాత్రింబగళ్లు నిద్రలేకుండా (ఆహారం లేకేం రోగం, బోలెడుంది!) వీటిని అనవసర సంచార ప్రచారాలు సాగించమని ఏడ్చినవాడెవడయ్యా, అని కొందరిప్రశ్న. కాని, ఏం చెప్పగలం? ఎవరికి ఎంతమట్టాలో అంతా ముడితేగాని ఊరుకోరు మరి. మానవజాతి తమరికి బాకీఉన్న తిట్లూ చెంపపెట్లూ అణాపైసల్లో వసూలుచేసుగోవాలని దోమల ఏడుపుగావును! అదీకాక, చేతుల్ని రెక్కలు అనికూడా పిలుస్తూంటారని గావును మానవులే ఎగిరిపడేవాళ్లంటూన్నప్పుడు దోమలు ఆగుతాయా, వాటిని ఎవరేనా ఆపగల్తుమా! అన్నట్టు, మానవుల్ని చెవులట్టుగుని ఆడించగలంగదా అని ఈదోమలకి ఎంతగర్వం అనుకున్నారు, అవి కేషెట్టి రొదగా చెబుతూన్నా మనం వాటిని విసిరికొడతాంగాని! ఇంకోటిట! అవతల శివుణ్ణీ ఇవతల దోమల్నీ పెట్టి తూస్తేటా, ముల్లు దోమలవేపే చూపుతుందిట! ఎందుకంటేటా, శివుడు పుణ్యాత్ములికి మాత్రం, కాశీమరణం లభించినవారికిమాత్రం, కుడిచెవిలోమాత్రం, తారకోపదేశం తీరుబడినిబట్టి చేస్తే చేస్తాడట, లేకపోతే లేదుట! కాని, దోమలో! చివరికి దురాత్ములైనాసరే, అకాశీఅయినాసరే, మరణం లభించకపోయినాసరే, కుడీ ఎడమా లేకుండా, చెవి అయినాసరే కాకపోయినాసరే, రాత్రి రెండోఝాం వేళయినాసరే – అవసరాన్నిబట్టి అప్పట్లో మరీభారీగా- అష్టతారకోపదేశం కాకపోతే లెక్కేమిటన్నాను – తారకం అంటేలాగు గీరకోపదేశం చేస్తేగాని సర్దణిగి ఊరుకోవుట!! పోనీ ఇదంతాకూడా సత్యమేనని ఒప్పుగుని ఇదవుదాంఅంటే మన్ని అవెక్కడ ఊరుకోనిస్తాయీ, వెఱ్ఱిమాటా! దోమలకి గాంధర్వంలో ప్రవేశంఉండడంవల్ల మానవులకి మరీ చావొచ్చిపడింది. అయ్యా, నమ్మతారో లేదో, ఎల్లాగైతేం మహా ఆ అఖండగానం తమ దేఅంటూ అవి ప్రకటించుగునే ప్రత్యేకపు బడాయి ఎన్ని పుట్లనుకున్నారు, వీటి బడాయి తంపపెయ్యా! దోమలకి పుట్టుకతోటే తాండవం ఉందిగనక, దోమగానాన్ని ఏదో మామూలు పక్షిగానంకింద జమకట్టిపారెయ్యక, మంచి యక్షగానంలాంటి నాటకవిశేషం అని, జనం ఒప్పుగుతీరక ఏం జేస్తారో చూస్తాంగా అని కొందరు దోమగానవిమర్శకులు వెనకపాంగుచేసి వీట్లకి హుషారీ ఇస్తున్నారు. పోనీ, విమర్శకులు ఏం జెయ్యగలవ్, ఏ ఒకదానికి స్థిరత్వంగాని, ఏ రెండింటికీ సమత్వంగాని, ఏ మూడింటికీ సాపత్యంగాని ఉండకపోడం సహజంగదా అని, గానప్రియులైనా రాయల్లా మాట్లాడకూరుకోకూడదూ, మనం బతిగిపోదుం!! వాళ్లు ఈ విషయంలో మరీ పుణ్యంకట్టుగున్నారు. దోమగానం మిక్కిలి ఉత్కృష్టంఅని వారు చచ్చుతెగేసి చెప్పి దాన్ని ఊహూ తెగపొగుడుతూండడం అల్లా ఉండ

గా, పైపెచ్చు ప్రతినిత్యమూ దోమనామస్మరణేనా చేస్తే పరానికేనా నయం అని తమలో తమరు ఒక రహస్య తీర్మానం చేసుకున్నారు. అందుకనే, ఈ రహస్యం తెలిసినవాళ్లంతా పాడేటప్పుడు తానంవగైరా మిష కల్పించుకునీ, ఉత్తపుణ్యానికికూడా, "తద్దదోంద, దోందోంద దోంద, దొ ఒ ఒ ఒ దొ ఓ ఒ ఓం దోం" అంటూ స్పష్టంగా దోమాంకితనాదం వినపడనిస్తారు. ఈ సంగతి మరి దోమలు ఏ రేడియోలో పసికట్టాయో మరీ శ్రేగిపోయి, గాయకులే తమగానం మెచ్చింతర్వాత మనుషుల లెక్కేమిటని చెప్పేసి, మానవులు కోరకపోయినాసరే, వద్దు పొమ్మన్నాసరే, మానకుండా, మానవులకి కోలీయేనా టిక్కట్టు ఖర్చులేని గానకళ దేశకాలపాత్ర వివక్షతలులేకుండా విరివిగా ప్రసాదిస్తున్నాయి.

ఇంత అసంఖ్యాకంగా సృష్టింపబడ్డజంతువు వ్యర్థం అయిఉండదు, దీనిప్రయోజనం ఏమిటాఅని కొందరు దీర్ఘాలోచనలో ఉన్నారు. వెనక పాంకరించిన ఒకమనిషిని దోమలుమూగేసరికి అతడు నిద్దర్నించి లేచి కూచున్నట్టు కూచున్నాడట. దీనిసైజు వెనకటికంటే పెరిగిందనిన్నీ కేవలం పిచ్చిగంతపరిమాణం కొద్దికాలంలోనే పొందుతుందనిన్నీ కొందరు సూచించి, ఏ ఆహారం-రక్తంకాక-దానికి సప్లైచేస్తే అది యింకా విజృంభిస్తుందో చూస్తున్నారు. బస్తీలన్నింటిలోనూ ఈ జంతువు దండిగా పుట్టి పెరగడానికి సక్రమమైన ఏర్పాట్లు చేస్తూంటారు. అంచేత ఓ బస్తీకీ మరో బస్తీకీ ఛేతిబంతి, కాలిబంతి, వాలీబంతి, కర్రబంతి, తడకబంతిపోటీలు జరిగించినట్లే దోమబంతిపోటీలు పెట్టాలని కొందరు సెలవిచ్చారు. బస్తీదోమ, ముఱుసుదోమ, నాటుదోమ, లంకదోమ, ముసదోమ — వగైరా దోమవిశేషాలపట్టీలు తయారుచేసి పంపిస్తే, వాటిల్లో మిక్కిలి పొడుగుపట్టీకి గొప్ప బహుమతీ ఇస్తాం అని ఒకపత్రికలో ప్రకటించడంవల్ల, ఆపత్రిక ప్రతికంతా సమూలంగా అమ్ముడైపోయింది. కోడిపందాలులాగ దోమపందాలుకూడా వెనకేఉన్నట్టు ఒకశాసనంలో ఉన్న భావకి తన అర్ధమున్నీ, తక్కినఅర్థాలు తీసేవాళ్లకి ఆలోచన నిండుకుందనిన్నీ ఒకరు అనుకుంటున్నారు. కిటికీలద్వారా

లకి కటకటాలు వేయించడం నిద్దరకిపడ్డ కళేబరాల్ని దోమలు బయటికి మోసెయ్యకుండా ఉండడానికే అని ఒకాయన ఈ మధ్య నొక్కి వాదించి ఇంగ్లీషులో ఆగ్రహించాడు. ఎగిరేస్వభావం ఈ జంతువుకి ఉందిగనక, కొద్దికాలం దీన్ని తరిఫీదుకు గాని చేస్తే, ఖర్చులేని విమానం — 'కీ' యిస్తే పరిగెత్తే శకటంలాంటిది — తయారు కాకపోతుందా అని ఒక జపానీయుడు ఏకతలపోస్తున్నాడట! వేటలు అనేవి హిందూ సాంప్రదాయంలో చాలా ఉన్నాయనిన్నీ, దోమవేటలోకూడా ఆరితేరి ఖండాంతరాల్లో మెప్పులుపొందిన హిందూరాజకుమారులు ఉండేవారనిన్నీ చదువుకున్నవాళ్లు చెబుతూంటారు. వెనకే, తత్తుల్యాలు ఇప్పుడూ ఉండచ్చు, దోమతెర్లు కట్టుకున్నవాళ్లు, లోపలజేరి, ఒకటే అరా దోమలనిమిత్తం రాష్ట్రకలహంలో ఉంటూంటే, తెరలుకట్టుగోడానికి తడిలేని వాళ్లు లోకక్షేమంనిమిత్తం మహాదోమ సంగ్రామంలో పనికొచ్చే బహిరంగపు దోమవేట అభ్యసిస్తూంటారు. పల్లెటూర్నించి బస్తీకి చుట్టం రావడం, అతనికి దోమతెర సప్లై కాకపోడం జరిగితే, అతడు యథాశక్తిగా వేట నేర్చుకుతీరాలి. దోమలూ నల్లులూ కొత్తమనుషుల్ని నిమిషంలో పోలుస్తాయి. కుక్కల్లాగ అవికూడా పసకడతాయెమో! రోజూ మనం కూర్చుంటూన్న పడకకుర్చీమీది నల్లులు మన్నికుట్టవ్; అంటే మనం స్వంతరక్తం ధారపోసి వాటిని పెంచుతున్నాం గనక మనయందు విశ్వాసం, అని కొందరన్నారు. రక్తం మద్దే గనక, రక్తస్పర్శ ఉండబట్టి పీడన మానాయని కొందరన్నారు. కాని, పరాయివాడు వచ్చి, 'అమ్మయ్యా' అంటూ సర్దుకోబోయేసరికి వాడికి వెంటనే అర్ఘ్యమిస్తాయి. దోమలధోరణీ అల్లాంటిదే. అప్పుడాపరాయివాడు 'మీరు ఈ బాధ ఎల్లా భరిస్తున్నారండీ' అంటాడు. 'అబ్బే, నన్నేమీ చెయ్యవండీ!' అంటాం మనం.

ఒకసారి ఒకబస్తీ స్నేహితుడింటికి ఆరుగురు వెళ్లారు. ఇద్దరికి దోమతెర సప్లై అయింది. కడంవాలు గురూ మర్యాదకోసం ఇవతల పక్కడ్డారు. చుట్టుపక్కల అడివి ఏదేనా రేగిందో ఏమో ఆరోజున దోమల పటాలాలు చాలా వచ్చాయట. వస్తూనే తెర ఇవతల

చిక్కడ్డ నలుసుల్నీ తణిఖీ ప్రారంభించాయి. కూచోనివ్వవ్, నుంచోనివ్వవ్, వెన్నువాల్చనివ్వవ్, కునుకోనిస్తాయా!! వీళ్ళల్లో చిన్నప్పట్నించీ ఉక్కురోషగాడు ఒకడున్నాడు. అతణ్ణి కొన్నొచ్చి కేటాయింపుగా పట్టుకున్నాయి. ఎవర్నైనా దోమలు ఆవహిస్తే ఓపట్టాన్ని వదలవ్ — నడిచినా, పరిగెత్తినా, వాహనం ఎక్కినా సరే వదలవ్! గంగలో దిగాలిగాని గత్యంతరం లేదు. రోకలి పుచ్చుక దంచినట్టు పడిలేస్తూ అతని నెత్తిమీద ఓ ఇరవైయో ముప్ఫైయో సమావేశించి, మనిషిని దిగదుడుపుకింద కట్టి ప్రదక్షిణాలు ప్రారంభించాయి. అతడు పళ్లు బిగించి వాటికేసి చూస్తూ వీలైనంత వడిగా ఇటూఅటూ పరుగు ప్రారంభించాడు. దోమతెరలో వాళ్లు, కళ్లుమూసుకునే ఉండి, 'అబ్బా! ఏమిటోయ్! అల్లరి! పరాయిసౌఖ్యం బొత్తిగా కిట్టదేమిటోయ్, నీకు!' అని కేకేశారు. దాంతో అతని రోషానికి కారం రాసినట్టయింది. 'సరే లెండోయ్' అని, అతను కూర్చుని పుస్తకంతీసి చదవడం మొదలెట్టాడు. కీనీసని జేరి దోమలు అతనివీపు లగాయిస్తున్నాయి. కడంవాళ్లు, 'దీపం ఊకేస్తే దోమలు తగ్గుతాయి, దీపం తీసెయ్,' అన్నారు. ఎల్లాఅయితేం అతడు చదువుకోడానికి వీల్లేకుండా దీపం దిగదీశారు. గదంతా చీకటీ వెల్తురూ ఏదీకాకుండా అయి, అతనికి కేవలం సంధ్యేత్తినట్టయింది. ఈ దోసందులో ఒకదోమ రైంయ్యిమని గానంచేస్తూ విమానంలాగ అతని చెవిమీదుగా పోయి, అతని ముక్కుమీద వాలింది. అతను ఆసమయంలో తనకాలిమీద వాలబోతూన్న మరోకదోమని గమనిస్తున్నాడు. తక్షణం ముక్కుమీదది కుట్టింది. దాన్ని సాగదీసి కొట్టబోయేసరికి, తనముక్కు ఊడిపడేటంత దెబ్బ ఛెళ్లున తనకే తగలగా, ఆదోమ మెత్తగా లేచి కటాకటీగా చక్కాపోయింది. అది ఎగిరి ఎక్కడ కెడుతుందో అని దాన్నేచూస్తూ అతడు నడవడంలో — గదంతా ముసుగుముసుగుగా ఉందికాదూ! — పడుకున్నవాళ్ల కంఠాలు తొక్కాడు. 'నిన్ను తగలెయ్యాయ్' అంటూ వాళ్లు కేకలూ తిట్లతో లేచి దీపం హెచ్చుచేశారు. అది గోడమీద వాలింది. మెల్లిగా, శబ్దం చెయ్యకుండా, మాట్లాడవద్దని కడంవాళ్లకి సంజ్ఞలు చేస్తూ, అతడు వెళ్లి దాన్ని ఒక్కచెంపకాయ తీశాడు. అతిసున్నితంగా దానితీసి దోమ పారిపోయింది. అతనికి దోమతోపాటు వేళ్లుకూడా స్వాధీనంకాకుండాపోయాయి. 'అబ్బబ్బ' అని బాధపడుతూకూడా అతడు దాన్ని వదల్లేదు. ఈలోపుగా బోలెడుదోమలు అతని నెత్తెక్కి తాండవిస్తున్నాయి — ఇంతి ఘటంలేదు ఇల్లెక్కి ఓండ్రకొట్టిందనిక్కాదూ, దోమసామెతా! — అలను ఇందాకటిదోమని ఒక్కదాన్నే పట్టుకున్నాడు. అది అతనికి అందకుండా దూలందగ్గిరికి ఎగిరింది. అతను ఎగర్లేక ఊరుకుని, ఈమాటు చెప్పులు కొనుక్కునేప్పుడు, దోమవేటలోకూడా ఉపయోగపడేలాగు స్ప్రింగుచెప్పులు కొనుక్కోవాలనుకున్నాడు. దానికేసే చూస్తూ, కింపకూర్చుని పుస్తకం విప్పి ఎదురుగుండా పెట్టుకున్నాడు. ఏమరుపాటుగా దానిగమనం కనిపెట్టే ఊహతో బుర్ర వంచి చదవడం అభినయించాడు. కాని, అది ఏవేపుకి ఎప్పుడు ఊడాయిస్తుందో అని పక్కబెదురుతోనే ఉన్నాడు. పాపం, అది కదిలి, దిగి, అతని చుట్టూ ఒక్కపెద్దసున్నాచుట్టి, పుస్తకంమీద ఒకవేపున వాలింది. అతనికి కొంచెం విజయందక్కేలాగ కనపడింది. 'నా అంతవాణ్ణి నువ్వు నెగ్గుతావా! అయిందిలే నీపని!' అని అతననుకున్నాడు. మళ్లీ 'పిచ్చిగమీద బ్రహ్మాస్త్రం' అన్నట్టు 'దీనిమీదా నాశౌర్యం, పోనీ దీన్ని క్షమిద్దాం' అనుకున్నాడు. ఇంతలో పారిపోయిన వేళ్లమాట జ్ఞాపకంవచ్చింది. ఇక పుస్తకం తప్పన మూసెయ్యడంతడువు, దోమ పైసలా అన్నమాటే అనుకున్నాడు. అయితేం, పుస్తకంయొక్క రెండుఅట్టలూ పుచ్చుగోడానికి వెళ్లడంలో కుడిచెయ్యి ఎడందానికంటె ఏ అరలిప్తో ముందు వెళ్లడంవల్లగావును పుస్తకం కొంచెం కదిలి, దోమ మళ్లీ దారెట్టింది. తపేలుమని శబ్దం అయేసరికి కునికిపాట్లుపడేవాళ్లూ తెరలోవాళ్లూ ఏ బాంబు పేలిందో ఏ తుపాకీపెట్టి ఇతను కొట్టుకున్నాడో అని కంగారుపడి ఇతణ్ణి పట్టుగోడానికి వెళ్లారు. అతడుమాత్రం చేతులు జోడించి, నిలబడి, కళ్లు మూసుకుని ఈక్రిందిమాటలు పఠించగా తక్కినవాళ్లు నిర్ఘాంతపడి విన్నారు —

"శ్రీమన్మహాదోమ! నీకుట్టడం మండ నే నోడిపో యాను. నెగ్గింది నువ్వేను ఓ దోమరాజా యటంచుం నినున్ పెద్ద చేతుం, బకే, భేషు, వాయించు కర్ణపేయంబులొ నీగానముల్ వర్ణనల్ సేతు, నిన్‌గూర్చి హారతుల్ వెల్గింతు, సాయంత్ర మీనామసంకీర్తనల్ జేసి నీదివ్య చారిత్రముల్ పాడి ఏ బాడిలో నీవు మున్ పుట్టితేనేమి నీ అప్రపత్వంబు శాత్రించరత్వంబునం జేసి నిన్‌గూడ దైతేయవర్గంబునం జేర్చి ఆ బ్రహ్మ యం బ్రహ్మ మాకంటె మీజాతి పైజాతిగా జేసెకాబోలు! ఆమధ్య ఈమధ్య రాజ్యాలు చేసే మహాచక్రవర్తుల్ని రాజాధిరాజుల్ని సింహాసనంమీంచి మానవుల్ దింపారు, పంపారు, చంపారు! కాని, యేమానవుల్‌గాని నిన్ నెగ్గుటల్ విన్పడవ్, కన్పడవ్!! నీకొక్క కైవారముం జేతు, నీకోప మింకన్ తమాయించు, నీ వెట్లు వాంఛించెదో యట్లె నారక్తముం తోడి నీరెక్కలన్ సిక్తంబు గావించుకోగాని, అంతంతరక్తంబు పీల్చేసి పైపెచ్చు నా ఒంటి మీదన్ మలేరియావంటివా వ్యాధులం దెచ్చి పాతేసి పోబోకుమీ, నీకు చాలాను పుణ్యంబు లుండున్. ఇదే స్వీకరించాలి నాదండమున్ నను నెగ్గి నీప్రజ్ఞ చూచే ప్రపంచానికిన్ జాటినా వికన్ నన్ను మన్నించి రక్షించు శ్రీదోమరాజా! నమస్తే నమస్తే నమః."

— * —



చిట్టితల్లి*

కొండేపూడి సుబ్బారావు

[పరిచయము: మానవజీవితములో సౌందర్యానికి గల ప్రాధాన్యము నిరూపించుటే, చిట్టితల్లికావ్యాశయము. భావనకు దివ్యమైన ఆనందము కలుగజేసే కళారాధననే, సౌందర్యపూజగా చిట్టితల్లి ఎంచుకున్నది.

'చిట్టితల్లి' పూర్వపు తెలుగురాజుకూతురు మానవులు నిర్మించుకున్న కృత్రిమజీవితములో నామెకు సౌఖ్యము లేకపోయినది. అందుననే, ప్రకృతిసౌందర్యము వెల్లివిరిసే అడవిలోనే చిట్టితల్లి ఆడుతూ, పాడుతూ ఉండేది. సంగీత, సాహిత్య, నృత్యములు చిట్టితల్లి చిన్ననాడే అభ్యసించింది. సౌందర్యపూజ ఆమె బ్రతుకుబాట. కళారాధన నిత్యకృత్యము.

ఒకనాటి పండువెన్నెల్లో, వసంతసురభిళమైన అడవిదారులలో చిట్టితల్లి మనసుతీరా గానము, నృత్యమూ చేసినది. ఆరసానుభూతిలో గలిగిన ఆనందము పట్టలేక, ఇంటికిపోయి నిద్రలో తాను స్వీయునిగా భావించుకున్న కళామూర్తినీ, సౌందర్యరాశినీ చూచినది. అతనినే తనకు దగ్గఱగా తీసికొనినది. అంతతో నామె కళాతపసులు పండినవి. ఇది చిట్టితల్లికావ్యవస్తువు. కొం. సు.]

చిట్టితల్లి గానము

చిట్టితల్లీపాట చెవుల సోకినయంత
చిట్టితల్లీమాట చెవుల మ్రోగినయంత
అడవిలో జరియించు నఖిలజీవులుగూడ
నొక క్రొత్తలోకమున నుండిన ట్లైపోవు.

ఈమధురగాంధర్వ మీమృదులగానమ్ము
నీనూతనానంద మీనవ్యజీవనము
లేలోకములనుండి ఈభూమిపై నిపుడు
అవతరించెనోయని, అనిపించె నందఱకు.

వలపులరు రాణియై, కలల కల్యాణియై
పలుకుగీర్వాణియై చలియించు వీణయై
చిట్టితల్లీపాడ, చిగురించి కుసుమించి
పొలుపుమీరినయడవి పులకించి మైమరచె.

చిట్టితల్లీపాట చెవులార వినుటకే
తాచుపాములులేచి తలలెత్తి నిలిచినవి
గాలిపడుచులుకూడ కదలుటే మానినవి
పులుగుజంటలు ఎగిరి పోవకే యాగినవి.

చిట్టితల్లీమృదుశ్రీగానమధురిమలు
అడవిపైపై నాడు నాకులటు కదలినవి
అబ్ధిపై కెగసిపడు నలలవలె దొరలినవి
పైరగాలికి నూగు పైరువలె సాగినవి.

కలతనిదురలకలలు కరగిపోయినయటుల,
పులుగుజంటలతేనె వలపుటూరెడి పాట
తొలిప్రొద్దు తెమ్మెరల కలసిపోయినయటుల,
అడివిబాటలపాట ల్లుకొని మ్రోగినవి.

పూదేనియల సోన పొంగి పొరలినయటుల
చదలేటి కెరటాలు సాగిపోయినయటుల

* [ఇది యొక్క పెద్దకావ్యము. ఇందు చిట్టితల్లిగానమె కాక చిట్టితల్లినృత్యము, చిట్టితల్లిస్వప్నము మొదలయిన విభాగములు కలవు.—భా. సం.]

పన్నీటిసెలయేళ్లు పరుపులెత్తినయటుల
గానవాహిని కదలి కాననము నిండినది.

తలిరుటాకుల గాలి ధ్వని చేసినటులుగా
సన్నతీ గెలవీణ సవరించినటులుగా
పసిడికిన్నెర మీటి పలికించినటులుగా
మ్రోగిపోయెను గానరుతు లాయరణ్యమున.

ఏపూర్వపుణ్యాలొ ఏసుకృతచయమ్మొ
ఏకఠోరతపసులో ఏపసిడిపూజలో
ఫలియింపకున్న నెవ్వరికైన గలుగునే
ఈమహాగానముల్ సృష్టింపగా శక్తి.

గాలియే లేని ఆకాశమధ్యమురీతి
అలలు పైకెగయని అబ్ధిగర్భముభంగి
పాటమానినవేళ పరమప్రశాంతమై
ఆకుకదలక యడవి అట్లె నిలుచునియుండె.

తమ్మికొలకులలోన తమిజొక్కు హంసవలె
చదలపై వెలుగొందు జాబిల్లి రేకవలె
నల్లమబ్బులపైని నటియించు మెఱుపువలె
అడవిలో నేకతము పాడగట్టినది చిట్టి.

ఆమె నడచినచోటు లామె తిరిగినయడవి
పసరుచివురులతోడ ప్రసవగంధముతోడ
పుడమిపై స్వర్గంబు పొలుపారసృష్టించి
మధుమాస సౌందర్య మయమై వికాసించె.

ఆమెవిలాసంబు లామెసౌందర్యముల్
కన్నవారికె కాదు విన్నవారికికూడ
నీకన్నెయందంబు లెచ్చటను లేవనుచు
నద్భుతాశ్చర్యమ్ము లావహిల్లగజేయు.

చిట్టితల్లీ పాడి చిన్నారి నడకలో
ఏటిదరి వాహ్యాళి కేగుచుండెడివేళ
పసపు పండించె నా పశ్చిమాకాశమ్ము
తరుణ మాధుర్య సౌందర్యమ్ము లెగబోసి.

మాధుర్య మెగజిమ్మె ప్రకృతి నవ్వినఅడవి
లావణ్యవాసంత లక్ష్మిపూసిన వనము
సాంధ్యకాంతిచ్ఛటా స్నపితమై వెలుగొందె
నవజీవన ప్రభా నాట్యంబులను చిల్కి.

ఇంతలో నొకక్రొత్త యింపు పొంపిరివోవ
దూరదూరములందు, తూర్పుకొండలపైని
పదునారుకళలతో పండువెన్నెలతోడ
చలువ జాబిలిపూవు వెలుగులో విరిసినది.



కచ-దేవయాని

[ఆల్ ఇండియా రేడియోవారు ఆంధ్రమహాభారతమునందలి కచ-దేవయానికథను నాటకముగా వ్రాసి జూలై నెల ౨-వ తేదిని 'బ్రాడ్ కాస్ట్' చేసియున్నారు. ఆ నాటకమును ఆల్ ఇండియా రేడియో వారి అనుమతితో ఇందు ప్రకటించుచున్నాము.—బా. సం.]

ప్రస్తావన

కథకుడు (పాడుతూ ప్రవేశము)

"శ్రీమచ్ఛుక్రవంశశి
ఖామణి మనుమార్గ రాజకంఠీరవ దై
త్యామరధరణీశ్వర ధర
ణీమండన ధర్మనిరత నిత్యాభ్యుదయా.

మనుజాధిప వృషపర్వుం
డనుదానవపతికి శుక్రుం డాచార్యుం డై
యనిమిషవిరోధులకుఁ బ్రియ
మొనరించుచు వివిధవిధనయోపాయముల౯.

దేవాసురరణమున గత
జీవితు లగు నసురవరులఁ జెచ్చెర మృతసం
జీవని యనువిద్యం బున
ర్జీవులఁగాఁ బ్రతిదినంబుఁ జేయుచు నుండె౯.

"దాని నెఱింగి దేవతలెల్ల నతిక్షీణులై యసురుల నోర్వనోపక శుక్రువలన మృతసంజీవని వడసి తేనోపునట్టి మహాసత్త్వుం డెవ్వం డగునో యని విచారించి బృహస్పతిపుత్త్రుండయిన కచునికడకుం జని యిట్లనిరి.

"పోరను మృతసంజీవని
కారణమున నిహతు లయ్యుఁ గా రసురవరుల్
వారల నోర్వఁగ మన కతి
భారము దుర్వారవీర్యబలయుతు లగుట౯.

మనపక్షంబువా రా
ద్దనుజులచే నిహతు లయ్యుఁ దగ మృతసంజీ
వనిలేమిఁ జేసి యమసా
దనమున కరుగుదురు వీర్యదర్పితు లయ్యు౯.

కావున మృతసంజీవనిఁ
దేవలయును శుక్రువలన ధృతిఁ బడసి తప
శ్శ్రీవిభవ దానిబలమునఁ
గావంగా వలయు సురనికాయబలంబుల౯."

(తెర)

మొదటి దృశ్యము

దేవలోకము

[బృహస్పతి పూజచేస్తూ వుంటాడు. మంత్రపుష్పం చదువుతాడు. గంట మోగిస్తాడు]

బృహస్పతి

శ్రీ విష్ణుపాదోదకం పావనం శుభం...

(ప్రవేశము : కచుడు)

కచుడు

తండ్రీ! నమస్కరిస్తున్నాను. నాకు సెలవా ?

బృహస్పతి

నాయనా! కచా! వెళ్లివస్తావా? మీ అమ్మతో చెప్పావా? ఆమె నిన్నువదలి యోల్లా వుంటుందో? అందులో రాక్షసుల దగ్గరకు వెళుతున్నావు. ఆమెకు చాలా బెంగగా వుంటుంది.

కచుడు

తండ్రీ! శుక్రాచార్యులవారు మనకు క్రొత్తవారు కారే!

బృహస్పతి

కారు కారు ; అంతే కాదు. వారికి మన మీద చాలా ఆప్యాయంకూడాను.

కాని, నీవు వెళ్లేపని అతికష్టమైంది. వారితోనే వుండి, పూర్తిగా వారిదయ సంపా దించి వారివిద్య తెలుసుకోవాలి.

కచుడు

మరి వేరుమార్గంలేదా ?

బృహస్పతి

లేదు! లేదు! మృతసంజీవనే కావాలి. అది నీవే తేవాలి...నాయనా! జాగ్రత్త ...శుక్రులు వేరు - రాక్షసులు వేరు. అసు రులకి మంచిచెడ్డలభేదం లేదు.

కచుడు

నా కేమిభయం ?

బృహస్పతి

అల్లా అనకూడదు. ఎంత ధైర్యవంతు డైనా తన జాగ్రత్తలో తా నుండాలి. సరే వెళ్లి రా. కార్యం చక్కబెట్టుకురా...ఆఁ ...ఇదుగో చూడు. శుక్రాచార్యుల కూతురు దేవయాని వుంది. బుద్ధిమంతురాలు. ఎంతో చదువుకుందికూడాను. ఆమెఅంటే తండ్రికి అపరిమితమైన ప్రేమ — సరే వెళ్లి రా.

(తెర)

రెండవదృశ్యము

[శుక్రాచార్యుని ఆశ్రమము. తోటమధ్య మంటపంలో దేవయాని వీణ వాయిస్తూ ఉంటుంది. అంత కంతకు రాగోద్దీపన మౌతుంది.]

(ప్రవేశము : శుక్రుడు)

శుక్రుడు

ఓహోహో! కన్నతల్లీ! ఏమి, యీ ఉత్సాహం!...ఎన్నడూ లేని యీ ఉద్రేకం! ...నీముఖంలో ఎంత కాంతి! — అమ్మా!

దేవయాని

(వీణ ఆపి) నాన్నగారూ! నేను చెప్ప లేకుండావున్నాను. నాకే తెలియటంలేదు. నా హృదయం వొకవింత ఆశతో, వొక అద్భుతమైన ఆనందంతో నిండిపోతోంది — నాకే కాదు...ప్రొద్దున్న గంగిగోవును పాలు పితకడానికి వెళ్లినప్పుడు దూడ ఎన్ని కేరింతా లాడిందనుకున్నారు! తోటలో చిలకలన్నీ కూడా ఎక్కడలేని క్రొత్తమాటలూ మా

ట్లాడడం మొదలు పెట్టాయి. అదుగో! వినండి. ఆ కోయిల ఎల్లా కూస్తోందో! అదుగో! ఆ మామిడిచెట్టుమీదనుంచి.

శుక్రుడు

అవును. అవును. అయితే — ఆవచ్చే క్రొత్తమనిషి ఎవరో — ఆఁ — ఆశ్చర్యం — అచ్చంగా మాబృహస్పతి చిన్నప్పుడు అల్లాగే వుండేవాడు. ఆపొడుగు, ఆనడకతీరు, ఆ అందం, అంతా బృహస్పతిదే... ఈ వేపే వస్తున్నాడు.

(ప్రవేశము : కచుడు)

కచుడు

ఆచార్యా! నమస్కారములు. నేను బృహస్పతి కుమారుడను. నన్ను కచు డంటారు.

శుక్రుడు

ఓయి! నీవా! — అనుకున్నాను సుమా! ఏమిసుదినం! ఏమిసుదినం! మీ తండ్రి దేవగురువున్నూ, మావదినెగారు తారా — అమ్మాయీ! దేవయానీ! తారకొడుకితడు — అందరూ క్షేమమా? నాయనా!

కచుడు

తమదయవల్ల.

శుక్రుడు

దేవయానీ! అల్లా వూరకున్నావేం? సాక్షాత్తు దేవగురువే మనకుటీరానికి వచ్చాడు. ఏవీ, కాళ్లు కడుక్కోడానికి నీళ్లు - చెరకు పానకం ...

(దేవయాని లోపలికి వెళుతుంది)

శుక్రుడు

నాయనా! మా దేవయానిని నువ్వు ఎరగవు. ఎప్పుడో చాలా చిన్నతనంలో చూచివుండొచ్చు. ఎప్పటిమాట! ఈమధ్య కలుసుకోటాలు లేవు ... అయితే, ఎంత వరకు చదువుకున్నావు? నాయనా! — నిన్ను అడగటమేమిటి? అన్ని విద్యలూ వచ్చేవుంటాయి. బృహస్పతికుమారుడికి లోటేమిటి? — దేవయానికూడా అన్ని శాస్త్రాలూ చదువుకుంది సుమా!

కచుడు

ఆచార్యా! నేను అట్టే చదువుకోలేదు. నిజానికి మీదగ్గర విద్య అభ్యసించాలనే వచ్చాను.

శుక్రుడు

ఆఁ! ఆఁ! బృహస్పతి కుమారుడికి నేను విద్య నేర్పాలా? — సరే! ఇది మీ తండ్రికి నామీద వుండే గౌరవం కాని వేరే కాదు. రా! నాయనా! రా! ఇదే మీ యిల్లనుకో.

(ప్రవేశము: దేవయాని అర్ఘ్యపాద్యాలతో, చెరకు పానకంతో)

దేవయానీ! — తెచ్చావా! — అమ్మాయీ! — నువ్వు యితనితో చిన్నప్పుడు ఆడుకున్నావు. ఎన్నేళ్లైందో. — నీకూ అతనికీకూడా జ్ఞాపకం లేదు. ఇప్పుడు నీ సహపాఠిగా వచ్చాడు. ఇదిగో! అన్ని విద్యల్లోనూ నువ్వు అతనికంటె ఎక్కువ కావాలిసుమా! హ హ్హా హ్హా!

దేవయాని

నా కేం వచ్చు?

(తెర)

మూడవ దృశ్యము

[శుక్రాచార్యుని ఆశ్రమము — పొగడతోటలో వొక మూల — కచుడు వొక్కడు కూర్చొని ఆలోచిస్తూ వుంటాడు.]

(ప్రవేశము, దేవయాని)

దేవయాని

(రొజుకుంటూ) దొంగా! ఇక్కడున్నావా? నీకోసము తోటంతా వెతికాను. (జాలిగా) ముళ్లు గుచ్చుకున్నాయికూడాను.

కచుడు

దేవయానీ! క్షమించు. నీకు చాలా శ్రమ యిచ్చాను.

దేవయాని

క్షమించడాని కేముంది? మొన్న నేను నిన్ను తోటంతా తిప్పలేదూ? — అయితే నువ్వు నన్ను తప్పించుకు తిరుగుతావేం? —

కచుడు

లేదు, దేవయానీ! లేదు.

దేవయాని

అబద్ధ మాడకు. నేను పారిజాతపు పువ్వులకోసం పారిజాతవనంలోనికి వెళితే నువ్వు పొగడపువ్వులకోసం పొగడతోటలోకి వెళ్లలే? నేను గంగరేగుపండ్లు కోయడానికి వెళితే నీవు మామిడిచెట్లక్రిందకు వెళ్లలే?

కచుడు

దేవయానీ! దేవయానీ! నువ్వు వూరికే అనుకుంటున్నావు.

దేవయాని

కాదు. కాదు. ఏదో వుంది. చెప్పవూ?

కచుడు

దేవయానీ!... దేవయానీ!...

దేవయాని

కచా! — చెప్పు — చెప్పు.

కచుడు

(నిట్టూర్చి) ఏమీ లేదు. — గురువుగారిని చూడడానికి వచ్చిన ఋషులు వెళ్లిపోయారూ?

దేవయాని

ఇంకా లేదు... కాని యిప్పుడు వారిమాటెందుకు? నువ్వు ఏదో చెప్పవచ్చావు, చెప్పరాదూ?

కచుడు

ఏమీ లేదు ... నేను నిన్నరాత్రి కల గన్నాను.—ఇలాంటిదే పెద్దతోటట. ఇంత కంటె సుందరమైనది.

దేవయాని

ఇంతకంటె సుందరమైనతోట లున్నాయా?

కచుడు

లేవు! లేవు! అయినా, వున్నాయేమో — ఊహాప్రపంచంలో... ఏమైతేనేం, ఆతోటలోకి వెళ్లేసరికి ఎక్కడలేని సుగంధం వెల్లివిరిసిపోయింది. 'ఈవాసన యెక్కడనుంచి చెప్మా' అని అనుకుంటూ వుండగా ఒక ప్రక్కన పెద్దసంపెంగపొద కనబడ్డది. పెద్ద పొద! పైకొమ్మమీద నేను యెప్పుడూ చూడని పెద్దసంపెంగపూవు ఒకటి గాలికి ఇటూ అటూ ఉయ్యాల లూగుతోంది— వొంపుతిరిగిన కాడమీద. అప్పుడు అమాంతంగా ఆపువ్వును కోసుకోవాలనీ, ఆ

పుష్పాను జిహ్వాతీరా అనుభవించాలనీ వెర్రి కోరికపుట్టి యెగిరాను. కాని యింతసేపూ కనపడని ముల్లు నాచేతిని చర్రున చీరాయి.

దేవయాని

అయ్యో! పాపము! ఏదీ నీచెయ్యి? యెంతబాధ కలిగిందో? రక్తం వచ్చిందేమో?

కచుడు

దేవయానీ! కలలో ముల్లుకే యింత ఆదుర్దా?

దేవయాని

కలలో పుష్పుకే యింత ఆదుర్దా అయితే, కలలో ముల్లను చూచి భయపడకూడదూ?

కచుడు

పరిహాసమా? కాని నేను మళ్లా ప్రయత్నం చేశాను. మళ్లా ముల్లు అడ్డం వచ్చాయి. ఈసారి వొకటి కాదు, ముండ్ల కంప అంతా నన్నావరించింది. నేను భయపడిపోయాను.

దేవయాని

తర్వాత?

కచుడు

తర్వాత యేమి వుంది? ఇంటికొచ్చేశాను. — నా గ్రంథాలూ — నేనూను.

దేవయాని

అవును. నీకు గ్రంథాలంటే చాలా యిష్టం. అసలు నీకు మనుష్యులకంటె పుస్తకాలే యిష్టం.

అయితే ఒకవేళ ఆపువ్వే — గాలికి ముచిక వీడి — నీచేతిలోనే పడితే యేం చేస్తావు?

కచుడు

అదీ ఆలోచించాను. కాని, నేను భరించలే ననుకుంటాను. ఆసుగంధం నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. నేను అర్హుణ్ణి కాను కూడా. పుష్పాన్ని దూరాన్నుంచి చూచి ఆనందించాలి, కాని అనుభవించే అదృష్టం నావంటివానికి లేదు.

దేవయాని

కచా! కచా! అల్లా అంటావేం? నీకంటె సురూపి యెవరు? నీకంటె ఎక్కువ బుద్ధిమంతు డెవరు? — ఎన్నిసారు లనుకున్నావు, నాన్నగారు నిన్ను మెచ్చుకొన్నది? నీవు వచ్చాక యీ ఆశ్రమమే మారిపోయిం దన్నారు. శిశిరవాసరాలలో వసంతం వచ్చినట్లయిం దన్నారు. — కాని, కచా! కచా! నీవు యిక్కడ స్వేచ్ఛగా వుండడం లేదు. ఎన్నాళ్లయినా యింకా క్రొత్తవానిలాగే ప్రవర్తిస్తావు. ఇంత చనువుగా వున్నా, ఉన్నట్టుండి పూర్తిగా పరాయివాడవులా అయిపోతావు. నీకోసం, నీసంతోషంకోసం యత్నించే మమ్మల్ని ఎంతో దూరం చేసివేస్తావు. నిన్ను అర్థంచేసుకోవడమే కష్టంగా ఉంది. — ఇదంతా నీది కాదూ? మా విద్యలన్నీ నీ వయ్యాయి. నీవు మావాడవు కాజాలకున్నావు.

కచుడు

దేవయానీ! అన్నీ వున్నా అనుభవించడానికి అదృష్టం ఉండాలి. మీ అందరి అనురాగానికీ నేను తగను. ఈ తీయని భావాలు నాకు అంతకంతకు నిరాశ కల్పిస్తాయి, కాని సంతుష్టిని కలగనియ్యవు. దేవయానీ! నన్ను చూస్తే నీకు అసహ్యంకూడా వేస్తుందేమో.

దేవయాని

ఎన్నటికీ కాదు. నీవు ఎల్లా వర్తించినా నాకు నీమీద గాఢమైన ఆపేక్ష మారదు. కచా! కచా! ఆనాడు చెట్ల సందులోంచి బృహస్పతి వెలుగుతో నీవు యీఆశ్రమంలో ప్రవేశించినప్పటినుంచీ నాలో అమిత ఆనందం ప్రబలిపోయింది అసలు నువ్వు రాకముందే నాహృదయం చంద్రకిరణాలను అందుకోబోయే సముద్రకెరటాలలాగ త్రుళ్లింత లాడింది. ఆవేకువను ఎంత గొప్పగా వీణ వాయించావనుకున్నావు! నా వేళ్లు వేళ్లు కావప్పుడు — వీణ మహతిఅయిపోయింది!... కచా! కచా! నాటికీ నేటికీ నీవు నన్ను పూర్తిగా ఆవరించివేశావు.

కచుడు

దేవయానీ! దేవయానీ!

దేవయాని

నువ్వు ఒక్కనిమిషం నాదగ్గర లేకపోతే నాకు ఏమీ తోచదు. నీకు నామీద ప్రేమ లేదని నాకు తెలుసు. ఏవేవో యితర ఆలోచనలతో నిండివున్న నీ హృదయంలో నాకు స్థానం లేదనికూడా తెలుసు. కాని కచా! కచా! ఎన్నటికైనా — ఎప్పటికైనా —

కచుడు

దేవయానీ! దేవయానీ!!

(తెర)

నాలుగవ దృశ్యము

కథకుఁడు : (ప్రవేశించి)

"అంతఁ గొన్ని దినంబులకు వెండియు నొక్కనాఁడు.

"అడవికిఁ బువ్వులు దేరఁగ
వడి నరిగిన కచునిఁ జంపి వానిని దనుజుల్
పొడవు సెడఁ గాల్చి సురతోఁ
దడయక యబ్బ్రాది శుక్రుఁ ద్రావించి రొగిన్.

"అంతనాదిత్యుం డస్తగిరిశిఖరగతుం డగుడు మగిడి హోమధేనువు లింటికి వచ్చిన వానితోడన కచుండు రాకున్న.

"వాఁడిమయూఖముల్ గలుగు
వాఁ డపరాంబుధిఁ గ్రుంకె ధేనువుల్
నేఁ డిట వచ్చె నేకతమ
నిష్ఠ మెయిన్ [దగ న]గ్నిహోత్రముల్
పోఁడిగ వేల్వఁగాఁబడియెఁ
బ్రొద్దును బోయెఁ గచుండు నేనియున్
రాఁడు వనంబులోన మృగ
రాక్షసపన్నగబాధ నొందెనో.

"అని దేవయాని దనమనంబున మలమల మఱుంగుచుంబోయి తండ్రి కిట్లనియె.

"మతి లోకోత్తరుఁ డైన యంగిరసుమ
నమ్మం డాశ్రితుం డా బృహ
స్పతికిం బుత్త్రుఁడు మీకు శిష్యుఁడు సురూ
పబ్రహ్మచర్యాశ్రమ
వ్రతసంపన్నుఁ డకారణంబ దనుజ
వ్యాపాదితుం డైన న
చ్యుతధర్మజ్ఞు మహాత్ము యక్కచున కే
శోకింప కెట్లుండుదున్.

"వానిం జూచి కాని కుడువనొల్లనని దేవయాని యేడ్చుచున్నఁ బెద్దయుం బ్రొద్దునకుఁ బ్రసన్నుఁడై శుక్రుండు దన యోగదృష్టిం జూచి లోకాలోకపర్యంత భువనాంతరంబునఁ గచుం గానక సురాసమ్మిశ్రభస్మ

మయుండై తన యుదరంబున నున్న యక్కచుం గని సుర సేవనదోషంబును నసురులవలన నైనయపకారంబును నెఱింగి.

"మొదలి పెక్కు జన్మములఁ బుణ్యకర్మముల్
పరఁగఁ బెక్కు సేసి పడయఁబడిన
యట్టి యెఱుక జనుల కొక్కక్షణమాత్రన
చెఱుచు మద్యసేవ సేయ నగునె.
భూసురు లాదిగఁ గలజను
లీసుర సేవింపరేని నిది మొదలుగఁ బా
పాసక్తిఁ బతితు లగుదురు
చేసితి మర్యాద దీనిఁ జేకొనుఁడు జనుల్.

"అని శుక్రుండు సురాపానంబు మహాపాతకంబుగా శపియించి తనయుదరంబున నున్న కచు నప్పుడ సంజీవితుం జేసిన నంద యుండి కచుండు శుక్రున కిట్లనియె.

"తనువును జీవము సత్త్వం
బును బడసితి నీప్రసాదమున నీయుదరం
బనఘా వెలువడుమార్గం
బొనరింపుము నాకు భూసురోత్తమ దయతోన్.

"అనిన నాయుదరంబు భేదిల్లినం గాని యిమ్మౌని కుమారుండు వెలువడనేరం డుదరభేదనంబున మూర్ఛితుండ నయిన నన్ను సంజీవితుం జేయవలయు నని శుక్రుండు కచునకు సంజీవని నుపదేశించిన.

ఉదరభిదాముఖమున స
భ్యుదితుండై నిర్గమించె బుధనుతుఁడు కచుం
డుదయాద్రిదరీముఖమున
నుదితుం డగు పూర్ణహిమమయూఖుఁడ పోలెన్.

"అంత :

విగతజీవుఁడై పడియున్న వేదమూర్తి
యతనిచేత సంజీవితుఁడై వెలింగె
దనుజమంత్రి యుచ్చారణదక్షుచేత
నభిహితం బగు శబ్దంబు నట్లపోలె.

"ఇట్లతిప్రయత్నంబునఁ గచుండు శుక్రువలన సంజీవని వడసి పెద్దకాలం బుండి యొక్కనాడు శుక్రుచేత ననుజ్ఞాతుం డయి దేవలోకంబునకుం బోవుచుండి దేవయాని కతిప్రియపూర్వకంబుగాఁ జెప్పిన.

(తెర)

అయిదవ దృశ్యము

[శుక్రాచార్యుని ఆశ్రమం వెలుపలి భాగము. కచుడు ప్రయాణానికి సిద్ధమై వుంటాడు. తొందర తొందరగా స్నానం చేసి దేవయాని, చేతికి లొంగని తలకట్టును ముడివేసుకుంటూ ప్రవేశిస్తుంది.]

దేవయాని

కచా! కచా! నువ్వు ఎలా వెళుతావు ఇక్కణ్ణుంచి? — అసలు నువ్వు ఎందుకు వెళ్లాలి? ఇక్కడే వుండరాదూ?

కచుడు

దేవయానీ! వెఱ్ఱిదానా! నాయన గార్ని, మా అమ్మను చూచి ఎన్నేళ్లయింది?

దేవయాని

అబ్బ! చంటిబిడ్డవా? అమ్మను విడిచి వుండలేవూ? ఎప్పుడూ అమ్మే కావాలీ? అంత కంటె ముఖ్యమైనవా రుండరూ?

కచుడు

దేవగురువుకి నాకొత్తవిద్యలు చూపించి ధన్యుణ్ణి కావాలి.

దేవయాని

బృహస్పతికి అప్పుడే తెలుసుగా — నువ్వు మహావిద్యావంతుడ వని. కచా! కచా! వద్దు, నువ్వు వెళ్లొద్దు. మనం కట్టిన క్రొత్తమామిడంట్లు చిగర్చనైనా చిగర్చలేదు. మనం పందిలివేసిన మల్లెతీగ ఎంత అద్భుతంగా అల్లుకుపోయింది! కాని పూవులు పూయొద్దూ? — ఆ పువ్వు లన్నీ దండ గ్రుచ్చి నీ మెళ్లో వేస్తేగాని నాకు తోచదు.

కచుడు

దేవయానీ! మల్లెతీగలు ఎప్పుడూ అల్లుకుపోతూనే వుంటాయి. సమయం వచ్చినప్పుడు పువ్వులు పూస్తాయి. అయినా ఎన్ని సార్లు నీవు నామెళ్లో పూలదండలు వెయ్యలేదూ? —నాకు సెలవియ్యవూ?

దేవయాని

కచా! కచా! మన మిద్దరం వ్రాస్తూ వున్న కావ్యం మొదటిసర్గమైనా పూర్తి కాలేదే? శ్లోకాలు ఎంత బాగున్నాయి! నామనస్సులో ఎన్నెన్నో ఊహ లున్నాయి. ఈకావ్యం పూర్తి అయ్యేసరికి యెంత అద్భుతంగా వుంటుందో! నాన్నగారు సంతోషంతో వుప్పొంగిపోతారు.

కచుడు

దేవయానీ! ప్రొద్దెక్కుతోంది. నాకు సెల వియ్యవూ?

దేవయాని

సెలవు? సెల విచ్చేదాన్ని నేనా? చూచుకో, నీహృదయంలో చూచుకో! పుస్తకాల దొంతరలమధ్య అణగిపోయిన నీ అనుభవపరంపరలను వొక్కసారి పైకి కనపడనీ. అవి యేమంటున్నాయి? అవి సెలవిస్తాయా? చూడు — నువ్వు యిక్కడకు వచ్చిన క్రొత్తలో మనము సెల యేటిదగ్గరకు వెళ్లాము — జ్ఞాపకం ఉందా? అవతలివొడ్డుకు వెళ్లాలని, నేను ప్రవాహాన్ని దాటలేకపోతే, నువ్వు నన్ను ఎత్తుకు తీసుకువెళ్లలే? — ఏరుదాటినాక కూడా నేను దిగనంటే నువ్వు నవ్వావు — జ్ఞాపకం లేదూ? కచా! కచా! కొంచెము జ్ఞప్తికి తెచ్చుకో — మన జంటహృదయాలను తనలో కలుపుకున్న సెలయేరు నీప్రయాణానికి సెలవిస్తుందా? అదుగో మ్రోత వినబడుతూనే వుంది — 'వొద్దు - వెళ్లొద్దు - వొద్దు - వెళ్లొద్దు' అంటూనే వుంది. కచా! కచా! నాకచా!!

కచుడు

దేవయానీ! నీవే అన్నావు — గ్రంథ పరంపరలమధ్య కూరుకుపోయాయి నా తీయని అనుభవాలు— అని. ఎందు కిప్పుడు వాటికి వెలుతు రిచ్చి బాధిస్తావు? అవి అల్లా అణిగిపోయి వుండడమే మంచిది.

దేవయాని

వెర్రివాడా! ప్రేమస్వభావం తెలియని వాడవులా మాట్లాడతావు. నీవు యెంత తెలివికలవాడవైనా — సాక్షాత్తు బృహస్పతి పుత్రుడవైనా, దేవదూతవైనా నిజాన్ని దాచగలవోయీ? నాకు తెలియ దనుకున్నావా? ఆవేళ, సంపెంగపువ్వుకల వట్టికల అనుకుంటానా నేను? కాని, కంటకాలుమాత్రము నీ పిరికిమనస్సులో వున్నాయిగాని నిజంగా లేవు. — కచా! కచా! నిజం చెపుతున్నాను. నీవు వసంతకుమారుడిలాగ యీఆశ్రమంలో ప్రవేశించినప్పటినుంచీ నేను నీలో లీనమైపోయాను. నీకు కాళ్లు కడుక్కోడానికి నీళ్లిచ్చి, నీచేతికి చెరకుపానక మందిచ్చినప్పుడే నేను నీదాన నైపోయాను. అయితే నీవు నావాడవు అవుతావో కావో అనే భయం అప్పుడే తలెత్తింది. నీకళ్లల్లో వింతచూపు వుంది. "నేను యీప్రపంచంలో లేను. నాదంతా ఆకాశగమనమే" అంటూ వుంటుంది నీదృష్టి. కాని, …… ఆనాడు, వేణువతి వొడ్డున వొక్కడవూ కూర్చొని

చంద్రోదయంకేసి చూస్తూవున్ననన్ను, నేను రాగానే చకితుడవైపోయినది నాకు తెలుసు. లేత చంద్రకిరణాలు ప్రతిఫలిస్తున్న నీకన్నెటి చుక్కలను నన్ను కౌంగుతో వొత్తనిచ్చి నప్పుడు నాప్రేమ వృధా కాదని, ప్రకృతివిరుద్ధ మైన మనము వొకరికోసం వొకరం వున్నా మనీ అనుకున్నాను. అల్లాగే ఆ ఆశనే దో హదం చేసుకొంస్తున్నాను. కచా! కచా! నువ్వు వెళతానంటున్నావు. ఎల్లా వెళ్లగలవు? అసలు నన్ను విడిచి ఉంటాననడానికే నీకు నో రెల్లా వచ్చింది?

కచుడు

దేవయానీ! నేను చెప్పలే-నేను అదృష్ట హీనుణ్ణి అని. నాకు దేవకార్యం ముఖ్యం. గురువుగారున్నూ, నీవున్నూ దేవయానీ! నాకు చూపిన అనురాగాన్ని నేను ఎన్నడూ మరువలేను. మీరు చూపిన వాత్సల్యము, అనేకపర్యాయాలు నన్ను స్వర్గాన్ని, దేవ గురువును, మా అమ్మనుకూడా మరపింప జేసేది. కాని, నేను యీ మహానందానికి నోచుకోలేదు. దేవయానీ! దేవయానీ! వెళుతున్నా...

(వెళ్లబోవును)

దేవయాని

అయ్యో! వెళ్లడం అంతసులభమై పోయిందా? మన మిద్దరమూ కలసి విహ రించిన యీతోటలు నీకు అడవులైపోయా యా? ఇచ్చటగాలే నీకు భారమైపోయిందా? కచా! నీవు ప్రయాణముమీద వున్నావని యెల్లా తెలిసిందో ఆశ్రమంలో ఉండే అంద రకూ ఎంత బెంగగా ఉందో చూశావా? బోదులకు నీళ్లు పెట్టే తోటమాలి కూతురు, జ్యోతి ఏమన్నా వచ్చి అన్నది: "అక్కగారు! అక్కగారు! చిన్నయ్యగారు వెళ్తారంట." — అదుగో, చూడు! ఆ రాతిగుట్టమీద నుంచి నీకేసే చూస్తోంది. నిన్న ప్రొద్దుటినుంచి దూడలు పాలుతాగడం మానివేశాయి; — ఆవులు నెమరువేయడంలేదు. మనం పెంచిన లేడిపిల్లకు నేను లేత గరికచిగుళ్లు తినిపించ బోతే, చిగుళ్లను అందుకోక బెదరుచూపు లతో నూరికే నాముఖంకేసి చూసింది — కన్నీరు కారుస్తూ.

కచుడు

దేవయానీ!

దేవయాని

పంచవన్నె చిలకలు రెక్కలు ముడుచు కొని మూల మూలల దాక్కున్నాయి. వెళ్లి పలకరిస్తే దీనంగా 'అక్కా! అక్కా!' అంటున్నాయి. చమత్కారపు మాటలన్నీ మరచిపోయాయి...కచా! కచా! కచ మయమైపోయిన యీప్రదేశాన్ని ఎల్లా వద ల్తావోయీ?

చూడు, నీకు అంతగా చూడాలనుంటే మీ నాన్నను, మాఅత్తను తారను ఇక్కడికే రప్పిస్తాను. — నేను చెపితే వద్ద నరు నాన్నగారు; స్వయంగా వెళ్లి తీసుకొ స్తారు వారిని. —

కచుడు

దేవయానీ! అది కాదు. నేను వెళ్లక తప్పదు. నేను ఇక్కడకు వొక ప్రత్యేక కార్యముమీద వచ్చాను. ఆ పని నెరవేర్చక తప్పదు.

దేవయాని

ఏమిటి? దేవకార్యమే ముఖ్యమా?—— అయితే, యీ సంవత్సరా లన్నీ అబద్ధా లేనా? —— నీ వినయం అంతా వొక్క దేవకార్యసిద్ధికొరకేనా? —— అయ్యో! నాకచా! ఇంతేనా? —— నీవు వట్టిబడిపిల్లవాడి వనుకో లేదు. చదివినన్నాళ్లు చదువుకొని, ఆట విడుపురోజు రాగానే పుస్తకాలు చంకబెట్టుకొని యింటి మొగమయ్యే శిష్యుడవేనా?

ఓయీ —— నీకు హృదయం లేదూ? సృష్టిలో వుండే అపూర్వవైభవాలని చూచి తన్మయుడ వైపోతూవుండేవాడవు. అదంతా యేమైపోయింది?

కచుడు

దేవయానీ! నిజం చెప్పావు! నాకు హృదయమే లేదు.

దేవయాని

కచా! కచా! కోపమా? నేను అనాలని అనలేదు. నీకా హృదయం లేకపోవడము? నీకే హృదయం లేకపోతే, నందనవనానికి సౌందర్యమే లేదు! మెరుపుతీగల్లో వెలుతురే లేదు! నవతుషారంలో చల్లదనమే లేదు! నీకు హృదయమున్నదీ లేనిదీ నాకు తెలియదూ?

నీ అనుభవా లన్నీ నా అనుభవాలుగా చేసుకున్న నాకు తెలుసు; సర్వమూ నీకళ్లతో చూడడానికి అలవాటుపడ్డ నాకు తెలుసు. ఇన్నాళ్లూ నీవు పీల్చేగాలినే పీలుస్తూ మైమరచి పోతూవున్న నాకు తెలుసు; కచా! కచా! ఈరోజున మనము వేణువతిలో స్నానానికి వెళుదామనుకున్నాము. ఎన్నాళ్లయిందో ఆవేపు వెళ్లి. రా! రా!

కచుడు

దేవయానీ! నన్ను క్షమించాలి. ఇంక ఆలస్యము చేయలేను. దయవుంచు.

దేవయాని

దయ! దయ! ఎవరిమీద దయ? —— లేత తీగలతో విలసిల్లుతూవున్న తోటను ధ్వంసము చేస్తున్నావు. పూలదొంతరలను త్రొక్కివేస్తున్నావు. —— దయ నీకా? —— నాకా? నీవులేని యీప్రదేశంలో నా కింకేముంది? కచా! కచా! నీవు కనబడని నిమిషము నేను జీవింపగలనా? చకోరపక్షిలాగ నీకనుచూపులే ఆహారంగా బ్రతుకుతూవున్న నాకు ఇంక ప్రాణ మేల?

కచుడు

దేవయానీ! వద్దు వద్దు. పాషాణమును ద్రవింపజేయవద్దు.——

దేవయాని

పాషాణమా? అవును —— పాషాణమే. కాని పాషాణానికైనా వొకప్పుడు దివ్య స్త్రీరూపం దాల్చగలశక్తి వుంది. నీకు స్త్రీరూపాన్ని రూపుమాపేశక్తి వుంది. కిరాతకుడవు! —— దేవదూతా! ఎంతపని చేశావు! పట్టపగలు పంచభూతాలుసాక్షిగా, సూర్యచంద్రులుసాక్షిగా యెంతదొంగతనం చేశావు! —— సరే! వెళ్లు, వెళ్లు! సంపాదించావుగా గొప్పవిద్య! ఇది నీవు యెల్లా వినియోగిస్తావో చూస్తాను. మోసము చేసి నేర్చుకున్న చదువు నీకు ఉపయోగపడదు సుమా!

కచుడు

దేవయానీ! దేవయానీ! ఏమన్నావు... అయ్యో! అయ్యో! నీ వాక్యాలు అమోఘాలు ... — కాని నాకు కాకపోయినా నావద్ద నేర్చుకున్నవారికైనా యీ విద్య పనిచేస్తుంది.

దేవయాని

వెళ్లు! వెళ్లు! ఆగుతావేం? దొంగవు. ఇక్కడి నిర్మలవాయువును మలినం చెయ్యకు — కిరాతకుడవు వెళ్లు! వెళ్లు! ఇంకా వెళ్లవేం?

(కచుడు త్వరగా వెళ్లిపోవును)

దేవయాని

.........అమ్మా! అమ్మా!

(మూర్ఛ)

(తెర)

౨౦వ దృశ్యము

[దేవలోకము, బృహస్పతి కూర్చొని గ్రంథాలు చూస్తూవుంటాడు. కచుడు వినయంతో నిలుచుని వుంటాడు.]

బృహస్పతి

అబ్బాయీ! వచ్చావా? శుక్రాచార్యులు నీకు దయతో సెలవిచ్చారా? అక్కడ ఆశ్రమవాసు లందరూ క్షేమమేనా? ... దేవయానీ —

కచుడు

ఆచార్యులు ... అనుగ్రహించారు.

బృహస్పతి

కచా! ఎన్నాళ్లైంది యీ ప్రవాసము? ఎల్లా ప్రాణంగలవాడవై యున్నావు? — నీమాట తలచుకుంటూనే వున్నాను. రాక్షసులు నీకు అపాయం చెయ్యడం, పూజ్యులు శుక్రులు మాకు పుత్రదానం చెయ్యడం అని పోతున్నమనస్సు మనస్సులోలేదు. నీకోసం నిముషం నిముషం నిరీక్షిస్తోంది. ... — తామరకొలనుకు నీళ్లెక్కినట్టుంది.

నాయనా! దేవతలు నీరాకనుగురించి ఎంతో ఆనందంతో వున్నారు! ఇంక దేవాసురయుద్ధంలో ఇంద్రుని కేమీ భయంలేదు.

బృహస్పతి కొడుకనిపించుకున్నావు ఇన్నాళ్లు, ఇంక నేను సగర్వంగా కచుని తండ్రి ననిపించుకుంటా. తండ్రీ! దేవలోకానికి యెంతగౌరవం తెచ్చావోయి '

కచుడు

నాన్నగారూ క్షమించాలి. మీప్రశంసకు నేను తగను. మీ ఆజ్ఞను పూర్తిగా నెరవేర్చలేకపోయాను. — నిర్భాగ్యుణ్ణి.

బృహస్పతి

ఏం? ఏం? మృతసంజీవనీవిద్య సంపాదించావుగా? శుక్రాచార్యులే మనఃపూర్తిగా నీకు ఆవిద్యను అనుగ్రహించారుగా?

కచుడు

అవును. కాని, నాదురదృష్టంవల్ల యీ విద్య నాకు పనిచేయదు. ఇతరులకి ఉపదేశించగలను. ఇతరుల కది పనిచేయును.

బృహస్పతి

కచా! కచా! ఏమైంది?

కచుడు

తండ్రీ! నేను మీ వద్ద సెలవు పుచ్చుకున్నప్పుడు మీరు సందేహిస్తూ, సందేహిస్తూ చెప్పారు — శుక్రునికుమార్తె దేవయాని — హుం — దేవయాన్ని గురించి.—

బృహస్పతి

(నిట్టూర్చి) అయితే?

కచుడు

ఆమె నన్ను ప్రేమించింది.

బృహస్పతి

ఆం.

కచుడు

నేను ఆమె ప్రేమను నిరాకరించాను.

బృహస్పతి

ఊం.— —.

కచుడు

ఆమెకు కోపం వచ్చింది. నన్ను శపించింది — ఈవిద్య నాకు పనిచేయదని.

బృహస్పతి

ఏమిటీ? ముక్కుపచ్చలారని పిల్ల నిన్ను శపించిందా? ఏమి సాహసం! అవును! రాక్షసుల సావాసము!

కచుడు

తండ్రీ! ఆమె మహనీయురాలు. ఆమెను గురించి అల్లా అనరాదు.

బృహస్పతి

అయితే నువ్వు ఆమెను లొంగదీయలేకపోయావన్న మాట.

కచుడు

నేను ఆమెకు లొంగలేదు.

బృహస్పతి

నువ్వు ఆమెను ప్రేమించావా?

కచుడు

(మౌనము)

బృహస్పతి

చెప్పవేమి?

కచుడు

(మళ్ళీ మౌనము)

బృహస్పతి

చెప్పటంలేదా. నువ్వు చెప్పకపోయినా ఆమె ఆకర్షణకు లొంగిపోయావు — లేకపోతే వాళ్ళు వారి ఆశ్రమం నిన్ను ఎట్లా విడిచి రాగలిగావో ఆశ్చర్యంగా వుంది.

కచుడు

తండ్రీ! బృహస్పతి కుమారుడికి దేవకార్యం ముఖ్య మనిపించింది.

బృహస్పతి

సంతోషము! కాని మొట్టమొదట అల్లా తోచలేదూ? మొక్కగా వంగనిది పోతే చెట్టయ్యాక వంగుతుందా?

కచుడు

ప్రయత్నించాను. కాని ఆమె ప్రేమ అపారమైంది. ఆమె అనురాగము ముల్లోకాలను ఆవరించే మహత్తు కలది. ఆమె హృదయం పరమపవిత్రమైనది.

బృహస్పతి

ఏమి పవిత్రం! — కాని ని న్నన వలసిం దేమిటి? యువతీయువకులు అనేక సంవత్సరాలు కలసిమెలసి వుండి నిష్ఠతో వుంటా రని వెర్రినమ్మకము వున్న మమ్మల్ని అనాలి.

కచుడు

తండ్రీ! మీ పా ద ము లా న చెపుతున్నాను: నానిష్ఠ కేమాత్రం లోపంరాలేదు.

బృహస్పతి

రా కేమి? ఏకాగ్రత లేకపోవడమే లోపం. మనం వెళ్లినపనేమిటి; మనం చేయవలసిన ప్రయత్న మేమిటి? దీనికంతా జ్ఞానం కావాలి, నాయనా! జ్ఞానంకావాలి. అహం చంపుకోవాలి. — అందులో నీవు వెళ్లినపని యెంత ముఖ్యమైంది? మరోవ్యాపకానికి తావేదీ? జగన్మోహినియైనాసరే సికండ్లతో చూడకూడదు. విశ్వమోహనమైన ప్రేమగానానికికూడా నీకు చెవులుండకూడదు. అవి నిత్యమా? అవి శాశ్వతమా? నీవిద్య శాశ్వతము. అనితరదుర్లభమైనవిద్య నీ చేతిలోవుంటే యెంత ధన్యత! ఎంత ధన్యత!!

కచుడు

తండ్రీ! విశ్వమోహనమైన ప్రేమకు కూడా స్థానమే లేదా?

బృహస్పతి

ఆమాటకేం! ఈసందర్భంలో కావలసినది జ్ఞానం. జ్ఞానచక్షువే వుంటే నీకు కనబడ్డ మెత్తదన మంతా అనిత్య మని నీకు తెలిసే వుండును. జ్ఞానచక్షువే వుంటే యింతవరకు వచ్చివుండదు! — సరే. మీఅమ్మ వచ్చినట్టుంది. వెళ్లి చూడు.

(తెర)

ఏడవ దృశ్యము

[దేవలోకము: బృహస్పతి ఆశ్రమం. కుటీరం లోపలి నడవలో ఒక పక్కన తార కచునికోసం నిరీక్షిస్తూవుంటుంది.]

(ప్రవేశం: కచుడు — మొదట ఆమెను చూడడు)

కచుడు

జ్ఞానచక్షువు! జ్ఞానచక్షువు! నిజంగా జ్ఞానచక్షువే వుంటే యీయుద్ధా లెందుకు? ఈ మోస మెందుకు? శత్రువులకు శుశ్రూష చేసి వారివిద్య సంపాదించడ మెందుకు?

జ్ఞానమే పరమార్థమట! ప్రేమ అబద్ధమట... అబ్బ!

ఎందుకోసము యీ జ్ఞానం? — ఒక్క హృదయాన్ని పీల్చి పిప్పిచేసిన ఈమృతసంజీవనీవిద్య ఎంతమంది దేవతలను రక్షిస్తే యేమిలాభము?— దేవయానీ! దేవయానీ!

తార

నాయనా! కచా!

కచుడు

అమ్మా! అమ్మా! నువ్వు యిక్కడున్నా వని తెలియదు. నిన్ను చూడలేదు.

తార

తండ్రీ! అయితే యేం? నా కంతా తెలుసు. — అసలు మొట్టమొదట నిన్ను అక్కడకు పంపినపుడే తెలుసు — యిదేదో హృదయాలతో చెలగాట మవుతుందని నే నెరుగుదును.

కచుడు

అయితే, యెందుకు ఆపావుకాదు?

తార

నాయనా! మనకంటె దేవకార్యము ముఖ్యం. ఈ గొప్పవిషయాలలో మనసుఖము ఆలోచించుకోకూడదు.

కచుడు

మనసుఖము ఆలోచించుకోకూడదు సరే. కాని ఏపాపమూ ఎరుగని మరోవ్యక్తిని, ఆముగ్ధహృదయాన్ని — అమ్మా! దేవయానిని, ఈ సందిగ్ధస్థితిలోకి తీసుకురావడం యేం న్యాయం? అమ్మా! తలుచుకుంటే గుండె చెరు వవుతుంది. శుక్రాచార్యులు, ఆ అమ్మాయి, అక్కడివారంతా నాయందు చూపిన దయ జన్మలో యెక్కడా నేను రుచి చూడలేదు.

ప్రొద్దున్నే దోసిలినిండా పారిజాతపుష్పాలు తెచ్చి నన్ను లేపేది. నా సొంతంక్తిని కాని ఆరగించేది కాదు. పాఠాలలోకూడా నేను శ్లోకంలో మొదటిపాదం వల్లిస్తేనే కాని దాన్ని చదివేదికాదు. పడుకోబోయేటప్పుడు కూడా — అమ్మా!

తార

అవును, తండ్రీ! అవును. నాకు తెలుసు.

కచుడు

పడుకోబోయేటప్పుడుకూడా నేను దగ్గర వుండి యేదో పురాణపు కథ చెప్తూ వుంటేనే కాని నిద్రపోయేదికాదు. వట్టిదేం. కాని, అమ్మా! ఆ బేలహృదయంలో ఎంత అగాధమైన ప్రేమసముద్రం పొంగనుకున్నావు? సృష్టిఅంతలోను పుత్రప్రేమభావను పోక యెత్తు — దేవయాని పూవులలో వున్న ఆర్ద్రిత్వం పోకయెత్తు.

తార

అవును. ఇప్పుడే కాదు. పసితనంలో కూడా ఆమెకు నీమీద ఆపేక్షయెక్కువే. 'బావ' — నిన్ను 'బావ, బావ' అనేది — 'బావ' కంచంలోకాని అన్నం తినేదికాదు. ఏమైనా పండ్లు, ఫలాలు దొరికితే ముందుగా నీ కిచ్చేది. మీ రిద్దరూ కలిసి చిలకా గోరింకల్లాగ ఆడుకుంటూవుంటే నే ననుకొనేదాన్ని — 'ఎన్నటికైనా దేవయాని నా కోడలు అవుతుం దని.' కాని తండ్రీ! మన ఊహాలు వేరు; జరిగేవిధానం వేరు. గాలిలో ఎన్ని మేడలైనా కట్టవచ్చు. కాని క్రియకు శాస్త్రాలు, ఆచారాలు, సంప్రదాయాలు వీనిని ఎవరు దాట గలరు? లోపల యెన్ని భావా లున్నా, రక్తం యెంత వేడితో వుడికిపోతూ ఉన్నా, మన విద్యుక్తధర్మాన్ని నెరవేర్చక తప్పదు.

కచుడు

అమ్మా! పుట్టుకతో వచ్చినసహృదయత్వాన్ని చంపివేయవలసిందేనా?

తార

చంపివేయడమేకాదు తండ్రీ! పునర్జన్మ లేకుండాకూడా చెయ్యాలి. అందాకా యెం

దుకు? ఇంత తెలిసిన మీతండ్రిగారుకూడా నేనెప్పుడైనా రవ్వంత పరధ్యానంగా వుంటే 'యేమి పూర్వస్మృతా?' అంటారు!

నాయనా! కచా! కార్యసాధకులకు సున్నితభావాలతో పని లేదు...... నీవు అన్నీ మరచిపోవాలి.

కచుడు

అమ్మా! మరచిపోవాలా? ఎల్లా మరచిపోగలను? అమ్మా! నాచిన్నతనంలో నా చెలికాడు విసరిన చిన్నిబొమ్మరాయి నుదుట తగిలి ఒకచుక్క రక్తం స్రవించినపుడు నీవు పడిన ఆదుర్దా నేను మరవగలనా — నీవు మరవగలవా?

తార

లేను తండ్రీ! మరవలేను. ఆనాడు నాకు తెలిసింది నీవు నాకు ప్రాణముకంటె ప్రాణ మని.

కచుడు

అమ్మా! అల్లాంటిది, యిప్పుడు తన సర్వస్వాన్ని నాకు అర్పణచేసి, తన ప్రేమ సామ్రాజ్యానికి పట్టము గట్టి, యిన్నేళ్లు నా తోడునీడయి వర్తించిన బంగారు బొమ్మను నిరసించి, లేతగులాబిరేకలను పాదాలక్రింద రాచివేసిన నేను, ఆమెప్రేమను, ఆమెదయను, ఆమె లావణ్యాన్ని, ఆమె ఉత్సాహాన్ని, ఆమె నిరాశను, ఆమె నిరుపేదరికాన్ని ఎల్లా మరవను? తల్లీ!

అమ్మా! అయితే వొకటి చెపుతా! — నేను బుద్ధిపూర్వకంగా ఆమెప్రేమను అభివృద్ధిచేయలేదు. మొదటిరోజున ఆమె తీయనిగొంతు నన్ను ఆహ్వానించినప్పుడు నేను సామవేదపుపాఠాలతో నాచెవులు మూసుకున్నాను. అపురూపమైన ఆమెలావణ్యము నాకండ్ల యెదుట తాండవమాడినా నేను కన్నులుండీకూడా గ్రుడ్డివానిలాగ వర్తించాను. ఎన్నిసార్లు, ఎన్నిసార్లు ఆమె ప్రేమచుంబనాన్ని నిరాకరించాను!

తార

తండ్రీ! నీ మనోనిబ్బరానికి నేను గర్వపడుతున్నాను.

కచుడు

అమ్మా! ఆ ప్రేమను మరల్చాలని అబద్ధాలాడాను కాని ఆమెను గడ్డిపోచతో సమానంగా చూచినట్టు కనబడ్డా, అనిర్వచనీయమైన ఆప్రేమ అణుమాత్రము తగ్గలేదు. తల్లీ! తల్లీ! మహత్తరమైన ఆప్రేమ యీ నిర్భాగ్యునిమీదనే నిలవాలా?

తార

నాయనా! ప్రేమప్రవాహాన్ని నీవు కాదు, నీకంటె గొప్పవారుకూడా అరికట్టలేరు. అంతే కాదు, ప్రేమ జ్యోతివంటిది. మనము శలభములము. రెక్కలు కాల్చుకొని జ్యోతిలోపడి ఆహుతైపోవలసిందే!

కచుడు

అమ్మా! అంతేనా?

(తెర)

ఎనిమిదవ దృశ్యము

[మసక చీకటి. కవుడు దీనంగా ప్రవేశిస్తాడు]

“ఈనడికిరేయి వెన్నెలరూప చలించు
పిలుపెవరో ‘నాసఖా’ యని వేగిరించు
అనలమై కాల్చి నిశ్శబ్దముగ కలంచి
పరువులెత్తించు కవిల నా ప్రణయ నిధుల !

“ఎన్నిమారులు సవరించుకొన్న మాపు
తొలగవేమో యలను నేము నెలమొగాన
చెదరునే చెదరి చెదరి చెలియ కురులు
జాలిగా నీలమేఘనిశ్వాసములటు !

“నాకొరకె చాచు పణికంఠనాళమందు
మ్రోగక చలించి చెరవడ్డ మూగిబాష
ఎటు పిలుచు నన్ను ఆహ్వానగీతిగాల ; కనులెత్తి
పలుకనేరక నిదురించి పగలు రేయి !

“అయ్యయో ! [ప్రేయసి] [illegible]
[illegible] నిధాన, నా [illegible]
[illegible]
[illegible] కాలిపోయి [illegible].

“ప్రాణనాథ, [illegible]
కట కలలు రాల్చు ! [illegible]
వేగిపో దిట నీకయి నీలు రేలు
ప్రణయ [illegible] !”

(తెర)



నాగరాజుగారి 'నవకవి'

ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి

ఆధునికాంధ్రసారస్వతంలోకి, హాలాహాలంలాగు కొత్తగా అడుగుపెట్టింది 'నవకవి' అనే ఏకాంక నాటిక.*

దీన్ని నేటిసారస్వతులలో కొందరు వెరగుపాటుతోనూ, కొందరు తిరుగుబాటుతోనూ చూస్తున్నారు.

కవయిత బుద్ధవరపు నాగరాజు బి. ఏ. గారు ఇంతవరకూ ఆంధ్రలోకానికి అంతగా పరిచితులు కారు.

నేడు ఏట్టిసాహిత్యసత్తా సంపాదించకుండా బుకాయించి పైకి వచ్చే కొందరు యువకులవలె గాక ఎన్నో సారస్వతమర్మములను పరిశీలించియున్నా ఇంకా ఏదో జిజ్ఞాసతో తల పైకెత్తడానికి సందేహించే తరగతివాడీ నాటికారచయిత.

ఈయన ఆంగ్లాంధ్రవాఙ్మయాల విజ్ఞానపుమేరలలో అడుగుపెట్టి తరచి చూచిన యువకుడు. ప్రాచీన అర్వాచీన భేదాల పెనుగులాటల్లో దిగక ఉపాదేయమును ఆదరబుద్ధితో గ్రహించే పక్వహృదయుడు.

శ్రీనాథ రామకృష్ణాది ప్రాచీనాంధ్ర కవులకు సుపరిచితుడు. ప్రసిద్ధనవకవులలో కొందరికి పరమస్నిగ్ధుడు.

ఏవంగుణ విశేషణ విశిష్టుని చేతి నుండి వచ్చిందీనాటిక. దీనిని ఒకసారి తిరగవేసినవారు సులభంగా స్థూలదృష్టితో శుక్లపక్షాదిగణం†లో చేర్చివేస్తారు. వెంటనే నవ్యసాహిత్యప్రతిపక్షులు దీన్ని ఆదరించనూ చూస్తారు. కాని—

వివేచనతోగూడిన సూక్ష్మబుద్ధి ఉపయోగిస్తే దీని పరమప్రయోజనం బోధపడుతుంది.

సుమారు పాదశతాబ్దికి పూర్వం పుట్టి వంగ, ఆంగ్లేయాది సుప్రసిద్ధసారస్వతాల సహకారంతో సర్వతోముఖవికాసానికి ఉర్రులుచాచే నవ్యాంధ్రసాహిత్యంపట్ల ఎవరో వికృతబుద్ధులు తప్ప సహృదయసారస్వతులెవ్వరూ విముఖులుగా వుండరు. అట్టి సాహిత్యనిర్మాతల ప్రతిభను శంకించే సంశయాత్ములున్నా తరచు లేరు. కాని కొందరు యువకులు భాషాశక్తిగాని భావనాశక్తిగాని లేకుండా కొన్ని చిల్లరలక్షణాలవల్ల నవకవివేషాలువేసి సత్యనవ్యకవుల విచిత్రాదర్శాల లోతులు తెలియక వాటిని గుడ్డిగా అనుకరించి నవ్యసాహిత్యపీఠానికి తీరనికళంకం ఆపాదిస్తున్నారు. తెలియనివారు వీరిని చూచి వీరి దోషాల నన్నిటినీ యావన్నవ్యసాహి

* నాటిక అనేమాటను ఔపచారికంగా ఇక్కడనేను వాడుతున్నాను. అసలు నాటికాలక్షణం వేరుగావుంది.

† ౧. 'శుక్లపక్షం', ౨. 'నేటికాలపు కవిత్వం', ౩. 'చాకిరేవు', ౪. 'సాహిత్యకళ—ఇది యాకృతిగలది'.

త్యానికిన్నీ జమకట్టుకున్నారు. కనుక ఇప్పట్లో నవ్యసాహిత్యశ్రేయస్సు—[illegible] వారు "అంగ్రవాత్రములో చికిత్సకులు [illegible] ఖండించి శేషాంగశ్రేయస్సు [illegible]" రెండోరకం నవకవులు (ఇప్పటివారిలో వీరి సంఖ్య ఎక్కువ) తీవ్రంగా విమర్శించి మొగటివారి ఉన్నతస్థితికి [illegible] వుంది.

నాగరాజుగారి ప్రయత్నం ఇటువంటిది. ఈయన నాటికతుది నిచ్చిన విన్నతిలోని మాటలివి :

"ఇతనికి (రామానికి) వారి (నవకవుల) అలవాట్లూ హావభావాలు మాత్రమే పట్టుబడి, వారలవరచుకొన్న అనమానకవిత్వం లోపించింది. కవితావనంలో కొన్ని ఉగ్రవ్యాఘ్రాలు ఉంటాయి. కొన్ని తీవ్ర జంబుకాలు కూడా వుంటాయి, వాటిని పెట్టుకోడానికి. ఒకదానిది గంభీరారావము. ఒకదానిది వెర్రికూత."

కనుక ఈ రచనకు హేతువు నవకవులమీది అసూయకాక ఒక న్యాయ్యమైన లక్ష్యం కారణం అని నమ్మితే దీనిని శంకిస్తూ చూడవలసిన అవసరంపోతుంది.

ఈ లక్ష్యసాధనకు ఇతడు తీసుకున్నది ఒక అవకతవకనవకవి అవివేకప్రేమవ్యవసాయం వస్తువు.

కథానాయకుడు రామం అనే నేటికాలపు యువకుడొకడు కొందరు నవకవులను — వారిపుస్తకాలను చూసి భ్రమసి, తనకున్న మిడిమిడిజ్ఞానాన్ని పురస్కరించుకొని కొత్తరకపు వలపుకవిత్వంలో పడ్డాడు. సరే-అందరిలాగనూ తనుగూడా ఒక ఆదర్శప్రేయసిని [illegible] వేరుగా [illegible] ప్రాణినవనిగా సర్పించుకున్నాడు. పైగా — ఇతడే జమాయిస్తే [illegible] మహాగీతాలు పాడుతూ [illegible] పెట్టాడు.

[illegible] పెట్టుకో సంగీతం [illegible] రామం హంగామా [illegible] ఇతడి [illegible] చేస్తున్నది.

రామం హఠాత్తుగా ఒకనాడు [illegible] ఆమెను చూసి [illegible] వారి తన ప్రణయాన్వేషణ [illegible] శైలముంచి ఎన్నో సిద్ధాంతరాద్ధాంతాలు చేసి [illegible] వుంటాడు.

ఇంతట్లో మురళీధర్ పరశు సాక్షాత్తు పరశురామావతారం ప్రవేశిస్తాడు. రామం సత్యమైనకవీ నిజమైనప్రేమికుడూ కానట్టే ధీరుడు కాని జపానురాముడు. పరశువాగ్ఘాటికి ఆగలేక తప్పటడుగులువేసి తిప్పినట్టల్లా తిరిగి పిస్తోలుచూచి హడిలి ఉడాయిస్తాడు. కథ అడ్డంగా తిరిగిపోతుంది.

ఈకథలో విశ్వనాథ సత్యనారాయణగారి 'తల్లిలేనిపిల్ల'లోని విచిత్రవిశేషం వుంది. విమర్శించదగ్గ కొన్నిసమస్యలను కావ్యవస్తువుగా తీసుకొన్నప్పుడు — వాటిని చక్కగా ఎత్తి చూపడంకోసం కొంచెం అతిశయకల్పన అవసరంగా వుంటుంది. తాత్కాలికంగా అట్టికల్పన అసహజంగా తోచినా

కావ్యకళాదృష్ట్యా అది చమత్కారపర్యవసాయియే అవుతుంది.

కనుక సత్యనారాయణగారి 'తల్లిలేని పిల్ల'లోని కల్యాణినాయుడూ — వసుంధరాదులూ 'నవకవి'లోని రామం — మణి — పరశూ కొంచెం అస్వాభావికస్వభావాలతో కనిపిస్తూన్నా — కొందరు మనుష్యుల వివిధ మనఃప్రవృత్తులను — అనేకసమస్యలనూ తమలోనే చూపి ఒకవిశేషవ్యక్తిత్వాన్ని నిరూపిస్తున్నారు.

పెద్దనాటకంకంటె ఏకాంకరూపకంలో ఒకవిమర్శాస్పదసన్నివేశాన్ని తీసుగుని బాగా నిర్వహించడం చాలా కష్టం. నాగరాజుగారు ఇట్టి క్లిష్టమైన పనికి పూనుకుని సాధ్యమైనంతవరకూ నేర్పుగా నిర్వహించినారని చెప్పవచ్చు.

ఈ రూపికలోని పాత్రలు ఒకరిని మించినవారొకరు.

రామం సరియైన ఆంధ్రసారస్వతహృదయం తెలియకుండా తెనుగుకవిత్వంలోకి చొరబడ్డాడు. చెప్పదగ్గభావాలు తనకు లేకపోగా ఇంగ్లీషుకవుల భావములను మెలికలు తిప్పి తెనుగులో పెట్టి అన్నీ తనవే అంటాడు. తరచు అతని తెనుగువాక్యాలు తెనుగులో కొమ్ములుతిరిగినవారికైనా అర్థం కావు. ఇక తనప్రేయసి తనను నిజంగా ప్రేమిస్తోందో లేదో తెలియనివాడు. పోనీ ఆధ్యాత్మికప్రేమికుడందామన్నా సమయమైతే మనిషినే కోరే కక్కుర్తిమనిషి. పుస్తకాల్లో చదివిన ప్రేమకథలు నిత్యజీవితంలో ప్రవేశపెడితే అభిషంగాలు ఎదురుపడతాయను కోని జడుడు.

మణి రామంకన్న మిన్న. తన బతుకు తెరువు బాగా ఎరిగినది. ఇట్లాంటి ఆశ్రితులను ఆటవస్తువులుగా ఉపయోగించి తుదకు "గీతమాలిక లంచమిస్తే హృదయమిస్తాను" అన్నట్లు ఈసడించి జాగ్రత్తపడగలది. తన అందానికీ — తెలివికీ ముగ్ధులైన వారిని బడాయిగా యిష్టంవచ్చినట్లు తిప్పగల మదవతి.

పరశు ఇద్దరిని మించినవాడు. మంచి హాస్యప్రియుడైనవాడు. భార్యను దేవతగా గాని, దాసిగా గాని చూడక స్నేహితురాలుగా చూడగలిగిన సంస్కారి. రామంవంటి వికారాదర్శకులను సునిశితతర్కంలోకి దించి "జితాస్మః" అనిపించగల చేవగలవాడు.

ఇట్టి క్రమక్రమ విశిష్టపాత్రలతో నాగరాజుగారి పాత్రపోషణమొంకువ ఒక మంచి మేరకు వెళ్ళి చక్కని నిర్వహణమును సాధించింది.

మహాకావ్యమునకు ఖండకావ్యం, నవలకు కథానిక ఉన్నట్టే విపులచిత్ర సన్నివేశాలతో రచింపబడే మహారూపకాలకంటె ఏకాంకరూపకం స్వల్పరసవద్రచన.

చమత్కారమైన ఒకసంఘటనను వస్తువుగా తీసుకొని ఇష్టనాట్యరసాలలో ఒకటి పూర్ణికం చేసి — ఒకేరంగంలో — ఒకటి రెండు గంటల్లో ముగిసేటట్లు నిర్వహించడం ఏకాంకికకు విశిష్టలక్షణంగా చెప్పవచ్చు. పైగా నాటకసామాన్యమైన ఘాతప్రతిఘాతములూ — ఉక్తిచాతుర్యం ముఖ్యంగా వుండాలి.

ఇట్టివి ఆడటంకంటె చదవడానికి ఎక్కువ బాగుంటాయి. సమస్యలు మాత్రమే ఆడగలవు.

'నవకవి' చక్కని ఏకాంకనాటకం. కథంతా ఒక్క గంటలో — ఒక్క గదిలో — ముగ్గురు పాత్రలతో హాస్యరసప్రధానంగా నడచింది.

రామం ప్రవేశం ఒకఆశతో ప్రారంభమై మణి తెలివైన తిరుగుబాటుతో ఒక మలుపునకు తిరిగిపోయింది. పరశు గొడ్డలిపెట్టుతో అతని స్వభావమే హఠాత్తుగా మారి సంసారిపక్షం అయిపోవడం నాటకత్వానికి ఎంతో తోడ్పడింది.

రామం మణీ, జరుపుతూన్న వాదోపవాద-తుపానులో, అసలు పరశు ప్రవేశమే కన్నులు జిగేలుమనే ఒకమెరపు. ఇక్కడనుంచి కథకు ఒకచురుకూ, — సంభాషణకు ఒక అపూర్వరుచీ,— రసాని కొక సమీపత్వం సిద్ధించాయి.

ఇందులో ముఖ్యంగా చెప్పదగ్గది కవి ఉక్తిచాతుర్యం. పట్టి సంభాషణను చమత్కారవచనముఖరితం చెయ్యడంలో ఈయన సిద్ధహస్తుడు.

రామం — ప్రపంచాని కసలు మూలం అహం కదా.

మణి — కాదు— అహం— నాపేరు money "ధనమూల మిదం జగత్" అన్నారు కదూ.

... ...

రామం — ఏం నాకేసి ఇంకా అలా బెదురుగా జేబుదొంగకేసి చూచినట్టు చూస్తున్నావు?

మణి — (చిరునవ్వుతో) ఏమీ లేదు. వాళ్ళ ళ్ళల్లో వుండే చురుకుతనం నీకళ్ళల్లో ఉందనీ—

... ...

పరశు — ఏమంటావ్! మై మనీ —

మణి — ఏం మై సర్వా — అయిందా —

... ...

రామం — మతమంటే ఈశ్వరునియందు దృఢవిశ్వాసముండీ —

పరశు — ఓవర్ కోటండీ! ఈకాలంలో విశ్వాసం ఎవరికండీ — కుక్కలకే లేదు— —

ఇట్లా మాటలమీద మాటలను ఆడించడం ఇతనికి బాగా పట్టుబడింది.

ఇతడు కవిత్వం-ప్రేమ-వివాహబంధం-ఘోషాపద్ధతీ - ఏకపత్నీవ్రతం - దేవుళ్ళు - గుళ్ళు - మతం — వీటిని గురించి నాటికలో చేసిన చమత్కారతర్కం ముచ్చటగా వుండి పాఠకుడి కౌతుకాన్ని పువ్వులాగు వికసింపజేస్తున్నది.

ఇందులోని 'షా'గారి పేరడాక్సు — ఉత్తరరామచరిత్ర పద్యోదాహరణాలూ — రామకృష్ణకవిమీది అభిమానం రచయిత వివిధసంస్కారపత్తను చెప్పుతూన్నవి.

ఈ నాటికను ప్రదర్శించడానికికూడా' కవి తగిన జాగ్రత్త తీసుకుని ఆద్యంతాలలో రెండుపాటలూ,మధ్య రామానివిగా ౯ పద్యాలును ఉంచినాడు.

ఈ పద్యాలూ — మొదటిపాటా రామానివి. పైకి చదవడానికి హాయిగానే ఉన్నాయి. కాని అర్థవివేచన చేస్తే, ఎన్నో అపశబ్దాలూ — అపక్రమాలూ — విజాతీయభావాలూ — వుండి తాత్పర్యం మసకమసకగా నీడలా తేలిపోతూ కనిపిస్తుంది. ఇందులో కొన్ని సుప్రసిద్ధ ఆంగ్లకవి షెల్లీ (Ↄhelly) పద్యాలకు పేరుచెప్పని తెనిగింపులు. చూడండి—

We look before and after
And pine for what is not
Our sincerest laughter
With some pain is fraught
Our sweetest songs are those
That tell of saddest thought
—'To A Skylark'

దీనికి నవకవి తెనుగు (౮౩ పేజి)—

"ముందువెనుక లరసి పోవచుస్త్రె చెడె జనం
బాసచేయు మిథ్యయైనదాని
కములహాసములు వ్యథాఘాతములు గీత
ములు విషాదభావపూరితములు.

". . .. .Oh wind!
If winter comes can spring
be far behind?
—"Ode to the West W ird'

"ప్రాప్తహేమంతబాధాసమాప్తి జేయ
కాసనే రాక [illegible]వసంతాగమమ్ము"

ఇంకా ఈపద్యాలలో "నార్థదగ్ధము" వంటి విచిత్రపదప్రయోగాలు ఉన్నాయి. మొదటిపాటలో ఏమీ అందుబాటులోని భావం కనిపించదు. కవి చెప్పితేనే తెలియాలి.

ఇందులో నవకవిపాత్రానుగుణముగా ఇట్టిపద్యములు వ్రాసి అతని చాతుర్యశైథిల్యమును ధ్వనింపజేసి ఔచిత్యవంతమైన మెలకువను రచయిత చూపినాడు.

నాటికలో రామంప్రవేశం వర్షంతో ప్రారంభించడం, అతని నిర్గమనం వర్షం వెలిసిపోవడంతో జరగడం చూడగా ఇందులో నాటకీయమైన చక్కని వస్తుధ్వని వున్నది.

ఇట్లా నాటికను ప్రారంభించి [illegible] నాటకీయమైన విపులసమాలోచన [illegible] హృదయాన్ని ప్రత్యక్షంగా చూపినాడు. ఇందువల్ల పాఠకులకు [illegible] మంచి [illegible]కర్యం ఏర్పడింది.

తొలియత్నమైనా నాగరాజుగారు ఆది నుంచి అంతందాకా కుతూకమును కల్పిస్తూ నాటికను మధురంగా నిర్వహించినారని చెప్పవచ్చు.

కాని —

మణి — రామూల సంభాషణ ఎంత చమత్కారంగా ఉన్నా నాట్యాని కనుగుణంగా లేదు.

వారి వాదాలలో కొన్నివిషాదాలు శ్లోదకమంగా వుండక విమర్శనీయములుగా కన్పిస్తున్నాయి. అదీకాక నాటకసంభాషణలో అంత పారిభాషికచర్చ పెడితే కళ నిలవడం కష్టం. మణి ప్రవేశంలో ఆవేదనగా ఆలోచించడం — తీక్ష్ణంగా గవాక్షంలోంచి చూడడం లేకపోతేనే బాగుంటుం దని నాఅభిప్రాయం.

ఇట్లా చిన్నచిన్నలోపాలు కన్పించినా మొత్తంమీద గుణప్రాచుర్యమూ — సుందరకావ్యత్వమూ ఇందులో వున్నవి.

పుస్తకపుకూర్పూ — అచ్చూగూడ మిక్కిలి ఆకర్షణీయములుగా వున్నాయి.

ఇకముందు శ్రీనాగరాజుగారు ఈనాటికలో నాటిన ప్రతిభాబీజములను పెంపొందించి ఎన్నో ఉత్తమనాటకాలు వ్రాసి ఆంధ్రనాటకరచయితృశ్రేణిలో ఉత్తమస్థానాన్ని ఆక్రమించగలరని నమ్ముతున్నాను.

స్నేహము

గుఱ్ఱం వేంకటసుబ్రహ్మణ్యం

మిత్రపదప్రయోగ మనిమిత్తముగా నుపయుక్తమయ్యె నే
పాత్రమునందు, నిత్యవిధి ప్రాపుగ నిల్చును వేనిమైత్రి, వై
చిత్రియక్రాలు వారములు సెల్లుకొలందియు, సౌహృదంబు సా
భ్రాత్రముమూర్తి తా నెవఁడు, భవ్యవిచారుఁడ వీవుదక్కఁగన్.

బాంధవ మున్కిగాదు, ప్రతివాసరముం గనుచున్కి గాదు, ని
ర్మంథరవర్త్మ గాదు, రుచిరంబగు వాక్కును గాదు, బాల్యభా
వాంధత గాదు, కావన ని వన్నియు నారయ, నైన నిట్లు సి
రంధ్రము స్నేహభాగ్య మలరంగ నెఱుంగఁ గతం బొకింతయున్.

వయసున వార యున్నది, స్వభావమునందున భేద మున్నదా
శయములమేరవేఱు, మఱిజాతకచర్చ విభిన్నమయ్యె, సు
ప్రియమగు సౌహృదంబునకుఁ బ్రేరణ మేమని పల్కువాఁడ, ని
శ్చయముగఁ బూర్వజన్మముల చాయలువో యివి యెల్లవారికిన్.

ఎన్నివ్యథల్ పయింబడిన నించుక సహ్యములౌను నీవు నా
సన్నిధి నున్నవేళ, నిఁక సౌఖ్యములో ద్విగుణీకృతంబులై
చెన్నెసలారు, నిర్వృతివిశేష మొకం డనుకూలమూలమై
యున్నె యలౌకికార్థముగ; నొద్దికసుద్దిగ లౌకికార్థమై.

పరిచయముంగలాడ ప్రతిభాప్రతిభారవులైనవారితో,
గురుతరపూజ్యభావమునఁ గొందును వారి విశిష్టభావమై
ఖరి సిగ దాల్పగా, హృదయకంజము తాల్పుగ నీడు మెచ్చుకోల్
నిరతిశయప్రమోద మిడు నిచ్చలు సారకవిత్వచర్చలన్.

కలిగియు భావపుష్కలత, కల్గి రసజ్ఞత, వాక్సహాయముం
గలిగి, యుపేక్ష చేసెదవు కావ్యము సవ్య మొకండు సేయఁ, జా
పలముపినా మఱేగుణలవంబును లేని ననుం గడుంగుతూ
హాలి నొనరించు టెందుల, కనల్పము జల్పము మెత్తురే జనుల్.

సిగ్గూ - బిడియమూ

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి

సిగ్గూ, బిడియమూ అంటూ సర్వసామాన్యంగా వాడుకొనేదాన్ని గూర్చి కొంచెం వ్రాస్తాను. యీ రెండుమాటలూ పృథక్కుగా వాడుకుంటూ వున్నట్టు కనపడినా అర్థంమాత్రం వకటే. యీలాటివి చాలా శబ్దాలు పునరుక్తిప్రాయంగా కనపడేవి మన వాడుకలో వున్నాయి. మఱొకప్పుడు వాట్లనుసరించి మాట్లాడుకుందాం. యీ సిగ్గుబిడియాలను సంస్కృతభాషలో "హ్రీ" మొదలైన కొన్నిశబ్దాలతో వ్యవహరిస్తారు. అందులో—"హ్రీ" అనేది సాక్షాత్తూ పరదేవతాప్రీతికరమైన మంత్రబీజాక్షరం. ఆకారణంచేతే అనుకుంటాను, తద్వాచ్యమైన యీసిగ్గును పరదేవతాస్వరూపాల్లో దేవీభాగవతంలో చేర్చినట్టు తోస్తుంది. యీ సిగ్గును విశేషించి పాటించడం గొప్పగొప్పమర్యాద కుటుంబాలవారిలో కనపడుతుంది. స్త్రీలకు అన్ని భూషణాలకన్నా యీ సిగ్గనే యెక్కువభూషణంగా కవులు వాడివున్నారు. అనుభవంచేత చూచినా మన భారతీయులలో యీ సిగ్గు ఆలాటిభూషణంగానే కనపడుతుంది. దీన్ని వర్జించి సంచరించేవాళ్లు మనదేశపు స్త్రీలలో వుండనేవుండరు సరికదా, పురుషులలోనున్నూ వుండరు. కాని పురుషులు పాటించేరీతి వేఱు, స్త్రీలు పాటించేరీతి వేఱున్నూ అని అందఱున్నూ యెఱిగిందే కనక విస్తరించేది లేదు. దీన్ని వదిలిపెట్టిన వ్యక్తికి చేయరానిపని అంటూ వుండనేవుండదని అభియుక్తులు చెపుతారు.

"లజ్జామేకాం పరిత్యజ్య త్రిలోకీవిజయీ భవేత్"

అనేవాక్యాన్ని తఱుచు పండితులు వాడుతూ వుంటారు సిగ్గు వదిలిపెట్టినవాఁడు యీ లోకాన్ని మాత్రమే కాదు మూఁడులోకాలనీకూడా జయిస్తాఁడని దాని తాత్పర్యం. అంటే? వాఁడికి విధినిషేధాలంటూ వుండవు కనక వాఁడు అన్నిటికీ సిద్ధపడతాఁడని తేలింది. శ్లోకంలో—"విజయీ" అని పుంలింగనిర్దేశం చేసినా స్త్రీలకున్నూ అది సంబంధించవలసిందే. జాతిగా మీద తరంలో వున్న స్త్రీలకున్నూ జరిగినంతలో యీ సిగ్గును ముఖ్యభూషణాల్లో వాడిస్తూనే వున్నారు. జమీందారులు యెక్కువగా వున్న గౌరవకుటుంబాలలో దీన్ని యెంత గౌరవిస్తారో చెప్పనే అక్కఱలేదు. ఘోషా వగయిరా మర్యాదల కన్నిటికీ యీ సిగ్గే మూలకందం. అట్టిని ఘోషానియమం లేనికుటుంబాలలో దీన్ని పాటించడం లేదనుకోవడానికి అవకాశం లేదు — "సలజ్జా గణికా నష్టా నిర్లజ్జైవ కులాంగనా" అనేవాక్యం వల్ల వేశ్యలకు లజ్జ వుంటే వృత్తి, నాట్యాభినయాలు వగయిరా బాగా సాఁగవని అన్నాఁడేకాని వుండదని అనలేదు. కాఁబట్టి వాళ్లకుకూడా వున్నట్టే తేలుతూ వుంది. స్త్రీమాత్రసహజమైన దీన్ని వేశ్యలుమాత్రం వదలడం యెలాగ? యీ సిగ్గనేది పురుషసాన్నిధ్యంలో స్త్రీలకున్నూ, స్త్రీసాన్నిధ్యంలో పురుషులకున్నూ మాత్రమే కాదు; స్త్రీసాన్నిధ్యంలో స్త్రీలకున్నూ, పురుషసాన్నిధ్యంలో పురుషులకున్నూ కూడా వుంటుంది. అందచందాలమాటలా వుండఁగా శీతబాధలేని వుష్ణదేశాల్లో మండువేసంగిలో అప్రాఁటను గతిలేని స్త్రీపురుషులవఱకున్నూ యేమాత్రమో వస్త్రధారణం చేయడానికి యీ సిగ్గే కారణం. సావిత్రి—"మనసా కైకొన్నభర్త మానందనునే" అని అనడానికి కూడా కారణం యీసిగ్గే అనుకుంటాను. యితరులకు తనమనస్సులో వరించిన సత్యవంతునివిషయం తెలియక పోవచ్చునుగాని తన అంతరాత్మకు తెలియకుండా వుంటుందా? అనేదే యిక్కడ ముఖ్యాంశం. ఆపె లోకోత్తరమైన పరమపతివ్రత కావడానికి యీ "హ్రీ" అనే మంత్రబీజాక్షరమే, అంటే దీన్ని మానని

కంగా పరకళత్ర్య చేయడమే ముఖ్యకారణంగా భావిం చాలి సీత త్రిలోకాధిపత్యాన్ని తృణీకరించిందికూడా యీ సిగ్గుకు లోబడియేన్యేవే. కాని స్త్రీసహజమైన యీ సిగ్గును పీకి రావణునితో పురుషుడికన్నా మిన్నాగా ధిక్కరించి యేలా మాట్లాడిందంటారేమో? అదికూడా సిగ్గును కాపాడుకోవడానికి చేసిన ప్రయత్నమేకాని అన్యం కాదు. ఆమె అప్పుడు మహావిపత్తులోకదా వుంది—"ఆపత్కాలే నాస్తి మర్యాదా" అనే అభియుక్తోక్తి అప్పుడు ఆమెకు వుపాదేయం అయింది. అక్కడికి అడ్డుగా వక గడ్డిపరకను మాత్రగా పడేసింది. యీసిగ్గు లేకపోవడంచేతనే రావణుడు పుత్రమిత్రకళత్రాదులతో నశించి పోవల్సి వచ్చింది. త్రిలోకైకజేత సిగ్గును వదిలిపెడితే అవుతాడన్నమాటకు ప్రస్తుతవాక్యం విరోధించిందంటారా? ఎందుకంటారు? అనరు. ఆమాట కర్థం వేరని యెరుగనివారెవరు? మూడులోకాలున్నూ బాహుపరాక్రమంచేత జయించిన మహాయోధుడు రావణుడు తుదకు సిగ్గుమాలిన పనికి అగ్గమై కుంకటివేళ్లతో నశించాడంటే వేరే చెప్పవలసిందేమిటి? రావణుని సిగ్గుమాలినతనాన్ని వివరించ నక్కరలేదు. అయినా కొంచెం వివరిస్తాను. సీతకు మొదట తనయందు అనురాగం వుందో లేదో తెలియక—

తే-గీ. "బలవిహీనుని కన్యని భార్య యంచు
దనకళత్రం బటంచు భేదంబుగాని
సొగసు గల డెల్ల దనచేతిసొమ్మెకాక
బలము గలిగినవాని కేర్పాటు కలదె."

అనే ముట్టితో పుపడబలాన్ని పురస్కరించుకొని బలాత్కారంగా, దొంగతనంగా తీసుకువచ్చినా తరవాత ఆమెచేష్టలవల్ల యథార్థం తెలిసింది కనక సిగ్గు కలవాడే అయితే రావణాసురుడు ఆమె సాంగత్యాన్ని అభిలషించేవాడే కాడు. అదిలేని మోట మొద్దుస్వరూపం కావడంచేతనే కుంకటివేళ్లతో నాశనం కావలసి వచ్చింది.

* * *

సిగ్గనేది తెలుచు కవులు శృంగార రసాంగంగామాత్రమే వర్ణిస్తూ వచ్చారు. కాని యే రసమూ లేనివిషయాల్లోకూడా దీనిప్రసక్తి కనపడుతుంది. యెవరివద్దైనా నాలుగుడబ్బులు అప్పు తెచ్చుకుంటే ఆ అప్పు తీర్చేదాకా ఆ ఋణదాత మొఖం చూడడానికి సందేహించేవాళ్లిందరో నా చిన్నతనం నాటికి వుండేవాళ్లు యిప్పుడున్నూ వుంటారు. కాని క్రమంగా దావాలు ప్రబలినతరువాత, ప్లీడర్లు విస్తరించినతరువాత ఋణప్రదాత అప్పునుగూర్చి కదిపితే వటి రెండుసార్లు 'అప్పుడిస్తాను, యిప్పుడిస్తా' నంటూ బదులు చెప్పడమున్నూ, మూడోసారి అడిగేటప్పటికి కళ్లెఱ్ఱ చేసి "కావలిస్తే దావా చేసుకో" అనేదగ్గఱికిమాత్రం వచ్చింది ప్రపంచం. కాని అప్పునుకూడా కాలదోషం పట్టిననోట్లుకూడా తీర్చినమహానుభావులు కొందఱుండేవారు. బందరులో భైరవప్రెస్సువారికిన్నీ, నాకున్నూ యిచ్చిపుచ్చుకోవడాలు వుండేవి. కాని యెన్నోసార్లు కాలదోషం పట్టడమున్నూ వుండేది. కాని వారెన్నడదూ తటాయించనే లేదు. ఆరోజుల్లో రచించిన గుంటూరుసీమలో "నోటుకు కాలదోష మది నోటికి లేదు" అని వ్రాయడం పైసందర్భాన్నే సూచ్యంగా సూచిస్తుంది. యీలాటివారి కందఱికీ పరలోకభీతికంటే కూడా యిహలోకంలో కలిగే సిగ్గే ఆయాయోగ్యతకు ముఖ్యకారణ మనుకోవాలి. వక సంపన్నగృహస్థు నా చిన్నతనంలో దివాలా తీసి త్రిశంచిగ్రామం ప్రవేశించాడు. ఆవూళ్లోనే నివాసంగా వుండేవాడు దివాలా తీసినా సంపన్నుడుగానే వుండేవాడు కాని తగాస్తుకునిమాత్రం సంచరించినట్టు లేదు. అందఱున్నూ ఆయన యింటిపేరుతో ఆయన్ని వాడిక యింటిపేరుస్థానంలో —దివాలాపదాన్ని చేర్చి వాడుకునేవారు. కొందఱు యెట్టయెదటకూడా ఆపేరుతోటే పిల్చేవారు. పాపం! యేమీ అనేవాడు కాడు. యెందఱో అన్యాలు ఆయనవద్ద వడ్డీలేనిపద్ధతినో, స్వల్పవడ్డీ యిచ్చేపద్ధతినో దాచుకున్నవాళ్లు చెడిపోయారని చెప్పుకునేవారు. కాని కలియుగమవడంచేతనో యేమోకాని ఆ సంపన్న గృహస్థు దోసతోటలాగ అభివృద్ధిగానే వుండేవాడు గాని బుద్ధిపూర్వకంగా చేసిన దుష్కృతఫలితాన్ని అనుభవించినట్టుమాత్రం లేదు. కాని సిగ్గుతోనే సంచరించేవాడు. దీన్నిబట్టిచూస్తే "ఋణస్య దానస్య న కించిదంతరం". కనక అప్పుతీర్చడం అనవసరంగా కన

పడుతుంది. యెక్కడనో యీలాటివాఁడొకఁడుంటే వుండవచ్చుంగాని ఆరోజుల్లో ఆస్తి అంతతో నిల్వనిచ్చేదికాదు. యేలాగో ఋణదాత కాళ్లా, కడుపూ పట్టుకొని తృణమో దుగ్గాణో యిచ్చి బాకీ తేదవిడిచుకొనేవరకూ వూరుకోనిచ్చేదే కాదు. అందుచేత సిగ్గేది ఋణాలు యెగఁబెట్టివ్వాలి మహాసుగుణంగా మనం జమకట్టుకోవచ్చు ననుకుంటాను.

నాకు సుమారు నలభైయేళ్లు వచ్చేనాఁటికి దివాలాలు విస్తరించాయి ఆరోజుల్లో నేను బందరులో వుండేవాణ్ణి. సెలవులలో అప్పటి నివాసగ్రామం మవడంచేత దివాలా కోర్లకు శరణ్యంగా వుండే యానాం పశ్లేషం తటస్థించేది. అప్పుడు యింకో సంపన్నగృహస్థు చిన్నదివాలా తీసి యానాంప్రవేశించాఁడు. చిన్నతనంలో నేనూ అతఁడూ నీలపల్లిస్కూల్లో వకటేతరగతిలో చదువుకొన్న స్నేహాన్ని పట్టి నన్ను చూడడానికి వచ్చాఁడు పాపం. ఆ సమయానికి వక పెద్దజ్యోతిష్కుఁడు జాతకభాగంలో మంచి ప్రజ్ఞకలవాఁడు నావద్దిరి వున్నాఁడు. నేనూ ఆయనా జాతకవిషయాలు మాట్లాడుకుంటూవున్నాం. ఆనా బాల్యస్నేహితుఁడు తనజాతకాన్ని కాగితంమీఁద వేసి ఆయనచేతి కిచ్చాఁడు. ఆయన కుండ పగలఁగొట్టినట్టు వున్నదున్నట్టు చెప్పడమే కాని బొత్తిగా లౌక్య మర్యాద పాటించేస్వభావం కలవాఁడు కాఁడు. ఆ కారణంచేత వున్నదున్నట్టుగా చెప్పడానికి మొదలెట్టాఁడు. ఆరీతి కొంచెం వివరిస్తాను. మొట్టమొదటే 'శ్రీమతే వేదవ్యాసాయ నమః' అన్నమాదిరిగా "నాయనా! నీవిచ్చినజాతకం యెవరిదోకాని యిది నిజమైన జాతకమే అయితే యీ జాతకుఁడు సంవత్సరంక్రితమే చచ్చిపోవలసి వుంటుంది నీవు పరీక్షకోసం నాచేతి కిచ్చినట్టు తోస్తుంది. యీలాటిపని యెప్పుడుగాని చేయవ"ద్దని మందలించాఁడు దానిమీఁద ఆ గృహస్థన్నాఁడుకదా "అయ్యా! యీ జాతకం నాదేనండి" అన్నాఁడు. 'నీదే అయితే నీ వెందుకు చచ్చిపోలేదో చెప్పవలసిం' దని జ్యోతిష్కుఁడు నిర్బంధించాఁడు. యిదేమిట్రా? అని నాకు ఆశ్చర్యం కలిగింది. అతఁడు దివాలా తీసినట్టు నాకుఁగాని, జ్యోతిష్కుఁడికిఁగాని లేశమూ తెలియదు. అతనితో వచ్చిన వకమనిషి మెల్లిగా దివాలాసూచకంగా [illegible] క్రితం యీలాటి చిక్కు [illegible]. దానితో జ్యోతిష్కుఁడు "నీకు చచ్చేనే యింతకన్న మేలు" అంటూ చీవాట్లు [illegible] న్న గృహస్థు పాపం! యెంతో చిన్నవోయాఁడు. నాకున్నూ యెంతో సిగ్గేసింది. జాతకుఁడికి [illegible] వచ్చిందేమో కాని స్వయంగా జాతకం చూసి చెప్పగడంచేత యేమీ అనలేకపోయాఁడు. యింతకూ ఆ జ్యోతిష్కుఁడు ఫలాపేక్షకు సంబంధించినవాఁడు కాఁడనుకొంటాను. అందుచేత పృచ్ఛకుల అనుగ్రహనిగ్రహాలతో ఆయనకు అవసరం లేదు.

* * *

యీజాతకభాగంలో పనిచేసేవారు చచ్చేది ముందే చెపుతూవుంటారు. చెడ్డను చెప్పేయెడల గతించినదాన్ని మాత్రమే చెపుతూవుంటారుగాని భవిష్యత్తునుగూర్చి చెప్పరు. యెందుచేత? అలా చెప్పడంవల్ల అది నిజమే అయినా చెప్పించుకున్న వారివల్ల కలిగేలాభం వుండదుకదా? వక పెద్దజమీందారు "కళా షష్టి"సమీపంలో వుండి అనారోగ్యంచేత చిక్కుపడుతూ కొందరికి జాతకాన్ని చూపిస్తే వారు వున్నయథార్థాన్నే చెపుతూవచ్చారు. యింకో పండితుఁడికి చూపడం తటస్థించింది. ఆ పండితుఁడు చాలా లౌక్యుఁడు. ఆయన గతంలో పండితులు చెప్పినమాటలన్నిటినీ "తోసిరా" జని "యీ జాతకుఁడికి యింకా రెండుదశలు ఆయుర్దాయం వుం"దంటూ చెప్పడంతో టట్టుగానే చాలా సంతోషించి దుశ్శాలువులూ, అర్ధ వేయిన్నూటపదార్లూ యివ్వడం జరిగిం దని చెప్పుకుంటారు. తరువాత యిదివఱలో యథార్థం చెప్పినపండితులు ఆయన్ని నిలవతీసి "స్పష్టంగా మారకం కనపడుతూ వుంటే, రెండుదశలు ఆయుర్దాయం యేలా చెప్పారు మీ" రని అడిగేటప్పటికి ఆయన నవ్వి, "నాయనలారా! మీరు యథార్థమే చెప్పారు. దానివల్ల మీ కేంలాభం కలిగింది? యిదిన్నీ కాక, అన్నిభావాలకన్నా ఆయుర్భావం నిర్ణయించడం చాలా దుష్కరం. కాఁబట్టి దాన్నిగూర్చి "నాస్తిలం కీర్తయేత్" అని సమాధానం చెపుతూ, వకవేళ మీరు మారకకాలంగా అభిప్రాయపడ్డ 'టయిము' దాటితే

యిప్పుడు జరిగిన సమ్మానానికి మించినసమ్మానం నాకు మళ్లా జరుగుతుంది. దాటకపోతే ఆయన నన్ను "సరిగా చెప్పలేదేమి?" అని ప్రశ్నించేడు. యిక ఆయనకు సంబంధించినవాళ్లు అనుగుతారనుకోవాలి. వారికి మీకు చెప్పిన జవాబే చెప్పవచ్చును" అంటూ చెప్పినట్టు వినడం. సరే! విషయం విషయాంతరంలోకి మారింది.

* * *

సిగ్గునుగూర్చి మనం మాట్లాడుకుంటూ వున్నాం. శృంగారరసంలోనే కాకుండా యీసిగ్గుకు అన్యత్రకూడా ప్రసక్తి వుందని చెపుతూ యెన్నో రూల్సులు అప్పగవేయడానికి వున్నప్పుడుకూడా యీసిగ్గు వాట్లను వుపయోగపడుచుకోనీయకపోవడంచేత కొందఱు యెట్లో క్రమప్రకారంగా ఋణవిముక్తిని పూర్వకాలంలో చేసుకొనేవా రని చెప్పినట్టయింది.

యింకా యీ సిగ్గుకు ప్రసక్తి కలది మఱొకటి వుంది. అది యుద్ధం. ప్రాణాలయందు యెంతో తీపి వున్న వాళ్లుకూడా యింట్లోకూర్చుని వుంటే తమరిని ఆడవాళ్లు నవ్వుతారనే తాత్పర్యంతో యుద్ధరంగానికి వెళ్లి తోచినంత పనిచేసి ప్రాణాలు విడిచినట్టు యెన్నో యితిహాసాలుకనపడతాయి. యుద్ధరంగాన్నుంచి భయపడి యింటికి వచ్చినప్పుడు ఖడ్గతిక్కన్నగారిని కాంబోలును వదినెగారు—"మగ రాచువారమైతిమి, వగపేటికి జలకమాడ వచ్చినవేళన్" అని ఆక్షేపించినట్టున్నూ, దానితో సిగ్గుపడి యుద్ధరంగానికి వెళ్లినట్టున్నూ వున్నయితిహాసం అందఱూ యెఱిగిందే. యెక్కడపడితే అక్కడ తినడానికిఁగాని, నోటికి వచ్చినట్లల్లా మాట్లాడడానికిఁగాని యెందఱో సంశయించడంకూడా యితరకారణాలమాటాలా వుండఁగా సిగ్గుచేతనే అనుకోవడం యుక్తియుక్తంగా వుంటుంది. బాగా ఆలోచిస్తే మనం తినేపదార్థాలలో యేకొన్నింటిలోనో తప్ప బాహుళ్యంగా వుప్పు కలవడం యేలాటిదో ప్రవర్తనలో సిగ్గుకలవడమూ ఆలాటిదే. దీనివల్లనే అనేకులు సత్ప్రవర్తన కలవారవుతూవున్నా రనుకోవచ్చును. మగవాళ్లకు సిగ్గుండకూడదనిన్నీ ఆడవాళ్లకే సిగ్గుండవలసిందనిన్నీ చెప్పేమాటలు సర్వసామాన్యమైనవిన్నీ శృంగారరసానికి సంబంధించినవిన్నీ అని తెలుసుకోవాలి.

క. 'కాంతుఁడు విటత్వుఁడైనను
గాంతకు సిగ్గుపడఁ జెల్లుఁగా కకటకటా!
కాంతుఁడు సిబ్బితికాఁడై
కాంతయు నట్లైన నెట్లు కాఁపుర మింకన్.'

అంటూ పింగళి సూరన్నగారు చెప్పినమాటవల్ల శృంగారంలోకూడా సిగ్గును కొన్నిసంచర్భాలలో స్త్రీలుసమేతూ కొంత తగ్గించుకోవలసిందిగా కనపడుతుంది గాని యెంతో ప్రాణం మీఁదికి వస్తే తప్ప స్త్రీ సిగ్గు వదిలి మాట్లాడడం తటస్థించదు. ఆలా మాట్లాడవలసేవస్తే యిక తరవాయంటూ వుండనే వుండదు. చూడండి శకుంతల భారతంలో దుష్యంతుఁడు తన్ను అనాదరించి అసత్యాలాపాలాడేసమయంలో యెలా మాట్లాడిందోను! యీలాంటి వింకా యెన్నో వుదాహరణాలు స్త్రీలవిషయంలో సిగ్గు వదలుకున్నవి చూపవచ్చును. కాని యింతమాత్రంచేత ఆయాస్త్రీలు లజ్జాశూన్యురాండ్రతరగతికి జమ కారు. మొత్తం పురుషులుకూడా సిగ్గును పాటించేవారే అయినా స్త్రీలవల్లనే యీ సిగ్గు నిన్నమొన్నటిదాఁకా బహుకుతూవచ్చింది పాప. "లజ్జితుమసిలజ్జతే" అనిన్నీ, "సిగ్గుకు సిగ్గులే దిటులు చేసినపిమ్మట నుండవచ్చునే?" అనిన్నీ వాడుకొనే యిత్యాదు లన్నీ స్త్రీలసిగ్గుకు సంబంధించినవే. యెంతటి "బూతులబుంగ"లున్నూ ఆడవాళ్లున్నచోట విశృంఖలంగా బూతు మాటలు రానీయరు. అలవాటుచొప్పున వస్తే చట్టున నాలుక కఱచుకొని పశ్చాత్తాపాన్ని సూచిస్తారు.

నిమ్నజాతులలో ఆడవాళ్లు పలువురు బండుబూతులు వాడేవాళ్లున్నూ వుంటారు. కాని అవి బూతులని వాళ్లు యెఱుగరు. వాళ్లందఱూ నామమాత్రానికి ఆడవాళ్లే కాని, వస్తుతః మగవాళ్లే అనుకోవాలి. అందులోనూ సిగ్గూ, బిడియమూ లేని మగవాళ్లనికూడా అనుకోవాలి. తాటక, శూర్పణఖ వగయిరాలు స్త్రీలని యెవ రనుకుంటారు? స్త్రీచిహ్నలుమాత్రమే స్త్రీత్వాన్ని సమర్థించవు. పురుషుల విషయంకూడా యీలాగే. ఆ చిహ్నములను పోషించతగ్గ గుణాలలో ముఖ్యగుణం సిగ్గుబిడియాలు. అవి వదులుకొన్నతరువాత స్త్రీత్వం నష్టేటిలో కలిసినట్టే. స్త్రీకి

చిన్నతనంలోకూడా యేమోగాని, పెళ్లిమాట తలపెడితే యెంతో సిగ్గు పుట్టుకువస్తుంది. అది కొనితెచ్చుకునేది కాదు, సహజం. ఆ పెళ్లి అనేది యేమేనా అశాస్త్రీయమేమో అంటే ఉత్పత్తి లేశమున్నూ కాదు. కాకపోయినా సిగ్గుబాస తప్పేదిలేదు. వొక్క స్వయంవరాలవిషయంలో దీనికి మినహాయింపయితే కనపడుతుందిగాని, దేవీభాగవతంలో సుదర్శనచరిత్రలో అతనిభార్య శశికళ యీ మినహాయింపునుకూడా అంగీకరించిందికాదు. పూర్వుల రచన లంటే బొత్తిగా యీసడించే నవనాగరికులకు వాట్లని వుదాహరిస్తే యేం లాభం?

యీ సిగ్గంతా స్త్రీలకు పురుషులే స్వార్థపరత్వంచేత కల్పించారనేవారున్నూ యీకాలంలో వున్నారు. ఒకవిషయమేమిటి? అన్నివిషయాల్లోనూ యిప్పటివాదం పిడివాదమే. స్త్రీలు బహిష్టయినప్పుడు నాలుగురోజులు అస్పృశ్యంగా వుండడానికి యెన్నో కారణాలు మనవారు ఆయుర్వేదాదులద్వారా కనిపెట్టి నిర్ణయించి వున్నారు. అగ్రవర్ణాలలో సర్వత్రా యీ ఆచారం యిప్పటికీ జరుగుతూనే వుంది. దేశభేదంచేత యీ అస్పృశ్యతలో కొంత తారతమ్యం వున్నా మొత్తం అందరూ దీన్ని పాటిస్తూనే వున్నారు. నిమ్నజాతులుమాత్రం అగ్రజాతులతోపాటు జరుగుబాటు లేక తాత్కాలిక స్నానమో యేదో చేసి సరిపెట్టుకుంటూ వున్నారు. స్నానమే చేయడానికి కొన్ని పౌనులు ఖర్చుపెడితేనేకాని వీలుపడని యూరపుఖండంలో దీన్ని మనలాగ పాటిస్తూన్నారని చెప్పడానికి వీలుపడదు. దాన్ని వుదాహరణ పుచ్చుకుని యిప్పుడు యీ ఆచారాన్ని పాటించవద్దని చెప్పేవారెందరో వున్నారు. యిదికూడా పురుషుల స్వార్థపరత్వంవల్ల కల్పితమైనట్టే వారి అభిప్రాయం. కట్టకడపటిజాతులకు దేవాలయప్రవేశం లేకుండా చేసిన ధర్మశాస్త్రమే స్త్రీలకు రజస్సమయంలో అంటరానితనాన్ని యేర్పాట్లు చేసిందిన్నీ. యిందులో వకటి స్వార్థపరత్వానికి వుదాహరించతగ్గదైతే రెండోది యెందుకు కాకపోతుందో?

పూర్వులు చేసిన ఆయీ యేర్పాట్లకన్నింటికీ బాహ్యకారణాలు చూపడం దుర్ఘటం. ఆధ్యాత్మికదృష్టితో ఆ [illegible] చూస్తే కనపడుతుంది. [illegible] సృష్టి మాత్రంలో సర్వజ్ఞత్వాన్ని ప్రకటించే మనకు [illegible] స్తారా? గోచరించనిమాత్రంచేత అవి స్వార్థపరుల కల్పన లని అలాగ్గా తోసివేసి లోకాన్ని మోసపుచ్చడం యుక్తం కాదు. కాని "ఆదేశపుస్త్రీల కేం లోపం వచ్చింది మనకి రావడానికి?" కని కొందరు సాహసురాండ్రు ఆయా కట్టుబాట్లను అతిక్రమించడం అనివార్యం అవుతూవుంది.

కించిజ్ఞులుగా వుండి సర్వజ్ఞుల మనుకునే కొందరుపురుషులే యీ అతిక్రమణానికి ప్రోత్సాహకులు. అతిక్రమించినా హాని లేనివి కొన్ని వున్నాయి. స్త్రీలు మనదేశంలో కొంతకాలందాకా బాల్యంలో జడవేసుకొనేవారు. వ్యక్తురాలైన పిమ్మట కొప్పు పెట్టుకొనేవారు. ఆ కొప్పుకూడా సంసారిణు లొకమాదిరిగానున్నూ, యితరస్త్రీలు వకమాదిరిగానున్నూ పెట్టుకొనేవారు. యిటీవల జడవేసుకొని దాన్ని చుట్టుకోవడం మొదలెట్టారు. కొన్నాళ్లు ఆ హయాం నడిచింది. యిటీవల మళ్లా జాలుజడలు ప్రారంభించారు. ప్రస్తుతం అదే అమల్లోవుంది. కొందరు తమ ఆడపిల్లలకుపూర్వం మొగపిల్లలపద్ధతిగా గిరజాలుగా కత్తిరిస్తూ వున్నారు. యివికూడా పయికి కొంత వికారంగానే కనపడతాయిగాని పరలోకహాన్ని కలిగించతగ్గంత దురాచారాల కోటిలోకి రావు. యీలాంటిమార్పు లెన్నో యిప్పుడు క్షణక్షణే అవతరించి నీటిబుడగల్లాగ అంతలోనే అంతరిస్తూవున్నాయి. యితరదేశసంపర్కంవల్ల యెన్నో వ్యాధులు యీ దేశానికి దిగుమతీఅయినట్టే ఆచారాలున్నూ అనుకోవాలి. అందులో యిహపరదూష్యాలు వదులుకుని యితరాలు స్వీకరిస్తే బాగుండేది కాని ఆలా జరగడం లేదు. సర్వానికీ సిద్ధమవుతూవుంది ప్రపంచకం. మనదేశాచారాలనిమాత్రం యితర దేశాలవారు స్త్రీలుగాని పురుషులుగాని అవలంబిస్తూవున్నట్టు లేదు. యెందుచేత? యిందులో విధినిషేధాలంటూ వుండడంచేతే అనుకోవాలి. యెవరో అమెరికా స్త్రీ మనదేశాచారా లన్నీ మంచివి కావంటూ వక పుస్తకం వ్రాసిం దని మనదేశంలో వుండే నాయకు లందరూ

యెంతో పరితాపపడ్డారు. పడి పూరుకోలేదు, ఖండన గ్రంథాలుకూడా వ్రాసి యెదురుచున్నారు. సరే సంతోషిద్దాం గాని మనదేశంలో అనాదిగా అలంకారభూతంగా వున్న సిగ్గు-బిడియాలు స్త్రీలకే కాక పురుషులకు కూడా లేకుండా చేసే ప్రయత్నాలు మనవారే దేశాభివృద్ధి కింద చేస్తూవున్నారు. పూరికేచేయడంమాత్రమే కాదు; కంఠపాఠాల్లోను, పిల్లలుకూడా ప్యాసు చేసి తద్వారా సిగ్గుకూడా కలిగిస్తూ వున్నారు. ఫలితం యేలా పరిణమించినా వుద్దేశం దేశాభివృద్ధి కని చేసేది కనక దానికిన్నీ సంతోషిద్దాం. వారి దృష్టిలో వృథాగా ప్రజానాశకమైన బాణాసంచాకాల్పులను పెళ్ళిళ్లు వగయిరాలలో జరగకుండా చేదామనే వుద్దేశం యెందుకు కలగలేదో ? అనుకుంటాను.

* * *

సుమారు నాలుగేళ్ల నాడు యీ బాణాసంచాను నిర్మించే వకవర్తకుని మేడ విశాఖపట్నంలో బాణాసంచా అంటుకొని దానిలో వున్న జనంతో "సహేంద్రతక్షకాయ స్వాహా" గా ఆహుతి అయింది. ప్రతిసంవత్సరమూ యీలాటి విపత్తులెన్నో జరుగుతూ వున్నాయి. దీపావళిపండుగ జరిగిన మరునాడు ప్రతీ ఆస్పత్రినిండా దీనివల్ల గాయపడ్డ జనం కనపడుతూనే వుంటారు. అసలు దీపావళిశబ్దానికి వున్న అర్థం నూనెతో భగవత్ప్రీతికరంగా దీపాలుపెట్టడమే కాని బాణాసంచాకాల్పు కానే కాదు. బ్రిటిషు వారి ప్రభుత్వం రాకపూర్వం తాటాకు టపాకాయలతోటన్నీ కొద్దిగొప్ప మతాబాలతోటిన్నీ యీ వుత్సవం జరిగే దని వినడం. మా చిన్నతనం నాటికి తారాజువ్వలున్నూ లంకాపురులున్నూ వెలిశాయి కాని బాంబులు బయలుదేరి లేదు. యిటీవల యివికూడా బయలుదేరాయి. దేవతాపుత్సవాలుగాని పెళ్ళిళ్లుగాని పీట్లకాల్పులు లేకుండా జరగడ మంటే చాలా న్యూనతగా చూస్తూ వున్నారు. యజమానికి యిష్టం లేకపోయినా వచ్చినచుట్టాలలోవారేనా చేతిడబ్బు పెట్టుకొని యీ బాణాసంచాను సప్లయి చేసి తీయతారు. నా చిన్నతనంలో యీనాంలో శ్రీమన్యం వారింట వకవివాహంలో యీ కాల్పువల్ల చూడడానికి వచ్చినవకమనుష్యుడి కళ్లు పోయినాయి. మనిషిమాత్రం బ్రతికాడు "చావుతప్పి కన్ను లొట్టపోవడం"-యెన్ని యీలాటివి యిటీవల జరిగాయో వివరించి వ్రాయవలసే వస్తే గ్రంథం చాలా పెరుగుతుంది. మద్యపాననిషేధంకంటేకూడా యీ బాణాసంచా కాల్పునిషేధం మొట్టమొదట చేయదగ్గదిగా నాకు కనపడుతుంది. యేకొంచెంగానో లైసెన్సు మూలకంగా వచ్చేది బడె తగ్గినా మద్యపాననిషేధంవల్ల వచ్చే నష్టమూ కష్టం కూడా దీనివల్ల గవర్నమెంటుకు వుండ దనుకుంటాను. మనకాంగ్రెసుమంత్రులు కులాచారాలకూ, వివాహశాస్త్ర మర్యాదలకూ భంగం చేయాల్సిన కొన్ని ప్రయత్నాలుగాని కంటూ చేస్తూనే వున్నారు. యిది వారిదృష్టిపథంలో యెందుకు పడిందికాదో అనుకుంటాను. గృహాలలో తప్ప యీ బాపతు వాడడానికి అవకాశం లేకుండా వకబిల్లు పెడితే దీన్ని యెదురుచూసేవారు అంతగా వుండరు. యెప్పటికో అకారణంగా సంఘటించే విపత్తు యీ బిల్లువల్ల తొలగుతుంది. యీ నిషేధం యేధర్మశాస్త్రాన్నిన్నీ కాని దేశాచారాన్ని కాని భంగించేదికాదు. యిది యెందుకో నిరపరాధులనుకూడా విపత్తులో ముంచుతూవున్న దుర్వ్యసనం. "రామాయణంలో పిడకలవేట్లాట" అన్నట్టు ప్రసక్తిగాని ప్రసక్తిగా యీ సిగ్గూ బిడియం అనే వ్యాసంలో యీ బాణాసంచా కాల్పుగొడవ యెందుకు వచ్చిం దంటే, మొన్న రాత్రి సుమారు పదిగంటలవేళ ఆకాశంమీద లేశమున్నూ మబ్బు లేకుండానే వకవురుము వినపడింది. దీని కారణ మేమిగా వుంటుం దని చర్చించాను కాని నిష్కర్షగా తేలిందికాదు. మర్నాడు రాజమండ్రిలో జరుగుతూవున్న సాహుకారు గృహంలో జరిగే పెండ్లిలో అయిదారు రూపాయిలు వెలగల వకబాంబువల్ల యిరవై తొమ్మండుగురు గాయపడ్డట్టున్నూ, అందులో తొమ్మండుగురు తత్కాలమందే మరణించినట్టున్నూ, ఆ మరణించినవారిలో వకరితల యెక్కడ పడిందీ తెలియనే తెలియనట్టున్నూ, వొక బ్రాహ్మణ కుఱ్ఱవాని కాలు దొరికితే తండ్రి దాన్ని మళ్లా అతికించుకోనే వుద్దేశంతో చేతపట్టుకొని దుఃఖిస్తూ తిరుగుతూ వున్నట్టున్నూ, తక్కిన యిరవై మందిన్నీ ఆస్పత్రిలో వున్నట్టున్నూ యెవరో చెప్పుకుంటూవుంటే విన్నట్టు మామూడో చిరంజీవి చెప్పగా విన్నాను.

యిందులో యేకొంచెమో హెచ్చుతగ్గుంటే వుండావచ్చును. శుభముల్లో జరిగే పెళ్లేమిటి, యీ "స్త్రీసర్వప్రగాఢమిటి" అని తోచి యీవ్యాసంలోనే దీన్ని గురించి రెండుమాటలు వ్రాసి యీ మతాచారాన్ని తొలగిస్తే బాగుంటుందేమో అని మంత్రులకు జ్ఞాపకం చేదామని యిందులో ప్రసక్తిలేని ప్రసక్తిగా దీన్ని యిరికించాను. యిటీవల యీ ఘోరదృశ్యాన్ని చూచినవారు చెప్పినమాటలు పొత్తిగా వినలేకపోయాను.

యెప్పుడో ప్రపంచయుద్ధం వస్తే యీకర్మం చీనాతోపాటు మనదేశానికూడా వస్తుందేమోఅనుకుంటే అప్పటిదాకా యెందుకు? యిప్పుడే వచ్చిం దన్నట్టు మొన్న టిరాత్రి రాజమండ్రీపృశ్యం ఋజువు చేస్తూవుంది. యీదిక్కుమాలిన బాణాసంచా లేనంతమాత్రంచేత పెళ్లికి వచ్చేలోటు లేశమున్నూ కనపడదు. సిగ్గుసిగ్గని చెప్పి నృత్తగీతాలు కొందఱు పెళ్లిళ్లలో పెట్టడం మానేశారు. వృథావ్యయ మనిచెప్పి సదస్యాలు మానుకున్నారు. కర్చుకు చేటని చెప్పి పాంచరాత్రవివాహాలు మానుకున్నారు. యింకా యెన్నో పూర్వులు ఆచరించే ఆచారాలు తగ్గించుకున్నారు. కాని వున్నంత శక్తిలోనే అంతో యింతో బాణాసంచాకాల్పంటూ లేకుండా యేమహాభాందసులయిళ్లలో జరిగే పెళ్లిళ్లు కూడా నాటికి తొంభైతొమ్మిది జరగడమే లేదు. పైని మానుకున్నట్లు వుదాహరించినవాట్లలో అంతో యింతో మంగళసంపాదకత్వం వుందిగాని యీ బాణాసంచాలో అట్టిది లేశమున్నూ వున్నట్టు లేదు. ఆపత్తు అందఱికీ స్పష్టంగా కనపడుతూనే వుంది. దీపావళినాఁటితోపాటు పెండ్లిండ్లలోకూడా దీన్ని మానిపించే ప్రయత్నం జరిగితే బాగుండును. దీపావళిపండుగనాఁడు బాలకులను సంతోషపెట్టడానికి యిటీవల విదేశాలనుంచి వస్తూవున్న కాకరపూవొత్తులు వగయిరాలకు అనుమతి యిస్తే అంత చిక్కులే దనుకుంటాను. యిది మానిపించడం ఆవశ్యక మని తోచేయెడల మఱికొందఱుకూడా వ్యాసకర్తలు వారివారి సమ్మతిని చూపవలసిందనిన్నీ, అన్యథా తోస్తే అన్యథాగానే వారివారి అభిప్రాయాన్ని తెలపవలసిందనిన్నీ అభ్యర్థిస్తాను. దీనివల్ల యివివఱిలో మన భారతజాతికి వున్న సిగ్గుబిడియాలు పోవడంగాని,

లేని [illegible] కూడా [illegible] నా [illegible] కి తోచి [illegible] వ్రాశాను. యీ [illegible] సంస్కారాలకూడదిగా [illegible] పృశ్యశంకకూడా లేదని నాకు తోస్తుంది. [illegible] బాణాసంచా ముచ్చటలు యిప్పటికే కాక [illegible] కూ, పెండ్లికూఁతురికికూడా మోసంతెస్తే [illegible] గదా! అసలా నాశనమునకు ప్రోవ దానికే అవకాశం. యెవరిపెళ్లిలో యీలాటి అమంగళం జరుగుతుందో ఆదంపతుల భవిష్యత్కాలాన్ని గూర్చి [illegible] వుంటుందా వుండదా? [illegible] లో యిట్టి తప్పకాలకు చోటివ్వక మనదేశ ప్రజలలో వుండే గొప్పతనకేకదా తర్కాలెంకి ఇట్టి ప్రజలే ప్రపంచంలో నూటికి తొంభైవంతు లుంటారు. యిట్టిప్రజల కంటికి దివ్యజ్ఞానం కలిగించదానికి కంటూ యెందఱో యెన్నో ప్రయత్నాలు చేసి తుదకు వారి జీవితాన్ని యావత్తూ దానికి ధారపోసి కృతార్థులు కాలేక పోయినట్టు గ్రంథాలు ఘోషిస్తూవున్నాయి. ఘోషించినా చేతనైనంతలో యత్నం చేయడం పరిజ్ఞాతలకు కర్తవ్యమే. అందుచేత పరిజ్ఞాతలు యత్నిస్తూ వుండవలసిందే. కాని ఆప్రయత్నంలో పూర్వులు చేసిన యేర్పాట్లను గూర్చికూడా తఱచితఱచి కాని చప్పన వాట్లను మార్చకూడదు.

అందులోనున్నూ యితరవిషయాలమాట యేలావున్నా వివాహాది ప్రధానవిషయాలు మఱీ ఆలోచించి కాని మార్చకూడదు. అందఱికీ స్వయంవరాధికార ముంటేమాత్రం అది నెఱవేఱడం యేలాగ? యీమధ్య వకసభలో వకాయన వుపన్యసిస్తూ హరిజనులకూ యితర వర్ణస్థులకూ వివాహాలుకూడా జరగడం ఆవశ్యక మని వుపన్యసించినట్టు చదివాను. వకప్రక్కనేమో వేదాధికారంకోసం ద్విజేతరులు ప్రయత్నిస్తూ మళ్లా యీ ప్రయత్న మేమిటి? యెవరికి తోచినట్టల్లా వారు తోవలు తొక్కుతూవున్నారు. స్త్రీలు చేసే సభలలో పురుషులు సర్వథా తమకు అపకారం చేసివున్నా రని తేల్చడమే కాని మఱొకటి కనపడదు. వొకవేళ అర్థాత్తూ ఆయాకాలాల్లో నిష్పక్షపాతబుద్ధితో చేసిన

ధర్మనిర్ణయాలు కొందఱికి యిటీవల బాధకాలుగా పరిణమిస్తే పరిణమించాయేమో కాని నిర్ణేతలు మాత్రం పక్షపాతులు కారనుట ధ్రువము. యిప్పుడు లోకోపకారబుద్ధితో మహాత్మునియంతటి నిస్పృహుఁడు చేసే ధర్మనిర్ణయాలు కొందఱికి బాధకాలుగా ఉండటం లేదా? ఆలాగే అనుకోవాలి.

* * *

అప్పటివారు యెంతసేపు ఆలోచించినా స్త్రీజాతికి ముఖ్యంగా సహజంగా వుండే సిగ్గు బిడియాలకు లోపం రాకుండా వుండే కట్టుఁబాట్లను చేసినట్టు తోస్తుంది. అనులోమవివాహాలే కావాలనేదానిలోకూడా యీ అర్థమే యిమిడివుంది. ఘోషాలోకూడా యిదే యిమిడివుంది యిప్పుడు స్త్రీలైతే స్వయంగా ఆనిర్ణయాలు వదులుకోవాలని కుతూహలపడ్డట్టు లేరు గాని కొందఱు సంస్కర్తలు అదేపనిగా పత్రికలలో వ్రాస్తూవుండడం చూచి యేకొందఱో స్త్రీలుకూడా వారిధోరణిని అనుసరిస్తూ వున్నారు. అనుసరించేవారు నూటికి పదిమందేనా వుండకపోయినా పత్రికలలో పెద్దచేసి ప్రచురించడంవల్ల వాళ్లే యెక్కువగా వున్నట్టు లోకానికి తోస్తుంది. ఆసంస్కర్తలుకూడా కొందఱు విడాకుల చట్టాన్ని యితరదేశస్థులతోపాటుగా యేవగించుకుంటూకూడా వ్రాస్తూనే వున్నారు. వారికి నమస్కరించవలసివున్నది.

సంసారమనేది కప్పలతక్కెడ. యెన్నివుపాయాలు చూపినా యేదోవకలోటు వుంటూనేవుంటుంది. ఆలాటిలోటు లేకుండా చేసేదల్లా వక్క యథాలాభసంతుష్టే. ఆ సంతుష్టిని కలిగించేదల్లా వక్క జ్ఞానమే. పోతరాజుగారేమో,

క. "వ్యాప్తిం జెందక వగవక,
ప్రాప్తంబగు లేశమేని పదివేలనుచున్,
దృప్తిఁ జెందనిమనుజుఁడు,
సప్తద్వీపములనైనఁ జక్కం బడునే?"

అనిచెప్పి తదనుకూలంగా కాలం గడుపుకున్నా జరిగింది. శ్రీనాథుఁడు—శా. అక్షయ్యంబుగ సాంపరాయని తెలుంగాధీశ! కస్తూరికా భిక్షాదానము సేయు" మంటూ కస్తూరిదగ్గిఱనుంచీ భిక్షించినా కాలం జరిగింది. ఆయనసిగ్గులేతనాన్ని అనేకులు అనేకవిధాల పొగడి కీర్తిస్తూవున్నారు. శ్రీనాథుని కవితారచనా విషయంలో యెంత కీర్తించినా యీ విషయంలో పోతరాజుగారికే హక్కు. ఆలాటిప్రవర్తన అందఱికీ అలవడుతుందా? అనేప్రశ్నకు జవాబుచెప్పడం కష్టం, "రామాదివ ద్వర్తితవ్యం, న రావణాదివత్" అనికదా పెద్దలయాదేశము. అందఱును రామునివలె వర్తింపఁ గలరనేనా వారితాత్పర్యం? నేర్చుకోవలసిన గుణాలు ఆలాటివి కాని యితరాలు కావని తెల్పడమే వారి వుద్దేశం. యితరగుణాలు వాటంతట అవే అలవడతాయి. అందుకే—"లోకే వ్యవాయామిష మద్యసేవా జంతోస్తు నిత్యాః" అని యెత్తికొని, "వ్యవస్థితి స్తత్ర" అని పరిసమాప్తి చేశారు ఋషులు. ఆవ్యవస్థ యెంత చక్కఁగా చేశారో అంత చక్కఁగానూ చేశారు. ఆ చేయడంలో స్త్రీలతోపాటు పురుషులనుకూడా కట్టుఁబాటుచేశారు. కాని పురుషులకు బహుభార్యాత్వాన్ని మాత్రం అంగీకరించారు. స్త్రీలకు బహుభర్తృకత్వాన్ని సమ్మతించారు కారు. అది పరంలోమాట దేవుఁడెఱుఁగునుగాని యిహానికే యెంతో హేయంగా వారికి కనపడింది. ఆ కనపడడం సిగ్గుకు సంబంధించినదే కాని వేఱు కాదు. ఆసిగ్గునుగూర్చే దేవీమంత్రబీజాక్షరమనిన్నీ, సాక్షాత్పరదేవతారూపాలలో అది వకటనిన్నీ నేను దీనిలో వ్రాసింది. పురుషులకంటేకూడా ఆ బీజాక్షరజపం స్త్రీలే చేసి నిలపఁదగ్గవారు. కొందఱు దానివిషయంలో అతిక్రమించినా యింకా యెందఱో దాన్ని అవలంబించి యీ భరతఖండమర్యాదను నిలుపుతారనే నా నిశ్చయం. పూర్వమాత్రం అందఱూ దాన్ని కాపాడినట్టు చెప్పఁగలమా? అప్పుడు ఆలాటివారికి సంఘంలో స్థానం వుండేదికాదు. యిప్పుడో? దాన్ని సంపాదించుకొన్నట్టవుతుంది. అంతేకాని దానికి మంత్రబీజాక్షరత్వం యెప్పుడూ నిల్చేవుంటుంది. యెంత వ్రాసినా యింతే. కొన్నాళ్లకు మళ్లా వెనకటిరీతికి ప్రపంచకస్థితి మాఱితే మాఱుతుందేమో? యిప్పటిమార్పు లేవిగాని చిరస్థాయులుగా వుండేటట్టు తోఁచదు. సర్వే జనాస్సుఖినోభవంతు. "హ్రీంకారరూపిణ్యై నమః" స్వస్తి.

వరప్రసాదం

కొడవటిగంటి కుటుంబరావు

కాపరానికి వచ్చిన పన్నెండేళ్లకిగాని కనకమ్మగారికి సంతానం లేకపోయింది. ఆ సత్యనారాయణస్వామివారి కటాక్షం కలగబట్టే అంత ఆలస్యంగానైనా ఆకొరత తీరింది.

నరసింహంగారూ కనకమ్మగారూ పిల్లలకోసం వాచిపోయినారు. చాలాకాలంగా కాపరంచేస్తూ పిల్లలు కలగకపోతే ఏదంపతులైనా సంతానంకోసం వాచిపోవచ్చును. ఇతరులు పిల్లలకోసం తపించటంలోనూ కనకమ్మా నరసింహంగార్లు తపించటంలోనూ చాలా వ్యత్యాసం ఉంది.

కనకమ్మగారికి పట్టిఉండినదిగు లేమంటే సంతానం కలగకపోవటం తన స్త్రీత్వానికే అవమానకరంగా ఉండినట్టు భావించిం దామె. అందరూ పిల్లల్ని కంటున్నప్పుడు తను కనకపోవటం సాటి ఆడవాళ్లలో తనకు అవమానకరమైనవిషయం కాదా మరి?

"కొందరికి కడుపులైనా పోతై!" అంటూఉండే దామె. ఆవాక్యంలో అపారమైన అర్థం కనిపిస్తుంది నాకు. ఆవాక్యంమీద ఎంతపెద్ద గ్రంథమైనా రాయవచ్చు ననుకుంటాను. "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" అనే ముక్క తలుచుకుంటే మహాస్వాములవారు ఎట్లా ఉద్రేకపూరితులౌతారో, కనకమ్మగారి మాటలు తలుచుకుని నేను అంత తన్మయుణ్ణి అవుతాను. కాని అనేక కారణాలవల్ల కనకమ్మగా రన్న వాక్యంలో ఉన్న వివిధ భావాలను పాఠకుల కుశాగ్రబుద్ధికి వదలి పై కథ కుపక్రమించుతాను.

పోతే నరసింహంగారికిన్నీ కొరతగానే ఉండింది పిల్లలు లేకపోవటమనేది. కొందరు పిల్లలకు బొమ్మలు ఎట్లా కావాలో కొందరు పెద్దలకు కూడా పిల్లలు అట్లాగే కావాలి—ఆడుకోవటానికి. నరసింహంగారు ప్రాణంగల బొమ్మలకోసం కలవరించాడు.

ఎట్లాగైతే నేం కాపరానికి వచ్చిన పుష్కరానికి కనకమ్మగారికి నెలతప్పింది. నలుగురూ సంతోషించారు. నరసింహయ్యగారి ఉత్సాహం చూసి నలుగురాడవాళ్లూ నవ్వుకోలేక ఇదయినారుకూడాను.

ఒకనాడు కనకమ్మగారికి వింతకల వచ్చింది. ఆవిడకు నామాలవాడు కలలో కనిపించి "నాదయవల్ల నీకు మగపిల్లవాడు పుడితే నా పేరు పెట్టుకుంటావా?" అని అడిగాడు. మర్నాడు భార్యాభర్త లిద్దరూ కూడబలుక్కుని మగపిల్లవాడే కలగాలి కాని తప్పకుండా ఆస్వామిపేరు పెట్టుకుందా మనుకున్నారు. ఆసాయంకాలమే కనకమ్మగారు బయట ఉండింది!

"మే మంటే వెంకటేశ్వరస్వామికికూడా వేళాకోళ మయిందిగదా!" అని విలపించింది కనకమ్మ ఎడంగా కూర్చుని.

అనేకమంది దేవతలుండటంకూడా ఒకందుకు మంచిదే సందానూ. ఆంధ్రదేశాని కంతాకూ ఒక్క వెంకటేశ్వరస్వామే ఉంటే ఆ దంపతుల గతి ఏమై ఉండును! డాక్టర్లలో పరస్పరం ఉండే ఈర్ష్య దేవతలలో కూడా ఉండి ఉంటుంది. నరసింహంగారికి సంతానం ప్రసాదించటం వెంకటేశ్వరస్వామి వల్ల ఎప్పుడైతే కాకపోయిందో అప్పుడు శ్రీ సత్యనారాయణస్వామివారు వెంటనే తనఏజంటును నరసింహంగారింటికి పంపారు. కనుక ఆ ఏజంటు ఎవరో పంపినట్టే వచ్చాడు. ఆయన వస్తూవస్తూనే నరసింహంగారి ఇంటి లోపలి అరుగుమీద కూర్చుని వేదోక్తంగా ఆశీర్వదించాడు గృహస్థును. ఆతరవాత కనకమ్మగారిని చూసి "అంతా క్షేమంగా ఉన్నారా, తల్లీ?" అన్నాడు. ఆతరవాత "కాస్తస్నానంచేసి సంధ్యావందనం చేసుకుంటాను. నుయ్యి ఎక్కడ?" అని అడిగి ఆ కార్యకలాపంలో పడిపోయినాడు.

మళ్లీ భార్యాభర్త లిద్దరూ కూడ బలుక్కుని "ఈయన ఎవరో దేవుడల్లే వచ్చాడు. భోజనానికి ఉండిపొమ్మందాం!" అనుకున్నారు.

"సత్యనారాయణవ్రతం చేసుకోండి. మీకు పిల్లలు ఎట్లా కలగరో చూస్తాను!" అన్నా డా బ్రాహ్మడు భోజనాలప్పుడు.

నరసింహంగారూ, కనకమ్మగారూ సత్యనారాయణవ్రతం చేసుకున్న తరవాత సంవత్సరం వెళ్లకపూర్వమే కనకమ్మగారికి మళ్లీ నెలతప్పింది. ఈసారి కనకమ్మగారికి గర్భం నిలిచిందికూడాను. కాని ఆతొమ్మిదినెలలూ గడిచిపోయిన షోకడలు సంతానవాంఛ ఉన్న మనిషికి ఉచితమైనవికావు. ఆవిడకు నేవిళ్లే సరిపడలేదు.

అన్నితత్త్వాలూ ఒకటిగా ఉండవు. కొందరికి జబ్బే రాదు. అసలుజబ్బురావటమూ, రాకపోవటమూ, వచ్చినతరవాత అది త్వరగా నయం కావటమూ, కాకపోవటమూ డాక్టరు చేతిలోకంటె మన చేతిలోనే ఎక్కువ ఉంటుంది. ఒక్కరోజు జ్వరంతో మంచాన్ని కంటుకుపోయినవాళ్లున్నారు. నాలుగైదు లంఘనాలు చేసికూడా పైకి కనిపించనివారున్నారు. ఒక్కపూట భోజనం మానేసి బిక్కమొహం వేసేవాళ్లే ఉన్నారు. ఎవరేమైతేనేం? కనకమ్మగారు కేవలమూ నేవిళ్లతోనే పీను గయిపోయింది.

ఆతరవాత నెలలు గడిచినకొద్దీ ఆవిడ నస ప్రారంభించింది: "ఏంకడుపు లమ్మా? దిక్కుమాలిన కడుపులూ!...కడుపులు రాకుండా పిల్లలు పుట్టరాదూ?" అని. అదివరకల్లా కడుపుతో ఉండినవాళ్లను చూసి అసూయపడ్డ కనకమ్మ ఇప్పుడు ఊరికే ఉన్నవాళ్లను చూసి అసూయపడ్డది. అనేకమంది కడుపుతో ఉండి కళకళ లాడేవారు. తను ఏబ్రాసల్లే ఉండటం దేనికో ఆవిడకు అర్థం కాలేదు. అట్లా ఉండకపోవటం తనపొరపాటే అయిఉండవచ్చునన్న అనుమానం ఆవిడకు తట్టింది, కాని అది ఎవరూ నిరూపించ లేరని తెలుసుకుని ఆవిడ నిశ్చింతగా ఉండింది. (ఇంకొకరు నిరూపించలేనంతకాలమూ తప్పులు చెయ్యటానికిగాని, అశక్తతతో ఉండటానికిగాని ఎవరి కభ్యంతరం ఉంటుంది?)

ఏడోనెల గర్భిణిగా ఉండగా కనకమ్మగారికి అగ్నిపరీక్షగా ఆవిడఅన్నా, అన్న

భార్యా, అన్న అత్తగారూ ఏదోపనిమీద తమయింటికి వచ్చారు. కనకమ్మ పోకడలు చూసి ఆవిడఅన్న అత్తగారు "ఇదేమిటమ్మా, కనకమ్మతల్లీ? ఇలా అయితే నేను పది హేను మంది నెలామోశానూ?" అని నీతులు ప్రారంభించింది. అది చాలనట్టు కనకమ్మగారి వదినెగారు కూడా ఆరునెలల గర్భిణీగా ఉండింది. ఆవిడ మొహాన ఎప్పుడూ సంతోషమూ చిరునవ్వూ తాండవిస్తూ ఉండేవి. తన అన్న ఆ భార్యని పువ్వుల్లోపెట్టి చూచుకోవటం చూస్తే కనకమ్మవళ్లు భగ్గున మండింది. ఆముగ్గురూ తమయింటో ఉన్న రెండు దినాలకాలంలోనూ చూడవచ్చిన అమ్మలక్కలంతా తనవదినెగారి ఆరునెలల గర్భాన్ని చూసి ఏమి మురిశారు! ఏడునెలల గర్భిణి తన మొహాన ఏమొద్దులూ లేవు!... నకాలానికి కనకమ్మగారు మగపిల్లవాణ్ణి కన్నది. ఆ కుర్రవాడికి రేపు బారసాల అనగా నరసింహంగారి కలలో సత్యనారాయణమూర్తివారు ప్రత్యక్షమై "నాఅనుగ్రహంవల్ల పుట్టిన యీపిల్లవాడికి నాపేరు పెట్టుకో" అని సలహా ఇచ్చారు.

ఆప్రకారమే నరసింహంగారు బియ్యంలో "సత్యనారాయణ వరప్రసాదు" అని రాశాడు. ఆయన ఆపేరు రాశాడో లేదో తల్లిచేతుల్లో ఉన్న గుడ్డు ఒక్కకేక పెట్టి నిశ్చలంగా ఉండిపోయినాడు. అందరూ గొల్లుమన్నారు. ఈ గలభాలో ఒక పూర్వసువాసినికి పూని ఆవిడ కేకలువేయటం మొదలు పెట్టింది. వెంకటేశ్వరస్వామి ఏదో అంటున్నాడని అందరూ సావధానులై విన్నారు. వెంకటేశ్వరస్వామికి చాలాకోపం వచ్చింది. తనపేరు పెట్టుకుంటా మని వాగ్దానం చేసి ఏమిటి "నరసింహాయి" ఉద్దేశం? ఇప్పటికైనా పిల్లవాడికి తనపేరు పెడతాడా? తను ఏంచేసేదీ చూస్తాడా?

మరి వెంకటేశ్వరస్వామి ప్రత్యక్షదైవము. ఇతరులకు వాగ్దానాలు చేసి తప్పినా గాని వెంకటేశ్వరస్వామితో కుదరదు. కోర్టుకు ఈడ్చేరకం!

సరే, నలుగురూచేరి పిల్లవాడికి వెంకటనారాయణ అని ఒప్పుకునేసరికి పిల్లవాడు ఏపని చేలేదు!...

ఇద్దరు దేవతల దయవల్ల భూమిమీద పడి ఆ ఇద్దరిపేర్లూ తనపేరు చేసుకున్న ఆ కుర్రవాడు ఎంతగొప్పజాతకుడో అని అందరికీ అనుమానం రావచ్చును. ఒక వైష్ణవుడు రాసిన జాతకంలో అతను చాలా గొప్ప జాతకుడని మళ్లీ మళ్లీ చెప్పబడిఉంది.

ఉదాహరణకు ఆయుర్భావం అనే ఘట్టంలో ఈవిధంగా ఉంది —

"ఆయుష్యాధిపతియైన చంద్రుడు (గ్రామ్యంగా "చంద్రుడు" అని రాసినా తప్పులేదు!) పంచమకోణమునందు యున్నందున్నూ కారకుడు సుఖస్థాన స్థితియందు యున్నందున్నూ యీజాతకునికి పరమాయుర్దాయము యున్నది" అని మనకు సులభంగా అర్థమయ్యేటందుకు "దీర్ఘాయుర్యోగః ... భవతి" అని సంస్కృతంలో ఉంది.

ఆవిధంగానే "అన్యజాతకస్య ధనాభావః" అనే ఘట్టంలోకూడా డబ్బును గురించీ దనకాన్ని గురించీ చాలా విశేషంగానే చెప్పబడి ఉంది.

ముందుముందు కుర్రవాడేమవుతాడో గాని ఇప్పటిమటుకు వాడిసంగతి నాకేమీ బాగాలేదు — ఇంకొకరిగొడవ నాకెందుకు?

వాడికి రెండునెలలు వెళ్లింది లగాయతు ఈనాటివరకూ వాడితల్లిదండ్రులు ఎవరి మటుకు వారు వాణ్ణి తనవాణ్ణి చెయ్యాలని ఒకరొకరితో ఘోరంగా పోట్లాడుతున్నారు. వాణ్ణి ఆ ఇద్దరూ చెరొక రెక్కా పట్టుకుని చెరొకవైపూ లాగినా వాడి కంత అపకారం జరగకపోను.

వాడు తండ్రిపోలిక అని అంటే తల్లికి మంట. తల్లిపోలిక అంటే తండ్రికి కోపం. తండ్రిమాట వింటే వాణ్ణి తల్లి కొడుతుంది. తల్లిమాట వింటే తండ్రి తిడతాడు. వాణ్ణి తల్లి కొడితే తండ్రి సముదాయిస్తాడు. తండ్రి తిడితే తల్లి ఓదార్చుతుంది. భార్యాభర్త లిద్దరిలో ఏఒకరు వాణ్ణి ఏంచేసినా రెండో వారు పోట్లాటకు వస్తారు.

ఈ ఇద్దరిమధ్యా వెంకటనారాయణకు ప్రవర్తన అనేదానికి సూత్రం తెలియకుండా పోయింది. ఏది చేస్తే ఎవరు తప్పపడతారో, ఎవరు తప్పపట్టటంకంటె ఎవరు తప్పపట్టటంలో ఎక్కువన్యాయం ఉందో తెలియక వాడు వట్టివాజమ్మగా తయారయినాడు. వాడికి ఆవగింజంత ఆత్మవిశ్వాసంకూడా లేదు. తను ఏదిచేసినా తప్పవుతుందని వాడికి తెలుసును — సాధారణంగా అవుతుంది కూడానూ! వాడు తన్నుతాను మరిచిపోలేని జబ్బుతో బాధపడుతూ ఉండటం నేను గమనించాను. వాణ్ణి పలకరిస్తే సమాధానం చెప్పటానికి భయపడతాడు. రెండక్షరాల సమాధానం చెప్పవలసివస్తే ఎంతకన్న చిన్నది ఒకఅక్షరం సమాధానం ఏమైనా ఉంటేమోనని ఆలోచించటం ప్రారంభిస్తాడు. తనసాటివాళ్లతోకూడా వాడు నిశ్చింతగా నవ్వలేడు. ఎవరన్నా తను మాట్లాడటం వింటున్నారని తెలిస్తే మతిపోయి మాట తడబడుతుంది. ఎవరన్నా చూస్తుండగా వాడు సరిగా నడవనైనాలేడు లోకమంతా తన మీద సానుభూతి లేని విమర్శకులతో నిండి ఉందని నమ్మినవాడల్లే కనిపిస్తాడు. పాపం, వాడు నవ్వినా మూతి ఒకపక్కకు తోసుకుపోతుంది!



స్త్రీలకు లేఖలు: ౨.

సామ్యవాదము

కొచ్చెర్లకోట సత్యనారాయణమూర్తి

సోదరీ !

మొన్నటి నా లేఖను నీవు కడవరకూ చదివియే ఉందువు. ఆడవాళ్లు చదువుకుంటా రని గ్రంథాలు వ్రాయడం, అవి మా యింట నీళ్లు కాచుట కుపయోగ పడడం మామూలు. ఈలేఖలు కూడా అందుకే వుప యోగపడతా యేమో నే నెరగను.

"సోషలిజము" (సామ్యవాదము) అంటే మన లోకవిఖ్యాతమైన భయ మేర్పడింది. రాజమహేంద్రవరం పేరు చెప్పగానే వీరేశలింగంపంతులూ, విధవావివాహాలూ జ్ఞాపకం వచ్చినట్లే "సోషలిజము" పేరు చెప్పగానే రష్యాదేశమూ, బీదసాదల తిరుగుబాట్లూ, కుట్రలూ, దౌర్జన్యాలూ, తుపాకులకాల్పులూ, నిరాయుధులైన ఆడ వాళ్ల పిల్లల శవాలూ, నెత్తురుకాలవలూ జ్ఞాపకం వస్తాయి. మన పాఠకజనంకూడా ఆవిధంగానే తిరగబడి మనతలలు బద్దలుకొట్టవచ్చునన్న భయం అనేకులకు వుంది. మన "సోషలిస్టు"లలో (సామ్యవాదులలో) చాలా మందికి రష్యాదేశంలో మోస్తరుగా మనదేశంలోకూడా నెత్తురువరదలను కళ్లచూస్తేనేగాని దేశానికి మోక్షం రాదన్న నమ్మకం లేకపోలేదు. ఒకకధ చెప్తాను విను.

పూర్వం వకదేశంలో వకవూరు కాలిపోయింది. అందులో వకపందిపిల్ల కాలిపోవడం తటస్థించింది. కాలి వేడిగావున్న ఆపందిపిల్లపైన వకబుద్ధిమంతుడు పొర పాటున వేలుపెట్టి, వేడిని చల్లార్చుకోడానికి ఆవేలిని తననోటిలో పెట్టుకున్నాడు. అది చాలా రుచిగా వుండ డంచేత వూరివా రందరూకూడా అదేవిధంగా పంది మాంసం రుచిచూడసాగారు. వూరిని తగలబెట్టి, అందులో పందిని కాల్చి, దానిపైన వేళ్లుంచి, నోట్లో పెట్టుకుంటే రుచిగా వుంటుం దని అచ్చటి బుద్ధిమంతు లందరూ గ్రహించి చుట్టుపక్కలవున్న వూళ్లను తగలబెట్టి పందిమాంసమును అవిరంగా రుచి చూడడం మొదలుపెట్టారు. చిమ్మట కొంతకాలానికి వూళ్లను తగలబెట్ట నక్కరలేకుండా పందినిమాత్రం కాల్చితిన్నా రుచిగానే వుంటుం దని గ్రహించారు.

రష్యానుసరించి చిలుకపలుకు లుపన్యసించే మన సోషలిస్టులకథకూడా ఈవిధంగానే వుంది. రష్యాదేశమే పుణ్యభూమి అనీ, మాస్కోనగరమే కాశీ, రామేశ్వరం, జగన్నాధములనీ వాదించే సోషలిస్టులతోటీ, భగవంతు డనీ, భూతదయ అనీ, మానవప్రేమఅనీ మనస్సులో ఏకో శాన్నీ లేకపోయినా విగ్రహారాధన పనికిరాదని గాలితో పోట్లాడే బ్రహ్మసమాజపు పాదికీలతోటే మనకు పని లేదు.

సామ్యవాదం ప్రారంభమైన కొత్తలో ఐరోపా ఖండ మంతటా యుద్ధాలూ, విప్లవాలూ సర్వసా మాన్యంగా వుండడంవల్ల యీ వుద్యమంకూడా చాలా దేశాలలో అడేధోరణిని అభివృద్ధిచెందడం తటస్థిం చింది. పైగా ఏదేశంలోనైనా ధనికులు తమహక్కు లనూ ఆస్తులనూ కాపాడుకోడానికి కొంత దౌర్జన్యం ప్రయోగించక మానరు. అది ఎంతవరకు సాగుతుంది, ఎంతవరకు తప్పుతుంది అనుప్రశ్నలకు సమాధానం ఒక్కొ క్క దేశాని కొక్కొక్క తీరుగా వుంది. అందునుగురించి ప్రతిదేశంలోనూ సహృదయులు తీవ్రంగా ఆలోచిస్తు న్నారు. ప్రస్తుతం మన మాలోచించవలసినవిషయం సామ్యవాదముయొక్క తత్త్వం. అంతేకాని సామ్య

వాదం అమలులోకిరావడానికి వకరి నొకరు చంపుకో వడం ఎంతవరకు అవసరం అని కాదు.

ఏ మేటికా దేశంలో ఉత్పత్తి అయ్యే ధనసంపదను ఏవిధంగా పంచాలి? మన కెంత వుండాలి? మన పక్కయింటివారి కెంత వుండాలి?

"ఈ విషయాలనుసరించి మన మిప్పుడు కొత్తగా ఆలోచించవలసిన అవసరం ఏమిటి? తరతరాలనుంచీ వస్తూవున్న ఏర్పాట్లూ, దొరతనంవారి చట్టాలూ, నిబంధనలూ లేవా? పైగా ఆలోచించడానికి మన మెవరం? మన కెందుకీ గొడవ అంతా?" అని నీ వడగవచ్చును.

సంఘమూ, సంఘంతోపాటు అందున్న ప్రతి సంస్థా ఏ మేటికా మారిపోతున్నాయి; మనకు తెలియకుండానే, మనం అనుకోకుండానే, మన కళ్లయెదుటనే మారిపోతున్నాయి. చంటిపిల్లవాడు మనకు తెలియకుండా మన కళ్లయెదుటనే యెత్తూ, లావూ ఎదుగుతున్నాడు. వాడి చొక్కాలు ఏ మేటికా విప్పించి కుట్టించి చివరకు చాలక పారవేస్తున్నాము. అల్లాగే సంఘంలో వున్న ప్రతిసంస్థనూ ఎప్పటికప్పుడు మారుస్తూనే వున్నాము. ఒక్క వివాహంవిషయమై ఆలోచించు. అటు హరవిలాస శారదా, డాక్టరు దేశముఖులు మొదలు, ఇటు గుడిపాటి వెంకటచలం వరకూ ఆ కట్టుబాటును ఎందరు ఎన్నివిధాల లాగి, తుంపి, చించి ఛేదించడానికి ప్రయత్నిస్తున్నారో చూడు! ఈజమీందారీలు ఎప్పుడూ ఈవిధంగా వుండినవి కావు. ఈవర్తకవ్యాపారాలు ఎప్పుడూ ఈవిధంగా జరిగినవనిన్నీ కాదు. ఆదాయపుపన్ను, ఉప్పుపన్ను, నీటిపన్ను— ఇవి కడచిన ౬౦, ౭౦ ఏళ్లలో అనేకసార్లు హెచ్చినవి, తగ్గినవి, తిరిగి హెచ్చినవి. ౮౦ ఏళ్లకు పూర్వం ఇంగ్లాండులో విలియం న్యూమార్చి అనువాడు "సంఘంలో వున్న తారతమ్యాలను సరిచేయడం పన్నుల వుద్దేశం కాదు" అని చెప్పియున్నాడు. ఈనాడు పన్నులమూలకంగా భాగ్యవంతులవద్దనుంచి అధికంగా ధనం వసూలుచేసి బీదసాదల ఉపయోగార్థం వెచ్చించడానికి మనం అలవాటుపడుతున్నాము. [illegible] ఆటవికం తర్వాత [illegible]వాదం వచ్చేటట్లే

సంఘంలో వున్న ప్రతిసంస్థా యథాప్రకారంగా యేమార్పులూ లేకుండా యే మేటికా జరిగిపోతూవుండని మన మనుకోవడం పొరపాటు. మనతాతలరోజులవలె మన రోజులు లేవు. మనరోజులవలె మన మనమలరోజులుండవు. మన ప్రయత్నంతో నిమిత్తం లేకుండానే మార్పులు వస్తున్నాయి. వాటిని ఆపడానికి మనతరం కాదు. ఆ మార్పులు ఏవిధంగా వస్తే బాగుంటుంది? అన్నదే మన మాలోచించగలిగిన విషయం. (ఈ సూత్రం నీవు బాగా గ్రహిస్తే సామ్యవాదతత్వం సులువుగా బోధపడుతుంది.)

ఇతరవిషయాలతోపాటు ధనసంపదయొక్క విభజననుసరించికూడా అభిప్రాయాలు మారుతున్నాయి. ప్రస్తుతం అమలులోవున్న యేర్పాట్లు అన్యాయమైనవనీ, అనర్థదాయకాలనీ, అసంతృప్తికరాలనీ అనేకులు మొరపెడుతున్నారు. అందునుసరించి ఎవరికి వారు ఆలోచించడం అవసరమవుతోంది. ప్రజల భావాల ప్రకారం రాజ్యాంగవిధానం నడిచేరోజులు సమీపించాయి. నిన్నటి రాజద్రోహులు నేడు దేశపరిపాలకులౌతున్నారు. "నాకెందుకీగొడవలు"ని నిర్లక్ష్యం చూపడానికిది తరుణం కాదు. నీయిల్లు, పొలము, తిండి, బట్ట — వీటిననుసరించిన సమస్యలనేకము పరిష్కారమవుతూవున్న రోజు లివి. వీటిననుసరించి నీవు తగినంత శ్రద్ధను చూపకపోవడంచేత స్వార్థపరులు నిన్ను జోకొట్టి నిద్రపుచ్చి రాజ్యాంగవ్యవహారాలను తమకు లాభించేటట్లు దిద్దుకొంటున్నారు. వారు తమబాగును చూచుకుంటారు గాని నీబాగును చూడరు. ఈయల్లరులలో తుదకు నీవం తేమియును మిగులకపోవచ్చును. నీ యెరుకలో యెంతమంది స్త్రీలు మహాంతస్తుల మేడల నుండి పేదరికమునకు దిగలేదు? వారుకూడా మొదట నీవలెనే "ఈ బీదసాదల గొడవలు నా కెందుకు?" అని నిర్లక్ష్యము చూపినవారే! సోషలిస్టు లంటే అసహ్యించుకొన్నవారే! మొదటిలోనే వారికి సహనమూ-దూరదృష్టీ వుంటే చివర కీగతి వారికి తప్పియుండును గదా! కాబట్టి "నా కెందు కీ గొడవ"లని నిర్లక్ష్యం తగినదికాదు.

ఈ పీసైనున్న రామమ్మగారికి పొలంకు కొయ్యా బస్తాలు ధాన్యం రాబడి. ఒక్కడే కొడుకు, ఖర్చు లేదు. కష్టపడవలసిన అవసరం లేకుండా కాలిమీద కాలు వేసుకుని హాయిగా కాలం గడిపిపోతూవుంది. ఆపీసైనున్న వెంకమ్మ పేదవితంతువు. ఎనమండుగురు పిల్లలు. మొగుడు రోగంతో మంచంపట్టినాడు. రోజుకు పావలా కూలిపనివల్ల సంసారం జరుగుతోంది. ఈ ఏర్పాటువు మార్పుచెం వెంకమ్మ కిష్టమేగాని రామమ్మ కిష్టంలేదు. ఇష్టం లేకపోయినా ఈమెపైకం కొద్దిగానో గొప్పగానో ఆమెకు ఏదోరూపకంగా ముడుతూనే వుంది. రామమ్మకుగాని, ఆమెకొడుకుకిగాని రోడ్లతో పని లేదు; కాలిబాట చాలు నంటుంది. తనకొడుకు వక్కడి కోసం వీధిబడి అక్కరలేదు. ప్రైవేటు మేష్టరును పెట్టి చదువు చెప్పించుకుంటుంది. రాత్రిళ్లు వీధిలో దీపాలు ఆమె కక్కరలేదు. ఇంటిచాకలిచేత కాగడావేయించు కుని వెడుతుంది. మునిసిపలునౌకర్లూ, యూనియన్ బోర్డు నౌకర్లూ, వూళ్లో చేసే చాకిరీ అంతా ఆమె తన మట్టుకు తాను సొంతనౌకర్లచేతనే చేయించుకుంటుంది. వెంకమ్మ కాతాహతులేదు. వీధిబడి, రోడ్లు, వీధులలో దీపాలు, వీధులను తుడిచేవాళ్లు, పోలీసువాళ్లు — వాళ్లందరిసహాయం ఆమెకు కావాలి; గాని వాళ్లకు జీతాలివ్వగల త్రాణ ఆమెకు లేదు. కాబట్టి వాళ్లకు జీతాలివ్వడానికి రామమ్మవద్దనుంచి పన్నుపేర కొంతద్రవ్యం వసూలు చేసి వెంకమ్మసౌకర్యంకోసం ఖర్చు పెడుతున్నాం. అంతే కాదు, రామమ్మవద్ద వెంకమ్మ ఋణం చేసి తీర్చుకోలేకపోవడంచేత వడ్డీని కొట్టివేస్తున్నాము. కాని వెంకమ్మదరిద్రం అంతటితో తీరడంలేదు. కాబట్టి అటువంటి వ్యత్యాసాలను తొలగించడానికి ఇంకేదైనా ఏర్పాట్లు చెయ్యకతప్పదు. ఏవిధంగా చేస్తే బాగుంటుంది ?

బెర్నార్డుషా అనునతడు ఏడువిధాలైన ఏర్పాట్లను సూచించాడు.

౧. ఎవరు శ్రమపడి ఉత్పత్తిచేసే ధనం వారిదే. ఇది న్యాయమేకాని యెవరెంతమొత్తం ఉత్పత్తిచేస్తున్నారో తెలుసుకోవడ మెట్లా? మన కళ్లయెదుట వున్న సరుకులకు మదింపు కట్టవచ్చును. కాని సేవ కలుగచేసే సేవకు విలువకట్టడం అసాధ్యం. [illegible] చేనేత కార్మికుడు [illegible] [illegible]. పొలంలో పనిచేసే కూలివానికి రోజు [illegible] గలం: పెద్ద [illegible] [illegible] [illegible] రూపాయలు; పెద్ద [illegible] [illegible] రూపాయలు; [illegible] [illegible] నాట్యానికి కూలి [illegible] రూపాయలు. కాని ప్లీడరు, డాక్టరు, సినిమానటి — వీళ్లు చాలాకాలం శ్రమపడి విద్యలను సంపాదించడం, నాట్యం నేర్చే మొత్తాలను రోజుకూలి అనిగాని, గంటకూలి అనిగాని లెక్కవేయడం న్యాయంకాదు. అంతేకాదు పోవడం మెందుకు ? సొద్దగృహిణి ఇంట్లో చాకిరితో సులిగిపోయే యిల్లాలిపనికి ఏదుకట్టడం యెట్లా? "అది చేసే దాసీపని కింత: వంటపని కింత: పిల్లలను సాకినందు కింత: పైపనులు చక్కపెట్టినందు కింత; ఇతరపరిచర్య కింత" అని మనం లెక్కపెట్టడం లేదు. కాని దేశంలోవున్న ధనసంపదను విభజించేటప్పుడు ఇల్లాలిపనిని ప్రత్యేకంగా లెక్కపెట్టాలి. అట్లా చెయ్యకపోవడం చేతనే "బతికి నన్నాళ్లూ మే మెంతకష్టపడ్డా తిండీ గుడ్డా తప్ప మా కేమీ వుండడంలేదు. మాలెక్కలలో శక్తులు తగ్గడంతోటే మా బతుకులు ఇతరుల దయాధర్మ భిక్షాలమీద ఆధారపడి వుంటున్నాయి. సంసారం బాగుకోసమని మా రక్తప్రాణాలు ధారపోసినా చివరకు మాకు మనువర్తికైనా గతిలేకుండావుంది. మాకు ప్రత్యేకం ఆస్తి వుండితీరాలి" అని ఆడంగులు పోట్లాడుతున్నారు. అది వేరేకథ.

పర్యవసానం ఏమిటంటే ఎవరికి వారు ఉత్పత్తి చేసే సరుకులయొక్కగాని, వ్యయముచేసే కాలము యొక్కగాని విలువనుబట్టి ధనసంపదను విభజించడం అసాధ్యమైనపని.

౨. ఎవరి అర్హతకు తగినట్లు వారికి అన్నది రెండవ పద్ధతి. సత్ప్రవర్తన కలిగి శ్రద్ధగా, పొదుపుగా, దుర్గుణాలేమీ లేకుండా వళ్లు వంచి పని చేసుకొనే వాళ్లకే ఐశ్వర్య మనిన్నీ, అసత్యము, సోమరితనము, త్రాగుడు, జూదము, దుబారాఖర్చు మొదలైన దుర్గ

ణా లున్న వాళ్లకు ఐశ్వర్య ముండ దనిన్నీ జాతక చక్రం సరిగా నడుస్తూవున్న అదృష్టవంతుల వాదన. యోగ్యతనుబట్టే ఐశ్వర్యమైతే లోకంలో అయోగ్యతకు స్థాన మేది? దుర్మార్గతకు దుర్నీతికి అగత్య మేది? సన్మార్గులు దరిద్రులుగాను, దుర్మార్గులు ఐశ్వర్యవంతులుగాను ఎందు కుంటున్నారు? పైగా సత్ప్రవర్తనకు ఫల మైశ్వర్యమైతే పుట్టుకతోనే యీ తారతమ్యా లెందు కుండాలి? కొందరు ఆగర్భ శ్రీమంతు లేల? మరికొందరు ఆగర్భదరిద్రు లేల? ఎన్ని తరాలవర కీ లెక్క? ఎవ రెంత ధనానికి అర్హులో నిర్ణయించడ మెట్లా? బడిపంతులికి నెలకు పదిరూపాయ లిస్తున్నాము. సినీమానటికి నక్క ప్రదర్శనానికి పదివేలరూపాయ లిస్తున్నాము. "ఎంతమంది బడిపంతుళ్లు వక్క సినీమానటికి సమానము?" అను నోటిలెక్కకు బదులు చెప్పడ మెట్లా? అర్హతనుబట్టి ధనవిభజన చేయడం అసాధ్యమైనపని. ప్రయత్నించి లాభంలేదు.

3. ఎవరిచేతికి అందినది వారిది అన్నది మూడవ పద్ధతి. అందరకూ సమానంగా తెలివితేటలూ బలమూ వుంటే అందరకూ సమానమైన అవకాశాలు వుంటాయి. ఎవరికీ లోపం జరగదు. కాని అది సాధ్యమా? పిల్లులమోస్తరుగా పోట్లాడుతూ ఎంత కాలం జీవించడం?

కాని ప్రపంచనాటకం కొంతవరకు ఈపద్ధతుల మీదనే నడుస్తూవుంది. దొంగతనం చేస్తే రాజదండన వుంది గాని తప్పతూనికలు, హెచ్చుధరలు, కల్తీసరుకులతో మోసంచేసే సాహుకారుకు ఏ ఆటంకమూ లేదు. వ్యవహారసరళిలో నోరున్నవారు నోరు లేని వారిని నిరాటంకంగా మోసాలుచేస్తున్నారు. వాటిని అరికట్టడానికి కొంతవరకు ప్రయత్నాలు చేస్తున్నాము.

మొత్తంమీద అరాజకాన్ని కూడా వకపద్ధతిగా అంగీకరించడం భావ్యం కాదు. కాబట్టివదిలివేద్దాము.

౪. కొద్దిమంది పెద్దమనుష్యులకు ఐశ్వర్యమూ, అధికారమూ, ఆధిక్యతా యిచ్చి వారి ఉన్నతపదవులను నిలబెట్టడానికి వారికి విస్తారమైన ఆదాయాలను, వారికింద పనిచేయడానికి మనిషిసిబ్బందిని ఏర్పాటు చేయడం నాల్గవపద్ధతి. ప్రపంచచరిత్రలో ప్రతిదేశంలోను సంఘనిర్మాణం ఈపద్ధతులమీద జరపడానికి అనేకసార్లు ప్రయత్నాలు జరిగాయి. అందువల్ల అనేకలాభాలు చూపుతున్నారు. ఉన్నతవిద్య, జ్ఞానము, పరిపాలనాదక్షత, కులగౌరవము, మర్యాద మొదలైన సుగుణాలతో శోభిస్తూ దేశం యొక్క సత్పరిపాలనకు కుడిభుజాలై యుండి, వాఙ్మయము, కళ, శాస్త్రము, వేదాంతము, మతము మొదలగు విజ్ఞానశాఖలకు పోషకులై సత్ప్రవర్తనకు, నాగరికతకు, ఉన్నతభావాలకు, నిష్కలంకజీవితానికి ఆదర్శప్రాయులైన యీతరగతివారు దేశానికి అమూల్యాలంకారాలనీ, అంతకంటె ముఖ్యమైన విషయం, వారిసొంతఖర్చులు పోను అధికంగా ద్రవ్యం వారివద్ద పోగవుతుంది కాబట్టి ఆమొత్తమంతా దేశాభివృద్ధికి మూలధనంగా వినియోగపడుతుందనిన్నీ వాదిస్తున్నారు. అదంతా నిజమే. వారివల్ల దేశానికి ఈలాభా లన్నీ సమకూరుతాయి. వారిని తీసివేసి వారిఐశ్వర్యాలను బీదసాదలకు పంచిపెట్టినా బీదవారి దరిద్రం తీరుతుం దనుకోడానికి వీలులేదు. పైగా ధనం కూడబెట్టే తరగతి ఉండదు. కాబట్టి దేశంలో మూలధనం తగ్గుతుంది. ఇంతకాలం అనేకులకు పనిపాటలను కల్పించి పోషించిన దివాణాలుండవు.

కాని యీవిధానంలో మేళ్లకన్న కీళ్లెక్కువగా కనపడుతున్నాయి. పైగా అనుకున్నలాభాలు దేశానికి సమకూరడం లేదు. ప్రజలకూ వారికీ సంబంధం లేకపోవడంవల్ల ప్రజలభావాలను వారు గుర్తెరుగజాలకున్నారు. అందుచేత వారిపరిపాలన ప్రజారంజకం కావడానికి బదులు అందుకు వ్యతిరేకమవుతోంది. వారిపెట్టుపోతలూ పోషణలూ తగ్గినాయి. తాము వసూలు చేసుకోనేచోట్ల నిర్దాక్షిణ్యాం చూపిస్తున్నారు. తమఆటపాటలమీద, తిండిమీద, ఆడంబరాలమీద విశేషద్రవ్యం వెచ్చిస్తున్నారు. వారు చేసే విద్యాపోషణ బహుస్వల్పం. ఆర్థి

తృప్తికోసం వినియోగపడవలసిన తమఅర్థమూ, మనుష్యబలమూ నిరర్థకమైన సొంతచాకిరీకోసం వినియోగపడుతున్నాయి. పాఠశాలలలో తమ లోపాలను కప్పిపుచ్చి గొప్పలను వర్ణించే చదువులను చెప్పించి విద్యలను పాడుచేస్తున్నారు. వారికోసం సంఘం నిర్మింపబడిందిగాని సంఘంకోసం వారు నిర్మింపబడియుండలేదు. ఇక వారు చేయవలసిన పరిపాలనాకార్యక్రమ మంతా చట్టనిర్మాణసభలూ, మునిసిపాలిటీలూ, జిల్లాబోర్డులూ, సివిలు క్రిమినలు కోర్టులు మొదలగు రాజ్యాంగశాఖలపై బడినది. పట్టణము లభివృద్ధిచెంది, పల్లెల ప్రాముఖ్యము క్షీణించిన కొద్దీ వీరి ప్రభావంకూడా క్షీణిస్తోంది. ప్రభుత్వోద్యోగుల అధికారం హెచ్చుటచేత ఈ తరగతి వారితో వారి ప్రజలకు అవసరం తగ్గుతోంది. ఇక వారు దూరపుపట్నాలలో కాపురా లుండడంతోటే వారి అధికారం అసలే పోతోంది. "మేము చెమటూడ్చి సంపాదించి యిచ్చినపైకాన్ని వీరు పట్నాలలో యేల వెచ్చించవలెను?" అని వారి ప్రజలు మొరపెడుతున్నారు. పైగా వీరు మూలధనం కూడబెట్టి దేశీయపరిశ్రమలను పోషించడం కూడా జరగడంలేదు. దుబారాఖర్చులను చేయగలిగినంత చేసి మిగిలినమొత్తాన్ని విదేశీకంపెనీలలో వేస్తున్నారు. జీవనానికి వృత్తులులేకుండా ప్రజలు బాధపడుతూవుంటే యీ ధనికులు లక్షలకొద్ది ద్రవ్యాన్ని యేటేటా విదేశాలకంపుతున్నారు. ఇక దేశీయసంస్థలు యెట్లా అభివృద్ధిచెందుతాయి? "విదేశీయులకంపెనీలలోను, బ్యాంకులలోను ధనం వుంచితే అందువల్ల లభించేవడ్డీలవల్ల మనదేశానికే లాభం కలుగుతోంది" అని వాదించే బుద్ధిమంతులు కూడా వున్నారు పైగా ఆవడ్డీపైకమైనా మనదేశంలో ఖర్చుఅవుతోందా? "స్వదేశీవ్రతము" పేర ప్రజలందరూ విరగబడి స్వదేశీమరలబట్టలు కొంటే ఆమరల ప్రొప్రయిటర్లు ఆ పైకాన్ని ప్యారిసునగరంలో ఫ్రెంచిదేశపు సౌఖ్యాలకోసం వెచ్చించడం లేదా? వారికీ వీరికీ భేదమేమిటి? దేశంలో వృత్తులూ, పరిశ్రమలు, ఫ్యాక్టోరీలూ, కళలూ, వేదాంతమూ, శాస్త్రము — ఇవి అన్నీ పేరుకుమాత్రమే!

కాబట్టి యీ ఐశ్వర్యవంతులనూ, వారి ఐశ్వర్యాలనూ నమ్ముకొని మన సంఘంలో కొన్నా అవా — లున్నాయి. ప్రపంచపరిస్థితులు, వాటితోపాటు యీ ఐశ్వర్యవంతుల పరిస్థితులు, వాటితోపాటు వారిపై ఆధారపడియున్న ప్రజలపరిస్థితులు కూడ జనసామాన్యం చిక్కులలో పడిపోతారు.

౫. వృత్తులనుబట్టి ప్రజలను విభజించి వృత్తికి తగిన ప్రతిఫలం ముట్టజెప్పడం ఐదవపద్ధతి. ఇది ప్రస్తుతం కొంతవరకు జరుగుతోందికాని వృత్తుల ఎక్కువ తక్కువలను నిర్ణయించడం సులభంకాదు. వంట బ్రాహ్మడికివున్న ఆదాయం ఒడిపంతులికి లేదు. కాఫీహోటలు అధికారిఆదాయం డాక్టరుకి లేదు. దుకాణదారుఆదాయం విద్వాన్ శిరోమణికి లేదు. రైల్వేస్టేషనులో కూలీకున్న ఆదాయం విశ్వవిద్యాలయపు పట్టభద్రునికి లేదు. అక్షరజ్ఞానములేని ధాన్యంవర్తకుడు లక్షాధికారి అవుతున్నాడు. మహా పండితునికి తిండి లేదు.

దేహవాంఛ లందరికీ సమానమే. లేదా అవి బీదవారికే యెక్కువ. ఆదాయములలోమాత్రం తారతమ్యాలెందుకు? కొంతవరకు అవి మనం తెచ్చిపెట్టినవి కావు. ఎవరికి దొరికింది వాళ్లు చేతనైనవిధంగా సంపాదించుకొంటున్నారు దానికి ఒకనియమం నిబంధనా లేవు. పైగా పెద్దరైతు తాలూకాజవానుకు జంకుతాడు. పెద్దషాహుకారు ఇన్‌కమ్‌టాక్సు గుమాస్తాను గౌరవిస్తాడు. కాబట్టి అధికారానికీ, ఆదాయానికీ సంబంధం లేదు. వృత్తులనుబట్టి ఆదాయాలను నిర్ణయించడం సులభసాధ్యం కాదు.

౬. ఉన్నపరిస్థితులను ఉన్నట్లు వదిలివేయడం మరొకపద్ధతి.

ఉన్నది ఉన్నట్టు వదిలివేయడం చాలా సులభం కాబట్టిచాలమందికిష్టం. మార్పంటే గొడవ; భయం. కాని యిదియే సులువైన విధమా? సులువైనా సాధ్యమా? ఇంట్లో ఎక్కడి వస్తువును అక్కడ వదిలినంతమాత్రాన బూజుపట్టకుండా, దుమ్ముపడకుండా, చెదపట్టకుండా అక్కడనే వుంటుందా? కొంతకాలా

పడుకున్న పిల్లి పొయ్యిలో వుంటుందా? ఇంకో నిముషాని కది పాలకుండకోసమని ఉట్టిమీది కెగరదా? కన్నంలో వున్న ఎలుక కన్నంలోనే వుంటుందా? ఇంకోనిముషాని కది ధాన్యంబస్తాలకు చిల్లుపెట్టదా?

ఎక్కడిదాని నక్కడె వదలడంలోనే చిక్కులున్నాయి. ముందుగా జాగ్రత్తపడి చూసుకోవడంలోనే చిక్కులు తగ్గుతాయి. ఈమధ్య మన దేశంలో ఇన్ని గొడవలు బయలుదేరడానికి కారణ మేమిటి? అందరికీ సంబంధించిన విషయాలు కాబట్టి ఎవ్వరవీ కావనుకొని అందరూ నిర్లక్ష్యంగా వదిలివేయడమే. రైతు తన పొలంవంక పదేళ్లు చూడకపోతే బలమైన తీగలు డొంకలు పొదలు ముళ్లకంపలు విషపురుగులు పొలమంతా పెనవేయవా? వేళ్లు లోతుగా పాతుకుపోయిన తర్వాత ఆ అడవిని కొట్టడం ఎంత కష్టమైన పని? ఎవరికివారు యీ గొడవలు మా కెందుకని నిర్లక్ష్యం చూపడంవల్ల దేశానికి కలిగే అనర్థకాలను యిదివరకే వర్ణించివున్నాను అందరి బాగుకోసం వినియోగపడవలసిన ద్రవ్యం కొద్దిమంది దుబారా ఖర్చులకోసం వ్యయమవుతోంది. అందరి బాగుకోసం వినియోగపడవలసిన మనుష్యబలం ధనికుల గుమ్మాల ముందు కాపలాకాయడానికీ, వారికి అర్థంలేని, నిరర్థకమైన చాకిరీచేయడానికీ వ్యయపడుతోంది.

కాని యెల్లకాలం ఇల్లాగే కదలకుండా, మెదలకుండా, తొణకకుండా వెడుతుందా? ఒకలక్షమంది అజ్ఞానులూ లంచగొండులూ అస్వతంత్రులూ అయిన వోటర్లు రంగుపెట్టెలో తమవోటును పడవేసినంత మాత్రాన కాలచక్రం ఆగుతుందా? ఆగదు. ముమ్మాటికీ ఆగదు.

ఐతే మనం మార్పులకు బొత్తిగా అలవాటుపడడం లేదని చెప్పడానికి వీలులేదు. కొంతవరకు అలవాటు పడుతున్నాము. కాని ఏవిధంగా? ఎంతవరకు? "ఈవేళ విశేషా లేమిటి?" అని వార్తాపత్రికలు చదివేటంతవరకు; అనగా? గోదావరీనది వడిగా ప్రవహిస్తూవుంటే వొడ్డున కూర్చుని ఆ ప్రవాహాన్ని చూస్తూవుండడం కాదు; డమానుతాడు తెగి ప్రవాహవేగంలో పడవ కొట్టుకొనిపోతూవుంటే, "మన మేమి చెయ్యగలం?" అని చేష్టలుడిగి సోమరితనంగా మాస్తూ పడవలో కూర్చుని వుండడం.

ప్రజల వ్యవహారాలలో పనిపాట్లలో ధనార్జన విధాలలో ఎంత తక్కువగా కలుగజేసుకొంటే, ఎవరి గొడవలను వారికి ఎంత వదిలివేస్తే అంతరకూ అంత మంచిదని దొరతనమువారూ ప్రజలూకూడా మొన్నటిదాకా నమ్ముతూ వుండేవారు. కాని అందువల్ల అనేక అనర్థకాలు పుట్టాయి. ఆపద్ధతి బొత్తిగా నిష్ప్రయోజనమని తేలింది. ఎవరో కొద్దిపాటి స్వార్థపరులైన అదృష్టవంతులకూ ఐశ్వర్యవంతులకూ తప్ప జనబాహుళ్యానికి ఆపద్ధతిమీద నమ్మకం బొత్తిగా నశించింది.

౭. ఇక మిగిలినది సామ్యవాదము.

సామ్యవాదుల ఉద్దేశాలలో బీదవారి దరిద్రబాధను నివారణచేయడం ముఖ్యమైనది. ధనికులు సౌఖ్యంగా వున్నారనిగాని దరిద్రులు అసౌఖ్యంగా వున్నారనిగాని చెప్పడానికి వీలు లేదు. కాని మనం నిత్యమూ చూసే దరిద్రము మనస్సుకుగాని శరీరానికిగాని ఆనందంగాని సౌఖ్యంగాని ఇచ్చేది కాదు. ఈదరిద్రము మనోదారుఢ్యాన్ని శరీరదారుఢ్యాన్ని చంపివేస్తుంది. అపరిశుభ్రతకు అనారోగ్యానికి పుట్టిల్లు. సంఘంలో వున్న దుర్గుణాలు అంటువ్యాధులు చాలవరకు దరిద్రులనుండి బయలుదేరుతాయి. దరిద్రబాధవల్ల వకఅందమైన యువతి పడుపువృత్తికి దిగితే సంఘంలో అంటురోగాలు వ్యాపించడంలో ఆశ్చర్యంలేదు. జూదము, దొంగతనము మొదలగు వ్యసనాలసంగతి, కలరా మొదలగు అంటురోగాలసంగతి కూడా యింతే. పైగా, ధనం ధనికులకు చేరేటట్టే దరిద్రం దరిద్రులను చేరి దేశ మంతటినీ దిగలాగుతుంది. ప్రజలలో దరిద్రబాధ హెచ్చడం దేశానికంతకీ సంభవించే విపత్తులలో వక్కటని బెర్నార్డుషా అభిప్రాయము. ప్రజలందరూ ధనికులవడానికి ప్రాకులాడడమే, పోరాడడమే అభివ

ద్ధికి సూచకమనీ, పేదరికమే దండింపదగిన శిక్షఅనీ అతని యుద్దేశము.

దరిద్ర మనేవ్యాధి దేశంలో వ్యాపించి వున్నప్పుడు, ప్రజలు దరిద్రు లవడానికి అవకాశాలు విరివిగా వున్నప్పుడు ఆవ్యాధి మన యింటి కెప్పుడు వచ్చునో చెప్పలేము. బీదసాదలతో సంబంధం లేకుండా మడిగా వూరికి దూరంగా ఇల్లు కట్టుకుని వున్నంతమాత్రాన ఆ బాధ మనకు తప్పునని చెప్పలేము. ఇతరులకోసమని త్రోవలో గోతిని తవ్వి వుంచితే ఎప్పుడో వకప్పుడు మనం కూడా ఆగోతిలో పడకతప్పదు. ఎన్నో మర్యాద గల కుటుంబాలు దరిద్రమనే గోతిలో పడుతూ వుండగా మన కుటుంబంమాత్రం తప్పించుకుంటుందని నమ్మక మేమిటి?

"వాడికి వళ్లు వంగనందుకు తగినశిక్ష అయిందిలే! వాణ్ణి ముష్టి ఎత్తుకోనీ, మనకేం?" అని నిర్లక్ష్యంగా తోసివెయ్యవద్దు. తాగుమోతైనాసరే, జూదగాడైనాసరే, సోమరిపోతైనాసరే, దుర్మార్గుడైనాసరే, దుబారా ఖర్చు చేసేవాడైనాసరే, ఇంకేదైనా శిక్షను విధించుగాని దరిద్రమనే శిక్షనుమాత్రం విధించకు. దరిద్రం దేశాని కంతకూ సంబంధించినవ్యాధి. అది దేశాని కంతకూ ముప్పును తెస్తుంది. అందుచేతనే సామ్యవాదులు ముష్టియెత్తుకునే వృత్తిని అంగీకరించరు ముష్టి యిచ్చినవాడినీ పుచ్చుకున్నవాడినీకూడా క్రిందికి దిగలాగుతుంది. ముష్టి గౌరవమైన వృత్తి అనడంలో మనం దరిద్రాన్ని, సోమరితనాన్ని గౌరవిస్తున్నాము. అందుచేత ఎందరో తోడిమానవులు ఆత్మగౌరవాన్ని చంపుకుని పవిత్రమైన మానవజన్మను నీచపరచి దరిద్రానికి దిగుతున్నారు. ధనికులు దేవుడికళ్లను గప్పి యీ దరిద్రుల ద్వారా చవుకగా స్వర్గానికి టిక్కెట్లను కొనుక్కుంటున్నారు. ముష్టిని వేసేవారికిగాని, గ్రహించేవారికిగాని "కృష్ణార్పణ"మనే భావం ఎక్కడా లేదు.

ఇక "నీవు ఏదేశంలోనో దరిద్రులసంగతి వ్రాస్తున్నావు. ఏ పుస్తకంలోనో రష్యానుగురించిగాని, అమెరికానుగురించిగాని, ఆఫ్రికానుగురించిగాని చదివి ఆపాఠాలు చిలకపలుకులలాగ నాకు అప్పగిస్తున్నావు. మన దేశంలో పేదరిక మింత తీవ్రంగా వుందా?" అని నీ వడగవచ్చును. అందుకు సమాధానం యీ క్రింది అంకెలే చెప్పగలవు. ఇంతవరకూ నిన్ను అంకెలతో భయపెట్టలేదుగాని ఇప్పుడు తప్పలేదు. పైగా మనదేశమే దరిద్రానికి పుట్టినిల్లైయుండగా రష్యాదేశంవరకూ పోవడ మెందుకు? మనవృత్తాంతం మనకు చాలును. కాబట్టి మనదేశాన్నిగురించి కొన్నిసంగతులను ఉదాహరిస్తాను:—

౧. ౧౮౮౦-వ సంవత్సరంలో కరవుల కమిషనువారు "వ్యవసాయంతప్ప వేరే వృత్తిలేనివారిసంఖ్య వ్యవసాయానికి కావలసినవారిసంఖ్యకంటె చాలా అధికంగా వుంది" అని వ్రాసివున్నారు. నాటినుంచి నేటి వరకు వ్యవసాయం తప్ప వేరు వృత్తిలేనివారిసంఖ్య క్రమంగా హెచ్చుతోంది:—

౧౮౮౧ లో	నూటికి	౫౮ మంది	వ్యవసాయ వృత్తిలో వుండిరి.
౧౮౯౧	,,	౬౧.౦౬	,,
౧౯౦౧	,,	౬౬.౦౫	,,
౧౯౨౧	,,	౭౧.౦౬	,,

ఈ మధ్య ఏర్పాటుచేయబడిన వ్యవసాయపు రాయలు కమిషనువారీసంఖ్య ౭౩.౯ వరకు హెచ్చినదని వ్రాసినారు. ఐరోపాఖండంలో వ్యవసాయ వృత్తిమీద ఆధారపడివున్నవారిసంఖ్య తగ్గుతోంది. ఫ్రాంసుదేశంలో ౧౮౭౬-౧౯౨౧ సంవత్సరాలలోగా యీసంఖ్య నూటికి ౬౭.౬ నుండి ౫౩.౬ కు తగ్గినది. జర్మనీలో ౧౮౭౫-౧౯౧౯ సంవత్సరాలలో ౬౧ నుండి ౩౭.౮ వరకు తగ్గినది. ఇంగ్లాండు వేల్సుదేశాలలో ౧౮౭౧-౧౯౨౧ సంవత్సరాలలో ౩౮.౨ నుండి ౨౦.౭ వరకు తగ్గినది. డెన్మార్కుదేశంలో ౧౮౮౦-౧౯౨౧ సంవత్సరాలలోగా నూటికి ౭౧ నుండి ౫౭ వరకు తగ్గినది.

వాణిజ్య, పరిశ్రమలలోకన్న వ్యవసాయంలో ఆదాయం బహుస్వల్ప మనిన్నీ, తక్కువ ఆదాయం వచ్చేవృత్తికి ఎక్కువమంది ప్రజలు పూనడం దరిద్రం హెచ్చడం సూచిస్తుం దనిన్నీ పండితు లంగీకరించారు.

౨. సొంతభూమి లేకుండా వ్యవసాయంమీద ఆధార పడివుండే పనివాళ్లసంఖ్య హెచ్చుతోంది. ౧౯౨౧ జనాభా లెక్కలప్రకారం నూర్గురు వ్యవసాయ దారులలో ౨౯.౧ మంది సొంతభూములులేని పని వాళ్లు. ౧౯౩౧ జనాభా లెక్కలప్రకారం యీ సంఖ్య ౪౦.౭ వరకు హెచ్చినది. ప్రస్తుతం యీ సంఖ్య ౩౩ అని అంచనా వేయబడినది.

౩. వ్యవసాయం చేయడానికి భూమి లేక కాదు. మొత్తం భూమిలో నూరు ఎకరాలకు ౩౪.౨ యెకరాలలోమాత్రమే వ్యవసాయం జరుగుతోంది. ౩౫.౨ యెకరాలు వ్యవసాయానికి అందుబాటులో లేవు. మిగతా ౩౦.౬ యెకరాలు భూమి వ్యవసాయానికి తగివున్నది. కాని వ్యవసాయం జరగడం లేదు.

౪. సాగు అయ్యేభూమి విపరీతంగా చిన్న చిన్న చీలిక లైపోతోంది. డాక్టరు హారోల్డు మాన్ అనునతను ఒక గ్రామములో సంగతులను పరీక్షచేసి వ్రాసిన దేమంటే: ౧౭౭౧ లో ఒక్కొక్కపొలంవిస్తీర్ణం దామాషాయిని ౪౦ ఎకరాలు వుండేది. ౧౯౧౫ లో ఒక్కొక్కపొలంయొక్క దామాషాయి విస్తీర్ణం ౭ ఎకరాలుమాత్రమే. కడచిన ౬౦, ౭౦ ఏళ్లలో పొలాలవిస్తీర్ణం చాలమట్టుకు తగ్గినమాట స్పష్టం బ్రిటిషు పరిపాలనకుపూర్వం, బ్రిటిషు పరిపాలన వచ్చినకొత్తలో వొక్కొక్కపొలం దామాషాయి విస్తీర్ణం ౯, ౧౦ ఎకరాలకుపైన వుండేది. ౨ ఎకరాలకు తక్కువపొలాలు వుండేవి కావు. ఇప్పుడు పొలాలసంఖ్య రెట్టింపుకన్న హెచ్చింది. నూటికి ౮౧ పొలాలు ౧౦ యెకరాలకన్నతక్కువవిస్తీర్ణం వున్నవి. నూటికి ౬౦ పొలాలు ౫ ఎకరాలకన్న తక్కువ విస్తీర్ణం కలవి.

సంయుక్త పరగణాలలో వ్యవసాయదారు వక్కంటికి దామాషాయిని ౨.౫ యెకరాల భూమి మాత్రము కలదు. బంగాళాదేశంలో దామాషాయిని తల వక్కంటికి ౩.౧ యెకరాలుమాత్రమే: అస్సాములో ౩ యెకరాలుమాత్రమే; బీహారు, ఒరిస్సాలలో ౩.౧ యెకరాలుమాత్రమే; మద్రాసులో ౪.౯ యెకరాలుమాత్రమే; మధ్య పరగణాలల్లో ౮.౫ యెకరాలు; పంజాబులో ౯.౨ యెకరాలు; బొంబాయిలో ౧౨.౨ యెకరాలు.

"ఎగ్రికల్చరల్ జర్నల్ ఆఫ్ ఇండియా"(Agricultural Journal of India) అనే వ్యవసాయపు పత్రిక ౧౯౨౬-వ సంవత్సరానికి సంబంధించిన యీ క్రింది సంఖ్యలను ప్రకటించింది.

బ్రిటిషు ఇండియా అంతటిలో ౧౦౦ పొలాలకు

౨౩ పొలాలు		౧ ఎకరము లేక అంతకులోపు విస్తీర్ణం	కలవి
౩౩	,,	౧ మొదలు ౫ యకరాలు	,,
౨౦	,,	౫ మొదలు ౧౦ యకరాలు	,,
౨౪	,,	౧౦ యెకరాల పైవిస్తీర్ణము	,,
౧౦౦			

అనగా నూటికి ౭౬ పొలాలు ౧౦ యెకరాల కన్న తక్కువవిస్తీర్ణం కలవి. అందులో ౧౫.౪ పొలాలు ఒకయెకరంకన్న తక్కువ విస్తీర్ణం కలవి.

బొంబాయిరాజధానిలో, ఖర్చులు పోను ఒక వ్యవసాయదారూ అతనికుటుంబమూ జీవించడానికి ౪౦, ౫౦ ఎకరాలు మెరకభూమి, పొలంలో ఒక నుయ్యి, ఒక ఇల్లూ వుండాలి; మెరకప్రదేశాలలో ౩౦ ఎకరాల భూమి చాలదు అని కీటింజిదొర అభిప్రాయం. సంయుక్తపరగణాలలో ౩౦ యెకరాలు ఒకకుటుంబం పోషించడానికి చాల వని జవన్నదొర వ్రాసినాడు. ఒక వ్యవసాయదారుడూ, అతని ఐదుగురు పిల్లలు, భార్యాగల సంసారం ౧౪ యెకరాలు సాగుచేసి అప్పులు లేకుండా జీవించలేరు అని డాక్టరు లూకసుదొర.

౫. బ్రిటిషు ఇండియాలో దామాషాయిని యెకరానికి ౨౫ రూపాయలపంట పండుతుంది. జపానుదేశంలో యెకరానికి ౧౫౦ రూపాయలకన్న తక్కువ పండదు (—సర్ మో. విశ్వేశ్వరయ్యగారు).

౬. "భారతదేశప్రజల దామాషాయి ఆదాయము: వివిధ అంచనాలు.

ఎవరి అంచనా?	ఏ సం. రమున	దా. ఆదా. మనిషి ౧ కి సాలుకు రూ.
దాదాభాయినౌరోజీ	౧౮౭౦	౨౦-౦-౦
బార్బరు	౧౮౮౨	౨౭-౦-౦
డిగ్బీ	౧౮౯౮-౯౯	౧౮-౦-౦
కర్జనుప్రభువు	౧౯౦౦	౩౦-౦-౦
డిగ్బీ	౧౯౦౦	౧౭-౪-౦
అట్కిన్సన్	౧౮౭౫	౨౫-౦-౦
,,	౧౮౯౫	౩౪-౦-౦
,,	౧౯౧౧	౫౦-౦-౦
వాడియా, జోషీలు	౧౯౧౩-౧౪	౪౪-౫-౬
షా, ఖాంబటాలు	౧౯౨౧	౬౭.౦-౬
మద్రాసు	౧౯౨౧	౧౦౭-౦-౦
,,	౧౯౨౨	౧౧౬-౦-౦
సర్ విశ్వేశ్వరయ్య	౧౯౩[illegible]	౮౦-౦-౦

*　　　*　　　*

ఇటీవల ౧౯౩౧లో బ్యాంకింగు విచారణ సంఘము వారు భారతదేశములోని కర్షకులదామాషా ఆదాయము ఎంతెహెచ్చు మదింపువేసినను సాలుకు తల ౧ కి రూ ౪౨-౦-౦ రూపాయలకన్న లేదని నిర్ణయించినారు. అందువలన మన దేశములో తల ౧ కి దామాషాయి ఆదాయము రోజు ౧కి రూ ౦-౧-౭లు"(!!!) (— దిగవల్లి వెంకటశివరావు : "భారతదేశమున బ్రిటిషు రాజ్యతంత్రము" నుండి.)

౭. "ఇండియాలో నూటికి ౩౦ మంది వ్యవసాయదార్లకు వ్యవసాయవృత్తిలో ఏమీ లాభం మిగలడం లేదు. ఆదాయంకన్న వ్యవసాయపుఖర్చులు, పన్ను అధికంగా వున్నాయి."(—'అగ్రేరియన్ ప్రాబ్లమ్' అను కాంగ్రెసు పక్షపు ప్రచురణము, ౧౯౩౭.)

౮. పంజాబులో ౨౭ పొలాలలో మొత్తం పంటలో నూటికి దామాషాయిని ౧౮ పాళ్లు వ్యవసాయం చేసినవాడికి. మిగత ౮౨ పాళ్లు భూస్వామి తీసుకుంటున్నాడు.

౯. పంజాబులో కొన్ని జిల్లాలలో సొంతభూమివున్న సేద్యదారుని నికరాదాయము, యకరానికి :

౧౯౨౮-౨౯ లో	౧౯౨౯-౩౦ లో	౧౯౩౦-౩౧ లో
రూ. ౩౨-౮-౪	౨౦-౧-౩	[illegible]-౧౦-[illegible]

౧౦. ౧౯౩౦ లో సెంట్రలు బ్యాంకింగు విచారణ సంఘంవారు, బ్రిటిషు యిండియాలో గ్రామాలలో ప్రజల ఋణాలమొత్తం ౯౦౦ కోట్లు రూపాయలు అని మదింపువేసినారు. ప్రస్తుతం ఇండియామొత్తానికి పల్లెటూళ్లలో ఋణాలు ౧౬౦౦ కోట్లరూపాయలని నిర్ణయించారు. వడ్డీరేట్లు సాలుకు నూటికి ౧౨ మొదలు ౨౪ రూపాయలు; కొన్నిచోట్ల రూ. ౩౬ మొదలు రూ. ౪౮ వరకుకూడా వున్నాయి.

౧౧. మేజరుజనరలు మెగా అను ఇండియను మెడికలు సర్వీసుయొక్క డైరక్టరు జనరలు ప్రత్యేక విచారణ చేసి వ్రాసిన దేమనగా:

ఇండియామొత్తంలో నూటికి ౩౯మంది బాగా ఆహారం వున్నవాళ్లు: ౪౧ మంది ఆహారం సరిగా లేనివాళ్లు; ౨౦ మంది బహుస్వల్పఆహారం వున్నవాళ్లు. (౧) ప్రజలు తినేఆహారము చాలా తక్కువ: (౨) దామాషాయిని జీవితముపరిమితి ఉండవలసిన దానిలో సగమే; (౩) ఐదుగ్రామాల కొక్క గ్రామంచొప్పున పదేళ్లకొకసారి కరువులూ తిండి లేకపోవడం సంభవిస్తున్నాయి; (౪) మరణాల సంఖ్య హెచ్చుగా వున్నప్పటికి జననాలసంఖ్య అధికముగా వుంది. పంటసరకుల ఉత్పత్తి అదేరేటున హెచ్చకపోవడంవల్ల ప్రజల జవసత్త్వాలు ఇంకా తగ్గిపోక తప్పదు.

౧౨. "వివిధదేశములలో సాలుకు మనుష్యునికి వచ్చు దామాషాయి ఆదాయము – కొన్ని అంచనాలు – రూపాయల్లో.

దేశము	సంవత్సరము	రూపాయలు
అమెరికా	౧౯౨౪	౩౩౨౮
బ్రిటిషుదీవులు	,,	౧౪౫౬
జర్మనీ	,,	౫౭౦
ఫ్రాన్సు	,,	౬౦౩
కనడా	,,	౧౫౧౧
ఆస్ట్రేలియా	,,	౧౪౩౧

జపాను	౧౯౨౮	రు. ౨౦౫
ఇండియా	,,	౪౦"(!!!)

(—దిగవల్లి శివరావుగారి గ్రంథమునుండి)

౧౩. పన్నుల భారము.

౧౯౨౩-౨౪ లెక్కలు

పన్ను పేరు	ధనికులపైన	బీదలపైన
	కోట్ల రూపాయలు	
సుంకములు	౨౦	౨౧
భూమిపన్ను, నీటితీరువ	౨౦½	౨౧½
ఆదాయముపన్ను	౨౦	—
అబ్కారీ పన్ను	—	౨౦
ఉప్పుపన్ను	౧¼	౮½
అపీవులు, రిజిస్ట్రేషను	౨	౫
స్టాంపులు	౬½	౬½
రైళ్లు	౩౩	౬౦
తపాలా ఆఫీసులు	౫	౫½
మునిసిపలు పన్నులు	౩	౧౦
జిల్లాబోర్డు	—	౧౦
కోట్ల రూ.	౧౧౧¼	౧౬౮

ఇట్లు ధనికులకన్న బీదలు ౫౬¾ కోట్ల రూపాయలు అధికపుపన్ను భరించుచున్నారు" !!!

(—దిగవల్లి శివరావుగారి గ్రంథమునుండి)

౧౪. వంగరాష్ట్రపు ఆరోగ్యశాఖవారు ఆరాష్ట్రమును గురించి ౧౯౨౮-౨౯ సంవత్సరపు రిపోర్టులో ఇట్లు వ్రాసి యున్నారు.

"బంగాళా రాష్ట్రములో మాత్రం ఏటేటా ౧౫ లక్షలమంది ప్రజలు చనిపోతున్నారు....వంగదేశపు కర్షకు లిప్పుడు తినే ఆహారంమీద ఎలుకలైనా ఐదు వారాలకంటె ఎక్కువకాలం జీవించలేవు..."(!!!)

౧౫. కూలివానికి పెద్దఉద్యోగికి వచ్చువేతనంలో తారతమ్యము:

దేశము	కూలివానివేతనంకన్న పెద్దఉద్యోగికి ఎన్నిరెట్లు అధికము?	
ఇంగ్లండు, స్కాట్లండు, వేల్సు	౧ కి	౩౦ రెట్లు
కెనడా	౧ కి	౧౦ ,,
అమెరికా సంయుక్త రాష్ట్రాలు	౧ కి	౯ ,,
జర్మనీ	౧ కి	౧౩ ,,
జపాను	౧ కి	౧౩ ,,
ఇండియా	౧ కి	౨౦౦౦ రెట్లు (!!!)

(—దిగవల్లి శివరావుగారి గ్రంథమునుండి)

౧౬. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారి బంగారపు పలుకులు

'దరిద్రాన్ని సహించి పూరుకోవాలి' అన్న సిద్ధాంతం మనం తప్పించుకోవలసిన గొప్ప అపాయాలలో వకటి. ప్రస్తుతం మన జనాభాలో అపరిమిత సంఖ్యాకులు దరిద్రపు పరిమితికన్న హీనంగా జీవిస్తున్నారు. సంఘంలో వున్న ప్రతివ్యక్తీ జీవించడానికి ఇంతకన్న తక్కువమొత్తం సరిపోదు' అనివక కనిష్ఠపు ప్రమాణాన్ని నిర్ణయించి, పనిచేయగల ప్రతివ్యక్తీ అంతకుతక్కువ గాకుండా సంపాదించుకోడానికితగిన వృత్తులను ఏర్పాటు చెయ్యడం చాలా అవసరము. యూరపు అమెరికా దేశాలలో, కూలిపనికి అంగులోనూ ఫ్యాక్టరీలలో కూలిపనికి, 'వేతనము ఇంతకన్న తగ్గగూడదు' అని వక పరిమితి ఏర్పాటుచేయబడి వుంది. ఆస్ట్రేలియా దేశంలో "వక వ్యక్తి జీవించడానికి కనీసం ఇంతమొత్తం అవసరం" అని కనిష్ఠప్రమాణం అంగీకరింపబడి వుంది. హిందూదేశపు నాయకులు చేయవలసిన సంస్కారాలలో ఇది ముఖ్యమైనది. ఇప్పుడు ప్రతిజిల్లాలోనూ ఏర్పాటుకాబోయే ఎకనామికు కౌన్సిళ్లు ఇందుకు సహాయంచేయగాలి."

'ఎకనామికు కౌన్సిలు' అంటే ప్రతిజిల్లాలోను కలెక్టరుగారి నాశ్రయించుకొని తిరిగే పెద్దమనుష్యుల సభ అనిన్నీ, పెరుగుతోటకూరలో పెరుగు లేనట్టే, నేతిబీరకాయలో నెయ్యి లేనట్టే 'ఎకనామికు కౌన్సిలు వారు' చేస్తూవున్న ఎకానమీలు ఏమీ లేవనిన్నీ నీవూ నేనూ ఎరుగుదుముకదా!

(సశేషము)

నాన్యః పంథా

రామకృష్ణశాస్త్రి

' నేను వాడి పీక నులిమేశాను -

' నేనే చంపింది. నమ్ముతావా, లేదా-

—నమ్ముదామా...అప్పటికే మూడో కాలంలో ఉన్నాడు. ఎన్ని సీసాలో ఖాళీ అయినవి, కాని ఆకళేబరం ఇక అంతైనా భరాయించుకునేటట్టు ఉంది. మాటఎక్కడో సముద్రం అట్టడుగునుంచి వస్తూన్నట్టుంది. దానికి విలువ ఏమిటి ?

—నమ్మకపోదామా...అతడికి త్రాగుడు తల కెక్కినకొద్దీ, నిదానం హెచ్చుతుంది. ...మెదడు పూర్ణంగా వికసించి సబబుగా పని చేయ మొదలుపెడుతుంది...కాని, ఏమో...

అప్పటికి అరడజనుసార్లన్నా, నామీద ఈవాక్యం ప్రయోగించాడు. నాకు ఏటు అనడానికీ పాలుపోవడం లేదు. చూపులు అప్పగించి కూర్చుని ... ఎదట, ఎప్పుడో చల్లారి తెరకగట్టుకుపోయిన టీవంకనైనా చూడకుండా, అతడు రెట్టించినపుడల్లా కొత్త ఖంగారు పుట్టి ఉలికిపడుతూ ' ఇలా వచ్చిందేమా భగవంతుడా ' అని మనసులో అనుకుంటూ ఉన్నాను.

నిండుకుండ జారి క్రిందపడినట్టుగా ... పట్టించిన మధురసం ఇముడక, ఉన్నచోటనే భళ్లుమన్నాడు... తెళ్లుకు, తెళ్లుకు...

నేనూ మరో వెయిటరూ, సాయంపట్టి, పైన గదిలోకి చేర్చాము. ఒళ్లు తెలిసినతరువాత, ఓపట్టానికి సత్తువ చేసుకుని, లేచి, దిండ్లమీద ఒరిగి కూర్చుని కాఫీ త్రాగి... సిగరెట్లు, పమ్ము కొకటిగా, అయిదు నిమిషాలు కాదేకి...అప్పటికి బాగా తేరుకుని... సోఫామీద నాపక్కను సర్దుకున్నాడు. ఇక గ్రంథంలోకి దిగుతున్నాం......అని నాకు వెంటనే అనిపించింది.

' నీవు నమ్మవు కాదూ ? ' ఒక్కొక్క మాట ఒక్కొక్కస్థాయిలో ... గుణించుకుపోయే ఊతంతో, నన్ను జవాబుకు మొగమాటపెడుతూ నొక్కులుగా ఉచ్చరించాడు. నేను అప్పటికీ ఏమీ అనలేకపోయినాను. ఆతనికి మతి పూర్తిగా పోయిందేమో నని దిగులూ, భయం పూర్తిగా కమ్మేసి ఊపిరి సలుపనీయడంలేదు.

' అవును లే...నమ్మవు. నాకు తెలుసును లే, నీవే కాదు, మనవా డెవడైనా ఇంతే... స్నేహితులం కాదుటోయ్, ఒకరిమీద ఒకరం ఈగ వ్రాలనిస్తామా? స్నేహమైనాక...ప్రాణమైనా...ఊ...ఈస్నేహమే వాడి ప్రాణం తీయించింది.

' నే నిలా ఎందుకు అయినానో గ్రహించావా వాడిమూలానే : ఇదివరకన్నా వా... సరదాకు త్రాగాను : ఇవాళ...సరదా ఇహ నుంచీ చచ్చిపోవాలని...నాగొప్ప హృదయం ...ఇతరుల కష్టాలు సహించలేని దొడ్డతనం

...వీటిమీద ఈగ్రాంకె నోటితో ఖాండ్రించి ...ఉమ్మేయాలని. ఏదీ సిగరెట్ ?'

ఒకటి చేతికి యిచ్చి కేసు అతనికి అందు బాటులో ఉంచి, నేను కొంచెం ఎడంగా జరిగాను. ఒకసందర్భం చెప్పడం, ఒకగుక్క పొగలాగడం, ఇలా ఆసాంతమూ నడిచింది... చూపుల్లోకాని, ధోరణిలోకాని ఉద్వేగం... నరాల దడదడ తప్ప...నిబ్బరము మాలిన తూలుడు అగుపించడం లేదు. అందువల్ల, చెప్పేది వినడానికి...నమ్మినా నమ్మకపోయినా ...ఇకమీద నా కేమీ బెరుకు కలగలేదు.

'వా డింత ఛండాలు డౌతాడని'... గుండెలు క్రుళ్లించుకుంటాడని నేను ఎన్నడూ అనుకోలేదోయ్......పన్నీరు బూడిదరాసి మీద ఎన్నికడవలు కుమ్మరించినా... ఎందు కులే, ఎవరి ననవలసినపనేముంది ?... సరే లే...అసలు అరవీశె, ఉపోద్ఘాతం ఆరువీశె లూ అవుతూందే...ఓహో—

'నేను దాసును చూసేటప్పటికే వాడి మనసు మండి మారణహోమ మైపోయి ఉన్నాడు : లోకంకోసం...మధ్యమధ్య తన కోసం...పద్యాలలో ఏడ్చి ఏడ్చి...తరుక్కు పోయిన మనసుముక్క లన్నీ దేశంమీద విసిరివేసి .....కొవ్వొత్తి ఆరిపోయేముందు గులేబులాగా ఉన్నా డంటే...చదివి తల లూపి భేష్ భేష్ అన్న ఒక రండాకొడు కన్నా...బతిమాలి, తెప్పించుకుని ఉల్బాగా అచ్చువేసుకున్న ఒక్క ఎడిటర్ అన్నా ...అలాటి రత్నాలు వెదజల్లుతూన్న వాడు ఏమైనాడో, తినడానికి తిండి ఉందో లేదో... అని ఎన్నడన్నా కనుక్కున్న పాపాన పోయినాడా ?

'చూసేటప్పటి కల్లా నాకు కళ్లవెంట నెత్తురుచుక్కలు రాలినాయోయ్. దేవతలు వరాలిచ్చే ఉద్యోగాల లోంచి రిటైరై...ఉప కార వేత నాలు పుచ్చుకుంటూన్నారు కాదూ...ఈపచ్చికలియుగంలో దేవుడల్లే నేను వాని పాలిటికి కనబడదా మనుకున్నాను. ఆ అహంకారమే ఇంత ముంచింది.

'ప్రక్కాకవికి ఉండే పొగరుమోతు తన మంతా ఝుళిపించి...నన్నూ, నే చేయ బోయే సహాయాన్నీ గడ్డిపోచ క్రింద దులిపేశా డే మొదట ! ఆ మూర్ఖపుపట్టు, వాడు విడవ కుండా...లొంగిపోకుండా ఉన్నా...బాగుండే దే...నాకోసం కాదు...లోకంకోసం నా యేడుపు.

'కలలోనైనా ఉట్టిమీదకు ఎక్కించ కూడని పుణ్య - నిర్భాగ్యమూర్తిని...కళ్లు తెరుచుకుని ఒక్కమాటుగా ఆకాశంలోకి ఎగురవేశాను. పడింది...నేను చేతులార చేసిన పాపంతోడి అదీ...బద్దలైంది.

'ఏం కావాలో...అతడు కోరుకోకుం డానే అన్నీ యిచ్చానోయ్. దారిద్ర్యమనేది వాడికి ఆమడ దూరంలోనైనా కాలుపెట్ట వీలులేకుండా చేశానోయ్. ఇంతవరదాకా చిల్లర రత్నాలు దొరికినగనిలో ఇక ప్రతి వేటుకూ తగిలేది కోహినూరే ననుకున్నా నోయ్...

'నందదేవీ శిఖరానికి ఎక్కడానికి జర్మను పండితులు ప్రయత్నం చేద్దా మని వచ్చారని పత్రికలో చదివి...నేనూ వాళ్లలో కలుద్దామని వెళ్లిపోయినాను...అన్నికష్టాలూ పడి...ఏమీ సాధించలేక, ఆరునెల్లకు వా ళ్లు...హతమారంగా మిగిలినవాళ్లు...ఓడ ఎక్కారు. నేనూ యింటిముఖం పట్టాను.

'వచ్చిన మర్నాడు, దాసును వెత కుతుంటూ...వాడుంటూన్న యిల్లు వెనుక్కొని పోయినాను. నాపిలుపు అంద, నౌకరు వచ్చి, లోపలకు తీసుకువెళ్లి...'అయ్యగారికి చెప్పి వస్తా'నని వెళ్లాడు. దగ్గరగా ఉన్న వాలు కుర్చీలో కూలబడి...గది అమరిక చూసి, మురుస్తూ 'మనవాడు ఇంకా ఫాయాలోనే ఉన్నాడు కదా...డబ్బుకు కొదవలేదాయెను ...వ్రాసినపద్యాలు...సంపుటాలుగా...ఎంత అందంగా అచ్చువేయించాడో...నాకు అవ న్నీ యిస్తాడు కాబోలును,ఎన్నాళ్లకు కనబడ్డా నని నన్ను అమాంతం కౌగలించుకుంటాడు కాబోలును, కొన్నాళ్లదాకా అక్కడే తన వద్దనే ఉండమని బలవంతంచేసి, నిలిపివేసు కుంటాడు కాబోలును...ఆలాగైతే ఎంత కులాసాగా కాలక్షేపం అవుతుంది:ఒకవేళ... ఎవరన్నా ప్రేయసి ఏర్పడిందేమో...అంతవా డు కోరాలిగాని...అసలు అందాకా అక్కర్లే దు,ఆతని పేరువిని...రచనలుచూసి...నేనంటే నేనని...ఎందరెందరు రావణుని కోటగుమ్మం లో దివ్యసుందరులులాగ పడికాపులుగా ఉండరు?...నేనుండటం ఆపక్షంలో...ఆతనికి అభ్యంతరంగా ఉంటుందేమో...అయినా...

'— ఇన్నికలలతో దాసు లోపలికి వస్తాడా అని ఎదురుకాచుకుని...గుమ్మానికి ఉన్న కర్టెన్‌రింగులు చిరుగాలికి రవంత గల గలమనినప్పుడల్లా...ఆతడే వచ్చాడని భావ నలోనుంచి మేల్కొంటూ— '

—తలుపు టకటక మంది: 'కమిన్' అనిపించుకుని వెయిటర్ వచ్చి కాఫీకప్పులు, గోడదగ్గిరగానున్న టీపాయ్ మాయెదటికి లా గి, మీద ఉంచాడు. త్రాగుతూండగా, టిన్ను అంచుతో మీట వెనుకకు నెట్టి గోరువాటం నొక్కి గ్రమనిపించి సిగ్గుపడ్డాను...రావటం చూసి కట్టుకున్నాక...కబుర్లు చెప్పేవి కొన్ని ను. చూసేసి సెట్ తీసుకున్నాను 'ఏం ఆ తీసేయ్...' అయితే ఇరాజులోంచి కాగి తాలను తీసి కప్పులు కట్టుకు వెళ్లిపోయారా డు...ఆతడు అప్పుళ్లు మంటవాడుగా నా మొగంవంక చూసి 'నాకు, ఒకటి కాని నంటే ఒకమాత్ర'.. అని పొగ భగభగ మని పించాడు.

—'వచ్చాడు; దాసు, అరగంటకి... దర్శనం ప్రసాదించాడు. మనం అంతనర దాకా గాలిలో కట్టిన పైడ్ర స్కైఫర్సు అన్నీ ఒక్కమాటు పునాదులంటూ కదిలి...

'ఎలా ఉన్నా వనుకున్నావ్...పుల్లా హావుతాం...ఫుల్లా హావుతాన్' అని కథ... అని కీర్తి. చంద్రవనిప్పులు కళ్లుమాత్రం.. కర్ర కొనకు కట్టిన మందారమొగ్గలులాగా...

'ఒంటరిగా దయచేశాడ? పుదుచ్చేరి సీతారామవిగ్రహా లుంటాయి చూశావ్రా... పీడి భుజంమీద తల వాల్చుకుని...పద్మినీ జాతిదానికన్నా సిరసించిపోయిన వాడి నడుముచుట్టూ...ఒకచెయ్యి మలుపుకుని... చీకటిపడగానే క్రీడల్లో ఏసందులో చూసి నా మనకు తగులుతూంటారే చిల్లర శ్రీ మహాలక్ష్ములు...అదోకతె...

'చూశాడు... వేయబోయే అడుగు ఎత్తి ఆలాగే ఉంచి భగీరథుడులా...చూ శాడు...చూశాడు.

'ఆపిశాచం, కోరమొగంవేసి కళ్లు చికి లించింది...ఇద్దరూ అక్కడనుంచి ఒకటే ఇకిలింపు...మాటలు పెగలని విరగబడటం-

'దాసూ'

'ఏం...దుకోయ్ వాసూ!'

'అందాకా ఎక్కింకి'

'సం-ద-దేవిదాకా...మళ్లా... ది.గి.ంద ...ఇహిహీయ్'

'—ఇదీ...మా సంభాషణ...పిశాచాలు తరుముకు వస్తూన్నట్టుగా... ప్రాణం గుప్పెటలోకి తెచ్చుకుని బయటకు ఒక్క ఉరుకు ఉరికాను.

'ఆ ఇహిహీలు' నాకు స్పృహతప్పేదాకా చెవులల్లో గింగురుమంటూ నేఉన్నవి: పక్కమీదనుంచి లేచి కాలు క్రిందపెట్టేటప్పటికి పదిహేనురోజు లైంది. కాని, అంతటితోనైనా ఈదేహికి బుద్ధి వచ్చిందా ?

'నీరసం వదలకుండానే...మళ్లా వాడికోసం...పడుతూ లేస్తూనే పోయినాను... కాని...వాడు ఆయిల్లు వదిలేశాడు. ఏమైనాడో ఇరుగూ పొరుగూ ఎవరిని విచారించినా తెలియదన్నవారే. వెదికాను...పట్టణం అంతా గాలించగా, చివరకు ఓమారుమూల, ఎక్కడో అధ్వాన్నపు అడివిలో, ఓ పెణక కూలిపోయిన వసారాలో, చొక్కా అయినా లేకుండా చింకిచాపమీద రెల్లుపుడకలాగా కొట్టుకుంటూ పడి ఉన్నాడు.

—'చూసి నేను వెనక్కు తగ్గాను. దాసు లేచివచ్చి నామీద తూలి కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టాడు. నాకు తలతిరిగిపోయింది... అనునయంగా... చేతితో వీపు నిమిరాను...ఏం మిగిలాడు... ఎముకలైనా గుప్పెడయేటట్టులేవు! అయినా ఇప్పటికైనా ఫరవా లేదు. చేసిన దంతా తప్పని తెలుసుకుంటే, ఇదే పశ్చాత్తాపమైతే...నీరు అంటి పచ్చి నిలవాలికాని... ఎంత మ్రోడైతేమాత్రం... ఎంతలో చిగిర్చి పువ్వులు ఘుమాయిస్తుంది...దోహదం మన చేతులో...

—'అప్పటికీ మనబుద్ధి గడ్డి తింటూనే ఉందోయ్. అంతా అబద్ధం: నేననుకున్నదంతా శుద్ధతప్పు. ఆ పగలమారి ఏమ్పలెంపు కనుకున్నావ్? రంభకు సాక్షాత్తూ పినతల్లికూతురు, ఆ...ఉండే, ఆలోకైక మోహిని...వీడిమూటాముల్లెతోగూడా మరొకడితో రైలెక్కి ఉడాయించేసింది. అందుకోసం...ఈ కన్నీళ్లన్నీ...దాన్ని చూడంకి ...దానితో కలసి ఉండంకి బ్రతకలేడు... కవిత్వం లేదు...లేదు, కవి నని అసలు వాడికి జ్ఞాపకమే లేదు.

—'నవనాడులూ క్రుంగిపోయి...లేచాను. నాకాళ్లు పట్టుకుని వదలడే... ...దాన్ని ఏలాగైనా వెదకి నేను తీసుకువచ్చి...ఇక ఆపైమాటలు వినిపించుకోకుండా... డబ్బు ఏమన్నా యివ్వమన్నదానికిమాత్రం, రేపు వస్తానని ఓ కేక వెనుకకు విసిరివేసి అటు తిరిగిచూడకుండా వచ్చేశాను.

'రెండు దినాలదాకా, ఆ చాయలకు పోలేదు. పోదలచుకోలేదు. మనసు 'సలా సలా మరిగిపోతూంది. పరిపరివిధాల ఆలోచనలు పోయినవి. ఆ పీడకలలోంచి దూసుకుపోయి... మళ్లా హిమాలయాల్లో పడదామనుకున్నాను. కాని...

— 'వెళ్లాను. అప్పటికే ఉసురు లోడిపోయి చీమలుపట్టి ఉండవలసిన దేహం... ఇంకా ప్రాణజ్యోతిని కొండ ఎక్కనీకుండా ఎలా అంటిపట్టుకుని ఉన్నదో'... దాసును లేచి రమ్మన్నాను. 'ఎక్కడికి'...అని ప్రాణ

లేనందువల్ల పసనచదిపినట్లు ఎగుడుదిగుడు స్వరంతో... మాట ఊదాడు. 'స్వర్గానికి అన్నాను'... విషంగా.

లేని ఆసలు... లేనిసత్తువ, తెప్పించుకుని నావెంట బయలుదేరాడు: పవలల్లా మహా రాజులలాగా గడిపాం. అంటే వాడు, కడుపుకు వెక్కసమయ్యేదాకా తిని... పొర్లివచ్చేటట్టుగా త్రాగుతూంటే .. నేను... ఇంకా ఇంకా అని పురికొల్పుతూ...

'చీకటి పడినతరువాత మాంచి బందోబస్తయిన నీమాటిని... అనుకున్నదాని కిబ్బడి ధర యిచ్చి... ఆగదిలోకి... సింహాన్నిలాగా వదిలాను... ఎక్కిళ్లూ ... నవ్వులూ ... బుసలూ... అన్నీ ఆ ప్రళయ - శోభనపు గదిలోంచి... తెల్లవార్లూవింటూ... గుమ్మందగ్గర ...కంటిలో వత్తులు వేసుకుని, కునుకకుండా కాపలా కూర్చున్నాను.

'చీకట్లు విచ్చుతూండగా... తలుపులు నెట్టుకుని లోపలికి వెళ్లాను... చెల్లాచెదరుగా ...ఇద్దరూ ఒకరినరసను ఒకరు యుద్ధభూమి లాగా ఉన్న పక్కమీద పడి ఉన్నారు... వాడికి శ్వాస ఇంకా ఆడుతూనేఉంది...

'ఎండుపుల్లను ఫెళుక్కు మనిపించినట్టుగా... వాడిగొంతు నులిమేశాను. ఆ రవంత గొరగొర...దాని గుర్రుహోరులో కలిసిపోయింది... ఈ నిశ్శబ్దపు... అలజడికే అది మేలుకుని... చూసి గ్రహించి... ఒకపొల్లుకేక వేసుకుంటూ... లేచి... దౌడాయించింది.

'ప్రొద్దునుంచీ... ఆగది వదలినప్పటి నుంచీ... దోవాతెన్నూ అనకుండా'... తిరుగుతూంటేగా... [illegible] నుంచీ నీమలో [illegible] సమయానికే [illegible] చేతే...

'నేను... [illegible] నోటిమెరుపు దలచుకోలేక. లోకం [illegible] కేం...

'నేను చేసింది నామనసుకు నచ్చిందా లేదా.. అయ్యవారిని చేయబోగా... కోతి... కొంచెముచ్చగా మారింది... వాడిదేహాన్ని సుఖపెడదామని... మితిమీరిన పరువు చేసి... మనసును కుళ్లించాను... అక్కడికునచ్చి... తెలుగుజంజా... దేశదేశాల ప్రఖ్యాతలసిన ... మహాకవి... నా పరిశ్రమపుకర్మగుణంమూలాన ... ఇంత పసికిమాలినవాడైపోయినాడు ... అసలే ఎడారిగా ఉన్న మన కావ్యక్షేత్రంలో ... మరోమోడుకూడా ఎందుకూ... పూలమొక్కకు పురుగు అంటించినవాడే... కుళ్లగించివేయడం ... ధర్మం.

'సబబవునా కాదా... ప్రకృతి... సజావుగా ఉండక... మన్కాకొట్టినప్పుడు... ఎదురుతిరిగి దానికన్నముందు మనం... దాని విశ్వనేత్రాల్లో దుమ్ముకొట్టి... సంహార కార్యం అంటూ వచ్చేటప్పటికి... నీకు తీసిపోయేవాడిని కానేవ్... అనిచూపించడం... పాత్రమవునా కాదా ?

'నీవు... ఏమంటావ్ ?'

— ఆమాట చెవిని పడి... నా ఆలోచనలు సుడి తిరగడం... వడి తగ్గకముందే ... పోలీసులు వచ్చారు.

నీలగిరి శిఖరాగ్ర పార్శ్వప్రదేశ విహార సందేశము

శ్రీ పిఠాపురము యువరాజాగారు

శిఖరిశేఖరములు చెరలాట లాడుచుఁ
జెలిమితోఁ గలియుచోఁ బలుకులాడె;
ఆమాట లావాడ పాలింప నానాఁడు
మనసాడఁ గాలాడ మసలినాఁడ
మబ్బులే మఱుఁగగు మాటుగా మాయమై
యుఱుములో మెఱుపులో నొదిఁగికొనుచు
గాలిలో వానలో పోలుచుఁ దూలుచు
శిఖరుల చెంతకుఁ జేరినాఁడ
దేవభాషను వాడి దివ్యవాక్కుల నవ్వి
యీరీతి నేమేమొ యెఱుకపఱిచె

"చెల్లెలా! చూచితే చిఱుత యీమనుజుండు
చెప్పచేఁతల మీఱి తప్పనడచు
జ్ఞానమే శూన్యము, ధ్యానమే పూజ్యము
తప్పులో యొప్పులో తలఁపలేఁడు
సర్వస్వతంత్రుఁడై సాటి నాకెవ్వఁడ
నని పిచ్చిపను లెన్నొ యాచరించు."

"అక్క! నీ కింతటి యాశ్చర్య మేలనే
యీనాఁడె వింటిమే యిట్టిచర్య
యీదివ్యలోకంబు నిన్నివిధంబుల
దగ్ధంబు చేసిన దానవుండు
మనుజుఁడే కాఁడటే మఱియెవ్వ రీసృష్టి
నీచముల్ సేయఁగా నిచ్చగింత్రు?"

"ప్రేయసీ! వింటివే ప్రియురాలుఁ బ్రియుఁడును
వలపులకలలలోఁ జెలఁగునపుడు
రాలను ఱువ్వుచు అంపాలఁ గోయుచు
రట్టుసేయుదురు భూరాక్షసులును"

"ప్రాణవల్లభ! నేను బలుమాఱు చూచితి
పాపిష్ఠమనుజుండు పాపకరుఁడు
సత్యమే నచ్చ; దసత్యమే నిత్యము
వానికి నచ్చెడి వర్తనంబు"

"అగ్రజా! యీలింపు మాక్రందమున గ్రుగ్గి
సంసారములు వినాశంబు నందె
జాయాపతుల సాధుచరితంబులును మాసె
పితృపుత్త్రవాత్సల్యగతులు సెడియె
సోదరసోదరీసుహృదయత్వంబులు
సంబంధిబాంధవసఖ్యములును
క్షీణించి క్షీణించి క్షీణత నొందఁగా
మిత్త్రత్వ మెచ్చట మిగులునోయి!

"తమ్ముఁడా! దేశాలు ధరణిఖండాలును
తెరలి తబ్బిబ్బులై తిరిగిపోవ
రణభేరిమ్రోఁతలో రక్తాలరంగులోఁ
బిల్లలపీనుఁగుల్ తల్లిరొదలు
క్రూరప్రవాహాలఁ గొట్టుకపోవఁగాఁ
గన్నీరు, కరుణయుఁ, గలఁకలేక

గంభీరగానంబు గర్వాంధుఁ డగుచును
గానంబు చేయఁగాఁ గార్యకర్త
శాంతియు దాంతియు సౌఖ్యము సఖ్యము
భూలోకమును వీడిపోయె నేమొ"

"మిత్రమా! యీరీతి మిధ్యలో మిడుకుచుఁ
గ్రూరమానవు మహాఘోరకృతులఁ
గుల్లుచుఁ గుందుచుఁ గ్రుంగిపోవుచు నెట్లు
మానవాసికము మసలఁగలుగు ?"

"ఏమౌనో ప్రియసఖా! యెవనికిఁ దెలియును?
ఈ పాపలోకాన నేమి యగునో ?"

అంతలో నగరాజు నట్టహాసము చేసి
స్తనితస్వరంబున సంప్రదించె.

"ఆత్మీయవరులార! యవధారు శ్రద్ధతో
నోర్వఁగా నా కింక నోర్మి లేదు.
భూలోకమును దుఃఖభూయిష్ఠముగఁ జేయు
మానవు లింకను మనఁగరాదు
క్రూరకార్యము లెల్లఁ గ్రుంగిపోవునుగాక!
క్రూరసంస్థలు నేలఁ గూలుఁగాక!
సత్యస్వరూపమే జయము నొందునుగాక!
ప్రేమస్వరూపమే వెలయుఁగాక!
సత్యధర్మైకవిజయవిలాసమునకు
వలయు నసత్యవిధ్వంసనంబు
కాంచఁగలరు మీరు గర్వితమానవ
భంజనంబును నేఁడె, భయము వదలు"

సైన్యాధిపతి యంత సైన్యంబులను గాంచి
ప్రభుఁ జూచి యిట్లని పలుకఁదొడఁగె.
"జయము మహారాజ! జయము మహారాజ!
జయము మీ సేనకు జయము తమకు

మహసానువుల హూపుమాపు మఁ గలిగెను
మానవుం జేనాఁడు మఱిఁ బిపుడు
భీకరమారుతఘోషలు మ్రోయించి
మేఘధూమంబులు మిగులఁ జేసి
వడి నేకధారగా వర్షింపఁ జేయించి
వడగండ్లవానలు దొడరఁ జేసి
మెఱుపుమంటలతోడ నుఱుములు సంఘటించి
పిడుగులఁ బెక్కింటిఁ బడఁగఁ జేసి
భూకంపమున నెల్ల పుడమిని గూల్చి
ప్రళయాగ్నిజిహ్వలఁ బరఁగఁ జేసి
కపటమానవమారకంబైన యజ్ఞంబు
మా ప్రభూ! చేయుము మహిమ చూపు"

వృద్ధుఁ డగునమాత్యవ(?)రుఁ డంతఁ జింతించి
ప్రభునితో మెల్లఁగాఁ బలుకఁదొడఁగె

"రాజేంద్ర! విను భవద్రాజ్యకార్యంబుల
మంత్రంబు చెప్పుట మాకుఁ గార్య
మది విని యటుమీఁద నానతి యొసఁగుము
శిరసావహించెద శిఖరిరాజ!
కలదు మీకును శక్తి కల్లోలమును జేసి
ముల్లోకములు నేఁడు ముంచుటకును
గలదు మీకును బుద్ధి కార్య మకార్యంబుఁ
దెలిసి భేద మెఱింగి తెలియఁజెప్ప
నాపల్కు లాలించి నాకోర్కి మన్నించి
కడఁగుఁడు మీ కార్యకరణమునకు
దుర్మార్గమానవు దుశ్చేష్టితము లింక
భరియింప నేరికి వలను గాదు
అట్లయ్యు నగరాజ! యాలోచనము సేయఁ
గర్తవ్య మేదియో కానరాదు

దుందుభిధ్వనులతో దుర్వారదుస్సహ
దోర్బలసైన్యసందోహములను
దుష్టమానవజాతిఁ దునుమాడఁ బంపుచో
భూలోక మెల్లను బుగ్గి యగును
సైన్యప్రవాహదుస్సహవేగమున నిట్టె
సమసిపోవును సర్వసంఘములును
దుర్మార్గమానవనిర్మూలనములోన
సన్మార్గవర్తులు సత్యపరులు
ప్రేమైకజీవనుల్ విశ్వసేవకులును
నిర్దోషులునుగూడ నిలువకుండ
నాశనమొందుచో న్యాయభంగం బగు
ధర్మము కా దది ధర్మవేది !
బహుముఖంబులఁ బొంగి బ్రహ్మపుత్రానది
పార్శ్వభాగస్థితప్రాణికోటి
వాసి పాటింపక వఱదలోఁ బడవైచి
పొరలుచుఁ బోయెడిపోల్కి నీదు
సైన్యంబు సర్వనాశంబు గావించదే ?
బాగు కా దది మహాభాగ! వినుము"

ఆవాక్య మాలించి యానుడుల్ పాటించి
యాలోచనము చేసి యనియెఁ బ్రభుఁడు
"సత్యము వచియించి సచివోత్తమా! నీవు
న్యాయమే సూచించినాఁడ వయ్య !
కాని, యోమిత్రమా ! కర్తవ్య మెయ్యది ?
క్రూరమానవు నెట్లు కూల్పవలయు ?"
"నాప్రభూ ! చెప్పఁగా నాకును దెలియదు
దేవుఁడే సర్వమ్ము దిద్దవలయు."
ఆనాఁడె యాషాఢ మాదదివసమును
మేఘాలకా నాఁడె మెఱుపువిందు
నగరాజునకు నాఁడె నవవర్షకాంతతో
నవరసనాట్యము నవ్యకళలు
నాశుభసమయాన నాప్రాంతములయందు
మానవుండను నేను మసలరాదు
తెలియక నే నటఁ దిరుగుచు నుండఁగా
మారుతసేవకవీరుఁ డొకఁడు
బిరబిర నేతెంచి గిరగిర ననుఁ ద్రిప్పి
విసరివైచెను వినువీథి కిట్టె
భూలోక మప్పుడు బొంగరంబుగ నుండ
నేలోక మేదియో యెఱుక పోయె
సూర్యుఁడు చంద్రుఁడు చుక్కలు నొక్కటై
చీకట్లు వెలుఁగులు నేకమయ్యె
నారీతి నొక్కింత యాకాశమార్గాన
తిరుగాడి వసుధపైఁ దిరిగి పడితి
నాయాట తిలకించి నాపాటు పరికించి
నవ్వెను గుహలోని నాగకన్య.

———౧———

వ్యవసాయదార్లు, షాహుకార్లు

తిమ్మరాజు సత్యనారాయణరావు

మన దేశంలోని కోటానుకోట్ల ప్రజా సమూహంలో నూటికి డెబ్బయిమందికి పైగా వ్యవసాయంవల్ల జీవించేవారే. ఒకానొకప్పుడీ ప్రజ లెంత సుఖంగా జీవించేవారో మన మెఱుగం కాని, ప్రస్తుతం వారిస్థితి అత్యంత దుఃఖభాజనంగా ఉందనిమాత్రం అందరికీ స్పష్టంగా తెలుస్తూనే ఉంది. పీడించుకుని వారిని ముఖ్యంగా తింటూన్నది దారిద్ర్య పిశాచం. నిజంగా కడుపునిండా రెండు పూటలా తినడానికి చాలని ఆదాయంతో ఈజనసమూహం మాడిపోతున్నారు. వాళ్లు నివసించే గ్రామాలు పట్టణాలకంటె రోగభూయిష్ఠ మైపోయాయి. బండి పోవడానికైనా సరైన బాటలు లేనివి, త్రాగడానికి మంచినీళ్లే లేనివి, క్రిక్కిరిసిపోయి ఇళ్లు ఒక దానిపై ఒకటి పడిపోయేట ట్లున్నవి, వైద్య సహాయం లేనివి, పాఠశాలలు లేనివి గ్రామా లెన్నెన్నో ఉన్నాయి. ఎక్కడో ఒకడుతప్ప మిగతవాళ్లంతా నిరక్షరకుక్షులు, ఉత్తరమైనా చదవలేనివాళ్లు, చేవ్రాలైనా చేయలేక వేలుముద్రలు వేసేవాళ్లు. ఇక పరస్పరకలహాలకీ, పార్టీ దెబ్బలాటలకీ లోటు లేదు. కోర్టులకెక్కి నాశనమైపోయిన కుటుంబా లెన్ని లేవు? ఇన్నివిధాలుగా రైతులజీవనం దుఃఖపూరిత మైపోయింది.

దేశసౌభాగ్యానికి మూలకందమైన వ్యవసాయపరిశ్రమ నిజంగా పరిశ్రమగా నడవడమే లేదు. వ్యవసాయం చేసేవారిలో ముప్పాతిక మూడుపాళ్లు మరొకరి సాయంలేనిదే గత్యంతరం లేక చేయడమేగాని అందువల్ల లాభం వస్తూ ఉండడం కాదు. రైతులకు సగటున మూడు ఎకరాల భూమి అయినా లేదు. దేశంలో ఉన్న భూమిలో ఆరవవంతుమాత్రమే నీటి సదుపాయం కలిగి పల్లపు పంటలకి వీలుగా ఉంది. ఉన్న భూమికూడా చిన్న చిన్న ఖండాలుగా ఇక్కడ ఒకఖండమూ అక్కడ ఒక ఖండమూ చెల్లాచెదరయిపోయి ఉండడం వలన వ్యవసాయదారుడు సరియైన ఉత్తమ పద్ధతుల నవలంబించి వ్యవసాయం చేయలేక పోతున్నాడు. అతనిపశువులు నీరసించిపోయి సరియైన తిండి లేక రోగాల పాలయి నష్టమే కాని లాభం చేకూర్చడంలేదు. ఇదికాక ప్రభుత్వాని కిచ్చుకోవలసిన పన్నులు, షాహుకారుకి ఇచ్చుకోవలసిన వడ్డీలు, కౌలుభూమి అయితే భూమిఖామందుకి ఇయ్యవలసిన శిస్తు - ఇవన్నీ రైతుకు వచ్చే ఆదాయాన్ని మింగివేస్తున్నాయి. ఇంకా దురదృష్ట వశాత్తూ పంటలు సరిగా పండకపోవడం, వానలు కురవకపోవడం, వరదలు, ఇతర ఈతి బాధలు ఇవేవైనా వచ్చి పడినా, కుటుంబంలో కష్టాలు గాని, కార్యాలుగాని తటస్థించినా రైతుస్థితి చెప్పనే అక్కరలేదు.

ఇన్నికష్టాలకు లోనయి పాటుపడుతూ ఉన్న రైతులు ఋణగ్రస్తులైపోయినారంటే

ఆశ్చర్య మేముంది? ఆదాయమా స్వల్పం; మరొక జీవనోపాధి కనపడదు; కుటుంబ భారమా పెరుగుతూఉంది. కార్యాలూ, కలాపాలూ తప్పవు. వర్షాధార మయిన చోట్ల, పంటలు పండని సమయాలలో, ఏయిక్కట్లయినా వచ్చినపుడు గత్యంతర మేమిటి? అంతేకాదు; సాధారణంగా పెట్టవలసిన వ్యవసాయపు ఖర్చులకుసైతము తిండికేనా చాలని ఆదాయంలోనుండి రైతేమి మిగిల్చి పెట్టుబడి పెట్టగలడు? ఒకసారి అప్పు తెచ్చిన తర్వాత ఇంక ఆజన్మాంతమూ అప్పే. షాహుకారుకి ఇయ్యవలసిన దారుణపు వడ్డీ రేట్లతో ఋణవిముక్తి యెల్లా కలుగుతుంది? భూములధరలు, సరుకులధరలు తగ్గిపోవడంతో ఈఋణభారం తడిసి మోపెడై పోతుంది. ఈభారము నెల్లాగైనా తప్పిస్తేగాని రైతులకు తరణోపాయం లేకపోయింది. గత్యంతరం లేక కాంగ్రెసుప్రభుత్వంవారు రైతుల ఋణ బాధ నివారించడానికి కొంత సదుపాయం చేస్తూ ఒకశాసనం నిర్మించినసంగతి అందరికీ తెలిసినదే. అందువలన ఋణగ్రస్తులై పోయిన రైతులకు కొంత ఋణభారం తగ్గి కొందరయినా బయట పడుటకు అవకాశం కలిగింది.

కాని, ఇంతమాత్రంచేత రైతుకష్టాలు గట్టెక్కలేదు. ఋణమనేది ఒకసారి తగ్గించినా, తీసేసినా పోయేది కాదు. మొదలంటా ఋణగ్రస్తతకు గల కారణాలను నాశనం చేస్తేగాని పోదు. తిరిగీ కొలదికాలంలోనే బ్రహ్మాచెముడుడొంకవలె బయలు దేరుతుంది. ఈ కారణాలు వేరే యేమీలేవు. వ్యవసాయ పరిశ్రమను నష్టకారణంగా చేసి, వ్యవసాయదారుని దారిద్ర్యబాధలో ముంచి ఉంచుటకు కారణాలన్నీ పైన చెప్పినవే. ప్రభుత్వంవారూ, ప్రజలూ కలిసి పట్టుదలతో ప్రయత్నించి వ్యవసాయములో సర్వతోముఖాభివృద్ధి కలిగిస్తేనేగాని ఋణబాధ నిజంగా నివారింపబడదు.

ఈ ప్రయత్నా లన్నీ అలా ఉండగా, ప్రస్తుతము రైతులపరిస్థితుల నభివృద్ధి చేయుటకు ప్రభుత్వంవారు చేయగలిగిన కార్యాలెన్నో ఉన్నాయి. అందులో ఒకటి యేమిటంటే, రైతునకు అవసరం వచ్చినప్పుడు సక్రమపద్ధతులమీద తక్కువవడ్డీకి అప్పు లభించేలాగున సదుపాయం కలిగించడం.

“అప్పిచ్చువాడు, వైద్యుడు,
నెప్పుడు నెడతెగక పాఱు నేఱును, ద్విజుడున్,
చొప్పడినయూర నుండుము,
చొప్పడకున్నట్టియూరు చొరకుము సుమతీ”

అని వ్రాయడంలో సుమతీశతకకర్త ఆలోచనాపూర్వకంగానో కాదోగాని, అప్పిచ్చువారిని మిగిలిన అన్నిసదుపాయాలకంటె కూడా, మొదటే పేర్కొన్నాడు. ఈ సదుపాయాన్ని సక్రమపద్ధతులపై కలిగించడానికే సహకారోద్యమం బయలుదేరింది. ప్రస్తుతమీ ఉద్యమం అనేక లోటుపాట్లతో నిండి ఉన్నా, ఎప్పటికైనా ఈ ఉద్యమం ద్వారానే రైతుకు కావలసిన ధనసహాయం, వ్యవసాయాభివృద్ధీకూడా లభించగలవు. ఈ ఉద్యమాన్నిగుఱించి సవిస్తరంగా చర్చించడానికి ఇక్కడ అవకాశం చాలదు.

ఇప్పటి కప్పుడే దాదాపు ముప్పైనాల్గు సంవత్సరాలై బయలుదేరి, ప్రభుత్వసహాయంతో, ప్రజాభిమానంతో, అనేక

మంది నాయకుల తోడ్పాటుతో పనిచేస్తూ ఉన్నప్పటికీ సహకారోద్యమం బహుస్వల్ప సంఖ్యాకులకే ఉపయోగించగిలిగింది. ఇప్ప టికికూడా వ్యవసాయదారులకు కావలసిన అప్పులలో చాలాభాగము షాహుకార్లే ఇస్తున్నారు. అందువలన, ఇంకా చాలా కాలంవరకుకూడా షాహుకార్ల వ్యాపారం, సహాయం రైతుల కవసరం. అనాదినుండీ వస్తూన్న షాహుకార్లు ఒకరోజులో పోయే వారు కారు. వారు పోయినందువల్ల రైతుకు కావలసిన ధనసదుపాయం దొరకకపోవడమే గాని, మరో ప్రయోజనం లేదు.

ఇటువంటి పరిస్థితులలో, షాహుకార్ల వ్యాపారపద్ధతులను మార్చి, కట్టుదిట్టము చేసి, వారికిని రైతులకునుగల సంబంధం పర స్పరోపయోగకరంగా ఉండేలాగున చేయడం ప్రభుత్వంవారి విధ్యుక్తధర్మమై ఉంది.

షాహుకార్లు అనేకరకాలుగా ఉన్నారు. వడ్డీవ్యాపారమే వృత్తిగా జీవించేవారు కొం దరు,—మార్వాడీలలాంటివారు. ఇంక వర్త కము, వ్యాపారము, మొదలయినవి చేస్తూ అప్పులిచ్చేవారు కొందఱు. వ్యవసాయదారు లుగా ఉండి వడ్డీవ్యాపారం చేసేవారు మరొక తరహా. వీరు మనరాష్ట్రంలోను, పంజాబు లోను విరివిగా ఉన్నారు. వీరుకాక ఇతర వృత్తులు చేసుకుంటూ (ప్లీడరీలలాంటివి) మిగుల్చుకున్న డబ్బు అప్పులిచ్చేవారు, తమ దగ్గర కూడబెట్టుకొన్న స్వల్పధనం వడ్డీ కిచ్చి, అందువల్ల జీవించే వితంతువుల్లాంటివారు, మిత్రులకు బంధువులకు అప్పులు, చేబదుళ్లు యిచ్చేవారు ఉన్నారు. ఇంక, దేశదేశాలు తిరుగుతూ పేదప్రజలకు చిన్నచిన్న అప్పు లు, ధనరూపకంగానో, వస్తురూపకంగానో యిచ్చి, వంచించి రాబట్టుకొనే [illegible], వర్తకులూ ఉన్నారు.

సాధారణంగా రైతులు షాహుకార్ల నుండే అప్పుతెచ్చుకుంటారు. ఇందువల్ల వారి కనేకసదుపాయా లున్నాయి. అడగగానే డబ్బు అవసరానికి వస్తుంది. కాలక్షేపం తంత్రముగాని, ఆలస్యముగాని అవసరంలేదు. షాహుకారుకు గ్రామస్థుల ఆంతరంగికస్థితులూ బాగా తెలుస్తాయి గనుక, చిన్న అప్పులకు హామీకూడా అవసరం ఉండదు. అనేకసంద ర్భాలలో షాహుకారు రైతుకు సలహాదా రుగానుండి సహాయం చేయడంకూడా కలదు. అవసరమైన సమయంలో అడగగానే పెద్ద తంత్ర మేమీ లేకుండా అప్పిచ్చేఋణదాత యెడల ఎందరో పేదరైతులు కృతజ్ఞులుగా ఉండడం అందరికీ తెలిసినవిషయమే. షాహు కార్లలో ఉదారస్వభావంగలవా రెందరో ఉన్నారు.

కాని, సాధారణముగా, షాహుకార్ల పద్ధతులు రైతులకు నాశనకరంగా ఉంటాయి. షాహుకారు తనలాభమే చూసుకుంటాడు గాని, రైతుశ్రేయస్సు చూడడు. సరియైన లెక్కలుండవు. అక్షరజ్ఞానమైనా లేనిరైతుకు అసలెంతో, వడ్డీయెంతో, ఎంతయిచ్చాడో, ఎంత యివ్వాలో ఏమీ తెలియదు. షాహు కా రెంత చెపితే అంతే. ఇంక వడ్డీరేట్లా? సాధారణంగా నూటికి ౧౨ కి తక్కువ కాకుండా నూటికి ౭౫, ౧౦౦ వరకూకూడా ఉంటాయి. దీనికిసాయం కాంపౌండు వడ్డీయే సాధారణంగా అమలులో ఉంటుంది. అతి స్వల్పకాలంలోనే వడ్డీ అసలుకంటె యెక్కు వయిపోయి, పాపంలాగ పెరిగిపోతుంది. కొన్ని సందర్భాలలో ఇచ్చినమొత్తంకంటె,

ఎక్కువకు నోటు వ్రాయించుకోవడం, వడ్డీ ముందుగానే యిచ్చేడబ్బులోనుంచి మినహాయించుకోవడం,—ఇటువంటివన్నీ ఉంటాయి.

ఇంక వర్తకం చేస్తూ వడ్డీవ్యాపారంచేసే షాహుకారు సాధారణంగా రైతుపండించే పంటమీద కన్నువేసి అప్పిస్తాడు. పంట పండించిన తర్వాత, తనకే అమ్మాలి. అమ్మడంలోనూ తనయిష్టం వచ్చిన ధరలకే. రైతుకి పండించడంలోను, అమ్ముకోడంలోనుకూడా స్వతంత్రం కాస్తా పోతుంది.

మనరాజధానిలో భూస్వాములుగాను, వ్యవసాయదారులుగాను ఉండి వడ్డీవ్యాపారం చేసేవా రెక్కువ. తనుకూడా రైతేకదా. రైతులకష్టాలు ఇటువంటి షాహుకారుకు తెలియవా అనుకోవచ్చు. తెలిసి, ఉదారభావంతో వ్యాపారం చేసేవారూ ఉన్నారు. కాని అధికసంఖ్యాకులు ఇతర రకాల షాహుకార్లకంటెను కఠినంగా ఉంటారు. కారణ మేమిటంటే, వీరిదృష్టి ధనంమీదకంటెకూడా భూమిమీదనే ఎక్కువగా ఉంటుంది. తనకి కలిసివచ్చేదీ లేక ఫలవంతమై సదుపాయాలు గల భూఖండమేదైనా కనిపించిందా, దాన్ని ఎలాగైనా స్వాధీనం చేసికోవాలనేకాంక్ష కలుగుతుంది. అప్పిచ్చిన తర్వాత షాహుకారు తిరిగియిమ్మని అడగనే అడగడు. అది అల్లా పెరిగిపోతూనే ఉంటుంది. తీర్చివేస్తానన్నా తొందరలేదనో, మంచి రోజు కాదనో, ఏదోవిధంగా జరిపివేస్తాడు. చేతిలో ఉన్నడబ్బు కాస్తా ఖర్చయిపోయిన తర్వాత యింకతీర్చేది యేముంది? ఈ విధంగా అప్పుకి ఆస్తికి సరిపోయేలాగ పెరగనిచ్చి, ఆస్తి వశపఱచుకోవడం ఈరకపు షాహుకార్లవిధానము. ముందుగానే క్రయదస్తావేజు వ్రాయించుకుని అప్పు తీర్చివేసిన తరువాత దస్తావేజు తిరిగి యిచ్చివేయడంకూడా కొన్నిచోట్ల కలదు.

పఠానులు, వర్తకులు మొదలైన దేశద్రిమ్మరి షాహుకార్ల వ్యాపారపద్ధతులు మరీ ఘోరంగా ఉంటాయి. వీరు పేదరైతులకు, కూలీలకు, నౌకర్లు మొదలయినవారికి అప్పులిస్తారు. ఇచ్చేవి చిన్నఅప్పులే—ధనరూపకంగానో, లేక బట్టలు మొదలయిన వస్తువుల రూపకంగానో; వడ్డీరేట్లుమాత్రం అతిదారుణంగా ఉంటాయి. నూటికి ౫౦-కి తక్కువ సాధారణంగా ఉండదు. తిరిగి వసూలుచేయడంలో కొట్టి వసూలుచేయడంకూడా కలదని చెబుతారు.

షాహుకార్లు వసూలుచేసే దారుణం అయిన వడ్డీరేట్లు తగ్గించడానికి, వారు అవలంబించే పద్ధతులను సక్రమంగా ఉంచడానికి, వారి జులుంవలన రైతులు బానిసలయిపోకుండా రక్షించడానికి ప్రభుత్వముగాని, సంఘముగాని వారిని అదుపాజ్ఞలలో ఉంచవలసిన అవసరం ఉంది. ఈ అవసరం అన్నిదేశాల్లోను అనాదినుండీ తెలిసినదే. ధర్మశాస్త్రాలు కొన్నినిబంధనలు విధించే ఉన్నాయి. కాని ఆధునికకాలంలో పూర్వమున్నంతరక్షణ లేకపోయింది రైతుకు. పూర్వము షాహుకారు గ్రామస్థుల సదభిప్రాయానికి, సాంఘికనియమాలకి లోబడి ఉండవలసిన అవసరం ఉండేది. ఇప్పు డది అంతా అవసరంలేదు. షాహుకారును రక్షించడానికి కోర్టులు, లాకోర్టులు ఉన్నాయి. పోలీసువా రున్నారు. అతడు సంఘాభిప్రాయాన్నిగురించి లెక్కచేయవలసిన అవసరం లేదు.

తప్పంతా షాహుకారుదే కాదు; కొంత వరకు రైతులుకూడా షాహుకారు అవలంబించే పద్ధతులకి కారణభూతులే. అదును చూసికొని, ఇచ్చినసొమ్ము ఎగబెట్టదలచిన వారు, ఎగబెట్టేవారు ఎందరో కలరు. ఇచ్చినా కోర్టుల కెక్కించి, బోలెడంత ఖర్చు పెట్టించి, డిక్రీ పొందినా ఆస్తి స్వాధీనం కాసీయక ముప్పతిప్పలూ పెట్టి మూడుచెరువుల నీళ్లు త్రాగించేవారూ ఉన్నారు. ఇట్టి కష్టనష్టా లన్నిటికీ సర్దుకోడానికిగాను షాహుకారు రాబట్టగలిగినచోట పేలవేసి బోలెడంత వడ్డీ, అసలు రాబట్టుతాడు. అందుకనే ఎక్కువ వడ్డీరేట్లు. బ్రిటిషు పరిపాలనలో భూమియందు వ్యక్తులకుగల హక్కులు చట్టములమూలమున స్పష్టంగా ఏర్పఱచబడడంచేతను క్రమంగా నీటిసదుపాయాలు, ప్రయాణసౌకర్యాలు మొదలైనవానివలన భూములవిలువ హెచ్చుటచేతను, వ్యవసాయదారునకు భూమితనఖామీద బాగా అప్పుపుట్టుటకు అవకాశం కలిగింది. ఈయవకాశాన్ని అవసరానవసరాలతో నిమిత్తం లేకుండా తెచ్చిన అప్పు వ్యాపారానికి ప్రయోజనకారిగా ఉండాలిగాని ఊరికే తినివేయడానికి ఉపయోగించరా దనేదృష్టి లేకుండా వ్యవసాయదార్లు విచ్చలవిడిగా ఉపయోగించి అధోగతిపా లయిపోయారు.

ఇప్పుడు మనరాష్ట్రంలో ఋణగ్రస్తులకు సదుపాయం కలిగిస్తూ కొన్నిసందర్భాల్లో వడ్డీ పూర్తిగా కొట్టివేస్తూ, కొన్ని అప్పుల విషయంలో వడ్డీరేటును నూటికి ౫ కి తగ్గిస్తూ, ఇకముందు కూడా ౧౦౦ కి ఆరుంబాతిక కంటె వడ్డీ మించరాదని నిర్ణయంచేస్తూ, అసలీఫాయిదాలు కలిసి అసలుకు రెట్టింపుకంటె దాటరాదనే ఉద్దేశంతోను [illegible] వ్యవసాయదారుల ఋణవిమోచన చట్టాలు అమలులోనికి వచ్చినవి. ఇటువంటి శాసనాలే ఇతరరాష్ట్రాలలోకూడా ఏర్పడుతున్నవి. కొంతకాలమునుంచీ షాహుకార్లకు కష్టం కలిగి ఇదివరకంత విరివిగా వారు వ్యాపారం చేయడంలేదు.

అయితే నేమి, ఇంకా చాలాకాలంవరకూ షాహుకారుసహాయం లేనిదే వ్యవసాయదారు జీవించలేడు. పరిశ్రమలు, వర్తకమూ మొదలైనవాటిలో పెట్టుబడికి విరివిగా అవకాశం కలిగేవరకూ షాహుకారు తనడబ్బును వ్యవసాయదారులకు అప్పులీయక మరేమీ చేసుకోలేడు. అందుకని రైతు, షాహుకారు - ఇద్దరి శ్రేయస్సుకూ కావలసిన దేమిటంటే, ఈయిద్దరి సంబంధమూ పరస్పరాభివృద్ధికరంగా ఉండేలాగున ఏర్పాటు చేయడం. అందుకని షాహుకార్ల వ్యాపార పద్ధతులు సక్రమంగా ఉండేలాగున నియమిస్తూ రాష్ట్రీయప్రభుత్వాలు చట్టాలు నిర్మించవలసి ఉన్నది.

ఈచట్టములలో ముఖ్యమైనది, షాహుకార్లంతా లైసెన్సులు పొందవలె నన్న నియమం. ప్రతిషాహుకారూ తాను వడ్డీవ్యాపారం చేసే వాడని రిజిష్టరు చేయించుకోవాలి. అందుకని కలెక్టరువద్దనో, తహశీల్దారువద్దనో లైసెన్సు పొందాలి. ప్రభుత్వంవారు నియమించిన పద్ధతిప్రకారం తనదగ్గర అప్పు తీసికొన్న ప్రతివారిపేరిట సక్రమమయిన లెక్కలు వేసి ఉంచాలి. ఆ లెక్కలు ఆరునెలలకో లేక సంవత్సరానికో ఒకసారి వేసి ఋణస్థునికి తెలియజేయాలి. తనకు చెల్లించిన ప్రతిమొత్తానికీ స్పష్టముగా

రశీదు ఇవ్వాలి. ప్రభుత్వంవారు నియమించిన వడ్డీరేటుకంటె ఎక్కువవడ్డీ విధించరాదు. మామూలుగా షాహుకార్లు చేసే తికమక లేవి చేసినా, రిజిస్ట్రేషను పోతుంది; శిక్షకూడా పడుతుంది. రిజిస్టరుచేయించుకోకుండా వ్యాపారంచేసేవారికి రావలసిన అప్పులకు, లేక సరియైనలెక్కలూ అవీ ఉంచని అప్పులకు కోర్టువారు డిక్రీ లివ్వరు. ఈవిధంగా వడ్డీవ్యాపారం బ్యాంకులు, సహకార సంఘములు మొదలయినవానిలోవలెనే సక్రమం అయిన వ్యాపారంగా ఏర్పడుతుంది. ఇటువంటి శాసనాల అవసరాన్ని గురించి రిజర్వుబ్యాంకువారు తాము వ్యవసాయదారులకు ధనసదుపాయాన్ని గురించి వ్రాసిన నివేదికలో ఇలా వ్రాశారు:

"గ్రామంయొక్క ఆర్థికనిర్మాణంలో షాహుకారు చేస్తున్నపని నిస్సందేహముగా చాలా అవసర మయినది. ఆతనివ్యాపారాన్ని సక్రమపద్ధతులలో ఉండేలాగున నియమించడం ఇదివరకే యెన్నడో జరిగియుండవలసినది."

ఇటువంటి నియమాలవలన షాహుకార్లకు యిబ్బంది కలిగి వ్యాపారం తగ్గించేయరా అని అడుగవచ్చును. కొంతవరకు అలా తగ్గడమూ మంచిదే. అప్పు చేసి బ్రతకడం మానేసి, ఆదాయంలో ఖర్చులు సరిపెట్టుకోడం రైతులకు కొంతయినా అలవాటవుతుంది. అదికాక, ఈ నియమాలవలన మోసంచేసే ఉద్దేశాలులేని షాహుకారుకేమీ నష్టములేదు. ఇట్టిశాసనాలనుగురించి రిజర్వుబ్యాంకువారు తమనివేదికలో ఇల్లా వ్రాశారు:

"అటువంటి శాసనాలు, షాహుకారు కొన్ని సక్రమపద్ధతుల నవలంబించా లని మాత్రం నియమిస్తాయి. బాకీదారుయొక్క అవసరమును, అజ్ఞానమును ఉపయోగించుకుని షాహుకారు అతనికి అన్యాయం చేయకుండా ఉండాలనియే వాటి ఉద్దేశము. విద్యావంతు లయిన ప్రజలతో వ్యాపారంచేసే కంపెనీలు, బ్యాంకులు, భీమాకంపెనీలు మొదలయిన వన్నీ శాసనబద్ధములుగా ఉండగా, చదువు రాని రైతులతో వ్యాపారంచేసే షాహుకార్లుమాత్రం తప్పించుకుపోవా లని చూడడాని కేమీ హేతువు లేదు. కనుక, సబబయిన శాసనాలద్వారా వడ్డీవ్యాపారం క్రమబద్ధను చేయాలనీ, అందరు షాహుకార్లు నిర్బంధంగా రిజిస్టరుచేయించుకోవాలనీ మాఉద్దేశము. అంతేకాక, ఈ శాసనాలలో నియమాలని దాటినందుకు విధించే శిక్షలసంగతి అటుంచి, షాహుకార్ల లెక్కలను తణిఖీచేయించడాని కొక విధానం ఏర్పాటుచేయాలని మాసలహా. ఇందువలన మోసపుపద్ధతులు మిగిలిన శిక్షలవలనకంటె కూడా పూర్తిగా నిర్మూలం కాగలవు. వడ్డీవ్యాపార మీరీతిని సక్రమ మైతే, షాహుకార్లలెక్కలపుస్తకాలు చూసి ఋణగ్రస్తత ఎవరిలో ఎంతవరకూ వ్యాపించియున్నదో సరిగా తెలుసుకోడానికి వీలవుతుంది; అప్పుడు దాన్ని నిర్మూలించడానికి తగినసాధనా లేవో ఆలోచించడం ఇప్పటికంటె సులభము, ఉపయోగకరము అవుతుంది."

ఇప్పుడు బాగా సంపాదిస్తూ కూడా ఆదాయపుపన్ను తప్పించుకొనే షాహుకార్లంటె వా రందరినుండీ పన్ను రాబట్టడానికి కూడా వీలవుతుంది.

ఈనియమాలవలన రైతుకి లాభంకాని షావుకారు కేమి ప్రయోజనం? అని అడగ వచ్చును. ముఖ్యమైన ప్రయోజన మేమంటే, షావుకారు చేసేవ్యాపారం నలుగురిచేత, ప్రభుత్వంవారిచేత న్యాయమైన వ్యాపారముగా పరిగణింపబడుతుందిగాని, దోపిడీవ్యాపారంగా పరిగణింపడదు. మొన్నటి ఋణ బాధానివారణశాసనంలో చూడండి — బ్యాంకులు, సహకారసంఘాలు మొదలయినవి నష్టపోలేదు. షావుకారు నష్టపోయినాడు. ఇటువంటి విచక్షణకు ఇకముందు అవకాశం ఉండదు. న్యాయమైన వ్యాపారం చేసే షావుకారు కేమీ నష్టం ఉండదు. ప్రభుత్వంవారి రక్షణకూడా ఉంటుంది.

అంతేకాదు; షావుకార్లకు బ్యాంకులతో సంబంధము కలిగించి రిజర్వుబ్యాంకువారు అవసరమయిన సందర్భాలలో వ్యవసాయదారులకొరకు ధనసదుపాయం చేయడానికి వీలవుతుంది. షావుకార్లు రైతులకు పంటలహామీమీద అప్పు లిస్తే, అందుకు కావలసినధనం బ్యాంకులు సర్దుబాటు చేయవచ్చు. బ్యాంకుల కవసరమయితే, ఇటువంటి షావుకార్లిచ్చిన పత్రముల హామీమీద రిజర్వుబ్యాంకువారు తక్కువరేట్లకు అప్పు లియ్యవచ్చును. ఈ విధముగా షావుకార్లకు రిజర్వుబ్యాంకుద్వారా తక్కువ వడ్డీలకు ధనసదుపాయం కలిగి విరివైన వ్యాపారానికి అవకాశం కలుగవచ్చు. ఇటువంటి సంబంధము యేర్పరచడానికి రిజర్వుబ్యాంకువారు బ్యాంకులతో అప్పుడే సంప్రతిస్తున్నారు.

పైన చెప్పినటువంటి శాసనాలు అప్పుడే బొంబాయి రాజధానిలోను, పంజాబులోను, ఏర్పడినవి. కొలదిరోజులక్రితమే హైదరాబాదులోకూడ ఒకశాసనం నిర్మించారు. ఋణగ్రస్తులకు సహాయం చేయడంలో ముందంజవేసిన మద్రాసుప్రభుత్వంవారుకూడా త్వరలో ఇటువంటి శాసనం నిర్మించాలి.

"శాసనం చేసినంతమాత్రాన యేమయినట్లు? షావుకారు బలవంతుడు, బాకీదారు బలహీనుడు. అందువలన శాసన నియమాలను చులకనగా దాటేసే యేర్పాట్లు షావుకారు చేసుకోలేడా? వడ్డీరేటు నూటికి ఆరుంబాతిక కంటె ఎక్కువ ఉండరాదంటే, అసలు మొత్తమే యెక్కువ వ్రాయించుకోలేడా?" అని అడగవచ్చును. నిజమే. కాని శాసన మేర్పరిస్తే దాన్ని ఉపయోగించుకొనే బాధ్యత ప్రజలది. కాలక్రమేణా అదే అమలులోనికి వస్తుంది. ఈసందర్భంలో 'రాయల్ అగ్రికల్చరల్ కమిషను'వారు చెప్పిన యీ క్రిందివాక్యములు గమనించదగినవి.

"అజ్ఞానమువలనకాని, దుర్వ్యయము వలనగాని, తన్నుతానే నాశనం చేసుకోడానికి నిశ్చయించుకొన్న రైతును, ఎంతటి సానుభూతితోను, ఎంతప్రజ్ఞతోను నిర్మించిన శాసనము లయినా కాపాడజాలవు. అట్టి సందర్భాలలో, షావుకారుచేసే కుతంత్రాలకు, బాకీదారుని నిర్లక్ష్యానికి రెండే అమోఘౌషధా లున్నాయి — విద్యాభివృద్ధి, సత్స్వభావాభివృద్ధి."

విరహవీణ

తల్లావజ్ఝల కృత్తివాస తీర్థులు

౧

చీకట్లో నిన్ను వెతుక్కొంటూ మిణుగురు దీపంతో రగిలిన ఆశతో వేణువనవీధి కలయ వెతికినాను. మాయనిమల్లెదండ నాకబరీభరంలోంచి తీసి, ఒక్కొక్కపువ్వు నేను వెళ్లే త్రోవలో వేస్తూవచ్చాను. ఉషస్సురేకులతో వికసించాక మల్లెపువ్వుల వరస చూసి గొల్లపడుచులు ముసిముసినవ్వులు నవ్వుకొంటారు. 'రాత్రి ఎవరో అభిసారిక ఈదారినే వెళ్లింది' అనుకొంటారు.

౨

వసంతం కోకిలకాకలీమధురవంతో, రత్నకాంతుల మధువుతో, కన్నులు చెదిరే రంగురంగుల పువ్వులతో, పరిమళాలతో విరిసింది.

నాకు కలతనిద్ర. మృణాలనాళబాహుపాశాలతో నిన్ను తనివితీర కౌగలించుకొన్నట్టు కలవచ్చింది. నా కేశపాశములో చిక్కుకొని వేలాడుతున్న జాజిదండ నువ్వు సవరించినట్టు తోచింది. నా స్తనపట్టకంమీద చందనం జల్లువలె చిలకరించినట్టు తోచింది. తనువు కడిమివలె పులకలతో విరిసింది.

కలతనిద్ర యథార్థమువలె తలచాను. పక్కనో త్తిగిల్లితే నువ్వు కనపడవు! నా దొంగా పారిపోయావా? నన్ను మోసగిస్తావా? వ్రజాంగనలను మోసంచేసినట్టే నన్ను నీమాయలో పడేశావోయి!

3

చేలగట్టున మనిషిఎత్తున గడ్డి పెరిగింది. మలయమారుతము నీతో దాగుడుమూతలాడుతూ దట్టమైనగడ్డిలో మృదుస్వనం చేస్తున్నది.

౪

ఏచెట్టు ఏచేను ఏత్రోవ చూసినా ఎందుకో కనిపెట్టుకొన్నట్టు ఉంటవి. ఆకుల జొంపములో పిట్టలు ఏవో అవ్యక్తాలాపాలు చేస్తుంటవి.

ఆకులురాల్చిన మోడైనతరువు చేతులెత్తి ఎదురుచూస్తూ ఆశతో ఉన్నది.

(—'విరహవీణ' నుండి)

—— * ——

ఈజిప్షనుల ఐక్యం—
ఇండియనుల వైవిధ్యం

వేలాల సుబ్బారావు

ఇండియాలో హిందూ - ముసల్మానుల సఖ్యంకోసం రెండు పార్టీలవారి నాయకులూ కలిసి ఇటీవల సలుపుతూవచ్చిన ప్రయత్నాలన్నీ విఫలమైనట్లు ఇటీవల పత్రికలలో వెలువడిన వార్తలవల్ల విశదమవుతూఉంది. హైందవులంతా కలిసి యేకమైనారని విన గలిగే శుభదినం ఇంకా ఎంతదూరాన వుందో తెలియదు. అది ఇంకా వెనక్కే పోతూ నెత్తిమీది పడదాను ఇంకా ముందుకే లాక్కొంటున్నట్టుంది ముఖంకన్పించకుండా.

బ్రిటిష్ వారు ఒకవేపున భారతవర్షాన్ని ఆక్రమించుకొంటూ తోడుతోడనే మరో వేపు దాన్ని స్థిరంగా నిలుపుకోడానికి గావలసిన కట్టుదిట్టాలన్నింటినీ చేసుకొంటూనే వచ్చారు. ఈదిగ్బంధనాలు ఇండియాకు నాల్గుమూలలా ఏర్పడుతూవచ్చాయి. వాటి యన్నింటిలో సూయజుకాలువనిర్మాణమూ, ఈజిప్టు ఆక్రమణమూ రెండూ మరింత ముఖ్యంగా గణింపదగినవి. అంతకుపూర్వం ఎంతకాలాన్నుంచో కనిపెట్టుకొని వున్నప్పటికీ ఈజిప్టును హరించగలశుభదినం ౧౮౮౨ లో లభించింది బ్రిటిష్ వారికి. అంతవరకూ ఈజిప్టు టర్కీ సామ్రాజ్యానికి చెందిన సామంతరాజ్యం. ౧౮౮౨ తరువాతకూడా ఆంగ్లేయులు దాన్ని నామకార్థం టర్కీ సుల్తాను ఆధీనంలోనే వుంచి ఆసలైన ఆయువుపట్లనుమాత్రం తమ చేతుల్లోనే వుంచుకొని నాటకం జరిగిస్తూ వచ్చారు. జర్మనీ యుద్ధారంభంవరకూ ఈనాటకం నిరాటంకంగా సాగుతూవచ్చింది. కాని తర్వాత టర్కీ జర్మనీపక్షం అవలంబించడంచేత ఒక్కపెట్టున టర్కీ సంబంధపు త్రాళ్లను తెగగొట్టి ఆంగ్లేయులు ఈజిప్టును తమ సంరక్షణం క్రిందికే తీసుకొన్నారు. ఈజిప్టు ఇంగ్లాండుల సంఘర్షణాని కిదే ఆరంభం. అదిమొదలు ఈజిప్షనులు నిద్రాహారాలు మానుకొని మొండికి దిగి, ప్రాణాలను లెక్కగొనక ప్రయత్నించి ఏదో వకవిధమైన స్వాతంత్ర్యం లభించే వరకు వదిలారు కారు తమ పట్టుదలను. చివరకు బ్రిటిష్ సింహానికీ పంజా వెనుకకు లాక్కోక తప్పింది కాదు. కాని మన ఇండియా? దీనికీ బ్రిటిష్ వారికీ ౧౮౫౭-వ సంవత్సరానికి ముందటినుంచే ఆరంభమైంది ఘర్షణ. ఇప్పటికీ ఘర్షణ ఘర్షణగానే వున్నది. స్వాతంత్ర్యం లాక్కోడానికి ఎన్ని సదవకాశాలో లభించాయి. అన్నీ వ్యర్థంగానే పోయినాయి. కారణం ఏమిటి? ఒక్కఅర్ధశతాబ్దిలో ఈజిప్టుకు ఏదోవకవిధమైన స్వాతంత్ర్యం లభించడం ఏమిటి? అంతకంటే ముందునుంచీ తన్నుకొంటున్నా మన వల్త్రాళ్లు ఇంకా తెగకుండా మరింత బిగుసుకపోవడం ఏమిటి?

మొదట వ్రాసినవే ఈ రెండింటికీ కారణాలు— ఈజిప్షనుల ఐక్యం; ఇండియనుల వైవిధ్యం.

ఇండియాలో అనేకమతా లున్నాయి. ఒక్కొక్కమతంలో అనేకశాఖలు. వాటి యన్నింటిలో హిందూ ముసల్మానుమతాలు రెండూ మిక్కిలి ప్రధానమైనవని అందరికీ తెలుసు. ఈజిప్టులోనూ అనేకమతాలవారూ జాతులవారూ ఉన్నారు వా రందరిలో ముసల్మానులూ కాప్టులూ ముఖ్యులు—ఇక్కడి హిందూ ముసల్మానులను సరిపోలిన వారు. ఈజిప్టులోని మొత్తం జనసంఖ్య ౧,౩౯, ౮,౦౦౦. అందులో ౧,౨౬,౩౪, ౦౦౦ మంది ముసల్మానులు. ౮,౫౯,౦౦౦ మంది కాప్టులు. ౧,౦౮,౦౦౦ మంది ఇతర క్రైస్తవులు. ౬౦,౦౦౦ మంది యూదులు. ౪౯,౦౦౦ మంది ప్రొటెస్టెంట్లు. ఇంత కంటెనూ హీనసంఖ్యల్లో సిరియనులు, ఆంగ్లేయులు, పరాసులు, లెవెంటైనులు, పర్షియనులు, గ్రీకులు, ఇటాలియనులు, తురుష్కులు లోనగు జాతులవారు కలరు.

ఇక్కడి హిందూ ముసల్మానులవిషయమై అందరికీ తెలిసేవుంది. ఈజిప్టులోని ముసల్మానులునూ ఇక్కడి మనసోదరులవంటివారే. కాప్టులనుగురించి వేరొకసందర్భంలో సవిస్తరంగా వ్రాయాలి; కాని సంగ్రహంగా తెలపాలంటే వీరు క్రైస్తవుల్లోని వకతెగవారు. క్రీస్తుపూర్వంలో ఉండిన ఈజిప్షనుల సంతతివారు. ఉత్తరఈజిప్టులో కొంచెం ఎక్కువగా ఉన్నప్పటికీ మొత్తంమీద దేశమంతటా వ్యాపించివున్నారు. ఖండఖండాంతరాల్లోని ఆదిమజాతులవారివలె ఈజిప్షనులునూ ఆదిలో ఒకవిధమైన మూర్తులను పూజిస్తూ ఉండేవారు. క్రీస్తు జన్మించినతరువాత కాలక్రమాన్ని అందరూ ఆమతం పుచ్చుకొన్నారు. క్రీ. శ. ౬౩౯ - ౬౪౧ లో ఓమరుఖలీఫా సేనానుల్లో వొకడైన అమ్రు ఈజిప్టును జయించేటంతవరకూ అక్కడివా ళ్లందరూ క్రైస్తవులే. మొదలు ఈ కాప్టులకూ ముసల్మానులకూ తగాదా లేమీ వుండేవి కావు. మీదుమిక్కిలి తమదేశాన్ని అంతపర్యంతం పీడిస్తూవున్న రోమనుపాలకులను వెడలగొట్టేటందుకు కాప్టులు ముసల్మానులకే సహాయంచేస్తూవచ్చారు. కాని కొంతకాలం గడచినపిదప ఈస్నేహసంబంధం తెగింది. ఇండియాలోలాగే అక్కడా మతకలహాలు అనేకరూపాలతో ఆవిర్భవించాయి. అంతటితో ఇష్టంమీద కొందరూ, బలవంతంమీద కొందరూ, స్వార్థానికి కొందరూ, పరార్థానికి కొందరూ, నయాన కొందరూ, భయాన కొందరూ కాప్టులు ఇస్లాంమతం స్వీకరించారు. ఇట్లా కొన్నిశతాబ్దాలు గడిచేసరికి అదివరకు అధికసంఖ్యాకులుగా వున్న కాప్టులు అల్పసంఖ్యాకులుగా పరిణమించారు. ముసల్మానులసంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. అధికసంఖ్యాకుల చేతుల్లో అల్పసంఖ్యాకులకు భరింపనలవికాని కష్టాలూ, యాతనలూ కలుగుతూవచ్చాయి. ఇటువంటిశుభావకాశాలకు వెదకుతూవున్న బ్రిటిష్‌దొరలు సరిగ్గా సమయంలో వలవేసి ఈజిప్షనులను పట్టుకొన్నారు. అందువల్ల అదివరకు ముసల్మాను — కాప్టుల్లో జరుగుతూవచ్చిన పోరాటాలు తగ్గాయి. క్రమంగా ఒకవిధమైనజాతీయభావాలు అంకురించి వృద్ధిని పొందాయి. ఉభయులూ తమలోగల దోషాలను గుర్తించుకొన్నారు. అదిమొదలు వారిప్రవర్తనాల్లో పరివర్తనా లేర్పడ్డాయి. జాతీయపక్షం వెల

సింది. ఈ జాతీయపక్షంవారికి టర్కీయాధిపత్యం అక్కరలేదు; బ్రిటిష్ వారి సంరక్షణమూ అక్కరలేదు. ఈజిప్టుస్వాతంత్ర్య మొక్కటే వారికి కావలసింది. ఈ జాతీయుల ముఖ్యనాయకుడు జగ్లుల్ పాషా. ఇతడు ఈజిప్టులో జన్మించినవాడు. అల్‌హజారు (ఈజిప్టు విశ్వవిద్యాలయం) విద్యార్థి. కొన్నాళ్లు విద్యామంత్రిగా, కొన్నాళ్లు న్యాయశాఖామంత్రిగా పనిచేశాడు. ఈజిప్టును స్వతంత్రం చేయడానికి ఇతడు ఎన్నిప్రయత్నాలనో సలిపాడు. ఏవిధానా కార్యం ఫలించింది కాదు. చివరకు తన దేశాధివాసులైన అన్నిమతాలవారికీ,అందలోనూ ప్రధానంగా ముసల్మాను—కాప్టులకు సఖ్యం కుదిరితేనే తప్ప మరోమార్గాన నది లభించేది కాదని నిశ్చయపరచుకొన్నాడు. తదనుసారం జాతీయభావాలు కలవారి నందరనూ పోగుచేసి మీదవచించిన జాతీయవర్గాన్ని నిర్మించాడు. ఈవర్గీయులకు ముసల్మాననీ, కాప్టులనీ, యూదులనీ విభేదం లేదు. ఈజిప్టు అధివాసి అయితే చాలు. అందరూ వొక్కటే. జర్మనీ యుద్ధం ఆరంభ మైన తరువాత ఏకారణం చేత నైతేనేమి ఈజిప్షను లందరూ మిత్రమండలివారికే తోడ్పడుతూవచ్చారు. ౧౯౧౮ లో ఆర్మిస్టిస్ అయింతరువాత విల్సన్ నియమాలప్రకారం కొన్ని చిన్నరాజ్యాలవారికి స్వాతంత్ర్యం లభించింది. కాని ఈజిప్టు కేమీ దొరికింది కాదు. అదిమొదలుకొని ఈజిప్టు స్వతంత్రతాసంరంభం ప్రచండరూపం దాల్చింది. కాని జాతీయవాదుల్లోనూ మితవాదులనీ, అతివాదులనీ రెండుపార్టీ లేర్పడ్డాయి. ఇందు మొదటి పక్షంవారు బ్రిటిష్ సంరక్షణక్రింద వుండి వా ర్లేర్పరచిన రాజ్యప్రణాళికను స్వీకరించాలని చెప్పేవారు. కాని జగ్లుల్ పాషాపక్షపు అతివాదులు కడి కట్టరు. వీరికి కావలసింది సంపూర్ణస్వాతంత్ర్యం. అల్‌హజారు విద్యార్థులే కాదు, అనేక ప్రొఫెసర్లు కూడా జగ్లుల్ పార్టీలో చేరి దేశ మంతటా జాతీయప్రచారం సాగించారు. పారిసులో శాంతిసమావేశం జరుగుతూవున్న రోజుల్లో అక్కడికి పోయి తమకోర్కెలను తెలుపుకోడానికి అనుమతి నివ్వవలసిందని జగ్లుల్ పార్టీవారు కోరగా అప్పు డక్కడ హైకమీషనరుగా ఉండిన సర్ ఆర్. వింగేటు సిఫార్సు చేసినప్పటికీ హోము డిపార్టుమెంటువారు అంగీకరించారు కారు. అంతటినుంచి జాతీయ సమారంభాలు మహా తీవ్రమైనాయి. అందువల్ల ౧౯౧౯ సం. మార్చినెలలో జగ్లుల్‌ను, మరికొందరను అరెస్టుచేసి మాల్టాదీవికి పంపించారు సర్కారువారు. దానితో మరింత ప్రజ్వరిల్లింది జాతీయవాదుల ప్రచారాగ్ని. పాలకపాలితులకు కలిగిన పోరాటాల్లో ఎందరు దేశభక్తులు స్వాహా అయినారో తెలియదు. పాలకులతరఫున ఆర్డినెన్సులే కాదు, కర్ఫ్యూ ఆర్డర్లే కాదు, మార్షల్‌లాలే కాదు ఎన్నో వెలిశాయి, దేశభక్తుల ఉద్రేకసమారంభాలను చంపేసే సాధనోపాయాలు. ఇక్కడ ఈజిప్టులో జాతీయోద్యమాలను అడగద్రొక్కుతూ, ఒకప్రక్క బ్రిటిష్ రాజనీతివేత్తలు సర్ ఆర్. వింగేటును లండనుకు రావించి అతనితో నచటి స్థితిగతులను గురించి సంప్రతించారు. ఈజిప్టు సేనలూ, పోలీసువర్గాలూ ప్రభుత్వపక్షమూని పని చేయడంవల్ల ఎట్లాగయితేనేమి కొంత కాలానికి అల్లరులు కొంచెం తగ్గాయి. కాని జాతీయవాదుల్లో ఆవేశం పెరుగుతూనే

పోయింది. పిదప అల్లెన్‌బీ అనునతడు హైకమీషనరుగా వచ్చి దేశమందలి నిర్బంధ విధానాలను చాలవరకు తొలగించాడు. శాంతిని స్థాపించాలని ప్రయత్నం చేస్తూ జగ్లుల్ మున్నగువారిని విడుదల చేయించాడు. వారక్కడనుండే పారిసుకు బోయి తమ దేశీయులపక్షాన వాదింపవలెనని తలపోసి వెళ్ళారు కాని అప్పుడు వారినక్కడ బలుకరించినవారే లేరు. ఈజిప్టులో ఈ జాతీయోద్యమాలమూలంగా కొంతఫలం కలగలేదనడానికి వీల్లేదు. ఈజిప్టులోని పరిస్థితులన్నింటినీ విచారించి తెలియపరచవలసిందని మిల్నరుకమీషను నియోగించారు పాలకులు. ఆ కమీషనువారు వెంటనే వచ్చి విచారించినట్లయితే పరిస్థితులెట్లు ఉండేవో చెప్పటకు వీల్లేదు కాని కమిటీవారు రావడంలో ఆలస్యం జరిగింది. పారిసులోని ప్రయత్నాలు సఫలం కాలేదని తెలియడంతోటే ఈజిప్టులో జాతీయుల కార్యాలు మరల పూర్వరూపంవహించాయి. ఖిలాఫత్తు రోజుల్లో ఇక్కడ ఇండియాలో హిందూ మునల్మానులేకమై ఏకశరీరంగా ప్రవర్తించినలాగు కాప్టులూ, మునల్మానులూ అనే భేదం మరచి వారిచర్చిల్లోకి వీరూ, వీరిమసీదుల్లోకి వారూ నిరాటంకంగా జొరబడి జనులకు ఐక్యమునుగురించి నూరిపోశారు. తర్వాత కొన్నాళ్లకు మిల్నరుకమిటీవారు వచ్చేసరికి వారికి ఇక్కడ సైమనుకమీషనువారికి జరిగిన మర్యాదలే జరిగాయి. కాని ఏదోవిధంగా రిపోర్టును తయారుచేసుకొని పొయ్యారు కమిటీవారు. అటుతరువాత పాలకులు ఈజిప్టును తమ సంరక్షణనుంచి తొలిగిస్తూ స్వాతంత్ర్యం ఇస్తున్నామని ఆ సంయుక్తనిర్వాచనపద్ధతిమీద ఒక క్రొత్త రాజ్యాంగవిధానాన్ని ప్రసాదించారు. కాని ఈజిప్షను జాతీయవాదుల కిది రుచించలేదు. దానిమీద మళ్లీ వాదవివాదాలు చెలరేగాయి. ఆపద్ధతిని స్వీకరించినయెడల తమ దేశం రెండుగా చీలుటకు అవకాశం గలదనీ, దానిద్వారా స్వాతంత్ర్యం ఎప్పటికీ లభింపదనీ జాతీయవాదులు దానిని తిరగ్గొట్టారు. అటుపిమ్మట జాతీయులందరూ కలిసి తమకేలాటి రాజ్యాంగవిధానం కావాలో పరిష్కరించుకొని చిత్తును వ్రాసి సర్కారువారికి పంపారు — దాన్ని అంగీకరించవలసిందని కోరుతూ. ఈప్రయత్నాలన్నీ ముమ్మరంగా జరుగుతూవున్న సమయంలోనే జగ్లుల్ పాషా కీర్తిశేషుడవడం సంభవించింది. ఈ దేశభక్తునిమృతికి దేశీయులు మహాకరుణంగా విలపించారు. అంతవరకూ జాతీయాభిప్రాయాలను గలిగివుండీకూడా స్వల్పభేదాల మూలంగా దూరంగా వుండిన దేశభక్తులెందరో ముందుకు వచ్చి అంతవరకూ పనిచేయుచున్నవారితో చేతులు గలుపుకొని సంపూర్ణస్వాతంత్ర్యంకోసం దేహాలను అర్పిస్తామని ప్రతిజ్ఞలను చేశారు. బ్రిటిష్‌వారు అప్పుడు దేశీయుల్లో కలిగిన జాగృతిని గ్రహించారు బాగా. జాతీయభావాలను అణగద్రొక్కడానికి చేయవలసిన ప్రయోగాలన్నీ అదివరకే విఫలమైనందుననూ జాతి మత విభేదాలను కట్టిపెట్టి అందరూ ఏకమై కోరుకొన్నందుననూ వీరు తయారుచేసిపంపుకొన్న చిత్తుచట్టాన్ని స్వీకరించారు దొరలు. దానిని అంగీకరించక తప్పింది కాదు. ఇట్లు ఈజిప్షనుల ఐక్యం ఫలించింది చివరకు. అదిమొదలు నేటివరకు ఆదే పద్ధతిమీద రాజ్యాంగవిధానం

సాగుతూవస్తూంది. ఇందుమూలంగా ఇప్పుడు కాప్టులకు అల్పసంఖ్యాకపద్ధతిద్వారా రావలసిన స్థానాలకంటె ఎక్కువస్థానాలు దొరుకుతున్నాయి. దేశమంతటా అక్కడక్కడ వ్యాపించివున్నప్పటికీ ముసల్మానులే వీరిని అసెంబ్లీలకు మెంబర్లుగా నిలిపి తాము వారికే వోట్లను ఇస్తున్నారు. ఈజాతీయభావం అందరిలోనూ వ్యాపించడంచేత అదివరకు జరుగుతూవుండే మతకలహాలు బొత్తిగా చూపుమాశాయి. కాప్టులకంటెగూడ అల్పసంఖ్యలోఉన్న జాతులవారికి ఇప్పుడు అసెంబ్లీలోనే కాదు, ఈజిప్షను జాతీయపార్లమెంటులో సైతం స్థానాలు దొరుకుతున్నాయి.

ఇట్టిజాతీమైక్యమే ఈజిప్టుకు ఇంతత్వరలో స్వాతంత్ర్యం లభించడానికి కారణం. ఈసంగతులన్నీ ఇండియాలోని హిందూ ముసల్మానులకు తెలియక కాదు. కాని స్వార్థంచేతనో, మరియేకారణంచేతనో ఇక్కడివారింకా మతం అనే ఘోషిస్తున్నారు. జిన్నా- బోసు- గాంధీగారల సంప్రతింపులు భగ్నంకావడానికీ ఇదే హేతువు. అఖిల భారతవర్ణాశ్రమస్వరాజ్యసంఘంవారు సైతం ఈమతంపట్టింపులనే పట్టుకొని పెనగులాడుతున్నారు కాని ఇండియనుల జాతీమైక్యమునకు పాటుపడడం లేదు.

ఇవన్నీ ఇట్లావుండగా మూర్షిదాబాదు నవాబుగారి ప్రకటనానుసారం ఢిల్లీయందు జాతీయముస్లిముల సమావేశం కానున్నట్లు తెలుస్తుంది. మన జాతీమైక్యానికి అందుచేయబోయే తీర్మానాలే నిదానాలు కావాలి. అందులకు పరాశక్తి అనుగ్రహించుగాత.



దొరల వైఖరిలో మార్పు

దిగవల్లి వేంకట శివరావు

[ఇంగ్లీషువారు మొట్టమొదట మనదేశములో వర్తకము చేసికొనుటకు ఒకకంపెనీని ఏర్పాటుచేసికొని వచ్చిననాటినుండి అధికారము సంపాదించి యీదేశమునకు ప్రభువు లగువఱకు వారివైఖరిలో ఎట్టి మార్పు వచ్చెనో శ్రీయుత దిగవల్లి వేంకట శివరావుగారు హృదయంగమముగ ఈ వ్యాసమున వర్ణించి యున్నారు. ఇది వారు రచియించుచున్న 'భారతదేశమున బ్రిటీషురాజ్యతంత్రము' అను గ్రంథము రెండవ సంపుటమునందలి ఒక ప్రకరణము.—**భా. సం.**]

ఆంగ్లేయు లీదేశమునకు మొట్టమొదట వర్తకము చేయుటకొరకు వచ్చినరోజులలో నీదేశాధీశు డగు మొగలుచక్రవర్తిపట్లను, ఆయనసామంతులపట్లను చాల భయభక్తుల తోను, అతివినయముతోను ప్రవర్తించుచుం డుటయేగాక, ఈదేశములోని హిందూ మహమ్మదీయ జనసామాన్యముపట్లగూడా చాలా మర్యాదతో ప్రవర్తించుచుండిరి. హిందూ మహమ్మదీయాచారవ్యవహారముల యెడల నెంతో సహనబుద్ధి చూపుచుండిరి. ఆంగ్లేయుల కీదేశమున పలుకుబడి హెచ్చి రాజ్యాధిపత్యము చేజిక్కి బలవంతు లైన కొలదియు వీరివైఖరిలో గొప్పమార్పు కలుగ సాగెను. చక్రవర్తిని, నవాబులను, రాజులను గౌరవించుట పోయి తృణీకరించుటయు, ప్రజ లను మర్యాదచేయుట పోయి నీచముగ జూచుటయు ప్రారంభమయ్యెను. ఈమార్పు చాలాచిత్రమైన పరిణామము. ఆంగ్లేయవర్తక కంపెనీపరిపాలనమున విలియం బెంటింకు గవర్నరుజనరలగునాటికి, అనగా ౧౮౨౮ నాటికిగూడ ఆంగ్లేయ వర్తకకంపెనీ ప్రభు ధికారులు పూర్వమర్యాదలు విడిచి పెట్టలేదు. పూర్వాచారములను పూర్తిగా తృణీకరించుట ప్రారంభింపలేదు. మతసహ నము చూపుట కంపెనీవారివిధి యని తలచి హిందూ - మహమ్మదీయులు తమ తమ మతాచారములనుబట్టి జరుపు ఉత్సవము లందు కంపెనీవారు ఆంగ్లేయోద్యోగులు హాజరుగా నుండునట్లు ఉత్తర్వులు చేసిరి. ౧౮౩౦ నాటికి హిందూ - మహమ్మదీయుల పండుగులకు కంపెనీప్రభుత్వము సెలవిచ్చు చుండెను. ఆనాటి కింకను ఆదివారములు సెలవుదినములుగా లేవు. ఆదివారమునాడు గూడ ప్రభుత్వకార్యాలయములు పనిచేయు చుండెను. ఆనాటి కింకను న్యాయస్థానమున ఇంగ్లీషుభాష వాడుకలో లేదు; ఫారశీ భాషయే వాడబడుచుండెను. వర్షఋతువు ప్రారంభసమయమున పూర్వాచారప్రకార మాంగ్లేయపరిపాలకోద్యోగులుకూడా కొబ్బెరకాయ కొట్టవలసియుండిరి. పూర్వము క్రొత్తగా వచ్చిన ఆంగ్లేయోద్యోగులు జిల్లా లోనుండు హిందూ-మహమ్మదీయప్రముఖుల నెల్లరను దర్శించి మర్యాదచేయుట ఆచార ముగా నుండెను. ఆపద్ధతి ౧౮౩౦ నాటికి

పోయి మనవారే ఆంగ్లేయోద్యోగులను దర్శించి మర్యాదచేయుపద్ధతి ప్రారంభమయ్యెను. అంతే కాదు. వారికాంగ్లేయోద్యోగులు దర్శనమిచ్చుటయె యొకగొప్పగౌరవముగ పరిగణింపబడసాగెను. తెల్లయధికారులను దర్శించుటకు పోవు హిందూ - మహమ్మదీయ పెద్దమనుష్యులు తమమర్యాదను, స్థితిగతులనుగూర్చిన నిదర్శనపత్రములు తీసికొనిపోవలసియుండిరి. తెల్లవారిలోకూడ నొకవిధమగు జాత్యహంకారము, గర్వము ప్రారంభమైనది. ఎంత గొప్పవాడైనను భారతీయుని "నేటివు" అని నీచముగ పిలుచుట, నీచముగజూచుట మొదలిడిరి. భారతీయులకు తెల్లవారన్న భయమొకటి కలుగసాగెను. తెల్లవారియెదుట కూర్చుండుటకుగూడ భారతీయులు సాహసింపలేకుండిరి. కలకత్తాలో ప్రతియాంగ్లేయునకు తనకు ప్రతిభారతీయుడు సలాముచేయవలెననుభావము ప్రబలినది. విలియం బెంటింకు చాలా నిగర్వియై భారతీయులను తెల్లవారితో సమానముగా చూడసాగెను. తన భవనమున జేయువిందులకు సమ్మానములకు ఆంగ్లేయులతోపాటు భారతీయులు కూడా గుజ్జుపుబండ్లెక్కి రావచ్చునని శాసించెను. ఇది తెల్లవారికి అగౌరవకరముగా తోచెను. తెల్లవారినత డవమానించుచున్నాడని కోపగించిరి. ఆంగ్లేయకంపెనీ అధికారులును, వారితాబేదారులును మొదటిరోజులలో భారతదేశమున చక్రవర్తికిని, నవాబులకును సాగిలబడి మ్రొక్కుచు ఎంతో భయభక్తులతో పూర్వపుమర్యాదలనెల్ల పాటించుచుండిరి. కంపెనీడైరెక్టర్లు మొదలు గవర్నరువరకును తమలేఖలందు చక్రవర్తియొక్కయు, నవాబులయొక్కయు బిరుదావళిని వర్ణించి మహాస్తోత్రవాచకములను వ్రాయుచుండిరి. జాఫరిన్ రాజుకు పాశ్చాత్యుడు నాగిలబడి మ్రొక్కుట, జహంగీరుకాలమున సర్ థామస్ రో చేసిన జోహారులనుగూర్చిన చిత్తరువులెన్నో కలవు. ౧౭౫౧లో కలకత్తా విలియంకోట ప్రెసిడెంటు వంగరాష్ట్రమున నవాబుకు కలిపినయముగా దాసోహము చేసి "ఏలినవారి సేవకే అంకితముచేసిన నాప్రాణములను తమపాదములకడ నుంచుచున్నా"నని వ్రాసెను. ఇతడే రెండేండ్లకు తరువాత ఫరుక్ షయ్యరుచక్రవర్తికి వ్రాయుచు "ఏలినవారి సేవకుడును, అత్యల్పమైన ఇసుకరేణువునగు తూర్పు ఇండియాకంపెనీ ప్రెసిడెంటు జాన్ రస్సెల్ తననుదుటిని నేలపైన మోపి చేయుమనవి" అని వ్రాసి సాష్టాంగప్రణామముచేయుటను సూచించినాడు (చూడుడు: తాంప్సన్ గెట్రార్ల్ బ్రిటీష్ పరిపాలన). పూర్వము ఆంగ్లేయగవర్నర్లు అధికారులు మొగలుచక్రవర్తిని దర్శించునప్పుడేగాక నవాబులను, సామంతరాజులను దర్శించునప్పుడుగూడ అమూల్యమైన బహుమతులను రొక్కపు నజర్లను సమర్పించుచుండిరి. గవర్నరులుకూడా చక్రవర్తియెదుట నిలిచియుండవలసినదేగాని కూర్చుండుటకు వీలులేదు. వారన్ హేస్టింగ్సు గవర్నరుజనరలుగా నున్నప్పుడు ఢిల్లీచక్రవర్తి ఏనుగుఅంబారిలో కూర్చుండగా నీ వారన్ హేస్టింగ్సు ఆయనవెనుకనే కూర్చుండవలసివచ్చెను! ౧౭౭౩ లో హేస్టింగ్సు గవర్నరుజనర లగునప్పటి కాంగ్లేయుల పలుకుబడియు బలమును హెచ్చుటవలనను, చక్రవర్తి ఇంకను బలహీనుడై మహారాష్ట్రుల చేతిలో నుండుటవలనను చక్రవర్తి హేస్టింగ్సు

నొకమారు రమ్మని కోరినప్పుడు పోవుట కెంతో జాగుచేసి తుదకు చక్రవర్తితో సమానముగా కుర్చీలో కూర్చుండగలిగెను. డాల్‌హౌసీప్రభువు ౧౮౪౮లో ఢిల్లీకి వెళ్ళినప్పుడు చక్రవర్తిని దర్శించుటయే తనకు పరువుతక్కువ యని మానివేసి చక్రవర్తికి నవాబులకు చూపవలసిన మర్యాదలను పూర్తిగా తీసివేసెను.

తూర్పు ఇండియావర్తక కంపెనీవారి నౌకరులును గవర్నరులును మనమొగలాయి చక్రవర్తికి నవాబులకు రాజులకు అడుగులకు మడుగులొత్తురోజులు పోయి వారే రాజాధిరాజులై మనరాజులచేతనే గౌరవము లందు రోజులు వచ్చినవి. తూర్పు ఇండియాకంపెనీ పరిపాలన అంతమొంది భారతదేశము ఆంగ్ల రాజమకుటముక్రిందికి వచ్చునాటికి వచ్చిన మార్పునుగూర్చి ౧౮౫౬ వరకు గవర్నరు జనరలుగ నుండిన డాల్‌హౌసీప్రభువు ఇంగ్లాండునుండి వ్రాసిన లేఖవలన తెలియగలదు.

౨ డిశంబరు ౧౮౫౭ తేదీన డాల్‌హౌసీ ఇంగ్లాండునుండి యిట్లు వ్రాసెను:

“.. ..... ప్రథమదినములలో తూర్పు యిండియా కంపెనీవారు ఢిల్లీరాజులను తమప్రభువులుగాను, తాము వారివలన వంగరాష్ట్రపు పన్నులు వసూలు హక్కు పుచ్చుకొనినట్లును గమనించి చరించిరి. మొదటి గవర్నరుజనరలైన వారన్ హేస్టింగ్సు ఢిల్లీరాజులతో నేమఱ కెక్కినప్పుడు తానారాజు వెనుక కూర్చుండెను! మానాయనగారి కాలములో కూడ పెద్దయుద్యోగులను, పెద్దరాజులను చూడబోయినప్పుడు రొక్కరూపమున నజరులను సమర్పించుచుండిరి. గవర్నరుజనరలు తన యథాస్థానమును గ్రహింపసాగెను. ఎట్టకేలకు హేస్టింగ్సుప్రభువు ఢిల్లీరాజులతో సమానముగ కుర్చిలో కూర్చుండుటవరకు సమానగౌరవమును పొందెను. ౧౮౪౮లో నేను ఢిల్లీకి వెళ్ళినప్పుడు రాజును దర్శించుటగాని, రాజనగరుకు వెళ్ళుటగాని చేయలేదు. కుశలప్రశ్నముల నుత్తరప్రత్యుత్తరములమూలమున సాగించితిని. ఈగౌరవము నెల్ల నీరాజు తదనంతరము తుదముట్టింపనెంచితిని. కోర్టువారు అభ్యంతరపెట్టుటవలన అది చేయలేదు కాని ఈడంబరముల నెల్ల వదలి గవర్నరుజనరలును సమానునిగ గౌరవించువరకును యువరాజును నేను రాజుగ నంగీకరింపక సంతను నెగ్గించుకొంటిని.”

తూర్పు ఇండియా వర్తకకంపెనీవారి తరఫున నీదేశములో నుద్యోగములు చేయ వచ్చిన ఆంగ్లేయుల జీవితవిధానమునందును. వారి మర్యాదలయందును చాలా మార్పులు కలుగసాగెను ప్రారంభములో నీదేశమునకు వచ్చినవారెల్లరు నౌకరిని జూచి ఇంకొక కొంత స్వల్పకాలములో నెంత హెచ్చుధన మార్జించిపోవుదమా యను తదేకధ్యానముతో పనిచేయుచు సొంతవ్యాపారములు చేసి లంచములు పుచ్చుకొని భారతీయులను వంచించి బాధించి ధనమార్జించుచు సీమకు పోయి నవాబులవలె జీవించుచుండిరి. హిందూదేశమున నుద్యోగము చేయుటకు ఒడంబడికపత్రములు వ్రాసి నేటి ఐ.సి.యస్. ఉద్యోగులకు పూర్వు లనదగిన “కవనెంటెడ్ సివిలు సర్వీస్” లోని ఆంగ్లేయోద్యోగులు ఇంగ్లాండునుండి ఈదేశమునకు వచ్చునప్పటికి సాధారణముగా పదునేడేండ్లైన నిండని యువకులుగ నుండిరి. వీరికి ప్రపంచానుభవము లేదు, ఎట్టి తర్ఫీదును లేదు, దేశభాషలు, ఆచారవ్యవహారములు తెలియవు. భారతదేశమునుండి ప్రజల ధనము దోచుకొనివచ్చి సీమలో మహారాజులవలె సుఖముగా జీవించువారి యదృష్టమును జూచి సీమనుండి వచ్చు ప్రతియుద్యోగియు తాను కూడ అట్టి భాగ్యభోగ్యములు పొందుటకు

పీలు కలదుకదా యని యుద్రేకించుచుండె ను. తెల్లవా రెల్లరు సైనికులో లేదా అధి కారులో యని ప్రజలు భయపడుచుండిన ఆ రోజులలో కంపెనీఉలుకుబడిని,అధికారమును పురస్కరించుకొని నిరంకుశముగా ప్రవర్తిం చుటకు ప్రజలను భయపెట్టి సులభముగా లంచములు గైకొనుటకుగల అమితమైన అవకాశములు, భార్యాబిడ్డలుగాని సంసార ములుగాని లేకుండా ఈదూరదేశములో చాలరోజు లుండవలసివచ్చుట, తమదేశ శీతోష్ణస్థితికి భిన్నముగా నుండు ఈ దేశపరి స్థితులు ఈయువకులను అతిత్వరితముగనే సుఖలోలురుగను, సోమరిపోతులుగను జేసి వైచుచుండెను. వీరిలో చాలమంది సురా పానమున, వ్యభిచారమున మునిగియుండిరి. అనేకులు దేశీయవారకాంతల నుంచుకొను చుండిరి. వెల్లస్లీ గవర్నరుజనరలుగా నున్న ప్పుడు కంపెనీవారి సివిలుసర్వీసు ఉద్యోగుల కొకపాఠశాల నేర్పరుపదలపగా కంపెనీ డైరెక్టర్లు మాన్పించిరి. అందువలన వీరిలో నెట్టిసంస్కారమును కలుగలేదు. ఈ ఉద్యో గులు చాలమంది లంచగొండులై అమిత ధనము నార్జించి విచ్చలవిడిగా ఖర్చుపెట్టుచు తమ నేటివు ఉంపుడుకత్తెలకు పుట్టిన యూరేషియను పిల్లలతో సంసారసాగరము నీదుచు భారతీయుల కులాచారములను అల వాటు చేసికొనుచుండిరి. తక్కిన ఆంగ్లే యులుగూడ వీరిని జూచి ఈక్రొత్తజీవితవిధా నమున కలవాటుపడసాగిరి. ఏబంగాళీబాబు నో, నవాబునో దబాయించియో వంచిం చియో ఎరువుతెచ్చుకొన్న గుఱ్ఱపుబండ్ల లోను, పల్లకులలోను ఈ ఆంగ్లేయులూరేగు చుండగా వీరి ముందువెనుకల నల్లసేవకులు [illegible] మును, కేళులు చేయుచు గడుపుచుండిరి. ఆ రోజులలో ఆంగ్లేయుల నైతికవిధానము తక్కి కన్న [illegible] నుండె ను. ఆంగ్లేయులకు [illegible] సీమసరకు [illegible] నుండెను. [illegible] దుస్తులు, నాటకము [illegible] మొదలు ఇంటి అద్దెలవరకును చేతికన్న చాల హెచ్చుగాను ఖర్చుచేయవలసియుండెను. ఆహారవిహారములకు, వినోదములకు పెద్ద యుద్యోగులు చేయునట్లె చిన్నయుద్యోగుల స్త్రీలు, ఇతర ఆంగ్లేయులుకూడ ఖర్చు చేయుట ప్రారంభించుచుండిరి. ఎంత ధనమైనను చాలకుండెను. ప్రజలను పీడించి పుచ్చుకున్న లంచములు చాలక అనేకమంది అప్పులపాలై ఋణదాతల చేతు లలోనుండి వెలువడలేక సీమకు పోవుటకు గూడ వీలులేకుండ నుండిరి. ఈదుబారా తనమువలనను, దుర్వ్యసనములవలనను ఆంగ్లేయులలో అనేకులు దుర్మార్గములు చేయుచు తాము పాడగుటయేగాక ఇతరు లనుగూడ పాడుచేయుచుండిరి.

భారతదేశమున కంపెనీవారు తమపరి పాలన ప్రారంభించినప్పుడే దేశీయుల మతా చారవ్యవహారములతో జోక్యము కలిగించు కొనమనియు, అన్నిమతములపట్లను సమాన భావము కలిగియుందుమనియు, దేశీయులను క్రైస్తవమతములో కలుపుకొను ప్రయత్న ములు చేయమనియు వాగ్దానము చేసియుం డిరి కాని త్వరలోనే క్రైస్తవమతపక్షపాతము చూపసాగిరి. ౧౮౧౩లో కంపెనీవారికి క్రొత్త పట్టా ఇవ్వబడినప్పుడు క్రైస్తవమతశాఖ ఖర్చులక్రింద సాలుకు ౧౦ లక్షలరూపాయలు

భారతదేశాదాయముపైన భారము వేయబడెను. కంపెనీవారు మిషనరీలను ప్రోత్సహింపసాగిరి. ౧౮౪౦ నాటికి పక్షపాతము తీవ్రమయ్యెను.

మద్రాసులో కంపెనీ ప్రభుత్వ కార్యదర్శి యగు "తామస్"గారు క్రైస్తవు లైనవారికి మాత్రమే ఉద్యోగము లివ్వసాగెను. చెన్నపట్టణమున నొకసాదరుకోర్టుజడ్జి దొరతనమునారు సూచించినట్లుగా క్రైస్తవమతాచార్యులకు సాయము చేయక తనకు న్యాయ మని తోచినట్లుగానే ప్రవర్తించినందు కాయన పనిని తీసివేసిరి! ఆయనను హిందువులు గౌరవించి సభ చేయగా ఆయన ఆసభలో నొకమహోపన్యాసమును గావించి నాటి ప్రభుత్వవిధానమునందు క్రైస్తవమతాచార్యులకు గల విశేషము పలుకుబడిని, అందువలన జరుగు అన్యాయములను బహిరంగపరచెను. చాలమంది జడ్జీలు మతాచార్యుల కీలుబొమ్మలై యుండిరి. మదరాసు సాదరుకోర్టు జడ్జి "సర్ విలియం బర్టన్" అనునాయన బహిరంగముగానే మతాచార్యులపైన అభిమానమును చూపుచు ఆయభిమానమును తనచర్యలలో వెల్లడించుటయెగాక న్యాయపీఠమున కూర్చున్నప్పుడు హిందువులకు స్వయముగా క్రైస్తవమతబోధను తానే చేయసాగెను. చెంగల్పట్టు జిల్లాజడ్జి యొకడు ఒకదినమున వ్యాజ్యములను విచారించుట మాని తనకోర్టుభవనమునందు ఒకక్రైస్తవ మతబోధకునిచేత నుపన్యాస మిప్పించెను. దేశములోని వివిధజాతులవారిని, మతములవారిని క్రైస్తవమతమున గలుపుకొనుటకు మిషనరీలు విశ్వప్రయత్నములు చేయుచుండిరి. మిషనరీలు బలవంతము చేసినట్లును, ఒత్తిడిచేసినట్లును నిదర్శనములు కలవు. శ్రీ రాజా రామమోహనరాయలనుగూడ క్రైస్తవమతమున చేరు మని క్రైస్తవమిషనరీలు బలవంతముచేసినట్లు ఆయనచరిత్రలో కలదు. పాఠశాలలందు బైబిలును ప్రవేశపెట్టుటకు మిషనరీలు ప్రయత్నింపసాగిరి. బాలురు బైబిలు చదువునట్లు చేయుటకు, ప్రపంచజ్ఞానమును పరీక్షించు నెపమున పరీక్షకులు బాలురను బైబిలుకథలనుగూర్చి ప్రశ్నింపసాగిరి. క్రైస్తవమతమున జేరిన హిందువుల ఆస్తి హక్కులు పోవుటవలన క్రైస్తవమత ప్రచారమునకు భంగకరముగ నున్నందున మిషనరీలు ఆనిబంధనను తీసివేయుటకు శాసనము చేయింపదలచిరి.



రేడియో ఇంద్రజాలము

దూరాననుండి మనము పాటలను, ప్రసంగాలను ఎట్లు వినగలము?

ఆనందరావు

౧

ఒక పొలములో పనిచేసికొనుచున్న హాలివాడు గట్టిగా వేసినకూత ఒక పావుమైలుదూరము సరిగా వినపడుకదా?

రేడియోమూలముగా లండన్‌నగరములో మాటలాడినమాటలు ఆస్ట్రేలియా, న్యూజిలాండు దేశములలో వినబడుచున్నవి. దక్షిణధ్రువమున పలికినపలుకులు న్యూయార్కునగరములో వినబడుచున్నవి. ఎక్కడి లండన్? ఎక్కడి ఆస్ట్రేలియా? ప్రపంచము యొక్క చుట్టుకొలత ఇరువదియైదువేలమైళ్లు; లండన్-ఆస్ట్రేలియా ఖండములమధ్య దూరము పదిపండ్రెండు వేల మైళ్లుండును. ఐననేమి? లండనుపురమున ప్రతిష్ఠింపబడిన బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ స్టేషనులో (**British Broadcasting Station**) నుండినవారు పలికిన పలుకులు, పాడినపాటలు, ఇచ్చిన మహోపన్యాసములు తూచాతప్పకుండ ఆస్ట్రేలియాఖండపుతూర్పుతీరమున నున్న పట్టణముల వాస్తవ్యులు ముఖాముఖిని విన్నట్లే స్పష్టముగా వినగలుగుచున్నారు. ఉత్తర ధ్రువప్రాంతములను పరిశీలింపనరిగిన మాక్మిలన్ దొరగారును, దక్షిణధ్రువమును పరిశీలింపనరిగిన బైర్డుదొరగారును రేడియోలో తెలిపిన వార్తలను విశేషములను, న్యూయార్కులో నొకకంపెనీవారు ఎప్పటికప్పుడే విని వెంటవెంటనే ప్రకటించుచుండిరి. భూమండలమున నెవరెచ్చట నిలిచి రేడియోమూలముగా నేమి మాటలాడినను, వానిని పరిగ్రహించుట కనుకూలమైన సాధనము లుండిన పక్షమున మన మదియెల్ల చక్కగా వినగలుగుచున్నాము.

క్షణాంశముకూడ ఆలస్యములేక వినుచున్నాము. దూరము నశించినది. ఖండాంతరవాసులతో ముఖాముఖి సంభాషణము చేయగలుగుచున్నాము.

ఏమి యీచిత్రము! త్రికాలైక లేదే! ప్రస్తుతము కావలసిన పలుకులు గ్రహింపబడుచుండెడివి, అనేక బహుయోజనముల మధ్యనగరములు తీరాలు పెక్కుకున్న పక్షమున అతీతాల సంబంధిత ఆకాలములు పలుకబడిన వనుకొందమన్నను అప్పటి తాల సంపర్కమైనను లేదు పట్టణములమధ్యను లేదే! ఏమి యీ యింద్రజాలము!

రామగిరి ఆశ్రమమున ప్రవాసము ననుభవించుచుండెడి ఒకానొక యక్షుడు—వాన, దుమ్ము, గాలి, ఆవిరి, మెరుపు మొదలగువానితో కూడుకొనిన—మేఘము ద్వారా — అలకాపట్టణమునందున్న తన ప్రియురాలికి సందేశ మంపెనని కాళిదాసు వ్రాసియున్నాడు. అది నిజమైనయెడల నది యొక్క గొప్ప విస్తారమునుగూర్చి సందేహము లేదు.

అంతకంటె విస్తారము, నిజమునైన విషయము — రేడియో.

అశరీరము, శబ్దసామాన్యమునని మనగణకులు వర్ణించిన ఆకాశమార్గమును సాధనముగా చేకొని నేటి వైజ్ఞానికులు దూరమును చంపి, ప్రపంచమున నెచ్చటనున్న వారైనను, ఏఖండాంతరవాసులతోనైనను ఎట్టయెదుటనున్నట్లే సంభాషించుటకు ప్రత్యక్షముగా ఏర్పాట్లు చేసినారు. వక్తల వాచికదోషములు, యాసలతోకూడ స్వచ్ఛముగా వారిపలుకులు వందలు—వేలు—మైళ్లు దూరమందున్నవారికి వినపడుచున్నవి.

నేటి అద్భుతము లన్నింటిలో మహాద్భుతమని ప్రశంసింపబడుచున్న యీరేడియో చరిత్రమును సంగ్రహముగానైనను తెలిసికొనుట మిక్కిలి యావశ్యకము కావున నావిషయమునుగూర్చి కొన్ని పంక్తులు వ్రాయుచున్నాను.

౨

రేడియో చరిత్ర

మూడువందల సంవత్సరములక్రిందటనే, హాలండు దేశస్థుడైన హైజన్స్ (Huygens) పండితుడు ఆకాశమార్గమున తరంగములు నడుపుట సాధ్యమగునని యోచించెను.

౧౮౭౩ సంవత్సరములో (Maxwell) మాక్స్వెల్ అను ఆంగ్లపండితుడు గణితశాస్త్రరీత్యా అట్టి తరంగములు నడుపుట సాధ్యమని నిరూపించెను.

౧౮౮౮ లో హెర్ట్జ్ (Hertz) అను జర్మను పరిశోధకుడు తీగెలసాయ మక్కరలేకుండ అట్టితరంగములు వ్యాపింపగలవని ఋజువుచేసెను. టెలిగ్రాఫులో వాడుచున్న తీగెలవంటి తీగెల అవసరములేకుండ దూరప్రదేశములకు వార్త లంపుటయు, దూరదేశముల వార్తలు వినుటయు సాధ్యమగునని శాస్త్రజ్ఞులు యోచించుచుండిరి.

మార్కొనీ (Marconi) అను ఇటాలియన్ శాస్త్రజ్ఞునకు తీగెసాయ మవసరము లేకయే వార్తలంపు విధానము కనిపెట్టెను. ౧౮౯౬ లో తీగె లేకయే రెండుమైళ్ల దూరమువఱకు వార్తలు నడిచెను. ౧౮౯౭ లో ౧౨ మైళ్ల వఱకు తంతిరహితములైన వార్తలు చేరెను. ౧౯౦౧ లో రెండువేల మైళ్లవఱకు తంతిలేనివార్తలు పంపగలిగెను. ఆసంవత్సరములోనే మార్కొనీద్వార ఇంగ్లండులోని పోల్డూస్థానమునుండి న్యూఫౌండులాండు (New found-land) లోని సెయింట్ జాన్ స్టేషనునకు అట్టివార్తలు పంపగలిగెను ౧౯౧౨ నాటికి ఇంకను దూరమునందున్నవారితో తంతిరహితముగ మాటలాడుట సాధ్యమయ్యెను.

౧౯౧౪ — ౧౯౧౮ సంవత్సరములలో జరిగిన మహాయుద్ధ దినములలో నీదూరశ్రవణము మిక్కిలి పెంపునకు వచ్చెను.

౧౯౧౫ సంవత్సరం సెప్టెంబర్ ఇరువదితొమ్మిదవ తేదీని అమెరికన్ టెలిఫోన్ అండ్ టెలిగ్రాఫ్ కంపెనీవారి ప్రెసిడెంటు వెయిల్ దొరగారు, న్యూయార్కు పట్టణములోనున్న తమ ఆఫీసుగదిలోనుండి, అక్కడకు ౨,౫౦౦ మైళ్లదూరమున పడమటిగానున్న శాన్ ఫ్రాన్సిస్కో (San Fransisco) నగరమునందుండిన కార్టీదొరగారితో ఇట్లు పలుకరించి మాట్లాడెను

"హల్లో - కార్టీ - నేను - మాట్లాడుచున్నాను- వెయిల్". ఈమాటలు కార్టీకి చక్కగా వినబడినవి. అంతేకాదు; వారున్న తావులకు తీగెల సంపర్కము లేదు. "బలే—మంచి బాగున్నది - అద్భుతముగా నున్నది" అని కార్టీ జవాబిచ్చెను. ఈయుభయుల సంభాషణలు వారియుభయ వారికేగాక, న్యూయార్కునకు ౨,౩౦౦ మైళ్ల దూరమందున్న శాన్ డీగో (San Diego) పురమునను, దక్షిణమున ౨,౧౦౦ మైళ్ళదూరమునందున్న పెనామా పురమునను, అక్కడకు ౫,౦౦౦ మైళ్ళదూరమున పసిఫిక్ మహాసముద్రమునందున్న 'హోనోలులు'లో నున్న ముత్యద్వీపమునందును కూడ స్వచ్ఛముగా వినబడెను.

౧౯౧౫ సంవత్సరము అక్టోబరు ఇరువదియవ తేదీ నాడు అమెరికన్ టెలిఫోన్ కంపెనీవారి మనుష్యులు ఫ్రాన్సుదేశమునకు ముఖ్యపట్టణమైన పారిస్ నగరమునందున్న ఈఫెల్ మహాగోపురముమీదనున్న వారితో స్పష్టముగా మాటలాడిరి. మానవుని వాక్కు మహాసముద్రము గడిచి ఖండాంతరవాసుల చెవులబడుటకిదియే మొదటిసారి యని చెప్పబడుచున్నది.

పైని పేర్కొనబడిన ప్రదేశములకు సరాసరి తీగెలసంపర్కము లేకనే సంభాషణలు నడిచినవి. తీగెలులేకుండ దూరదేశస్థులతో సంభాషణలు జరుపు క్రమమునకు తంతిరహిత (Wireless) పద్ధతి యని పేరు వచ్చెను. ఈవిధానము విద్యుత్తరంగాలచే సాధ్యమగుటచే దీనికే రేడియో (Radio) అనికూడ పేరువచ్చినది. ఈ రెండునుభేద మనుకొని కొంతకాలము కలవరపడిరి. కాని ౧౯౧౨-వ సంవత్సరములో నానాజాతిసమితివారు తంతిరహితము, రేడియో (Wireless, Radio) అను పదములు సమానార్థకములే; భిన్నార్థకములు కావని నిర్ణయించి స్పష్టముచేసి కలవరము దీర్చిరి.

అనంతాకాశమున వ్యాపించు మానవుని కంఠస్వరమును, పట్టి, శ్రోతల కందిచ్చు నద్భుతశక్తి గల సాధనములు ప్రపంచ మంతటను ముఖ్యస్థానములలో

ప్రతిష్ఠింపబడినవి. ఇంగ్లండుదేశములో పదిలక్షలకు పైగా 'రేడియో రిసీవరు సెట్లు' ఉన్నవి. ఇతరదేశములలో హైస్కూలు విద్యార్థులు ఎవరి 'రిసీవరు'— శ్రవణసాధనమును వారే ప్రతిష్ఠించుకొనగలుగుచున్నారు. ఒక్కొక్క ముఖ్యపట్టణమునందు 'బ్రాడ్‌కాస్టింగు' స్టేషనులు నెలకొల్పి అచ్చట కాలనిర్ణయపట్టికప్రకారము వార్తాశ్రవణము, వాతావరణస్థితి, విద్వాంసుల ఉపన్యాసములు, గాయకుల గానము, మంత్రిపుంగవుల మహోపన్యాసములు, మొదలగువాని వెదజల్లు ఏర్పాటు చేయుచున్నారు. 'బ్రాడ్‌కాస్టు' అను పదమునకు 'వెదజల్లుట' అని అర్థము. ఉపన్యాసాదులిచట వెదచల్లబడును. లండను బ్రాడ్‌కాస్టింగ్ స్టేషనులో ప్రసంగింపబడు వాక్యములను ఇంగ్లండు దేశములోవారే పది, పండ్రెండు లక్షల జనులు వినుచుందురు. వందలకొలది మైళ్లదూరమున నున్న పట్టణములలోను, పల్లెలలోను నివసించువారయ్యును, వారందరును ఒకగదిలోనో—ఒకహాలులోనో—ఒకసభలోనో సమావేశమైనట్లు, ఒకేసారి, ఒకేతీరున, శబ్దవ్యాపనస్థానమునందలి వాగ్విశేషములను విని యానందించి ప్రయోజనము నొందుచున్నారు. ఒక గాయకుడు తన గానమాధుర్యమును వివిధపట్టణవాసులను ఒకేసారి గ్రోలనిచ్చుచున్నాడు. ఒకవిద్వాంసుడు తన ఉపన్యాసమును తనయెదుటలేని శ్రోతలకు బహులక్షలకు వినిపించుచున్నాడు. ముద్రణావసరము లేక ముఖ్యవార్తలు ఏనాటి వానాడే దేశమంతటను వ్యాపించుచున్నవి. గాలి, వాన, మంచు మొదలగు వాతావరణ విశేషములు ఎప్పటికప్పుడే తెలియనగుచున్నవి. వాయువిమానములకు ముఖ్యముగా ఆ వివరము లవసరము. వెనుక అమెరికాలో గాలివాన రేగి, టెలిగ్రాఫ్ స్తంభములు పడిపోయి వరదపొడిచి మిసిసిపి-మిజోరి నదులు మహోపద్రవము కలిగించినపుడు, అచటిప్రజల దురవస్థ యువజనుల రేడియోమూలముగా ప్రభుత్వమువారికిని, ఇతరప్రాంతవాసులకును తెలిసి సత్వరముగా వారికి సాయముచేయుట సాధ్యమైనది.

వినోదమేగాక, బహువిధముల మన నిత్యజీవనములో నత్యంతోపకారియైన రేడియోవిధానమును హిందూదేశములోకూడ ప్రవేశపెట్టు డని ప్రభుత్వము వారికి బహువిధముల [illegible] బొంబాయి మొదలగు పెద్దపెద్ద పట్టణములలో [illegible] ములు ప్రవేశపెట్టుటకు [illegible] లను పట్టినది. నేటికి, [illegible] నాటికి భరతదేశమున నిలువున్న [illegible] ధ్వని ప్రచారస్థానములు (Broad-casting Station) ప్రతిష్ఠించి ప్రభుత్వమువారు [illegible] సౌకర్యములు నేర్పాటుచేసినారు. [illegible] (Receiving Sets) కలవారందరు [illegible] ప్రచారస్థానము (Broad-casting Station) నుండి శబ్దవిశేషములను విని యానందించుచున్నారు.

ఎక్కడి మద్రాసు! ఎక్కడి విజయనగరము! మెయిలుబండిలో సుమారు ఇరువదిగంటలు ప్రయాణము సాగించినగాని అప్పటికి మధ్యనున్న ఐదువందల ఇరువది మైళ్లదూరము దాటలేము. కాని మద్రాసు ప్రచారస్థానమునుండి వెడలిన వార్తలు, విశేషములు, వాతావరణపరిస్థితులు, వాణిజ్యగీతములు, మనీషావంతుల మహోపన్యాసములు, నటీనటోత్తముల నవప్రసంగములు — అన్నియు అచ్చట వారిప్పుడే పలికినట్లే—విజయనగరములోకూడ విని ఆనందాశ్చర్యములను పొందుచున్నాము.


ఇది యెట్లు సాధ్యమగుచున్నది? ఏవిజ్ఞానవిషయముల నాధారము చేసికొని చెన్నపట్టణమునుండి వార్తావిశేషములు వెదజల్లుచున్నారు? ఏయుపాయములన్ని వాని నన్నిటిని మనరాజధానిలో వివిధప్రాంతములవారు వినగలుగుచున్నారు? ఈసంగతులను తెలిసికొనుటకు మనము నీటిలో పుట్టి వ్యాపించు కెరటములను గూర్చి కొన్ని వివరములను తెలిసికొనుట అవసరము. ఈ వివరములు పరిస్ఫుటమైనగాని రేడియో విషయము లేమియు నవగాహన కాజాలవు. కావున జలతరంగములనుగూర్చి కొంచెము ప్రసంగింతము.

3

నీటి కెరటములు

నిర్మలముగ ప్రశాంతముగనున్న యొక చెరువు నీటిలోనికి ఒకరాయి విసరినప్పుడు 'బొళక్కు' మని

నీరు పై కెగయును; తోడనే చిన్న కెరటములు పుట్టి నాలుగు దిక్కులను వ్యాపించి, ఒడ్డు చేరి విఱుగును. ఇందువలన తరంగములు ఎట్లు ఉత్పత్తి యగునో, ఎట్లు వ్యాపించునో మనకు స్పష్టమగుచున్నది. నీటికి రాతిదెబ్బ తగిలినపుడు, ఆరాతితో సంపర్కము నొందిన నీటిబిందువులు తమకు తగిలినదెబ్బను దాని సమీపముననున్న జల కణములకు అందచేయును; ఆకణములు దాని సమీపముననున్న ఉదకబిందువులకును, అవి తమ పరిసరమున నున్న సలిలాణువులకును తాము గ్రహించిన దెబ్బను అందిచ్చి స్వస్థలమున నుండిపోజాలును. ఇట్లు శిలాపాతము వలన కలిగిన జలక్షోభము ఒండొంటి సమీపముననున్న జలకణములకు అంచెలద్వారా వ్యాపించి తరంగరూపమున చెఱువునీటిపై కనబడుచు నాలుగుదిక్కులకును వెడలుచుండును. చూ. ౧-వ చిత్రము.



౧-వ చిత్రము.


చెరువునీటిలో రాయిపడినపుడుపుట్టిన అలలు


ఇక్కడ గమనించవలసిన విశేష మేమనగా: చెఱువుమధ్యనుండి, రాతిదెబ్బ తగిలిన ఒకొక్క జల కణము తనకు తగిలినదెబ్బకు తాను చలించి తన సమీపస్థములైన జలకణముల కా దెబ్బ నందిచ్చి తాను మునుపుండినచోటనే ఉండిపోజాలును గాని తానే స్వయముగా దూరము గడచిపోయి చెఱువుఒడ్డును చేరుకొనదు. ఈ యంశము స్పష్టముగా తెలియుటకు రెండుమూడు ఉదాహరణములను యోజింతము. ఒకడొకరాయి విసరినపుడు ఆరాయి సరాసరిగా పోయి యెదుట నున్నదానికి తగులును. ఫిరంగి ప్రేలినపుడు అందునుండి వెడలినగుండు తిన్నగా పోగలిగినంత దూరము పోయి గురికి తగిలి ప్రేలును. మనము పోస్టుచేసిన ఉత్తరము ఎన్నెనో గ్రామములు, పట్టణములు గడిచి పోయిపోయి గమ్యస్థానము చేరుకొనును. ఈ వస్తువులు తాముండిన స్థలము విడిచిపెట్టి, సరాసరి ప్రయాణము సాగించి ఏగారస్థలమును స్వయముగా తామే చేరుకొనును. తరంగగమన మట్టిది కాదు. తరంగములలో అణువులు తాము అందుకొనినదెబ్బను సమీపాణువుల కందిచ్చి తా మున్నచోటనే ఉండిపోజాలును; కనుక అవి అటునిటు చలించుటలో అలలరూపము వ్యక్తమగుచుండును.


మరొక ఉదాహరణము చూపవచ్చును. ఒక జెనెడెత్తునకు పైగా పెరిగిన పచ్చనిచేనిపై గాలి వీచినపుడు అందలిమొక్కల ఉపరిభాగమున గోచరించు తరంగవ్యాప్తి మీరు గమనించి యుందురు. పొలములోని మొక్కలు పొలములోనున్న చోటనే నిలిచియుండియు, గాలితాకున తరంగగమనము చూపుచు నేత్రోత్సవము చేయుచుండును.

జలతరంగములనుగూర్చి స్పష్టమైన అభిప్రాయములు పాఠకుల మనస్సులలో ఏర్పడినపక్షమున విద్యుత్తరంగములను ప్రేరేపించువిధమును, రేగి బహుదూరముపోయిన తరంగములను గ్రహించువిధమును చక్కగా బోధపడగలవు. ఆవిద్యుత్తరంగముల మూలముననే మనకు దూరశ్రవణము సాధ్యమగుచున్నది. ఈ క్రమము తేటతెల్లమగుటకు నీటిలో సదుపాయముగా కెరటములను ఎట్లు పుట్టింపగలమో, ఏవిధమున వ్యాపింపచేయగలమో ఆక్రమము బాగుగా తెలిసికోవలెను. మఱియు ఆతరంగముల కథను మనకు విస్పష్టముగా తెలియచెప్పు రిసీవర్ (Receiver), అనగా పరిగ్రహసాధనములను ఎట్లు ఉపయోగించుకోవలెనో బాగుగా తెలిసికొనుటయు ముఖ్యమే. ఈక్రింద వివరింపబడిన ప్రయోగములవలన జలతరంగములు ఉత్పత్తిచేయుట, వ్యాపింపచేయుట, వాని యుదంతము గ్రహించుట అను నీముఖ్య విషయములు విస్పష్టము కాగలవు.

ప్రక్క (౨-వ) పటములో నీటితొట్టెల బొమ్మలు మూడున్నవి. నిడుపాటి తొట్టె యొక్కటే; గాని వేర్వేరు సందర్భములు మూడు ఆలోచించవలసియున్నందున మూడుబొమ్మలను వేసి చూపించుచున్నాము.







౫౨-వ చిత్రము.

నీటి తొట్టెలు

మీది పటము (ఎ) తొట్టెను తెచ్చి ఒక కుళాయిమూతి (౧) క్రింద నుంచినాము. తొట్టె అంచులకు దారములు (౪) కట్టి వాని కొకబెండుముక్క (3) ముడివేసినాము. కుళాయి మూతిమీది మూర బిగించి యుంచినాము. నీరేమియు పారుటలేదు.

మధ్యపటము (బి)—ఇపుడు కుళాయిమర సడల్చి నీరు పూర్తిగా వదలినాము. ధారకట్టి నీరు తొట్టెలో [illegible]

అడుగుపటము (సి)—ఈ పటములో నీరు తేడా యున్నది. ఇక్కడ నీరు ఏకధారగా ప్రవహింపబడుటలేదు. కుళాయిమూతిని కదలించుచు, కొంచెము ప్రతిక్షణమును త్రిప్పుచు మార్పు కలిగించుచున్నాము. అందుచేత కుళాయిమూతినుండి వెడలు నీటిపరిమాణము ఒకేవిధముగ నిలుకడగా లేక, అనుక్షణము మారుచున్నది. ఒకసారి విప్పినకాలమున ఎక్కువనీరు వెడలుచున్నది; ఒకసారి బిగించినకాలమున తక్కువనీరు వెడలుచున్నది. ఇట్లు, దానిని వదులుచేయుచు, బిగించుచు నుండుటచేత కుళాయిమూతినుండి నీరు పూర్ణముగా వెడలజాలదు; నీటి ధారయు పూర్తిగా ఆగిపోజాలదు. అనుక్షణము మారుచున్న పరిమాణముకలదై, కుళాయిమూతినుండి వెడలునీరు, దిగువతొట్టిలోపడి అందున్న నీటిని కలచుచున్నది. అందువలన తొట్టెలోని నీరు, మధ్యపటములో నీటివలె నిలుకడగా ప్రవహింపనేరదు. క్షణాంశములో పలుమారు ఇల చలించు స్వభావముగలదై అడుగుపటమున తొట్టెలోనీరు తరంగరూపమున ప్రవహించుచున్నది. బెండుముక్క ఆ కెరటములమీద తేలి యాడుచుండును. తరంగ చాంచల్యమును సరిగా అనుసరించుచు బెండుముక్క అల ఉపరిభాగమున మీదికి తేలుచు, ఆ కెరటము దిగువకు పోయినపిమ్మట, తరువాతికెరటము తగులకముందు, ఆ రెండింటిమధ్య నేర్పడిన పల్లమునకు దుముకు, పిమ్మటవచ్చు కెరటముతో దానిశిఖరమునకు లేచుచు — ఇట్లు ఎక్కుచు, దిగుచు బెండుముక్క నీటి యుపరిభాగమున ఆడుచున్నట్లు తోచును.

ఇదే మరొకవిధమున తెలియవచ్చును. లోతులేని ఒక కొలుపునన్య నొకబాలుడు నిలువబడియున్నాడు. వానిచేతిలో నీటిని కలచుటకు అనుకూలమైన సాధనమున్నది. సాధన మనగా మరేమీ కాదు: సన్నగ, నిలు


ప్రయాణమున్న కష్ట. దానికడుగున నొకచక్రము నమర్చబడి యున్నది. ఒకతరహా కవ్వపుకఱ్ఱ. మనయిండ్లలో కిరోసనాయిల్ తోడు బొంబాయిలో మీదికిని క్రిందికిని ఆడించు పిస్టన్ వంటిదే.

కవ్వపు కఱ్ఱను కాలువ నీటిలో పెట్టి, బాలుడు మెల్లగా మీదకును క్రిందకును ఆడించినప్పుడు కాలువనీటిలో అలలు పుట్టుచున్నవి. కొంచెముదూరములో ఒక బెండుముక్కనో, కాగితముక్కనో నీటిలో వేయుదము.

అది యీ అలలపై తేలియాడుచుండును. బాలుడు కవ్వపుకఱ్ఱను కదిపినప్పుడెల్ల కెరటము పుట్టుచున్నది. ఆడించుచు నుండునపుడు వరుసగా నెన్నెన్నో కెరటములు పుట్టి వ్యాపించుచుండును. మొదటపుట్టిన కెరటమును తరువాతి కెరటము వెంటాడుచున్నట్లు తోపగలదు. ఇట్లు కలుగుటచేత చెఱువుమధ్యనున్న నీరు ఉన్నచోటు విడిచి స్వయముగా ప్రయాణము సాగించి ఒడ్డు చేరుకొనుట లేదు. నీరు ఉన్నచోటనే ఉండిపోగలుగుచున్నది. చలించుచు నుండునదిపోయి ఒడ్డుచేరుకొనునవి కెరటములే. నీటిమీద బెండుముక్కను తేలనిచ్చి అలలవరుసలు పుట్టించినపుడు ఆబెండుముక్క అలలతో కూడ చలనము నొందుచుండును. ఎగయు కెరటముతో నది మీదికి లేచి దాని శిఖరమున కెక్కి, అది విడలిపోయినతోడనే పల్లమునకు దిగును; ఇట్లు ఎక్కుచు దిగుచు, లేచుచు దుముకుచు చలించుచుండును గాని బెండు చెఱువుఒడ్డునకు పోదు.

బాలుడు కవ్వమును తాపీగా, నెమ్మదిగా ఆడించుచున్నపుడు పుట్టుకెరటములు ఒకదాని కొకటి దూరమున నుండుచుండును. ఇట్టితరంగములను దీర్ఘతరంగములు (Long waves) అందురు

క్రిందిపటమును చూడుడు :



౩-వ చిత్రము, ౧.
దీర్ఘ తరంగములు


బాలుడు కవ్వమును జోరుగా ఆడించినపుడు కెరటములు ఒకదానివెంబడి నొకటి అధికసంఖ్యలుగా గబగబ బయలుదేరును. వానిని హ్రస్వతరంగములు (Short waves) అందురు (చూ. ౩-వ చిత్రము, ౨).



౩-వ చిత్రము, ౨.
హ్రస్వ తరంగములు

దీర్ఘతరంగములకు కెరటపునిడివి (wave length) హెచ్చుగా నుండును. హ్రస్వతరంగములకు కెరటపునిడివి తక్కువగా నుండును.

ఒకదానివెంబడినే వచ్చు మరొక కెరటమును గమనింతము. ఆరెండు కెరటముల శిఖరములమధ్యదూరమునకు కెరటపునిడివి యని పేరు. ఆ రెండు కెరటముల పల్లములమధ్య దూరముకూడ నంతే యుండుటచేత పల్లములమధ్యదూరమైనను కెరటపునిడివి యనవచ్చు (చూ. ౩-వ చిత్రము, ౩.)



౩-వ చిత్రము, ౩.
కెరటపు నిడివి

శి-శి—కెరటపు శిఖరములు (Crests).
ప-ప—కెరటముల మధ్య పల్లములు (troughs).
ని-ని—కెరటపు నిడివి (Wave length).

కెరటపు నిడివి అధికమైనపుడు ఒకక్షణములో వెడలు తరంగముల సంఖ్య తక్కువగా నుండును; అనగా తఱచుదనము తక్కువగా నుండును (low frequency). కెరటపు నిడివి తగ్గినపుడు ఒకక్షణములో వెడలు తరంగముల సంఖ్య — తఱచుదనము — హెచ్చుగా నుండును (High frequency).

౪

జలతరంగములు — విద్యుత్తరంగములు

నీటిమీద పుట్టించి వ్యాపింపచేయగల అలలసంగతులు కొన్ని పైని తెలిసికొంటిమి. నీటిని, నీటిఅలలను మనము

కనులతో మాపెగలము. కాని మనచుట్టును ఆవరించుకొని యున్నను, మనకనులకు కానరానంత సూక్ష్మములైన తరంగవిశేషములు పెక్కు లున్నవి. కెరటపునిడివి హెచ్చుగాగల తరంగవిశేషములనుకూడ మనకన్నులు మాపజాలవు. శబ్దతరంగములు మనకనులకు గానరావు. నీటిమీద జలతరంగములవలెనే శబ్దతరంగములు గాలిలో పుట్టి వ్యాపించుచున్నవి. శబ్దము క్షణమునకు సుమారు పదునొకండువందల అడుగుల త్వరతో వెడలుచుండును. ప్రకాశము (Light), ఉష్ణము (Heat), విద్యుత్తు (**Electricity**) అను వీని సంబంధమైన తరంగములు నిత్యమును మనచుట్టును వ్యాపించుచున్నవి. వెలుతురు కెరటములు అతిసూక్ష్మములు. క్షణమునకు లక్షయేను బదియారువేల మైళ్లు వ్యాపించుచుండును. ఆకెరటములను మనకన్నులు కొంతవఱకే గ్రహింపగలవు. ఉష్ణతరంగములు అంతకంటె పెద్దవి. అయినను మనకు కనబడవు. విద్యుత్తరంగముల కెరటపునిడివి బహుసూక్ష్మముకావచ్చును; లేదా ఇరువది మైళ్లుండవచ్చును; లేదా ఈమధ్య నేపరిమాణమైన కలిగియుండవచ్చును. ఈవిద్యుత్తరంగములు మనచుట్టును ఆకాశమున నదృశ్యములై అనంతవ్యాప్తి కలిగియున్నవి. కెరటపునిడివియందు భేదముతప్ప ప్రకాశతరంగమునకును, ఉష్ణతరంగమునకును, విద్యుత్తరంగమునకును వేరుభేదము లేదు. అవి యన్నియు నొక్కరీతినే వ్యాపించి పోవుచుండును. చెఱువులు మొదలగు జలాశయములలో నీరు ఉన్నట్లే విద్యుద్ద్రవ్యము గాలిలోను ఆకాశమునందును వ్యాపించి యున్నది.


మనచుట్టును గల వాయుమండలమందును, మహాకాశమునందును వ్యాప్తమైన విద్యుద్ద్రవ్యమును కలచి విద్యుత్తరంగములను పుట్టించి నలుముఖముల వ్యాపింపచేయుటకును, ఆతరంగములద్వారా సంజ్ఞలు, మాటలు, పాటలు, ఉపన్యాసములు మొదలగువానిని నేలనాలుగు చెరగులకును పంపుటకును ఏర్పాట్లు చేయబడినవి. ఇట్లు మహాకాశమున నలుదిక్కులకును చెదరి వ్యాపించు తరంగములను పట్టి శబ్దముక్రింద మార్చి వినోదించుటకు, వార్తలు వినుటకు, ఇతరవిధముల అవసరమైన కార్యజాలముల సాధించుటకును వైజ్ఞానికులు శ్లాఘ్యములైన సాధనములను నిర్మించినారు. [illegible] ఆకాశ[illegible] [illegible] [illegible]

కుళాయిమూతిక్రింద పెట్టిన [illegible] (ప్రేషకస్థానము) [illegible] మరల [illegible] తరంగముల [illegible] స్థానములు. ఇటునుండి వెడలిన తరంగములు నలుదిశలకు వ్యాప్తమగును. ఆ తరంగములను గ్రహించుచు వానితో లేచుచు పడుచు తరంగసందర్శనమును మనకు వ్యక్తముచేయునది బెండుముక్క. జలతరంగములకు కుళాయిమూతియనదగినది జన్మస్థానము - ప్రేషకము (Transmitter); బెండుముక్క తరంగములను పరిగ్రహించుస్థానము (**Receiver**)-గ్రాహకము. కుళాయిమూతికి మీదనున్న మరవిడి విప్పక [illegible] వానికియుండినంతసేపు జలములేదు; తరంగములు లేక వ్యాప్తిలేదు. ఇప్పుడు ప్రేషకస్థానము (**Transmitting station**) పనిలో లేదు.

కుళాయివిడి సడలించి నీరు ఒకేవిధముగా ప్రవహింపచేసినపుడును తరంగములు లేవు; నీరు సరాసరి ప్రవహించిపోవుచున్నది. బెండు నీటిపై తేలియున్నది. కెరటములు లేనందున వానినిగూర్చి బెండు తెలియచెప్ప విశేషములు లేవు.

మూడవసారి కుళాయివిడిని మూయుచు, తెరచుచు ప్రతిక్షణము—క్షణాంశములో కుళాయి మూతినుండి వెడలు నీటిపరిమాణమును మార్చివేయుచున్నాము. తొట్టెలో ప్రవహించు నీటిపై అలలు పుట్టుచున్నవి. మరవిడి నేర్పుగా తెరచుచు, మూయుచు నీరు వదలుచు వచ్చితిమేని, కోరిన కెరటపునిడివికల అలలను,—ఒక్కక్షణములో కెన్ని కావలయునన్న అన్ని అలలను—పుట్టించి, తొట్టెనీటిలో వ్యాపింపచేయగలము. ఆ కెరటములను గ్రహించి, వానితోపాటు లేచుచు, పడుచు వాని నిడివిని (**wave length**), తరచుదనమును (**frequency**), వ్యాప్తిని మనకు విశదముచేయునది బెండుముక్క. ఇదే తరంగగ్రాహి. ఇది 'రిసీవింగ్ స్టేషన్' (**Receiving Station.**)—విద్యుత్తరంగములను అందుకొని మనకు ఎరిగించు తావువంటిది.


చెంబువుమధ్య నిలుచుండి, నీటిలో కొంతవఱకు కవ్వమును ముంచియుంచి, మీదికిని క్రిందికిని ఆడించుచు చెంబునీటిలో కెరటములు పుట్టించి నలుదిక్కులను వ్యాపింపచేయు బాలుని మరొకమారు స్మరింతము.



౪-వ చిత్రము, ౧.

జల తరంగములు.

వానిచేతిలో మీదికిని క్రిందికిని ఆడు కవ్వపుకఱ్ఱవంటిదే వ్యాపనస్థానము (Brcad-casting Station). ఇట నుండి నలుదిక్కులకు వెదజల్లబడు విశేషములను గ్రహించు బెండుముక్కయే 'రిసీవింగ్ స్టేషన్' (Receiving Station). దిగువ చిత్రము చూడుడు.



౪-వ చిత్రము, ౨.

వ్యా — తరంగములను పుట్టించి వ్యాపింపజేయు స్థానము (Transmitting station).

గ్ర — తరంగములను గ్రహించు స్థానము (Receiving station)

ఎలెక్ట్రినులు

"విశ్వమంతయు మహావిద్యుత్తరంగాళి విలసితంబు."

నీటిలో జలతరంగములవలెనే విద్యుత్తరంగములు ఆకాశమున వ్యాపింపగలవని పైని తెలిసికొంటిమి. విద్యుత్తనగా నేమి? ఆ తరంగములు గాలిలో నెట్లున్నవి? ఆ తరంగము లెట్లు ఉత్పత్తియగును? వాని నెట్లు గ్రహింపవచ్చును? అను విషయములు తెలిసికోవలెను. విద్యుత్తనగా నేమో మనకు స్పష్టముగా తెలియదు. అది రెండువిధములుగా వ్యక్తమగుచున్నది — ౧ పాజిటివ్ (Positive); ౨. నెగెటివ్ (Negative). భేదజ్ఞానముకొఱకు మనము 'పాజిటివ్' విద్యుత్తును "ధనవిద్యుత్తని"యు, 'నెగెటివ్' విద్యుత్తును 'ఋణ విద్యుత్తని'యు వ్యవహరింతము. ఈ రెండింటికిని పరస్పరాకర్షణము మెండు. ధన విద్యుత్తుతో కూడిన మేఘము ఋణవిద్యుత్తుతో గూడిన మేఘమును సమీపించినపుడు మెఱుపులతో పిడుగులు పడును. ఋణవిద్యుత్తుయొక్క లేశము-సూక్ష్మతమరేణువునకు 'ఎలెక్ట్రను' (electron) అని పేరు. ఈ యెలెక్ట్రను యొక్క పరిమాణమెంతో, దీనిలోగల విద్యుత్సంపద ఎంతో అవన్నియు శాస్త్రవేత్తలు పరిశోధించి తెలిసికొనినారు. ఒక గ్రాముకు సుమారు ౧౧౦౦౦, ౦౦౦, ౦౦౦, ౦౦౦, ౦౦౦, ౦౦౦, ౦౦౦, ౦౦౦, ౦౦౦ ఎలక్ట్రినులు తూగును. ౧౧ ౨/౩ గ్రాములు సుమారు ౧ తులమగును. దీనినిబట్టి చూడగా ఎలెక్ట్రన్ ఎంతసూక్ష్మమైన విద్యుల్లేశమో విశదము కాగలదు.

రాయిపడిన నీటిలో జలతరంగములు పుట్టి వ్యాపించునట్లే గాలిలోను ఆకాశములోను ఎలెక్ట్రనులు సంచరించునపుడు అవి అపరిసరాకాశమున విద్యుత్తరంగములను పుట్టింపగలవు.

ఆకాశ మనగా నేమో, అం దేమేమి యున్నవో స్పష్టముగా తెలిపి ఋజువుచేసినవారు లేరు. హైందవ గణకులు గగన మనగా శూన్యము, సున్న (౦), అందేమియు లేదు. అని శూన్యసంఖ్యకు పర్యాయపదముగా ఆకాశపదమును వాడుచున్నారు. నిశ్చయముగా అందేమియు లేవో ఉన్నదో, ఉన్న పక్షమున నందలి పదార్థ మెట్టిదో ఆసంగతులు మనకు స్పష్టముగా తెలియవు. దురూహ్యమైనంత దూరమున గల నక్షత్రములను దాటి ఆవలకుగూడ ఆకాశము వ్యాపించియున్నదని మన మూహించుచున్నాము. ఆకాశమున విద్యుత్తరంగములు


వ్యాపింపగలుగుట నిశ్చయము. కదిలుమహోయెడి ప్రతి ఎలెక్ట్రానును ఇందు విద్యుత్తరంగములను పుట్టించగలదు. కనుక ఎత్తైన రాటలు పాతి గాని, ఎత్తుగా స్తంభములు కట్టిగాని, ఉన్నతస్థానముల ప్రతిష్ఠించి, వాని శిఖరములమధ్య లోహపు తీగె కట్టి, ఆ తీగెలోనికి విద్యుత్ప్రవాహ మంపి, ఎలెక్ట్రానులను పెదలించినపక్షమున ఆకాశమునందు విద్యుత్తరంగములను వ్యాపింపచేయగలము. ఈ తీగెకు 'ఏరియల్' అని పేరు బాలునిచేతి కవ్వము చెరువునీటిని కలచినట్లు ఈ తీగెనుండి పెడలు ఎలెక్ట్రానులు ఆకాశమును కలచి విద్యుత్తరంగములను జనింపచేయును. ఈతరంగములు నలుదిక్కులకు వ్యాపించును. ఇది చోదనస్థానమునందలి 'యేరియల్'.

దానికి ఎన్నోవందల మైళ్లదూరమున మరొక ఊరిలో ఎత్తు స్తంభముల శిఖరముల మధ్య నొక తీగె కట్టబడిన దనుకొందము. ఆతీగెలోని ఎలెక్ట్రానులు చెరువులో బెండుముక్కవలెనే — చోదన స్థానము నుండి పెడలు విద్యుత్తరంగములను గ్రహించి దినువ శబ్దగ్రాహులకు పట్టి ఇయ్యగలవు.

విశాలాకాశము చెరువులో నీటివంటిది. నీటిలో జలతరంగములను పుట్టించి వ్యాపింపచేయగలిగి నంత సులభముగానే ఆకాశమున విద్యుత్తరంగములను పుట్టించి నలుదిక్కులకు వ్యాపింపచేయవచ్చును.

౬

ఏకస్పందన — స్వరైక్యము




౫-వ చిత్రము.

కంపన పంగ.

ఇదిగో! ఈప్రక్క చిత్రము చూడుము. అందు పంగనామమువలె నుండి ఒక పెట్టె మూతపై నిలిచిన లోహపుకడ్డీ ఒకటి కనబడుచున్నది. దానిని దేని తోనైన కొట్టినపుడు దానిపంగలు చలించి, ముందు వెనుకలకు అతివేగముతో కంపించుచుండును. ఆ కంపనములవలన శబ్దతరంగములు పుట్టిగాలిలో వ్యాపించుచున్నవి. అది క్షణమునకు ౪౦౦ సార్లు కంపించగలదు. కావున మందస్వరముమాత్రము విననగుచున్నది. ఇట్టి పంగలకడ్డీలను ఇంగ్లీషులో 'ట్యూనింగ్ ఫోర్క్సు' (Tuning forks - ...) అనెదరు.


వానిలో పరిమాణభేదములును. కంపన భేదములును గల పంగ లనేకవిధములుగా నుండును.



౬-వ చిత్రము.

పై చిత్రములో వరుసగా నాలుగు పంగలున్నవి. అందు మొదటిది క్షణమునకు, నాలుగు వందల సారులు పరిస్పందించగలదు. రెండవది క్షణమునకు ఐదువందలసారులు కంపించగలదు; మూడవది ఆరువందల సారులును, నాలుగవది ఎనిమిదివందల సారులును కంపింపగలవు.


ఈ క్రమముననే కంపింపగల మరినాలుగు 'ఫోర్కు' లను సంపాదించి గదిలో మారుముగా ౭-వ చిత్రములోవలె రెండుగుంపులుగా పెట్టుదము. అందు ఒకొక్కదానినే కొట్టి నాదము పుట్టించి మనము వినగలము.



౭-వ చిత్రము : (మొదటి గుంపు).

మొదటి గుంపులో క్షణమునకు ౪౦౦ సారులు పరిస్పందించు పంగను రబ్బరు సుత్తితో కొట్టి చూతము. కొట్టగానే మంద స్వరమున శబ్దము వినవచ్చుచున్నది.

ఆపంగను చేతితో తాకినంతనే దాని కంపనములు కట్టిపోయినవి; దాని శబ్దమును అంతరించినది. కాని ఏమి యీచిత్రము? రెండవగుంపులో ఏపంగను మనము తాక



(రెండవ గుంపు).

లేదు. ఐనను ౪౦౦ సఖ్యగల పంగ కంపించుచున్నది; శబ్దించుచున్నది. అదియేల కంపించవలెను? ఏల శబ్దించవలెను? ఈఐక్య మెట్లు సాధ్యమైనది?

మొదటిగుంపులో ౪౦౦-పంగను మనము కొట్టినప్పుడు అది కంపించి శబ్దతరంగములను గదిలో నాలుగు ప్రక్కలకు వ్యాపింపచేసినది. ఆతరంగములు ఆగదిలో నున్న రెండవగుంపుల పంగలమీదను పడినవి. తక్కిన పంగలను కదల్పజాలినట్లు కనబడకున్నను, ఆతరంగములు రెండవగుంపులోని '౪౦౦-పంగ'ను మాత్రము తాకి, చలింపజేసి, శబ్దింపచేయకలిగినవి. ఎందుచేత?

౫౦౦-పంగలు, ౬౦౦-పంగలు, ౭౦౦-పంగలు కూడ, మొదటిగుంపులోని ౪౦౦-పంగ జనింపచేసిన కంపనములకు కదలినవి. తరంగముల నుత్పత్తిచేసినవి. కాని ఆ తరంగముల కదలికకును, ౪౦౦- పంగ జనింపచేసిన తరంగములకును కలయిక కుదిరి లేదు. అన్నియు నొకక్రమమున పోలేదు. ఒకదాని కొకటి పరస్పరము ఎదురై పొలిసిపోయినవి; కాని ఒండొంటితో మేళవింపలేకపోయినవి. జట్టుకుదరక, శ్రుతికలియక ఒకదాని కొకటి ఎదురై తరంగగమనమునకు ముఖ్యలక్షణమైన నిమ్నోన్నతత్వము- ఎగుడుదిగుడులు - లేక సమగతిచెంది అవి సమసిపోయినవి. ఆతరంగములు లేవు; శబ్దమును లేదు.

మొదటిగుంపులో ౪౦౦- పంగ కంపించి జనింపచేసిన తరంగములకును, వానిచే చలింపజేయబడిన రెండవగుంపులోని ౪౦౦- పంగయొక్క పరిస్పందనముచే క్రొత్తగా జనించిన తరంగములకును జట్టు కుదిరినది; కత్తు కలిసినది; శ్రుతి ఏకమైనది. స్వరైక్యము సాధ్యమైనది. రెండుగుంపులలో ౪౦౦- పంగలుమాత్రము ఏకస్వరముతో శబ్దించుచున్నవి. మొదటిగుంపులోని పంగను తాకి, కంపనములు మాన్పించినను, రెండవగుంపులోని పంగయొక్క కంపనముల కాటంకమేమియు లేనందున నది కంపించుచు శబ్దించుచు నున్నది.

ఇదేవిధముగా రేడియోతరంగవ్యాప్తిలోకూడ ఏకవిధమైన స్పందనము సమకూడినగాని, కత్తుకలిసినగాని దూరశ్రవణము సాధ్యము కాదు. శబ్దచోదనస్థానమునుండి వెలువడు విద్యుత్తరంగముల శిఖరములనడుమ గల కెరటపు నిడివిని గమనించి, శబ్దము నందుకొనుతావున నదే నిడివిగల విద్యుత్తరంగములను గ్రహించుటకు ఏర్పాటులుండవలెను. చోదన, ప్రతిగ్రహస్థానములయందు విద్యుత్తరంగములు ఏకస్పందనముగలవిగా నుండవలెను. అట్లు లేనిపక్షమున భిన్నభిన్నస్థానములనుండి వెడలు విద్యుత్తరంగములు అన్యోన్యము తో త్పడజాలవు; పరస్పరము వృద్ధిపొందించుకోజాలవు. స్పందనైక్యము కుదరక తరంగములు నిమ్నోన్నతాన్యములై సమగతి చెంది సమసిపోవును. అపుడు దూరశ్రవణము సాధ్యము కాదు. శబ్దచోదనస్థానమునను, శబ్దగ్రహణస్థానమునను ఒకే కెరటపు నిడివిగల తరంగము లుత్పత్తియైనగాని స్పందనైక్యమును, స్వరైక్యమును కుదరవు.

కాబట్టి ఏవోతరంగములు ఏలాగుననో పుట్టించినంతమాత్రముచేత దూరశ్రవణకార్యము సఫలము కానేరదు. ఒకొక్కచోదనస్థానమునకు నిర్ణీతమైన కెరటపు నిడివిగల విద్యుత్తరంగములనే జనింపచేసి వ్యాపింపచేయుచుండవలెను.

విద్యుత్తరంగముల కెరటపునిడివి మీటరుకొలతలలో తెలియచేయుట ఆచారముగా నున్నది. మీటరు అను కొలత ఫ్రాన్సుదేశపుది. మీటరుపొడుగు ౩౯.౩౭౦౪ అంగుళములు: గజము అనగా ముప్పదియారంగుళములు. గజముకంటె మీటరు మూడుఅంగుళముల చిల్లర ఎక్కువ పొడుగుగా నుండును.

చెన్నపట్టణమున మొన్న నూతనముగా స్థాపింపబడిన చోదనస్థానమునుండి వెడలు విద్యుత్తరంగముల కెరటపునిడివి ౨౧౧ (రెండువందల పదునొకండు) మీటర్లు. ఇవి చాలా హ్రస్వతరంగములు; ఏలననగా, కలకత్తా చోదనస్థానపు కెరటపునిడివి ౩౭౦.౪ మీటర్లు.

లక్నో — ౨౯౪ మీటర్లు.
లాహోరు — ౨౭౬ మీటర్లు.
బొంబాయి — ౨౪౪ మీటర్లు.

కాబట్టి శబ్దగ్రహణ స్థానములలో (**Receiving stations**) నున్నవారు ఎక్కడి శబ్దవిశేషములు విన గోరుదురో అక్కడనుండి వెడలు విద్యుత్తరంగాళి

యొక్క కెంటపునిడివితో సమమైన కెరటపు నిడివిగల విద్యుత్తరంగములను గ్రహించునట్లు తమసాధనములను సరిచేసుకొనినచేతప్ప స్పందనైక్యము కుదరక, స్వరైక్యము చెడి దూరశ్రవణమునందు విఫలు లగుదురు.

౭

'ఫ్లెమింగ్ వాల్వ్' (FLEMING VALVE)

కోరినకెరటపు నిడివిగల విద్యుత్తరంగములను పుట్టించి శబ్దవ్యాపన గావించుటకును, అట్లు వ్యాపించు చున్న తరంగములను పట్టి తొంటి శబ్దములను గ్రహించుటకును ఎలెక్ట్రానులనబడు 'ఋణవిద్యుత్తు' లేశములు ముఖ్యసాధనము లని తెలిసికొంటిమి. ఎలెక్ట్రానులకు విశిష్టములైన కొన్ని లక్షణము లున్నవి. అవి అతిసూక్ష్మములు. ఎలెక్ట్రానుల ప్రవాహమే విద్యుత్ప్రవాహము. 'జెనరేటరు' అనబడు 'విద్యుదుత్పాదకయంత్రము'నుండి తీగెలద్వారా ప్రవహించునపుడీ ఎలెక్ట్రానులు వడిగా పోలేవు. చల్లగానుండు తీగెలనుండి ఎలెక్ట్రానులు వెడల జాలవు. శ్వేతోష్ణమునందిన సన్నతీగెలనుండి (White-hot filaments) అవి స్వేచ్ఛగా వెడలిపోగలవు. గాలిని పూర్తిగా వెడలించి శూన్యములుగా చేయబడిన నాళికల(గొట్టముల)లో (Vaccuum tubes) అవి క్షణమునకు ఎన్నోవేలమైళ్లు పోగలవు. సజాతీయములైన ఎలెక్ట్రానులు ఒండొంటికిదూరముగా పోవునుగాని యొకదాని నొకటి ఆకర్షించుకొనవు. ఈ యంశముల నాధారము చేసికొని ఫ్లెమింగ్ (Fleming) దొరగారు వాల్వ్ (Valve)అనబడు ఒకవిచిత్రమైన గాజుగొట్టము(నాళిక)ను నిర్మించిరి. ఆ గొట్టము మూలముగా ప్రచారకస్థానము నందును, శబ్దమును గ్రహించుస్థానమునందునుకూడ కంపనములలోను, స్వరములోను కలయిక, ఐక్యము కలుగజేయుటకు అవకాశ మేర్పడినది.

గాలి పూర్తిగ తీసివేయబడిన యొకగొట్టములో 'ఫిలమెంట్' అనబడు సన్నని లోహపుతంతు వొకటియు, దానినిచుట్టి లోహపురేకు ఒకటియు అమర్పబడియుండును. రేకునకును (Plate), 'ఫిలమెంటు'నకును మధ్య 'గ్రిడ్' (Grid) అనువలవలెనుండు తీగె యొకటి యుండును. ఇన్నిటితోకూడిన ఈగొట్టమునకే —నాళికకే 'ఫ్లెమింగ్ వాల్వ్' (Fleming Valve) అని పేరు.

'ఫిలమెంటు' ను తెల్లగా కాలునట్లు విద్యుత్ప్రవాహము ప్రసరింపచేసినపుడు అది తెల్లగా, కాలి, సుమారు ౧౫౦౦ డిగ్రీల ఉష్ణమును పొందును. అప్పుడు అదినుండి ఎలెక్ట్రానులు స్వేచ్ఛగా వెడలి పోగలవు. ఎక్కువ శక్తికలిగిన విద్యుద్ఘటము (High Tension Battery) యొక్క ధనాగ్రమునకు నాళిక (గొట్టము)లోని రేకు (Plate), ఋణాగ్రమునకు 'ఫిలమెంటు'ను కలిపియుందురు. అందువల్ల తెల్లగాకాలిన ఫిలమెంటునుండి వెడలు ఎలెక్ట్రానులు రేకుచే ఆకర్షింపబడును. ఫిలమెంటునుండి రేకుమీదికిపోవు ఎలెక్ట్రానుల సంఖ్యను తగ్గించుటకు, హెచ్చించుటకు 'గ్రిడ్' కవాటముగ వలె ఉపయోగపడును. రేకునకును, ఫిలమెంటునకును ఏరియల్ తీగెతో సంపర్కము కలుపుటవలన, దానికి ఈ ఎలెక్ట్రానుల పైకి పంపివేయుటకు వీలుకలుగును. ఇందువలనను విద్యుత్తరంగములను పుట్టించి విశాలాకాశమున వానిని వ్యాపింపచేయుటకును, దూరమున నున్న చోదనస్థానమునుండి వచ్చు విద్యుత్తరంగములను గ్రహించుటకును, వానిశక్తిని వృద్ధి చేయుటకును కూడ ఈసాధనము మిక్కిలి అనుకూలముగా నుండును. శబ్దగ్రాహు లున్నచోట, ఇట్టి గొట్టములు మూడు వాడి, ప్రవాహబలము వృద్ధిచేసి దివ్యముగా దూరశ్రవణము గావించుటయు కలదు.


౮

శబ్దమును పంపే విధము

ఈ ప్రక్క(౨ - వ) చిత్రములో అత్యంత సాధ మయిన శబ్దప్రసారమును మనము చూచుచున్నాము.

శబ్దము కలిగినప్పుడు గాలిలో ఒకవిధమయిన కదలిక పుట్టును. అట్టి కదలిక సెకనుకు ఎన్నిసారులు కలుగునో దానిని ఆ శబ్దముయొక్క తరుచుదనము (Frequency) అనెదరు. మాటలాడువానిగాని, పాడు వానిగాని శబ్దమువల్ల 'మైక్రొఫోను' లో విద్యుత్సంబంధ మయిన కదలికలు – స్పందనములు – పుట్టును. 'మైక్రొ

మనుష్యవాక్కును ఆకాశములో పంపేవిధము



౮-వ చిత్రము.

1. 'ఫిలమెంట్ జనరేటర్లు' — (Filament generators- 'ఫిలమెంటు'ను ఉష్ణపరిచే బాటరీ).
2. 'ట్రాన్స్మిటింగ్ వాల్వ్' - (Transmitting valve - చోదననాళిక)
3. 'మైక్రోఫోన్' - (Micro-phone — సూక్ష్మశ్రవ్యధ్వనిగ్రాహి).
4. 'ఏరియల్ ట్యూనింగ్ కాయిల్'—(Aerial tuning coil).
5. 'హెచ్. టి. జనరేటర్' — (H. T. Generator — విద్యుచ్ఛక్తిని పుట్టించే సాధనము).

ఫోను' వల్ల కలుగు ఈ విద్యుత్సంబంధ మయిన కదలికలకుకూడ ఈ శబ్దమే కారణము కాబట్టి వాటికికూడ ఈతరచుదనమే యుండును. ఇటువంటి కదలికలను - స్పందనములను - 'ఏరియల్' తీగకు అందజేసినయెడల ఆకాశములో విద్యుత్తరంగాలు పుట్టును. వీటి కెరటపు నిడివి సుమారు ౨౦ మొదలు ౨,౦౦౦ మైళ్లవరకు ఉండును. ఇంత దీర్ఘములైన కెరటములను ఆకాశములో ఎక్కువదూరము వ్యాపించునట్లు చేయలేము. కాబట్టి ఇంతకంటె చాల పొట్టి కెరటములను — కెరటపు నిడివి చాల తక్కువ గలవాటిని — పుట్టించి, వాటి సాయముతో ఆ దీర్ఘ తరంగాలను శబ్దచోదనస్థానమునుండి ఆకాశములో ఎంతదూరమునకైన ప్రసరింపజేయవచ్చును.


'మైక్రోఫోను'నుండి వచ్చు విద్యుత్సంబంధమైన కంపనములు - కదలికలు - చాల హీనముగా ఉండును గనుక వాటిని 'మైక్రోఫోను ఆంప్లిఫయర్' అనుసాధనమువల్ల బలపరిచి, వాటిని 'చోదకనాళిక'ల (Valves of the transmitter)వద్దకు పంపెదరు. వాటికి ఈ నాళికల(valves)లో పుట్టే హెచ్చుతరచుదనము గల స్పందనములతో - కదలికలతో - సంపర్కము

కలిపి, 'ఏరియల్ ట్యూనింగ్ కాయిల్' ద్వారా 'ఏరియల్' తీగెకు పంపెదరు. ఈ హెచ్చుతగ్గులుగల కదలికలవల్ల ఆకాశములో పుట్టిన కెరటముల నిడివి సుమారు ౧౫ మొదలు ౫౦౦ మీటర్లదాకా ఉండును. ఈ కెరటపు నిడివే శబ్దచోదనస్థానము (Transmitting Station) యొక్క ప్రత్యేకత; అనగా, ఒక్కొక్క ట్యూనింగ్ కాయిల్', 'ఏరియల్ కండెన్సర్' అను సాధనములనేకాక కంపనముల — ప్రకంపనముల — వలన ఆధారపడియుండును.

శబ్దమును గ్రహించే విధము

ఆకాశములో సంచరించే ఆ విద్యుత్తరంగము లను మరల మానవ వ్యాక్కుగా మార్చుటకు —టియుండి

మనుష్యవాక్కును గ్రహించేవిధము




౯-వ చిత్రము.

1. 'రిసీవింగ్ వాల్వ్' — Receiving valve — పరిగ్రహణ నాళిక; గొట్టము).
2. ఫి—'ఫిలమెంటు.'
3. రే—'ప్లేటు' (రేకు).
4. 'ఏరియల్ కాయిల్' — (Aerial Coil).
5. గ్రి—'గ్రిడ్' తీగె
6. 'ట్యూనింగ్ కండెన్సర్' — (Tuning Condenser)
7. 'మైక్రోఫోన్ ఆంప్లిఫయర్' (Microphone amplifier —స్వరవివర్ధక సూక్ష్మధ్వని గ్రాహి).
8. 'లౌడ్ స్పీకర్' — (Loud speaker)

చోదనస్థానమునకు కెరటపు నిడివి ఒక్కొకతీరుగా నిర్ణీతమయియుండును. ఈ కెరటములనే 'వాహకతరంగాలు' (Carrier waves) అనెదరు. 'ఏరియల్ చోదన స్థానమున (Transmitting station) కలిగే ధ్వనిని గ్రహించుటకు ఉపయోగించు సాధనమును 'రిసీవింగ్ సెట్' అనెదరు. ఈసాధనములో ముఖ్య

మయిన విభాగములు నాలు గుండును. అవి యేవన, (౧) 'ఏరియల్ కాయిల్'; (౨) 'ట్యూనింగ్ కండెన్సర్'; (౩) వాల్వులు (నాళికలు; గొట్టములు - Valves); (౪) 'లౌడ్ స్పీకర్.'

మనము 'రిసీవింగ్ సెట్' పెట్టుకొనే స్థలమునకు దగ్గరగా ఎత్తయిన రెండు స్తంభముల కొనలకు కట్టి వేసి తీగె యుండును. దీనినే 'ఏరియల్' అందురు. ఆకాశములో సంచరించు విద్యుత్తరంగములను ఈతీగె గ్రహించి విద్యుత్కంపనములరూపముగా 'రిసీవింగ్ సెట్టు' లోనికి ఇంకొక తీగెద్వారా పంపును. ఈ కంపనములు తక్కువ తరచుదనముగలవి, హెచ్చుతరచుదనము గలవి అని రెండురకములైనవి కలసియుండునని మనకు తెలియును. ఏ వ్యాపనస్థానమునుండి మనము సంగీతమునుగాని, ప్రసంగమునుగాని వినగోరుదుమో ఆస్థానమునకు నిర్ణీతమైన కెరటపునిడివికి 'ట్యూనింగ్ కండెన్సరు'ను శ్రుతిచేసికొనవలసియుండును. ఆవిధముగా శ్రుతిచేసికొన్నయెడల ఆస్థానమునుండి వచ్చే తరంగాలనుమాత్రమే మన సెట్టు గ్రహించును. ఈ 'ఏరియల్ కాయిలు'నుండి వచ్చే స్పందనములు – కంపనములు – కొన్ని 'వాల్వు'ల (గొట్టముల) మూలముగా బలపడి 'డిటెక్టర్ వాల్వు' అను మరియొక గొట్టములో ప్రవేశించును. ఈ 'వాల్వు'(గొట్టము) తక్కువ తరచుదనము గల స్పందనములను - శబ్దసంబంధమైన స్పందనములను–మాత్రమే గ్రహించి వాటిని వృద్ధిపరచును. వాటిని ఆవిధముగా మరికొన్ని 'వాల్వు'ల (గొట్టముల)ద్వారా ఇంకను వృద్ధిపరచవచ్చును. ఈ వృద్ధి పరుపబడిన స్పందనములు 'లౌడ్ స్పీకరు' (మాటలను గట్టిగా వినపడునట్లు చేయు సాధనము)వల్ల తిరిగి శబ్దరూపమును పొంది మనకు వినపడును. ధ్వనిచోదనస్థానము (Transmitting station)లోని శబ్దమే విద్యుత్సంబంధమైన స్పందనములుగాను, తరువాత తరంగములుగాను, మరల స్పందనములుగాను మారి తుదకు 'లౌడ్ స్పీకరు'లోనుండి శబ్దరూపముగా వినబడును. కాబట్టి అక్కడి పాట కాని, ప్రసంగముకాని ఏవిధమయిన మార్పు లేకుండ ఇక్కడ వినగలుగుచున్నాము.



రాజవోలు శాసనము

ఒంగోలు వేంకటరంగయ్య

రాజవోలు నెల్లూరుజిల్లా ఆత్మకూరు తాలూకాలో ఆత్మకూరు వింజమూరు రస్తాలో ఆత్మకూరికి ఏడుమైళ్లలో నున్నది. ఇపు డిది యొకసామాన్యమగు సర్కారుగ్రామముగ నున్నది, అగ్రహారము కాదు. దాదాపు 1800 మంది జను మున్నారు. సర్కారుశిస్తు దాదాపు రు. ౨౭౦౦ లుగ నున్నది. ఈ శాసనములో చెప్పబడిన ఎల్లలును తలాంకితములగు చిహ్నములును (topographical details) దానికి సరిపోవుచున్నవి. మరియు గ్రామమునకు దానముచేసిన ప్రతాపరుద్రగజపతి తన దిగ్విజయయాత్రలో సంగమను క్షేత్రమున పినాకినీ నదియందు ఒకానొక దుర్మతిసంవత్సర వైశాఖ శుద్ధ పూర్ణిమా సోమవారమునాటి సోమోపరాగకాలమున స్నానముచేసి శ్రీసంగమేశ్వరస్వామివారి సన్నిధిని ఈ దానము చేసినటులు శాసనమున కలదు. ఇత్యేవమాది అంతర్గత బహిర్గత నిదర్శనములవలన నిది నెల్లూరుజిల్లాలోని రాజవోలు అనియె నిర్ణయింపవలయును. తూర్పుగోదావరి జిల్లాలో నొకరాజవోలున్నది. శాసనగతమగు రాజవోలు రాజమహేంద్రపరిసరములలోనిది కాదనియును చెప్పవచ్చును.

శాసనపు లేఖలు :

ఈ శాసనము దళసరియగు మూడు రాగిరేకులలో అయిదుపొరటలపై నున్నది. ఈమూడురేకులును రథాకారముగ నున్నవి. ఒక్కొక్కరేకును పాదమునుండి శిఖరాగ్రమువరకు నడికొలత ౧౧ $\frac{1}{3}$ అంగుళముల ఎత్తున్నది. పార్శ్వభుజ మొక్కొక్కటియు ౯ మొదలు ౯ $\frac{2}{3}$ అంగుళము లున్నది. అక్కడనుండి రేక నడికొప్పువరకు ఏటవాలుగ నుండు భుజ మొక్కొక్కటి ౪ లేక ౪ $\frac{2}{3}$ అంగుళముల పొడవున నున్నది.



రేకలు ఈ ప్రక్క చూపిన యాకృతి గలిగియున్నవి. శిఖరతలమునందు వర్తులము రేకులు కూర్చియుండు రాగికడియము దూర్చుటకు వేయబడిన రంధ్రము.

ఈ మూడురేకులును $\frac{1}{3}$ అంగుళము మందము గల రాగికడియమునకు కూర్చబడియున్నవి. ఈ కడియము సుమారు తొమ్మిదియంగుళముల చుట్టుకొలతయు, రెండున్నర వ్యాసమును కలిగియున్నది. దీనియొక్క రెండుకొనలును ఇత్తడిపొడితో యతికింపబడియున్నవి. రాగిరేకుల నచ్చొత్తింమటకు వీలుగనుండుటకై సొంతదారుల యనుమతిమీద ౪-౪-౩౭ దిన అకడియమును అతుకుకడ నేను కోయించితిని. ఈ కడియముమీద ఒక ముద్రనని రాగిదిమ్మె యున్నది. దీనివ్యాసము ౧ $\frac{1}{3}$ అంగుళమున్నది. ఈ దిమ్మెమీద రెండు బంతులుగల వ్రాతయొకటి యున్నది. శాసనాంతమునను నిట్టి యక్షరములే గలవుగాని అవి రెండుబంతులుగాక ఒకబంతిగనే యున్నవి. వీనిలో ఒకటిరెండు నాగరలిపియందలి మకార, లకారముల పోలినవి తప్ప మిగిలినవి దురూహ్యములుగ నుండ వానిని తెలియగోరి పలువుర బ్రార్థించితిని. ఇపుడు ఒరిస్సారాష్ట్రమున చేర్పబడిన జయపురవాస్తవ్యులు శ్రీ గొడవర్తి రామదాసుపంతులు, బి. ఏ., యం. ఆర్. ఏ. యస్ గారు వీని పరిశీలించి అవి "శ్రీమాయి జయమంగళం" అనియు, అవి ఓఢ్రదేశ్యభక్కీలో వ్రాయబడిన నాగరాక్షరము లనియు తెలిపిరి. ఈ దిమ్మెమీదివ్రాతయందింకొకవిశేషమున్నది. ఈ దిమ్మె దానమిచ్చిన ప్రభువర్యుని ముద్రికగ నున్నది. ముద్రలలోని యక్షరములు సాధారణముగ అచ్చుఅక్షరములవలె తలక్రిందుగను, అపసవ్యముగను నుండును. లక్కమీదగాని, లేక కాటుకపూసిగాని యొత్తినయెడల సవ్యముగ కనపడగలవు. రాజముద్రా

స్థానమునందున్న ఈ దిమ్మెపైనుండు అక్షరములును ఇటులె తలక్రిందుగను, అపసవ్యముగ నున్నవి. ముద్రించినచిత్రపు "శ్రీమాయి" అనుబంతి క్రిందిదిగను, "జయ మం(గ)ళం" అనుబంతి పైనిదిగను చెక్కబడియున్నవి. శాసనాంతమున నుండునవి చేవ్రాలస్థానమున నున్నందున ఇవి తలక్రిందులు గాకయున్నవి.

బహుశః అక్షరముల చెక్కినశిల్పిపొరపాటు వలన ఈ దిమ్మెమీదను, శాసనాంతమునను "శ్రీమాయి జయమంగళం" అను నక్షరములలో "గ" కారము తప్పి పోయినది. ఉత్కలగజపతులు శ్రీదుర్గాదేవిని ముఖ్యముగా నారాధించుచుండినవా రనియు, వీరి శాసనాదులలో ఈ దేవతాస్తవము ముఖ్యముగ నుండుననియు, ఆ దుర్గాదేవినే "మాయీ" (జగన్మాత) అని సంబోధించుట గలదనియు ప్రాక్తనపరిశోధనదక్షులు శ్రీ రామదాసుపంతులుగారే తెలిపిరి.

శాసనముయొక్క మూడురేకులలో మొదటిరేకు మొదటిపొరటయం దేమియు లేదు. శాసనము రెండవ పొరటనుండి ప్రారంభ మగుచున్నది. రెండవపొరట యందలి శిఖరభాగమున అర్ధచంద్రరేఖయు, సూర్యబింబమును నక్షత్రచిహ్నములుగ సకేంద్రములగు మూడు వర్తులములుగల రెండుచక్రాకారములును గలవు. ఇవి ఈ శాసనగతదానమున కాచంద్రతారాస్థాయిత్వసూచకములుగ నుండగలవు.

వీని క్రింద "శ్రీమాన్వరాహదేవో జయతి" యని ఇష్టదేవతాప్రశంస గలదు. పైవాక్యము రెండు పఙ్క్తులపై నున్నది. "శ్రీమాన్వరాహ" వరకు నొకవాక్యమును మిగిలిన యక్షరములు రెండవవాక్యముగను నున్నవి. మొదటిబంతిలోని "శ్రీమాన్" అను నక్షరములు చక్కగ దెలియుచున్నవిగాని "వరాహ" స్థానమున నుండునవి సుగమములు కావు. "శ్రీమాన్వ" అనుటలో నకారమునకు వకారసంయోగమును క్లిష్టముగ నూహింపవలెనుగాని ఆవల "రా" స్థానమునను "హ" స్థానమునను నుండు అంకములు కష్టసాధ్యములుగ నున్నవి. "రా" స్థానమున నుండునది ా ఇటు లున్నది. ఇది సాధారణముగ గకారమగును. ఇక హకారస్థానమున నుండు చిహ్నము ᒥ ఇటు లున్నది. ఈ చిహ్నమున ఎడమప్రైపుననుండు చంద్రవంకను క్రిందికి ఏటవాలుగ పొడిగించిన "హ" కార మూహ్యము కాగలదు.

శాసనముండు అయిదుపొరటలలో మొదటిదానిపై ఇరువది రెండుబంతులును, రెండవదానిపై ఇరువదియారును, మూడవదానిపై ఇరువదిమూడును, నాల్గవదానిపై ఇరువదియైదును, అయిదవదానిపై పందొమ్మిదియు గలవు. చేవ్రాలుస్థానమున నుండు నక్షరముల నూక బంతిగ గ్రహించిన ఈ కడపటిపొరటపై ఇరువది యగును.

పొరటలమీద పుటసంఖ్య కానరాదు. రెండవ రేకు మొదటి పొరటయొక్క పైభాగమున ౨ ఈ చిహ్నమున్నది. ఇది యరవమున రెండు అగును. ఒకపర్యాయముగ తెలుగంకెలలోని రెండవ యంకెయు కావచ్చునని మన్నింపవలెను. ఈరేకుయొక్క రెండవప్రక్కనగాని, మూడవ రేకుమీద గాని యెట్టియంకెయును లేదు. మొదటిపొరటపై సూర్యచంద్రాదు లుండుటచే నది మొదటిదని యనుక్తముగ తెలియగలదు. రెండవరేకుయొక్క మొదటిపొరట మీద ౨ (రెండు) వేసినయెడల దీనివెనుకప్రక్క స్వతస్సిద్ధముగ మూడవ పేజి కాగలదనియు, ఈ విధమున రెండుమూడు పేజీలు ఏర్పడినంతట ఒకరు చెప్పకనె మూడవరేకున నుండునవి నాలుగైదుపొరటలనియు సుకరముగ నూహింపవలెను ననుతలంపుతో రెండవరేకు మొదటి పొరటమీద ౨ (రెండు) వేసి ప్రయత్నబాహుళ్యము (economy of effect) ఎందుకని మిగిలినవి తెలుపబడలేదనుకొనతగునా ? లేక ఈ శాసనలేఖనశిల్పి అరవవాడై మొదటిపొరటమీద సూర్య చంద్రు లుండుటచేత నచట నింకేమియును చెక్కవలనులేక రెండవరేకు మొదటిప్రక్క ౨ గుర్తు చెక్కియుండునా ? తెలుగువారు ఏమివ్రాసినను శ్రీకారము మొదట వ్రాయుదురు కదా. అటులనే యరవవారు తమ వ్రాతలప్రారంభమున ౨ చిహ్నమును పెట్టుటగలదు. దీనిని వారు పిళ్లారిసుడి (ఈ ழி) యందురు. పిళ్లారి (పుళ్లైయార్) పార్వతీదేవి ముద్దులకొమరుడు—వినాయకుడు. ఈ చిహ్న మా

ప్లిళ్లారిసుడియే యగుసేని ఈ శాసనమునకు ప్రావిషెప్పన్న నూహింప నలవియగును.

శా స న లి పి:

ఈ శాసనమంతయు నాగరాక్షరముల నున్నది. లిపి విజయనగరశాసనములలిపికంటె యర్వాచీనముగ నున్నది. అక్షరములు మంచివదిరికయు అమరికయు గల్గి యున్నవి. సాధారణముగ నిందు అక్షరక్లేశము లేదు. అర్థ, అన్వయక్లేశము లున్నచోటహూడ అక్షరములు చక్కగనే తెలియుచున్నవి. ఉదాహరణములు:

(౧) ౨—౪, ౫ యద్ద త్తివేలాకపయోంబుధిభ్యః ప్రజానురాగ ఘిలరత్నగభా౯ః.

(౨) ౨ — ౬. చలాయభూక్షుః కలకెప్తినస్యాః.

(౩) ౨—౧౩. యిచామి సప్తార్ణవవేఘులాయా మవాప్తసవ౯సాస్యాసణాభిముష్టః.

పైన ఉదాహరించిన మొదటివాక్యములో "ప్రజానురాగ ఘిలరత్నగభా౯ః" అను మాటలను "ప్రజానురాగ ఖిలరత్నగభ౯ః" అని మార్చుకోవచ్చును. కొన్నిచోట్ల వర్ణక్రమదుష్టములగు వాక్యములచే నర్థము దురూహ్యముగ కనుపడుచున్నది. ఉదాహరణము:

(౧) ౧—౧౧, ౧౨ ధత్త్వానః పచోటాక్యా వంశే జాతాయ ధీమతే।

ఇందు "ధత్త్వానః" అను పదమునకు "పచోటాక్యా" యను పదమునకు అర్థము కుదురదు. ఈరెండు మాటలను కలిపి ఈ క్రిందివిధముగ చదివినయెడల ఇవి సుబోధము లగుచున్నవి:

"దత్త్వా నప్పచోటాఖ్యా ..."

అనగ, అప్పచోట అనుపేరుగల వంశజాతునికి దానమిచ్చెను అనుఅర్థము సాధ్యము కాగలదు ఇప్పటికిని ఈరాజవోలు గ్రామమునందును, అండదండ గ్రామములందును "అప్పచోడు" అను ఇంటిపేరుగల వెలనాటిబ్రాహ్మణు లున్నారు. ఆ యింటిపేరిటివారె యిప్పటికిని రాజవోలు పురోహితు లనియు తెలియుచున్నది. "దత్త్వాన్" అనుటకు "ధత్త్వాన్" అని అక్షరభేదము కలిగియుండవచ్చును. శాసనమూల మాత్ర కలో 'దత్త్వా నప్పచోటాఖ్యా' అని యున్నది. మూలవాక్యముల నొకడు చెప్పుచుండగ నింకొకడు అవ్యుత్పన్నుడు వినుచు వ్రాయుచో "దత్త్వానః పచోటాక్యా" యని వ్రాసియుండును. వ్రాతదాని ప్రకారము పొరబడినది. 'దత్త్వా నప్పచోటాఖ్యా' యని యుచ్చరించుటకును 'దత్త్వానః పచోటాక్యా' యని అనుటకును శ్రవణలగ్న మగుటకును వ్యత్యాసము లేదు. "రామః" అని యొకడు చెప్పి సామాన్యుడగు మరియొకని దాని వ్రాయుమనిన "రామహ" అని వ్రాయుట అశాస్త్రీయమయిన నగునేగాని శ్రవణేంద్రియ వ్యాపారమున కంతదోషము కాదు. అక్షరముల నేర్చి కొను నొకపిల్లవానికి ఆవును జూపి దానిపేరు వ్రాయమనగ "ఆఉ" అని వ్రాసినాడు. "వ"కార, "ఉ"కార భేదోచ్చారణము అశిక్షితముగ వానిచెవికి వినులేదు. ఇటులనె "దత్త్వా నప్పచోట" అనునది "దత్త్వానః పచోట" అని వ్రాయసకానిమారు వ్రాతలో పడియుండె నన్నును. "దత్త్వానః పచోటాక్యా వంశే జాతాయ..." అనుదానినే సాంప్రదాయముగ గ్రహించిన "పచోటాక్యా"కులము ఏదేశమున ఏజాతివారిలో కలదో అభూతసంప్లముగ వెదకుచుండవలసియుండును.

(౨) ౨—౧౬ లో ఈవాక్యమున్నది:

"ప్రతాపావంనినాశామ్య చ్ఛత్రుకాంతారమోజశా". శాసనకవి "ప్రతాపవహ్నినా శామ్య చ్ఛత్రుకాంతార మోజసా" అని వ్రాసియుండును. "చ్ఛత్రు", "మోజశా" అనుతప్పుల నిరాదరణచేయవచ్చును. "వహ్ని నా"కు "వంనినా" యని వ్రాయుట విచిత్రముగ నున్నది. ఇచటను శ్లోకము నొకడు చెప్పుచుండగ అక్షరముల జెక్కినవాడు తన చెవికి పడినటుల చెక్కియుండును.

ఇక చిల్లరతప్పులకు మితిలేదు. పలుమారు 'ఖ' స్థానమున 'ఘ' వాడబడియున్నది. ఖ ధ ల శ స ల వ్యత్యయము సర్వసాధారణము. ౧-౯; ౧-౨౨— ఇత్యాదులందు 'న్వ' స్థానమున 'న్న' యున్నది. ఇట్లు వర్ణక్రమ స్ఖాలిత్యము లున్నను వీనినెల్ల పాఠకులు సవరించుకొనగలరు. దుస్సాధములు కావు.

శాసనములోని నాగరాక్షరములు బొంబాయి నాగరాక్షరముల పోలిక కలిగియున్నవి. అన్నియు

సాధారణముగ వాడుకలోనుండువానివలెనె యున్నవి. ఒకానొకచోట చెక్కడపుపనివాని ఉరవళ్లచేత మెర వళ్లచేత కొంచెము భిన్నములుగ నగపడినను నెమ్మదిగ జూచిన స్వస్వరూపము తెలియగలదు.

ఒక్కయక్షరమే వేఱువేఱుతీరుల వ్రాయబడి నది. ఇందుకుదాహరణముగ మూలమున గ, జ, ధ, భ లు చూపెదను. ఉ, ఊ ల కొమ్ములు వేఱువేఱుతీరుల గలవు. ఘ, ఞ యక్షరములు వింతగ నున్నవి.

అకార హ్రస్వ దీర్ఘములు, గుడి గుడిదీర్ఘములు కొమ్ము కొమ్ముదీర్ఘములు, ఏత్వ, ఐత్వ, ఔత్వములు విచ్చలవిడిగ నొకదాని స్థానమున నింకొకటి యుండును. చదువరి ఇట్టి స్వల్ప వ్యతిక్రమముల సులభముగ కను గొనవచ్చును. చదువుటకును అర్థమునకును తిరుగబడు నది మొదటిపొరటలో రెండవ బంతియొకటి యగపడు చున్నది.

శాసనభాష, రచన :

(౧) తత్ర భూదానశాసనక్రమః (౧ – ౧౫)
(౨) తత్ర విఘ్నేశ్వరస్తుతిః (౧ – ౧౫)
(౩) బ్రహ్మస్తుతిః (౧ – ౧౭)
(౪) సూర్యస్తుతిః (౧ – ౧౯)
(౫) అష్టభోగస్వామ్యానీ (౩ – ౧౧)
(౬) నిధినిక్షేప జలపాషాణ అక్షీణాగామి
(౭) సిద్ధసాధ్యాదినిర్ణయోః సార్థం(౩–౧౨,౧౩)
(౮) గ్రామాష్టకోణనిర్ణయః (౩ – ౧౩)

ఇత్యాది సూచనవాక్యములుతప్ప మిగిలిన శాసనభాగ మంతయు శ్లోకబద్ధమైనటుల కనుపడు చున్నది. శ్లోకసంఖ్యగాని, పఙ్క్తిసంఖ్యగాని వేయ బడియుండలేదు. ఈ యచ్చున వేయబడియుండు అంకెలు పాఠకసౌకర్యముకొరకు నాచే వేయబడినవై యున్నవి. కొన్నికొన్ని శ్లోకములు అర్ధశ్లోకములుగను, అసంపూర్తిగను ఉన్నటుల తోచుచున్నది. ఉదా హరణము :

పొరట బంతి

౧ – ౧౪ నారాయణాభిధానాయ
నన్నంభట్టాయ చ స్వతః।

౨ – ౧౯ సానాదిగంతభూపాలైః
అపిజాతం రత్నభూషణం ।

౫ – ౧౦, ౧౧ శ్రీరాజమాంబాపురాష్టదిక్షు
యేకోనత్రింశశిలాశాసనాని।

౫ – ౧౨ ఇమానిశిమచింహ్నాని
కథితాని పురాతనైః।

అర్ధశ్లోకములతో కలసి అన్నియు నలువదియొని మిదిగ నున్నవి. వీనిలో అధికసంఖ్య అనుష్టుభ్ శ్లోక ములు. ఇవిగాక ఉపజాతులు (ఇంద్రవజ్రోపేంద్రవజ్ర ములు), రథోద్ధతలు, ద్రుతవిళంబితములు, శార్దూల ములును, ఇంద్రవంశములు, పంచచామరమును గలవు. లేఖక (శిల్పి) ప్రమాదికములై కొన్నికొన్ని ప్రస్తార ములకు కుదురుట లేదు. ఉదాహరణము : పొరట ౪, బంతులు ౧౪–౧౭.

తతనుపశ్చిమే మేచకభూతలే శాసనంముతర దిక్తటభూమిషు।

ప్రస్తర ఆరవేడు చిరువేళ్లయోః సంగమనేపుర సిమ్ని సుశోణకే॥

దీనిని ప్రస్తరింపవలయునని దుర్ఘటముగ నున్నది. దీనిని సవరణచేయతగినంతవరకు చేసినయెడల ఇటు లుండు నేమోయని భ్రమకలుగుచున్నది.

తదను పశ్చిమమేచకభూతలే
శాసనముత్తర దిక్తట భూమిషు।
ప్రస్తరఆరవె డుచ్చిరు వేళ్లయో
సంగమనేపుర సీమ్నిసు శోణకే॥

ఇది ద్రుతవిళంబితవృత్తమని మొదటిపాదము వలన (న. భ. భ. ర.) స్ఫురించుచున్నది. రెండు మూడు నాలుగు పాదములలోని మొదట నగణము లేదు. వ్రాయసకాని గంటమో అగసాలవాని పోగరయో ఈదుర్గతికి కారణము. ఒక్కొకమారు కవియె ఛందో భంగము నోర్వజాలక యక్షరలోపముల జేసినట్లును కను పడుచున్నది. ఇందు క్రిందికి మనోహరమగు పంచచా మరము సాక్ష్య మిచ్చుచున్నది.

కులాల పుక్కరాయనే శిలోచయే పురస్తతః
ప్రుధాకునామధేయకా సమానశిమ్ని దక్షిణే

పునోటిక్షేమపశ్చిమే సు రాజరాజమాంబికా
పురా దు(గీ)చిభీమసంధికా శిలావిలేఖనం॥

౫, ౭—౧౦.

ఈశ్లోక ప్రథమపాదమున "శిలోచ్చయే" యను టకు బదులు "శిలోచయె" యని పడినది. ద్విత్వచ కారము వ్రాసిన వ్యాకరణమున కనుకూలముగ నుండును గాని ద్విత్వము లేకున్నను ఛందోభంగము లేదు. ఇటు లనె రెండవ పాదమునందలి "శిమ్ని" స్థానమున "సీమ్ని" యని వ్రాసిన శబ్దసౌష్ఠవము సిద్ధించుచున్నదేగాని ఛంద స్సునకు లోపము లేదు. ఇక కవియొక్క చమత్కా రము మూడు నాలుగు పాదములందు చూడవలయును. మూడవ పాదములోని మొదటిమాటయగు "పునోటి" యనునది యొక గ్రామనామము. ఆయూరిపేరు "పును గోడు." "పునుగోడు" అని వ్రాసిన ఒకయక్షర మెక్కువ యగుచున్నది. "పుఙ్గోడు" అని వ్రాసిన మొదటి యక్షరము గురువు అగును. దీనివలన ఛందోభంగము సంభవించును. అటులనే ఆపా దమున నే "సు రాజరాజ" యనుచోట "శ్రీ రాజరాజ" యని యున్న రమ్యతరముగ నుండును కాబోలును. "సు" ను "శ్రీ" జేసినయెడల శ్రీశబ్ద మీకారాంత మగునను భీతిచే "సు" అని పనిపడి వ్రాసియుండ వచ్చును. ఇక నాల్గవపాదము "భీమ"శబ్దము 'నామైక దేశగ్రహణే' నామగ్రహణన్యాయమున సాధింపతగి యున్నది. "భీమ" అను రెండక్షరములు "భీమవరం" అను శబ్దమునకు పర్యాయముగ నున్నవి. "భీమవరం" అని వ్రాసిన శ్లోకము నడువదు. అందుచేత "భీమ" శబ్ద ము భీమవరమునకు సంక్షేప రూపముగ చెప్పబడినది. ఇట్టికష్టముల జూచియే కాబోలు "అపిమాషం మషం కుర్యా చ్ఛందోభంగం న కారయేత్" అని ప్రాచీను లుద్ఘోషించినది. వ్రాయసకాని అస్తవ్యస్తములు శిల్పి యొక్క అవ్యుత్పన్నతలు శాసనకవిపై బెట్టుట న్యా య్యము కాదు. లేఖక శిల్పిక స్ఖాలిత్యముల పరిహ రించుకొనినయెడల శాసనపాఠమును రసనయు ప్రాశస్త్యమును, శ్లాఘ్యమునను నున్నటుల లోపగలదు.

రాజవోలుపల్లెలు లోనగునవి :

రాజవోలు గ్రామమునకు శాసనమున చెప్పబడి యుండు పల్లెలందు పూర్వహద్దు అగు పామూరు తప్ప మిగిలిన వన్నియు గతిపోవుచున్నవి. పూర్వపల్లె యగు పామూరు ఇప్పుడు లేదు. ఏకారణమువలనో కొన్ని శతా బ్దములకు ముందు అచ్చటివారందరు అచ్చటిని వదిలి లేచి పోయిన ట్లున్నది. కాపురములులేక పాడుబడి పొలము మాత్రము గ్రామముక్రింద యుండునదియు కాదు. ఇట్లుండుదానిని బేచిరాగ్[1] గ్రామ మందురు. ఇది అట్టిదిని కాదు. దీనినామరూపము లిప్పుడు లేవు. ఆ గ్రామనివేశనములు, క్షేత్రములు, పాడుబడిభూములు, అడవులు, కంచెలు — అన్నియు రాజవోలునకు ఇప్పటను తూర్పుననుండు అనుమసముద్రము, అనుమసముద్రంపేట అను గ్రామముల పడికట్టులో చేరిపోయినవని కొందరు వయోవృద్ధులు చెప్పెదరు. పామూరొకటి యొకకాల మున నుండి ఈవల అస్తంగతమయిన దనుటకు ఆయింటి పేరుగల కరణాల కుటుంబములు, శెట్టి, తెలాగులును గలరు. ఈ పామూరుగాక కనిగిరిసమీపమున పూర్వ మున కాళహస్తిసంస్థానమునకు చేరియుండిన పామూ రొకటి ఇప్పటికిని వెలయుచున్నది. అది రాజవోలు నకు మూడామడలదూరమున నున్నది. శాసనగతమగు పామూరు అది కాదు.

ఇతరదిక్కులహద్దులు శాసనమున నీ క్రిందివిధ మున్నవి. ఆగ్నేయమున పునుగోడు, దక్షిణమున పైడి పాడు, నైరృతిదిశయందు చిరువెల్ల, పశ్చిమమున అర వేడు, వాయవ్యమున ధూపగుంట, ఉత్తరమున భీమ వరము, ఈశాన్యమున పందిపాడు, — ఇవన్నియు ఇప్పటికిని గలవు. అయితే యిప్పటి సర్కారు హద్దులప్రకారము దక్షిణమున పునుగోడు చిరువెళ్ల గ్రామములమధ్య నబీనగరు అను శ్రోత్రియ మొకటి

---

1. బేచిరాగ్ అనగ అవయవార్థము దీపములేనిది. అర్థాత్ దీపము పెట్టుకొని కాపురము చేయు వారు లేనిది (Deserted Village).

కొంతవరకు తగులుచున్న దనియును, ఉత్తరము నను పందిపాటికిని రాజవోలునకు నడుమ కొంత వరకు హబ్బీపురము అను శ్రోత్రియగ్రామమొకటి తగులుచున్న దనియును తెలియుచున్నది. ఈ నవీనగరున్ను హబ్బీపురమున్ను ఉదయగిరిలో తురకలప్రభుత్వ మేర్పడుటకుముందు లేవు. మరియు ౧౮౬౧ ప్రాంతముల జరిగిన ఇనామతి సెటిలుమెంటునందును ఈరెండు శ్రోత్రియములును అనాదిశ్రోత్రియములుగా గణింపబడక దర్మిల్లా పుట్టినట్లుగా తీర్మానింపబడిన దనియు తెలియుచున్నది. కాబట్టి ఈనాడు దక్షిణమున నవీనగరమును ఉత్తరమున కొంతవరకు హబ్బీపురమును ఉండుటచే శాసనప్రామాణ్యమునకు భంగము కలుగజాలదు. ఈక్రొత్త శ్రోత్రియము లిట్లుండగ గవనర్మెంటు వారు ప్రకటించిన రీసర్వేప్లానులో నీహద్దులును, తూర్పున తప్ప మిగిలిన దిశలందు ప్రాతహద్దులును పైరెండు క్రొత్త శ్రోత్రియములును కలిసియున్నవి. తూర్పున అనుమసముద్రం పేట పునుగోడు; దక్షిణమున నవీనగరం శ్రోత్రియము, చవుట భీమవరము; పడమట బోయిళ్ల చిరువెళ్ల, ఆరవీడు. ఉత్తరమున దూబగుంట, చవుట భీమవరము. ఈ హద్దులలోని చవుటభీమవరమే శాసనమున భీమవర మనబడినది. ఇందలి బోయిళ్ల చిరువెళ్లయె శాసనమున చిరువోళ్లి యనబడినది. సర్కారుహద్దులలో నొకవిశేష మున్నది. ఇది యాథార్థమో విచిత్రమోగాని చవుట భీమవరము రాజవోలునకు దక్షిణమున, ఉత్తరమునకూడ చూపబడియున్నది! సర్కారుప్లాను తప్పన నెవరికి శక్యము ?

శాసనమున తొలుత ఈ గ్రామమున కెనిమిది దిక్కులనుండు ఇతరగ్రామముల వరుసగ జెప్పినతరువాత గ్రామములోని ప్రసిద్ధములగు గుర్తులు (topographical notes) — తలచిహ్నములు జెప్పబడి, ఆవల గ్రామావరణ సీమానిర్ణయమునకై వేయబడినరాళ్లును (demarcation stones) తూర్పునుండి వరుసగా చెప్పబడియున్నవి. గ్రామమున కెనిమిదిమూలలనుండు గ్రామములపేళ్లు పైన వివరింపబడియున్నవి. గ్రామమునకు ప్రత్యేకముగ గుర్తులు కొతగిన తలచిహ్నములు నాలుగు చెప్పబడియున్నవి: (౧) గ్రామస్య దక్షిణే శైలః (ఇది యున్నది); (౨) ఉత్తరే పుష్కరం స్మృతం (ఈ చెరువును ఉన్నది); (౩) పశ్చిమే నందివాపి స్యాత్ (ఈబావి లేదు. బావిపట్టున నందు లున్నవి); (౪) ఆగ్నేయాంతు శివాలయః (ఇది శిథిలమై యున్నవి).

గ్రామావరణసీమానిర్ణయమునకై ఇరువదితొమ్మిది రాళ్లను శాసనచిహ్నములతోటి స్థాపించినట్లును ౫ — ౧౦, ౧౧ వలన తెలియుచున్నది — "శ్రీ రాజమాంబా పురాష్టదిక్షు । ఏకోనత్రింశచ్ఛిలాశాసనాని". ఈ ఇరువది తొమ్మిదింటిలో (౧) కొన్ని ముయ్యెలరాళ్లు, అనగా గ్రామములకూడలిలో ముయ్యెలలో వేయబడినవి; (౨) కొన్ని మూలరాళ్లు, అనగా సరిహద్దు చెప్పకొనిపోవుటలో చాయగా ఋజురేఖవలె నడువక ఎచటనైన కొని తిరిగినయెడల అచట నా కొనితిరుగుమూలను తెలుపుటకై వేయబడినవి — మూలరాళ్లు. వీని వర్ణించుటలో కోటి కోణ ఇత్యాదిశబ్దము లుండును. పైరెండువిధముల గాక మూడవవిధపురాళ్లు చాలురాళ్లు. ముయ్యెలరాతి కొక యుదాహరణము :—

ప్రాగ్భాగే పునుగోటిసీమనికటే చించాతరూణాం పురః
శ్రీమద్ధర్మశిలావిలేఖనం" ౩ — ౨౦.

'మూలరాతి కొక యుదాహరణము:—

తస్యా దక్షిణకోటికోణ నిహితా శ్రీమచ్ఛమీసన్నిధౌ
శ్రీమత్ప్రస్తర శాసనం. — ౩ — ౨౧, ౨౨.

చాలురాలు:—

తస్య పశ్చిమతటాకసన్నిధౌ ప్రస్తరస్తదను రాజతే శుభః।
తస్య దక్షిణశిలామయే భువి శాసనం.
౪ — ౬, ౭.

ఈఇరువది తొమ్మిదిరాళ్లును ఇపుడు ఆయాస్థానములలో నున్నవియో లేవో చెప్పగలవారు లేరు. ఉన్నను యేమియు ప్రయోజన ముండజాలదు. కేవల శాసన యాథార్థ్యసిద్ధికొరకు వీని చూడవలసినదే.

రాచతికపువిషయములు; దాత-ప్రతిగ్రహీత:

రాచతికపుజోలి ఈశాసనమున కొలదిగ గలదు. ఈగ్రామదానముతో సంబంధపడినవా రొకరా యిద్దరు ప్రతాపరుద్రులాయని సందియముగ నున్నది. ఇద్దరగు నెడల ఓరుగంటి కాకతీయ ప్రభువర్యుడగు ప్రతాపరుద్రు

ఒకడును, రెండవవాడు ఉత్కలాధిపుడగు ప్రతాపరుద్రగజపతియును కావలయును. ఓరుగల్లు, కాకతీయ శబ్దము లీ శాసనమున నగపడవు. పుట ౧, బంతి ౧౦ లో "ముమ్మటియా[1] తనూద్భవాః" యని యుండుటచే ఈముమ్మటి (ముమ్మడి) కాకతీయ ప్రతాపరుద్రునితల్లి యగు నెడల కాకతీయ ప్రతాపరుద్రుని ప్రస్తావము అనుమేయము కాతగును. ఈముమ్మటిశబ్ద మాయమపర్యాయము కానిచో పరిశేషమున నొక్క ప్రతాపరుద్రుడే మిగులుచున్నాడు. ఈతని ఐక్యవిషయమున సందేహమే లేదు. ఈతని పితృపితామహనామము లిందున్నవి (పొరట ౨, బంక్తులు ౨ మొదలు ౧౬ వరకు) చూడుడు.

కపిలేంద్రుడు
|
పురుషోత్తముడు
|
ప్రతాపరుద్రుడు

వీరల భార్యలపేళ్లు శాసనమున లేవు. వీరిది సూర్యవంశము. వీరి గజపతిత్వమున కాధారమగు సూచనలు అందందు గలవు.—

ఈ యిద్దరు ప్రతాపరుద్రులనడుమ దాదాపు ఇన్నూరేండ్లెడమున్నది. కాకతీయుని రాజ్యకాలము క్రీ. శ. ౧౨౯౫ – ౧౩౨౬ అని ఆంధ్రచరిత్రవ్యవస్థాపకులు — శ్రీ చిలుకూరు వీరభద్రరావుగారు నిర్ణయించియున్నారు. ఔత్కలప్రతాపుని రాజ్యకాలము క్రీ. శ. ౧౪౯౬ లేక ౧౪౯౭ మొదలు ౧౫౪౧ లేక ౧౫౩౦ వరకని దేశచరిత్రలవలన తెలియగలదు. ఇంతకాల వ్యవధిగల యిద్దరురాజుల కాలము నెట్లు పొసగునని ప్రశ్నింపవచ్చును. అందుకు సమాధాన మేమన :

తొలుత నీగ్రామమును ఓరుగంటి ప్రతాపరుద్రుడు శ్రీవత్సగోత్రోద్భవుడగు అప్పలోటి నారాయణభట్టు అను నామాంతరముగల నన్నంభట్టునకు సహిరణ్యోదకముగ దాన మిచ్చియుండును (౧-౧౨, ౧౪). ఈ ప్రతిగ్రహీతృవంశము ఇట్లు గలదు.

నరసింహ
|
సర్వాభట్టు
|
సోమ (సోమభట్టు)

నారాయణాభిధాను డగు నన్నంభట్టు – (౧-౧౧-౧౪).

కాలగతిచేతనైననేమి ప్రతిగ్రహీతృసంతతి విచ్ఛేదమున నైననేమి, ఇతరదైవిక రాజకములచేత నైననేమి ఈదానము నిరాగమమై (Devoid of documentory evidence) ఖిలమై యుత్పన్నదశ జెంది యుండవచ్చును. అయితే పరంపరాగత ప్రజాస్మృతిపథమున నది యొకపూర్వాగ్రహారముగ నిలిచియుండును. ఇట్టి దాని నెట్టులయిన యుద్ధరింపజేసికొనవలయు ననుకోరిక ప్రథమప్రతిగ్రహీతృదాయాదివర్గమునకు కలిగి యుండుట అసంభావ్యము కాదు. ఇట్టిస్థితిలో దైవికముగ ప్రథమదాతసనామకుడు ఉత్కల ప్రతాపరుద్ర గజపతి దిగ్విజయయాత్ర వెడలి ఈరాజవోలుప్రాంతమునకు వచ్చినపుడు ప్రథమప్రతిగ్రహీతృ సనామకుడు సగోత్రుడు-దాయాది-తద్వృత్తిశేషభోక్త[2]-రెండవప్రతి

---

1. కాకతీయ ప్రతాపరుద్రునికి దౌహిత్రదాయరీతిగ ఓరుగంటిసామ్రాజ్యము లభించియుండుట ప్రతాపరుద్రీయాది యుద్గ్రంథములవలన ప్రసిద్ధమయియున్నది. ఆకారణముచే నాతనితల్లి పేరిందు స్మరింపబడియుండగలదు.

"కౌసల్యాసీ త్ప్రథమజననీ దేవకీ చ ద్వితీయా । విష్ణో ర్మాతా తదనుమహితా ముమ్మడంబా తృతీయా ।
యా త్రేతాయాం రఘుపతే రభూత్ ద్వాపరే శౌరిరాసీత్ । త్రాతుం క్షోణీం స జయతి కలౌ వీరరుద్రావతారః॥
—ప్రతాపరుద్రీయము, నాయకప్రకరణము.

2. ఇట్టివాని నిప్పటి యాంగలభావసమ్మిళిత స్మార్తపరిభాషయందు 'రివర్షనర్' అనియో, 'రిమెండర్ మాన్' అనియో యందురనుకాబోలు,

గ్రహీత అనేకభూదేవసహితుడై ఈగజపతికడ కేగి స్తోత్రముజేసి భారతకర్త నంతటివాడవని పొగడి ప్రాక్తనదానచరిత్రము తెలుపుకొని ఈ పునర్దానమును దానశాసనపురస్సరముగ పొందియుండును. ఈయూహ కాధారములు పొరట ౨, పంక్తులు ౧ మొదలు ౧౩ వరకును గలవు. ఇందలి శ్లోకములకు అన్వయము సుబోధము గాకపోయినను వానియొక్క సారాంశము ఈయూహను స్ఫుటముగ జూపుచున్నది. ఈరెండవ నన్నయ తాను ప్రథమ నన్నంభట్టు దాయాది ననియు, "తద్వృత్తిశేష భోక్త" ననియు చెప్పుకొనినట్లు అందున్నది. అంతట ప్రతాపరుద్రగజపతి ఆమోదించి ఈ తామ్రశాసనము నిచ్చినట్లును చెప్పబడియున్నది (౨ – ౯, ౧౦, ౧౧ బంతులు).

మొదటిదానము హిరణ్యోదకపూర్వకమాత్రమనియు, ఈరెండవదానము తామ్రశాసనపూర్వకమనియు నూహింపనలవియగుచున్నదని నామనవి.— అట్లుగాక ద్విశతాబ్దవ్యవధిగల యిద్దరు ప్రతాపరుద్రుల ప్రశంస యిందు లేదనియు, దాన మిచ్చినది ఉత్కల ప్రతాపరుద్ర గజపతిమహారాజే ననియు, నన్నంభట్టులు ఇద్దరు కారనియు, ఒక్కరే యనియు-ఇత్యాదిపక్షము సిద్ధమగునెడల నాయూహ ఎట్లయిన గెలువవలయునని పట్టులేదు. ఈ పూర్వపక్షమున కొకదుస్తరమగు కష్టము గలదు. "<u>తద్గోత్రజస్తు</u>[1] దాయాదః। సోమాభట్టసుతో<u>పరః</u> నన్నయాఖ్యస్తు<u>తద్వృత్తిశేష భోక్త</u>నిరంతరం"ఇత్యాది పొరట ౨, బంతులు ౫, ౬, ౭ లలోని మాటలకు సమన్వయము కావలసియుండును. తచ్ఛబ్ద ప్రయోగమును, "తద్గోత్రజ", "తద్వృత్తి శేషభోక్త"యనుటయు పూర్వవర్తియైన యింకొక నన్నంభట్టువున కాకాంక్ష జూపుచున్నవని నామనవి.

మనదేశమున ముఖ్యముగ హిందువులలో పూర్వపుతరములవారి పేళ్లు వెనుకటితరములవారికి పెట్టుట ప్రసిద్ధవిషయము. అట్లగుటచే పూర్వ మెన్ని తరముల క్రిందనో యుండిన సోమభట్టు అను పేరు తరువాతి తరములలో వచ్చుటయు, ఈతనికి నారాయణభట్టు అను నామాంతరముగల నన్నంభట్టు అనుకుమారు డుండుటయు అసంభవవిషయములు కావు. కాబట్టి నాయూహ సమంజసమగునేని పూర్వము కాకతీయ ప్రతాపరుద్రుడు నన్నంభట్టువునకు హిరణ్యోదకపూర్వకముగ జేసినదానమును తెరువాత ఇన్నూరేండ్లకు ప్రతాపరుద్రగజపతి గొప్పమనస్సుతో నద్ధరించి అనుపాలనముచేసి పునర్దానముగ ఈ శాసనపురస్సరముగ ఇచ్చియుండును. 'దానపాలనయోర్మధ్యే దానా చ్ఛ్రేయోనుపాలనం, దానా త్స్వర్గమవాప్నోతి పాలనా దచ్యుతం పదం' అను స్మృతివాక్యప్రమాణమునుబట్టి ఈ ప్రాచీనదాన ముద్ధరింపబడి స్థిరపరుపబడియుండును (regrant and confirmation). ఇప్పటి గవర్నమెంటువారును ఇనాముతిసెటిలుమెంటులో చేసిన దిదియేగదా, దానపత్రమో, ఏబదియేండ్లకు పైబడిన అనుభవమో యేర్పడినయెడల అట్టి యినాములను ప్రాయికముగ స్థిరపరచుచు వచ్చినారు.

గ్రామనామము :

ఈ గ్రామము దానమీబడునప్పటికే దీనికి "రాజవోలు" అను పేరుండినయెడల ఆపేరెట్లు కలిగినదియు విచారింపవలసియున్నది. కిరాతులపల్లెలు కొన్ని యుండినట్లును వానిలో నీ రాజవోలు "శోభసమన్విత"మై యుండినదనియు ౧ — ౯, ౧౦ బంతులవలన తెలియుచున్నది. "కిరాతానాం గ్రామతికామధ్యే శోభసమన్వితః।రాజవోలుమహాగ్రామే..." ఈకిరాత గ్రామములే "నిషాదబృందనిలయ" యని ౨ – ౨౨ లో వర్ణింపబడియున్నవి. కిరాతజాతులకును రాజ్యములు గ్రామము లుండినవియాయని యాశ్చర్యపడనక్కరలేదు. వాల్మీకి రామాయణమునందలి అయోధ్యాకాండ సర్గ ౫౦, శ్లో. ౩౨ త్త యందు నిషాదుడగు గుహుడు రాజుగ వర్ణింపబడియున్నాడు: "తత్ర రాజా గుహో నామ,.... నిషాదజాత్యో బలవాన్ స్థపతి శ్చేతి విశ్రుతః" అని

1. ఈ శ్లోకములోని మాటలక్రిందిగీతలు మూలమున లేవు. అవి నాచే గీయబడినవి.

యున్నది. ఏకలవ్యుడు "హిరణ్యధన్వుండను నెఱుకరాజు కొడుకని భారతమున ఆదిపర్వ పంచమాశ్వాసమున నున్నది. మఱియు స్వారోచిష "నొక్క యెఱుకు రేను నక్కకొమ్ము నిజ్జగొరజంపు కానుక యిచ్చినట్లు మనుచరిత్రమున ౪ - ౧౩వ చూడనగును. నెల్లూరుజిల్లా కందుకూరుతాలూకాలో వర్ధిల్లుచుండు చండిరాజులు బోయవారని నానుడి గలదు. అదియు నిదియు నేల, ఈరాజవోలునకు నైరృతిదిశయందుండు "సీరువోల్లకః" అను గ్రామము నేనాటికిని "బోయిళ్ల చిరువెళ్ల" యని పిలువబడుచున్నది. ఇందుచే ఈరాజవోలులోనను కొన్ని గ్రామములు ఒకచిన్న బోయసంస్థానమునకు జెందియుండెను. ఆసంస్థానమునకు రాజవోలే రాజధానిస్థానముగ నుండును. అందుచేతనే పొరట ౧, పంక్తి ౯ లో యిది "శోభసమన్వితః" అని వర్ణింపబడియున్నది. మరియు ౨ - ౨౨ "ప్రజావర్ధనీ" యనియు, "నిత్యానంద నిషాదబృంద నిలయే"1 యనియు భూషింపబడియున్నది. ఇదియుగాక రాజవోలు (రాజ+ప్రోలు) అనుటచేతనే ఇది ఆ చిన్నసంస్థానమున ప్రధానగ్రామ మయినట్లును ఊహింపవచ్చును. ఈ గ్రామమునకు ప్రతాపరుద్రగజపతి "శ్రీ రాజాంబాపురము" అనునభిధేయము నిచ్చినాడు (౨ – ౨౩). ఈ నూతన నామకరణకాలమునకే ఆగ్రామమునకు "రాజవోలు" అనుపేరుండుటచే కిరాతుల రాజధానిగనైన ఉండవచ్చును; లేక పై ౧౩–౧౪ పుటలలో నూహించినటుల కాకతీయ ప్రతాపరుద్రునిచే నాక్రమింపబడినందున రాజవోలు (రాజప్రోలు) అను బిరుదనామము కల్గియుండవచ్చును. ఈయూహ కింకొకనాలుపోవయు శాసనాంతిమభాగమున కానవచ్చుచున్నది. పొరట ౫, పంక్తులు ౩, ౯, ౧౦ లలో "శ్రీ రాజమాంబాపుర" ప్రస్తావము కలిగియుండియు ఆపొరటయందే ౧౩,–౧౪ పంక్తులలో నవశ్యముగ ఈ గ్రామమునకు "ప్రతాపరుద్రాఖ్యపురాగ్రహార"నామ ముండినటుల స్ఫురింపజేయు నీక్రిందివాక్యము లున్నవి:

"సింహాసనస్థ పరివారనిస్తంభ "ప్రతాపరుద్రాఖ్యపురాగ్రహారే గోప్పాపమాత్రం యదిహంస చేన్న, ప్రదాతి గోశతం సకలం పాపి॥"

ఇం దుల్లేఖింపబడిన ప్రతాపరుద్ర గజపతిరాజు యనునాతడు రెండుసంస్కృతిక నైన శ్రీ రాజమాంబాపురము చెప్పియుండి తటాలున దినప్పుడు ఈ అగ్రహారమునకు పెట్టుకొనుట సమంజసముగ నుండదని మనవిజేయ వలసియున్నది. ఈ పొరటలలో ౩, ౯, ౧౦ బంతులలోననేగాక ౧ — ౯, ౨ — ౨౩, ౪ - ౨౧ లలోకూడ శ్రీ రాజాంబనే యున్నది. ఇన్ని చోట్లలో శ్రీ రాజాంబనేరు చెప్పబడి, కట్టకడపట "ప్రతాపరుద్రాఖ్యపురేగ్రహారే" అనుటకు ప్రబలమైనకారణ ముండవలయును. ఆయూహ కాపే యుండుటయే ఆ ప్రబలమైన కారణముగ నుండును. ఆ ప్రతాపరుద్రుడు కాకతీయుడుగనే యుండవచ్చును.

ఈ గ్రామమును శ్రీ రాజాంబాపురమనుటకు కారణమగు నా గొప్పస్త్రీ యెవరో ఈ శాసనము వలన తెలియదు.

శాసనకాలము :

శాసనకాలనిర్ణయమున కిందు రెండు ఆధారము లగపడుచున్నవి. మొదటిది పొరట ౧, బంతులు ౧, ౨, ౩, ౪ లలో నున్నది. రెండవది పొరట ౨, బంతులు ౨౫, ౨౬ల లోను, పొరట ౩, బంతి ౧లోనను ఉన్నది. వీనిలో మొదటిదానిలో రెండవబంతిలో కొన్ని యక్షరములు తెలియలేదు. తెలియనివాని కిట్లు... నుర్తుపెట్టి ఆబంతులు ఇచట వ్రాయబడుచున్నవి.

(౧) స్వస్తి శ్రీవిజయాభ్యుదయ శాలివాహన శకాబ్దాః|...

(౨) ......జ్ఞేయం గుణలేఖనభావనా | తత్ర దుర్మతినామా.

1. "నిత్యానంద నిషాదబృంద"యనుటలో ఇచట ఛలోక్తి యేమియు నూహింపబడనక్కరలేదని మనవి.

2. 'రుద్రాఖ్యేయ' యనుపదమును "రుద్రాఖ్య"యని సవరించుకొనవలయును. దీని క్రిందిగీత నేను గీచితిని.

(౩) వైశాఖపూర్ణిమాసంయుతే । సోమవారయుతా సోమగ్రహోపేతా.

(౪) సంప్రదా—

ఈ వాక్యములందలి "గుణలేఖనభానునా" యను సంకేతము అన్వయము కాలేదు.

రెండవయుల్లేఖ మిటు లున్నది.

పాఠకం ౨, పంక్తి ౨౫ :

"శాకాబ్దే గుణ లోచ నార్క సహితే సంవత్సరే దుర్మతౌ । రాహుగ్రస్తవిధౌ బహుప్రక

పాఠకం ౩, పంక్తి ౧ :

టితో వైశాఖమాసే ముదా దత్తం" ।

ఈ రెండుల్లేఖములును ఒకటే కాలమును సూచింపుచున్నటుల కనుపడుచున్నది. "గుణలేఖన భానునా" యను నక్షరములను "గుణలోచన భానునా"యని పఠించినయెడల ఇదియు, "గుణ లోచ నార్క సహిత" యు శకవర్షంబులు ౧౨౨౩ను ఇచ్చుచున్నవి. గుణ = ౩, లోచన = ౨, భాను లేక అర్క = ౧౨. "అంకానాం వామతో గతిః" అని యున్నందున యంకెలను కడపటినుండి మొదలిడి త్రిప్పిజెప్పిన ౧౨౨౩ అగును. దీనికి ౭౮ జేర్చిన క్రీస్తుశకసంవత్సరము ఏర్పడుచున్నది. శాలివాహనశకము ౧౨౨౩నకు సరిపోవు క్రీస్తుశకసంవత్సరము ౧౩౦౧ అని తేలుచున్నది.

స్వాయల్ గారి 'హిందూదేశమందలి చంద్రగ్రహణములు' (Lunar Eclipses in India) అను గ్రంథమును బట్టియు, స్వామికణ్ణుపిళ్లె గారి 'ఇండియన్ క్రోనాలజి' (Indian Chronology) అను గ్రంథమునుబట్టియు క్రీ. శ. ౧౩౦౧ ప్లవ యగుచున్నది. ప్లవ వైశాఖపూర్ణిమ నాడు చంద్రగ్రహణమైనటుల యా గ్రంథములవలన తెలియలేదు. సంవత్సర మాస తిథులు స్పష్టముగ చెప్పబడియున్నందున వానిబట్టిచూడగ క్రీ. శ. ౧౫౦౧ గ నుండవచ్చునని తోచుచున్నది. క్రీ. శ. ౧౫౦౧ శకవర్షంబులు ౧౪౨౩ అగుచున్నది. ప్రభవాది షష్టిసంవత్సరపరిగణనమునకు అది దుర్మతి యగుచున్నది. ఆ దుర్మతి వైశాఖశుద్ధ పూర్ణిమా సోమవారము సోమగ్రహోపేత మయినట్లును పై గ్రంథములవలన తెలియుచున్నది.

క్రీ. శ. ౧౩౦౧ కాకతీయ ప్రతాపరుద్రుని రాజ్యకాలము క్రీ. శ. ౧౨౯౫ - ౧౩౨౬ లో నంతర్భూతమగుచున్నది కాన ప్రతాపరుద్రగజపతికాలమున కన్వయింపదు. ఈ విషమస్థితిలో "గుణ లోచన భానునా", "గుణ లోచ నార్క సహిత" అను సంకేతముల సమర్థనమెట్లు కుదురునో చూడవలయును. ఈశాసన మత్యంతము గ వర్ణక్రమదుష్టమయి యుండుట పాఠకోత్తములు కనుగొనగలరు. ఇటులుండుటచే "గుణ లోచన భానునా", "గుణ లోచ నార్క సహిత" యను నక్షరములందె పొరపాటులుండవచ్చునని గ్రహించి, "భానునా" యనుపదమును "భానవాః" యనియు, "లోచ నార్క సహిత" యనుదానిని "లోచ నార్కి సహిత" యనియు చదువుకొనిన సంవత్సరములు సరిపడునటు లున్నది. "భానవ" శబ్దమును "ఆర్కి" శబ్దమును మనుగణపర్యాయముగ నన్వయించుకొనిన మనుసంఖ్య పదునాలుగగుటచే "గుణ లోచన భావవాః", గుణ లోచనార్కి సహిత" యనునవి ౧౪౨౩ కాగలవు (గుణ = ౩, లోచన = ౨, భానవాః లేక ఆర్కి = ౧౪). మనువునకు సూర్యపుత్రత్వము ప్రసిద్ధవిషయము. వాల్మీకిరామాయణ బాలకాండ, సర్గ ౭౦, శ్లో. ౧౮ యందు దశరథవంశకథనమున "వివస్వాన్ కాశ్యపా జ్జజ్ఞే మను ర్వైవస్వత స్సుతః" అని యున్నది. శాలివాహనశకవర్షంబులు ౧౪౨౩ ను క్రీస్తుశకమునకు పరివర్తించిన (౧౪౨౩ + ౭౮) - లబ్ధము ౧౫౦౧. పైన చెప్పిన గ్రంథములలోని గణితపట్టికలవలన క్రీ. శ. ౧౫౦౧ దుర్మతి యగుటయెగాక ఆవైశాఖ శుద్ధపూర్ణిమ సోమోపరాగయుత సోమవారమును అగుచున్నది.

పైసమర్థకము అంగీకార్య మగునేని మనుశబ్దమున కెచటనైన పదునాలుగునకు పర్యాయముగ ప్రయోగమున్నదా యని విచారింపగ బృహజ్జాతకమున నొకప్రయోగమును, కాలామృతమున నొకప్రయోగమును లభించినవి. అందు బృహజ్జాతకమున సంజ్ఞాధ్యాయము, శ్లో. ౧౩ :

"అజవృషభమృగాంగనాకుళీరాఝషవణిజౌ చ దివాకరాదితుంగాః దశశిఖి మనుయుక్తిథీంద్రియాంశై స్త్రినవక వింశతిభిశ్చ తేஂస్తనీచాః",

ఇందు ఇరువదియెనిమిదియను సంఖ్య కావలసి గ్రంథకర్త మనుయుక్ అని ప్రయోగించియున్నాడు. మనుయుక్ అనగా మనుయుగళము, అనగా రెండు పదునాల్గులు

కాలామృత పంచమబిందు శ్లో॥ ౧౮౨:

"విష్ణుశ్చ చతుర్దశీగ నవమీ ష ష్ట్యష్టమీ ద్వాదశీ । నాగా స్తత్వ చతుర్దశాంక మను గిజ్ఞ్యాడ్యః క్రమాద్రోగదాః".

ఇందు మనుశబ్దము పదునాలుగు అనువర్థమున ప్రయోగింపబడినది. ప్రాయికముగ నీ యంకసంకేతములు జ్యోతిషగ్రంథములందే యుపయోగింపబడు చున్నవి. "భానవ", 'అర్కి' యను పక్షమును కొలదిగ క్లిష్టసాధ్య మనియె తోపగలదు.

పైవిధమున కాలనిర్ణయము ఒప్పిదమగునెడల నీ దానశాసనము ప్రతాపరుద్రగజపతికాలమున పుట్టినటు లేర్పడి, కాకతీయ ప్రతాపరుద్రు డింతకుముందు హిరణ్యోదకపూర్వకమాత్రముగ జేసినదానమును గజపతి యూర్జితపరచి పరిపాలించిన దగును. శాసనపురస్సరముగ జేసినదానమునకును సహిరణ్యోదకక్రియ జరిగి యుండవలయు ననియు, కాకతీయునిది హిరణ్యోదకపూర్వకమాత్ర మనియు, ప్రతాపరుద్రగజపతిజేసినది శాసనపురస్సర మనియు, భేదము కల్పించుట దుర్బలవాద మనియు ఆక్షేపించునెడల ఈ భేదము శాసనపంక్తులయందే కనపడుచున్న దని వినయపూర్వకముగు ప్రత్యుత్తరము.

శాసనకాలనిర్ణయవిషయమున పైయూహ లెవ్వియు తృప్తికరములను సమర్థకములు కానియెడల దైవజ్ఞులును, సాంవత్సరికులును నగు ప్రాజ్ఞవరేణ్యు లెవ్వరయిన గుణ లోచ నార్కసహితయగు దుర్మతి నామాబ్ద వైశాఖ శుద్ధ పూర్ణిమను "సోమవారయుత" గను, "సోమగ్రహణోపేత"గను సాధించి పాఠకుల కుపకరింతురని నిరీక్షించుచుండెద. అట్లునుగాక ఏవిధముచేతనైనను ఉదాహృతశకాబ్దంబులకు శాలివాహనశకమునకు యు, సోమవారసహితయగు నట్టి పూర్ణిమ పూర్ణిమకునుతో సమన్వయము కుదరనియెడల శాసనపుకాలము తప్పుగ నుండవలయును; లేదా శాసనము తప్పుగ నుండవచ్చును. అటులు కానియెడల ఈశాసనమే కూటలేఖ్యముగ నుండవలయును. రాజవోలు అను పేరును సార్థకముజేయుటకై ఎవరైన శ్రీమంతుడు ఈ శాసనప్రబంధమును కల్పించియుండవలయు. ఈయూహ కాధారమగువిషయ మొకటి గలదు. ఎన్నడయిన ఈ గ్రామ మెవ్వరుగాని అగ్రహారముగ నుండినదను జనశ్రుతి యున్నటుల తెలియరాదు.

కూటలేఖ్య మనుసాహసము అంత యరుదుగ చేయబడలేదను యనుభూతియు గలదు. ప్రతాపరుద్రగజపతిచరిత్రమును వ్రాసినయెడల క్రీ. శ. ౧౪౯౯ మొదలు ౧౫౦౦, ౧౫౦౨, ౧౫౦౩, ౧౫౦౬, ౧౫౦౮–౦౯, ౧౫౧౧, ౧౫౨౩, ౧౫౨౯ మధ్యభాగమువరకును ఆయన అందరుజేసిన దానాదులును, విక్రమములును సప్రమాణములుగ నిరూపింపజాలు సాధనము లున్నటుల రూఢియగుచున్నది. చరిత్రాంకితములగు ననేకనిదర్శనములతో గూడిన శ్రీప్రతాపరుద్రగజపతి విషయమున నిట్టి దుండగపు సాహసము ప్రయత్నింపబడియుండునా యనియు యోచింపవలసి యున్నది. శాసనాంతమునను కడియపు దిమ్మెనీలను నుండు హస్తాక్షరప్రాయములై చేవ్రాలవంటి బలముగల లేఖనములు సృష్టింపబడి యుండవచ్చునని తలచుటయు మితిమీరిన తెంపుగ నుండును. విద్యానగరశాసనములందును కట్టకడపట దాత చేవ్రా లుండవలసిన స్థానమున "శ్రీవిరూపాక్ష" యనుస్మరణ యుండును. ఇటులనే మరికొన్నిటిలో 'శ్రీ వెంకటేశ', 'శ్రీరామ'ఇత్యాది దేవతానామస్మరణలతో శాసనసమాప్తి జేయబడియున్నది.

గజపతుల బిరుదావళి వెలిచర్ల శాసనమున[1] నిటు లున్నది:

---

1. వెలిచర్లశాసనము ౧౯౩౬ న ఆగస్టు భారతియందును, రాజమహేంద్రమున ప్రకటింపబడు చుండు **Journal of the Andhra Historical Research Society, Vol. XI, Parts 1 & 2, (April, 1938)** యందును ప్రకటింపబడియున్నది.

శ్రీమద్రాజాధిరాజేంద్ర ప్రపంచ గౌడానాధినాయక; వీరకేదార; మానగోవిందలాంఛన; విద్యానిధి; పాంకనాండి వోగ (చొక్క (?)) మండలనాయక; త్రిభువన తోషరమల్ల, రణబహిజార - ఇత్యాది.

ఇవి యెవ్వియు ఈశాసనమున లేవు. ఉంగ్ర కొంపె ప్రస్తావమును లేదు. మరియు వెలిచర్ల శాసనాంతమున గజపతుల రాచరికపు చిహ్నములగు ఖడ్గము యొక్కయు, శంఖము యొక్కయు నాకృతు లున్నవి. రాజవోలు శాసనమున నివియు లేవు. ఈరిక్తములకు కారణము లి టుండవచ్చును. వెలిచర్లశాసనకాలము క్రీ. శ. ౧౪౧౦. రాజవోలు శాసనమున మాహింపబడిన క్రీ. శ. ౧౪౦౧ సరియగునేని అప్పటి కింకను ఈగజపతి జైత్రయాత్రావిజృంభణములలో మున్గియుండి ప్రాప్తి నిలుకడగలిగిన రాజ్యధౌరంధర్యమున కుపక్రమింపలేదు కాబోలును. పై కారణమె యన్వయించవలసి యుండును.

మరియు వెలిచర్ల శాసనమునను ఈ శాసనమునను వినాయకప్రార్థన యున్నది. వంశమూలపురుషుడగు సూర్యుని ప్రార్థన యున్నది. భూధర్త అధికముగ స్తుతించు ఆదివరాహస్తోత్రము వెలిచర్ల శాసనమున నద్భుతము శార్దూలముపై నున్నది. రాజవోలునం దిది "శ్రీమాన్వరాహదేవో జయతి" యను నొక్క వాక్యమున ముగిసినది.

దానమిచ్చిన చోటు :

ఈశాసనము పుట్టిన పవిత్రక్షేత్రము సంగము గ్రామము నెల్లూరుజిల్లా ఆత్మకూరు తాలూకాలో ఉత్తర పినాకినీతీరమున నున్నది. ఇది శైవక్షేత్రము. ఇందు వెలసియుండు అర్చావతారమునకు శ్రీ సంగమేశ్వరస్వామి యనిపేరు. ఇచట ప్రతిసంవత్సరము నను మేషసంక్రమణప్రవేశమునకు బ్రహ్మోత్సవము జరుగును. మేషసంక్రమణ ప్రయుక్తమగు నుత్సవకలాపమునకు 'సంగం పూనికె' యని లోకవాడుక పేరు కలదు. ప్రతాపరుద్రగజపతి మహారాజు పూర్వోదాహృత దుర్మతినామ సంవత్సర వైశాఖశుద్ధ పూర్ణిమ - సోమవారయుత సోమోపరాగపర్వమున నిచట

"జైత్రయాత్రాసమయే సంగమేశ్వరసన్నిధౌ
స్నాతః పినాకినీనద్యాం భూదాన మకరో
న్ముదా". ౨—౨౦—౨౬.

ఉదయగిరి దుర్గము :

ఉదయగిరి ఏకాలమునుండి ప్రసిద్ధికెక్కినదియో నిర్ణయింపవలను లేదు. విజయనగరసామ్రాజ్య మూలపురుషుడగు సంగమునికాలమునకూడ ప్రఖ్యాతమై యుండెనది విజయనగరసామ్రాజ్యమున నిది రాజప్రతినిధి స్థానముగ నుండినది. కాలక్రమమున దీని గజపతివంశరాజులు లోబరచుకొని ఇచటనుండి కొంతరాజ్య మేలుచుండిరి. వీరిని కృష్ణదేవరాయ లోడించి తరిమివేసెను. ఈ ప్రశంస ఆముక్తమాల్యదలో ప్రథమాశ్వాసాంతమునను ద్వితీయాశ్వాసాంతమునను గలదు. ప్రథమాశ్వాసాంత పద్యము.

"ఇది కర్ణాటసరాట్కృతిస్థిరభుజా హేలాకలద్భేభరా
డుదయోర్వీధర తత్పితృవ్యకృత నవ్యోపాయనోష్ణీ
షర..."

ఇభరాడుదయోర్వీధర — ఇభరాడ్ గజపతియైన ప్రతాపరుద్రునియొక్క, ఉదయ ఉర్వీధర ఉదయగిరి దుర్గమందు ..

ద్వితీయాశ్వాసాంతపద్యము:—
"ఇది భూమండనకొండవీటిధర ణీభృద్దుర్గ పూర్వాద్రిభాస్వదిభేశాత్మజ వీరభద్ర......"

పూర్వాద్రి ఉదయగిరి (దుర్గమున)యందును, భాస్వత్ ప్రకాశముగల, ఇభేశ ఆత్మజ గజపతి కుమారుడైన, వీరభద్ర వీరభద్రపాత్రునియొక్క.........

ఈమూలవాక్యములును వ్యాఖ్యానవాక్యములును మహోపాధ్యాయ బ్రహ్మశ్రీ వేదము వెంకటరాయ శాస్త్రులవారి ప్రతిలోనుండి గ్రహింపబడినవి.

(ఈ రెండు పద్యములందు కృష్ణదేవరాయలు గజపతి నోడించిన విషయమును గలదు.

ఈ యుదయగిరికి రాజ్యాంగతంత్రప్రాశస్త్యముండినందుననే నిది. యనేకశాసనములలో ప్రధానక్షేత్రముగ గణింపబడుచు దాతవ్యగ్రామస్థానమునకు

దీనినుండి దిఙ్నిర్ణయము చేయబడుచుండెనది. ఇందు కుదాహరణ మీ రాజవోలుశాసనమున నిటు లున్నది :–

"శ్రీ వీరరుద్రదేవోయం గజరా డ్విభవోత్తమః,
నరసింహప్రతాపేన ఉదయాచలభూమిషు,
లబ్ధేష్టవిభవాన్నత్యా దుదయాచలపూర్వతః,
కిరాతానాం గ్రామశికామాధ్యే శోభసమన్వితః,
రాజవోలు మహాగ్రామే......"

—పొరట ౧ — ౬, ౭, ౮, ౯, ౧౦.

మరియు,

ప్రద్యోతోదయభూధరేంద్రనగరీ ప్రాచ్యాం...

—పొరట ౨ – ౨౧.

ఈ రాజవోలు ఉదయగిరికి దాదాపు మూడామడెలదూరమున నున్నను రాజధానియగు నుదయగిరి ప్రశంసింపబడియున్నది. పారంపర్యముగ పూర్వకాలపు రాజవంశముల కీయుదయగిరి ముఖ్యముగుటకు కారణము దీని నైసర్గికస్థితివలన నేర్పడినటు లున్నది. ఇది తూర్పుకనుమల సోలుపులో చేరినదైనను దానికి కొన్ని మైళ్లదూరమున తిటాలున నొక్కప్రక్కకు పొదుచుకొని వచ్చి తనంతటఁ దాను మొలచిలేచిన ట్లున్నది. ఒకకాలమున నీ దుర్గమునకు పదమూడుకోట లుండిన వనియు, వానిలో నెనిమిది కొండ పైభాగమునను, అయిదు అడుగుభాగమునను ఉండినవి అనియు తెలియుచున్నది.[1] నాటికిని, నేటికిని దీనికి ఉదయగిరిదుర్గ మని పేరు.

ప్రతివందనములు :

ఈ శాసనము నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాలెం శ్రీ దొడ్లవారిసంస్థానమునకు సంబంధించి బుచ్చిరెడ్డిపాళెమునకు రెండుమూడుమైళ్లలో నుత్తరమునందు ఎల్లచెరువులో పనిచేయుచుండిన వీరిసేవ్యగాండ్లకు అనేక సంవత్సరములక్రింద దొరికి పనికిరాని యినుకలపసామానుల నుట్టలో ఎప్పుడో పడిపోయినది. ఇది ఆ గొప్పకుటుంబమున నితరమున ప్రసిద్ధులుగ నుండునట్టియు, అతీతమద్రాసు శాసనసభోపవేశనకాలమునం దుపాధ్యక్షులుగ నుండినట్టియు రాజమాన్య రాజాజిత శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి, బి. ఏ., బి. యల్. గారి కెటులనో తెలియవచ్చి నారినుండి వారియాశ్రితులును పండితులును పౌరాణికులునగు శ్రీమాన్ ఉదయగిరి అనంతాచార్యులవారికి రాగా వారివలన గడచిన ఫిబ్రవరినెల ప్రథమదినములలో నాయొద్ద చేరినది. దీనిలో తెలియని యక్షరములకును, యంశములకును ఇతరులసహాయము బొందితిని. కొన్ని యంశములగూర్చి శ్రీజయపురసంస్థానాధీశులును, సంస్కృతాంధ్రకవిపండితులును, విమర్శకులును బహుశ్రుతులునునగు శ్రీ శ్రీ శ్రీ విక్రమదేవవర్మ మహారాజులుంగారిని ప్రార్థింపగ వా రాదరించి వారికి తెలిసినవానిని దెలిపి మరికొన్నిటివిషయమై వారియభిమతులు జయపురవాస్తవ్యులు మహారాజశ్రీ గొడవర్తి రామదాసు, బి. ఏ., యం. ఆర్. ఏ. యస్ గారిని ప్రేరణజేసి వారివలన దెలిపించిరి. వీరి కందరికిని కృతజ్ఞతాపూర్వకములగు ప్రతివందనముల నర్పించెద. *

— * —

1. డాక్టరు మెక్లీనుగారు ప్రకటించిన Manual of Administration in the Madras Presidency, Vol. III చూడుడు.

* [శాసనమూలము దిమ్మెలతోసహా సెప్టెంబరుసంచికలో ప్రకటింపబడును. భా. సం.]

అనుమానం - కసి

అత్తిలి సూర్యనారాయణమూర్తి

౧

అది పెనుభూతం - దానికళ్లు
పచ్చన్న, దానిమొఖం ఎర్రన
దానిహృదయం నల్లన -
దానికి ఆత్మ లేదు.

౨

ఆభూతం రాత్రిళ్లప్పుడు
ఒంటిగా ఉన్నప్పుడు -
ప్రత్యక్షమై నిన్ను
ఆవరిస్తూంటుంది.

౩

అది నిన్ను దొంగని చేస్తుంది
దోషాలు చూస్తావు
లోకం కాళరాత్రి
దానిలో తారాడే దొంగవు

౪

అగ్నిరగిలినట్లు —
జ్వాలలై, ప్రేమని, విశ్వాసాన్ని
ఆనందాన్ని దహించి
మాడుస్తుంది. —

—

పుస్తకసమీక్ష

శ్రీ భగవద్గీత

[శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారి పంతుల వారి టీక; ప్రకాశకులు: ఆంధ్ర గ్రంథమాల, నెం. 7, తంబుచెట్టివీధి, మద్రాసు. వెల ఒక రూపాయి.]

భగవంతుడు కూర్మరూపమున క్షీరవారాశి మథించి యమృతమును దేవతలకు ప్రసాదించెను. శ్రీ కృష్ణరూపమున సకలవేదవారాశిని మథించి గీతామృతమును మానవలోకమునకు ప్రసాదించెను.

సాంసారిక తాపములచే పరిమ్లానములగు మానవుల జీవకుసుమములకు గీత యమృతవృష్టి.

పరస్పర సంఘర్షణములేకుండ చతుర్విధ పురుషార్థ సాధనములను పుష్కలముగా సకుమారముగా బోధించుటలో గీత యద్వితీయము.

గీతల యుపదేశతత్వసారమును పరిపక్వాంతఃకరణముతో గ్రోలుదుమేని సర్వజాతులకు, సర్వమతములకు, సర్వకాల సర్వావస్థలయందు సర్వసమముగా ఫలమును ప్రసాదించునది యొకగీతయేయని యెలుగెత్తి చాటవచ్చును.

మహాసముద్రమున నానాజాతిరత్నరాసులవలె గీతలయందు ననంత భావరాసులు లీనములై వెలయుచున్నవి. మనప్రాచీన మహాపురుషులు గీతాసాగరమున మునింగి తమశక్తికొలది భావరత్నములను సేకరించి లోకమున వెలయించిరి. అందు శ్రీశంకర రామానుజ మధ్వాచార్యులు ప్రధానస్థానము నలంకరించిరి. వారికి పూర్వమందును, పరమందును పలువురు పండితులు భాష్యములను, వ్యాఖ్యలను టీకలను, విమర్శనములను రచించి ధన్యులయిరి. కాని వారు ఐహిక దృష్టిని విడచి కేవల పారమార్థికదృష్టితోనే గీతలను పరికించిరి. ఇటీవల లోకమాన్య తిలకుగారు నిష్కామ కర్మయోగపరముగా గొప్పవ్యాఖ్యను రచియించి యుభయలోకకల్యాణమునకును నొకగీతయందే సరస సమన్వయమును జూపి ధన్యవాదములను బడసిరి. గాంధీ మహాత్ముడు అనాసక్తియోగపరముగా వ్యాఖ్యను రచించి ధన్యుడయ్యె. గీతాసాగరమును మథింపని మహావ్యక్తి యొకటియు భారతఖండమున గానరాదు. పరమ పురుషార్థమును ప్రతిపాదించుటలో ప్రాచీన వ్యాఖ్యాతలకుగాని నవీనవ్యాఖ్యాతలకుగాని విప్రతిపత్తి యణుమాత్రము లేదు. అట్టి పరమపురుషార్థమునకు భంగము లేకుండ ఐహికమును ప్రతిపాదించుటలోనే మతభేదము లేర్పడినవి. ఇట్టి మతభేదములు గీతోపాసకులకు వారి వారి వాసనానురూపముగా సాహాయ్యమొసరించి కృతకృత్యములయినవి.

ప్రకృతమున శ్రీ నాగేశ్వరరావుపంతులుగారు తమ కౌమారమాదిగా నామరణాంతము నఖండదీక్షతో గీతల నుపాసించిరి. తాము గ్రహించినసారమునకను రూపముగానే తమజీవితయాత్రను అస్ఖలితముగా గడిపిరి. భగవంతుడు వారికి కారాగారమందు విశ్రాంతిని ప్రసాదించినతోడనే తమ యాశయములను ప్రకటింప నొకటీకను రచించిరి. ఆ గ్రంథమే యిది. ఇందు ప్రతి శ్లోకమునకు సులభశైలిని ప్రతిపదార్థమును, తాత్పర్యమును వ్రాసిరి. శ్రీ శంకర రామానుజ మధ్వాచార్యులకు ఏయేతావులయందు నభిప్రాయభేదములు గలిగినవో వానిని సంగ్రహముగా తేటతెనుగున జూపిరి.

అన్నియధ్యాయముల యాద్యంతములయందు నా యధ్యాయముల సముదితార్థమును విస్పష్టముగా వ్రాసిరి. అక్షరాస్యులగు తెనుగువారందరికి గీతార్థము సుబోధమగుపద్ధతిని పంతులువారిటీక నెలసినదనుట స్వభావోక్తియే.

ఈ టీకయందు పంతులువారు గ్రహించినదియు త్రికరణశుద్ధిగా నాచరించినదియునగు సారాంశమెద్ది యని మన మూహింపవలసియున్నది.

అభ్యుదయమునకు మూలాధారమగు తన విజ్ఞానమును మానవుడు విశ్వకల్యాణమునకు వినియోగించుటయే గీతాపరమార్థమని పెక్కుతావులయందు వారు

వెలువరించిరి. ఈ పరమార్థమును వారు తమ జీవితములో నిష్కళంకముగా జూపి యధీతిబోధాచరణ ప్రచారణములచే పరమాన్యజీవనులయిరి.

కర్మను పూర్తిగా విడుచుటకాని, పూర్ణముగా గర్మ నాచరించుటకాని, యెవరికిని శక్యముకాదనియు, ధనయర్థము, కామము, హింస, భోగము, పశుత్వము, మున్నగువానిని త్యాగము అహింస, సత్యము, శాంతి, నిత్యత, బ్రహ్మత్వముగా పరిణమింపజేయుటయే సర్వమతముల ముఖ్యాశయ మనియును, జీవత్వము మానవత్వమును, మానవత్వము బ్రహ్మత్వమును పొందు విషయము సులభముగా గీతయొక్కటియే బోధించుచున్నదనియు విపులముగా జర్చించి వ్రాసిరి. తన సర్వశక్తులను, తన సర్వసంపదను, తన సర్వవిజ్ఞానమును లోకకల్యాణమునకై సర్వకాలసర్వావస్థలయందు సర్వదా వినియోగించినగాని జీవునకు మానవత్వమే సిద్ధింపదనియు, మానవత్వములేక బ్రహ్మత్వము అత్యంత దుర్లభ మనియు పంతులవా రుపదేశించిరి. వారిజీవితము అంతా పరిపూర్ణమానవత్వమున కాదర్శభూతమైన దనుటలో నెరికిని విప్రతిపత్తి లేదు. పంతులవారు తమ జీవితకాలమందే సంపూర్ణ మానవత్వమును బొంది తనూమ్లమున బ్రహ్మత్వమును బడసిరి.

అట్టి మహాపురుషుడు అనుభవపూర్వకముగా రచించి ప్రసాదించిన గీతావ్యాఖ్యను సమగ్రముగా నాస్వాదించి యాంధ్రులు మానవత్వమును, బ్రహ్మత్వమును బడయుదురుగాక యని విన్నవింతును.

వాసా సూర్యనారాయణశాస్త్రి.

శ్రీ భా గ వ త ము

శ్రీ వ్యాసమహర్షికృత సంస్కృత భాగవతానుసారము; ఏకాదశ, ద్వాదశ స్కంధములు (రెండవ సంపుటము).

[గ్రంథకర్త : - శతావధాని సంపన్ముడుంబ సింగరాచార్యులుగారు; రాయల్ సైజు. ౨౧౧ + ౬౮ + ౧౬ పుటలు; ప్రకాశకులు : శ్రీ భాగవత గ్రంథమండలి, జగ్గయ్యపేట, కృష్ణాజిల్లా; లేక ఆంధ్ర పబ్లిషింగ్ హౌస్, మారీసుపేట, తెనాలి; వెల రు. ౨-౦-౦.]

భారతీయులకు భారత, భాగవత, రామాయణములు ప్రధానగ్రంథములు; అవి ప్రపంచములోని నానారకభావము లన్నింటిలోనికిని పరివర్తితములు; సంస్కృతమున రచింపబడిన యీ గ్రంథత్రయమునకు ప్రాచీనాంధ్రకవు లొనరించిన పరివర్తనములు పెక్కుండ్లెక్కింపటనే వెలువడినవి.

సహస్రాబ్దులకు పూర్వము వెలువడిన మూలగ్రంథము లిప్పటివలెను అట్లే యున్నవని చెప్పలేము; తమ రచనలకు, ఆశయములకును ప్రచారమును, గౌరవమును కోరిన కొందఱు పండితకవులు మూలగ్రంథములను చాలవఱకు పెంచిరి. కావుననే పయిగ్రంథములం దందందు చర్వితచర్వణము, సమన్వయానుపహల్యము కన్పించుచుండును; ప్రాచీనాంధ్రకవులట్టి విషయములను పరిశీలించి సర్వజనగ్రాహ్యములగునట్లు, సంగ్రహరీతిని, కావ్యభక్కిని పయి గ్రంథములను తెనిగించిరి. కావున వారి గ్రంథములయందు కొన్నియెడల పెంపును, కొన్నియెడల కుదింపును కానవచ్చుచుండును. జనసామాన్యమునకు దుర్గ్రాహ్యములను తలంపుతో ప్రాచీనకవులు కొన్ని శాస్త్రచర్చలను, క్లిష్టవిషయములను ఆంధ్రీకరింపక విడిచిరి.

మూలగ్రంథముల యథాస్థితిని తెలుసువా రెఱుగవలెనని యథామూలానువాదములే ఆవశ్యకము లని తలచి ఆధునికాంధ్రపండితకవులు పయి మహాగ్రంథములకు యథామూలానువాదముల నొనరింప దొరకొనిరి; గోపీనాథునివారు, వావిలికొలనువారు, జనమంచివారును రామాయణము నాంధ్రీకరించిరి, శ్రీపాదవారు భారతమును తెలిగించిరి; కాని ఇంతవఱకును భాగవతమునకు మాత్రము యథామూలానువాదము వెలువడలేదు; ఆకొఱత నిప్పుడు శ్రీ సంపన్ముడుంబ సింగరాచార్యులుగారు తీర్చుచున్నారు. వీరి రచనలో ఇదివఱకు ప్రథమ, ద్వితీయస్కంధములు గల తొలి సంపుటము వెలువడినది; ఇది ఏకాదశ, ద్వాదశస్కంధములు గల మలి సంపుటము.

రామాయణ మాదికావ్యము; అది రసమయము, నీతిబోధకమును. భారతము పంచమవేదము; అది మత ప్రతిపాదకము, ధర్మతత్త్వ బోధకమును. భాగవతము వేదాంతశాస్త్ర ప్రతిపాదకము; నివృత్తిమార్గ బోధకము. లెక్కలేని కథ లిందున్నను అన్నిటియందును - మొదటి నుండి తుదివఱకును అంతరార్థముగ వేదాంత మిమిడి యున్నది. కావుననే భాగవత మందఱికిని అర్థము కాదు; అందును ఏకాదశ, ద్వాదశస్కంధములు కొఱకరాని కొయ్యలు; ఇంచుమించుగ ఆ స్కంధద్వ యము శ్రీ కృష్ణు డుద్ధవునకు జేయు పరతత్త్వోపదే శముతో నిండియున్నది.

పయి స్కంధద్వయమును తొలుత తెలిగించిన నెలికండల నారయ్య పయి విషయములను లెస్సగ వివ రింపక విడిచెను; అతని తెలిగింపు 'తత్త్వఘట్టములందు గాని, కథాంశములందు గాని మూలమునకంటెను బెక్కు చోట్ల జాల న్యూనముగా' నున్నది. మూలాభిప్రాయ ములను తూ, చాలు తప్పకుండ తెలుగున తెలుపదలచిన శ్రీ సింగరాచార్యులుగారు నారయ నలువది రెండు పుటలలో ముగించిన గ్రంథమును ఇన్నూటడెబ్బది తొమ్మిది పుటలలో విపులీకరించి యున్నారు. పర తత్త్వవివేకమును బడయగోరువారికి నారయగ్రంథము కంటె శ్రీ ఆచార్యులవారి అనువాదము బహూపకార కము. యథామూలానువాదముతో తృప్తిపడక శ్రీ ఆచార్యులవారు 'అనుబంధము'న క్లిష్టపద్యముల సమన్వ యపద్ధతిని, విశేషార్థములను వివరించి జిజ్ఞాసువులకు చాల మేలొనగూర్చిరి.

శ్రీ ఆచార్యులవారి గ్రంథము యథామూలముగ అనూదిత మగుటచే అందుండు పద్ధతినే ఇందును కొన్ని చర్వితచర్వణపద్ధతి నుండవచ్చును. అట్టి పద్ధతి కథాం శములపట్టుల కొంత విసుపును కలిగించును; ఈ స్కం ధద్వయమున ప్రధానమగునది పరతత్త్వనిరూపణము కాన, చర్వితచర్వణపద్ధతి యిచట విషయము సుల భావగాహన మగుట కనుకూలించును; అది దోషము క్రింద లెక్కకు రాదు.

శ్రీ సింగరాచార్యులుగారు పెక్కేడులనుండియు సారస్వతసేవ చేయుచున్నవారు; శతావధానులు; ఆంధ్రగీర్వాణములందును, వేదాంతశాస్త్రమునను పాండి త్యము గడించి భాగవతాంధ్రీకరణమునకు వాఖ్యాతా రలయినవారు; వీరి శైలి సులభము: రచన సరళము: కవిత్వపక్ష ప్రాచీనసంప్రదాయము ననుసరించి, పూర్వకవులను తలపించుచున్నది.

శ్రీ ఆచార్యులుగారు తలపెట్టిన కార్యము గొప్పది; అది సర్వజనామోదకరము. భాషాభిమానులు వారి గ్రంథములను గౌరవించి, వారి ప్రయత్నము అచిరకాలములో సాకల్యముగ ఫలసిద్ధిని పొందుటకు సాయపడుదురుగాక!

బు. వెం. ర.

జానకిప్రేమ మొదలైన చిన్నకథలు

[గ్రంథకర్త: టేకుమళ్ల కామేశ్వరరావు గారు; ప్రకాశకులు - టేకుమళ్ల విశ్వనాథంగారు, రాజమహేంద్రవరం. వెల అయిదు అణాలు.]

సారస్వతం అంతలో చిన్నకథలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. తక్కిన సారస్వత భాగాలలో కథా వస్తువుకు చాలా ప్రాముఖ్యం ఉంది. కాని చిన్నకథ లలో మాత్రం అది లేదు. మామూలుగా మనం ప్రపం చంలో చూస్తూ అనుభవిస్తూ ఉన్న ఒక ఘట్టాన్ని అనుసరించి కథకుడు ఒక చిన్నకథ అల్లుతాడు. అందు లో నీతిబోధనకోసంకాని, తనపాండిత్య ప్రకర్ష కోసం గాని ప్రయత్నించకుండా అతిసూక్ష్మంగాను సహజం గాను కథను చెప్పతాడు. కాని ఆ చెప్పడంలోనే నేర్పు ఉంది. ఈ చిన్నకథలను వ్రాయడం మన తెలుగు వారు ఈ మధ్యనే మొదలుపెట్టి ఉండడంచేత ఇంకా ఈ సారస్వతవిభాగం ఉన్నతస్థితికి రాలేదు. ఈ రచన లో కృషిచేస్తూ ఉన్నవారిలో శ్రీ కామేశ్వరరావు గారు ఒకరు.

'జానకిప్రేమ మొదలైన చిన్నకథలు' అనే ఈపుస్తకంలో కూర్చినకథలు వీరి సామర్థ్యాన్ని చూపు తున్నాయి. వీటిలో ముఖ్యంగా నన్ను ఆకర్షించిన కథలు 'ప్రసాదరావు పెళ్లిచూపులు', 'ఆ జంట', 'వక్రి అనుమానంమనిషి'. వీటిలో కథావస్తువు అతిస్వల్పం.

కాని ఆకథల నిర్వహణంలో వారు చూపిన నైపుణ్యము ఆకథలకి జీవం యిచ్చింది. అతి సహజంగా చిత్రింపబడ్డ ఆకథలలోని పాత్రలను మనం ప్రపంచంలో ఎన్నో సార్లు చూసి ఉంటాం. తాను చాలా గొప్పవాణ్ణి అని అనుకొనే పెళ్లికొడుకు తను పెళ్లాడబోయే పిల్లను కనుబొమ్మ కొంట్రుకలలోకూడా పోచ్చుతగ్గు ఉండకూడదని కోరడం చాలా సహజం. అటువంటివాడే చివరికి పప్పులో కాలువెయ్యడంకూడా తటస్థిస్తుంది. చివర మాత్రం ప్రసాదరావు వ్రాసిన ఉత్తరం అనులాపురం వెళ్లేటప్పటికి ఆ పిల్లకి పెళ్లి స్థిరపడి ఉంటే కథకి యింకా అందం వచ్చేదేమో. 'అజంట' యొక్క సాధారణక్షేమ, అన్యోన్యంకల ఆజీవనం, 'నాకు అసూయ కలిగించిందంటే అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. అయినా సహవాసంవల్లనూ ఆదర్శం వల్లనూ మనదంపతులుకూడా మారడం సహజంగానే ఉంది. ఈ కథలోని చివరిపేజీలోని దాసీగాథ తీసివేస్తే కథకు ఏమీ లోపంరాదు సరికదా, దాని అందం ఇంకా ఇనుమడించేదేమో.

'పక్షి అనుమానంమనిషి'ని చిత్రించడంలో కామేశ్వరరావుగారు చాలా నేర్పు చూపించారు.

మిగిలినకథలలో తర్వాత చెప్పవలసినవి 'తంజావూరు స్నేహితుడు', 'సుబ్రహ్మణ్యం దెయ్యం', 'పోయిన ఫోటో'లు.

కామేశ్వరరావుగారిది చక్కని శైలి. దానినిగురించి వేరే చెప్పడ మెందుకు, వారే వ్రాశారు వారి 'మలినుడి'లో ఇట్లా: "ఈగ్రంథంలోని శైలి వ్యావహారిక రచనని ప్రారంభించేవారు అనుసరించి లాభం పొందవచ్చునని నా నిష్పాక్షిక అభిప్రాయం". మొత్తంమీద ఈ 'జానకిక్షేమ- కథలు' హృదయరంజకంగా ఉన్నాయి. ఇవి అందరూ చదివి ఆనందించ వలసినవి.

'పి'

ఫాహియాన్ భారతవర్షయాత్ర

[కర్త:— వేలూరి సత్యనారాయణగారు, బి. ఎ. బి. యల్; వలయువారు గ్రంథకర్తకు భీమవరం అని వ్రాసికొనవలయును. వెల ౧-౮-౦]

ఈగ్రంథము విజ్ఞానచంద్రికా గ్రంథమండలి ప్రచురణము. ఆంధ్రచరిత్ర వాఙ్మయమున ప్రశంసల గడించిన గ్రంథము. పదునైదువందలయేండ్లక్రిందట బౌద్ధపవిత్ర గ్రంథ సంపాదనకై, చైనానుండి ఒంటరియై భారతవర్షమునకు చనుదెంచిన ఫాహియాన్ అను ఒకానొక బౌద్ధ పరివ్రాజకుని, ప్రయాణకథ యీగ్రంథమందలి కథాంశము. నాటి భారతభూమియందలి, రాజ్యాంగ, మత సాంఘిక వ్యవస్థలు, ప్రజల ఆచార, శీల, వర్తనములు, పారిశ్రామిక జీవనము, మున్నగు చరిత్రాంశము లన్నియు ఇందు కన్నులకు గట్టినట్లు చిత్రింపబడినవి. మతవిషయములందు ఆనాడు, ఆచార్యస్థితము నధిష్ఠించి, మతవ్యాపారములలో బౌద్ధలోకమునకెల్ల శాసనకర్తయై, ప్రఖ్యాతిగడించిన నాటి భారతవర్ష మెట్లుండెనో తెల్పిన ఫాహియాన్ భారతప్రజలకు చిరస్మరణీయుడు. భారతవర్షమును జేరుటకు ఫాహియాను మార్గమున పడినయిడుమలు, అతని సముద్రయాన వృత్తాంతము నవలవలె చదువరుల నాకర్షించుచున్నవి. విసువు జనింపకుండ చరిత్ర విషయముల నాకర్షవంతముగ చిత్రకారుని ప్రతిమవలె చిత్రించుటలో గ్రంథకర్తకు అపారమగు నేర్పుగలదు. శైలి, సరళమై, ధారాళమై, సజీవమై, మధురమై శోభల నురిపించుచున్నది. ప్రాచీనకాలపు భారతవర్షచరిత్ర విషయముల తెలిసికొనగోరు ఆంధ్రసోదరు లెల్లరు చదువవలసిన గ్రంథము.

'త్రి'

ఆంగ్లచరిత్ర

[కర్త:— వేలూరి సత్యనారాయణ గారు, బి. ఏ., బి. యల్. దీనిని గ్రంథకర్తకు భీమవరం వ్రాసిన బడయగలరు. వెల 1-4-0.]

గ్రంథకర్త ఆంధ్రలోకమునకు చిరపరిచితులగు వేలూరి సత్యనారాయణగారు. వీరి చరిత్రరచనా కౌశలము ఆంధ్రులకు క్రొత్త గాదు. రవి యస్తమింపని బ్రిటిషు సామ్రాజ్య మహాసౌధమునకు, శంకుస్థాపన చేసిన ట్యూడరువంశజుల చరిత్రభాగ మిందు ప్రస్తరింపబడినది. ఆంగ్లచరిత్రములోని కెల్ల ట్యూడరుల చరిత్ర

భాగము మిగుల ప్రఖ్యాతమైనది. ఆంగ్లచరిత్రరంగమున వీరి చరిత్రభాగ మొకయెత్తు, తక్కిన చరిత్రమంతయు నొకయెత్తు. ఆంగ్లచరిత్రమున వీరి కార్యకలాపములకు ఒక విధముగ ప్రత్యేకత గలదు. టూడరుల విరంకుశ వర్తనము, నాటి మతకలహములు, పరమత ద్వేషనము, మతాంతరుల క్రూరహింసలు, యుద్ధకలాపములు, సముద్రచోరుల విచిత్రచౌర్యములు మున్నగు చరిత్రాంశములు బాగుగ చిత్రింపబడినవి. మోరు, క్రాన్మరు, మొదలగు ఆంగ్లవైష్ణికుల చిత్రవధలు, రుధిరప్రియ యగు మేరీరాజ్ఞి రక్తపిపాస మున్నగు ఘట్టములు చదివిన ఒడలు జలదరించును. శైలి గంభీరముగ మృదువుగ రసవంతముగ నున్నది.

'ఆ'

లెనిన్ ఉపదేశాలు

[అనువాదకులు: రామమోహన్; ప్రకాశకులు-విశ్వసాహిత్యమాల, ముంగండ, (via) అంబాజీపేట, తూర్పుగోదావరి జిల్లా. వెల ఆరు అణాలు.]

ఇది విశ్వసాహిత్యమాలవారి పన్నెండవ కుసుమం. రాజకీయాలను గురించి ఆంధ్రులకు తగినన్ని పుస్తకాలు లేవు. అలాంటప్పుడు విశ్వసాహిత్యమాలవారు వివిధరాజకీయవిషయాలను గురించి గ్రంథాలను ప్రకటించి చాలా సేవ చేస్తున్నారు. 'నిరుడు మే ఇరవైన ఒకటీ, ఈయేడు ఏప్రియలు పందొమ్మిదిన ఒకటీ' విశ్వసాహిత్యమాల వారి పుస్తకాలు ప్రభుత్వంవారిచేత నిషేధింపబడ్డాయికూడాను.

లెనిన్ ఉపదేశాలు పామీదత్తు వ్రాసిన గ్రంథానికి అనువాదం. లెనిన్ ఉపదేశాలకు చక్కని వ్యాఖ్యానంతో పామీదత్తు వ్రాసిన గ్రంథాన్ని మంచిధారాళమైన శైలిలో రామమోహన్‌గారు అనువదించారు. ఇలాటి గ్రంథాలు ప్రస్తుతం చాలా అవసరం.

'చక్రవర్తి'

పారిసు కమ్యూన్

[అనువాదకులు: మహీధర జగన్మోహనరావు గారు. ప్రకాశకులు:— విశ్వసాహిత్యమాల, ముంగండ, అంబాజీపేట, తూర్పుగోదావరి జిల్లా. వెల ఆరుఅణాలు.]

రష్యాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని నెలకొల్పిన, రష్యాభాగ్య విధాత లెనిన్ వ్రాసిన గ్రంథానికి ఇది అనువాదం.

1871 లో ఫ్రాంసు దేశంలో పారిస్ కమ్యూన్ ప్రభుత్వం నెలకొని రెండు నెలల పదిహేను రోజులు మాత్రం రాజ్యంచేసింది. తరువాత విప్లవకారుల చేతులలో నలిగిపోయింది. మొట్టమొదట ఆచరణలోకి వచ్చిన కమ్యూనిస్టు పరిపాలన ఇదే. రష్యాలో కమ్యూనిస్టుపరిపాలనను స్థాపించిన లెనిన్, యీ ప్రభుత్వాన్ని గురించి ఏమి చెప్తాడో ప్రతివారూ తెలిసికోవలసిన విషయం. లెనిన్ వ్రాసిన గ్రంథానికి చక్కగ అనువాదంచేసి తెలుగులో ప్రకటించినందులకు అంతర్జాతీయరాజకీయాలేగాక, మార్పుపొందుతూ వున్న మన రాజకీయాలను గురించి చదువుకునే వాళ్లు కూడా, విశ్వసాహిత్యమాలవారికి కృతజ్ఞత చూపవలసిందే.

'చక్రవర్తి'

చిత్ర

[చిన్న నాటిక. శ్రీ రవీంద్రనాథ ఠాకూరుగారు ఇంగ్లీషున రచియించినదాని కిది అనువాదము. అనువాదకులు: కందుకూరి రామభద్రరావుగారు; శ్రీ పిఠాపురం రాజావారి కళాశాల పత్రికలో మొదట ప్రకటితమై, విడిగా తీయబడినది.]

మణిపూరుపురమునకు ప్రభువైన చిత్రవాహనుని కూతురు చిత్రాంగదను అర్జునుడు తీర్థయాత్రాకాలమున వివాహమయిన విషయమును చిత్రమయిన ఫక్కిని శ్రీ రవీంద్రనాథ ఠాకూరుగారు ఆంగ్లమున ఒకనాటికగా రచించినారు.

వసంతుడు, మన్మథుడు, చిత్ర (చిత్రాంగద), అర్జునుడు అనువారు ఇందువచ్చు పాత్రలు. పరమేశ్వరవర

మున చిత్రవాహుని వంశమున అతనిపూర్వులకు పారంపర్యముగ పుత్రులే కలుగుచు వచ్చిరి కాని యతనికి మాత్రము చిత్రాంగదపుట్టినది. అయినను తండ్రి ఆమెను కొమరునిగా చూచుకొని ఆమెకు పురుషోచిత విద్యలు నేర్పి పురుషునిగ పెంచెను. ఆమెకు పురుష ప్రకృతి యలవడినది. ఆమెలో లలనాసహజములైన సౌందర్య, లాలిత్యములు లుప్తములైనవి.

ఒకమారు తైర్థికుడైన యర్జునునికిని వేటనుండి తిరిగివచ్చు చిత్రకును వనమున సమావేశము కలిగినది. ఆ మహాపురుషుడు తన హృదయసీమ నారాధించు దేవతామూర్తి యర్జును డని తెలిసి చిత్ర మరల స్త్రీరూపమున ఆతనిని గలిసికొని యాతని పాణిగ్రహణము కోరును; కాని తాను బ్రహ్మచర్య మవలంబించితినని చెప్పి ఆమెను అతడు నిరాకరించును. అంత నామె వసంత, మన్మధుల నారాధించి, వారివలన దివ్యసౌందర్య, వసంత సుమశోభలను వరముగ పొంది తుద కర్జునుని మోహింపజేయును.

ఈ ప్రణయగాధ నద్భుతమైనరీతిని శ్రీ రవీంద్రనాధఠాకూరుగారు రచించినారు. అనువాదమున మూలమునందలి అందము రాదని యందురుకాని యది యీ అనువాదమువిషయమునమాత్రము నిక్కము కాదు. రామభద్రరావుగారు మూలములోని భావము సౌందర్యము చెడకుండ చక్కనిరచన సాగించి దీనిని వెలయించిరి. శ్రీ రవీంద్రులవారి భావములలోని గొప్పదనము, వారిరచనలోని వైదుష్యము, పదములతో చిత్రములను రచించుటలో వారికిగలనేర్పు దీనినిబట్టి ఆంగ్లవిద్యాగంధములేనివారు కొంతవరకు తెలిసికొనవచ్చును.

'మ'

గ్రంథ స్వీకారము

అహల్యా సంక్రందనము:— కర్త: సముఖము వేంకటకృష్ణప్ప నాయకుడు ప్రకాశకులు: శృంగారకావ్య గ్రంథమండలి, మచిలీపట్టణము.

శాంతినికేతనము:— డాక్టరు శ్రీ రవీంద్రనాథఠాకూరుగారి ధర్మోపదేశములు — వంగభాషామాతృకకు అనువాదము: ప్రథమభాగము. అనువాదకులు—ఆకురాతి శ్రీ కృష్ణమూర్తి చలమయ్యగార్లు. ప్రకాశకులు: ఆకురాతి చలమయ్యగారు, సూపరింటెండెంటు, శాంతికుటీరము, పిఠాపురము, తూర్పు గోదావరిజిల్లా. వెల శేపరు బైండు, రు. ౧-౮-౦; క్యాలికోబయిండు, రు. ౨-౦-౦.

గాంధిచరిత్రము: సిద్ధాంతములు:— కర్త: కొమాండూరి శఠకోపాచార్యులుగారు, ఎం. ఏ, బి. ఎల్., కాకినాడ. వెల ఎనిమిదణాలు.

హైందవధర్మ పోలీలు:— కర్త: సురవరం ప్రతాపరెడ్డిగారు; ఇది దేశోద్ధారక గ్రంథమాలలోని మొదటి కుసుమము. ప్రకాశకులు: దేశోద్ధారక గ్రంథమాల, నెం. 2844, ఇమాంబావి వీథి, సికందరాబాదు. వెల సభ్యులకు నాలుగణాలు; ఇతరులకు ఆరణాలు.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad.

భారతి

సచిత్ర మాసపత్రిక

సంపాదకుడు

శి. శంభుప్రసాద్

ఆంధ్రపత్రికా ముద్రాలయము,
మద్రాసు.
౧౯౩౮

సంపుటము ౧౫, సంచిక ౯

ప్రకటన

ఈక్రింది కనబరచిన నెంబర్లవారికి ఈనెల భారతి (1938 సం సెప్టెంబరునెల)తో ఇదివరకు చెల్లించిన చందా పూర్తి యగుచున్నది. తిరిగి ఇంకొక సంవత్సరమున కగు చందామాకు చేరునట్లు ఈనెలాఖరులోగా మనియార్డరు చేసినచో తెంపు లేకుండ పత్రికను పంపుచుందుము. అట్లు తమ యొద్దనుండి 30-వ తేది లోపుగ సొమ్ము రానిచో సహజభాషాభిమానులగు తాము తిరిగి ఇంకొక సంవత్సరము వఱకు భారతి చందాదారులుగ నుందురను నమ్మకముతో 1988 సం అక్టోబరు 10-వ తేదిని రూ 6—4—0 లకు వి. పి పంపుచున్నాము. గావున తా మెప్పటివలెనే పత్రికయం దభిమాన ముంచి సొమ్ము చెల్లించి వి. పి. ని గైకొన ప్రార్థితులు. ఒకవేళ తమకీ పత్రిక ప్రస్తుత మనవసరముగ దోచినచో మాకావిషయము వెంటనే తెలియజేసిన యెడల వి. పి. పంపుట నాపుదుము.

A 1, 11. H 37, 38, 39, 40, 41, 42 62. J 5. K 13. L 8. M 10.N 15.
P 23, 24. R 24, 25, 26, 27, 35, S 5, 7, 77, 80, 81, 85. V 24.


వి ష య సూ చి క

చిత్రములు

త్రివర్ణచిత్రము : విద్యాభ్యాసము;

చిత్రకారుడు : వేగుల వేంకటశాస్త్రిగారు

సాధారణచిత్రము : శాంతినికేతనము.



విద్యాభ్యాసము



సంపు. ౧౩ బహుధాన్య, భాద్రపదమాసము (సెప్టెంబరు 1938) సంఖ్య ౯

స్వప్న శకలము

అంకితము : సుభద్రకు] ["సంపత్"

[ఒకొక్కప్పుడు హృదయ మంతః ప్రబోధమునకు సంస్పందించి, పవిత్రావేశములో సద్రిక్త మవు తుంది. కాని—బాహ్యహేతువులు, తమస్సులై పైకొని ఆయావేశమును, క్షణికంగా, స్వప్నశకలంగా మార్చి వేస్తాయి. ఆకెరటము దాటిపోయినతర్వాత మనము నగ్నంగా నిలిచిపోతాము.]

నన్ను విభావరీవిషమనాటకరంగమునుండి 'లేచి ర'
మ్మన్నది యెవ్వరో వినుతురా—? అల తారకపంక్తిలో దరో
త్పన్ననిశాప్రశాంతమున దాగి, రహోమధురప్రసన్న సం
పన్నతగీతికాచరణమాధురులే వినిపింతు రెవ్వరో—.

ఈదరమైన లేయెద చలింపగ మీనెఱతీపిపాటలో
జేదు లిముడ్తురా! ఇరులు చీరని రేలకు, ప్రేమజీవనా
వేదనకున్, ముహుశ్చలదవేద్య సుధామధురోహకున్, ఉష
శ్శ్రీదరహాసరేఖలకు జీవితమే తృషగా మిగిల్చినన్.

జీకటు లేలికొన్నవి నిశీథములో జగమంత స్వేచ్ఛగా
నాకు విభావరీవికిరనాట్యములే కనిపించు; లేవు స్వ
ర్లోకధునీప్రపతత్సుఖవిలోలుపకాముకు, లార్ద్రభావనా
లోకవిహారముల్ వలపులోతులు, జీవితసుప్రభాతముల్.

ఆరవి వేదనాభరవిషానలకీల మగిడ్చి, స్వప్నశృం
గారవనీవసంతముల గమ్మని నిద్దురలం గలంచి, న
న్నారక శోకపెట్టి 'మధువో! మధువో!' యని రాఫువడ్డ నా
నీరవశుష్కకంఠమున నింపును లోకము కాలకూటమున్.

సంజగులాబికెంపులపసందులు మాపులువడ్డ ఈతమః
పుంజములో ధ్వనింప దిట పూర్వయశస్సుకుమారతామనో
రంజకజీవితాంకము; పురోదయరాగరసప్రసక్తి పు
ష్పాంజలితోడ నాంది యిడునంచు ధ్వనించునె శూన్యవీథులన్ ?

అలసినభావముల్ కనుల నద్దిన నిద్దురలో శమించె; వె
న్నెలచిలువెల్లు లీప్రణయినీకృపణాత్మకు లేవు; నిద్దురల్
కలచిన ఈరహోవిరహకంఠము నాయెదలోనె సన్నగా
పలికినదేమొ స్వప్నమధువాటికలో దలుపూడ్చి తీయగా !



"మన" తెలుగు

భమిడిపాటి కామేశ్వరరావు

[౬-౮-౧౯౬౮ తారీఖున తెలుగుదేశంలో ప్రసిద్ధి చెందిన రాజమండ్రీ గౌతమీ గ్రంథాలయపు ౭౦-వ వార్షికోత్సవ సందర్భంలో ఆంధ్రవిశ్వకళాపరిషత్తు యొక్క అధ్వర్యప్రతినిధిగా రెండవసారి ఉంటూ దేశదేశాంతరాల్లో ప్రఖ్యాతులైన శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారి అధ్యక్షతకింద జరిగినసభలో ఈప్రసంగం చాలావరకు అయింది. ప్రసంగం 'మనతెలుగు' యొక్క స్థితిగతులగురించి. 'మన' అనేమాట మనభాషలోనే ఉందట. మనమతంలాగే మనభాషకూడా చాలా సమిష్టికుటుంబం చెప్పేదాల్లో తెలుగుభాషయొక్క విశేషాలుగనక మీకు స్ఫురణకొస్తే అవి 'మన' తెలుగువే అనిన్నీ, లోపాలుగాని కనపడితే అవి 'నా' తెలుగువనిన్నీ అనుకోండి. ఇది నాహృదయంలో ఉండడంచేత మీ సెలవుప్రకారం పైకి నేను చెప్పుకుంటూన్నబాధేకాని ఉపదేశంఅనిమాత్రం మీరు ఎంచకండి. ఉపదేశం చెయ్యడానికి నాకు అర్హత లేదు. అసలు దేశంలో బలం ఉంటేగాని ఉపదేశంలోనూ బలం ఉండదు.]

భాషఅంటే సంస్కారంపొందిన ధ్వని. భాషలు ధ్వనులు. భాషలగురించి చెలరేగే వాదప్రతివాదం కోలాహలం. ఒకదేశాన్నుంచి మరోదేశానికి మానవులు ఏవర్తకం నెపంమీదో ప్రయాణాలు మాననంతకాలం భాషలకి సంపర్కం మానదు. సరిహద్దుల్లో బహుభాషాసంపర్కం తప్పదు. సంపర్కం ఉండడంతోటే సంబంధం, సాంగత్యం, సాంకర్యం, సంఘట్టన మొదలైనవాటిల్లో ఏదేనా ఏర్పడచ్చు. కొత్తమనుషుల్ని మననెత్తి నెక్కించుగోడానికి మనం ఒప్పుగుని వాళ్ల భాష మననెత్తిమీదిది కాదనుకోడం అజ్ఞానం. ఇట్లాంటిసందర్భాల్లో మెత్తమెత్తనివాళ్లని గట్టివాళ్లు కంఠం నొక్కి దవడశుద్ధి చేస్తూంటారు. ఆమెత్తవాళ్లు ఒకొక్క చెంపకాయే శాస్త్రప్రకారం తింటూ, 'ఈమాటు కొట్టుమరి చూస్తాగా!' అంటూండేవం, ఇల్లా కోరినప్పుడు ఊరుకుంటే బాగుంటుందా అని చెప్పేసి గట్టివాళ్లు వెరకటికంటె ముదరకం చెంపకాయి కిస్లని లాగుతూండేవం కద్దు. ఆమెత్తనివాళ్లు తమస్థితిని పట్టిగిన్ని తమప్రారబ్ధకర్మానికి ముడెట్టుకుని నిశ్శబ్దంగా ఆగట్టివాళ్లని చావతిట్టుకుంటూండేవం. తెలుగుసంగతికూడా అల్లా అయిపోయింది. దేశీయాంధ్రం అనేవి తెలుగువాళ్లల్లో లక్షకొకడికి తెలియొచ్చు. అట్లాంటి తెలుగులో కొందుమూడుగ్రంథాలూ ఎరుగుదుం, సజీవులై ఉన్నవాళ్లల్లో ఇద్దరుముగ్గురుపైగా రచయితల్ని ఎరుగుదుం. కాని, నూటికి నూరుమంది పైపలుకు మాట్లాడేతెలుగు కలగాపులగమే. ఈపులగంలో సంస్కృతం, పార్సీ, ఇంగ్లీషుమాత్రం జోరుగా పడ్డాయి. తెలుగుయొక్క మెత్తదనంవల్లే ఇన్నిన్ని భాషలపదాలూ బానిసల్లాగ హృదయంనాటేలాగ తెలుగులో గుచ్చుకుపోయిఉన్నాయి. తెలుగుశరీరంలో వాటిని నిల్చిఉండనిస్తే అవి సెలుపేసి ప్రాణంతీసేస్తాయని కొందరూ, లేక వాటిని పైకిలాగిపారేస్తే వెంటనే ప్రాణపోకటఅని కొందరూ! అప్పట్లో సంస్కృతానికున్న మన్ననబట్టే, సంస్కృతాన్ని పరిపూర్ణంగా తెలుగులిపిలో రాయడానికుండే వీలునుబట్టే, తెలుగువాళ్లకి ఇహపరసాధనాలైన శాస్త్రాలు సంస్కృతంలో ఉండబట్టే, ఎన్నో సంస్కృతపదాలు ఆపళంగానే తెలుగైపోయాయి. తెలుగులోంచి వాటిని ఇప్పుడు తీసెయ్యడం ఎల్లా? తురకరాజ్యకాలంలో వేషం, అలంకారం, ఆభరణాలు, కచేరీలు, కొలుఖుత్తులులాంటివాటికి సంబంధించినపదాలు వందలాదిగా తెలుగైపోయాయి. వాటిని ఇప్పుడు చెడనాడుకోడం ఎల్లా? అట్లానే కుంపినీ రాజ్యం జొరబడ్డదిలగాయతు ఇంగ్లీషువాళ్లు ఏదో జీవితావసరం అనిపించే నూతనసౌకర్యం — స్టీమరు,

రోడ్డు, పోస్టు, టెలిగ్రాఫు, ఎలెక్ట్రీ (అనేచాలామంది తెలుగువాళ్లు అనగ్రలు,) నీళ్లపైపు, కాఫీహోటలు, మిల్లులు, సైకిల్, మోటారు, ఎయిరోప్లేను, గ్రామొఫోను, సినీమా, టాకీ, రేడియో, [ఇకముందు టెలివిజన్, యాగర్‌ప్లేన్]లాంటిది తెచ్చి తెలుగువాళ్లల్లో పారేస్తూండడం, ఒక్కొక్కపట్టు ఓవాతిగేసి ఇంగ్లీషు మాటలు మనకళ్లముందు తెలుగైపోతూండడం ఎరుగుదుం. వీటిని ఇప్పుడు అప్రయత్నంగా బళ్లో కెళ్లి ఇంగ్లీషు చదివిఉండని తెలుగువాళ్లంతాకూడా వాడతారు. తెలుగుసంభాషణలోకి ఆకీతిగా ఎక్కి హైటాయించిన ఇంగ్లీషుమాటల్ని ఇప్పుడెల్లా తీసెయ్యడం? మచ్చుమాయడం అంటే మాటలే! ఏకర్మంవల్లో ఒకేమహాప్రవాహంలో మనుష్యులు పడ్డప్పుడు, వాలుకేసి మొఖం పెట్టినవాళ్లనీ ఎదరకేసి మొఖంపెట్టి సుంజకుసేవాళ్లనీ ఉభయుల్నీకూడా ఆప్రవాహం వాలుకేసే ఈడ్చుకుపోయి గిరవటెడుతుంది, ఎటొచ్చీ వాలుకేసి తిరిగిన వాళ్లు కాస్త సజావుగా పడతారు, ఎదరకేసి తిరిగిన వాళ్లు వెల్లగిత్తులా పడతారు......

ఆమీదట ఒకటి జరిగింది. కేవలం తెలుసుకాకుండా మరొకభాషగాని విషయంగాని బాగా తెలిసి ఉంటేతప్ప ఉద్యోగం వబ్బ్యాలేని ఒకతెలుగువాణ్ణి ఆంధ్రేతరులూ ఆంధ్రులూకూడా ఒకపండితమాత్రుణ్ణిగానేనా కట్టడం మానేశారు. లోకంలో చాలామంది గొప్పవాళ్లకి తెలుగు రాకపోబట్టి, తమరికిసుడా తెలుగురాకుండాపోయి రాదని తమరు చెబుతూంటేగాని తెలుగువాళ్లల్లో గొప్ప సంపాదించడానికి వీల్లేదని కొందరు తెలుగువాళ్లకి నమ్మకం కలిగిందా అనిపిస్తుంది. కాలక్రమాన్ని 'విద్య' అన్నా, 'చదువు' అన్నా, 'పాండిత్యం' అన్నా ఆదిని సంస్కృతంలోనేఅనిన్నీ పదపడి ఇప్పట్లో ఇంగ్లీషులోనేఅనిన్నీ అనుకునేటంత వ్యామోహం తెలుగువాళ్లల్లో ప్రబలింది. పురాతన విజ్ఞానం ధరించినదవడంచేత సంస్కృతానికి జ్ఞానులు మొదటివోటు ఇచ్చారు పిదపవచ్చిన రాజకీయ పరివర్తనంవల్ల పార్సీకి మోజు ఉండేది — "దేవతా భాషల తీరు లేమియు గావు, పారసీకోక్తులు ప్రణుతికెక్కు" అని తిమ్మకవి దుఃఖించాడు. దరిమిలాని ఇంగ్లీషు వెలిసింది. మొదట్లో గుమాస్తాగిరీవిషయంలో అవసరమై, నేటివరకూ అది అల్లానే ఉండగా, అక్కణ్ణించి, లోకంతో వ్యవహరించే విషయంలో, నవీనవిజ్ఞానాభివృద్ధి గమనించేవిషయంలో, నవ్యప్రపంచరాజకీయ పరిస్థితి సర్తెరిగేవిషయంలో, వేదశాస్త్రాల్లో ఏముందో చెప్పిన దొర్లపుస్తకాలు చదువుకోడం విషయంలో, నూతన శాస్త్రపరిశోధనలవల్ల తేలిన సారాంశాలప్రయోగంవల్ల మానవులయొక్క ఐహికసౌఖ్యాభివృద్ధికి తోడ్పడే అపూర్వసాధనోపాయాలు అవగాహన చేసుకుని లాభం తియ్యడం విషయంలో, ఇంగ్లీషు ప్రాణావసరం అయిపోయిందని చాలామంది ఒప్పుకుంటారు. అందుకని, దేశావసరమైన పూర్వపుసంగతులు యావత్తూ సంస్కృతంలో ఉండడంవల్ల అవి నేర్చుగోడానికి తెలుగు అక్కర్లేనట్టే, నేటిప్రపంచం తెలుసుగోడానికి తెలుగు అక్కర్లేదు కాదు — ఎంతమాత్రం చాలదు ఇంగ్లీషుంటే, అందుకూ మరోఅందుకూ మరోఅందుకూ కూడా నయం. ఒకవేళ నేటి సజీవప్రపంచాన్నిగురించి రాసినగ్రంథాలు తెలుగుని ఉన్నా, అందులో కొత్తని అని పామరులు అనుకునేసంగతులు ఇంగ్లీషులోంచో మరో పరభాషలోంచో చాపో, రైటులేక చెప్పకో అనువదించి, కుదించి, దించి, అనుసరించి, అనుకరించి తంటాలుపడ్డబాపతు పోనూ అని నిరసన. 'తెలుగులో అపూర్వమేధావంతులు చేసినస్వతంత్రరచన మనం నేర్చుగుని మన్నించతగ్గది లేదు' అని ప్రతీ గొప్పతెలుగువాడికీ విశ్వాసం. తాను తక్కిన తెలుగుమూకకంటె గొప్పవాడవడంచేతనే అల్లాంటి విశ్వాసం కుదుర్చుకోగలిగానని వాడిఊహ. సనాతనత్వం, దేవత్వం, సర్వతోముఖత్వం కలిగిఉండడంవల్ల సంస్కృతాన్ని వదలలేని తెలుగువాళ్లున్నారు. సంస్కృతం నేర్చి ఆభాషలో కావ్యాలు రాస్తే తీరిపోనా, అట్లాంచేతో చెయ్యక, తెలుగులో గ్రంథాలు రాస్తూ నల్లేరుమీద బండి అన్నట్టు అసలే నామరూపాలు లేకుండా అణగారిపోతూన్న తెలుగుమీదికి సంస్కృతరథం తోలుకొచ్చి తెలుగువాళ్లని పచ్చడిచేసే తెలుగువాళ్లూ ఉన్నారు. దర్జా, హోదా, [illegible]బాయింపు, ఉద్యోగార్జన, గొప్పవాళ్లతో సహవాసం తద్వారా స్వలాభంలాంటివాటికి వీ లుండడంవల్ల బొట్లేరు ఇంగ్లీషుముక్కలు వదల్లేని తెలుగువాళ్లున్నారు. దర్జా

కోసం ఓ జిల్లాబోర్డుమెంబరు (ఆయన్ని బోర్డుమెంబరు అంటేగాని ఆయనకి కోపంవచ్చేది!) "నేను మొన్న మెడ్రాసు వెళ్లినప్పుడు ఆంజినీలుహోటల్లో భోంచేశాను. అక్కడి లిప్టన్ అరణ్యమెంటు బాగుంది" అన్నాడు. తరవాత వాకబుచేస్తే — ఆంజనీలంటే డి యాంజిలిస్‌ట, లిప్టన్‌అంటే రెట్రీట్‌ట. పట్నబూళ్లల్లో పోతూ ఇంగ్లీషు మాట్లాడి అక్కడి 'వైశ్యుల చేత దణ్ణా లెట్టించుకుని చాకిరీచెయించుకునే తెలుగువాళ్లున్నారు కారునడిపేవాళ్లు తమరికి పది పన్నెండు వర్ణక్రమం తెలియని ఇంగ్లీషుమాటలు వచ్చుననేగా మనుష్యుల్నీ పశువుల్నీ సమంగా దబాయించడం! ఎండి పుష్కలించిపోయిన పురాతనపు ఇంగ్లీషుసరుకు — రెండుమూడువందలఏళ్ల నాటిది — ఏటి కెదురీది పిక్కవేసి నేర్చి ఉద్యోగాలుచేసే అస్మదాదుల్ని తమరు ఎరగనే ఎరుగరు. గౌరవానికి లోటనేభయంచేత తెలుగుయాసతో ఇంగ్లీషుమాట్లాడే జనాన్నికూడా ఎరుగరుం "దేర్‌ఫోరూ, ఐ వెన్టూ! వాట్! ఐ నోన్లీ ఐ వెన్టూ! యూ నీడ్నాటు క్రియ్యా ఐ సెడ్డు" మాదిరిగా. ఇంగ్లీషుముష్టి బాగా కిడుతుందని గావును కొందరు ఈమధ్య ఇంగ్లీషులో ఎత్తుతున్నారు. అక్కణ్ణించి, తెలుగులో క్రియ లేకపోబట్టి, క్రియలన్నీ, ఇంగ్లీషులోనే జరిపే తెలుగువాళ్లు లేస్తోచ్చారు — మాట్లాడ్డం నడవడం, కోప్పడ్డం, తినడం, ఏడవడం, పశ్యన్‌వగైరా అన్నీ. పెళ్లానికి ఇంగ్లీషు రాదు, వదిలెయ్! తల్లిదండ్రులకి ఇంగ్లీషు రాదు, పాతెయ్! భంట్రోతుల్ని? ఇంగ్లీషు రాకపోతే తీసెయ్. తెలుగువాళ్లల్లో విద్యాధికులైన గొప్పవాళ్లతో ప్రసంగిస్తే ఈకింద యిచ్చిన నమూనాసమాధానాలు లాంటివి వినిపిస్తాయి:

ప్రశ్న — సంస్కృతంమాట ఏమిటి?

జబాబు — బతికున్నవాళ్ల కెందుకూ! ఒకవేళ చచ్చి స్వర్గానికెడితే దేవుడితో సంభాషించచ్చు!

ప్ర — ఇంగ్లీషు?

జ — అల్లా అన్నారు, ఆల్‌రైట్! బానిసలమైన మనమే కాదు, కొమ్ములుతిరిగినవాళ్లుకూడా ఇది నేర్చుకుంటున్నారు. ఇంగ్లీషుని ప్రపంచభాష చెయ్యడానికి ఇంగ్లండు[illegible] కట్టి, [illegible] ఇంగ్లీషుని [illegible], వాళ్లలోనే [illegible] గ్రంథాలన్నీ [illegible] రాస్తున్నారు. [illegible]

ప్ర — హిందీ?

జ — అబ్బా! అందులో [illegible], [illegible] ఉన్నాయి. అయితేం? [illegible]

ప్ర — [illegible] తెలుగు?

జ — ఛీ! తెలుగేమిటి చెప్పూ! నాహోదా గాడి కేమి ఉంటుంది అందులో! స్టైల్!

ప్ర — తెలుగుపుస్తకాలు?

జ — తర్జుమా, [illegible], తక్కువరకం. నామనస్సుకి విందుగాగాని, ఆహారంగాగాని, పథ్యంగా గాని, ఆఖరికి చిరుతిండిగాగాని ఉండేవేనా లేవు.

ప్ర — తెలుగులో నాటకరచన?

జ — సుద్దం! విజ్ఞానశూన్యం. పైగా అవంతా అదివరకే సంస్కృతంలో అంతకంటె రమ్యంగా ఉండేసిన బాపతుట!

ప్ర — తెలుగులో కొత్తరచన?

జ — అగమ్యం, సంకరం, అసభ్యం, నీరసం.

ప్ర — చదివి చూశారా?

జ — కిట్టదు. అందుకనే చదవను. చదవకుండా చెప్పడంమాత్రం కళ కాదా?

ప్ర — తెలుగులో పాతచిత్రకళ?

జ — అంతా ఇంగ్లీషు. అందులో పురాణస్త్రీలుకూడా గోరసాన్లలానే ఉంటారు.

ప్ర — కొత్తచిత్రకళ?

జ — బాబూ ఇది బెంగాలీఫక్కీ. అన్నీ "భావబొమ్మలు."

ప్ర — తెలుగులో పాతపాటలు?

జ — ఇప్పటి మూర్ఖులూ వెనకటిస్త్రీలూ వినడానికోసం.

ప్ర — కొత్తపాటలు?

జ — గంధర్వ, ప్యాప్, — ఇమిటేషన్, ఒక్క త్యాగయ్యవినా — అతడేనా అరవదేశంలో ఉన్నాడుగనక. అతనికేనా తెలుగు బాగారాదు.

ప్ర — తెలుగు ఫిల్ములు?

జ — మంచివి ఒక్కటి లేదు. నిశ్శబ్దంగా ఉండే సినిమాల్లోకి వచ్చిన తెలుగునటుడు లేడు ఇప్పుడు సశబ్దంగాఉండే టాకీలో ముందు ఒక్క తరవాత ఒక్కగాని తెలుగుజనుడు లేడు.

ప్ర — తెలుగు పత్రికలు?

జ — కొన్ని ఇంగ్లీషువాటికి ప్రతికలు. కొన్ని అప్రమేశితాలు. కొన్ని ప్రచారమాత్రాలు.

ప్ర — తెలుగుయంత్రపరిశ్రమలు?

జ — పేపరుమిల్లు, బట్టలమిల్లువగైరా. కొన్నింటిలో తెలుగు లేదు, తక్కిన వాటిలో పరిశ్రమే లేదు.

ప్ర — తెలుగువాళ్ల విదేశవర్తకం?

జ — అది సాగుతూండేది అన్యభాషాపరిచయంవల్లే. తెలుగువల్ల కాదు.

ప్ర — తెలుగు పరపతి సంఘాలు?

జ — కొన్ని నరపతి సంఘాలు, కొన్ని తిరపతి సంఘాలు.

ప్ర — తెలుగుప్రజల ధనాలయాలు?

జ — కొన్ని సుప్రజాలయాలు, కొన్ని స్వప్రజాలయాలు, కొన్నిలయాలు.

ప్ర — తెలుగులో భీమాలు?

జ — కొన్ని హేమాలు, కొన్ని కామాలు.

ప్ర — తెలుగు నాయకులు?

జ — కొందరే, చాలామంది వినాయకులు.

ప్ర — తెలుగు విశ్వవిద్యాలయం?

జ — అదంతా తెలుగుది కాదు.

ప్ర — అయితే?

జ — అప్పుడూ మజా! అదీ మెడ్రాస్ ఇమిటేషన్! పరీక్షల కార్ఖానా!

ప్ర — కొత్తశాఖ లున్నాయే!

జ — ఇంకా ఉండాలి. తెలుగివాలి.

ప్ర — డబ్బుంగాలిగదా. అంతా తెలుగైతే అన్యదేశాల్లో మనపట్టాలు సాగవేమో!

జ — అన్యదేశాలు వెళ్లనేవద్దు!

ప్ర — పోనీ తెలుగురాష్ట్రం?

జ — అట్టెట్టె! ఆగాలి! సౌరాష్ట్రం!

విచారణచేస్తే సంస్కృతం దేవలోకభాష. ఇంగ్లీషు భూలోకభాష. ఉర్దూ యోధలోకభాష. 'ఉర్దూ' అంటే యోధులు విడిసేస్థలం అని అర్థం యుద్ధానికి పురికొల్పేసమయంలో వివిధభాషల యోధులకీ ఉర్దూభాషలోనే హెచ్చరికోపన్యాసం ఇస్తూంటారని చెబుతారు. మరి తెలుగో! ఇది ప్రస్తుతం గొప్పతెలుగువాళ్లపట్ల పనికిమాలిందిలాగ ఉన్నభాష. మహాఅంటే దీన్ని గానభాష అనచ్చు. అందుకనే అరవలు తెలుగుకీర్తన్లూ జావళీలూ నేర్చి తెలుగువాళ్లకి శ్రవణానందంచేసి సొమ్ముచేసుకుంటారు. వీటివల్ల వాళ్లకొచ్చే ఆదాయం చూస్తే 'అరవలు తెలుగుపాటలు అర్థంచేసుగోలేరు' అని విచారించేవాళ్లు అర్థంచూడకుండా పోతున్నారన్నమాట. ఈమధ్య తెలుగువాళ్లు అరవల్ని ఏవో అన్నారని అరవలంతా ఏకమై — ఎందెందులో ఎవరెవరు ఏకమైనా అసలు మెచ్చతగ్గదే! — ముందుముందు తమరు చేసే పాటకచేరీల్లో త్యాగయ్యకీర్తన్లు పాడడం మానెయ్యాదల్చుకున్నారని వదంతి. అదే నిజమైతే, వాళ్లు త్యజించేది త్యాగయ్యని గనక అందరూ సరిగ్గా (త్యాగయ్య - త్యాగయ్యర్ - త్యాగయ్యెస్ట్ సూత్రప్రకారం) త్యాగయ్యర్లుఅయి ఊరుకుంటారు.

ఏతావాతా, తెలుగులో విద్య నేర్చినవాడికీ తక్కిన తెలుగువాడికీ మానసికంగా చాలా దూరం అయిపోయింది. కేవలతెలుగువాడికి ఉండేభావాలూ

అభిప్రాయాలూ అసలైన భావాలూ అభిప్రాయాలే కావని విద్యాధికుడైన తెలుగువాడు అనుకునేకర్మం తెలుగుదేశానికి పట్టింది అందుకని అభిప్రాయాలుగల తెలుగువాళ్ళూ అంటే మానసికంగా ఇంగ్లీషుభాషలోనో, సంస్కృతభాషలోనో, ఉర్దూభాషలోనో— తెలుగుతప్ప మరొకభాషలో — ఆలోచన కొనిస్తున్నసే తెలుగువాడు అని తెలుస్తోంది. కొబట్టి, తెలుగు విద్యాధికుడికి స్వంతానికి తెలుగు అవసరం లేదు. స్నేహితులు కలిసినప్పుడు గొప్పతెలుగువాళ్లు తెలుగులో మాట్లాడుకోరు. ఫక్తుఇంగ్లీషు చేతకాక — పరభాష పరభాషేమరి — అంగులోనూ మాట్లాడుకోలేరు. అదియిదీ ఎదీకాని "ఎంగిలీషు"లో ముచ్చటించుకుంటారు. కొందరు గాంభీర్యంకోసం; కొందరు వ్యవహారంలో కోపంవచ్చి; కొందరు తీరా తెలుగైతే ప్రతీవిశ్రాంబ వెళ్లేవాళ్ళూ 'ఇదిట్రా! అబ్బాయి తెలివి!' అని తన సంగతి కనిపెట్టేస్తాడేమోఅని; కొందరికి అలవాటు; కొందరికి నైసర్గికం; కొందరు తమఅన్యభాషాభావానికి తెలుగులో — తనతెలుగులో — పదాలు అసలేలేక; కొందరు వాళ్ళీఅవసంచేత; కొందరు తమరికి వచ్చినా మెచ్చేవాళ్లు లేరనే దుడ్డకొద్దీ! బజారు చెయ్యడానికి గొప్పతెలుగువాడు వాళ్లనేవెళ్లడు గనక తెలుగు అక్కర్లేదు. వెళ్లినా ఓయూభైతెలుగు మాటలు ఎక్కితొక్కినూ! గొప్పతెలుగువాడు తెలుగు టాకీ బాగుండదని ముందే తెలుసునని దానికి వెళ్లడు. అందుకని టాకీవిషయంలో 'హిందీ'గాని, 'ఇంగ్లీషు' గాని రావాలి, చాలు. అరవం వచ్చినా చాలు. అరవ త్యాగరాజుఫిల్ముకి తెలుగుదేశంలోనే డబ్బు ఎక్కువ వచ్చిందని ఆఫిల్మువారు అన్నారన్నారు. కాఫ్యాలయానికి వెడితే ఉప్మా సాంబార్‌లాంటి అరవం, అరకప్ అరప్లేట్‌లాంటి ఇంగ్లీషు చాలు తెలుగు అక్కర్లేదు. కోర్టుల్లో కొంతవరకు సంభాషణ తెలుగుని జరుగుతుందిగాని, అది ఆంగ్లంలో పెడితేగాని తెలుగుఫిర్యాదీ హృదయబాధ న్యాయమూర్తిగారితల కెక్కదు. ధర్మశాస్త్రం అటు సంస్కృతంలోనూ ఇటు ఇంగ్లీషులోనూ ఉంది. ఇదమిత్థంఅని న్యాయం తేల్చడానికి తెలుగువాళ్లకి తెలుగు అవసరం లేదు. అందుకనే న్యాయం తేల్చలేరు, ఓపట్టాన్ని తేల్చాండదు. అన్నప్రాల్లో సంస్కృతం, ఇంగ్లీషురాక మరొకటేదు గూఢంగా ఉండాలని వ్యవహారిస్తారు. సోగాలి తప్ప తెలుగు తెలియనివాళ్ళు, సంస్కృతస్థానికి తరువుగా, ఉపన్యాసాల్ని తెలుగులోనే ఉండాలని మహానివేదనపడుతున్నారు. కాని తమ ప్రాంతాల్లో కొందరు ఇంగ్లీషులోనే మాట్లాడుతూ "తెలుగు ఓ! తెలుగు, యూ మస్ట్! మస్ట్!" అని చెప్పేతెలుగువాళ్లు ఉంటూంటారు. ఇక బళ్లలో తెలుగు! పరిపాలకులే ఇంగ్లీషువి. సమాప్తాల్ని తెలుగులోకే నిమిత్తం ప్రభుత్వం వాళ్ల తమకిభాష నేర్పేబళ్లు. పరిపాలనలో తెలుగు ఒకవిషయం. వాళ్లకు ... అవి ... భాషగానో తెలుగు ఉండాలనకగాని, లేకపోతే చాలామంది తెలుగువాళ్లు తెలుగుఅక్కర్లేనా మాటకుండా పెరిగుండేవాళ్లు. వెనక బళ్లలో తెలుగుతప్ప కడంవిషయాలన్నీ ఇంగ్లీషునే. కొంతకాలానికి బళ్లు తెలుసుమారాయి. ఇప్పుడు తెలుగు మరోమెట్టునాకా నిశ్చంధించారు. అయినా తెలుగుస్థితి అల్లానే ఉంది. అక్కడ తెలుగుస్థితి మచ్చుచూస్తే దేశంలో తెలుగు యొక్కస్థితి సరిగా బోధపడుతుంది. అస్థితి, అందుకు పుల్యాంకట్టుకున్నవాళ్లు, వాళ్లవాటాలూ: అదోపెద్ద గాధ.

ఇంత అధ్వాన్నంగా తెలుగుస్థితి ఉంటూండగా కొంతకాలంనించిహిందీగురించిహంగామా జరుగుతోంది. ఇన్నికోట్ల తెలుగుజనంలోనూ — స్త్రీ పురుష బాల వృద్ధ పండిత పామరుల్లోనూ — ఎన్నిలక్షలమంది ఎవరెవరు హిందీలో ఏమాత్రంపాండిత్యం ఎన్నేళ్లల్లో నేర్చి అందులో ఎంతమంది పరిపాలకవర్గంలో ఉద్యోగాలు సంపాదించి తెలుగుదేశాన్నీ, దాంతోపాటు తక్కిన హిందూదేశాన్నీ ఎన్నిఅంగుళాలు పైకి లేవదీస్తారూ అనేది చూడవలిసినవిషయం. కొన్నివందల ఏళ్లనించి తెలుగువాళ్లకి ఇంగ్లీషే రాజభాష. పొట్టకోసం కొందరు తెలుగువాళ్లు పుస్తకమాత్రం అయిన పాతఇంగ్లీషు నేర్చారు. ఈపాతదినుసేనా తెలిసినవాళ్లు ఇప్పటికీ మొత్తంమీద వెయ్యోవంతు ఉండరు. గట్టుమీద ఈత నేర్చుకున్నట్టు తెలుగుదేశంలో ఉండి ఇంగ్లీషుచదవడానికి ఇన్నేసేళ్లు పడుతోందిగాని, అక్కడికే వెళ్తే

ఓరెండు మూడు భాషల్లో కావలసినవన్నీ ఇంగ్లీషు పదవులు కొల్లుకురావచ్చు. గొప్పగా జీతాలనే ఆశతో తెలుగువాడు ఆస్తైనా అమ్మి నేటివరకూ దొరికినంత ఇంగ్లీషు చదువుకుంటున్నాడు. తెలుగువాళ్లల్లో ప్రతీ వాడూ ఇంగ్లీషు చదవాలనిగాని, చదివితే తమరికి ఉద్ధరింపనిగాని, చదవకపోతే తమరికి అరిష్టం అనిగాని, ఇంగ్లీషువాళ్లు చెప్పాలేదు, ఏడవాలేదు. ఇంగ్లీషు సారస్వత చరిత్రలో ఇంగ్లీషుపండితులైన తెలుగువాళ్ల పేర్లు ఎక్కుతాయని నమ్మడానికి వీలు కనిపించదు. తెలుగుతండ్రులే కోరుకుని, తమసంతానం పాలితులైన తెలుగువాళ్లల్లో చిక్కడిపోకుండా పాలకులైన ఇంగ్లీషు వాళ్లవర్గంలో జేరితే లాభమూ గొప్పాకదాఅని వాళ్లకి ఇంగ్లీషు చెప్పించారు. అట్లాంటివాళ్లకికూడా ఇంకా బాగా మోహం మొత్తలేదు. అల్లానే హిందీనూ. చావగొట్టి ఏదీ చదివించలేం. చావగొట్టినా తల్లిభాష రాని వాళ్లకి చచ్చినా పరభాష రాదు. అందుకని, ఏమీ అక్కర్లేదు, మీదపడితేసరి, తప్పకుండా వస్తుంది. రావడమే కాదు, ఇది మాభాషే మేం వదలం అంటారు. కాని, ఒకబరువు ఇంకా మీద ఉండగానే మరోటిపెట్టడం అధర్మం. అయితే, చిన్నప్పణ్ణించీ తెలుగువాడికి హిందీలాంటిది చెప్పకపోతే వాడు తల్లి భాషలో కాస్త కుదురుకుంటాడుగనక, తరవాత తరవాత ఇంకోభాషలోకి స్వత్వం చంపుకుని మారడు. అందుకని, ఉగ్గుపాలతోటే తెలుగు వాడికి పరభాష చెబితే, పరభాష తనదే అనుకోడం తన తల్లిభాషని నిరసించడం, పరమతం పరజ్ఞానం వగైరా బాగున్నా యనుకోడం తన అసలుమతం అసలుజ్ఞానం నాసిరకం అనుకోడం, పరదేశం తనదనుకోవడం తనదేశం మట్టి అనుకోడం వాడికి సహజం అయిపోయి, వాడు మరి తెలుగు తెలుగంటూ ఏడవడు. ఇంగ్లీషుభాష విషయంలో ఇల్లా అయింది! మరోదానికి ఇల్లానే జరగవచ్చు! అక్షరాస్యులైన తెలుగుజనంలో చాలామంది 'హ' గుణింతం, 'త' వత్తూ తెలియక 'హ' 'త' శ్రేణిలో చేరినవాళ్లం ఉంటూంటే 'హిందీ' వచ్చి వీళ్లనోటపడి ఏమి హింస పడుతుందో గదా అని దిగులు. హిందీ ఒకవిధమైన ప్రాకృతం — వ్యావహారిక సంస్కృతం, సంస్కృతానికి ఛాయ. అల్లాంటప్పుడు ఛాయని పట్టుకుని దేవుళ్లాడ్డం ఎందుకు? దేశభాషల కన్నింటికీ తల్లివేరైన ఆ అసలు వస్తువు సంస్కృతమే అన్నిచోట్లా నిర్బంధంగా చదివిస్తే సరి వొదిలిపోతుంది అని కొందరి నమ్మకం. సంస్కృతమే వస్తే హిందీ, మందీ, ఉన్నదీ, లేందీ అన్నీ కూడా వచ్చేస్తాయని. "అమరోక్తులు సకలభాషలందును వెలయున్" అంటాడు అప్పకవి. కాని, సంస్కృతానికి ఒక ఆక్షేపణ ఉండొచ్చు. అది ప్రస్తుత రాజకీయాధికారం ఉన్నవాళ్లకి వచ్చునో రాదోట. అయితేమాత్రం? రాజకీయావసరాల్ని బట్టి కొన్ని ఇతర భాషలు నేర్చి తీరవలసినట్టే, ప్రజలభాషకూడా పరిపాలకులు నేర్చాలి. అంతేగాని పరిపాలకుడి భాష ప్రజల్లో ప్రతివాడికీ యుగం తిరిగినా రాదు, రానక్కర్లేదు. కాబట్టి ఇతరభాషల గురించి భయపడడం అనవసరం. ఏస్థానం తెలుగు కిచ్చి తెలుగుయొక్క అపరిమితమైన వాడకం తెలుగువాళ్లందరికీ తప్పని సరి అయే సందర్భాలు ఏవేవి కలిగిస్తే యుక్తమో మొదట చూసుకోడం తెలుగు వాళ్ల ధర్మం. అప్పుడు తెలుగులోనే వివిధ సంస్థల నిమిత్తం వివిధ పరిభాషలు ఏర్పడాలి— తెలుగుమతగ్రంథాల్లో పరిభాషా, తెలుగు జ్యోతిషాది గ్రంథాల్లో పరిభాషా, తెలుగు న్యాయస్థానాల్లో పరిభాషా, తెలుగు రాజకీయంలో పరిభాషా, తెలుగు పాఠశాలల్లో పరిభాషా — ఈరీతిగా. అక్కణ్ణించి ఇన్నిన్నిశాఖల్లోనూ వాడుతూండే తెలుగూ, నిత్యకృత్యాలకి ఉపచరించే పామరుల తెలుగూ వ్యత్యాసంగా ఉండడం, పారిభాషిక పదాల్లోంచి కొన్నొచ్చి సంభాషణలో పడడం, సంభాషణలోంచి కొన్నిపదాలు వెళ్లి ప్రత్యేకస్పష్టార్థాల్తో పారిభాషిక పదాలుగా నెలవడం, ఇల్లా ఇచ్చిపుచ్చుకోడాలు జరగడం, ఉభయతారకంగా అది పరిణమించడం, తెలుగు దేశంయొక్క జ్ఞానం క్రమంగా ఒక్కొక్క పైమెట్టే ఎక్కడం సంభవించవచ్చు. అందుకని ముందు నా తెలుగుకి, నాభాషకి నేను నా హృదయంలో ఉచిత స్థానం ఇస్తాను. నేను తెలుగుని గౌరవిస్తాను, మన్నిస్తాను, ఆరాధించి సేవిస్తాను.

మ. నినుసేవింపగ నాపద ల్పొడమనీ
నిత్యోత్సవం బబ్బనీ
జనమాత్రుం డననీ మహాత్ము డననీ,
సంసారమోహంబు పై
కొననీ, జ్ఞానము గల్గనీ, గ్రహగతుల్
కుందింపనీ, మేలు వ
చ్చిన రానీ యవి నాకు భూషణము లో
శ్రీకాళహస్తీశ్వరా.

అని ధూర్జటిదీక్ష తెచ్చుకుని 'శ్రీయాంధ్ర భాషేశ్వరీ' అనుకుంటాను. నేను తెలుగు వాడతాను, ఉపయోగిస్తాను, పలుకుతాను. ప్రాణహానివగైరా తెచ్చే వ్యవహారాటంకం కలిగేటప్పుడు రెండోపక్షంగా ఇతరభాషలు — వాట్లకి తలవంపులు రానీకుండా — నేరుస్తాను. అందానికీ, అలంకారానికీకూడా వాటిని తెచ్చుకుంటాను, నాయిష్టం అయితే. అయితేనేం? నా తెలుగు నాతల్లి భాష, నాతల్లి హృదయం, నాతల్లి మనస్సు, నాతల్లి. నాతల్లిని నేను మన్నించడంవల్ల నాకు లాభమా, నష్టమా నేను తర్కించను. నేను జంతువుల్లో జమ అయిపోకుండా ప్రప్రథమంలో నా జిహ్వలో ప్రవేశించి, నాముఖతా పైకొచ్చి, తద్వారా నాజన్మ సార్థకపరిచిన ఏ తెలుగుభాష అయితే ఉందో, ఆ తెలుగుతల్లిని నేను — ఈజన్మ ఎల్లానూ చాలదు పరభాషాదత్తం అయిందిగనక, — ఎన్ని జన్మ లెత్తి సేవిస్తే ఆవిడఋణం తీరుతుందోకదా అని ఆదుర్దాపడుతూంటానుగాని, దీన్ని సేవిస్తూకూచుంటే నాకు కిట్టుతుందా కిట్టదాఅని బేరంచేస్తూ అహోరించను. గొప్పవాళ్లైన నా తెలుగువాళ్లెవళ్లేనా నా తెలుగు వినిపించుగోకపోతే నేను బాధపడను. ఎప్పటికేనా తెలుగుకి అర్హత, అవసరం, గణ్యత, గౌరవం వస్తాయని విశ్వసిస్తాను. తెలుగున ఆలోచించి, తెలుగుజనాన్ని జ్ఞాపకంఉంచుగుని తెలుగుహృదయంనించి అభిప్రాయం తెలుగులో చెబితే తెలుగుజనం ఆలకించి తీరతారు అనేధైర్యంతో ఉంటాను. అప్పుడు వాళ్లకికూడా నాకు కలిగినచిత్తవృత్తిలాంటిది కలిగితీరుతుందని భావిస్తాను. స్వతంత్రరచన తెలుగులోలేదని చెప్పేవాళ్లు అంతమాట అనవలసినఅర్హులు కారని తలుస్తాను. సంస్కృతవిజ్ఞానాకరం ఆంధ్రభాషకప్రసాదించినవాళ్ల కావ్యమే మనకి అందచేసిన నన్నయ తిక్కనాదుల్ని స్మృతికి తెచ్చుకుని, భాగవతంపుస్తకం ప్రత్యక్షంగా చూసి మురిసేట్టాగాడా అనిపించే పోతన్నని తల్చుకుని, సంస్కృతవాణితో చెట్టాపట్టాలుపట్టించి తెలుగుతల్లిని యావత్తు తెలుగునాటా దిగ్విజయంగా ఊరేగించిన శ్రీనాథుణ్ణి స్మరించి, మూడువందలజన్మల్లో ఒకేపాత్రయొక్క అనుభవాలు రాయగలిగిన సూరన్నని, బ్రహ్మ సరస్వతుల పవిత్రశృంగారచేష్టలు వర్ణించి ఎక్కడెక్కి పూర్తయిన చేష్టలు అక్కడికి సృష్టి బ్రహ్మచేత చిలక్కి కథగా చెప్పించి సరస్వతిచేత కథకి అర్థంచెప్పించి కవిబ్రహ్మ సంకల్పించింది అక్షరాలా భూమిమీద జరుగుతుందని చూపించిన సూరన్నని, చలువ - వెన్నెల - అందం - సౌరభం - కోమలత - మధురత్వం అనేవి తెలుగుతల్లికి లక్షణాలని ఇన్నిలక్షణాలూగల మాటల్లో అనేసినసూరన్నని, ముందుకి ఒకభావంలోనూ వెనక్కి మరోభావంలోనూ ఏకకాలమందే నడవగలిగిన సూరన్నని, సర్వశాస్త్రపరిజ్ఞాతలు ఇంతవరకు ఇంకా కనిపెట్టలేకుండాఉన్న అద్భుతాలు వెనకే ఊహించేసిన సూరన్నని మరీమరీ స్మరించి, అతిసుళువుగా అపార ఐహికాముష్మికజ్ఞానం ఆటవెలదిముఖతా పలికింపించిన వేమన్నని నెమరికి తెచ్చుకుని, తెలుగుయొక్క గౌరవప్రతిష్ఠలు ఎక్కడ తగ్గిపోతాయో — అన్యభాషాఘాతం అయి తెలుగు తనస్వత్వాన్ని ఎక్కడ పోగొట్టుకుంటుందో - తెలుగులో కామధేనువుల్లాంటి పదాలు ఎక్కడ వట్టిపోతాయో - ఏచిన్న తెలుగుపదం ఎక్కడ ఉంచడంవల్ల జీవిస్తుందో — ఏపదాలు ఏక్రమంలో సర్దుకొని కూర్చినవాణ్ణీ నేర్చినవాణ్ణీకూడా ఉభయులూ అనుకోని భావందగ్గిరికి ఎగరదీసుకుపోగలవో - రకరకాల నవీనవిజ్ఞానాన్ని తెలుగులో ఎల్లా పాకించడమో, తెలుగుజిహ్వ పెట్టిపుట్టడాన్ని ఏమేమిటిఅనేసి సఫలం చేసుగోవాలో — అంటూ తెలుగుగురించి తెగతాపత్రయ పడిపోతూ ఇహంలో మెప్పమాటగాని డబ్బుమాటగాని పరంలో మోక్షాశగాని తెలుగువల్ల ఉండవు అని అనుభవంలో తెలిసీకూడా, కాళ్లట్టుక ఈడ్చేస్తూన్నా మారట్టుగు వేళ్లాడుతూ, తెలుగులోనే జీవిస్తూ, తెలుగే వాడుతూ, తమరిచిత్తవృత్తులకి తెలుక్కి

తాదాత్మ్యం ఆరోపించుకుని తెలుగులోనే ఆలోచిస్తూ తమరిహృదయనాళాలమీదినొక్కులు తెలుగువల్లే కలిగాయి అనుకుని తమరి పెదిమిలు తెలుగు అనడానికే దేవుడు చేశాడనుకుని, తెలుగుభాషాసంప్రదాయాన్ని ఇన్నాళ్లనించీ నిలబెట్టుకుంటూవచ్చిన తెలుగుఅధ్యాపకు లందరికీ తెలుగుపండితులందరికీ తెలుగురచయితలందరికీ — అంతకంటె ముందు ఇతరులై పుట్టినా సోదరులైన బ్రౌన్, గెలెటీవంటివాళ్లకి — నమస్కారంచేసి, ఒక్కక్షణం ఆగి, వెనక్కిచూచి, మరీ ప్రత్యేకంగా,

తెలుగదేల యన్న దేశంబు తెలుగేను
తెలుగువల్లభుండ, తెలుగొకండ
యెల్లనృపులు గొలువ యెఱుగవే బాసాడి
దేశభాషలందు తెలుగులెస్స

అనే మృదువైనమాటలు గంభీరమైనభావంతో అనగలిగిన "సాహితీసమరాంగణసార్వభౌము"డైన శ్రీకృష్ణదేవరాయల్ని సవినయంగా తల్చుకుని, ఎంత చెడ్డా నేటివరకూ తెలుగుని యథాశక్తిగా నేర్చినా నేర్చకపోయినా పోషించుకొస్తూన్న తెలుగురాజుల్ని మెచ్చుకుని,

తెలుగుదేశం స్వతంత్రంఅయి దేశంలోఉండే గొప్పసంస్థల్లో తెలుగు విస్తరించి, తెలుగువాళ్లల్లో గొప్పవాళ్లు తెలుగుని లేవనెత్తి, దాన్ని మొదటవిధిగా హృదయంలోనూ, వీలైతే కంఠంలోనూ, అధమం శిరస్సుమీదా పెట్టుకున్నప్పుడే తెలుగుయొక్క ప్రతిభా, తెలుగుయొక్క వ్యక్తిత్వం, తెలుగుయొక్క జీవం సిద్ధిస్తాయని ఆశిస్తాను.

ఆ వే ళ

శ్రీ దేశరాజు వేంకటరమణారావు

అది లతాంతనితాంతశాంతాంతరంగి
కోదయమునందు పాలక్రియ్యాటలోన
గఠినగండశిలారేఖ కరగి, కరగి
జగమునల్లు పురాతనాజాతవేళ.

హారిణకైశోరముల యదృచ్ఛాంచలముల
విహగవీణాస్వనప్రియావహములందు
నమృతరసవీచికల సముద్యమముజొన్పి
విస్మృతనిశ్శబ్దహృదుల గావించువేళ.

తుహినధారాపికార నిస్తులగభీర
లీనకల్యాణగానవిధాన మెఱిగి
వటముపాలాశపాలి సంభావ్యగతి స్ప్ర
శించి శాంతగీతము లాలపించువేళ.

—నా 'ఏలాలత' నుండి.

శిలాప్రతిమ



చింతా దీక్షితులు

౧

"త్యాగం అంటే ఏమిటండీ" అన్నాను భైరవశాస్త్రుల్లుగారితో.

భైరవశాస్త్రుల్లుగారు అప్పుడే భోజనముచేసి అంగవస్త్రముతో చేతులు తుడుచుకొంటూ వచ్చి అరుగుమీద కూర్చున్నారు. రాత్రి ఎనిమిదిగంటలయింది. ఆసమయానికి ఆచుట్టుపట్ల కాపురమున్న నేనూ యితరగృహస్థులూ భైరవశాస్త్రుల్లుగారి అరుగుమీద చేరి పిచ్చాపాటీ చెప్పుకోవడం అలవాటు. భైరవశాస్త్రుల్లుగారికి కథలంటే మహాసరదా. ఏప్రశ్న అడిగినా ఆప్రశ్నకు సమాధానంగా ఒకకథ చెప్పతూఉంటారు.

"త్యాగం అంటేనా!" అని శాస్త్రుల్లుగారు ఒకమారు త్రేన్చి, కడుపు నవరించుకొని, అంగవస్త్రం నడుంచూట్టూ తిప్పి మోకాళ్ల కింద కట్టి పర్యంకబంధంవేసుకొని 'త్యాగం అంటేనా?" అన్నారు.

"చిత్తం. త్యాగం అంటే తమ రేమిసెలవిస్తారో వినాలని వున్నది శాస్త్రుల్లుగారూ!" అన్నాను.

"భగవద్గీతలలో త్యాగం అన్నప్పుడు సర్వకర్మఫలత్యాగమే త్యాగముగా ఎన్నుకోవలసిఉంటుందని చెప్పబడ్డది. అట్టిత్యాగమున్నూ 'సత్త్వరజస్తమోగుణాల ననుసరించి ముత్త్రివిధముగా ఉంటుంది' అని చెప్పబడ్డది. కాని కలిమిలాను త్యాగార్థము అనేకవిధాలగా మారింది. త్యాగానికి ప్రత్యర్థము ఈవి. ఋషితోసమానమైన కాళిదాసుగారుకూడా "త్యాగాయ సంభృతార్థానాం" అన్నారు. అతనికి సొంతమాత్రమూ త్యాగంలేదన్నా, త్యాగబుద్ధి లేదన్నా లోకములో, ఈవిలేనివాడు అనేఅర్థముచే చేసుకొంటారు.

ఇది ఇలా ఉండగా ఈకాలములో ఆత్మత్యాగమనేమాట తరుచుగా వాడుతున్నారు. దీని కర్థము దేహత్యాగమనే; అనగా ఉదాత్తమైన కార్యాన్నుద్దేశించి తనప్రాణములను విడిచిపెట్టడమే. ఆత్మత్యాగ మనే మాటలో ఆత్మకు దేహమనే అర్థం చెప్పాలి. ఎందువల్లనంటే ఆత్మ అనేదానికి త్యాగమంటూ ఉండదుకదా. ఆత్మ త్యజించేదికాదు త్యజించబడేదికాదు" అని శాస్త్రుల్లుగారు పొడుంకాయకోసం యిటూ అటూ వెతుక్కోవడం మొదలుపెట్టారు. కథ చెప్పడానికి బదులు వాక్యార్థంచేస్తున్నారు, అడ్డుప్రశ్న వేస్తేనేగాని ఈధోరణి తగ్గదని అన్నానుగదా—'శాస్త్రుల్లుగారూ! ప్రాచీనకాలంలోనైతేనేమి, ఈకాలంలోనైతేనేమి ఉత్కృష్టమైన త్యాగంచేసినవాళ్లు చాలా మంది ఉన్నారు గదండీ?"

శాస్త్రుల్లుగారు పొడుంపట్టు పట్టుకొని, "తొందరపడకు, విశ్వం, తొందరపడకూ; వస్తున్నాగా — అయితే ఈ త్యాగమున్నూ అనేకవిధాలగా ఉంటుంది. మనవిశ్వం చెప్పినట్లు గొప్పగొప్పత్యాగాలు చేసినవాళ్లు పూర్వమందూ ఇప్పుడూకూడా ఉన్నారు. అజమహారాజు, రఘుమహారాజు, శ్రీరామచంద్రులవారూ, శ్రీకృష్ణచంద్రులవారూ—"

"అయితే శాస్త్రుల్లుగారూ — వీరు వీరు చేసినటువంటి త్యాగాలు—"

"తొందరపడకయ్యా. విశ్వం — చెప్పవచ్చిన మాట ఏమిటంటే — మహాపురుషులైతేనేమి, స్త్రీలైతేనేమి, పూర్వకాలమందైతేనేమి, యీకాలమందైతేనేమి చేసినత్యాగాలు అనేకవిధములుగా ఉండుకుంటున్నవి. శ్రీకృష్ణచంద్రులవారిని సత్యభామాఅమ్మవారు నారదులవారికి దానముచెయ్యడమనేది బహు ఉత్కృష్టమైన త్యాగమనిపించుకుంటుంది. మరిన్ని మరణించిన భర్తలతోపాటు సహగమనము చెయ్యడము అనే దేహత్యాగము ఏదైతేగలదో అదిన్నీ ధర్మప్రేమ పరమావధిగాగలది అయినప్పటికిన్నీ అమ్మవారి త్యాగముతో సరితూగదు.

ఇది యిలా ఉండగా — శైవసంప్రదాయదీక్షితులైన భల్లాణమహారాజులుంగారు జంగమరూపమున అతిథిగా వచ్చిన శ్రీమహేశ్వరులవారి భోగార్థమై నిజధర్మపత్నిని త్యాగముచెయ్యడమనేది శైవులలో భక్తిపారమును తెలియజేస్తుంది."

"అయితే శాస్త్రుల్లుగారూ! ఇట్టిత్యాగము శైవులలోనేగాకుండా మనలోకూడా ఉన్నట్లు భారతము చెప్పుచున్నదిగదండీ—"

"అతిథి నిను గోరెనేనియు మతి గింకిరిపడక యోలమానగొనక నీ వతనికి సపర్యసలుపుము" అన్నాడుగదా."

"అవును, ఆమాట నిజమే, అతిథి అభ్యాగతులు విష్ణువుతో సమానులని ప్రమాణవాక్యము లున్నవికాబట్టిన్నీ, మనదేహప్రాణమానములు భగవంతునివేకాబట్టిన్నీ యిట్టిత్యాగమున్నూ భల్లాణచక్రవర్తి త్యాగమువంటిదే అవుతుంది.

మరిన్నీ దేశక్షేమముకోసము యోధులున్నూ, దేవతాప్రీతికోసం ప్రాకృతభక్తులున్నూ ఎట్టిత్యాగమైనా చేస్తారు.

అన్నికాలాలలోను ఎక్కువగా చేయబడే త్యాగం స్త్రీప్రేమకోసంఅని మీకు తెలిసే ఉంటుంది.

అన్నిత్యాగాలకంటె అత్యుత్తమమైన త్యాగం ఏమిటంటే — ముక్తికోసం సర్వసంగపరిత్యాగం చేసే సన్న్యాసిది. ఏలనంటే—"

"దీని కేదైన కథ ఉన్నదా శాస్త్రుల్లుగారూ?" అన్నాను, ఉండబట్టలేక.

కథమాటకు వస్తే—కథా ఉన్నది!—దీనికి కాదు గాని—అయితే వినండి చెబతాను.

౨

సుమారు యిప్పటికి రెండువందల ఏళ్ల క్రితం సంగతి.

ఆకాలంలో రాఘవరాజుగత్తర అని ప్రజలు భయంతో చెప్పుకుంటూ ఉండేవారు. మొన్నమొన్నటిదాకా వీరాపురంలో ముసలివాళ్లుకూడా ఒకమారు ఈ రాఘవరాజును తలుచుకొని భీతావహులవుతూ

వుండేవారు. రాఘవరాజు అనేకధైర్యశాలి ఏకులంవాడో తెలయదు. ఏఊరివాడో తెలియదు, కాని తనవంటి ధైర్యసాహసాలు కలిగినటువంటిన్నీ, తనవలె బలాఢ్యులైనటువంటిన్నీ జట్టీలను యాభైమందిని పోగుజేసికొని అదునుచూచి గ్రామాలమీద పడి దోచుకొంటూ వుండేవాడు. ఆకాలపు రాజులకు అట్టి దోపిళ్లు తెలియనే తెలిసేవికావు. ఒకవేళ తెలిసినా వాళ్లు ఏమీ చేయలేక పోయేవారు. ఏలనంటారా — దొరతనము వారి సిబ్బంది ఒకతట్టునుంచి వస్తే రాఘవరాజు మరొ యింకోతట్టుకు పారిపోయేది.

నానాటికీ రాఘవరాజుతొందర ఎక్కువైపోతోంది. ఏవిధంగానైనా యితగాడిని రాజసైన్యముచేత పట్టిద్దామన్నా అతగాడి నివాసము కొండలలో.

కొండలలో ఒకకోట కట్టుకొని ఆకోటలో తానూ తనసహచరులూమాత్రము ఉంటూండేవారు. వారికి కుటుంబా లున్నవో లేవో, ఒకవేళ ఉంటే అవి ఎక్కడ ఉంచబడ్డవో ఎవరికీ తెలియదు.

ఈరాఘవరాజుతొందర తట్టుకోవడం చుట్టుపట్టులనున్న గ్రామాలకు చాలాకష్టమౌతూ ఉన్నది. ఉన్నధనమూ, బట్టలూ, జవాహరీ భోషాణాలలో దాచుకొన్నా లాభం లేకుండాఉంటున్నది. పెరళ్లల్లో పాతినా లాభములేకుండాఉంటున్నది. కోటలవంటి యిళ్లల్లో కాపురముండే మోతుబర్లచేతికిచ్చి దాచిపెట్టమన్నా లాభములేకుండా ఉంటున్నది.

ధనము పోతేపాయె. అతగాడు పెట్టేబాధలు సహించడం బహుకష్టంగా ఉండడంవల్ల గ్రామస్థులకు ఏమిచేయడానికీ తోచలేదు. తాము పన్నులు చెల్లిస్తున్నప్పటికిన్నీ, తా మెన్నిమారులో మొరపెట్టుకొన్నప్పటికిన్నీ తమ ఏలిక ఏమీ చెయ్యలేకుండా ఉన్నాడు. అతగాడిని అని లాభం లేదు కదా! ఇక చేయవలసిం దేమిటి?

అన్నా గ్రామాలలో ఉండే పెద్దలందరూ సమావేశమయ్యారు. కర్తవ్యమాలోచించారు. తమ యేలికకు పన్ను లిచ్చేబదులు ఈ రాఘవరాజుకే ఏటేటా పన్నులు చెల్లిస్తూ ఆయన్నే తమయేలికగా ఏర్పాటు చేసుకొంటే తమకు ఇంతే ధన నష్టమున్నా ఉండదు. బాధలున్నా ఉండవు. క్లేశమున్నా ఉండదు.

అయితే అందుకు రాఘవరాజు సమ్మతిస్తాడా? దేశాలు దోచుకొనే దొంగ అనిపించుకోవడంకన్న గ్రామాలనుండి పన్నులు వసూలుచేసుకొంటూ, అందుకు ప్రతిఫలంగా గ్రామస్థులను రక్షించుకొంటూ, రాజచిహ్నములు ధరించి ఏలిక అని అనిపించుకోవడముకు అతడు సమ్మతించడా?

ఈయేర్పాటులో మరిన్నీ మరివక చిక్కు ఉన్నది. అదేమిటంటే తమ్ము యింతవరకున్నూ పాలిస్తూన్నఏలిక, తమకు పన్నులు చెల్లించడం లే దనే కారణంవల్ల ఈ గ్రామాలమీదికి దండెత్తివచ్చి ధ్వంసము చేస్తే అప్పుడు చెయ్యవలసిన దేమిటి? ఈరాఘవరాజు గత్తరకన్న ఆయేలిక దండయాత్ర బహుక్రూరముగా ఉండవచ్చు. చెప్పరాని బాధలు అప్పుడూ అనుభవించవలసిఉండవచ్చు. ధనప్రాణమానముల కప్పుడునూ అపాయము కలుగవచ్చు. అయితే దీనికి ఉపాయమేమిటీ?

తమ యేలిక తమ్ము శిక్షించవలె ననే క్రోధముతో ఒకవేళ దండెత్తివస్తే తమ గ్రామాలను కాపాడే బాధ్యత రాఘవరాజే వహించవలసిఉంటుందనిన్నీ, అట్టిబాధ్యత వహించే పక్షమందే అతగాడికి తాము పన్నులు చెల్లించవలసి ఉంటుందనిన్నీ వారు నిర్ణయం చేసుకొన్నారు.

అందుకొరకై రాఘవరాజుతో రాయబారాలు నడపడమునకై గ్రామస్థులలో కొందరు పెద్దలు ఏర్పాటైనారు. ఈరాయబారము బహుప్రమాదకరమైన కార్యము. ఏమంటారా? తా నెంతసాహసవంతుడైనా, ఎన్ని ఊళ్లు తాను నిరాఘాటంగా దోచుకొంటూ ఉన్నా, తన కెంతబలగం ఉన్నా రాఘవరాజు నిరంతరమూ భయముతోనే మెలగుతూఉండేవాడు. ఏమూలనుంచి ఏసైన్యము వచ్చిపడుతుందో, తనపై కసితీర్చుకోవడానికి గ్రామస్థులు ఎట్టికుట్రలు పన్నుతున్నారో. ఏచెట్టువెనక ఏశత్రు వున్నాడో, ఎక్కడ గోయ్యో, ఎక్కడ నుయ్యో — అని అతగాడిభయం.

ఈరాయబారకార్యాన్ని అతడు కుట్రగా భావించి రాయబారులనందరినీ అతడు చంపివెయ్యవచ్చు. లేదా వారి నాకొండలలో బంధించవచ్చు. వారిని చిత్రవధ చేయవచ్చు. ఏమిచేసినా చేయదగ్గవాడేగదా!

ఇట్టిసందర్భంలో రాయబారం నడపదలచుకొన్న గ్రామపెద్దలు ప్రాణాలకు తెగించియే ఈకార్యానికి పూనుకొన్నారని వేరే చెప్పనవసరంలేదుగదా!

ఆటవికులవల్లనూ, చారులవల్లనూ గ్రామస్థులు రాఘవరాజుకోట, కొండలలో ఎక్కడ వుండేదీ తెలుసుకొన్నారు. రాయబారులు భత్యాలు మూటకట్టుకొని ప్రయాణం సాగించారు. గుట్టలు దాటారు, సెలయేళ్లు దాటారు. కొండలు దాటారు. ఎక్కడా మనిషిఅలికిడి లేదు. జంతుసంచారాలూ లేవు పక్షులుమాత్రం అక్కడక్కడ దృగ్గోచర మయ్యేవి.

నిర్ధారణగా రాఘువరాజుకోట యిక్కడ వున్నదని తమకు చెప్పేవా రెవరూ లేరు. స్వతంత్రముగా తెలుసుకొనేప్రయత్నములు విఫలమౌతూన్నవి. ఆనాటిసాయంకాలం ఒక కొండప్రక్కనే విశ్రమించవలె ననుకొన్నారు. అక్కడ సెలయేరు ఉన్నది. విశ్రమించడానికి ఎత్తైన బండ లున్నవి. మృగభయము ఉంటుందనే అనుమానం తోస్తే నెగళ్లు పెలిగించుకోవా లనుకొన్నారు. ఈవిధంగా ఆలోచించుకొంటూ మూటలు దింపుకొంటూ ఉంటే — పదిమందిసాహసులు ఎక్కడినుంచో వచ్చి వాళ్లని బాధించారు. వాళ్ల మొలల్లో కటారులు దోపుకొన్నారు. చేతుల్లో కత్తు లున్నవి. గిరజాలజుట్లు. చల్లాడాలు తొడుక్కొన్నారు. వాళ్లు మాట్లాడలేదు. రాయబారులచేతులు వెనకకు విరిచికట్టివేశారు. కళ్లు కనిపించకుండా గట్టిగా గుడ్డలతో బిగించారు. వాళ్ల మూటలు వాళ్ల భుజాలకు మళ్లీకట్టివేసి వాళ్లను నడిపించుకుపోయారు.

రాయబారులకు సగము ప్రాణాలు పోయినవి. కాళ్లతో తడుముకొంటూ, రాళ్లూ, పేళ్లూ పాదములకు తగిలినప్పుడు తూలుతూ పడుతూ, కొమ్మలు మొహాలకు తగిలినప్పుడు బుర్ర వంచుతూ నెమ్మదిగా నడుస్తూపోయారు. ఎప్పటికి ఈబాధ అంతమౌతుందో

తెలియలేదు. తాళ్లుపట్టుకు వాళ్లు నడిపించుకు పోతూనే ఉన్నారు. వీళ్లు వాళ్లననుసరించి పోతూనేఉన్నారు.

"ఎవరు నాయనా, మీరు? నిరపరాధులను మమ్ము యీవిధముగా యేల బంధిస్తిరి? మీవల్ల వచ్చిన అపరాధమేమిటి?" మమ్మల్ని యిట్లా చేయడంవల్ల మీకు వచ్చే లాభం ఏమిటి? అని అన్నాడు రాయబారులలో ఒక్కడు.

సమాధానం లేదు.

సూర్యు డస్తమించాడో లేదో తెలియదు. ఎండుటాకుల చప్పుడుతప్ప మరేశబ్దమూ వినబడ్డం లేదు.

నెమ్మదిగా నడిచి వెళ్లుతూ ఉండగా ముందు నడిచేవాళ్లు ఆగినట్లు రాయబారులకు తోచింది. వాళ్లూ ఆగారు. వాళ్లను ఎత్తి గాడిదల మీద వేసి కట్టిపెట్టినట్లు వాళ్లు గుర్తించారు. గాడిదలు ఎంతసేపో నడచినవి. ఏదిక్కుగా నడచినవో ఎంతదూరము నడచినవో వాళ్లకు ఆనుపానులు చిక్కలేదు. ఎప్పటికి యీ యాత్ర అంతమునకు వస్తుందో వాళ్లకు గోచరించలేదు.

* * *

చేతులకట్లు విప్పారు. కళ్లకట్లు విప్పారు. చేతులు స్వాధీనమునకు రాలేదు. మొద్దుబారినవి. అంతా చీకటిమయం. నిలబడ్డచోటనే నిలబడిపోయారు.

కొంతసేపైనతర్వాత వాళ్లకు ఒక కొండ వంటి పదార్థం కనిపించింది. నిదానంగా చూడగా అది కొండలమధ్య కట్టిన యిల్లని వాళ్లు గుర్తించారు. ఆయింట్లోకి రాయబారులను వాళ్లు తీసుకుపోయారు. అక్కడ వాళ్లను వదలి వెళ్లిపోయారు. విస్మయము, భయము, ఆశ, నిరాశలమధ్య ఊగులాడుతూ వాళ్లు ఆరాత్రి ఆకొండ యింట్లో కలతనిద్రపోయారు.

తెల్లవారింది, అడవిపక్షులు కిలకిలలాడుచున్నవి. వాళ్లు కళ్లునులుముకు లేచారు. కాలకృత్యాలు తీర్చుకొన్నారు. కర్తవ్యం ఆలోచిస్తూఉండగా ఇద్దరు ఆజానుబాహులు వచ్చి వాళ్లను రమ్మని సైగచేశారు. రాఘవరాజుసమక్షానికి తీసుకుపోయారు. అది కొండగుహ అయినప్పటికీ చాలా విశాలంగా ఉన్నది. మంచములు, పరుపులు, దిండ్లు, పీకిదోనెలు వగైరాసామానులు గుహానిండా ఉన్నవి. రాఘవరాజు ఒకపరుపుమీద దిండు నానుకు కూర్చున్నాడు. ఆజానుబాహువు. వర్చస్వి.

రాయబారులు చేతులు జోడించి ఎదుట నిలువబడ్డారు. వారిలో నాయకుడు ముందుకువచ్చి యీరీతిగా విన్నవించుకొన్నాడు. "మహాప్రభూ! తమకీర్తి దిగంతవిశ్రాంతము; తమసాహసపరాక్రమములు అర్జునుణ్ణి మరపునకు తెస్తవి. తమహృదయము దయార్ద్రము. మహాప్రభూ! మేము తమదర్శనం చేసుకొని తమతో ఒక్కమాట మనవిచేసుకోవలెనని వస్తూఉండగా ఈపుణ్యాత్ములెవరో తమసమక్షానికే మమ్మల్ని తీసుకువచ్చారు. వెదుకబోయినతీగ కాళ్లకే తగిలింది. ఆడబోయినతీర్థ మెదురైనది. శకునములు మంచివైనవి. తాము ఉదారులు. మా కార్యము తమవల్ల కాకపోదు మహారాజా!"

"ఎవరు మీరు? ఏమిటి మీ కార్యం?"

"తాము పాలించే గ్రామాలలో నివసించే బీదగ్రామస్థులము మేము, మహారాజా!"

"మేము ఎట్టి గ్రామములూ పాలించడం లేదే!"

"తమరు పాలించడానికి సమర్థులై ఉండిన్నీ, సాహసవిక్రమాస్యులై ఉండిన్నీ, రాజనీతిపారంగతులై ఉండిన్నీ ఎందువల్లనో యథాక్రమంగా గ్రామాలను పాలించక పోవడం యదార్థమే కావచ్చు, మహారాజా! కాని మేము మాత్రము—యాభై గ్రామముల కాపురస్థులము, మీకు సమీపమందుండే గ్రామాలలో నివాసం చేస్తూన్నవాళ్లము, తమరినే ధర్మప్రభువులనుగా ఎంచుకొంటూ తమరే మా యేలికగా భావించుకొంటూ ఉన్నాము, మహారాజా! కాబట్టి తమరు మాకు ఏలికగా ఉండి, మావల్ల తాము పన్నులు గ్రహిస్తూ, మమ్మల్ని రక్షించేభారం వహించరా మహాప్రభూ?"

"అందుకా మీరు వస్త?"

"చిత్తము, మహాప్రభూ!"

"మీ యేలికకు పన్నులు చెల్లించకుంటే అతనివల్ల మీకు ఉపద్రవము సంభవించదా?"

"తమరి అండ జేరిన మాకు ఎట్టిఉపద్రవాలూ సంభవించవని మా ధైర్యం. తమరు నిజముగా విజృంభిస్తే తమపరాక్రమును ఎవ్వరు తట్టుకోగలుగుతారు, ధర్మప్రభూ!"

రాఘవరాజు వారు చెప్పినమాట లన్నీ విన్నాడు. తన సహచరులతో ప్రసంగించాడు. ఇటువంటి తరుణం పోగొట్టుకోవడం మంచిది కా దనుకొన్నాడు. ఈ రాయబారములో మోసము లేదని తేల్చుకోవడమునకున్నూ, గ్రామస్థుల సద్భావమును పరీక్షించడమునకున్నూ, తాను ఏలిక అయ్యే పక్షమందు తన పదవిని దృఢపరుచుకోవడమునకున్నూ కొన్ని షరతులు ఏర్పాటు చేశాడు. ఆ షరతులప్రకారం వారు నడచే పక్షమందు తాను వారి ఏలికగా ఉండి ఎట్టి ప్రమాదములూ గ్రామములకు రాకుండా కాపాడతానని చెప్పాడు. తక్షణం యాభై గ్రామాలవారూ తనకు ఆయేటిపన్నులు చెల్లించడం మొదటి షరతు. గ్రామముల లోఉండే పురుషులలో యుక్తవయస్సు వచ్చినవా ళ్లందరూ తనవద్ద తరిభీతుపొంది అవసరమైనప్పుడు తనకు యుద్ధకార్యములలో సహాయము చెయ్యాలి.

ప్రాకారము, బురుజులు, కందకము మొదలైనవాటితో అతనికి ఒకకోట అనువైన తావున గ్రామస్థులే కట్టించవలెను.

ప్రతిగ్రామమునకున్నూ ప్రాకారములు, బురుజులు, కందకములు ఆగ్రామస్థులే కట్టుకోవలెను.

ఈషరతులు రాయబారులు వప్పుకొన్నారు. రాయబారులను గౌరవించి, బహూకరించి, కొంతవరకూ తనమనుష్యులను తోడుయిచ్చి వారిని సాగనంపించాడు రాఘవరాజు.

౪

రాఘవరాజుకు మొదటిదఫా పన్నులు చెల్లినవి. గ్రామస్థులు సద్భావముతో ప్రవర్తిస్తున్నారని అతడు గ్రహించాడు. తాను తనఅనుచరులతో తనస్వాధీనమం దుండే గ్రామాల నన్నింటినీ చూచినాడు. గ్రామ

స్థులను పునర్గొల్పి ప్రతిగ్రామమునూ ఒక చిన్న కోటగా మార్చివేసినాడు. అన్నిగ్రామములలోను గరిడీ లేర్పాటుచేసినాడు. యుద్ధపరికరాలు చేయించినాడు. యుక్తవయస్సు గల పురుషు లందరిని కూర్చి సైన్యము తయారుచేశాడు.

అన్ని గ్రామాదులకూ అందుబాటుగా ఉండగలందులకున్నూ, రక్షగా ఉండగలందులకున్నూ, తాను తనప్రజలు కొందరితో నివసించగలందులకున్నూ ఒకకోట కట్టడానికి అనువైన స్థలము నిర్ణయము చేశాడు.

కంటకబాధ తీరినందుకు ప్రజలు సంతోషించారు కాని తమ మొదటి యేలికనుండి ఎట్టి చిక్కులు వస్తవో అని భయపడుతున్నారు. ఆభయమున్నూ రాఘవరాజు తీర్చినాడు. ఆఏలికతో తాను రాయబారాలు నడిపాడు. కప్పము కొంత తాను క్రమముగా చెల్లించడానికి వప్పుకొన్నాడు. తాను సామంతరాజుగా ఉండుటకు అంగీకరించమని కోరాడు. యీభైగ్రామములవారూ తనచెప్పుచేతులలో ఉండుటకు అంగీకరించారనిన్నీ, తనద్వారా వారిసేవ ఏలిక పొందవచ్చుననిన్నీ నచ్చచెప్పాడు. ఇట్టితగాణము పోగొట్టుకొంటే ధన, ప్రాణముల కపార నష్టము సంభవించగలదనికూడా సూచించాడు. ఎన్నడూ సక్రమముగా పన్నులు వసూలుకాని కారణముచేత ఆయేలిక యీ యేర్పాటులకు వప్పుకొన్నాడు. గ్రామస్థులు సంతోషించారు.

* * *

"అయితే భైరవశాస్త్రులుగారూ—ఈకథలో త్యాగమనేది ఆరాయబారులు చేసినట్లా యీ రాఘవరాజు చేసినట్లా మీ అభిప్రాయ మేమిటి?" అన్నాను. వేళ అతిక్రమిస్తోంది. కళ్లు బరువెక్కుతున్నాయి. ఎంతకీ కథ ముగియడంలేదు.

"మళ్లీ తొందరపడుతున్నావప్పా, విశ్వం? జరిగినకథలో లేదు త్యాగం. ముందు వస్తోంది — కథ కావచ్చిందిలే —" అన్నారు భైరవశాస్త్రులుగారు.

"చిత్తం — కానియ్యండి."

* * *

౫

పూర్వకాలాల్లో రాజులకు కోట కట్టవలసివస్తే అది నరబలిలేకుండా జరిగేదికాదు. కోటకు సౌభాగ్యము, దేశమునకు కల్యాణము యీ నరబలివల్లనే చేకూరగలవని ఆనాటినమ్మకం. రాఘవరాజుకోట చురుకుగా తయారవుతోంది. ప్రాకారాలు లేచినవి. కొంతవరకు కందకములు తవ్వడమైనది. కందకములకు నీరు కొండసెలలనుంచి తీసికొని వచ్చుటకు కాలవలు తవ్వుతున్నారు. మూడు దిక్కులా మూడుబురుజులు తయారైనవి. నాల్గవదిక్కున బురుజు కట్టవలసి ఉన్నది. అక్కడే, అది కట్టుటకు ముందుగానే నరబలికూడా జరగవలసిఉన్నది. నరబలికోసమని బలవంతాన మనుష్యులను తీసుకురావడం ఆనాటి ఆచారము కాదు. ఐచ్ఛికముగా ధైర్యోత్సాహములతో ఎవ్వరైనా అట్టి బలికి సంసిద్ధులు కావచ్చు. అట్టి బలిలో ఆధైర్యవంతులు దేశసేవ చూడవచ్చు. అట్టి బలిలో వారు మోక్షము చూడవచ్చు. దేహమును బలియిచ్చినంతనే, దేశకల్యాణము, ధర్మస్థాపన, మోక్షము కలుగునని నమ్మకమున్నప్పుడు దేహాభిమానులు

కానివారు యిట్టి నరబలి కియ్యకొందురంటే ఆశ్చర్య మేమిటి? ఇట్టి ఆశయములకే ఎందరో కాలములో దేహత్యాగం చెయ్యడంలేదు? నాల్గవబురుజు కట్టి ప్రాకారము పూర్తిచేయవలసియున్నది. బురుజకు పునాదులు నరదేహముమీదనే పడవలెను.

నరబలికి ముహూర్త మేర్పాటైనది. బురుజుకు పునాదులకొరకై పెద్దగొయ్యి తవ్వినారు. ఆగోతిలో ముత్తైదువులు పసుపూ కుంకుమ చల్లినారు. పెద్దలూ పిన్నలూ స్త్రీలూ పురుషులూ ఆబాలగోపాలమూ ఆగోతిలో — పళ్లో, బట్టలో, నాణెములో, పసుపో కుంకుమో, పువ్వులో ఏదోఒకటి వేస్తూవచ్చారు. ముత్తైదువులు మంగళహారతి పళ్లెములు పట్టుకొని గోతికి కొంతదూరముగా నిలబడ్డారు. మేళతాళాలవాళ్లు వారికి ముందుగా నిలబడ్డారు. గోతిచుట్టూ వీరపురుషులు పునాదరాళ్లగగ్గిర నిలబడ్డారు.

ముహూర్తం సమీపిస్తోంది. ఎవరు నరబలికి ఆముహూర్తకాలానికి సరిగా వచ్చి ఆగోతిలో దూకుతారో తెలియడంలేదు. వ్యగ్రోత్సాహులై అశేషజనమూ కనిపెట్టి చూస్తూ ఉన్నారు. వారిఉత్సాహములో భయమూ, జాలీ, ధర్మబుద్ధీ తాండవమాడుచున్నవి.

ముహూర్తం సమీపిస్తూన్నది.

దూరమున ఒక చక్కని స్త్రీ కన్నులనుండి బాష్పములు జారుచున్నవి. పసుపు రాసుకొన్న మొహమైనప్పటికి వెల్లదనము కనిపిస్తోంది. ఆమెకు ఎదురుగా నిలబడ్డా డొకపురుషుడు. కండలు తిరిగిన శరీరం. ఆమె ఆ శరీరానికి పసుపు కలిపిన మంచిగంధం పూసింది. ఆపురుషుని మెడలో మందారపుష్పమాల వేసింది. అతడు ఆమె చేతులు పట్టుకున్నాడు. దిగులు పడవద్దని అతని కళ్లు ఆమెతో చెప్పినవి.

ఆమె అతనిభార్య! అతడు బలియగుటకు — దేశక్షేమమునకై, ధర్మమునకై బలి అగుటకు ఆమె సమ్మతించింది. కడసారిమాటు ఆమె నతడు చూచాడు. తల తిప్పుకొన్నాడు. ఆమె చేతులు వదలినాడు. హుంకారము చేస్తూ గోతివైపు అతడు దూసికినాడు.

ఆమె అక్కడనే నిలిచియున్నది. ఆమెదృష్టి అతనిమీదనే నిలిచియున్నది. ఆమెకు రెప్పపాటు పడలేదు. దేహము కదలలేదు. సీత్కారశబ్దము ప్రజలు విన్నారు. ఒక్కమారు అతనికేసి చూచారు — "హరహర శంభో" — ఒక్కమారు కోటికంఠాలు గొంతుకలలోనుంచి బయలువెడలింది. తూర్యనాదాలు చెలరేగినవి. స్త్రీలూ పురుషులూ అతని మెళ్లో పుష్పమాలలు వేస్తున్నారు అతనికి కొత్తబట్టలు కప్పుతున్నారు. ముత్తైదువులు కర్పూరాలు వెలిగించి మంగళహారతులు పాడ మొదలుపెట్టారు.

ఆమె అక్కడనే నిలిచియున్నది. ఆమెదృష్టి అతనిమీదనే నిలిచియున్నది. ఆమెకు రెప్పపాటు పడలేదు. దేహము కదలలేదు.

వీరహుంకారాలు, తూర్యనాదాలు, హరస్మరణలు, మంగళహారతులు — ఈఘోషలో ఆవీరపురుషుడు "శంభో" అని ఉచ్చస్వరముతో అర్చి ఒక్కగంతు వేసి గోతిలోకి దుమికాడు సరిగా ముహూర్తకాలముకు. చుట్టూ నిలిచిన పురుషులు పునాదిరాళ్లు గోతిలోకి తోశారు. వాద్యఘోష మిన్ను ముట్టుతున్నది. రాళ్ళతో గోయి

నిండింది. "హర, హర, శంభో" దిక్కులు నిండింది.

ప్రజ లింటిముఖము పట్టారు. బురుజు కట్టుటకు పనివాళ్లు అప్పుడే పూనుకొన్నారు. క్రమ క్రమంగా జనసమ్మర్దం తగ్గింది. కాని —

ఆమె అక్కడనే నిలిచియున్నది. ఆమెకు రెప్పపాటు పడలేదు. దేహము కదలలేదు.

రాఘవరాజు నరబలిచూచాడు. ప్రజల ఉత్సాహము చూచాడు. ఆవీరుని ధైర్యసాహసాలు మెచ్చుకొన్నాడు. ప్రజలు యిండ్లకు వెళ్లడం చూచాడు. అందరూ యింటికిపోయినా ఒకస్త్రీ మాత్రం కదలక మెదలక ఒక్కచోట నిలబడిఉండడం ఆతడు గ్రహించాడు. కారణము తెలుసుకొందామని ఆస్త్రీని సమీపించాడు. అత డామెను చూచాడు. ఆమె అతన్ని చూడలేదు. పలకరించాడు. మాటాడలేదు. భయపడి తిరిగి వెళ్లిపోయాడు. ఆరాత్రి అక్కడ కాపలాఉంచాడు. మర్నాడు మళ్లీ వచ్చి చూచాడు. అక్కడ స్త్రీవిగ్రహం లేదు. స్త్రీప్రతిమ ఉన్నది. అక్కడ ఆమె నిలిచియున్న తావుననే; ఆమెకళ్లే; ఆమె దేహమే; ఆమెముఖమే; ఆమెయే.

ఆమె అక్కడనే నిలిచియున్న ట్లున్నది. ఆమె దృష్టి అతనిమీదనే నిలిచియున్నట్లున్నది. ఆమెకు రెప్పపాటు లేదు.

ఒక్క కలికాలఖండములో, ఒక్క సతి, ఒక్కనాటిలో, శిలాప్రతిమగా మారి తన సతీత్వమును ఘనీభవింపజేసింది.

ఆనాటినుండీ ఆశిలాప్రతిమను ప్రజలు పూజిస్తూ ఉండేవారు.

రాఘవపాలెం జమీందారుగారి కోటదగ్గిర యీ శిలాప్రతిమ నేడుకూడా మనము చూడవచ్చు. కాని మన మది శిల్పి మలిచిన విగ్రహ మనుకుంటాము.

రాఘవపాలెంజమీందారుగారు రాఘవరాజుగారి సంతతివారేలని చెప్పకుంటారు. ఈ మధ్య వారికి "రాజా" అనేబిరుదు దొరతనమువా రిచ్చేరని వదంతి.

* * *

"అయితే భైరవశాస్త్రులుగారూ — అతగాడు చేసినత్యాగం సాత్విక రాజస తామసాల్లో ఏదిగా ఎన్నుకోవలసిఉంటుందండీ" అన్నాను లేచి.

"అబ్బాయీ, విశ్వం, అతగాడు చేసిన త్యాగం గొప్పదైనా అంతకన్నా గొప్ప త్యాగం చేసిన అతనిభార్యసంగతి ఎత్తుకోవేమి ?"

"చిత్తం. ఆమాట నిజమే. — ఇక సెలవిప్పిస్తారా?"

"మంచిది. త్యాగ మన్నప్పుడు అంతకు మించినత్యాగ మెక్కడా నాకు కనిపించ లేదుసుమా!"

"చిత్తం సెలవు."

క వి హృ ది

కొమరవోలు వెంకటసుబ్బారావు

రాజాధిరాజశౌర్యకుటీరకోటీర
　ముక్తామణిద్యుతిఁ మునిఁగి తేలి,
ఘనతరద్రవిణాధికారదూరత్వోజి
　హీర్షాభిమానంబు సీసడించి,
దుర్వారదారిద్ర్యదుఃఖఝంఝూవాత
　బలవద్ధతుల నెల్లఁ జులుకఁ బుచ్చి,
నిబిడశార్వరఘటాకబళితప్రజ్ఞావి
　కస్వరజ్యోతినిఁ గలుగఁ జేసి,
దివిజకవిగుండియలుగూడ దిగ్గురనఁగ
సలుప నేరిచి యాత్మవిశ్వాసపుష్టి
నుబికి, యేపారి, పొంగారు నో కవీంద్ర!
హృదయమా! యిదె నా నమస్కృతిశతమ్ము.

కమనీయరమణీయకళ్యాణకల్యాణ
　భూరిరాసులు కుప్పఁగూర లయ్యె,
నాహావానాహాత్రోత్సాహసాహసులైనఁ
　గుక్కవడి కుసుల్లుగూలనయ్యె,
భాషాదరిద్రాణపాషాణనిద్రాణ
　శరచిత్తములును బల్చనగ నయ్యె,
నవసాహితీతటిన్నవనటీపటలంబు
　మొలిచి గొండిలియాట లలవరించె,
నతఁడు చేసాచి, యడిగిన యట్టి చోట,
నతఁడు వేసారి, కినిసిన యట్టి గడియ,
నతఁడు హృదయమ్ము విప్పించి నట్టి యెడల,
నతఁడు పరికించి నడచిన యట్టి బాట.

బమ్మెరవారింట భారతీదేవి తాఁ
　బనికత్తెగా నొప్పుకొనిననాఁడు,
భీమన్న యాకు విప్పిన నవ్వడికి గంగు
　కుందేటిపిల్లయై క్రుంగునాఁడు,
అవచి కప్పలి జోగు లల కస్తురపుఁ దిప్ప
　లేడుగీవులనుండి యెత్తునాఁడు,
చనుబాల రంగరించిన శౌర్యరస ముగ్గు
　వెట్టి బిడ్డలఁ దల్లి పెంచునాఁడు,
ఆంధ్రకవిరాజు ధాటికి నాగ లేక
కంచు ఢక్కలుగూడఁ జెక్కలగునాఁడు;
హారువు మెఱసిన కవిహృదయమ్మ యిదియె
భక్తి నొసఁగెడు నా నమోవాకశతము.

చికిలి చేసిన బాకు చివరతోఁ దులఁదూఁగెఁ
　బైఁడిగంటపు జగా పనితనమ్ము,
చక్రవర్తుల భుజాస్థలితోఁ జెలిమి చేసె
　నాకు వట్టిన వాని యందఱమ్ము,
అభియాతినిశితసాయకముతో జోడయ్యెఁ
　బడఁతి దిద్దిన చిన్ని పసపుముద్ద,
క్రొందమ్మి చూలి పల్కులతోడ నుద్దించెఁ
　గవిగాఁడు పల్కిన కసరు నుడులు,
అట్టి పుణ్యదినమ్ముల యనుభవముల,
నా మహాపురుషుల జీవితాంశములను,
దలఁచికొన్నంత మేనెల్లఁ బులకరించు,
సురిగిపోయిన ప్రాణముల్ దిరిగివచ్చు.

* *

కుమారసంభవములోని కొన్ని అపపాఠములు

యన్. వెంకటరమణయ్య

కుమారసంభవమున కొన్నియెడల నపపాఠములు గానవచ్చెడిని. ఇందు కొన్నింటికి ముద్రాపకులు కారకులు. మఱికొన్నింటికి వ్రాతప్రతి వ్రాయసగాండ్రు కారకులు. అపపాఠము లేకారణమున గ్రంథమునకు బ్రాకినను, వానిమూలమున గ్రంథము పెక్కుతావులయందు దురవగాహమగుచున్నది. ఈయపపాఠములను దిద్దుకొన్ననేగాని పెక్కుపద్యములకు అన్వయము కుదురదు. కవిభావము తెల్లముగాదు. ఈక్రింద నట్టియపపాఠములను కొన్నిటి నుదాహరించుచున్నాను. వీటిని దిద్దునప్పుడు సాధ్యమైనంతమట్టుకు వ్రాతప్రతిపాఠమును ద్రోసిపుచ్చక దానినే సరియైనపాఠముగ నంగీకరించి తన్మూలమున పద్యముయొక్క వాస్తవార్థమును గ్రహింప బ్రయత్నము సల్పితిని[1].

౧. దక్షాధ్వరధ్వంసమున రుద్రగణముల కోడిపాఱిన యష్టదిక్పాలురపాటును వర్ణించుచు నన్నెచోడుడు వరుణునిగూర్చి ఇట్లు వ్రాసియున్నాడు.

గీ. ఉరుతరాబ్ధిసం డయ్యును నోడిపాఱె
వరుణుఁ డలుగుచు నుడికె దేవాంగువోలె
గలుము లెసఁగైన నేమియు నిలువ వనుట
దగుభయాతురుఁడై నోరఁ దడియులేక.

—కుమా, ౨-౨౦౭.

ఇది ముద్రితపాఠము. ఇందు పద్యము రెండవ పాదమును జూడుడు. వరుణుడు అలుగుచు దేవాంగు వోలె నుడికెను. 'దేవాం' గనగా ఉడుము అని కవిగారు అర్థము వ్రాసియున్నారు. వరుణుడు అలుగుచు ఉడుమువలె నుడికెను. అలుగుచు నుడికె ననుటచేత 'ఉడుకు' శబ్దమునకు 'తాపము జెందు' అని యర్థము చేసుకొనవలసి యున్నది. అయితే, 'ఉడుము'తో వరుణుని నుపమించుటకు కారణ మగపడదు. 'ఉడుము'లకు గోపముతో నేడ్చుట స్వభావమా? ఉడుముశాస్త్రవేత్త లీవిషయమును నిర్ణయించవలసియున్నది. వ్రాతప్రతియందు 'దేవాంగు' అన్నమాట లేదు.

'వరుణుం డలంగుచు నుడికె వాంగువోలె'

అని యుం దున్నది. ఇచ్చటిమాట 'వాంగు' (వాఁగు) కాని 'దేవాంగు' కాదు. 'వాఁగు' అనగా 'సెలయేఱు'. మొదటిపాదమును దిలకించిన 'వాగు' శబ్దప్రయోగమునకు గారణము బోధపడగలదు. వరుణుడు ఉరుతరాబ్ధిసుడు. అబ్ధులు 'వాఱు', అనగా ప్రవహించుస్వభావముగలవి కావు. పాఱెడుస్వభావము లేని యబ్ధులకు నాథు డయ్యును వరుణుడు ఆర్తధ్వని సేయుచు (ఘోషించుచు) వాగువలె పాఱెను (ప్రవహించెను). కావున నీపద్యద్వితీయపాద మిట్లుండి యుండును.

'వరుణుఁ డలఁగుచు నుడికెడువాఁగువోలె.' ?

౨. ఈశ్వరుడు పెండ్లికి తరలి యోషధీప్రస్థపురమునకు బోగా హిమవంతుడొనర్చిన మహోత్సవమును వర్ణించుపట్టు నీక్రిందిపద్య మిట్లు ముద్రితగ్రంథమున గానవచ్చుచున్నది.

1. ఈయపపాఠములను దిద్దుసందర్భమున కుమారసంభవపరిష్కర్తలగు శ్రీ మా. రామకృష్ణకవిగారి సాయమును బడసితిని. కొన్నిపట్ల వారు సూచించిన దిద్దుపాట్ల నంగీకరించితిని. ఓపికతో చర్చించి పలుమారు నాసందేహములను బాపినందుకు వారియెడ గృతజ్ఞుడను.

గీ. అప్పురమున వణిజ్జను లాపణములఁ
గలయఁ బచరించియున్న నిర్మలినరత్న
రాసు లొప్పె సుమావరురాక కర్థి
వలయ నెత్తిన వలపుదీవియలువోలె.

—కుమా, ౭ - ౪౪.

ఇందు చతుర్థపాదమున 'వలపుదీవియల' యౌచిత్యము విచారణీయము. 'వలపు' అనుమాటకు వాసన, కోరిక, కామము అనునూహార్థములు శబ్దరత్నాకరమున గానబడుచున్నవి. వీనియం దేయర్థమును నిచ్చట సరిపోదు. 'వలపుదీవియ'లను పాఠము తప్పు. రత్నరాసులను బచరించి దీవియ లెత్తిన ట్లొనర్చినవారు వణిజ్జనులు. వణిజ్జను లన పురుషు లనియే యర్థముచేసికొనవలయును. వారికి శివునిపై భక్తి గలుగవచ్చును. వలపునకు నెడము లేదు. మఱి, వ్రాతప్రతి పాఠము భిన్నము. అందు 'రాగదీవియ' లున్నవి. 'రాగ'మన వర్ణము. రత్నములు తొమ్మిదితెగలవి. ఒక్కొక్కతెగకును వన్నె వేరు. రాగదీవియ లనుటచే రంగులదీపములని కవిహృదయము. ఉత్సవావసరములయందు వన్నెవన్నెదీపముల నెత్తుట సామాన్యముగదా. కావున 'రాగదీవియలు' అనుపాఠమే సరియైనది.

3. హరువీర్యభారమును మోయజాలక డిగ్గజాఱిన వియద్గంగను వర్ణించుపద్యము ముద్రితప్రతియం దిట్లు గానవచ్చుచున్నది.

క. హరువీర్యము దాల్పఁగఁ గడు
భరమై వడి నడుమ డిగ్గఁబడి కడల ళ్లం
బరముదెస నిల్చి పొల్చెను
సురవాహిని బాలుఁ డున్న జోలెలువోలెన్.

—కుమా, ౧౦ - ౩౭.

"'కడలళ్లు' = తరంగసమూహములు" అని రామకృష్ణకవిగారు అర్థమును వ్రాసిరి. శబ్దవిచ్ఛిత్తి కడలు + అళ్లు: 'అడి' శబ్దమునకు బహువచనము 'అళ్లు, అడులు, అళులు, అళ్లు' అని.

ఇచ్చట సురవాహినినడుమ డిగ్గబడుటకును, కడలళ్లు అంబరముదెస నిల్చి పొల్చుటకును సంబంధమేమి? అట్లుండుటవలన సురవాహిని బాలుడున్న జోలెవలె నట్లాయెను? 'కడలళ్లు' అనుపాఠము కవిభావమును మరుగుపఱచుచున్నది. వ్రాతప్రతియందు 'కడలళ్లు' అనుమాట లేదు. అందు 'కడపళ్లు' అని యున్నది. 'కడపళ్లు' 'కడపల'కు బహువచనము. కడపల అనగా కొన లేక తుదిభాగము, అంత్యము. ఈమాటను తిక్కనసోమయాజిగారు ప్రయోగించి యున్నారు.

చ. ఎడఁ గొలిపోని వేసవల
రేఁగెడిరి సొంపున నంతికంతి -
కక్కసమదంబు వేర్మి రతి
కోర్కులు కొమ్మలు నీవ నప్పు-
ప్పాత నలిఁ గేరినట్టుల ని
భుండును వారిజపత్రనేత్రయుం
గడపలలేని కేలితమ
కంబున నుల్లము లుల్లసిల్లఁగాన్.

—నిర్వ. ఉత్త, ౮ - ౨౩.

పై కుమారసంభవ పద్యమున 'గడపళ్లు' అనునదియే సరియైన నిక్కపుపాఠము. 'కడలళ్ల'ని మార్చవలసిన యవసరము లేదు.

హరువీర్యభారముచే వియద్గంగాప్రవాహము మధ్యమున డిగ్గబడినది; అనగా, క్రిందికి వ్రుసంగినది. కొనలు రెండును అంబరమున నిలిచినవి. అమరగంగావాహిని యొక్క కొనలు, అనగా నాద్యంతములు ఆకాశమున నంటుకొనియుండగా మధ్యభాగము హరువీర్యభారముచే నధోముఖముగ జాఱినది. బాలురకై కట్టుజోలె రెండుకొనలు దూలమునకో లేక చెట్టుకొమ్మకో కట్టబడియుండ మధ్యభాగము క్రిందికి వ్రేలుచుండును. కావుననే హరువీర్యభారముచే నడుమ డిగ్గబడిన సురవాహిని బాలుడున్న జోలెతో బోల్పబడినది. 'కడల'ళ్ళను 'కడప'ళ్లని దిద్ది చదువుకొన్న పద్యమునకు అన్వయము చక్కగా కుదురును.

౪. తారకుడు దేవదూతను శిక్షింపదలకొన నింద్రుడతని వారించుచు నిట్లు పలికెను.

క. వీం డేమి సేయుఁ బంచిన
వాం డుండఁగ నిక్కమునకు వధ్యుఁడుగా నా

ఖండెలుఁడు గాక యేలిన
వాం దుండఁగ నేమి సేయు పరికర మనిలోన్.
—కుమా, ౧౦-౫౨౦.

వ్రాతప్రతియందు తృతీయ చతుర్థపాదము లిట్లు లేవు—

ఆ| ఖండెలుఁడుగాక యేసిన
వాం డుండగ నేమి సేయు వరకర మనిలోన్.

'వరకరము' అనునది 'వరశరము' అని యుండవలయును. 'ఏయు' క్రియా శరప్రయోగమును సూచించుచున్నది; కావున,

'యేసిన| వా డుండఁగ నేమి సేయు వరశర మని లోన్' అనుట యొప్పును. విలుకాడు బాణమును శత్రులపై నేసినట్లు, ఇంద్రుడు, దూతను తారకాసురుని కడ కంపెను. దూత బాణమువంటివాడు. తనంతట వచ్చినవాడు గాడు. వానిని శిక్షించుట పైదగిలిన బాణమును విఱుచుటవలె నిష్ప్రయోజనమైనపని. కావున, వానిని వదలి వాని నంపిన ఇంద్రుని శిక్షించుట తగవు అని తాత్పర్యము.

౫. మఱియు, కుమారుని పీఠియందలివీరుల బిరుదువాక్యములను వర్ణింపుపట్టున నీ క్రిందికంద మగపడుచున్నది.

క. ..... చుఁ జాగియు
నే ననియ తలంచు లోభి యొప్పఁడు ననికిన్
జా ననియె తలఁచు వీరుఁడుఁ
జా ననియ తలంచుఁ బంద సరియె ట్లగునో.
—కుమా, ౧౧-౬౧౪

ఈ పద్యమున నష్టభాగమును ఉద్ధరించి పద్యమును పూర్తిచేయవచ్చును. ఇందు చాగి, లోభి, వీరుడు, పంద వీరినలుగురి తలపులు సమానములు. అవి యెట్లు సమానమగును ? అని కవి పృచ్ఛించుచున్నాడు. మఱియు వీరుడును పందయు 'జానని తలం చెదరు' అని వారితలంపులను కవి యెఱుకపఱచుచున్నాడు. తక్కిన ఇద్దఱితలంపులును నట్టివిగానే యుండవలయును. ఇంతే కాదు; ద్వితీయ తృతీయ చతుర్థపాదములకు 'ననియ తలచు' అనుపదము సామాన్యము. ప్రథమపాదమందలి క్రియాపదమునకు గడపటియక్షరము 'చు' అని నష్టశేషమైన పాదభాగమువల్ల దెలియుచున్నది. కావున ప్రథమపాదమందలి క్రియాపదముసైతము 'తలచు' అనుట నిశ్చయము. క్రిందిపూర్వపాదములయందును 'ననియ(యె) తల(ం)చు' అని యుండుటచేత ఇచ్చటను 'ననియ తలచు' అని యుండుననుట యొప్పును పై జెప్పిన నలుగురితలంపును సామాన్యమగుటచే వారు నలుగురును 'చాననియ' తలతురని యనుకొనుట యసమంజసము గాదు. కావున పద్య మిట్లుండవలయును.

క. చాననియ తలఁచుఁ జాగియుఁ
జా ననియె తలంచు లోభి; చనునపు డనికిన్
జా ననియె తలఁచు వీరుఁడుఁ
జా ననియ తలంచు పంద సరియె ట్లగునో.

౬. దేవదానవయుద్ధమున శరహతి దెగినశిరములు భువిపై ద్రెళ్లినరీతిని సోముఁ డీ క్రిందిపద్యమున వర్ణించుచున్నాడు:

క. ఎగయు శిరంబులు నభమున
దొగఁ ద్రెమ్మెడు రక్తజలము లొలుకుచు భువిపై
మసడఁ బడుఁ జూపెఁ గడురం
సుగ నోలిన రాటనమున సుండ్రెలుపోలెన్.
—కుమా, ౧౧-౪౫౪.

ఈపద్యములోని 'రాటనము' 'సుండ్రెలు' అను మాటలకు రామకృష్ణకవిగారు 'రసముతీయు యంత్రము', 'త్రిప్పెడు పైసందు' అని టీక వ్రాసియున్నారు. కాని, తిరుగుడుసుండుతో గూడిన రసముతీయుయంత్రమునకును శరహతి బడెడిని వ్రాలు శిరంబులకును నెట్టి పోలిక గలదో తెల్పరైరి. వ్రాతప్రతియందు చతుర్థపాద మిట్లున్నది.

రం| గ్గంగ నోలిన లాటనమున సుండెలువోలెన్.

'లాటనము' తప్పు; రాటన మనియే సవరించవలయును. సవరణచేసి చతుర్థపాదము నిట్లు పఠించవలయును.

రం|సుగ నోలిన రాటనమునఁ గుండెలువోలెన్.

రాటనము = నూతినుండి నీటిని తోడెడు చక్రము. కుండలు త్రాటికి గట్టి చక్రమున కనుసంధించి యుండును. చక్రము తిరుగగా కుండెలు వరుసగా నూతినీటిలో మునిగి, జలభరితములై క్రమముగ పైకి, చక్రోపరిభాగమునకు వచ్చినపుడు నీటిని బయట గుమ్మరించును. అట్లే శరహతి ద్రెస్సినశిరములు వరుసగా మొదట పై కెగసి, రాటనబద్ధములైన కుండెలు జలమును గుమ్మరించినరీతిని రక్తమును కార్చుచు క్రిందబడును.

శ్రీ రమణమహర్షి

పి. గణపతిశాస్త్రి

౧

ఓ యుగవల్లి చిరదిస
శ్రీప్రఫుల్లమనుజముకుళ !
ఓ పృథివీగళిత శాంత
స్వర్లోకోద్యానవకుళ !
ఓ అరుణాచల శిఖరాం
చలనృత్యద్దివ్యదీప్త !
ఓ అరుణేశ్వర దేవళ
ఘంటాగంభీరమూర్తి !

౨

పదనినాద పతదహీన
మానవసామ్రాజ్యభవన,
మాయాబర్హాంచితకర,
కాలదివ్యలాస్యేందిర,
క్షుభితనృత్తగతుల మాని,
స్తిమితనయనముద్ర బూని
నిశ్చల నీరాజనమున
నిలిచెను నీ సమ్ముఖమున !
నీరాజనసంప్రఫుల్ల
హారమౌక్తికసుమమ్ముల !

౩

కాలస్త్రీపదహతములు
గోళవహ్నికందుకములు,
చిరయుగ శతసహస్రముల
విరతిరహిత గతిశతముల
దిరిగి, తిరిగి, తిరిగి, తిరిగి,
చరణకిరణశాంతి నాగి,
నిల్పె నీసమాధి దివ్య
దీపావళి సాంధ్యవేళ
నీ యనంతవిశ్వగేహ
దేహళికాదీపమాల !

౪

కుపితపన్నగోర్ధ్వఫణా
కులజిహ్వాచంచలములు
సాయంప్రజ్వలితారుణ
సంధ్యాహోమాగ్నిశిఖలు,
భవన్నయన దేవళగ
ర్భాలయశాంతాంతరాళ
వేదికలం దరుణకాంతి
దీపిక లర్పించువేళ,
గోవులచల కర్ణమ్ముల,
నిర్నిమేష నీలాక్షుల,
నీ దృగంతరాళ విశ్వ
నీరవ జీవితరహస్య
మరసి, యరసి, కనుగొలుకుల
గురియును ప్రమోదాశ్రుల ;
నోరుల జారిన నెమరుల

తృణకణములు మెల్లమెల్ల,
మందమందనిశ్వాస వి
మలవాత నిహతుల రాల !

౫

నీ ప్రశాంతనయనయుగళ
నిశ్చల నీలాంచలముల
నీలినిదురతెర మెలమెల
మెలకువ తొలగించువేళ,
సుప్రభాత లక్ష్మీనయ
నప్రవేశ హర్షవేళ,
పిచుకలు "కలకల" రవముల,
"తురుతురు" మను నునురెక్కల,
చివురుల "తళతళ" మెరపుల,
జారుపసిడి వరివెన్నుల
పరువు లిడును ; భవదుటజ
ప్రాంగణమున పాపలవలె !
అమరాంజలిహర్ష గళిత
హైమవవర్ష ధారలవలె !

౬

సాయంప్రాతస్సంధ్యల
సర్వాశ్రమ వృక్షరాజి,
ఛాయాసాష్టాంగనమ
స్కృతి నొనర్చు మౌనపూజ ;
పూర్వపశ్చిమాశాంతర
సర్వదేశశిష్యసమితి,
నిలుచు విస్మృతాత్మాంతర
వినమితోత్తమాంగవినతి !
మహారాజరాజసుతులు,
మహితత్విడ్జ్వాలాగ్రస్తులు,
నీకరుణాశ్రమగభీర
నిశ్చలకాసారాంతర
జలముల, నిశ్శబ్దగతుల
నిలుతురు చిరుమీనులవలె !

౭

లేదు నీకు జీవనదీ
చరమారుణ మరణసంధ్య !
లేదు నీకు రోగజరా
భైరవ నరలోకరథ్య !
యాతనాజలూకలచిర
పీతగళద్రుధిరధార,
దూరాశా బహువిహంగ
మారవశ్రుతాశ్రుధార,
నీరవశోకము లోకము
నిలిచెను క్రీనీడవిధము !
భవదున్నత మహశ్శిఖర
భయసమర్పితాలోకము !

౮


ఏ నవలోకమున మధుర
పుణ్యతూర్యనాదలవమొ !
మానవలోకమున జనుల
వీనులబడి మ్రోయు నేడు !
తారాతారాంతరగత
తమోయవనికాంతరమున !
విద్యుచ్చలకేతులలిత
వియదుచ్చరథాంతరమున !

౯

జగదర్ణవతీరకలుష
సుఖదుఃఖతరంగఘోష,
మత్తవివిధమతభీషణ
భేరీవాదన ఘోషణ,
అంతరహిత శాంతిహీన
లోకాన్వేషణరోదన,
భవ "దాత్మవిచార" నవ్య
భవ్య శంఖనాదహతికి,
శాంతసుప్తవిశాల ని
శ్శబ్దతాంబరమున మునిగి,
ఆనందమహోదయోత్స
వాహ్వానమె మ్రోయునేమొ!!

౧౦

పశ్చిమదిగ్భవనాంగణ
భయదయుద్ధ భేరీధ్వని,
పూర్వదిక్కుటీరోదర
దరిద్రక్షుధార్తధ్వని,
కలచు మాహృదర్ణవాల
భయబడబానలజ్వాల;
లోకశోకభారవినత
నయనకరుణబాష్పవర్షి!
భారతచిరపుణ్యఫలిత!
ఓ రమణా! ఓమహర్షి!
నీ మహదోంకారదివ్య
హైమవల్లకీనిసదము,
మామనుష్యలోకాంధగు
హాముఖమున వర్షింపుము!





పూజారి

బి. రంగరాథ్

ఇందలిపాత్రలు

౧. పూజారి.
౨. ఖైదీ.
౩. మాధవుడు — పూజారినౌకరు.
౪. సబ్ ఇన్స్పెక్టరు.
౫. పోలీసు జవాను.
౬. గంగ — పూజారి వితంతుసోదరి.

దృశ్యం

[పూజారిఇంట్లో ఒకగది. అందులో ఆడంబరమైన వస్తువు లేవీ లేవు. తూర్పుదిక్కొకటీ, పడమటిదిక్కొకటీ, రెండువాకిళ్లున్నవి. ఒకకిటికీకూడా వుంది. కిటికీ సమీపంలో ఒకచాప వేసివుంది. దానిపక్కనకొన్నిపుస్తకాలూ వ్రాతపరికరాలూ వున్నవి. ఒకమూల వెండి దీపస్తంభం వుంది. గూట్లో ఉసురుదీపం వెలుగుతూ వుంటుంది. గంగా మాధవులు కనబడతారు. మాధవు డొకమూల ఇనుపపొయ్యిమీద హల్వా తయారుచేస్తూ వుంటాడు.]

గంగ— మాధవా! హల్వా ఇంకా తయారుకానట్టుందే?

మాధ— చిత్తం

గంగ— నీచిత్తం చిమిడిపోనూ? అటు చూడు. పొయ్యి బాగా మండటం లేదు.

మాధ— మీరేగదండీ! పొయ్యి రాజేసిందీ?

గంగ— మాటకి మాట ఎదురుచెప్పటం బాగా నేర్చుకునిపోతూవు. మొద్దువెధవవు.

మాధ— చిత్తం. చిత్తం.

గంగ— సగంరాత్రి కావొచ్చింది. బయట మొహంమీద కొడితే కానరావటం లేదు. చలి విపరీతంగా వుంది. అన్నగారింకా రాలేదు. ఎక్కడికి వెళ్లిందీకూడా తెలియదు. నాకు భయమేస్తోందిరా!

మాధ— చిత్తం.

గంగ— అన్నగారు వెళ్లేటప్పుడు నాతో ఏమయినా చెప్పుకున్నారా?

మాధ— లేదండీ!

గంగ— మరి తా నెక్కడికివెళ్లేదీ నీతో చెప్పలేదూ?

మాధ— చెప్పారండీ!

గంగ— (చేతులు త్రిప్పుతూ హాస్యంగా) అయితే, తా మాసంగతి ఇంతవరకూ నాతో చెప్పారుకారేమండీ?

మాధ— అధికప్రసంగం చెయ్యొద్దని మీ రీవుదయం నన్ను మందలించారు. అందువల్ల ఏసంగతికాని మీ రడిగనిదే చెప్పకూడ దనుకున్నాను.

గంగ— (మాధవుడి చెవిపట్టుకుని) అలాఅయితే ఇప్పు డడుగుతున్నాను చెప్పు. ఊ...తొరగా.

మాధ— (విడిపించుకుని) మాఅమ్మను చూడ్డానికి వెళ్లారు.

గంగ— ఎందుకూ?

మాధ— 'మీఅమ్మ దేహస్థితి ఎలావుం' దని అయ్యగారీవేళ నన్నడిగారు. నేను ఎంతమాత్రం బాగా లేదని చెప్పాను. ఆమాట వినడంతడవుగా అయ్యగారు బయల్దేరారు

గంగ— అయ్యగారిసంగతి తెలిసివుండికూడా అలా ఎందుకు చెప్పాలి? బాగుందని చెప్పకూడదూ?

మాధ— హల్వా తయారయిందండీ.

గంగ— దించివెయ్యకుండా ఇంకా చూస్తా వెందుకురా? గాడిదా! (మాధవుడు హల్వాపాత్రను దించ

దానికి ప్రయత్నిస్తాను.) ఉండండి అలా కాదు; కింద పడవేస్తావు. జాగ్రత్త. నేనే దించేస్తాను. నీవు వెళ్లి ఆ పన్నీరుబుడ్డి ఇలా పట్టుకునిరా.

మాధ— (తటపటాయిస్తూ) ఆ స.. రాబుగారు.

గంగ— సరాబువా డేమిటి? నీ మొహం. నీ అవివేకానికితోడు చెముడుకూడా సంప్రాప్త మయినట్టుంది.

మాధ— పన్నీరుబుడ్డి అమ్మకమయిందండి!

గంగ— అమ్మక మేమిటి? నీకు మతిపోతోంది

మాధ— అయ్యగారు నిన్నమధ్యాహ్నం పన్నీరుబుడ్డి నాచేతి కిచ్చి సరాబు పాపయ్యకు విక్రయించమన్నారు. నేను విక్రయించి, డబ్బుతెచ్చి అయ్యగారి కిచ్చాను.

గంగ— నీలాగే మీ అయ్యగారుకూడా వొట్టి . . మీ అయ్యగారికి ఇప్పుడు డబ్బుతో ఏమంత అవసరమొచ్చింది?

మాధ— డబ్బు అవసరం అయ్యగారికి కాదండీ! మా ముసలిముండకి.

గంగ— రోగంతో చస్తోన్న ముసలిముండకి డబ్బెందుకురా?

మాధ— పాలుమాలడంవల్ల ఈమూడు నెల్లనుండీ ఇంటి బాడుగ ఇచ్చుకోలేక అవస్థపడుతోంది మాఅమ్మ. నిన్నటిరోజు ఇంటియజమాని అరిచి ఇల్లు వెళ్లగొట్టడానికి తయారుపడ్డాడు. ఆసంగతి అయ్యగారి కెలాగో తెలిసి ఈవాళ డబ్బు పట్టుకుని వెళ్లారు.

గంగ— వల్లమాలిన పరోపకారం! సంసారమంతా కొల్లబెడుతున్నాడు. ఇంట్లోవున్న డబ్బే గాకుండా కుర్చీలూ— బల్లలూ— మేజాలూ మాయమయినవి. ఇప్పుడు పాత్రసామానుకి వొంతొచ్చినట్టుంది. నాడబ్బుకాస్తా లేకపోతే ఈపాటికి అయ్యగారిబండారం బయటబడివుండేది. ఇలా ఖర్చుపెడితే అదిమాత్రం ఎన్నాళ్లుంటుంది? అయ్యో! దేవుడా! నా కెంతదురదృష్టం తెచ్చిపెట్టావు దేవా! (ఏడుస్తుంది)

మాధ— (చేతులు నలుపుకుంటూ) నా కింతగా తెలిసి వుంటే.. .. .. ..

గంగ— తెలిస్తే ఏడ్చేవాడివిట కాబోలు! నిన్ను చూస్తే నాకు అరికాలిమంట నెత్తికెక్కుతోంది. పో. ఇక్కడనుండి. [illegible] కనుక్కునిరా, [illegible] ఉన్నావు.

మాధ— చిత్తం. చిత్తం.

[[illegible] పూజారి లోపలికి వస్తాడు.]

పూజా— ఇక్కడ ఎంత వెచ్చగా వుంది! బయట చలిగాలిలో తిరిగితేగాని లోపలగల ఈ వెచ్చదనంలోని ఆనందం అనుభవించలేము

[గంగ అతని దుస్తులు విప్పడానికి సాయపడుతుంది. మాధవుడు తలవొంచుకుని నిలబడతాడు.]

గంగా! నీ విందాకా ఏదో కేకలేస్తున్నావు మాధవు డేమీ తప్పుచేయలేదుగదూ?

గంగ— లేదు. లేదు. కాని..... .....

పూజా— మాధవా! నీ యింటికి వెళ్లు. మీఅమ్మకి కాస్త నయంగా వుంది. డాక్టరుగారిని ప్రతిదినం చికిత్సచేసేలాగ ఏర్పాటు చేశాను. తొరగా వెళ్లిపో. మీఅమ్మ నీకోసం కాచుకుని వుంటుంది.

[మాధవుడు వెళ్లడానికి తలుపుతీస్తాడు చలిగాలి జోరుగా లోపలికి కొట్టుకుంది.]

పూజా— మాధవా! కాస్త ఆగు. ఈశాలువ కప్పుకో. చలిగాలి విపరీతంగా వుంది.

గంగ — దున్నపోతులా వున్నాడు. వాడికి చలీలేదు. గిలీలేదు. ఇదంతా నీపిచ్చి. కాకపోతే...

పూజా — చెల్లీ! ఊరుకో. బయటికి వెళ్లనిదే చలిబాధ ఎలా తెలుస్తుంది?—మాధవా! అలా సందేహిస్తా వెందుకూ? ఇదుగో! ఈశాలువ తీసుకో (ఇస్తాడు). ఇంక ఒక్కపరుగున వెళ్లు.

[మాధవుడు వెళ్లిపోతాడు.]

గంగ — అన్నయ్యా! నీమాటలంటా నాకు మనస్థిమితం లేకుండా పోతోంది. ఈ హల్వా తిను. ఇప్పటికే చల్లారిపోయింది. ఇంకా కాస్సే పుంటే బొత్తిగా చల్లారిపోతుంది (వేళా కోళంగా) చల్లారితేమట్టుకేం? నీకు చెడ్డవస్తువులుగూడా మంచివిగానే కనబడుతూవుంటవి.

పూజా — (హల్వా తింటూ) హల్వా చాలా రుచిగా వుంది చెల్లీ!

గంగ — మాధవుడితల్లికి జబ్బుగా వుండివోచ్చు. అయితే మట్టుకు ఆవిడకు ఈచీకట్లో, ఈ చలిగాలిలో నీవు వెళ్లవలసినంత తీవ్రంగా వుండదనే నానమ్మకం. నీచేత వూడిగం చేయించుకోడానికి ప్రతిఒక్కరూ ఇలాగే రోగం అభినయిస్తోంటారు. అందులో ఒక్కరుగూడా నీ ఆరోగ్యాన్నిగురించి ఆలోచించరు. పాడులోకం.

పూజా — గంగా! నీకు నామీద చాలా ప్రేమ. అందుకే అలా మాటాడుతున్నావు.

గంగ — నేనే లేకుంటే నీగతి ఈపాటికేమైవుండేదో? పాడుబడ్డకొంపల్లో చావడానికి సిద్ధంగావున్న ముసలిముండలకి సేవచేసుకుంటూ లోకుల వెక్కిరింపులకు లోనవుతుండేవాడివి. నీకేం తెలుస్తుంది ప్రపంచంసంగతి? పిచ్చి కోకరుచీ — పుట్టు కోకబుద్ధీ.

పూజా — వెక్కిరించేవాళ్లు అనుభవిస్తారు. నా కేం లోటుగనకా?

గంగ — ఈవేదాంతం నాకు సరిపడదు. ఇంకా కొద్ది రోజులు ఇలా జరిగితే ఇంట్లో చిల్లిగవ్వగూడా మిగలదు. నీ కీపిచ్చిచేష్టలు ఎంతత్వరగా మానుకుంటే అంత మేలు.

పూజా — ఆలోచించకుండా మాట్లాడుతున్నావు. తోడి మానవులకి నేను చేస్తోన్న ఉపకారం అత్యల్పం.

గంగ — అయితే, ఒకవైపు పరాయివాళ్లకి వుపకారం చేస్తూ, మరొకవైపు నీవంటే పంచప్రాణా లర్పించే చెల్లెల్ని ఉడికింపడం న్యాయమా అన్నయ్యా?

పూజా — (లేస్తూ) నేను నీకు కష్టం కలిగిస్తున్నానా? అలాఅయితే నీవు కూకలుపెయ్యడానికి కారణం నామీది కోపంచేతనే కాబోలు? సత్యం చెబుతున్నాను. నీమెత్తనిమనస్సుకి కష్టం కలిగించే వుద్దేశం నా కెప్పటికీ లేదు. నీవలా అనడంవల్ల నాకు ఏడుపువస్తోంది చెల్లీ!

గంగ — నీ కేడ్పు వస్తే నాకూ వస్తుం దన్నయ్యా! కూర్చో హల్వా చల్లారిపోతోంది.

పూజా — (కూర్చుంటూడు) మరి నీకష్టానికి కారణమేమిటో చెప్పావుకావు.

గంగ — చెబితేమాత్రం లాభమేమిటి నీవు బాసపడితా వన్న నమ్మకం బొత్తిగా లేనప్పుడూ? మధ్యాహ్నం పొరుగింటికి వెళ్లానో లేదో, అప్పుడే పన్నీరుబుడ్డిని బజార్లో అమ్మించావు.

పూజా — అవును. పాపం, నీవా పన్నీరుబుడ్డిని చూసుకుని చాలా మురిసిపొయ్యేదానివి

గంగ — మురిసిపోనూమరి? నాదగ్గర వుండేవస్తువుల్లో కల్లా అందమయిందీ, ఖరీదుగలదీ అది ఒకాటే.

పూజా — పన్నీరు ఇంకోబుడ్డిలో పోసుకోనూ లేదూ? చెల్లీ!

గంగ — అలాఅయితే రేపటినుండి భోజనపాత్రలేకుండా నేలమీద భోంచెయ్యవోచ్చు. ఆకాలంగూడా కలిసివస్తోందిలే, తొందరపడకు.

పూజా — నీకు విచారం కలిగించినందుకు నన్ను క్షమించాలి.

గంగ — మాట్లాడకు. ఇంకా మాట్లాడకు. ఈవాళ పన్నీరుగుబుడ్డి, రేపు మళ్లీ అవసరంవొస్తే ఆ దీపస్తంభమూ — నీ వ్యవహారం చూస్తే వొళ్లుమండుతుంది.

పూజా — కాదు ఆ దీపస్తంభాన్ని అమ్మడానికి వీలులేదు.

గంగ — ఎందుకు లేదూ? అది ఇంకొకరి ఇంటిబాడుగ చెల్లించడానికి పనికొస్తుంది.

పూజా — మంచిమాట. అమ్మ చనిపొయ్యేసమయంలో జ్ఞాపకార్థంగా ఆ దీపస్తంభం నా కిచ్చింది.

అందువల్ల దాన్ని సాధ్యమయినంతవరకూ ఇలాగే వుంచాలని నా వుద్దేశం. అయితే, ప్రపంచమంతా కోరే ఇలాంటి విలువగలవస్తువును మన ఒక్కరిసొత్తుగానే భావించడం తప్పనుకుంటాను.

గంగ— అన్నయ్యా! నీవు నా హృదయాన్ని ముక్కలు ముక్కలు చేసేస్తున్నావు. (శోకకంపితస్వరంతో) ఇంక నీమాటలు చాలించు. నిద్ర వస్తోంది. వెళ్లి పండుకుంటాను. (అలమారుకు తాళం తగిలించి తిరిగి వచ్చి) వెళ్లుతున్నా. పిచ్చిభావాలతో హెచ్చుగా మేలుకోవొద్దు. ఆరోగ్యం చెడుతుంది. ఇప్పటికే సగమైపోయావు. (వెళ్లుతుంది.)

పూజా— (కిటికీ దగ్గరికి వెళ్లి చాపమీదవున్న పుస్తకాల్లో ఒకటి తీసుకుని దీపస్తంభానికేసి చూస్తూ) చెల్లి బాగానే చెప్పింది. ఈ దీపస్తంభం తప్పకుండా ఇంకొకరిబాడుగ చెల్లించడానికి పనికొస్తుంది.

[దీపపువత్తిని కొంచె మెగదోస్తాడు. పక్క ఇంట్లోగడియారం పన్నెండుగంటలుకొడుతుంది. పూజారి పుస్తకం చదువుతూవుంటాడు. ఖైదీ మెల్లగాగదిలో ప్రవేశించి వెనకవైపునుండి పూజారిని పట్టుకుంటాడు.]

ఖైదీ— జాగ్రత! గోలచేశావంటే బుర్ర చిదకపొడుస్తాను. (మొల్లో బాకు తీసి చేత బట్టుకుంటాడు.)

పూజా— నేను చదువుకుంటూవుండడం కళ్లారా చూసికూడా మీ రిలా అనడం సబబుగా లేదు.

ఖైదీ— (కొంత హీనస్వరంతో) నా కిప్పుడు భోజనం కావాలి. మూడురోజులనుండి పస్తు. ఒకటే పస్తు. తొరగా భోజనం తీసుకునిరా. లేకుంటే......

పూజా—(నెమ్మదిగా) అయ్యా! తొందరపడకండి. మీ కిక్కడ కావలసినంతభోజనం దొరుకుతుంది. అలమారుతాళపుచెవి నాచెల్లెలిదగ్గర వుంది. వుండండి. తెస్తాను (లేస్తాడు.)

ఖైదీ— అక్కరలేదు. కూర్చో. నీవలలో పడడానికి నేను పిట్టను కాను. నీవు తాళంచెవికోసం వెళ్లడానికి కారణం నాకు తెలుసు. ఇంట్లోవాళ్లను లేపడాని కేఅపాయంలేని ఉపాయం పన్నుతున్నావు. నా కిప్పుడు కావలసింది తాళంచెవి గాదు. భోజనం కావాలి. అబ్బా! ఆకలి వజ్రకీటకం నా పేగుల్ని కొరికివేస్తోంది.

పూజా— (తనలో) గంగ అలమారుకు తాళం వెయ్యకుండావుంటే ఇప్పు డెంతో సముచితంగా వుండేది. (పైకి) అయ్యా! భయపడకండి. ఈ ఇంట్లో నేనూ, నాచెల్లెలూతప్ప మరెవ్వరూ లేరు.

ఖైదీ— నిన్నెలా నమ్మడం?

పూజా— ఇదేసంగతి మీతో ఇంతకుముందు చెప్పాను. ఇప్పుడు మళ్లీ చెబుతున్నాను.

ఖైదీ—(పూజారివైపు అదేపనిగా చూస్తాడు) ఖండిది. మోసంచేసే ఆయమ్మతల్లి వంటబెట్టుకుని వస్తేమాత్రం ఈబాకు నీనల్లగుండెను పెకలిస్తుంది. జాగ్రత్త!

పూజా— మీరు మాటిమాటికి సందేహపడవలసిన అవసరంలేదు. గంగా! గంగా!

గంగ—(లోపలినుండి) అన్నయ్యా!

పూజా— ఎవడో తెరువగాడు దోవతప్పి వచ్చాడు. ఆకలితో అల్లాడిపోతున్నాడు. ఇలా వొచ్చి భోజనం పెడితే నీకు చాలా పుణ్యం వుంటుంది.

గంగ— ఈ అర్థరాత్రివేళకూడా ఈబిచ్చగాళ్లబాధేనా? నా కేరాత్రి నిద్రపొయ్యే అదృష్టం లేనట్టుంది.

పూజా— ఏంచెయ్యాలి? వేళగానివేళ. ఇంకోస్థలానికి పొమ్మనడానికిగూడా వీల్లేదు.

గంగ— సరే వస్తున్నా. (గదిలోకి వొచ్చి దొంగచేతిలోవుండే బాకు చూసి భయంతో కొంత వనక్కితగ్గుతుంది.)

పూజా— భయపడకు చెల్లీ! వీరికి మనమంటే నమ్మకం లేదు. అందుకోసం...(చిరునవ్వు నవ్వును.)

గంగ— నాకు భయమేస్తోంది. (మెల్లగా) అన్నయ్యా! అడివిమృగంలాగ వీడు మనల్ని ఇలా ముట్టడించాడేం ?

ఖైదీ— తొందరగా కానివ్వండి. లేకుంటే మీ ఇద్దర్నీ చంపేస్తాను.

పూజా— గంగా! అలనూరు తాళపుచెవి నాచేతి కిచ్చి వెళ్లు.

[గంగ తాళపుచెవి ఇచ్చి తనగదికి వెళ్లబోతుంది.]

ఖైదీ— ఆగు నేను వెళ్లిపోయ్యేవరకూ, మీఇద్దరూ ఈగదిలోనే వుండాలి. నాఉత్తర్వు లేనిదే అడుగు అవతల పెట్టగూడదు.

గంగ— (పూజారివైపు చూస్తుంది.)

పూజా— అలాఅయితే వీరికి భోజనం వొడ్డించు, వచ్చి చాలాసేపయింది.

[గంగ పీటవేసి విస్తట్లో అన్నం వొడ్డిస్తుంది. ఖైదీ భోంచెయ్యడానికి కూర్చుంటాడు.]

ఖైదీ— ఇలాంటిభోజనం జైల్లో ఎప్పుడూ దొరకదు.

పూజా— జైల్లోనా?

ఖైదీ— (పప్పుఅన్నం కలిపి పెద్దముద్దలుచేస్తూ) అవును. జైలంటే ఏమనుకున్నావ్? (తలుపుకేసి చూస్తూ) ఆతలుపు అలా తెరిచివుంచావేం? ఎవరైనా రావడానికా? (అన్నంచేత్తోనే వెళ్లి తలుపుమూసి వస్తాడు.)

పూజా— చిత్తం. మీబోటివాళ్లెవరైనా రావాలనే వుద్దేశంతోనే ఆతలుపు నిత్యం తెరిచివుంచడం అలవాటు.

ఖైదీ— అలాగా? అయితే ఇప్పుడది మూయబడ్డది.

పూజా— (నిట్టూర్పు విడిచి) ఈనలభైఏళ్లలో ఇది మొదటిసారి.

[ఖైదీ తొందరగా భోంచేస్తాడు. ఆతొందరలో కొన్ని మెతుకులు కిందపడతాయి.]

గంగ— ఇల్లంతా అశుభ్రం చేసేస్తున్నాడు. వెధవ!

[పూజారి కిందపడ్డమెతుకులన్నీ ఏరి ఒక పక్కన పెడతాడు.]

ఖైదీ— నీకు దొంగలంటే భయంలేదూ?

పూజా— లేదండి! వాళ్లంటే నా కెంతో దయ.

ఖైదీ— దయ? హ్హా! హ్హా! హ్హా! (నీళ్లు తాగి చేతులు కడుక్కుంటాడు.) మంచిది. దొంగలంటే దయ! హ్హా! హ్హా! (ఉలిక్కిపడి) నీపే రేమిటి?

పూజా— పూజారి.

ఖైదీ— పూజారి? హ్హా! హ్హా! నీవు పూజారివి నేను దొంగను.

పూజా— మీ రిప్పటినుంచీ అలా వుండరని నా నమ్మకం. గంగా! నీవు వెళ్లిపో. వీరు నీకు సెలవిస్తా రనుకుంటాను

గంగ— నీవు వీడితో ఒంటరిగా...

పూజా— ఫరవాలేదు. వీరితో కొంచెం మాట్లాడవలసి వుంది.

ఖైదీ— (ఆవులిస్తూ) పొమ్మంటే అలాచూస్తా వేంకుహ? మొద్దా! వెళ్లిపో. నేను పూజారితో ఏకాంతంగా మాట్లాడాలి

పూజా— వెళ్లవమ్మా! (తలుపు తెరుస్తాడు. గంగ ఏదో గొణుక్కుంటూ తనగదికి వెళ్లిపోతుంది.)

ఖైదీ— (జోరుగా) నే నెవ్వరో నీకు తెలుసునా?

పూజా— తెలుసు. కొంతిమందికి దుఃఖం కలిగించిన వ్యక్తివి.

ఖైదీ— దుఃఖం? (సంభ్రమంతో) హ్హా! హ్హా! అది కేవలం పాతగాథ. అప్పుడు నేను మానవుణ్ణి. ఇప్పుడు ౧౫౭౩౮-వ సంఖ్యమాత్రమే. తొమ్మిదిసంవత్సరాల నరకవాసం నాఆత్మను హరించింది.

పూజా— నరక మెలా వుంటుందో చెప్పండి. వింటాను.

ఖైదీ— ఎందుకూ? (సందేహంతో) నీవు పోలీసువాళ్లకి పత్తా ఇవ్వదలుచుకున్నట్టుంది.

పూజా— అబ్బే! పోలీసువాళ్లకి నే నేమీ చెప్పను. నరకంసంగతి చెప్పడానికి మీమనస్సుకి కష్టంగా వుంటే తాత్కాలికంగా వదలిపెట్టండి. కాని, నరకంలో ప్రవేశించడానికి ముందు మీస్థితి ఎలావుండేదో చెప్పడాని కేమీ అభ్యంతరం వుండదనుకుంటాను.

ఖైదీ— నే నిప్పు డాసంగతి చాలామట్టుకు మరిచి పోయాను. అప్పుడు నా కొకచిన్న గుడిసె వుండేది. చుట్టూ పొరగాయలతీగెలు ప్రాకి వుండడంవల్ల అది ఎంతో మనోహరంగా వుండేది. అందులో ఒకమూల, బహుశా, అది నా పెళ్లాం రోగంతో మంచంమీద పడివున్న స్థల మనుకుంటాను. (ఆలోచించి) ఆ.. జ్ఞప్తి కొచ్చింది. నా పెళ్లాం రోగి. నేను పేదవాణ్ణి కావడంవల్ల దానికి పథ్యపానాదులు జరిపే స్థితిలో లేను. అందువల్ల దానిపరిస్థితి ముదిరి పోయింది. అవంతా చూసి నాకు ప్రాణంమీద రోతపుట్టింది. ఒకరోజు తెగించి అంగట్లో కొన్ని ఆహారవస్తువులు చోరీచేశాను. (ఏడుస్తాడు. పూజారి ఖైదీకన్నీళ్లు తుడుస్తాడు). అంగడివాడు నన్ను పోలీసువాళ్ల కప్పగించాడు. నేను చోరీచేసినకారణం వాళ్లకి తెలియజెప్పాను. వాళ్లు వినిపించుకోకుండా నన్ను కోర్టు కెక్కించారు. కోర్టులోగూడా సత్యం చెప్పాను. తత్ఫలితంగా నాకు పదిసంవత్సరాలు కఠినశిక్ష లభించింది. (వెక్కుతూ) జైల్లో కాలుబెట్టిన మూడోనాడే నాపెళ్లాం చనిపోయిందని తెలిసింది. (ఆవేశంతో) విచారించేదిక్కు లేకపోవడంవల్ల పురుగులుపడి చచ్చిందట నా పెళ్లాం (మళ్లీ ఏడుస్తాడు).

పూజా— మీకథ చాలా జాలికరంగా వుంది. నరకం సంగతి ఇంతకంటె హృదయ విదారకంగా వుంటుం దనుకుంటాను.

ఖైదీ— అవును. అక్కడ నన్ను అడివిమృగంలాగ బంధించేవారు. కుక్కను కొట్టినట్టు కొరడాతో కొట్టేవారు. ఉడికీఉడకని అన్నమూ, పురుగులుపడ్డ గంజీ నా కాహారంగా ఇచ్చేవారు. తత్ఫలితంగా నేనూ, నాఆత్మ వేరైపోయాము. ఒకరోజు యమదూతలు మామూలుమేరకు తమ మృగాన్ని బంధించడం ఎలాగో మరిచిపోయారు. మృగం తప్పించుకుని బయటబడింది. అది స్వాతంత్ర్యం పొందుస్వాతంత్ర్యం ఆకలితో అల్లాడి చావడాని కీస్వాతంత్ర్యం

పూజా— ఆకలితో చావడానికా?

ఖైదీ— అవును. నరకంలో వున్నంతసేపే వాళ్లు అన్నం బెడతారు. బయటికొస్తేమాత్రం ఆకలితో చావడంతప్ప వేరే గత్యంతరం చూపించరు. అంతే గాదు. బయటికి రావడంతడవుగా వాళ్లు నన్ను వేటాడుతోన్నారు. మూలమూలకీ తరిమి వేస్తున్నారు. ఇప్పుడు నాకు ఊరులేదు. పేరు లేదు. డబ్బు లేదు. కూలినాలి చేసుకుందా మంటే శరీరంలో తగిన శక్తిగూడా లేదు. పోనీ, తిరిపెమెత్తుకుని బ్రదుకుదామంటే బయట తిరగడానికి వీల్లేదు. ఇదీ నరకగాథ. పసందుగా లేదూ? (నీళ్లగ్లాసు ఖాళీచేస్తాడు.)

పూజా— అయ్యో! మీకు దుఃఖం ఎక్కువగా కలిగిన మాట వాస్తవమే. అయితే ఆశమాత్రం వొదలకండి! నేనుమీకు మేలుచేస్తాను.

ఖైదీ— ఆశ! ఆశ! హ్హా! హ్హా! హ్హా! (అట్టహాసం చేస్తాడు.)

పూజా— చాలా పొద్దుపోయింది. ఆ గదిలో మీపడక సిద్ధంగా వుంది.

ఖైదీ— అక్కరలేదు. నే నిక్కడే ఆ చాపమీద పండుకుంటాను.

పూజా— అలాఅయితే కప్పుకోడానికి దుప్పటి తెస్తాను. చలిగా వుంది.

ఖైదీ— సరేగాని ఇక్కడి కెవరయినా వొస్తే నాగతి ఏం కావాలి?

పూజా— ఇక్కడి కెవరూ రారు ఒకవేళ వొచ్చినా, మీరు నాస్నేహితులని చెబుతాను.

ఖైదీ— పూజారి......స్నేహితుడు. బలే బాగుంది.

పూజా— మీ రింక నిర్భయంగా నిద్రపోవొచ్చు. దుప్పటి తెస్తాను (వెళ్లుతాడు.)

[ఖైదీ చాపమీద పండుకుని పూజారి వెళ్లినవైపే చూస్తూవుంటాడు. అలా చూడడంలో అతని దృష్టి దీపస్తంభంమీద పడుతుంది. లేచి నలుమూలలూ చూసి దీపస్తంభం చేతబట్టుకుంటాడు.]

ఖైదీ — చాలా బరువుగా వుంది. వెండిదై వుంటుంది.

[బయట పూజారి అడుగుల శబ్దం అవుతుంది. తొందరలో ఖైదీ చేతిలో వున్న దీపస్తంభాన్ని జారవిడుస్తాడు. పూజారి లోపలికి వస్తాడు.]

పూజా — (జరిగిందంతా గ్రహించి) ఈ దీపస్తంభాన్ని మీరు చాలా మెచ్చుకున్నట్టుంది. అది మీ మెప్పుకు తగిందే కాని, ఈ చిన్న ఇంట్లో మాత్రం వుండతగింది కాదు. మా తల్లి జ్ఞాపకచిహ్నం కాబట్టి దీన్ని ఇలా వుంచవలసివొచ్చింది. మీ కింకా నిద్ర రాలేదా?

ఖైదీ — నిద్ర? హ్హా! హ్హా! మోసగాడా! నాతో నీ వింత మంచిగా ప్రవర్తించడానికి కారణం నాకు తెలియకపోలేదు.

పూజా — లేనిపోని శంకలు పెట్టుకోకుండా కాస్సేపు నిద్రపొండి.

ఖైదీ — నీవు నన్ను భ్రాంతిగా మార్చివెయ్యాలని చూస్తున్నావు. అది సాధ్యంగాని పని. నాకు పుణ్య ధర్మాలతో పనిలేదు. ప్రపంచమంటే నాకు చెడ్డ అసహ్యం.

పూజా — అయితే, ప్రపంచం మిమ్మల్ని అసహ్యించుకోనవసరం లేదు.

ఖైదీ — కాదు. కాదు. నీవు నాకోరకు చూపే శ్రద్ధ - దయ - వినయం - స్నేహం అన్నీ నిరుపయోగం. కేవల మొక పిశాచికోసం నీ విలువైన అమూల్యవస్తువుల్ని దుర్వ్యయం చేస్తున్నావు.

పూజా — క్షమించండి. దేముడి ప్రీతికొరకు, కర్తవ్యం కొరకు, తోడి మానవునికొరకు ఇలా చెయ్యవలసివచ్చింది.

ఖైదీ — నీ ధర్మప్రసంగాలతో నాకు పనిలేదు. నీ గదికి వెళ్ళి పండుకో. నే నొంటరిగా వుండాలి.

పూజా — చిత్తం

ఖైదీ — (తటపటాయిస్తూ) అయితే, ఈ గదిలోకి ఎవరూ రారని దృఢంగా చెప్పగలవా?

పూజా — ఆ సంగతి ఇంతకుముందే చెప్పాను మీరు స్వయంగా తలుపు మూసుకున్నారుగూడాను.

ఖైదీ — (తలుపును పరీక్షించి వచ్చి పూజారి చేతిలో వున్న దుప్పటి తీసుకుని) నీవింక పోవొచ్చు.

పూజా — మంచిది (పోతాడు).

ఖైదీ — (మళ్ళీ తలుపులోపలి భాగం పరిశీలించి) గొళ్ళెం లేదు. ఎవరైనా వచ్చారంటే గప్పకుండా పుట్టిమునుగుతుంది. ఆ దీపస్తంభాన్ని ఇంకోసారి బాగా చూడాలి. (దీపస్తంభాన్ని పైకెత్తి పట్టుకుని, తిప్పి తిప్పి చూస్తూ) వందకి తక్కువ చెయ్యదు. పూజారి తల్లి జ్ఞాపకచిహ్నమట ఇది. అయితే, నన్ను జైలుకు పంపేటప్పుడు ఆ పాడులోకం నా తల్లి నుగురించి ఆలోచించింది కాదు. ఈ పూజారిగూడా ఆ లోకంలో వాడే. (ఆలోచించి) అలా అనడానికి వీల్లేదు. ఇతడు కొంత మంచివాడిలాగే కనబడతాడు. నాలో ఏదో మార్పు కలిగినట్టుంది. కాకపోతే, పూజారి మంచితనం నాకెలా బోధపడుతుందీ? ఇప్పుడా మంచితనాలతో నాకు పనిలేదు. నాకు కావలసిందల్లా ఈ దీపస్తంభ మొక్కటే. దీన్ని తొరగా తీసుకుని వెళ్ళాలి. తెల్లవారేవరకూ ఇక్కడ వుంటే మళ్ళీ అతని వుపదేశాలు వినవలసి వస్తుంది. అప్పుడు నా హృదయం ఎలా మారుతుందో నాకే తెలియకుండా వుంది.

[దీపస్తంభాన్ని దుప్పట్లో చుట్టి చంకలో పెట్టుకుంటాడు. తర్వాత మెల్లగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోతాడు. కిటికీ తెరిచిన చప్పుడవుతుంది.]

గంగ — (లోపలినుండి) ఎవరదీ? ఎవరు? పలుకరేం? (గదిలోకి వచ్చి) ఇక్కడ ఎవరూ లేరే? (దీపస్తంభం వుండిన స్థలానికేసి చూసి) అమ్మయ్యో! కొంప మునిగింది. — అన్నయ్యా! నీ నిద్ర నీళ్ళపాలుగానూ, లేవవేం?

[ప్రవేశం: పూజారి]

పూజా — అమ్మాయీ! అలా కూక లేస్తున్నావెందుకూ?

గంగ — కూక లేస్తున్నానా చస్తున్నానా? ఆ దొంగముండాకొడుకు దీపస్తంభంతో గూడా పరారీ అయినాడు.

పూజా—(నిట్టూర్పు విడిచి) ఊరుకో అత డలాంటివాడు కాదు. ఏదో పొరబాటు జరిగివుంటుంది.

గంగ—ఇంకా పొరబాటేనా? నీఇల్లుబంగారంగానూ వెళ్లి పోలీసుస్టేషన్‌లో రిపోర్టుచెయ్యి.

పూజా—ఇందులో అతడి తప్పేమీలేదు. అతడికి ఆశ చూపించింది నేనే.

గంగ—ఆశా లేదు. గీశా లేదు. వొట్టి దొంగముండా కొడుకు. వాణ్ణి చూసీచూడకముందే నేనా సంగతి గ్రహించాను. అన్నయ్యా! కదలవేం? అయితే నేనే వెళ్లి రిపోర్టుచేస్తాను. (గంగ పోబోతుంది. పూజారి ఆపుతాడు.)

పూజా—మళ్లీ అతణ్ణి నరకానికి పంపడమా? అది అంత ప్రయోజనకారి గాదు. అతిడికి విధించవలసినశిక్ష వేరేవుంది. అది చాలాకఠినమయిన శిక్ష.—అయ్యో! దేముడా! (రెండుచేతులతో తల పట్టుకుంటాడు.)

గంగ—నీతెలివి తెల్లవారినట్టే వుంది. సొత్తు పోగొట్టుకోవడమేగాకుండా రిపోర్టు చెయ్యడానికిగూడా చేతగాక కబుర్లు చెబుతున్నావు. నీతో ఒక్క పనీగాదు. నేనే వెళ్లుతాను.

పూజా—గంగా! ఆగు. ఆదీపస్తంభం మొదట నాది. తర్వాత అతినిది. దానిఅవసరం నాకంటె అతినికే హెచ్చుగా వుండవొచ్చు. ఇందులో రిపోర్టుచెయ్యవలసిన వైపరీత్యమేముంది?

గంగ—ఏడ్చినట్టే.. ...

[బయట తలుపుతట్టిన శబ్దం.]

పూజా—ఎవరు వారు? నిరభ్యంతరంగా లోపలికి రావొచ్చు.

[సబ్ ఇన్స్పెక్టరు జవానుతోగూడా గదిలోకి వస్తాడు. వాళ్లమధ్య ఖైదీ వుంటాడు. ఇన్స్పెక్టరు చేతిలో దీపస్తంభం వుంటుంది.]

గంగ—(సంతోషంతో) ఆ. దొరికిపోయాడు. దొంగముండాకొడుకు వీణ్ణి ఎలా పట్టుకున్నారండీ?

సబ్—వీడు రోడ్డుమీదంబడి అనుమానాస్పదంగా పోతుంటే చూసి అనుమానంమీద అరెస్టుచేశాను. తర్వాత వీడు పూర్తీ, పేరూ సరిగా చెప్పలేకపోవడంవల్ల నా అనుమానం మరింత బలపడింది అదిగాక వీడిచేతావున ఈ వెండిదీపస్తంభం వొకటి దొరికింది. (గంగ దీపస్తంభం తీసుకుని పైటచెరగుతో గుడుస్తుంది.) ఈ దీపస్తంభం పూజారి గారిదని పూళ్లోవాళ్లు చెప్పడంవల్ల వీణ్ణి ఇక్కడికి లాక్కొచ్చాను. మాంగిసేమ. తప్పకుండా శిక్ష అవుతుంది.

[పూజారి ఖైదీలు పరస్పరం చూసుకుంటారు ఖైదీమొహంలో ఉద్వేగం కనబడుతుంది.]

పూజా—ఈ విషయంతో నా కేమీ అర్థంకావడం లేదు. ఇతను నా స్నేహితుడు.

సబ్—మీ స్నేహితుడా? నిజంగా?

పూజా—అవునండి! నిజంగా నా స్నేహితుడే. ఇతడు రాత్రి మాఇంట్లో భోంచేశాడు. ఆ దీపస్తంభాన్ని నేనే ఇతని కిచ్చి బహూకరించాను.

సబ్—(అపనమ్మకంగా) ఈ దీపస్తంభాన్ని మీరే ఇతనికి బహుమానమిచ్చారా? మీ మాటలు ఒహుచిత్రంగా వున్నవి.

పూజా—పూజారి ఎప్పుడూ అబద్ధమాడడు.

సబ్—ఉద్యోగధర్మంకాబట్టి అలా అడిగాను, క్షమించండి. మీసంగతి నాకు బాగా తెలిసేవుంది.

పూజా—అలాఅయితే అతణ్ణి విడిచిపెట్టండి.

సబ్—వీడిపూరూ పేరూ తెలిసేవరకూ అలా చెయ్యడానికి వీల్లేదు.

పూజా—నేను పూచీఇస్తాను.

సబ్—అక్కరలేదు. కేవలం మీమాటమీద నమ్మకంమీద వీణ్ణి విడిచిపెడుతున్నాను. మళ్లీ ఏదైనా తంటాచేశాడంటే మీ దాకా వస్తుంది. జాగ్రత్త.

పూజా—ఫరవాలేదు.

[ఇన్స్పెక్టరూ, జవానూ వెళ్లిపోతారు. కొంతసేపటివరకందరూ నిశ్శబ్దంగా వుంటారు.]

ఖైదీ— (కలనుండి మేలుకున్నవాడిలాగ) ఆదీపస్తంభాన్ని మీరే నా కిచ్చామని ఆయనకు అంతతో చెప్పారుకదూ? ఎంత గొప్పలినం?

గంగ— (దీపస్తంభాన్ని రెండుచేతులతో గట్టిగా గొమ్ముకొనిలాక్కొని) దొంగభడవా! తిన్న ఇంటికి వాసా లెంచేరకం నీది. కాకపోతే, మా ఇంట్లో అన్నం తిని మాకే ద్రోహంచేస్తావూ? అన్నమ్యాకు కోసంవొస్తుండని ఇంకా కావూరుకున్నాను. లేకుంటె ఇన్స్పెక్టరుతో వున్నది వున్నట్టుగా చెప్పి నీతాడు తెంచేదాన్ని.

పూజా— గంగీ! కోప్పడకు. పెల్లవారుజాము కావస్తోంది. వెళ్లి పండుకో.

గంగ— నేను వెళ్లను. ఈదొంగముండావాడివద్దర నిన్నొంటిగా విడిచివెళ్లడానికి నామనసొప్పడం లేదు.

పూజా— (తీవ్రంగా) నే నొంటరిగానే వుండాలి. అది నాఇష్టం.

గంగ— అంత కాదుపొమ్మంటే వెళ్లిపోతాను. అయితే ఈదీపస్తంభంమాత్రం నాతో వుండాలి.

పూజా— (మరింత తీవ్రంగా) వీల్లేదు. ఆదీపస్తంభం నాది. అది ఇక్కడే వుండితీరాలి

గంగ— (నిర్లక్ష్యంగా) అలా ఎంతమాత్రమూ జరగదు.

పూజా— (అధికారస్వరంతో) గంగా! నీకు పెద్దవాళ్లమీద బొత్తిగా గౌరవం లేనట్టుంది.

[గంగ దీపస్తంభాన్ని యథాస్థానంలో వుంచి విస విస వెళ్లిపోతుంది.]

ఖైదీ— (సిగ్గుతో) నే నింకా చావకుండా బ్రతికివుండడం నాకే ఆశ్చర్యంగా వుంది.

పూజా— ఇప్పుడైనా కాస్సేపు నిద్రపోండి.

ఖైదీ— నా కంత అదృష్టం లేదు. నే నీరాత్రే పాండుచ్చేరికి వెళ్లాలి. అది గొప్పపుణ్యస్థలం. ఈనరకమాతలందులో ప్రవేశించడానికి వీల్లేదు. అక్కడ నేను నిర్భయంగా తిరగవొచ్చు. మేకపోతును వ్రేలాడగట్టినట్టున్న ఈచీకటీ — ఎముకల్ని కొరికివేస్తోన్న ఈచలీ నాప్రయాణానికి తగినశకునాలు. బయలుదేరడానికి ముందు మీరు నన్ను ఆశీర్వదించండి. మీ ఆశీర్వాద బలం నాకు దారితోడుగా వుంటుంది.

[ఖైదీ తలవొంచుతాడు. పూజారి తన కుడిచేత్తో ఖైదీతలను స్పృశించి ఆశీర్వదిస్తాడు.]

ఖైదీ— (ఏదో చెప్పబోతాడు. మాట పెగలదు. పూజారికాళ్ళమీద బడతాడు.) అయ్యా! సెలవు. (తలుపువైపు పోతాడు.)

పూజా— కాస్త ఆగండి. మీసొత్తు నిక్కడే వదలిపెట్టి వెళ్లుతున్నారు.

ఖైదీ— (ఆశ్చర్యంతో) నే నీదీపస్తంభం తీసుకోవాలని మీకోరికగాబోలు?

పూజా— అవును. ఇది మీకు తప్పకుండా పనికొస్తుంది తీసుకోండి. (ఇస్తాడు) ఈ ఇంటికి వెనకవైపు కొస్తదూరంలో ఒక అడివిరస్తా వుంది. ఆరస్తానుండా వెళ్లితే, మీకు పోలీసువాళ్ల కంటబడకుండా గమ్యస్థానం చేరగలరు. వెళ్లండి.

ఖైదీ— (మళ్లీ పూజారికాళ్లబడి లేచి) నే నింతవరకూ అడివిమృగంలాగ సంచరించాను. అయితే మీరు మీప్రవర్తనవల్ల నాలో మళ్లీ మానవత్వాన్ని స్థాపించగలిగారు. నే నిప్పుడు పూర్తిగా మానవుడనైపోయాను.

[పూజారి దొడ్డివాకిలి తెరుస్తాడు. ఖైదీ వాకిట్లో నిలబడుతాడు.]

పూజా— (ఖైదీవీపు తట్టి) అయ్యా! ఈశరీరం పరమేశ్వరుని నివాసస్థానం అన్నసంగతి సదా జ్ఞాపకంవుంచుకోండి.

ఖైదీ— (ఆశ్చర్యంతో) శరీరం పరమేశ్వరుని నివాసస్థానం.. సరే! జ్ఞాపక ముంచుకుంటాను. (వెళ్లుతాడు.)

[పూజారి తలుపు మూసి పూజాగృహంలోకి వెళ్లిపోతాడు.]

(తెర)

(హిందీ నుండి.)

పూజాశిరీషాలు

మల్లవరపు విశ్వేశ్వరరావు

౧

ఆ సుందరిని నేను ప్రేమించాను.

ఆమెను ప్రేమించకపోతే, ఆమెను చూచినప్పుడల్లా నా తనువు పులకలు వేస్తుందెందుకు? నా ఆశయాలు ప్రొద్దుపొడుపు పువ్వుల్లాగ వికసిస్తాయెందుకు?

ఆమెవి విశాలనేత్రాలు. ఆకర్ణాంతాలు. ఆమె చెక్కిళ్లలో మావిచిగుళ్లు నవనవలాడుతాయి. ఆమె తొంగిలిరెప్పలందు నీలికాంతులు విశాలమైన స్వచ్ఛాకాశంలో నల్లనిమేఘాలు నర్తించినట్లు పరుగులిడతాయి.

ఆ కారుమేఘాల్లో ఆనందతటిల్లతలు నాట్యమాడ్డం లేదు నేటిదినాలు. ఏ యస్పష్టవేదనో కుంచుకుని కుంచుకుని నిశ్వసిస్తుంది. నా నవనీతహృదయం నిలువలేదు ఆ యస్పష్టవేదనా నీరవాక్రోశానికి. ఆ నిరాశా నిశ్వాసాల్లో ఆశాసౌరభాలు నా ప్రేమపుష్పం విరజిమ్మగలదా? నా సానుభూతిపరిప్లుతప్రణయాన్ని ఆదుఃఖపూరిత హృదయాని కెట్లందియ్యగలను?

౨

సాయంసంధ్యని గుబురుగుబురు చిరుచీకట్ల చెరగుల నొత్తిగించి మిసిమివెన్నెలలలో ఉదయించు అర్ధచంద్రుని చలువలతో లేచిన నా బాల్యజీవితం నేడు ఏ యింద్రజాలవశాన్నో నూతనరూపం దాల్చింది. ఇంతింతలుగ పెరిగి ఉదయగిరి మంటపమున మూర్తీభవించు ప్రచండారుణ సూర్యాతపమువలె తీక్ష్ణమగుచున్న నా ప్రేమతృష్ణ ఉష్ణోష్ణముగ పరిణమించుచున్నది. ప్రేమసంధ్యాయవనికను చీల్చుకుని యౌవనోదయకిరణములు తీగలుసాగుచున్నవి.

కైవారి సవితాంగణమున నవగానిజాగృతిశంఖవిరావాలు ఆ కమలినీకోరకాన్ని కళ్లు విచ్చమని ఆదేశిస్తాయి. నిద్రించే ఆమె ప్రణయసరోజముకుళము ఏవో నిశ్వాససౌరభాలతో రేకులు విగుస్తోంది. సగము తెరచుకున్న ఆ నవపద్మనేత్రాల్లో ఏవో వేదనాశ్రువు లింకను ఆరలేదు. వలపుమధువుల నింతింతలో ఆమెదరవికాసిత తృషితజీవితాన ఊరింపవా నా ప్రణయసూర్యతరుణ కిరణ చుంబనములు!

3

ఈ వసంతప్రశాంత ప్రభాతకాంతుల్లో ఆమె సుకోమలగాత్రాన ఆకుపచ్చని చేలాంచలములు చిగురుజెండాలవలె రెపరెపలాడుతున్నవి. సుకుమారభంగిమాన్ని వెలార్చి నిల్చిన ఆమెకు శ్రుతిపుటముల సోకి కోకిలకూజితము లానందసందేశముల ననుపుతున్నవి. కాని ఆమె విభ్రాంతనేత్రాల్లో ఇంకను వెరగుచూపు

లేవో విహ్వల పూర్వస్మృతులనే ప్రతిఫలిస్తున్నవి. విస్మయ సందేహా లేవో ఇంకను వ్యథిత పూర్వానుభవాలను విస్మృత దుస్స్వప్న రాశిలో విలుప్తము కాసియ లేదు.

కారుణ్యమూర్తి యగు ఆసువర్ణ లావణ్య విగ్రహాన్ని నా ప్రణయవిలసిత నవ యౌవనాంగణంలో పూజాశిరీషాల నర్పించి పునరుద్ధరించుకోలేనా ?

౮

కనికరము లేని ప్రపంచకంలో కష్టనిష్ఠురములు కోర్వలేని ఆబాలిక కారుణికహృదయము కైశోరమునందె దుఃఖాశ్రుపూరితమైంది.

చిగురుటాస లేవైనను సాగసిన జీవితవాతాయనములందు తలసూపబోయినను నిశ్వాస శీతవాతోద్ధతికి ఆ సుకుమార ద్వారములు మూసికొనిపోవును. శారద చంద్రికామధుతుషారము లామెజీవిత ప్రాంగణమున నడవి గాసిన వెన్నెలయే ఇంతకాలమును.

ఏ శుభోజ్జ్వల తారకాకిరణరేఖయైనను ఆ దరనిమీలిత నీలనేత్రాల్లో లేవెలుగుల సినినను అంతలోననే ఏ యుదాసనైన్యాన్నాశ్రుబిందువో చూపుదారుల నరికట్టి ఊహాలోకమును శూన్యతలో బంధించి వేయును.

నా విరహోచ్ఛ్వలిత ప్రణయవార్తలు వసంత విహంగ కలకూజితములలో, సెలయేటి కలకల నిస్వనములలో, చివురుటాకుల మిసిమి గుసగుసలలో ఆమె యౌవన ప్రాకారము నంటి నల్గడల నెంత రెక్కలార్చినను, ఆ నీరవార్త రహస్య జీవితాంతరంగమున నూత్నాశాప్రచలన మంకురించుకుంటునా ?

నా గాఢస్నేహ ప్రపూర్ణ ప్రణయవార్తలామె యమాయికాజ్ఞాన శోకజీవిత విపంచీ తంత్రుల నే వినూత్నానంద ప్రశాంతాలాపనములతో మేలుకొల్పవా ?

౯

నా ప్రణయనివాసిత హృదయం సానుభూతి సందేశాల్ని తటిత్ కాంతుల్లో, తారా కిరణేక్షణములలో, మలయమారుతస్పర్శనమాధుర్యాలలో తనకోసమే పుస్తెంచుచున్నట్లామె విస్పష్టముగా పోల్చుకొన్నదో లేదో ? కానిదో పులకించిన ఆమె దేహవల్లి ఇంకను పూర్ణవికసిత హాసపుష్పముల మొలకలీన దేల? ఇంకను ఆ యస్పష్టావగుంఠనమున సౌందర్యశోభను గుప్తముసేయు టేలనో ? ఆస్వచ్ఛ చంద్రబింబానన మింకను నీలకుంతల జలదాచ్ఛాదితమై బాష్పార్ద్రమై యున్న దేల ?

ఈ కైశోర ప్రణయినీశోకమూర్తికీ ప్రేమ ప్రవాసినికి నా ఆహ్వానగీతిక లానందామోద లేశమునైనను ప్రేరేచి ఊరార్చవా? నాపూజాశిరీష మాలిక లామెక్షుభిత వక్షోభాగము నలంకరించి ప్రశాంత సౌరభస్పర్శతో పలుకాడనేరవా నా రహస్యస్నేహావేశమును, నా ప్రగాఢ ప్రేమరహస్యములను , నా యగాధ సానుభూతి ప్రమాణములను ?

౬

ఆమె విద్యావతి.

ఆమె ముఖవర్చస్సులో వేదాలవెలుగులు. ఆమె లేపలుకులలో సరస్వతీదేవి విపంచీ విమల గానామృతము. ఆమెజీవితమే ప్రభావిభాసితము.

ఆమెను ప్రేమించనిదే ఆ యగాధ హృదంతరములోని నిరుపమానామూల్యరత్న సంపత్తి ఎట్లు నాకు హస్తగతమగును ?

తెలతెలవారు తొలిసంజవెలుగుల మరుగు పరుచు మంచుతెరను నాచూపు లెట్లు చొరబారి శోకాచ్ఛాదితమై మాటువడ్డ ఆమె సౌందర్యోదయమును పొడగాంచ గల్గును ? ఆ సుందరినే నేను ప్రేమించితిని — ఆమె విద్యావతి.

ఆ ప్రేమప్రవాసినియే ఆ వెదకొడుహృదయము నాకర్షించినది. ఆమె శోకావృతవతి.

౭

నా మరుగుకోరిక లా శిరీషబాలను తాకినంతనే కరగిపోవునేమో కోమలకుసుమము ! నా వేడినిట్టూర్పు లా పేశలదళాల నంటి వాడించునా ?

నా పిలుపుతొందరి లామెముగ్ధముకుళితజీవితము నొక్కుమ్మడి రేచి విభ్రాంతిగొల్పునేమో !

నిష్ఠురలోకమునకు వెరపొంది కుంచుకొనిపోయిన ఆమె భీతహరిణజీవిత మింతలో తెరచినకన్నుల నా వినూత్న యౌవనోత్సుకాహ్వానము మిరుమిట్లుగొల్పి తిరిగి మూతవెట్టునా ?

మలయమారుతములో ఆమె సలలితప్రణయ జీవితమును మేలుకొల్పుగాత, శాంతకాముని కాంతులే ఆమెశోకవిదారితశీలమునకు విశ్రాంతి నొసంగుగాత, చిగురు చేలాంచలముల స్రవించు మ్లానాశ్రువుల నొత్తి ఈ వసంతప్రకృతిలతాంగియే ఆమెపూపుటెడందను లాలించి పోషించునుగాత !

౮

యౌవనమును యౌవన మేల ఆకర్షించునో? ఆత్మల నాత్మ లేల కలుపుకొనునో ?

ఇంత విభేదభూయిష్ఠమైన ఈ విశ్వప్రకృతిలో ఏకత్వ మెట్లు పరిణమించునో ?

చీకటుల శోకాంధహృదయమున వెలుగులూ, వెలుగుల సమున్మాద జీవాంతరమున విషాదచ్ఛాయలూ, భాసమానిశ్చితమైన ప్రకృతిపర్ణశాలల్లో విచిత్రకౌముదీనాట్యాలూ, నాట్యమాడు శోభన ఋతుకామినీ నేత్రముల తొలకరించు ప్రవాసవిశ్లేష వేదనాశ్రువులూ — ఇన్నియు విశాలకాలగగనాంతమున భూస్వర్లోకముల నెల్లకాలము నొక్క చిగురుటాసతోనో, ఒక్క చిరుతనిట్టూర్పుతోనో బంధించి ఐక్యము ఘటించును గదా !

౯

ప్రణయవీక్షణములలో ప్రణయ వీక్షణము లెట్లు మిళితమైపోవునో! ఒక చొరవ చూపు, ఒక విరహసంరంభమూ మరియొక వెరగుటెడద, మరియొక ముగ్ధ నమ్రవిభ్రాంత సౌందర్యశోభకోస మేల

వలచుకొనునో, ఎట్లు వశపరచుకొనునో? ఏ యజ్ఞేయ సూక్ష్మరహస్య మీ నరనారీ హృదయముల నొదిగి దాగున్నదో! ఏ యగాధాగోచరామృతబిందు వీ గుండెలలో పొంచిపొంచి ప్రణయోన్మాద సంకులమై పొంగిపొంగి ప్రవహిల్లునో! ఏ పూర్వపరిచయస్మృతు లీ మానవజీవ చైతన్యకేంద్రమున మిణుకుమిణుకుమని వెలిగి, 'నాకు నీవే! నీకు నేనే! మన మనంతప్రేమైకజీవుల'మని ప్రణయప్రమాణముల వెల్గించి, యౌవనపథముల నానందాలోకమును ప్రసారించి, ప్రేమికుల నాకర్షించునో, కోరికల నైక్యము సమకూర్చునో ?

ముసురు రేయి

దామెర రాజగోపాలరావు

ఒక్కచుక్కేని లేని మహోగ్ర రోష
భీషణధ్వాంత దుర్దాంత విజనరజని,
కాసిపెంచె నేడు మహాశ్మశానవాటి
కాకుటిలకతోరస్థలి గంరమెత్తి,
భర్తృమరణవ్యథాకులస్వాంతయైన
కరము శోకించు శాకినీతరుణీకరణి.

కాళిగళకరాళవ్యాళపాళి కావి
లోలవిలయకీలాభీలమాలికలగు
నాలుకలు సాచి, భూనభోంతముల మ్రింగు
నటుల చీకటులపటలి యటమటించె.

నిరుపమక్షుధాక్షుభితకంఠీరవమ్ము,
క్రూరగంభీర ఘోరకాంతారవీథిఁ
గ్రోధవశత రహోగుహాకుహరవితతి
పగిలిపోవంగ గర్జించుభంగి, నింగి
భోరుభోరున నీరేయి బొబ్బలిడును.

మూగవోయినగతి మౌనముద్ర దాల్చి,
వృక్షములు రాక్షసులభాతి భీతి గొలుప,
నిలచియున్నవి చింపిరితలలు వాల్చి;

ఈ ముసురురేయి గాంచి నా యెద చలించె!

రాయలు, సూరన, భట్టుమూర్తి

వీరల కవితాతారతమ్యము

'కృష్ణకుమారి'

[ఇది శ్రీయుత కట్టమంచి రామలింగారెడ్డిగారి ఆధిపత్యమున జూలై నెల ౬-వ తేదినాడు రాజమహేంద్రవరమున జరగిన శ్రీగౌతమీగ్రంథాలయ రజతోత్సవసందర్భమున చదివిన యుపన్యాసము. దీనికి శ్రీమతి బత్తుల కామాక్షమ్మగారు స్వర్ణపతకమును బహుమానముగ నిచ్చిరి.—భా. సం.]

"విశ్వశ్రేయః కావ్యమ్"—కావ్య మేదియైనను, నద్దానిఫలిత మేదో యొకప్రపంచశ్రేయమును ధ్వనించుచునే యుండవలెను. సాంఘికనీత్యుద్బోధకములు కాని కావ్యముల నుత్తమశ్రేణినుండి పూర్వులు నిర్దాక్షిణ్యముగ వెడల ద్రోసివైచిరి. అసలు తత్కావ్యకర్త మహామహుడు "రసమయుడైనకవి విశ్వశ్రేయము నెట్లు సాధింపగలడు" అనునది పెద్దప్రశ్నము. ఉత్తమశ్రేణికి జెందిన రచన, అది యెంత రససంభరిత మైనను, నందు ఛాయగ విశ్వశ్రేయము తానంత తాను ధ్వనించుచునెయుండును.

కవి : కవిత్వము

కవి రసమయుడై, ఆనందమయమగు ప్రకృతిని దనయందు ప్రతిఫలింపజేసికొని యాప్రకృతియందే ఆత్మసాక్షాత్కారమందిన యోగిచందమున నానందమున మునకలు వెట్టుచుండును. అట్లు తాను ప్రకృతిసౌందర్య పీయూషమత్తుడై పడియుండుటే కాక, తన కా ప్రకృతి సమవలోకనముచే గల్గు నిసర్గపారవశ్యసుధను గావ్యరూపమున బాఠకులకు సైత మందించి వారికిని దల్లీనత ఘటించువాడే దక్షుడగుకవి. వారే "రససిద్ధాః కవీశ్వరాః" అను నుడికి అన్వర్థతనుభజింతురు.

ఇట్టికవులు — భావనాకవులు, కల్పనాకవులు, చిత్రకవులు నని ముత్తెగలుగ నుందురు. ఈ మూగురకును మనుజునందు మానవత్వమువలె, కవిత్వ మను కళాధర్మము సామాన్యముగనె యుండును. ఇక్షు, క్షీర, గుడ, శర్కరాదులలో మాధుర్య మనుధర్మము సమానమె యైనను, అందు రుచిభేద ముండునట్లె, ఈకవుల కవిత్వమునందు వైశిష్ట్యము పొందుకొనియుండును. కవిత్వము, చిత్రకళ గానము మున్నగువానివలెనె, పూర్వజన్మసంస్కారమున నబ్బుచుండును. కావుననె 'ముఖే ముఖే సరస్వతీ' యనునట్లు, ఒక్కొక కవికావ్య మొక్కొకతీరున నుండును. వ్యక్తిగుణములయందలి యీపృథక్త్వము తెలిసినపుడే, వారి గుణాధిక్యానాధిక్యములు ప్రచురమై స్థిరపడును.

పైబేర్కొనిన కవిత్వమునందు కవితాధర్మ మొకటేయైనను తత్తద్రీతులు, ఉత్తరగుణములును వేఱై భాసించుచుండును. కావున, మున్ముందు నాకవితాగుణముల భిన్నతను బర్యాలోకించిన, నద్దానింబట్టి తదాశ్రయులను కవులకు పృథక్త్వము గల్పించినట్లె యగును.

ఆ కవిత్వములయందు ప్రాథమికము భావనా కవిత్వము :— కవి రామణీయకప్రకృతిని జూచి యా సౌందర్యమున ముగ్ధుడై, తనయనుభూతిని నిరాడంబరముగ యథాస్థితిని ప్రదర్శించి, పాఠకుల హృదయములను అప్రయత్నముగ, బలాత్కార మొకింతయేని లేకుండ లాగొనును. కవియున్న దున్నట్లు వర్ణించి వస్తువుయొక్క సహజస్థితిని ప్రదర్శించుటచే, నీకవితయం దేమాత్రమును కల్పనకు ప్రాధాన్య ముండదు. మొత్తముపై కావ్యమున నొకించుక కల్పన యున్నను, అది ఖండ ఖండమై యొక్కడి దక్కడె నంతి మైపోవుచుండును. ఔట, నయ్యది యప్రధానమేయని చెప్పవల

యును. దీనియందు నిరలంకారభూషితయగు కవితా కన్యయొక్క సహజసౌందర్యము ప్రస్ఫుటమగును.

ఇక రెండవది కల్పనాకవిత్వము:— ఇందు కవి తనయనుభూతిని — ఈ యనుభవము భావనావిశిష్ట మగుట నుఱువగూడనిది. ఏలనన, మనకుగ భావింప నిది యనుభవమే కాదుగదా — స్వయం ప్రతిభచే మెఱుంగులు దిద్ది పాఠకునకు గనబరచును. కల్పనా కవిత్వమున వస్తుప్రత్యక్షీకరణశక్తి ప్రధానముగ నుండును. వస్తుస్వాభావికస్థితి నెఱుంగనివారికి మాటలచేగాని, రచనచేగాని తద్వస్తుప్రత్యక్షమును ఘటించుటయందు ఒకింత యతిశయోక్తి (కల్పన) చొన్పినగాని, యావ స్తువుయొక్క యథాస్థితి యూహల కంద దనునూక్ష్మమే యీకవిత్వమునకు మూలకారణము. అట్టియెడ సహజ త్వముకన్న సౌందర్య మినుమడించునను టనిక్కము. కావున నిందు కవితాకన్య హొయలుకారిన ట్లు సేర్చిన రాయంచ. అటుచే బాఠకుని మనస మీకవిత్వము నకే హెచ్చుగ నాకర్షితమగును.

మూడవది చిత్రకవిత్వము:— ఇది కేవల మాడంబర కవిత్వము; డమరుకవాద్యమునట్టిది. యమకాద్యలం కారభూయిష్ఠమై యుండును. ఇందు దుత్తమకవితా లక్షణములగు భావన, కల్పన యనునవి సాధారణముగ లోపించునందురు. అంతలోకష్టముగ విమర్శించుటకంటె, వాని కంత ప్రాధాన్య ముంచదనుటతో తృప్తి నంద వచ్చును. కాని సమగ్రముగ కవిహస్తమున నివియు బాఠకుని దృష్టినొందింపవచ్చును. భూషణాధిక్యముచే నిందు కవితాకన్యయొక్క సహజసౌందర్యము మసుగ వడును. ఇది లోక మెఱింగినసత్యమే.

ఇక మూటిని సూత్రప్రాయముగ నిర్వచింతును. భావనాకవిత్వము తనపై బడినధూళినైనను రాల్చుకొనలేని ముగ్ధఆరణ్యకుసుమము.

కల్పనాకవిత్వము పోషితోద్యానమందలి మెఱుం గులు తుఱంగలించు సుందరసుమము.

చిత్రకవిత్వము కేవల మానవకల్పితమై, కల్పిత వర్ణసంయుతమై, చూపులకు బ్రకృతిపుష్పసౌందర్య మును మించుసౌందర్యమును బ్రదర్శించు కృత్రిమపత్ర పుష్పము.

ఇక సూరనయందు భావనాశక్తి పరికింతము. భావనాకవిని జేరకున్నను, నానైపుణి తక్కువా ర్యుడు కం స్ఫురింపజేయుచున్నాడు. వాని శోక వర్ణ సాకారము. మానసికప్రవృత్తివివరణమునం దేమి, భావ నాది యితరలక్షణములం దేమి సూరనకు ప్రజ్ఞహెచ్చు. ఇతను నాత్మస్తుతికొక్కవిషయమును జెప్పి, యాతనినుండి సెలవుగైకొందము. ఉద్యోగపర్వమున:

చ. "అంతలు సేసి పోనడచి
యక్కట సంజయుచేత జెప్పి పు
త్తెంతురె, యిట్టియూరట మ
దిం బ్రియమొంది యుధిష్ఠిరుండు దా
నంతన యూరకుండెనసురకు
నైదు సుయోధను డిచ్చునొక్కొ యీ
కంతకృపావిహీనమతి
నాతడు నొందునె యన్న దమ్ములన్."

అనుపద్యమున ద్రౌపది నెట్లు సాక్షాత్కరింప జేసెనో విజ్ఞు లెఱుంగుదురుగాక.

రాయలు

అటుపిమ్మట నాయెట్టయెదుట రాయలు బొడ గట్టినవాడు. ఆముక్తమాల్యదారచయిత, రాయలమహా శయుడు — ప్రబంధయుగమున — ఈతనిం బేర్కొ నగనె, తోదోనవె యింకొకవిషయమును దోచు చున్నది. 'ఆముక్తమాల్యద సారస్వతప్రపంచమున బలము సంపాదించుకొని, కాలు నిలువద్రొక్కుకొన దలచినవానికి సాముగరిడీలయట్టి' దని. ఈతడు భావనాప్రధానముగ కైత జెప్పినాడు. శైలి నారి కేళపాకముకంటెను నొకవాసి బిగువైనదే. రచన మొత్తముపై గ్లిష్టపదభూయిష్ఠము. ఈతనిభావన లతి నూత్నములు, ప్రపంచానుభవప్రకటనసమర్థములునై యున్నవి. ఈ రచనాక్లిష్టతయు, భావనాప్రగాఢ తయునే యీతనికావ్యమునకు బంచకావ్యములలో స్థాన మిప్పించినవి. భావనాప్రధానమయ్యు గావ్య మున నడుమనడుమ కల్పన లేకపోలేదు. ఆ కల్పనలు అర్థమైనవెనుక, మంజులమనోహరములే. కాని మొదట నవియు నతిప్రగాఢములే అగుట గంటకచ్ఛన్నమగు

కూపమునందలి స్వాదుజలములవలె నున్నవి. ఎండకాలమున సుడిగాలులను వర్ణించు

"దవధూమంపుఁదమంబులోఁ దమరస
ద్రవ్యంబు బంకేజబాం
ధవభానుప్రతతుల్ హరింపఁ గుయి
వెట్ట స్వోల్లకూనోర్వీరుహా
వవితానంబనఁ జూడఁ జూడఁ బుడమి
న్వాటిల్లి పైపిప్పలై
యవసం బంచుల నాడఁగా నెగసె
వాత్యాళి వ్రజశ్చక్రముల్."

పద్యమునందు కల్పన యతిసుందరమయ్యు, బద్యముయొక్క రచనాకాఠిన్యముచే నది యొక్కడనో మూల్గుచు నుండిపోయినది. ఇంగ్లీషురానివా రింగ్లాండు వెళ్ళి నోళ్లు వెళ్లబెరుచుకొని మూచి వచ్చినట్లే యీకావ్యము సామాన్యభాషాజ్ఞానులకు కొరుకుపడ కుండుట కిదియే కారణము.

'సకలసంపత్సమేతుడై, కడుపున జల్ల కదల కుండునట్లు, కాలుపై కాలువైచుకొనియుండు మహాసామ్రాజ్యాధినేతయగు కృష్ణదేవరాయల కింత ప్రకృతి పరిశీలనము, ప్రపంచానుభవము నెక్కడనుండి యబ్బిన విరా బాబూ'అని ముక్కుపై వ్రేలువైచుకొని యబ్బురంపడదగిన ఘట్టము లీతనికావ్యమున జాలఁగ గలవు. ఎండకాలమున భూమిబీటలలో దాగుకొనిన బొమ్మడాయలను దినుబకములను వర్ణించిన

"మీటగు మీలనెల్ల మును
మ్రింగి క్రమంబుననైన యెండపె
న్బీటిక వెంటఁ దోచుదొగ
వేఁబడి గ్రొమ్ముపై చెలంగఁగా
ద్రోటిక కర్దమద్రవము
త్రోవ వశించిన బొమ్మడాయడా
తూట్కటకులమ్ములం దినె బ
కోటకులమ్ము జలప్రహదంబులన్"

అనుపద్యమును, ఆసందర్భముననె మాత్స్యపాక భక్షణచే గర్భిణకవరుడు సాంధ్యవేళల యువకులు కొబ్బరినీరు ద్రావి బోకార్చుకొందురు" అని వర్ణించిన "తారుణ్యాతిగచూతనూత్న..." అనుపద్యమును నతని ప్రకృతిపరిశీలనమును, ప్రపంచానుభవమునకును సాక్ష్యములై యున్నవి.

ఈతనిశైలియందొక వైచిత్ర్య మగపడుచున్నది. అది యేమనగ, నీతడు వర్ణనలనుట్టుక యతిగాఢమగు కల్పనలను, అతిక్లిష్టమగు రచనకు బనిరించినను, కథాసరణి నింత రచనాకాఠిన్య మగపడదు. రాముడు - 'తన్నెరాకకడకు బొమ్మని కలలో గనపడి యానతిచ్చినపుడు, విష్ణుచిత్తుడు భగవంతున కిడిన సమాధానము—
"గృహసమ్మార్జనమో, జలాహరణమో, పల్యంకికావహనమో.. గృహాంనాడిసు లేల లేరె, యితరుల్ నీకిలకుం బాత్రముల్" అను పద్యమును.

గ్రీష్మ, ప్రవర్షనాదికము యాకవి కల్పనాకవి యగునో; కాని కల్పనకంటె నీతనిభావనయే విశిష్టము, అధికము నగుట నీతడు భావనాకవియే. ఇంకను నీత డుపమాద్యర్థాలంకారములనె యెక్కువగ ప్రేమించెను. అవియైనను భావనకు గోడు మూసినవెకాని, భావనను మించలేదు.

రాయలు రాజ్యపాలనమంగువలె కవితాసామ్రాజ్యమునందును నిరంకుశ విహారము సల్పి, గంగ్రాస్యేషులను లాక్షణికులకు జేతిచిందుగ బని కల్పించినాడు. 'గంగను కానె', 'ఇష్టతాపవం టకిన' ఇట్టి వన్నెని యాశీర్వి క్రింద నెత్తిచూపవచ్చును.

ఇంతియకాక, సంస్కృతమునను మనవను గూడ మూలమున్న నిందెనింతపదములను దీసి బూజు దుల్పివాని కప్రయుక్తత్వదోషమును బాపి పున్నెము గట్టుకొన్నాడు. 'శయపుజాంబూజములు', 'నిశింగాయలు', 'పెరుంజువిడులు' మున్నగున వట్టివి.

ఈతని కావ్యోద్యానమునకు శాంతరసము తోటకాపరి. తోటకాపరి పగలెల్ల దోటను గన్నెల్ల ద్రవ్వి గొప్పులు దీసి, పాదులు చేసి నీరు బారించి యనేక విధముల నష్టకష్టముల బడినగాని, యాతోటలోని మందమలయమారుతము ననుభవింపలేడు.

సూరన

కల్పనాకవిత్వమునకు పట్టభద్రుడు సూరనార్యుడు. ఈతనికవిత కల్పనాప్రధానమైనదేకాని,

కల్పనతోబాటు భావనయు గ్రుమ్ములాడినది. ఈతని కల్పన యఖండమైనది. అది కావ్యమం దంతటను నలమికొనిపోయినది. కథావస్తువే కల్పితమైనది. తిక్కనకు గల విశిష్టధర్మముల మూటిలో బ్రథమమున శ్రీనాథాదులు భావనను బుంజుకొనగా, పోతన భక్తిరసమును బుణికికొని పోతరింపగా, నీత డాతనికల్పనాశక్తిని సొత్తుగ గైకొని యం దాతని మించెనుగూడ. పూర్వోక్తమగు నాముక్తమాల్యదయందు కల్పన ఏకదేశవర్తిని. ఈతనికల్పన యఖండమైనది. ఈకల్పనాశక్తి యీతనిలో నొడ్డుదాకి, యీతనికి వాఙ్మయరంగమున బ్రత్యేకమగు గద్దె నిడినది. శైలి మృదుపదగుంఫితమగు ద్రాక్షాపాకము. రచన జాతీయము జాలువారు తేటతెలుగు. భావనయు నతిహృద్యమైనది. రసతాదాత్మ్యమీతని ప్రధానకావ్యములయం దంతటను గాన్పించుచున్నది. అందును గళాపూర్ణోదయమునం దెన్నితావుల నేని యగపడుచున్నది. కలభాషిణి ఉయ్యెల నూఁపటను వర్ణించిన మణికంధరుని

"తమిఁ బూఁదీఁగెలఁ దూఁగుటుయ్యెలలఁ బం
తాలాడుచుం దూఁగు నా
కొమరుంబ్రాయపు గబ్బిగుబ్బెతలయం
ఘ్రుల్ చక్కఁగాఁ జాఁగి మిం
టి మొగంబై చనుదెంచుతీవిఁ గనుఁగొం
టే దివ్యమౌనీంద్ర నా
కమృగీనేత్రలమీఁద కయ్యమునకుం
గాల్దాచులాఁ గొప్పెడిన్"

అనుపద్యమును దానివెంటనె "బళిరా సత్కవివాదు..." అని నారదు డందుకొంటయు సుముఖాసత్తి ముదుసలిరూపమును వర్ణించు "పసిమి పోనెండిన కసవు బుట్టయుఁబోలె నరనెండ్రుకలనొప్పుశిరమువలన..." అను పద్యమును ఈతని భావనాప్రధానమగు కల్పనాకవిత్వ చమత్కృతికి మచ్చుగ జూపితిని.

అందే, "భావజుఁడు వెళ్లిపోయిన పాడుమేడ పగిది" నను నుపమ ఉచితస్థానపతితమై, తేటయైన భావలో నుండి "ఉపమా కాళిదాసస్య" అను నుడిని జ్ఞప్తి కెలయించుచున్నది. నిజమున కీ విషయమున నాచన సోమనాథుని ముందు చెప్పఁగవలయును. హరిహరుల యుద్ధ సందర్భమున, 'నరకు జేసినయస్త్రి,

"అరచందురు డెందములోఁ
జొరఁబారి వణంకు తోకచుక్కయపోలెన్;
హరినిటలతటమున దాఁకి యల్లలనాడెన్."

అను నొక్క యుపమయే చాలు నీ సత్యము నుద్ఘాటించుటకు.

"నానృషిః కురుతే కావ్యం" మ్మను నుడి యీతనియెడ నన్వర్థమగుచున్నది. ఈ కవి ౪౦౦ ఏండ్లకు జరుగబోవు ప్రపంచపరిణామము నద్భుతముగ దన పాత్రమున జోస్యము జెప్పినాడు. ఈతని సృష్టించిన నాయిక, కలభాషిణి సామాన్య లోకమునకె కానికావ్యప్రపంచమున నెందును గన్పట్టదు అకాలమున గావ్యమున బ్రతినాయికయు నుత్తమలక్షణ లక్షిత, యున్నత వంశసంజాత; అట్లే నాయకుడు సర్వసద్గుణసంపన్నుడు, మహోన్నతవంశసంభూతుడు నై యుండవలెను. నూత్నత భాసింప సౌందర్య మప్పువడకున్నను శాస్త్రమర్యాద నతిక్రమింపక అష్టాదశ వర్ణనల నేకరువుపెట్టవలెను. ఈతడు మహాస్వతంత్రుడును, రసపరతంత్రుడును నగుట, నానియమముల నధఃకరించి, తనకాలమునకు బరిపాటియై, ప్రజాభిరుచి నందిన ప్రబంధనాయికల దిరస్కరించి, సామాన్యవేశ్య నుత్తమనాయికగ గల్పించి, విరహాదికముపట్ల యీ నాయికయే ప్రబంధనాయికలకన్న మిన్న యని నిరూపింపగల్గినాడు. పవిత్రప్రణయ మనునది ప్రభువుల సొమ్మే కాక, ప్రజల స్వత్వము నగు నని యెలుగెత్తి చాటినాడు. ఇట్టి సంఘటనము సంస్కృత వాఙ్మయమున మృచ్ఛకటికమున నగపడుచున్నది. ఇది యప్పటి తనకాలమునాటి ప్రజకు గిట్టదు. కాని యంతవు నాల్గువందలయేండ్లు గడచన్న యాధునికయుగమున కిది సరిపోవుచున్నది కళయన్న నేమి ("What is art)" అనుపొత్తమును రచించిన టాల్‌స్టాయి ('Tolstoy') అనునాంగ్లకవి 'కవు లందఱు ధనవంతులకవిత్వమునే వ్రాసిరి' కాని, సాంఘిక స్థితిని బ్రధానముగ జేసికొని యొక్కరును జిత్రింప రైరి" అని వ్రాసినాడట. సూరన యీయావచనీయము

నుండి ముక్తుడైనాడు; తనకృతియందు సంఘముతో నైక్యమంది సంఘము నుజ్జీవింపజేసినాడు.

ప్రప్రథమమున పాత్రప్రవేశాదికమునసె, నాటకపుసూచన లగపడుచున్న వనియు, నింక నితరవిషయము లెన్నో కల వనియు లోతుగ విమర్శించుట యప్రస్తుతకమగును.

కాని యొక్క విషయము చెప్పక తప్పదు. సూరన ఇపుడు పెద్ద పెద్దచర్చలు జేసి తలలు బద్దలు చేసికొనియు, నిదమిత్థమ్మని నిర్ణయించలేకపోయిన ప్రణయపంథల నన్నిటి నపుడే తనగ్రంథమున బ్రదర్శించియున్నాడు. సరస్వతీ చతుర్ముఖుల ప్రణయము సృష్టి కౌరణమై యుదాత్తమై విలసిల్లినది. సుముఖాసత్తి శాలీనుల ప్రేమ పామరజనసామాన్యమై, ప్రాపంచికస్థితి నెఱుకపఱచినది. రంభా నలకూబరుల ప్రణయము ప్రపంచమున బ్రణయ మొక్కటేదక్క వేఱొండు లేదనుటను స్థిరపరచుచు, విషయాంతరవిగళితమగు రూపు దాల్చి నిల్చినది.

ఇక కలభాషిణి ప్రణయము స్వచ్ఛమైనయది. పవిత్రమైనయది. కాని మణికంధరవిషయికమగు ప్రేమ ప్రణయము ఫలమందుటకు వ్యవధి యధికమౌటగాబోలు నాపె చాలకాలము వేచియు నిక నోర్వలేక తొందరపడి మణిరూపుం గాంచి గాఢప్రేమను వలచినది. ఇయ్యది సామాన్యమానవప్రకృతి. లోకమున నిట్టి సంఘటనలు నిత్యము మనకండ్లయెదుట వేనవేలు జరుగుచునేయుండును. కాని యది 'యతివ్యవధి నైపని విశుద్ధప్రణయతృష్ణకు దాహశాంతి' యని యెవరో కాని యూహింపలేరు. ఊహించినను నట్టి ప్రణయముగల స్త్రీని మనఃపూర్వకముగ క్షమించి, యుత్తమప్రబంధమున నాయికగ దిద్దుట కొప్ప విశాలహృదయముగల వారై యుండరు. అట్టిసత్యమును సూరన యతిగంభీరముగ బయలువెట్టెను. అందులకే 'రవి గాంచనిచో గవి కాంచునేకదా' యనుచుందురు. అందును నుత్తమ వంశసంజాతయగు నాయిక కిట్టిలక్షణము లంకించుట నాకాలపుప్రజ బొత్తిగ హర్షింపదు. కావుననే ప్రజాభావనకు విరుద్ధమయ్యు, తననాయికను వేశ్యను జేసికొనెను. అట్లు జేసికొనియు, రసికలోకముచే ధన్యవాదముల జేకొనినాడు. ఇది యంతయు గల్పనాప్రాభవము, కల్పనాపటిష్ఠత కాదోటు?

ఈతడును నర్థాలంకారములనే యెక్కుడుగ నుపయోగించెను.

"విలసితశీవిచికాయతతర
విప్రతిబింబమిషమ్మునన్ మహా
జలనిధి లక్ష్మ్యపార్శ్వశయా
చక్రిపయిన్ జెయిఁ జాచి యొస్సఁగ
న్నుల 'బాల' లక్ష్మి గర్మలిగ
లన్నియు నొక్కల పుష్పకాయగా
వలయు, విచింపెలంపు రస
పత్రిరిఖామిషబాలబంధమున."

యున్నను సద్యస్సు లన్నిని దానికి నిదర్శనీభూతములై యున్నవి.

ఇతడు కావ్యరచనా విషయమున సామ్యమైనంతవట్టు స్వాతంత్ర్యము చూపె, యుప్పెన సంప్రదాయమున నొక్క యిర్వదిబార లెడఁగినాడు. పుత్రనికవిత్వమున, భావనకు గల్పనకును శైలి పొందువడి, యీ రెండును ధరాత్రగములగా నెగిలించిలిన గూర్చినవి.

ఇతని కావ్యోద్యానమునకు నిరుపమ మైనందమునంతయు స్వేచ్ఛమెయి ననుభవింప నొక్క గల్గిన యజమాని.

భట్టుమూర్తి

మిగిలినవాడు చిత్రకవి :— అతడు మూర్తి కవి. ఇందీతడు సిద్ధహస్తుడు. తెలుగు సారస్వతము నంతను గాలించినను నీకళయందీతని మించినవా రింకొకరు గాన్పింపరు. ఇతని ననుకరించినవారి కావ్యము లన్నియు 'పిల్లవసుచరిత్రము'లే కదా! ఈత డన్ననో అసాధ్యుడు. "ప్రాయశో యమకే చిత్రే రసపుష్టి ర్న విద్యతే" అను నభియుక్తోక్తి కొక్క జలాంజలి యొసగెను. శయ్య కదళీపాకము. కల్పన విస్తృతమైనదే. ఐననేమాయె అది యఖండము కాదు. భావనాబలమును కవికి మిగులగ గలదు. అందులకే చిత్రకవిత్వమయ్యు, ప్రజాహృదయము చూరగొని

చిత్రకవిశ్రేణికి బ్రజాపతియయ్యెను. ఈకవికి శ్లేష అప్రయత్నసాధ్యము. తలచినది, పలికినది, కన్నది, విన్నది సర్వమును శ్లేషయే. పలుకని ముత్తుకొన్నను, ఆతనిమాటలు వ్యంగ్యభంగినె యుండును. అంత సులభ సాధ్యముకనుకనే రచన క్లిష్టనియమములతో నిష్ప్రభకా లేదు. శ్లేషకవిత్వమున కితరకవు లెన్నియో పాట్లు బడిరి. ఎన్నియో నియమముల నుల్లంఘించిరి. వాని కపవాదసూత్రముల బన్నించుకొనిరి. "శ్లేషే సబిందు నిర్బిందోర్వర్ణయోశ్చ న భేదః (మతమ్)" ఇత్యాదు లన్నియు వారిలోపమును పవరించుటకు బుట్టినవే. ఈతఁ డవి యన్నియు సాధారణముగ గంట జూడ లేదనియే చెప్పవలెను. "సునివృత్తి సేనాక్లిష్టబచరిం చెనో తీర్థసంవాస మిచటి హంసవ్రజంబు" మున్నగు నవి యీతనిశ్లేష కుదాహరణములు. కొన్నిపద్యము లీతనిశ్లేష కుదాహృతులని చూపుట హాస్యాస్పదమే. ఏలనన, ఈతనికావ్యమే శ్లేష కుదాహరణము. ఉద్యాన వనవర్ణనయందలి 'పరిమిళితప్రవాళనవపట్టపటధ్వజ మాతనూతన...' మున్నగు పద్యములు భావనకును, గిరికజలక్రీడను వర్ణించు

> కరముల మూఁపు లూఁదుకొని
> కన్నెలు చన్నులబంటి నీటఁ గొలఁకుల్
> బరిఁగొని నిల్వఁ దత్పరిధి
> బ్రాంశుదృగంశు కలాపపూరితాం
> తరమయి పొల్చె భావభవ
> దైవత భావిత హేమకుంభసం
> భరిత మృణాళ మండలిత
> పద్మమయ ప్లవమండలం బనన్"

అనుపద్యము కల్పనాశక్తికి దార్ఢ్యాణముగను నొసగవచ్చును.

ఈతనికవిత్వమం దొకవింతయాగుణము కాన్పిం చుచున్నది. ద్వంద్వచిత్రణమువలె, నీతనికవిత శ్లిష్టచిత్రములచే జిత్రితమైనది. జడెచులగు సక్తిమతీ కోలాహలులను మానవులనుగా జిత్రించెను. ఇదియే ద్వంద్వచిత్రణము. ఇది యంత్యమువఱకు గమ్మనై పుణితో, సమర్థతతో నిర్వహింపబడినది. ఒక్క పద్యమునందె, యొక్కపదమునందె యొకప్రక్క స్త్రీ యు, నింకొకప్రక్క నదియు గన్నులకట్టిన ట్లగపడు చుందురు. శ్లేష యింతగ నీతనికి వశ్యమైనది. దీనియం దీతఁడు కృతార్థుఁడు. కేవలము శ్లేషయేకాక భావన, కల్పన యను నుత్తమకవితాలక్షణములను నుంబ, కావ్యము రక్తికట్టి పండితులప్రోల 'బళీ' యనిపించు కొన్నది. రవివర్మ గంగాపాతమున నిట్టిచిత్రణమే చూపనెంచియు జిత్రింపలేక, శివజటాజూటముపై నదీపాతమును, దానిపై స్త్రీమూర్తియగు గంగను జిత్రించి వదలిపైచెను.

ఇంకను గాటముగ దరచి చూచుచో, భావనా బలము, కల్పనాశక్తియే యెక్కువగ గన్పట్టుచున్నది. ఏమందురా — కథ మొదల చాల పొట్టిది. ఒకప్రేలె డంతకథను దీసికొని, యారాశ్వాసముల ప్రబంధము నల్లెను. అంతయు నూహాగానము. ఎంత కల్పనాశక్తి యున్నను దానిని గ్రమింగి, జయించి పైకి గనబడినది శ్లేషమాత్రమే. కావుననే చిత్రకవి యయ్యెను. చిత్ర కవియయ్యు మెప్పుల గొన్న యీకవి ధన్యుఁడు.

ఈతనికైతయం దనేకములగు ననుసృతులు కల వందురు. కాని యిది యీతని యొక్కనిదోసమే కాదు. ఈయనుకరణ మనుమహామారి వాల్మీకి, హోమరుల దక్క, తక్కిన యందఱుకవుల నావరించినది. ఆంధ్ర వాఙ్మయమునందు నేపదుగురో తప్ప, మిగిలినవా రందఱు నీబారిని బడినవారే. మూలానుకరణములేనిదే నూత్న సృష్టి పొసగదను టొకకళారహస్యము. అనుకరణ మున్నను, శైలీసాహచర్యముచే నది సొంతముగ భాసించు టీకవివిదగ్ధతను జెలికి గనబరచుచున్నది.

ఈతని కావ్యోద్యానమున పాఠకుఁడు యజమాన నియంత్రితుఁడగు నారామావేక్షకుఁడు

—o—

వర్డ్స్‌వర్త్: అతని కవిత్వము

మొహమ్మద్ ఖాసింఖాన్

ఆంగ్లేయకవిత్వచరిత్రమున పందొమ్మిదవశతాబ్దము వసంతమువంటిది. ఆంగ్లవాఙ్మయమున ఈకాలమున అపూర్వవికాసము కలిగెను. వర్డ్స్‌వర్త్, కూలిడ్జ్, కీట్స్, షెల్లి, బైరన్, లీహంట్, లాంబ్ మున్నగు ఆంగ్లసాహిత్యదిగ్గజము లీ కాలమువారు. పదునెనిమిదవశతాబ్దము ఆంగ్లవాఙ్మయచరిత్రమున మనప్రబంధయుగమువంటిది. ఆశతాబ్దారంభమున అలెగ్జాండర్ పోప్ అను ఒక మహాపండితకవి భాషాచమత్కృతియే ప్రధానముగ నెన్నో కావ్యము లల్లెను. ఆ కావ్యములే నాటికవులకు ఆదర్శప్రాయము లాయెను. వారిభావవలెనే భావములుకూడ కృతకములు. ఛందస్స్వరూపములలో వైవిధ్యము గాని, సౌలభ్యముగాని లేకుండెను. ప్రకృతి సౌందర్యమును పూర్వకావ్యములను చదివి వర్ణించుటయగాని చూచి చిత్రించుపద్ధతి లేదు. శబ్దసామగ్రియు, అలంకారసంచయమును పోతపోసిన అచ్చులు. పాండిత్యప్రకర్షయే నాటికవిత్వోద్దేశము. కవిత్వవస్తువునకు అనుదినజీవితమునకు ఏసంబంధము లేకుండెను. కవితాభాష ఒక ఉన్నతకుల భాషయై ఉండెను.

ఈపరిస్థితు లొక సాహిత్యవిప్లవమును రగుల్కొల్పెను. ఈవిప్లవకారులు కవి నిరంకుశుడని వాదించిరి. కవితాభాష సామాన్య ప్రజాభాష కావలెననిరి. కవితాకళ కేవలము పండితులసొత్తు కా దనిరి. గగనసంచారులగు దేవాదులు, సౌధవాసులగు రాజపురుషులు, రాజకన్యలే కవితావస్తువులై యుండదగ దనిరి. ఈవిప్లవమునకు నాయకుడు విలియం వర్డ్స్‌వర్త్‌కవితిలకుడు.

విలియం వర్డ్స్‌వర్త్‌కవి ౧౭౭౦-వ సంవత్సరములో జన్మించెను. ఎనిమిదేండ్ల ప్రాయముననే విలియం తల్లిని గోల్పోయెను. భార్యావియోగదుఃఖముచే విలియం తండ్రి జాన్ ఆరేండ్లపిదప మరణించెను. విలియమున కప్పుడు పదునాలుగేండ్లవయస్సు. అది విద్యార్థిదశ.

విలియం తన బాల్యమును హాక్‌షెడ్ పాఠశాలలో గడిపెను. పదునాలుగేండ్ల ప్రాయమునాటినుండియు పద్యముల వ్రాయసాగెను. పోప్‌పండితుని అనుకరించుచు వ్రాసినపద్యము లెన్నో కలవు. బాల్యమునుండియే విలియం ప్రకృతి నారాధింపసాగినాడు. ఉదయభానుని చూచి ఉప్పొంగిపోవువాడు. పడమటికనుమల శిఖరములను చుంబించు సాయంసూర్యుని చూచి ఆనందపరవశు డగువాడు. ప్రకృతియందలి బాహ్య సౌందర్యమే అతని నప్పు డాకర్షించినది. క్రమముగ అతడు ఈ సౌందర్యమునందలి పరమార్థము నరయసాగినాడు. ఈతత్త్వ చింతనమువలన అతనికి సృష్టిరహస్యము గోచరించినది.

విలియమునకు ప్రకృతి సజీవ. అత డామెతో మాట్లాడగలడు. ఆమె తనజీవిత

రహస్యము నాతనికి నివేదించుకొనును. ప్రకృతి యతనికి పరమగురువు.

తన హృదయమున ఈభావము లెట్లు రేకెత్తినవో విలియం చెప్పికొనినాడు. చిన్నప్పు డొకనాడు విలియమ్ ఫలాహరణ మునకై ఒకడొంకికొక్కెను తీసికొని పరిసరము లందున్న ఒకచిట్టడవి కేగెను. అక్కడ చెట్ల నీడల విశ్రమించుచు, క్రొంబూవులతో క్రీడించుచు, సెలయేళ్ల జూచి ఆనందించుచు ఒక ఫలభరితమగు వృక్షమును చేరి దానికొమ్మను వంచి ఒకరెమ్మను విరిచెను. నిశ్శబ్దముగ ఆరెమ్మ అతనికి లొంగిపోయెను. విలియమ్ హృదయము ఒక్కసారి చలించెను. తన మారణకర్మకు ఖిన్నుడాయెను. ప్రకృతి కూడ సజీవయే అని అతనికి స్పష్టముగ గోచరించెను.

నీరవ మహీజపంక్తుల నీల నిర్మ
లాంబరపథాల గనినప్పు డంకురించు
నాయెద నదేలనో వేదనానుభూతి :
మృదుహృదయవయి చరియింపుమీ ప్రియ [సఖి!
ఈతరుచ్ఛాయలందు ; స్పృశింపవలతు
వేని కోమలాత్మవయి చేయిడుము, సకియ,
కానలంగూడ నొకయాత్మ కలదుగాన.

అని విలియం నాటి తన అనుభవమును చెప్పికొనినాడు.

ఇట్టిదే మరొక యనుభవము విలియమునకు కలిగినది. ఒక గ్రీష్మసాయంసమయమున అత దేకాంతముగ పరిసర సరోవరమున నౌకావిహారము సేయబోయెను. నిర్మలమగు నీలాకాశము ; మిన్కుమిన్కను తారకారాజి ; సరస్సున కావలియొడ్డున ఉన్నతమగు నల్లని కొండకొమ్ము. నావ కొంతవరకు గడచెను. నక్షత్రముల నిరోధించుచు తన ముందు ప్రత్యక్షమైన యా గిరిశృంగ మాతని హృదయమును భయావేశములతో నించి వైచెను. నాటియనుభవమును వర్డ్స్‌వర్త్ ఇట్లు చెప్పికొనినాడు.

After I had seen
That spectacle, for many days, my brain
Worked with a dim and undetermined sense
Of unknown modes of being ; o'er my thoughts
There hung a darkness, call it solitude
Of blank desertion."

ఈ అనుభవములవలన వర్డ్స్‌వర్త్ దృక్పథము పూర్తిగ మారెను. అంతటితో అతడు ప్రకృతితో మాట్లాడ సాగినాడు.

౨

౧౭౮౭-వ సంవత్సరములో వర్డ్స్‌వర్త్ పాఠశాలను విడిచి కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయమును ప్రవేశించెను. కాని అక్కడి జీవితమతనికి సరిపడలేదు. అక్కడి పాఠ్యప్రణాళికయం దతనికి అభిరుచి లేకుండెను. ప్రఖ్యాత ఆంగ్లకవుల కావ్యముల నన్నిటిని అతడు శ్రద్ధతో చదువసాగినాడు. ఈకాలముననే మనకవికి యూరపుఖండసంచారము గావించు అవకాశము లభించెను. నాటి యూరపు స్వాతంత్ర్యోత్సాహముతో నిండియుండెను. రాజకీయ విప్లవముతోపాటు ఐరోపీయదేశములలో ఆర్థిక సాంఘిక పునర్నిర్మాణము జరుగుచుండెను. కాని ఆసంచారమునందలి

అనుభవమువలన మనకవిదృక్పథమందేమియు మార్పు కలుగలేదు.

" I looked upon these things
As from a distance ; heard and saw and felt
Was touched, but with no intimate concern "

అని కవియే చెప్పికొనినాడు. అతనికి ప్రకృతియే గురువు; సర్వస్వము నదియే. సాంఘిక రాజకీయ ప్రపంచములందలిమార్పులు అతని కంత గణనీయములు కావు. ప్రకృతి శోభయందలి భంగిమములే అతని నాకర్షించును.

నాలుగేండ్లకుపిదప మనకవి పట్టభద్రుడాయెను. తరువాత ఏమి చేయవలెను అన్నప్రశ్నకు సరియగుసమాధానము దొరకలేదు. ఫ్రెంచిభాష సమగ్రముగ నేర్చుకొనవలె ననుపట్టుదలతో ఫ్రాంసు దేశమున కేగెను. ఈసారి ఫ్రెంచివిప్లవసూత్రముల నతడు బాగుగా అవగాహనముచేసికొని విప్లవమునెడ సానుభూతిని చూపసాగినాడు. ఫ్రాంసువిప్లవవాతావరణము అతనిని తన లోనికి లాగికొనినది. ఆవిప్లవరథుండొకనాటిమూరు తమున ఆతడు కొట్టుకొనిపోవలసినవాడు. దినదినప్రవర్ధమాన మగుచున్న దారిద్ర్యమును నశింపజేయవలె నన్నకోరిక అతనిని తీవ్రముగ కలతపెట్టసాగినది. దానికి విప్లవమే ప్రధానసాధనమని అతడు గ్రహించెను. నిరంకుశప్రభుత్వము నశించినగాని మానవజాతికి సౌఖ్యము లేదన్నవిషయ మాతనికి సుస్పష్టమాయెను. అతడు విప్లవయోధులలో కలియవలెనని సంకల్పించుకొనెను. ఇంతలో వర్డ్సువర్తుబంధువు లతనిభావిజీవితము భగ్నమగుచున్నదని భయపడసాగిరి. ఫ్రాన్సునుండి మరలి రమ్మని నిర్బంధపెట్టిరి.

వర్డ్సువర్తు స్వదేశమునకు మరలిరావలసి వచ్చెను. అప్పుడు ఇంగ్లండులో ఫ్రెంచి విప్లవమునకు మితిలేని ప్రాతికూల్యవాతావరణము వ్యాపించియుండెను. మనకవి విప్లవమును సమర్థించుచు వ్రాయసాగెను. పిట్ మంత్రి ఫ్రాన్సుతో యుద్ధమునకు గడగెను. వర్డ్సువర్తుహృదయమున కిది యొకదెబ్బవలె తగిలెను. అతడు దేశభక్తిపరాయణుడే. కాని ఈపరిస్థితులలో తనదేశము న్యాయమార్గమున లేదనువిషయ మతడు గ్రహించెను. బ్రిటనుకు పరాజయముకలిగినప్పుడు మనకవికి అపరిమిత మగుసంతోషము కల్గెను. కాని ఫ్రాన్సు తరువాత సామ్రాజ్యతత్త్వము ననుసరించి ప్రపంచముపై దండెత్తసాగెను. విప్లవసిద్ధాంతము లతనికి ప్రియములే కాని ఫ్రాన్సు యెడమాత్ర మతనికి ఏవగలిగెను. నాటి రాజకీయ ఆర్థిక అల్లకల్లోలము లతనిహృదయమును కలతపెట్టసాగెను. ఇదమిత్థ మని అతడేదియు నిర్ణయించుకోజాలకపోయెను. అతని మనశ్శాంతి నశించెను.

ఇట్టిసందిగ్ధావస్థలో అతనిసోదరి డరోతి అతనికి శాంతిదాన మొసగెను. ఇదేసమయమున అతని కొక ఉపాస్యదేవికూడ లభించెను. ఆమెయే మేరీ హాచిన్సన్. డరోతి అతనికి చక్షుశ్శ్రోత్రములు నిచ్చెను. అతని హృదయము నుత్తేజిత మొనర్చెను. మేరీ అతని కొక ఆనందప్రతిమ; సౌందర్యలక్ష్మి. వీరితో వర్డ్సువర్తుజీవితము మారిపోయెను.

3

ఇప్పుడు మనకవికి ఇరువదినాలుగేండ్లు. వర్డ్సువర్తు రెండుకావ్యములను ప్రకటించెను.

అవి రెండును ప్రకృతికావ్యములే. మొదటిది 'సాయంవిహారము' (Evening walk); రెండవది 'వర్ణనములు' (Descriptive sketches). రెండుకావ్యములును నాటిపద్ధతి ననుసరించి ద్విపదరూపముననే రచింపబడెను. భాషకూడ కొంతవరకు ప్రాచీనకవుల అనుకరణమే. కాని భావములు నవీనములు. పురాతన కవులు ప్రకృతిని సమష్టిదృష్టితో చూచువారు. మన కవిసమయములవంటివి వారికి కొన్ని వాడుక లుండెను. ఆకవిసమయములే వారిప్రకృతివర్ణనారచనమునకు సామగ్రి. వర్డ్సువర్త్ ప్రతివస్తువును జాగ్రత్తగా పరిశీలించువాడు. పైనచెప్పిన కావ్యములను గురించి వ్రాయుచు: "అందు వర్ణితమైన దృశ్యములలో నేను బాగుగా పరిశీలించని దేదియు లేదు. ఇప్పుడు నాడెబ్బదిమూడవయేటకూడ ఆదృశ్యములను నేను చూచిన వేళయు ప్రదేశములనుకూడ చెప్పగలను" అని చెప్పినాడు. "ప్రకృతిస్వరూపమున వైవిధ్య మున్న విషయము నాకు తెలిసినంత మట్టుకు ఏకాలమందును ఏకవియు గ్రహించన ట్లున్నది. ఆకొరత తీర్చవలెనని నా కోరిక" అని మరియొకచో అతడు వ్రాసినాడు.

వర్డ్సువర్త్స్ కీకావ్యములవలన కలిగిన ఆర్థికలాభ మేమియు లేదు. వాటి నెవ్వరు నాదరింపరైరి. వర్డ్సువర్త్కు నిస్పృహ కలిగెను. ఏదేని ఒకపత్రిక నడుపవలెనని అతనికి కోరిక పొడమెను. అది ఫలించలేదు. అతని కేమిచేయుటకును తోచలేదు. కాల్వర్ట్ అను ఒకస్నేహితుడు క్షయవ్యాధిపీడితుడై అతనికి ౯౦౦ పౌం డ్లిచ్చి స్వర్గవాసి యాయెను. వర్డ్సువర్త్కవితాజీవితము అవిచ్ఛిన్నముగ సాగుటకు అది సాధనభూత మగునని కాల్వర్ట్ ఆశయము. అతని ఆశయము ఫలించెను. వర్డ్సువర్త్కు సంసారతాపమునుండి చిరకాలము ముక్తినొసగిన దామిత్రునిత్యాగము.

> "Calvert! It must not be unheard by them
> Who may respect my name, that I to thee
> Owed many years of early liberty."

అని వర్డ్స్వర్త్ తన కృతజ్ఞతను తెలుపుకొనినాడు.

డార్సెట్షైర్లో రాన్డౌన్ లాడ్జి యందు మనకవి తనవినివాస మేర్పరచుకొనెను. అతనిసోదరి డరోతికూడ అతనితో ఉండసాగెను. వర్డ్స్వర్త్కు చిత్తశాంతి కలిగెను. శాంతిసమృద్ధమగు అతనిజీవితమునకు మూలకారణము భగవంతునియందతనికి గల విశ్వాసమే. ఈ దుఃఖమయమానవజీవితమున ఒకే ఆలంబన మున్నది. మన సుఖదుఃఖములకును, భాగ్యాభాగ్యములకును, కారకుడు అఖండదయాస్వరూపు డగు ఈశ్వరుడే అన్నదృఢ విశ్వాసము" అని వర్డ్స్వర్త్ చెప్పికొనినాడు.

ప్రతిభాశాలియగు కూల్రిడ్జ్ ఒకప్పుడు వర్డ్స్వర్త్ను దర్శించెను. అతడు విలియం జీవితపథమున ఒకనూతనజ్యోతి యాయెను. తరువాత వర్డ్స్వర్త్ తన క్రొత్తస్నేహితునింటికి పోయి అక్కడికి సమీపముననున్న ఒకభవనము నద్దెకు తీసికొనెను. అక్కడ గడిపిన ఒక సంవత్సరము మనకవికి అమితానందమును చేకూర్చెను.

కూల్రిడ్జ్ సహవాస భాగ్యమువలన వర్డ్స్వర్త్కు మనోవికాసము కలిగెను. నిరంతరము వా రిద్దరును కవితాతత్త్వమును చర్చిం

చుచుండిరి. కవితాకళయందలి రెండువిషయములకు వారు అగ్రస్థాన మొసగిరి. ప్రకృతి సత్యమును ప్రార్థిగ అనుసరించి పాఠకుని అనుభూతిని రెచ్చగొట్ట గలశక్తి కవిత కుండవలెనని; నిరంతరము రంగులను మార్చి భావములను చిత్రించి కవితకు నూతనత్వము కల్పింపవలెనని. ఈ రెండుద్దేశముల ననుసరించి కొన్ని ఖండ కావ్యములను వ్రాయవలె నని వారు సంకల్పించిరి. సామాన్య జీవితమును కవితా వస్తువుగా గ్రహించి వర్డ్స్వర్త్ అనేక ఖండ కావ్యములను రచించెను. ఈ ఖండకావ్యములు 'లిరికల్ బాలడ్స్' (Lyrical Ballads) అను ఒక సంపుటమున ప్రకటింపబడెను.

ఈ సంపుటము ఆంగ్ల వాఙ్మయమున ఒక నూతనశకమారంభించినది. సామాన్య ప్రజాభాషయందు సామాన్యప్రజాభావములను కవితాచిత్రములుగ రచించుటయే వర్డ్స్వర్త్ ఉద్దేశము. ప్రాథమిక మనోనురాగములు జానపద దశయందే స్వచ్ఛముగ నుండును. అప్పుడు వాటిని సులభముగ ఊహింపవచ్చును; శక్తియుతముగ చిత్రింపవచ్చును. జానపదజీవితము ఈ ప్రాథమికమనోనురాగములనుండియే అంకురించును — ఇవి వర్డ్స్వర్త్ భావములు.

కవితాభాష సామాన్యప్రజాభాష కావలె నన్న భావము ననేకులు ఖండించిరి. విద్యాగంధములేని సామాన్యప్రజలు వ్యవహరించుభాష కవితాభాష కాకూడదని కూలిడ్జ్ సహితము వాదించెను. మనదేశమున కూడ ఇట్టిభావము వ్యాపించినప్పుడు అనేకులు ప్రతిఘటించిరి. వర్డ్స్వర్త్ భావ మెంత సమంజసముగ నున్నను ఆచరణయోగ్యము మాత్రము కాజాలకపోయెను. కాని 'ప్రకృతికి మరలుడు' అన్న వర్డ్స్వర్త్ పిలుపు స్వాతంత్ర్యశంఖధ్వాన మయ్యెను. మానవ హృదయమే కవితావస్తువాయెను. వర్డ్స్వర్త్ మనదేశమున నండూరి కవివలె నూతన సాహిత్య ప్రజాస్వామ్యమునకు ప్రభాతగీతమును పాడెను.

వర్డ్స్వర్త్కు ప్రకృతి ఉపాస్యదేవత అని యింతకుముందే చెప్పియుంటిని. ప్రకృతియందతీంద్రియమగు ఒకమహాసత్త్వము నిండియున్నదనియు, ప్రకృతి అందుచే పరమగురువనియు అతనిమతము.

"One impulse from a vernal wood
May teach you more of man"
Of moral evil and of good
Than a'l the sages can."

లార్డు మార్లేవంటి విమర్శకులు ఈ మతమును కొంతవరకు ఖండించిరి. ప్రకృతి పరమగురు వెట్లగునని వారిప్రశ్న. ఆర్యులు ప్రకృతి నుపాసించిరి. ప్రకృతిసౌందర్యమున సత్యమును దర్శించిరి. సూర్యుడు వారికి సమస్తచరాచరాత్మకుడగు జ్ఞానస్వరూపుడు. అతడు ప్రేయసి నభిసరించు ప్రియునివలె కాంతిమతియగు నుషస్సు వెనుదగిలి, దేవతలు సదా క్రీడించు ఆనందధామమున తనప్రకాశమును పంచిపెట్టుచున్నాడు. "ఆకాశము వాయువు, భూమి, అగ్ని, నదీనదములు, పర్వతములు అన్నియు సజీవములే; అన్నియు దివ్యస్వరూపములే; అన్నియు పరమేశ్వరుని విభూతులే. వర్డ్స్వర్త్ ఇట్టిసత్యమునే దర్శించెను. వాస్తవికశాస్త్రములే విజ్ఞానసర్వస్వమని తలంచుపాశ్చాత్యులకు వర్డ్స్వర్త్ప్రకృతితత్త్వము బాగుగా అవబో



శాంతి నికేతనము

ధము కాక వారు దానిని ప్రతిఘటించిరి. అత నిని సమర్థింపజూచిన హడ్సన్ పండితుడుకూడ ఆతనిని సరిగ అర్థముచేసికొనలేదు.

Books ! it's a dull and endless strife
Come, hear the woodland linnet,
How sweet his music ! on my life
There is more of wisdom in it "

అను పద్యముపై వ్రాయుచు హడ్సన్ పండి తుడు

"Though his recoil from mere bookishness manifestly prompted him to a tooemphatic and over-fanciful expression, I do not think he meant that nature teaches better than books the things which books teach."

అని చెప్పినాడు. సామాన్యులకు మరొక మార్గము లేదు. సత్యద్రష్టలగు మహా కవుల భావములు సామాన్యులకు సులభ గ్రాహ్యములు కాకపోవుట వింత కాదు. వర్డ్స్వర్త్ కేవలము కవి కాడు. అతడు సౌందర్యానందములయందు బ్రహ్మమును గాంచిన ఋషివర్యుడు. కవి కీ దివ్యదృష్టి యుండుటవలననే కాబోలు 'నానృషిః కురు తే కావ్యమ్' అని మన దేశమున కవికి ఋషిస్థానము నిచ్చినారు. మరొకమె ట్టెక్కి "కవి ర్బ్రహ్మా కవి ర్విష్ణుః కవి ర్దేవో మహే శ్వరః" అని కవికి దివ్యత్వమునే ఆపాదించి నారు.

౧౭౯౮-వ సంవత్సరములో వర్డ్స్వర్త్ మేరీని పెండ్లాడెను. అతని జీవితములో ఆమె యొక క్రొత్త ఆనందజ్యోతిని వెలిగిం చెను. ఇరవదేండ్లు మనకవి అవిచ్ఛిన్నమగు ఆనందమయ జీవితమును గడిపెను.

8

వర్డ్స్వర్త్ వృద్ధు డగుచున్నకొలది అతని భావములుకూడ పరివర్తనములు కాజొ చ్చెను. దేహదౌర్బల్యముతో హృదయ దౌర్బల్యముకూడ హెచ్చసాగెను. యౌవన మున ప్రజ ను సమర్థించిన మన కవి ఇప్పుడు ఏ విప్లవసూత్రములను ఆచర ణలో పెట్టిన నెపోలియనును ఖండించెను. అతని పరాజయ మాతని కానందదాయక మాయెను. అతని రాజకీయ తత్త్వము పూర్తిగ మారెను. ప్రజాపరిపాలనమునం దేవ కలిగెను; టోరీలలో అగ్రగణ్యు డాయెను. నాటినుండియు అతని కవితా ప్రతిభయు తగ్గజొచ్చెను. ౧౮౦౮నుండి అతని కవితాశక్తి తగ్గ నారంభించె నని లార్డు మార్లే అభిప్రాయము. దీని తరువాత ముప్పదేండ్లవరకు కావ్యము లల్లెను కాని అవి గణనీయములు కావు.

౧౮౩౫ నుండి వర్డ్స్వర్త్ జీవితమున విషాద మేఘములు క్రమ్మసాగెను. ఆ సంవత్సర మున అతని సోదరి డరోతి దురంత రోగ గ్రస్తయాయెను. నాలుగేండ్లకు పిదప అతని ప్రియమిత్రుడు కూలరిడ్జ్ పరమపదించెను. మరి రెండేండ్లలోనే మేరీఅక్క సారా కాల గతి నొందెను వర్డ్స్వర్త్ జీవితమునందలి ఆనందము సన్నగిలసాగెను. "సంపుటముల నింపజాలు విషయ మున్నది, కాని దాని నాలపించు యౌవనము లేదే" అని మనకవి ఖిన్నుడగుచుండెను. కోకిల యనిన అతని కెంతో అభిమానము. అట్టి కోకిలగానము నయితము ఆనందించుటకు శక్తితగ్గెను. 'కోకిల ఎంత మధురముగ కూయుచున్నది!'

అని అతనిమిత్రుడు రెండుమూడుసార్లతనిని హెచ్చరించవలసి వచ్చెను.

> " List - It was cuckoo - O with what delight
> Heard I that voice! and catch it now, though faint,
> Far off and faint, and melting into air,
> Yet not to be mistaken."

అని అప్పుడు వర్డ్సువర్తు తన అసహాయతను తెలిపికొనినాడు.


౫

నూతనత్వము ఏదేశమునందైనను దూషింపబడుచునే యుండును. లార్డు జెఫ్రీ ఆకాలపు సుప్రసిద్ధ విమర్శకుడు, వర్డ్సువర్తు రచించిన ఏ కావ్యమునైనను అతడు పొగిడి ఎఱుగడు. అతని కావ్యములు "అర్థములేని వ్రాతలు అని తెగనాడెను. "ఇంతకన్న అధమ కవిత్వము నేనెన్నడు చదివియుండలేదు" అని మరియొకచో వ్రాసెను. వర్డ్సువర్తు ఈ దూషణల కించుకంతయు చలింపలేదు. ఈ విమర్శనలను గుఱించి లేడీ బోమంట్ (Lady Beaumont) అను తన స్నేహితురాలికి వ్రాయుచు

> " Every great and original writer, in proportion as he is great and original, must himself create the taste by which he is to be realised. "

అని వ్రాసెను. ప్రతిభాశాలియగు కవి రుచులను చక్కదిద్దునుగాని తనకాలపు రుచులకు సామాన్యునివలె లొంగడు. కరుణారసమే ప్రధానముగా కావ్యమును రచించి తనకాలపు రుచులకు లొంగక క్రొత్తరుచుల నూరించిన భవభూతిమహాకవి ఈ సత్యమునే మనదేశమున చాటినాడు.

వర్డ్సువర్తు జీవితకాలముననే దేశమున రుచులు మారసాగెను. అతని కవిత యువకుల నాకర్షించెను. ౧౮౩౮లో డర్హామ్, ఆక్స్‌ఫర్డు విశ్వకళాపరిషత్తులు అతనిని గౌరవించెను. వర్డ్సువర్తుకు సామ్రాజ్య కవీశ్వర పదవి లభించెను. ఇట్టిగౌరవము నంది ౧౮౫౦లో ఎనుబదేండ్లప్రాయమున ఈ మహాకవివర్యుడు పరమపదము నొందెను.



యుద్ధం రానున్నదా?

మామిడిపూడి వేంకటరంగయ్య

౧

ప్రస్తుతము స్పెయిన్ దేశమునను చైనా దేశమందును కొంతకాలమునుండి యుద్ధములు జరుగుచున్నవి. స్పెయిన్ దేశములోని యుద్ధము ప్రజలలో నేర్పడి యుండు రెండుపక్షములవారిమధ్యన జరుగుచుండు అంతఃకలహము. ఇందులో ఒకపక్షము ప్రజాప్రభుత్వ విధానమందును, కూలిపని జేసికొని జీవించు సామాన్య జనుల యోగక్షేమమందును విశ్వాసము కలిగి వాటికై కృషిచేయుచుండునది. రెండుసంవత్సరములకు పూర్వము యుద్ధ మారంభించుటకు కొంతముందు దేశమున జరిగిన ఎన్నికలలో ఈపక్షమువారు గెలిచిరి. అందుచే దీనిలోని నాయకులు మంత్రివర్గముగ నేర్పడి, దేశప్రభుత్వమును కొనసాగించుచుండిరి. అప్పటికి అమలులో నుండిన రాజ్యాంగచట్టము ననుసరించి ప్రభుత్వాధికారము సంపాదించినందున ఈమంత్రివర్గమునకు చెందిన పక్షమువారికి ప్రభుత్వపక్షమువారను పేరు కలిగినది. వీరి నెదిరించుచుండు పక్షమునకు ఫ్రాంకో అనుసేనాని నాయకుడుగ నున్నాడు. ప్రజాప్రభుత్వమున నమ్మకములేనివారును, ధనికుల లాభమును ఎక్కువగ కోరుచుండువారును, ప్రాచీన మతసంప్రదాయములందు గౌరవాభిమానములు ఎక్కువగ కలవారును ఫ్రాంకోపక్షమున చేరియున్నారు ఈరెండుసంవత్సరములలో దేశమందలి $\frac{2}{3}$ భాగమును ఫ్రాంకో వశపరచుకొనగలిగెను. ఇంతటివిజయ మితడు సంపాదించుటకు ఇతని స్వబలము కారణము కాదు; ప్రజలలో ఎక్కువభాగ మితనియందు సానుభూతి గలిగియున్నారని అనుకొనుటకు గాని, దాని మూలమున ఇతడు దేశములో చాలభాగమును వశపరచుకొనగలిగెనని అనుకొనుటకుగాని కారణములు లేవు. ఇతనిజయమున కంతకు జర్మనీ ఇటలీదేశముల ప్రభువులు చేయుచుండు సహాయమే ప్రధానమగు కారణము. ఇతనిసేనలో వేలకొలదిజర్మనులు ఇటాలియనులు చేరియున్నారు; ఇతని విమానదళములో నూటికి తొంబది వరకు జర్మనీ ఇటాలియన్ విమానములే; ఇతని సైన్యమునకు శిక్ష గరపుచుండువట్టియు, యుద్ధమునందు శాస్త్రనైపుణ్యము చూపుచుండువట్టియు ప్రముఖులు జర్మనీ ఇటలీదేశములనుండి వచ్చినవారే. బలవంతులగు విదేశప్రభువుల సహాయ ముండుటచేతనే ఫ్రాంకోకు ఇంతటివిజయము లభించెను. ప్రజాప్రభుత్వపక్షమువారికి జయము రాకుండుటకు విదేశములనుండి ఎక్కువ సహాయము వారికి లభింపకుండుటయే కారణము. రషియావారును ఫ్రెంచివారును కొంత సహాయము చేయుచుండిరిగాని, ఫ్రాంకోకు లభించినసహాయముతో దీనిని పోల్చి చూచినయెడల ఇది చాల స్వల్పమైనదని చెప్పక తప్పదు.

విదేశసైనికు లనేకు లీరెండుపక్షముల చేరియుండుటచేతనే ఈయుద్ధమున కింతప్రాముఖ్యము వచ్చినది; అన్నిదేశములవారు ఈయుద్ధమునుసరించి ఎక్కువగ విమర్శించుచుండుటకును, ఇందు కలుగుచుండు జయాపజయముల విషయమున సంతోషమును కొందరును, విచారమును మరికొందరును వెలిబుచ్చుచుండుటకును ఇదియే కారణము. ఫ్రాంకోపక్షమువారు జయించినయెడల ఇటలీ జర్మనీ ప్రభువులు జయించిరనియు, రషియా ఫ్రెంచి ప్రభుత్వములవారు ఓడిరనియు చెప్పవలసియుండును. ఒకవైపున జర్మనీ, ఇటలీదేశములును, మరియొకవైపున రషియా ఫ్రెంచిదేశములును కలిసి, స్పెయిన్‌లో ఈయుద్ధమును సాగించుచున్నవని చెప్పుటలో అతిశయోక్తి ఎట్టిదియు లేదు. ఇదియే దీని ప్రధానలక్షణము. ఇందుచేతనే కాలక్రమమున ఇది ప్రపంచయుద్ధముగ పరిణమించునేమో అనుభయము అన్నిప్రభుత్వములవారికి కలుగుచున్నది.

చైనాలో జరుగుచుండు యుద్ధముగూడ కొంతవరకు ఇట్టిభయమునకు హేతు వగుచున్నది. స్థూలదృష్టితో చూచినయెడల ఇది చైనావారికిని, జపాను

వారికిని జరుగుచుండు యుద్ధమని కన్పడును. కాని కొంతవరకు రషియావారు చైనావారికి సహాయము చేయుచున్నారని చెప్పుటకు హేతువులు కలవు. జపాన్ వారికి పరిపూర్ణమగు జయము లభించుట రషియావారికిని, ఫ్రెంచివారికిని, ఇంగ్లీషువారికిని ఇష్టము లేదు. అట్టిజయము వారికి కలుగునని తోచినపుడు రషియా, ఇంగ్లండు, ఫ్రాంసుదేశములవారు జపానుపైకి వెళ్లెదరేమో యనుఅనుమానము అనేకులమనస్సులం దున్నది. స్పెయిన్, చైనా దేశములలోని యుద్ధములు ప్రస్తుతము స్థానికములుగ నున్నను, పైకారణములవలన నివి ప్రపంచయుద్ధములుగ మారిన మారవచ్చునని అనుకొనుటకు అవకాశము కలుగుచున్నది.

ఒకప్రదేశమందుమాత్రము, లేక రెండుమూడు దేశములలోనివారికిమాత్రము జరుగుచుండుయుద్ధమునకు స్థానికయుద్ధమను పేరు తగియున్నది. అట్లుగాక అనేక ప్రదేశములందును, అనేక దేశములలోనివారికిని ఏకకాలమున జరుగుయుద్ధమును ప్రపంచయుద్ధమని చెప్పవచ్చును. ౧౯౧౪ మొదలు ౧౯౧౮ వరకు జరిగిన యుద్ధమును ప్రపంచయుద్ధమని మనము వాడుచుండుట కిదియే కారణము.

౨

స్థానికవేషమును ధరించియుండు ప్రస్తుతపు యుద్ధములు ప్రపంచయుద్ధములుగ మారునా అను ప్రశ్నకు ఈనాటి ప్రపంచపరిస్థితుల విమర్శయే తగిన జవాబు. ఈవిమర్శవలన పరిస్థితులయొక్క ప్రధానలక్షణములు స్పష్టమగును.

ప్రపంచములోని భూభాగముయొక్క విస్తీర్ణము ౫,౧౧,౦౦,౦౦౦ (అయిదుకోట్ల పదకొండు లక్షల) చదరపుమైళ్లు. అందు ౪,౪౧,౦౦,౦౦౦ (నాలుగుకోట్ల నలభైఒకలక్షల) చదరపుమైళ్లు — అనగా నూటికి ఎనభై అయిదువంతులు పాశ్చాత్యుల అధీనమం దున్నది. ఐరోపాఖండవాసులగు పాశ్చాత్యులు కాలక్రమమున అమెరికా, ఓషనియా (ఆస్ట్రేలియా మొదలగు దేశములతో కూడినట్టిది), ఆఫ్రికాఖండముల నన్నిటిని వశపరచుకొనిరి; ఆసియాఖండములో నూటికి యాభై ఆరువంతులు వారియాధీనమం దున్నది. ప్రపంచములో నింతభాగమును వారేల దిగమ్రింగవలెను? ప్రాగ్దేశములలోనివారందరు చేతగానివారై యుండవలసినదేనా? ఈపాశ్చాత్యవ్యాప్తి అంతయు క్రీ. శ. ౧౫౦౦ నాటినుండి విజృంభించినదిగదా? తగిన ప్రయత్నముల గావించినయెడల ప్రాగ్దేశములవారు కూడ ఇట్టికార్యమును సాధింపజాలరా? అను ప్రశ్నలన్నియు ఆసియాఖండములో ననేకుల నిటీవల కలవరపెట్టసాగెను. ఇట్టికోరికను ఎక్కువగ పొందినవారు జపానువారు. కలవరముతోటిమాత్రము తృప్తినొందక, తగిన ఉత్సాహమును, పట్టుదలను, నిర్మాణశక్తిని చూపి వారికి సమీపమున నుండిన దేశభాగములను కొన్నిటిని ఆక్రమించుకొనగలిగిరి. ౧౮౬౮ లో జపానువారికి విశేషరాజ్యమే లేదు; వారు ౧,౪౭,౦౦౦ మైళ్ల విస్తీర్ణముగల స్వదేశమునుమాత్రమే పాలించుచుండిరి. అప్పటినుండి వారు పాశ్చాత్యుల రాజనీతి ననుకరించి చైనాదేశమునుండి చాలభాగమును విడదీసి, ఇప్పుడు సుమారు ౬,౨౦,౦౦౦ (ఆరులక్షల ఇరువదివేల) చదరపుమైళ్ల విస్తీర్ణముగల విదేశముల కధికారులుగ నున్నారు. కాని, ఇంతటితో వారికి తృప్తి కలుగలేదు. పాశ్చాత్యులలో బలవంతులని పేరు గాంచిన ఇంగ్లీషువారు ఫ్రెంచివారు మొదలగువారు సంపాదించినదానికంటె నధికమగు సామ్రాజ్యమును సంపాదింపవలెనను ఆశ వారిని పట్టుకొనియున్నది. అందుచేత వారిప్పుడు యుద్ధసన్నద్ధులై, ఇతరరాష్ట్రములను బలాత్కరించి వశపరచుకొనుటలో అధర్మమేమియు లేదనువాదములో దిగియున్నారు. చైనాదేశముపైనమాత్రమేగాక, జావా మొదలగు ద్వీపములతో గూడిన డచ్చిసామ్రాజ్యముమీదను, రషియాలో చేరియుండు సైబేరియాపైనను, ఆంగ్లేయసామ్రాజ్యములోని ఆస్ట్రేలియామీదను, ఫ్రెంచిసామ్రాజ్యములోని ఇండో—చైనాపైనను వారు కన్నువేసియున్నారు. చైనాలో వారిప్పుడు చేయుచుండుయుద్ధమున వారికి జయము కలిగినయెడల రషియా మొదలగు సామ్రాజ్యములకు వారివలన తప్పక ముప్పు గలుగును. ఇట్టిసందర్భములో వారిప్రయత్నములను విఫ

తముచేయుటకు రషియావారును తక్కినవారును పూనుకొనకయుందురా? తగిన సమయమును నిరీక్షించి, జపాన్ పైకి వారు యుద్ధమునకు వెళ్లవలసినపరిస్థితులు కొలది కాలములో తప్పక వచ్చును. అందుచేతనే, ఇప్పుడు చైనాలో జరుగుచుండు యుద్ధము ప్రపంచయుద్ధముగ మారు నని అనేకు లనుకొనుచున్నారు.

“జపాన్‌వారు చైనావారిని జయించినంతమాత్రమున మనకు కలుగునష్ట మేమిటి? ఇండియాను, బర్మాను, జావాను, ఆఫ్రికాలోని దేశములను మనము జయించినట్లే వారు చైనాను జయింప ప్రయత్నించుచున్నారు. మన మేల వారి కడ్డుతగులవలెను? మనయధీనమందలి దేశములపైకి వారు రాకుండునంతవరకు వా రేమిచేసిన మన కేమి?” అని ఇంగ్లీషువారును ఇతర పాశ్చాత్యులును తలచినయెడల జపాన్‌మూలమున ప్రపంచయుద్ధము రాకపోవచ్చును. కాని, వా రెప్పుడైన ఇట్లనుకొని, జపాన్ యెడల ఉదాసీనభావమును వహింతురా? చైనాను స్వాధీనపరచుకొనినతర్వాత జపాన్‌వారు తమపైకి దండెత్తుదురను భయము వీ రందరికి కలదు. అట్టిప్రమాదము జరుగకముందే వారు తగినచర్యను తీసుకొనగలరు.

3

స్వాతంత్ర్య మనుభవించుచుండు పాశ్చాత్యదేశములు రెండురకములుగ నున్నవి. విదేశములపై అధికారము గలిగి సామ్రాజ్యములను తమవశమందుంచుకొనియుండు దేశములు కొన్ని. సామ్రాజ్యాధికారము లేని దేశములు మరికొన్ని. దేశములలో ననేకములు రెండవరకములో చేరియున్నవి. మొదటిరకములో చేరి సామ్రాజ్యముల ననుభవించుచుండు దేశములలో ముఖ్యములైనవి: (౧) ఇంగ్లండు, (౨) ఫ్రాన్సు, (3) ఇటలీ, (౪)హాలెండు, (౫)బెల్జియం, (౬) పోర్చుగల్, (౭) స్పెయిన్, (౮) యునైటెడ్ స్టేట్సు. ఒకప్పుడు రషియాదేశముకూడ ఈతరగతిలో చేరియుండెను. కాని ఆదేశములోని ప్రాతకాలపు రాజ్యాంగపద్ధతి మారి, సామ్యవాదానుసారమగు ప్రభుత్వము ఏర్పడినది మొదలు సామ్రాజ్య మనుపేరు దానికి తగినది కాదని చెప్పవచ్చును. ఒక దేశమునకు లోబడి అనేక దేశము లుండుటయే సామ్రాజ్యమునకు ప్రధానలక్షణము. ఇప్పటి రషియాయొక్క వైశాల్యము సుమారు ఎనభైరెండులక్షల చదరపుమైళ్లను (అనగా ఇండియాకంటె రమారమి రెట్లుపెద్దది), ఇందులో ఒకప్రదేశమువారు అధికారము కలిగియుండుట, తక్కిన ప్రదేశముల లోనివారు వారికి లోబడియుండుట అనుపస్థితి లేనందున రషియాను సామ్రాజ్యములలో చేర్చుట తగదు. పైన ఉదాహరించిన ఎనిమిది దేశములు మాత్రమే సామ్రాజ్యాధిపత్యమును వహించియున్నవి.

సామ్రాజ్యములేనిపాశ్చాత్యదేశములలో సామ్రాజ్యము నేవిధముగనైన సంపాదింపవలెననెడి ఆశ ఒక జర్మనీకితప్ప మరి ఏదేశమునకును లేదు. తక్కినదేశములన్నియు తమ కున్నదానితో తృప్తిజెందియున్నవి. అవి అట్లుండక విధిలేదు. విదేశముల జయించుటకు కావలసిన బలముగాని, శక్తిసామర్థ్యములుగాని వాటికి లేవు. జర్మనీయొక్క స్థితి ఇట్టిది కాదు. ఐరోపాఖండమందలి దేశములలో విస్తీర్ణమందును జనసంఖ్యయందును ప్రజల తెలివితేటలయందును నాయకుల నైపుణ్యమందును పేరొందినవగినవాటిలో జర్మనీ ఒకటిగ నున్నది. గడచిన ప్రపంచయుద్ధమునకు పూర్వము ఖండాంతరములందు కొన్నిదేశములు దీనియధీనమం దుండుటచే సామ్రాజ్యాధిపత్యము వహించినదేశములలో నిది చేరియుండెను. ఆయుద్ధమం దపజయము గాంచుటచేత, విదేశముల నన్నిటిని కోల్పోయి సామాన్యపు స్వతంత్రదేశములలో నొక్కటిగ మారవలసివచ్చెను. కాని ఇట్లు సామాన్యులవలె జీవించియుండుట ఆదేశపునాయకు లెవ్వరికిని ఇష్టములేదు. ముఖ్యముగ గడచిన అయిదుసంవత్సరములనుండి నిరంకుశాధికారము వహించియుండు హిట్లరుకు ఇట్టిదీనస్థితి ఎంతమాత్రమును నచ్చినది కాదు. ప్రపంచములోని జాతు లన్నిటిలో జర్మన్‌జాతి అగ్రజాతి అనియు, జర్మనుల నాగరికత ఉత్కృష్టమైనదనియు, ఇట్టివారు సామ్రాజ్యములేక తమదేశముతో తృప్తిపడవలసివచ్చుటకంటె అవమానకరమగు విషయము మరియొకటి యుండజాల దనియు, భరింపలేని ఈయవమానము పోగొట్టుకొనుటకు సామ్రాజ్యసంపాదనముతప్ప మార్గాంతరము లే దనియు అతని దృఢనిశ్చయము.

ఇటలీదేశమునకు నియంతయగు ముసొలినీ యొక్క ఆశయములుగూడ నిట్టివే. ఐరోపాఖండపు ప్రాచీనచరిత్రలో అగ్రగణ్యులను గాంచిన దేశము ఇటలీ దేశము. దీనికి రాజధానియగు రోమ్‌నగరవాసులు అయిదారువందల సంవత్సరములకాలము బహుళవిస్తీర్ణము గలిగి ఇప్పటి ఇంగ్లండు, ఫ్రాన్సు, స్పెయిన్, పోర్చుగల్, జర్మనీ, స్విట్జర్లాండు, హంగేరి, బాల్కన్ ద్వీపకల్పము లోనగు ఐరోపాఖండములోని దేశములనే గాక ఈజిప్టుమొదలు మరాకోవరకుగల ఉత్తరఆఫ్రికాలోని దేశములను ఆసియాఖండపు పశ్చిమటిభాగములో చాలప్రదేశమును పరిపాలించియుండిరి. రోమకసామ్రాజ్యము జగద్విఖ్యాతములగు సామ్రాజ్యములలో నొక్కటి. అట్టి సామ్రాజ్యమును మరియొకమారు స్థాపించుట ఇటలీదేశస్థుల సహజధర్మమను దృఢవిశ్వాసము ముసొలినీకి కలదు. ఇటలీకి ఇప్పుడు సామ్రాజ్యము లేకపోలేదు. ఈదేశముయొక్క విస్తీర్ణము ౧,౧౯,౦౦౦ చదరపుమైళ్లయినను, దీనియధీనమందు ప్రస్తుతము (అబిసీనియాతో కలిపి) పదమూడు లక్షల మైళ్ల విస్తీర్ణముగల సామ్రాజ్యమున్నది. కాని పూర్వకాలపు రోమ్‌నగరవైభవమునకును దీనికిని హస్తిమశకాంతర భేదము కలదు. స్వతంత్రరాజ్యములలో పేరుప్రతిష్ఠలు లేనట్టియు, ౧౨,౦౦౧ చదరపుమైళ్ల విస్తీర్ణముగలిగినట్టియు బెల్జియం అను చిన్నదేశమునకు ౯,౮౦,౦౦౦ మైళ్ల సామ్రాజ్యమును; ౧౩,౦౦౦ మైళ్ళ విస్తీర్ణముగల హాలెండువశమున ఎనిమిదిలక్షలమైళ్ళ సామ్రాజ్యమును; ౩౬,౦౦౦ మైళ్ల విస్తీర్ణముగల పోర్చుగల్ దేశమునకు కూడ అంతటి సామ్రాజ్యమును; విదేశస్థుల సహాయము లేక అంతఃకలహమును అంతరింపజేసుకొనలేనట్టి స్పెయిన్ దేశమునకు ౧౩ లక్షలమైళ్ళ సామ్రాజ్యమును ఉండుటయు, సైనికబలమందును నౌకాదళమునను వాయువిమానములయందును అసమానమగు సంపదను గడించిన ఇటలీదేశపు గౌరవమునకు తగినంతటి సామ్రాజ్యము లేకపోవుటయు చూడ ప్రపంచములోని రాజ్యాంగపద్ధతులు తలక్రిందులుగ నున్నట్లే ముసొలినీకి తోచుచున్నది. పౌరుషవంతులును బలవంతులును అగు ఇటాలియన్లవంటివారికి సామ్రాజ్యసంస్థాపనము జన్మహక్కు వంటిది. అట్టిహక్కును స్థిరపరచుకొని దానివలన కలుగులాభమును అనుభవింప నిష్టపడనియెడల సృష్టికర్త ఇటాలియనులను ఏయుద్దేశముతో సృజించెనో ఆయుద్దేశమునకు భిన్నముగ వారు నడచుకొనినవారగుదురు. కావున ఇటాలియన్లధర్మమిదియే యని గ్రహించి, తక్కినసంశయముల నన్నిటిని వదలి, చేతగానివారు పలుకు న్యాయాన్యాయవిచారమును లక్ష్యపెట్టక విదేశముల జయించుటకన్న వేరుముఖ్యకార్యము లేదనుటయే ముసొలినీయొక్క మతము. ఇట్లు జయింపదగిన దేశములలో ముఖ్యములైనవి మధ్యధరాసముద్రతీరమందుండునవియే. ఈజిప్టు మొదలగు ఉత్తర ఆఫ్రికాలోని దేశములును పశ్చిమ ఆసియాలోని సిరియా, పాలెస్టయిన్, అరేబియా, టర్కీదేశములును ఎప్పటికైన ఇటలీ వశపరచుకొనక తప్పదనియే అతని నమ్మకము.

సామ్రాజ్యమేలేని జర్మనీదేశమును, ఉన్నసామ్రాజ్యముతో తృప్తినొందక దాని నెక్కువ వృద్ధిచేసుకొనవలయునని నిశ్చయించుకొనిన ఇటలీ జపాన్ దేశములును ప్రపంచయుద్ధము వచ్చుటకు కారణములైయున్నవి. ఇట్టియుద్ధమందు ఈదేశములవారికి జయము కలిగినగాని వీరిఆశయములు నెరవేరజాలవు. బలహీనులగు వారికిట్టికోరిక లున్నయెడల ఎట్టిప్రమాదమును కలుగజాలదు. ఈమూడుదేశములును బలిష్ఠములుగ నున్నవి. సాహసించి వాని నెదుర్కొనగల శక్తిగల ప్రభుత్వము లనేకములు లేవు. అట్టిశక్తిగల ప్రభుత్వములు ప్రస్తుతము నాలుగున్నవి. ఇంగ్లండు, ఫ్రాన్సు, రషియా, యునైటెడ్ స్టేట్సుప్రభుత్వములే ఇవి. ప్రపంచయుద్ధము వచ్చునదీ, లేనిదీ వీరిపైరినిబట్టి యుండును. వీరు ఉదాసీనులై యుండినయెడల బహుసులభముగ జర్మనీవారును ఇటలీవారును తమకోర్కెల నరవేర్చుకొనగలిగియుందురు. రెండుమూడు నెలలలో గొప్పసామ్రాజ్యములు వీరివశమగును. కాని, ఇంగ్లీషువారును ఫ్రెంచివారును ఉదాసీనులై యుందురా? లేక వీరి ప్రయత్నములను బహిరంగముగ అడ్డెదరా? అడ్డుటకే వీరు నిశ్చయించుకొనినయెడల హిట్లరు ముసొలనీలు తమప్రయత్నములనైన మానుకొనవలెను; లేక జపాన్ వారితో కలసి ప్రపంచయుద్ధమునకు పూనుకొనవలసి యుండును.

౪

౧౯౩౧-వ సంవత్సరము తర్వాత జరిగిన విషయములనుబట్టి ఇంగ్లీషువారును ఫ్రెంచివారును యుద్ధమనిన బెదరుచున్నా రనియు, ఎవ రేమి చేసినను వారూరకుండెద రనియు అనేకులు అభిప్రాయపడియున్నారు. ఇట్టి అభిప్రాయము వ్యాపించుటకు కారణములనేకము లున్నవి. ప్రపంచములో ఒకరాజ్యమునకును మరియొకదానికిని వివాదము లేవైన కలిగినపుడు వాటిని రాజీమూలముగ పరిష్కరించుటకును, వాటిమూలమున యుద్ధములు రాకుండజేయుటకును నానాజాతిసమితిని ౧౯౨౦ లో స్థాపించిరి. ఆసమితిలోని సభ్యులలో ముఖ్యులు ఇంగ్లండు, ఫ్రాన్సు, ఇటలీ, జపాన్ దేశములవారు కొంతకాల మైనతర్వాత జర్మనీ రష్యా దేశములుకూడ అందులో చేరినవి. ౧౯౩౧-వ సంవత్సరమువరకు ఈసమితి ఏదో కొంత తృప్తికరముగ పని చేసినను అదిమొదలు చైతన్యహీనమై పరిహాసపాత్రమైనది కొంతకాలమునకు జపాన్ జర్మనీ ఇటలీ దేశములవారీసమితిని వదలి, సమితిషరత్తులకు విరుద్ధముగ యుద్ధములు జేసియు, సైన్యముల బలపరచుకొనియు సమితిని అందలి సభ్యులను ఎంతమాత్రమును లక్ష్యపెట్టుట మానిరి సమితిస్థాపనకు ముఖ్యకారకులు ఇంగ్లండు, ఫ్రాన్సు వారు. అట్టిసంస్థను ఎదిరించినవారిని శిక్షించలేకపోవుటయేగాక వారికార్యములను ప్రశంసింప సంసిద్ధులగుటకూడ జరిగెను. జపాన్వారు మంచూరియాను కబళించిరి; ఇంగ్లీషువారు, ఫ్రెంచివారు ఆఘోరమును చూచి సహించియుండిరేగాని సమితి సభ్యులలో నొకటియగు చైనాదేశమున కెట్టిసహాయమును చేయకపోయిరి. ఇటలీదేశము అబిసీనియాను హరించెను; ఇది చాల అన్యాయమని ప్రగల్భములాడి, ఇటలీవారిపై వ్యాపారసంబంధములగు ఆంక్షలు కొన్ని పెట్టుటకు వీరు కొంత ప్రయత్నము జేసిరిగాని, ఆవిషయమునగూడ పట్టుదలతో పనిజేయలేరైరి. సమితిని లక్ష్యపెట్టక హిట్లరు తనసైన్యములను వృద్ధిజేసికొనినను వీరు నోరు తెరవక ఊరకుండిరి. సమితిసభ్యులలో నొకటియగు స్పెయిన్ దేశపు ప్రభుత్వముపై తిరుగబడిన ఫ్రాంకోకు సహాయముచేయుటకై జర్మనులు ఇటాలియనులు సేన సేలు వచ్చుచుండినను వీరు ఆసైన్యముల నేవిధమునను నిరోధించరైరి. ఇట్లే ఆస్ట్రియాదేశమును హిట్లరు వశపరచుకొనినపుడు ఇంగ్లీషువారేమియు చేయుట కిష్టపడరైరి. ఇన్ని ప్రమాదములు సంభవించుచుండినను వీటి నన్నిటిని చూచుచు అసహాయులవలె ఇంగ్లీషువారు ప్రవర్తించినందున ఇకమీదటగూడ ఎక్కడ ఏమి జరిగినను వీరు తాటస్థ్యము వహింతురను అభిప్రాయము అనేకులలో వ్యాపించియున్నది.

కాని, కడవరకు వీరు తాటస్థ్యమునే వహించియుందురా? లేక హిట్లరు ముసోలినీలు హద్దుమీరుచున్నారని వారి నెదుర్కొనెదరా? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పుట చాల కష్టము. ప్రస్తుతము ఇంగ్లండును పాలించుచుండు మంత్రివర్గమువారియొక్క ఉద్దేశము లెట్టివో అక్కడివారికికూడ స్పష్టముగ లేదు. అట్టి సందర్భమున వారికమీదట ఎట్లు ప్రవర్తింతురో నిశ్చయించుట ఎట్లు? అయినను ఈ సందర్భమున ముఖ్యములగు కొన్ని అంశములు గమనింపవలసియున్నది.

గడచిన నాలుగైదుసంవత్సరములనుండి ఇంగ్లీషువారు యుద్ధమనిన భయపడుటకును, తాటస్థ్యభావము వహించియుండుటకును కారణములు కొన్ని కలవు. ప్రపంచమం దిదివరకు ఇంగ్లీషువారికిగల ఔన్నత్యమునకంతకును వారినౌకాబలమే కారణము. సముద్రముమీద వారి నెదిరించగలవా రెవ్వరును లేరైరి. శత్రువు లెవ్వరును ఇంగ్లండుపై దండెత్తివత్తురనుభయము వారికి లేకుండెను. సముద్రములను దాటినగాని ఖండాంతరములందు వారికి లోబడియుండు ఇండియా, ఈజిప్టు, ఆస్ట్రేలియా మొదలగు దేశములపై బడుటకు శత్రువు లెవ్వరికిని సాధ్యమయ్యెడిది కాదు. కాని గడచిన ఇరవై సంవత్సరముల లోను ఈ విషయమున మార్పు లనేకములు కలిగెను. ఇంగ్లీషు నౌకాబలముతో తులతూగగల నౌకాబలములు జపాన్వారును, యునైటెడ్ స్టేట్సువారును తయారుగావించుకొనిరి. ఇటలీవారుగూడ తమనౌకాబలమును వృద్ధిచేసికొనగలిగిరి. ఈ కారణములచేత ఇంగ్లీషువారి నౌకాధిక్యము తగ్గుట సంభవించెను. ఇదిగాక యుద్ధమందలి జయాపజయములకు నౌకాబలముకంటె ఆకాశవిమానబలము ముఖ్యమైన ఆధారమయ్యెను. కాని విమానముల

వృద్ధిచేసికొనుటయందు ఇంగ్లీషువారు తగిన శ్రద్ధను వహించలేదు. ఇటలీ, జర్మనీ, జపాన్ మొదలగు దేశములవారు వేలకొలది విమానములను తయారు చేసికొనియుండిరి. విదేశీయు లెన్నటికిని తమ దేశముపై దండెత్తి రాలేరను దృఢనమ్మకముగల ఇంగ్లీషువారు విమానవృద్ధిని మానికొందురేమో భయపడసాగిరి. బాంబులతో గూడిన విమానములు పెద్దపెద్దపట్టణములను, యుద్ధనౌకలను ఎంతసులభముగ నాశనము చేయగలిగియున్నవో స్పెయిన్ చైనాయుద్ధముల మూలమున మనకు తెలియుచునేయున్నది. వందలసంవత్సరముల నుండి శత్రువుకంటబడని లండన్ మొదలగు ఇంగ్లీషు పట్టణములు వాయువిమానములకు గురియై అత్యల్ప కాలమున వినాశము గాంచునేమో యనుభయము ఇంగ్లీషువారికి కలుగసాగెను. ఇట్లే ఇంగ్లండునకును ఇండియాకును రాదారియగు మధ్యధరాసముద్రమందలి ఇంగ్లీషు నౌకాబలమును ఇటాలియన్ల వాయువిమానములు అతిశీఘ్రముగ నాశనముచేయుట కవకాశ మేర్పడెను. ఈసముద్రములోని ముఖ్యములగు ఇంగ్లీషునౌకాశ్రయము లన్నియు ఇటలీకి చాల సమీపమందున్నవి. జిబ్రాల్టరు మాల్టా మొదలగు నౌకాశ్రయము లింతవరకు ఆంగ్లేయ సామ్రాజ్యములో ప్రధానమయిన కోటలుగ నుండెను. వారినౌకల రాకపోకలు సులభముగ జరుగుచుండుట కిదియే కారణము. కాని విమానబలము ప్రాముఖ్యము గాంచినందున నౌకలయొక్కయు నౌకాశ్రయముల యొక్కయు లాభము తగ్గసాగెను. జర్మనీ ఇటలీ దేశములు తయారుచేయుచున్నన్ని విమానములు తాము కూడా తయారుచేయగలిగినగాని వారితో యుద్ధము చేయుటకుబదులు రాజీపడియుండుటయే ఉత్తమమార్గమని ఇంగ్లీషువా రనుకొనుటలో ఆశ్చర్య మేమియు లేదు. ప్రపంచపరిణామములో పుట్టుచుండు అద్భుతములు దురూహ్యములు. విమాననిర్మాణము అట్టి అద్భుతములలో నొకటి. సామ్రాజ్యమున కంతకును ఆంగ్లేయుల నౌకాబలమే ఆధారముగ నుండెను. నౌకాబలముచే శత్రువు లెవ్వరు నిదివరకు వీరి నెదుర్కొనలే కుండిరి. కాని సాగరాంతర మొకటి విమానరూపముగ ప్రపంచమున బయలుదేరుటచేత, నౌకాబలపు ఆధిక్యము అదృశ్య మగుచున్నది.

ఇంగ్లీషువారు యుద్ధమునిన వెనుదీయుటకు మరి కొన్ని కారణములు కలవు. గతయుద్ధమందు ఇంగ్లీషువారికి జయము వచ్చుటకు రుష్యనియన్లు, ఇండియా, యునైటెడ్ స్టేట్సు, జపాన్ మొదలగు దేశములు చేసిన సహాయమే ముఖ్యకారణము. [illegible] పెంచియుండినను ఈకాలములో ఏదేశముగాని ఇతరుల సహాయము లేక గెలువజాలదు. ప్రపంచములో నాల్గవభాగము వరకు పరిపాలించుచుండు ఇంగ్లండుకూడ ఇట్టిస్థితియందే యున్నది. ఇటలీ జర్మనీలతో యుద్ధమునకు పూనుకొనిన యెడల, గతయుద్ధమందు వారికు సహాయము చేసినవా రందరును ఇప్పటియుద్ధములో సహాయము చేయరుగదా అనుమానమయ్యె ఇంగ్లీషుప్రభుత్వమువారికి సందేహము కలుగుచున్నది. జపాన్ వారి సహాయము చేయకపోవుట మాత్రమేగాక, శత్రుపక్షమున జేరి, వారి నౌకావళముతో సింగపూరు మొదలగు నౌకాశ్రయముల స్వాధీన పరచుకొనెదరేమో! కనడా, దక్షిణ ఆఫ్రికా, ఆస్ట్రేలియా మొదలగు డొమినియన్లు పూర్వమువలెగాక, ఇప్పుడు విదేశవ్యవహారములందు ఇంగ్లీషువారికి అనుచరులగుట కిష్టపడక, స్వతంత్రించి నడుచుకొనజూచుచున్నవి. ఆదేశములు యూరపుఖండమున కెంతో దూరమందున్నవి. యూరపులోని రాజకీయవ్యవహారములలో జోక్యము కలుగజేసికొని బెల్జియం, జెకోస్లోవేకియా, ఫ్రాన్సు మొదలగు దేశముల సంరక్షించుటకై తాము యుద్ధముచేయుట వారి కిష్టములేదు. వారి సహాయములేక ఇంగ్లీషువా రెంతకాలము యుద్ధము చేయగలరు? మరి, ఇండియాయొక్క స్థితిగూడ ఇప్పుడు మారియున్నదని వివరించి చెప్పవలసినది లేదు. గతయుద్ధమందు లక్షలకొలది సైనికుల నంపియు, కోట్లకొలది ద్రవ్యము నిచ్చియు మనము ఇంగ్లండును, ఇంగ్లీషుసామ్రాజ్యమును నిలబెట్టుటకు కంకణము గట్టుకొంటిమి. దానికై మనకు కలిగిన ప్రతిఫల మేమి? ఇంగ్లీషువా రిప్పుడు మరియొకమహాసంగ్రామమున ప్రవేశించినయెడల, ఇండియానుండి సహాయ మేమైన వారికి రాగలదా? ఈవిషయమై వారికే ఎంతో అనుమానము కలదు. యునైటెడ్ స్టేట్సువారు చేయుసహాయమును గురించికూడ ఇంగ్లీషువారి కిట్టి అనుమానమే కలదు. గతయుద్ధమున వారు ఇంగ్లీషువారి కెంతో సహాయము

చేసిరి. జర్మనీ అపజయము గాంచుటచేత నిరంకుశ ప్రభుత్వము లదృశ్యము లగు ననియు, ప్రజాప్రభుత్వములు ప్రపంచమం దంతట వ్యాపించుననియు, కష్టపడి ఉత్పత్తిగావించిన ధన మంతయు ప్రజల సౌఖ్యము కొఱకై వెచ్చింపబడునేగాని, యుద్ధములవ్యాజమున కోట్లకొలది ప్రాణుల వినాశమునకై వెచ్చింపబడ దనియు, ప్రపంచశాంతి నెలకొను ననియు వారు నమ్మియుండిరి. కాని ఇ దంతయు స్వప్నసమాన మయ్యెను. యూరపుఖండమును నిరంకుశప్రభుత్వములకు నెలవయ్యెను. అవి ప్రజలనుండి ఎక్కుడులేనిపన్నులను వసూలుచేసి, ఆద్రవ్యమునంతను ఘోరయుద్ధ మారణసాధనముల సంగ్రహించుటకై ఖర్చుపెట్టసాగెను. తమవద్గిర తీసకొనిన అప్పును చెల్లించుటకు ధనములేదని మొర పెట్టుకొనిన యూరపువారు యుద్ధసన్నాహమునకై అనంతముగ ధనమును ఖర్చుపెట్టుచున్నారు. ఇట్టి విపరీతబుద్ధిగల యూరపువారి వ్యవహారములలో తాము జోక్యము కలుగజేసికొనుటకంటె వెఱ్ఱితనము మరియొకటి లేదనియే అమెరికన్లలో బహుసంఖ్యాకుల అభిప్రాయము. అందుచేత వారుగూడ ఇంగ్లీషువారికి సహాయముచేయుదురను నమ్మకము తగ్గినది. ఇక మిగిలినది రషియాదేశ మొకటియే. కాని ఈదేశముతో మిక్కిలి సఖ్యముగ నుండుటకు ఇంగ్లీషుప్రభుత్వమువారికి ఇష్టమున్నట్లు లేదు. రషియారాజ్యాంగపద్ధతి సామ్యవాదానుసారమైనది. ఇంగ్లీషుప్రభుత్వమువా రన్ననో సామ్యవాదమును నిరసించువారు. ఇదిగాక, రషియాయొక్క సైన్యములు నౌకాబలము విమానబలము మొదలగువాటిని గురించి యథార్థ మిది యని తెలియుటలేదు. కావున వారితో ఎక్కువసఖ్యము చేసికొనినను లాభ ముండదేమోయని ఇంగ్లీషుప్రభుత్వమువారి అనుమానము.

పైన బేర్కొనిన పరిస్థితుల కారణముననే ఇంగ్లీషువారు గడచిన నాలుగైదు సంవత్సరములనుండియు జపాన్ ఇటలీ జర్మనీ ప్రభుత్వములవారు ఎంతటి దారుణకార్యముల జేసినను, ఒక్కొక్కప్పుడు తమ అసమ్మతినైనను తెలుపుటకుగూడ జంకి, అరణ్యవాసమునను అజ్ఞాతవాసమునను కాలముగడపుచుండిన పాండవులవలె ప్రవర్తింపవలసివచ్చెను. వీరిప్రవర్తన ఇకమీదటకూడ ఇదేవిధముగ నుండునా? వీరి అజ్ఞాతవాసము ముగిసిన దని అనుకొనవచ్చునా? అనువిషయమును విమర్శింపవలసియున్నది.

ఇంగ్లీషుప్రజలలో కొందరును, ప్రముఖులగు నాయకులలో కొందరును మంత్రివర్గమువా రవలంబించిన తాటస్థ్యవిధానమును ఖండించుచున్నారు. ఈ విధానము దేశగౌరవమునకు హానికరమైన దనియు, యుద్ధముచేసి అపజయము గాంచుటవలన ఎంతటినష్టము సంభవించునో అంతటినష్టము ఇప్పటి ఔదాసీన్యము వలన సంభవించు ననియు, పౌరుషముతో శత్రువుల నెదుర్కొనుటయే ఉత్తమధర్మ మనియు, ఇటలీ జర్మనీల మహత్తుల కన్నిటికిని అంగీకరించి లొంగిపోవుట ఆంగ్లేయుల అనాదిసంప్రదాయములకు విరుద్ధ మనియు వీ రభిప్రాయపడుచున్నారు. దీనిమూలమున మంత్రివర్గముయొక్క అభిప్రాయముకూడ త్వరలో మారుటను సూచనలు కనబడుచున్నవి.

గడచిన రెండుసంవత్సరములనుండి మంత్రివర్గమువారు రాబోవు ఉపద్రవముయొక్క స్వభావమును గుర్తెరిగి, యుద్ధసన్నాహమునకు మొదలిడి విశేషద్రవ్యమును ఖర్చుపెట్టుచున్నారు. ఆకాశవిమానముల సంఖ్య హెచ్చుచున్నది; క్రొత్తయుద్ధనౌకలు తయారగుచున్నవి; సైన్యములలో చేరుచుండువారుకూడ ఎక్కువగుచున్నారు. యుద్ధసమయమున కావలసియుండు పరికరములు ఆహారపదార్థములు లోనగునవి అధికముగ సంగ్రహింపబడుచున్నవి. యుద్ధమునకు సిద్ధులు కాకుండినందుననే మంత్రివర్గమువారు ముసొలినీని హిట్లరును బెదరించలేకుండిరి. సమరసామగ్రి వృద్ధియగుచుండుటచేత అట్టిభయమును వదలి కొంత ధైర్యముతో వర్తించుట కవకాశము కలుగుచున్నది.

యుద్ధ మనిన నిజముగ భయపడుటకు కారణము లనేకము లున్నవి. పూర్వకాలమున యుద్ధములు సంభవించినయెడల ఏకొద్దిమంది ప్రాణములకో నష్టము కలుగుచుండెను. యుద్ధముచేయు సైనికులసంఖ్య కొన్ని వందలో కొన్నివేలో ఉండెడిది. ఇప్పుడన్ననో సైని

పులసంఖ్య లక్షలకొలదిగ నున్నది. ఇదిగాక సాయుధులు నిరాయుధులు అనువివక్ష చేయక, శాంతముగ జీవనముచేయుచుండు సామాన్యజనులపై బాంబుల ప్రయోగించియు, వారికి కావలసిన ఆహారపదార్థముల రాకుండజేసియు, వారిని నిర్మూలముచేసి దేశమం దంతటను అనవసరముగ క్షోభను కలిగించుట ఇప్పటియుద్ధములకు లక్షణముయ్యెను. ఇట్టిసందర్భములలో ఏకతినహృదయుడో తప్ప తక్కినవా రందరును యుద్ధము రాకుండుటకై సర్వప్రయత్నములును చేయుచుందురు. నిరాయుధులగు పురుషులు, అబలలగు స్త్రీలు పిల్లలు మొదలగువారికి అకారణముగ నష్టము కలుగుననియే ఇంగ్లీషుమంత్రివర్గమువా రింతవరకు యుద్ధమనిన వెనుదీయుచున్నారు. కాని పరిస్థితులు నానాటికి ప్రమాదకరము లగుచున్న వనునమ్మకము కొంతవరకు వారియందుకూడ కలుగుచున్నది. వారితాటస్థ్యమునకు ప్రతిఫల మేమి?

అబిసీనియా ఇటలీయధీన మగుట, ఆకారణముచేత ఈజిప్టునందును ఏడెన్ ప్రాంతములందును ఎఱ్ఱసముద్రమందును ఇంగ్లీషువారికి ప్రమాదము హెచ్చుట, స్పెయిన్ దేశమున ఇటలీ జర్మనీసైన్యములు చేరుట, వీరియధీనమందుండు విమానాశ్రయములు వృద్ధియగుట, దీనిమూలాన మధ్యధరాసముద్రమునకు ప్రధాన ద్వారమగు జిబ్రాల్టరుకు ఉపద్రవము కలుగుట, దక్షిణ ఆఫ్రికాకు రాదారియగు అట్లాంటిక్ సముద్రమార్గమందుండు మెడీరియా, కానరీస్, అజోర్సు మొదలగు ద్వీపములలో జర్మనులు విమానాశ్రయముల నేర్పరచుకొని ఆ మార్గమున నడుచు ఇంగ్లీషునౌకల నడ్డగింపగలిగియుండుట, ఈ విధముగ ముఖ్యమైన మార్గములు శత్రువుల వశమగుటచేత మధ్యధరాసముద్రముమీదుగ రాకపోకలు దుస్సాధ్య మగుట, ముసాలినీమూలమున లిబియానుండి ఈజిప్టునకును పాలెస్టైనుకును ప్రమాదము సంభవించుట, జర్మనీవారు జెకోస్లోవేకియాపైకిగూడ దాడివెడలి, ఆరాష్ట్రమును భగ్నపరచి రుమేనియా బల్గేరియాలమీదుగ తూర్పు మధ్య ధరాసముద్రమును చేరుటకు ప్రయత్నించుట, మధ్యధరాసముద్రపు పశ్చిమ ద్వారమున ఫ్రాంకో, మధ్యన ఇటలీ, తూర్పున జర్మనీ ఇటలీలు తమ అధికారమును స్థాపించి అచటినుండి తూర్పుదేశములపై తమసామ్రాజ్యమును వ్యాపింప జేయజూచుట, — ఇన్నిపలములతో గూడుకొనిన ఇంగ్లీషు మంత్రివర్గమువారి తాటస్థ్యము సామ్రాజ్యమునకు ప్రమాదము కలిగించుచున్నదని గ్రహింపవలసిన సమయము వచ్చినది.

౬

పై వివరణములో ఫ్రాన్సునుగురించి విశేషముగ చెప్పియుండలేదు. కాని ప్రపంచయుద్ధము వచ్చినా అనువిషయములో ఇంగ్లీషువారి వైఖరి ఎంత ముఖ్యమో ఫ్రెంచివారివైఖరికూడ అంత ముఖ్యమే. ఫ్రెంచివారికిని జర్మనీవారికిని గలవైరము ఈనాటిది కాదు. అది అనేక శతాబ్దములనుండి వచ్చుచున్నది. ఫ్రెంచివారు బలవంతులుగ నుండినకాలములో అనేక పర్యాయములు జర్మనీపై దండెత్తియుండిరి. జర్మనీ ఉచ్ఛస్థితియం దుండినదినములలో జర్మనులుకూడ ఫ్రాన్సుపై దండెత్తియుండిరి. ఈవైరము సమసిపోయిన దని యనుకొనుటకు కారణములు గాన్పించుటలేదు; ఇది వృద్ధియగు అవకాశములే ఎక్కువగ కనుపడుచున్నవి. ఫ్రాన్సువారిసంఖ్య నాలుగుకోట్లు; జర్మనులసంఖ్య ఇప్పటికి ఏడుకోట్ల ఇరవైలక్షలు. జెకోస్లోవేకియాలోని జర్మనులుకూడ హిట్లరురాష్ట్రములోనికి వచ్చినయెడల ఈసంఖ్య మరియు పైలక్షలవరకు పెరుగును. ఇదిగాక ఫ్రెంచివారి జనసంఖ్య హెచ్చుగుటలేదు. వారివివాహాచారములు, సంతాననిరోధపు ఏర్పాటులు లోనగువాటిమూలమున వారిసంఖ్య వృద్ధి కాకుండ నున్నది. జర్మనులసంఖ్య అన్ననో ఏటేటికి వృద్ధియగుచున్నది. ఈకారణములచేత జర్మను లన్నను వారిరాష్ట్రమన్నను ఫ్రెంచివారి కెంతో భయము కలుగుచున్నది. ఫ్రెంచివారి అదృష్టకాల మంతరించినదనియు, వారు క్షీణదశయం దుండువా రనియు, వారిని సులభముగ నోడించి వారియధీనమందుండు సామ్రాజ్యమును వశపరచుకొనవచ్చు ననియు జర్మనులనమ్మకము. ఇందు, ముసాలినీ వారికి తోడైయున్నాడు. ఫ్రెంచివారి సామ్రాజ్యము ఎక్కువగ ఉత్తరఆఫ్రికాలోను, ఇండోచైనాలోను ఉన్నది. ఉత్తరఆఫ్రికాలో ముసాలినీకి

గూడ కొంతరాజ్య ముండుటచేత, దానిసమీపమున నుండు ఫ్రెంచిప్రదేశములను వశపరచుకొనినయెడల శత్రుభీతిలేక సుఖముగ నుండవచ్చు ననెడి ఆశ అతనికి కలదు.

స్పెయిన్‌లో జరుగుచుండు యుద్ధమువలన ఫ్రాన్సుకు ఎక్కువప్రమాదము కలుగనున్నది. ఇదివరలో ఫ్రాన్సుకు జర్మనీకి యుద్ధము సంభవించినపుడు ఫ్రెంచిసైన్యము లన్నియు తూర్పుసరిహద్దులయందుండి జర్మనులతో యుద్ధముచేయ వీలుండెను. స్పెయినులో ఫ్రాంకోకు జయముకలిగినయెడల ఫ్రెంచివారికి దక్షిణ సరిహద్దులలోకూడ తమసైన్యముల నిలుపవలసివచ్చును. స్పెయిన్‌లోని విమానాశ్రయములనుండి ఫ్రెంచిపట్టణములపై బాంబుల వేయుట సులభమగును. స్పెయినుకు తూర్పుననుండు ద్వీపములు ఇటాలియనుల వశమగుటచేత, అచటినుండి ఫ్రాన్సుయొక్క దక్షిణతీరమునకు ప్రమాదము కలుగుటయేగాక, ఆతీరమునుండి ఆఫ్రికాలోని తమరాష్ట్రములకు వెళ్లుట వారికి అసాధ్యమగును. ఇట్టిప్రమాదము సంభవించునని ఎరిగినవారగుటచేతనే వారు తమచేతనైనంతవరకు ఫ్రాంకోకు జయము రాకుండ చూచుచున్నారు. ఫ్రాంకోవిజయ మనిన ఫ్రెంచివారి పరాజయమును, వారిసామ్రాజ్యవిచ్ఛిన్నము అని చెప్పవలసియున్నది.

కాని, ఒంటరిగ వారు ఇటలీ జర్మనీలను ధిక్కరించి, స్పెయిన్‌లోని ప్రభుత్వపక్షమునకు సహాయము చేయుటకు జంకుచున్నారు. ఇంగ్లీషువారి సహాయము లేక వారొట్టియుద్ధములోనికి దిగి జయము సంపాదించుట సాధ్యముకాదు. ఇప్పటివరకు స్పెయిన్‌విషయములో ఇంగ్లీషువారు వెనుదీయుచున్నందున ఫ్రెంచివారుకూడ వెనుదీయవలసియున్నది కాని మూడు వైపులనుండి ప్రవాహము కొట్టుకొని వచ్చుచుండ వారెల్లకాలము చైతన్యవిహీనులై యుండుట కిష్టపడెదరా?

అందుచేతనే వారు జర్మనీకి తూర్పుననుండు జెకోస్లొవేకియాతోడను రషియాతోడను సంధి చేసికొనియున్నారు. ఈమూడు దేశములవారికిని జర్మనీ సామాన్యశత్రువు. జెకోస్లొవేకియాలో ముప్పైయయిదు లక్షల జర్మను లున్నారు. జర్మను లందరిని ఏకరాష్ట్రవాసులుగ జేయుటకు హిట్లరు పట్టుపట్టియున్నాడు. దీని ననుసరించియే అతడు ఆరుమాసముల క్రిందట చీమ చిటుక్కుమనకుండ ఆస్ట్రియాను జర్మనీలో చేర్చెను. ఆస్ట్రియాలోనివారందరును జర్మనులే. అప్పటినుండియు ఆతడు జెకోస్లొవేకియాపైకి దండెత్తి, జర్మనులు నివసించుచుండు జిల్లాలను జర్మనీలో చేర్చుకొనునని అందరును భయపడుచున్నారు. కాని ఇట్టిది జరిగినయెడల తమస్నేహితులగు జెకోస్లొవేకియావారికి సహాయముచేయుటకు తాము సంసిద్ధులుగ నున్నట్లు ఫ్రెంచివారు ప్రకటించిరి. హిట్లరుయొక్క యుద్దేశము కొనసాగకుండుటకీప్రకటనయె కారణము. ఏనిమిషమున అతడు జెకోస్లొవేకియాపైకి వెళ్లునో ఆనిమిషమున ఫ్రెంచిసైన్యములు జర్మనీపైకి దండెత్తివెళ్లును. ఇది వారినిశ్చయము. దీనినుండి వారిని మరల్చుటకు ఎవరికిని సాధ్యము కాజాలదు.

అట్టి సందర్భములో ప్రపంచయుద్ధము ప్రారంభమైనదన్నమాటయే. జర్మనీకి సహాయముచేయుటకై ముసోలినీ ఫ్రెంచివారిపై బడును. ఇంగ్లీషువారికిని, ఫ్రాన్సువారికిని జరిగియుండు ఒడంబడికలబట్టి ఇంగ్లీషువారు వారికి తప్పక సహాయముచేయుదురు. ఫ్రెంచివారికిని రషియావారికిని ఇట్టిఒడంబడికలె యుండుటవలన వారుకూడ ఈయుద్ధమున ప్రవేశింపవలసివచ్చును.

ఇదంతయు నాలోచించియే శాంతిమార్గమున జెకోస్లొవేకియాసమస్యను పరిష్కరించుటకు ఇంగ్లీషు ప్రభుత్వమువారు విశ్వప్రయత్నము చేయుచున్నారు. ఈప్రయత్నము సఫల మగునో కాదో చెప్పుటకు వీలు లేకున్నది. విఫలమే అయినయెడల ప్రపంచయుద్ధము మన మనుకొనుదానికంటెను శీఘ్రముగ సంభవించును.

ఫొటో

తేకుమళ్ల కామేశ్వరరావు

మా పినతండ్రి నాలాగా కాక అన్నికళలూ కొస్తో కూస్తో ఎరిగినవాడు. లలితకళలలో సన్నిహితమైన సౌందర్యం ఎరిగికూడా ఆయనకవిత్వం చెప్పలేదు, బొమ్మలు గీయలేదు, సంగీతంమట్టుకు రవ్వంత కూనిరాగాలు తీసేవాడు. నాకు కావలసిందీ ఇలాంటిమనిషే. తనుకూడా ఏకవిత్వమో చెప్పేమాటుంటే, నాఖండకావ్యాల్ని ఇప్పటంతగా మెచ్చుకుని ఉండడేమో! నాకోసం అతను అలాగే ఉండవలసిందే అని నాకోరిక. స్వార్థం అటుంచి ఆయన ఏకళా పూర్తిగా పరిశ్రమ చెయ్యకపోడానికి కారణం ఇలాగనికూడా అనిపిస్తూంటుంది. అందరి మోస్తరుగానే మా పినతండ్రి అన్నీ తలో కాస్తా నేర్చుకున్నాడు. తాళాలు బాగుచేస్తాడు. ఇంటితలుపులకీ, ద్వారబంధాలకీ చిన్నచిన్న మరమ్మత్తులు చేస్తాడు. స్వంతక్షౌరం చేసుకోగలడు. గుడ్డలు కాస్త ఇస్త్రీ చేస్తాడు. మా సైకిలుకి చిన్నచిన్న మరమ్మత్తులు చేస్తూంటాడు. నాచేతి గడియారానికి ఆయిల్ చెయ్యడానికి ఆయనకే ఇస్తున్నందువల్ల ప్రతిమాటుకి రూపాయి లాభం కళ్లారా కనబడుతూనే ఉంది, ఇంటికి సరిపడ్డ బట్టలసబ్బులు చేస్తాడు. ఇప్పుడు రవ్వంత గ్రామఫోను మెకానిజమ్ నేర్చుకుంటున్నాడు. మొన్ననే ఒక స్నేహితుడిదగ్గరనుంచి గ్రామఫోను తెచ్చి యజమానుడి అనుమతి లేకుండా ఆయంత్రాన్ని విప్పి, రవ్వంత నేర్చుకుంటున్నాడు. అన్నీ తలో కాస్తా నేర్చుకోడంలో ఉండే అభిరుచి ఏఒక్కటీ పూర్తిగా నేర్చుకోడంలో లేదు. ఉద్యోగం పనితర్వాత- ఆయన శికందరాబాదులో మహబూబ్ కాలేజీలో (నిజానికి ఇది హైస్కూలుమాత్రమే) ఉపాధ్యాయుడు. ఆపని తర్వాత నేర్చుకునేవి ఇవన్నీను. ఏదయితేయేం నా పద్యాల్ని మెచ్చుకుంటాడు. నేను ముందుముందు గొప్పకవి నౌతా నంటాడు. నా కదే చాలు.

ఉట్టినే షికారుకని బయలుదేరి రైలు ఎక్కి మల్కాజాగిరిలో (మా ఊరికి రెండుమైళ్లే పైచిల్లర దూరం ఉంది) దిగి, ఆకొండ ఈకొండ, ఆమెట్ట ఈమెట్ట ఎక్కి దిగి, హఠాత్తుగా ఒకచోట ఒళ్ళు నేను మరిచిపోయి ఆగిపోయాను. ఎంత సుందరమైన దృశ్యం! ఎంత ఆకర్షకమయినది! ఎంత మోహనమయినది! కొండమీద చిన్న ఏటవాలుప్రదేశం. ఎవరని బండరాళ్లు ఒకదానిమీద ఒకటి ఎక్కువగా పేర్చి ఉన్నాయి. కుడిపక్కని కొన్ని చెట్లు ఎండిని సన్నగల లతల్తో ఊగులాడుతున్నాయి. ఎడంపక్కని చిన్న కురిసిన వానకి నేలయేటిపోయి ఒకటిగా సాగిపోసుకుని ఇసకని చక్కని ముడతలు పెట్టేసింది. గాలి హాయిగా వీస్తూంది. పచ్చనిపిట్ట ఒకటి [illegible] పాడుతూంది. కొంతసేపటికి నేను తెప్పరిల్లి అక్కడే రవ్వంతసేపు కూచుని, దృశ్యసౌభాగ్యాన్ని మరికొంత చూసి, విడవలేక విడవలేక ఆ ప్రాంతాన్ని విడిచి, మళ్లీమళ్లీ వెనక్కి తిరిగి చూస్తూ, చీకటిలో కనపడకపోగా కాళ్లీడ్చుకుంటూ స్టేషను చేరుకుని, మా ఊరు వచ్చేశాను. ఇంటికి వెళ్లి వెళ్లడంతోటే మా పినతండ్రికి ఆ దృశ్యంవిషయమై ఉపన్యాసమిచ్చి ఆయన్ని [illegible]ట్లు చేశాను. ఆ దృశ్యాన్ని నా వర్ణనలవల్ల ఆయన ఎంతో ఉబలాటపడ్డాడు. అంతలో "అక్కడ మనం ఫొటో తీయించుకోవాలి. దానికి సాటిదృశ్యం లేదు" అన్నాను తన్మయత్వంతో. మా పినతండ్రికూడా తప్పకుండా తీయించుకుందామని సరదాపడ్డాడు. "ఎల్లుండి శనివారంనాడే ఆ పని జరగాలి" అన్నాను కొంత ఉద్రేకం వెల్లడిచేసి, ఆయన ఒప్పుడలని ఆదుర్దాతో చూస్తూ. ఆయన తల ఆడించాడు. మరో రెండునిమిషాలు ఊరికే కూచుని లేచి, మాకు తక్కువరేటుకి చేసే ఫొటోగ్రాఫరుదగ్గిరికి వెళ్లి అన్నిసంగతులూ తెలియజేసి, ఫొటో ఏర్పాటుచేశాను.

రెండురోజుల్లో శనివారం వచ్చింది. మా ప్రయత్నానికి రెండురోజులనుంచీ అడ్డు తగులుతున్నారు, మా నాయనమ్మ (అరవైయేళ్ల వితంతువు), మాపినతల్లీను. మా పినతల్లి "అసలు ఇప్పుడు ఫొటో ఎందుకు? పిల్లలజీతాలు కట్టాలి, మీ భీమాడబ్బు చెల్లించుకోవాలి,

"నా నానుసీల పోయింది చేయించుకోవాలి" అని మా పిన తండ్రితో అంది. పెద్దపిల్ల పెళ్ళిమాట ఎత్తలేదు, ఈ కాస్తకే పెళ్ళి అడ్డిపోదనికమోసు. మామామ్మ "నాతావళం అరిగిపోయింది. బంగారపుతీగతో కట్టించుకోవాలి. కృష్ణమూర్తివిగ్రహానికి మురుగులు చేయించాలి" అని అంది. "ఇవన్నీ బతికున్నంతకాలం ఉండేవే" అని మా పినతండ్రి ఒక్కముక్కలో వాళ్ళని నిరుత్తరుల్ని చేసేశాడు. నేను చేసినపనేమిటంటే, వాళ్ళ జీవితానికి, వాళ్ళజ్ఞానానికి పశువులజీవనానికి ఇసుమంతైనా తేడా లేదని ఉదాహరణలు పోగుజేసి బోలెడంత చెప్పి, మొగాళ్ళకంటే వాళ్ళు ఎన్నోవంతులు తక్కువని రూఢి పరిచాను. చివరికి ఫొటో తప్పిందికాదు, ఆడవాళ్ళ నోరు మూసుకున్నారు.

ఫొటోకని ముస్తాబు అయాం. మా బాబయ్య షికారు బయలుదేరే దుస్తులు వేసుకున్నాడు, జరీఅంచు పెద్దాపురం పట్టుకండువా అడ్డంగా పింజపెట్టి ఒక కొసతో ముడివేసి, అది బుజాన్నివేసుకొని, చేతికర్ర పట్టుకున్నాడు. నేను పంచ సైకిలుకట్టు కట్టి, కంఠం మెడలాల్చీ తొడిగి, నా ఎర్రటి మొహానికి గులాబీరంగు కండువా అందమని వల్లెవాటుగా వేసుకుని చేత్తో నాపద్యాలఫైలు — అట్టమీద గిల్టురేఖలు, హంసగలది — పట్టుకున్నాను. కళ్ళకి షెల్ ఫ్రేము కళ్ళజోడు తగిలించాను. మా పినతల్లి తలకి నిమ్మనూనె రాసుకుని మల్లెపువ్వులు సిగలో పెట్టుకుంది. కరాచీపట్టుచీర కట్టుకుని పొరుగింటావిడివాచీగొలుసు ఎరువుతెచ్చుకుంది. కాని మా పినతండ్రి ఇష్టపడకపోవడంవల్ల ఆ గొలుసు తిరిగీ వాళ్ళకి ఇచ్చేసింది. ఆమె తన ఆడపిల్లలు ముగ్గురికీ మొగలిరేకులతో జడ అల్లి మంచిగుడ్డలు కట్టింది. పెద్దకొడుకు పట్టుకండువా వేసుకున్నాడు. వాడితో నేను "ఒరే! భోజనానికి కాదురా, ఫొటోకి" అన్నాను. "నీకూ తెలిసిందీ, ఇంకేం తెలిసైనవాడివే" అన్నాడు. కొంచెంలో తప్పిపోయింది కాని నెత్తిమీద గపీమని పప్పు డవవలసిందే, నేను చెయ్యి విసరడానికి. పెద్దవాడు వేసుకున్నాడని చిన్నవాడు కూడా పట్టుపట్టి గరించాడు. మా నాయనమ్మ సఫేదు లాంటి సైనుగుడ్డ కట్టుకొని, తావళం ఇవతల పడేసుకుంది. గోవలోనే కనకాంబరంకూడా జరిపిద్దామని ఇంక ఉప్మాను పిండి, జంతికలు పట్టుకున్నాం. బండీ అనవసరమనే సంగతి ఆడవాళ్ళు తెలియజేశారు కాని ప్రకృతిసౌందర్యం అందాన్ని ఆస్వాదించడానికి అటువంటివి కుదరవని వాళ్ళకి బోధపరిచాం. దానితోపాటు చేతి ఓపిక, నవ్వు తెచ్చుకుని బయలుదేరారు. మధ్యాహ్నం ఒంటిగంట అయింది. మా బాబయ్య ఆఖరిపిల్లని ఎత్తుకుని భుజానవేసుకున్నాడు. మా పిన్నమ్మ రెండోపిల్లని ఎత్తుకుంది. ఏడుస్తే ఎత్తుకుందాం రెండోవాణ్ణి అని మా మామ్మ ఊరుకుంది. మా పెద్దచెల్లెలు, దాని పెద్దతమ్ముడూ నడుస్తున్నారు.

పట్నం దాటి మల్కాజాగిరికి కాలిబాటపట్టాం. మా ఇద్దరి ఆనందం చెప్పలేనంత. "ఈ రాళ్ళురప్పలదారేమిట్రా, ముళ్ళుంటూ" యని మా మామ్మ విసుక్కుంది. "నీకేం తెలుసు చెప్పినట్టు రా" అని నేను ధామత్తు చేశాను. "మీఖర్మం, పదండి" అంది ఆవిడ.

కొంతదూరం నడిచి మా బాబయ్యతో నేను "అల్ల ఆరాయి చూడు. ఎలాగ చెక్కినట్టుందో" అని ఒక కొండవైపు చూపించాను.

"ఔను బాగుంది. దానిపక్కనే ఉన్న చెట్టు చూడు" అన్నాడు ఆయన.

"చెట్టు మరికొంచెం పెరిగుంటే ఇంకా బాగుండును" అని ఆయనభావానికి మెరుగుపెట్టాను.

"నిజమే, అది ముళ్ళడొంక అయిపోయిందిగాని, మామూలుచెట్టయితే ఇంకా బాగుండేది" అన్నాడాయన. ఇంతట్లో నాకాలికి ముల్లుగుచ్చుకోగా దృష్టి నేలవైపు మళ్ళింది. దారిపక్కని చిన్నతీగ పచ్చనిబిళ్ళ పువ్వులు పూస్తూంది. "ఆహా! చూడు ఇది" అన్నాను తీగె చూపిస్తూ.

"బాగుందిరా" అని ఆయన రెండుపువ్వులు కోసి చంటిపిల్ల చెవిని పెట్టాడు. పెట్టీపెట్టడంలో ఆపిల్ల వాటిని నలిపేసి కింద పారేసింది. ఆడవాళ్ళు, పిల్లలూ కాస్త వెనకపడ్డారు. మా పెద్దతమ్ముడు మాఇద్దరితో వచ్చి అడ్డప్రశ్నలు వెయ్యవలసిందేకాని వాడికి వాళ్ళమ్మ దగ్గిర ఎక్కువచేరిక. ఆవిడ వాణ్ణి ఎప్పుడూ చదువుకో

మనదు. మాపినతండ్రి అలాగ కాదు. అంచేత వాడు ఆవిడతో నే వస్తున్నాడు. అందరూ వచ్చేవరకు ఆగి "మామ్మా! ఆ చెట్టు చూడు సంద్రాయిపక్కనుంచి ఎంతచక్కగా కనపడుతూందో! ఆకులు ఎలాగ తళతళ లాడుతున్నాయో" అన్నాను. పక్క ఇంటిదానిమీద నేరాలు చెప్పుకుంటూన్న ఆడవాళ్లు నావాక్యాలు తమ ధోరణ్ణి బంగం చేసినందుకు మనస్సుల్లో ఇదయారు. మా మామ్మ తలఎత్తకుండా "ఎంతో బాగుందిలే" అంది. "నీకు కనబడిందా" అని వెటకారంగా అన్నాను. "నీలాగు నన్నుకూడా కళ్లజోడు పెట్టుకో మన్నా వేమిట్రా" అంది. నాలోటుకి తలతిప్పి ఊరుకున్నాను. మాపినతండ్రి మాపినతల్లితో "నీకు కనబడిందా" అన్నాడు. "అదిగో అదేనా" అంది ఆవిడ, అసలు వస్తువుతప్ప తక్కినవన్నీ చూపిస్తూ. చివరికి ఆమె కంటికి అగపడచేశాం.

మబ్బువల్ల ఎండ పట్టూ విడుపుగా ఉంది. నెత్తి మరీ మాడడంలేదు. ఇంతకే గోడుగులు మాకు మొగాళ్ల కున్నాయి. మొహం పైకి తిప్పి చూశాను. ఆకాశాన్ని అలలలాగ ఉన్న మేఘపుతునక కనబడింది. సూర్య రశ్మికి ఆగలేక కిందికి చూశాను. కింద ఎండిపోయిన సెలయేటియొక్క అలలలాంటి ఇసకపొర కనబడింది. సెలయేటిలో నీళ్లుంటే పై మేఘంయొక్క ప్రతి బింబమే ఇది అని అనుకొనేవాణ్ణి కదా! ఈ సంఘటన విచిత్రమనిపించి మా పినతండ్రికి చూపించాను. ఆయనా చూసి సంతోషించాడు. పెద్దకొండమీద నీలాకా శంలో రాంబోందులు ఎగురుతున్నాయి. ఆ దృశ్యం అత్యానందకరంగా ఉంది. మా పినతండ్రికి చూపిం చగా, ఆయన అక్కడే నిలబడిపోయి తన్మయత్వంతో చూసి "ఆ కొండఎక్కి నీలిపిట్ట నయిపోయి రాంబోందు లతో ఆడి, ఆకాశంలోకి ఎగిరి, కలిసిపోదామని ఉంది" అన్నాడు. ఆయనవాక్కులలోని కవిత్వానికి నేను చకి తుడనయి ఆ భావం నా ఫైలులో రాసుకున్నాను, ఆయన చూడకుండా. ఇంతట్లో మా పినతండ్రి దూరా న్ని నిలుచుని పాడుతూన్న చిన్న ఎర్రనిపిట్టయొక్క అందం చూడమన్నాడు. నేను చూడకుండానే ఆ పిట్ట ఎగిరిపోగా, అది ఎగురుతూండగా ఉండే సౌందర్యం చూశాను. మరికొంతదూరంలో మూడుకొండలు లోపల ఆవరణగలిగి మూడువైపులా ఎత్తయిన గోడ లలాగున్నాయి. వాటి చరియలమీద మేఘాలయొక్క నీడలు పడ్డాయి. నీడలు నడుస్తున్నాయి. పక్కన పెద్ద బండరాళ్లనీడ లున్నాయి. ఆ దృశ్యంయొక్క అందం ఇద్దరం చూసి బహు ఆనందించి, ఆడవాళ్లకి చూపిద్దామని ఆగాము. ఘర్లాంగు వెనకబడి ఉన్న ఆడ వాళ్లు నెమ్మదిగా మాదగ్గరికి వచ్చారు. ఇప్పుడు వాళ్ల సంభాషణ పొరుగింటివాళ్లమీదనుంచి, మా పినతండ్రి వద్దకుండే అప్పచెల్లెలిమీదికి మారింది. నేను పలకరించ బోగా మా మామ్మ ముందరే "చూశాను" అంది. "ఏమిటే" అన్నాను నివ్వెరబోయి. ఇంతట్లో మా పిన తండ్రి ఆ విషయంగురించి మా పినతల్లికి చెబుతూండడం చేత మా మామ్మ సరిగ్గానే జవాబుచెప్పి, "మేము ఇంక నడవలేమ్రా, ఎలాగపోఅవనియ్యండి" అంది. వాళ్ల మొహాలు ఎండదెబ్బ తిని చెమటపట్టాయి. పిల్లల్ని ఎత్తుకోవలసివస్తూండడంచేత బొత్తిగా అలసి పోయారు. కాని "దగ్గిరికే వచ్చేశా"మని బొంకాను. ముందుకి నడక సాగించాం. ఎండధాటివల్ల, కొంత అల సటవల్ల, సౌందర్య భావావేశంవల్ల నేను బహుసన్నిత మైన మనఃస్థితిలో ఉన్నాను. ఎక్కడినుంచో ఒకసీతా కోకచిలక రెక్క ఎగిరిపడింది. పసుపుపచ్చని రంగు మధ్యని నీలిచుట్టు, లోపల నెమలిఈకరంగుతో ఉన్న ఆ రెక్కని చూసి నేను మూర్ఛపోవలసిందేకాని రెక్క ఒకవైపుపగిలి ఉండడం నన్ను రక్షించింది. ఆ రెక్కని మాపినతండ్రికి చూపించి "ఇక్కడ ముక్క విరిగిపో కుండా ఉంటే ఎంతో బాగుండును" అన్నాను మా పినతండ్రి ఆరెక్కనిచూసి ఆనందించాడు. పక్కనిఉన్న ఒకతీగె ఆకులు ఎండకి సోలిపోయున్నాయి. ఆమొక్క నున్న నీలిపువ్వులు మా పినతండ్రి తీసి, వేడివాసనని ఆఘ్రాణించి, ఇష్టపడక, చూడమని మా పిన్నమ్మకి ఇచ్చాడు. ఆమె ఆపువ్వులు సిగలో పెట్టుకోబోయింది. ఆమెమొహంమీద వేళ్లాడుతూన్న ముంగురులపాయి ఎంతో అందమనిపించింది కాని ఆభావం అంతట్లోనే నాలో చచ్చింది. మా పినతండ్రిమాత్రం ఆమెవైపు ఒళ్లు మరిచి ఒక్కక్షణం చూసి, దృష్టి మరల్చుకున్నాడు. పిల్లలు "నడవలేం, ఎండగా ఉంద"ని గొడవచేస్తు


న్నారుగాని తండ్రిదగ్గిర గట్టిగా అనలేక లోపలే ఏడుస్తున్నారు. నేను చూసీచూడనట్టుగా ఊరుకున్నాను.

రెండుఫర్లాంగుల దూరంలో చిన్నతోట కనబడింది. తోటచుట్టూ పెద్దగోడ ఉంది. మే మిద్దరం వేగిరం నడిచాం. దారిలో ఒకలోయలో కనబడ్డ ఒక గోరీరాతిని మా బాబయ్యాని చూపించి "ఈ లోయ యొక్క సౌందర్యం చెడగొడుతూంది ఈరాయి" అని చెప్పి, మనస్సులో ఆరాతికి శాపనార్థాలు పెట్టాను మా పింతండ్రి ఒప్పుకున్నాడు.

తోటలోకి వెళ్లాం. చెట్లనీడలకి, చల్లనిగాలితో కలిసిన నారింజ, నిమ్మ, దబ్బ వాసనకి, ఒళ్లు అవశమాతూంది. తోటలో మనిషిఅలికిడి ఎక్కడా లేదు. గొంతుక ఎండిపోతూండడంచేత చెట్టునున్న రెండు నారింజకాయలు పక్కనున్న గెడతో దులిపాను. దూరాన్ని చింతచెట్టుచాటునుంచి ఒక గడ్డంమనిషి రౌద్రాకారంతో దెయ్యంలాగ ఇవతలికి వచ్చాడు. వాణ్ణి దగ్గరికి రానివ్వి శాంతపరిచేటప్పటికి తలప్రాణం తోకకొచ్చింది. కాయికి అణాచొప్పున వాడికి దాఖలుచేసి నోరు మూసుకున్నాం. వాడితో సంభాషణవల్ల తేలిన విషయ మేమిటంటే, ఆతోట ఒక నవాబుగారి దనీ, ఆయనకి ఉన్న ఆస్తిఅంతా ఈ ఎకరంతోటా, హైదరాబాదులో ఒకచిన్న సందులో ఉన్నదోసెడు పాత కొంపా అనీ, తనపెద్దకూతుళ్ల నిద్దరినీ హైదరాబాదు నిజాంగారికి మరికొంత రొక్కంతోపాటు నజరాణాగా ఇచ్చాడనీ,ఆనజరాణా ఇయ్యడంవల్ల ఈ నవాబుగారి కుటుంబం రాత్రిపూటమాత్రమే జొన్న అన్నం తింటున్నారనీ, ఆయన దగ్గిర నిలుచుని తోటలోని చెట్లకాయలు కోయిస్తాడనీ, అటుతర్వాత చెట్టుమీదేనా చెయ్యివెయ్యకూడదనీను. బట్ట, బువ్వలేని నవాబుగారి గ్రహాలు ప్రస్తుతం మంచిఇళ్లలోనే ఉన్నట్టుగా నాబుద్ధికి తోచింది. ఎంచేతంటే ఇద్దరిపిల్లల్నిగాక వట్టిరొక్కమే నజరాణాగా చెల్లించి ఉంటే నవాబుగారు రెండు రోజుల కొకపూట భోంచెయ్యవలసి వచ్చేది. అలాగగాక ఇప్పుడు రోజుకి ఒక్కమాటేనా కూడు కళ్లతో చూస్తున్నాడు. ఇంతట్లో మావాళ్లు మమ్మల్ని కలుసుకున్నారు. తోటలోని నూతిదగ్గిర కూచుని ఫలహారం చేద్దామని వాళ్లదగ్గిర మూట తీసుకొని విప్పగా, ఆవకాయిముక్కలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఉప్పుడుపిండి, జంతికలు పిల్లలు దారిలోనే భక్షించేశారు. చేసేదిలేక మే మిద్దరం చెరోనాలుగుముక్కలు తిని-మా పింతల్లిమాట జ్ఞాపకంలేదు - ఇన్నినీళ్లు తాగి, కొంతబడలిక తీర్చుకున్నాం. ఈ ఫలహారంకంటె ముందు ఇద్దరం చెరోనారింజకాయ - మాపింతండ్రి మూడోవంతుకాయ చంటిపిల్లకి పెట్టాడు - తినడం కొంత నిజమైన సత్తువ ఇవ్వడంచేత మళ్లా ప్రయాణం సాగించాం. మానాయనమ్మ తిట్లు ప్రారంభించింది, మమ్మల్నికాదు ఫొటోని. ఇంకెంతదూరమని ఆవిడకి ధైర్యంచెప్పి బయలుదేరాం. ఎండ తగ్గింది, దానితో ఎండదెబ్బ తగ్గింది. అలసట వృద్ధిపొందినా సంతోషమే ఓపికగా నడిచాం. నేను అనుకున్నస్థలం చూపుమేర దూరంలో ఉంది. అక్కడ ఫొటోగ్రాఫరు, పక్కన కూలివాడు సిద్ధంగాఉన్నారు. గమ్యస్థానం సమీపించినందుకు అంతా పరమసంతోషం పొందాం. ఆస్థలంచేరాం. ఆడవాళ్లు నేలనిచతికిలపడ్డారు. పిల్లలు నేలమీద పడుక్కున్నారు. "ఎండతగ్గిపోతూంది, ఆలస్యంచెయ్యడానికి వీలులేదు, అంతా అమర్చుకు కూచున్నాం" అని ఫొటోగ్రాఫరు కూలివాడు తొందరచేశారు. వాళ్లు ఇద్దరూ పువ్వులరంగళ్లలా ఉన్నారు. ఫొటోగ్రాఫరు క్రాపింగులో ఒక్కవెంట్రుకేనా చెదరలేదు. రైలుమీద వచ్చాడు ఆయనగారు. మా పింతండ్రి ప్రకృతిదృశ్యాన్నిచూసి బహు రమణీయమైనదనిచెప్పి, అక్కడ ఫొటోతీయించుకోడం మన అదృష్టమని మెచ్చుకొని, అలసిపోవడంచేత తలవంచుకు కూచున్నాడు. నేను గొడుగుమీద ఆనుకుని కళ్లలో లేనిజీవం తెచ్చుకుని దృశ్యంవైపు చూసి ఆనందం పొందుతున్నాను. వెలుతురు తగ్గిపోతూందని ఫొటోగ్రాఫరు గొడవచెయ్యడంచేత అంతాలేచి ఫొటోకి సిద్ధమయాం. నేనూ, మా పింతండ్రీ నిలుచున్నాం. మా పింతండ్రి చేతిలో పిల్ల ఉంది, చేతికర్ర కిందపడేశాడు. మామధ్యని మాపెద్దచెల్లెలు, పెద్దతమ్ముడు నిలుచున్నారు. మా పింతండ్రికి ముందువైపు మాపింతల్లి రెండోపిల్లని తన ముందు పెట్టుకునికూచుంది. నాకు ముందువైపు మామామ్మ రెండోమనమణ్ణి తన ముం దుంచుకుని కూచుంది. మరొక్కనిమిషంలో ఫొటో తియ్యడ మయిపోయింది.

యాత్ర పూర్తి అయినందుకు సంతోషించి, బయలుదేరి స్టేషన్ చేరుకుని, బొలారం పాసింజరుమీద అరఘడియలో ఇంటికి వచ్చేశాం.

నేను చాలా తొందరపడ్డాను, వీలైతే ఆరాత్రే ప్రూఫ్ చూద్దామని. కాని కుదరలేదు. మర్నాటి సాయంత్రానికి ఫోటోలే వచ్చేశాయి. ఫోటోలని చూసి నిశ్చేష్టులయాం. నేను నేనులాగ లేను. మహాకవిలాగ ఆకాశంవైపు ప్రశాంతంగా చూస్తూ నిలబడి ఫోటోలో పడదామని అనుకున్నాను. కాని - కాని ఫోటోలో మార్గాయాసమంతా నా మొహాన్నే ఉంది. మొహం ముడతలుపడిపోయి కనుబొమ్మలు ముందుకి వచ్చి కళ్లు చిన్నవయి, అడుగు పెదిమ పైకి వెళ్లి ఏడుపుకి సిద్ధమయినట్లుగా పడ్డాను. కాళ్లూచేతులూ జవంలేక తోటకూరకాడల్లాగ వేళ్లాడుతున్నాయి. గొడుగుమీద భారంవేసి నిలుచున్నాను. వల్లెవాటు వేసుకున్న కండువా అలుగుడ్డరంగున పడింది. మాపింతండ్రో! ఆయన మొహం అతి బిరాకుగా ఉంది. లేనిపోని ముడతలన్నీ చొక్కాని, కండువాని పడి అసహ్యంగా ఉంది. మా పింతండ్రి చేతిలో పిల్ల నీరెండవైపు తిన్నగా చూడలేక మొహం వెనక్కి తిప్పేసింది. అంచేత మొగలిరేకుతో సిలకమాత్రం పడింది. మామయ్యనున్న పెద్దవాడి చొక్కా బొత్తాలు ఊడిపోయాయి. పైగా, వాడు నాలాల్చీ జేబులోంచి దొంగతనం చెయ్యబోతూన్నట్టుగా పడ్డాడు. మా పెద్దచెల్లెలు నోరు తెరిచి పళ్లు బైటపడేసి దెయ్యంలాగ పడింది. తలవెంట్రుకలు రేగిపోయి తల పిచికలగూడులాగుంది. మాపింతల్లి జుట్టు రేగిపోయింది, కళ్లు కిందికి వాల్చి అశోకంకింది సీతాఅమ్మవారులాగ వుంది. ఆమె ముందున్న పిల్ల చింపిరితలతో ఓరగా చూస్తూ, రాళ్లేరుతూంది. మానాయనమ్మ మొహం ముడుచుకుపోయింది. నోట్లో వేసుకున్న వక్కపలుకు మునిపళ్లతో నొక్కుతూ కోతిలాగ పడింది. ఆమె ముందున్న కుర్రాడి బుజాలమీద ఆమెచేతులు వెయ్యడంచేత ఏదో కాస్త తిన్నగా కూచున్నవాడు రాంబొందులాగ పడ్డాడు. నానాకంగాళీగాను ఉన్న ఈఫోటోలో మా వెనకనున్న ప్రకృతిదృశ్యం, నాపక్కని తియ్యడం మరిచిపోయి పెట్టినఫలహారపు బుట్టమూట, నాచేతిలో గొడుగు బాగా పడ్డాయి. ఈఫోటోని చూసి పెద్దవాళ్లం అసహ్యించుకున్నాంగాని పిల్లలు తమలో తాము అందరికంటే నేను బాగాపడ్డానంటే నేను బాగాపడ్డానని గర్వులాడుకున్నారు.



గ్రీసు దేశమునకు బద్ధవైరి

కొన్ని శతాబ్దములనుండి జ్ఞానమును సంపాదించి, మలేరియా వ్యాధి నివారణకు ఖరీదుగల మందులనే వాడుచున్నను ఈవ్యాధి భయంకర వ్యాధిగానే నిలిచియున్నది. మానవులకు బద్ధవైరిగానున్నది. పూర్వకాలమున అస్వస్థత కలిగినప్పుడెల్లా దేవునికి తమపై ఆగ్రహము కలిగినదని తలచుచుండెడివారు. మలేరియా వ్యాధివలన అత్యధికసంఖ్యాకులు మరణించుచుండిరి. మలేరియా వ్యాధి ప్లేగువ్యాధిని మించినది.

పూర్వకాలమున ఈజిప్టు, పాలెస్టైయిన్ దేశీయులు మలేరియావ్యాధివలన చాల బాధపడిరి. కాని ఇందు మరణించిన వారిసంఖ్యకంటె గ్రీసుదేశమున మలేరియా వ్యాధివలన చనిపోయినవారిసంఖ్య అత్యధికము.

క్రీస్తుశకమునకు పూర్వము 5 శతాబ్దమున అటికాలోను, ముఖ్యముగా ఎథెన్సులోను మలేరియావ్యాధివలన అత్యధికసంఖ్యాకులు చనిపోయిరి.

మందులకు పితామహుడైన హిప్పోక్రాట్సుగారికి మలేరియావ్యాధిసంగతి బాగుగా తెలియును. పల్లపు ప్రాంతములలోను, తేమగాఉండు ప్రాంతములలోను, ఎండవేడిమి ఎక్కువగాఉండు ప్రదేశములలోను నివసించువారు దీర్ఘకాలము జీవింపరు. కల్మషమున్న నీటిని త్రాగుటవలన ఈమాదిరి వ్యాధులు తటస్థించునని వీరు అభిప్రాయమును వెల్లడించిరి.

2000 సం॥ గతించినతర్వాత నేడుగూడ గ్రీసుదేశమున ఇంకా మలేరియావ్యాధిబాధ తగ్గలేదు. కాని ఈవ్యాధివలన భయపడవలసిన అవసరములేదు. మలేరియా నివారణమునకు క్వినైన్ ఉన్నది.

మలేరియావ్యాధి చెలరేగినదినములో ప్రతివారు నిత్యము 6 గ్రెయినులవంతున, రోగులు 5-7 దినములు 15-20 గ్రెయినులవంతున సేవింపవలెనని జాతిసమితి మలేరియా కమిషన్ వారు శిఫార్సుచేసియుండిరి వ్యాధి తిరుగబెట్టినదినములలోగూడ ఇదేమాదిరి చేయవలెను.

మలేరియావ్యాధిని నిర్మూలించుటకు అనుకూలించు ఈమందును మనము కృతజ్ఞులము. కథలలో జరిగినరీతిగా నశించిన గ్రీసుదేశీయులు ఈ మందుప్రభావమువలన సజీవులు కావచ్చును. M. No. 7.

తీయని బాధ

"సుకుమార్"

[ఇందులో వచ్చేపాత్రలన్నీ కల్పితాలు]

ఒకానొక సుందరదృశ్యము, ఒకానొక దివ్యమంగళవిగ్రహము, ఒకానొకపిచ్చికల — తరువాత ఎన్నిసుందరదృశ్యాలు చూచినా, ఎన్ని దివ్య విగ్రహాలు కనపడ్డా, ఎన్ని వింతకలలు కన్నా, ఆ మొదటి దృశ్యమే, ఆ మొదటివిగ్రహమే, ఆ మొదటి పిచ్చికలే మరల మరల మనసులో అవతరిస్తూ ఉండడమే నిజమైన ప్రేమంటే — తీయనిబాధంటే.

* * *

నాకు నాలుగేళ్లప్పుడు మా అమ్మను గోదావరితల్లికి వప్పచెప్పి ఆరాత్రికి రాత్రే నది దాటి విఘ్నేశ్వరం వస్తున్నాము — రహదారిపడవలో. మాఘపౌర్ణిమ. వెన్నెలైనా, ఆకాశమంతా, ఎందుచేతనో, ఒక వింత ఉదారంగుతో నిండిఉంది. నక్షత్రాలు మెరిసిపోతున్నాయి. గాలి లేదు. సర్వమూ నిశ్శబ్దము. బొబ్బర్లంకలో సంపాదించిన ఊచబియ్యాన్ని రాల్చుకుంటూ పడవవాళ్లందరూ ఒకమూల కూర్చున్నారు — కిక్కురుమనకుండా. పడవనిండా జన మున్నా ఎవ్వరూ పలకడం లేదు. హాలులో దీపం మినుకుమినుకు మంటోంది.

అప్పుడు, లక్ష కెరటాలమీద తేలిపోతూ ఉన్న చంద్రబింబంకేసి చూస్తూవున్న నా కళ్ల ఎదుట ఆకెరటాలమీద మాఅమ్మ కనబడింది :

తెల్లని జరీచీర, బంగారపు వడ్డాణము, చేతులకు వంకీలు, మెళ్లో కంటె, కాసుల పేరు, చెవులకు బావిలీలు, ముక్కున అడ్డబాస, చెంపలకు చేర్చి దువ్విన నల్లని తలకట్టు, ఒంపైన కొప్పు, పెద్ద అరకానంత కుంకుమబొట్టు, కప్పువేసిన పలువరస కొంచెం కనపడుతూ చిరునవ్వుతో నన్ను చూచి "నాన్నా"! అని పిలచినట్టయింది. నేను "అమ్మ అదుగో!" అని కేకవేశాను. ప్రక్కనే ఉన్న మాచెల్లెలు బావురుమంది. అప్పుడు మాతాతయ్య మమ్మల్ని యిద్దరినీ తనసందిట్లోకి తీసికొని దుఃఖాన్ని దిగమింగుకుంటూ, "పిల్లలు జడుసుకుంటున్నారు" అని మామీద దుప్పటీ కప్పాడు......

ముప్పదియేండ్లక్రితంమాట అది. కాని, అప్పటికీ యిప్పటికీ యెంతటి అద్భుతమైన సృష్టివైచిత్ర్యాలని చూచినా అఖండగోదావరికెరటాలల్లో అవతరించిన దృశ్యము జ్ఞప్తికి రాకమానదు. శివసముద్రపు కావేరీధారల్లోనూ, బొంబాయి సముద్రపుపికార్లలోనూ, ప్రయాగవద్ద యమునానదీ నౌకావిహారాలల్లోనూ, హృషీకేశంలోని అతినిర్మలమైన గంగానదీఅగాధపు లోతులలోనూ, ఆ మొదటిదృశ్యమే కనబడుతుంది.

తాజ్ మహాల్ని చూచాను నాలుగైదు సార్లు. ఒకపర్యాయము మిక్కిలి ప్రేమించిన

ఒకవ్యక్తి నన్ను ఉద్దేశించే అభినయంతో "చేతులార శృంగారము" పాడుతూ,

"అందమైన నిన్ను యురమున జేర్చి"

అన్నచోట నన్ను గబుక్కున తనహృదయానికి చేర్చుకుంది! నేను ఆనందం భరింపలేక కళ్లు మూసుకున్నాను. మళ్లా అదృశ్యమే — అఖండగోదావరి, మా అమ్మ!

* * *

జీవితాదర్శమైన నా సౌందర్యరాశిని నేను మొదట చూచినప్పుడు స్తంభితుడనైపోయాను. నాకోరికమీదనే ఆమెను చూచాను — కాని ఏమి మాట్లాడను? రెండవపర్యాయము కన్నెత్తి చూడ్డానికికూడా భయమేసింది. ఆమెమాత్రము నిర్భయంగా నన్ను పరిశీలించి చూచి నాలోతు కనిపెడుతో ఉన్నట్లు గ్రహించాను — ఆ మొదటి చూపు యిప్పటికీ మరవలేను...

తర్వాత అనేకవిషయాలు జరిగాయి — మంచీ చెడ్డా కూడాను. ఒక దివ్యనిమిషం ఆమె నా వొళ్లో తల పెట్టుకుని అనిర్వచనీయమైన ప్రేమదృక్కులతో నన్ను ముంచెత్తింది; "నేను నీకు తగను" అని అంటూ గద్గదికమై ఏడ్చింది.

చంద్రవంకను ప్రతిఫలింపజేస్తూ ఉన్న ఆమె కన్నీటిబొట్లను నేను పెదవులతో అతిభక్తితో తుడిచాను — ఆరుచి యిప్పటికీ యీ పెదవులను వదలలేదు —

ఆ దివ్యమంగళవిగ్రహాన్ని యిప్పటికీ ఆరాధిస్తున్నాను—

ఆమెకు మాత్రము నేను లేనేలేను!

మోమున మోముఁ జేర్చి నిను
ముద్దిడు కోరిక లేదు, నీదు వ
క్షోమృదుశయ్యపైని శిరసున్
గెడవాలిచి ప్రేలు మల్లికా
దామసువాసనా మధుర
త ల్పరికింపఁగఁ గాంక్ష లేదు, నా
ప్రేమకు దారిఁ జూపఁగ వ
రించితి.........!

అన్న కవిహృదయం ప్రకారము ప్రేమ పూర్తిగా అశరీర మైనదే.

* * *

తరువాత అనేక అనుభవా లొచ్చాయి యీ జీవితంలోకి.

అందాన్నే ప్రధానంగా చూచుకుంటూ గుజరాతులోను, కాశ్మీరంలోనూ, కలకత్తాలోను, మధురలోను, మలబారులోనూ, అనేకులను చూచాను - రూపసుల్ని. కొంతవరకు ఆకర్షించి యీ హృదయాన్ని వశం చేసుకున్నారు. కాని తృప్తి యెందుకుంటుంది? —

చివరకు ఒకానొక ప్రణయసంబంధానికి లొంగినా దానికికూడా కారణం ఆ మొదటి ఆదర్శంలోని ఏదో కళ ఒకటి ఈ వ్యక్తిలో కనబడడం వల్లనే — కాని మరల మరల ఎప్పటి ఆరాధనే; ఎప్పటి అన్వేషణే, ఎప్పటి దాహమే.

అయితే యిన్ని ప్రేమసంబంధాలను పెట్టుకోవడము ఏకాగ్రతకు లోపం కాదా, ఒకవిధమైన మానసికవ్యభిచారం కాదా అంటే:

ప్రేమ సంగీతంవంటిది. అనేకరాగాలతో కూడినది సంగీతం. నాకు సావేరిరాగం

చాలా యిష్టం. సావేరి వింటూఉంటే పరవశుడ నైపోయి యేడ్చివేస్తాను. కాని భైరవి రాగమూ యిష్టమే. "జయ జయ గోకుల బాల..." వింటూఉంటే నా కళ్లముందర గోపాలకృష్ణుడు తాండవమాడుతాడు. "శివ గిరీశా పరురాలను" వింటూఉంటే శివభక్తుడ నైపోతాను. దీనివల్ల నాకు ఏకాగ్రత లేద నడం న్యాయమా ?

కళాపరిపూర్తికి యీరాగాలన్నీ తోడు కావాలి. యేమనోభావాని కనుగుణ్యంగా ఆరాగం కదలిస్తూ వుంటుంది. అన్నిటికంటె నన్ను ఎక్కువగా కదిలించేది సావేరి. కాని యితర రాగాలకుకూడా స్థానం ఉంది; గౌరవం వుంది.

భౌతికంలోకి దిగకుండా ఉన్నంతవరకు ఎందరిని ప్రేమిస్తే ఏమి? ఎన్నివిగ్రహాలను ఆరాధిస్తే యేమి ? మానసికపూజకు కట్టుబాట్లేమిటి ?

ఈపూజ, యీగౌరవము, ఒకమెట్టు దిగి అన్యోన్యాభిలాషకోసం దేవులాడడం మొదలుపెట్టినప్పుడే వస్తుంది చిక్కు.

కాని సంస్కారమంటే మనఆశయాలని మన్నులో పడకుండా కాచుకోవడమే. ఇది కష్టం కావచ్చు. తెలియనివారికి అమానుషంగాకూడా ఉండవచ్చు. కాని మనలోఉన్న మృగత్వాన్ని నశింపజేసి దేవత్వం ప్రసాదించేదే నిజమైనప్రేమ.

* * *

అంటే యిందాకటికవికి భౌతికమైన ప్రేమఅన్నా స్పర్శన, చుంబన, ఆలింగనాది విలాసాలవిలువఅన్నా తెలియదనుకోకూడదు. అతనిజీవితంలో ఇవన్నీ అనుభవించే ఉండొచ్చు అతడు; ఒకప్పుడు వర్ణనాతీతమైన ఆనందాన్నికూడా పొందివుండవచ్చు వీనిద్వారా!

కాని కొంతసేపో, కొన్నినాళ్లో, కొన్ని యేండ్లో, శరీరానికి ఉద్రేకం కలిగించి, రక్తాన్ని వేడిచేసి యింద్రియసౌఖ్యాల్ని యిచ్చిన యీవిలాసాలు అతనికి శాశ్వత మనిపించవు.

పైగా, అవి అతనిపరిణామంలో ఒకప్పుడు మిక్కిలి విలువకలవిగా కనబడబట్టే—

"మోమున మోముంజేర్చి
నిను ముద్దిడు కోరిక లేదు"

అంటాడు.

"...ప్రేలు మల్లికాదామనువానినా
మధురత ల్పరికింపంగం గాంక్ష లేదు—"

అంటాడు.

అవి ముఖ్యమైనా అతనికి ఆ "అప్రాప్త మనోహారి" తన "ప్రేమకు దారిచూపడమే" మరీముఖ్యము.

అయితే యిందులోకూడా ఒకలోపం వుంది:

నిజమైనప్రేమకు యింకొకరు దారి చూపడ మేమిటి? అప్రాప్తమనోహారి ఒక వేళ ప్రాప్తించినట్లయితే అతనిప్రేమకు దారి తెలిసినట్లా?

ఒకప్పుడు అట్టి విపత్తే జరిగితే అతని త్రోవకు నిరోధం కలుగుతుందికాని, ప్రేమ ప్రయాణము పైకి సాగదు. మనము కోరిన గగనకుసుమాలు మనచేతిలో పడితే అవి గగనకుసుమాలే కాకపోవచ్చును — ఎన్నెన్ని స్వర్ణవిగ్రహాలకు మంటికాళ్లు ఉండడం మనం చూడ్డంలేదు ?

ప్రేమకు దాని చూపమని ఆమెను కోరడం వ్యర్థం. ప్రేమకు దాని ఉనికే సొంపైంది: ఏకాంతసేవ — దివ్యనామార్చన — ఎడబాటు భరించలేనప్పుడు వేడినిట్టూర్పులూ— బాష్పసలిలధారలు. అయితే యివన్నీ మాటకు కొంచెంతక్కువరకపు సకారాలనే చెప్పాలి.

మనోహారిణీ ప్రాప్తించటం ఎందుకు? ఏనాడు సెవ నిర్మలహృదయంతో ఆమెను స్వప్రణయరాణిగా చేసుకున్నాడో ఆనాడే సకామె లభించింది! నిజమైన ప్రేమకు అవతలవారి అంగీకారంకాని సహాయంకాని అవసరమే లేదు. అవున్నంటే ప్రేమ పరిపూర్తి చెందుతుం దని కొందరి మతము — కాని అవి లేకుండానే నానాటికి కతిశయిల్లి గొప్ప దయ్యే ప్రేమే నిజమైన ప్రేమ.

* * *

అయితే జనసామాన్యానికి మాత్రం పెద్దపెద్ద ఆశయాలు పొసగవు. శారీరకమైన విలాసాలూ, తద్ద్వారా ఆనందమూ, వివాహం, సంసారం, సంసార తాపత్రయాలూ - యివన్నీ జరగవలసినవే.

సంసారంలో ప్రేమ లేదనకూడదు. అద్భుతమైన ప్రేమ ఉండడానికి అవకాశా లున్నాయి. కాని యీ అవకాశాలు యిప్పటిపరిస్థితులలో రాణింపవు.

నిజంగా భార్యాభర్తల స్నేహంకంటె గొప్పస్నేహం లేదనవచ్చు. ఎంత అన్యోన్య ప్రేమ ఉన్నా, ఎంత త్యాగసంపత్తి ఉన్నా, ఎంతటి సమాన ఆశయాలు ఉన్నా, ఏ మిత్రద్వయమున్నా అదృష్టవంతులైన దంపతుల అన్యోన్యానికి సాటి కారు.

కాని యిప్పుడు దేశంలో అమలులో నున్న వివాహాలలో అట్టి అన్యోన్యానికి ఏ లేదే ?

ఆమెకు పన్నెండేళ్లు — శారదాబిల్లు పుణ్యమా అని పద్నాలుగేళ్లుండవచ్చు; అతనికి పదహారో పద్దెనిమిదో ఏళ్లుంటాయి. వీరి మనస్సుల్లో ఏమి భావాలుంటాయి?

తల్లిదండ్రులచాటున పెరిగేపిల్ల అయితే, ఆమెకు అప్పుడే భర్తను భక్తితోను, భయంతోను చూస్తుం, భర్త కోరినప్పుడు తన శరీరాన్ని అతని కర్పించడమూ, అతను సంపాదించి తెస్తూఉంటే ఆమె వండిపెడుతూ ఉండడమూ, క్రమేణా పిల్లల్ని కనడమూ, వాళ్లని పెద్దవాళ్లను చేసి పెళ్లిళ్లు చేయడమూ, ఆస్తి, నగలు, భూమి నిలువచేసి నలుగురిలోనూ గౌరవంగా మసలడమూ—ఇవీ ఆమె కోరికలు.

ఇక అతనివిషయం. పెండ్లి అయ్యేసరికి అతను ఏ టెన్నిసుఆటల్లోనో, సినిమాధోరణిలోనో, "బుద్ధిమంతుడైతే" పరీక్షావిషయాల్లోనో నిమగ్నుడై ఉంటాడు. సహచరుల ధర్మమా అని యిదివరకే సంసారసుఖము లంటే ఒకవిధమైన భావ ముంటుంది అతని మనస్సులో.

దీనితో ప్రథమసమాగపువేళ మోటుగా ప్రవర్తించి ఆమెను బెదిరించివేస్తో, బొత్తిగా రాయిలా ఉండి ఆమెకు విసుపుగలిగించో, యీ జన్మానికంతా ఆమెకు తన మీద అసహ్యం కలిగించుకుంటాడు; లేదా యిది మనవిధ్యుక్తధర్మంకాబట్టి జరిగిపోవాలని, యీసంసారచక్రంలో వారిద్దరూ బండికళ్లై తిరిగిపోవడం ఆరంభిస్తారు.

* * *

ఒకరిమనస్సులు ఒకరు అర్థంచేసుకుని, ఒకరిఆశయాలకు ఒకరు దోహదంచేస్తూ అభివృద్ధిఅయ్యే ఐక్యాలు యెన్నివున్నాయి మనలో ! లేనేలేవేమో !

అనేకులు భర్తలు తమభార్యలవిలువ తెలియకుండా ఉన్నవాళ్లని నే నెరుగుదును. అనేకులు భర్తలు తమభార్యలు దేదీప్యమానమైన అందంగలవారని ఎరగరు — వారికి ఆధోరణే లేదు. అనేకులు భర్తలు తమభార్యలకు అద్భుతమైన సంగీతజ్ఞానముందని ఎరుగనే ఎరుగరు !

* * *

ఒకనాడు మేము కొండపల్లెకు వెళ్లాలని ప్రయాణమయ్యాము. మాఅక్కయ్య అంది: "మాస్నేహితురా లుంది తీసుకువస్తాను" అని.

అలవాటుచొప్పున నేనన్నాను: "ఆమె అందంగా ఉంటుందా" అని. "నువ్వన్నావుగా మహా నవమన్మథుడిలాగ" అంటూ నన్ను పైతస్కోపుతో కొట్టి వారివీధికి కారు మళ్లింపించింది.

మేము రావడం కిటికీలోంచే చూచి కిటికీతలుపులు దబాలున వేసి ఆమె అంతర్థానం అయిపోయింది. కాని నాదొంగకళ్లకు ఆమె దివ్యమైన దేహకాంతీ, తీవ్రదృష్టిగల విశాలనేత్రాలూ, సాక్షాత్తూ సంపెంగపువ్వును అనుకరించే నాసికా నిజంగా ఎర్రని నాజూకైన పెదవులూ కనబడ్డాయి — "అక్కయ్యా ఆమెను ఎల్లాగేనా తీసుకురావాలి" అన్నాను.

ఆమె వచ్చింది. ఆమెను నాప్రక్కన కూర్చోపెడుతుందేమో మాఅక్కయ్య అనుకున్నాను. కాని వా రిద్దరూ కలిసి వెనుక కూర్చున్నారు. —నా కామెను పరిచయమేనా చేయలేదు. కాని ఆమె ఏడేండ్లకుమార్తె — అచ్చంగా తల్లిపోలిక —"కారుమామయ్యా" అంటూ నా ఒళ్లోకి ప్రాకింది. "డాడుకో కసకం" అంది ఆపిడ. నేను కసకాన్ని మరీ దగ్గరకు తీసుకున్నాను.

నాముందు అద్దం ఉండబట్టి సరిపోయింది కాని లేకపోతే ఆనాటిప్రయాణము ఎల్లా నడిచేదో తెలియదు. ఒకటి రెండుపర్యాయాలు అద్దంలో ఉన్న నామొఖంకేసి ఆమె తదేకదృష్టితో చూడ్డం కనిపెట్టాను. ఆమె తల వొంచుకుంది. మమ్మల్నిద్దరిని పట్టుకుంది మాఅక్కయ్య !

త్రోవపొడుగునా వా రేదో మాట్లాడుతున్నారు. ఆప్పుళ్లో ఆడవాళ్లక్లబ్బులు, క్లబ్బు కీమె వెళ్లికపోవడమూ, ఎంతవెళ్లా లని ఉన్నా యింట్లో తెమలకపోవడమూ, యీ పూరొచ్చాక ఒక్కసినిమాఅయినా ఎరక్కపోవడం, వారిపుట్టిల్లు విశాఖపట్టణపుసాంపూ, వాల్తేరులో సముద్రపుటొడ్డున వారి బంగాళా, సింహాచలం అందం, ఆసంపెంగతోటలూ, గులాబీవనాల్లో, అత్తవారింటికి వచ్చేదాకా అన్నదమ్ములతోనూ వదినెలతోనూ ఆమె విహారంచెయ్యడం ఆమె చెపుతోంది ఉత్సాహంతో.

ఎందు కన్నానో నేను : "నేనుకూడా వెళ్లానండి సింహాచలం చాలాసార్లు. అద్భుతంగా ఉంటుంది. ఆపోకచెట్లపక్కని చిన్నబోదె వుంది. ఆబోదెచుట్టూ మెట్టతామరగింజల్ని యేరి దండలుగా గుచ్చేవాళ్లం" అన్నాను.

అప్పు డంది మా అక్కయ్య "సత్యవతీ! వీడు మాతమ్ముడు 'సుకుమార్'. చాలా కొంటెవాడు" అని. ఆమె నవ్వినట్టు చూశాను......

మా అక్కయ్యకు "బాటనీ" (వృక్ష శాస్త్రం) అంటే చాలాయిష్టం. కొండమీదికి వెళ్లాక తాను తెచ్చిన తడివట్టివేళ్లసంచీలో రకరకాల మొక్కల్నీ, పువ్వుల్నీ యేరి నింపు తోంది కనకంసహాయంతో. "మీరు పదండి వస్తాము" అంది మాతో. తప్పనిసరిగా మే మిద్దరమూ పక్కపక్కన నడవడం ఆరంభిం చాము. తీగలా ఊగిపోతూఉన్న ఆమె విగ్రహంనుంచి కళ్లు మరల్చుకోవడం నాకు దుస్సాధ్యమైంది.

పడమటికనుమ చేరాం. సూర్యుడు అప్పుడే యింటిముఖ మయ్యాడు. దట్టంగా కమ్మిన నీలమేఘాలసందునుంచి కిరణాలు దూరాన్నున్న కృష్ణపాయలను వెండిసెల యేళ్లుగా చేసేస్తున్నాయి. మాముందు ఆమ డలపర్యంతం దట్టమయిన పచ్చనిఅడవి. నది అవతలివొడ్డున కొండలు. బహురమ్యంగా ఉంది.

ఆమె అటుతేరి చూచి ఉత్సాహంతో "అదుగో వేద్రాద్రి! అదుగో అమరావతి" అన్నది.

"మీకు అమరావతి తెలుసునా?" అన్నాను.

"తెలియకేం? — అక్కడ ఒకప్పుడు బౌద్ధ స్తూపం ఉండేది ... నేను సారనాథ్ కూడా చూశాను......ఆబూపర్వతంలోని జైనదేవాలయాలూ చూశాను."

"ఇంకా?"

"ఇంకా చాలావోట్లు చూశాను — కాని—"

"కాని?"

"ఏమిలాభము? — అదోపూర్వజన్మ!"

నాకు ఆశ్చర్యంవేసింది. నేనుతప్ప నా కారులో యింత భూప్రదక్షిణంచేసినవాళ్లు లేరని నాగర్వం.

"చెప్పండి — నాకు వినాలని ఉంది" అన్నాను ఆత్రుతతో.

"దిల్వారాలో ఆ అద్భుతశిల్పాలని చూచి — చనిపోవా లనిపించింది."

"ఎంతమాట!"

"అవును — అంతటి సుందరమైన విష యాలను చూశాక యింక జీవించడ మెందుకు?"

నాకు మరీఆశ్చర్యమైంది — ఒకానొక ప్పుడు హంపీక్షేత్రంలో విరూపాక్షాలయం దగ్గర ఒకమందిరంలో మహావలయాకృతిని రాసక్రీడ చిత్రించి ఉండడం చూచాను. కృష్ణ కర్ణామృతములోని

శ్లో. అంగనా మంగనా మంతరే మాధవో
మాధవం మాధవం చాంతరే చాంగనా,
ఇత్థమాకల్పితే మండలే మధ్యగ
స్సంజగౌ వేణునా దేవకీనందనః.

అన్న వర్ణన ననుకరించి అద్భుతంగా చెక్క బడివుంది రాసక్రీడ. దానిని చూచి నేను స్నే హితునితో అన్నాను: "అబ్బా! ఏమి అందం! చచ్చిపోవాలని ఉందోయి" అని.

మరల యిన్నేళ్ళకు అదే భావము — అద్భుతమైన అందాన్ని చూచి అంతటితో అంతమైపోవాలని వెర్రిఉద్రేకం — మరల యీనాటికి యీమెవల్ల విన్నాను.

ఆమె మాటలు యింకా వినాలని అని పించింది. ఒకవేళ పాడగలదేమో ?

"మీకు సంగీతము యిష్టమా ?"

ఆమె ఒకక్షణం ఆలోచించి "యిష్టమే— కాని పాడి కొన్నేళ్ళయింది."

"ఏం — యిప్పుడు మానివేశారా ?"

మౌనము.

"ఈ దివ్యసమయములో కొంచెము పాడాలని లేదా ?" ఆమె నాకేసి చూడ లేదు. మరల అడిగాను : "పాడరా — నే నడుగుతున్నాను కాబట్టి..." (ఏమిచొరవ!)

ఏమి ఆచూపు! జాలిపడుతూ, జాలి చూపిస్తూ, జాలికోరుతూ, జాలిని కలిగిస్తూ నన్ను చకితుణ్ణి చేసింది......ఆమె పెదవులు కదిలాయి :

"ఏమి పాడను ?"

"ఏదయినా సరే — మీ యిష్టం వచ్చిన పాట."

నేను కళ్లు మూసుకున్నాను...

తేనెసోనలు చింద నారభించినాయి :

"క్షీరసాగర శయనా — నను
చింతల బెట్టవలెనా......"

ఎంతసేపు పాడిందో ఆమె...... ఆప్రశాంతసమయంలో దేవతలు విహరించే వేళ, ఎంత స్వానుభవంతో ఎంత దీనంగా, ఎంత మధురంగా, ఎంత జాలిగా ఆలాపిం చిందో ఆమె నేను చెప్పలేను......

మాఅక్కయ్య యెప్పుడో వచ్చి మా కాళ్లమీదికి క్రుంగివున్న నాతలను తన మెత్తనిచేతులతో నిమురుతూ "ఏమి టిది" అని నాకన్నీటిని చూచింది.

కనకం తల్లిఒళ్లో చేరి "అమ్మా! ఎందుకే ఏడుస్తున్నావు?" అన్నది.

మాఅక్కయ్య దొంగకోపంతో "చా ల్లెండి — "సెంటిమెంటల్‌ఫూల్సు!" పదండి చీకటిపడుతోంది" అని ఆమెను బహు నెమ్మదిగా లేవదీసింది. కౌగలించుకుంది.

సూర్యుడు ఎర్రబారిన మొగంతో, "వెళ్లిపోతున్నారా? నేనూ వెడుతున్నాను" అన్నట్టు వేద్రాదివంకకు మరిగాడు—మేము యిళ్లకు చేరుకున్నాము.

ఆరాత్రి ఆమెభర్త — వాసుదేవరావు ఆమెను కొట్టాట్ట !

* * *

తరవాత చెప్పింది మాఅక్కయ్య : వాసుదేవరావుగారు భార్య పోగా మరదల్ని సత్యవతిని పెళ్లాడాడనీ, సత్యవతి తండ్రి సర్వే యిలాకాలో గొప్ప ఉద్యోగం చేసి పింఛను పుచ్చుకొని, విశాఖపట్టణంలో కా పురముండేవాడనీ — కాలక్రమేణ కలకత్తా గుర్రపుపందాలలో ఆమె అన్నగారి ఆస్తి అంతా చాలవరకు పోయిందనీ, తండ్రి గతిం చాక సత్యవతికి ఈ అనుకోనిపెళ్లీ, అతను చాలా మంచివాడైనా ఒంటెత్తుగుణం కల వాడనీ, ఎప్పుడూ తనవంతెనలూ, రోడ్లూ, కంట్రాక్టరులే తప్ప వేరే వ్యాపకం లేనివా డనీ, దేశదేశాలలో మహాకీర్తితో వెలిగిన

ఆమె తండ్రిద్వారా ఆమెకి కలిగిన విద్య, కళా వ్యాసంగము, అన్నీ బూడిదలో పోసినపన్నీ రయినాయనీ, అతనికి సౌందర్యదృష్టి, శరీరంకంటె ఎక్కువ సంసారానికి అయిన భార్య అంటే తగని అనుమానము, ఆమె ఎవరితోనైనా, ఆడ వారితో గాని, మగవారితో గాని మాట్లాడితే పట్టలేనంత ఈర్ష్య కోపము వస్తుందనీ, ఆమె కనకం మీద పంచప్రాణాలూ పెట్టుకొని ఎల్లాగో కాలం గడుపుతోందనీ యింకా ఏవేవో చెప్పింది మా అక్కయ్య.

ఆ రాత్రి నాకు నిద్దర లేదు. రెక్కల మీద ఆమెవద్దకు వెళ్లి ఆమె రెండు చేతులూ పట్టుకొని "అమ్మా! విచారపడవద్దు. నే నున్నాను మిమ్మల్ని పూర్తిగా అర్థం చేసు కోగలవాణ్ణి. మీలాగే బాధపడుతూ ఉన్న వాణ్ణి. మీలో ఉన్న నిరాశనూ, నిరుపేద రికాన్ని నేనూ అనుభవించాను. అనుభవ లోకంలో మన మిద్దరమూ సహచరులము, స్నేహితులం" అని ఊరడించాలని ఎంతో అనుకున్నాను! కాని, ఏమిలాభము? ఆశలు గుర్రాలైతే, బిచ్చగాళ్లు రౌతు లౌతారు!

మాయిద్దరి మధ్యా సంఘనియమాలనే మహాకంటకం ఉంది......

నాటికీ నేటికీ నేను మళ్లా ఆమెను చూడలేదు...కనకం పుట్టినరోజుకుమాత్రం నాకు "కారుమామయ్యకు" అని పట్టు జేబు రుమాలు వస్తూవుంటుంది. దరిమిలాను "కారుమామయ్య" సుకుమార్ అయ్యాడు. ప్రతి శ్రావణశుద్ధపంచమికి సత్యవతీదేవి కుట్టిన సువర్ణాక్షరాలతో నేను ఎక్కడ వుంటే అక్కడికి పట్టురుమాలు కానుకగా వస్తూ వుంటుంది — నా తడికళ్లను అద్దుకో డానికి.

జవాబు వ్రాయాలని ప్రయత్నిస్తాను. "కొంప మునుగుతుంది సుమా" అంటుంది మా అక్కయ్య — ఆమెకు సంఘపు మొట్టికా యలబాధ తెలుసును కాబట్టి.

సంఘమే కాదు. ఈర్ష్యాపిశాచం కూడా ను. "అమ్మపెట్టదు. అడుక్కు తిననీయదు" అన్నట్టు తా నామెకు ఆనందం యియ్యడు. యిచ్చే త్రోవలను నిరోధిస్తాడు. — భార్య అతనికి విలువగల ఒకవస్తువైందిగాని, ఆమె గౌరవానికి, తన స్నేహానికి, తన అనురా గానికి, ఒకొక్కప్పుడు తన భక్తికి నిలయ మైన తేజస్స్వరూపిణి అని గుర్తెరగడు. సుమ కారంతో చూచుకుంటూ ఉన్న మడి మాన్యాలలో ఆమెకూడా ఒకర్తె. తనతోట లోని గులాబిపువ్వులను యితరులు తేరిపార జూస్తే కర్రపుచ్చుకునే తోటమాలిలాగ యితనున్నా ఎవరైనా తనభార్యలావ ణ్యాన్ని కన్నెత్తి చూచినా, ఆమె మృదుల సంభాషణవల్ల కొంత మనశ్శాంతిని పొందినా యితనికి కిట్టదు.

యిక వీరిద్దరిమధ్యా స్నేహం ఎల్లా కుదురుతుంది? పాపం అక్కడికీ ఆమె అనేక విధాల అభినివ్యాపకాలలో జోక్యం కలి గించుకొని అతను యింటికి వచ్చాక తిని కూర్చుని తమలపాకులను అందుకుంటూఉన్న ప్పుడు మెల్లిగా అడుగుతుంది, 'ఈవేళ ఆఫీసులో జరిగిన విషయాలు ఏమి'టని. అత నికి చెప్పటానికి ఓపికేది? అడిగించుకోవా లనీ, కనకంసంగతీ, కనకం ఎదుగుతో ఉన్న విషయం, కనకం చిన్నిహృదయంలోంచి

మొలకిలెత్తుతూన్న చిన్నారిభావాలూ, ఆమె అల్లరీ, అప్పుడే సంగీతంలో ఆమెచూపిస్తూ ఉన్న శ్రద్ధ, స్థానంపాటలను అచ్చంగా స్థానంలాగే పాడడం యివన్నీ అతనితో చెప్పాలని ఉంటుంది ఆమెకు. కాని అతనికి తీరికేది ? ప్రక్కయింటికి కబురు పంపించి తెప్పించిన అర్ధణాపేపరులో జమ్మలమడుగు వృత్తాంతాలని చదువుతూ నిద్దర వచ్చే అతనికి ఈమెతో సల్లాపమే అక్కరలేదు. ......గుర్రుపట్టి నిద్రపోతాడు. ఆమె ఒక సారి పక్కదగ్గిరికి వెళ్లి కనకాన్ని తడిమి చూచుకొని కింద పడుతుందేమోనని ఈ వైపూ ఆవైపూ తలగడలను సరిచేసి వచ్చి పడుకుంటుంది. కాని, నిద్రవస్తేగా ! మళ్లా లేచి వెళ్లి చల్లగాలిలో కొంచెం హాయి అనుభవించి పడకటింటిమూలను భద్రపర చిన వీణను తీసికొని శ్రుతులు సరిచేసుకొని యిష్టంవచ్చిన వర్ణమో, ఏదో పదమో పలికిస్తూ వీణతో చెప్పుకుంటుంది తనభగ్న హృదయపుగాధను.........

ఒకవేళ సుకుమారు ఆమెకళ్లకు కను పడతాడేమో !......

* * *

భార్య తన స్వార్జితమైన చరాస్తీ, నిజంగా స్థిరాస్తీకూడాను అని అనుకుంటూ న్న భర్తలేకాదు; అదేవిధంగా భర్తకూడా తమ ఆస్తి అనుకొనే భార్యలూ ఉన్నారు. వీరి విషయంలో సాధారణంగా ఈభావము ప్రేమోద్రేకంవల్ల వచ్చిందేమో? ఆర్థికంగా మాత్రం కాదు. మొట్టమొదటి చనువులను పూతగా తీసికొని వీరు భర్తను తమ అను చరుణ్ణిగా చేసుకుంటారు. ఆమెమీద అపరి మితమైన ప్రేమవల్లో, సహజంగా యితనిలో ఉన్న స్త్రీజనమందలి గౌరవంవల్లో యితడు ఆమెను చాలచాల పెద్దచేసి అన్ని విధాలా ఆమెకు సంతోషం కలిగించాలనే చూస్తుం టాడు. ఏమి చేసినా ఆమెను కనుక్కోందే చేయడు. ఏ ఆనందం అనుభవించినా ఆమె తోపాటే అనుభవిస్తాడు......

కాని ఏముహూర్తాన వస్తుందో శాంతి నికేతనంనుంచి బెంగుళూరు వెడుతూ పూర్వ పరిచయంవల్ల బెంగాలీ అమ్మాయి రేణుక వీరింట్లోనే దిగాలా ? రేణుక మన పార్వతికంటె ఎక్కువ అందంగా ఎందు కుండాలి ? పార్వతికంటె వేష భాషలలో ఎక్కువ నాజూకుగా ఉండడం రేణుక తప్పా? పూర్వం కొన్నియేండ్లు తనతో సహాధ్యా యుడై ఉన్న మోహన్‌తో ఆమె చనువు గా ఉండడం ఆమెకు తప్పులా కనపడదు. అతను సోఫాలో కూచుంటే దబ్బున వెళ్లి అతని పక్కనే కూచుంటుంది. అతను లేచి వెళ్లి యింకో కుర్చీలో కూచుంటే ఏం బా గుంటుంది? వారిద్దరిమధ్యా తాను కూర్చో వాలని ఎన్నిసార్లు ప్రయత్నం చేస్తుంది పార్వతి ?

" ఈమధ్య వసంతోత్సవం చేశా మోయ్ బోల్పూరులో. గురుదేవుడు నా నృత్యాన్ని చూచి ఆనందమయిపోయాడు. 'బిడ్డా! ధన్యురాలవు' అని కౌగలించుకున్నా డు" అంటుంది రేణుక.

ఆమెను నిదానించి చూచి, నృత్యము కోసమే సృష్టింపబడ్డ ఆమె అంగసౌష్ఠవానికి ఒక్క నిమిషము అతడు సంతోషించటమూ, ఆహోగడ్త అతని చూపులలో ప్రసరించడమూ పార్వతికి ఎల్లా కిడుతుంది ?

సాయంత్రము బీచ్‌కి వెళ్లాలని ముస్తుకూ బయలుదేరతారు. కార్‌లో ఎక్కబోతూ వుంటే కలెక్టరుగారిభార్య వచ్చి "పార్వతీ" అంటుంది. కలెక్టరుగారిభార్య కొంచెం పూర్వాచారం కలది. మోహన్‌తో మాట్లాడదు. పార్వతి వెనక్కుండిపోతుంది. వారు వెళ్లాలా, వద్దా? — పోనీ, ఆమె నిలబడిపోయిందని వారూ ఆగరాదూ? రేణుక రోజు రోజూ వస్తుందా? మళ్లా ఎన్నాళ్లికొస్తుందో యీపూరు? కలకత్తా ఆవేపున సముద్రం ఉండదు. మోహను భారమంతా డ్రైవరుమీద వేసి ఊరకుంటాడు. క్రొత్త దృశ్యాలని చూడాలని ఉన్న రేణుక ఉత్సాహం డ్రైవరుని కమ్మివేసి పార్వతి లేకుండానే బీచిప్రయాణం సాగుతుంది. ఎంత మంచి మోటారైనా ఏదో మర పాడవడం ఆశ్చర్యమా? రాకరాక వచ్చిన అతిథికోసం పార్వతి మరోగంట ఎక్కువసేపు భోంచెయ్యకుండా కనిపెట్టుకోవడంలో అంత గొప్పయిబ్బంది లేదు. కాని కలెక్టరుగారిభార్య పుణ్యమా అని రేణుక "తెయితక్కలబొమ్మ"యింది. దానికోసం కనిపెట్టుకోవడం కంటకమయిపోయింది పార్వతికి.

వారిద్దరూ ఉత్సాహంతో మేడమెట్లెక్కి రావడం వింది. వారు హాలులో కొచ్చేసరికి పార్వతికి తలనొప్పి వస్తుంది.

"అయ్యో! యింతసేపూ యింట్లోనే ఉన్నారా? చల్లగాలి లేకపోతే తలనొప్పి రాదూ? యీకిటికీ తీయనా" అంటుంది రేణుక.

"వద్దండీ! చలేస్తోంది — మీరు వెళ్లి భోంచెయ్యండి" అంటుంది పార్వతి.

మోహను ఏం చేస్తాడు? 'అమృతాంజనం పట్టుకొచ్చి రాయనా' అంటాడు. ఆమెకు కావలసింది ఈ అంజనం కాదు!

"ఏమీ వద్దు. మీరిద్దరూ వెళ్లి భోంచెయ్యండి. పరమాన్నం చల్లారిపోయిందప్పుడే" అంటూ అతనికేసి చూడనయినా చూడదు. ఎప్పుడో మధ్యాహ్నం తాగిన కాఫీ — యింక ఆమెను మరీబతిమాలలేక వారిద్దరూ భోజనానికి వెడతారు.

రోజూ అయిదు నిమిషాలలో భోంచేసి చెయ్యి కడుక్కునే మోహన్ అరగంట ఎందు కుండాలి భోజనందగ్గర? ప్రతివస్తువు మారు వడ్డించుకుంటున్నాడు. ఆమెకు మన వంటకాలన్నీ వర్ణించి చెపుతూ యింకా యింకా రుచిచూడమని బలవంతం చేస్తున్నాడు!—

పార్వతి తన తలనొప్పిమాట మరచిపోయి రొప్పుకుంటూ వచ్చి "అవ్వగారూ! పెరుగెక్కడుందండీ" అంటూ వెండిగిన్నెలో పెరుగు తీసికొని వారిని కనుక్కోకుండానే దబదబా వారిద్దరికీ వడ్డించి మెఱుపులాగ మళ్లీ పడకటింటిలోకి వచ్చేస్తుంది.

—వారిద్దరికీ తమలపాకుల్ని పంపిస్తుంది. మోహన్ వినేటట్టుగా "సుబ్బారావూ! డ్రైవరుని కారు తెమ్మను. అమ్మగారు రైలు కెళ్లాలి?" అంటుంది.

పాపము! రేణుక యింకా నాలుగైదు రోజు లుంటుందేమో, ఆమెవల్ల పార్వతి యింకా క్రొత్తవిషయాలను తెలుసుకుంటుందేమో, ఈపూళ్లో కొందరికైనా వంగదేశపు కళంటే ఏమిటో, వారు మనకంటె ఎందుచేత గొప్పవారయూరో చూపించాలని అనుకున్న

మోహను యిప్పుడు ఆమె ప్రయాణాన్ని ఎల్లా ఆపగలడు? రేణుకకూడా తన ప్రోగ్రాం ప్రకారము మోహనువద్ద నాలుగైదు రోజు లుందామని వచ్చినా యింకమీదట ఎల్లా వుంటుంది?

......రైలు కదులుతూండగా అతని చేతుల్ని తనచేతుల్లోకి తీసుకుని రేణుక అంటుంది;

"నాకు తెలుసు...విచారించకు...... కాని, ఆమె సౌఖ్యాన్నే నీ సౌఖ్యంగా చూచుకో."...

పార్వతీ మోహనులమధ్య అంకురించిన ఈ చిన్నగాలి ఈదరగాలై, హోరుగాలై, తుపానై, ఉప్పెనై, ప్రళయమై, వారిని శాశ్వతంగా విడదీసివేసింది. ఎవరిది తప్పు!

తప్పెవరిదైతే నేమి? వీరిద్దరూ వొకరి నొకరు అర్థం చేసుకోడానికి ప్రయత్నించక పోవడమే విచారకరం. ఆపేక్ష, అనురాగమూ వేరు, — ప్రేమ వేరు. ప్రేమలో స్నేహం వుంది. ప్రేమలో స్వార్థం యిసుమంతైనా లేదు. త్యాగస్వరూపమే ప్రేమ!

*　　*　　*

నీప్రియురాలిని చేతులార లోకప్రియురాలిని చేయగలిగినపుడే ధన్యుడవు!

"నీవెత హరింతు — సుఖమెల్ల
నీకెయుంతు"

అన్నప్రియుడే గొప్పప్రియుడు.

యింతకూ నిజమైన ప్రేమ యేమిటంటే: భౌతికంకాని అశరీరమైన ఆశయారాధన.

మనం మిక్కిలి హృదయపూర్వకంగా ఆరాధిస్తూవున్న ఆశయాలు, మన నిజమైన అనుభవాలపరిపూర్తి, మనము పైకి చెప్ప డానికికూడా భయపడే గొప్పకోరికలు అన్నీ మూర్తీభవించి ఒకదివ్యమంగళవిగ్రహంలో "సగుణబ్రహ్మ"గా అవతరిస్తూవుంటాయి.

కాని, మన అజ్ఞానంవల్ల ఒకొక్కప్పుడు వీనిని భూలోకానికి దిగలాగచూస్తాము — అప్పుడు అంటాడు కవి:

......"ఔర! ప్రభాతశైలసా
నూపలనీలపాళికల
నొత్తకయే స్రవియించు ఆహిమా
నీపరగాయనీగళవి
నిస్రుతమాధురి మంటికేస్తురా?

అని.

ఉత్తమకవి ఆదర్శప్రియుని - దృష్టిలో:

"ప్రేయసి సోయగమ్మునకు
లేదు శరీరము; లేదు మేను నా
తీయని ప్రేమకేని; కలదే
యెడబాటిక మాకు!"......

కాని, కొన్నికొన్ని గొప్ప ఉద్దేశాలను మనసులో జపించుకోవడం ఒకటి. వానిని అనుభవాలుగా చేసుకోవడం వకటి. ఒకొక్కమారు మన ఆశయాలు చాల దగ్గరగా అందుబాటులో ఉన్నట్టుంటాయి. ఎన్నాళ్లనుంచో మనసులో చిత్రించుకున్న గుణపరంపరల నన్నిటినీ, ఎన్నాళ్లనుంచో హృదయంలో ఆరాధిస్తూఉన్న విలాసాలను అన్నిటినీ ఆఖరికి ఒక వ్యక్తిలో చూచామనుకుంటాము. అన్వేషణ పూర్తి అయిం దనుకుంటాము. కాని చివరికి ఏదో లోపం వుంటుంది.

ఎంతటి స్వర్ణవిగ్రహానికైనా, కాలిగోరికైనా మన్ను తగిలి వుంటుంది. అప్పుడే వస్తుంది ఆశాభంగము, భరింపరాని ఆశయభంగము! ఆ స్థితిలోనే అంటాడు కవి:

“ ఏ మృగతృష్ణనో వలచి యేఁగెదు; నీ దురదృష్టశేషిత
ప్రేమము నీయెడంద కొన రెక్కలకేనియు నందరాని స్వ
ర్గామృత నందనప్రసవ మయ్యెఁగదా! వెదకాడఁబోయి చే
లా మిహికా మృషా పథములం దని రందరు నవ్వులాడుచున్.”

సాంత్వనము

కొండూరు వీరరాఘవాచార్యులు

తావు లెగజిమ్ము నాపొన్నతరువుక్రింద
పాలగచ్చుటరుంగుపైఁ బవ్వళించి,
ప్రణయరాగాలు దీయు నో పడుచుపిల్ల
ఏల శయనించినావు రానేలమీఁద ?

జిలుగుచిఱునవ్వువెన్నెల ల్చిందిపడెడి
వదనమున కోపపూర్ణవైవర్ణ్య మేల
తాండవించెడు? భామినీ! తలఁపవొక్కొ,
తమము వర్షింపఁబోఁడు సుధామరీచి.

చిరవియోగార్తి ఖిన్నమౌ చిత్తసీమ
వలపుఁదేనియ లూర, మై పులకరింప,
ముగుద! బెట్టిద మీ క్రోధముద్ర విడిచి
ఏది తిలకింపు మొకసారి ఇతనివైపు.

పండువెన్నెలరేలిరుల్ బ్రామికొన్న
కాళరాత్రులయట్టులఁ గానుపించు,
అతివ! వలపులు జిలుక రసార్ద్రభణితి
నొక్కమాటైన నీ వాడకున్కిఁ జేసి.

నవవికచసుమామోదమానముడుగు, నింపు
ప్రేమమునునైన వసివాడుహృదయ మబల!
ప్రియుని కక్కున బెట్టుగాని వీడుదువుగాని
శీర్ణమైపోవు నిక నాలసించెదేని!

అలరుబోణులతుమ్మెదగాఁగ నంటుకొన్న
అంగకమ్ములు నలసిల్ల నడుగుఁడెంచు
పిల్లతెమ్మెరకాని పెంపిల్లఁ జేసి
కరుగఁగదా హృద ? యింత నిష్కరుణమయ్యె?

అదె శరన్మేఘుఁడోలెఁ దూఁగాడుసమ్మగా
మధురమూర్తియు రోహిణీమానసశశికి
కలువపూగుత్తి నీనిశాకాంత చేతఁ
బంపు, ప్రేమోపదగ స్వీకరింపు మనుచు.

ప్రణయినీ! మృదుమధురభావాలబరిణ
హృదయ మెందులకే పిధానించుకొనెదు ?
అందు విరిసినపూలభోగ్యత్వమునకు

బియ్యపుధర – ఎందుకు పడిపోయింది?

ఎట్లా పెరుగుతుంది?

నరసింహదేవర సుందరరామశాస్త్రి

కొంతకాలంనుంచి బియ్యపుధర మందమవడంవల్ల దేశంలో చాలాఆందోళన కలిగింది. మనవ్యవసాయదారులలో చాలామందికి బియ్యము, ఇతర కాయ ధాన్యాలు — వీటివల్లనే రాబడిగనుక ఈ విధమయినఆందోళన కలగడం సహజమే. విడివిడిగా తీసుకొంటే ఈ రాష్ట్రంలో పండేపంట లన్నిటిలో బియ్యానిదే ఎక్కువపెద్దపంట. ఇది పండేభూమివిస్తీర్ణం దాదాపు కోటి ఎకరాలు, అంటే మనరాష్ట్రంలో సాగయ్యే మొత్తంభూమి అంతటిలోను ఇది నూటికి ఇరవైయెనిమిదిచొప్పున ఉన్న దన్నమాట. ఇతరధాన్యాలు పైరయ్యేభూమి మొత్తం విస్తీర్ణం దాదాపు కోటిముప్పయిలక్షల యెకరాలు, అంటే మొత్తం విస్తీర్ణంలో నూటికి ముప్పయ్యారోవంతు. ఈ విషయాలనుబట్టి వ్యవసాయదారులు ఈ సరకులమీద ఎంత ఎక్కువగా ఆధారపడిఉంటున్నారో తెలుస్తుంది.

ఈ పక్క నిచ్చిన పట్టికలో ౧౯౧౮ మొదలు ౧౯౩౬ సంవత్సరాలలో ప్రతి ‘ఇంపీరియల్ మణుగు’ తూకంగల బియ్యానికి సంవత్సరానికి దామాషాయిని ఎంతధర ఉంటూవచ్చిందో తెలుపబడింది. ఈ యంకెలన్నీ మద్రాసు గవర్నమెంటువారి ‘సీజన్ అండ్ క్రాప్’ నివేదికలనుండి తీసుకొన్నవి. ‘ఇంపీరియల్ మణుగు’ అంటే ౮౨ 2/7 పౌనులకు సమానం.

బియ్యంధర

సంవత్సరం	మణుగుకు అణాలలో
౧౯౧౮	౧౨౨
౧౯౧౯	౧౪౪
౧౯౨౦	౧౨౦
౧౯౨౧	౧౧౭
౧౯౨౨	౧౦౯
౧౯౨౩	౧౧౧
౧౯౨౪	౧౨౫
౧౯౨౫	౧౧౪
౧౯౨౬	౧౧౮
౧౯౨౭	౧౧౯
౧౯౨౮	౧౧౦
౧౯౨౯	౯౯
౧౯౩౦	౭౫
౧౯౩౧	౬౭
౧౯౩౨	౬౦
౧౯౩౩	౫౦
౧౯౩౪	౬౦
౧౯౩౫	౬౨
౧౯౩౬	౬౦

ఈపైపట్టికనుబట్టి బియ్యపుధర ౧౯౨౭ నుంచే పడిపోవడం ఆరంభించిందని తెలుస్తుంది. కాని ఈధర మొదటిమూడు సంవత్సరాలలోను మందంగా పడిపోయింది; ౧౯౩౦ తరువాత చాలా వడిగా పడిపోయింది. ధర బాగాపడిపోవడం ౧౯౩౩ లో. అటుతరువాత ధర కొంచెం పెరుగుతూ

వచ్చింది. కాని ఎంత పెరిగినా ధరలమందానికి పూర్వపురోజుల్లో ఉండేదానితో సమానమాత్రం కాలేదు. ఈ పెరగడమయినా ౧౯౩౭ నుంచి నిలిచిపోయింది.

ధరలు పడిపోవడానికి కారణాలు :

ధాన్యాలధరలు మందంగానే ఉంటూ రావడానికి చాలావరకు ౧౯౧౪–౧౯౧౮ యుద్ధముఅనంతరంకలిగిన పరిస్థితులే కారణం. యుద్ధపురోజుల్లో ఆహారపదార్థాలు విపరీతంగా కావలసిన అవసరం ఏర్పడింది. అందువల్ల ధరలు బాగా పెరిగిపోయినవి. ఇందుమూలాన పంట ఎక్కువచేయడానికి ప్రోత్సాహం కలిగింది. దీనికి ఫలితంగా, ప్రపంచ మంతటాకూడా ఆహారపదార్థాలు పండించే భూమివిస్తీర్ణం బాగా పెరిగిపోయింది. గోదుమలు పండించేభూమిలో మరవ్యవసాయపు పనిముట్లు వచ్చి, వాటిమూలంగా పంట హెచ్చడం, పంట పండించడంలో అయ్యేఖర్చులు తగ్గడం జరిగింది. ఇక బియ్యంవిషయంలో అమెరికా సంయుక్త రాజ్యాలలోను, దక్షిణయూరోపుదేశాలలోను, ఇండో-చీనాలోను సాగుబడిభూమి వృద్ధిచేయడానికీ, అదివరకున్న భూమిలో అదివరకుకంటె ఎక్కువపంట పండించడానికీ ప్రయత్నాలు జరిగినవి. యుద్ధమయినప్పటి నుంచి ఇటలీ, స్పెయిను, కొరోలినాలలో బియ్యపుపంట మూడింతలు పెరిగిపోయింది. పంట అంత ఎక్కువగా పెరగడంమూలాన్ని ధరలు బాగా పడిపోయినవి.

ప్రత్యేక కారణాలు :

ఈ విధంగా యుద్ధానంతరం కలిగిన వ్యత్యయాలవల్లా ధరల మందంకాలంలో అన్నిసరకులధరలూ సాధారణంగా పడిపోవడంవల్లా బియ్యానికి బాగా దెబ్బతగిలింది. ఇవి అట్లా ఉండగా, బియ్యంవంటి సరకు యొక్క మామూలుధర (Normal Price) సామాన్యపుభూమిమీద దానిని పండించడానికయ్యే పెట్టుబడిఖర్చులనుబట్టి నిర్ణయమవుతూఉంటుంది. కాని ఒకదేశం ఇతరదేశాన్నుంచి ఏ సరకునైనా ఎంతో కొంత అవసరంగా దిగుమతిచేసుకోవలసివచ్చినప్పుడు పైనిచెప్పినటువంటి పెట్టుబడిఖర్చులు ఆ సరకు ఎక్కడినుంచి దిగుమతిఅవుతుందో ఆ దేశంలో అయ్యేవే లెక్కలోకి తీసుకోవాలి.

ప్రతిసంవత్సరమూ బర్మానుంచి మద్రాసుకి బియ్యం చాలా దిగుమతి అవుతున్న దన్నసంగతి అందరికీ తెలిసినవిషయమే. బియ్యం పండించడానికి బర్మాలో అయ్యేఖర్చులు మద్రాసులో అయ్యేవాటికంటె చాలా తక్కువ; ఎందుచేతనంటె బర్మాలో బియ్యం వర్షాధారంవల్ల సాగయ్యే ఫలవంతమయిన భూమిలో మద్రాసులో అట్టిభూమికి చెల్లించవలసినదానికంటె తక్కువ భూమిసిస్తు చెల్లిస్తూ పండిస్తారు. ౧౯౩౮ లో బియ్యంపండే ఎకరంభూమికి ఖర్చులు తంజావూరిలో ౨౮ రూపాయ లయితే బర్మాలో ౧౩ రూపాయలే అయిందని అంచనా వేశారు.

ఇంతేకాకుండా, బియ్యాన్ని బర్మానుంచి మద్రాసురేవుపట్టణానికు రవానా చేయడానికయ్యే ఓడకేవుఖర్చులు మద్రాసు రాష్ట్రంలోనే ఒకచోటనుంచి ఇంకొకచోటికి పంపడానికయ్యే రైలుఖర్చులకంటె చాలా తక్కువ. చౌకఓడకేవులవల్ల యూ

రోపుగోదుమపంటకు గిరాకీ తగ్గి అమెరికా పంటకు ఏవిధంగా గిరాకీ తగిలిందో ఆరీతిగానే పైదేశాలనుంచి వచ్చిన చౌకబియ్యం మద్రాసు బియ్యపుధరలను బర్మాధరల మట్టానికి కూలదోసినవి. మద్రాసురాష్ట్రంలోని ముఖ్యకేంద్రాలలోని బియ్యపుధరలు బర్మాధరలకు చాలా చేరికగా ఉంటున్నవనే విషయం కడచిన కొద్ది సంవత్సరాలలోను ధరలు అక్కడా ఇక్కడా ఎట్లా ఉన్నవో తెలుసుకొంటే బోధపడుతుంది. ఈక్రింద చూపిన పట్టిక ననుసరించి ధరలమందానికి పూర్వం బర్మా విదేశాలకు చేసినఎగుమతులు హిందూదేశం చేసినవాటికంటె దాదాపు రెండురెట్లు ఎక్కువగా ఉన్నట్లు మనం తెలుసుకొంటాము. కాని ౧౯౩౩ నుంచి బర్మా నుంచి విదేశాలకు అయ్యేయెగుమతులు కూడా క్షీణించినవి. ఇటువంటి పరిస్థితులలో ఆ బర్మాసరకు మనహిందూదేశానికి వచ్చిపడిందంటే సహజమే, విపరీతంలేదు. ఈదిగుమతిసరకువల్ల మన హిందూదేశంలోని బియ్యపుధరలకు దెబ్బ తగిలింది.

బర్మానుంచి వేలటన్నుల లెక్కను ఎగుమతులు

	విదేశాలకు	హిందూదేశానికి
౧౯౨౬-౩౦ (దామాషాను నాలుగేండ్లలో)	౧౮,౨౪	౮,౫౫
౧౯౩౧	౨౦,౬౬	౧౦,౮౬
౧౯౩౨	౧౬,౫౭	౯,౩౬
౧౯౩౩	౧౫,౨౭	౧౬,౨౮
౧౯౩౪	౧౩,౯౯	౧౯,౭౮
౧౯౩౫	౧౨,౧౮	౧౫,౭౩
౧౯౩౬	౧౨,౩౦	౧౫,౩౪

అయితే, హిందూదేశంలో మొత్తం పండే బియ్యపుపంటలో బర్మానుంచి దిగుమతిఅయ్యే బియ్యం చాలా స్వల్పభాగమే అనవచ్చు. అది నిజమేకాని గ్రామాలలో పండించే పంట అక్కడి ఖర్చుకి పోగా బజారులో అమ్మకానికి వచ్చే సరకుతో అంచనా వేసిచూస్తే దీనిభాగం ఎక్కువగానే ఉంటుంది. అదిగాక, ప్రక్కని సరకు కొద్దిగా ఉన్నప్పటికీ దాన్ని చౌకగా అమ్ముతూఉంటే మిగతా సరకు ధరలను పడగొట్టడానికి అదేచాలు.

ఇండో - చీనా, హిందూదేశపు ధరలు :

౧౯౩౩, ౧౯౩౪ లలో సయాము, ఇండో-చీనాలనుంచి అయ్యే బియ్యపుదిగుమతులలో అకస్మాత్తుగా పెరుగుదల కనిపించింది. హిందూదేశంలో బియ్యపుధర పడిపోవడానికి ఇదే కారణ మన్నారు కొందరు. ఈయనర్థకంతోలగడానికివిదేశాలనుంచివచ్చే బియ్యపుదిగుమతులమీద ౧౯౩౫ లో దిగుమతిపన్ను విధించారు. దీనికి ఫలితంగా ఆ మరుసటిసంవత్సరం మన దేశంలో బియ్యపుధర కొంచెం హెచ్చింది కాని ఆతరువాతి సంవత్సరాలలో అది నిలబడలేదు. 'ఇండియా రెవ్యూ ఆఫ్ ట్రేడ్'వారు (హిందూదేశ వర్తక వ్యాపార పరిశీలకులు) ౧౯౩౫ లో బియ్యపుధర పెరగడానికి కారణం మన దిగుమతిపన్ను కాదనిన్నీ, హిందూదేశంలోను, బర్మాలోను బియ్యపుపంట తగ్గడమే కారణ మనిన్నీ చెప్పారు. కాని మన దేశంలో మళ్లీ ఎప్పటి మామూలుపంట పండేటప్పటికి విదేశాలకు బర్మాయెగుమతులు పడిపోవడంవల్ల మనధరలకు దెబ్బ తగిలింది.

పర్యవసానం :

పర్యవసానం ఏమిటంటే, ఈపైకారణాలన్నిటినిబట్టీ చూస్తే ప్రస్తుతపరిస్థితులలో బర్మాబియ్యపుధరలు మందంగా ఉన్నంత

కాలం మద్రాసులో బియ్యపుధర పెరిగేటట్టు కనబడదు. విదేశాలకయ్యే యెగుమతులు పడిపోవడంవల్ల ఇంతలో బర్మాలో బియ్యపు ధర పెరుగుతుం దనడానికిన్నీ అవకాశం ఏమీ కనబడదు. మనం ఇక్కడి ధరలు పెరగడానికి ఎట్టిప్రయత్నాలు చేసినా బర్మా నుంచి వచ్చే బియ్యపుదిగుమతులను మన వశంలో ఉంచుకొంటేనేతప్ప ఆప్రయత్నాలు విఫలం కాకమానవు. రాజకీయంగా హిందూ దేశంనుంచి బర్మా విడిపోయినప్పటికీ అనేక కారణాలవల్ల పన్నులు విధించడానికి మనకు సాధ్యంకాదు. అందువల్ల మనదేశం లోకి బర్మాబియ్యం వచ్చిపడిపోకుండా ఆపుదల చేసేటందుకు 'కోటా' ఏర్పాట్లమీద దిగుమతులను నియామకంచేయడం ఆవశ్యకం. మనదేశంలో పండినపంట చూచుకొని, దేశంలో ఎప్పటికప్పుడు నిలవఉంటూ ఉన్న సరకు చూచుకొని బర్మాబియ్యపు దండయాత్రను ఆపడానికే కాకుండా, ఇక్కడ సంభవించే ఎద్దడిని నివారించుకోడానికి కూడా తగినట్టు ఎంత బియ్యం దిగుమతి చేసుకోవలసిన అవసరం ఉంటుందో నిర్ణయించుకొని, అంతమట్టుకే దిగుమతిచేయడానికి వర్తకులకు లైసెన్సు లిచ్చి, వాటిని వశంలో ఉంచుకోవాలి. ఇట్లా చేస్తేనేకాని ఇక్కడ ధాన్యపుధర పెరగడానికి అవకాశం లేదు.



స్త్రీలకు లేఖలు: 3.

మన సంఘవ్యత్యయములు-

సామ్యవాదుల ఆశయములు.

కొచ్చెర్లకోట సత్యనారాయణమూర్తి

సోదరీ,

నేటి పాశ్చాత్యనాగరికత తప్పుదారులు పట్టిందనీ, బీదసాదల రక్తపాతంతో యేర్పాటైన ప్రజాప్రభుత్వ విధానంలో అసలు అధికారమంతా ధనికుల పరమైందనీ, ఆ అధికారాన్ని వారు మొత్తంమీద తమ స్వలాభంకోసం వినియోగించుకొంటున్నారనీ, ఆర్థిక స్వాతంత్ర్యంలేని ప్రజాప్రభుత్వ విధానం ధనికులనే బాగుచేసిందనీ, అందువల్ల దేశంలోవున్న ధనసంపదను క్రొత్తపద్ధతులపై విభజింపవలసిన అవసరం యేర్పడిందనీ యిదివరలో వ్రాసివున్నాను. ప్రజలు పడేపాటును బట్టి, వారి నడవడినిబట్టి, పుట్టుకనుబట్టి, శక్తిసామర్థ్యాలనుబట్టి, వ్యక్తుల అవసరాన్నిబట్టి, ఉన్న దున్నట్లు వదిలివేసి — ధనం విభజనచేయడం అసాధ్యమని నిరూపించివున్నాను. ప్రజ లందరికీ సమానంగా, పక్షపాతాలు, విపక్షతలు లేకుండా తిండి, బట్ట, యిల్లూ వీటిని యేర్పాటుచేయడం, పనిపాటులతో సంబంధం లేకుండా అందరకూ సమానంగా ధనసంపదను విభజించడం — యివే సులువైన పద్ధతులని సూచించివున్నాను.

ఈ విషయం ఇంకా కొంత విపులంగా వ్రాయవలసివుంది. ఎంత వ్రాసినా తనివితీరని విషయ మిది- ముందు మనలోపాలను మనం కొంతవరకైనా గుర్తించుకోగలిగితే వాటిని దిద్దేమార్గాలు క్రమంగా అవే స్ఫురిస్తాయి. అప్పుడు మనయిష్టం వచ్చిన గురువులను, పద్ధతులను యేర్పాటుచేసుకోవచ్చును. భూమిని పదును చేయడమే చాలా కష్టమైనపని. బుద్ధుడు, యేసుక్రీస్తు, లెనిన్, మహాత్మగాంధి మొదలగు మతప్రవక్తలు, సంఘసంస్కర్తలు తమ జీవితాలను చాలవరకు భూమిని పదునుచేసి పునాదులు వెయ్యడంలోనే గడిపివేయవలసి వచ్చింది. వారు చేయదలచుకొన్న పనిని పూర్తిగాచేయడానికి వారి ఆ జన్మలో అవకాశాలు బహుస్వల్పమైనాయి.

వర్ణాశ్రమధర్మాలు, మంత్రీమహానాటి కట్టుబాట్లు, సమిష్టికుటుంబపద్ధతులు మొదలైన కట్టుదిట్టాలిదివరకే సడలినాయి. ఇప్పట్లో వాటి పునరుద్ధరణను గురించి ఆలోచించనక్కరలేదు. పూర్వం వేదాంతులచే పొగడబడి, అడవులలో మహర్షులచేత అనుష్ఠింపబడిన పేదరికానికీ, మనం నిత్యమూ మనతూర్పుగూడేలలో చూచే పేదరికానికీ యేమీ సంబంధంలేదు. ఈ పేదరికమంటే మన కందరకూ అసహ్యమే. దేవుడిపేరు భూమిమీద చాటడానికి కంకణం కట్టుకున్న యెంతటి బ్రహ్మోపాసకుడైనా జమీందారుణ్ణి దీవిస్తాడుగాని, ఉద్యోగస్థుణ్ణి మన్నిస్తాడుగాని పేదవారివంక కన్నెత్తి చూడడు. తమ సనాతనధర్మాన్ని చూచుకుని గర్వపడే, ఖండాంతరాలలో దానినిచాటించే హిందూవేదాంతులు, దాతలు, ప్రొఫెసర్లు చేస్తూవున్న నిర్వాక మేమిటి? వీరు ఒకవంక పాశ్చాత్యనాగరికతనులోభభూయిష్ఠమనీ, స్వార్థపరత్వమయమనీ నిందిస్తున్నారు. "ఆత్మవత్ సర్వభూతాని" అని బోధించే తమ మతమే గొప్పదని ఉపన్యసిస్తున్నారు. ఇంకొకవంక తమసంఘంలోవున్న అరిపేదలు అన్నివిధాలా ఇంకా అధమస్థితిలోకి వచ్చేదాకా పూరుకొని అప్పుడు దానధర్మాలనిపేరుచెప్పి వాళ్లను చావనీయకుండా బ్రదకనీయకుండావుంచి పురాణాలలో వర్ణించిన యమలోకపు బాధలను, కత్తిరికోతలను వాళ్లు యీ భూమిమీదనే అనుభవించేటట్టుచేసి ఆనికృష్టుల భుజాల

పైనుంచి స్వర్గానికెగరడానికి మోస్తున్నారు. వాళ్లకు వేసవిలో గంగ పోయించి ముందు జన్మలో తమకు దప్పిక బాధ లేకుండా చేసుకుంటున్నారు. హారనా, బాబా భార్య కుసుమాదేవిని పూజించడానికి వందలు వేలు ఖర్చుచేసి, మొన్న బెజవాడలో కొందరు పౌరులు చేసినట్లు, ఆయవ్వ బట్టపిసుకునీళ్లను తాగి తమ తలలపై చల్లుకొని ముందుజన్మలకు మంచిగతులను మూటగట్టుకుంటున్నారు. రోగమూ, దరిద్రమూ పూర్వజన్మకృత పాపాలని వాదిస్తున్నారు. మూలధనం వుంటేనే వడ్డీ; పూర్వజన్మలో పెట్టిపుట్టి తేనే యీజన్మలో సిరి సౌఖ్యాలు. పూర్వజన్మలో పెట్టిపుట్టని దరిద్రులకు యీ జన్మలో సుకృతాన్ని మూటగట్టుకోడానికి అవకాశాలు తక్కువ కాబట్టి ముందుజన్మలో వారికి గతులుండవు; అనగా, యీవడ్డీవ్యాపారం జన్మాంతరాలకు సంబంధించినది; ఋణవిమోచన చట్టాలకు అతీతమైనది. "నీకర్మ మది; కిక్కురుమనకుండా పడివుండు" అని శ్రుతిస్మృతిపురాణేతిహాసాలు బోధిస్తున్నాయి. ప్రభువులు, పండితులు, వేదాంతులు, మతకర్తలు కలిసి పన్నిన యీ మాయపన్నాగంలో, గూఢపురాణాలలో నోరు మెదల్పడానికవకాశ మేది?

పైగా 'పురమే లేనివాడి కంతఃపుర మెక్కడ' అన్నట్లు జీవనమే దుర్భరంగావున్న దౌర్భాగ్యులకు అర్థశాస్త్రపుపండితులు వర్ణించే "వాంఛ" లుంటాయా? తిండీ, బట్టా లేనివారు తిరగబడరు. ఉన్నమట్టుకు ఆకు, అలము, బంద, బూడి మొదలైనవాటితో పొట్ట పోసుకుంటారు. అవీ లేనినాడు నోరు మెదల్పకుండా ప్రాణాలు విడుస్తారు. అట్టివారికి "ఐహికవాంఛలు చంపుకో; ముక్తి గలుగుతుంది" అని బోధించనక్కర లేదు. ఆకలిబాధ సగ మణిగినవారికే తిరుగుబాటు స్వభావం. కొన్ని కోరికలు, కొన్ని సౌఖ్యాలు, కొంత స్వతంత్రం అనుభవించినవారికే యింకా కావా లన్న కాంక్ష. ఏవుద్యమమైనా వారిలోనే మొలకలెత్తుతుంది. "యాచన మా కులవృత్తి; మేము పనిచెయ్యము" అని గర్వపడే నీచులలో ఆత్మగౌరవమూ, ఔన్నత్యాభిలాషా పొడచూపిననాడు సంఘంయొక్క పునాదులు కదిలాయని చెప్పకతప్పదు.

కాని ఆశ కంతమంటూ లేదు. కలిమిలేములు మనసునుబట్టి వుంటాయిగాని, ఐశ్వర్యాలనుబట్టి వుండవు. కుటీరంలోని నిరుపేదకుండే సౌఖ్యం, సంతోషం ఉదయాస్తమానం చేయడానికి పని లేకుండా అవస్థపడుతూ, ఎల్లప్పుడూ ఏదో రోగంతో గాలు సతమౌవుండే ఐశ్వర్యవంతులకు లేకపోవచ్చును. "శివాజీ మహారాజు తనరాజ్యమును సమర్థైన రామదాసు పాదాలయొద్ద వుంచినా, ఆ మహానీయుడూ తన యెప్పటి భిక్షాటనం మానలే దని శివాజీ విచారించెనట! ఐహికవాంఛలవిషయంలో ఎవరి కెంత కావాలో, ఎంత చాలునో యెవరు నిర్ణయించగలరు? దేశకాలపాత్రాదులనుబట్టి ఆనిర్ణయం మారుతూవుంటుంది. కాబట్టి యెప్పటి కప్పుడు సంఘంలోవున్న ధనసంపదను ప్రజలందరకూ సమానంగా విభజించడ మొక్కటే సాధ్యమైన న్యాయమైన పద్ధతి. "ఏమిటి? అందరకూ సమానంగా పంచడమా?" అని నీవు ఆశ్చర్యపడివుంటావు. కాని ప్రస్తుతం ప్రతివిషయంలోను తారతమ్యాలు, వాటిదుష్ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వాటిని తలుచుకుంటే అంతకన్న సమాన విభజనమే శ్రేష్ఠమని నీవు అంగీకరించక తప్పదు. మనం చేసేఖర్చులో ఏది ముందు, ఏది వెనక, ఏది అవసరం, ఏది అనవసరం అన్నవిచక్షణ పూర్తిగా నశించింది. ప్రస్తుతపు కాలాన్ని అన్నివిధాలా అభివృద్ధికాలమని కొందరు, మోటార్లు వాయువిమానాలు సృష్టైనవి వచ్చాయి కాబట్టి శీఘ్రగమనయుగమని కొందరు వర్ణించియున్నారు. స్నోడెన్ అను ఆంగ్లేయసామ్యవాది యీకాలాన్ని దుబారాఖర్చుయుగ మనిన్నీ, ప్రపంచచరిత్రలో ఎన్నడూ యింత దుబారాఖర్చు జరిగియుండినట్లు కనపడ దనిన్నీ చెప్పియున్నాడు. పిల్లలస్థితిను గమనించకుండా తాను సింగారించుకొనే తల్లిని చూచి హర్షిస్తామా? ఇంట్లోవాళ్లను మాడ్చి తనత్రాగుడుకు, వేషాలకు ధనము వెచ్చించే తండ్రిని మెచ్చుతామా? కాని సంఘమనే యీ పెద్దసంసారపు గొడవలు యింతకన్న అధోగతిలో వున్నాయి. ఒకయింట్లో పసిపిల్ల పాలకోసం యేడుస్తూవుంది; ఇంకో యింట్లో సీమసారాయిలకోసం ధనం ఖర్చుఅవుతోంది. ఒక

యింట్లో చలితో బాధపడుతున్నారు; ఇంకో యింట్లో డజన్లకొద్దీ చొక్కాలు అనవసరంగా పెట్టెలలో పడి వున్నాయి. ఒకయింట్లో ముప్పొద్దులూ కడుపు కూడు లేక మాడుతున్నారు; మరొకయింట్లో వేళాపాళా మితీ లేకుండా తిని జీర్ణించుకోలేకుండా బాధపడుతున్నారు. మందులకు గతిలేకుండా రోగాలతో బాధపడుతూ వున్న దొకయిల్లు; పెంపుడుకుక్కను పెంచడానికని ఒకసంసారాని కయ్యేఖర్చుకంటె యెక్కువద్రవ్యం వెచ్చిస్తూవున్న యిల్లు మరొకటి.

మనదేశంలో వకసంస్థానంలో, రైతులకుకంటె పంచెపుత్రాల కెక్కువసంరక్షణ జరుగుతోందనీ, మనుష్యులకోసంకంటె పెంపుడు కుక్కలకోస మెక్కువ ధనం ఖర్చవుతోందనీ యీ మధ్య వకరు చెప్పినారు. బంగాళాదేశంలో మనుష్యులు తింటూవున్న తిండి తిని యెలకలైనా ఐదువారాలకన్న ఎక్కువకాలం జీవించవని అధికారులొప్పుకున్నారు. రత్నాలకోసం, సీమ సారాయిలకోసం, పైవేషాలకోసం, పేరుప్రతిష్ఠల కోసం వేలు లక్షలురూపాయలు ఏటేటా ఖర్చుఅవుతున్నాయి.

ఇందుకు అజ్ఞాను లేమని సమాధానం చెబుతున్నారు? "ఆ కుక్కలను పెంచే ఆయనతండ్రీ, డజన్లకొద్దీ కోట్లువున్న ఆయనతండ్రీ, క్లబ్బులో సీమసారాయిలు తాగే ఆయనతండ్రి, ఆ వజ్రాలకమ్మలు పెట్టుకునే ఆవిడమామగారూ, ధాన్యంవర్తకంలోను కల్లుదుకాణాలు వేలంపాటలలోను తూర్పుగూడెంలో రోడ్ల కంట్రాక్టులలోను, హాస్పత్రులలో తిండిగింజల కంట్రాక్టులలోను లక్షలకొద్దీ రూపాయలు సంపాదించిపెట్టి పోయారు. వాళ్లకేం? వాళ్లు మహారాజులు. ఆచింపిరి గుడ్డలవానితండ్రి తప్పతాగి ఉన్నదంతా అమ్ముకున్నాడు. ఆకూలివాడు యీ మధ్య ధాన్యంధరలు పడిపోయినప్పుడు వ్యవసాయంలో దెబ్బతిని కూలిపనికి దిగాడు. వీళ్లకూ వాళ్లకూ సాపత్యమా?" అంటారు.

"ధాన్యం వర్తకం!" ఆహా! ఎంత మర్యాదైన మాట! ఎంత ఘరానావృత్తి! ఎంతటి పెద్దమనుష్యులు చేస్తూవున్న వ్యాపారం! అచ్చతెలుగులో ఆమాటకర్థమేమిటి? "ఆబాలగోపాలం తినిబ్రతకవలసిన తిండిగింజలను ఒడ్డి జూదమాడడం" అనిగదా! అది బాహాటంగా సాగడానికి అవకాశమిచ్చే అనుమతినిచ్చే పరిపాలనను, అర్థశాస్త్రాన్ని ఏమని వర్ణించాలి? "ధాన్యం ధరలు లేచాయి" అని ఎంత శాస్త్రోక్తంగా మాట్లాడుతున్నాము! అందువల్ల ఎన్ని బీదకొంపలు కూల్తాయో, అందుకు కారకు లెవరో, కారణా లేమిటో అరసి పాలించే ప్రభు వేడి? అవును! అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యనే ఒడ్డి జూదమాడి ఓడిపోయిన చక్రవర్తులు జన్మించిన పుణ్యభూమి యిది! తిండిగింజ లొకలెక్కా? నేను తీవ్రంగా వ్రాస్తున్నానని అనుకోవద్దు. అట్టి దేశాన్నిగురించి బెర్నార్డుషా ఏమని వ్రాశాడో చూడు:

"దేశంలో వున్న పసిబిడ్డలకు చాలినన్ని పాలను ఏర్పాటుచేయడానికిముందు పాంపైను సారాయికోసం ధనం వెచ్చించేదేశం, చాలినంత ఆహారం లేకపోవడంచేత వేలకొద్దీ చంటిపిల్లలేటేటా చచ్చిపోతూవుంటే పెంపుడుకుక్కలకు రుచిరైన ఆహారం వేయించడానికి ధనం వెచ్చించేదేశం, చాలా చెడుగా పరిపాలింపబడుతూవున్న, తెలివితక్కువ, బడాయికోరు, బుద్ధిలేని, అజ్ఞానపుదేశమని చెప్పాలి. అటువంటిదేశం తననిజస్థితిని తాను గుర్తించకుండా కప్పిపుచ్చాలని దేశంలో వున్న రత్నాలహారాలను, పెంపుడుకుక్కలను ఐశ్వర్యంకింద లెక్కపెట్టుకుంటూ, ఒక్కొక పెంపుడుకుక్క ఆరేసిపిల్లలను పెట్టినప్పుడు దేశంలోవున్న ధనసంపద ఆరురెట్లు హెచ్చిందని సంతోషిస్తూ, ఎంత అవస్థపడి ప్రయత్నించేసినా, చివరకు చెడిపోక మానదు. ఒకజాతి బాగుపడడానికి మార్గం తనయింటిని చక్కగా దిద్దుకోవడం వక్కటే; అనగా ఆజాతియొక్క భౌతికవాంఛలను వాటివాటి అవసరాలనుబట్టి తీర్చడం, అవసరమైన వాంఛలు పూర్తిగా తీరేదాకా పోకులకు చిత్తచపలతలకు పోకుండావుండడం."

కుక్కలను, గుఱ్ఱాలను పెంచేవారిని తిట్టి లాభంలేదు. ఈజబ్బుకు అసలు కారణ మేమిటి?

కొంతమందికి ఎక్కువధన ముండడం - అవసరమైనదానికంటె ఎక్కువగా, ఎల్లా ఖర్చుపెట్టాలో తెలియకుండా డబ్బు వుండడం. ధనికుడికీ, దరిద్రుడికీ సమానంగానే యిల్లూ, వాకిలీ, తిండీ, బట్టా కావాలి. ఇద్దరూ ఇళ్లు కడతారు; తిండిగింజలు కొంటారు; బట్టలు కొంటారు. కాని దరిద్రుడు తాను కొన్నవస్తువులూ, కట్టించినయిల్లూ చాలటంలేదని మొరపెడుతూ వుంటే, ధనికుడు పెద్దమేడ కట్టిస్తున్నాడు. కొత్త నగలు చేయిస్తున్నాడు. ఇంటిసామానుల ఖరీదు, బంగారంఖరీదు హెచ్చితేనేం? తన కేమిలెక్క? ఎక్కువడబ్బు ఖర్చుపెడతాడు. పనివాళ్లకు ఎక్కువ జీతా లిస్తాడు. కాబట్టి వాళ్లందరూ అతను పురమాయించే పనులమీద పరుగులెత్తుతారు. పర్యవసానమేమిటి? బీదవాళ్ల దరిద్రమూ, అవసరాలూ తీరటం లేదు. పనిపాటులన్నీ భాగ్యవంతులకోసమే వినియోగపడుతున్నాయి. అధికసంఖ్యాకులగు పేదవారిసంగతి కనుక్కునేవాళ్లు లేరు. అల్పసంఖ్యాకులగు ధనికుల సౌఖ్యంకోసం అందరూ పాటుపడుతున్నారు. అటువంటిసందర్భంలో భాగ్యవంతులు ప్రజలకు పనిపాటులు కల్పిస్తున్నారని చెప్పి లాభంలేదు. అందువల్ల దేశాని కుపయోగంలేదు. మనిషిని చంపినవాడు ఉరిదీసేవాడికి పని కల్పిస్తున్నాడు. వీధిలో ఆడుకునే పిల్లమీదికి మోటారుబండిని పోనిచ్చి చంపిన మోటారుమనిషి డాక్టరుకి, శవాన్ని మోసేవాళ్లకు, పురోహితుడికి, పోలీసుకు, మేజస్ట్రీటుకు ఇటువంటివాళ్లందరకూ పని గల్పిస్తున్నాడు.

"నిరర్థకమైన పనిపాటులను కల్పించడంలో ధనవంతులు ఖర్చుచేసే ధనం అందరికీ వుపయోగపడేటట్లుగా విభజనఅయితే అందరికీ సరియైనవృత్తులు ఏర్పడతాయి. ప్రతి మనిషికీ తిండికి, బట్టకు, కొంపకూ లోటు తీరేదాకా మోటారుకార్లకోసం వజ్రపుకమ్మలకోసం డబ్బు వ్యర్థంగా వినియోగపడదు. అందరికీ వుపయోగపడే వృత్తులను వదిలి సోమరిపోతులకు చాకిరీచేయడానికి మనుష్యులకు జీతాలు భత్యాలు ఏర్పడవు. పైపటాటోపం, సోమరితనం, దుబారాఖర్చు, నిరర్థకజీవనం తగ్గుతాయి. చాలినంత తిండి, బట్ట, పరిశుభ్రమైన యిళ్లు, నిశ్చింత, నీతి, ఆరోగ్యం, నిజమైన ఐశ్వర్యాభివృద్ధి యేర్పడతాయి" (— బెర్నార్డ్ షా).

పనిపాటులు లేకుండా సోమరిగానుండగా కాలక్షేపం చేయడం, అల్లా వున్నందుకు బతికేవారు, గౌరవించేవారు లేకపోవడం - ఇవి ధనికు లనుభవిస్తూవున్న సౌఖ్యాలలో ప్రధానమైనవి. ఈ హక్కులు వారికి స్థిరంగా యేర్పడ్డాయి. అట్టివారిని మనం గొప్పవారని మన్నిస్తున్నాం. మనం వాడుకునే వస్తువులకు, చేయించుకునే సేవకు మనం మారువస్తువు లివ్వకుండాను, మారుసేవ చెయ్యకుండాను వుంటే అది దొంగతనం, అల్లా చేసేవాళ్లే దొంగలు. ఇతరవిధాలైన దొంగతనాలవలెనే ఇట్టి దొంగతనాలవల్లకూడా హాని కలుగుతుంది. పదిలక్షలరూపాయలు పిత్రార్జితం వున్నవాడు ఇల్లు తగలబెట్టినా, తలలు బద్దలుకొట్టినా, నరహత్యలు చేసినా వూరుకుంటున్నామా? కాని యింతకంటె ఎక్కువహానిని కలిగిస్తూవున్న ధనికుల నిర్వ్యాపారత్వాన్ని సోమరితనాన్ని శిక్షించకుండా వూరుకుంటున్నాం. వారు కష్టపడి పనిచేయడం మర్యాదకు భంగమనీ, గొప్పవారు చేయకూడని పనిఅనీ మనపిల్లలకుకూడా చెప్తున్నాం. శరీరకష్టంవల్ల దేశంలోవున్న ఆస్తిసంపదను వృద్ధిచేయడం సామాన్యులు, పూటకి గడవలేనివాళ్లు చేయవలసినపనిగాని ఘరానామనుష్యులు చేయదగిన పనిగా దంటున్నాము. "శ్రమపడగలిగినవా రందరూ శ్రమపడి పనిచేయాలి" అన్నది చట్టా లన్నిటిలోను ప్రధానమైనది. కాని మనచట్టాలన్నీ భాగ్యవంతులు ఏర్పాటుచేసినవి కాబట్టి అన్నిటికంటె ప్రధానమైన యీసూత్ర మందులో కనబడదు.

దుర్భరమైన యీ సోమరితనంవల్ల అన్నివిధాల హీనస్థితికి వచ్చినవారు ధనికులఆడంగులు. నిర్వ్యాపారత్వము, అనారోగ్యము దురభిమానము మొదలైన జబ్బులన్నీ వారిని మిక్కిలి బాధిస్తున్నాయి. తమ శరీరాన్ని అలంకరించుకొని వళ్లువంచి పనిచేయకుండా కూచునివుండడం వారిదినచర్య. సామాన్యస్త్రీలవలె స్తరుగా తమసంసారాలను దిద్దుకోలేరు. పిల్లలను పెంచ

లేరు. వంటిళ్లను అసలే చక్కబెట్టుకోలేరు. చెమటూడ్చి పనిచేయడాని కలవాటుగాని, ఇష్టంగాని లేదు. అల్లా జీవించేవారిని చూస్తే నిరసన; నీచభావం. తమ వంటి చెప్పవారు సామాన్యులందరిమోస్తరుగా పని చేయరు. పనిచేయనక్కరలేదు. కొన్ని జమీందారీ యిళ్లలో రాణివాసస్త్రీలు నిత్యమూ నౌకర్ల చేతనే అన్నపుముద్దలు చేయించుకుని తమనోళ్లలో వేయించుకుంటారట. నీయన్నము నీచేతితో నీవు తినుటకభిమానపడేటంత ఐశ్వర్యం నీ కెన్నడూ పట్టకుండునుగాక!

కాని యీమధ్య ధనస్వాములు, ధనికులు కూడా కష్టపడి పనిచేస్తున్నారు! అందరితోపాటు వారు కూడా చట్టనిర్మాణసభలకు, స్థానికసంస్థలకు విశ్వవిద్యాలయసభలకు అభ్యర్థులుగా నిలిచి దేశమంతటా డబ్బు వెదజల్లి సభలలో స్థానాలను బాహాటంగా కొంటున్నారు. మంత్రివర్గాలు నడుపుతున్నారు. 'రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా?' అందరితోపాటు వాళ్ల యువకులుకూడా చదువుతున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. వళ్లువంచి పనిచేయనక్కరలేకుండా కర్రపెత్తనం చేయవలసిన వుద్యోగాలు వారికి సొత్తు. ఈమంత్రివర్గాలనుగురించి, ఉద్యోగులనుగురించి బెర్నార్డుషా ఏమని వ్రాశాడో చూడు :

> "ప్రజల కుపకారాన్ని బట్టి ఆలోచిస్తే తమనా రందరిమోస్తరుగానే వీరు కుండా ఆట పాటలతోను వినోదాలతోను తమకాలం గడిపి, ప్రజలను పరిపాలించే పనిని, ప్రజల కష్టసుఖాలు తమకష్టసుఖాలు వకటిగా వుండి, సుష్టయిన జీతాలమీద పనిచేసే మంత్రులకు ఉద్యోగులకు వదిలివేస్తే ఇంతకంటె బాగా వుంటుంది."

మతం ధనికులది; దేవాలయం ధనికులది; దేవత ధనికులది; పురోహితుడు ధనికులనౌకరు; ఉద్యోగి ధనికులమనిషి; అతడమలుజరిపే చట్టాలు ధనికులవి; చట్టనిర్మాణసభలు ధనికులవి; న్యాయస్థానాలు ధనికులవి; అచ్చటి న్యాయం ధనికులది; వర్తకవ్యాపారాలు ధనికులవి; చదువులబడులు ధనికులవి; చదువు చెప్పేవారు ధనికుల మనుష్యులు; వారు చెప్పేవి ధనికులచదువులు; వార్తాపత్రికలు ధనికులవి; అందలి వార్తలు ధనికులవి; అర్థశాస్త్రం, రాజ్యాంగశాస్త్రం, నీతిశాస్త్రం, వైద్యశాస్త్రం, ఆరోగ్యశాస్త్రం మొదలైన శాస్త్రాలన్నీ ధనికులవి.

ఇందులో చిక్కేమిటంటే, అందరి లాభనష్టాలు కష్టసుఖాలు కొంతవరకు వకేవిధంగానే వుంటాయి. భాగ్యవంతులు బీదవాళ్లు కొంతదూరం వక్కత్రాటిమీదనే నడుస్తారు. కొంతదూరం యిద్దరిదీ వక్కటే రస్తా. అందుచేత సమర్థులు, దారితెలిసినవాళ్లు ముందు నడుస్తావున్నవాళ్లు, అసమర్థులకి, దారి తెలియనివాళ్లకి వెనకబడినవాళ్లకి దారిచూపడం సహజం; వెనకబడిన వాళ్లు కళ్లు మూసుకొని వారి ననుసరిస్తూ, తమదాకీ వారిదారీ యెచ్చట విడిపోతాయో, ముందు వెళ్లేవాళ్లు దొంగలో దొరలో, తెలుసుకోలేకపోవడంకూడా సహజమే. ఒక ఉదాహరణ, రైళ్లలో అపాయాలు అందరకూ సామాన్యమే. వాటిని తప్పించడానికి చట్టాలు, నిబంధనలు, బోధనలు, సలహాలు — ఇవి అందరకూ లాభించేవే. కాని "రైల్వేలో పనిచేసేవాళ్లకు జీతాలెక్కువచేసి, ఎక్కువ విశ్రాంతి ఇస్తే రైళ్లలో ప్రమాదాలు తగ్గుతాయి. రైళ్లలో వచ్చే లాభాలన్నీ వాటాదార్లు పంచుకోవడంచేత నౌకర్ల జీతాలు చాలా తక్కువగా వున్నాయి" అని చెప్పనీ; చెప్పినవాళ్లను "సోషలిస్టు"లనీ, "రష్యాడబ్బు తింటున్నవా"ళ్లనీ తిడతారు.

వైద్యశాస్త్రం: భాగ్యవంతుల కంపెనీలలో తయారైన ఖరీదైన మందులను అందరిచేతా కొనిపించడానికి. అర్థశాస్త్రం: ధనికుల ఐశ్వర్యాలకు యేమాత్రం వత్తిడి కలిగినా, పనివాండ్ర జీతాలు యేమాత్రం హెచ్చినా దేశంలోవున్న మూలధనమూ ఐశ్వర్యాభివృద్ధీ తగ్గిపోతాయనీ, బీదవాళ్లు సంతాననిరోధాలవల్ల పిల్లలను కనడం తగ్గిస్తే వాళ్లకష్టాలు తీరిపోతాయనీ బోధించడానికి. వార్తాపత్రికలు: వేలకొద్దీ ఖర్చుపెడితేనేగాని పత్రిక నడవదు. అది బీదవారికి సాధ్యంకాదు. వ్యాపారంచేసే భాగ్యవంతులపక్షు మంటేనేగాని పత్రిక నడవదు. చదువులు: పరిశుభ్రమైన యిళ్లూ, చాలినంత తిండీ వుంటే బీదవాళ్ల రోగాలు పోతాయనీ, చేతినిండా సార్థకమైన

పనిపాటు లుంటే ధనికులరోగాలు పోతాయనీ బోధించే బడిపంతులుకి ఉద్యోగం దొరుకుతుందా ? అతడికి యిక ముందుకూడా యెక్కడా వుద్యోగ మియ్యకూడదని స్కూళ్ల యినస్పెక్టరువద్దనుంచి గెజెట్లో నోటీసు రాదా ? తనరాజ్యంలోవున్న బడు లన్నిటిలోను 'ఓం హిరణ్యకశ్యపాయ నమః' అని ప్రార్థించాలనీ, 'విరోధిశాస్త్రాలు' నేర్పకూడదనీ శాసించిన హిరణ్యకశ్యపుణ్ణి మనం నిందించడం యెందుకు ?

అయితే, వున్నవాళ్లే కాకుండా లేనివాళ్లుకూడా యీ పద్ధతులమీద యెందుకు తిరగబడరు ? నిజమే ! ఏసంస్కర్తలో, యేబాధలను అనుభవించేవాళ్లో ఏదో విషయమై యెప్పుడూ తిరగబడుతూనేవున్నారుగాని, అందరూ యేకమై యెన్నడూ తిరగబడలేదు. సామాన్యప్రజకు యిన్నివిషయాలకు సంబంధించిన సామాన్యపు సూత్రాలను గ్రహించేటంత వివేకం, దూరదృష్టీ లేవు. ఎవరికి వారు ధనికు లిచ్చే స్వల్పదయాధర్మభిక్షలతో తృప్తిజెందేవారే. అల్పసంతోషులు. అందుకు చిన్నప్పటినుంచీ అలవాటుపడివున్నారు. కట్టుకోడానికి పాతగుడ్డ లిస్తేచాలు ; తనకూ తనవాళ్లకు చిన్న చిన్న నౌకరీ లిప్పిస్తేచాలు ; ఎల్లావున్నా రని కనుక్కుంటేచాలు ; శుభాశుభకార్యాలలో తిండిపెట్టిస్తేచాలు ; మంచికీ, చెడ్డకీ పోవలా, బీడా చేతులోపెడితే చాలు. పైగా ధనికులయిళ్లల్లో పండుగలకీ, పర్వాలకీ ఎన్ని వేడుకలు ? — బాణసంచాలు, వుత్సవాలు, అన్నదానాలు ! ఆ భూస్వామి గొప్పనుగురించి, యీ భూస్వామి సరదాలనుగురించి, యింకో భూస్వామి ఐశ్వర్యాన్నిగురించి వారు తమయిళ్లల్లో ఎన్నాళ్లు ముచ్చటించినా అంతువుంటుందా దానికి ? ఫలానావారికి నేనే సరుకులు సప్లైచేస్తాననీ, వారియింట్లో నేనే పనిచేస్తున్నాననీ, వారు ఫలానావారికి శాలువ లిప్పించారనీ, వారికొట్లోనో దివాణంలోనో మావాడు గుమాస్తాఅనీ చెప్పుకోవడం గౌరవం. ఏమో ! వున్నవాళ్ల అనుగ్రహం వుంటే ఎప్పటికేమి వస్తుందో, ఏమి లాభమో ! పత్రికలలోకూడా అట్టి వారి గొప్పనుగురించి చదవాలని వుంటుందిగాని, వారి ఫోటోలను చూడాలని వుంటుందిగాని ఐదేళ్లవయస్సు వచ్చేలోగానే చనిపోతూవున్న పిల్లలసంఖ్య ఇదివరకు కన్నా హెచ్చిందని వ్రాసే సెన్సర్లంటే తలనొప్పి. వాటినిచూడ బుద్ధిపుట్టదు. అల్లా బుద్ధిపుడితే అప్పుడు తెలుస్తుంది - చక్కగా సింగారించుకొనే వక్కతివ దాని దుబారాఖర్చువలన దేశంలో పదిమంది చంటిపిల్లల పోషణకు డబ్బులేక వాటిప్రాణాలు పోయి యుండవచ్చునని. అందరు స్త్రీలకూ శ్రేష్ఠమైన బట్ట లుంటేనేగాని ఒకరిద్దరకు రవలగుట్ట లుండరాదని అజ్ఞానురాండ్రకు తోచదు. అందరు స్త్రీలూ చింపిరి గుడ్డలతో వున్నప్పుడే రవలగుట్ట తొడుక్కుండడంలోనే వుంది అందం చందంఅని వారి అభిప్రాయం. ఆ చింపిరిగుడ్డలవాళ్లెన్నడైనా తిరగబడవచ్చునని గాని, రవ్వలను కొనుక్కునేవాళ్లు లేకపోవడంవల్ల వాటికి ఖరీదు రానిరోజులు రావచ్చునని గాని, అందరూ మంచి గుడ్డలు కట్టుకునేరోజులు వస్తాయనిగాని వారికి తోచదు. పోలీసువాళ్లున్నారుగా ! ఏం భయం ?

పాపం ! మొన్ననే వకజమీందారుగారు అన్నమాట "ఏం విడ్డూరం వచ్చింది ! దినాలు మారినాగాని ప్రజ లెన్నడైనా తిరగబడడం ఎరుగుదుమా ?" అని ! ! ! తిరుగబాటంటే అసూర్యంపశ్యలైన ఆయిల్లాలికి ఆశ్చర్యంవేసి వుంటుంది!!!

౧౭౮౯ లో ఫ్రెంచిప్రజ తిరుగుబాటుచేసి తిరగబడి, బాస్టిలు చెరసాలను పట్టుకొని, ఖైదీలను విడిపించినప్పుడు రాజు తనమంత్రిని 'మనప్రజలు తిరుగుబాటు చేస్తున్నారా ?' అని అడిగాడుట ! 'కాదు ! తిరుగు బాటు కాదు, విప్లవం !' అని మంత్రి జవాబిచ్చినాడట !

సామాన్య శ్రేయోధ్యేయాన్ని అంగీకరించి వూరుకోడానికి యింకో కారణంకూడా వుంది. ఏమో అదృష్టవశాత్తుగా మనకుకూడా ఎక్కడినుంచైనా పాతికవేల రూపాయలు రాగూడదు ? మొన్న అంబాజీపేట కమ్మ వారి అబ్బాయికి కలకత్తా స్వీప్‌స్టేకులలో పదివేల రూపాయలు రాలేదూ ! ఎవరు మాత్రం ? వాండ్రేవు వారి అబ్బాయి, వల్లూరివారి అబ్బాయి, ముద్రావారి అబ్బాయి కలెక్టరుపరీక్షలు ప్యాసయినారు. మనవాడు కూడా నాలుగేళ్లలో ఆ పరీక్ష ప్యాసుకాకూడదూ ? లేదా గుణుపురంతాలూకా తాసీల్దారు కావచ్చును ;

లేదా ఫ్యాక్టరీకంపెనీలో పాతికరూపాయల గుమాస్తాగిరీ దొరకవచ్చును.

సంఘమంతా ఇటువంటి జూదపు ఆలోచనలతో, అడియాసలతో, గాలిమేడలతో దుర్భరమైన జీవితపుబరువును మోస్తోంది. ఎంతమందికి ఈ అడియాసలు సఫలమౌతున్నాయి? ఎన్నోవంతుమందికి? మిగిలినవారి గతియేమిటి? వాళ్ల తెలివితేటలు, శక్తిసామర్థ్యాలు బూడిదలోపోసిన పన్నీరౌతున్నాయి.

ఐశ్వర్యాలలోవున్న ఈ యెక్కువతక్కువలవలన కలుగుతూవుండే అనర్థకాలనుగురించి ఇంకా ఎంతైనా వ్రాయవచ్చును. కాని, యీపాటికే నీకు నమ్మకం కుదిరివుండాలి. లేకపోతే నేనంటే నీకు ఇష్టం లేదన్నమాట.

ఆదాయమందరకూ సమానంగా వుండడం అనుభవంలో కొంతవరకు మనం చూస్తూనేవున్నాం. వ్యవసాయంలో ఒకనాటున ఒకవిధమైన పనిలోవున్న కూలీలందరికీ ఒక్కటే కూలి యిస్తున్నాం. వాళ్లలో ఎర్రటివాళ్లు, నల్లటివాళ్లు, హిందువులు, తురకలు, కిరస్తానీలు, తెలివైనవాళ్లు, తెలివితక్కువవాళ్లు, చురుకైనవాళ్లు, వెనకపడేవాళ్లు అందరూ వుంటారు. అల్లాగే గవర్నమెంటు వుద్యోగాలలో, కంపెనీలు, బ్యాంకులు, వర్తకవ్యాపారాలలో ఒకతరగతి మనుష్యులకు ఒకమొత్తం జీతం ఏర్పడివుంది. వాళ్లలో ఒకరిద్దరు తెలివితక్కువవాళ్లు డబ్బు పోగొట్టుకున్నా, ఒకరిద్దరు అదృష్టవంతులు మిగతావాళ్లను వెనుకకుదొక్కి పైకి వచ్చినా, సమానంగా జీతం పుచ్చుకుంటూవున్నవాళ్లలో లక్షాధికారిఅనీ, పేదవాడనీ భేదా లుండవు.

మనిషికీ మనిషికీ గుణాధిక్యతలో, తెలివితేటలలో శక్తిసామర్థ్యాలలో పనిపాటలలో ఎక్కువతక్కువలు వ్యత్యాసాలు ఉండవచ్చును, ఇతరవిధములైన అర్హతలనుబట్టి కొద్దివారు గొప్పవారు అని భేదాలుండవచ్చును. గాని ధనాధిక్యతనుబట్టి యేర్పడివున్న విపరీతమైన యీ వ్యత్యాసాలు నశిస్తేనేగాని సంఘాన్ని దిగలాగుతూవున్న యీ కంటకాలు తొలగవని సామ్యవాదులవాదన.

ఎక్కువ తెలివితేటలూ నీతీ, న్యాయమూ, శ్రద్ధా, చురుకుదనమూ కావలసినచోట అధికంగా జీతాలివ్వాలనీ, ఆదాయంలో ఆధిక్యము వుంటేనేగాని నడవడిలో ఔన్నత్యం చూపడానికి ప్రోత్సాహముండదనీ లోకం నమ్ముతోంది. కాని సామ్యవాదు లీవాదనను అంగీకరించరు. ఒకటోరకపుపనికి ధనప్రోత్సాహ మక్కరలేదనీ, అది వున్న ప్రతిచోటా అట్టిపని జరగటమే లేదనీ, మానవస్వభావం అంత నీచమైనది కాదనీ, మానవస్వభావానికి ద్రవ్యాశ ఆరోగ్యవంతమైన ప్రోత్సాహమే కాదనీ, ఏడవకుండా వుండడానికి, బడిలోకి వెళ్లడానికి, చిన్నపిల్లకు కానీ లంచ మిచ్చినట్లుగానే కొందరికి యెక్కువడబ్బిచ్చి సత్ప్రవర్తనను కొనడం అలవాటు చేయడంవల్ల ప్రజలందరకూ అనేకదుర్గుణాలు అలవాటు చేస్తున్నామనీ, సత్ప్రవర్తనయొక్క విలువనే చంపివేస్తున్నామనీ, ఎంతటి స్వల్పకార్యాలకైనా ఎంతటి మహత్కార్యాలకైనా ఎట్టి నౌకరీకైనా సహజమైన, ఉత్సాహం, శ్రద్ధాభక్తులు, ఆత్మగౌరవం, జనాపవాదంటే భయం, మొదలైన గుణా లుంటే పనులు జరుగుతాయికాని ద్రవ్యాశవల్ల కావనీ, మొత్తానికి సంఘాన్ని నడుపుతున్నవి ఆ గుణాలేకాని ద్రవ్యం కాదనీ, ఎన్నడూలేని ప్రాముఖ్యం డబ్బుకు ఇవ్వడంవల్లనే సంఘానికీ చిక్కులన్నీ ప్రాప్తించాయనీ సామ్యవాదుల నమ్మకం. ఎంతబీదదైనా భార్య పాతివ్రత్యంచూపడం మగడిచ్చేలంచాని కాశపడి కాదు. ఎంత డబ్బిచ్చినా వేశ్య పతివ్రత కాదు. మహారాష్ట్రదేశచరిత్రలో నేతాజీ పాల్కారు, తానాజీ మాలుసురేలవంటి సేవకులను శివాజీ ఎంత డబ్బిచ్చి కొనగలడు? ప్రపంచచరిత్రలో డబ్బువల్ల సాధింపబడిన మహత్కార్యాలకంటె ఉత్సాహము, అభిమానము, భక్తి, శ్రద్ధాదులవల్ల సాధింపబడిన మహత్కార్యాలే యెక్కువ కనపడుతున్నాయి.

డబ్బాశ లేకపోతే కొంతమంది అసలే పనిచేయరన్నభయం సామ్యవాదులకు లేదు. అందరికంటె తక్కువగా పనిచేసి అందరితో సమానంగా వాటాకు సిద్ధమయ్యే సోమరులుకూడా దొంగలే కాబట్టి యితరవిధాలైన దొంగలను శిక్షించినట్లే వారినికూడా శిక్షిస్తారు. "నేను మురికిగుడ్డలతోనే వుంటాను; నాకు శుభ్రమైన

యిల్లూ వళ్లూ తిండి అక్కరలేదు. నేను పనిమాత్రం చెయ్యాను. ఏదో ముష్టెత్తుకుని బతుకుతాను" అని అన్నంతమాత్రాన వళ్లువంగని మంగయ్యను వదిలి పెట్టరు. అందరూ సమానంగా శ్రమపడాలి. వేతనం పొందాలి, సుభిక్షంగా వుండాలి. తనవంతుపని తాను చేసినతర్వాత యిష్టమువచ్చినంత సోమరితనంగా అతడు వుండవచ్చును.

అయితే వళ్లువంగని మంగయ్యకు కోపం, సంఘంలో వున్నవాళ్లందరూ కలిసి తనను బలవంతంగా దరిద్రంలో వుంచారని కాదు. తనకి బాగుపడమనీ, పని చెయ్యవలసిందనీ నిర్బంధంచేస్తే కోపంవస్తుంది.

పాకీపని మొదలైన 'అసహ్యమైన' పనులు చెయ్యడానికి మనుష్యులు దొరకరని సామ్యవాదు లంగీకరించరు. అటువంటి వృత్తులలో పనిచేసేవాళ్లు అసహ్యంగా వుండవలసిన అవసరంలేదు. సినీమాలలోను రైళ్లలోను మనతో సమానంగా కూర్చునేవాళ్లలో అటువంటివాళ్లను గుర్తించగలుగుతున్నామా? డాక్టర్లు మంత్రసానులు రోగులకు చేసేచాకిరీని మనతల్లులు, భార్యలు, భర్తలుకూడా మనకు చేయడానికి అసహ్యించుకుంటారు. ఆవృత్తుల గౌరవమేమైనా తగ్గిందా? రోగుల మలమూత్రాలను శవాలను పరీక్షచేసే డాక్టరుని మనం అసహ్యించుకుంటున్నామా? పిల్లలను కనడం పెంచడం అసహ్యమైన పనులు కావూ? శుభ్రమైనవాళ్లు యేపనినైనా శుభ్రంగా చేయవచ్చును. పాకీపని మొదలైన వృత్తులలో అందరూ అసహ్యించుకొనేది ఆవృత్తులు కాదు. ఆపనివాళ్ల మాటలు, ప్రవర్తన, జీవనం, యిరుగుపొరుగులు. కలక్టరు తనమోటారును నడుపుకోడానికీ, ఇల్లాలు తనయింట్లో పనిచేసుకోడానికి అసహ్యించుకోరు. గాని కలెక్టరు మోటారుడ్రైవరు టోపీని, చొక్కాను వేసుకోడానికీ, యిల్లాలు దాసీదాని, వంటదాని గుడ్డలను కట్టుకోడానికీ అసహ్యించుకుంటారు. మాలమాదిగలు, పాకీవాళ్లు తిరగబడేది తమపనులను చెయ్యమని కాదు. సంఘం తమరిని నీచంగా చూస్తోందనీ, స్వల్పజీతాలిస్తోందనీ తిరగబడుతున్నారు.

అందరకూ సమానంగాగాని, [illegible]గా సమానంగాగాని వేతనాలు ఇవ్వడాన్ని గురించి సామ్యవాదులలో అభిప్రాయభేదాలున్నాయి. అది దేశకాలపాత్రాదులనుబట్టి అనుభవంమీద క్రమంగా నిశ్చయంచేయవలసిన విషయం. ఇంకా ఇంకా అనేక విషయాలనుగురించి సామ్యవాదుల వృద్ధికాలంలో అభిప్రాయభేదాలు కనపడుతున్నాయి. అవి క్రమంగా అనుభవంమీద నిశ్చయంకావలసినవిగాని, ఇదమిత్థమని యిప్పుడు ఖండితంగా చెప్పడానికి వీలుండదు. ఈలోపుగా, యీ వృద్ధికాలంలో [illegible] యనీ, గొంతెమ్మకోరికలనీ, [illegible] కావనీ, వెఱ్ఱిమొఱ్ఱిపన్నాగాలతో, పంపిణీలతో సామ్యవాదులు సంఘాన్ని గంగలో ముంచడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శకులు హేళనచేస్తున్నారు. సామ్యవాదం వస్తే మోటారుకార్లుంటాయా? గుర్రపుబండ్లుంటాయా? కళాభివృద్ధి, జ్ఞానాభివృద్ధి, శాస్త్రపరిశోధనలు, ఉంటాయా? పెళ్లిళ్లుంటాయా? — యీవిధంగా ప్రశ్నిస్తున్నారు. "గుడిపాటి వెంకటచలం పెళ్లిళ్లక్కరలేదంటాడు. ఆయన 'సోషలిస్టు'. కాబట్టి 'సోషలిస్టు' లకు పెళ్లిళ్లక్కరలేదు" — యీవిధంగా సిద్ధాంతీకరిస్తున్నారు.

నదులకు ఆనకట్లు కట్టించి సంవత్సరాలపాటు తవ్వించి సముద్రపుపర మవుతూవున్న నీళ్లకొన్ని [illegible] పొలాలను సారవంతం చేయడానికి ఉపయోగపడుతున్నట్లే ఖనికులపర మవుతూవున్న ఖనిజసంపదను [illegible] పేర్పర్చి సంఘాని కంతటికీ ఉపయోగపడేటట్లు చేయాలని సామ్యవాదుల ప్రయత్నం. ఒకనిష్టరు బాగుపడడం వల్ల పదిమంది నష్టపడడానికి వారొప్పుకోరు. అంతేకాదు. సంఘాభివృద్ధివల్ల కొందరికి లాభం కొందరికి నష్టం కలుగుతోంది. బెజవాడలో సిమెంటుకంపెనీ రావడంవల్ల ఏలూరులో కలెక్టరాఫీసు రావడంవల్ల, విశాఖపట్నంలో హార్బరు రావడంవల్ల, అన్నిపట్నాల లోను మునిసిపాలిటీవారు కొత్తగా రోడ్లు, ఎలక్ట్రిక్ దీపాలు వేయించడవల్ల ఆ ప్రాంతాలవున్న ఇంటిస్థలాల ఖరీదులు హెచ్చి కొంతమంది లక్షలు సంపాదించారు. ఆమునిసిపాలిటీలోనే కొంపలులేనివాళ్లు లేవని యేడుస్తూ

వుంటే, అటువంటివాళ్ళదగ్గరనుంచికూడా యేదో పన్ను పేర డబ్బు లాగి ఆ డబ్బుతో మునిసిపాలిటీవారు రోడ్లను వేయించి దీపాలు పెట్టిస్తే, అక్కడ ఖాళీస్థలాలు వున్న అదృష్టవంతులు యిదివరకు గజం రెండుఅణాలుచేసే తమస్థలాన్ని గజం రెండురూపాయలుచొప్పున అమ్ముకొంటున్నారు. కట్టుకున్న సుద్దముకూడా అమ్మించి దమ్మిడీలతోసహా శిస్తువారివద్ద వసూలుచేసిన పన్ను మొత్తంలోనుంచి తలావక ౨౦ వేలు, లక్షా చొప్పున విశాఖపట్నపు హార్బరువద్ద వున్న పదేసి సుశిసెలుగల భూస్వాములకు క్రుమ్మరించారు. వారు ఏం కష్టపడ్డారని, సంఘానికేమి వుపకారం చేశారని, ప్రతిఫలంగా వారికా డబ్బును ముట్టజెప్పడం ?

అంతేకాదు, ఈ ధనికుల ప్రభుత్వంలో సార్థకంగా వినియోగపడే ఒక్కరూపాయికి పదిరూపాయలు దుబారాగా నిరర్థకంగా ఖర్చుఅవుతున్నాయి. భగవంతుడు మనకు ప్రసాదించిన విశాలభూభాగాన్ని, అనంతమైన ప్రకృతిసంపదను, మనుష్యసంపదను వినియోగించుకోలేక మహాసమృద్ధిమధ్య దరిద్రంతో మునిగి తేలుతూ, "ఇంత పెద్దదేశాన్ని, ఇంతమంది ప్రజను ఎందుకు సృష్టించావు, భగవంతుడా ? జపాను ఇంగ్లాండుల మోస్తరుగా చిన్నదేశం చేయలేకపోయినావా ?" అని మొర పెడుతున్నాము. "దేశం భాగ్యవంతమైనది; ప్రజలు మిక్కిలి బీదవారు" అని దక్షిణహిందూదేశాన్ని గురించి డాక్టరు స్లేటరు అనుఅర్థశాస్త్రజ్ఞుడు వ్రాశాడు. మనదేశంలో వున్న భూమిలో మూడింట యింకా రెండువంతులు సాగు, పంటలులేకుండా ఖాళీగా వుందని యిదివరకే వ్రాశివున్నాను — "అంగట్లో అన్నీవున్నాయిగాని అల్లుడినోట్లో శని వుంది" అన్నట్లు ఒక వంక ఉపయోగపడవలసిన అపారమైన ప్రకృతి సంపద, ఇంకొకవంక నిరర్థకమైన దుబారాఖర్చు, మరోవంక అంతులేని దరిద్రం, — ఈ లోటుపాట్లను కనుక్కోగల, తీర్చగల నాయకులు లేకపోవడం — ఇక, ధనికులు మనకు చేస్తూవున్న నిర్వాకం ఏమిటి ?

ఈ లోపాలను దిద్దడము సామ్యవాదుల ఉద్దేశం. సంఘంలో యెవరికివారు స్వంతఆస్తిని సంపాదించుకోడానికీ, దానిని యిష్టంవచ్చినవారి కిచ్చుకోడానికీ సామ్యవాదు లభ్యంతరపెట్టరు. కాని అందువల్ల సంఘానికి హాని కలుగరాదు. నీ ఉపయోగంకోసం నీవు చేతికర్రను కొనుక్కోవచ్చును. నీయిష్టం వచ్చినవారికి దాని నిచ్చుకోవచ్చును. కాని దానిని చేతబట్టుకొని రోడ్డుమీద నీవు నడిచేటప్పుడు ఆ కర్రను నీయిష్టంవచ్చినట్లు త్రిప్పి, రోడ్డుమీద యింకెవ్వరినీ నడవనీయకుండాచేయడానికి నీకధికారం లేదు. భూమి, వర్తకవ్యాపారాలు, పరిశ్రమలు మొదలైన అర్థోత్పత్తిమార్గాలు కొద్దిమంది స్వంతఆస్తులుగా వుండడంవల్ల లాభాలకంటె నష్టాలే ఎక్కువ కనపడుతున్నాయి. చిన్నా, పెద్దా, అందరి బాగుకోసం వినియోగపడవలసిన సాధనాలు కొందరికే లాభిస్తున్నాయి. కాబట్టి వాటిని సంఘమే, ప్రభుత్వమే నడపాలి. వాటిని సంఘమే అభివృద్ధిజేసి ఆ లాభాలను సంఘమే పొందాలి. అందరూ బాగుపడాలి. ప్రభుత్వమువారు పోస్టాఫీసులను, రైళ్లను — నడుపుతోన్నట్లే, మునిసిపాలిటీవారు ఎలక్ట్రికుదీపాలను నీటికుళాయిలను నడుపుతున్నట్లే ఉమ్మడిగా అందరకూ సంబంధించిన సంస్థలను ఉమ్మడిగా అందరిలాభంకోసం నడపాలి. —

—— * ——

పండితరాయలసూక్తులు

(నా తెలిగించినవి కొన్ని)

నల్లాది సూర్యనారాయణశాస్త్రి

సిరిగలవారి నాసికడ
　　చేరవు వారిముఖంబు చూచి వా
గరువపుమాటలుఁ వినవు
　　కల్లప్రియంబులు నల్క వల్లనం
దరుణము చూచి సేయుదువు
　　త్రాగుదు హాయిగ నిద్రవోదు వో
హరిణమ! నాకు జెప్పు మహా
　　హా! యెన తేమితపంబు చేసితో?

పెద్దవారిశిక్షఁ బెరిగిన మనుజుఁడు
గొప్పతనము గాంచి మెప్పువడయు,
సానపట్టకున్న జాతిరత్నంబైన
భూమినాథు మౌళిఁ బొందునె కొ!

కుండ తగుపాటిసిటినిఁ గ్రోలుచుండ
దానికొడుకు సముద్రవుంతయును జుర్రె
ధన్యమగు జన్మమెత్తిన తనయుఁ డెంచఁ
దండ్రి మించునుగాదె యుత్తమచరిత్ర.

మానియన నొక్క చాతకమే నిజంబు
వసుధఁ గలకాల మయ్యది బ్రతుకుఁగాక
దాహమైనంత విడుచును దేహమైన
నోరు తెఱచి యాచించు బలారినైన.

మంచివారిహితము మాటిమాటికి భంగ
పఱుపనేర్పు కాఁడు పాపజాతి,
నిరపరాధులైన నరుల ప్రాణంబులు
పాప నేర్పుకలది పాపజాతి.

మంచివారను దూది రక్షించునట్టి
యగ్నిహోత్రుండు పరుల దుఃఖాగ్నిశిఖల
నల్లఁ జల్లార్చునట్టి మహానిలుండు
నైనదుష్టుని వర్ణించునతఁడు కలఁడె?

దుర్జనుం డొనరించును దుష్కృతంబు
తత్ఫలము మంచివాని మార్గమునఁ బడును,
రావణుండు దొంగిలించె భూమిపుత్రిఁ [illegible]
నంబుధికి బంధనంబు సంప్రాప్తమయ్యె.

కొంతపడి కష్టపడి చేర్చుకొన్న దాని
చిత్తరువునందు పూలు వ్రాసినంతగాక
అవ్వి యేమైన ఘుమఘుమ లాడునె కొ?
భృంగములకందు రసము లభించునె కొ?

ఎన్ని వేదాంతములు పఠియించినను
దుర్జనుండు గానఁడెందు సాధుత్వగుణము,
అన్ని నేతులందుగా స్ఫటిక [illegible]
మిఱకుమైనాకుఁ [illegible]?

పరిమళము కొదవటగదను
గరువము పడకు మీ పుష్పసుందరి! నీవు
పరిమళశైత్యశుచిత్వ
కరమై సుకుమారమైన ఘనసారంబుల్.

వానకాలంబు సిద్ధమౌనె? [illegible] సమయ!
నీటిసంపద నీకిట్లు నిలుచునొకొ
కాని, పాటిసి! నిజముగాఁ గప్పమునఁ గల
చెట్లు కూల్చినవాండు స్థిరమునుక్త!

కేరాతఁ జూడ నోఁగని
నీరజము జన్మ మెట్లు నిష్ఫలముగునో,
సారసము సొంపుచూడని
కైరవమిభుజన్మ మెట్లు కడు నిష్ఫలము.

పెండికొండ పైఁడికొండలు కొండలా?
ఆశ్రయించు చెట్లు లట్టెయుండు,
సరుగు వేసఁగూడఁ జందనంబును జేయు
కొండ మలయ మొకటి కొండ రాజు.

మంచినేర్పరి వగుదువు చందమామ!
నీకు సరివారు లేరు భూలోకమందు,
పండువెన్నెలఁ జెలఁగె దుత్పలినిఁ గూడి
పద్మినింగూడి చెలఁగెదు పగటివేళ.

గ్రామపరిశ్రమలు

తిమ్మరాజు సత్యనారాయణరావు

౧

మనదేశము ఆర్థికముగా వెనుకబడియుండడానికి ముఖ్యకారణము, దాదాపు ప్రజ లందరూ ఒక్క వ్యవసాయముమీదనే ఆధారపడియుండడము. ఇతరపరిశ్రమలను వెంటనే అభివృద్ధిచేయడం ఇందులకు ప్రధాన సాధన మని అందరూ అంగీకరించారు. ప్రభుత్వంవారి మీద ప్రజాప్రతినిధులు నిరంతరాయముగా ఒత్తిడికలుగ చేయగా కట్టకడవరకు విదేశీసరుకులమీద పన్నులు విధించి కొన్ని దేశీయపరిశ్రమలను రక్షించేవిధానమును ప్రభుత్వంవారు అవలంబించారు. ఈరక్షణవిధానమువలన కొన్ని పెద్దపరిశ్రమలు ఏర్పడి, ఆధునికయంత్రాగారాలతో పనిచేస్తూ, దేశీయులకు కావలసిన కొన్ని సరుకులలో చాలాభాగం తయారుచేయగలుగుతున్నాయి. ఇటువంటి పరిశ్రమలలో వస్త్రపరిశ్రమ; ఇనుము, ఉక్కు పరిశ్రమలు; పంచదారపరిశ్రమ ముఖ్యమైనవి. స్వదేశీఉద్యమము, రాజకీయసంచలనములుకూడా పరిశ్రమాభివృద్ధికి తోడ్పడినవి.

ఇలా వృద్ధియైన పరిశ్రమ లన్నీ పాశ్చాత్యదేశాలలోవలెనే పెద్దపెద్దఫ్యాక్టరీలలో బొంబాయి, జంషెడ్పూరు, అహమ్మదాబాదు మొదలయిన కేంద్రములలో పనిచేస్తున్నాయి. ఇది యిట్లుండగా, ఈనడుమ ఒకక్రొత్తవాదం బయలుదేరింది. దీనికి ప్రధాననాయకులు శ్రీమహాత్ములు, వారి అనుచరులయిన జె. సి. కుమారప్పగారు మొదలయినవారు. వీరు, "ఈపెద్దయంత్రాగారపరిశ్రమలు మనకు పనికిరావు, వీనివలన చాలా నష్టాలున్నాయి, వీటి నన్నిటిని తీసి పారేసి పూర్వంలోవలె చిన్న చిన్న గ్రామపరిశ్రమలు స్థాపించాలి" అంటారు. ఈకార్యక్రమం నెరవేర్చడానికే అఖిలభారతగ్రామోద్యోగసంఘము (A.I.V.I.A.), గాంధీసేవాసంఘము మొదలయిన సంస్థలు పూనుకున్నాయి. రాష్ట్రాలలోని కాంగ్రెసు ప్రభుత్వాలు కూడా, ఖద్దరు మొదలయిన పరిశ్రమలకు విరాళాలివ్వడం, వారి పారిశ్రామికశాఖలను గ్రామపరిశ్రమల అభివృద్ధికే ముఖ్యంగా పనిచేయమని హెచ్చరించడంద్వారా గ్రామపరిశ్రమల అభివృద్ధికి తోడ్పడుతున్నారు.

గ్రామపరిశ్రమలు దేశానికి చాలా ముఖ్యమైనవి. వాటిని అన్నివిధాలా వృద్ధిచేయడం తప్పక అవసరమే. అందుకు కావలసిన అన్నిప్రయత్నాలూ ప్రభుత్వంవారు ప్రజలుకూడా చేయవలసినవిధిగా యున్నది. కాని, ఈవాదాన్ని ప్రచారంచేస్తున్న ప్రముఖులు ఇంతటితో ఆగక, సమస్తపరిశ్రమలు (ఒకటి రెండింటిని తప్ప) గ్రామపరిశ్రమలుగా మార్చివేస్తా మంటున్నారు. పెద్దపరిశ్రమ లనగానే షాహుకార్లు, పెట్టుబడిదార్లు కావాలి. కష్టమంతా కార్మికులది, లాభమంతా పెట్టుబడిదార్లది. యజమానులకు కార్మికులకు తగాదాలూ పోట్లాటలు వస్తాయి. చిన్నపరిశ్రమలలో — అనగా గృహపరిశ్రమలలో, యజమాని, పెట్టుబడిదారు, కార్మికుడు అన్నీ ఒకడే. అతనికే కూలీ, అతనికే లాభమున్నూ. యంత్రాలకు బానిసయై, ఫ్యాక్టరీకట్టుబాట్లకు లోనై పనిచేయనక్కరలేదు. తనయిచ్ఛవచ్చినట్లు చేసుకోవచ్చు. ఫ్యాక్టరీపరిశ్రమలు లక్షలాదివస్తువులను రాసులు రాసులుగా తయారుచేసి పోసేస్తాయి. కార్మికు లెందరో అవసరమే లేదు. అందువలన నిరుద్యోగం పెరిగి నిరుద్యోగసమస్య అన్నిపారిశ్రామికదేశాలలోను పీడించుకుతింటోంది. ఇంక పెద్దపరిశ్రమలను నిర్వహించడంలో నిర్బంధము, హింసావిధానము అవసర మవుతున్నాయి. తయారైన వస్తువులను అమ్ముకోడానికి ఇతరదేశాలలో హక్కులనిమిత్తం పారిశ్రామికదేశాలు పోరాడుకోడం, యుద్ధాలు, సామ్రాజ్యాలేర్పరచడం, ఇన్నిరకాల హింస అవసరమవుతోంది. పూర్వంలో

వలె ఏగ్రామానికి కావలసిన వస్తువులు ఆగ్రామంలోనే తయారయి స్వయంసంపూర్ణంగా ఉంటే ఈహింస, ఈయుద్ధాలూ ఇవన్నీ అవసరం లేవుగా? ఇంక — పారిశ్రామిక కేంద్రాలేర్పడడంవలన అనారోగ్యపరిస్థితులలో, క్రిక్కిరిసిపోయిన కొట్లలో అనేకకుటుంబాలు జీవించడంలాంటి అనర్థాలు గ్రామపరిశ్రమలలో పోతాయి. గ్రామపరిశ్రమలను వృద్ధిచేయడంవలన రైతులకు సహాయవృత్తి లేర్పడతాయి. వ్యవసాయంవల్ల వచ్చే ఆదాయానికి కొంచెము చేర్చుకోగలుగుతారు. ఇవికాక, ఇంకా గ్రామపరిశ్రమలలో తయారయ్యేవస్తువులు చక్కనివని, కళాపూరితమైనవని, ఆధ్యాత్మికాభివృద్ధికి తగినవని, ఇంకా యేమేమో చెప్పి ఈఉద్యమానికి ప్రచారంచేస్తున్నారు. ఈపరిశ్రమలద్వారానే బాలురకు విద్య గరపవలెనని ఒకవిధానం తయారుచేశారు.

ఇదంతా చూస్తే చాలా చక్కగానే కనబడుతుంది. ఇంకేముంది! ఈగ్రామపరిశ్రమలవిధానం అమలులో పెడితే చాలు, ప్రపంచాన్ని పీడించుకుతింటున్న ప్రధాన ఆర్థిక, సాంఘిక, రాజకీయ సమస్యలన్నీ హఠాత్తుగా ఎగిరిపోతా యన్నమాట! కాని, యీవాదాలన్నీ బాగా తరచిచూస్తే ఇదంతా చెప్పేటంత సులభమైనవిషయం కాదని తెలుస్తుంది.

ఒకానొకప్పుడు ప్రపంచ మంతటను, మొన్న మొన్నటివరకు మనదేశంలోను, ఈగ్రామపరిశ్రమలే వ్యాపించియుండేవి. అటువంటివి, ఎందుచేత క్షీణించినవి? ఇందుకు ప్రధానకారణము అత్యంతశక్తిమంతములై, వస్తువులను స్వల్పఖరీదుతో తయారుచేసే యంత్రాలు బయలుదేరడమే. ఈయంత్రాలపోటీకి నిలవలేక చేతిపనులు అన్నిదేశాలలోను కాలక్రమేణ క్షీణించిపోయాయి. యంత్రనిర్మాణంవలన ఇదివరలో ఎంతో వ్యయప్రయాసలతోగాని తయారుకానివస్తువులు తక్కువఖర్చుతో త్వరగా లక్షలకొలది ఉత్పత్తిచేయడానికి వీలయినది. పేదవాళ్లకుకూడా చవుకయిన ఆహారపదార్థాలు, బట్టలు, దీపాలు, ప్రయాణసౌకర్యాలు, అందుబాటులోనికి వచ్చాయి. ధనవంతులుకూడా యెరుగని విద్యుద్దీపాలు, మోటారుకార్లు, అచ్చుపుస్తకాలు, పత్రికలు, గ్రామోఫోనులు, రేడియోలు సైతము ప్రజాసామాన్యానికి అలవాటయిపోతున్నాయి. ఈపారిశ్రామికాభివృద్ధి నంతటినీ పక్కకు తోస్తే, మనప్రజలకు అవసర మయిన వస్తువుల నెలా సంపాదించుకుంటారు? మరేమిలాభము? అనుకూలపరిస్థితులనుబట్టి ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్కపరిశ్రమ బాగా విస్తరించి వస్తువులు తయారుచేసి, వాటిని ఇతరస్థలాలకు ఎగుమతి చేస్తుంది. అక్కడనుండి ఆప్రాంతాలలో ప్రత్యేకంగా సాధ్యాలుగల ఇతరపరిశ్రమలవస్తువులు తెప్పించుకుంటారు. ఇటువంటి ప్రత్యేకవృత్తి, సహకారం లేక ప్రతిగ్రామంలోనూ అన్నిపరిశ్రమలూ స్వయం సంపూర్ణంగా యేర్పడవలెనంటే, సమయమూ శ్రమా అన్నిచోట్ల వృధా అయిపోవడం, తగినంత కష్టపడడం మాత్రమే జరుగుతుంది. ఏకేముని సైని ఒకటి కావలసిన అన్నివస్తువులూ తయారుచేసుకోవాలంటే అది సమంజసమా, ప్రతిగ్రామమూ స్వయంసంపూర్ణంగా ఉండాలంటేనూ అంత చక్కగా ఉంటుంది.

పూర్వం గ్రామాలు స్వయంపూర్ణంగా ఉండేవి కావచ్చు, నిజమే, ఉండేవి — ప్రయాణసౌకర్యాలు, పత్రికలు మొదలయినవి లేనిరోజులలో. ఇప్పుడు అలాలేదు, ఉండవలసిన అవసరం లేదు. ఇతరపరిశ్రమలమాట అటుంచుదాం! వ్యవసాయంలోనే ఆ పరిస్థితులు తారుమారయిపోయినవి. రైతులు తమకు కావలసిన అన్నివస్తువులూ తమపొలాలలో పండించుకోవడం లేదు. తమపరిస్థితులలో అన్నింటికంటె లాభకారిగా ఉన్నదాని పండించి ఇతరప్రాంతాలకు, ఇతరదేశాలకు ఎగుమతిచేస్తున్నారు. ప్రత్తి, పొగాకు, చెరకు, వేరుసెనగ మొదలయినవి పండించే ప్రాంతాలలో అవన్నీ మానేసి కొంచెం వరి, కొంచెం ప్రత్తి, కొన్ని అపరాలు, కొన్ని కాయగూరలు పండించుకోవలెనంటే ఏర్పడు విపరీతాలు? ఏమి లాభం వస్తుంది? ఈయుగంలో తిరిగి గ్రామాలలోనే స్వయంసంపూర్ణత్వం ప్రవేశపెట్టాలనేది అసంభవమైన కార్యక్రమము.

ఇంక, యంత్రాలూ ఫ్యాక్టరీలు తీసివేస్తే 'కాపిటలిస్టు' విధానంవలన (అనగా, ధనాఢ్యులైన పెట్టుబడిదారుల అధికారంవలన) కలిగే అనర్థాలు నశించిపోతాయా అన్నది ఆలోచించాలి. యంత్రాలు పెట్టుబడిదారులవి

కావడంచేత పరిశ్రమలలో తయారయ్యే సంపదంతా పెట్టుబడిదారులకే పోయి కూలీల కేమీ రావడంలేదని, యంత్రాలు తీసేస్తే కార్మికుడే యజమాని అవుతాడు గనుక లాభమంతా అతనికే చెందుతుందనీ కదా, వాదం. యంత్ర మంటే యేమిటి? అదికూడా ఒక సాధనము; పెద్దది, శక్తియుతమైనది. ఈసాధనంవలన అమితమైన సంపద తయారవుతోంది. ఇదంతా పెట్టుబడిదారులు దోచుకొని పోతున్నారంటే, అది సాధనంయొక్క తప్పా? కాదు; ఆతప్పు సంపదను పంచుకొనే విధానంలో ఉంది. ఈయంత్రాలన్నీ పెట్టుబడిదారుల ఆస్తి కావడంలో ఉంది. ఇవి మారితే, పెట్టుబడిదారులు కోటీశ్వరులు కావడం, కార్మికులంతా కూటికి లేక మాడి పోవడం అనే విపరీతపరిస్థితి, దీనివలన వచ్చే సాంఘికసంఘర్షణలు నశించిపోతాయి. సంఘనిర్మాణాన్ని మార్చడంవలన పోయేఅనర్థాలుకాని, ఇవి యంత్రాలు తీసేస్తే పోయేవి కావు. యంత్రా లంతగా ఉపయోగించనిది, గ్రామాలలో చిన్నరైతులచేత చిన్నచిన్న భూఖండాలలో సాగించబడుతున్నది, వ్యవసాయపరిశ్రమను గమనించండి. ఇందులో సాంఘికసంఘర్షణ కేమయినా లోపమా? రైతులు, కూలీలు యజమానులచేత షావుకార్లచేత పీడింపబడి నశించి పోతున్నారు. కాపిటలిస్టు విధానంయొక్క అనర్థాలన్నీ స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి. పోనీ, చేనేతపరిశ్రమవంటి గృహపరిశ్రమలలో చూడండి. అక్కడా ఇవే పరిస్థితులు. పనివారంతా షావుకార్లకు ఋణగ్రస్తులైయున్నారు. మగ్గాలు మొదలయిన పనిముట్లు షావుకార్లవి. (లేదా, షావుకారుకి తణఖాలో ఉంటాయి). నూలు, భత్యాలువగైరాలకు షావుకారే అడ్వాన్సు యివ్వాలి. దీనంతటి మీదా బోలెడంత వడ్డీ. షావుకారుకి కావలసినరీతిని వస్తువులు తయారుచేసి, అతను నిర్ణయించే ధరలకు అతనికే అమ్ముకోవాలి. పనివాడికి మిగిలేది పొట్టపూటకయినా చాలని కూలియే గాని మరేమీ లేదు! ఈషావుకారుదళారీలకు పూర్తిగా వశమై పోయిఉండని గృహపరిశ్రమ ఒకటయినా లేదు. సహకార సంఘాలద్వారా ఈదళారీలను తొలగించడానికి చేసినప్రయత్నాలన్నీ విఫలమైనవి.

దీనివలన తేలేసారాంశ మేమి? షావుకార్లు తమధనాన్ని యంత్రపరిశ్రమలలోగాని, గృహపరిశ్రమలలోగాని, వ్యవసాయంలోగాని, పెట్టుబడి పెట్టి లాభాలు లాగడానికి సావకాశ మున్నంతవరకు పరిస్థితు లొకలాగే ఉంటాయి. ఈపరిశ్రమలు చిన్నవా, పెద్దవా? యంత్రాలు గలవా, లేనివా, ఒకేచోట కేంద్రీకరింపబడినవా, చెల్లాచెదరైయున్నవా అనే ప్రశ్నలతో నిమిత్తం లేదు. ధనాఢ్యులకు పేదలకు, యజమానులకు కూలీలకుగల యీసంఘర్షణ ఉత్పత్తి సాధనాలను మార్చినంతమాత్రంచేత పోజాలదు. ఈతరగతుల పరస్పరసంబంధాలను సంఘశ్రేయస్సు కనుగుణంగా ఉండేలాగున ప్రభుత్వంవారే కట్టుదిట్టము చేయాలి; లేదా ఈసంఘవ్యవస్థ పోయి కొత్తసంఘవ్యవస్థయినా రావాలి.

ఇక నిరుద్యోగంసంగతి యేమిటి? పెద్దపెద్ద యంత్రపరిశ్రమలలో వస్తువు లన్నిటినీ యంత్రాలే కొలదిమంది కార్మికులసహాయంతో తయారుచేస్తాయి; అందువలన చాలామంది నిరుద్యోగులైపోతారు; అదే గ్రామపరిశ్రమలద్వారా జరిగితే యంత్రాలు చేసే పని తక్కువ, మనుష్యుల అవసరం యెక్కువా ఉండి చాలామందికి పని దొరుకుతుంది అని వాదిస్తున్నారు. ఇది పూర్తిగా నిజమే అయినయెడల, యంత్రాలన్నీ తీసేసి, చేతిపనులు స్థాపిస్తే అందరికీ కావలసినంతపని దొరకాలన్నమాట. మాటవరసకి — రైళ్లు తీసేసి, యెద్దుబండ్లు నడిపిస్తే ఎన్నిలక్షలమందికో ఉద్యోగాలు దొరకాలి! కాని, నిజంగా అల్లా జరుగుతుందా? రైళ్లే లేకపోతే ఇంతమంది ప్రయాణం చేస్తారా? ఇన్నిసరకులు రవానా అవుతాయా? పెద్దపరిశ్రమలు తీసేస్తే అసలు జరిగే ఉత్పత్తియే తగ్గిపోతుంది. అందువలన నిరుద్యోగం హెచ్చుతుందిగాని తగ్గదు.

ప్రాతపద్ధతులు పోయి కొత్తవి వచ్చినప్పుడల్లా ఇదివరకు వృత్తులలో ఉన్నవారిపనులు పోకతప్పదు. కాని, సంఘములోని సంపద, పనులు, ప్రజల ఆదాయాలు హెచ్చినకొలది ఈపనులు పోయినవారు కొత్తపనులలో చేరుతుంటారు. ఒకసారి కొత్తగా బయలుదేరిన పరిశ్రమలు, ఉద్యోగాలు పరికించిచూస్తే

ఎంతమంది ఈకొత్తపనులలో చేరియున్నారో తెలుస్తుంది. ఒక్కొక్కప్పుడు ఈసర్దుబాటు సరిగా జరగక కొంతమంది నిరుద్యోగులుగానే ఉండిపోవటం తటస్థిస్తుంది. అది, సంఘవ్యవస్థలో ఇటువంటి సర్దుబాటు సక్రమముగా జరగడానికి తగిన యేర్పాట్లు లేకపోవడంవల్ల వచ్చేఅనర్థము. ఒకపనిలో ఉన్నవా రెవరికి పని పోనే కూడదు అంటే, పరిశ్రమలలో ఎన్నియుగాలకయినా అభివృద్ధిలేకుండా అల్లాగే ఉండిపోవా లన్నమాట. మనదేశంలో అల్లాగే ఉండేయెడల, మనపరిశ్రమలు ఎప్పటిలాగే ఉంటాయి ఇతరదేశాలవారు వృద్ధిచేసుకొని ఆసరుకులు తెచ్చి మనదేశంలో అమ్ముకుంటారు; పెద్దపరిశ్రమ లుండవు, చిన్నపరిశ్రమల వస్తువులు కొనే వా రుండరు; అందరూ తిరిగి వ్యవసాయంమీదనే పడి జీవించవలసినస్థితి యేర్పడుతుంది. అందరికీ ఏదో "ఉద్యోగం" ఉంటుంది కాని, దానివలన వచ్చే "ఆదాయం" ఎందుకూ సరిపోదు.

ఊరికే యంత్రాగారాలు తీసేసి చిన్నపరిశ్రమలు పెట్టినంతమాత్రాన నిరుద్యోగసమస్య పోయేది కాదు. అది చాలా క్లిష్టమైనసమస్య. సాంఘికవిధానంలోను, పరిశ్రమలను నడిపేపద్ధతులలోను, తీవ్రమైన మార్పులు వస్తేనేగాని తెమలేసమస్య కాదు.

మనదేశంలోని పారిశ్రామికకేంద్రాలలో కూడా కార్మికులకు సరియైన యిండ్లు, వసతులు లేకపోవడం, అతిఅనారోగ్యపరిస్థితులలో వారు జీవించవలసిరావడం, మొదలయిన అనర్థాలు బాగా వ్యాపించాయి. కాని ఇవి ఆధునికపరిశ్రమలతోపాటు ఉండవలసిన అవసర మేమీ లేదు. యజమానుల స్వార్థపరత్వమే దీనికి కారణం. పాశ్చాత్యదేశాలలో కొన్నిచోట్ల ఇట్టిఅనర్థాలు లేకుండా యజమానులే శ్రద్ధతీసికొన్న పరిశ్రమలూ ఉన్నాయి. ప్రభుత్వంవారు శ్రద్ధవహిస్తే ఇవి లేకుండా యేర్పాట్లు చేయవచ్చును.

పోనీ, కేంద్రీకరింపబడిన పెద్దపరిశ్రమలకంటె చిన్నపరిశ్రమలే కొన్నివిధాల మంచి వనుకుందాము. అయితే, ఇటువంటి చిన్నపరిశ్రమలను ప్రస్తుతపరిస్థితులలో స్థాపించి నెగ్గగలమా అని ఆలోచించాలి.

అటువంటి పరిశ్రమలనే [illegible]గా స్థాపించినా [illegible] ఉత్పత్తిశక్తి బాగా క్షీణించిపోతుంది. వస్తువుల [illegible] చాలా యెక్కువ అవుతుంది. యంత్రాలకన్న [illegible] తంగా ఆధునికపద్ధతులపై [illegible] చేసే [illegible]యులు మనకంటె చాలా తక్కువ[illegible]కు అమ్ముతారు. మనవస్తువుల నెవరు కొంటారు? [illegible] వస్తువులమీద హెచ్చుగా పన్నులు వేసి [illegible] అంటే ఆ విదేశీయులే మన[illegible] [illegible] [illegible] లు కొందరితో కలిసి [illegible] [illegible], [illegible]గా పన్నులబాధ తప్పించుకొని [illegible]. [illegible] యిలా ఏర్పడినకంపెనీ లెన్నో [illegible]న్నాయి. [illegible] పెట్టెలు, జోళ్లు, రబ్బరువస్తువులు, [illegible] రాలు తయారుచేసే [illegible] [illegible] [illegible]నున్నాయి. ఇటువంటి ప్రయత్నాల [illegible] కావలసిన రాజకీయాధికారం మనకు లేదు. [illegible] కాగమే ఉంటే ప్రభుత్వ[illegible] [illegible] [illegible], [illegible]వస్థను లవలంబించడం, చిన్నపరిశ్రమలు స్థాపించడం అవసరమే లేదు. [illegible] ఆధునిక పరిశ్రమలనే స్థాపించి [illegible] కలిగినఅనర్థాలు [illegible] [illegible] [illegible] కోవచ్చు.

మన[illegible]శంలోని ప్ర[illegible] [illegible] [illegible] [illegible] ముఖ్యంగా కావలసినవి [illegible]. "[illegible] వస్తువులు, మీ[illegible]నే [illegible], [illegible] మన[illegible], [illegible]తో చేసినవి, వీనిలో ఏగక్కనుము[illegible]" — [illegible] న్నీ చెప్పి నేమిలాభం? [illegible] వచ్చే [illegible] యములోను అన్నిఅవసరాలు [illegible] [illegible] [illegible] ఒకలాగ [illegible]. [illegible] చేతిపనులలో పనిచేసే పారిశ్రామికు[illegible], తనమట్టుకు చవుకయిన యంత్ర[illegible] [illegible] రయిన వస్తువులే కొంటాడు. [illegible] సాగను, కొత్తరకాలు కలిగినా, ఇంక [illegible] లేదు. జపాను వస్తువుల ప్రాబల్యం ఎవరికి తెలియదు? బొమ్మలు, ఆటవస్తువులు; బట్టలు, [illegible]; [illegible], రబ్బరు వస్తువులు; సైకిళ్లు, [illegible]; [illegible] అనేకరకాల చిత్రవిచిత్రవస్తువులు మారుమూలల ప్రా

మాలలోనికి ఎలా చొచ్చుకొనిపోగాయో చూడండి! స్వదేశీ ఉద్యమం, రాజకీయ సంచలనం, జపాన్ వస్తు బహిష్కరణంగూడా ప్రబలియున్న ఈ రోజుల్లోనే ఇలా ఉంటే ఇతరసమయాలలో వేరే చెప్పవలెనా?

పరిశ్రమలు వృద్ధిలోనికి రావలెనంటే, ప్రజాసామాన్యానికి తగినంత చౌకధరలకు వస్తువు లుత్పత్తి చేయాలి. చౌకవస్తువులు ఎంత త్వరగా వ్యాపిస్తున్నాయో చూడండి — ప్లైవుడ్డు వచ్చి టేకుబల్లలను సాగనంపింది; ఇమిటేషన్ సిల్కు వచ్చి సిల్కువస్తువులను చాలాభాగం తొలగించింది. ఇలాగే మిగిలినవాటిలో కూడా ప్రస్తుత సాంఘికవిధానంలో, ఎవరిబాగు వారే చూసుకోవాలి. ఇతరుల క్షేమంకోసం ఆలోచిస్తూ కూర్చుంటే తనయిక్కట్లు తీర్చేవా రెవరూ లేరు. అందువలన, రకం చూసుకొని, అన్నిటికంటె ఏవస్తువులు చవుకగా ఉంటే వాటినే ప్రతివాడూ కొంటాడు. ఇంతకంటె గత్యంతర మేమి?

పెద్దపరిశ్రమలవలన హింసావిధానం ఏర్పడుతుంది గనుక, గ్రామపరిశ్రమలనే అవలంబించవలసిన విధిగా ఉన్నదని ఈనాడు ప్రచారకులు పదేపదే చెబుతున్నారు. పెద్దపరిశ్రమలవలన బోలెడన్ని సరుకులు తయారవుతాయి; వీటిని తయారు చేయడానికి ముడిపదార్థాలు కావాలి; వీటిని అమ్ముకోడానికి దేశాలు కావాలి. ఇందుకోసం దేశాలూ దేశాలూ యుద్ధాలకు దిగి, సామ్రాజ్యవాదం ప్రబలమై హింసావిధాన మేర్పడుతుంది. బ్రిటిషువారు సామ్రాజ్య మేర్పరుచుకోడానికి, ఇటలీ అబిసీనియాను ఆక్రమించేయడానికి, జపాన్ చైనాలో చేసే మారణహోమానికి యిదే కారణం. అందువలన పెద్దపరిశ్రమలు పనికిరావని వీరివాదం.

దీని కంతటికి నిజంగా కారణ మేమిటి? పరిశ్రమలు తయారుచేసే వస్తువులని అనుభవించడానికి ఆయా దేశాలలో ప్రజలు లేకనా? కార్మికులంతా దారిద్ర్యములో మ్రగ్గిపోతున్నారే! ఈయుద్ధాలకు, హింసకు, అన్నిటికి పెట్టుబడిదారుల స్వలాభాపేక్షయే కారణం. ప్రజల ఉపయోగం నిమిత్తమే వస్తువులను తయారు చేసేటట్టయితే ఈహింసంతా అవసరమే లేదు. వస్తువు లెక్కువగా తయారయితే, తయారుచేసే కార్మికులే, ప్రజలే, వాటిని యెక్కువగా అనుభవించవచ్చును. వాటిని కార్మికులకు రానీయక, ఇతరచోట్ల లాభసాటిగా అమ్మి కోటీశ్వరు లవుదామనే ఉద్దేశంతో యజమానులు సంచరించడంవలన ఈకల్లోలమంతా వస్తున్నది.

పైగా, ఇతరదేశాలన్నీ ఆధునిక పారిశ్రామిక విధానాన్ని అవలంబించి మీదబడి క్రమ్ముకొస్తున్నప్పుడు మనం చేతులు ముడుచుకొని పారిశ్రామికాభివృద్ధి లేకుండా కూర్చుంటే జరిగే దేమిటి? అయ్యో, జపానువలె హింసకు దిగము అని ఆలోచిస్తే, చైనావలె హింసంతా మనమే అనుభవించవలసివస్తుంది. పారిశ్రామిక దేశాలన్నీ మనమీద పడి పీడించుకు తింటాయి. అహింస అంటే దుర్బలత్వం నీరసత్వం కాదు. బలవంతులైకూడా ఇతరులను హింసించకపోవడం. ఇంతకు — కొన్నితరాలవరకు మనం ఇతరదేశాలలో అమ్ముకోనక్కరలేదు, మనవస్తువులవిడుదలకు మనదేశము చాలు. మనకు కావలసినముడిపదార్థాలు చాలావరకు మనదేశంలోనే దొరుకుతాయి.

ఆధునికయంత్రాగార పరిశ్రమలు మనదేశానికి తప్పవు. దేశంయొక్క పారిశ్రామికాభివృద్ధి ముందుముందుకూడా ఈపరిశ్రమల వృద్ధిమీద చాలావరకు ఆధారపడిఉంటుంది. ఇటువంటిపరిశ్రమలు సరియైన ప్రణాళికప్రకారం అనువయిన ప్రదేశాలలో స్థాపించి ప్రజలకు కావలసినవస్తువులు అతితక్కువఖర్చుతో తయారుచేయడానికి ప్రయత్నించాలి. పారిశ్రామికాభివృద్ధి అంటే ఎంతసేపూ విదేశాలనుండి దిగుమతిఅయ్యే వస్తువులబదులు మక్కికి మక్కీగా తయారుచేయడమే అనుకుంటారు. అంతేకాదు కావలసినది; విదేశాలనుండి వచ్చేవస్తువులకంటె అనేకరెట్లు అధికంగాతయారు చేయాలి. ప్రజల అవసరాలను బాగా పరిశీలించి, స్వతంత్రంగా ఆలోచించి, ఆ అవసరాలను తీర్చేవస్తువులు తయారుచేయాలి. వీలయినంత త్వరలో యంత్రాలుకూడా ఇతరదేశాలనుంచి తెప్పించుకోవలసిన అవసరంలేకుండా మనదేశంలోనే తయారయ్యే ఏర్పాట్లు చేసుకోవాలి. ఆవిధంగా పరిశ్రమలను స్థాపించినట్లయితే అనేకకోట్లప్రజలకు పరిశ్రమలలో పని దొరుకుతుంది. నిరుద్యోగం తొలగిపోతుంది.

అయితే, మన దేశంలో గ్రామపరిశ్రమలకు గల స్థాన మేమి? గ్రామపరిశ్రమలు నిజంగా మన దేశానికి చాలా ముఖ్యమైనవి. మన ప్రజలలో పరిశ్రమలవలన జీవించేవారు ౨౬౦ లక్షలమందిలో, ౧౫ లక్షలమంది మాత్రమే ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు. దీన్నిబట్టి పారిశ్రామిక ప్రజలలో అత్యధికసంఖ్యాకులు చిన్నచిన్న గ్రామపరిశ్రమలవల్లనే బ్రతుకుతున్నారని తెలుస్తుంది. విస్తారమైన మనదేశంలో, పట్టణాలకు దూరమైన పల్లెలలోనే ప్రజలు చాలామంది నివసిస్తున్నప్పుడు, ఏ గ్రామాని కా గ్రామానికి కావలసిన చేతిపనులు చేసే వడ్రంగి, కమ్మరి, కుమ్మరి వగైరా పనివారందరూ చాలా అవసరంకదా. ఇదికాక, అనేకపరిశ్రమలలో పెద్దఫ్యాక్టరీలు చిన్నఫ్యాక్టరీలుకూడా పనిచేస్తున్నట్టే, చిన్నగృహపరిశ్రమలుకూడా పనిచేస్తుంటాయి. ఇందుకు ప్రత్యేకకారణా లుండవచ్చును. కొన్నిపరిశ్రమలలో పనివాడి పనితనం, జాగ్రత్త, కావలసినరీతిని తయారు చేయడం మొదలయినవి ముఖ్యంగా ఉంటాయి. నగలు, దంతపు పనులు, విలువగల సామానులు మొదలయినవి చేయడంలో చిన్నగృహపరిశ్రమలే యంత్రాగారాలకంటె బాగా పనిచేస్తాయి. చేనేతపరిశ్రమలాంటి కొన్నిపరిశ్రమలలో, యంత్రానికిగల శక్తి ఫ్యాక్టరీలకు లాభించగా, నేతవారు చాలా తక్కువకూలితోనే తృప్తిపడి తమ కుటుంబాలతోసహా పనిచేయడంవల్ల గృహపరిశ్రమ కూడా పోటీకి నిలువగలుగుతున్నది. ఒకానొకప్పుడు ప్రబలియున్న ప్రతిగృహపరిశ్రమనీ తిరిగి లేవదీస్తామంటే సాధ్యంకాదు; ఇప్పుడు నిలిచియున్న గృహపరిశ్రమ లన్నీ నిలవలేకపోవచ్చుకూడా. కాని, ఇప్పు డున్న వాటిలో చాలా పరిశ్రమలు నిలవగలవు, పనిచేయగలవు. ఇంకా కొత్తవానినికూడా పరిస్థితుల ననుసరించి స్థాపించి జయప్రదంగా నడపవచ్చు. అందువలన మనం చేయవలసిన దేమంటే, ప్రతిచిన్నపరిశ్రమనీ దాని ఆర్థికపరిస్థితులనుగురించి ఆలోచించకుండా లేవదీయాలని ప్రయత్నించక, ఏయేపరిశ్రమలు జయప్రదంగా నిలిచి పనిచేయగలవో బాగా పరిశీలించి వాటిని వృద్ధిచేసి బలపరచాలి. పెద్దపరిశ్రమలలో ఎల్లాగయితే విచక్షణ చూపి నిలవగలవని తోచిన కొన్నిపరిశ్రమలకే రక్షణ విధానం అవలంబించారో, అల్లాగే చిన్నపరిశ్రమలను బలపరచడంలోకూడా కొంత విచక్షణ చూపించాలి. గ్రామపరిశ్రమకదా అని ప్రతిపరిశ్రమనీ లేవదీయాలని ప్రయత్నిస్తే, అసలు ఉద్యమమే హాస్యాస్పదమవుతుంది గాని మరొకప్రయోజనం లేదు.

౨

గ్రామపరిశ్రమలలో మూడురకా లున్నాయి. వ్యవసాయదారులు తమకు వ్యవసాయపుపనులు లేనిరోజులలో సహాయవృత్తులుగా అవలంబించదగినవి మొదటిరకము. రెండోవి, గ్రామాలలో ఉండే కమ్మరి, వడ్రంగి, కంసాలి, తెలుకులవారు మొదలయినవారు చేసేపనులు. గ్రామాలలోను, పట్టణాలలోను చిన్నపరిశ్రములుగా యేర్పడి, వస్తువులను అక్కడనే ఉపయోగపడడానికి, ఇతరచోట్ల అమ్మకానికికూడా తయారుచేసే నేతపరిశ్రమలాంటివి మూడోతరహావి

మనదేశంలో వ్యవసాయదారునకు సంవత్సరమంతా పని ఉండదు. కొన్నినెలలపాటు ఖాళీగా ఉండవలసివస్తుంది. ఈ ఖాళీరోజులనుగురించి అనేక అంచనా లున్నాయిగాని, రాయల్ అగ్రికల్చరల్ కమిషన్ వారు చెప్పినట్లు, రెండుమొదలు నాలుగునెలలవరకు ఉంటాయని అనుకోవచ్చు. ఈరోజులలోకూడా కొన్ని యితరపను లుంటూనే ఉంటాయి — యెరువు తోలడం, బళ్లు కట్టడం, ఇళ్లు నేయించుకోడం, పశువులను చూసుకోడం మొదలయినవి. మదరాసు బ్యాంకింగు విచారణసంఘమువారు, మెట్టప్రదేశాలలో తప్ప మిగిలినచోట్ల ఈ విశ్రాంతికాలం అంతగా ఉండదంటారు. పైగా, పాలేళ్లని పెట్టి పనిచేయించే పెద్దరయితు గృహపరిశ్రమలంటే లెక్కచేయడనీ, ఇంక చిన్నరయితుగాని ఇతర పరిశ్రమలుకూడా అవలంబిస్తే అసలు వ్యవసాయం పాడుచేస్తా డనీ వారి అభిప్రాయం. వ్యవసాయ పరిశ్రమమీదనే చాలామంది ఆధారపడియుండడం, అందువలన అందరికీ తగినంతపని లేకపోవడం - ఈస్థితి వ్యవసాయాభివృద్ధివలన, ఇతరపరిశ్రమలలోనికి కొందరు ప్రజలు చేరిపోవడంవలన మారవలసినదేకాని, సహాయవృత్తులవలన కాజాల దని అగ్రికల్చరల్ కమిషన్ వారు , వ్రాసి

యున్నారు. సహాయవృత్తులు కొన్ని చోట్ల కావలసినవే: కాని గ్రామంలోనే కొద్దిపెట్టుబడితో ప్రారంభించి, వ్యవసాయపు రోజులలో మానేసి మిగిలినరోజులలో పనిచేయదగినదయుంటే, లాభదాయకమైన పరిశ్రమలు దొరకడమే కష్టం.

పండించినవస్తువులను ఉపయోగానికి తయారు చేయడం - అనగా ధాన్యం దంపడం, ప్రత్తి విడదీయడం, నూనెతీయడం వగయిరాపనులు సహాయవృత్తులకు తగినవి. కాని, ఈపనులు చేసే బియ్యపుమరలు, పింజిమరలు, మొదలయినవి గ్రామాలలోకూడా ప్రాకిపోయినవి. దంపుడుబియ్యం ఆరోగ్యానికి చాలా అవసరమని సర్వించి ప్రచారంచేస్తూ ఉండడంవలన బియ్యపు మరల ప్రాబల్యం కొంత తగ్గిపోవచ్చును. ఇంకా పాలు, వెన్న, నెయ్యి తయారుచేయడం, జాతిపశువులను పెంచి అమ్మడం, కోడిగుడ్లపరిశ్రమ, తేనెటీగలను పెంచడం, కూరగాయలు కాపించడం మొదలయినవి సహాయవృత్తులుగా పనికివస్తాయి; వ్యవసాయంతో అవలంబించదగినవే. కాని పట్టణాల చుట్టుప్రక్కల తప్ప, తయారయినవస్తువులు అమ్మకంకావడం కష్టము. రైలుఖర్చులు బాగా తగ్గించి, దూరదేశాలలోకూడా అమ్ముకోదగిన పరిస్థితులు ఏర్పరిస్తేగాని యీపరిశ్రమల వలన లాభము రాదు.

కాంగ్రెసువారు గట్టిగా ప్రోద్బలముచేస్తున్న సహాయవృత్తి నూలువడకడం. రాష్ట్రప్రభుత్వాలు ప్రస్తుతి మీవృత్తికి విరాళాలుకూడా యిస్తున్నాయి. కాని, ఈపరిశ్రమ శాశ్వతంగా నిలిచేది కాదు. చేతితో నూలువడకడంవలన కలిగేఉత్పత్తి మిల్లులఉత్పత్తితో పోల్చిచూస్తే అతిస్వల్పం ప్రస్తుత మవలంబింపబడిన రోజు ౧-కి ౦-౩-౦ కూలిప్రకారం ఖద్దరుధరలు బాగా పెరిగిపోయినవి నేతబట్టల ధరలకంటెకూడా ఇవి చాలా యెక్కువ. రాజకీయ కారణాలవలన ఖద్దరు అమ్మకం హెచ్చు అవుతున్నది ; కాని ధనవంతులు, మధ్యతరగతులవారు, పట్టణవాసులు మాత్రమే ఖద్దరు బట్టలు కొంటున్నారు.

"అయితే, రైతుకి ఖద్దరు కొనవలసిన అవసరమేమి? తనకి మరోపని ఏమీ లేనప్పుడు నూలువడుకొక్కాలి నేయించుకోలేడా?' అని అడుగవచ్చు. ఏమీ పని లేనప్పుడు ఖాళీగా కూర్చునే బదులు నూలువడుకోవడం మంచిదే. కాని, అందువలన రైతుకి మిగిలే దెంత? నేతగాని కిచ్చే కూలిమీద కొన్ని అణాలు బేరమాడితే తయారయినపంచెలచాపే వస్తాయంటే, అందు నిమిత్తం నూలువడుకుతూ కూర్చునే దెవరు? అణాలు దమ్మిడీలు లెక్కపెడుతూ డబ్బు మిగిల్చే శ్రద్ధయే రైతుకుంటే మిగల్చడానికి పద్ధతులు చాలా ఉన్నాయి — చుట్టలు కాల్చడం మానెయ్యవచ్చు; జట్కెక్కడం మానేసి కాలినడకనో, బండిమీదనో, పడవమీదనో ప్రయాణంచేయవచ్చు; దెబ్బలాటలలో కోర్టుల కెక్కడం మానవచ్చు; కార్యాలలో ఎంతయినా ఖర్చు తగ్గించవచ్చు; ఇలాంటి వెన్ని లేవు? అందులో ఒకటయినా చేస్తున్నాడా రైతు? అలాంటప్పుడు, కొలది డబ్బులు మిగిల్చేనిమిత్తం రాట్నం తిప్పుతూ కూర్చోమంటే ఏరైతుకి నచ్చుతుంది? తమ అవసరాలనిమిత్తం తాము ఖాళీసమయంలో నూలువడుకోమంటే బాగానే ఉంది; కాని ఇది రైతులకు పెద్దలాభం కనపడని పని గనుక నచ్చదు. ఇంక పరిశ్రమగా తయారుచేసి అమ్మకం సాగించవలెనంటే ఇది ఎంతకాలమో నిలవజాలదు — నేతబట్టలకంటెకూడా అనేకరెట్లు ఖరీదయిన ఖద్దరుబట్టలను సామాన్యప్రజ లెక్కడ కొనగలరు?

వ్యవసాయంతోపాటు సులకనగా సహాపగలిగినవి, లాభసాటివ్యాపారానికి వీలయినవి అయిన పాలు, నెయ్యి తయారుచేయడం, పశువులను పెంచి అమ్మడం మొదలయిన వృత్తులే సహాయవృత్తులుగా ప్రోత్సహించడానికి బాగా తగినవి. పట్టుపురుగులను పెంచి పట్టునూలు తీయడంకూడా లాభకరమైన సహాయవృత్తియే. కాని, ఇమిటేషన్ పట్టు రావడంవలన అసలుపట్టువస్తువుల అమ్మకం బాగా తగ్గిపోయింది. ఈపరిశ్రమ లాభకారిగా ఎన్నాళ్లు నడుస్తుందో చెప్పలేము.

ఇంక గ్రామాలలోని పనివారిసంగతి ఆలోచించాలి. ఏగ్రామాని కాగ్రామం స్వయంసంపూర్ణంగా ఉండేరోజులలో ఈపనివారు గ్రామస్థులకు చాలా అవసరంగా ఉండేవారు. రోడ్లు, రైళ్లు, బండ్లు, బస్సులు వచ్చి దేశాన్నంతా ఒకటిగా చేసిన యీరోజులలో

పరిస్థితి చాలా క్షీణించిపోయింది. విదేశాలనుంచి, పట్టణాలలోని కర్మాగారాలలోనుంచి వచ్చేవస్తువులు వీరు తయారుచేసేవస్తువులను చాలావరకు తొలగించివేశాయి. కుమ్మరివాని కుండలకుసహా అల్యూమినియం వస్తువులపోటీ; మాదిగవాడు తయారుచేసే చెప్పులకు కంపెనీజోళ్లతోను, కాన్వాసజోళ్లతోను పోటీ.

అయినప్పటికీ ఈపనివారింకా నిలవగలిగే యున్నారు. ఇంత విస్తారమైన దేశంలో గ్రామాలలో ఏదో పని తమలుతూనే వుంటుంది. ప్రతిచిన్నపని కోసం పట్నానికి పోలేరుకదా! కొత్తపరిస్థితులకు తగినట్లు తమపద్ధతులు మార్చుకొని ఫ్యాక్టరీలలో తయారయిన రేకులు, ఇనపకడ్డీలు, ప్లైవుడ్ చెక్కలు, మేకులు మొదలయిన సామానుల నుపయోగించి కొలాను సుణ్యముగా వస్తువులను తయారుచేయవచ్చును. చిన్న చిన్న యంత్రాలనుకూడా వాడుకచేయవచ్చు. విద్యుచ్ఛక్తియే గ్రామాలకుకూడా సప్లయి అయి చవుకగా దొరికితే దానివలన చిన్నయంత్రాలను నడిపి పనిచేయవచ్చు. ఈయంత్రాలు బాగుచేయడం, వ్యవసాయదారు లుపయోగించే పనిముట్లకు యంత్రాలకు కావలసిన భాగాలు అమ్మడం మొదలయిన పనులుకూడా చేయవచ్చు. వీరికి ముఖ్యంగా కావలసినవి నవీనయుగానికి కావలసినట్లు వస్తువులను తయారుచేసే ఊహలు, ఆలోచన, పారిశ్రామికవిద్య.

ఇంక మూడోతరహా గ్రామపరిశ్రమ లున్నాయి. ఇవి గ్రామాలలోనే కాక చాలా పట్టణాలలోకూడా వ్యాపించియున్నాయి. ఈపరిశ్రమలలో పనిచేసేవారు తమయిండ్లలోగాని యజమానుల కార్ఖానాలలో కూలికిగాని పనిచేస్తారు. సాధారణంగా 'గృహపరిశ్రమ' లనుసరించి వ్యవహరించేవారు వీనినే ఉద్దేశించి మాట్లాడతారు. వీటన్నిటిలోనికి ముఖ్యమైనది చేనేతపరిశ్రమ. ఇటువంటి వింకా చాలా ఉన్నాయి — ఇత్తడి, రాగి, కంచుపాత్రల పరిశ్రమ; పలక, రాతిపని; కఱ్ఱపని; వెదురు, పేము, తాటాకు వగయిరాపనులు; లక్కసామాను; జలతారుపరిశ్రమ; తివాసీనేత; దంతపుపని; — ఇంకా యెన్నో ఉన్నాయి. ఒక్క మన మదరాసురాజధానిలోనే ఇట్టిపరిశ్రమ లనేకములను గురించి ప్రభుత్వంవారు పరిశోధనచేయించారు. ఈ పరిశ్రమలలో కొన్ని అనేకచిక్కులకు, మిల్లులతీవ్రమైన పోటీకి లోనైకూడా జయప్రదముగా పనిచేస్తున్నాయి. ఇవి తప్పక నిలిచి వృద్ధిపొందదగినవి. నూతనపద్ధతు లవలంబించడం; తగినంత పెట్టుబడిసహాయం; ముఖ్యముగా, పెద్దపరిశ్రమలలోవలెనే కట్టుదిట్టమయిన వ్యాపారనిర్మాణం — వీటిద్వారా ఈ పరిశ్రమలను చాలా వృద్ధిచేయవచ్చును.

ఈ పరిశ్రమలకు ఉదాహరణగా చేనేతపరిశ్రమను తీసుకోవచ్చును. ౧౯౩౨-వ సంవత్సరపు లెక్కల ప్రకారం మన మదరాసురాజధానిలోనే ౩,౫౯,౮౫౧ మగ్గాలు పనిచేస్తున్నాయని అంచనావేయబడెను. ౧౯౩౫-వ సంవత్సరపు లెక్కల ప్రకారం, ౩౫,౦౦౦ లక్షలగజాల వస్త్రములు మిల్లులలో తయారవుతుండగా, ౧౬,౦౦౦ లక్షలగజాలు (దాదాపు మిల్లు బట్టలో సగం) చేతిమగ్గములపై తయారవుతోంది. ఒక్క మన రాజదానిలోనే చూస్తే మిల్లులలో తియారయ్యే బట్టకంటె చేతిమగ్గాలలో తయారయ్యేదే అనేకరెట్లెక్కువ. మిల్లులపోటీవలన బాధపడుతున్నా ఈపరిశ్రమ తీసిపోక ఉత్పత్తి యెక్కువచేస్తూ అనేకకుటుంబాలకు జీవనోపాధి కలిగిస్తోంది. ఇల్లాగ ఈపరిశ్రమ నిలవడానికి నేతపనివారు తక్కువ కూలికే పనిచేయడం, వారిమగ్గాలు మొదలయిన పనిముట్లకు అంతగా పెట్టుబడి అవసరంలేకపోవడం, పల్లెటూరి ప్రజలకు కావలసిన ముతకబట్టలు, ప్రత్యేకరకపు చీరలు, సన్నివస్త్రాలు మొదలయినవి నేతపనిలోనే తయారుకావడం, ఈవస్త్రాలమన్నిక మొదలయినవి కారణాలు. ఇట్టిపరిశ్రమలు ఇంకా అభివృద్ధిలోనికి రాకపోడానికి కారణా లీక్రిందివి:—

(౧) పెట్టుబడి చాలకపోవడం.

(౨) షాహుకార్లు, దళారీలు పనివారిని చేతిలో నుంచుకొని లాభమంతా లాగివేయడం.

(3) షాహుకారుకి పనివాడు ఋణగ్రస్తుడై, ఆ ఋణాన్నుంచి తప్పించుకోలేక బానిసగా పడియుండి ఆషాహుకారు కిష్టమయిన షరతులమీదనే పనిచేయడం

(౪) పనివారికి చదువు, పారిశ్రామికవిద్య లేక క్రొత్తపద్ధతుల నవలంబించలేకపోవడం.

(౫) త్రాగుడు మొదలయిన దురభ్యాసాలు.

(౬) ఉత్పత్తిచేసిన వస్తువులను అమ్ముకోడానికి తగిన యేర్పాట్లు లేకపోవడం.

(౭) పరిశ్రమలను లాభసాటిగా నడిపే వ్యాపార దక్షత లేకపోవడం.

మిగిలిన అన్నిచిక్కులకంటె అమ్మకపుచిక్కే యెక్కువది. ఉత్పత్తి యెక్కువచేయగలంకాని, లాభం వచ్చేలాగున ఈ వస్తువులను విడుదలచేయవద్దా? పనివారు తక్కువ వసూలికే సంతృప్తిపడడంవలన పరిశ్రమలు చిన్నవయినా తక్కువధరలకే వస్తువులు తయారుచేయవచ్చు. కాని ఆవస్తువులన్నీ సరియైననాణ్యం ఉండేలాగున చూడడానికి, వాటిని ప్రకటించి ఏజంట్లను పెట్టి అమ్మక మయ్యేలాగున చూడడానికి, పనివారికి కావలసినసరుకులు, డబ్బు అడ్వాన్సు యివ్వడానికి (పెట్టుబడికి) చిన్నగృహపరిశ్రమలలో సదుపాయాలు లేవు. వీటన్నిటిలోను ఫ్యాక్టరీపరిశ్రమలకే సదుపాయము లున్నాయి. మదరాసు బ్యాంకింగు విచారణసంఘమువారీక్రిందివిధముగా వ్రాశారు :—

"అన్నిటికంటె ముఖ్యమైనది అమ్మకపుసమస్య. ఎక్కడికక్కడనే ఉపయోగపడడంనిమిత్తము ఉత్పత్తి యెక్కువచేసి ప్రయోజనం లేదు. పల్లెటూరిప్రజలకు కొలదిగానే నేతబట్టలు కావలసియుంటాయి. నేతపనివారు ఎక్కువగా ఉత్పత్తిచేసి ఇతర చోట్ల అమ్ముకోవాలంటే, సహకారపద్ధతులమీద విక్రయసంస్థలు స్థాపించి పనిచేయవచ్చు. కాని, అల్లాగయితే ఉత్పత్తి చేసే వస్తువులు గ్యారంటీగా రకానికి రకం సరిపోయేవిగా ఉండాలి, నాణ్యం తప్పకుండా ఉండాలి."

అంటే యేమిటి? పనివారికి పెట్టుబడి పెట్టడానికి, వారు చేసేపనులు సక్రమంగా జరిగేలాగున చూడడానికి, నాణ్యం, రకం చెడిపోకుండా చూడడానికి, వస్తువుల నన్నిటిని చేర్చి ప్రచారంచేసి అమ్మించడానికి, బాధ్యతవహించి అజమాయిషీ చేయడానికి ఒకసంస్థ కావాలన్నమాట. ఏటువంటివస్తువులకు గిరాకీ ఉంటుందో, ఎల్లాంటిరకాలు తయారుచేస్తే కొంటారో గమనించి తెలుసుకొని అల్లాంటివే పనివారిచేత తయారు చేయించాలి. ఇవన్నీ చేసేపెద్దసంస్థలు లేనిదే పనిజరగదు. అటువంటిసంస్థ గనుకనే అఖిలభారత చరఖాసంఘం ఖద్దరుపరిశ్రమను బాగా నడపగలుగుతోంది. అట్టి సంస్థవలన వ్యాపారం ఎంతబాగా జరుగగలదో, ప్రతిచిన్న పట్నంలోను వ్యాపించి అమ్మకం సాగిస్తున్న "బాటా" వారి జోళ్ళవ్యాపారం చూస్తే తెలుస్తుంది.

కనుక, వస్తువుల ఉత్పత్తి గృహపరిశ్రమలద్వారా జరిగినా, పెట్టుబడి, అజమాయిషీ, అమ్మకం, ఇవన్నీ కేంద్రీకరించక వీలులేదు. ఇవన్నీ చేస్తున్నాడు కనుకనే సాహుకారు ఈ పరిశ్రమలలో సర్వాధికారి యైనాడు. ప్రభుత్వమువారిచే ఈ పరిశ్రమల పరిశోధనకు నియమింపబడిన అధికారి, "తట్టలూ బుట్టలూ అల్లడంలాంటి బొత్తిగా చిన్నపనులలో తప్పితే మిగిలినవానిలో సాహుకారు (దళారీ) లేకుండా పనిజరగదు" అని నిశ్చయంగా వ్రాసివేశాడు.

ఈ పరిశ్రమల అభివృద్ధికి సహకార క్రయవిక్రయసంఘములు స్థాపించి వానిలో పనివారందరిని చేర్పించి అంతా కలిసి పనిచేసేలాగున చేయాలని అనేకమంది అభిప్రాయము. ప్రభుత్వమువారు తామితర విధాల (పారిశ్రామికపాఠశాలలు నడిపి, క్రొత్తపద్ధతులు ప్రదర్శించి, సలహా లిచ్చి, పెట్టుబడికి అప్పు లిచ్చి) చేస్తున్న సహాయంకాక సహకారసంఘాలు నెలకొల్పి పనిచేయించడానికి చాలా ప్రయత్నాలు చేశారు, చేస్తున్నారు. కాని, ఈ సంఘా లేవీ ఇదివరలో సరిగా పనిచేయలేదు. చేనేతపరిశ్రమకొరకు ఇప్పుడు రాష్ట్రానికంతటికి ఒక కేంద్ర సహకారసంఘం ఏర్పరిచారు. ఈ సంఘానికి ఇండియాగవర్నమెంటువారిచ్చిన విరాళంలోనుంచి ధన మిచ్చి, నేతపనివారి సహకార సంఘాల ద్వారా అనేకవిధాల పనివారికి సహాయంచేయాలని ఆలోచిస్తున్నారు.

ఇతర దేశాలు కొన్నిటిలో పారిశ్రామికులు సహకారసంఘాలుగా యేర్పడి పెట్టుబడిదారుల బాధ నుండి తప్పించుకొని వృద్ధికాగలిగినారు. కాని ఈ ఉద్యమం మన దేశములో సంతృప్తికరముగా పనిచేయ

లేదు. ఇందుకు కారణాలు అనేకమున్నాయి:— పని వారి వస్తుత్వము, దారిద్ర్యము, గురాశ, నైగ్గడానికి అవకాశములేని పరిశ్రమలలో ప్రయత్నంచేయడం, అన్నిటికంటె ముఖ్యమైనది, సంఘాలు స్థాపించినా వానిలో అనుభవజ్ఞులు, వ్యాపారదక్షులు, విశ్వాస పాత్రులు అయిన కార్యనిర్వాహకులు లేకపోవడమే. సహకారసంఘంస్థాపించగానే వ్యాపారదక్షతవస్తుందా? అదికాక, సహకారసంఘానికి పెట్టుబడి అప్పుద్వారా రావాలి. పరిశ్రమయొక్క పరిస్థితి ఎలా ఉన్నా, ఈ అప్పుమీద మొదటినుంచీ వడ్డీ చెల్లించుకోవాలి. ఇదే సమూలుకంపెనీలలో నయితే, లాభం వచ్చినతరువాతి పెట్టుబడిదారులకి పంచిపెడతారుగాని మొదటినుంచీ వడ్డీ యిచ్చుకోవలసిన అవసరం ఉండదు.

కనుక, అఖిలభారతచరఖాసంఘంవంటి వ్యాపార సంస్థలే నయము. ఒక్కొక్కప్రాంతాని కొకపారి శ్రామికసంస్థ అక్కడి కనువయిన పరిశ్రమల నిమిత్త మేర్పడి, ప్రజలనుండి వాటాలద్వారా పెట్టుబడినిధనం సంపాదించవచ్చును. ప్రభుత్వంవారుకూడా కొన్ని వాటాలు తీసుకోవచ్చు. ఈసంస్థలే, వస్తువులు తయారు చేయడం తప్ప మిగిలిన అన్నికార్యాలు — సరుకులు అద్దాన్నుచేయడం, సక్రమముగా పనిచేయించడం, తయారయినవస్తువులకు ప్రకటనచేసి అమ్మించడం మొదలయిన అన్నిపనులు చేయాలి. ఈసంస్థ లన్నిటికీ పరస్పరసంబంధ మేర్పరిచి, వీలయితే ఇతరప్రాంతాలకు, దేశాలకు ఎగుమతిచేయడాని కొకకేంద్రసంస్థ నేర్పరుపవచ్చును. ఇటువంటి పద్ధతులపై పూర్తిగా వ్యాపారసూత్రాల ననుసరించి, కట్టుదిట్టమయిన నిర్మాణం చేస్తేతప్ప, నిలువగలిగెన గృహపరిశ్రమలయినా తగినంత వృద్ధిలోనికి రాజాలవు.

మనరాజధానిలో అనేకసంవత్సరాలనుంచి పెద్ద పరిశ్రమలతోను, కార్మికసంఘాలతోను సంబంధముకలిగిన అనుభవజ్ఞులను శ్రీ వి. వి. గిరిగారు పారిశ్రామిక శాఖామంత్రిగా ఉండడం మన అదృష్టవశాత్తు తటస్థించినది. వారు పెద్దపరిశ్రమలూ, చిన్నపరిశ్రమలూ కూడా సక్రమంగా స్థాపించాలనే ఉత్సాహముగలవారు. వారినాయకత్వమున దేశంలో పెద్ద, చిన్న పరిశ్రమలను సక్రమమయిన ఒకప్రణాళికప్రకారం విరివిగా స్థాపించుటనుగూర్చి సమగ్రమయినవిచారణ జరిగి ఒక కార్యక్రమం త్వరలోనే ఆచరణలోనికి రాగలదని ఆశించవచ్చును.

వ్యాసవిలేఖకులకు మనవి

వ్యాసాలు ఎనిమిదపుటలకు మించకుండా ఉండాలి. వ్యాసరచన రంజకంగా ఉండాలి. శాస్త్రీయవిషయాలనుగురించిన వ్యాసాలుకూడా ఎక్కువ పరిభాషా, ఎక్కువ వివరాలూ లేకుండా సంగ్రహంగాను, సామాన్యపాఠకునికి విషయం బోధపడేటట్టు సులభంగాను, మనస్సును కథలా ఆకట్టేటట్టు ఆకర్షకంగాను ఉండాలి. శాసనవ్యాసాలు పదిపన్నెండు పుటలకు మించేయెడల రెండుసంచికలలో ప్రకటింపవలసివచ్చును.

దేశాన్ని ఎక్కువగా కలవరపరుస్తున్న సాంఘిక ఆర్థిక, రాజకీయాది విషయాలనుగురించీ, మనఆంధ్రుల ప్రత్యేకసమస్యలనుగురించీ ప్రత్యేకవ్యాసాలు కావాలి. సాధ్యమయినంతవరకు ఎత్తుకునే విషయంలోను, చూచేదృష్టిలోను, రచించేరచనలోను కొత్తదనం కావాలి. మన ఉద్యమాలూ, మనదేశం, మనసంఘం, మనఆశయాలు భారతిలో ప్రతిఫలించేటట్టు చూడవలసిందని వ్యాసకర్తలకు మనవి.—భా. సం.

ప్రాగైతిహాసిక ప్రపంచం - పురాణగాథలు

వేలాల సుబ్బారావు

ప్రాగైతిహాసిక రోమనులలో, గ్రీకుల్లో, బ్రిటిష్ దీవులతో సహా యూరోపుఖండవాసుల్లో, టర్కీ ఈజిప్టుల సమేతం పశ్చిమాశియానివాసుల్లో, భారతీయుల్లో ఒక విధమైన గాథలుండి, పురాణాలుగా తయారైనాయి. మూడునాల్గువందల ఏండ్లక్రిందట యూరోపియనులు భూమి మీద బయలుదేరి వివిధ ఖండాల్లోని దేశాలనూ యుక్తితో శక్తితో వశపరచుకోడం మొదలిడిన నాటినుంచీ రకరకాల మొగాలనూ, రంగురంగుల దేహాలనూ, ఆచార వ్యవహారాలనూ, పరికించి వీనికన్నింటికి ఏదైనా సంబంధం వుందా లేక యథాదృష్టాలేనా యనే జిజ్ఞాసతో పరిశోధనలు చేయడం ఆరంభించారు. ఆ పరిశోధనలకు ఫలితంగా కొంతకాలానికి "నవశిలాయుగపు యూరోపియనులు (Neolithic Europeans), ఈజిప్షియను లమూలపురుషులు (Proto - Egyptians), సుమేరియనులు(Sumerians), దక్షిణపారసీకులు (Southern Persians), ఆర్యహైందవులూ — వీరందరిలో ఒకవిధమైన జాతిసంబంధం (Race kinship) ఉం" దని కొందరు మానవజాతి పరిశోధకులద్వారా తేలింది. కాని దీనిని ఇకయుం దెప్పుడు తిరుగులేని నిర్వివాదమైన సిద్ధాంతమని అంగీకరించడానికి వీల్లేదు. ఇదివరకైనవీ, ఇప్పుడవుతూవున్నవీ తీర్మానాలన్నీ చాలావరకు ఊహాజనితాలే. మొదలుమొదలు భాషాశాస్త్రిల్లో గన్పించిన సామ్యంవల్ల వారందరిలో జాతిసంబంధం వుందన్నారు. కొంతకాలం అదే సిద్ధాంతంగా వెలిగింది. అనంతరం శరీరరచనా, కపాలాస్థిప్రమాణాల పరిశోధకులు బయలుదేరి, ఉపర్యుక్త భాషాసామ్యవాదులను వెనక్కునెట్టారు. కొంతకాలం వీరి యుక్తులూ, ప్రమాణాలూ రాజ్యం ఏలాయి. తర్వాత భూగర్భశాస్త్రవిదులూ, పురాతత్వకోవిదులూ బయల్దేరారు. వీరు పైరెండు ప్రకారాలసిద్ధాంతాలకూ స్వస్తి చెప్పారు. వీరూ తీర్మానాలయితే చేశారుకాని, అవి ఇంతవరకూ అసంపూర్తిగనే ఉన్నాయి. ఉపర్యుక్తజాతులలో వ్యాపించియున్న నాగరికత పడమటనుంచి తూర్పుదేశాలకు ప్రాకిందా, లేక తూర్పునుంచి పడమటికిపోయిందా అనే విషయం ఇంకా వాదవివాదాల్లోనే వుంది. ప్రపంచానికంతటికీ సభ్యతాభిక్ష పెట్టినవారు రోమనులూ, గ్రీకులూ అని కొందరు. అక్కడికంటే ప్రాచీనమైన నాగరికత మెసపటోమియా ఈజిప్టుల్లో గన్పించిందనీ అక్కడనుంచే అది ప్రపంచమంతటా వ్యాపించిందనీ మరికొందరు. అటుపిమ్మట మీదవచించిన ఈజిప్టు, మెసపటోమియాలతో తులతూగగల నాగరికతా చిహ్నాలు సింధునదీప్రాంతంలో వున్న మహెంజోదారోలోనూ, పంజాబులోని హరప్పాదగ్గరను, ఏషియా మైనరునందలి బోగేజ్ కోయివద్దను దొరికినందున సభ్యతాప్రసారవిషయంలో మరికొన్ని సందేహాలు పయికి వచ్చాయి. కాని ప్రస్తుతం ధనం, బలం గలవారిది నోరు. వారేదంటే అదే సిద్ధాంతం. కావున పాశ్చాత్యుల ఫైసలాప్రకారం నాగరికత పడమటినుంచి తూర్పుకు ప్రసరించిందనే. పాశ్చాత్యులను జూచి పూర్వీయులలోనూ కొందరు పరిశోధకులు బయలుదేరారు. వీరి కథనానుసారం సభ్యత తూర్పునుంచి పడమటకు ప్రసరించింది. కాని వీరి వాదనను నమ్మేదెవరు? అసలుపూర్వీయులకే విషయంలో జోక్యం కలుగజేసుకోడానికి వారికంతటి అర్హత ఎక్కడిదీ? ఈ జాతిసంబంధివిసంబంధి విషయాల్లోని వాదవివాదాలతో మనకంతగా ప్రసక్తిలేదు కాని వీరందరిలో ఒకవిధమైన పురాణగాథ లుండేవనడంమాత్రం నిర్వివాదం.

సృష్టి స్థితి లయ విషయాలు, దేవీ దేవతల గాథలు, దివ్యపురుషుల చరిత్రలు, వీరపురుషుల కథలు, సందర్భానుసారంగా మరికొన్ని వృత్తాంతాలూ ఈ పురాణాల్లో వర్ణితాలై ఉన్నాయి. ఈ దేశాలలో పర

స్వరం వందలకొలదిమైళ్ల వ్యవధానం ఉంది. అక్కడి భాషలు వేరు. ధార్మికపరివర్తనం వెయ్యేండ్ల క్రిందటనే అయింది. కాని ఆయా దేశాలలోని ప్రాగైతిహాసిక రచనలైన పురాణాల్లో రచింపబడిన దేవీ దేవతలచరిత్రలందు ఒకవిధమైన సమానత అనుపదముతూవుంది. మన హిందూదేశంలో మాత్రం ఇప్పటికీ ఆకాలపు పురాణాలు నామకయందే వున్నాయి. వానిలో భారత, భాగవత, రామాయణాల కున్న ప్రచారం మరి వేటికీ లేదు వాటిలో వర్ణితాలైన దేవీ దేవతల దివ్యమూర్తులు ఇక్కడి దేవాలయాల్లో స్థాపితాలై నిత్యం దేశీయులచేత పూజాపురస్కారాలను పొందుతూ వుంటాయి. వాని విషయంలో ఎక్కువ వ్రాయడం అనవసరం. ఇవి భారతీయులకందరికీ తెలిసినసంగతులే. పాశ్చాత్యుల పురాణాల్లోనూ దేవీ దేవతలకు తక్కువలేదు. క్రీస్తుపుట్టేటంతవరకూ ఇక్కడిలాగే అక్కడి దేవీదేవతలకూ పూజోపచారాలు జరుగుతూ వచ్చాయి. అనంతరం వాటిప్రచారం క్రమంగా పోయింది. కాని అవి వారి పురాణాల్లోనుంచి రూపుమాసి మాత్రం పోలేదు. మీదుమిక్కిలి వాటిలో ఆదేవీ దేవతల శౌర్యపరాక్రమ సాహసౌదార్యాది ఉత్తమగుణాలన్నీ వర్ణితాలై వున్నాయి. ఆ పురాణాలన్నీ లాటిన్, గ్రీకు భాషల్లో వుండటంవల్ల ఆ భాషలు తెలియని దేశీయుల కందరికిగూడా అందుబాటులో వుండవలెననేకోరికతో వానిని దేశభాషల్లోనికి మార్చుకొన్నారు. అంతేగాక ప్రసిద్ధులైన దేశభాషాకవులనేకులు పురాణదేవీ దేవతలను ముఖ్యపాత్రలనుగా గైకొని స్వతంత్రరీతి కావ్యనాటకాది గ్రంథాలెన్నింటినో వ్రాశారు. మూర్తి పూజకు విరుద్ధమైన మతము నవలంబించి నప్పటికీ, దేవీ దేవతలందరూ 'పాగను'సంజాతులైనప్పటికీ తమ పూర్వీకులు సృష్టించినవాటిని హేయములని నిరసించక ఆయా దేశాలవారు తమ నిమిత్తం వదలిపెట్టిన అమూల్యములైన ధనరాశులనుగా గ్రహించి గౌరవిస్తూ వారియందలి ఉత్తమగుణాలను తమ నిత్యజీవితంలో అనుష్ఠింపజేసుకొంటూ వుంటారు. పెర్సియస్, హెర్క్యులిస్, జాసన్ ఒడిస్సస్ ఇత్యాది పురాణవ్యక్తులవలె తామునూ శౌర్యధనూలూ, పరాక్రమవంతులూ, వీరులూ కావలెననే వీరి హార్దికమైన కోరిక. కావుననే భారతవర్షంలోని గుళ్లూ గోపురాలవలెనూ, వానిలోని విగ్రహాలవలెనూ గాక పోయినప్పటికీ వీరు వీరి దేవీ దేవతలయొక్క చక్కని ప్రతిమలను చేయించి దేశాల్లోని ప్రధానస్థానములందును, విచిత్రవస్తుప్రదర్శనశాలల్లోనూ స్థాపించుకొని యున్నారు. ఇక్కడి దేవాలయాల్లోని మూర్తులను చూచినప్పుడు ఆస్తికబుద్ధికలవారైనయెడల వారి మనస్సులలో శ్రద్ధాభక్తులూ, పూజ్యభావాలూ ఉదయించేలాగు అక్కడ ఆమూర్తులను (Statues) చూడటంతోటే వారి శౌర్యధైర్య పరాక్రమాలు చూపరుల హృదయాల్లో రేకెత్తి విజృంభిస్తూ ఉంటాయి.

ఈపౌర్వ, పాశ్చాత్యమూర్తులు దర్శకులను శుద్ధవేదాంతులనుగాగాని, నితాంత శౌర్య పరాక్రమవంతులనుగాగాని చేయుటలో ఎంతవరకు సాయపడుతూ వుంటాయో ఆయా దేశాల్లోని వర్తమాన పరిస్థితులవలన చదువరులే గ్రహించుకోవాలి.

ఇక పశ్చిమాసియా ఖండంలోని పరిస్థితులు వేరు. పాలస్టయిన్, ఏషియామైనర్, మెసపటోమియా, అరేబియా, అఫ్గానిస్థాన్, బలూచిస్తానులు గల ప్రదేశం పశ్చిమాసియా. దీనితోసహా టర్కీ, ఈజిప్టులు. ఈ భాగంలో ఇప్పుడు ముసల్మాన్‌మతం వ్యాపించివుంది. ఇంత గొప్పవైశాల్యంగల ఈ భూభాగంలో దేవీ దేవతల మూర్తులుగాని తద్విషయక గ్రంథాలుగాని దొరకవు. అచ్చటిగ్రంథజాలం, విద్యాయావత్తూ ఖురాన్ షరీఫుకు ఇటీవల ఏర్పడిందే. అంతకు పూర్వముండిన గ్రంథజాలం యావత్తూ ప్రవక్తవారి యాజ్ఞానుసారం రూపుమాసిపోయింది గ్రంథజాలంలోనివిద్య ఖురాన్ షరీఫుకు అనుకూలంగా వుందా లేక ప్రతికూలంగా వుందా అనే వివేచనే లేదు. అనుకూలంగా వున్నాసరే, ప్రతికూలంగా వున్నాసరే ఆగ్రంథా లవసరంలేదని ఒక తీఉత్తర్వు. గ్రంథం ఖురానుకు అనుకూలంగా ఉంటే అదే ఖురానులో ఉన్నప్పుడు మళ్లీ ఇంకో గ్రంథం ఎందుకు అనవసరంగా? ఇక ప్రతికూలంగా ఉంటే దానిసంగతి అడుగనేఅక్కర్లేదు. వెంటనే చించిపారేయవలసిందే. ఇట్టి విధానం అవలంబించి నందువల్ల మహమ్మదీయ సంప్రదాయంలో ప్రాగైతిహాసికరచన మిగులనేలేదు. ఇక మూర్తులన్నో

వానికి నితాంతనిషేధం. మహమ్మదులవారు మూర్తిపూజను, తద్విషయక గ్రంథాలనూ నిషేధించారు సరే, అంతకువందరెట్లు ఎక్కువకఠినంగా ప్రతిమానిర్మాణాన్ని బహిష్కరించారు. దానిని నొకకళగా గ్రహించి వ్యవహరించుకొంటూ వున్నప్పటికీ కొంతకాలం గడచిపోయినతర్వాత తన దేశీయులు తన ఉద్దేశాలను, ఉపదేశాలనూ మరచిపోయి మళ్లీ దేశాన్ని యావత్తూ మూర్తిపూజలో ముంచి ఎక్కడ నాశనంచేస్తారో అనే భయంచేత దానిని సమూలంగా బహిష్కరించారు. ప్రవక్తవారికి ఇటువంటి భయం కలగడానికి ప్రబలమైన హేతువుకూడా ఉంది మహమ్మదు పైగంబరునుపూర్వం ౯౯మంది పైగంబరులు అవతరించిపోయారు. మొట్టమొదటి పైగంబరు ఆదాం. మహమ్మదులవారు నూరో పైగంబరు. ఒక్కొక్క పైగంబరు అవతరించి సత్యమతప్రచారం కావించి రాయిరప్పలను పూజించడం మాన్పించి ధర్మసంస్థాపనం సలిపి పోతూవుండేవారు. కాని కొంతకాలం జరిగిపోయినపిదప జనులు వారిని మరచిపోవడం, అసత్ పూజల్లోకి దిగి మళ్లీ వెనకటిస్థితికే రావడం, దేశమంతటా కల్లోలం పుట్టించడమూను. ఈ అధర్మం, అన్యాయం తొలగించి మళ్లీ ధర్మసంస్థాపనం చేయడానికి ఇంకో పైగంబరు అవతరించవలసివస్తుండేది. ఈఆఖరు పైగంబరులవారు జన్మించబోతా రనగా, అరేబియా దేశం యావత్తూ మహాభయంకరమైన, శోచనీయమైన స్థితికి వచ్చింది. లెక్కలేనన్ని తెగలు. ప్రతితెగకూ ప్రత్యేకపుదేవుళ్లు ఈ తెగలవారు పరస్పరం కలహించుకొని నిరంతరం దేశాన్ని రక్తపాతమయం చేసుకుంటూవచ్చారు. అందువల్ల శాంతి సుఖాలు ఆదేశంలో లేకుండా పోయినాయి. ఈ తెగలవారి కందరికీ మరల సఖ్యభావం కుదిర్చి, దేశంలో రక్తపాతం అనేది లేకుండా చేయాలనే దృఢమైన సంకల్పంతో, తమ పూర్వపు పైగంబరులలో వారు చేసిన కట్టుదిట్టాల్లో గల లోపాలను గరిపట్టి, అట్టివి తమయనంతరంకూడా జరగకుండేలాగు నియమాలుచేశారు మహమ్మదులవారు; ఏకేశ్వరోపాసన బోధించారు. కళావృద్ధికోసంగాని, ఉదరనిర్వాహకానికి వృత్తిగా పెట్టుకొనిగాని ప్రతిమానిర్మాణం ఎంతమాత్రం పనికిరాదని శాసించారు. అందుచేత పశ్చిమాసియాఖండం సమస్తం పైకి కనుపడేటంత వరకు ఏవీ దేవతల విషయంలోగాని, పెద్దపెద్ద వైవ మూర్తుల విషయంలోగాని ఒక పెద్దమార్పుగా పరిణమించింది. ప్రస్తుతం కురాన్ షరీఫ్‌కు విరుద్ధార్థాలు గల ధర్మగ్రంథాలుకాని, మసీదులుతప్ప దేవాలయ, వైవ శిల్పాగారాలు కాని ఈ పశ్చిమాసియా భాగంలో కల్పించవు.

ఈ విషయాలన్నింటినీ దీర్ఘంగా సూక్ష్మంగా పర్యాలోకించిచూస్తే అత్యంతప్రాచీనకాలంలో ప్రపంచమంతటా ఒకవిధమైన మూర్తులూ, మూర్తిపూజలూ ఏర్పడియున్నట్లునూ, వాటిలో లెక్కలేనన్ని యవకలవకలు, దురాచారాలు, దుర్మార్గాలు జనించి లోకులను కలవరపరుస్తూ వుంటే వాటిని రూపుమాపడానికి ఎందరో మహానుభావులు ప్రయత్నించినట్లునూ, అందుమొట్టమొదటి ప్రయత్నం అసలు భారత వర్షంలో పుట్టిన బుద్ధునిది, రెండోది క్రీస్తుకావించినది. ఈ రెండింటివల్లా తగినంత ప్రతిక్రియ గానరాక తన దేశీయు లింకా విగ్రహాల్లోనూ, తెగల్లోనూ బడి కొట్టుకొంటూవుంటే మహమ్మదులవారు దానిని మహాతీవ్రంగా ప్రతిఘటించి పారదోలడానికి యత్నించినట్లు స్పష్టమవుతుంది. అందుచేతనే వీరు అసలు ప్రతిమా నిర్మాణాన్నే నిషేధించారు. కాని భూగర్భంలో ఏమున్నదీ ఎవరికి తెలుస్తుంది? అప్పటికి పురాతత్వవేత్తల త్రవ్వటాల ప్రసంగమే లేదాయె. కాబట్టి పైగంబరులవారీ విషయంలో ఎట్టి ఆజ్ఞలనుగాని ఇచ్చియుండలేదు. అస్తు.

ఆధునికయుగంలో యూరోపియను పురాతత్వవిదులు బైలుదేరి ఏషియామైనరులో, మెసపటోమియాలో, బాబిలోన్ అస్సీరియాల్లో, అఫ్గానిస్తానంలో, ఈజిప్టులో చారిత్రకప్రదేశాలు త్రవ్వటం ఆరంభిచారు. తత్ఫలితంగా గ్రంథాలు, గ్రంథాలయాలు, దేవాలయాలు, ఆకొలపునాణేలు, శాసనాలేకాదు గ్రామాలు, నగరాలుసైతం భూగర్భంలోనుంచి పైకి వస్తున్నాయి. వీటివల్ల అదివరకున్న చరిత్రే మారిపోయింది. పాలస్టయిన్, అస్సీరియా, మెసపటోమియాల్లో త్రవ్వటాలు కాకపూర్వం బైబిలులోని వ్రాతలన్నీ పుక్కిటి పురాణాలనీ, అందులోని పేళ్లన్నీ పిచ్చివాళ్ల కేకలనీ

అంటూవచ్చారు. కాని ఉపర్యుక్త ప్రదేశాల్లో వెల్వడిన వస్తుసముదాయంపూలాన్ని బైబిలువ్రాతలు సత్యమైన ఇతిహాసాలని విశదమైంది. ఈజిప్టులోని నైలు నదీతీరంవెంట భూమిని త్రవ్వగా ఎన్నిగ్రామాలో బయటపడ్డాయి. మెసపటోమియాయందలి యూఫ్రటీస్, టైగ్రిస్‌నదీపరిసరాల్లో ఎన్నో గ్రామ నగరాలు వెలికివచ్చాయి. ఏషియామైనరులో బోగాజ్‌కోయి దగ్గర ప్రాక్ - మహమ్మదీయయుగంలోని వస్తువులు మెసపటోమియాలో దొరకినవాటితో పోలికలుగలవి లభించాయి. మరియు నచట లభించిన శాసనాలవల్ల అక్కడి ప్రాచీనజాతులైన మిటన్నీలకూ ఆర్యహైందవులకూ సంబంధం వున్నట్లు తేలింది. వైదికయుగానంతరం హిందూదేశంలోవర్ధిల్లిన పురాణరచనకూ, సుమేరియా, బేబిలోనియా, ఈజిప్టులలో వెల్వడినవ్రాతలకూ పోలిక లున్నట్లు దృష్టాంతాలు దొరికాయి. గ్రేటుబ్రిటన్, హిందూదేశ నివాసులలో ఆచారసామ్యం ఉండేదనేటందుకు నిదర్శనాలు దొరికాయి. ప్రాచీనకాలపుగ్రీసులో హిందూదేశంలో ధర్మకార్యాలసామ్యం ఉండేదనడానికి తగినపరికరాలు లభించినాయి. ఈజిప్టులోని హోరసుకూ, హిందూదేశంలోని ప్రజాపతికీ జన్మస్థాన సమానత్వం ఉంది. వీరిద్దరూ పద్మగర్భసంజాతులు. హిందూదేశపు పురాణాల్లో వర్ణింపబడిన రాజులపేర్లలో కొన్ని పశ్చిమాసియాఖండపు శాసనాలలో గన్పడడంచేత వీరందరు ఆప్రాంతవాసులా లేక భారతీయులాయని కొందరు సందేహపడవలసివచ్చింది. కొంత పురాణరచన ఆ పశ్చిమదేశంలోనే జరిగివుండవచ్చు నని కొందరి వాదన. కాని ఇంతవరకు ఇవి పాశ్చాత్యుల వూహాలే గాని సిద్ధాంతాలుమాత్రం కాదు.

మొత్తంమీద ఈ పురాణాల్లో రెండురకాల రచనలు గన్పిస్తున్నాయి. సహజం, జ్ఞానదాయకం, వివేచనాయుక్తం, న్యాయం, సయుక్తికం, యథార్థమైనరచన కొంత. అందులకు సరీగ్గా విపరీతమైనరచన కొంత. ఇంద్రుణ్ణి స్వర్గాధిపతిగా, సకలదేవతాపాలకుడుగా, ఐశ్వర్యవంతుడుగా, న్యాయపరిపాలకుడుగా, యజ్ఞయాగాదుల జేయించువాడుగా తత్ఫలప్రదాతగా వ్రాస్తే అట్టిరచన సహజమూ, న్యాయోపేతమూ అయింది. కాని, అంతటి ఉచ్చపదాధికారమందున్న దేవతా చక్రవర్తిని హీనుణ్ణిగా, వ్యభిచారిగా, ఈర్ష్యాగ్రస్తునిగా తయారుచేసి, అహల్యతో అనుచితమైన పొందు కల్పించడం అసహజం, అన్యాయం, అయుక్తికం. ఇటులే గ్రీకుపురాణాల్లో జ్యూస్, జూనోలనుగురించీ న్యాయాన్యాయాలైన వ్రాత లున్నాయి. ప్రాచీనులిట్టివ్రాతలను విమర్శించక దేవతామూర్తులనే బుద్ధితో సేవిస్తూవచ్చారు. ఇప్పటిరోజులు వేరు. విమర్శకులెక్కువ. కొలదిమందిమాత్రం వానిమీద గల అభిమానంచేత సమర్థిస్తున్నారు. వారిసమర్థనలు చాలవరకు న్యాయంగానే కనుపడుతాయి. అవీ ఆలోచించదగినవే, చూడండి. వేదాల్లో గల వైజ్ఞానికవిషయాలు పురాణగాథలుగా మారినప్పుడు ఇట్టి అస్వాభావికాలు ఏర్పడుతూవుంటాయి. ఆయాగాథలను చదువుకొనేటప్పుడు అందలి వైజ్ఞానిక సిద్ధాంతాలను మనస్సులో బెట్టుకొని చదివినయెడల అవి అస్వాభావికంగా, అనుచితంగా గన్పించవు అని కొందరు. పురాణాల్లోని స్వభావసిద్ధాలైనవ్రాతలే అసలైన యథార్థరచనాలు; తక్కినవి హిందూమతవిరోధులైన బౌద్ధ, జైన, చార్వాక, వామమార్గ శాక్తేయులచే కల్పింపబడి హిందువులకు అపకీర్తి దెచ్చుటకు, కళంకను నాపాదించుటకు పురాణాల్లో ప్రక్షిప్తముచేయబడినవి. వీటివల్ల వీని కిట్టి దుర్గతి సంభవించినది అని మరికొందరు. ఏది ఎట్లున్ననూ గాథలందు అనేకపరమార్థములైన విషయములు కలవు. మనోహరంగా కూడా వుంటాయి.

—— * ——

రాజవోలుశాసనము మూలము

ఒంగోలు వెంకటరంగయ్య

మొదటి రేకు: రెండవ ప్రక్క

శ్రీమాన్వాహా దేవో జయాతి

౧. స్వస్తి శ్రీవిజయాభ్యుదయశాలివాహనశకాజాః ౧
౨. తమ [1]త్రయక్షేయం గుణలేశ భానునా । తత్ర దుమర్తినామా
౩. బ్దే రాధా పూర్ణిమసంయుతే । సోమవారయుతా సోమగ్రహోపేతా
౪. శుభప్రదా ॥ తత్రపర్వణీ సంగస్య సంగమేశ్వర సంనిధౌ ॥
౫. రాజాధిరాజశ్రీరాజాః నవకోటిధనుర్ధరః[2] । కలబరగ[3]
౬. దేశకర్నార కర్ణగనామధీశ్వరః ॥ శ్రీవీరరుద్రదేవో
౭. యంగజరాడ్విభవోత్తమః । నరసింహప్రతాపేనా ఉదయా[4]చె
౮. లభూమిషు ॥ లబ్ధేష్టవిభవౌ నత్వా దుదయా[4]చెలపూర్వతః
౯. కిరాతనాం గ్రామతికా[5] మార్ధ్యే శోభసమన్వితః ॥ రాజవో
౧౦. లు మహాగ్రామే ముంమటి[6]యాతనూద్భవాః ॥ గణికాద్యష్ట[7]
౧౧. భోగానాం హిరణ్యోదకపూర్వకం ధత్తవానఃపవోటాక్యా
౧౨. వంశే జాతాయ ధీమతే । నరసింహస్యాన్త్రోతు పౌత్రాయ గు
౧౩. ణశాలినే । సర్వభరశ్యచ తథా సేమభరసుతా
౧౪. యచ । నారాయణాభిధానాయ । నన్నం[9]భట్టాయ చ స్వతః ।
౧౫. తత్రభూదానశాసనక్రమః ॥ తత్ర విఘ్నేశ్వరస్తుతిః ॥
౧౬. వందే గజేంద్రవదనం విఘ్ననాశన మవ్యయం ॥ స
౧౭. ర్వదేవ శిరోరత్నం నీరాజిత పదద్వయం ॥ బ్రహ్మస్తుతిః ॥
౧౮. చతుర్ముఖారవిందైస్చ చతుర్వర్ణానుపాలనం ॥ చరాచర
౧౯. జగద్వంద్యం బ్రహ్మాణం ప్రణమా మ్యహం ॥ సూర్యస్తుతిః ॥ రాజీవ
౨౦. రాజీవర చెంచరీక ఝుంకారనిర్వర్తిత వంద్య కృత్యః ॥
౨౧. భూభృతటాంతే తిలకామలంఘ్రిః జగత్ప్రదీపో భగవాం వి
౨౨. వస్వార్ ॥ తస్యాన్వయే భు మ్నహనీయకీర్తి యిక్ష్వాకునా

మొదటి రేకు: రెండవ ప్రక్క

౨[10]

రెండవరేకు : మొదటిప్రక్క

౧. మాకులశైలసారా [11] యదీయబాహా అవ
౨. లంబ్య భూమిభోగేంద్రభూమిం శిథిలం చకార।
౩. య స్యన్వయే భూకపిలేశరాజం కరేంద్రకర్ణానిలకం
౪. పితారిః॥ యద్దత్తవేలాకపయోంభుధిభ్యః ప్రజానురాగ
౫. ఘిలరత్నగర్భాః।యద్ఘోరభేరీరవదీర్ణకర్ణాః ప్రత్యర్థి
౬. భూపాః కటకా చలంతి॥ చలాయభుక్షు[12]ః కటకేష్వన
౭. స్యాః। యదియయాత్రాసు పురోగతానాం తురంగమాణాం ఖురపా
౮. పాటితాయాః ధారేణభూమే రవసన్నమూర్ధా శేషోపి యస్మై న
౯. తి మాతనోతి హానుగ్రహో శ్రీపురుషోత్తమస్య యదియ
౧౦. సూను జనకా ద్బభూవ॥ఆకారసామ్యా పురుషోత్తమస్య
౧౧. చక్రే కుమారం పురుషోత్తమాఖ్యం॥ పురుషోత్తమఖేం[13]ద్రస్తు
౧౨. శత్రూణా మఖిలంఘనం చక్రె సర్వం మహాచక్రం ధర్మేణ
౧౩. పరిపాలయంన్న॥ [14]యిచామి సప్తార్ణవమేఖలాయా మవా
౧౪. ప్తసవర్ణస్యాగుణాభిర్ముష్టః॥ భూపాలనార్థం పురుషో
౧౫. తమస్య। తన్వో భవోభూ తరుణేందుమాలిః॥ ప్రతాపరుద్ర
౧౬. భూపోయం ప్రతాపేనాక్రమం జగతు ప్రతాపవంనినా శా
౧౭. మ్య చ్యత్రుకాంతార మోజశ్శా తతో భూదేవదేవాం చ్ఛా పాల
౧౮. య న్నవనీతలం రరాజ హేలయా సార్ధం ప్రతాపోదితభాస్క
౧౯. రా [15]ననాదిగంతభూపాలైః అర్పితం రత్నభూషణం దిగ్జైత్రయా
౨౦. త్రసమయె సంగమేశ్వరసంనిధౌ స్నాతః పినాకినీనద్యాం
౨౧. భూదాన మకరో న్ముదా॥ ప్రద్యోతోదయభూదరేంద్రనగరీం
౨౨. ప్రాచ్యాం ప్రజావర్ధనీ నిత్యానందనిపాదభృందనిలయే
౨౩. శ్రీపైడిపాడోత్తరే॥ శ్రీరాజాంబపురాభిధాగురుతరా
౨౪. మేఘూ[16]నదీయోతరే దతా వీరప్రతాపరుద్రవిభునా
౨౫. ధాత్రీసురాణాం పురః। శాకాబ్దే గుణలోచనార్క
౨౬. సహితే సంవఛరే దుర్మతౌ రాహుగ్రస్తవిధౌ బహుప్రక

శిలాఫలకము : మొదటిప్రక్క

రెండవరేకు : రెండవ ప్రక్క

౧. టితో వైశాఖమాసే ముదా। దత్తం శ్రీ గజ
౨. రాట్ప్రితాపవిభవా శ్రీ వీరరుద్రేణ యతః భూదేవా
3. త్పదాదాహారంతీ నితరా మానందసంధుక్షితా । [17]శ్రీ
౪. వత్సగోత్రసంభూతో సోమాభటతనుదభవ । నారా
౫. యణో యజుర్వేదీ త్రితీ[18]చ్ఛధార్మానుపాలకః ॥ తద్గో
౬. త్రజస్తు దాయాదః సోమాభట్టసుతోపరః । వంన్నయాఖ్యస్తు
౭. తద్వితీర్ణ శేషభోక్త నిరంతరం ॥ యీాత్యేవం కథితై ప్రతా (ప)[19]
౮. విభవా శ్రీ వీరరుద్రేణ చ । సంతుష్ట్యై నితరాం ద్విజావలి
౯. పురా ఖర్వ ద్విజా భారతే। ఆమోదా దథ తాంమ్రశాసనప
౧౦. రం సంగస్యాతఛనిధా ఆచంద్రార్క మిదం భవత్వితి ము
౧౧. దా సంభాషయామాసహ[20] ॥ అష్టభోగస్వామ్యాపి [21] ॥
౧౨. నిధినిక్షేపజలపాషాణ అక్షిణాగామి సిద్ధ
౧3. సాధ్యాది నిర్ణయైః సార్థం ॥ గ్రమాష్టకోణ నిర్ణయః ।
౧౪. ప్రాగ్భాగే పా[22]మురుగ్రమః ఆగ్నేయాం పునుగోడుకః !
౧౫. దక్షిణస్యాం పైడుపాడుః నైరుత్యా చీరునోల్లకః । పశ్చ
౧౬. మే ఆరవేడుస్యాత్ వాయవ్యాం ధూపగుంటకః । ఉత్తరే భిమ
౧౭. వరియాఖ్యః। ఈశాన్యాం పందిపాడుకః। గ్రామస్యా దక్షి
౧౮. ణశైలః । హుత్తరే పుష్కరం స్మృతం పశ్చమే నందివా
౧౯. పీస్యాతు ఆగ్నేయాంతు శివాలయాః ॥ గ్రామావరణ
౨౦. స్యా సిమానిర్ణయః ॥ ప్రాగ్భాగే పునుగోటిశిమనిక ।
౨౧. శే చీంచాతరూణాం పురః శిమధర్మ[23]సీలవిలేఖున
౨౨. మతో త దక్షిణే ప్రస్తరః తస్యా దక్షిణకోటికోణ
౨3. నిహితా శ్రీమచ్ఛెమిాసంనిధై శ్రీమత్ప్రస్తరశాశనం

రెండవ రేకు : రెండవ ప్రక్క

మూడవ రేకు: మొదటిప్రక్క

౧. చ నిబురుష్టే శ్రీమఛిలా రాజితే తస్యా దక్షిణ
౨. కోటికోణనిహితం శ్రీమఛిలాశాసనం తస్యాద
౩. క్షిణరోధసి ప్రరురుచే శ్రీప్రస్తరః సుందరః। తస్యాః
౪. పశ్చిమతః శివా[24]యర్ణసహితే కూలే శిలాశాసనం। తస్యా
౫. పశ్చిమకోటిభాగరుచిరే వల్మీక[25]కూలేశిలా॥ త
౬. స్య పశ్చిమతటాకసంనిధౌ ప్రస్తర స్తదనురాజి
౭. తే శుభః। తస్య దక్షిణశిలామయే భువి శాసనం తదను
౮. పశ్చిమే స్మృతం। పైడిపాడు పునుగోడు సంగమే శాసన
౯. భువి విజితతరః। తస్య పశ్చిమబిడాల[26]హ్రదిని దక్షి
౧౦. ణే శివ ముదారశాసనం। తస్య పశ్చిమతటాకదక్షి
౧౧. ణే వ్రి[27]క్షమూలనిహితం హిసనసం తస్య పశ్చిమశిలో
౧౨. చ్ఛ్రయోతరే ర[28] క్తభూమివివరే విరాజితే॥ చిరువేళ్ల
౧౩. పైడిపా[illegible]స్తు సగమక్రమశిమని క్రుష్ణా[29]పాకఫ
౧౪. లాకూలే శోభతే ధర్మశాసనం॥ తదను పశ్చిమమే[30]చ
౧౫. కభూతశే శాసనం ముతరదిక్తటభూమిషు ప్రస్త
౧౬. ర ఆరవేడు చిరువేళ్లయోః సంగమనేపురసిమ్ని సు
౧౭. షేణ[31]కే॥ శాసన ముతరకూలవిరాజితే వల్మీకరా
౧౮. జిత శాసన ముతరే। నయ్యా[32]క్రో విరాజిత ఊతరతః
౧౯. కులఉదంచిత ప్రస్తరఆదరతాః తస్యోతరే [33]చి
౨౦. త్రగువాసికాతటా ఆవార్ధుపా[34]ర్వడునామసంగమే
౨౧. శ్రీరాజమాంబాపురశిమసంన్నిధౌ శిలావిలేఖం త
౨౨. దను ప్రకీర్తిదం ॥ తస్యోతరే లతా[35]చించాప్రాగ్భూ
౨౩. మై శాసనం పునః । తస్యోతరో[36]పవ ద్వాపిసంనిధౌ శా
౨౪. సనంస్మృతం ॥ తస్యోతరే రక్తధరిస్తు కుల్యాప్రరో
౨౫ (హ)[37]వితః పురతో శిలాతలం తత్పూర్వభగస్తతటా

మూడవ రేకు : మొదటి ప్రక్క

మూడవ రేకు : రెండవ ప్రక్క

౧. క సంనిధౌ స్త్రీప్రస్త రోమేయ ఉదారా...
౨. నా తత్పూర్వ ఆశ్రద్రతటాక సంనిధై [3]శ్రీ భీమన
౩. ధూర్ణ పతటాకసంగమే శ్రీరాజమాంబాపుర ద సంధి
౪. ధై తత్పూర్వతో దా[39]సరివాపిశాసనం। తత్పూర్వతః కంటు[40]
౫. కవాపికాయాః ప్రాచ్యాం విలేఖుం తదనుక్రమేణ
౬. తత్పూర్వభాగే శిఖి[41]తింత్రిణీక ప్రాచ్యాం విలేఖుం తరశ్చ
౭. పురస్తాత్ ॥ కులాల[42]పుష్కరాయనేతెలో చయే పురీ
౮. స్తతః। ప్రుధా[43]కునామధేయకాసమానశిమ్న దక్షి...
౯. పునో[44]టీ శిమపశ్చిమే సు రాజరాజమాంబికాపురా ద[45](డి)
౧౦. చీ భీ[46]మసంధికాశిలావిలేఖనం ॥ శ్రీరాజమాంబా
౧౧. పురా[47]ష్టదిక్షు యేకోనత్రింశఛిలాశాసనా[48]ని।
౧౨. ఇమాని శిమచిహ్నాని కథితాని పురాతనైః[49]
౧౩. చింహ్నాదమూభిః పరివారతస్మిన్ ప్రతాకరుద్రా[50]
౧౪. ఖ్యపురే గ్రహారే । గోష్పాదమాత్రం యది గంహరేచ్ఛ।
౧౫. ప్రయాతి ఘోరం నరకం స పాపి। ప్రతాపరుద దేవే
౧౬. న దత్తా క్షోణి మహీభుజా శ్రీవత్సగోత్రజాతా
౧౭. య భూసురాయ కృపాళునా ॥ బ్రహ్మస్వహరణాచ్చ
౧౮. ద్యః । క్షీయంతే పుణ్యరాశయః । నివర్తంశో జాయతే క్షి.
౧౯. ప్రం తస్మా జాగ్రత భోజనాః ॥

శ్రీమాయిజను మంగళం.

శాసన  ముద్రిక

మూడవ రేకు: రెండవ ప్రక్క

రాజవోలు శాసనము : అథోజ్ఞాపికలు.

1. రెండవ బంతిలో మొదటియక్షరమునుండి నిలువుగ్గొవరకు సుగమము కాలేదు.
2. కాకతీయప్రతాపరుద్రమహారాజునకు "నవలక్ష ధనుర్ధరాధినాథుడు" అను కీర్తి కలదు. నవకోటిధనుర్ధరాధిపత్యమును కలదా? లేక ఆతని విల్లునకు తొమ్మిది అంచు లుండినవనియా?
3. ప్రతాపరుద్రగజపతుల బిరుదులు సరస్వతీవిలాసమం దున్నవనియు, దానిలో "శ్రీవీర గజపతి గౌడేశ్వర, నవకోటి కర్ణాట కలబరిగేశ్వర ఇత్యాదు లున్నవనియు చరిత్రశోధకప్రకాండులు శ్రీ గిడుగు వెంకట రామమూర్తి పంతులు, బి. ఏ., ఎమ్. ఆర్. ఏ. ఎస్ గారు తెలిపిరి. వారికి వందనముల నర్పించెద. హింద్ లా వేత్తలు జాన్ - డి - మెయిన్ గారు లోనగువారు ఇంగ్లీషున వ్రాసియున్న హిందూలా గ్రంథములందు ఈ "సరస్వతీ విలాసము" ప్రతాపరుద్రదేవకృతియని చెప్పుచు హిందూలా మూలగ్రంథములలో దీని చేర్చియున్నారు.
4. నెల్లూరు జిల్లాలో ఉదయగిరి.
5. కుగ్రామము. గ్రామశబ్దముమీద అల్పార్థమున "టికన్" ప్రత్యయ ప్రయోగముచే "గ్రామటికా" యను రూపము సిద్ధించునని వ్యాకరణజ్ఞులు చెప్పెదరు. ఈ రూపమునకు మమ్మటభట్టు కావ్యప్రకాశికలో హనుమన్నాటకాంతర్గత మని యుదాహరింపబడిన ఈ క్రింది శ్లోకము నొకదాని జూపెదరు. ఈశబ్దము నిఘంటువులలో మృగ్యముగ నున్నది.

కావ్యప్రకాశికలో నిట్లున్నది :—

న్యక్కారో హ్యయమేవ మేయ దరయ స్తత్రా ప్యసౌ తాపసః
సోప్యత్రైవ నిహంతి రాక్షసకులం జీవ త్యహో రావణః
ధిగ్ధిక్ఛక్రజితం విబోధితవతా కిం కుంభకర్ణేన వా.
స్వర్గగ్రామటికా విలుంఠనవృథోచ్ఛూనైః కి మేభి ర్భుజైః

6. ఈపేరు కాకతీయ ప్రతాపరుద్రునితల్లిది (కావ్యాలంకారసంగ్రహమును ప్రతాపరుద్రీయమును చూడుడు).
7. గణికాద్యష్టభోగములు — ఇల్లు పగుపు వస్త్రము ఆభరణము స్త్రీ గంధము తాంబూలము. అష్టభోగ స్వామ్యములు వేరుగ నున్నవి (3 — ౧౧, ౧౨, ౧౩ చూడుడు).
8. అప్పచోటివారగు ఆంధ్రులు, వెలనాటివారు, శ్రీవత్సనగోత్రులు. ఇప్పటికిని అచట నున్నారు.
9. ఆంధ్రభారతప్రథమకవియు, వాగనుశాసనుడును నగు "నన్నయ" పేరును నారాయణశబ్దవికృతిగ నుండునని తోచుచున్నది. "నన్న" యనగ "చిన్న" యను నర్థము శబ్దరత్నాకరమున నున్నది. తత్త్వ మెట్టిదో?
10. ఇది పుటసంఖ్యయో లేక అరవవారు వ్రాయు పిళ్లారిసుడియో.
11 ఇచట సంస్కృతపు 'ఙ' గుర్తు ఉన్నది. దీనిప్రయోజనము తెలియలేదు.
12. ఈవాక్య మర్థముకాలేదు.
13. క్ష్మేంద్ర = క్ష్మా + ఇంద్ర = భూపతి. క్ష్మా = భూమి. నానార్థరత్నమాలలో ఏకాక్షరకాండ చూడుము.
14. ఈ వాక్యమున కర్థము కుదురలేదు.
15. ఈవాక్యమున కన్వయము కుదురలేదు.
16. మేఘానది = మబ్బువాగుఅని వాడుకపేరు. ఇది యున్నది.
17 ఈపొరటలోని 3 - 8 బంతులలోని మాటలవలన మొదట దానమును పొందిన నారాయభట్టుఅను నన్నంభటువును, అరవబంతిలోని నన్నయాఖ్యుడు వేరు వేరు వ్యక్తులని నామనవి.
18. ప్రభుతేశ్చా అని యుండవచ్చును.
19. ఇచట నుండవలసిన "ప" అనునక్షరమున తప్పిపోయియుండును.
20. సహ = సః.

21. [illegible] ప్రాచ్యమ్ము [illegible].

22. [illegible] [illegible] పోయినది. పాలసముద్రము అనుసముద్రంలోనను అనుమ [illegible] కలిసిపోయినదని కొందరు చెప్పెదరు. [illegible] వారు అనుయింటిపేరుగల [illegible] ఉన్నారు. ఇనెలిపల్లి గ్రామము లున్నవి. గ్రామదక్షిణాన నున్నట్లు చెప్పబడిన తిప్పలును, [illegible] [illegible] ఉన్నవి. పడమటితట్టుండిన సందులబావి పూడిపోయినది. ఆస్థానమున [illegible] మున్నవి. ఆగ్నేయపు శివాలయము శిధిలమైయున్నది. గ్రామనామము [illegible] సంవత్సరకొలకు [illegible] మురు అని వ్రాసియుందురు.

23. "[illegible] శిలకాలేఖుస" అనుపంక్తిని "శ్రీమద్ధర్మ శిలావిలేఖుస" అని చదువుకొనవలెను.

24. ఇది "శివాయ" యని యుండవచ్చును. "శవాయ" యనగ శివాలయమనకు శ్మశానమునకు పర్యాయ పదముగ నున్నది. [illegible] చెప్పియుండు చోటునను రాజకొలారుద్రభూమి(శ్మశానము)ఉన్నదట.

25. ఈపుష్టల [illegible] శక్యముకాదు.

26. [illegible] = [illegible]. ఇప్పు [illegible].

27. వృక్షశబ్దము.

28. ఎర్రనేల యున్నది.

29. ఈచెట్టుయొద్దినారా [illegible] తెలియలేదు. కలివెచెట్టుగా నుండును.

30. నల్లరేగటిభూమి.

31. ఎర్రనేల.

32. ఈన్యగ్రోధముల (మర్రిచెట్లు) గుర్తింప వలనుకాదు.

33. చిత్రగువాడి గుర్తుపడలేదు.

34. ఆరవేగ, మాపగుంట గ్రామనామములకు వచ్చిన కడగండ్లు.

35. లతాచించలన చింతచెట్టుజాతిలో నొకభేదమని తెలియుచున్నది.

36. చావటబావి యున్నదట.

37. రేకు ఈమూలయందు మొఱిపోయినది. అర్థమునుబట్టియు, ఛందస్సునుబట్టియు ఆస్థానమున "పుం"కార మూహింపబడినది.

38. శ్రీభీమవరఘాపగుంట అని గమ్యము.

39. ఇది ఇపు దన్నది.

40. ఇది గుర్తుపడలేదు.

41. దీనికి వాడుకపేరు తెలియలేదు. వృక్షవిశేషముగ నున్నది. [illegible] = [illegible].

42. కులాలపుష్కరము = కుమ్మరివాండ్లగుంట యున్నది.

43. ప్రుధాకు అనునది పృధాకుఅని యుండవలెను. పృధాకు అనగా పులి పాము ఇత్యాద్యనేకార్థము లున్నవి. పులిచేను అనునొకటి యున్నదట. సమాసనీమ యనుటచే ఈదగమనుసాగుభూమిగ నుండును.

44. ఫనుగోటి

45. ఇచట "దీ" అనునక్షరము చెక్కడములో తప్పిపోయినది.

46. భీమ = భీమవరము.

47. పురాప్తాసుదిక్షు అని చదువుకొనిన శ్లోకము సరిగా నుండును.

48. ఈఇరువదితొమ్మిదిశాసనపురా ట్లున్నవియో లేవో.

49. అర్థశ్లోకము.

50. ఈగ్రామమునకు ప్రతాపరుద్రపురాగ్రహారమని పేరుండినదని దీనివలన యూహ్యామగును. ఈపే రిచ్చిన ప్రతాపరుద్రుడు శ్రీరాజాంబాపురమని పెట్టిన పురుషుడుగ నుండజాలడని నాయూహ (౨ - ౨౩ చూడుడు).

ఆంధ్రాభ్యుదయము  

ఇంజనీరింగు విద్య- పరిశోధన

భారతీయ విశ్వవిద్యాలయాలలో ఇంజనీరింగు (వాస్తు శాస్త్ర) శాఖలో సాధారణంగా పరిశోధన జరగటంలేదు. కాని పశ్చిమదేశాలలోని విశ్వవిద్యాలయాలలో ఇదొక సాధారణకృత్యమే. పరిశోధన ప్రత్యక్షఫలితం ఇవ్వడానికేకాకుండా పశ్చిమదేశాలలో జరిగే అపారపరిశోధనలను జీర్ణంచేసుకొని, ఇంజనీరింగు విద్యలనుసరించి ఎక్కువ స్పష్టమయినభావం కలిగించేటందుకు కూడా ఉపకరిస్తుంది.

మద్రాసు విశ్వవిద్యాలయంలో డాక్టరు కే. సి. చకో, బి. ఏ., డి. ఎస్. సి. (లండన్), ఎమ్. ఐ. ఇ. గారి ఆచార్యత్వమున ఇంజనీరింగులో పరిశోధన ప్రారంభమయింది. శ్రీయుత కానూరు లక్ష్మణరావుగారు ఇట్టి పరిశోధనకు పూనుకోవడానికి మొదటివారు. వీరు పరిశోధనకు తీసికొన్న విషయం నిర్మాణమున ఉపకరించే పరికరాలలో కొత్తదీ, ఇరవైయవ శతాబ్దిలో కనిపెట్టిన గొప్పవస్తువూ అయిన "రి ఇన్ ఫోర్స్డ్ కాంక్రీట్". ఈ పరిశోధనకు కావలసిన పరికరాలు మొదలైనవాటికైన ఖర్చులను వారి స్నేహితులూ, ముఖ్యంగా "ఇండియా అస్సోసియేటెడ్ సిమెంట్సు కంపెనీ లిమిటెడ్"వారూ ఔదార్యంతో భరించారు. సంవత్సరంలోపున శ్రీ లక్ష్మణరావుగారు పరిశోధన పూర్తిచేసి ఒక 'థెసిస్' (పరిశోధకవ్యాసము) తయారుచేసినారు. దీనిని పాశ్చాత్యపరిశోధక వాస్తుకళానిపుణులు ఆండ్రూస్, ఆస్కార్ ఫేబరు, చెట్టోలు చాలా మెచ్చుకొన్నారు.

ఇంజనీరింగులో పరిశోధన ఇంకా పెంపొందుతుందనీ, గవర్నమెంటువారున్ను ప్రైవేటుసంఘాలున్ను ఈవిషయంలో హిందూదేశంలో తగినంత అభివృద్ధి కలిగేవరకూ ప్రారంభదశలో ఈ పరిశోధనకు తోడ్పడుతారనీ ఆశ.



కే. లక్ష్మణరావుగారు, బి. ఇ., ఎం. ఎస్. సి.

వీరు మద్రాసు విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగులో మొట్టమొదటి ఎమ్. ఎస్. సి., డిగ్రీని పొందిన మొట్టమొదటి ఆంధ్రులు. వీరు 'డిఫ్లెక్షన్సు ఇన్ రీఇన్ఫోర్స్డ్ కాంక్రీట్ స్ట్రక్చర్స్" అనే విషయాన్నిగురించి వ్రాసిన పరిశోధకవ్యాసమును లండన్‌లోని చాలా గొప్పకన్సల్టింగ్ ఇంజనీరులైన ఇ. ఎస్. ఆండ్రూస్, ఎమ్. ఇన్స్టిట్, సి. ఇ; డాక్టరు ఆస్కార్ ఫేబర్, డి. ఎస్. సి., ఎమ్. ఇన్స్టిట్, సి. ఇ; చెట్టో, ఎమ్. ఎస్. సి., ఇన్స్టిట్., సి. ఇ. అనేవారు పరీక్షచేసి, దానిని చాలా మెచ్చుకొని, ఎమ్. ఎస్. సి, డిగ్రీ నిచ్చి వారిని బహూకరించిరి.

ఈ ప్రారంభదశలో ఈ పరిశోధనపద్ధతులలో తర్ఫీతయి వచ్చేటందుకు కొందరిని ఇంగ్లాండుకు పంపడం కూడా చాలా అవసరం.

(శర్మ)

శ్రీమతి లేడీ వెంకటసుబ్బరావుగారు



ఈమెను మదరాసు ఆల్డరుమనుగా డా॥ ముద్దు లక్ష్మీరెడ్డిగారిస్థానే ఎన్నుకొనిరి. ఈమె న్యా॥ ముత్తా వెంకటసుబ్బరావుగారి సతీమణి. వీరుమదరాసులో సేవా సదనముఅను ఉన్నత స్త్రీవిద్యాసంస్థను నడుపుచున్నారు.

శ్రీమతి పుల్లె అన్నపూర్ణాదేవిగారు, ఎమ్. ఎస్. సి.



ఈమె శ్రీయుత పుల్లె శ్రీకంఠరావు, ఎమ్. ఎస్. సి.,గారి సతీమణి. కాశీవిశ్వవిద్యాలయమున రసాయనశాస్త్రమున ఎమ్. ఎస్. సి. పరీక్షయందు తీర్ణురాలగుట కీమెయే మొదటిది.

వి. ఆర్. చిత్రాగారు



వీరు ఉత్తరహిందూస్థానమునందలి కొన్ని పారిశ్రామిక సంస్థలను జూచి యచ్చటి పారిశ్రామిక విద్యా విషయకకృషిని తెలిసికొనివచ్చుటకుగాను మదరాసు ప్రభుత్వమువారిచే పంపబడిన మదరాసు చిత్రకళాశాల క్రాఫ్ట్సుశాఖ సూపరింటెండెంటుగారు. వీరు బీహారు, బెంగాలు, సంయుక్తరాష్ట్రములు, రాజపుత్రస్థానము, మధ్యపరగణాలలోని కొన్ని ముఖ్యపారిశ్రామిక సంస్థలను జూచి రెండు నెలలో తిరిగి వచ్చెదరు.

కీ. శే. నడింపల్లి జగన్నాథరావుగారు

శ్రీయుతులు నడింపల్లి జగన్నాథరావుగారు ఆకస్మికముగా దివంగతులయినారని విని చాలా విచారము పొందినాను — అమితదేశాభిమానియైన పరిశోధకుని దేశము గోల్పోయినదే అని. కానైతే ఆయనది న్యాయవాదివృత్తి; గుంటూరుజిల్లా నర్సారావుపేట నివాసము. వకీలువృత్తియందు ఆయనకు తగినంతతీరిక ఉండేదికాదు. అయినా దేశచరిత్రపరిశోధనఅంటే ఆయనకు ప్రాణము. ఈ పరిశోధనధర్మమువల్లనే మా యిద్దరికీ మైత్రి కలసింది. అది ఇప్పుడా? — చాలాఏండ్లయినది. అప్పటినుంచీ మేము తరచు కలుసుకొంటూనే వచ్చాము. ఆయన మద్రాసు వచ్చినప్పుడెల్లా నన్ను కలుసుకోకుండా వెళ్లలేదు. కలుసుకొన్నప్పుడెల్లా మా యిద్దరికి తీవ్రమయిన చర్చకూడా — ఏవోవిషయాలను గురించి — జరగకుండా ఉండలేదు. అయితే ఎంతటి చర్చ సంభవించినా, ఎంతటి తీవ్రాభిప్రాయభేదం కలిగినా మేమిద్దరమూ మిత్రులమే. నవ్వుతూ నవనీతమైన హృదయంతో తీవ్రవాదానంతరం నన్ననునయించేవారు. నేనంటే వారికి అపరిమితమైన ప్రేమా, అభిమానమూ అని గ్రహించాను. ఆయన ఇక లేడంటే మనస్సుకి బాధగానే ఉంటోంది. ఎందువల్ల, పరిశోధకులు లేరనీకాదు, తక్కువయినారనీ కాదు; ఆయనవంటి పరిశోధకులు లేరని.

ఆయనపరిశోధనే వేరు; ఆయనదృష్టే వేరు. పాశ్చాత్యులైన ప్రాచ్యవిజ్ఞాన పరిశోధకులు వేసిన రహదారీబాట లున్నవి. వాటిలో పోయేవారే ఇప్పటిచరిత్ర పరిశోధకులలో చాలామంది. వాటి నతిక్రమించి పోవడాని కెవ్వరికీ సాహసమూ లేదు; ఆదృష్టీ లేదు. 'మన పురాణాలన్నీ నమ్మదగినవి కావు. మన కలియుగశకము ఇటీవల కల్పించినది. మన భారతయుద్ధము మన ప్రాచీనులు చెప్పేటంత పూర్వకాలాన జరిగింది కాదు. ఆ మాటకువస్తే మనవేదములే చాలా ఇటీవలివి; క్రీస్తుశకానికి రెండుమూడువేలయేళ్ల క్రిందటివేమో మహాఅయితే—.' ఇప్పటిచరిత్ర పరిశోధకు లందరివీ ఇవే భావాలు. అలెగ్జాండరు దండయాత్రే మనచరిత్ర కాలం లెక్కించడానికి సరియైన పునాదిమైలురాయి. అంతకు పూర్వపుచరిత్ర భారతీయులకు లేదు. ఒకవేళ ఉందన్నా చాలావర కదంతా కల్పనే. అదంతా ఇదమిత్థమని తేల్చరాని ప్రాగైతిహాసికయుగమే. ఇవన్నీ పాశ్చాత్యులసిద్ధాంతాలు. వారిబళ్లలో చదివిన మనవీ అవే సిద్ధాంతాలు. వీటిని ఎవరైనా కాదంటే వారు మనకు పరిహాసపాత్రులు. "ఇవన్నీ అపసిద్ధాంతాలు, సరియైనవి కావు. మనశకములు, మన ఇతిహాసములు పాశ్చాత్యుల బైబిలువ్రాతలకంటెను విశ్వాసపాత్రములైనవి. కృష్ణనిర్యాణముతోనే కలియుగం ఆరంభమయింది. అది ఇటీవల కల్పితమయినశకం కాదు. మహాభారతయుద్ధం క్రీస్తుశకానికి మూడువేలేండ్లకు పూర్వం జరిగినయుద్ధం. వేదములు మొదలైనవి అంతకు కొన్నివేలేండ్లకు పూర్వపువి" అని శ్రీ జగన్నాథరావుగారివాదము. ఈ వాదమును సమర్థించుకోవడానికి వారు మహాభారతయుద్ధకాలనిర్ణయమని ఇంగ్లీషులో ఒక పుస్తకం వ్రాశారు. ఇంకా వారివాదం పూర్తిగా అందులో ప్రదర్శింపబడనూ లేదు; సమర్థింపబడనూ లేదు. ఇంకా మరోగ్రంథం వ్రాయా లనుకొంటూ ఉండగానే మృత్యువు వారిని తనపొట్టను బెట్టుకొంది. ఇటువంటివాదమువల్ల వారు చరిత్రపరిశోధకులు చాలమంది దృష్టిలో పరిహాసపాత్రులైనా, లోతుకు పోయి విషయాలు తరస్తూవచ్చినవారుమాత్రం వారి వాదాన్ని సావధానంగా చదివి యోజిస్తూమాత్రం వస్తున్నారు. వారికీ తెలుసు ఇప్పటి హిందూదేశచారిత్రక కాలపరిగణనంలో లోపం ఉన్నదని. అయితే, పరంపరగా తరాలనుంచి వస్తూన్న కొన్నిప్రధానభావాలు వారి నాకట్టి ఉంచడంవల్ల వారికి ఆబాటలోనుంచి తప్పుకోవడము ఎట్లాగో తెలియడం లేదు., ఎక్కడికి తప్పుకోవాలో తెలియడం లేదు. అందువల్ల వారూ తికమకలాడుతున్నారు. అయినా వారిసంఖ్యే పెద్దదవడంచేత వారిమాటే చెల్లుబడి అవుతూవస్తోంది. కాని మహంజోదరో మొదలయిన ఇటీవలిపరిశోధనలు శ్రీజగన్నాథరావుగారివాదానికి బలాన్నీ, ఇతరులవాదాలకు సవరణలనూ ప్రతిపాదిస్తూవున్నాయి. ఏటి కెదురీదే ఆ సాహసుణ్ణి మరచిపోలేను.

ఎన్ని అభిప్రాయభేదా లున్నా, ఎన్ని విరుద్ధసిద్ధాంతాలను ప్రతిపాదించినా ఏ దృష్టితో చేసినాడు, నిర్మలమైన, నిష్కపటమయిన హృదయముతో చేసినాడా లేదా అన్నదే మన మాలోచించవలసినది. పని చేసేవారికి ఎవరికి తగినగౌరవం వారికి మన మిచ్చినప్పుడే మనగౌరవంకూడా హెచ్చుతుంది.

శ్రీ జగన్నాథరావుగారి కుటుంబాని కిందుమూలంగా నాసానుభూతిని తెలియజేసుకొంటున్నాను.

మల్లంపల్లి సోమశేఖరశర్మ.

పుస్తకసమీక్ష

భారతీయ నాగరికతావిస్తరణము

కర్త: శ్రీ [illegible] రామారావుగారు, ఎమ్. ఏ., [illegible], [illegible] ప్రొఫెసర్ [illegible], [illegible]. ప్రకాశకులు: వెంకటరామా అండ్ కో., ఏలూరు. పుటలు ౧౩౭. వెల [illegible]

విశ్వకవిరవీంద్రుడు —

"ప్రథమప్రభాత ఉదితతవగగనే,
ప్రథమసామరవ తవతపోవనే."

అని భారతదేశపు అతి ప్రాచీనతను, ఆధ్యాత్మికసజ్ఞానను పాడినాడు. మనదేశ మొకప్పుడు ఆధ్యాత్మికసార్వభౌమత్వమును వహించి, ఎన్నియో దేశాలకు నాగరికత నేర్పి, జీవితమార్గాలను బోధించి, అన్నిటికంటె మేటియై వెలుగొందిన దని చెప్పటం మన కొకవింత కౌతూహలాన్ని కలిగించకపోదు. మన వర్తమానపరాధీనజీవితం అంతటి గొప్పవాక్యాలను విన సాహసించదు. 'ప్రాచీనార్యులకును, నేటి క్రైస్తవజాతులకును నడుమ నీదేశముపై దండెత్తివచ్చిన ప్రతిజాతికిని విజయమిచ్చి, తమ స్వాతంత్ర్యమును గోలుపోవుచు, వారికి జోహారొనర్చుచు, కొంగొ మవకాశము దొరకినప్పుడు కొలదికాలము తలయెత్తుచు, మొత్తముమీద భారతీయులు శతాబ్దములకాల మస్వతంత్రజీవితమున కలవడిరి......భారతీయ నాగరికత భారతదేశపుసరిహద్దులను దాటలే దనియు, నేటి ఇంగ్లండు, ఫ్రాన్సు మున్నగు పాశ్చాత్యదేశీయులవలె భారతీయులప్రతిభ తమదేశము నెన్నడును దాటిపోలేదనియు చెప్పే పాశ్చాత్యవిద్వాంసులవాక్యాలు తూచాలు తప్పకుండా ఇంతవరకు ఒప్పకుంటూ వచ్చాం. కాని నేటి చారిత్రకపరిశోధకులకృషి ఈ

వాక్యాలన్నీ నిరాధారములని ఋజువుచేస్తున్నాయి. నానాటికి పరిశోధన హెచ్చినకొద్దీ అసలు స్వరూప మేమిటో బయటపడుతోంది. టిబెట్, చైనా, కొరియా, జపాన్, బర్మా, సయాం, కాంబోడియా, చంపా, మలయాద్వీపకల్పము మొదలగు దేశములందునివసించువారి ఉనికి, వారి ఆచారవ్యవహారాలు, వారి రీతులు, విశ్వాసాలు, జీవితపద్ధతులు, అక్కడి దేవతల పేళ్లు, ఉపాసనాపద్ధతులు ఈవిషయంలో ఎక్కువ సాయపడుచున్నాయి. "ధర్మమను మహాస్త్రముచే మానవహృదయమును జయించుటే నిజమైన విజయము" అను ప్రబోధమును గ్రహించిన అశోకచక్రవర్తి కాలములో బౌద్ధభిక్షువులు ప్రపంచ మంతటా ఎన్నో కష్టముల కోర్చి బౌద్ధధర్మాన్ని బోధించారు. ౧౧-వ శతాబ్దంలో నాలందా విశ్వవిద్యాలయం పలువురు విదేశీయులకు జ్ఞానదాత యైనది. కేవలము బౌద్ధజ్ఞానమే కాదు. ఈదేశమువచ్చిన విదేశీయులు, ఇక్కడనుంచి వెళ్లిన మతప్రచారకులు తమతోపాటు ఇక్కడి శిల్పకళ, కవిత్వము, గానము, ఇక్కడి వాస్తువిద్య కూడ నేర్చుకుపోయినారు. విశేషంగా భారతదేశమే అజ్ఞానాంధకారంలో మునిగి ఉన్న ప్రపంచానికి జ్ఞానదీక్ష పెట్టింది. చైనా, టిబెట్ మొదలైనదేశాల్లోనివారు మన గ్రంథాల్ని ఎంతో శ్రద్ధతో పఠించినారు.

పరిశోధనకు సంబంధించిన సాహిత్యం మన తెలుగులో ఇతరభాషలందంత విరివిగా తయారుకాక పోవటం విచారకరం. పూర్వచరిత్రలే మానవజాతి యొక్క సాహసం, ఉత్తేజన, స్వాతంత్ర్యప్రియతలకు దోహదములు. చరిత్ర లేనిజాతి ముందుకు సాగలేదు. రామారావుగారిచే రచింపబడిన "భారతీయ నాగరికతా విస్తరణము" ఇంకా కొంతమందిని ఈమార్గమున ఆకర్షించగలదని నమ్ముచున్నాము. ఇప్పుడిప్పుడే కళ్లు తెరచి, స్వాతంత్ర్యసంపాదనమునకై పాటుపడుచున్న భారతజాతికి తగినన్ని చరిత్రలు కావాలి. అప్పుడే

దేశం నిండుకుతూన్నాం మాపకలుగుతుంది. పుస్తకం కొద్దిలో ఆకర్షణీయంగా ఉంది. ఆంధ్రపాఠకలోకం ఈ పుస్తకాన్ని ఆదరించి, గ్రంథకర్తకు తగిన ప్రోత్సాహం చూపుదుగాక.

యలమంచిలి వెంకటేశ్వర రావు.

గ్రంథస్వీకారము

కపితాగోష్ఠి (సంస్కృతము) :— కర్త: శతావధాని, వేమూరి నృసింహశాస్త్రిగారు; గ్రంథములకు గ్రంథకర్తగారికి పాతగుంటూరుకు వ్రాయవలెను. వెల రూపాయి.

ప్రేమతపస్విని :— ఇది యొక తెలుగు ఖండకావ్యము కర్త; బెల్లూరి శ్రీనివాసమూర్తిగారు. పుస్తకములకు గ్రంథకర్తగారికి, అనంతపుర మండలము, కొత్తచెరువు పోస్టు, తలమర్లకు వ్రాయవలెను. వెల ఆరణాలు.

ఆవేదన :— ఇది హరిజనప్రబోధమునకు సంబంధించిన పద్యకావ్యసంపుటము. కర్త: బయ్యా సూర్యనారాయణమూర్తిగారు. గ్రంథములు వలయువారు: బి. సుబ్బారావుగారికి, ఒల మేడక్స్ స్ట్రీటు, వేపేరి, మద్రాసుకు వ్రాయవలెను. వెల నాలుగణాలు (తపాలకూలికాక.)

తోరణము :— ఇది యొక ఖండకావ్యసంపుటి. కర్త: మధునాపంతుల సత్యనారాయణగారు. వలయువారు గ్రంథకర్తగారిపేర, కాకినాడ పోస్టు, పల్లెపాలెమునందలి ఆంధ్రకుటీరమునకు వ్రాయవలెను.

యువకథావళి :— ఇది యువప్రచురణములలో ఎనిమిదవది. శ్రీ సౌరీస్, మల్లాది రామకృష్ణశాస్త్రి, కొడవటిగంటి కృష్ణమూర్తి, కుటుంబరావు, పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రి, మొపలి వెంకటసుబ్రహ్మణ్యశర్మగారల కథలు గలవు. ప్రకాశకులు: యువకార్యాలయం, తెనాలి. వెల పావలా.

నిశ్శస్త్రశరీరపరిశోధన :— ఇది ప్రకృతిప్రత్యక్ష సాధన గ్రంథమాలలోని నాలుగవగ్రంథము. నాడీ, మూత్ర, చర్మాది పరీక్షలవలన "శరీరాంతరారోగ్యస్థితి తెలిసికొని, వ్యాధులను తప్పించుకొను సామర్థ్యజ్ఞానము కలుగజేయుట" యీ గ్రంథోద్దేశము. కర్త: బొల్లాప్రగడ సుందర గోపాలరావుగారు. గ్రంథమును గ్రంథకర్తగారి పేర రాజమహేంద్రవరమునకు వ్రాసిన బహుమతి గలదు.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad.

భారతి

సచిత్ర మాసపత్రిక

సంపాదకుడు

శి. శంభుప్రసాద్

ఆంధ్రపత్రికా ముద్రాలయము,
మద్రాసు.
౧౯౩౮

సంపుటము ౧౫, సంచిక ౧౮

ప్రకటన

ఈ క్రింది కనబరచిన నెంబర్ల వారికి ఈ నెల భారతి (1938 సం. అక్టోబరు నెల)తో ఇదివరకు చెల్లించిన చందా పూర్తి యగుచున్నది. తిరిగి ఇంకొక సంవత్సరమున కగు చందా మాకు చేరునట్లు ఈ నెలాఖరులోగా మనియార్డరు చేసినచో తెంపు లేకుండ పత్రికను పంపుచుందుము. అట్లు తమ యొద్దనుండి 30-వ తేది లోపుగ సొమ్ము రానిచో సహజభాషాభిమానులగు తాము తిరిగి ఇంకొక సంవత్సరమువఱకు భారతి చందాదారులుగ నుందురను నమ్మకముతో 1938 సం నవంబరు 10-వ తేదిని రూ 6—4—0 లకు వి. పి పంపుచున్నాము. గావున తా మెప్పటివలెనే పత్రికయం దభిమాన ముంచి సొమ్ము చెల్లించి వి. పి. ని గైకొన బ్రార్థితులు. ఒకవేళ తమకీ పత్రిక ప్రస్తుత మనవసరముగ దోచినచో మాకావిషయము వెంటనే తెలియజేసిన యెడల వి. పి. పంపుట నాపుదుము.

A 10. B 14, 15. G 5. H 29, 43, 44, 48. J 2. K 16. M 5. N 17 18. P 26, 27, 30. R 30, 31, 33. S 10, 18, 79, 83, 84, 85, 87, 88, 89, 90, 91, 92, 93. V 4.

చందాదారుల కొకహెచ్చరిక

ఆంధ్రదేశములోని వివిధ ప్రదేశములందు ఆంధ్ర పత్రికను విక్రయించుచున్నవారు 1938 అక్టోబరు 1-వ తే "న్యూస్ వెండర్సు" అను పేరుతో వ్యవహరింప బడుదురు. ఆంధ్రపత్రిక (దైనిక, వార) సంచికలు, (మాసపత్రిక) మున్నగునవి సదరు "న్యూస్ వెండర్సు" వారికి నిర్ణయించిన ఆయా ప్రదేశములందు తమ బాధ్యతమీద విక్రయించుటకు సంపూర్ణముగా అధికారము పొందియున్నారు. "ఆంధ్ర దైనికపత్రిక" కు అనగా శనివారపు పత్రికలతో సహా విడిపత్రిక 1-కి రూ 0-1-0. న్యూస్-వెండర్లున్న ప్రదేశముల మాత్రము మాసవారీ చందా ప్రతి 1-కి రూ 1-12-0 లు. మా కార్యాలయమునుండి నేరుగ పోస్టు ద్వారా పంపబడిన పత్రికలకు మాసవారీ చందా ప్రతి 1-కి రూ 2-0-0 లు.

వి ష య సూ చి క

చిత్రములు


త్రివర్ణచిత్రము : శకుంతల.

చిత్రకారుడు : యస్. దుర్గారావుగారు.

౨౦-వ ఆంధ్రమహాసభ అధ్యక్షాదుల చిత్రములు.

సవరణ.

కడచిననెల భారతిలో ప్రకటితమైన 'రాజవోలుశాసనము మూలము 3౭౧-వ పుటలో ౧౧-వ పంక్తిలో "పురుషోతమఖేంద్రస్తు" అనుటకుబదులు "పురుషోతమఖేంద్రస్తు" అనియు, అధోజ్ఞాపికలపట్టిక 18-వ దానిలో "ఖేంద్ర = భా + ఇంద్ర" అని "భా = భూమి" అనియుండుటకు బదులు "ఖేంద్ర = ఖా + ఇంద్ర" అని, "ఖా = భూమి" అనియు పొరపాటున పడినవి.



శ కుం త ల



సంపు. ౧౫ బహుధాన్య, ఆశ్వయుజమాసము (అక్టోబరు 1938) సంఖ్య ౧౦

నంది

(అనుమకొండ)

అడివి రాఘవరావు

అలవడి నిత్యసాధనలయానుగుణమ్ములు సుస్వరమ్ములై
గలగలలాడు గజ్జియలు గంటలు మువ్వలుగాఁ జరించుచున్
వెలుఁగుపొలాలఁ బచ్చిక మదిం గడుఁగూర్చిన తృప్తి నృత్య లీ
లలు మొలకెత్తి లోతలఁపులం బరమాణువు నూఁగఁగా వృషా.

రుద్రాత్మ మాతెన్గు ప్రొద్దు పితామహ పీఠాగ్రసంస్థితి వెడలి పొడిచె
నాతేజుఁ దాల్చి శక్త్యాత్మ యమృత మొల్కు చల్లని తల్లిగా చందమామ
పంచభూతోద్భవుల్ భద్రభావస్థితుల్ కుజబుధగురుశుక్ర క్రూర శనులు
నావరణాతీత మావరణాంతర పరివర్తితాత్మము పరమతత్త్వ
మమరి హరిహరరూపమ్ము లాత్మతేజ, మొకటిగాఁ దెన్గుప్రొద్దులో నుభయపార్శ్వ
వర్తిగా దేవతాయజ్ఞవాటికబలెఁ, దెనుఁగుహృదయాన నృత్యవేదిక తనర్చె.

తమశంఖవాద్యమ్ము త్వరఁ బరావహమున ఘంటానినాదమ్ముఁ గలుపుకొనుచు
తమవీణియల మీటు తారకాపదగతి మువ్వలరవళిని ముద్దుగొనుచు

తమమద్దెలలచాటుః తగిలి యావహామున చిఱుతగజ్జెలగతుల్ చేర్చుకొనుచు,
తమభావసంపద తారకాపదగతి తెలుఁగుజోదులకంటఁ గలుపుకొనుచు
నిధపమగరిస గతులుగా సింగివెడలి, కెరలియాడుచు కడలి పొదరఁగలట్టు
లచట ఁలాలు వజ్రాలు నిచట నగుచు, నమరి కొలువైరి స్వాముల కైనభటులు.

గంగెద్దుదాసులు కాకతిఱేండ్లు, దుర్జయకులజులు దొడ్డతనాల
ప్రోలమహారాజు రుద్రదేవుండు, గణపతి రుద్రాంబ ఘనకీర్తి గలరు
వీరప్రతాపుండు విశ్వంభరుండు, తమసైన్యములతోడఁ దద్దయు బత్తి
తమదొరసానులు దాసీలు రాఁగ, క్రమముగాఁ జనుదెంచి కాళ్లకు మ్రొక్కి
గిఱిచుట్టి చనుదెంచి మఱిమఱి మ్రొక్కి, తాముగా రాణులు తమనేర్పు మెఱయ
పసుపుఁ బారాణియుఁ బదపద్మములకు, నుదుటఁ గుంకుమబొట్టు నొప్పుగా దిద్ది
కంఠాన కొమ్ముల కటి నురస్థలుల, పూదండ ముత్యాల పొలుపు రచించి
బంగారు 'సిగమోర' పట్టెడల్ గట్టి, తోరంపు బంగారు తొడుగులు తొడిగి
కొమ్ముల నడిమిని ఘోణీపతాక, నిలఁబెట్టి నిలువెల్లఁ బులకించి చూచి
మారేడుదళముల మంచివిభూతిఁ, బూజించి యెడఁదలోఁ బొంగులువాఱ
అచ్చకప్పురమున హారతి పట్టి, కమ్మతేనియపుట్ట కాలువకట్టు
చక్కనిగొంతుల జయగీతి పాడి, పప్పు పచ్చిక మంచి ప్రత్తివిత్తులును
పండ్లు పాయసములు పానకమ్ములును, నైవేద్యములు పెట్టి నతిచేసి తొలఁగ
కలడోల్లు 'సన్నాయి' కనకతప్పెటలు, ఢాంకారభేరీలు పటహనాదములు
నొక్కుమ్మడిని రేఁగి యొరయ దిక్కులను, నీఁటెముత్త మ్మెత్తి యెలుఁగెత్తి మిగులఁ
"జయ జయ వృషభేశ ! జయ నందిదేవ !, హేశివానుగ దేవ యితరసంహార !
జయ జయ శివలెంక ! జయ జయ" యనుచు, వరుసల నినుఁ జుట్టి భటులును ఱేండ్లు
నాటకు నెడమిచ్చి యనుసరింపంగ, నడుగులో నడుగుగా ననుసరింపంగ
సర్వౌషధిగ్రాససత్త్వాతిశాయి, చిగురుపచ్చికమేపుచేవను పెంచి
త్రిపథగాంభఃపానదీప్త్యతిశాయి, నాటుతోగులయాట తేటను పెంచి
శారదాకృతపరిష్కారాతిశాయి, దొరసానిచేఁదీర్పు మెఱుఁగును పెంచి
ప్రమథసాంగత్యాతిప్రతిభాతిశాయి, తెన్గుజోదులజట్టు తేజును పెంచి
శ్రీశంభుసాన్నిధ్య సేవాతిశాయి, ప్రొద్దుముందర యాట మోదమ్ము పెంచి
పాలసంద్రపుటలల్ పై కెగసిపడు, నట్లుగా జనములు నట్టిట్టు లూఁగ
కొండకొమ్ముల గంగ గునిసియూఁగాడు, కలలుగా నూఁగ ప్రక్కల గంగడోలు

శ్రీకార మోంకార మేకాకృతివలె, మెలికలై తనేక క్రొమ్మెఱుఁగుల నెస
తనువెల్ల కుంచించి తనువెల్ల పెంచి, తనువెల్ల లయమాడి ధగధగా మెఱసె
ఒక్కయావృత్తిలో నోదుగులు పోవ, నంతంత గడియెక్కి అంతంత మెచ్చి.

తెలుఁగులయజ్ఞవేది సముదీర్ణహుతాశన దివ్యకీర్తిగా
వెలిఁగెను ప్రొద్దు; ధర్మపరివృత్తి సుదర్శనచక్రధారగా
వెలిఁగెను ప్రొద్దు; స్వామి అరవిచ్చిన చిచ్చుఱకంటిమంటగా
వెలిఁగెను ప్రొద్దు సర్వపృథివిం బడి జ్యోతుల నాత్మ నించుచున్.

వేవెల్గు వెలుఁగారి విక్రమాదిత్యులు రూపఱ తమతేజు రోసినారు
కుంతలమ్ములు మాఁడి క్రోడాంక మెద గాఁడి గుండఁడు తనతేజుఁ గోలుపోయె
నీయాత్మ వంచించి నేల నేలఁగ నెంచు బిజ్జలుతేజమ్ము పేరడంగె
త్రైలపు గోవిందు దారుణప్రభ లెల్ల గుదివడి భక్తితోఁ గొలువుచేసె
నెల్లభూములు పద్మము లింత విచ్చి, కలకలలువోయి పద్మజ కలితమంద
హాసభాసురముల్ శివతాతి సుంద,రమ్ములును మహోనాట్యపరమ్ములు నెద.

పంత మింతింత గాఁబట్టి పాపత్రాడు
దేవదానవు లుమ్మడి త్రిప్పనపుడు
ఘూర్ణితాంభోధితరఁగల గుడ్లు తిరుగు
మందరమ్ముగ నృత్తసంపదలపోవ.

తెలుఁగుప్రతాపవహ్ని గడితేరి పొగల్విడి కుప్పకట్టైనా
వెలిఁగెను ప్రొద్దు; ఘోణి తెలుపెక్కిన చిక్కని చుట్టుకోరలా
వెలిఁగెను ప్రొద్దు; రాజ్యపదవిం ఝుళిపించిన ఖడ్గధారలా
వెలిఁగెను ప్రొద్దు సర్వపృథివిం గడుఁ జెల్లుచు దుర్నిరీక్ష్యమై.

భీమము చోడవంశశుచి పెట్టినపేరట బిట్టు మండఁ దా
నై మటుమాయ మయ్యె నెదురై కడువెల్గెడి తెల్గుప్రొద్దుకున్
తామరకన్ను విచ్చి శివతాతిమనోజ్ఞము గాక చోడక
న్యామణి తానుగా తెనుఁగునాథుని పాదము లద్ది కొల్చెనున్.

దుమ్ముతుపాను లెత్తి పడఁదోలుచు గిట్టల కోరకొమ్ములన్
గ్రుమ్ముచు బెల్లురేఁగి పిడుగుల్వడ, దావహుతాశనాగ్రరూ

క్షమ్ములు వాయువుల్ సుడులుగా సుడిత్రిప్పుచు కుచ్చుతోఁక, శ్వా
నమ్ముల నిప్పు లూఁదినతుషారము చిమ్ముచు తాండవించినన్.

పడిమిగడి దాఁటె తపనుండు నెడఁదలోన,
నెసరుమసలినరొద లెత్తె నెల్లనదులు
దివికి నరిగాపుపోయెడిపావలు యుష్మ,
దప్రమేయమహానాట్యతైజసములు.

పడమటగాలి తోలి కడఁబట్టెను ప్రాణము తూర్పుసంద్రపుం
బాడవుల రాజుమూఁకలకు బుస్సనుముట్టియు ఫేనపుంజముల్
సుడియుచు జల్లుగాఁ గురిసి చుక్కలు రాలినయట్లు పశ్చిముల్
మడిసిరి; దక్షిణోత్తరములం బడి చచ్చిరి తోఁకగాలులన్.

ఎల్లభూములు పద్మమ్ములెల్ల విచ్చి, కలకలలువోయి పద్మజ కలితమంద
హాసభాసురముల్ శివతాతిసుంద,రమ్ములును మహానాట్యపరమ్ములు నెద.

స్మరహరశిక్షణఁ బెరిఁగిన
పరమాద్భుతభావరాగవరలయగతి సుం
దరతలు మెరసినతరటులు
స్ఫురదభినవలీల పోయి చొక్కుచు మిగులన్.

తరతమభేదము ల్గొనని ధైర్యము నాఁగ జితేంద్రియత్వపుం
సిరి చెలువమ్ము నాఁగ రససిద్ధిపతాకము శిల్పశాస్త్రపుం
బరిణతి నాఁగ సుందరసభాముఖమై కనుమోడ్చి పండితుం
పరమముమోదమై తెలుఁగుభావము రాగము సీక దక్కెనే.

తెలుఁగులు ద్వారబంధముల తీరిచి దిద్దిన పెద్దబొట్టుగా
వెలిఁగెను ప్రొద్దు; తెల్గుపృథివీపతి యిట్టిన లచ్చి చెక్కుగా
వెలిఁగెను ప్రొద్దు; కోరి యెదఁ బెంచిన శైవ పదాబ్జభక్తిగా
వెలిఁగెను ప్రొద్దు సర్వపృథివీస్థలి మోదము నాత్మ నించుచున్.

ఊఁదినశంఖమ్ము లూఁదినట్లే యందు పట్టినహస్తముల్ పట్టినట్లె
మీటినవీణియల్ మీటినట్లే యందు త్రిప్పినదృక్కులు త్రిప్పినట్లె

చాటినమద్దెలల్ చాటినట్లే యందు వంగిన భంగిమల్ వంగినట్లె
పాడినరాగమ్ము పాడినట్లే యందు పొందినకరణముల్ పొందినట్లె
తోణఁకి సంతోష మెడఁద నీతోడివార, లచలమూర్తులు స్వాముల కైశభటులు
నచలమూర్తులు స్వాములు నచట నట్లె, నృత్యవేదిక దేవతానిలయ మయ్యె.

వేయివెలుఁగులు సకల దిగ్విజయమంది,
తెనుఁగు నాటు జయస్తంభదీప్తి మెఱయు
నచలమూర్తులుగా బ్రొద్దు నచలమూర్తి
పరమసంతోషభారసంపన్నమూర్తి.

౨

మోడ్పు కను విచ్చి యల్లన మోఁకరించి
తనువు విదళించి పొంగించి ధరణిధూళి
కర్కశఖురాగ్రపాతదిగ్గామిఁ జేసి
ఊఱుము లుఱిమిన పెనురంకె లుఱవడింప.

ఇంటింటఁ మహాసియవేదపఠనాహీనమ్ము మంత్రార్థముఁ
ఘంటానాదము కామినీగళగళన్మాధ్వీకసంగీతముఁ
మింటఁ పర్వతశృంగలంబి విరహామేయ ప్రతప్తాత్మకుఁ
జంటా మేఘపుగర్జనిదుధ్వనికిఁ తానమ్ము పట్టెఁ వృషా!

వాకిట వాకిట న్మోదవు ప్రాగ్దిశఁ జూచి శ్రుతిప్రమోదనా
డాకలనాతినమ్రము బయల్ చెవు లోరగ నాలకించి పె
ల్లాఁకట లేఁగలేయరపులం బాదుఁ గింతకు నింతగా భవ
చ్ఛ్రీ కని చేఁపె లో నెఱుక సిగ్గు విలాసము నింత కింతగా.

నీసంతానము పుంగవౌఘ మెదలో నీగర్జ ప్రభావజ్ఞ గా
వానగ్రాసము లిచ్చి మమ్ము బ్రతికింప న్నిత్యకృత్యమ్ముగాఁ
దా సాగారెఁ బాలమ్ముకమ్మనిమెడంద న్మేల్మిబంగారుగా
మోసెఁ వాసకసజ్జికాలలితసంభోగ్యమ్ము సౌభాగ్యమున్.

పాలవాఁగులా వెన్నెలపంటలా ప్ర
చలిత మమృతాబ్ధిలా అభిసారికాగ

వాఘములు చారువంశీప్రభాతనినద
మధురతానీతగోపికామసృణరుచుల.

ః చ్చనిమజ్జీని డచ్చము శృంగారరసవేది సత్కవిరచన గాఁగ
కడసినకదుపులకగుభర్తయట వ్యభిచారిభావాలలో స్థాయి గాఁగ
నెదమైన తోలుఁబెయ్య లాదుఁగుమూఁపురమున వస్త్రాపహారిసంపదలు గాఁగ
మోమెత్తి ప్రోడావు మోము కప్పఁగ నర్ధనారీశ్వరత్వసుందరత గాఁగ
నచ్చ మద్వైత మొకట రూపై యనాది, హరిహరమ్మగు రూపమ్ము నవధరించి
అనుమకొండపాలాల ప్రత్యక్షమైన, తిక్కకవిపల్కు వెల్గులతేట యయ్యె.

*** *** ***

నాఁటికి నేఁటికిన్ తెనుఁగునాట భవత్కథ గంగిరెడ్డిదా
పాటలపాటల న్నడుపు సాధువు కన్నియ గంగిబెయ్య పెం
డ్లాటయు మంత్రయుక్తముఁ గళాపరిపూర్ణముఁ జేతు రాంధ్రు లీ
వేటికి రాఁదగన్ భటులు నేటికి నేటికి స్వాములున్ వృషా!

నాఁటికి నేఁటికిం దెనుఁగునాట గభస్తికి(?) చందమామ కే
లోటును కానుపించదు వెలుంగుల, నీగ్రహరాజి యట్టులే,
కూటికి గుడ్డకేని తెలుఁగుల్ పరతంత్రులు, చూడ మొక్క సీ
యాటయ లోటుగా, కదలరా బసవా! బసవా! వృషాధిపా!

———o———

సవర పాటలు

గిడుగు - వెంకటసీతాపతి

[వృక్షశాస్త్రజ్ఞుని దృష్టిలో పాదపములన్నీ ఒకటే. అశ్వత్థవృక్షములో ఆధిక్యమూ లేదు; నువ్వు మొక్కలో న్యూనతా లేదు. ఆ విధంగానే వైయాకరణుని దృష్టిలో ఒకభాష ఎక్కువా కాదు; మరియొక భాష తక్కువా కాదు. "వ్యాకరణము లేనిభాషలూ" "లక్షణము లేనిభాషలూ" అని అంటారు. అంటే, ఆ భాషలకు ఇంకా ఎవరూ వ్యాకరణముగాని లక్షణముగాని చెప్పలేదని అర్థము; అంతేకాని, వ్యాకరణమూ లక్షణమూ అనేదేదీ ఆ భాషలకు ఉండనే ఉండదని చెప్పగూడదు. ఆ యోగ్యత ప్రతిభాషకూ ఉంటుంది.

సవరలు (శబరులు) గంజాం, విశాఖపట్టణంజిల్లాలలో మన్యప్రదేశములందలి అడవిజాతివారు. సవర భాష ఆర్యభాషలకుగాని ద్రావిడభాషలకుగాని సంబంధించినభాష కాదు. అయినా దానిలో భాషల కుండ వలసినలక్షణము లన్నీ ఉన్నవి. కృదంతాలు, సన్నంతాలు, తద్ధితాలు, భావార్థకాలు మొదలయిన రూపాలు సులువుగా ఏర్పడడానికి సాధ్య మగునట్లుగా భాషాసామగ్రిగల భాష. అందుచేత, నూతనభావములతోపాటు నూతనపదరూపములు పరభాషాపదసాహాయ్య మక్కరలేకుండానే చేసుకొనుటకు సాధ్యమైనభాష. ఈ విషయములో ఇది తెలుగుభాషకు తగ్గిపోదని చెప్పగలము.]

సుశిక్షితుడైన గానకళావిశారదుని కంఠస్వరముకంటెను ఎక్కువ మధురముగా ఉంటుంది కోవెలస్వరము. సకలశాస్త్రవిద్యాపారంగతుని ప్రౌఢవాక్కుకంటెను ఎక్కువ మనోహరంగా ఉంటవి చిన్నిబాలకుల చిలుకపలుకులు. ఆవిధముగానే ముద్దుపలుకులతోను, భావసరళతతోను సవరల హృదయములను పల్లవింపజేస్తూ ఉంటవి సవరపాటలు.

మాటలాడడం వచ్చినప్పటినుండీ పిల్లలలో కొందరికి పాటలు పాడడము సహజంగానే వస్తుంది. వారు తమ ముద్దుపలుకులతో తమ చిన్ని భావాలతో పాటలు కూర్చి పాడుకొంటూ ఉంటారు. ఒకసారి ఇద్దరు తెలుగు పిల్లలు — అయిదేండ్ల బాలుడు — ఆరేండ్ల బాలిక పాటవరుసను ఎట్లు సంభాషించుకొన్నారో చూడండి.

"కమలా! కమలా! కమలాపండు"
"ఐతే నాదే"
"అబ్బా అబ్బా!
నీ దెందు కైందీ? నీవు కొన్నావా?"
"నా పేరు పెట్టావు; నాపండు కాదూ?"

ఏ దేశంలో అయినా, ఏభాషలో అయినా, వాఙ్మయచరిత్రయందలి మొదటిదశ ఇటువంటిపాటలతోనే ప్రారంభిస్తుంది. క్రమంగా పాటలనుండి పద్యాలేర్పడుతవి. పాటలు రాగతాళయుక్తంగా పాడుకొంటారు. పద్యాలు రాగయుక్తంగా పాడగలిగినా చదువుకొనుటకు సైతము చక్కగా ఉంటవి. వాటిలో లయ గుప్తంగా ఉంటుంది. కొంతకాలానికి గాని గద్యరచన ఏర్పడదు. శ్రద్ధతో పరిశీలించి చూస్తే ఈ వాఙ్మయచరిత్రపరిణామము ఎప్పటికప్పుడు ప్రతితరంలోను పిల్లల

పాటలు మొదలుకొని పెద్దల కవిత్వవరకు గోచర మవుతూ ఉంటుంది.

ఒక సవరపల్లెలో నేను బస చేసిన యింట దాసిగా ఉన్న ఒక సవరదాని కూతురు, ఆరేండ్ల పిల్ల ఏడుమాసములు ఈడుగల తన చెల్లెలను జోగొట్టుతూ పాడుతూ ఉండెను :

ఏడువకు ఏడువకు నాచిట్టితల్లీ
ఏడువకు ఏడువకు నాముద్దుచెల్లీ.
ఏడువకు ఏడువకు బంగారుబిడ్డా
ఏడువకు ఏడువకు మారాణిబిడ్డా. ఏడువకు.
ఏడువకు ఏడువకు చిన్నారిబిడ్డా
ఏడువకు ఏడువకు విహగములద్రుడ్డా. ఏడువకు1.

అదివరకు బిగ్గరగా ఏడుస్తూ ఉండినబిడ్డ హీనస్వరంతో అప్పుడప్పుడు గునుస్తూ ఉండడం చూచి, పెద్దపిల్ల తన పాటవరుస కొద్దిగా మార్చి చెల్లెలను జోగొట్టుతూ ఉండెను.

ఊరుకో కనకమా పెద్దపులి వచ్చే
ఊరుకో సుందరీ పాము వచ్చిందీ.
ఊరుకో పద్మమా భూత మిదె వచ్చే
ఊరుకో మధుకరీ దేవ తిదె వచ్చే2.

అంతవరకు నాగదిలో నేను చదువుకొంటున్నాను. అప్పుడే బయటకు వచ్చాను. నన్నుచూచి పెద్దపిల్ల కొంచెము సిగ్గుపడి తనపాట నిలిపివేసినది. "కెనా గాయ్ కెనా గరోయ్ పోజన్ తే' (పాడు అమ్మాయ్ పాడు ; సిగ్గుపడకు) అని నా గదిలోనికి పోయినాను. ఆ వెంటనే ఆబాలిక -

ఊరుకో వెల్లెలా బాబు వస్తారు
ఊరుకో అమ్మాయి కోపగిస్తారు3

అని పాడినది. పై చరణాలు అనుశ్రుతంగా వస్తూఉన్నవైనా ఈచరణంమాత్రం నన్ను ఉద్దేశించి అప్పటికప్పుడు ఆపిల్ల కల్పించి పాడినదే.

ఇటువంటి జోలపాటలు అనేకంగా ఉన్నవి.

కట్టెలకు వెళ్లండి బిడ్డల్లారా -
ఆకులకు వెళ్లండి బిడ్డల్లారా !
వెదురుకంజికి పొండి బిడ్డల్లారా -
పుట్టకొక్కులు తెండి బిడ్డల్లారా !
కూలికై వెళ్లండి బిడ్డల్లారా -
పనులకై వెళ్లండి బిడ్డల్లారా !
ఉప్పుకై వెళ్లండి బిడ్డల్లారా -
మిరెపలకు వెళ్లండి బిడ్డల్లారా !4

ఈ విధంగా గృహోపకరణాలూ గృహోపకృత్యాలూ పేర్కొంటూ ఎన్నైనా చరణాలు కల్పన చేస్తారు.

---

1. ఏడోజ్ ఏడోజ్ తోనాయ్ఖాఁ
ఏడోజ్ గూడోజ్ ఆయీఖాఁ.
ఏడోజ్ ఏడోజ్ రన్నాఓఁ
ఏడోజ్ గూడోజ్ రాజీఓఁ. ఏడోజ్.
ఏడోజ్ ఏడోజ్ లంగారీఓఁ
ఏడోజ్ గూడోజ్ అద్రేసాఓన్. ఏడోజ్.

2. కడింబా సన్నారి కినాఁ ఇరాయ్ తేఁ
కడబ్బా లంగాకి జాడఁ ఇరాయ్ తేఁ
కడింబా తడాతార్ కుల్బాఁ ఇరాయ్ తేఁ
కడబ్బా అడెన్ రోయ్ సోనుమ్ ఇరాయ్ తేఁ

3. కడింబా ఆయీఁ బాబూఁ ఇర్రాయ్ తె
కడబ్బా తోనాఖ్ కఖ్ కఖ్ల త్రైఁ

4. అబల్బా ఇర్బా ఓన్జీ - ఓలాబా ఇర్బా ఓన్జి !
తబజ్బా ఇర్బా ఓన్జీ - బతీబా ఇర్బా ఓన్జి !
బజ్ బా ఇర్బా ఓన్జీ - కంబ్రాబా ఇర్బా ఓన్జి !
బసిడ్బా ఇర్బా ఓన్జీ - మరిస్నాబా ఇర్బా ఓన్జి !

మీతండ్రి వచ్చాడు బిడ్డల్లారా -
మీఅన్న వచ్చాడు బిడ్డల్లారా !
పినతండ్రి వచ్చాడు బిడ్డల్లారా -
పెత్తండ్రి వచ్చాడు బిడ్డల్లారా ![5]

ఈవిధంగా బంధువులపేర్లు చెప్పతూ కొన్ని చరణాలు పాడుతారు.

వడ్లునే దంచుతా బిడ్డల్లారా !-
రోకలీ తెండోయ్ బిడ్డల్లారా !
నిప్పు రాజగజేసి బిడ్డల్లారా -
మండింపజేయండి బిడ్డల్లారా!
సాయంత్ర మైనదో బిడ్డల్లారా -
కూడు వండెదనోయి బిడ్డల్లారా!
నాపిల్ల ఏడ్చునో బిడ్డల్లారా -
జోలె గట్టండోయి బిడ్డల్లారా![6]

ఈ విధంగా వర్ణిస్తూ పాడి తల్లి తనపెద్ద పిల్ల వీపుకు నిద్రబోతూ ఉన్న చంటిబిడ్డను మూటకట్టినట్లుగా జోలెలో కట్టి వంటచేసుకోడానికి వెళ్తుంది. ఈపాటే దంపుళ్లపాటగా కూడా పాడుతారు.

చంటిబిడ్డలకడుపుకాచే ఆచారము సవరలలోసైతము కలదు. ఇంటి ఆడువారిలో పెద్దది - బిడ్డనాయనమ్మో, అమ్మమ్మో - కుంపటిసెగపై నూనె రాచుకొన్న తన అరచేతులు ఉంచి బిడ్డకడుపు కాచుతూ పాడుతుంది:

ఎండ [1]బాగా పెట్టవోయీ సూర్యుడా! ఈ -
[2]సవరబిడ్డను - [3]కాచుకొంటానను బల్కునా
ఎండ [1]బాగా పెట్టవోయీ సూర్యుడా ఈ! -
[2]మనిషిబిడ్డడు [3]కాచుకొంటానంచు బల్కును[7].

ఇందులో ప్రతిచరణమందున్న గల మొదటి భాగము తన రెండు అరచేతులున్న నూనె రాచుకొని రాపాడుకొంటూను, రెండవ భాగము నిప్పుసెగపై పెడుతూను, మూడవ భాగము బిడ్డకడుపుమీద అరచేతులు పెట్టి కాచుతూనూ పాడుతారు. రెండవభాగమందున్న మాటలు మాత్రమే మార్చుతూ ఉంటారు: సవరబిడ్డడు, మనిషిబిడ్డడు, మెఱుపు బిడ్డడు, సొగసుబిడ్డడు, కాంతిబిడ్డడు మొదలైనవి.

అడవులలో ఉండే మృగాలు, పక్షులు, చెట్లుమొదలయినవాటిని గురించి సవరలలో పిల్లలకు సైతము అనేకవిషయాలు తెలుసును. మృగంకానీ పక్షికానీ, ఎప్పుడు ఏది ఏలాగు అరుస్తుందో చెప్పగలరు; ఆ అరుపు అనుకరించగలరు.

---

5. ఊఆనమ్ ఇరాయ్‌లేఙ ఓన్జి -
కామానమ్ ఇరాయ్‌లేఙ ఓన్జి !
గాడీనమ్ ఇరాయ్‌లేఙ ఓన్జి -
తాతానమ్ ఇరాయ్‌లేఙ ఓన్జి!

6. సరోన్ తజ్‌డిజ్తాయ్ ఓన్జి -
ఓన్‌రియఙ పాజాయ్బ ఓన్జి
తొబగిఙ ఎరెయ్బ ఓన్జి -
బజ్నాలె ఇమ్మజ్బ ఓన్జి
ఒరుబ్లె ఒజొల్లె ఓన్జి -
కూడూనమ్ డిఞ్తాయ్ ఓన్జి
ఓన్‌ఞాఙ ఏడాతె ఓన్జి -
లక్కుల్డె ఇంబా ఓన్జి

7. [1]డాగాడాగా ఉయుజ్ - [2]సోరాన్ అఓన్ -
[3]ఇఞ్ఞత్తెనాయ్ గామ్‌తె.
[1]డాగాడ గా ఉయుజ్ - [2]మంద్రాన్ అఓన్ -
[3]ఇఞ్ఞత్తెనాయాయ్ గామ్‌తె.

కోడిపుంజు సాధారణంగా 'కొక్కోర్ జుమ్-కొక్కోర్ జుమ్' అని అంటుందట. కొంచెం ఉషారుగా ఉన్నప్పుడు 'కెక్కెర్ జుబ్-కెక్కెరేకెబ్ - కొక్కోర్ జుబ్ - కొక్కోర్ జుమ్ - కెక్కెరేకెబ్' అని అంటుందట. గద్ద తన పిల్లలను తన్నుకుపోవడానికి వస్తూ ఉన్నప్పుడు, కోడిపెట్ట 'కొబ్ కొబ్ కోబ్ కొకెరేబ్ - కొబ్ కొబ్ కొకెరేబ్' అని తనభయము, ఆతురపాటు తెలియజేస్తూ తన పిల్లలను పిలిచి రెక్కలు చాచి వాటిని చేర దీసుకొంటుంది; అప్పుడు పిల్లలు 'పియెబ్-పియేబ్' అంటూ తల్లి రెక్కల క్రిందికి దూరుతవి. పక్షికూత విని అది మగపిట్టదో ఆడుపిట్టదో పోల్చుకోగలరు. మగకోవెల 'కు ఉకుఉ' అంటే, ఆడుకోవెల 'కుడుకుడు' అంటుందట. ఆడునెమలి 'పెకొాజ్ పెకోజ్' అంటే, మగనెమలి 'మెకొాజ్ మెకోజ్ - పెకొాజ్ పెకోజ్ - మేబజ్ మెబజ్' అని అంటుందట. 'ఇ ఓ ఇఙ్ - ఇ ఓ ఇఙ్' అని బర్రె అరుపు సవరపిల్లలు చక్కగా అనుకరిస్తారు.

సాహచర్యంచేత తమకు మిత్రులయిన జంతువులకు, పక్షులకు తమ ఆటపాటలు కల్పించి సవరలు ఎట్లు పదాలు కూర్చుతారో చూడండి :

నల్ల జీడిపండు తింటూ నంటుంది కమ్మసాలిపిట్ట
కుక్ కుక్ కుక్
కడుపునిండువరకు తింటానంటుంది కమ్మసాలిపిట్ట
కుక్ కుక్ కుక్[8].

ఆ పిట్టలినే పండ్లపేర్లు ఒకొక్కటి చేర్చుతూ ఒకొక్క చరణం కూర్చి పాడుతారు. మరియొకపాట :

కుర్రీ కుర్రీ కుర్ కుర్ - కుర్రీ కుర్రీ కుర్ కుర్.
కుర్రీ! కుర్రీ! కుర్రీ! అంటూ
అంటూ నంటూ నంటూఙ్
గంటెలేకానీ, గంగలేకానీ,
సామలేకానీ, చోళ్లేకానీ
తెస్తాఙ్ తెస్తాఙ్ తెస్తా నంటూ
అంటూ నంటూ నంటూన్
కుర్రీ! కుర్రీ! కుర్రీ! అంటూ
అంటూ నంటూ నంటూన్.
రాగులేకానీ జొన్నలేకానీ
మొలకపుట్టిందా? పుట్టనేలేగా?
తెస్తాన్ తెస్తాన్ తెస్తా నంటూ
అంటూ నంటూ నంటూన్.
కుర్రీ కుర్రీ కుర్ కుర్ - కుర్రీ కుర్రీ కుర్ కుర్[9].

ఇది గువ్వపిట్ట పాట; దాని అరుపు 'కుర్రీ కుర్రీ కుర్ కుర్' గనుక దానిపేరు కుర్ కురఙ్ (కుక్కురఙ్).

---

8. ఒలాయ్ గూరఙ్ జుమ్తాయ్ గామ్తై కంగోజన్
కుక్ కుక్ కుక్
అబకీ పుజఙ్ జుమ్తాయ్ గామ్తై కంగోజన్
కుక్ కుక్ కుక్

9. కుర్రీ! కుర్రీ! కుర్రీ!
గామ్లై గూతాయ్, గూతాయ్, గుతాయ్.
బురోయ్ జా పోజ్, గంగా జా పోజ్,
సాజాపోజ్, సిత్తరీజాపోజ్
ఇఙ్తాయ్, ఇఙ్తాయ్, ఇఙ్తాయ్
గామ్లై గూతాయ్, గూతాయ్, గూతాయ్.
కుర్రీ! కుర్రీ! కుర్రీ!
గామ్లై గూతాయ్, గూతాయ్, గూతాయ్
కుగోయ్ జా పోజ్, కంబుర్ జా పోజ్,
బుడేతేన్ పోజ్, ఎజ్జాపోజ్
ఇఙ్తాయ్, ఇఙ్తాయ్, ఇఙ్తాయ్
గామ్లై గూతాయ్, గూతాయ్, గూతాయ్.

పంచతంత్రం కథలలోను, ఈసప్ కథల లోను ఉన్నట్లు జంతువులున్ను పక్షులున్ను కలసిమెలసి వ్యవహరిస్తూ ఉండడము సవరల కథలలోను, పాటలలోను ఉన్నది.

ముంగి దాల్చినది జన్ని వేషమును
ఉడుము మద్దెలను వాయించినదీ
ఉడుత పంచినది కల్లందరికిని
చెవులపిల్లి వాయించెను వేణువు
నెమలి చిన్న దొక తుడుము పట్టుకొని
డిఙ్ జుబ్ డిఙ్ జుబ్ అని వాయించెను
ముంగి పట్టినది జన్ని తంబురను
డంబుజ్ డంబుజ్ అని వాయించెను
ఉడుము కొట్టినది లుంబస్సర్ లుమ్
బైబై అంటూ వినిపించిందట.
చెవులపిల్లి యట తిరొడొయ్ తిరొడొయ్
పర్డొయ్ యంటూ వేణు వూదెనట10.

సవరపిల్లలు ఆటలాడుకొంటూ పాడే పాటలు అనేకంగా ఉన్నవి.

జాంబవంతునినాట్య మాడుకొందాము
హనుమంతునాట్యమును ఆడుకొందాము
జాంబవంతునిలాగు ప్రాకుదము మనము
హనుమంతులాగునే ప్రాకుదము మనము11.

ఈవిధంగా పులి, నెమలి మొదలయిన జంతువులపేర్లూ పక్షులపేర్లూ పేర్కొంటూ కొన్ని చరణాలుగూర్చి పాడుతారు; పిమ్మట

సంతోషమైనదా? వేడుకలు తీరెనా?
చుట్టురా తిరుగుదాం చుట్టురా తిరుగుదాం గిర్రుమని
తిరుగుదాం.
జాంబవంతునిలాగు పులిలాగు తిరుగుదాం
చుట్టురా తిరుగుదాం గిర్రుమని తిరుగుదాం12.

పిల్లలకు సహజమైన అలకలు మురిపెపులు సవరపిల్లలలోనైతేము కనబడతవి.

ఎందుకు పిల్లా తిడుతూ ఉంటా
వెందుకు పిల్లా కొడుతూ ఉంటావ్?
తబార్ సిక్ దేశం పోతానమ్మా
రగాడ్ సిజ్ దేశం పోతా నమ్మా
ఎవ్వరి నమ్మా తిడతా వికనూ
ఎవ్వరి నమ్మా కొడతా వికనూ13.

కల్లు తాగని సవర నాకు కనబడలేదు. ఆడవాళ్లు, మగవాళ్లు, పిల్లలు, పెద్దలు అందరూ కొద్దిగానో గొప్పగానో ప్రొద్దస్తమానం త్రాగుతూనే ఉంటారు. పూజలకు, పితృ

---

10. కింపడేబఙ్ కుడానఙ్ ఎత్నే తేఙ్
బసరఙ్ ఆతే డెబ్ డిజ్నే తేఙ్
గొండిజన్ ఆతే ఆలీన్ తితియే తేన్
పండేరఙ్ ఆతే పెస్సె జ్నే తేన్.
మారాఙ్ ఆతే తుడుమఙ్ ఇఙ్లై
డిఙ్ జుబ్ డిఙ్ జుబ్ గాఙ్లై డెబే తేన్
కింపడేబఙ్ ఆతే రనజన్ ఇఙ్లై
డంబుజ్ డంబుజ్ గాఙ్లై రజే తేన్
బసరన్ ఆతే లుంబస్సర్ లుమ్ బైబై గాఙ్లై డెబే తేఙ్
పండేరన్ ఆతే తిరుడొయ్ తిరుడొయ్
పర్డొయ్ గాఙ్లై పెడే తేన్.

11. కంబూడ్ తొజన్ తొజొయ్యా
కరూ తొజన్ తొజా య్యా
కంబుడ్ లామఙ్ లామా య్యా
కరూ లామఙ్ లామా య్యా.

12. బల్లోసా పొక్ డెలాయ్ ఇడికొనాపొక్ డెలాయ్
గయ్యార్యాయ్యా గయ్యార్యా య్యా పియ్యార్యాయ్యా
కంబూడ్ గయ్యారాఙ్ కినాగయ్యారాన్
గయ్యార్యాయ్యా పియ్యార్యాయ్యా

13. అమన్ రొయ్ మొనీ కఞ్ కఞ్ లత్తెన్
అమన్ రొయ్ మొనీ తిడ్ తిడ్ లత్తెన్
తబర్ సింగ్ డెసాఞాన్ ఎర్తెరొయ్ లా
రగడ్ సింగ్ డెసా ఞాన్ ఎర్తెరొయ్ రా
బొతెఙ్ తె ఒకిఞ్ కఞ్ కఞ్ లత్తెన్
బొతెఙ్ తె ఒకిఞ్ తిడ్ తిడ్ లత్తెన్

కార్యాలకు కల్లు ముఖ్యము. చూడబోయిన వారికి సైతము కల్లు మర్యాదాగా ఇస్తారు. సాధారణ దినములలో కూడా పొరుగూరి నుండి వచ్చినవారు దాహంగా ఉందంటే కల్లుకుండ వారిముందర పెడతారు.

ఏయింట కల్లుగలదో
ఆయిల్లే రాజగృహము (ననగా నొప్పక)
ఏయింటను గల్లుండదో
ఆయిల్లొక యిల్లు నాక ననదగదుగదా14.

తప్పత్రాగి తెలివితప్పి పడిపోవడం మాత్రం తప్పగా భావిస్తారు. త్రాగుబోతు తనము హేళన చేస్తూ పాడుతారు.

వరిబువ్వ నాకేల వద్దయ్యా వద్దు
జెరుకుపానక మేల వద్దయ్యా వద్దు
కల్లుత్రాగుదు నేను కల్లు త్రాగుదును15.

హేళన చేసేవారికి త్రాగుబోతు సాధారణంగా చెప్పే సమాధానము.

దినమెల్ల కష్టపడి దుక్కి దున్నాను
దున్ని దున్ని నేను అలసిపోయాను
కల్లు త్రాగుదు నేను కల్లు త్రాగుదును16.

త్రాగి పడిపోయిన తనభర్తను చూచి విచారిస్తూ ఉన్న భార్యపాట :

ఈతకల్లు త్రాగి త్రాగి
నామగండు తెలివి తప్పె
నాట్యమాడి నామగండు
తెలివి తప్పె నామగండు17.

అడవిలో చిన్నవాడూ చిన్నదీ కలుసుకొన్నప్పుడు వారు తమ అన్యోన్యప్రేమ పాటలు పాడుతూ తెలియజేసుకొంటారు.

రావె చెలియా పాడుకొందాం
రావె చెలియా ఆడుకొందాం.
నేను మధుపుడ నీవు మధుకరి
నామధూకపు చెట్టుక్రిందను
పాడుకొందాం ఆడుకొందాం18

అని చిన్నవాడు పాడగానే,

రార సఖుడా పాడుకొందాం
రార సఖుడా ఆడుకొందాం
పాటపాడుకు ఆడుకొందాం
ఆటలాడుతు పాడుకొందాం
ఆమధూకపు చెట్టుక్రిందను
ఆడుకొందాం పాడుకొందాం19

అని చిన్నది పాడుతుంది.

---

14. ఉఆన్తై అసూజ్ అలీన్ డకొతెక
కని అసూజ్ రాజాన్ అసూజ్
ఉఆన్తై అసూజ్ అలీన్ అగాసా
కని అసూజ్ నూజ్ తెడ్ కరుజ్ తెడ్

15. వరజన్ ఇాక లుడా తెడ్
ఆకుడా ఇాక లుడా తెడ్
అలీన్ గాతాయ్ఇాక అలీన్ గాతాయ్

16. కుడ్డుబ్ డిన్నా ఇాక ఒర్రొ్రాయ్
ఒర్రె ఒర్రెఇాక మంగాలీక్
అలీక గాతాయ్ఇాక అలీన్ గాతాయ్

17. సిండీసాలక గఆన్ గాతే
తనోజ్జాఇాక తడాయ్తే
తొజక తొజ్లై తనోజ్జాఇాక
జల్లాడేలే తనోజ్జాఇాక॥

18. జాబాగై అకెన్నా
జాబాగై అతొజ్జా
బుజ్ బుజ్ బుడ్ ఇాక
అడజ్ రొయ్ అమన్,
అబానేబ్ అజైతాన్
అకెన్నా అతొజ్జా॥

19. జాబా గై అకెన్నా
జాబాగై అతొజ్జా
కెన్లైకెన్లై అతొజ్జా
తొజ్లైతొజ్లై అకెన్నా
అబానేబ్ అజైతాన్
అకెన్నా అతొజ్జా

తేనెటీగలలో మగ ఆడు భేదములకు సార్థక్యం ఈ క్రిందిపాటలో కనబడుతుంది:

ఛీ! ఛీ! మధుకరి! సిగ్గు లేదటే?
పరిమళ ముండే తావు తెలుసునే?
మధురమైన నీ మధువు నిస్తివా
నా పరిమళమును నీకు నిచ్చెదను
ఛీ! ఛీ! మధుపమ! సిగ్గు లేదురా?
మాధుర్యం గల తావు తెలుసునా?
నీ పరిమళమును నాకు నిస్తివా
మధురమైన నా మధువు నిచ్చెదను[20].

వలపుపాటలు అనేకంగా ఉన్నవి. క్రొత్తపాటలు ప్రతిదినం పుడుతూనే ఉంటవి. వాటిలో మనోహరంగా ఉన్నవి పదేపదే పాడుతూ ఉండడంవల్ల అనుశ్రుతంగా వస్తూ సవరల జ్ఞప్తిలో నిలిచి ఉంటవి. అందులో ఒకటి :

రావే రావే చెలియా!
రావే రావే సకియా!
చుట్టచుట్టుగా పుట్టినయూకో?
మట్టిచిగురో నీదేహము యువతీ!
అని నిన్నందును చెలియా
నిను కొనియాడుదు సకియా!
వలపు పుట్టదే నాపై?
మనసు పుట్టదే నీకూ?
నెమలిపింఛమును బోలినదేహము
పాపటపింఛము బోలినదేహము
గల యువకుడనే చెలియా!
కనవే నన్నో సకియా!
నను గ్రహియింపవె చెలియా!
నను గైకొనవే సకియా!
గోవుతోకవలె సుందరదేహము
బట్టతోకవలె సుందరదేహము
గలయువతీ యని నిన్నే
కొనియాడుదు నో చెలియా!
అకటా అకటా చెలియా!
అకటా అకటా సకియా!
పెడమొగ మెందుకు పెట్టుకొందువే?
వెనుకకు తిరిగెద వెందుచేతనే?
పిలిచిన పలుకవె చెలియా!
మాటలాడవే సకియా!
ముసలివాడనా? చెలియా!
ముదుసలినైతినె? సకియా
ఉపుతకుచ్చువలె పండిపోయెనా?
మంగిజొచ్చువలె ముదిరి పండెనా?
నెరిసిపోయెనా చెలియా!
నాతల, గడ్డము? సకియా!
జోడు గూడుదము చెలియా!
జోడు గూడుదము సకియా!
కత్తెరతోకల మంగలిపిట్టలు,
గువ్వపిట్టలూ కూడినయట్లే
జోడు గూడుదము రావే!
యని నిను బిలుతును సకియా:
కొప్పు చూస్తివా చెలియా!
ఎట్లు ముడిచితినో సకియా!
మంగలిపిట్టలు కట్టినగూడో
పిగిలిపిట్టలే కట్టినగూడో
అనవలెగాదే చెలియా!
ఏమందువో ఓసకియా!

---

20. ఇసీ! ఇసీ! అడజ్ రొాయ్ గన్డొాిియ్ తెడ్ పో
ఉ ఆన్తై డిజ్ సరుమ్ ఈతాగలం అమన్
తిఇఞ్ గై అడజ్ డా అజిడ్
డిజ్ సరుమ్ ఞాన్ తిత్తం తెనమన్.
ఇసీ! ఇసీ! బుజ్ బుజ్ బుడ్ గన్డొాిియ్ తెడ్ పో
ఉ ఆన్తై అడజ్ డా ఈతాగలం అమన్
తి ఇ ఞ్ గై డిజ్ సరుమ్ అజిడ్
అడజ్ డా ఞాన్ తిత్తం తెనమన్.

కోపము వచ్చెనె? చెలియా!
లజ్జ పొడమెనా? సకియా!
చిగురుటాకువలె సిగ్గు పుట్టునట
జొన్న చిగురువలె లజ్జ పొడమునట
అవునా కాదా? చెలియా!
అడుగుదు నిన్నే సకియా! 21

వలపులకాలంలో యువతీయువకులు ఒకరి నొకరు పలుకరించుకోవడంకూడా పాటలతోనే జరుగుతుంది.

వన్నెలాడీ! వన్నెలాడీ!
వెలగపండూ వన్నెలాడీ! 22

అని యువకుడు యువతిని పలుకరించగానే యువతి

వన్నెకాడా! వన్నెకాడా!
అరటిపండూ వన్నెకాడా! 23

అని యువకునికి మారుపలుకుతుంది.

పెండ్లియైనతరువాతను, అత్తవారింటికి పోయే చిన్నదానికి తల్లిదండ్రులు బుద్ధులు చెప్పి దీవిస్తారు:

అత్తవారింటికి వెళ్లవే - నవ్వుకొంటూ నీవు వెళ్లవే!
మామగారింటికి వెళ్లవే - సంతోషమొందుతూ వెళ్లవే!

---

21. ఇఙ్గాయ్ ఇఙ్గాయ్‌లా ఇ తోనాన్!
ఇఙ్గాయ్ ఇఙ్గాయ్ లా ఇ బుఙ్ మఙ్!
కుయ్‌కుయ్ ఓలన్ డోక్ డగ్గోడిన్
తుఖెర్ ఓలన్ డోక్ డగ్గోడిన్ ఇగామ్
తం ఇసలో!
ఇరిసుక్ పోఙ్లా అడ్డేయం?
మొన్నాసీ పోఙ్లా అడ్డేయం?
సిరిబేడఙ్ డోజ్ డగ్గోడాన్
పాపాబేడఙ్ డోజ్ డగ్గోడాన్
ఇతోనాన్ ఇజాడీ!
ఇమా ఇమాలా ఇబుఙ్ మఙ్!
ఇమా ఇమాలా ఇతోనాన్!
అలా తొజఙ్ డోజ్ లంగారీ!
అలాబోజఙ్ డోజ్ లంగారీ!
ఇగామ్‌తమ్ ఇతోనాన్!
ఇసీన్ ఇసీన్ లా ఇబుఙ్ మఙ్!
ఇసీన్ ఇసీన్ లా ఇతోనాన్!
ఇతేన్ ఆసన్‌లా మోడేజ్ తిఙ్?
ఇతేన్ ఆసన్‌లా కంమజ్ తిఙ్?
ఇతోనాన్! ఇగామ్తమ్.
గొడేల్లిఙ్ పోఙ్లా? ఇతోనాన్!
గొడేల్లిఙ్ పోఙ్లా? ఇబుఙ్ మఙ్!
గొండిజఙ్ డోఙ్లా ఇతొలైబాన్?
తెంబేరఙ్ డోఙ్లా ఇతొలైబాన్?
ఇగామ్‌తమ్ ఇతోనాన్!
అజాడేనే లా ఇతోనాన్!
అజాడేనేలా ఇబుఙ్ మఙ్!
కొరొంతాఙ్ డోఙ్లా జాడేనన్;
కుర్కురఙ్ డోఙ్లా జాడేనన్
ఇతోనాన్! ఇగామ్‌తక్.
ఉకేఙ్ జా కొడిజ్ అడకోక్
గిల్లెపో యాంతెగాల్లెమెడకు?
కొరొంతాఙ్ డోఙ్లా ఉయుబఙ్
తింకోడుఙ్ డోఙ్లా కుంమెబక్
ఇగామ్‌తమ్ ఇతోనాన్!
బనఙ్‌రబ్ పోఙ్లా ఇడేతమ్?
గనన్‌రొంయ్ పోఙ్లా ఇడేతమ్?
బొలొయ్ ఓలఙ్ డోక్ గనఙ్‌రొయ్,
కంబుర్ ఓలఙ్ డోజ్ గనఙ్‌రొయ్
ఇజ్జాపో ఇగామ్‌తమ్.

22. లంగీబొయ్! లంగీబొయ్!
కైతాగూర్ లంగీబొయ్!

23. లంగామర్! లంగామర్!
కింతేగూర్ లంగామర్!

నీయత్త నికమీద తల్లిగా- భావించిచూడవే సూతురా!
నీ మామ నికమీద తండ్రిగా భావించిచూడవే సూతురా!
నీభర్తయికమీద రాజు గా-మాయింటి నేలు చూనుండుగా!
అతనిల్లుమాడవే నేడుగా-నిజముగా నీయిల్లె ఆయెగా!
నీకతడు రాజుగా ఉండునే-నీవతని రాణివైయుండవే!
అతనింటిపంటవైయుండవే-అతనింటి లచ్చివైయుండవే[24]

తన అక్కను తోడ్కొని పోవుటకు తన బావ వచ్చినప్పుడు తన అక్కయెడల అత డెట్లు ఆచరించవలెనో కొంచెం హాస్యరసంతో అతని మరదలు చెప్పేమాటలు ఈక్రింద నుదాహరించిన పాటలో కనబడతవి:

వద్దు దంచు పనుల బెట్టి నొప్పింపకు నాసోదరి
వంటపెంట పనుల బెట్టి బాధించకు నాఅక్కను
పొయ్యి మంట బెట్టుమనుచు నొప్పింపకు నాసోదరి
కట్టెమోపు కొట్టుమనుచు బాధించకు నాఅక్కను
పెండ్లివారి యింటికైతె పంపింపుము నాసోదరి
నాట్యమాట మాతునంటె వెళ్లనిమ్ము నాయక్కను
చక్కగ తలదువ్వుకొనగ హెచ్చరించు నాసోదరి
నాట్యమాడ వెళ్లునంటె వెళ్లనిమ్ము నాయక్కను[25].

పిల్లకు ఇష్టంకాని పెండ్లిసైతము జరుగుతూ ఉంటుంది. అత్తవారిల్లంటే గండంగా జూచి భయపడిపోయే కోడం డ్లున్నారు.

చేపలను బట్టుకొను జాల రిజ వచ్చె
ఏడుస్తు నో యమ్మ ఏడుస్తును.
వలయొగ్గినా డిచటి జలములోపలను. ఏడుస్తు.
చేపలన్ని యిచట చెదిరిపోయినవి. ఏడుస్తు.
నేనుమాత్రము వలను తగులుకొన్నాను. ఏడుస్తు.
నన్ను పట్టుకు నితడు పెడలిపోతాడు[26]. ఏడుస్తు.

పూర్వపరిచితుడై మొదట తనయందు వలపు చూపి, పిమ్మట తన నెడబెట్టి మరల కొంతకాలమునకు తనయింటికి వచ్చిన కాంతునిపై తనకుగలకోపము ఎంత నేర్పుగా సవరవనిత చూపిస్తుందో చూడండి :

ఏడుస్తూ నే నుంటే- నీవు నవ్వుతావుగా ?
వెళ్లవయ్యా వెళ్లువెళ్లు
నాయింటికి నీవు రాకు-వెళ్లవయ్యా వెళ్లువెళ్లు. ఏడుస్తూ.
నిన్ను నేను పిలువలేదు-వెళ్లవయ్యా వెళ్లువెళ్లు. ఏడుస్తూ.
ఎందుకోసం వచ్చినావు-వెళ్లవయ్యా వెళ్లువెళ్లు. ఏడుస్తూ
నీ యింటను పని లేదా-వెళ్లవయ్యా వెళ్లువెళ్లు. ఏడుస్తూ.
నిన్ను నేను కోరలేదు-వెళ్లవయ్యా చెవిటివాడ[27]. ఏడుస్తూ.

---

24. కినార్ సూజన్ ఇజ్నా మఅజ్ మాల్లె
కుఞార్ సూజన్ ఇజ్నా మొడిఞ్ డాలె
కినార్నమ్ యాజ్నమ్ ఆంబ్రి గలమ్నా
కుఞార్నమ్ ఉఆనమ్ ఆంబ్రిగలమ్నా
తనోజ్బానమ్ సూజ్నమ్ అరాజాడేలె
అసూజన్ నమ్ సూజ్నమ్ అజాడీన్ డేలె
అమఞ్ అనిఞ్ అరాజ్ బోయ్ డేలమ్
అమఞ్ అనిఞ్ అసిరీ బోయ్ డేలమ్.

25. తజ్ తజ్ డిజ్ జా అబాఞ్ డోజ్ తోనాఞ్ఞ
డిఞ్ డిఞ్ నాజా అబాఞ్ డోజ్ కాకిఞ్ఞ
తుజల్ తోడ్ జా అబాఞ్ డోజ్ తోనాఞ్ఞ
అజల్ బాజా అబాఞ్ డోజ్ కాకిఞ్ఞ.
సింద్రుజ్ సూజ్ బా బఞాయ్యా తోనాఞ్ఞ
గి గి తోక్ బా బఞాయ్యా కాకిఞ్ఞ
పాపా ఊబా బఞాయ్యా తోనాఞ్ఞ
తోజ్ సేజ్ బాజా బఞాయ్యా కాకిఞ్ఞ.

26. ఞమ్ యో మరన్ ఇర్రాయ్
ఏడాతేనాయ్ యాజ్ ఏడాతేనాయ్
గనేరన్ అనిన్ డాలేజన్ సెల్లె. ఏడాతే.
యెర్రేజీ అమోన్ సబ్బిఞన్. ఏడాతే.
గనేరన్ ఞేఞన గత్రిఞ్. ఏడాతే.
ఞల్లెఞ్ఞ అనిఞ్ యెత్రె. ఏడాతే.

27. ఏడాతేనాయి ఞాన్; మఅజ్జెపోజ్ అమన్ ?
యొరా యొరా యొరా
ఇడ్డోజాయ్ సుఊజ్ ఞాన్ యొరా యొర్రా యొరా. ఏ.
అమన్ ఞేన్ అగ్గాడిజ్జమ్ యొరా-యొర్ధా యొరా. ఏ.

తన్నెడబాసిపోయిన భర్తరాకకై తహ తహ లాడుతూ అతనిని వెదకి తోడ్కొని రమ్మని తమ్మునితో చెప్పతూఉన్న విరహిణి పాట ఏవిధంగా ఉంటుందో చూడండి:

త్వరపడవోయ్! తమ్ముడ! త్వరపడవోయ్!
మూడో నాలుగో ఏండ్లు గడచినవి
నా ప్రియకాంతుని చూడనైతినోయ్
ఆయిదుపంటలును వెల్లిపోవునోయ్
నాప్రియకాంతుని చూడనైతినోయ్. త్వర.

ఎందరో తండ్రులు ఎందరో అన్నలు
ఉంటేనేమిటి ఎవరికి కావలె
నా మనోహరుడు ఇట లేకుంటే
నా చెంతకు నతడిక రాకుంటే. త్వర.

సిరిసంపద లిక నెన్ని యుండనీ
ఉంటే నేమిటి; ఎవరికి కావలె?
నాప్రియకాంతుడు రాకుంటే నా
మనసు నిలువదోయ్ ఇక నీచోటను28. త్వర.

ఒక విరహిణి అడవిలో పనిచేసుకోడానికి పోయి, ఏమీ తోచక అటు ఇటు తిరుగుతూ తాను దుఃఖిస్తూఉన్నా అక్కడి చెట్లూచేమలూ, పిట్టలూ, తుమ్మెదలూ సరదాగా పాడుతూ ఉన్నట్లు భావించి వాటిని పలుకరిస్తూ చెప్పేమాటలు ఈ క్రింది పాటలో సూచిస్తున్నాను.

ఏమి పాడెదవు ఏమి పల్కెదవు
దుఃఖముతో నే నేడుస్తుంటే.
ఆనందిస్తూ మామిడిచెట్టా!. ఏమి29.

ఈవిధంగా ఒకొక్కచెట్టుపేరో పిట్టపేరో చెప్పి చరణాలు కూర్చుతూ పాడుతారు.

అత్తబాధ, మగనిబాధ పడలేని పెండ్లాము ఘోష వర్ణిస్తూ ఒకపాట ఉన్నది. అందులో

పులికొడుకు నామగడు
ఆడుపులి నాయత్త
చిన్నయావును నేను30

అనే చరణాలు కలవు.

మగడు వల్లని పెండ్లాము తనయౌవనం పోగలాగున, ఆవిరిలాగున వృథా అయిపోతున్న దని, తాను మామిడి, ఈత, ఇప్ప, కొబ్బరిపిందెలు రాలి చెడినట్లే నశించిపోతున్నానని ఏడుస్తుంది.

ఇతేనాసన్ అమక్ ఇరాయ్ యెరా యెరా యెరా. ఏ.
సుఊబ్నుమ్ ఇతేజా బారాతెడ్ పా
యెరా యెరా యెరా. ఏ.
అమక్ ఖోన్ లుడా తెడ్ ఏకల్లా! యెరా యెరాయెరా. ఏ.

28. బయానా డోక్ ఉబ్బడ్ బయానాడోక్.
ఫర్సుం ఉంజి మిన్ను ఖ డేలే
తనోజ్బాఖాక్ ఎర్గనిఖాన్
మొల్లాయ్ మిన్నుమ్ జానక్ మాల్లె
తనో జ్బాఖాక్ ఎర్గని ఖాన్. బయానా.
డజిక్ ఉ ఆ ఖోక్ పజిక్ కాకన్ ఖోన్
డకోలెన్ డేన్ జితేన్న కాారా

తనో జ్బాఖాన్ అగాసాడేన్
మజ్బాఖాన్ అనిల్లాయెండేన్. బయానా.
డజిక్ జంద్రుమ్ డజిక్ గంద్రా
డకోలెన్ డేన్ జితేన్న క్కారా
తనోజ్బాఖాన్ అనిల్లాయెంజక్
మన్నా సుఖాన్ తెన్నె అడ్డేయే. బయానా.

29. ఇతేన్ కన్తే ఇతేన్ గాప్తే
మతేడాలిఖ్ మల్గాడాలిఖ్.
మొఓఖ్ డాలె ఉడానేబ్. ఇతెన్.

30. తనోజ్బాఖాక్ అఓన్- కిడ్
కినార్ఖాన్ అయాక్ కిడ్
సన్నాసన్నాఖాన్ తజ్లిఖ్

ములలోను, ఈ దిక్కున చింతపండు అంగడిలోను, ఆ దిక్కున తాజమహాలులోను, ఈవైపున నూడిన మాకుడులోను, ఆవైపున పూర్ణచంద్రబింబములోను, ఈవలంకున రాబందులోను, ఆవలంకున రాజహంస లోను, ఈకెలంకున సురికిసంటలోను, ఆ కెలంకున మానససరోవరమందును గల వేర్వేఱుతలంపుల నెఱిగిన వాడగుడు తన మనసునకు వచ్చిన సుందరసృష్టి నే తనది గావించుకొని అనుకూలశయ్యలో దానిని జేర్చి వికృతవస్తువులను వికృతచిత్తులకు వదలివేయును. ఈవ్యక్తులు తమ చిత్తములకును తామెన్నుకొను వస్తు చిత్తములకును సరిపడు కంపుగొట్టు మాటలందే తమ తలపులను వ్యక్తీకరించుకొందురు.

కావున సాధారణపరిస్థితులయందు మాటనుబట్టి మానసికస్థితిని గుర్తింతుము. అమృతోక్తులు చెవిని బడి నప్పుడు వాని నుచ్చరించినవానిహృదయము కమలసన్నిభ మనియు, అరవింద మెఱుంగు వాని దృష్టి నాకర్షించి యుండు ననియు గ్రహింతుము. వెఱితీఱు నుడువులు కవిహృత్తామరకు నసుబాటు దెచ్చునని గ్రహింతుము.

ఆత్మప్రకాశ మొసరించుకొనుట సౌందర్యముయొక్క సహజలక్షణము. అడుగుననేయుండి దౌష్ట్యమున కొడిగట్టుట కుత్సితముయొక్క స్వభావము. జగదీశుడు ఈడెన్ (Eden)లో నుండు ననియు, సాటన్ (Satan) హేడ్స్ (Hades)లో నుండు ననియు బైబిలు తెలుపుచున్నది. స్వర్గమున కూర్ధ్వదిశ యంగును, నరకమునకు భూమిదిగువను చోటు లొసగితిమి. అడుగునయుండునది దిగువ నుండునదేకదా! దివ్యసౌందర్య మీశ్వరహృదయమున నిలీనమై యుండక బ్రహ్మాండమున నిండుకొనలేదా?.. మురికి కాలువలు లోకుల కన్నుల బడక నాటంగములందు దొంగలవలె మసలవా? వియన్నది గట్టులదొరశిరమునుండి మహోద్వేగమున నురలలేదా? ఉత్కృష్టభావ మెందును ఖైదీయై యుండనేరదు. ఇది పరార్థకీవి. మూర్తీభవించిన దివ్యభావమైన శ్రీకృష్ణుని ఖైదునందు నిలుపుటకు కంసునకు శక్యమాయెనా? కవిప్రతిభ కృష్ణపరమాత్మునివలె అద్భుతరీతి నాత్మప్రకాశము గావించుకొనును సుడీ! ఇది ఎందు ప్రకాశమునో అందు బృందావన ముండుట తథ్య మని విశ్వసింపుడు.



కవి

శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

నగసానువులయందు నటియించు జలదాన
  ప్రణయ వార్తాహరుఁ బడయఁగలవు
అహిమాంశుతీక్ష్ణత కాఁగిరా వార్బిందు
  వున జీవితచరిత్ర పొందఁ గలవు
అతిభయంకరతమోవృతపితృవనసీమ
  వీరులసత్కథ లేరఁగలవు
జాడయేని యెఱుంగఁజాలని శైథిల్య
  ములఁ బూర్వవిభవముల్ తలఁపఁగలవు
  శాస్త్రవేత్తల దూరదర్శనియు సూక్ష్మ
  దర్శనియుఁ జూపలేని యత్యంతచిత్ర
  వస్తుదర్శనమున కెటులం టియుగ్రత
  మొక్కటి సృజించుకొనినావొ కవీంద్ర!

సారామ్రపల్లవాహారంబుచే కుల్కి
  యింపుగా పాడు కోయిలవెలంద
ఇనకరాలంకృతి నెనలేని సుఖముచే
  తనివొంది వికసించు తమ్మిపడతి
తరుణసమీరగాత్రస్పర్శసుఖమున
  పులకించి చలియించు పూవుకన్నె
విహగగీతముల కువ్విళ్లూరి లయగతి
  పాటింపఁ గల సెలయేటిజోటి
ఎపుడు నిను వీడకుండ వసించునిట్టి
అమల చరితలు నెచ్చెలు లగుట నేమొ
హాయి,మాధుర్య,మామోద, మతులితమగు
ధారయున్ నీదు వాక్కున తాండవించు.

మూడు నవ్యకావ్యాలు

కోలవెన్ను రామకోటీశ్వరరావు

[ఈనడుమ మద్రాసు, 'ఆల్ ఇండియా రేడియో' స్టేషనునుంచి 'కల్యాణకింకిణి', 'వకుళమాలిక' 'దీపావళి', అను మూడు నవ్యకావ్యములను గురించి శ్రీ కోలవెన్ను రామకోటీశ్వరరావుగారు 'బ్రాడ్‌కాస్టు' చేసిన పరిచయ ప్రసంగ మిది.— భా. సం.]

౧

ఈ సాయంత్రం మనం పరిశీలించే మూడుకావ్యాలూ గుంటూరునుండి నవ్య సాహిత్య పరిషత్తువారు ప్రచురించినవే. శుభంగా 'కల్యాణకింకిణి' అనే పద్యకావ్యాన్ని మొదట పరిచయం చేస్తాను. కవి మల్లవరపు విశ్వేశ్వరరావు. ఇదివరకే 'మధుకీల'ను రచించాడు. ఇది రెండోకృతి. దీనికి 'కల్యాణకింకిణి, అని పేరు ఎందుకు వచ్చిందో ముందు వినండి. 'శాంతినికేతనం'లో తనసహాధ్యాయీ, పైగా 'సుహృన్మణీ, సహృదయుడూ' అయిన బెజవాడ గోపాలరెడ్డికి పెండ్లికానుకగా దీనిని సమర్పించాడు. ఆ కృతిసమర్పణ జరిగినప్పుడు చూసినవారందరికీ చాలా ముచ్చ టేసింది. అంకితమిస్తూ విశ్వేశ్వరరావు చదివిన పద్యాలలో మరో చమత్కారం చేశాడు. "ఏమయ్యా, గోపాలరెడ్డీ! మీ ఆవిడ 'శాంతినికేతనం' లోనే చదువుకున్నది. ఆవిడా నిన్నే వరించింది. నా కావ్యకన్యకా నీపొత్తే కోరింది. కాని ఇబ్బంది లేదు. మీ రిద్దరూ కలభాషిణులే,

"చింతాక్రాంతశుణముల
శాంతసుధాలాప నిత్యసౌఖ్య మొసగుతఱి"

అని దీవించాడు. సవతులపోరు ఉండదని అభయమిచ్చాడు. పుస్తకంకూడా కల్యాణ మహోత్సవానికి తగినట్టే పసుపు అట్టమీద కుంకుమరంగు అక్షరాలు ముద్రించాడు. రాజపుత్రచిత్రాలలోనుంచి సేకరించి నాట్యసుందరుల బొమ్మనుకూడా ఎంతో అందంగా వేశాడు.

పాతికసంవత్సరాలనాడు శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారి 'తృణకంకణము'తో ప్రారంభమైన నవ్యకవితాస్రవంతి ఎడతెరిపిలేకుండా ప్రవహిస్తూనే ఉన్నది. ఈ మధ్య రెండుమూడేళ్లక్రింద కొంచెము మందగించిందేమో అనిపించింది. ఏమంటే ప్రధానకవులైన ఒకరిద్దరిని గురువులుగా అంగీకరించి వారినే అనుకరిస్తూ అనేకమంది చిన్నకవులు వ్రాయడం పరిపాటి అయిపోయింది. "వారిలో ఉండే ప్రతిభా, భాషాప్రభుత్వమూ వీరిలో లేకపోవడంచేత అంతకంతకు నవ్యకవిత్వము నీరసిస్తున్నదేమో! క్రొత్త పోకడలు లేవే! అంతా పాడినపాట గానే ఉన్నది!" అనుకున్నాము. కాని, శ్రీరంగం శ్రీనివాసరావు, పిలకా గణపతిశాస్త్రి, ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి, రుక్మిణీ నాథశాస్త్రి, విశ్వేశ్వరరావు రచించిన

కృతులు చూస్తే, మళ్లీ ఆశ మొలకెత్తింది. వీరిలో నూతనత్వము భావంలోనూ, భాష లోనూకూడా ప్రస్ఫుటమౌతున్నది. ఆ కథా కలాపమంతా అటుంచి 'కల్యాణకింకిణి' సంగతి చెపుతాను.

కవికి 'ఈలోకకఠోరయాత్రలో' తన జీవితాన్ని ఆవరించిన చీకట్లో, ఒక తేజస్స్వ రూపిణి, ఒక కాంతిమయి క్రొత్త వెలుగును విరజిమ్మింది. అంతటితో, తనలో నిగూఢమై ఉన్న శక్తులన్నీ మేల్కొన్నవి. పాపం! ఎన్నో దినాలు "అవనీతీరాలెల్ల వెదకివేసరి" నాడు - ఆమె "నవపల్లవకోమల పాద పద్మరజంకోసం". "హృదయంలో ఒంటరి"యై నిలబడి "ఏదో పదముల సవ్వడికై ఎదురు చూచి చూచి" అలసినాడు. అట్టి స్థితిలో, "అలపుగొన్న స్వప్నజీవితావరణం" మేలుకొలిపి, హృదయభవనంలో దీపం నిలిపింది ఆమె. ఆమె దివ్యంగా పాడగలదు. ఆమె పాట,

"మనసులో మనసులో
కలిసిపోయెను దీపకళికలో
కాంతిలా!"

ఆమెగానం వింటూ, ఆమెమ్రోల "నా గసర్వం పడగలాగు" అయిపోయినాడు. కాని ఉపాస్యదేవత ఎల్లప్పుడూ సమక్షంలోనే ఉంటుందా? తెరచాటవుతూ ఉంటుంది. అందుకనే,

"మినుమన్నులం దెల్లెడను వెదకునాయెదకు
దరిసెన మీ్మయవే! వరగాయనీమణీ!
తరలిరావే తెరలచెర వీడి ఓరాణి!"

అని ప్రార్థిస్తాడు. ఆమె అనుగ్రహం వల్లనే తన కవితాలత పుష్పించింది; తన హృదయవీణ మ్రోగింది:

"ఏనాటి దీరతన్ని నేటి
కానాసిత దివ్యవీణ!—
ఈనాటికి తెరని నీనాటి
తీవు బాల! నా బ్రదుకున"

అని ధన్యవాదాలు చేస్తాడు.

ఈ కావ్యంలో, కవి తనకు కలిగే ఆశ, నిరాశ, దివ్యములైన అనుభవాలు వర్ణించాడు. ఒకప్పుడు "లలితార్ద్రజీవనద మింకు నొకో మరుభూమి" అని భయపడతాడు. ఒకప్పుడు,

"లోకమ్ములో నవా
లోక మ్ముదయమయ్యె!
శోక మ్ముశిశిపాదు
మోకవీ! ఓకవీ!"

అని జయభేరి మ్రోగిస్తాడు.

"హృదయకేదారసీమ లందిప్పు డేను
సస్యసంపదలను రాశి సలిపి"

ఆమెకు ఉగాదికానుకగా అందిస్తాడు. దానిని స్వీకరించడము భరమనితోస్తే, చివరకు తన ఆశీర్వాదమైనా గ్రహించమంటాడు. ఎటువంటి ఆశీర్వాదము?

"మలయగంధానిలముకన్న జలువ లోలయు
సుమసుకోమలము".

కావ్యానికి కడపటిభాగం "మోహితవని" అతిరమ్యంగా ఉన్నది.

"ఆవియత్కన్య నేత్రాంచలబిందు
వాకాశకుసుమమే యనునేమొ రేపు!"

అన్న సంశయము ఉండనే ఉన్నది. కాని, వెంటనే,

"అన్వేషణమ్మునం దలసి వాడితివి,
ఆశీస్సులోయి నీకగు నాత్మకాంతి!"

అన్న చల్లనివాక్యము వినపడుతుంది. కవికి మన అందరి ఆశీస్సుకూడా అదే.

"ఎవరో ఒక కవికి సంబంధించిన ఈ అనుభవాలూ, ఈ విలాపాలూ కావ్యంగా ఎందుకు వ్రాయాలి? లోకానికి వీటితో ఏమి ప్రసక్తి?" అంటారేమో! అనుభవాలు లోకంలో అనేకమందికి వస్తూనే ఉన్నవి. కాని జీవితమనే సముద్రాన్ని మథించి, అందులో వెలువడే అమృతాన్నీ, హాలాహలాన్నీ సమంగా ఆస్వాదించి, ఆ అనుభవంవల్ల తాము తరించి, ఇతరులను తరింపచేయగలశక్తి కవులకే ఉన్నది. ఇంత చిన్నతనంలో, ఇంత ఉత్తమకావ్యం వ్రాసి ధన్యుడైన విశ్వేశ్వరరావు ఆంధ్రకవితాకన్యకు ఇంకా ఎన్ని అలంకారాలు దిద్దుతాడో! పోనుపోను, సమాసభూయిష్ఠమైన సంస్కృత శబ్దజాలాన్ని తగ్గించమనీ, పదముల రవళికయొక్క సమ్మోహమునుండి తప్పించుకోమనీ కోరుతున్నాను.

౨

తరువాత శ్రీ శివశంకర శాస్త్రిగారి 'వకుళమాలిక'. శాస్త్రిగారు చాలా సంవత్సరాల క్రిందట 'సాహితీ సమితి'ని స్థాపించి, ఇప్పటికి సుప్రసిద్ధులైన కవులనూ రచయితలనూ చిన్ననాడే చేరదీసి, ప్రోత్సహించి, వారికృతులను ప్రకటించి, ఆంధ్రలోకానికి అఖండమైన సేవ చేశారు. అందుకనే, ఈ రచయితలంతా శాస్త్రిగారిని "అన్నగారూ!" అంటారు. అదే రూఢమైనది. వీరు స్వయంగా రచించిన కావ్యాలలో 'హృదయేశ్వరి' అనే ప్రేమగాథ పేరుమోసింది.

శబ్దాడంబరాలూ, కృత్రిమాలంకారాలూ, విపరీత వర్ణనలూ లేకుండా అందమైన శైలిలో, స్వచ్ఛమైన, అగాధమైన ప్రేమను వర్ణించారు. ఇటీవల వీరు రచించిన వాటిలో ముఖ్యంగా చెప్పవలసినవి 'పద్మావతీ చరణచారణ చక్రవర్తి' అనేనాటికా, ఈ 'వకుళమాలికా'. 'వకుళ మాలిక'లోని ఇతివృత్తం 'హృదయేశ్వరి'కి అనుబంధంగా ఉన్నది. నాయకుడు స్వయంగా తన అనుభవాలను చెప్పక, నాయిక తనకు ప్రేమ చిహ్నంగా సమర్పించిన వకుళమాలికచేత చెప్పిస్తున్నాడు. ఉద్విగ్న హృదయుల ప్రేమ వలెనే, ఈ వకుళమాలిక సువాసన వీడకుండా ఎంతకాలమైనా పేటికలో ఉంటుంది. నిర్జీవమైన పూలదండకదా అనుకోకండి:

"ప్రాణ ముండుటె కాదు
ప్రమదమో దుఃఖమో
కలుగుచుండును నాకు
కారణంబును బట్టి

* * *

ఎడనెడ స్వామి
యమృతహస్తము తాక
ఉదయమందును యావ
న్నోద్రేక మెదలోన"

అని చెపుతున్నది. నాయికా నాయకుల ప్రేమోదంతం ఈ మాలికకు తెలుసు. వారు ఒకరినొకరు సందర్శించి ప్రేమించుకోవడం కళ్లారా చూసింది. తనకు జీవనదాత్రి అయిన నాయికనూ, స్వామి అయిన నాయకునీ సమానంగా ప్రేమిస్తున్నది.

"ఎంత చక్కనిచుక్క
ఇందిరాలలితాంగి!
ఎంతకోమలహస్త
మిందిరా కన్యకది"

అని నాయికనుగూర్చి,

"పుష్పాలికనే
పుష్పించునే
[illegible]
పుష్పోత్రితే
అంగనే కరియుం
అప్సరస్సు వనిగా
కాలింపు వేడుక
కంటే వే దేశా!"

అని నాయకుని బాస్పై అనుకుంటుంది.

శ్రీకృష్ణ శాస్త్రిగారికి ఈకావ్యాన్ని కృతిఇస్తూ కవిగారు "ప్రేమనగర్‌కీ రాహ్ కఠిన్ హై" అన్నసూక్తిని జ్ఞాపకంచేశారు. నిజమే ప్రేమనగరానికి మార్గము కఠిన మైనదే.

నాయకుడు తన భగ్నహృదయాన్ని పదిలపరచుకొని, కథ జరిగినపిదప చాలా కాలానికి స్మృతిపథంలో మిగిలిన కొన్ని సన్నివేశాలనూ, ఘట్టాలనూ ప్రశాంతంగా తలుచుకుంటున్నట్టు కనపడుతుంది. కఠిన మార్గాన్ని అనుసరించేటప్పుడు చూపించే ఉద్వేగమూ, ఆందోళనా, ఆశానిరాశల మధ్య నడిసముద్రపు తుపానులోవలె కొట్టు కోవడం ఇవన్నీ ఈకావ్యంలో కనిపించవు. శైలిలోకూడా నెమ్మదీ, తూకమూ ఉన్నవి కాని, గాఢాంధకారంలో వెలుగుకై పరితపించే ప్రేమయాత్రికుడి మాటలలోని ఆవేదనా, నిమ్నోన్నతాలూ కనిపించవు. ఇందుకు ఒక్కటే సమాధానం. ఇది పుష్పమాలిక ఎన్నాళ్లకో చెప్పినకథ. నాయకుడు చెప్పడం లేదు.

అంతాఆశాభంగమైంది. ఆకాశహర్మ్యాలన్నీ కూలిపోయినవి. ఈ విధంగా కావ్యం పూర్తి కావడం రసాభాస మనుకుంటారేమో? ప్రేమించడమే గొప్పసాహస. దాని ఫలితాలు ఏవిధంగా ఉంటవో ఎవరు చెప్ప గలరు? వినండి వకుళమాలిక ఏమంటు న్నదో?

"ఆమె స్వామికి లభ్య
యగుట కలలో వార్త!
ఆతడామెను మరచు
టన్న కలలో వార్త!"

మరపురాని ఈప్రేమవృత్తాంతమే జీవితమార్గాన్ని జ్యోతిర్మయం చేస్తుంది.

3

ఇక శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రిగారి "దీపావళి"ని పరిశీలించుదాము. వీరు అప్పుడప్పుడు పత్రికలలో ప్రకటిస్తూ వచ్చిన పద్యాలనూ, పాటలనూ మీలో చాలామంది చదివే ఉంటారు. సాహిత్యసభలలోనూ, విడిగానూ వారికృతులను హృదయంగమంగా చదివి వినిపిస్తే విన్నవారు కూడా ఉండవచ్చును. కాని సంపూర్ణంగా సర్వాంగ సుందరంగా, ఈనాటికి "దీపావళి" అనే కావ్యసంపుటం బయలుదేరింది. కవిగారి మిత్రులైన శ్రీ నూతక్కి రామశేషయ్యగారు కృతిపతులు.

ఈ కావ్యంలోని ఒక్కొక్కపుటనూ తిరగవేస్తుంటే, చదివినవాటినే మళ్లీ చదువుతుంటే చెప్పనలవికాని ఒక ఆవేదనా, ఆవేదననుమించిన ఆనందపారవశ్యమూ అనుభవించాను. నాలుగేళ్లక్రిందట శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారూ, శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారూ కలిసి రచించిన "సౌందరనందం" చదివాను. ఇప్పుడు "దీపావళి" చదివాను. రెండూ గొప్పకావ్యాలే. ఒక కవి అన్నట్టు

"వేసవి మండుటెండలన్
చే యొక టడ్డుచేసికొని,
చెమ్మట లోడగ ముండ్లబాటలన్
పోయెడు"

బాటసారులకు, ఈ "దీపావళి"కావ్యం చల్ల గాలివలె, పుష్పసౌరభంవలె హాయి కొలుపుతుంది. శాస్త్రిగారు సిద్ధహస్తులు.

'జయగీతి', 'కాగడా', 'కాంక్ష' దేశభక్తి ప్రబోధకములు. ప్రేమభిక్షుకై ప్రియురాలిని అర్థించేగీతాలు కొన్ని ఉన్నవి. 'యాత్ర', 'కృతజ్ఞత', 'నిరసనము' ఇటువంటివే. 'కృతజ్ఞత'లో

"అలరులకుబోలె నా హృదయమ్మునకును
జన్మమున కొక్కటే వికాసమ్ము సకియ!"

అనీ, 'నిరసనము'లో

"విరిని సమయుటే ఫలమని యెరిగియును
విరి సేనయ బాడుచును బోవు కెరటమట్లు
ఘోర మరణాంతక మ్మనుకొనియుగూడ
వేగిపోవు నాబ్రదుకు నీప్రేమకొరకె"

అనీ జాలిగా చెప్తాడు. ఈ కృతులన్నీ ఎవరికి వారు చదువుకొని ఆనందించవలసినవే.

తమ హృదయంలో అపారమైన ప్రేమజలధి ఉన్నదనీ, ఆప్రేమను ఎవరికి అర్పించడానికి ఉత్సాహపడినా అందరూ నిరాకరించేవారేననీ, పొంగిపొరలిపోయే ఈప్రవాహమంతా అడవినికాసిన వెన్నెలవలె వృథా కావలసిందేనా అనీ, నెలలు, సంవత్సరాల తరబడి అహోరాత్రాలూ వ్యథనుపొందే జీవులు లేరా? ఈకవి అట్టివాడే. ఈజీవితమంతా ప్రేమవిహీనమై మోడువలె కనిపిస్తుంది. విసిగి వేసారి, తెన్ను కానక, ఏదో ఒక సుముహూర్తంలో, ఈ తోటి మానవుల ప్రేమకై వాపోవడం వ్యర్థమనీ, ప్రేమకంతా నిధానమైన ఆ పురుషోత్తముడికే ఈ ప్రేమను సమర్పించుదామని నిశ్చయము కలుగుతుంది. ఆ నిశ్చయానికి రాలేనంతవరకూ, "ఇంతగా ప్రేమకై విలపించే ఈ దుఃఖజీవికి శాంతి సమకూర్చే వ్యక్తి — భగవంతుడే కాక, ఇంకొకరుకాసి — చతుర్దశభువనాలలోనూ ఎక్కడా లేనే లేడా? ఉంటే ఎందుకు ఈ ఆర్తనాదాన్ని వినడు?" అని ఆవేదన పొందగా పొందగా చిట్టచివరకు తెంపు కలుగుతుంది. ఒక్క త్రుటిలో మన హృదయంలోని ప్రేమను విశ్వాన్నంతా ప్రేమించే ఆ ప్రేమనిధానమైన మహాసాగరంలో లీనముచేస్తాము. ఇది పరమభక్తులసాధన. శ్రీ సత్యనారాయణ శాస్త్రిగారు ఈ సాధనచేశారేమో అన్నట్టు కొన్నిచోట్ల వారి వాక్యాలవల్ల తోస్తున్నది. వారి మాటలనే వినండి:

"అశాంతి"లో

"దారుణపు జీవితంపు పెడారిలోన
తీరని పిపాస నే దారి తెన్నులేక
నేనె నాదుఃఖ,బాష్పశోణితలహరుల
నే విసుగువేసటలులేక త్రావినాను."

*　　　*　　　*

"కాని, మోడైన నా యెదలోనిబరువు
దీర, నాబ్రతు కూపిరి దొరకొనగ,
కనికరపుజూపు చిరునవ్వుతునకయైన
గటికికరవయ్యె బాములోకాన నాకు."

"ఏమగునో" అనేదానిలో,

"ప్రేమరత్న మీపేద కొదవునని
యీమహాబ్ధి లోతెరుగక వెడలితి
ఏమగునో యిక నాబ్రతుకు".

"దీపావళినాడు"లో

"[illegible]
[illegible]
[illegible]
[illegible]."

* * *

"[illegible] గాలితో [illegible]
[illegible]"

"సముద్రకెరటాన"లో

"[illegible]
[illegible]."

'సుధాకరా'లో

"నీమహోదయ
చ్ఛాయలు సోకినాయెడద సాగరమట్టులు పొంగు"

"కన్నెటి పాటల"లో

"సాద రూపుగన్న యీ పద్మ జీవితము
నెట్టులో నిలిచితి నిన్నాళ్లదాక"

* * *

"సాగింతు నా ప్రేమ సాగరయాత్ర
తేలుచో మునుగుచో తేలెడుదాక"

* * *

"పోయెద నాశాంతములకైనగాని
చేరెద నంభోధిపారమ్మునైన,"

* * *

"బ్రతుకెల్ల కన్నుగా వెదుకాడుకొందు"

తరువాత "ఉత్కంఠ"లో నూతనానుభవం పొడసూపుతుంది.

"బ్రదుకు బ్రదుకెల్ల తీయని వలపు నింపి
వేచియుంటి నీరాక కీవేళ స్వామి"

* * *

"వలపు లాలి కెడు, పూవులు వాడిపోయె
కనకపేటిక హారతి కునుకుచుండె
తమ్మి రేకుల సురటి పొంకమ్ము దొరగె
నొంటి నికనెంతసేపిటు లోర్తు స్వామి!"

శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారి

"హేమపాత్రల చందన మెండిపోయె
ద్వారములు మోయుచున్నవి హారములను"

అన్న పంక్తులు జ్ఞాపకము వస్తున్నవి. చివరకు "నీకోసమే" అనేదానిలో,

"కోసికొనుము యీ కోమలకుసుమము
కోరి విరిసె నీకోసమె స్వామీ!"

అని అర్పణచేస్తాడు. ఆపైన మెట్టుమెట్టుగా ఆనందధామము సమీపిస్తాడు.

"శరదుత్సవము"లో

"బ్రతికినన్నాళ్లకీ ముహూర్తమున విరిసె
దొలివలపు దొల్కు జీవమాధుర్యసుమము"

* * *

"నరకలోకపు జీకటితెరలవంటి
వెన్నినిశ లేగ నొక స్వప్నమేనిలేక
ఇంతసౌందర్య మింత ప్రశాంతిసౌఖ్య
మింతమాధుర్య మెట దాగె నింతవరకు."

అటుపైన,

"వలపులజ్యోతి భావమ్మున వెలుగ
దారికోసము పరితాపమేమిటికి
యెదలోని మూర్తితో నెడబాటు లేదు
తీయని బంధమ్ము తెగిపోవ దెపుడు."

అన్న మహాసత్యాన్ని గ్రహిస్తాడు.

"నేడు"లో,

"తప్పిపోయిన స్వప్న సౌందర్యపథము
పారవైచిన చిరతరప్రణయమురళి
వెదకికొని వచ్చినట్లు లభించె నేడు"

* * *

"పాడుకొందును తాండవ మాడుకొందు
నారుటీర మానందనందనము నేడు"

ఆ ఆనందములోనే శ్రీ శాస్త్రిగారిని ఉండనిచ్చి, శలవుతీసుకుంటాను.

*

దివాన్‌జీగారి ముసాఫరు

'కరుణకుమార'

చెంచయ్య తనతండ్రి కొక్కడే కొడుకు. చాలా బీదసంసారం. గ్రామంలో శూద్ర ఇళ్ల పౌరోహిత్యంతప్ప తండ్రికి మరొక జీవనాధారం లేదు. ఇట్లాగైనా తనకొడుకు నాలు గింగ్లీషుముక్కలు చదువుకొని, ఏ చిన్నదో పెద్దదో సర్కారుఉద్యోగం చేస్తూ వుండగా చూచి ఆనందించాలని తండ్రి ఎంతో ముచ్చటపడ్డాడు. కాని చెంచయ్య థర్డుఫారం పూర్తిచేయడమే కష్టమైపోయింది. రెండుసారులు తప్పి అతను మూడోసారి కష్టపడి చదివి థర్డుఫారం పరీక్ష ప్యాసయినాడు. ఇక చదువు చెప్పించడం తండ్రికి కష్టమైనందున అతను స్కూలు విడిచిపెట్టి ఉద్యోగంకోసం ప్రయత్నించడం మొదలుపెట్టాడు కాని ఎక్కడాకూడా నౌకరీ దొరకలేదు. చదువే ఆట్టే లేదయ్యె; పైగా బ్రాహ్మణుడు. అందువల్ల సర్కారు నౌకరీకి ఆశ వదలుకొని ఏ ఎస్టేటుఇలాకా నౌకరీఅయినా సంపాదించుకొందామని కాళ్లు పడిపోయేటట్టు తిరిగితిరిగి వారినీ వీరినీ ఆశ్రయించి తుదకు దొడ్డిగుంట ఎస్టేటులో చేరిన కోణంగితాణాలో నెలకు పదిహేనురూపాయల జీతంమీద గుమాస్తాగా ప్రవేశించాడు. ఆతాణాలో పది పదకొండునెలలు పనిచేసినతర్వాత కాస్తో కూస్తో ఇంగ్లీషు చదువుకొన్నవా డవడం వల్లనూ, అంతకంటెనూ ఆశ్రయింపు బాగా చేతనవడంవల్లనూ అతనికి ఎస్టేటువారు ప్రమోషన్ ఇస్తూ నెల కిరవైరూపాయల జీతంమీద ములుమూడిముఠా గ్రామాలకు సముద్దారుగా వేశారు.

జమీన్‌దారీ ఇలాకాలో సముద్దారంటే రెవిన్యూ ఇన్‌స్పెక్ట రన్నమాట. చెంచయ్య ములుమూడిలో ఛార్జితీసుకొన్న నాలుగు నెలలకు ఎస్టేటుదివాన్‌జీగారు ఆగ్రామంలో మూడురోజులు మకాం చేయబోతున్నారనీ, జూన్‌నెల ఆరోతేది సాయంత్రం అయిదు గంటలకు గ్రామం విజయంచేస్తారనీ, వారి బసకు తగిన ఏర్పాట్లు చేస్తూ, గ్రామచావడి ముందు పందిరీ, వంటకు ప్రత్యేకం వసారా, మోటారు పెట్టుకోడానికి షెడ్డూ, స్నానాల గదీ, పాయిఖానాదొడ్డీ — వీటిని కట్టించి దివాన్‌జీగారికి తగిన సదుపాయాలు ఏర్పాటు చేయవలసిందనీ తాణాదారుదగ్గరనుంచి సముద్దారుకు జూన్‌నెల 3-వ తేది మధ్యాహ్నం రెండుగంటలకు తాఖీదు వచ్చింది.

దివాన్‌జీగారు అంత అర్జంటుగా ఆ గ్రామం ఎందుకు మకాంచేస్తున్నారో చెంచయ్యకు తెలియదు. ఆయన సర్కారులో డిప్టీకలెక్టరుగా ఉండి నిప్పులు కురిపించాడని ఆయనకు పెద్దపేరు. పేరు నారాయణరావు. నియోగిబ్రాహ్మణుడు; మంచిముసద్దీ; వర దీసినకత్తి. సవ్యసాచివంటివాడు. సర్కారులో డిప్టీకలెక్టరుగా ఉండంగా ఫిర్యాదికీ ముద్దాయికీకూడా అనుకూలంగా — ఎటు బేరం మొగ్గితే అటు తనచిత్తం వచ్చినట్లు — ఒకకేసులోనే రెండు జడ్జిమెంట్లు తిప్పి

వ్రాయగల నేర్పు కలిగి రెండుచేతులతోనూ ఎడాపెడాకూడా సంపాదించిన చెయ్యి అని ఆయనగారికి ప్రతీతి. ఎస్టేటుపరిపాలనాపద్ధతిని చక్కబరచడానికి రాజాగారు ఈమధ్యనే ఆయనవిషయమై సర్కారులో స్వయంగా ప్రయత్నంచేసి, నెలకు ఎనిమిదివందల రూపాయల జీతంమీద ఏరి కోరి తెచ్చుకొన్న మనిషి. ఎస్టేటు అంతా సర్వాధికారాలతో ఆయనచేతిలో పెట్టి రాజాగారితరపనులమీద తిరుగుతున్నారు. ఆయన పీఠం అధిష్ఠించింది లగాయతు పిడుగులు కురిపిస్తున్నాడు. నిద్రపోతూఉన్న జమీన్దారీ తాబేదార్లందరికీ ఆయనపేరంటే సింహస్వప్నం అయింది. గడగడ లాడుతోంది ఎస్టేటంతా!

అట్లాంటి దివాన్జీగారు తన హెడ్ క్వార్టరు గ్రామంలో మూడురోజులు మకాం చేయబోతున్నారని సముద్దారుపేర తాఖీదు వచ్చేవరకు అసలే కొత్తసేద్యం అయినందువల్ల చెంచయ్యకు గుండె బేజారయింది. దివాన్జీగారెక్కడ మకాంచేసినా రాజాగారికంటెకూడా అదనంగా సప్లయిలూ, మర్యాదలూ జరగవలసివట్టున్నూ, ఏమాత్రం లోపం జరిగినా ఆయన సహించుకొనేఘటం కానట్టున్నూ, సర్కారులో ఉండంగా ఆయన ఆప్రకారం జరుపుకొన్నట్టున్నూ — ఇట్లాంటిపుకారులు ఎన్నెన్నో అంతకు ముందే ఎస్టేటులో బయలుదేరినవి.

చెంచయ్య కొత్తవాడు. ఇట్లాంటి మర్యాద లనుభవంలేదు. ఎప్పుడూ తాను చూడనూలేదు; చెయ్యనూలేదు. ఇంకా తన మజ్జీ గ్రామాధికార్లకూ, గ్రామాధికార్ల మజ్జీ తనకూ బాగా తెలియనేలేదు. ఒక ముఠాకంతా అధికారికాబట్టి, దివాన్జీగారి సప్లయిడ్యూటీ యావత్తూ సముద్దారు నెత్తినే త్రోసి తాణాదారు ఎస్టేటు శిస్తుబకాయిలు వసూలుచేసే అర్జంటుపనిమీద దక్షిణపు పల్లెలలో తిరుగుతున్నాడు.

దివాన్జీగారి ముసాఫరుకు చేయవలసిన పనులు చాలా ఉన్నవి. పందిళ్లూ, పాకలూ వేయించడానికి ఎంతోసామాను కావలసిఉండె! మనుష్యులు కావలసిఉండె! డబ్బు కావలసిఉండె! అప్పూరు మునసబు బలవంతుడే కాని వట్టి కొరకరాని కొయ్య. గవర్నమెంటు అధికార్లనేకాని జమీన్దారీ అధికార్లంటే ఆతట్టు కన్నెత్తికూడా చూచే రకం కాదు అతడు. తన హెడ్ క్వార్టరు గ్రామానికి క్రొత్తగా సముద్దారు వచ్చి నాలుగునెల లయినప్పటికీ, గ్రామంలో ఉన్నాడా, తిన్నాడా, చేశాడా అని ఇంత వరకు ఆమునసబు విచారించిన పాపాన్నిపోలేదు. అతడు ఖాయంమునసబు కాదట కూడాను. అతని పెత్తండ్రి మనుమడు రిజిస్టర్డు మైనరుగా ఉంటే, అతనిమైనార్టీలో ఇతడు మైనరుతరఫున వత్తాసిమునసబుగా పనిచేస్తున్నాడట. ఇప్పుడు ఖాయంమునసబు (పిల్లవాడు) మైనార్టీ తీరి మేజరయి ఇవ్వేళో రేపో తననౌకరీ తాను తన్నుకుపోవాలని ఉన్నాడట! అందువల్ల మునసబుకు నౌకరీ మీద నిర్లక్ష్యమైపోయింది. ఎంతసేపూ తన సేద్యమేమో, తన నాద్యమేమో, వ్యవహారాలేమో — వాటితోనే సరిపోతోంది కాని ఇక రెండో ప్రమేయం అతగాడికి కాబట్టలేదు. అతగాడు నడుంకట్టి నిలబడితే తలపెట్టిన పనులన్నీ క్షణంలో కాగలవు; కాని సముద్దారుగారి కింతవర కాయనదర్శనమే

లేకపోయె! కరణం ఉన్నాడు కాని అతడు కొత్తవాడు. ఏడాదికిందటనే ఛార్జీ తీసుకొన్నాడు. గ్రామంలో ఇంకా పలుకుబడి కలగలేదు.

దివాన్‌జీగారు రావడానికి ఇక రెండు రోజులే గడు వుంది. ఈలోపల పందిళ్లు, పాకలు చాలా తయారుకావలసివుంది. సముద్దారు కేమీ పాలుపోకుండా ఉంది. కరణాన్ని పిలిపించి సంప్రతించాడు. "మునసబును పిలిపించి ఘట్టిగా చెప్పండీ! దివాణం వారి సొమ్ము తింటూ ఎవరికోసం చేస్తాడు సప్లయిలు — ఆయన అట్లా పై ఆటలాడుతూ ఉంటే మధ్య మీకూ నాకూ ఎందుకీ దొర్లాట? చెప్పి పంపండి ఆయనగారికి. ఆయన ఇల్లు కదలకపోతే రిపోర్టుచేయండి ఠాణాదారుగారికి" అన్నాడు కరణం.

కరణంవల్ల ఉపయోగం ఉండేటట్టు కనపడలేదు సముద్దారుకు. అయినా అధికారుల సప్లయిడ్యూటీ మునసబుదే కాబట్టి "నే నొకసారి పిలుస్తున్నానని మునసబు నిట్లా పిలుచుకొనిరావోయి" అని తన జవానుని పంపాడు సముద్దారు. "మునసబుగారు మిరపచేనుకు నీరుకట్టిస్తున్నారు; ఇంటికాడ లే"రని పోయిన జవాను చక్కావచ్చాడు. ఇక వ్యవహారం కాగితంమీదపెట్టి నడిపితేనే కాని వీల్లేదని వెంటనే

ములుమూడిముఠా సముద్దారువద్దనుండి
ములుమూడి గ్రామమునసబుకు.

తాఖీదు

ఈనెల ౬-వ తేది సాయంత్రం ఆరుగంటలకు శ్రీ శ్రీ శ్రీ దివాన్‌జీదొరగారు ఈ గ్రామానికి విజయం చేయబోతున్నారు. కాబట్టి ఈతాఖీదు చూచినవెంటనే మీరు నాయెదుట హాజరై శ్రీవారి ముసాఫరుకు తగిన యేర్పాట్లన్నీ చేయవలెను. అర్జంటు. ఇందుకు తప్పిన యెడల మీసంజాయిషీతో అవసరం లేకుండనే మీ మీద చర్య పుచ్చుకోవడ మవును.

(సం.) చెంచయ్యా,
సముద్దారు.

అని ఒక తాఖీదువ్రాసి మునసబు ఎక్కడ వుంటే అక్కడకు తీసుకువెళ్లి ఇచ్చిరమ్మని జవానుచేతి కిచ్చాడు.

"మునసబుగారు చదువుకొని, తాఖీదు తీసుకోవడం లేదన్నా" రని జవాను వాపసు వచ్చి సముద్దారుతో చెప్పాడు.

చెంచయ్యకు ఆగ్రహం ఒకవంకా, భయం ఒకవంకా బయలుదేరినవి. అధికారి యెడల మునసబుచేసిన అవిధేయతకు తాను పైవారికి రిపోర్టుచేస్తే చెయ్యవచ్చు. కాని ముందు దివాన్‌జీగారికి జరగవలసిన కర్మకాండ యావత్తూ జరగవలె. అదిగాక, తీరా రిపోర్టుచేస్తే సంగతి దివాన్‌జీగారికి తెలిసి, ఒకముఠాకు సముద్దారుగా ఉండి తానింత మాత్రం సప్లయిలు చేయలేక మునసబుతో తగవుపెట్టుకొన్నాడని తనవిషయమై దివాన్‌జీగారు అపోహపడతారేమో అని చెంచయ్యకు జంకయింది. ఇక మునసబు ప్రస్తావన పెట్టుకొంటే అసలు వ్యవహారానికి చిక్కు రావడమే కాకుండా, అతనితో అనవసరమయిన విరోధానికి కారణ మవుతుందని ఆ ప్రయత్నం విరమించుకొని, మునసబుకు వ్రాసిపంపిన తాఖీదు చింపివేశాడు.

కరణాన్నీ, జవానునీ పిలిపించి, 'ఏం చేశా మిప్పు'డని చెంచయ్య వాళ్లిద్దరినీ సలహా అడిగాడు. "చేసే దేముంది? ఆయన సలహామీద ఆశపెట్టుకొంటే కార్యంలేదు. ఇక

మీకు తప్పేదికా దిది. గ్రామంలో నలుగురు రైతులనూ పిలిచి వాళ్లదగ్గర తాటిదబ్బ లేమైనా ఎరువిస్తారేమో అడగండి. వాళ్ల వద్ద సామాను చిక్కితే చిక్కినట్టూ, చిక్కకుంటే అసలు మినహాలోనైనా మనం పది తాళ్లు పడగొట్టించి పని జరిపించాలె కదా" అన్నారు కరణమూ, జవానూను. సరేనని గ్రామంలోని నలుగురు రైతులనూ పిలిపించి అడిగాడు సముద్దారు. "ఈపూరుకు మునసబు లేడా యేమిటి పంతులూ" అని ఒకరూ, "దివాణంసొమ్ము తేరగా తింటూ, ఆయనగారు స్వంతపనులు చూచుకొంటూఉంటే, ఈపను లెవరుచేస్తా డనుకొన్నా డాపెద్ద మనిషి?" అని ఇంకొకరూ, "ఈమునసబు పనికిరాడని నిలుపుదల చేయించండి తమరు. నే నొక్కణ్ణే తెల్లవారేవరకు గ్రామంఅంతా పందిళ్లు వేయించి, సిద్ధంచేస్తానో లేదో చూతురుగాని" అని మరొకరూ సమాధానాలు చెప్పి 'శలవుపుచ్చుకొంటాం' అని దణ్ణంపెట్టి ఎవరిదారిన వారు వెళ్లారు.

చెంచయ్యకు గత్యంతరం తోచడం లేదు. రైతులవల్లకూడా జరిగేనసహాయం కనిపించలేదు. దివాన్జీగారు రాక్షసముండా వాడని వినికిడి. తలవెంట్రుకవాసికూడా మర్యాదలకు లోపం రాకూడదని అంతా అంటున్నారు. ఆయనగారు సర్కారులో పెద్ద అధికారాలు చెలాయించి పేరుపడ్డవాడనీ, రావడంతోనే ఆయనకు మెడలో పూలమాల వేసి, పండ్లూ, ఫలాలూ వగైరాలు వాకిట్లోనే సమర్పించి ఎన్నో రాజోపచారాలు చేస్తేనేగాని అసలు మోటారే దిగడనీ, ఇట్లాంటివదంతులు చాలా బయలుదేరినవి. వ్యవహారానికి విఘ్నేశ్వరపూజ వద్దనే విఘ్నం అయింది. ఆయనకు మనస్సులో భీతి ఎక్కువయింది. ఆరాత్రి తెల్లవార్లూ ఆయనకు నిద్రపట్టలేదు.

తెల్లవారింది. మనిషి కొంత ధైర్యం తెచ్చుకొన్నాడు. మూడునెలలజీతం ఈ నష్టయిలకింద ఖర్చుపెట్టాలని నిశ్చయపరుచుకొన్నాడు. "పోనీ! అయితే అయింది. ఈ దివాన్జీగారుకూడా బ్రాహ్మణుడే కాని మాలవాడు కాడు కదా! ఒక బ్రాహ్మణకార్యానికై ఖర్చుపెట్టానని అనుకొంటాను. అదైనా కలిసొస్తుంది." అని ఒకవిధమైన తీర్మానానికి వచ్చి తెల్లవారి బారెడుపొద్దెక్కంగనే ఆగ్రామవెట్టివాళ్లను ముగ్గురినీ, ఇంకా ముగ్గురు కూలీలనూ పెట్టి మధ్యాహ్నానికి చెరువుకట్టమీద చెట్లల్లో పదితాడిచెట్లు పడగొట్టించి సాయంత్రానికి బద్దలు చెక్కించి, రెండుబళ్ల ఆకు కొట్టించి. మడతొక్కించాడు. చీకటిపడేవరకు సామాను యావత్తూ సిద్ధపరిపించాడు. ఆమరునాడు పదిమంది కూలీలను పెట్టించి, ఠాణాదారుగారి ఉత్తరువుప్రకారం పందిళ్లూ, పాకలూ యావత్తూ — ఒక పాతికరూపాయలు ఖర్చుపెట్టి తయారుచేయించాడు. ఆమరునాడు ఉదయాన్నే తన జవానుని నగరం పంపి దివాన్జీగారికి ఒకటోరకమైన ఒక గులాబీ పూలమాలా, ఒక 'బొఖే', ఒకడజను ఆపిల్సూ, రెండుడజనులు కమలాలూ, ఒకటిన్నరడజను బత్తాయిలూ, నాలుగు దానిమ్మపండ్లూ — అంతా పదిరూపాయలు ఖర్చుపెట్టి అట్టహాసంగా బుట్టతో బుట్టెడు తెప్పించాడు. సాయంత్రం అయిదుగంటలకు సర్వమూ తయారయింది. పొయ్యిలోకి కట్టెలూ, నీళ్లుపోసుకోను కొత్తకుండలూ, స్నానానికి

సేల్లూ, కుమ్మర్లూ, చాకర్లూ తయారుగా వున్నారు. ఇక దివాన్‌జీగారు రావడమే తరువాయి.

ఇంతలో దివాన్‌జీగారి వంటబ్రాహ్మణుడూ, సప్లయిజవానూ వంటసామానుతోనూ, దొరగారి కాంపుసామానుతోనూ ఒంటెద్దుబండిలో ముందుగా మొలుమూడికి చేరుకొన్నారు. సప్లయిజవాను దొరగారికి చేయబడిన ఏర్పాట్లన్నీ తణిఖీచేసి, "అన్నీ బాగానే ఉన్నవి కాని వంటవసారామాత్రం వారి ఆఫీసుకు సమీపంలో ఉండడానికి వీల్లేదు. పొగ తగిలితే దొరగారు కోపం చేస్తారు. అందువల్ల వంటకు మరొకచోట ఏర్పాటుచేయవలసిం" దని ఒక సవరణ తీసుకువచ్చాడు. దొరగారిదగ్గర ఖుద్దున ఉండి, ముసాఫరులో వారితోకూడా తిరిగే సప్లయిజవాను ఉత్తరువు దొరగారి ఉత్తరువుతో సమానమైనదే! వేసిన వంటవసారా పెరికించి సాయంత్రములోపల మరొకచోట వేయించడానికి వీలు లేక రెండుఫర్లాంగుల దూరంలో తూర్పువీధిన ఉన్న కరణంగారి యింటి దక్షిణపువసారాలో వంట కేర్పాటు చేసి, టిఫ్ఫిన్‌కారీయరులోపెట్టి దొరగారికి భోజనం తీసుకువెళ్లేటట్టు ఏర్పాటు చేసుకొన్నారు. వంటసామాను యావత్తూ కరణంగారి ఇంటిదగ్గర చేర్పించి పొద్దుకూకినతరువాత వంటబ్రాహ్మణుడు తన సామాను విప్పి వంటప్రయత్నంలో వున్నాడు.

దివాన్‌జీగారు ఏడుగంటలకు మోటారు కారులో వస్తారని జవాను సముద్దారుతో చెప్పి, ఆయన తెప్పించిన పూలమాలా, పండ్లూ చూచి చాలా బాగున్నవనీ, దొరగారు చాలా సంతోషిస్తారనీ మెచ్చుకొన్నాడు. సముద్దారుకు సంతోషం అయి, "దొరగారి మెడలో ముందుగా పూలమాల వేసినతరువాత 'బొకే' చేతిలో పెట్టవలెనా, లేక ముందు 'బొకే' చేతి కిచ్చినతరువాత మెడలో మాల వేయవలెనా?" అని సప్లయి జవాను నడిగాడు.

"ముందు మెడలో మాలవేసిన తరువాతనే 'బొకే' చేతిలో పెట్టం" డన్నాడు సప్లయిజవాను.

"సరే. అయితే దొరగారి కీమర్యాదలు మోటారులో ఉండంగనే చేయవలెనా లేక మోటారు దిగి చావడిలోకి వచ్చినతరువాత చెయ్యవచ్చునా?" అని తాను ఈ తంతు తెలియని కొత్తవాడవడంవల్ల పదిచోట్లా దొరగారితో తిరిగే సప్లయిజవానుని మళ్లా అడిగాడు.

"దొరగారికి మర్యాదలన్నీ మోటారులోనే జరిగించాలె. దిగినతరువాత చేస్తే బాగుండదు. కాబట్టి మోటారు రావడంతోనే మెడలో మాలవేసి, చేతికి 'బొకే' ఇచ్చి, పండ్లబుట్టను మోటారులో పెట్టండి. వెనక డ్రయివరు వాటి నెత్తుకొని వస్తాడు' అని జవాను తెలియపరిచాడు.

"సరే. మనదొరగారిది ఇంగ్లీషుపద్ధతా లేక హిందూపద్ధతా" అని సముద్దారు మళ్లా ప్రశ్నించాడు.

"అబ్బో! ఆయన ఇంగ్లీషువాళ్లకంటె ఇంగ్లీషుపద్ధతిలో ఉంటారు పంతులూ! దొరటోపీ, సూటూ, బూటూ — అంతా తెల్లదొరమాదిరే. మోటారుకూడా స్వయంగానే నడుపుతారు. డ్రయివరు వెనుక ఊరి

కనే కూర్చోవలసిందే," అని సప్లయిజవాను జవాబు చెప్పాడు.

సాయంత్రం ఏడుగంట లయింది. చీకటి పడింది. తలకు పాగా చుట్టుకొని, కోటు తొడుక్కొని ఎదురుతెన్నులు చూస్తున్నాడు సముద్దారు. గులాబిపూలదండా, పండ్లూ రెండుబుట్టలలో పెట్టుకొని, దివాణంవారు సప్లయిచేసిన డవాలు తగిలించుకొని నడుముకు గుడ్డకట్టి నెత్తికి పాగాచుట్టి సముద్దారు గారి జవాను సిద్ధంగా ఉన్నాడు. కరణము కూడా తగురీతిని తయారుగా ఉన్నాడు. సప్లయిజవాను చేత లాంతరు పట్టుకొని వాండ్లపక్కనే నిలబడి ఉన్నాడు. చీకటి దట్టమయింది. కొంచెం మబ్బు లేచింది. నక్షత్రాలు కనిపించడం లేదు. వెన్నెల ఇంకా రాలేదు. ఏడున్నర దాటింది, గ్రామ చావడిలో ఇంకోలాంతరు వెలిగించి బయట రోడ్డుమీద పైసిబ్బంది యావత్తూ మోటారు కెదురుచూస్తూ నిలబడిఉంది.

మునసబు అతట్టుకూడా మెదలలేదు. సముద్దారుగారే స్వయంగా సప్లయిలు చూచుకొంటున్నాడని తెలిసి "నెత్తిన పాలు పోశాడు — మహారాజు" అని అనుకొంటున్నాడు. దివాన్జీగారు వచ్చినవెంటనే తనకు తెలుపవలసినదని వెట్టివాడితో చెప్పి, గ్రామ మునసబు భోజనం చేసుకొని చుట్ట కాల్చుకొంటూ తనయింటికాడనే కూర్చున్నాడు.

గ్రామచావడి ఉత్తరపు గమిడిలో గ్రామానికి సంబంధం లేకుండా ఎడంగా ఉన్నది. రాత్రి ఎనిమిది కావచ్చింది. దొరగారింకా రాలేదు. ఆయనకొరకు కెదురు చూస్తూవుండగా, చాకలివాడొకడు పరుగున వచ్చి, "వంటబ్రాహ్మడికి తేలుకుట్టింది; సప్లయి జవానుని అర్జంటుగా పిలుచుకొని రమ్మన్నా" డని చెప్పాడు. "అయ్యో! పాపం! సమయానికి తే లెక్కడనుంచి వచ్చిందో! నేను పోయి విచారించి ఇప్పుడే వస్తాను — కాని మీరుమాత్రం దొరగారు వచ్చేసరికి తయారుగా ఉండండి. మోటారు చప్పుడు వినబడడంతోనే పేరెం తీసి వస్తాను" అని చెప్పుతూ, సప్లయిజవాను వెంటనే చాకలివాడితోకూడా వంటబ్రాహ్మణుడి దగ్గరకు పోయాడు.

ఇంక కొంచెంసేపటికి ఉత్తరంనుండి రోడ్డుమీద మోటారు వెలుతురు కనబడింది. "దొరగారు వస్తున్నారు, వస్తున్నా" రని సిబ్బంది యావత్తూ లేచి నిలబడింది. గ్రామ తలారి చేతిదండకు ఇత్తడిబిళ్ల కట్టుకొని, చేతికర్ర పట్టుకొని, తలకు పాగా చుట్టుకొని, మోటారు సమీపంలోనికి రాంగనే నిలపవలసిందని డ్రయివరుకు తెలిసేలాగున, రోడ్డుకు అడ్డంగా చెయ్యెత్తి నిలబడిఉన్నాడు. బుట్టలో పూలమాల నలిగిపోకుండా రెండు చేతులతోనూ పైకి తీసి, 'బొకే'ను కరణంచేతి కందిచ్చి, అడిగిన వెంటనే తన కివ్వవలసిందని చెప్పి, తన కుడిప్రక్కన ఆయన్ని నిలబెట్టుకొని సముద్దారు తలారివానికి సమీపంలో రోడ్డుకు పడమటితట్టు నిలబడివున్నాడు. సప్లయిజవాను చెప్పిన సంగతులు మరచిపోకుండా మనస్సులో మననం చేసుకొంటూ, దివాన్జీగారికి చేయవలసిన పూజావిధానం మీద దృష్టి నిలిపి, ఒకవిధమైన ఆత్రంతోనూ, ఖంగారుతోనూ, తడబాటుతోనూ సముద్దారు మోటారు వచ్చేవైపు చూస్తున్నాడు.

ఇంతలో ఎప్పుడు వచ్చిందో దూరంలో కనబడిన మోటారుదీపం సమీపంలోకి వచ్చింది. ఆ మోటారులైట్ల మసకవెలుతురులో చూచి "దొరగారే, దొరగారే" అంటూ అందరూ నెమ్మదిగా, సర్దుకొన్నారు. మోటారులైట్ల కాంతిచేత రోడ్డుమీద నిలబడివున్న జనానికి కళ్లు చీకట్లు కమ్ముతున్నవి. మోటారు తలారివానిదగ్గరకు వచ్చి నిలబడింది. నెత్తిన దొరటోపీ. మెడలో నల్లనినెక్‌టై, తెల్లనికాలరూ, ఓపెన్‌కోటూ, సూటూ, కళ్లకద్దాలూ వేసుకొని ఒకాయన మోటారు నడిపేచక్రం పట్టుకొని కూర్చున్నాడు. దృష్టిని బలవంతాన సరిచేసుకొంటూ సముద్దారు ఆయన్ని చూచి, "దొరగారు స్వయంగా మోటారు నడుపుకొని వచ్చా" రనుకొంటూ తడబడుతూ, ఆ ఖంగారుతోనే ఆ దొరగారి మెడలో పూలమాల వేయడానికి రెండుచేతులూ పైకెత్తాడు. ఈ సన్మానోత్సవానికి మంగళవాయిద్యంలాగ నిలబడివున్న మోటారుఇంజన్ డబడబా కొట్టుకొంటున్నది. ఆదొర నెత్తిమీది టోపీ తీసి తల ముందుకు వంచాడు. వెంటనే సముద్దారు ఆమనిషి మెడలో పూలహారం వేసి, కరణంచేతిలోని 'బొకే' ఆయన చేతిలో ఉంచి 'నమస్కారం' అని రెండుచేతులూ జోడించి నమస్కరించాడు. మోటారులోని దొరగారు "థాంక్స్" అన్నట్టుగా చెంచయ్య చెవికి వినవచ్చింది. దివాన్‌జీగారు ప్రసన్నులైనారని సముద్దారు సంతోషించి, వెంటనే జవానుచేతిలోని పండ్లబుట్ట తాను అందుకొని మోటారులో పెట్టాడు. దొరగారి వెనక మోటారులో కూర్చున్న మనిషి బుట్ట నందుకొని పక్కగా పెట్టుకొన్న మీదట దొరగారు "మెనీ థాంక్స్; గుడ్‌నైట్" అంటూ కుడికాలుతో గియర్‌బాక్స్ తొక్కి, ఫుట్‌బ్రేక్ విడిపించి, ఫస్టుగియర్ మీద మోటారును ముందుకు సాగించి, సెకండ్‌గియర్ మార్చుకొని, అంతా అరనిముషంలో టాప్‌గియర్‌మీద స్పీడెక్కించి, కనురెప్పపాటులో సిబ్బంది అంతా రిచ్చవడి చూస్తూ ఉండగా — దక్షిణముఖంగా పలాయనం చిత్తగించి మాయమైనాడు.

రోడ్డుమీది జనానికి కేమీ అర్థం కాలేదు. అంతా నిర్ఘాంతపోయి ఒకరిముఖం ఒకరు చూచుకొంటున్నారు. "దొరగారికి ఆగ్రహం వచ్చి వెళ్లిపోలేదుకద" అని అనుమానం పుట్టి సముద్దారు "సప్లయిజవా నేడీ" అని కరణాన్ని అడిగాడు. "వంటబ్రాహ్మణుడు పిలిస్తే వెళ్లాడు. అత డింకా రాలే" దన్నాడు తలారి. ఈదొరగారు దివాన్‌జీగారవునా కాదా అని అనుమానాలు పుట్టినవి. "ఈయన దివాన్‌జీగారు కారేమోనండి" అన్నాడు కరణం. "కారేమోనండీ" అన్నారు మరొకరు. దివాన్‌జీగారు ఎస్టేటుఛార్జి పుచ్చుకొన్న తరువాత ఇదే మొదటిమారు రావడం ములుమూడికి. అందుచేత దివాన్‌జీగారిని చూచినవా రెవ్వరూ లేరు — అంతా వారినిగురించి విన్నవారేకాని. "దివాన్‌జీగారు కాకుంటే మనం ఇచ్చినపళ్లు తీసుకొంటాడా !" అన్నాడు సముద్దారు. "ఎందుకు తీసుకొంటా" రన్నారు ఇంకొకరు. "తీసుకోవడాని కేం" అన్నారు వేరొకరు. "దివాన్‌జీగా రయితే మోటారు స్వయంగా నపుడుతారా" అన్నాడు కరణం. "ఇప్పు డిది అందరికీ ఫేషన్" అన్నాడు సముద్దారు.

సముద్దారుగారి జవాను పాతవాడు — ముసల్మాన్ బిడ్డ. దివాన్‌జీగారిని కాని, వారి మోటారును కాని యిదివర కతడు చూడ లేదు. కాని పల్లిచ్చినతరవాతకూడా మోటారుదిగకుండా లోపలిమనిషి మోటారు స్టార్టు చేసేవరకు అతగాడి కనుమానంవేసి అప్పటినుంచీ దానిని పరకాయించి చూస్తున్నాడు. ఇంతలో హఠాత్తుగా స్ఫురణకు వచ్చి "అయ్యయ్యో! ఎంతపని చేశారు పంతులూ! నా కిప్పుడు జ్ఞాపకంవచ్చింది. ఈ మోటారు లైఫ్ ఇన్స్యూరెన్స్ కంపెనీ యేజెంటు నరసింహారావు నాయుడుగారిది స్వామీ!" అన్నాడు జవాను.

మోటారుహారన్ చప్పుడు విని దొర గారి సప్లయిజవాను దొరగారు వచ్చారు కాబోలునని గుండెలు గుబుక్కుమంటూ పరుగుతో వచ్చేవరకు దిగ్భ్రాంతుడై కొయ్యబొమ్మలా నిలబడివున్నాడు సముద్దారు చెంచయ్యపంతులు.



ఇరువదియవ ఆంధ్రమహాసభ చెన్నపురి.

(౧౯౩౪ అక్టోబరు)



అధ్యక్షులు

సర్ సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారు




ఆంధ్రమహాసభా ప్రారంభకులు
సర్ ముత్తా వెంకటసుబ్బారావుగారు



ఆంధ్రమహాసభ ఆహ్వాన సంఘాధ్యక్షులు
పాణిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు



ఆంధ్రమహాసభా సప్తమ [illegible]
సర్ అల్లాడి కృష్ణస్వామి అయ్యరుగారు



ఆంధ్ర కళాప్రదర్శన ప్రారంభకులు
శ్రీమంతులు రాజా అంకినీడు యార్లగడ్డ
శివరామ ప్రసాదు బహదూరు
(శ్రీ చల్లపల్లి మహారాజాగారు)

ఆధునిక హిందీవాఙ్మయము

యలమంచిలి వెంకటేశ్వరరావు

నవయుగ ప్రారంభం కాకముందు హిందీకవిత్వానికి ముఖ్యవిషయం ప్రేమ. ప్రేమకు ఆధారం లౌకిక మయినప్పుడు శృంగారకవిత్వం బయలుదేరింది. అదే లోకోత్తరానందం కొరకు బయలుదేరినప్పుడు భక్తికావ్యాలు వెలువడినై. వీరరసానికి కూడా ఈ లౌకికప్రేమయే ప్రేరకం. వీరరస ప్రధానాలైన కావ్యాలలో నాయకుని రౌద్రాన్ని పెంచి యుద్ధానికి పురికొల్పేది కూడా ప్రేమకథయే. ఈవిధంగా ప్రతివిషయానికీ ప్రేరకం శృంగారవృత్తియే. ఆలంబన విధానంలో నూతనత లేకపోయేసరికి కవిత్వమంతా చర్వితచర్వణ మైపోయింది. కవులు తమకున్న కామవాసనను వెలిబుచ్చటానికి రాధాకృష్ణుల నే ఆధారం చేసుకున్నారు. ఎవరు కలం పట్టినా, రాధాకృష్ణులు, పొదరిండ్లు, యమునానది — వీటినే వర్ణించారు. ప్రకృతినికూడా వారి ఉద్దీపనవిభావంవరకే సరిపెట్టారు. ప్రకృతి ఒక స్వతంత్రవస్తువుగా, దానిరమణీయతలో ఒక ప్రత్యేకత ఉన్నట్టుగా వీరికి గోచరించలేదు. ప్రకృతికూడా మనుష్యునిసుఖదుఃఖాలను అనుసరించే ఉంటుంది వీరిదృష్టిలో. మనిషి నవ్వుతూ ఉంటే ప్రకృతి నవ్వుతుంది. మనిషి విషాదంలో ఉంటే ప్రకృతికూడా విషాదరూపం ధరిస్తుంది. ఇంతే కాని సస్యశ్యామలయగు ప్రకృతిని యథేచ్ఛగా కన్నులపండువుగా వర్ణించినకవులు నవయుగానికి ముందు మచ్చుకైనా దొరకరు హిందీలో. కాని ఈలోటు ఆంగ్లభాషా పరిచయం కలిగిన కొత్తకవులవల్ల చాలా వరకు తీరింది. ఆంగ్లకవుల ప్రకృతిప్రేమ, దేశ మంటే ఉండే అమితఅభిమానం, దేశకాల బంధనాలను తెంపుకుని విశ్వజనీనతను వ్యక్తపరచేవిశాలభావాలు ఈకవుల్ని ఎక్కువగా ఆకర్షించినయి.

విశ్వజనీనత అనేశబ్దం కొంతమందికి ఆశ్చర్యం కలగచేయవచ్చు. కాని యథార్థంగా చూస్తే మనదేశంలో విశ్వం ఎలా ఉన్నా, ఆఖరుకి సంపూర్ణ దేశాన్ని అయినా పూజించిన మహాపురుషులు మన పూర్వ చరిత్రలలో దొరకరు. స్వాతంత్ర్యాభిరతికీ, పౌరుషమునకూ ప్రసిద్ధి చెందిన ప్రతాప,శివాజీలుసయితం తమతమ ప్రాంతాలనే భారత దేశం అనుకున్నారు. ఆసేతు హిమాచలం లోని ఆబాలగోపాలం ఒకమార్గాన పోవాలను భావం ఎప్పుడూ కలగలేదు. 'మహారాష్ట్రం', 'చిత్తోడ్' మొదలైన శబ్దాల్లో అమిత ఆకర్షణశక్తి ఉంది. అవి మనకు తీర్థస్థానములే. అయినా అంతమాత్రాన మనకు పూర్ణత్వం లభించదు. వ్యక్తిగతంగా ప్రత్యేకాభిప్రాయాలు కలిగిఉన్నా దేశం దగ్గరకు వచ్చేసరికి అందరూ ఒకేభావంతో ముందుకు పరువెత్తవలెననే దృష్టి ఆంగ్లేయుల సంపర్కంవల్లనే లభించింది. దౌర్భాగ్యవశాత్తు బెంగాలు మళ్లీ పాతమార్గాన్నే తొక్కింది. "ఆమార్ వంగభూమి" అను

కుంటేనే వారికడుపు నిండుతుంది. వారి ప్రాస్వదృష్టి ఇంతవరకూ వెనుకబడే ఉంది. కాని హిందీవారికి ప్రత్యేక ప్రాంతీయశబ్దం లేదు. ౩౫ కోట్లమంది జనులూ వారికి సోదరులే.

నవ్యసాహిత్యాన్ని గురించి తెలుసుకోవటానికి పూర్వం ఈ నవయుగానికి పునాదులు వేసినవారి భావాలుకూడా తెలుసుకోవటం అవసరం. తురకల ప్రభుత్వంలో విసిగిన హిందువులకు ఆంగ్లేయుల పరిపాలనలో కొంత స్వేచ్ఛ లభించింది. కనీసం జుట్టు పన్ను 'జిజియా' అయినా లేకుండా పోయింది. మత, సంఘ, ఆచారాల్లో ప్రభుత్వం జోక్యం కలిగించుకోలేదు. అందుకని అప్పటికవులు ఆంగ్లేయుల్ని పొగడుతూ కవిత్వం రాశారు— "ఇంగ్లీషువారి పరిపాలన సుఖసౌకర్యాలకు కూడలి. అందు సమస్త సౌఖ్యం లభిస్తుంది. కాని మనదేశపు ధనమంతా విదేశములకు చేరుతోంది. ఇది చాలా దుఃఖకరం"— అటూ ఇంగ్లీషువారికి జోహార్లు; ఇటు దేశదారిద్ర్యం అంటే ఏడుపు. ఈ ద్వంద్వభావంతోనే అప్పటి వాఙ్మయం ముందుకు సాగింది.

అవి మార్పుకు మొదటిదినాలు. అందుచేత అప్పటి కవిత్వమంతా ఉపదేశాలతో నిండి ఉంది. విమర్శ, ఉపదేశములతో కూడుకున్న భావాలు కావ్యానికంత అనుకూలంగా ఉండవు. దేశభక్తినిగురించి పాఠకులలో కరుణ, వీర, రౌద్రరసాలు కలిగించవలె ననుకున్నకవి అందుకు అనువయిన పాత్రలను సృష్టిస్తాడు. తాను చెప్పదలచుకున్నదాన్ని పాత్రలచేతనే చెప్పిస్తాడు. అప్పుడే కవి అనుకున్నట్లు ఫలసిద్ధి పొందకలుగుతాడు. సారాంశం అప్పటిరచనలలో దేశభక్తిని మూర్తీభవింపచేసే ప్రయత్నాలు జరుగలేదు కాని భావధారలో అనేకమార్పులు జరిగినయి. ఫ్రెంచి, ఇంగ్లీషుసాహిత్యసంపర్కంతో కొత్త అభివ్యంజనశైలి లభించింది. వ్యంగ్యాత్మకమయిన శైలిని పాశ్చాత్య వాఙ్మయంనుండియే గ్రహించింది హిందీ. ఇక్కడ ఇంకొకవిషయం పాఠకులు గుర్తుంచుకోవాలి. ఉర్దూవాఙ్మయంలోనుంచి భావధారను గ్రహించింది భారతదేశపు భాషల్లో ఒక్క హిందీమాత్రమే. మహమ్మదీయుల జీవితంలోవలెనే, వారికవిత్వంలోకూడా విరక్తికి స్థానం లేదు. వారిశృంగారంలో గంభీరతకంటె సజీవత, మనోరంజకత ఎక్కువవుంటుంది. ప్రేమలో వేదన ఎక్కువగా కనిపిస్తుంది. ఉర్దూలోనుంచి వేదనాపూర్ణ ప్రేమాభివ్యక్తిని హిందీకవులు గ్రహించారు.

భాషలోకూడా ఒక పెద్దమార్పు జరిగింది. పూర్వకాలపు సాహిత్యం అంతా దాదాపు రాముడు, కృష్ణుడిమీదనే తయారవటంచేత అయోధ్య, వ్రేపల్లెలకు చుట్టుప్రక్కల మాట్లాడే అవధి, వ్రజ భాషలే కవిత్వానికి ఉపయోగించుతూ వచ్చారు పూర్వకవులు. కాని ఆధునిక వాఙ్మయానికి అందులో ముఖ్యంగా గద్యానికి ఆభాషలు పనికిరావనే ఆందోళన ఈకాలంలో రేగింది. దానికి ఫలితంగా ఢిల్లీకి చుట్టుప్రక్కల మాట్లాడే భాష ఇందుకు అనుకూలమని తేలింది. దానిపేరు "ఖడీబోలీ". నేటి సాహిత్యం అంతా దీనిలోనే తయారవుతున్నది. ఈ భాషాప్రచారానికి మహమ్మదీయులుకూడా తోడ్పడ్డారు. ఈ ఖడీబోలీ, ఉర్దూ-ఈ రెంటికీ లిపిభేదమే తప్ప దగ్గర

దగ్గర రెండు ఒకటే. ఉర్దూలో అరబ్బీ, పారశీ శబ్దాలు ఎక్కువగా వుంటే, ఖడీబోలీలో సంస్కృత శబ్దాలు ఎక్కువగా ఉంటాయి. హిందీ లేఖకులలో అనేక మంది మొదట ఉర్దూలో రాస్తూ రాస్తూ తరువాత హిందీలో రాయటం ప్రారంభించారు. శైలిలో జీవశక్తి చూడవలెనంటే ఈ ఉర్దూ తెలిసిన హిందీ లేఖకులలోనే దొరుకుతుంది. కేవలం సంస్కృతపాండిత్యంతో రాసేవారిశైలిలో అసలుకు ఆ తీవ్రత ఆ వాడిమి కనుపించదు. భాషే కాదు, ఉర్దూ ఛందస్సునుకూడా హిందీకవులు ఇష్టంవచ్చినట్లు ఏజంకూ లేకుండా వాడుకో మొదలుపెట్టారు.

ప్రథమయుగం (౧౮౬౮ - ౧౯౦౩)

ఈ మొదటియుగానికి నాయకుడు బాబూ హరిశ్చంద్ర. ౧౯-వశతాబ్దంఅంతంలో ఈయన వాఙ్మయంలో ప్రవేశించాడు. ఈయన్ని గురించి రాసేటప్పుడు మన వీరేశలింగం పంతులుగారు జ్ఞాపకం వస్తారు. ఇద్దరూ ఒకే కాలంలోని వారని చెప్పవచ్చు. ఇద్దరికీ అనేకసాదృశ్యా లున్నాయి. భాష, భావం, సంఘం అన్నిటిలోనూ మార్పు తేవాలని నడుముకట్టినధీరు డితడు. చిన్నవయస్సులో చనిపోయినాడు. 'మేధస్సుకు వయస్సుతో పనిలేదు' అనునార్యోక్తి ఈయనకు బాగా వర్తిస్తుంది. ఈయనప్రోత్సాహంతో అనేక మంది క్రొత్తక్రొత్తరచనలు ప్రారంభించారు. ఇతర సమున్నత వాఙ్మయాలనుంచి విరివిగా అనువాదాలు ప్రారంభించింది ఈయనే. పత్రికలుకూడా అనేకం బయలుదేరినవి. సాంఘికఅవనతి, బాల్యవివాహాలు, వితంతువులదురవస్థ, భారతీయులవిద్యాశూన్యత, దేశభక్తి ఈకవులకు ముఖ్యవిషయాలు. సంఘ దురాచారాలను వ్యక్తపరచటానికిగాను ఈ కవులు హాస్యరసాన్ని ఎక్కువగా ఉపయోగించారు. చందా లిచ్చి దేశభక్తు లయ్యే వ్యక్తులు, మూఢగతవిశ్వాసాలను పాటించుతూ మార్పంటే గడగడలాడేఛాందసులు, తమస్థితిగతులు మరచి ఆంగ్లేయులకు తోకలై తిరుగురాజభక్తులు వీరిహాస్యానికి ఆలంబన విభావం.

హరిశ్చంద్రకవి ఆకాలంలోనే అస్తమించటంచేత వాఙ్మయాభివృద్ధికి గొప్ప లోటు సంభవించింది. అయినా నవజాగృతి అంతమాత్రంతో ఆగలేదు. ఈసమయంలోనే నాగరప్రచారిణీసభ అనే ఒకసభను కాశీలో స్థాపించారు. ఈసభ చేసినసేవ చిరస్మరణీయము. ప్రాచీనకవులగ్రంథములు వెతికించుట, వాటి నన్నిటిని పరిష్కరించి అచ్చొత్తించుట, వాఙ్మయచరిత్రలు రాయించుట, తులసీదాసు, సూరదాసు మొదలైన మహాకవుల కృతులను గుఱించిన విమర్శలు తయారుచేయించుట మొదలగు భాషా సంబంధమైన మహత్తరకార్యములను ఇప్పటివరకూ ఈ సభ చేస్తూ ఉన్నది. ఈ సభ తరఫుననే 'సరస్వతీ' పత్రిక వెలువడినది.

ద్వివేదీయుగం (౧౯౦౩ - ౧౯౧౮)

౧౯౦౩వ సంవత్సరం హిందీవారికి మహాసౌభాగ్యప్రదమయినది. పండిత మహావీరప్రసాదద్వివేదీ "సరస్వతీ" పత్రికకు సంపాదకుడై హిందీవాఙ్మయంలో ప్రవేశించిన వత్సర మదియే. ఈయన పదిహేను సంవత్సరాలు సంతత పరిశ్రమ చేసి హిందీకి ఒక కొత్త హొయలు, కొత్త జిగిబిగిని సమర్పించాడు. మొదటిదినాల్లో ఇతడు పలురకాల

సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చింది. ఇప్పుడు మన ఆంధ్రభాషకువలెనే అప్పుడు హిందీభాషకు అది సంధికాలం. హరిశ్చంద్ర యుగంలో భావజాగృతి అయితే కలిగింది; వాఙ్మయంలో నవీన ఉపకరణాలను నిస్సంకోచంగా స్వీకరించారు. కాని భాష పులగం అయిపోయింది. ఏప్రాంతంలోనిరచయిత ఆప్రాంతంలోని శబ్దాలు, భాషీయాలు హద్దు పద్దు లేకుండా వాడటం ప్రారంభించాడు. భాషలో నీతి - నియమాలు లేకుండాపోయినయి. దీనివల్ల రెండునష్టాలు. ఒకటి భాషలో స్థిరత్వం లేకపోవటం, రెండు అన్నిప్రాంతాలకు అర్థమయ్యేలాగు ఒక 'ఇడియమ్' ఏర్పడక చిల్లర - మల్లరభాషలు తయారవటం. ఇంతకంటె జటిలసమస్య ఇంకొకటి ఎదురొచ్చింది. హరిశ్చంద్రయుగంలో పద్యానికి ఒకభాష (వ్రజభాష), గద్యానికి ఒకభాష (ఖడీబోలీ) అయింది. హరిశ్చంద్ర మొదలైనకవులు ఒకటి రెండుప్రయత్నాలు ఖడీబోలీలో పద్యాలు రాసి ఇది కవిత్వం రాయతగ్గభాష కాదని నిర్ణయించారు. దీనికి రెండు కారణా లున్నాయి. ఒకటి — ప్రాచీనకాలంనుంచీ కవిత్వం ఎక్కువగా వ్రజభాషలోనే రాయబడింది. అందుకని ఆ ప్రాచీనతామోహం తొందరలో విడటం ఎట్లా? రెండు — వ్రజభాషలో కవిత్వం రాయటం తేలిక. ఒకేశబ్దాన్ని అనేకవిధాలుగా ఉపయోగించవచ్చు. దోష మనరు. అందుచేతనే ఇప్పటిహిందీలో మూడునాలుగు శబ్దాలు వాడి వెలిపరిచేభావానికి వ్రజ భాషలో ఒక శబ్దం చాలు. కాని మహావీర ప్రసాదువంటి కర్మవీరునకు గద్యం ఒక భాషలోనూ, పద్యం ఒకభాషలోనూ రాయటం ఎలా ఒప్పుదల అవుతుంది?

ఈయన వెంటనే ఆందోళన బయలుదేరదీశాడు. ఈయన ఆందోళన ప్రారంభించినదినాల్లో ఈ పత్రికద్వారా హిందీ సాహిత్యసేవకు. ఈయనకూడా ఇదివరకు వ్రజభాషాకవే. కాని ఆందోళన ప్రారంభించిన తర్వాత ఖడీబోలీలో కవిత్వం రాసినాడు. ఈ ఆందోళనలో ఒక ఇబ్బంది ఏర్పడింది. భాషాసంస్కారం ఎలాగు? ఏప్రాంతపు శబ్దాలు జనబాహుళ్యానికి సుబోధకాలు అవుతాయి? వ్యాకరణం ఎంతవరకు గ్రహణీయం? భాషలో స్థిరత్వం ఏర్పరచటానికి కొత్తగా పైకి లేచి నవనవ వికసిత కళలు లందుతూ వృద్ధిపొందుతున్న భాషకు ఏవిధమైన ఆటంకం లేకుండా ప్రగతిని సాధించటానికి తొక్కవలసిన మార్గ మేది? అనే ప్రశ్నలు ఎదుర్కొనినయి. కాని ఈమహాపురుషుని నిరంతరపరిశ్రమ, దూరదర్శిత్వం అనేకమంది కొత్తకవులను, లేఖకులను తయారుచేసింది. అచిరకాలంలో భాషలో ప్రాంతీయదోషాలు నశించి ఐక్యం కలిగింది.

అవి ఇంగ్లీషులంటే వ్యామోహం ప్రబలినదినాలు. ప్రతిఆంగ్లభాషాభ్యాసకుడు ఇంగ్లీషులో రాస్తేనేగాని మనం గొప్పవారం కామనుకోవటం, ఇంగ్లీషు పత్రిక చదివితేనేతప్ప దేశసమాచారాలు తెలియ వనుకోవటం ఎక్కువ ప్రబలి ఉంది. అట్టికరుణంలోనే ద్వివేదగారి ఈఆందోళన, ఈప్రోత్సాహం చాలమంది యువకుల్లో మాతృభాషానురాగమును కలుగజేసినయి. ప్రతివిమర్శకునకు సరస్వతిలో స్థానం ఉండేది. పూర్తిగా ఆయనకు వ్యతిరేకంగా రాసినా

ఆయన ఆగ్రహించేవాడు కాదు. వారినందరిని ప్రోత్సహించి-ఏదోవిధంగా భాషాసేవకు పురికొల్పటమే ఆయనపని. ద్వివేదీజీ బహుభాషావిదుడు. సంస్కారి. విమర్శనాశక్తి కలవాడు. పదిహేనుసంవత్సరాలు ఎడతెగకుండా నాయకత్వము వహించి అమరకీర్తిని గడించిన ధన్యుడు ఈయన సహృదయత ఒకమహాకవి (మైథిలీశరణగుప్త)ని హిందీజగత్తునకు సమర్పించింది. భారతదేశంలో కర్షక- పాటక జన జీవితాన్ని సాహిత్యంలో ప్రవేశపెట్టిన నవలాసమ్రాట్టు ప్రేమచందు కూడా ద్వివేదిగారివల్ల కొంతప్రేరణ పొందినాడు విమర్శ, కవిత్వం, కథలు, నవలలు, నాటకాలు, అనువాదం, ప్రతివిషయాన్ని గురించి వ్యాసాలు రాయటం అంటే ప్రజల్లో అభిరుచి ఈయనయుగంలో కలిగింది.

ద్వివేదీయుగానికి ప్రతినిధికవి మైథిలీశరణగుప్త — జాతీయకవి. ఈయన అటు సనాతనులకు, ఇటు యువకులకు ఇద్దరకు ఆదర్శప్రాయుడు. మహాత్మునకు అత్యంత ప్రేమపాత్రుడు. 'సమస్యలు పరిష్కరించటం కావ్యంపని కాదు. వస్తువుయొక్క బాహ్యాకారమే కావ్యానికి చరమధ్యేయం కాదు. అయినా అనుభూతియొక్క పూర్ణ వ్యక్తీకరణమునకు ఒక గ్రహణశీలమైన మధ్యవర్తి కావ్యం. కనుక కావ్యం ఏయుగంలోని అనుభవానికి కళారూప మిచ్చి, దాన్ని శాశ్వతరూపంలో వ్యక్తపరచబోతున్నదో ఆయుగపు సామూహిక ఆత్మను వ్యాకులపరచుసమస్యలను ప్రతిబింబింపజేయటం కావ్యధర్మమయి ఉంది. ఈకావ్యధర్మాన్ని గుర్తించినవాడే యుగప్రాతినిధ్యం వహించగలడు. మైథిలీశరణగుప్త అందుకు సమర్థుడు. ఈమహాకవికి ఆర్యసంస్కృతి అంటే అతిప్రేమ. అట్లని నవీనతను తిరస్కరించడు. ప్రాతక్రొత్తలను సమన్వయపరచి ఒక నూతనవస్తువుని తయారు చేయవలెనని కాంక్షించుతాడు. మహాత్ముని యుగంలోని కవికనుక మహాత్మునిభావచింతన, నిష్కామకార్యానురక్తి, నిష్కల్మష దేశప్రేమ ఈయనకవిత్వంలో పొడచూపుతవి. క్రొత్తపాతలను రెంటిని మేళవించబట్టియే ఈకవి ఇటు యువకులకు, అటు సనాతనులకు ఉద్బోధనకర్త కాగలిగినాడు. మహాయుద్ధప్రారంభదినాల్లో ఈయన 'భారత - భారతి' బయలుదేరింది. దీనికి మూలప్రేరకం ఉర్దూకవి హాలీ రచించిన ప్రసిద్ధఉర్దూపుస్తకం. దేశభక్తిపూర్ణమైన ప్రతి యువకహృదయం ప్రేమతో గర్వంతో ఈ పుస్తకాన్ని అందుకున్నది. దీనిలో మూడు ఖండాలు ఉన్నాయి. సనాతన ఆర్య సంస్కృతియొక్క మహావైభవం, వర్తమానపు అధోగతి, భవిష్యంలో మనమవలంబింపవలసిన భవ్యమార్గం— వీటినిగురించి ప్రసంగాని కనుకూలించు చక్కనిరసపరిపాకంతో వర్ణించబడింది. వాడవాడల, పల్లెపల్లెల ఈ కావ్యం పొందినఆదరం, ఈకావ్యంవల్ల జరిగిన సాంఘికజాగృతి అవర్ణనీయం. ఈయన కావ్యాలలో 'సాకేత్' (రామాయణం), యశోధర, జయద్రథవధ ప్రసిద్ధిచెందినవి. రామాయణంలో ఆదికవి ఊర్మిళకు ఎక్కువస్థానం ఇవ్వలేదు. ఊర్మిళత్యాగం, ఊర్మిళజీవితం అంధకారంలోనే ఉండిపోయింది. దీనికికారణం కూడా ఉంది. మనం ఏదైనా వస్తువును చూచునప్పుడు ఒకేమాదిరిగా ఆ వస్తువు సమస్తభాగములను ఒక్కసారిగా చూడలేం.

ఎదుటిభాగం బాగా కనబడుతుంది, ప్రక్క భాగం తక్కువ, వెనుకభాగం అసలే కనబడదు. ఇదేవిధంగా సాహిత్యశిల్పి కూడా తనశిల్పంలో ఏ అంశానికి ఎక్కువ ప్రాధాన్యం ఇద్దా మనుకుంటాడో, దాన్ని పెద్దగా చిత్రిస్తాడు. మిగిలిన అంశాలను — పాఠకుల ఊహాశక్తికి వదలివేస్తాడు. ఆదికవి రామాయణాన్ని ఒకలక్ష్యంతో వ్రాశాడు కాని మైథిలీశరణగుప్త ఊర్మిళ జీవితాన్ని ముఖ్యంగా దృష్టిలో ఉంచుకొని 'సాకేత్'ను సృష్టించాడు. ఇందులో వర్తమానయుగపు ఆత్మబలిదానం, సర్వసమత్వం మొదలైనభావాలు బహురమ్యంగా చిత్రింపబడ్డయి. ఇదేవిధంగా బుద్ధుడు, యశోధరకు చెప్పకుండా అడవికి పారిపోయి యోగాభ్యాసంచేయటం ఈకవికి అన్యాయంగా తోచింది. అందువల్ల, కొత్తలక్ష్యంతో, 'యశోధర'ను రచించినాడు. ఈయన 'యశోధర'లో యశోధరయొక్క మానసికగ్లాని, విషాదం స్త్రీల సహజౌదార్యం, మాతృప్రేమ,ఆత్మసమర్పణ పాఠకులను కరుణరసంలో ఓలలాడించుతాయి. వంగమహాకవి మైకేలు మధుసూదన దత్తు వ్రాసిన "మేఘనాధవధ "ను ఈయన అనువదించాడు.

భాషాసంస్కారానికి మార్గదర్శకములు ఈయనకావ్యాలే. ఈయన'సాకేత్' మహాత్ముని పారాయణగ్రంథం. ఇక్కడ ఇంకొక విషయం గమనించదగ్గది. ప్రస్తుతం హిందీలో ప్రబంధకావ్యాలు రాసేవారు బహుఅరుదు. ప్రబంధఫక్కీని పోకుండా పట్టుకున్నది ఈయన ఒక్కడే. ఈయన తమ్ముడు సియారామ శరణగుప్తకూడ ఒక మధురకవి.

కొన్ని శతాబ్దాలనుండి సుషుప్తిలోపడి మకిలిపట్టిపోయిన జాతీయభావం అకస్మాత్తుగా మేలుకునేసరికి భారతదేశహృదయం ఆవేశంతో ఉద్వేలిత మయింది. ఈ ఉద్వేలన, ఈ ఆవేగం హిందీకవులను ఎక్కువగా కలతపరిచిం దని చెప్పటంలో అతిశయోక్తి లేదు. సత్యాగ్రహపుదినాల్లో జాతీయ ఉద్బోధనకు గీతా ల్లానికవి లేదు. శృంగారంలో దేశభక్తి. కృష్ణభక్తిలో దేశభక్తి. ఎటు చూచినా వీరరసోల్లాసపూర్ణమయిన గీతికలే. ఈధారా ప్రవాహం కవిత్వంలో ఏదో ఒకరూపంతో ఇంతవరకు వస్తూనేఉంది.

కథలు—నవలలు :

పశుపక్షులక్రోధం, ప్రేమ, రాగద్వేషాలు 'నా' వరకే ఆగిపోతాయి. ఆ 'నా' క్షేత్రం చాలా హ్రస్వంగా ఉండిపోతుంది. తల్లికి పిల్లలపైనుంచే మమకారం బహుస్వల్పం. పిల్లలు రెక్కలు వచ్చిఎగరటానికి యోగ్యమై నవయ్యేసరికి ఆమిగిలిన మమకారంకూడా నశిస్తుంది. ప్రేమ, ద్వేషం మొదలైన అంతర్వృత్తులలో వ్యాయామం జరగదు. భావసంఘర్షణ, విరోధీభావాలతో యుద్ధం చేయటం మనుష్యుని స్వభావం. అతని 'నా' శబ్దం క్రమక్రమంగా విశాలరూపాన్ని ధరిస్తుంది. నా కుటుంబం, నా సంఘం, నా దేశం అనుకోవటం అతని నైజగుణం. అతను సంఘజీవి తన సుఖ-దుఃఖాలు ఇతరులతో చెప్పకోవటం, ఇతరుల సుఖ-దుఃఖాలను వినటం అంటే అతనికి సర్దా. దీన్ని పూర్తిచేసుకునేందుకే అతను కథలు అల్లుతాడు.

మనుష్యత్వంలో సానుభూతికి గొప్ప స్థానముంది. అది ఒక గొందిలో పడి ఉండ

లేదు. దాని విహారానికి సర్వప్రపంచం కావాలి. నవలలు కథలు రాయడంకూడా దాని ప్రేరణవల్లనే. కాలానన్నుసరించి, నాగరకత ననుసరించి కథలబాహ్యరూపం మారినా, మూలప్రవృత్తిమాత్రం మారదు. దాని ఉత్పత్తిస్థానం ఎప్పుడూ ఒకటే.

౧౯౧౮ దగ్గరనుంచి నవలలకు కొత్త యుగం ప్రారంభమయింది. అదివరకుకూడా పలువురు నవలలు రాశారు. కథలు రాశారు. పేరుకూడా పొందారు. కాని అవన్నీ 'డిటెక్టివు'నవలలు, కాశీమజిలీల్లాంటి ఊహాప్రపంచంలో తిరుగాడేవే. కథావాఙ్మయంలో నవయుగాన్ని వెంటతీసుకుని వాఙ్మయంలో ప్రవేశించింది ప్రేమచందు. ఈయనకళకు ఆధారం మానవజీవితం. మనుష్యజీవితమే ఈయనకళకు పుష్టి నిచ్చింది. సాంఘిక జీవితమే ఈయనకళకు ప్రధానక్షేత్రం. జీవితాన్ని మరచినకళాకారుడు తనకర్తవ్యాన్ని నెరవేర్చుకోలేడని ఈయనవిశ్వాసం. 'మూక జీవితానికి వాక్కును కలుగజేయటం 'కళాకారునివంతు' అంటూఉండేవాడు. ఈయన 'కథావస్తువు అకృత్రిమంగా ఉండాలి. మానవీయ అంతఃప్రవృత్తులు, నైతికతత్త్వాలు, వాటిల్లో కలిగే సంఘర్షణ, చివరకు కలిగే పరిణామాన్ని సూచించటం కథలకు ముఖ్యాదర్శమయిఉండాలి' అను గుణపాఠం తీసుకుని బయలుదేరాడు ఈయన.

ఇప్పటివరకు ఏ భారతీయకవిహృదయం లోనూ కార్మికులు, కర్షకులు, పాటకజనం అంటే నిజమయినసానుభూతి లేదు. కర్మం చాలక పూర్వం ఏకవిఅయినా వారిజీవితాన్ని తీసుకుంటే అది మేలుజీవితం గడపేవారివినోదంకొరకే. హాస్యరసానికి ఆలంబనవిభావంగా "పల్లెటూరిగబ్బిలాయిల (?)జీవితాన్ని" తీసుకునేవాడు. ఇంతకుమినహా వారియందు అకృత్రిమమైనసానుభూతిని ఏమహాకవీ చూపించియుండలేదు. పూర్వపు ఆదృష్టే వేరు. బహుశః వారిదైన్యజీవితానికి హిందీవాఙ్మయంలో రూప మిచ్చినప్రథమసహృదయుడు ప్రేమచందే. ఆయన ప్రారంభజీవితం చాలాకష్టాల్లో గడిచింది. పల్లెటూళ్లలో తిరిగేసౌభాగ్యం ఆయనకి లభించింది. అందుకనే ఆయన ప్రతిరచన, ప్రతివాక్యం, ప్రతిశబ్దం పల్లెటూళ్ల జీవితాల్ని వర్ణించినయి. ఆయన షుమారు 300 లకు పైగా కథలు రాసినాడు. ఆయన రాసిన నవలలు ఒకడజనుకు తక్కువ లేవు. మానవత్వమంటే ఈయనకున్న ఆదరమూ, బీదసాదలంటే ఈయనకున్న సానుభూతీ వర్ణనాతీతం. సత్యాగ్రహసమరం మొదలుకొని ఇప్పటివరకూ భారత దేశంలో జరిగినతుములయుద్ధానికీ, యువకుల మహత్త్వాకాంక్షలకూ ఈయనరచనలు అద్దంవంటివి. ఇతనికి కళ ప్రధానం కాదు. జీవితం ప్రధానం. దానితోపాటు కళకూడా జతపడితే ఆ శ్రేయస్సు ఆయన పాండిత్యానికేకాని, ఆయనధ్యేయానికి కాదు.

ఈయన మొదట ఉర్దూలో కథలు రాస్తూఉండేవాడు. తరువాత హిందీలో రాయ నారంభించాడు. అందుకనే భాష మంచినుడికారం గలిగి పాత్రల స్వభావానికి అనుగుణంగా ఉంటుంది. ఇప్పుడు గాంధీగారు "హిందుస్తానీ" అని చెప్పేది ఈయన భాషను 'మానా'గా పెట్టుకునే. ఇంతటి మహాస్రష్ట సుఖజీవనానికైనా సరిపడ్డసంపాదన సంపాదించ లేకపోయినాడు. ఈయనకు మహమ్మదీయ సోదరులు చూపినంత గౌరవ

మైనా హిందీవారు చూపెంచలేదు. తీరా దేశం గుర్తించవచ్చి, ఈయనకు తగిన గౌరవాన్ని చూపించబోయేసరికి ఈయనకు ఆయువు లేకుండా పోయింది. భారతీయ సాహిత్యపరిషత్తుతరఫున ప్రచురించటానికి ఈయన నడుపుతూవచ్చిన 'హంస' పత్రికను తీసుకొన్నారు. కానికొద్దికాలంమాత్రమే గవర్నమెంటు దాన్ని సాగనిచ్చింది.

హిందీ కథావాఙ్మయం అంతులేకుండా పెరిగిపోతోంది. ప్రతినెల పత్రికలలో కథలు మిక్కుటంగా వెలువడుతున్నాయి. సాంఘిక, రాజనైతిక విషయాలకే ఎక్కువప్రాధాన్యం. రచయితలు మానవీయ అంతఃప్రవృత్తుల సంఘర్షణ ఎక్కువగా చూపించుతున్నారు. కథలలో కొన్ని గాలికి ధూళికి ఎగిరిపోయే వయినా మొత్తంమీద స్థాయీ సంపత్తి చాలా పోగవుతోందనిమాత్రం చెప్పకతప్పదు. ఇతరవాఙ్మయాలనుండి అనువాదంకూడా జరుగుతూనే ఉంది. నవలలు కూడా చెప్పుకోదగ్గవి బయలుదేరినయి, బయలుదేరుతూనే ఉన్నాయి. మొత్తం మీద కథావాఙ్మయం చాలా అభివృద్ధి చెందిందని నిస్సంశయంగా చెప్పుకోవచ్చు.

నాటకములు :

కథాసాహిత్యం ఎంత అభివృద్ధిచెందిందో నాటకసాహిత్యం అంత వెనుకపడిఉంది. స్టేజికి పనికివచ్చే నాటకాలు బొత్తిగా లేవు. ద్విజేంద్రలాలురాయి, గిరీశచంద్రఘోషుగారి బంగాలీనాటకాల అనువాదాలు హిందీలో ఉన్నవి. ద్విజేంద్రలాలురాయినాటకాలు భారతదేశంలోని అన్నిభాషలలోనికి అనువాదమై కీర్తిగడించిన వని వేరుగ చెప్పనక్కరలేదు. హిందీలో స్వతంత్రనాటకాల కంటె ఈఅనువాదితనాటకములే ప్రజల నెక్కువ ఆకర్షించినయి.

స్వతంత్ర నాటకాలు రచించేవారు చాలామంది ఉన్నా ఈక్షేత్రంలో ఎక్కువ పేరుప్రతిష్ఠలు గడించింది జయశంకరప్రసాదు. ఈయనకు బౌద్ధయుగంఅంటే ఎక్కువప్రేమ. బౌద్ధయుగంలోని సంస్కృతినే ఈకవి ఎక్కువగా చిత్రించాడు. పాశ్చాత్యనాగరికతావ్యామోహంలో మునిగిన ఇప్పటియుగం ఈయనభారతీయసనాతన ఆదర్శాలను నిస్మయ, విభ్రమదృక్కులతో చూడనారంభించింది. ఈయనకలంలో నాటకీయకౌశలం కంటె కవిత ఎక్కువ వుంది. ఈయన భాషకఠిన. భావానుభూతి కడునిగూఢము; అతిగంభీరము. అదే నాటకాల్లోకి వచ్చింది. అందుకనే నాటకాలు రంగాని కంతగా ఉపయోగించవు. చదువుతూంటే కావ్యానందం కలుగుతుంది.

నాటకాల్లో హిందీవారు చాలా వెనుకపడిఉన్నారు. 'మనవాఙ్మయంలో నాటకాలు లేవే'అనే ఆందోళనతో పలువురు కలాలు పరుగెత్తిస్తున్నారు ఇప్పుడిప్పుడే. కాని ఇంత ప్రశంసింపతగ్గనాటకాలు ఇంతవరకురాలేదు. వ్రాయనగాండ్ల ఉత్సాహం చూస్తే తొందరలోనే ఆలోటు పూర్తి అవుతుం దని ఆశించవచ్చు.

అనువదింపబడు వాఙ్మయం :

హిందీ ఉన్నతిగోరు భాష. ఇది — స్వతంత్రరచనలు అనేపేరుతో కిటికీలుపులు మూసుకోదు. ఇతరభాషల్లో ఏమాత్రం మంచికనపడినా తమవాఙ్మయంలోనికి తీసుకోవాలని హిందీవారు తహతహ లాడుతూంటారు. మంచితోపాటు చెత్తకూడా కొట్టుకు

రావటం సహజమే. అనువాదంపెచ్చిలో పడితే స్వాబుద్ధితో ఆలోచించేశక్తి నశించటం సహజమే అయినా ఇతర వాఙ్మయాల నుండి గ్రహించకుండా వాఙ్మయం వృద్ధి కాదు; పూర్తి అనిపించుకోదు. హృదయ కవాటం జ్ఞానాన్వేషణకు ఎప్పుడూ తెరచి ఉంచటము ఉన్నతిగోరువారి లక్షణం.

సంస్కృతాం, ఇంగ్లీషు, ఫ్రెంచి, రష్యా, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, ఉర్దూ మొదలైన భాషల్లోంచి చాలాగ్రంథాలను అనువదించారు. ఇప్పుడిప్పుడే మన దక్షిణదేశపు తమిళం, తెలుగు, కర్ణాటకం, మలయాళం భాషలనుంచికూడా అనువాదం సాగింది. తెలుగు వాఙ్మయాన్ని గురించి ఎక్కువ కృషిచేసి హిందీవారిదృష్టిని ఇటు మరలింప ప్రయత్నించినవారిలో శ్రీరామానందశర్మ, వ్రజనందనశర్మగార్లు ముఖ్యులు. వ్రజనందనశర్మగారు అనువదించిన ముద్దుకృష్ణగారి 'అశోకవనం' హిందీవారి ఆదరాన్ని చాలా పొందింది. హిందీ చదువుకున్న తెలుగుపండితులు మన ఆంధ్రవాఙ్మయాన్ని గురించి రాష్ట్రభాషయగు హిందీలో రాయటం చాలా అవసరమనుసంగతి వేరుగ చెప్పనక్కరలేదు. కాని ఈవిషయంలో ఇంకా ఎవరూ అంత ఉత్సాహం చూపకపోవటం విచారకరం.

విమర్శ :

కావ్యంలో మునిగి నిష్పక్షపాతబుద్ధితో దానిలో రత్నాలున్నవో నత్తగుల్లలున్నవో చెప్పటం విమర్శకునిపని. ఇటువంటివిమర్శ ఇటీవల చాలా హెచ్చింది అని చెప్పవచ్చు. హిందీలోకూడా విద్వాంసులు కొందరు ఈక్షేత్రంలో మంచిప్రతిష్ఠ సంపాదించారు. ఇంగ్లీషులోవలె ఒక్కొక్కకవినిగురించి పలు రకాల విమర్శపుస్తకాలు బయలుదేరుతున్నాయి. హిందూయూనివర్సిటీ హిందీ ప్రొఫెసరు పండిత రామచంద్రశుక్లగారు ఈదిశలో మేటి. 'రసాత్మకం వాక్యం కావ్యం' అనేసిద్ధాంతాన్నే ఈయన తీసుకున్నారు. కొత్తమెరుగులు పెట్టి కవియొక్క అంతరంగ - బహిరంగప్రవృత్తులను మనోవిజ్ఞానంతో ఇంత చక్కగా విమర్శించేవారు హిందీలో ఇంకొకరు కనబడరు. పూర్వకవులు —తులసీదాసు, సూరదాసు, జాయసీ మొదలగువారినిగురించి ఈయన రాసినవిమర్శలు ఏపాశ్చాత్యవిద్వాంసుల విమర్శలకూ తీసిపోవని పండితుల దృఢవిశ్వాసం. తళుకు బెళుకులు చూపి వాఙ్మయంలో పేరు సంపాదింపజూచేవారికి ఈయనంటే సింహస్వప్నం. ఇటువంటివిమర్శకులు ఏవాఙ్మయానికైనా గౌరవనీయులు. వీరిమార్గాన్ననుసరించి ఇంకా పలువురువిమర్శకులు కడుఉత్సాహంతో పనిచేస్తున్నారు. నవలలు, నాటకాలు, కథలు మొదలైనవాటినిగురించి —ప్రత్యేకంగా ఒక్కొక్కలేఖకుడి రచనలు తీసుకుని గ్రంథాలు తయారుచేస్తున్నారు. ఈదృష్టితో మన తెలుగుసాహిత్యాన్ని చూస్తే నిరాశతప్ప ఏమీ కనబడదు. మన తెలుగులో రోజ రోజు ఇన్నిన్ని నవలలు, కథలు, నాటకాలు బయలుదేరుతూంటే వ్యక్తిగత రాగద్వేషాలుమాని, నిష్పక్షపాతంగావిమర్శించే విమర్శకుడు బయలుదేరకపోవడం కడుశోచనీయం.

పత్రికలు :

హిందీలో పత్రికలు - దినపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు - దినదినం పెరిగిపోతున్నాయి. ఈ పెరిగే సంఖ్యతో మన

కిక్కడ సంబంధం లేదు. భాషాసేవకు తోడ్పడుతూన్న పత్రికలే ఇక్కడ చర్చనీయములు. సాంఘిక, రాజనైతిక, ఆర్థిక విషయాలే కాక స్త్రీసమస్యలు, మతవిషయాలనుగురించి కూడా పత్రికలు కడుశ్రద్ధ తీసుకుంటున్నాయి. పాతని రోయటం కాని, కొత్తని ముద్దిడటం కాని వాటిపని కాదు. విశ్వసాహిత్యానికికూడా వాటిల్లో స్థానం ఉంది. పత్రికల్లో కవిత్వాలు, కథలు, ఏకాంక నాటకాలు, అనువాదాలు విరివిగా పడుతూ ఉంటాయి. వ్యాకరణం, రస, అలంకారాలను గురించినచర్చ పత్రికల్లో బొత్తిగా కనుపించదు. మనోవేగంతో పరుగెత్తుతూన్న ప్రపంచాన్ని అనుసరించాలని శతవిధాల సంపాదకులు ప్రయత్నిస్తారు.

మన తెలుగుమాసపత్రికల్లో సంపాదకీయం మచ్చుకైనా దొరకదు. వ్యాసకర్తలు కష్టపడి రాసి పంపిస్తే అన్నిటినీ జతపరిచి ప్రచురించడమేకాని వ్యాసకర్తలకు నాయకత్వం వహించి మార్గం చూపించే ప్రయత్నాలు తెలుగు సంపాదకులలో కనుపించవు. కాని హిందీలో సంపాదకీయం లేకపోవడం చాలా అవమానంగా ఎంచుతారు. పత్రికలు పెట్టుబడిదార్లవయినా, వాటి సంపాదకులకు పూర్ణహక్కులు వదిలివేస్తారు.

హిందీలో పిల్లలకు ప్రత్యేకంగా ఎన్నో పత్రికలు బయలుదేరుతున్నాయి. వారి [illegible] ఉన్నతిని దృష్టిలో ఉంచుకుని సంపాదకులు బహుజాగ్రత్తతో వ్యాసాలు [illegible] చేయిస్తూ ఉంటారు. విజ్ఞానం, కవిత్వం, కథలు, సినిమాలకుకూడా ప్రత్యేకం పత్రికలు బయలుదేరుతున్నాయి.

అర్థశాస్త్రం, విజ్ఞానం, [illegible] — రస — ఛందస్సులు, భాష, చరిత్ర మొదలైన వాటికి సంబంధించిన గ్రంథాలు విరివిగా బయలుదేరుతూన్నాయి. గ్రంథపరిష్కరణభీతిచే వీటి విరివయిన కొద్దిలోనే [illegible] వచ్చింది.

దినదిన ప్రవర్ధమానమవుతూవున్న హిందీవాఙ్మయాన్ని గురించి ఒకవ్యాసంలో పూర్ణంగా తెలుపడం [illegible]. ఈ వ్యాసం ఉద్దేశం ఆధునికహిందీ సాహిత్యాన్ని గురించి సాధారణపరిచయం కలిగించడం వరకే.



మాటలేనా!!

భమిడిపాటి కామేశ్వరరావు

నాతపట్నం సివారు పెరుగుపిల్లి అనే ఒక జమీందారీ గ్రామం ఉండేది. ఆవూళ్లో సిమాలమ్మ అనే ఒకవ్యక్తి ఉండేది. మొదట్నించీ ఆవిడ అక్కడే ఉంది. ఆవిడ పుట్టింటారంతా బుగ్గి అయిపోడం, మాటలు ఇంకా సరిగ్గారాని వయస్సులోనే ఆవిడకి అత్తారింటి పెళ్లి కావడం, పెళ్లైన పదహారో ఏండగ ఇదనకుండానే ఆవిడఐదోతనం కాస్తా అస్తా యిస్తాయిపోవడంలాంటివి కుట్ర జరిగినట్టు జరిగిపోయాయి. మాటొచ్చినప్పుడు పేరంటాళ్లు "సిమాలమ్మ ఎంత దొడ్డది! అయితేం పెట్టిపుట్టలేదు! కట్టుపెట్టి, కాటికెళ్ళాయా ఎరగదు కదా!" అంటూ కళ్లు తుడుచుకునే వారు. అత్తమామలకి ఇతరసంతతి లేక పోబట్టి, ఆవిడ అత్తారింటికి వెళ్లినవెళ్లడం ఏకవెళ్లడం అయిపోయి, అక్కడే పాతుకు పోవలిసొచ్చింది. ఆవిడకి పాతికేళ్లు వచ్చే దాకా అత్తగారుగ్రహం, పిసాదంపో సాదిస్తూ, విగ్రహం కంటికి కనపడుతూ ఉండేది. మరి తరవాత కథా ఎవ వినన్నారూ! బిక్కు బిక్కుమంటూ కార్తీకదీపంలాగ మామగారొక్కడూను! ఆ కాస్త మామగారూకూడా వచ్చేప్రాణం పోయేప్రాణంకింద మంచం మీద పణ్ణర్ధం ఉయ్యాలా ఊగి, ఆవిడ ముప్ఫైయ్యోయేట బ్రహ్మాండం మీద పోయాడు. అప్పణ్ణించి, ఆవిడ, అటూ ఎవరూలేక ఇటూ ఎవరూలేక ఘంటస్తంభం లాగ ఒక్కర్తీ నిల్చిపోయింది. బతికున్న జ్ఞాతులు ఎవరూ లేకపోడంచేత వారసత్వపు గొడవలు ఆవిడచెవిని పడవలసిన అవసరం పోయింది. ఆవిడ పెంచుకోనూ లేదు. ఏటా ఓ ఇరవై కాటాబస్తాధాన్యం, ఓబొద్దుగడ్డీ, గుమ్మంలోకి తెచ్చి ఆవిడకాళ్లదగ్గిర అప్పగించేవారు. ఆవిడదగ్గర రెండువేలు చేసే బంగారపుతోడు గుండేది. ఆవిడపేర రెండు వేలపైమాట వడ్డీకి తిరుగుతూండేది. ఆవిడికి పట్టుమని బంధువులేనా లేరు, ఏబీరకాయి పీచో! ఆవిడ ఇంటిపేరుకి నోట్లల్లోనూ పత్రాల్లోనూ తప్ప వాడకమే లేదు. దానిమూలాన్ని ఆవిడికి పురుషపుణ్యాలూ, కష్టసుఖాలకి రాకపోకలూలాంటి కుటుంబసంబంధమైన తప్పనిసరి మొహమాటపు తగులుబాట్లు కించిన్మాత్రం లేకుండాపోయాయి. ఆవిడికి గవ్వ ఖర్చులేదు. అందులోనూ ఆవిడ స్వతహా ఇరుకుచేతి మనిషి. అవునా! తను దంతసిరితో పుట్టిందగదా, ఇంత అన్నోదకాలకి మొహం వాయక్కర్లేదుగదా, ఒహటోరకమైన వసతి కట్టుదిట్టంగా ఖంజాయింపై ఉందిగదా, చెయ్యి ములగా పాడిగదా, ఒరగణా అంత భవంతి స్వంతానికి ఉందిగదా, అల్లాంటప్పుడు తనవేళకి తన యింటో, తనసొమ్ము — ఇతరులకి పెట్టద్దు పోసీ! — తను తింటూ ఉండిపోతే రోజులు దొర్లిపోవూ! దేవాసురులుకూడా ఎగిరి గంతెయ్యరూ! మరే! ఆవిడ అల్లా ఉంటుంది! రమ్మంది, తిమ్మన్నబంతికి! అల్లాంటివాళ్లు అల్లా ఉంటే కావలిసిందేమిటిహా! అపూర్వమైన

స్వంతవైత్యం ఏదో ఓటి వీథిని పడాలి, వ్యక్తిత్వంలో ఉండే ప్రత్యేకత స్థాపన కావాలి. అందుకని, అంత నిప్పులాంటి మనిషీ ప్రజలనోట పడింది.

ఇంట్లో పనున్నప్పుడు తప్ప ఆవిడ తన వీధి అరుగు — ఎడంవేపుది వదలేదికాదు. ఇల్లెంతున్నా యజమానికి, ఇంట్లో ఒక్కోక్కస్థానం మరీ స్వస్థలంలా కనిపిస్తూండి, అక్కడికి చేరుకుంటేనేగాని మనస్సు స్థాయీ పడదు. రాత్రిళ్లుకూడా చాలంభాగం ఆవిడ అరుగునే ఆశ్రయించేది. కాని, ఆవిడకల్లో సరేసరి, నిద్దట్లోకూడా ప్రసంగిస్తూనే ఉండేది. ఇక, ఉత్సాహపడు అడిగాదూ! పైగా, ఒక్కని ఎవరో కళ్లల్లో వత్తులెట్టుగుని ఊకడుతూ కూచున్నట్లు, సంబోధనలుకూడా చేస్తూండేది. అయితేంగాక, ఇంతమాత్రాన్నే జనానికి కోపం రాలేదు. వాళ్లు ఆవిణ్ణి, 'వాగుడుకాయి' అని, ఇంకా పొట్టిచేసి, 'వాక్కాయి' అని ఆవిడ పరోక్షంలో వ్యవహరించేవారు, తీరిపోయేది. కాని, అభ్యాసంవల్లా నిర్భయత్వంవల్లా ఆవిడధోరణి క్రమేపీ తిట్లల్లో పడింది. కొంతకాలానికి ఎల్లా దిగింది! వీథమ్మట చరాచరాల్లో ఎవళ్లైనా సరే ఏదేనా సరే, నడవ భయం వెళ్ల భయం, ఉత్త పుణ్యానికి ఆవిడ దులిపి ఝాడించి పారేసేది. పైగా వెధవకర్మం! తన వేడివేడి విమర్శని ఒక్కరవ్వ చల్లారనిచ్చి, దానికి కొంచెం వార్నీసు వెయ్యడంగాని దాన్ని ఎల్లానో సాఫు చెయ్యడంగాని లేకుండానే ఆపళంగానే ఎదరపార్టీ మొహంమీద గిరవటెట్టేది. అక్కణ్ణించి క్రిమినలంతపని జరుగుతూండేది. ఆవిడ వంకలేనిమనిషి అవడంవల్లా, ఆడది అవడంవల్లా, సుళువుగా తిట్టడంలో సార్వీసు ఉన్న స[illegible]ల్లా, కోపం హెచ్చినకొద్దీ నోటిఫాటీ పోరు చెయ్యగలశక్తికలది అనడంవల్లా, సమయం ఆవిడికే దక్కుతూండేది. 'నోటిఫాటీ' అంటే అదేదో జపానుసరుకు అనుకోకండి మరి! అప్పట్లో జనం ఎ[illegible]గా సా[illegible] [illegible] పోడంవల్ల ఆవిడికి సంగీతం [illegible] అ[illegible] లేదు గాని ఆవిడిది గ[illegible], స్థాయి గాత్రం, మందకొడి[illegible] [illegible]నోకేగానికి [illegible]పుగా ఉండే నా[illegible]. ఆ[illegible], పల్లి పాలు తాగడం, [illegible], [illegible] పోతే, చావమూ! [illegible] కుక్కలు ఆవీథిని [illegible], చూసుకోండి మరి ఆవిడప్రజ్ఞ! ఒకసారి [illegible]మీద వస్తూన్న ఆ[illegible] ఆ[illegible] [illegible] సంగతి ఎరుగున్నవా [illegible]. వారితో మాటు, ఒక పెద్ద [illegible] [illegible] [illegible] భయం ఏమి [illegible] [illegible] తొడుక్కుని [illegible] [illegible] వెడతూంటే, ఆవిడికి [illegible], '[illegible] కిర్రు మండిరి గదరా, [illegible] గదరా!' అని జమిలిగా తిట్టేసరికి, అంతటి మనిషీ నిలవా లేక, అటుగూ సాక్క, మాటా తోచక కేవలం '[illegible]మూ' అయిపోయండని చెబుతారు. అక్కణ్ణించి, ఆవిడ ఎదటపడి ఆగలేని అసమర్థులంతా ఆవిడమీద అసూయా పెంచుగుని, ఆవిడతిట్లనిగురించి చాటుగా ప్రచారం మొదలెట్టారు. సిమాంబమ్మ తిట్టపప్రజ్ఞ దేశంలో మోగిపోయింది. ఆవిడికి అదో హా జబ్బు అని చాలామంది అన్నారు. ఆవిడికి ఆ జబ్బు కుదిర్చి ఖర్చులేని దేశోపకారం టూకీగా చేసేసి వీళ్లైసంత పేరు [illegible]గాలని

కొందరు యత్నాలు చేశారు. మంచిదో చెడ్డదో ఏదో ఓ పేరు గలవాణ్ణి తిట్టడమో, అథవా వాడిచేత తిట్టించుగోడమో జరిగితే, తమరికిగూడా అమాంతంగా కొంత పేరేనా సుఖువుగా వస్తుందని భ్రమించేజనం ఉంటారు. ప్రస్తుతం పోటీ తిట్లపోటీగనక ప్రతివాడూ అభ్యర్థిగా నిల్చి చూశాడు. తిట్టుకి తొలిపై దాకా తిట్టా లేమోగనక గట్టివాళ్లుకూడా కొందరు చేరబడ్డారు. ఉపన్యాసకులు, ఉపాధ్యాయులు, వాదులు, నిగూహకులు, పురోహితులు వక్తలు, కవులు, ఆవిణ్ణే మించాలని వెళ్లేవారుగాని, ఆవిడే మరినాలుగాకులు ఎక్కువ చదివేది. బళ్లవాళ్లూ, బండపని చేసేవాళ్లూ, కొంపవచ్చిన పోలీసులూకూడా ఆవిడ తిట్టేసింపు సభ్యంగానూ స్వచ్ఛంగానూ తిట్టలేక తమ అపజయం ఒప్పేసుకున్నారు. తెరవెనకనించి ఉరిమినట్టు జంతువుల్లాగ కుయ్యగల ఒకరిద్దరు మునగరకపు విద్యార్థులకికూడా ఆవిడయెదుట నోరు లేవలేదు. కొంతమంది గడేకాళ్లూ, చిలకొట్లూ, ఏజెంట్లూ, జట్టువాళ్లూ, వసూళ్లవాళ్లూ కూడా ప్రయత్నించి, ఆవిడతిట్లప్రవాహంలో మొదట కొట్టుకుపోయి, మధ్య మునిగిపోయి, చివరికి తేలిపోయారు. 'హరి' అనే వరకూ ఆవిడిదే పైచెయ్యిగావును — (కాదు! పైనోరు గావును) — ఆవిడప్రభ అల్లా వెలగవలిసిందేగావును, ఆవిడజాతకం అల్లాంటిది గావును, తిట్టగలవాళ్లట రాజ్యంగావును, అనుకుంటూ లోకులు నిరాశలో పడిపోయారు.

కాలం జరిగింది. జరక్కుండా కూచోంది అదొక్కటేగా! ఆవిడిమీది కంట్రకత్వం పండింది. ఆవిడికి కుంచం నిండింది. ఒకనాడు పొద్దున్న తొమ్మిదింటికి ఆవిడ అరుగుమీద చతికిలబడింది. క్రితంనాడు పక్కఊరు తీర్థాని కెళ్లి రాత్రిరి ఇంటికి చేరుకునేసరికి ఆవిడికి పులకారం వచ్చినట్టుండి వొళ్లంతా పచ్చిపుండైంది. ఉదయం అప్పీషూ లేచి, అత్తేసరు పడేసి, తరవాత ఏదో యింత వడియాలపచ్చిపులుసు చేసుగో వచ్చుకదా అనుకుని, మడిగానే ఆవిడ అరుగుమీదికి వచ్చింది ఒక ఎరకలాడు ఆవీథంట వచ్చాడు. వాడు, మొలకి గోణం, తలకి పాణకంత పాగా, చెవలకి తమ్మెట్లూ, ఎడంచెవికి బావిలీ, ముక్కుకి కాడా, చేతులికి వెండిమురుగులూ, కుడిదండకి కడియం, చేతులో నక్కపిల్లికర్రా, జనపనారతాడు చుట్టా, నోట్లో యాళ్లకర్రంత ఉండి వెంటిలాగ రాజుతూన్న పొగచుట్టా, మీసాల చెప్పులూ వగైరాతో మహా అట్టహాసంగా వచ్చాడు. ఒక విశేషం. వాడిచుట్ట రెండు మూడునెల్లు వరసని కాల్చుగునేబాపతుది. దానిపొడుగుమూలాన్ని అది వాలిపోయి, జ్వాలాతోరణంలా ఒకసారే తగులబడి పోకుండా, వాడు దానిమధ్య ఒకనులకతాడు ముడేసి, నోట్లో ప్రతిష్ఠించినప్పుడు అది మట్టంగా ఉండేలాగు ఆతాడు అవతలకొస పట్టిగెళ్లి తలపాగాకొంగుకి కట్టేశాడు. పళ్లగంపచుట్టూ మూగినట్టు జనం వాణ్ణి మూగి కొందరూ, వెంటాడించి కొందరూ వచ్చారు. సిమాలమ్మకి కొంచెం ఆశ్చర్యంవేసింది — "ఎవడ్రా! ఇన్నాళ్లకి ఇల్లా తెగించి రాగలిగాడూ!" అని. కాని, అల్లాంటివాణ్ణి తిట్టి, సాగనంపగలిగితేనే తన వాగ్జన్మకి సాఫల్యం అనిపిస్తి, అంతగొప్పతరుణంలాంటిది మళ్లీ మళ్లీ తనకి దొరకకపోవచ్చనిపిస్తి, ఆవిడికి

అనిపించి, ఆవిడ తనమనస్సులో ఉన్న తిట్లు దస్త్రాలు తిరగేసి, కొన్ని ముఖ్యమైనతిట్లు కేటాయించి ఏరి, నూరి, చిన్న చిన్న కట్టలుగా కట్టి, ప్రయోగించడానికి తగ్గస్థితిలో పెట్టింది. వాడు ఆవిడఇల్లు సమీపించాడు. అసలు వాడు తాడిచెట్టులో సగం ఉన్నాడు. వాడికర్ర వాడు నిశాన్గా పట్టుకున్నప్పుడు అది వాణ్ణి దాటిపోయి, తాడిదన్నే వాడి తలదన్నే వాణ్ణి జ్ఞాపకంచేసింది. వాడు వచ్చేసి సరసరా ఆవిడ ఇంటిగుమ్మాలు ఎక్కేశాడు. వాడ్ని కిరాతపుముండావాడొచ్చాడే అనుకుని ఆవిడ కొద్దిగా నిర్ఘాంతపోయి లేచి నిలబడి దవడలు నొక్కుకుని, "అయ్యో! అజ్జో! అవ్వో! నీతాడు తెగా, నీదుంప తెంపా, నీపేరు తవ్వా! నేను మనిషి ననుకున్నావా, పంది ననుకున్నావురా, నిం దగలెయ్యా!" అని ప్రారంభోపన్యాసం ఇచ్చింది. వాడు గడపదాకా ఎక్కి, అక్కడ ఆగి, తనమూతి పైకి ఎత్తిపట్టి, చుట్ట తీసి, "థ్థూ" అనే పెద్దశబ్దంతో ఇంట్లో పడేలాగు కఫవంత ఉమ్మేసి, వీధికేసి తిరిగి, చుట్ట మళ్లీ నోట్లో స్థాపించి, నులకతాడు బిగించి, గుమ్మంమీద కూచున్నాడు సిమాలమ్మ, నడుం బిగించి,పళ్లు బిగించి, చేతుల్తో గాల్ని పొడుస్తూ కొంచెం వడిగా, "ఓరివెధవా, వెధవన్నరా! కుంకా! దోయంకుంకా! కుంకాకీ! చెవలవెధవా, చెప్పుతెగిన వెధవా! మరీ పొయ్యకాలం వచ్చిందేంరా! హోమం చెయిస్తా! నీకొవ్వొండిస్తా! నీపొగరు తీయిస్తా! అమ్మవెధవపొగరా!"...

అంటూ కాస్త దార్లోపడుతూండేసరికి, ఎరకలాడు భంగువ గద్దిగాడులాగ ఆవిడ మొదట ఓగజం ఎడంలోకి గంతేసి వాలి, చుట్ట తీసి పట్టుకుని, ఒక గొప్ప మేఘమండలం కోట్లోంచి బల్లపరుపుగా ఊది, ఆవిడకి నిర్మొహమాటంగా ప్రత్యుత్తరదానం చేసి, మళ్లీ తాపీగా గడపమీద కూచున్నాడు. ఆ పొగతో ఉక్కిరి బిక్కిరి అయి, ఘూకం వేసినట్టు అయి, ఆరిశాపమాట సన్నికెక్క ఆవిడ తేనెపట్టులా రేగిపోయింది. ఉదయంగా యేసి, ఆవిడ ప్రతీపిట్టమాకే, మాటలు ఎగరెయ్యడం, చేతులు చాచి చేతిగోళ్లు గిరగిరా తిరిగేలాగు నిలుపుచాటంలో ఉండి చక్రాలులాంటి సున్నాలు చుట్టడం, నూరిదాకి వెనక్కి ఊగడం, ... ఎకరక పరువడం, నిశపకుండా చేస్తూ, ... గా ... మనిషి గిన్నెలాగ ... అవస్థలో పడింది.

వాడు ... లోంచి అద్దం ఓటి పైకి తీసి, సవరించుకుంటూ, తనముఖంయొక్క అందానికి మురిసిపోతూ, పెదిమిలికి ఒక ఐమూల ఉన్నచోట దానంగాంట ... పళ్ల మీద సవరణ చేస్తూ ... ఐమూలకి చేరేటట్టు కదుపుతూ, తన పెదిమి యొక్క పనివాడితనం చూసుకుంటూన్నాడు.

సిమాలమ్మ — (బెక్కుతిట్లకే పైన చెప్పిన చేష్టలు చేస్తూ, వాడి ముఖం మీద కొచ్చివచ్చి) ఓరి నీ ముఖంఈడ్వా, నీ ముఖం మండా, నీ ముఖం ఊరేగించా, నీ ముఖాన్ని గోడట్టా, నీ ముఖం తగలెయ్యా, నీ ముఖం కాల్చా, నీ ముఖం గాను గాడా, నీ ముఖం ఛత్రంచెయ్యా, నీ ముఖం చిత్రికపట్టా, నీకళ్లు పేలా, నీగుడ్లు మాడా...

వాడు —(చుట్ట తప్పించి, కోతిలాగ పళ్ళిగిలించి, దొరపెక్కినట్టు ముక్కూ వొళ్లూ గోక్కున్నాడు.)

సి — నీపళ్ళు పీకా, నీగోళ్ళు పేల్చా, నీ కొక్కడం అంటించా, కొంప ముచ్చువెధవా, కోతివెధవా......

అంటూ ఆవిడ గొరకపుచ్చుగునే సరికి ఆసమయానికి ఓ ముష్టమ్మి, ఒకోతిని ఆడిస్తూ తీసుగొచ్చింది. ఎరకలాడు తంపాగాలోంచి ఓ అరటిపండు తీసి దానికేసి గిరవ ఏసి, ఇంకోటి కుడి అరుగుమీద పడేశాడు. తక్షణం ఆ కోతి గిరవేసిన పండు పట్టుగుని ఒక్క గంతులో కుడి అరుగుమీదికి ఎగిరి, అక్కడి పండు కుడా తీసుగుని తినేసి, మొగ్గలేసి, సిమాలమ్మ ఎల్లా ఎల్లా తిప్పుగుని ఏమేమి చేస్తే అల్లాఅల్లా తిప్పుగుని అది అది చేస్తూండడం మొదలెట్టింది. సిమాలమ్మకి కోపం జనానికి సంతోషం ఎక్కువైపోయాయి. ఇక ఎరకలాడు ఊరుకున్నప్పుడుకుడా, ఊరుకోకుండా ఆవిడ తిట్టేస్తోంది.

ఇంతలో వాడు ఆవిడకేసి చూసి నవ్వి, తనవేళ్ళు, (కళ్ళు మూసుగుంటూ), ముద్దెట్టుగున్నాడు.

సిమాలమ్మ — (గబగబా) నీకు అమ్మవారు రానూ, నీకు మహామ్మారి రానూ. నీకు పత్తెత్తురానూ, నీకు పెద్దరోగం రానూ, నువ్ మంచం అట్టా, నిన్ను పెద్దపాం పీకా, నిన్ను పులేసుగుపోనూ, నీమీద పిడుగడా, నిన్ను బలెయ్యా, నిన్ను తెగయ్యా...

కోతికుడా అంతవడిగానూ పెదిమిలు కదుపుతూ, కడంపన్లన్నీ చేసి చూపించింది. జనం చూస్తూ, వింటూ, కోలాహలంగా ఉన్నారు.

కాని, సిమాలమ్మకి మాట ఒక్కంటికి అన్నేసి చేష్టలు చేస్తూండడంవల్ల, క్రమేపీ మడమలు లేవడం మానేశాయి. కాన్సేపటికి చేతులు గూళ్ళల్లో పట్లు తప్పిపోయాయి. మరి కాన్సేపట్లో మెడజీవాలు కూడా తోడుకుపోయాయి. అక్కడితో ఆవిడ చాలా పీలస్వరంలో తిట్టడం తప్ప, అభినయాల్లో ఒక్కటీ చెయ్యలేక పోయింది. ఆసందర్భంలో వాడు కుడి తర్జనితో తనకేసి చూపెట్టుగుని వెంటనే ఆవిడకేసి చూపించి, తర్జనీలు కలిపి చూపించాడు.

సి — (చాలా కోపంతో, అతివడిగా) నువ్వు చచ్చిపోనూ, నువ్వు రాలిపోనూ, నువ్వు కాలిపోనూ, నీకు నిచ్చిన కట్టా, నీకు సవ్వారికట్టా, నీకు పాడికట్టా, నీకు రాయికట్టా, నిన్ను మోసెయ్యా, నిన్ను తగలెయ్యా, నిన్ను పాతేయ్యా, నిన్ను పాతరెయ్యా, నిన్ను బారెట్టా, నిన్ను పురంవెయ్యా, నిన్ను బూడిదచెయ్యా, నీకు పన్నెండెట్టా, నీకు మాసిగంపెట్టా, నీపిండం పిల్లులికెయ్యా, నీశార్థం చెట్టుకిం దెట్టా...

అనేరకాలు కొన్ని సొంతంగా ప్రయోగించుగుంటూ చివరచివరకి రావడంలో, ఆవిడికి మాటకూడా పడిపోయింది. కళ్లు తెరిచిఉన్నాయి, నోట్లోంచీ, ముక్కుపోణాల్లోంచీ గాలిమాత్రం వస్తోంది. మరేమీ

లేదు. అయినా ఎరకలాడు ఇంకోసారి చూద్దాం అనుకుని, బుగ్గని చేతెట్టుగుని తక్కుతూ, ఆవిడదగ్గిరిదాకా వెడుతూ వస్తూ బోగంఆట ఆడిచూశాడు. కోతికూడా అల్లానే చేసింది. కాని ఆవిడ ఎంతమాత్రం చేతా వాతా కాకుండాపోయి కేవలం అశక్తురాలై బొమ్మలాగ చూస్తూ ఉండిపోయింది.

గ్రంథం అంతవరకు రానిచ్చి, ఎరకలాడు, ఒక్కమాటంటే ఒక్కమాటే నోరు విప్పి, "నేను నీకు మంచి మొగుణ్ణి కానుటే" అంటూ ఆవిడకేసి చూసి సిగ్గు అభినయించాడు. ఈమాటతోటి, అస్ఖలితంగా బతికిన మనిషి గనక, సిమాలమ్మ తన అపజయం, పరాభవం, అవమానం, నిస్త్రాణ, నీరసం వగైరాలవల్ల గుప్పుమని పెద్దపెట్టున అప్పుడు మళ్ళీ పుట్టిన కోపంతో, ఊతం బలవంతం చేసుగుని, ఆఖరుమాటు చేతులు తిప్పుతూ ఆడిపోతూ కసితీరా వాణ్ణి తిట్టాలనుకుని, చేతులు చాచి, "ఓరి నీనోరు పడ్డోవ్" అనడానికి ప్రయత్నించడంలో, గూళ్లు పట్లుతప్పిపోవడంవల్ల ఎల్లానో చాచినచేతులు అల్లానే ఉండిపోయాయి గాని మరి కిందికి రాలేదు, మాటలు అనడాకిని తెరిచిన నోరు అంకిళ్లు పట్లు వొదిలిపోడంవల్ల ఎల్లానో ఆమాటలు అనేసి, తరవాత అల్లానే ఉండిపోయింది గాని దగ్గిరపడలేదు. ఒక్కక్షణం ఆస్థితిలో నిల్చిపోయి, చెయ్యీ దవడా స్వాధీనం తప్పిపోడం ఆవిడికి బాగా గుర్తుకి రాగానే, ఆవిడ కుంగిపోయి పక్కకి పడిపోయింది.

జనానికీ ఎరకలాడికీ ఆవిడమీద అదివరకే బయుద్దేరిన జాలి పెల్లివిరిసిపోయింది. ఎరకలాడు తనవైద్యం మరి కట్టేశా . అసలు వైద్యులొచ్చి ఆవిడ గూళ్ళూ అంకిళ్ళూ బాగుచేసి, మందిచ్చి, ఉపచారాలు చెయ్యగా, ఆవిడ ఓ వారంరోజుల్లో లేచింది. ఎరకలాడివేషం వేసిన ఆయనకే, ముష్టిఅమ్మవేషంలో కోతిని తీసుగొచ్చిన అతని తమ్ముడికీ వాగ్దానప్రకారం ఆ ఊరి జమీందారుగారు సిమాలమ్మశర్మమా లని ఓ అగ్రహారం ఇచ్చారు. సిమాలమ్మ [illegible] ఆస్తికూడా తనఅనంతరం వాళ్లికి చెందేటట్టు రాసేసింది.

తరవాత సిమాలమ్మగారు, తను జీవించిన పదికాలాలపాటూ, ఇల్లా నోరు విప్పి ఎరగదుట, నోరు విప్పగా ఎవ్వరూ విన లేదుట. ఆవిడమాట మానుకున్న అనంతరం ఆవిడ మాటలు వినాలని [illegible]దగా జనం వచ్చేవారుట. ఆవిడ గొప్ప జ్ఞానురాలనీ, ఆలోచనపరురాలనీ, కవయిత్రి అని జనం అప్పుడు కనిపెట్టి ఎంతో మెచ్చేవారట.

"సారస్వతప్రౌఢిమార్థి...సుగియు చేత
నాలుకఁ గోసికొని......యిష్టమొందగా"
అని మన సూరన్న మాటలు

మాటలేనా!

—o—

రూపాయి మారకముపై ప్రభుత్వవైఖరి

రేటు హెచ్చుతగ్గులలో గల చిదంబర రహస్యము

'రావు'

౧౯౨౦-వ సంవత్సరంనుంచీ జాతీయోద్యమం వల్ల కలిగిన ప్రబోధంచేత మన దేశీయులకు రాజకీయ విషయాలను తెలుసుకోవాలనే కుతూహలం వ్యాపించింది. ఇంతవరకు భేషుగానే వుంది. కాని యిది చాలదు. అర్థశాస్త్రం రాజకీయాలకి ప్రధానాంగం. ఆర్థికంగా మనకు కలిగే నష్టాలను గ్రహించలేకపోతే రాజకీయంగా మన కెలాంటి స్వాతంత్ర్యం కావలెనో నిర్ణయించుకోలేము. ఆ శక్తి యుంటే ఆర్థిక విషయాలను అర్థం చేసుకోవడం అంతగా కష్టం కాదు.

రూపాయిమారకంపూర్వచరిత్ర :

రూపాయి మారక మనగా నేమి?

పూర్వకాలంలో ప్రజలయొక్క వృత్తులు ఆ కాలపరిస్థితుల కనుగుణ్యంగా వుండేవి. మనుష్యుడు తనే స్వయంగా కాయకష్టం చేసి సంపాదించిన ముడి పదార్థాలు తెచ్చి, బాగుచేసి, తన కవసరానికి కావలసిన వస్తుపరికరాలను తయారుచేసికొని, తనూ, తన కుటుంబానికి వినియోగించుకునేవాడు. తనకు సరిపోగా మిగిలినవస్తువు లితరుల కిచ్చి వానికిబదులు తనకు కావలసినట్టియూ, తనవద్ద లేనట్టియూ ఐన యితర వస్తువులు తీసుకొనేవాడు. అప్పుడు నాణెముల ఆవశ్యకత లేకపోయింది. సరకులు బదులుకు బదులు ఇచ్చిపుచ్చుకోవడంతో అవసరం తీరిపోయేది.

కాలక్రమేణ వృత్తివిభాగం జరిగింది. ముడిపదార్థాలు సంపాదించే దొకరు, వానిని కొని విక్రయించే దొకరు, వస్తువులు తయారుచేసేది పలువురు, చేయించేవారు వేరు, చివరకు బజారులో ప్రజోపయోగానికి తెచ్చి అమ్మేది మరొకరు.

ఇలా యొక్కడి కక్కడ విభేదం కలిగింది. సరకు ఒక ప్రదేశంనుంచి వేరొకప్రదేశానికి పోవలసివచ్చింది. ఈ వ్యాపార బాహుళ్యానికి ఒక కొలబద్ద అవసరమైంది; అనగా, నాణెములు కావలసివచ్చాయి. ప్రతివస్తువు యొక్క విలువ నాణెముల రూపంలో తెలుపుకోటానికి నిర్ణయించుకున్నారు. ఈ విధంగా క్రమేణ వస్తుతత్వాన్నిబట్టి వస్తువుల ధరలు ఏర్పాటైనాయి.

వ్యాపారం వృద్ధియైనకొద్దీ ఆయా దేశాలలో వుత్పత్తిఅయ్యే సరకులు విదేశాలకుకూడా పంపగలిగిన శక్తి కలిగింది. అయితే ఒక్కొక్క దేశంలో ఒక్కొక్కవిధమైన నాణెము చెలామణిలో ఉంటూవున్నది. అందువల్ల ఆయా నాణెములయొక్క విలువలో తారతమ్యము నిర్ణయించుకోవలసి వచ్చింది; అనగా, నాణెములయొక్క 'మారకపురేటు' ఏర్పాటు చేయవలసి వచ్చింది.

మనదేశంయొక్క నాణెము రూపాయి. ఇంగ్లాండుదేశంలో చెలామణి యవుతున్నది పౌను. ఈ రెండు నాణెములకు ఇచ్చిపుచ్చుకోవటంలోగల పరస్పర సంబంధము (అనగా మారకము రేటు) పైననే యీ రెండు దేశములయొక్కయు, ఈ నాణెముల నాధారం చేసుకున్న యితర దేశాలయొక్కయు వ్యాపారాది వ్యవహారములన్నీ ఆధారపడి యుంటాయి. నాణెముల యొక్క విలువను నిర్ణయించే అధికారం సాధారణంగా ఆయాదేశ ప్రభుత్వాల కుంటుంది.

౧౮౦౬-వ సంవత్సరానికి పూర్వం మనదేశంలో వెండి బంగారు నాణెములు రెండూనూ చెలామణిలో వుంటూవచ్చాయి. కాని ఆ సంవత్సరం ఈస్టిండియా

కం పెనీ, డైరెక్టరుల సమావేశములో లార్డు లివర్‌పూలు గారి సూత్రాన్ననుసరించి హిందూదేశంలో ఒక వెండి నాణెంమాత్రం అమలులో వుంచవలెనని నిర్ధారణ చేశారు. ఆప్రకారం దేశంలో వెండిప్రమాణము (Silver Standard) నెలకొల్పబడ్డది. కాని తరువాత కొంత కాలంవరకు బంగారునాణెంకూడా ప్రక్కప్రక్కన చెలామణి అవుతూనేవచ్చింది. చివరకు ౧౮౩౫ నాటికి చట్టమురీత్యా బంగారునాణెము పోయి వెండిరూపాయి పూర్తిగా అమలులోకి వచ్చింది.

౧౮౬౧ మొదలు ౧౮౭౪ వరకు చాలాసార్లు ఇండియాప్రభుత్వం దేశంలో బంగారునాణెం ఏర్పాటు చేయాలని ప్రయత్నించింది. ప్రతి ఆర్థికశాస్త్రజ్ఞుడున్నూ ఈ అభిప్రాయానికి అనుకూలంగా సలహా చెప్పాడు. కాని యింగ్లాండు ప్రభుత్వం ఆటంకం కల్గచేయటం వల్ల వీరిప్రయత్నాలేవీ నెగ్గలేదు.

అందుచేత తిరిగీ యిండియాప్రభుత్వం నాణ ద్వంద్వలోహప్రమాణము (Bi-metallism) ఏర్పాటు చేయాలని ౧౮౭౮, ౧౮౮౧ సంవత్సరాలలో అంతర్జాతీయ ఆర్థికసమావేశంలో ప్రతిపాదించారు. కాని అక్కడకు పోయినా యింగ్లాండుయొక్క అధికారం, ఆధిక్యాలు తప్పలేదు. తిరిగీ ౧౮౯౨లో బ్రస్సెల్సు సమావేశంలోకూడా యిదే ఫలితం!

అయితే ౧౮౩౫ నుంచి వెండిప్రమాణము నేర్పాటుచేసినందువల్ల మనదేశానికి కలిగినయిబ్బంది యేమని పలువురకు సందేహం కలుగవచ్చు. ౧౮౭౩వరకు వెండి రూపాయికిన్నీ, యింగ్లీషు పౌనునాణెమునకున్నూ నిలకడయైన మారకమురేటు లేదు.

రూపాయి యొక్క విలువ వెండి, బంగారు నాణెములయొక్క ధరల తేడాల ననుసరించి హెచ్చుతగ్గులుగా మారుతూవచ్చింది. ౧౮౭౩లో ప్రపంచంలో బంగారం తక్కువగాను, వెండి అమితంగాను వుత్పత్తియైంది. వివిధదేశాలలో బంగారముపైగల అభిమానమువల్లను, వెండినాణెముపైగల నిరాదరణవల్లను, బంగారంవెల విపరీతంగా జాస్తియై వెండిధర తగ్గిపోయింది. దానితో హిందూదేశప్రభుత్వానికి క్లిష్టపరిస్థితులు ప్రారంభించాయి. ౧౮౭౩ మొదలు ౧౮౯౩ వరకు వెండిధర అవున్సు ౧కి ౫౯.౨౫ పెన్నీలనుండి ౩౯.౮౧ పెన్నీలకు తగ్గిపోయింది. దానిఫలితంగా రూపాయి మారకంరేటు ౨౨.౮౭ పెన్నీలనుండి ౧౫.౨౫ పెన్నీలకు తగ్గిపోయింది.

మనహిందూదేశప్రభుత్వానికి వచ్చే ఆదాయం యావత్తూ రూపాయల లెక్కలో ఉంటుంది. కాని వ్యయంలో జాస్తిభాగం ఇంగ్లాండుకు హోం ఛార్జెస (Home charges) అనే పేరుతో ఏటేటా కోట్లకొలది ద్రవ్యం పౌనులలో లెక్కకట్టి సమర్పించుకోవలసి వుంటుంది. వెండిరూపాయివిలువ తగ్గటంతో ఇంగ్లాండుకు చెల్లించవలసిన కర్చులు జాస్తి అవుతాయి.

ఉదాహరణ:— రూపాయివిలువ పౌను ఒకటికి ౧౦ రూపాయిల రేటునుంచి ౧౫ రూపాయిలరేటుకు మారినట్లయితే పూర్వం ౧౦౦ పౌనుల బాకీనిమిత్తం ౧౦౦౦ రూపాయి లిస్తే సరిపోయేది. క్రొత్తరేటు ప్రకారం ౧౫౦౦ రూపాయి లివ్వవలసివుంటుంది; అనగా బాకీమొత్తం మారకపోయినప్పటికీ రూపాయి విలువ తగ్గినందువల్ల అధికమైనరొక్కం చెల్లించవలసి వుంటుంది. దీనికితోడు ఏటేటా యివ్వవలసిన బాకీ కూడా జాస్తియైనట్లైతే యింకెంత నష్టమో చెప్పవలసిందిలేదు. సరిగా ఇలాంటిపరిస్థితులే ౧౮౭౩ లో తటస్థించాయి. అందువల్ల ఇండియా ప్రభుత్వమన్ని యవస్థలు పడవలసివచ్చింది.

ఈవిధమైన సందిగ్ధావస్థలో హర్షెల్ కమిటీ (Herschell Committee) నియమింపబడ్డది. ఈకమిటీ యొక్క సలహాప్రకారం ౧౮౯౩లో ప్రభుత్వచట్టమొకటి యేర్పాటైంది. నాటినుంచి వెండిప్రమాణము హిందూదేశంలో అంతరించింది. రూపాయివిలువ ౭.౫౩ ౩౪౪ గ్రెయినుల బంగారంతో సమానమని నిర్ణయించారు.

ఇంతమాత్రంచేత వెంటనే మారకమురేటు హెచ్చలేదు. ౧౮౯౫వరకుకూడా రూపాయివిలువ (౧౮౯౫ జనవరిలో రు. ౧-కి ౧౨ ౫/౮ పెన్నీలరేటువరకు) తగ్గుతూనే వచ్చింది. కాని ఆటుతర్వాత కొంతమార్పు కలిగింది.

౧౮౯౯-వ సంవత్సరంలో రు. ౧-కి ౧౬ పెన్నీలరేటు చొప్పున నిలిచిపోయింది. అప్పటికి ౧౮౯౮లో సర్ హెన్రీ ఫౌలర్ గారి అధ్యక్షతక్రింద (Fowler Commission) మరియొక ఆర్థికవిచారణసంఘం నియమింపబడ్డది. బంగారుప్రమాణంతో బాటు, బంగారు నాణెములు—సవరనులు, అరసవరనులు (సవరను ౧-కి రు. ౧౫ వంతున) చెలామణీలో వుంచవలెనని సిఫారసు చేశారు.

౧౮౯౯ మొదలు అయిరోపా సంగ్రామకాలం వరకు, అనగా ఆగష్టు ౧౯౧౪ వరకు రూపాయి మారకపురేటు స్థిరంగా ౧౬ పెన్నీలవద్దనే నిలిచివున్నది. ప్రభుత్వంవారును, ౧౯౧౩ లో వచ్చిన ఛేంబర్లేను కమిటీవారున్నూ (Chamberlaine Commission) ఈ రేటు సరియైనదన్నట్లు సమర్థించారు.

బంగారుప్రమాణంపైన రూపాయికి ఒక స్థిరమైన రేటు నిర్ణయించబడ్డది కాని ౧౯౧౮లో మరియొక క్రొత్తపరిస్థితి అగుపడింది. వెండిధర హెచ్చింది. అందువల్ల వెండినాణెమైన రూపాయిలోని వెండివిలువ, బంగారుప్రమాణముపై నిర్ణయింపబడ్డ విలువకన్న జాస్తియైనది; అనగా రూపాయినాణెముయొక్క విలువ, ఆనాణెములోని వెండివిలువకన్న తక్కువైంది. దానివల్ల అప్పటిపరిస్థితులలో మారకపురేటు తిరిగి మార్పు చేయవలసివచ్చింది. ఈమార్పు రెండువిధాలుగా చేయవచ్చు.

౧. రూపాయి నాణెములో కల్తీలేని వెండిలోహముయొక్క తూకము తగ్గించినట్టయితే నాణెముయొక్క విలువ తగ్గుతుంది.

లేదా,

౨. మారకపురేటును మార్చవచ్చును.

౧౯౧౯-వ సంవత్సరం వచ్చిన బాబింగ్టన్ స్మిత్ కమిటీ (Babington Smith Committee) యొక్క సలహా ననుసరించి ప్రభుత్వం రెండవపద్ధతి నవలంబించింది. అంటే మారకపురేటు రూ. ౧-కి ౨౪ పెన్నీలకు మార్చింది. దీనివల్ల తిరిగి ౧౮౯౩ నాటి ప్రాతపరిస్థితులు సిద్ధమైనాయి. ప్రభుత్వముయొక్క ఆర్థికసౌష్ఠవము చిక్కులలో పడ్డది. ఈనష్టములు భరించలేక సెప్టెంబరు ౧౯౨౦ లో మారకపురేటును వదిలివేయవలసివచ్చింది. అనంతరం కట్టుదిట్టాలు లేక స్వేచ్ఛగా వదిలివేయబడిన యీ రేటు రు. ౧-కి ౧౬ పెన్నీలవంతున నిలిచిపోయింది.

౧౯౨౬ లో హిల్టన్ యంగు కమిషన్ (Hilton Young Commission) వచ్చి యిండియాకొక రిజర్వు బ్యాంకు నెలకొల్పవలెననిన్నీ, ౧౮ పెన్నీల రేటు రూపాయికి స్వభావసిద్ధమైన మారకపురేటనిన్నీ సిఫార్సులు చేశారు. దీనితో దేశంలో ప్రభుత్వానికీ, ప్రజలకూ ఒక పెద్ద సంఘర్షణ బయలుదేరింది. వర్తక ప్రముఖులు, నాయకులు, ఆర్థికనిపుణులు, కాంగ్రెసేమి, లీగేమి, అందరూ ఏకగ్రీవంగా ౧౮ పెన్నీలరేటు పనికిరాదని పట్టుపట్టారు. కాని ప్రభుత్వదృష్టిని మార్చటానికి సాధ్యం కాకపోయింది.

అయితే యీమాత్రం రేటు మార్పుదలకు ప్రజలలో యింతఅలజడి యేల కలుగవలసివచ్చిందని ప్రశ్న తోస్తుంది. యుద్ధకాలంలో మనకు అమలులోవున్నది ౧౬ పెన్నీల రేటు. ఇంగ్లీషుపౌనుకూ, ఇండియా రూపాయికీ స్థిరమైన సంబంధం కలిగినప్పటినుంచి, అనగా, ౧౮౯౩ నుంచి యీ ౧౬ పెన్నీలరేటు దాదాపు ౨౫ సంవత్సరాలు అమలులోవున్నది. ౧౮ పెన్నీలరేటు ౧౯౨౦-వ సంవత్సరం ప్రాంతంలో తప్ప యితరకాలంలో అమలులోనికి రాలేదనే చెప్పవలసివుంటుంది. యుద్ధానంతరం బంగారుప్రమాణంమీద ఆధారపడ్డ ప్రపంచరాజ్యాలన్నీ చాలావరకు తమతమనాణెములవిలువ తగ్గించుకున్నాయి. అలాంటిసందర్భంలో ఒక్క యిండియామాత్రం వ్యావహారికంగా తననాణెముయొక్క విలువను హెచ్చుచేసుకోవడంలో విశేషమేమి?

చివరకు ఎవ రెన్ని చెప్పినా కావలసింది కాక మానలేదు. ౧౮ పెన్నీలరేటే స్థిరోభవ అనిపించారు. నాటినుంచి నేటివరకూ అదే అమలులో వుంటోంది. మధ్యమధ్య యెవ రెన్నిమార్లు మార్పు చేయమని కోరినా ప్రభుత్వం లక్ష్యంచేయలేదు.

౧౯౨౯ - ౩౧ సంవత్సరములకు మధ్య ప్రపంచమంతటా కలిగిన విపరీతమైన ఆర్థికక్లిష్టపరిస్థితుల

మూలంగా ౨౧-వ సెప్టెంబరు ౧౯౩౧ నాడు ఇంగ్లాండు బంగారు ప్రమాణం ఎత్తివేసు కోవలసివచ్చింది. రూపాయిని పౌనుతో ముడిపెట్టి ఒక గాఢ పరాయణ సంబంధము నేర్పాటుచేశారు. అప్పుడు పౌనువల తగ్గటంతో దానితో బంధింపబడ్డ రూపాయి విలువకూడా కొంతవరకు తగ్గింది. దానివలన తాత్కాలికంగా మన హిందూదేశానికి కొంచెం లాభం కలిగినమాట వాస్తవమే కాని ఆ వెంటనే బంగారుప్రమాణముపైనున్న యితర రాజ్యాలుకూడా ఇంగ్లాండుమార్గము ననుసరించినందువల్ల మనకు తాత్కాలికంగా కలిగిన అకొంచెంలాభంకూడా పోయింది.

ఇక ఇటీవలివిషయం. గత ౧౯౩౬-వ సంవత్సరం జూన్ — సెప్టెంబరుమాసములమధ్య ఫ్రాన్సులో సంభవించిన విపరీతపరిస్థితులవల్ల స్వదేశవ్యాపారాన్ని సంరక్షించుకొనుటకుగాను ఆ దేశపు ఫ్రాంకు నాణెము యొక్క విలువ తగ్గింపబడ్డది. ఆ వెంటనే బెల్జియం, హాలెండు మొదలైన యితర రాజ్యాలుకూడా ఇదే మార్గాన్ని అనుసరించాయి. కాని రూపాయివిలువను తగ్గించటానికి ఇంతవరకూ ప్రభుత్వంమాత్రం సమ్మతించలేదు. క్రొత్తగా జరిగిన రాష్ట్రీయశాసనసభల యెన్నికలలో కాంగ్రెసుపార్టీకి అద్భుతమైన జయం కలిగింది. ఏడురాష్ట్రాలలో కాంగ్రెసుప్రభుత్వాధికారం వహిస్తున్నది. ఈ రాష్ట్రప్రభుత్వాలు కేంద్రప్రభుత్వంవారికి రూపాయి విలువ ౧౬ పెన్సులకు తగ్గించవలసిందిగా సిఫార్సులు చేశాయి. అఖిలభారత జాతీయమహాసభాధ్యక్షులైన సుభాష్ చంద్రబోసుగారు కూడా ఈ ప్రస్తుతమున్న ౧౮ పెన్సుల రేటు దేశానికి లాభదాయకము కాదనిన్నీ, ౧౬ పెన్సులకు మార్చవలసిన దనిన్నీ అభిప్రాయము వెల్లడించియున్నారు. ప్రజాభిమానం స్పష్టంగా పై యభిప్రాయాన్ని బలపరుస్తున్నది. రిజర్వు బ్యాంకు నిర్మాణ సందర్భంలో బ్యాంకుచట్టముయొక్క ప్రస్తావనలో (Reserve Bank Act, preamble) ఇండియా దేశముయొక్క కరెన్సీ విషయంలో ప్రపంచార్థిక పరిస్థితుల ననుసరించి దేశానికి క్షేమకరమైన మారకము రేటు నిర్ణయించటానికి రిజర్వు బ్యాంకు అధికారవర్గాని కెట్టి యాక్షేపణయున్నూ లేదనిన్నీ, అంతవరకు తాత్కాలికంగా ౧౮ పెన్సులరేటు అమలులో వుంటుందనిన్నీ వాగ్దానం చేయబడి ఉంది.

అలాంటప్పుడు కడచిన సెప్టెంబరు ౨, ౧౯౩౮-వ తేదీన కేంద్రశాసనసభలో విచారణకు రావలసిన రూపాయిమారకముశేటునుగూర్చిన తీర్మానము రాజప్రతినిధి త్రోసివేయుట చాలా విచిత్రంగా కనిపిస్తుంది. దీనినిబట్టి ప్రభుత్వానికి ప్రజాభిప్రాయంమీద నేమాత్రం గౌరవంకూడా లేదని భావించవలసి వుంటుంది. చివరకు ప్రభుత్వంవారు ఆ తీర్మానాన్ని గూర్చి చర్చించే అవకాశంకూడా కలుగచేయకపోవటం నిజంగా శోచనీయం.

౧౮ పెన్సుల రేటువల్ల నష్టం:

పైన వ్రాసిన చారిత్రక విశేషాలు మాత్రమే కాక ఆ ౧౮ రేటు హెచ్చు అగ్గులలోగల మంచిచెడ్డలూ, లాభనష్టాలూ గ్రహించవలసియున్నది. ఈప్రస్తుతమున్న రేటు ౧౯౨౭ నుంచి, అనగా, గతపదిరెండు సంవత్సరములనుంచి అమలులో వున్నది. అంతకుపూర్వమున్నది ౧౬ పెన్సులరేటు. ఈమార్పులవల్ల తటస్థించిన నష్టమిక్రింది విషయాలనుబట్టి స్పష్టమవుతుంది.

ఎగుమతి, దిగుమతి వ్యాపారము: పౌను ౧౫ రూపాయిల (౧౬ పెన్సుల మారకము రేటు)నుంచి పౌను రు. ౧౩—౫—౪ (౧౮ పెన్సుల రేటు)కు మార్చినందువల్ల పౌనుకు రు. ౧—౧౦—౮ చొప్పున యెగుమతులలో తక్కువవస్తుంది; అనగా, ౧౦౦ పౌనుల విలువగల సరకు విదేశాలకు పంపితే పూర్వం రు. ౧౫౦౦ లు వచ్చేధర ప్రస్తుతం క్రొత్త రేటు ప్రకారం రు. ౧౩౩౩—౫—౪ మాత్రమే వస్తుంది. ఈతక్కువధరకు వస్తువులు విక్రయిస్తే మనకు నష్టం. ధర హెచ్చుచేస్తే విదేశాలలో వుండే పోటీవల్ల మన సరకు జాస్తిగా అమ్ముడుకాదు. అందుచేత మన యెగుమతివ్యాపారం తగ్గిపోతుంది.

ఇదేమాదిరిగా విదేశవస్తువులు మనకు చవుకగా లభిస్తాయి; అంటే ౧౦౦ పౌనుల వస్తువులు పూర్వం మనకు రు. ౧౫౦౦ ల ఖరీదైతే యిప్పుడు

రు. ౧౩౩౩—౫—౪ లకే లభిస్తున్నాయి. విదేశవస్తువులు చవుక అయినవంటే దిగుమతులు జాస్తియైన వన్నమాట. దేశంలోకి వచ్చే ద్రవ్యంకన్న విదేశాలకు పోయే ద్రవ్యం అధికం. ఒకదేశానికి ఎగుమతి వ్యాపారం తగ్గి, దిగుమతివ్యాపారం హెచ్చిందనగా ఆర్థికంగా ఆదేశం నష్టపడుతున్నదని యర్థం.

మనహిందూ దేశంలో సగటున నూటికి ౭౦ వంతున ప్రజలు వ్యవసాయంవల్ల జీవనంచేస్తారు. చాలావరకు వుత్పత్తికాబడే ముడిపదార్థాలే విదేశాలకు ఎగుమతి యవుతూవుంటాయి. అక్కడినుంచి మనకు వచ్చేవి తయారైన వస్తుపరికరాలు. కనుక ఎగుమతివ్యాపారం తగ్గుటవల్ల ముడిపదార్థాలయొక్క ధరలు తగ్గుతాయి. దానివల్ల రైతు నష్టపడతాడు. విదేశవస్తువులు చవుకగా లభించటంవల్ల స్వదేశపరిశ్రమలకు దెబ్బతగులుతుంది. స్వదేశపరిశ్రమలు నష్టపడితే నిరుద్యోగసమస్య జాస్తి యవుతుంది. ఈవిధంగా మారకంరేటులో జరిగిన యీకొద్దిమార్పువల్ల రైతులకు, పరిశ్రమదారులకు, విద్యార్థులకు, కార్మికులకు మొత్తం మీద దేశానికంతకూ నష్టం. దేశదారిద్ర్యం హెచ్చినకొద్దీ ప్రభుత్వాదాయం తగ్గుతుంది. ఆదాయం తగ్గితే ప్రభుత్వం ఖర్చులైనా తగ్గించుకోనవలె; లేదా ప్రజలపై అధికంగా పన్ను విధించవలె. అసలే దారిద్ర్యబాధ ననుభవిస్తున్న ప్రజలు అధికమైన పన్నులిచ్చుకోలేరు. ప్రభుత్వము అలవాటుపడిన తననిత్య ఖర్చులు తగ్గించుకొనుట యిష్టపడదు. ఈవిధమైన విషమ పరిస్థితులు తటస్థమవుతాయి.

ఇవి సాధారణంగా ప్రాప్తించే నష్టాలు. ఇక విపరీతసమయాలలో విపరీతఫలితాలు సంభవమవుతాయి. దీని కుదాహరణంగా సెప్టెంబరు ౧౯౩౧లో యింగ్లాండు బంగారుప్రమాణము నెత్తివేసినతర్వాత మనహిందూ దేశంలో యిప్పటివరకు దాదాపు ౩౨౬కోట్ల రూపాయిల విలువగల బంగారం విదేశాల కెగుమతియైంది. పైన వివరించిన నష్టాలే కాక యీ అసాధారణనష్టం కూడా మనలను ఆవరించింది. బంగారుప్రమాణము నెత్తివేయటంతో పౌనుకాసునకు, బంగారులోహమునకు గల పరస్పరసంబంధం విడిపోయింది. పౌను యొక్క విలువ తగ్గింది. బంగారుధర హెచ్చింది. దారిద్ర్యబాధ ననుభవిస్తున్న మనదేశపురైతు తనకుగల ఆస్తి, ఆభరణాలను విక్రయించుకొని జీవయాత్ర సాగిస్తున్నాడు.

ప్రతికక్షుల వాదన:

ఈయసందర్భస్థితిని చూచి హర్షించే ఆర్థికనిపుణులుకూడ అక్కడక్కడ లేకపోలేదు మనదేశంలో! కోట్లకొలది రూపాయిల విలువగల బంగారం విదేశాలకు పోతూంటే దీనివల్ల నష్ట మేమీ లేదనిన్నీ, పూర్వకాలంలో మనం కొన్న బంగారంలో ఇది నాలుగోవంతైనా లేదనిన్నీ, ఇంకా లెక్కలేనంత బంగారం మనదేశంలో పాదుకుని వున్నదనిన్నీ, కనుక యేవిధమైన ఆదుర్దాపడవలసిన యవసరం లేదనిన్నీ వీరియభిప్రాయం.

ఏది వచ్చినా మన మంచికే, ప్రభుత్వ మేది చేసినా మన క్షేమానికే యనేవిశ్వాసం కలవారు వీరు వీరికి ప్రత్యక్షనిదర్శనాలతో పని లేదు; ప్రజాభిప్రాయంతో అగత్యం లేదు. శాస్త్రాధారాలతో సర్వమూ సమర్థింపచూస్తారు. రూపాయిరేటు మార్చితే యీక్రింది విధంగా నష్టపడుతా మని వీరివాదన:—

౧. ౧౮పెన్నీలనుంచి ౧౬పెన్నీలరేటుకు మార్చితే పౌను రు. ౧౩-౫-౪నుంచి రు.౧౫-౦-౦లకు వస్తుంది; అనగా, మనముడిపదార్థములవెల హెచ్చును. దేశంలో వస్తువులధర హెచ్చితే నెలజీతాలమీద ఆధారపడే కార్మికులు, ఉద్యోగులు మొదలైనవారికి ఖర్చు జాస్తిఅవుతుంది. రాబడి జాస్తికాకుండా ఖర్చుమాత్రం హెచ్చితే జీవయాత్ర గడపుట కష్టమవుతుంది. దీనివల్ల కార్మికులలో అసంతృప్తి, సమ్మెకట్లు, తన్మూలకంగా పరిశ్రమలకు నష్టమూ వస్తుంది.

౨. రూపాయివెల తగ్గితే బంగారంవెల ప్రస్తుత మున్నదానికన్న హెచ్చును. అందుచేత అధికంగా బంగారము విదేశాల కెగుమతియగును.

౩. పౌను రు.౧౫లు అయితే విదేశవస్తువుల ధరలు పెరుగును. అట్టివస్తువులు మనదేశంలో తయారుకానం

దున అధికమైనధరల యిచ్చికూడా వానినే కొనవలసి వస్తుంది. అందువల్ల ప్రజలకు అసౌకర్యం.

౪. హిందూదేశప్రభుత్వం ఇంగ్లాండుకు హోమ్ చార్జీల (Home Charges)రూపంగా యేటా చెల్లించవలసిన ద్రవ్యము పౌను ౧౫రూపాయిలవంతున లెక్క కట్టితే అధిక మవుతుంది. దానివలన ప్రభుత్వమునకు ఆర్థికలోపం కలుగుతుంది.

౫. రూపాయిరేటు తగ్గించుకొని తద్ద్వారా యెగుమతులు హెచ్చించి, దిగుమతులు తక్కువచేసినట్టయితే విదేశరాజ్యాలు పోటీకొరకు తమనాణెముల విలువ తగ్గించుకుంటాయి. అందువల్ల మనకు తాత్కాలికంగా వ్యాపారరీత్యా కలుగవచ్చుననుకునే లాభం అదృశ్య మవుతుంది.

ఆ యీ కారణాలవల్ల రేటుమార్పుదల మనకు శ్రేయస్కరము కాదని కొందరివాదన. ఈవాదములో గల సత్యాసత్యాలు కొంత విమర్శనదృష్టితో పరిశీలిస్తే బోధపడుతాయి.

మొదట వ్రాసినట్టుగా మన హిందూదేశంలో నూటికి ౮౦ మంది వ్యవసాయంవల్ల జీవిస్తున్నారనే విషయం స్పష్టం. ఇక మిగతా ౨౦ వంతులలో వేర్వేరు వృత్తులుగలవారు, అనగా, కార్మికులు, ఉద్యోగులు మొదలగువా రున్నారు. రేటు మార్పుదలవల్ల దేశంలో ధరలు జాస్తియైతే కష్టపడేది యీ నెలజీతముల మీద ఆధారపడే ౨౦ వంతులలో కొందరుమాత్రమే. కాని ౮౦ వంతుల జనసంఖ్య దీనివల్ల బాగుపడుతుంది; అనగా, రైతులకు రాబడి అధికం — దారిద్ర్యబాధపడలేక అప్పులపాలు కావలసినపని వుండదు. అందుచేత ఆస్తి, ఆభరణాలు అమ్ముకొని జీవించవలసిన అవసర ముండదు. అప్పుడు విదేశాలకు బంగారం కూడా యెగుమతి కానక్కరలేదు. కనుక యిందువల్ల కలిగే నష్టంకన్న లాభమే జాస్తియని స్పష్టపడుతుంది. ఇక యీకొలదినష్టంకూడా రాకుండా ప్రభుత్వము-అందులో ప్రజాక్షేమమును పాటించే కాంగ్రెసు ప్రభుత్వము—తగినయేర్పాటు చేయవచ్చును. వస్తువుల ధరలను గమనించి నెలజీతగాండ్రకు తగినట్టు వేతనములలో అభివృద్ధి నివ్వవచ్చును. ప్రభుత్వ మిందులకు పూనుకుంటే అధికాదాయము వచ్చే వర్తకులుగాని, రైతులుగాని యీ కొద్దిమార్పుల కభ్యంతరపెట్టరు.

అమెరికా, ఫ్రాన్సు ప్రభుత్వా లిలాంటి పరిస్థితులలో యీమాదిరిసౌకర్యాలు కలుగచేసినట్టు వింటున్నాం. అదేమాదిరిగా యిక్కడకూడా ఒక ఆర్థిక ప్రణాళిక తయారుచేసి దాన్ని ప్రకారం నడుచుకుంటే యేవిధమైన చిక్కులూ వుండవు. అలాంటి అవకాశానికి కాంగ్రెసు ప్రభుత్వాధికారం వహించినందువల్ల యిప్పుడు దివ్యమైన తరుణం.

ఇక రెండవవిషయం. రూపాయివిలువ తగ్గితే బంగారంధర మరింత హెచ్చి విదేశాల కెగుమతి యగుటకు ప్రోత్సాహం కల్గుతుందని చెప్పుతున్నారు. సాధారణంగా జనులలో దారిద్ర్యబాధ పడలేక విధిలేక ఆస్తి అమ్ముకుని జీవించేవారే కాని, సర్వమూ సమృద్ధిగా వుండి ఆదాయం బాగా వున్నకాలంలో బంగారంధర జాస్తియైనంతమాత్రాన తమ ఆస్తిని విక్రయింప బూనుకొనేవా రుండరు. మనుష్యప్రకృతిలో సంపాదించి కూడబెట్టవలెననే ఆసక్తి వుంటుంది కాని కూడబెట్టింది అమ్మి ఖర్చుచేసుకోవలెనని చాలా మంది కుండదు.

ఆటుతర్వాత అనవసరమైన విదేశవస్తువుల ధరలు పెరుగుటచేత మనకు నష్టం కలుగు నని మరియొక వాదన. స్వదేశపరిశ్రమలను ప్రోత్సహించేనిమిత్తం విభిన్నదేశాలలో దిగుమతిసుంకాలు విధించి, పన్నులు కట్టించి ప్రయోగిస్తుంటే, విదేశవస్తువులను ప్రోత్సహింపవలె ననేవారి వాదన సమంజసంగా లేదు. అందుకు మన హిందూదేశంలో సర్వము సమృద్ధిగా పండుతాయి. మన మొకరిమీద ఆధారపడవలసిన అగత్యం లేదు. తమకు కావలసిన భోజనపదార్థాలు పండించుకోలేని పాశ్చాత్యదేశాలు ప్రాచ్యవాసులమీద ఆధారపడటం సహజం కాని యిండియాలో అలాంటియవస్థ పడనక్కరలేదు. మీదుమిక్కిలి మనం తెప్పించే సామగ్రి చాలావరకు సౌందర్యపోషణకు, భోగవిలాసములకు పనికివచ్చేది. ఇలాంటి వాటికొరకు విదేశాలమీద ఆధారపడటం శోచనీయం.

ఇక ప్రభుత్వంయొక్క హోంచార్జీలు(Home charges) జాస్తి యవుతాయని యిదియొక అభ్యంతరం. రూపాయివిలువ తగ్గితే యీ చార్జీలు ఎక్కువయ్యే మాట వాస్తవమే కాని 30 కోట్ల రూపాయిలమీద షుమారు నాల్గుకోట్లు అధిక మవుతా యని సందేహించటం బుద్ధిమంతుల లక్షణం కాదు. సాలుకు విదేశాలతో మనం దాదాపు 300 కోట్ల రూపాయిల విలువ గల యెగుమతి, దిగుమతుల వ్యాపారం చేస్తాం. రేటు మార్పువల్ల మనదేశీయులకు మొత్తంమీద నలభైకోట్లు పైబడిన రాబడి వచ్చే అవకాశా లున్నాయి. ఈ లాభం పోగొట్టుకొని ప్రభుత్వానికి నాల్గుకోట్ల రూపాయిలు అధికవ్యయము కాగలదని సందేహించటం న్యాయం కాదు కాని వేరొకవిషయం కూడా ఆలోచించవలసియున్నది. దేశంయొక్క వ్యాపారం అధికమైతే ప్రభుత్వానికి సుంకములవల్లను, ఆదాయపు పన్నులవల్లను, ఇంకా యితరత్రా మార్గాలవల్లను రాబడి ఎక్కువవుతుంది. కనుక పైన చెప్పిన నష్టంకూడా యీ విధంగా వచ్చేలాభంతో చాలావరకు సరిపోవచ్చును.

మరియొక సంగతి. మననాణెము విలువ తగ్గించుకుంటే విదేశాలుకూడా పోటీకి వారివారి నాణెములవిలువ తగ్గించుకుంటా యని కొందరంటారు. అయితే యీ సందర్భంలో ఒక చిన్నమాట జ్ఞాపకం ఉంచుకోవాలె. మన భరతఖండం ప్రస్తుతం దారిద్ర్య మనుభవిస్తోంది. ప్రజలయొక్క జీవనప్రమాణము (Standard of living) యితర దేశాలలోకంటె దానికన్న చాలా తక్కువ. ఇలాంటి క్లిష్టసమయాలలో చేసిన యీ స్వయంసంరక్షణప్రయత్నానికి విదేశాలు ఈర్ష్యచేత పోటీచేస్తాయనటం న్యాయం కాదు. ఈ మార్పు పరదేశాలను వంచించటానికి చేసే యెత్తు కాదు. స్వదేశవ్యాపారానికి ప్రోత్సాహ మివ్వటానికి చేయవలసిన కనీసధర్మం. అంతేకాదు, పూర్వం ౧౯౨౬లో మన రూపాయినాణెముల హెచ్చుచేసినప్పుడు ఇతర దేశాలేవీ పోటీకొరకు తమనాణెములవిలువ యెక్కువచేసుకోలేదుకదా. ఇప్పుడుమాత్రం పోటీ యేల ఉంటుంది? ఇది కేవలం ఊహ. ప్రత్యేకంగా పోటీ జరిగే అవకాశం లేదు. ప్రభుత్వాభిప్రాయం బలంగా వుంటే పరదేశాల కీవిషయం స్పష్టంచేయటం సులభం.

పైన వ్రాసిన ముఖ్యవిషయాలు ఈక్రింది వివరాలవల్ల స్పష్టమవుతాయి:

ఇండియాలో టోకుధరల తారతమ్యము
(౧౯౨౯-వ సంవత్సరం ధరలు ౧౦౦క్రింద భావిస్తే)

సంవత్సరం	సగటు ధర	సంవత్సరం	సగటు ధర
౧౯౨౦	౧౪౪	౧౯౨౮	౧౦౨.౮
౧౯౨౧	౧౨౭	౧౯౨౯	౧౦౦
౧౯౨౨	౧౨౪	౧౯౩౦	౮౨ ౩
౧౯౨౩	౧౨౩	౧౯౩౧	౬౮.౧
౧౯౨౪	౧౨౩	౧౯౩౨	౬౪.౫
౧౯౨౫	౧౧౩	౨౯౩౩	౬౧ ౭
౧౯౨౬	౧౦౫	౧౯౩౪	౬౩.౧
౧౯౨౭	౧౦౫	౧౯౩౫	౬౪.౫

టోకుధరలు ౧౯౨౦-వ సంవత్సరంనుంచి యే విధంగా క్షీణించాయో, ఇంగ్లాండు బంగారుప్రమాణము సెలవిచ్చినతర్వాత, అనగా ౧౯౩౧ అనంతరం ఎలా వున్నాయో పైసంఖ్యలు తేటతెల్లం చేస్తాయి. దీనివల్ల వ్యాపారమెంత మందగించిందో వేరేవ్రాయనక్కరలేదు.

ఇండియాయొక్క వ్యాపారం
(కోట్లరూపాయలు)

సంవత్సరం	ఎగుమతులు	దిగుమతులు
౧౯౨౬	౩౨౨.౪౩	౨౩౬.౦౧
౧౯౨౭	౩౧౮.౪౯	౨౪౮.౦౯
౧౯౨౮	౩౩౦ ౬౪	౨౪౯.౮౦
౧౯౨౯	౩౨౨.౫౪	౨౫౦.౨౮
౧౯౩౦	౨౫౨.౫౯	౧౮౭.౯౪
౧౯౩౧	౧౬౫.౧౯	౧౩౬.౧౬
౧౯౩౨	౧౩౫.౧౫	౧౩౨.౭౯
౧౯౩౩	౧౪౪.౪౪	౧౧౪.౭౬
౧౯౩౪	౧౪౮.౨౭	౧౨౫.౨౪
౧౯౩౫	౧౫౭.౧౭	౧౩౪.౨౦

బంగారము మాత్రము

సంవత్సరం	ఎగుమతులు	దిగుమతులు
౧౯౨౬	౨.౬౨	౪౪.౬౫
౧౯౨౭	౩.౨౦	౩౪.౮౫
౧౯౨౮	౫.౯౬	౩౮.౫౦

౧౯౨౯	౪.౨౫	౭౯.౩౯
౧౯౩౦	౩.౯౩	౭౮.౮౬
౧౯౩౧	౪౧.౩౨	౧౨.౬౨
౧౯౩౨	౮౦.౦౩	౩.౧౬
౧౯౩౩	౫౮.౨౬	౨.౦౧
౧౯౩౪	౬౭.౭౭	౩.౭౫
౧౯౩౫	౫౪.౯౦	౨.౫౭

పైపట్టికల ప్రకారం మనవ్యాపారం సంతృప్తికరంగా లేదని తెలుస్తుంది. మన వ్యాపారాన్ని సమర్థించుకోటానికి మనము బంగారం విదేశాలకు పంపుతున్నాం. ముఖ్యంగా ౧౯౩౧ అనంతరం మనవ్యాపారం ఎలా తగ్గిందీ, మనం బంగారం ఎంతెంత ఎగుమతి చేసిందీ పై అంకెలవల్ల విశదమవుతుంది.

సాధారణంగా మన దేశాన్నుంచి ఎగుమతి అయ్యేవి ముడిపదార్థాలు, భోజనపదార్థాలు, చర్మములు, ఊని చర్మములు, లక్క, గింజలు, పొగాకు, ప్రత్తి, జనపనార, గోనెసంచులు మొదలైనవి. ప్రపంచం మొత్తంమీద హిందూదేశం గోధుమలు వుత్పత్తి చేయటంలో ౩-వ స్థానం ఆక్రమిస్తుంది; నూటికి ౫౦ వంతులు బియ్యం పండిస్తుంది; తేయాకు, పొగాకు, జనపనార వుత్పత్తిచేయటంలో ప్రథమస్థానము; ప్రత్తిలో రెండవస్థానము సంపాదిస్తుంది. సాధారణంగా ప్రతి విషయంలో ప్రాధాన్యం వహిస్తుంది. కాని మనకు పూర్వం ప్రాప్తించిన ఒటావా ఒడంబడికలవల్ల నైతేనేమి, రూపాయి రేటుమార్పులవల్ల నైతేనేమి మన వ్యాపారం పొగాకు, తేయాకు, జనపనారలలో తప్ప మిగతావానిలో క్షీణించిందని లెక్కలవల్ల తెలుస్తుంది. పైముడివస్తువులు ఇతరత్రా దొరకనందువల్ల హిందూదేశంమీద విదేశాలు ఆధారపడ్డాయి. మిగతావిషయాలలో ధరలు పడటంవల్లను, పోటీవల్లను ఎగుమతులు తగ్గిపోయినాయి.

చివరమాట :

ఇలాంటి పరిస్థితులు నిరుత్సాహం కల్పటంలో ఆశ్చర్యం లేదు. విదేశాలకు పంపిన ౩౨౬ కోట్ల విలువ గల బంగారంవల్ల మరియొక సమయంలోనైతే దేశంలో ధరలు పెరిగియుండేవి. దానికిబదులు మనకు నిర్మాణయంత్రాలు, అవసరమైన యంత్రసామగ్రి కొరకి యుండే పరిశ్రమలు జయప్రదంగా సాగేవి. ఇప్పుడలో అలాంటి దేమీ జరగలేదు. ఆనాటికానాటికి ధరలు క్షీణించాయి వ్యాపారం తగ్గిపోయింది. నిరుద్యోగ సమస్య జాస్తియైంది. విలువగల బంగారు విదేశాలకు తరలిపోయింది. ఇప్పటికీ ప్రభుత్వం రూపాయి రేటు మార్చుటలనాలే దంటే అర్థమేమిటి? అసలు రేటు మార్పు యిందికూడా యొక్క ఆర్థికస్థితిమీద ఆధారపడటం పనిలేక, ముఖ్యంగా ఇంగ్లాండు వర్తకసంఘములవారి కోరికలనుబట్టి మన అవస్థలుకూడా మారుస్తూ వుంటారనియును గ్రహించవలసియుంటుంది.

ఈ యవసరంలో కాంగ్రెసు తీవ్రమైన ఆందోళన చేసి, అధికారులను దేశముయొక్క ఆర్థికస్థితిని బాగుపరచవలసియున్నది. దానికి తక్కిన ఆర్థికప్రణాళిక సిద్ధంచేసి ఆచరణయోగ్యం చేయాలి. దీనికి సహాయంగా రూపాయిమారకపురేటు తగ్గేటట్లు ప్రభుత్వమునను, రిజర్వ్ బ్యాంకు అధికారులను తగినంత ఒత్తిడి కలుగచేయవలెను. ఇట్టి సందర్భంలో మనకు ప్రజాభిమానం ముఖ్యం. ప్రజాభిమానముతో ఇందులో గల రహస్యం తెలుసుకుంటేగాని మోసపోక తప్పదు.



హిందూ దేశము:

పారిశ్రామిక ఆవశ్యకత

శ్రీపాద గణపతిరావు

నేటికిగూడా మనదేశంలో పారిశ్రామిక ఆవశ్యకతనుగురించి ప్రత్యేకించి వ్రాయవలసివచ్చిన దంటే ‘మార్పు’ అంటే మనకెంత భయమో తెలుస్తుంది. పారిశ్రామిక ఆవశ్యకత, అభివృద్ధి ప్రపంచానికి నూతన విషయం కాదు. యంత్రాగార పారిశ్రామిక విధానం వ్యాపించి ఇప్పటి కప్పుడే వకశతాబ్దం దాటింది. ఈ దేశంలో మనకుమాత్రం ఇంకా కొత్తగానే వుంది. ప్రపంచము యావత్తూ వకమార్గంలో పోతూ వుంటే మనం ఇంకో మార్గంలో పోతున్నా మన్న సంగతికూడా అట్టేమందిని గాఢంగా ఆకర్షించినట్టు కనబడదు. పైగా, అలాగ పోతేనే మన గొప్పదనం, మన ప్రత్యేకత అని అనుకొనేవాళ్లు ఉన్నారు. అనాదినుండీ ముఖ్యవృత్తి అయిన వ్యవసాయమే నేటికిని మనకు తగిన జీవనోపాధి యనియు, దాని అభివృద్ధియే మనకు సౌభాగ్యసాధన మనియు దృఢంగా నమ్మి వాదించేవాళ్లు చాలామంది వున్నారు. మరియొకవైపున, కేవలం వ్యవసాయమే ప్రధానజీవనాధారంగా వుండడం దేశానికి చాలా అనర్థంగా వున్నదనీ, జనులందఱికీ పూర్తిగా సంవత్సరంపొడుగునను పనివుండి సుఖజీవనం ఉండాలంటే వ్యవసాయానికి తోడుగా గ్రామాలలో చిన్నచిన్న పరిశ్రమలుకూడా వుండాలనీ, మరికొందఱి అభిప్రాయం. ప్రస్తుతం అధికారంలో వున్న కాంగ్రెసుపక్షంవారివల్ల ఈ రెండవ అభిప్రాయమే యెక్కువ బలంగా వుంది. అఖిల భారత గ్రామ పరిశ్రమసంఘము (All-India Village Industries Association) ఈ విషయమై తీవ్రంగా ప్రచారం చేస్తున్నది. ఏది యెట్లున్నను, దేశంలో ఆర్థికంగా వక మార్పు రాబోవుతున్నదనిమాత్రం స్పష్టంగా తెలుస్తున్నది. వచ్చేమార్పు ఏవిధంగా ఉంటే దేశసౌభాగ్యానికీ, ఔన్నత్యానికీ ఎక్కువ తోడ్పడును అన్నది అందఱూ ఆలోచించవలసిన విషయం.

ఆర్థికంగా హిందూదేశముయొక్క ఆశయము ఏలా వుండవలెను? కేవలం వ్యవసాయమా? కేవలం గ్రామపరిశ్రమలా? కేవలం నవీన యంత్రపరిశ్రమలా? ఏవి దేశసౌభాగ్యానికి ముఖ్యసాధనం?—ఇవే మనం గమనించవలసిన విషయం.

అయితే, ఇలాంటిప్రశ్న వేస్తే, ఏదో వకటియే పరమసాధనంగా వుండవచ్చు నని, ‘తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు’ అని వాదించేవారు అట్టేమంది లేరు. ఇది కొంత వరకు శుభసూచకమే. కాని, ప్రత్యేకించి ఈ సాధనాలలో ఏవకదానికైనను ప్రాముఖ్యము ఇచ్చేవారు చాలామంది వున్నారు. ఈ భేదాభిప్రాయంమట్టుకు దేశంలో యెక్కువగా కనబడుతోంది. కనుక ఈ త్రివిధసాధ

నాలను వేరువేరుగా కొంచెం పరికించి చూద్దాం.

మొదటిది : వ్యవసాయమే ముఖ్యవృత్తిగా వుండవలెను; దాని యభివృద్ధియే మనకు పరమావధి కావలెను — అనేవాదన. అవును, వ్యవసాయమే ఈ దేశప్రజలకు తరతరాలుగా ముఖ్యవృత్తిగా వుండినది, ఇంకా వుంది. కాదని యెవ్వ రనగలరు? కనుక దాని అభివృద్ధి దేశసంపదకు ఏకముఖ్యసాధనమని వేరే చెప్పనక్కరలేదు. కాని ఈ వ్యవసాయాభివృద్ధికోసం వాదించి, యంత్రపరిశ్రమ లంటే క్రోధం వహించేవారిని కొన్నిసంగతు లడగాలి :

౧. వ్యవసాయం ఇప్పుడు లాభకారిగా వున్నదా? లేకపోతే, ఎందుకు లేదు?

౨. వ్యవసాయార్హమగు భూములలో ఏటేటా కనబడే అత్యంతవిభాగానికి కారణ మేమి?

3. వ్యవసాయంవల్ల ప్రజలకి సాలుకు రమారమి నాలుగునెలలపాటు సంభవించే నిర్బంధ నిరుద్యోగము మాట ఏమి?

౪. ప్రస్తుతం మనం దారుణంగా చూస్తున్న యువకుల నిరుద్యోగసమస్యకు వ్యవసాయాభివృద్ధి ఏమైనా తోడ్పడునా?

౫. వ్యవసాయంవల్లనే దేశసంపద వృద్ధిపొంది, ప్రపంచంలోని ఇతరదేశాలతోపాటు మనదేశంకూడా ఉన్నతస్థితికి రాగలదా?

౬. కేవలం వ్యవసాయమే పరమసాధనంచేసికొని ఇదివరకు ఏ దేశమైనను ఔన్నత్యమును పొందెనా?

౭. కేవలం వ్యవసాయంవల్ల దేశంలో జీవనప్రమాణం (Standard of living) ఎప్పటికైనను వృద్ధిపొందగలదా?

౮. ఒకవైపున కాలక్రమాను భూసారం తగ్గుతూవుంటే మరొకవైపున జనసంఖ్య త్వరితంగా ఎక్కువగుతూవుంటే, కేవలం వ్యవసాయాన్నే ముఖ్యవృత్తిగాను, జీవనోపాధిగాను కలిగిన మనదేశస్థితి కొన్నిదినముల పిమ్మట ఎట్లుండును?

౯. నవీననాగరికతా ప్రవాహంలో : నూతనత్వం అంతా క్రమంగా అలవాటుపడ్డ మనం, ప్రాచీనపు పనిముట్లకును ఇంకా ఎంతమాత్రమైనా ఆధారపడి వుండవలసినదేనా?

౧౦. అటుగాక, వ్యవసాయంలోకైనను నూతనత్వము లేనిదే, దానికి కావలసిన శాస్త్రజ్ఞానము లేనిదే, పారిశ్రామికాభివృద్ధి లేనిదే ఇతరదేశములతో పోటీకి నిలువగలమా?

ఇలాంటి ప్రశ్నలింకను ఎన్నియో వేయవచ్చు. ప్రస్తుతం ఇవి చాలు. వీటికి మనం మనబుద్ధికి, జ్ఞానానికి, అనుభవానికి తృప్తికరమైన సమాధానములు ఇవ్వగలిగితే వ్యవసాయంకోసం నేటినుంచే తీవ్రప్రచారం చేద్దాం.

హిందూదేశపు ఆర్థిక ఆశయాలలో రెండవదీ, ప్రస్తుతం ఎక్కువగా ప్రచారం జరుగుతున్నదీ చిన్నచిన్న గ్రామపరిశ్రమల

పునరుద్ధరణము, వానియభివృద్ధి. కేవలం వ్యవసాయమే ముఖ్యవృత్తిగా వున్న ప్రస్తుత ఆర్థికలోపం తీరుస్తూ, అత్యంతంగా వృద్ధి పొందిన పాశ్చాత్య యంత్రాగార పారిశ్రామిక నాగరికతలో వుండే అనర్థాలు లేకుండా ఉండే మధ్యమార్గము మహోన్నతమార్గము అని కొందఱి అభిప్రాయం. వ్యవసాయానికి సహాయకారిగా గ్రామపరిశ్రమలు మిక్కిలి ఉపయోగకరములు. వీటి మూలమున గ్రామస్థులగు వ్యవసాయదారులకు ఏటిపొడుగునను పని కల్పింపబడియుండును. ఆర్థికంగా సహాయంగా వుండును. వీటివల్ల వచ్చేఆదాయం కుటుంబపోషణకు సాహాయ్యపడును. కనుక గ్రామపరిశ్రమాభివృద్ధివల్ల నిజమైన లాభాలు అనేకంగా వున్నాయి. అయితే, వ్యవసాయానికి తోడుగా గ్రామపరిశ్రమలుకూడా కావలెననుట యొకటి. 'గ్రామపరిశ్రమలే చాలును, యంత్రపరిశ్రమలు అంతగా అవసరం లేదు' అని వాదించుట వేరొకటి. గ్రామపరిశ్రమలు కావాలి అనుటలో మాకేమీ తప్పు కనబడదు. తప్పక కావాలి. అయితే, ఆధునిక నాగరికతకు సమీపస్థానానికి సంబంధించిన యంత్రపరిశ్రమలుకూడా కావాలి. గ్రామపరిశ్రమలుమాత్రమే చాలు ననేవారిని, వ్యవసాయమే చాలు నన్నవారిని అడిగినట్టి కొన్నిప్రశ్నలు అడుగవలసి యుండును:

౧. గ్రామపరిశ్రమలు హిందూదేశానికి క్రొత్తవా? పూర్వము లేవా?
౨. ఉంటే, ఎందుకు నశించాయి? ప్రపంచమంతటను నలుమూలలను వ్యాపించి, ఆశ్చర్యమును గొలిపిన 'డక్కామస్లిను' లేవీ?
3. ఆధునిక యంత్రపరిశ్రమలధాటికి ఈ ప్రాచీనపద్ధతులు ఆగగలవా?
౪. యంత్రసాధనంచేత చేయబడ్డ వస్తువులు అమ్మబడే ధరలకు ఈ గ్రామాలలో తయారయ్యే వస్తువులు ఎప్పటికైనను వచ్చునా?
౫. రోజంతా ఇంట్లో కూర్చుని, నాలుగు సూదిబత్తాములు కష్టపడి చేసి, కొనకి అమ్మితే కిట్టుబడి అవుతుందా? ఇక్కడ ఇంకోసంగతి చెప్పాలి. గ్రామపరిశ్రమతత్త్వజ్ఞులు వాటిని అవలంబించామంటే ఇప్పుడుమనకు కనబడేనిరుద్యోగసమస్య పటాపంచలయిపోతుం దని వాదిస్తారు. అవును, ఒకగుండుసూది చేయాలంటే నాలుగుగంటలు పడితే 'నిరుద్యోగ' మెక్కడ వుంటుంది? అంతా ఉద్యోగమే!
౬. అదిగాక, ప్రస్తుతం జపానునుండి వచ్చే వివిధవస్తువులు అద్భుతంగా చెల్లుబడి కావడానికి కారణ మేమిటి? ఈ సరకులు ఆట్టే కాలము మన్నవని మనకు తెలిసినను ఖరీదైన ఇతరదేశపువస్తువులను కొనకుండా, మనం ఈ వస్తువులనే ఏల కొందుము? —

వీటి నన్నింటినిబట్టి ఆలోచిస్తే, ముఖ్యంగా రెండుసంగతులు స్ఫురిస్తాయి. ఒకటి: సామాన్యజనులు కందఱికి వాడేవస్తువు లన్నీ చవకగా వుండవలెననీ; రెండు: వాటిని చవకగా చేసి ఈయగల సాధనసామగ్రి వున్నంతకాలము, ప్రాచీనపద్ధతులకు హీనస్థితి తప్ప దని. అయితే, దీనివల్ల ప్రాచీన

పద్ధతులతో నడచుచున్న గ్రామపరిశ్రమలు అనవసరమని కాదు, కొంతవరకు అవసరమే పైగా కొన్ని కొన్ని వస్తువులను గృహపరిశ్రమలుగాను, చేతిపరిశ్రమలుగాను కాక చేయనేలేము. నగిషీపని, దంతపుపని మొదలైన అలంకారపుపనులు యంత్రమూలంగా చేస్తే వాటి అందమే పోతుంది. కాని, కేవలం గ్రామపరిశ్రమలవల్లనే దేశంలోని పారిశ్రామిక ఉత్పత్తి యావత్తు జరగవలెనంటే ఈ నవీనప్రపంచంలో కొంచెం హాస్యాస్పదంగా వుండకమానదు.

కనుక, హిందూదేశముకూడా ఇతర దేశములతోపాటు అభివృద్ధిచెంది, ఉన్నతదశకు రావాలంటే, జను లందఱూ తగినంత కలిగి, ఇతర దేశస్థులతోపాటు నవనాగరికవిశేషాలలో తమపాలు తాము అనుభవించాలంటే, వ్యవసాయంతోపాటు, గ్రామపరిశ్రమలతోపాటు, ఆధునిక యంత్రసాధకమైన పెద్దపెద్ద పరిశ్రమలుకూడా కావాలి. ఈ దేశం ఆర్థికాభివృద్ధి సర్వతోముఖంగా వుండాలి. శాస్త్రజ్ఞానం వినియోగించి వ్యవసాయం అభివృద్ధిచేయాలి; లేకపోతే ఇప్పుడు మనం ఎగుమతిచేయుచున్న వ్యవసాయపు సరకులైనను ఇతర దేశాలకి అక్కరలేకపోవచ్చును. సాధ్యమైనంతవరకు గ్రామపరిశ్రమలను వృద్ధి చేయాలి. అన్నిటికంటెను ముఖ్యంగా ఆధునిక యంత్రపరిశ్రమలు వృద్ధిపొందాలి. దేశంలోని ప్రత్యేకధనికులు, ప్రభుత్వం, శాస్త్రజ్ఞులు, అందఱూ ఈ ఉద్యమంలో తోడ్పడి భారం వహించాలి. అంతవరకు దేశంలో మొత్తంమీద జనమంతకూ సరిపడిన ఆదాయమైనా వుండదు. నిరుద్యోగ మట్లనే వుండును. దారిద్ర్యము అట్లనే వుండును. ఆర్థికంగాలేని ఔన్నత్యము రాజకీయంగా ఎప్పటికిని రానేరదు. దేశానికి మొత్తముమీద సరిపడిన ధనమే లేనప్పుడు, దేశస్థులలో ధనం సరిగా పంచబడి వుండలేదనిమాత్రం ఎందుకు అనుకోవడం? దేశంలోని జను లందఱూ సమానదరిద్రులుగా వుండవలెననియా మన కోరిక లేక వారంతా కావలసినంత కలిగి సుఖంగా వుండవలెననియా? పారిశ్రామికంగా వచ్చే ఆదాయం మన దేశంలో ఎంత తక్కువో ఈక్రింది అంకెలవల్ల తెలుస్తుంది.

దేశం	పరిశ్రమలనుంచి వచ్చే ఆదాయం — తలొక్కంటికి	
ఇండియా	౧౨	రూపాయలు
జపాను	౧౬౮	,,
జర్మనీ	౨౭౯	,,
ఇంగ్లాండు	౪౬౩	,,
కెనడా	౫౭౭	,,
అమెరికా సంయుక్తరాష్ట్రాలు	౮౩౦	,,

ఈవ్యాసాన్ని, ఎడ్విన్ కానన్ (Edwin Cannan) అనే వక గొప్ప అర్థశాస్త్రజ్ఞుడు 'ఆర్థికాభివృద్ధి' అంటే యేమిటి అనిచెప్పిన కొన్నిమాటలతో ముగిస్తాను:

"ఆర్థికాభివృద్ధి అంటే ప్రకృతిశక్తులన్నింటిని మనవశం చేసికోడం. ఈ వశం యెక్కువ అయినకొలదీ మనజీవనంలో ముఖ్య అవసరాలకోసం శ్రమపడే కాలము తక్కువగుచుండును. ఇది తెలుసుకోడానికి విశేష అర్థశాస్త్రజ్ఞానం అక్కరలేదు. మనం అభివృద్ధి పొందుతున్నకొలదీ, పశుపక్ష్యాది జంతుసమూహంతోపాటు మనకును ఉండే ప్రథమవాంఛలకై తక్కువ శ్రమపడి, అంతకంటె ఉన్నతమైన, నాగరికమైన వాంఛలను

సాధించుకొనుటకు ఆశించును; అవకాశం కూడా ఎక్కువ కనబడును. 'మన ఆహార వాంఛ మన ఆకలిచేత పరిమితమగుచున్నది; కాని మనవస్తువులూ, వస్త్రములూ, ఇంటిసామగ్రి మొదలైన ఇతరసౌఖ్యాలకు ఏ విధమైన హద్దూ ఉన్నట్లు కనబడదు' అని ఆడమ్ స్మిత్తు (Adam Smith) గారు ఇప్పటికి ౧౬౦ సంవత్సరాలక్రితం చెప్పారు. అప్పటినుంచి ఆయన ఊహించగలిగిన కోర్కెలకంటె ఎన్నియో క్రొత్తకోర్కెలను గ్రహించాము. మన నోటిరుచులు ఏమైనా కొంచెం ఎక్కువైనవేమోకాని మన 'పొట్ట' మాత్రం అలాగే వుంది[1]."

ఇంకోచోట ఈ విషయాన్ని గురించి ఇలాగ "ఏ దేశంలోగాని వ్యవసాయదారులసంఖ్య, ప్రత్యేకంగా ఉంటేనేమి, పారిశ్రామికులతో సరిపోల్చి చూస్తేనేమి, తగ్గితే ఆ దేశం యొక్క ఆర్థికౌన్నత్యాన్నిగాని క్షీణ సూచకం గాదు" అని చెప్పినారు. ఇంతకు ముందు పైని చెప్పినది మనం అర్థం చేసికొన్నామంటే ఇది కేవలం సహజమే. కాని, దీనినిబట్టి చూస్తే ప్రస్తుతం హిందూదేశస్థితి ఏలాగ వున్నదో ఈ దిగువ నుదాహరించిన అంకెలవల్ల తేటపడుతుంది. వ్యవసాయదారులసంఖ్య తగ్గుటకు మారుగా ఈ క్రింది విధంగా యెక్కువ అగుతూవస్తోంది:

మన దేశంలో కేవలం వ్యవసాయంమీద
ఆధారపడివున్న వారిసంఖ్య :

సం॥రం॥	జనాభా లెక్కలను బట్టి	
౧౮౯౧ లో	౧౦౦కి	౬౯.౮
౧౯౧౧ ,,	,,	౭౧.౩
౧౯౩౧ ,,	,,	౩. ౭

అయితే, మన దేశం ఆర్థికంగా ఎలాగ నడుస్తున్నదో, పారిశ్రామిక అభివృద్ధి ఎంత ఆవశ్యకమో పాఠకులే గ్రహింతురుగాక[2]

---

1. "One of the simplest generalisations of elementary economics is that the greater command over natural forces which marks economic progress is necessarily coincident with a decline in the proportion of our time which we are obliged to devote to the production of the necessaries of life. As we progress, we can give more and more time to the satisfaction of our more refined wants, which are very elastic, because we need give less and less to the satisfaction of the more elementary and course wants which we share with the beasts of the field, the birds of the air and even the worms which drag down rotten leaves to their larder and the maggots which enjoy putrid flesh. 'The desire of food', as Adam Smith said, 'is limited in every man by the narrow capacity of the human stomach; but the desire of the conveniences and ornaments of building, dress, equipage and household furniture, seem to have no certain boundary' In the hundred and sixty years since his time we have discovered many wants which are even more elastic than those which he thought of, and the human stomach is no wider, though the tongue may be a little more dainty." — ("The Need for Simpler Economics" — Economic Journal, Sep. 1933, p. 368).

2. కొన్ని సంవత్సరాల క్రితం "హిందూ" అనే మాసపత్రికలో "కాంగ్రెసుదృష్టి" (The Congress Outlook) అనే శీర్షిక క్రింద మన దేశంలో పారిశ్రామిక ఆవశ్యకతనుగూర్చి కొంతంగా వ్రాశాను. దీనికి తోడుగా పాఠకులు దానిని కూడా చదువగలిగితే మంచిది.

ఏమి చేదాము?

డాక్టరు చిలుకూరి నారాయణరావు

వ్యావహారికభాషావాదము బయలుదేరి ఇరవైయారేళ్లయింది. అందులో సుమారు ఇరవైయేళ్లు వాదప్రతివాదాలతో గడిచిపోయింది. ఈలోగా మనము సాధించదలచుకొన్న దేమిటి? సాధించిన దేమిటి?

విజ్ఞానము జనసామాన్యములో వ్యాపింపజేయడము, అన్ని తరగతులవారికిన్ని ఆనందము కలుగజేయడము ఈ వ్యావహారిక భాషోద్యమమునకు లక్ష్యములు - పూర్వము మన కున్నది పోగొట్టుకొనడము మన ఉద్దేశము కాదు. పూర్వవిజ్ఞానమును, నవీనవిజ్ఞానమును ఇప్పటివారికి, ఇప్పు డందరికిన్ని బోధపడే భాషలో అందజేయడమున్ను, తన్మూలముగా ఆంధ్రదేశపు సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడమున్ను మనకు ప్రధానోద్దేశము.

అభినవాంధ్రకవిపండితసభను ఆరంభించి, దానికి నవ్యసాహిత్యపరిషత్తు అని మారుపేరు పెట్టి ఆరేళ్లుగా సాగిస్తున్నాము. 'ప్రతిభ' అనే పత్రికను లేవదీసి దానిమూలముగా మనలక్ష్యమునకు దగ్గరగా పోవడానికి ప్రయత్నిస్తున్నాము. వ్యావహారికభాషలో వ్రాసిన నవ్యసాహిత్యమున కనేకవిధాలగా తోడ్పడుతున్నాము. కాని, ఆనవ్యసాహిత్యస్వరూపము నెట్లు సరిదిద్దుకోవలెనో యింకా ఆలోచించుకోలేదు.

ఈవిషయమై మనము నిశ్చయించుకోవలసిన అనేకవిషయా లున్నవి. వాటిలో ప్రథమస్థానమును వహింపవలసినది మనము వాడవలసిన భాషస్వరూపము. "వ్యావహారిక భాష అంటే ఏమిటి?" అనే ప్రశ్నకు మనమింతవరకున్ను సరియైన సమాధానము చెప్పలేదు. 'వాడుక' భాష అంటే ఎవరి వాడుకలోనిది? దీనికి కొందరు కవులవాడుకలోనిది అని సమాధానము చెప్తారు. 'కవులవాడుక' అనగా కవులు నిత్యవ్యవహారములో కాక తమ కావ్యములలో వాడుకొనేది అని కొందరు వ్యాఖ్యానము చేస్తారు. 'అందరు కవుల కావ్యములలోని భాష అంతా ప్రమాణమేనా' అని ప్రశ్నిస్తే పూర్వపూర్వకవులభాష ఉత్తరోత్తరకవులకు ప్రమాణమవుతుంది గనుక అతిప్రాచీనకవుల భాష మాత్రమే ప్రమాణమని వా రంటారు. వీరే గ్రాంథికవాదులు. ఈ గ్రాంథికవాదులలో అనేకమతాలవా రున్నారు. ఆమతాల నన్నిటిని యిచ్చట వివరించడ మనావశ్యకము.

కొందరు నేటివారివాడుక నేటివారికి ప్రమాణము అని అంటారు. 'నేటివారు' అంటే అందరూనా? అంటే, కాదు 'శిష్టులు' అని అంటారు. ఎవరు శిష్టులు? ఒకరకము వారినిమాత్రమే శిష్టు లంటే తక్కినవారి నందరినీ అశిష్టు లన్నట్టేకదా. కాబట్టి ఈ

నిర్వాహకులవల్ల చాలా కష్టాలు కలుగు తవి. అయితే గ్రంథాలు కనేవే లేదా? అంటే, 'లేదు' అనే ప్రత్యుత్తరం చెప్ప వలసినట్లుంది. మించి ఉన్న దానికి ఒక గ్రంథాల ముంటాయి. అది పెరుగుతూ ఉంటుంది, తరు గుతూ ఉంటుంది, పెరిగినా తరిగినా, ఏదో ఒక చిత్రముకూడా అవుతూ ఉంటుంది. గ్రంథా లనుగురించి మనుష్యులు, గ్రంథములను వ్రాస్తూ మొదలయిన దగ్గర లేక, ఆ గ్రంథాలన్నీ విషయములు ఇక్కడ ... లేకుండా, అట్లే జీవద్భాషకు సంబంధించినవాటికూడా ... లేము.

అయినా, కొంతవరకు వాడుకభాష ప్రయో గము ప్రసక్తిలోకివచ్చినా, ఇంకను నిండుగాను పూర్తిగాను, ఒక్క ప్రయోగ మనేదానిని వ్యవహారములో అనుసరిస్తూనే ఉన్నాము. ... గ్రంథ రచనను మనము వ్యావహారికభాషాప్రయో గములోకూడా ... చేసుకోవలసి ఉంటుం ది. సమగ్రభాషను, ఇచ్చి పుచ్చుకొనేపని ము, ... లోకములో ఒక్కటైనా కూడా జరగదు. ఎన్నాళ్లని ఈవిధమైనట్లు ... కాలము వ్యర్థము చేసుకొంటూ, గ్రంథ లక్ష్యము మరిచి ఉండవలెను ?

మన మిన్నాళ్లుగా సాధించినది లేకపో లేదు. ఆంధ్రలోకము సంతోషించి మనకు సుముఖ మయ్యేటట్లు చేసుకొన్నాము. శుష్క పండితుల భయమును పోగొట్టినాము. ఏకథ వ్రాయవలసివచ్చినా, ఏగీతాలు వ్రాయవలసి వచ్చినా, ఏవ్యాసాలు వ్రాయవలసివచ్చినా, వ్రాసేవారి కలమువెంట వ్యావహారికభాషే సహజముగా ప్రవహిస్తూ ఉంది. పూర్వము గ్రాంథికభాష సహజముగా వ్రాస్తా మనుకొనే వాళ్లుకూడా లేని భయము విడిచి వాడుక భాషలో వ్రాస్తున్నారు. పండితులుకూడా గ్రాంథ్యముపట్ల ఇష్టము మడిగట్టుకొని వ్యావ హారిక భాషావాదులకు పరిహాసారముగా ఉపదేశము మానినారు. వ్యావహారికభాషా రచనలలో 'కూడా' సత్తా ఉందని గ్రహించేస్థితికి వచ్చినారు. వ్యావహారిక భాషను బహిష్కరించిన విశ్వవిద్యాలయాలు, టెక్స్టు బుక్కు కమిటీలవారున్నూ కొంచెం కొంచెముగా వాడుకభాషలో వ్రాసిన గ్రంథములకు జంకుతూ జంకుతూ ప్రోత్సా హం కలిగిస్తున్నారు.

కాని, వాడుకభాషమీద శాసనరూప మైన ఆంక్ష ఇంకా పోలేదు. ౧౯౧౨ సంవత్స రములో సర బయ్యా వేంకట నరసింహేశ్వర శర్మగారు మద్రాసు కౌన్సిలులో వ్యావహారిక భాషను తాత్కాలికముగా ఆమోదించ వీలు లేదని తెచ్చిన తీర్మానము ఆనాడు నెగ్గినది. ఆ ఆంక్ష ఇంకా రద్దు కాలేదు. మనము చేయవలసిన మొదటి ప్రయత్నము ఈవిషయమై జరుగవలసిఉన్నది. ఆ ఆంక్షను వెంటనే శాసనమూలముగా తొలగించుకో వలెను. ఇప్పుడది సులభముగా జరిగితీరు తుంది. అది జరుగుతేనేకాని, విద్యాశాఖాధి కారులు బహిరంగముగా వాడుకభాష నామోదించరు. మన మింతపని చేసినా, జనులదృష్టిలో ఇంతటి గొప్పమార్పును కలి గించినా, దానివల్ల కలుగబోయే ఫలము ననుభవించడానికి వీలుకాలేదు. కాబట్టి, దేశహితమును కోరేవారందరున్నూ ఈ విషయమై వెంటనే కృషిచేయవలసిఉన్నది.

అయితే, ఇంకా పూర్వకాలపు ఆక్షే పణలను చెప్పేవారు లేకపోలేదు. ఆ ఆక్షే

పణలు సంగ్రహముగా తెలుసుకొని ఉంటే మంచిది: (౧) మండలమునకున్న మండల మునకున్ను, ఒక్క మండలములోనే వివిధ వృత్తులకున్ను, జాతులకున్ను నుడికారము మారుతూ ఉన్నది. ఒక ప్రమాణము లేకపోతే భాషాసౌష్ఠవము చెడుతుంది; (౨) ఇప్పుడు వాడుకభాషలో వ్రాస్తూఉన్నవారి ప్రయోగాలలో నానావికారాలున్ను కనబడుతున్నవి. 'ఉన్నెయ్', 'వస్తోంది' మొదలయిన రూపాలు కొందరికి కర్ణకఠోరముగా వినబడుతున్నవి. ఇవే ప్రధానములైన ఆక్షేపణలు. మన కా ఆక్షేపణలు సరియైనవిగా కనబడకపోయినా, ఇతరుల అభిప్రాయానికి కొంచె మనుకూలముగా సర్దుకోకపోతే కార్యము సఫలము కాదు. కాబట్టి వాడుకభాషలో ఒకరీతిప్రమాణమును ఏర్పాటు చేయడానికి ప్రయత్నము చేదాము. ఎట్టి ప్రమాణమును మనము ఏర్పాటు చేసినా, అది వాడుక భాషకు విరుద్ధముగా ఉండకుండా ఉంటే మనకు చాలును. దానికోసము మ॥ రా॥ రా॥ శ్రీ రావుసాహేబు గిడుగు రామమూర్తి పంతులుగారు ఎన్నో ఏళ్లక్రిందట మూడు సూత్రాలు ఏర్పాటు చేసినారు. వాటిని తరువాత కుతంత్రము చేసి ఆంధ్రసాహిత్య పరిషత్తువారు త్రోసివేసినా, మొదట నవి వారి అంగీకారమునుకూడా పొందినవే. ఆ సూత్రా లేమి టంటే—

(అ) పూర్వకవులవాడుకలో ఉండి నేటి వ్యవహారములోకూడా ఉన్నప్రయోగాలు గ్రాహ్యములు. అట్టిప్రయోగాలేవో 'బాలకవిశరణ్యము'లో శ్రీ రామమూర్తిపంతులుగారు వివరించే ఉన్నారు.

(ఆ) ఇప్పటి గొప్పకవు లని చెప్పబడేవారు ప్రయోగించిన ప్రయోగాలు నేటి వాడుకలో ఉంటే, వాటిని గ్రహించవలెను.

(ఇ) నేడు ఆంధ్రప్రాంతా లంతటా సామాన్యముగా ఉన్న పలుకుబడి గ్రాహ్యము కావలెను.

ఇంతకంటె సమంజసములైన సూచన లుండబోవు. కాని, వాటినిగూర్చిన సూక్ష్మ వివరములను కొన్నిటి నేర్పరుచుకొని ఆక్షేపకుల సమ్మతిని పొందుతే మనపని సుకర మవుతుంది.

నేడు ప్రజాసామాన్యము విస్తరిల్లుతున్నది. ప్రజలకు వివిధవిషయాలలో జ్ఞానము కావలసిఉన్నది. వారికి కావలసిన సరియైన విజ్ఞానమును వారి కింకా మన మందించలేదు. ప్రభుత్వమువారు విద్యావిధానములో గొప్పమార్పులు చేయ తలపెట్టి ఉన్నారు. ప్రజావిద్యకోసము అధికధనమును వినియోగించబోతున్నారు. వా రాపనిని చేయవచ్చును కాని, దాని నేరీతిగా చేయవలెననే విషయమును కూడా ఆలోచించవలసిఉంటుంది. మాతృభాషలో ఇకముందు విద్య నడుస్తుందట. కాని, ఏది మాతృభాష? అనే విషయమును మనము నిర్ణయించవలెను. ప్రభుత్వమువారి కీవిషయమై ఏమిన్ని తెలియదు. కాబట్టి మనము వారికి మన ఉద్దేశ మేమిటో తెలియజేయవలెను.

ఈవిషయమై ఏమిచేదాము?

'మా నాన్న'

సత్యవతి

"అందరూ నాన్నని నిందిస్తారు. మా నాన్న గొప్పోడు అమ్మా!"

"తెలిసీతెలియకచేసిన తప్పుకు అమ్మమ్మా నేనూ మీనాన్నతో పోట్లాడాము నీ పుట్టకముందు. అప్పటి నుంచీ మీ నాన్న దూరమైపోయినాడు. నీవు వుంటే మళ్లీ ఎప్పటికైనా కలుస్తామేమో!"

ఇంట్లో మాట్లాడుకునే సంభాషణ వింటూంటే మా నాన్నగారు మంచివారనీ, తెలివికలవారనీ, చాలాగ కోపంతో పొరపాటుచేసుకుని మా అమ్మ పుట్టింటికి చేరిందనీ తోచేది. ఎవరైనా బంధువులూ, తెలిసినవాళ్లూ యింటికి వస్తే నాన్నమాట వచ్చేది. అప్పటి ప్రసంగాలు మరోవిధంగా వుండేవి. వాటిని వింటే నాన్న దేవుడిలా అనిపించేది. ఎప్పటికైనా కలిస్తే నిజం తెలుస్తుందని ఉవ్విళ్లూరుతూ వుండేదాన్ని.

అదృష్టంవల్ల మా మేనత్త ఊరునించి వచ్చింది. ఎప్పుడూ చింపిరులతో మురికిగా వుండే తలదువ్వి దానిలో వకమూల పువ్వులు పెట్టి మా అమ్మ ఉత్సాహంతో అత్తయ్యతో మాట్లాడుతూ, "మీ నాన్న యిట్లానే వుంటారు" అని హెచ్చరించింది.

అత్తయ్య ప్రేమతో నన్ను దగ్గరికి తీసుకుని "అంత తెలివిగల మీ నాన్న వుండికూడా మీ గతి యిట్లా వున్నది" అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది. "అత్తయ్యా! మా నాన్నను చూపించవూ" అని దిక్కులేని మొగంతో నేనడిగేటప్పటికి హృదయం కరిగి "సరే, అల్లాగే" అని మాట దక్కించుకుంది. మా అమ్మ, అత్తయ్య చాలాసేపు గుసగుసలాడారు. మా అమ్మమ్మకూడా మర్యాదగా మాట్లాడి పంపింది.

తర్వాత వకనాడు బళ్లోనించి వచ్చి పుస్తకాలు సర్దుతుండగా, "పిల్లలను తీసుకుని వెంటనే బయలుదేరి రా" అని టెలిగ్రాం వచ్చింది. మా అక్కయ్య పూళ్లోకేసం గా వచ్చిందే అని మనస్సుకు కొంచెం కష్ట మేసింది. ఆ రాత్రిరైలుకే నేనూ, మా అమ్మ, బట్టలు సర్దుకుని మూటకట్టుకొని బయలుదేరాం. అమ్మమ్మా తాతయ్యా కళ్లనీళ్లు కారుస్తూ సాగనంపారు. అమ్మ నాలకం చూస్తే బలవంతంగా ప్రయాణంచేస్తున్నట్టు తోచింది. తెల్లారు జామున అత్తయ్యగారివూరు చేరాం. వెతుక్కుంటూ యిల్లు కనుక్కునేప్పటికి తూర్పు తెల్లారుతున్నది. ఇంట్లోకి వెళ్లేప్పుడు, మా అమ్మ యెందుకో శంకుతూ బయట నిలబడి కంగారుపడింది. మా అత్తయ్య బయటికి వచ్చి ప్రేమతో నన్ను దగ్గరికి తీసి మమ్మల్ని లోపలికి తీసుకెళ్లింది. లోపలి కెళ్లిన తరువాత వెంటనే యిట్లా అంది "అన్నయ్య షికారుకెళ్లారు! అధికప్రసంగం చెయ్యక నీవు చెప్పదలచినవన్నీ మా అన్నయ్య మనస్సు కెక్కేటట్టు చెప్పుకో. ఇదివరకులాగా తెలివి తక్కువగా ప్రవర్తించకు."

మా అమ్మ "ఆయన మొఖం చూట్టానికి నాకు భయంచేత యిన్నాళ్లూ పుట్టింట నానామాటలూ పడుతూ వున్నా. పిల్లల్ని ఆయన కొప్పచెప్పదామని ధైర్యంచేసుకు వొచ్చా. వదినా! నీ మేలెన్నటికీ మరవను" అన్నదో లేదో యింతలో వచ్చాడయ్యా ధూకుడుగా వకాయన. మా అత్తయ్య నన్నూ అమ్మనీ పక్కగదిలో కెళ్లమని సంజ్ఞచేసింది. అప్పు డనుకున్నా ఆయన మా నాన్నని. మే మిద్దరం గదిలో నక్కాం. ఎందుకో యింతభయం నాకు తెలియదు.

"వంట అయిందా? బావ వచ్చాడా? ఆకలవుతున్నది వడ్డించు" అంటూ వంటింటిలో కొచ్చి పీట మీద కూచున్నాడు మా నాన్న. కూచుని పూరుకోక కమ్మనికబుర్లు చెప్పటం మొదలెట్టేటప్పటికల్లా మా నాన్న మంచి చురుకైనవాడనీ, యితరుల మనస్సులను ఆనందింపజేయగలవాడనీ తెలిసింది. ప్రథమదర్శనం నా కాయనమీద అపేక్షను పుట్టించింది. మామయ్య

గారు త్వరగా భోంచేసి చెయ్యి కడుక్కుని నన్నాయన దగ్గిరికి పంపాడు. నాన్నగారిని చూడగానే ఆయన ఒళ్లో కూర్చోవాలనిపించిందిగాని మనస్సులో, ఎన్నో యెందుకో అట్లా చెయ్యలేకపోయినా. నుంచున్నా. నెరిసేకళ్లు, చిరునవ్వు చిందులు తొక్కే పెదవులు, బూరెల్లాంటి బుగ్గలు, ఆనందాన్ని వెల్లడించే మొఖము చూసి, తప్పక నన్నాదరంతో ప్రేమిస్తారని అనుకున్నా. నావంక సూటిగా చూశాడుగాని నన్ను గుర్తుపట్టలా. తన మాటలధోరణిలోనే పది నిమిషాలున్నాను.

"ఆ అమ్మాయి యెవరో వచ్చి చాలాసేపటి నుంచి కూర్చున్నది. కూర్చో మనవేమన్నా బిట్టితల్లి!" అనగానే "మీ అమ్మాయే! వదినెకూడా వచ్చింది. నిన్ను క్షమాపణ కోరుకుంటుందిట! ఆమె చెప్పేదంతా విను. పిల్లల్ని మరవకు. వాళ్లను వృద్ధిలోకి తీసుకు రావటం నీధర్మం" అని అత్తయ్య గంభీరంగా జవాబు చెప్పింది. నాన్నగారు అత్తయ్యవంక తీక్ష్ణంగా చూస్తూ, "నాతో సంప్రదించకుండా, నాకు తెలియకుండా వాళ్లనెందుకు రానిచ్చావు? ఎంత పొరపాటు చేశావు?" అని భోజనందగ్గిరనుంచి లేచి గదిలోకెళ్లి అత్తయ్యను మామయ్యను పిల్చి చాలాసేపు మాట్లాడాడు. తర్వాత వంటరిగా పది నిమిషాలు తన మనస్సులో తాను ఆలోచించుకుని "సరే మాట్లాడుతా"నన్నాడు కాబోలు. మామయ్య తనతో నన్నుకూడా గదిలోకి తీసికెళ్లి కూర్చోపెట్టాడు. వెంటనే ప్రశ్న పరంపరలు. "నీ పేరేమి? ఏమి చదువుతున్నావు? మీ అమ్మపేరేమి? మీ నాన్న పేరేమి? ఎప్పుడైనా మీనాన్నను చూశావా? చూడా లనిపించిందా?" నదురు బెదురు లేకుండా నేనూ ఘాటుగా జవాబులు చెప్పేటప్పటికి నిర్ఘాంతపడిపోయి నాన్నగారు, "అన్నం తిని నిద్రపో. రేపు సావకాశంగా యింకా మాట్లాడుదాం" అని నన్ను పంపారు. సావిట్లో సిద్ధంగావున్న అమ్మ మాట్లాడటానికి లోపలికి తయారైతే "మీ భోజనాలైన తర్వాత" అని నాన్నగారివద్దనుంచి ఖంగున జవాబు వచ్చింది. నేను భయం లేకుండా ధైర్యంగా జవాబులు చెప్పినందుకు మా అత్తయ్య నన్ను మెచ్చుకున్నది. అన్నం తిని నిద్రపోయా.

మర్నాడు నేను లేచేటప్పటికల్లా మా నాన్నగారు స్నానం చేసి పూజచేసుకుంటున్నారు. అది మొదటే ఇప్పటికి ఆయన దైవభక్తి కలవారనిన్నీ, నన్నూ మా అక్కయ్యనూ తప్పక ఆదరణతో చూస్తారనిన్నీ తోచింది. కాలకృత్యాలు తీర్చుకుని నేను సిద్ధమయ్యేటప్పటికి పూజనుంచి లేచారు. అప్పుడు నన్ను దగ్గిరికి పిల్చి ఒళ్లో కూచోబెట్టుకొని తల నిమురుతూ ముద్దుపెట్టుకుంటే నాకు యెన్నడూ యెరగని ఆనందం కలిగింది. ఎన్నడూ నేనంత సంతోషం యెరగను. మనస్సు యెట్లాగో వుంది. నే నప్పుడు మా నాన్నగారి భుజాలమీద చేతులు వేసి కండ్లల్లోకి చూస్తూ,

"నాన్నగారూ! మీదగ్గిరుంటా. చాలా ఆనందంగా ఉంది. మిమ్మల్ని చూసినప్పటినుంచీ మిమ్మల్ని విడిచిపెట్టా లని లేదు" అన్నాను.

"తల్లీ! నాకుకూడా అలాగే వున్నదమ్మా! త్వరలోనే నాదగ్గిర వుంచుకునే ప్రయత్నం చేస్తానే" అంటూ నామీద ముద్దులవర్షం కురిపించారు. ఇదివరకు నేను చూస్తున్న ముఖాల్లాగ తమ్ముళ్లో ప్రొద్దు గూకినట్టుగాక అక్కడి మావాళ్ల యింట్లో అన్ని ముఖాలూ చాలా వికాసంగా వున్నాయి. నాన్నగారు బజారు కెళ్లి చాలా రకాల పండ్లు తెచ్చారు. అత్తయ్య పిండివంటలు చేసింది. ఎన్నడూ నే నెరగని ఆదరణతో చూస్తూవుండేది. రెండు పరికిణీలు, రెండు జాకెట్లు కుట్టిచ్చింది. వాళ్లలో వుండాలనిపించింది. అక్కడినుంచి పోబుద్ధిపుట్టలా.

నాన్నగారు మర్నాడు ప్రయాణానికి సిద్ధమై నన్ను ముద్దాడి, "త్వరగానే కలుసుకుని మనమందర మొకచోట వుందాము. ధైర్యంగా వుండు" అని వెళ్లారు నా హృదయంలో నివాస మేర్పరచుకుని. తర్వాత రోజూ నాన్నగారిదగ్గిరనుంచి వుత్తరాలు వస్తూవుండేవి. ఆ వుత్తరాలు చదువుతూంటే నాన్నగారు కండ్లయెదుట మాట్లాడుతున్నట్టనిపించేది. ఇట్లా నా కాయనమీద ప్రేమ అభివృద్ధి అయింది. ఒకనాడు మా అమ్మ అత్తయ్యతో, "మా అమ్మ పని చెయ్యనియ్యక గారాబంగా దద్దమ్మల్లే కూచోబెడుతుంది. ఇక్కడుండి పని నేర్చుకోవాలని వుంది" అన్నది.

"వదినా! మిమ్మల్నిద్దరినీ కలపగలిగా. అన్నయ్య పస్తైర కల్పించాకా యిక్కడే వుండి పని నేర్చుకో సుఖంగా. ఏమీ అన్యాయం లేదు. కాని యిన్నాళ్లుగా స్వలు. మా యింటివాడికి పోట్లాట కొస్తే నాకేం గావాలమ్మ" అన్నది మా అత్తయ్య. మా యింట్లో నాన్నగారుండగానే మాటలల్లేగాక యిక్కడి వాళ్లాడుకునే మాటలు నాన్నగారి మొదటి గౌరవాన్ని, ప్రేమను పుట్టించాయి.

"ఇంతకాలంగా నా మొగుడింటి పని తెలిస్తే యిదివరకెప్పుడో వచ్చేదాన్ని. చెప్పిందంతా విని తిరిగి ప్రశ్నలు వేస్తే జవాబు చెప్పలేకపోయినా, నాన్నగారు చెప్పిన సలహాలవల్ల వారితో పోట్లాడి కాపురాన్ని పాడుచేసుకున్నా" అంటూ కన్నీళ్లు పెట్టుకుంది మా అమ్మ.

"అయినదానికి దుఃఖించకు. పిల్లలు పుట్టేటప్పటికి సుఖపడ్డావుగా. ఇప్పుడైనా కాపురం తెలివిగా నిలబెట్టుకో, సుఖపడతావు. లేదా యిద్దరూ మళ్ళీ రం పుట్టిల్లో నీవాళ్లేగతి" అని ఓదార్చింది మా అత్తయ్య. ఒకటికి నాలుగుసార్లు చెప్తూ, చేతగాని పని చేసి చూపిస్తూ మా అమ్మకు పని నేర్పి కాపురంపై శ్రద్ధ తీసుకున్నది మా అత్తయ్య. దాదాపు నెలదినాలు గడిచాయి. ఒకనాడు మా నాన్నగారు గ్రామ వృత్తి రంలో మంచిగా మార్చుకొని రావచ్చునని రాశారు. ఆ వృత్తాంతం చూసి నా వొళ్లు, హృదయం పొంగిపోయింది. ఎందుచేతనో అమ్మ నిశ్చింతగా తల్లో బోయి చూసింది. అప్పుడు అత్తయ్యా మామయ్యా మా అమ్మకు బుద్ధులు చెప్పి మమ్మల్ని సాగనంపారు.

పట్నం చేరేటప్పటికల్లా నాన్నగారు ప్లాటు ఫారంమీద సిద్ధంగా వున్నారు. ఆయనపైకి పక్కగింం తేసి వురికా. కౌగిట్లో చేర్చుకుని ముద్దాడి అబ్బురంగా తన నివాసానికి తీసుకుని పోయారు. ఒకటి రెండు దినాలు గడిచాయి. ఇంట్లో రేమీగా సమక్కవలేదు. అన్నీ సమృద్ధిగా వుండేవి. క్రమంగా మా అమ్మకు మా అత్తయ్యగారింట్లో వుండే మురుకుదనం తగ్గింది. పూర్వం మళ్లేప్రవర్తన ఆరంభించింది. నాన్నగారు పాపం కోపం యెంతమాత్రం లేకుండా, "త్వరగా నిద్రలే. కాలకృత్యాలు తీర్చుకుని, తలదువ్వుకొని, నీళ్లుపోసుకొని, బొట్టు పెట్టుకొని, వంటచెయ్యి, మనం సుఖంగా వుండవచ్చు. ఇక్కడ యెవ్వరు నిన్ను ఆపస్లు పెట్టేవాళ్లెవ్వరూ లేరు. వేగిరం పనిలోకి పోవాలి" అంటూ పనిచెయ్యమని ప్రేరణచేసేవారు ఏమీ ప్రయోజనం లేకపోయింది. ఇంకా, "పోనీలే! పాపం! యింతకాలం తల్లిదండ్రుల వద్ద సుఖంగా వుండి పనీపాటూ యేమీ చెయ్యకుండా వున్నావు. వెంటనే అన్నీ నేర్చుకోటం కష్టం. వక్క వారం పనులన్నీ నేను చేస్తూవుంటాను. శ్రద్ధగా గమనిస్తూవుండు. తరువాత చేద్దువుగాని" అని పనంతా తానే చేస్తూ పని నేర్చుకోటానికి ప్రేరేపించేవారు. ఇందువల్లకూడా ఆమె యెంతమాత్రం మారలేదు. నాన్నగారు పనంతా తాను చేసుకుంటూంటే పోనీ తన తల దువ్వుకోటం మొదలైన స్వంతపనులైనా చేసుకో వచ్చునా, అదీ లేదు. ఏవేళకూ నిద్రలేవక, అప్పుడప్పుడు కంట్లోంచి నీరు కారుస్తూ, ప్రశ్నిస్తే జవాబు చెప్పలేక తలవంచుకునేది.

"మీ అమ్మకు అన్నీ నిజం చెప్పావా? పెద్దమ్మ యిని కనుపుతో వున్నప్పుడు నాతో పోట్లాడి వెళ్లిన సైనం వాళ్లకు తెలుసునా? భర్త కలెక్టరు, జడ్జి అయితేనే నేను పనిచేస్తానన్నావని వాళ్లకు తెలుసునా?" అన్నారు నాన్నగారొకరోజు.

"అన్నీ చెపుతానాయేమిటి? ఇప్పటికే నా కళ్లే నేమాటలు వినలేకుండావున్నాను. సంగతులన్నీ చెపితే వుంచి ఉప్పునీళ్లు చల్లుతారు" అన్నది మాఅమ్మ.

"తెలివితక్కువదానివి. చెప్పితే వాళ్లకు నీమీదున్న ప్రేమకు తలన్నా తొకట్టుపెట్టి, యేకలెక్టరునో, యేజడ్జినో నీకు తగినవాడిని తీసుకొచ్చి నిన్ను సుఖపెట్టే వాళ్లుగా!"

"ఈ జన్మకింతే"

"ముందు జన్మలోనైనా నీకోరిక యీడేరుతుందేమోలే!"

ఇట్లా పరస్పరం అయిష్టసంభాషణలు జరుగుతూండేవి.

ఒక రోజున నాన్నగారు వంట చేసుకుంటున్నారు. ఆయనకు పాపం! సహాయం చెయ్యకుండా సోది మొదలెట్టింది.

"మన అమ్మాయి పెళ్లి వైభవంగా చెయ్యాలె, నాల్గువేలైనా ఖర్చుపెట్టి. సిద్ధంగా వున్నారా?"

"చిన్నతల్లి వృద్ధిలోకి రావాలే గాని అంతకంటె యెక్కువకూడా ఖర్చుపెట్టడానికి సిద్ధంగా వున్నాను. బాగా చదువు చెప్పిస్తాను. పెండ్లి కిప్పుడేం తొందర రొచ్చింది?"

మానాన్నగారిజవాబు నాకెంతో నచ్చింది. అమ్మమొగం చూసేటప్పటి కామె కాజవాబు అసంతృప్తి కల్గినట్టు తెలిసింది.

ఇట్లా కొన్నాళ్లు గడిచాయి. "వంటా, పెట్టా భారం వహించమని దినామూ చెపుతూ వుండేవారు. ఒకనాడు వంట చెయ్యమని చెప్పివెళ్లారు. అమ్మతోటలో చెట్లవంకా ఆకాశంవంకా చూస్తూ కాలం గడుపుతూంటే, "త్వరగా నిప్పు రాజేసి వంట చెయ్యి. నాన్నగారు వచ్చేటప్పటికి వంట సిద్ధంగా లేకపోతే కోపం వస్తుందేమో!" అన్నాను.

"కావలసినవాళ్లు చేసుకు తింటారు" అన్నది.

"ఇట్లా అయితే నాన్నగారివద్ద యెక్కువకాలం వుండలేవు సుమా! నీసంగతి క్రమంగా బయటపడుతున్నది. నేనూ మా అక్కయ్యా నాన్నగారి దగ్గిరుండి హాయిగా చదువుకుంటాం. నీవు నీ పుట్టిల్లు చేరుకోవలసిందే!" అనేటప్పటికి నా చెంపమీద ఛెళ్లని వకదెబ్బ కొట్టింది. నేను యేడుస్తూంటే నాన్నగారు గబగబ "వడ్డించూ" అంటూ లోపలికొచ్చారు. నే నేడవడం చూసి అడిగితే, జరిగినవిషయమంతా చెప్పా. అప్పుడు నన్ను ఓరడించి యెత్తుకుని ముద్దాడి అమ్మతో బెదిరిస్తూ,

"వంట యెందుకని సిద్ధం చెయ్యలేదు? ఎప్పుడూ యింక అమ్మాయిని కొట్టవుకదా!" అని చెవి పట్టుకుని సాగదీశారు.

"హాయిగా మా అమ్మ వండిపెడుతూంటే తిని కూర్చోలేక యిక్కడికొచ్చాను. నేను చెయ్యలేను. మమ్మల్ని పంపించండి పోతాం" అన్నది మాఅమ్మ తీవ్రంగా.

"అనమస్తురాలవు. ఉన్నచోట పడుండకుండా ఆశాత్తుగా వచ్చి నాకాళ్లమీ దెందుకు పడ్డావు మరి? అమ్మాయిని చూసి ప్రేమకలిగి యిక్కడికి రప్పించాను. నీకు నామీద ప్రేమ యెంతమాత్రం లేదని నాకిదివరకే తెలుసు. మా అమ్మాయిగారింట్లో అనాధగా తిరూడా నీకళ్లల్లో చూస్తే యెంతమాత్రం నీకు పశ్చాత్తాపం కలిగినట్టు తోచలేదు. అమ్మాయి యోగక్షేమమైనా ఆలోచించి యికనైనా కుదురుగా వుండు" అని మానాన్న మందలించారు. తానే వంటచేసుకుంటూ కాలం గడుపుతూండేవారు. ఒకనాడున నేను నాన్నగారికి సహాయం చెయ్యటానికి పొయ్యేటప్పటికి నాచెయ్యి కాలింది. "తల్లీ! చిన్నదాని వమ్మా! నీవు వంటలోకి రాకు" అంటూ ప్రేమతో నన్ను వారించారు. అమ్మచేసేపను లన్నీ అవకతవక. వస్తువులన్నీ నట్టింటఅయిపోయేది. నాన్నగారికొళ్లు చేతుల కష్టం. నాన్నగారు కోపంతో విసుక్కోడం పరిపాటైంది. మేము వచ్చి యింకా పదినాలుకాలేదు. ఒకరోజు తలుపులన్నీ తీసి పెట్టింది. ఇల్లు దొంగలకు బెట్టింది. దాదాపు వందరూపాయల సామానులు నష్టమైనాయి. నాన్నవచ్చేటప్పటికి శోకాలు పెడుతూ కూచున్నది. అప్పుడు నాన్నగారు బహుశాంతంగా వోదార్చారు. "నేను బంగారం పట్టుకుంటే మన్నవుతున్నది. మీదగ్గిర నేనుండతగను. మమ్మల్ని మావాళ్లింటికి పంపండి" అంటూ యేడ్చింది అమ్మ.

"పొరపాటున తలుపులు తాళాలు వెయ్యకపోతే దొంగలు వచ్చి సామెత్తుకెళ్లారు అంగుకని నిన్ను నేను వేధించటంలేదు. జాగ్రత్త, చురుకుతనం అలవాటు చేసుకునిపనిపాటులు చేసుకుంటూంటేచాలు"అన్నాడు నాన్న. సొమ్ము పోయినా యింత శాంతంగా వుండడం చూచి నా కాశ్చర్యమేసింది. ఇట్లా యెప్పుడూ బుద్ధులు చెప్పుతున్నా, మాఅమ్మ తన్ను తిట్టుకోడం నాన్నగారిని యింకా విసికించడం సాగించింది. ఓ నాడు, "మీరమ్మాయి పెండ్లి నాయిష్టప్రకారం చెయ్యక పోయినారా, మావాళ్ల యిష్టానుసారం, యెటువంటి వెధవైనాసరే నా రెండోతమ్ముడి కిచ్చి ముడేస్తాను వెనక మీకు తెలియకుండా పెద్దమ్మాయికి వివాహం చెయ్యడం వల్ల దానితల చెడిరిద. ఈమాటు మాఅమ్మ పట్టుపట్టింది. ఎట్లాగైనా మిమ్మల్ని లొంగదీసి పీటలమీద కూర్చుండబెటుతుంది" అనేటప్పటికి నాన్నగారు కళ్లెఱ్ఱచేసి,

"నీ అమ్మపట్టు మీ నాన్న దగ్గిర. వెనుక సాతో పట్టు సాగించుకొమ్మని నీకు సలహాయిచ్చి సాగించుకో లేక, క, యెనుక తిగగడం నుంచిపోయి మళ్లీ నిన్ను యిందు కని పంపిందా యేం? ఇంకా పూర్వం వద్దా? యాత్రలు చేసించానిఫలం యిప్పేనా? ఏమో గుణం యెక్కన్నాందే? ఇకనీమీద యిట్లాంటి అనవసర ప్రసంగం నావద్ద లేవద్దు" అని గట్టిగా చెప్పాను.

నాకు సాగాలు చెప్పడం, పట్నమంతా చూసించడం నాన్నగారికి సర్దా. వారికి చాలామంది స్నేహితులున్నారు. వాళ్లు తరుచు విందులకు పిలుస్తూండేవాళ్లు. నేనుకూడా వెళ్లేదాన్ని. నన్ను వాళ్లు చాలా ప్రేమగాను మర్యాదగాను చూసేవాళ్లు. ఇక్కడుంటే అంతా నాకు స్వర్గంలాగుంది అని మా అక్కయ్యకు వ్రాశా. ఏది కావాలంటే అది వెంటనే కొనిచ్చేవారు నాన్నగారు. ఇక్కడే వుండాలని నాకు గట్టిగా వుండడంవల్ల ఓనాడు అమ్మను, "వెళ్లకు. వంటచేసి పెడితే తినుపోదని తానుపోతానన్నగారు. శ్రద్ధగా పని చెయ్యి. మన మిక్కడే వుందాం" అని బతిమాలుకున్నా.

"ఈ ఫలహారాలు, మిగాయిలు నాకేం అంత బాగా లేవు. ఇక్కడికి వచ్చింతరువాత హాయిగా యింత గోంగూర, చింతకాయ, ఆవకాయ చేసుకుని, కమ్మగా చేసిపెడితే సుఖపడలేక యెరక్కపోయి యిక్కడికి వచ్చా. మనం అమ్మమ్మగారింటికి పోవాలసిందే" అన్నది.

"నువ్వుపో, నేను రాను. నీకులాకంగా అక్కయ్యా నేనూకూడా చెడిపోతాం. ఇక్కడ వుంటే మేము తప్పక వృద్ధిలోకొస్తాం."

ఈ సంభాషణతర్వాత అమ్మతో యెక్కువగా మాట్లాడటం మానేశాను. పిలుస్తేకూడా వినిపించుకోకుండా వుండేదాన్ని. ప్రతిదినం తనను పుట్టింటికి పంపమని నాన్నగారితో పోరుతూండేది. వారు యింకా కట్టిపెట్టు మంటూండేవారు. ఇట్లావుంటూ వుండగా ఓరోజున,

"నన్ను యెందుకూ పనికిరాని పిచ్చిదానికింద కట్టి పిల్లలను పెంగరానివాళ్లలాగు చదువు చెప్పించి తయారు చేస్తారా అనుకుంటున్నారా? పిల్లలను మీకు ధారాదత్తం చేస్తాననుకున్నారేమో? ఎట్లా వచ్చానో అట్లా పోతా. అడ్డు చెప్పారా, భావిలో దూకి మిమ్మల్ని సకలయిబ్బందులూ పెట్టకపోతే మారుపేరుపెట్టండి" అన్నది. అనగానే నాన్నగారు తోకతొక్కినతాచల్లే లేచి,

"ఇట్లాంటి మొండిదానివి మళ్లీ యెందుకొచ్చావు? జనకోసూటు భావిలో పడతానంటే అయినకాస్తే మరిచిపోతావా? మీఅమ్మ మంచివిద్య నేర్పి పంపింది. చావ తలుచుకున్నదానివి మీవాళ్లయింట్లో భావిలోనే దూకలేక పోయావు? ఇట్లాంటిదానివి నాదగ్గిర వుండతగవు. తప్పణం నాగడపదాటు! ఇదియీనాడేమాటు! నా నెత్తురు నాకోట పోసికొట్టావు. పో! వెళ్లిపో!" అని గట్టిగా అరిచారు. అందరికంటె బలవంతుడు రాజు. రాజుకంటె బలవంతుడు మొండివాడు. అత్యంతమైన ఆవేశం వచ్చి నాన్నగారు దాన్ని భరించలేక నేలమీద మూర్ఛవచ్చినట్లు పడిపోయారు. అట్లాంటిస్థితిలో యెట్టి మనస్సూ కోపం లేకుండా నేను రానని రాగాలు పెడుతూండేకూడా వినకుండా నన్ను యీడ్చుకుని స్టేషను చేరింది. నాన్నగారు స్టేషనుకు వస్తారనుకున్నాగాని రాలేదు. మళ్లీ వెనక గానుగలలోనే పడ్డాం.

నాన్నగారిమీద అన్నీ అబద్ధాలు కల్పించి వాళ్ల వాళ్లతో చెప్పింది. నేను జరిగింది జరిగినట్లు అంతా నిజం చెప్పా. అదివిని, "స్వతంత్రంగా కాపరంచేసుకోక మళ్లీ మావాళ్లబద్దావూ?" అని నిందించారు. బైట మొగంపెట్టలేక యెప్పుడూ యింట్లో మూలబడుండేది. కొన్నాళ్లకు మా అక్కయ్య వచ్చింది. నేను జరిగిందంతా చెప్పా. మా నాన్నగారిదగ్గిరకెళ్లి చదువుని వృద్ధిలోకి రావాలని తీర్మానించుకున్నాం. మానాన్నగారు మళ్లీ వకమారువస్తే తీసుకెళ్లటానికి వీల్లేదని ఆయన్నడ్డగించారు. శారదాచట్టము సవరణ కాబడ్డ యీరోజుల్లోకూడా యేఅర్ధరాత్రో నాకు ముడివెయ్యాలని పన్నాగం పన్నారు. మాఅక్కయ్యమల్లె నాకుకూడా మానాన్నకు తెలియకుండా మా మామయ్యకిచ్చి పెళ్లి చెయ్యాలని మునిలాళ్ల పట్టు. మమ్మల్నొకమారడిగేటప్పటికి మాకు యిష్టం లేదని చెప్పాం. అప్పుడా తెల్లమొఖంవాడు నా కెందు కి

బలవంతప్పెళ్లిఅని తెలివితెచ్చుకుని యెక్కడికో దూసుకున్నాడు. నే నెక్కడ పెద్దమనిషినౌతానో, వాళ్ల కొంప కూలిపోతుందని భయపడుతూండేవాళ్లు. విద్యా వికాసాలులేక మొండిపట్టు పడితే సంసారాలు ధ్వంసం కావూ? లేనివాళ్లు నే కేడుస్తాంలే ఉన్నవాళ్లపని యిట్లా వున్నది. మా కిద్దరికీ ముళ్లమీ దున్నట్టుండేది. ఏనాటికైనా బాకీ తీర్చుకొని మా నాన్నగారివద్ద చేరి హాయిగా చదువుకుని వృద్ధిలోకి వస్తామా అని ఆ దుర్దా పడుతూ నిమిష మొక యుగంగా గడుపుతున్నాం.

ఇట్లా వుండగా ఒకనాడు మా నాన్నగారు యింకా యిద్దరు పెద్దమనుష్యులు వచ్చి మావాళ్లవాకిట్లో బండి నిలిపి మమ్మల్ని పిల్చారు. మాఅక్కయ్యకూ నాకూ ప్రాణాలు లేచొచ్చినై. మమ్మల్నిద్దర్నీ బుజ్జగించి ముద్దుపెట్టుకుని మీఅమ్మ వస్తుందేమో అడిగిరమ్మన్నారు. ఇట్లా మాఅమ్మతో చెప్పేటప్పటికి మూతి ముడుచుకొని వాకిట్లోకైనా రాలేదు. మా అమ్మమ్మ తాతయ్యా యింట్లో లేరు. మమ్మల్ని తీసుకుని వెళ్లిపోయారు బళ్లవేశారు. మేమే యిల్లు దిద్దేవాళ్లం. తరువాత యెన్నిసార్లు రమ్మన్నా మాఅమ్మ రాలేదు.

ర హ స్సు

దామెర రాజగోపాలరావు

శీత కలధౌత విమల విభాత వేళ,
కొండకోనను వికసించి కుసుమ మొండు,
పరిమళాహ్వానపత్రముల్ పరచె దెసల,
మంద మలయసమీరకుమారుచేత !

శ్రావ్య మోహన కోమల స్వరము నెత్తి,
మధురగానమ్ము సేయుచు మధురఫణితి,
కదలి రాలేదు ఒక్క షట్పదకుమారు
డేని, ఆనందమున అది యేమొ కాని !

కాటుకను ఉదాసించు చీకటుంగపటలి
రేపు మునిమాపు తలసూపు రీతి దోచె;
అంత ప్రసవమ్ము వసివాడి, కాంతితొఱగి,
రేకు లల్లనల్లన రాల్చి రిత్తవోయె !

తుంగభద్ర ప్రాజెక్టు

గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు

మన పెద్ద లీభూమిలో నెల్లప్పుడును మహానదుల నాశ్రయించిరి. స్నానపానములకు ఎది ప్రభుత్వము నీరావశ్యకమని వీరట్లు చేసియుందురనుట కొంతనిజము కాని అంతకంటెను ప్రబలతరమైన కారణమును కలదు. మానవుని నిర్మాణములోనే మూడువంతులకు పైబడి నీరు చేరియున్నది. కాబట్టి మానవశరీరపోషణకు కావలసిన ప్రతివస్తువులోను నీరు ముఖ్య భాగము. సస్యములమీద జీవించు మనకు ఆసస్యాభివృద్ధికి తగిన నీటివసతి అత్యావశ్యకము మొదటివసతి. అందులోను మనదేశమున వర్షము లెల్లప్రాంతములలోను కోరినప్పుడు కురియుస్థితియందు లేవు. అందుచేత ననాదికాలమునుండియు ఈ దేశమునందు నీరు నిలువచేసికొని సస్యముల పెంపుదలకు ఆకరము కల్గించుకొనుట ఆచారమయినది.

మానవప్రయత్నముచే కలుగజేసకొను పంటనీటివసతివలని ప్రయోజనము ఇటీవలి గోదావరిజిల్లా చరిత్రయందు విశదముగా కన్పించును. గోదావరిజిల్లా జనసంఖ్య ౧౮౨౧-వ సంవత్సరమునందు ౭,౩౮,౩౦౮. క్షామముపై క్షామము సంభవించినందున ఆ జనసంఖ్య ౧౮౩౯—౪౦ లో ౫,౩౩,౮౩౬ కు తగ్గినది. అప్పటి ప్రభుత్వ మీమహాదౌర్భాగ్యదశను జూచి యేమి చేయతగునా యని ఆలోచించినది. మొదట సర్. హెన్రీ మాంట్గమరీ యను నుద్యోగిని, సిదప కర్నలు కాటనును ఈ విషయమై ఏమిచేయవచ్చునో రిపోర్టు చేయవలసినదని కోరినది. ౧౮౪౪ లో కాటను రిపోర్టు వ్రాయుచు ఇట్లు నుడివెను.

"క్షామ సంవత్సర మొక్క సంవత్సరముకథనే ఆలోచింతము. సర్కారుకు వచ్చే ఆదాయము శాశ్వతముగా తగ్గిపోవడమే కాకుండా అందువలన ప్రజలకు కలిగే దుఃఖము వివరింపరానిది. దీనిని కనిపెట్టినవారికి ఆనకట్టకట్టి పంటనీటివసతిని కలుగజేయడముచేత ఫలించేమేలు ఎంత మహత్తరమైనదో అర్థమగును. గోదావరికి దగ్గర ఉండే మండలాలలో ఎచ్చటనైనా క్షామమనేది సంభవించడమే మన కంతులేని అవమానము. అటువంటి సంభవము లిదివరకు జరిగినవనేగా, ఆనకట్టు కట్టకపోతే మళ్లీ అట్టి సంభవాలు కలుగునవేది, సాధారణమైన సంవత్సరాలలో మనము పెట్టే కర్చుకు వడ్డీకి తగిన ప్రతిఫలము కలిగినా కలుగకపోయినా మనము ఆనకట్టు కట్టడానికి మనలను ప్రేరేపింపదగియున్నవి."

ఈ మాటల ఫలము గోదావరి ఆనకట్టు. అది ముగిసిన కొంతకాలమునకు ౧౮౫౪ లో మరల క్షామము కలుగగా జి. ఎక్. పెయిలరను ఉద్యోగి వ్రాసినవిషయము వెంటనే కలిగిన మార్పును విశదపరచును.

"ఈ జిల్లాలో మాత్రము సంరక్షితమైన పంటవిలువ ముప్పదియారు లక్షల వెలయగును...ఇంత దుర్భరమైన ఈ సంవత్సరమునందు అందరికీ కనుపించే ఫలాలు ఈ నీటివసతిపనులచే ప్రజలు పొందిన మేలుకు నిదర్శనములుగా నున్నవి. కడచిన సంవత్సరము వసూలైనదానికంటె ఎంతో తక్కువగాని రివిన్యూ వసూలైనది. ఇది పూర్వపు సంవత్సరాల దామాషాలకంటె ఎక్కువ. జిల్లానుంచి ౧౮ లక్షల సామగ్రి ఎగుమతి చేసినాము. రు ౫,౭౪,౫౪౭ ల దిగుమతులు రాగలిగినవి. మండే ఎండలలో నీరుపట్టుకాలములో మనుష్యులకు పశువులకు పుష్కలముగా ఏటినీరు సరఫరా చేయగలిగినాము. తక్కువ అదృష్టము చేసకొన్న జిల్లాలలో పంటలు పూర్తిగా నష్టమైపోయి రైతులు పడిన కష్టనష్టాలు ఈ జిల్లారైతులకు తప్పినవి. ఆనకట్టు నిర్మాణము మరియేమి చేయనీ చేయలేకపోనీ ఈ ఒక్క సంవత్సర

ములో దీనిని సలహాచేసిన (కాటన్) మహాశయుని ఉత్తమఫలశ్రుతులలో ఒక్కఫలశ్రుతిని నిజముచేసినది".

ఇప్పటి గోదావరిజిల్లా జనసంఖ్య నొక్కటి చూస్తే ఎంత ప్రయోజనము ఆనకట్టచే కలిగినదో అర్థమౌతుంది. తూర్పుగోదావరి ౧౩,౪౯,౧౦౪, పడమటి గోదావరి ౯,౯౪,౧౯౦. మొత్తము ౨౩,౪౩,౨౯౦. ఎక్కడి అయిదులక్షలు, ఎక్కడి ౨౩ లక్షలు.

నాటి గోదావరిజిల్లా వలెనే నాటి బళ్లారి జిల్లాయును నాటి అధికారుల దృష్టియందు మెలగినది. శ్రీ కృష్ణదేవరాయల దినములనుండే పదునొకండు చిన్నకాలువలు మన పెద్దల మార్గదృష్టిచే తుంగభద్రా నదినుండి చీలి వచ్చి కొంతభాగమును సస్యశ్యామలము చేయుచున్నందున బ్రిటిషు అధికారులుకూడ అదేవిధముగా ఇంక కొంత పనిచేసి కార్యమేల సాగించరాదని ఆలోచనలు చేయ నారంభించిరి. పదేపదే బళ్లారి జిల్లా క్షామబాధిత మగుచుండుటచేత పదేపదే తుంగభద్రనీటిని ఆజిల్లాకు ప్రయోజనకరము చేయుటకయి విచారణలు జరిగినవి. నాలుగు పర్యాయములు విచారణలు జరిగి నలుగురధికారులు రిపోర్టులు వ్రాసి ౨౨-౩-౬౯న, ౨౭-౧౨-౭౬ న, ౨౯-౧౦-౮౯ న, ౮-౩-౯౯ న గత శతాబ్దమున గవర్నమెంటువారి ఆర్డరులీ విషయమయి ప్రకటిత మయినవి. కాని ఇన్ని పర్యాయము లాలోచించినా బళ్లారిజిల్లాలోపుగనే ఈక్రొత్తకాలువ ముగియవలె నని పెట్టుకోడముచేత వ్యయప్రయాసలకు తగిన ఫల మేమాత్ర ముండ దని తేలుచువచ్చినది. ౧౯-వ శతాబ్దములో సులభముగా తేలేపని యగునెడల ఆపదునైదు పదునారవశతాబ్దాలలోనే విజయనగర రాజ్యాధిపతులే తీర్చివైచియుందురుగదా! ఈ సందర్భమున మరియొకవిషయముగూడ గమనింపదగును. ఈవిమర్శలో సర్వమును బళ్లారిమాటే రావడానికీ, అనంతపురము కర్నూలు కడప మాటలు రాకపోవడానికీ కారణ మేమాయని అచ్చెరువు పొందేవా రుండవచ్చును. కర్నూలు కడపలకు అప్పటికే ఇర్రిగేషన్ కంపెనీవారు కడప-కర్నూలు కాలువను త్రవ్వియుండినారు. అనంతపురంజిల్లాను ప్రత్యేకము జిల్లాగా పరిగణించుచుండలేదు.

ఘాతకరమను పేరొందిన దేశమంతటిని మాడ్చివేసిన ౧౮౬౬ ౬౬-వ సంవత్సరపు తరువాత సర్ రిచర్డ్ స్ట్రాచీ అనువారి రాజమాన్యమునను, ౧౮౭౬ - ౭౮ క్షామమునకు పిదప సర్ జేమ్స్ లయల్ అనువారి నాయకత్వమునను, ౧౮౯౯ - ౧౯౦౦ క్షామమునకు తరువాత సర్ ఆంటొనీ మాక్డొనెల్ అనువారి నాయకత్వమునను మూడు 'ఫామిన్ కమీషన్'లు బ్రిటిషుప్రభుత్వమువారిచే ఏర్పాటయి రిపోర్టులు వ్రాసినవి. అందులో కడపటిరిపోర్టు చాలవిమర్శగా వ్రాసినారు అది ౧౯౦౨లో ప్రకటితమయినది. దానిలో కమీషనువారు క్షామకాలములో చేయించే పనియందు పంట నీటివసతులను అభివృద్ధిపరచుటయు, పెంచుటయు క్రొత్తగా పైనగు ఇర్రిగేషన్ పనులు చేయించుటయు చేర్చుటయు చాల మేలని వ్రాస్తూ ప్రతిసర్కిలులోని సూపరింటెండింగు ఇంజనీరు అర్హమైన అట్టిపనుల జాబితా తయారుచేసి చీఫ్ ఇంజనీరు అనుమతినొంది జిల్లాప్రోగ్రాములలో, అంటే క్షామకాలంలో పని చేయించడానికి ఉద్దిష్టమయిన కార్యక్రమములో, చేర్చి ఉంచవలసిన దని సిఫారసు చేసిరి.

అప్పటి కప్పుడే బళ్లారిజిల్లానీటివసతిని గురించి మరల విమర్శించి రిపోర్టుచేయడానికి ఎస్. ఇ. క్లార్కు అనుఅధికారి నియమితుడై యుండినాడు. బళ్లారి జిల్లాలో ఏకొన్ని తాలూకాలకో నీరు సరఫరా చేసే ఉద్దేశముతో పరిశీలించేయెడల తుంగభద్ర ప్రాజెక్టు ఏనాటికిని తేలదని వ్రాసి కడప నెల్లూరు జిల్లాలకుకూడ నీరు సరఫరాచేసే పెద్దఎత్తుగడతో పనిచేస్తే ఫలముండు నని వ్రాసినాడు. నెల్లూరులో సోమశిలవద్ద పెన్నేటిని తటాకముక్రింద నేర్పరచి నీరును నిలువచేయవచ్చు నని సూచించినాడు. స్మార్ట్ అనే మరియొక ఇంజనీరు ఈ అభిప్రాయమును గట్టిగా బలపరచినాడు. అతని ఎస్టిమేటు ప్రకారము కృష్ణజిల్లాలో రెండులక్షల ఎకరాలు రెండవకారుపంటకూ, బళ్లారిలో ౩౦,౦౦౦ ఎకరాలు వరిపంటకూ, అయిదులక్షల ఎకరాలు క్షామ సంరక్షణకూ, కడప, అనంతపురము జిల్లాలలో ముప్పదేసివేల తరీపైరుకూ, నెల్లూరులో లక్ష ఏబదివేల తరికి నీరివ్వడానికి వీలవుతుం దని అతని అంచనా.

ఫామిన్ కమీషనువారు కూడ ఈ విస్తారతరమైన ప్రాజెక్టును ౬ కోట్ల రూపాయలు కావచ్చుననీ, దానికి తగిన ప్రతిఫలము రాదనీ, కాకపోయినప్పటికిని కరవుబాధనుండి ప్రజలను సంరక్షించుటకొరకు ఇది అత్యవసరము కాబట్టి దీనిని జరిపి తీరవలెననీ వ్రాసిరి. సాధారణకాలములో ఈ ప్రాజెక్టు నీటిని తీసికొనువారు తక్కువగా నుండురనటము కూడ వారు పూర్తిగా గ్రహించియే యీ సిఫారసు చేసిరి. దేశమునందు బళ్లారి, అనంతపురము, కడప, కర్నూలు జిల్లాలలో నల్లరేగడి చాల విస్తారముగా నుండుటను బట్టియు సామాన్యముగ వర్షము కురిసినప్పుడు అందులో నీరు నిలువయుండి చాల కాలము ఉపయోగపడుచుండును. ఈ ప్రాంతాలలో నీరు వాడుకొనుట తక్కువ అను అభిప్రాయము ఉండెను. తుంగభద్రా నీరు ఏర్పడిన నీరు నిలువ చేసినచో ఈనీటిని అక్కడక్కడ సంగ్రహం చేయుటకొరకు కట్టలకు పెట్టవలెననే ఉద్దేశము ఉండెను. నీటిని సాగుచేసుకొనుటకు రైతులకు నీళ్లిస్తూ నీరు లేని జిల్లాలలోనే ఎక్కువ అవసరమనే అభిప్రాయము ఉండెను. కాని కడప-కర్నూలు కాలువ అనుభవమును బట్టి యిది అంత లాభదాయకము కాదని యనిపించును.

ఫామిన్ కమీషను నేర్పడిన కొన్ని నెలలలోనే ఇర్రిగేషనుకమీషను నేర్పడి విచారణలు జరిపెను. వారు కూడ తుంగభద్ర ప్రాజెక్టునుగూర్చి సిఫారసుచేసి వ్రాసిరి.

"తుంగభద్ర ప్రాజెక్టు పూర్తి యయినప్పుడు ఇండియాలో కెల్ల విస్తారతరమములో వ్యవసాయములలో నొక్కటి కాగలదు. దీనిలో వ్యయపరచిన మూలధనానికి ప్రతిఫల ముంటుందని చెప్పుటకు వీలులేదు. కాని ఉపయోగకరమయిన క్షామనివారణ సాధనముగా నుండి అదుచితమయిన రివిన్యూదారులకు తక్కువపడదని మా విశ్వాసము."

ఇర్రిగేషన్ కమీషనువారి యెదుట హాజరయి సాక్ష్యమిచ్చిన ఇంజనీరులలో 'స్మార్టు' చెప్పిన వాక్యములు చిరస్మరణీయములు.

అన్ని జిల్లాలలోను క్షామకాలములో చేయించ నేర్పడిన కార్యప్రణాళికలు పూర్తిగా అసంతృప్తికరములు. క్షామపుపని సంపూర్ణముగా నీటివసతుల పనిపై కేంద్రీకరించుట కవకాశమున్నది. గ్రామపుచెరువులు బావులు వగైరాలన్నిటిని ఈ కార్యక్రమములో చేర్చవలెను. అన్ని పనులు వదలిపెట్టి అధికారులు రోడ్డు పనులకు రాళ్లుకొట్టించుట మారంభించుటము విచారకరము అని గంటకొట్టిన రీతిని ప్రకటించినారు.

౧౯౦౨-వ సంవత్సరము ఫిబ్రవరి ౧౩-వ తేదీని కమీషన్‌వారి ప్రశ్నకు స్మార్టు ఇచ్చిన ప్రత్యుత్తరమును బట్టి తుంగభద్ర ప్రాజెక్టును ఎంత త్వరగా సాధించవలెనని అత డాతురపడుచుండినాడో తెలియగలదు.

"అవును. దీనిని వెంటనే ఆరంభించికావలెను. పునాదులను పరీక్షించుటకు కావలసిన త్రవ్వకపు పనులు క్షామసాంత్వనములో పూర్తి కావలెను."

ఎక్కడి ౧౯౦౨, ఎక్కడి ౧౯౩౮? ఆనాటికిని ఈనాటికిని ముప్పదియేండ్ల అంతర మేర్పడికూడ మన మొక యడుగైనను ముందుకు పెట్టలేదు.

౧౯౦౩—౦౪ లో ఇండియా గవర్నమెంటు వారు క్షామనివారణకు కావలసిన పంటనీటివసతుల విచారణ చేయవలసిన దని ఆజ్ఞాపించిరి. తుంగభద్ర ప్రాజెక్టును విచారించుటకు ప్రత్యేకము సూపరింటెండింగు ఇంజనీ రేర్పడెను. రివిన్యూకు సంబంధించిన వివరాలు విచారించుటకు స్పెషలురివిన్యూ ఆఫీసరు నేర్పరచిరి. ౧౯౦౬—౦౭-వ సంవత్సరమునకు ప్లానులు ఎస్టిమేట్లు తయారు అయిపోయినవి. అప్పటి ఎస్టిమేటు ౧౭ కోట్ల రూపాయలు. నాటియేర్పాటుమేరకు ఈప్రాజెక్టు నేటిరాయలసీమకేగాక నెల్లూరుకుకూడ ఉపకరింపవలెనని ఆలోచించిరి. అది ఇంజనీర్లు ప్లాగుర్కు, స్మార్టులు సూచించినమార్గము. కాని దీనికి ౧౯౧౧ లో మార్పు కలిగినది. నెల్లూరు ఇందులోనుంచి వదలిపెట్టవలసిన దని తీర్మానించినారు. ఎస్టిమేటు ౧౩ కోట్ల రూపాయలకు దించినారు.

ఇంతపనీ జరిగినతరువాత నాటికీ నేటికీ అడ్డము వచ్చే కారణము అడ్డము వచ్చినది. ఇంజనీరు స్మార్టు దీనినిగురించి తనసాక్ష్యములో హెచ్చరించియుండి నాడు. పెట్టుబడిమీద వడ్డీ ప్రతిఫలము గిట్టనిది పంటనీటి వసతిపనులు చేయుటము లేదను రాజనీతి మాటిమాటికిని అడ్డు తగులుచున్నది. అట్లడ్డుతగులనీయరాదు అనిన అతనిమాటను తుట్టతుదకు పైఅధికారులు తుడిచివైచి నారు. ఇటువంటి విషయాలలో అప్పటికాలపు 'సెక్రటరీ ఆఫ్ స్టేటు' అనే ఇండియా కార్యదర్శి దే తుదిమాట. ౧౯౦౯-౧౦వరకు ఉత్తరప్రత్యుత్తరాలు జరిగి ఆసంవత్సరములో తుంగభద్ర ప్రాజెక్టును మానుకున్నా మని గవర్నమెంటువారు ప్రకటించిరి. కృష్ణా కావేరి ప్రాజెక్టులలో ఎక్కువ ప్రతిఫలము కలుగును కాబట్టి వానిని జరుపవలసిన దనినారు. తుంగభద్ర ప్రాజెక్టు ఆరంభించినా పూర్తిచేయడానికి ఇరువదేండ్లు పట్టు ననినారు.

మరి దీనిప్రశంస ౧౯౨౪-౨౫ వరకును రాలేదు; అనగా ద్వంద్వప్రభుత్వవిధాన మని పేరుపడిన డయార్కి యేర్పడి ప్రజలచే నిర్వాచితులయిన ప్రతినిధులును మంత్రులును రాజ్యనిర్వహణాధికారము ఏకొంచెముగ నైనను వహించేవరకూ దీనిమాట ఎవ్వరును తలపెట్టలేదు. తేదీల క్రమమునుబట్టి చూడ తుంగభద్ర ప్రాజెక్టువిషయ విమర్శ నిలుపుదల కావడానికి రాజకీయ కారణాలు కూడ కారణమయినట్టు తోచును వందేమాతర ముద్యమము ౧౯౦౫-౦౬ లలో ఆరంభమయినది, ౧౯౦౯-౧౦ ల వరకు సాగినది. ౧౯౧౪ లో ప్రపంచ సంగ్రామ మారంభమయినది. దానితోనే మన దేశములో హోమురూలుద్యమ ముపక్రమించినారు. దాని ప్రవృద్ధియే డయార్కీగాను, గాంధి యుద్యమముగాను పరిణమించినది. అందువలన బ్రిటిషు అధికారులు పూర్ణ నిరంకుశులుగా నున్నప్పుడు మనమీద ఆగ్రహము జేసినసమయాలలో తామే తల్లి తండ్రి ప్రభుత్వముగా ఏలుచున్నా మనుకొన్నవాళ్లలో గోదావరీ కృష్ణా స్కీములు తయారుచేసినారు. తమపై అసూయ చాలరేగినదని యనుకొనిన దినములలో తుంగభద్ర ప్రాజెక్టువంటివి సిద్ధమయి యున్నవి త్రోసపుచ్చగలిగినచోట త్రోసిపుచ్చినారు.

ఎట్లయిన నేమి? ప్రజలు వోటుచేసి ఎన్నుకొనిన ప్రతినిధులు మద్రాసు శాసనసభలో ౧౯౨౧ నుంచి కూర్చొనుట మారంభమవుతూనే తుంగభద్ర ప్రాజెక్టు సంగతి యేమి యని ప్రశ్నింప నారంభించినారు. అప్పటి కింకను ఇర్రిగేషన్ మంత్రుల స్వాధీనములోనికి రాలేదు. శ్రీ సి. పి. రామస్వామయ్యరుగారు ఎగ్జిక్యూటివు మెంబరుగా పరిపాలన చేయుచుండినారు. తుంగభద్ర ప్రాజెక్టులో వడ్డీనష్టము తప్పదు. సంగమేశ్వరము ప్రాజెక్టయితే వడ్డీ గిట్టుతుందని ఆలోచించి సంగమేశ్వరము ప్రాజెక్టు కొంతవరకు కర్నూలు, కడపజిల్లాలవారిని, ఇతరాంధ్రులను తృప్తిపరచునని కారణముతోనో మరియేమో శ్రీ రామస్వామయ్యరుగారు దానికొరకు కొంత విచారణలు చేయించినారు. కాని ౧౯౨౪-౨౫ లో నైజాము ఆక్షేపించుటముచేత అది ఆగవలసివచ్చినది. అంతట రాయలసీమ ఇర్రిగేషన్ సౌకర్యము లన్నిటిని ఆలోచించడానికి కమిటీ వేయవలసిన దని గట్టిగా కోరడముతో జవాబుదారీ కమిటీకే చెందియుండినీ యని శ్రీరామస్వామయ్యరుగారు ౫-౨-౧౯౨౫ న 'సీడెడ్ డిస్ట్రిక్టుల ఇర్రిగేషన్ కమిటీ'ని ఏర్పరచడానికి అంగీకరించిరి. ఆరోగ్యస్వామి ముదలియారుగారు అధ్యక్షులుగా కమిటీ యేర్పడెను. ౧౯౨౬-వ సంవత్సరములో మొదటిరిపోర్టు - అదే తుది రిపోర్టుకూడ నైనది —— పంపిరి. అందులో నైజాము ఇలాకా మల్లాపురం స్థలములో కాకుండా బ్రిటిషు ఇలాకా తిమ్మలాపురంలో ఆనకట్ట కట్టవచ్చునని తీర్మానించిరి. అదివరలో చేర్చియుండిన నెల్లూరుజిల్లా ప్రాంతాలనీ ప్రాజెక్టులో చేర్చనక్కరలేదనిరి. అనంతపురము, ధర్మవరము తాలూకాలకుగూడ కాలువలు తీసికొనిపోవడాని కేర్పరచిరి. కాని అప్పటి ఛీఫ్ ఇంజనీరు హాకిన్సు ఈ ప్రాజెక్టుతల నరికివైచెను. మొట్టమొదట తుంగభద్ర ప్రాజెక్టునుగురించి యాలోచించిననాటికీ తమనాటికీ పనిచేయించే కర్చులు అపారముగా పెరిగిపోయిన వనెను. సాధారణమైన నీటితీరువలు వేసే లెక్కపెట్టుకుంటే రివిన్యూ మిక్కిలి తక్కువ యగునవెను. సంవత్సరానికి ౫౦ లక్షల రూపాయలు లోటుపడగల దనెను. కాని కొంత ప్రజల యధికారముకూడ కలదని

కాబోలు మొదట క్రిష్ణా ప్రాజెక్టు తీర్మానించి ఈప్రాజెక్టును విచారణలో పెట్టవచ్చు ననెను. గవర్నమెంటు వారుకూడ దీనిని బలపరచిరి. తుంగభద్ర ప్రాజెక్టు కార్యక్రమములోనికి తేవచ్చునా లేదా అనేవిషయములో తీర్మానమునకు రావడము చాలా కష్టమని తీర్మానించిరి. శ్రీ సి. పి. రామస్వామయ్యరుగారు చెప్పిన దేమంటే ఇండియా గవర్నమెంటువారివద్ద ప్రాజెక్టుకయి తీసికొనే అప్పుమీద మేము వడ్డీ యివ్వకుండా తప్పదు కదా, ఆవడ్డీ అయినా గిట్టుబాటు తనిఖీకర్చులు కొంత భరించగలిగితేకదా మేమీ ప్రాజెక్టు ఆరంభించేది అనిరి.

విచారణ జరుగవచ్చుననేమాట ఛీఫ్ ఇంజనీరు చెప్పియున్నందునను, ౧౯౩౭ కడపట కాంగ్రెసుపరముగా శాసనసభను ప్రవేశించిన సభ్యులు నిరంతరము తమ్ముము శాసించుచుండుటచేతను శ్రీ సి. పి. రామస్వామయ్యరుగారు ౧౯౩౮-వ సంవత్సరపు బడ్జెట్టులో తుంగభద్ర ప్రాజెక్టు విచారణకని రు. ౩౫,౧౦౦లను ప్రత్యేక పరచిరి. నాటినుండి నేటివరకు ఈసమస్య పది సంవత్సరాలుగా ఈప్రాజెక్టు ఇంకా విచారణలోనే ఉండడము సంభవించినది. ౧౯౩౯ నుండి ౧౯౩౬ వరకును కాంగ్రెసువారు శాసనసభలను బహిష్కరించుటయు ఈస్థితికి కొంత కారణభూత మయినది.

౧౯౨౬-౨౭లో తుంగభద్రాశాస్త్రజ్ఞు డొకనిని ప్రత్యేకముగా నేర్పరచి ఆనకట్టు కట్టుస్థలమును పరీక్షింపజేసిరి. ౧౯౨౮ జూన నెలలు తీసికొనిరి. ప్రత్యేకముగా విచారణకయి ఇంజనీరు కార్యాలయము నొకదాని నేర్పరచిరి. ౧౯౪౦-వ సంవత్సరము ఏప్రిలు మాసములో ప్రస్తావనుగాగా ప్రభుత్వసభ్యుముగా ఈక్రింది ప్రత్యుత్తరము నిచ్చిరి.

"బహుకాలముగా ఆలోచనలోనుండే ప్రాజెక్టులు రెండు కలవు — కృష్ణా, తుంగభద్రలు బళ్ళారిజిల్లా తిమ్మలాపురములో తుంగభద్రకు ఆనకట్ట కట్టి నీరు నిలిపి ప్రాజెక్టు ఏర్పరచే విషయముమీద దృష్టిని కేంద్రీకరింపజేసి పునర్విమర్శలు చేయుచున్నాము. దీనివలన దుర్భిక్షమునకు చాల యెక్కువగా పాత్రమగుచుండే విశేష భాగమునకు ప్రయోజనము కలుగగలదు. అయిన, ఆర్థిక దృష్టిపథమునుండి కాని శాస్త్ర దృష్టినుండిగాని ఈ ప్రాజెక్టులు జరుగగలవా యను విషయమును గురించి యే అభిప్రాయమును ప్రకటించేస్థితిలో లేము"

స్పెషల్ ఇంజనీరు రిపోర్టు చేయడములో హాస్పేటవద్ద మల్లాపురము స్థలముతో క్రొత్తగా తల పెట్టిన తిమ్మలాపురముస్థలము ఏమాత్రము దీటురాదని నాడు. నీరు ఎక్కువ నిలవచేసకొని బళ్ళారి పడమటి తాలూకాలలో ౫౦,౦౦౦ లకు నీటివసతి చేసుకోడానికి పనికివచ్చు ననినాడు. కాబట్టి సైజాము స్థలములోనే ఆనకట్ట కట్టడము తప్పదని నిర్ణయించుకొనినారు.

అనుదినము మద్రాసు శాసనసభలో నీవిషయము విమర్శకు తెచ్చుచుండుటచేత కర్చు పూర్తిగా పెట్టినా పెట్టకపోయినా పని యెక్కువ జరిగినా జరుగకపోయినా ౧౯౩౮-౩౯లో ఒకప్పుడు రు. ౭౬,౯౨౦ లవరకు అలాటుమెంటు కోరినారు. ౧౯౩౯-౪౦ లో రు. ౧,౫౩,౬౦౦లు బడ్జెట్టులో ఈ ప్రాజెక్టు విచారణ కర్చులక్రింద శాంక్షను తీసికొనినారు. కృష్ణా, గుంటూరు, కడప, కర్నూలు, బళ్ళారి, అనంతపురము జిల్లాల కలెక్టరులనుండి రిపోర్టులు తెప్పించినారు. ప్రాజెక్టు ఆఫీసరు ప్రత్యేకముగా రిపోర్టు సిద్ధముచేసినాడు. పదునేను లక్షల ఎకరాలకు ప్రాజెక్టు పనికివచ్చు నని నారు. గుంటూరులో ఏడులక్షలు, బళ్ళారిలో ౫ లక్షలు, ఇతరజిల్లాలలో ౫ లక్షలు నీరు పారునన్నారు. రాయల సీమలో ౩ లక్షల ఎకరాలు పారుదల భుంజీగా ఏర్పడ గల దనుకొనినారు.

౧౯౩౧-వ సంవత్సరములోగూడ సైజాము ప్రభుత్వముతో ఉత్తర ప్రత్యుత్తరములు జరుగుచుండినవి. ౧౯౩౪లో నొకప్రశ్నకు ప్రత్యుత్తర మిస్తూ మద్రాసు ప్రభుత్వమువారు మెట్టూరుప్రాజెక్టు పూర్తి యగు లోపల తుంగభద్రవిషయవిమర్శ పూర్తిచేయుట తమ యుద్దేశమనియు, మెట్టూరులో ఉపయోగించిన యంత్రాలులు తుంగభద్రకు ఉపయోగింపదలచితిమనియు చెప్పిరి. మెట్టూరు పూర్తియయినది. యంత్రములు త్రుప్పుపట్టినవి. ఎచ్చటనున్న రాయలసీమ అచ్చటే యున్నది. సైజామువిషయములో నాడు విమర్శించుచు సైజాము దేశపులెవలులనుబట్టి వారు తుంగభద్రనీటికిగాను అత్యాశ పెట్టుకోడానికి రాదుకాబట్టి వా రెంతకోరితే అంతా

యిచ్చివేయవచ్చు నని ఆరోగ్యస్వామిముదల్యారుగారు చెప్పిరి. ఎవ్వరేమిచెప్పినా ప్రభుత్వములో ఉండేపండితులు తమ చేవవారిక్కను తమ స్వస్థానికి వచ్చినప్పుడు పలికేవరకూ ఏపనికిను సాగదుకదా!

౧౯౩౨లో "ప్రాథమికమైన స్కీము సిద్ధమయినది, ప్రాథమికమైన ఎస్టిమేట్లుకూడ తయారైనవి. కాని "మేము ముందుకడుగు వేయలేము; నైజాము, మైసూరు, బొంబయిలతో సమాధానము కుదురవలసియున్నది" అని కాంప్‌బెల్ గారు అనిరి. ౧౯౩౩-వ సం.ము ఫిబ్రవరి, మార్చిమాసములలో నైజాము, మద్రాసు ప్రభుత్వముల అధికారుల సమావేశములు జరిగినవి. తాత్కాలికముగా తీర్మానాలు చేసుకొనినారు. మెకెన్జీ సిఫారసు చేసి బెంటల్ అంగీకరించిన మల్లాపురమే స్థలమని స్థలనిర్దేశము చేసినారు. ప్రాజెక్టుకర్చు తలకు సగముగా రెండు ప్రభుత్వములును భరింపవలసినదనీ, నియమితమైన మైమితికి లోబడి ఇరువారలవారు నీరు తీసికోవలసినదనీ, పెద్దకాలువలు, పిల్లకాలువలు, పంటకాలువలు ఏ ప్రభుత్వప్రాంతానికి సంబంధించినంతవరకు ఆ ప్రభుత్వము త్రవ్వించుకోవలసినదనీ అనుకొనినారు. ఆనకట్టవలన ఏర్పడే జలాశయములో నిలిచేనీరు లెక్క వేసికొనినారు. క్రొత్తఆనకట్టజాగాకు క్రిందుగా ఇప్పుడు ఉండే నీటివసతి విషయములో ఏమి యేర్పాటు జరుగవలెననే విషయము ఆ ఏర్పాటులకును నీళ్ల పంపకములో ఒక్కొక్క ప్రభుత్వానికి కలిగే సదుపాయాలకును ఏలాటి సంబంధము ఉండవలెననే విషయము ముందుకు ఆలోచించుకొనుటకు నిలిపినారు ౧౯౩౩ అంతములో మళ్లీ సమావేశము జరుగవలసి ఉండినది. కాని అప్పటికి నైజాము, మైసూరు, బొంబయిలలో ఇప్పుడుండే అనుకూలాల వివరాలు ఆ ప్రభుత్వాలవారు ఆలోచించిన ఇతర ప్రాజెక్టుల వివరాలు పూర్తిగా చేరనందున ఆలస్యమయినది. సూక్ష్మముగా ప్లానులు ఎస్టిమేట్లు ఇదంతా తీర్మానమయిన వెనుకగాని ఆలోచించడము కుదురదుకదా అని మద్రాసుప్రభుత్వమువారు ప్రజాప్రతినిధుల నోదార్చినారు. ౧౯౩౪ సంవత్సరాంతమునకు నైజామువారికిని, మద్రాసుప్రభుత్వమువారికిని సమాధానము కుదురలేదని వార్త వినవచ్చినది. ఇండియా గవర్నమెంటువారు పంచాయతిదారును వేస్తారా అనేది తరువాత ప్రశ్నగా చేర్పడినది.

౧౯౩౫ జనవరిలో మాట్లాడుతూ నాటరు గారు అన్ని ప్రాజెక్టులలో తుంగభద్ర ప్రాజెక్టొకటని తక్కిన ప్రాజెక్టులను తామాలోచించుచున్నామని చెప్పినారు. కాని మార్చిలో తుంగభద్రకు రెండటిపూక్క కలదన్నారు. ౧౯౩౬-వ సంవత్సరము ఆగష్టు నాటికి కూడ మైసూరు, హైదరాబాదు, మద్రాసు ప్రభుత్వములమధ్యన యేర్పడినతగాదా ఇండియా గవర్నమెంటువారితో ఉత్తర ప్రత్యుత్తరములలోనే యుండినది. ఆకాలములో మైసూరు, హైదరాబాదు ప్రభుత్వములతో చేరి నీటికొలతలు తీసికొనడము జరిగినది. వ్యవసాయపుడిపార్టుమెంటువారు ప్రాజెక్టుప్రాంతములో భూసారపరీక్ష తీవ్రముగా జరుపుచుండినారు. వేరు వేరు పంటలకు అవసరమయ్యే నీటిపరిమాణముల పరిశీలనయు జరుగుచుండినది.

క్రొత్త గవర్నమెంటు ఆఫ్ ఇండియా యాక్టు అమలులోకి రావడముతో పంటనీటి వసతులకు ఇండియా గవర్నమెంటుకును సంబంధము తప్పినది. నీటివసతియంతయు ప్రాంతప్రభుత్వాధీనమయినది. కాంగ్రెసు మంత్రివర్గమువారు అధికారములోనికి వచ్చిన పిదప ౧౯౩౮—౩౯ లో నీటికొలతలను సాగించడానికి సిరుగుప్పలో పంటలను పరిశీలించు ప్రయోగాలకు ౧౯౩౮-౩౯ బడ్జెట్టులో కొంతసొమ్ము శాంక్షన్ చేసుకొన్నారు. ౧౯౩౯-౪౦ లోను ఈ పనిని సాగించినారు. ఈ సంవత్సరము మార్చిమాసములో అడిగితే మైసూరు, హైదరాబాదులకును తమకును ఇంకను మాటలు జరుగుచున్నవని ప్రత్యుత్తరము చెప్పినారు. కాని వీరింకను ఈ ప్రశ్నను గట్టిగా విచారించినారని అనుకొనడానికి వీలు లేదు. అధికారమునకు వచ్చి ఏడాదికూడ కాలేదు గాబట్టి వ్యవధి యియ్యవలసియుండునని కోరుకోరుట ఇతర సందర్భాలలో వినుచున్నాము. పట్టుబట్టి తుంగభద్రవిషయమయి విచారించినా ఇదే ప్రత్యుత్తరము కలుగుననడం సాధారణదృష్టిగలవారికి తోచును. వ్యవధి యివ్వవలదని నేననను. కాని ఈ విషయమేమో సమగ్రముగా అర్థము చేసికొని ఇందులో తామవలంబించదలచు

కొనిన కార్యశీలత లేనో యిప్పటికి వీరు స్పష్టముగా ప్రకటించి యుండవలసినది. సి. పి. రామస్వామయ్యరుగారు చెప్పినట్లు ప్రతిఫల మిచ్చే ఇరిగేషన్ ప్రాజెక్టులనే వీరు సాగింతురా? ప్రతిఫలము రాకపోయినా [illegible]మసందర్భము కవసరమైన పనులు చేయింపరా? నిజముగా ఈ యిరువది రేండ్లుగా [illegible] లివ్వబడు లోను, కర్చుపెట్టి [illegible] కొనిన ప్రభుత్వమే తుంగభద్రా ప్రాజెక్టుకు సంబంధించిన ప్రత్యేకపనులమీద కర్చుపెట్టి ఉంటే [illegible] ఇప్పటికి పని యాయి పోయియుండును. మైసూరు ప్రభుత్వమువారు పంచవర్ష ప్రణాళిక కార్యక్రమానికి యిచ్చే '[illegible]' వంటిపని పన్ను విధించి [illegible] కాని కొనసాగించుచు ప్రాజెక్టుకూడా [illegible] ప్రాంతపు వారు పనిచేయవలసినది, [illegible] సంవత్సరానికి [illegible] ౧౭ [illegible] లో పన్ను [illegible] నియామించి తుంగభద్రప్రాజెక్టుపని చేయుచు [illegible] కొంతపని [illegible] లేదు. ఇట్టిపనులు [illegible] ఉత్సాహము, సాహసము, త్యాగము, ధైర్యము కావలెను. స్వదేశీ [illegible]లుకాని బ్రిటిషు నిరంకుశాధికారులు [illegible] నుంచి [illegible] గాలు పుట్టినా ప్రజలలో ఏమి [illegible] పుట్టి — అంతే [illegible] సంఘటిత తప్పని [illegible], [illegible] వర్గాల [illegible] నష్టదృష్టిచేత [illegible] పుట్టి — తమ కేంద్రాలో [illegible], తమ [illegible]సౌభాగ్యాలకూ, ప్రాబల్యానికి [illegible] యని సాహసించి కార్యమును [illegible]యినారు. తమబలమును పెంచే రైతుల [illegible] వృద్ధిలు నూటికి సంవత్సరానికి [illegible] గిట్టకపోతే సర్కారు ప్రత్యక్షములోనుండి [illegible] రూపాయల వంతున సంవత్సరము సంవత్సరము కోట్లకొలది [illegible] గట్టినారుగాని నీటివసతి దగ్గరకు వచ్చినప్పటికి నూటికి సంవత్సరమునకు రూ. ౧౮ — ౯ లకు తక్కువకాకుండా గిట్టునా గిట్టదా యని లెక్కచేయుచు వచ్చినారు. ఆ సాములో తమ తేయాకుతోటలలో పని చేయడానికి కూలీలపై నిర్బంధశాసనాలు చేసినారు. ఇక తమ కొద్దవ జీతాలూ, తమసైన్యాల కెక్కువకర్చులూ కావలసివచ్చినప్పుడు ప్రజలమీద విధించిన దండుగ పన్నులమాట వివరింపనే పనిలేదు. ఏనాడో రావ్వరో చెరువులు వగైరాలు వేయించిపోయి తమకు నీటితీరువ రైతులవల్ల వచ్చేభాగ్యము పట్టినా అట్టి చెరువుల రిపేరీలూ, వాటి కాలువల రిపేరీలూ వగైరాలకు తమ ఆదాయములో నుంచి కర్చుపెట్టడమున కంగీకరింపక కుడిమరమ్మతనే పేరిట నిర్బంధపుకూలి రైతులచేత చేయించుచునేవచ్చుచున్నారు. కాని గ్రామారోగ్యానికి సౌభాగ్యానికి పనికి వచ్చే ఉమ్మడి పనులకుగాని, తుంగభద్రా ప్రాజెక్టు వంటి అనన్యసాధ్యమయిన గొప్ప ప్రజోపయోగకర కార్యములకుగాని వారు ప్రజలను నిర్బంధపరచి పని చేయించేమాట తలపెట్టలేదు. ప్రభుత్వము లేదనే కారణ[illegible]చుచూ ప్రజోపయోగ, ప్రజాభివృద్ధికర [illegible]మును కుంటుపడజేసినారు. సంపూర్ణస్వాతంత్ర్యము మనకు కలిగినా కలుగకపోయినా కోస్తాలలో మనమంత్రులు స్వతంత్రులుగనే రాజ్యమేలుచున్నారు.

రాయలసీమవాసులు 'తుంగభద్ర ప్రాజెక్టు' విషయమున నోరుతెరచికొని వేచియున్నారు. క్షామముల పాలయి కృశించుచు ఉండుజిల్లాల కీయాశ అనంతకాలముగా అధికారమునందుండువారు పెట్టుచువచ్చినారనుట పైన చెప్పిన వివరణమునుబట్టి అర్థమయియుండగలదు.

ఆంధ్రరాష్ట్రవిభాగసమస్యలో కూడ దీనికొకవిధమయిన ప్రస్తావము కలిగియున్నది. ఆంధ్రరాష్ట్రము ఏర్పడినయెడల ఈప్రాజెక్టువిషయమున ఎక్కువ దృష్టి కేంద్రీకరింపజేయవచ్చు ననుకొనువారలలో నే నొకడను. కాని ఒకవైపున దీనికొరకాంధ్రరాష్ట్రము వచ్చి తీరవలెననిగాని, ఎదురువాదముగా ఆంధ్రరాష్ట్రము నేడు సాధించినయెడల ఈప్రాజెక్టు జరుగదనిగాని వాదించుట నాకు సమంజసముగా తోచదు. వెంటనే ఆంధ్రరాష్ట్రము కోరుటకు నాకుగల కారణము వేరు. దేశభాషలో వ్యవహారము జరుగుట నిజమగు ప్రజాధికారమునకు మొదటి మెట్టు. రాజ్యమేలువారెవరైనా, పై దర్జాచదువులు చదువుకొనేవారికి సామాన్యభాష ఏదిచేర్పినా, యేది వదలినా, ప్రజల మాతృభాషలో సర్వపరిపాలనను నడపకపోతే నిజమగు ప్రజాపరిపాలనకు తావుండదు. నిజమగు ప్రజాపరిపాలన సాధ్యమయినప్పుడే 'తుంగ

భద్రా ప్రాజెక్టు' బోటిప్రాజెక్టులు సఫలతరముగా జరుగును. అంతవరకును మనకు అడ్డము దగిలే స్వలాభపరిత్వాలు అడ్డము తగులుచునేయుండును. అవి స్ఫుటము గానప్పుడు ఉదారహృదయులయిన అధికారులు తమ హృదయావేదనను తెలిపినప్పుడు మనకు ఆశ తోచుట, అవి స్ఫుటమయినప్పుడు మనకు నిరాశ జనించుట తప్పదు. రమారమి నలువదియేండ్లుగా తుంగభద్ర ప్రాజెక్టువిషయమున జరిగిన విషమపరివర్తన మంతయు దీనికి తార్కాణము. క్షామములలో పనిచేసినవారును, క్షామవార్తలు విచారించి చదివినవారును నైన అధికారులను బహుటివారును తుంగభద్ర ప్రాజెక్టు వల్లనష్టమును కలుగజేసేదియైనా వెంటనే జరుపదగిన దనినారు. అయిన నధికారము వహించి ద్రవ్యపుబరువునకు జవాబుదారీ కావలసిన పరిపాలకులు ఏదో యొకసాకు పెట్టి ఆలసించుచు నేటివరకును లాగుకొని వచ్చినారు. ౧౯౦౮-వ సంవత్సరములో 'ఇంపీరియల్ గెజటీయర్ అఫ్ ఇండియా' అనే గ్రంథపరంపరను ప్రకటించునప్పుడు తత్కర్తలేమనిరో చూచిన నెట్టివారికిని తరువాతికార్యక్రమమునుసరించి విషాదము కలుగకపోదు. 'హాసపేటవద్ద తుంగభద్రకు ౧౨౫ అడుగుల ఆనకట్ట కట్టితే ౧౬౦ చదురపుమైళ్లతటాక మేర్పడును. అది నైలునదిమీదకట్టిన 'అసవన్' తటాకమునకు రత్తి రెట్లు పెద్దదిగా నుండగలదు. అట్టిది విచారణలో నున్న' దనిరి. తుంగభద్రప్రాజెక్టు నేడు నిజము కావలసియుంటే ముఖ్యముగా నుండదగినయుపకరణము భల్లూకపు పట్టుతో దీనిని సాధించివదలుదుమను పరిపాలకవర్గము కావలెను. రూపాయలణాలలో లెక్కవేసికొను ప్రభుత్వము — ఆంధ్రరాష్ట్రప్రభుత్వ మయినా, కాంగ్రెసుప్రభుత్వ మయినా, మరి యేప్రభుత్వ మయినా — ఈపనిని కొనసాగించుట కష్టమగును. అవశ్యకమైనయెడల ఏయేప్రాంతాల కీప్రాజెక్టు ఉద్దిష్ట మయినదో ఆయాప్రాంతాలలోని సర్వప్రజలను నిర్బంధపరచి వారిచేత వారమున కింతకాలమను నియమముతో ఉచితముగా పనిచేయించుటకు తగినశాసనము చేయుటకుగూడ సిద్ధపడే ప్రభుత్వ మయిననే ఈపనిని నిర్వహింపగలదు. అట్టిపనిని చేయడానికి ఇష్టపడని గృహస్థులవద్దనుండి బరువైన పన్ను వసూలుచేయుటకుగూడ ఆప్రభుత్వము సిద్ధపడవలెను. బలమైన భారతకేంద్రప్రభుత్వ మేర్పడినప్పుడు అన్నిప్రాంతముల ద్రవ్యమును ఈపనికి వినియోగింతు రనుకొనువారుండవచ్చును. ఇండియాలో రాయలసీమవలె క్షామ మనుభవించురాష్ట్రము లనేకము లున్నవి. ఇన్నిటిని కేంద్రప్రభుత్వమువారు తలగరింపలేరు. అదియునుగాక ప్రాంతప్రభుత్వాలు కేంద్రప్రభుత్వానికి అట్టి అధికారము లిచ్చెద రనకొనుటకును అవకాశము లేదు. మరి కొందరు మిత్రులు తమిళ కర్ణాటక మలయాళసోదరులతో కలిసియున్నచో తుంగభద్ర ప్రాజెక్టును వారు కూడ భరించి మనకు మేలు కలుగజేయుదు రనుకొనువారున్నారు. ఇది వట్టిభ్రమ. ఇదివరలో వివరించిన చరిత్రనుబట్టి అది స్పష్టమయినది. నాడు శ్రీ సి. సి. రామస్వామయ్యారు చేసినదే నేడితరులు చేయగలుగునది.

నిజముగ ఈసమస్యాపరిష్కారము రాయలసీమప్రజల ఉత్సాహకార్యశక్తులమీదనే ఆధారపడియున్నది. ఆసీమలోని ప్రతిగ్రామములోను సభలు జరుగవలెను. ఒక్కొక్క యూరివారును 'తుంగభద్రా ప్రాజెక్టువిషయమునందు తమశక్తికి తగినయంత కష్టము చేసి ప్రభుత్వమునకు తోడ్పడెదము' ఆభయము ఇయ్యవలెను. తమ అన్నదమ్ములను తమ యక్కచెల్లెండ్రను సంరక్షించుకొనుటకు తాము నెరవేర్చుకొనే యింటిపని యిది యని లోకమునకు స్పష్టపరచవలెను. తమ యాత్మవిశ్వాసమును తాము ప్రకటించినప్పుడు ఏప్రభుత్వము అధికారములో నున్నా అందులో ముఖ్యముగా కాంగ్రెసుప్రభుత్వము అధికారములో నున్నప్పుడు — ఈ ప్రాజెక్టు నిశ్చయము కావడమునకు అనుమానముండదు. మామట్టుకు మేము నిద్రింతుము, మేము పేదలము, బీదలము, మీ రప్పు తెచ్చి అమర్చి బరువులు మోసికొను డని ఇతరాంధ్రులను కోరినా ఈ పని జరుగదు. అరవలను తదితరులను కోరినా ఈ పని జరుగదు. వా రందరిమీదను ఈర్ష్యను పెళ్లగ్రక్కుకొనినను జరుగదు. నిజాంవా రంగీకరించినా, మైసూరువా రంగీకరించినా వారివారి ప్రాంతాలలో ప్రభుత్వాలు నిరంకుశముగా ప్రజలచేత పని చేయించడానికి అవ

కాశా లున్నవి కాబట్టి అంగీకరిస్తారు. పూర్తి కార్యక్రమము దగ్గరకు వచ్చునప్పటికి వాయిదా వేసేది మన ప్రభుత్వమే అవుతుంది. ఇదివరలో బ్రిటిషు ప్రభుత్వమువారు నిర్బంధపు హాలీపద్ధతి పెట్టితే తాము ప్రజల యసంతృప్తికి ఆజ్యము పోసినట్లవుతుందని మనం తమమాటే ఉన్నా స్వేచ్ఛగా మనకయి పెద్ద బరువు జవాబుదారీ పెట్టుకోడానికి ఇష్టములేకను ఈ ప్రోజెక్టును త్రోసివేస్తూవచ్చినారు. నేడు అధికారములో ఉండేవారును రాబోయేవారును వేరేవేరే ప్రాంతాలనుంచి వచ్చే ప్రజల ప్రతినిధులు మనపై వుఠంచి తగినంత ఆందోళన యుండి మనలాభానికయి మనము పడవలసిన కష్టనష్టములను అనుభవించడానికి సిద్ధముగా నున్నా మనడము వారి ప్రజలకు స్పష్టపడి వారు స్వేచ్ఛగా మనకు తోడ్పడే మనోభావమునందుండేనేగాని యీ ప్రతినిధులుపైకి మనయందంత యనురాగము కనుపరచినా వారి ప్రజ లిచ్చే పన్నులపై గట్టిబరువుపడే ఇట్టి ప్రోజెక్టు నిర్వహణానికి సిద్ధపడుదురని అనుకొనడము గొప్పపొరపాటు. కాబట్టి నేటి రాయలసీమవారి జవాబుదారీ చాల యెక్కువ. జిల్లాబోర్డులు, పంచాయితీలు, మునిసిపాలిటీలు, కోఆపరేటివు సంఘములు, కాంగ్రెసు సంఘములు, రైతుసంఘములు, యువకసంఘములు, గ్రంథాలయములు, స్త్రీసమాజములు, వర్తకసంఘములు, మస్లిముల అంజుమానీసంఘములు, దేవాలయముల కమిటీలు, ఇతర ప్రజాసంస్థలు అన్నియు మేల్కొని మొదట తుంగభద్రప్రోజెక్టుకథను తమలో తాము చదువుకొని ప్రజాసామాన్యమునకు చదివిచెప్పి రాయలసీమ ఎట్టి త్యాగమునకు నైనను వెనుదీయ దనుటను స్పష్టపరచవలెను. నీటిసాధారము లేర్పరచడము పుణ్యకార్యములలో ఉత్తమపుణ్యకార్యము కాబట్టి దేవాదాయ ధర్మాదాయములలో కొంతభాగము తుంగభద్ర ప్రోజెక్టుకయి ప్రత్యేకించే తీర్మానాలు స్వేచ్ఛగా తత్తదధికారులు చేయడముకూడ మంచిది.

రాయలసీమ ఇర్రిగేషన్ కమిటీని పునరుద్ధరించి యీ కార్యక్రమము నంతా రాయలసీమ నడుపుకోగలిగితే తుంగభద్రప్రోజెక్టు మనలను సమీపించును; లేదా కమీషన్లు, కమిటీలు, రిపోర్టులు, ప్రశ్నలు, ప్రత్యుత్తరాలతో కాలహరణ మగుచుండునని పదునైదేండ్లుగా ఈ విషయపరిచయము చేసికొనిననాకు తోచిన నమ్మిక.



15. 10- 13

సబితాదేవి

"సంపత్"

౧

ఓ మధురకల్యాణవాణీ!
ఓ ప్రావృషేణ్యాభ్రవేణీ!
మృదు
మాధురీ
సుధా
సరిదంతర స్వనిత
దివ్యగానమ్ములో
నీగళమె, నీగళమె
నీసుధాలాపనమె —

౨

ఓ తారానవరూపిణీ!
ఓ నాట్యకలాకలాపినీ!
భావ
బంధుర
కవన
కల్యాణి ఋతురాణి,
చూపులో, ఘెంగల్వరేకులో
వేణోకరాకలో
నీచూపె, నీచూపె
నీ కేకరాక్షమ్మె —

౩

ఓ దివ్యవర్చస్వినీ!
ఓ భాగ్య తేజస్వినీ
నీ
౧ "లతా" భినయానుకూల
తామృతహస్త
నీ
౨ "మధూరిక"
సుప్తజీవితమ్ములు కదిపె
నీ
యశశ్శృంగార
పారిజాతము నిలిపె
నీ
కీర్తి నర్తకీ కింకిణులు
వినిపించె —
హే తారానవరూపిణీ
హే నాట్యకలాకలాపినీ —

---

౧. "జీవన్‌లత"లో లత.

౨. "డాక్టర్ మధూరిక"లో మధూరిక.

సుందరి-మణి

డాక్టరు అప్పరాజు శేషగిరిరావు

మనిషికో అలవాటు! నాకూ సుందరికీ మొదటినుంచీ ఒక చిన్న అలవాటు—ప్రొద్దున్నే కాలోచితాలు అయినతర్వాత నాకు తలకు నూనె రాయటం, నూటం దువ్వటం, రిస్టువాచీ కళ్లజోడూ అన్నీ వరసగా చేతికిస్తూవుండటం, టాయిలెట్ పూర్తిచేసుకొని నేను బయలుదేరేటప్పుడు 'నా సంగతులు నా కేమిటన్నట్టు' ఒక్క వోరచూపు చూడటం, ఒక్కముద్దు పుచ్చుకుని నేను గడిగడప దాటటం! - ప్రొద్దున వ్యాహ్యాళికి దిగేటప్పుడేగా సాయంత్రం టెన్నీసుకు వెళ్లేటప్పుడేగా యీ సర్వీసు చెయ్యటం, ఆ ముద్దులు కొనియ్యటం, యిదీ క్రమం తప్పని అలవాట్లు! కొంచెం కాలానికి కొత్త యేడిపిస్తామని పొద్దుటి మామూలు యెగకొట్టినా?— అసలంతా వడ్డీతోసహా సాయంకాలం వసూలుచేసేం దన్నమాటే!

పురిటికని నెలరోజు లయింది మా అత్తగారు సుందరిని పుట్టింటికి తీసుకుపోయి. తిరిగి వచ్చి వారం రోజు లయింది. ఆ రోజు శనివారం, సాయంకాలం. సాయంత్రం కాఫీ తీసుకుంటూ 'కొత్తరికార్డు కొన్నాను చూశావా సుందరీ!' అన్నాను. 'యెంకివంటి పిల్ల రికార్డు అయిందట కొన్నారా లేదా?' అంది. 'మాడు మరి? కొన్నానో లేదో!' అన్నాను. ఫోను తెరిచి కొత్త ప్లేట్లు ట్రయి చేస్తోంది. వీధిలో మల్లెపూలకేక వినపడింది. ఆ కేకకు సుందరి చెవులు యెప్పుడూ పాము చెవులే. పిల్చి యిన్నిపూలు కొనుక్కుంది. ప్లేటు మారుస్తోంది. మధ్యమధ్య నాకు కావలసినవి అందిస్తోంది. నా టాయిలెట్ పూర్తయింది. మామూలు 'ముద్దు' చెల్లించాను. కాలు బయటపెడ్తున్నాను......

'పాత బాకీ మాట?'

'యింకా లిమిటేషన్ పట్టలేదా?'

'మరీ అన్యాయం! నెలరోజులకే లిమిటేషనా?'

'......ఒకటి......రెండు! బాకీ అంతా రద్దు' అన్నాను. కాలు బయటపెట్టాను......

ఫోను 'యెంకివంటిపిల్ల లేదోయి లేదోయి! యెంకి నావంకింక రాదోయి రాదోయి'

ఫోను టక్కున ఆపేసింది సుందరి!!

అకస్మాత్తుగా వెన్నుమీద యెవరో చరిచినట్టు మనసులో యెట్లాగో అనిపించింది.

ఇల్లు విడిచి క్లబ్బుకు వెళ్లిన వ్యవధేలేదు. టెన్నీసు సెట్టు మొదలెట్టి పదినిమిషా లయిందో లేదో యింటి దగ్గిరనుంచి మానాన్నగారు స్వయంగా వచ్చారు 'కోడలికి సుస్తీగా వుంది, ఒక్కసారి యింటికిరా' అని. సెట్టులో స్నేహితులకు క్షమాపణ చెప్పుకుని, రేకెట్టు అక్కడ పడేసి, స్టాండుమీదికోటు భుజంమీద వేసుకుని బయలుదేరి వస్తున్నాను. మానాన్నగారు 'కోడలికి వాంతయింది. నీళ్లోసుకున్న మనిషిగదా అంచేతేమో అనుకున్నా' అంటున్నారు. ఇంటికీ క్లబ్బుకీ రెండువందల గజాలకంటె యెక్కువవుండదు. నాలుగంగల్లో యింటి వద్ద వాలాను. సరాసరి గదిలోకి వెళ్లాను సుందరికోసం. సుందరి లేదు. గది శూన్యంగా వుంది. గులిపివేసినపక్క చెదరనేలేదు, ప్రక్క ప్రక్కగా పెట్టిన జోడుదిండ్లూ నెసకనేలేదు, జడేసుకుని మొహం రుద్దుకున్నాక పెట్టుకుందామని పూలుతో కట్టిన కత్తెరచెండు తెల్లటిపక్కమీద మొగ్గవిచ్చుతూ విచ్చుతూ కలకల నవ్వుతోంది, అరగంటనుండు మ్రోగిన గ్రామఫోనుమూత అట్లా తెరిచేవుంది, సుందరిమాత్రం గదిలోలేదు. —పడమటింట్లోకి వెళ్లిచూస్తే దొడ్డిగడపదగ్గిర కూర్చున్న మాఅమ్మ, మాఅమ్మఒళ్లో తలకాయ పెట్టుకొని మాసుందరీ!

'యేమిటిది' అని అడిగా. మాట్లాడలేదు. సగం యెత్తినకళ్లతోనూ, కొద్దిగా కదిల్చిన చేత్తోనూ సంజ్ఞ మాత్రం చేసింది సుందరి 'వెళ్తున్నాను' అనే అర్థం యిచ్చేటట్టుగా. చెయ్యిపట్టుకుచూస్తే నాడిలేదు. చల్లగా కలప కొయ్యల్లే వుంది. ఛప్పున డిస్పెన్సింగురూములోకి వెళ్లి

కస్తూరియిన్‌జక్షన్ సిరెంజిలోకి యెక్కించుకువచ్చాను. నీళ్లోసుకున్న మనిషిగదా అని స్ఫురణకువచ్చి 'నాన్నగారూ! వెళ్లి లేడీ డాక్టరును పిలుచుకురాండీ' అన్నాను. మానాన్నగారు గడపదిగారు నేను యిన్‌జక్షన్ యివ్వటానికి సుందరిచెయ్యి నాచేతులోకి తీసుకున్నాను... ...ఉచ్ఛ్వాసనిశ్వాసాలు ఆగిపోయినయి..... ఇన్‌జక్షన్ యిచ్చాను......స్టెతస్కోపు గుండెలమీదపెట్టి చూచాను......గడియారం ఆగిపోయింది..... చీకటి! ......కారుచీకటి!!................ పదినిమిషాలకల్లా లేడీడాక్టరును వెంటపెట్టుకొని మానాన్నగారు వచ్చారు. దొడ్డిగడపలో తను చూచి వెళ్లినకోడలు వొడ్డివాకిట్లో క్రిందపడుకో పెట్టబడివుంది. చుట్టూసుమారు వందమంది మూగారు. కొందరు పాముకాటేమో అని మంత్రిస్తున్నారు. కొందరు కప్పనాకుడేమో అంటున్నారు. లేడీడాక్టరుకూడా స్టెతస్కోపుతో చూచింది. పెదవి విరిచి జబ్బ యెక్కించింది...సడెన్ హార్టు ఫెయిల్యూర్ అంది!......అయిపోయింది!......జ్యోతి ఆరిపోయింది! నాకున్న కొంత ఆశాకూడా అడుగంటిపోయింది! నేనింకా నిరీక్షిస్తున్నా ఒకవేళ లేడీడాక్టరు వచ్చి 'డాక్టర్! నీస్టెతస్కో పేమన్నా చెడిపోయిందా? చక్కగా హార్టుబీట్సు వినపడుతున్నయే నాకు!' అంటుందేమో అని. ఆ ఆశకూడా నిరాశఅయిపోయింది. హార్టు ఫెయిల్యూర్!...సుందరిహార్టు ఫెయిల్యూర్!...

ఎప్పటికైనా గుండె ఆగకపోతే ప్రాణమే పోదు. ముందుహృదయస్పందనముఆగి తర్వాత ఉచ్ఛ్వాసనిశ్వాసాలు ఆగిపోతే —సడెన్ హార్టు ఫెయిల్యూర్. మాసుందరికి అట్లా కాకుండా యథావిధిగానే జరిగినయి —ముందు లంగ్సు, తర్వాత హార్టు! ఊహింపలేకుండాను, ఆకస్మికంగామాత్రం జరిగినయి. కారణం కనుక్కోటానికి సావకాశం లేకుండామాత్రం క్షణాలమీద జరిగిపోయినయి. అందుచేత యిది 'చావు' అని 'మరణం' అని నాకు అనిపించలేదు. పరలోకప్రపంచానికి అర్జంటు 'కాల్' వస్తే అకస్మాత్తుగా వెళ్లిపోయిందేమో అనుకున్నా. యెప్పటికైనా కలుసుకోలేకపోతానా, చూడలేకపోతానా అని నాగుండె నాకు నిబ్బరం చెప్పతోంది. కాని ఆలోచించినకొద్దీ యీఆరేళ్లనుంచీ అనుభవించిన 'హాయి' అంతా 'మాయా?', సుఖాలన్నీ వట్టి స్వప్నాలా? నిజంగా జరిగినట్టు కన్పించినసంగతులన్నీ శుద్ధ అబద్ధాలా? కనబడిన ఆరేళ్లూ కలా లేక యీ ఆరు నిమిషాలూ కలా? అసలు పోయింది నాసుందరా లేక నేనా? యిట్లా అనేకప్రశ్నలు లోపలినుంచి వస్తున్నయి గాని జవాబులు లోపలినుంచీ రావటంలేదు, బయటనుంచీ రావటంలేదు. మొత్తంమీద నేను ఆరునిమిషాలకన్న యెక్కువ పట్టలేదు. తెర పడిపోయింది!....ఒకఅంకం సమాప్తమయిపోయింది!......

అరగంటక్రింద ఆగినఫోను —'యెంకినాకం కింక రాదోయి రాదోయి'.

నాలోంచి — ఆఁ! రామా!...రామా!......

మళ్లా ఫోను —రావోయి!...రాదోయి!

అంతే! ఫోను మళ్లా పలకలేదు.

యాభైయేళ్ల మాతండ్రినీ, నలభైయేళ్ల తల్లినీ నేనే వోదార్చాను, వేదాంతం ముక్కలు చెప్పి కాదు; వేదాంతం నాకు రాదు కూడాను. 'అయిపోయిందిగదా! వూరుకోండి యేం చేస్తాం?' అన్నాను. అంతే. నన్ను వోదార్చవలసిన అవసరం యెవ్వరికీ కల్గించలేదు. నాకు కంటివెంట నీరే రాలేదు. మనసులో విచారిస్తున్నానో లేదో యెవరికీ తెలియదు. అసలూ మనసులో విచారిస్తున్నా ననుకున్నా నన్ను వోదార్చటానికి నేను విచారం సూచిస్తూ మాట్లాడితేగా?

అప్పటికి వైద్యం ప్రాక్టీసు ప్రారంభించి సుమారు అయిదేళ్లు కావచ్చింది. యెన్నోసార్లు ఉచ్ఛ్వాసనిశ్వాసాలు లేకుండా భూపతనమవుతూ వచ్చిన శిశువులను చూచాను, కాసేపటికి క్యారు-క్యారు మనటమూ చూచాను, గాలి పీల్చటమూ చూచాను! కళ్లు తెరిచి అన్నీ మాట్లాడుతున్నమనిషి ఛప్పున కళ్లు తేలేసి గుటుక్కుమంటమూ చూచాను! ఆ శిశువులోకి ప్రాణం యెక్కడినుంచి వచ్చిందో తెలియలేదు; యీ వ్యక్తిలోంచి ప్రాణం యెక్కడికి పోయిందో తెలియలేదు. అదెక్కడినుంచి వచ్చిందో ఇదక్కడికే పోయి వుంటుంది అనుకునేవాణ్ణి. యిప్పుడు నా సుందరి కూడా

అక్కడికే పోయి వుంటుందని నిశ్చయించుకున్నా. యెప్పుడో ఒకప్పుడు నేనూ అక్కడికే పోతాగదా అనుకున్నా. కొస్త 'ముందు వెనక' అంతేగదా భేదం అనుకున్నా. యిట్లా మనసులోనే అనుకున్నాను. మనసులోనే దిగమింగేశాను నా సుందరిని, నా సుందరి రూపాన్ని, నా సుందరి శరీరాన్ని, నా సుందరి సర్వస్వాన్ని. పాపం! మా వాళ్లు ఆ శరీరాన్ని కాల్చి బూడిదచేసి వచ్చామనుకునేవాళ్లు! కాని నాకు తెలుసు నా సుందరిని నేనే మింగేశానని—నాలోనే వుందని! ఆరేళ్లు నీడల్లే నన్ననుసరించి, కష్టాలలో కష్టాలు సుఖాలలో సుఖాలు సమంగా పంచుకొని నా ప్రేమ రాజ్యంలో డిక్టేటరల్లే రాజ్యంచేసి మరో ప్రపంచం లోంచి రేడియో కాల్ అనండి, ఆహ్వానమనండి, రేడా రైమయిపోయిందిరమ్మని కొట్టినగంట అనండి యేదో అందరికీ అర్థంకాని వింతపిలుపు వచ్చి వెళ్లిపోయింది. ఆకాల్ గాని గంటగాని నన్నూ పిలుస్తుంది కొంతకాలానికి. నేనూ వెళ్తాను. మరెందుకు యీకాన్సెపట్లో యీ కన్నీళ్లు?

కన్నీళ్లు దిగమింగాను!
కడుపు చెరువయింది!
గుండె రాయయింది.

మనశ్శాంతికోసం అని సెలు పెట్టుకొని చెన్నపట్నం వెళ్లి కొన్నాళ్లు గడిపాను. రోజూ మెరీనాకు వెళ్లేవాణ్ణి. అప్పుడప్పుడు రాత్రికి వెళ్ళేవాణ్ణి. పెద్దబాధ మనసులో యేమీ అనిపించటంలేదు. యెంతో మనశ్శాంతి కల్గిందని మరట్లా చెప్పటం? నా సుందరి వున్నప్పుడు రాత్రిళ్లో వినపడిన సంగీతం యిప్పుడూ వినపడింది. అప్పుడు సముద్రంమీద కనపడిన అలలు యిప్పుడూ కనపడినయి. అప్పుడూ సముద్రపువొడ్డున యిసక వుండేది. యిప్పుడూ వుంది. మార్పేమీ కనపడలేదు. ఔను! మార్పు నా జీవితంలో జర్గితే సముద్రపువొడ్డున యిసకా, టాకీలో సంగీతమూ లేకుండా యెందుకు పోవాలి?

సూర్యుడు తూర్పునే వుదయిస్తున్నాడు! అయిస్ క్రీమ్ తినటానికి చల్లగానే వుంది! విశేషాలేమీ లేవు పట్నంలో!

అక్కడనుంచి మకాం అనంతపురానికి మార్చాను. మండువేసవి. అర్ధరాత్రి పదకొండుగంటల సమారుకు వూరు చేరాను. వూరు కొత్త. జట్కావాడు 'యెక్కడికి సార్?' అన్నాడు. పెద్ద ఆస్పత్రికి పోనిమ్మన్నాను. అక్కడ వాకబుచేసి 'ఫలానివారి యిల్లెక్కడ' అని అడిగి ఆయిల్లు చేరినతర్వాత బండివాణ్ణి 'మిస్ జేకబ్ గారు వున్నారా' అని అడగమన్నాను. జేకబ్ డాబా దిగి బండి దగ్గిరకు వచ్చింది. 'గుడ్ మార్నింగ్ మణి' అంటే 'గుడ్ మార్నింగ్ రాజు' అని షేక్ హాండ్ యిచ్చింది. మణి చెయ్యిచల్లగాయిగమల్లేఅనిపించింది. 'నీచెయ్యింతచల్లగా వుందే' మన్నాను. 'కాని నా హృదయంలో వెచ్చతనమే వుంద'ని మణి సమాధానంచెప్పింది. సరే రేపు కలుసుకుంటానని గుడ్ నైట్ చెప్పి మకాం సత్రంలో వేశాను.

మణి—సంవత్సరం క్రిందట ఆస్పత్రిలో నా దగ్గిర పనిచేసిన నర్సు. ఇప్పుడు ట్రాన్సుఫర్ అయి అనంతపురంలో పని చేస్తోంది. అనంతపురం వెళ్ళేముందు మణీ, మణితోపాటు యింకా యిద్దరు మలయాళీనర్సులూ 'డాక్టర్! యీవూరునుంచి వెళ్లిపోతున్నాము. ఒక్కసారికూడా యిక్కడ సినీమా చూడనేలేదు. మా కొక్కసారి చూపించరా?' అన్నారు. సరేనని చెప్పి ఆ రాత్రి ముగ్గురునర్సులను మా సుందరిని వెంటబెట్టుకుని జట్కాలో సినీమాకు వెళ్లి చూచాము తిరిగీ వచ్చేస్తున్నాము. చీకట్లో బండిలో కూర్చున్న నా చేతికి కొంత సేపటికి యింకోచేయి తగిలింది. షేక్ హాండేమో అనుకున్నా! ఇంకో చెయ్యి నా చిటికెనవ్రేలు తడుముతోంది!... వళ్లు ఝల్లుమన్నది! నే నేమీ మాట్లాడలేదు. యెవరి క్వార్టర్సుదగ్గిర వారిని దింపేసి నేనూ సుందరీ యింటికి తిరిగివచ్చాము. ఒకనిద్ర పోయి లేచి దీపం పెద్దది చేసి చేతినవున్న వుంగరం తీసిచూస్తే లోపలివేపున రెండక్షరాలు—మ...ణి!

నాకాశ్చర్యంవేసింది. అప్పటికి సంవత్సరంనుంచి రోజూ నేను చూచేమణే! ఒక్కరోజైనా తనకు ప్రేమ వున్నట్టు నాకు చెప్పనూలేదు, నాకు ప్రేమ వుందా అని అడగనూలేదు. వూరు విడిచి వెళ్లిపోతూ అర్ధరాత్రి యీ పనిచేసి చక్కాపోయింది. మూడోనాడు అనంతపురం నుంచి వుత్తరం వచ్చింది తనసాహసానికి క్షమించమని.

తనకు జవాబనేది వుంటుందా అని, తనకు సంవత్సరం నుంచీ ధైర్యం చిక్కలేదనీ, చివరికి యిట్లా తెగబడ్డాననీ, తనకు నాహృదయంలో కాస్తచోటు కావాలనీ, రెండు వస్తువులు దయవుంచి పంపమనీ...ఒకటి, నాపేరుగల చిన్న వుంగరం...రెండు, నాఫౌన్ టెన్ పెన్ క్లిప్పులో యిమిడిన నాచిన్నఫొటో. మూడురోజులక్రితం జరిగిన సంగతి చెప్పి, వుత్తరం చదివి వినిపించాను— మాసుందరికి. 'యేమిటి నీసలహా' అన్నాను పంపించండి యేం పోయిందిగనక'అంది 'బాగా ఆలోచించి చెప్పావా ? హృదయంలో కాస్త చోటంటోంది. దాని మాటే మిటి ?' అన్నాను. 'జాగా వుంటే అట్లాగే యివ్వండి. నాకేమభ్యంతరంలేదు జవాబుకూడా రాయండి' అన్నది సుందరి. 'జాగా వుంటే...?' 'వుందా'అని ఆలోచించిచూస్తే—అదేమన్నా పెద్దబంగాళాగనకా? నాకేం పాలుపోలేదు. అది మనసుకు పట్టించుకోకుండా ఆసంగతి విడిచిపెట్టి అడిగినరెండూ పంపించాను. వచ్చే వుత్తరం వెళ్ళేవుత్తరం ఒకచిన్న ఆఫీ సయిపోయింది. మూడునాలుగురోజుల కోసారి మధ్యాహ్నంపూట నవ్వుతూ సుందరి మంచంవద్దిరకు వచ్చి 'మణిదగ్గిరనుంచి వుత్తరం వచ్చింది. ఇస్తే నా కేమిస్తారు' అనేది. 'నీమామూలు తీసుకో' అని జవాబు చెప్పేవాణ్ణి. మణి రాసిన వుత్తరాలన్నీ మాసుందరే తనట్రంకుపెట్టెలో జాగ్రత్త చేస్తూవుండేది.

ఆ మణే యీ అనంతపురం నేను వెతుక్కుంటూ వెళ్ళినమణి !

మర్నాడు మధ్యాహ్నం జేకబ్ క్వార్టర్సులో క్యాంపుకాట్ మీద నేను కూర్చుని మా సుందరియొక్క ఆకస్మిక...మొదలైన సంగతులన్నీ పూసగుచ్చినట్టు చెప్పాను. మణి కాఫీ కాచి పెద్ద గ్లాసుటంబ్లరులో పోసి చేతి కందిచ్చింది. 'అబ్బో యింతెవరు తాగగలరు?తగ్గించ' మన్నాను. 'యేం నేను లేనా'అంది మణి. సగం తాగి తనకిచ్చేవరకు చూస్తూనుంచుందేగాని థర్మాస్ఫ్లాస్కులో మిగిల్చినకాఫీ తను తాగదు. గ్లాసులో నేను మిగిల్చిన సగంకాఫీ తాగి 'డ్యూటీ టైమవుతోంది వెళ్ళా'లంది— మణి. 'యీపూట సెలవు పెట్టలేకపోయావా' అన్నాను. 'లేదు మీరొచ్చారని తెలిసి అసిస్టెంటు సర్జను సెలవిచ్చే టట్టు కన్పించలేదు. అందుచేత సెలవడగలేదు' అంది. 'పోనీలే' అన్నాను. తలవంచుకుని...చన్నని రెండు చేతులూ నా మెడను చుట్టుకున్నాయి —నావొళ్ళో మణి పుస్తకమల్లే కూర్చుంది... 'యింకా నన్ను తొకటానికి నీకు ఆలోచనేనా' అంది.

అట్లా వారం పదిరోజులు గడిచిపోయినయి. అదివరకు గజంబారాన నిలిచేమణి యిప్పుడు ప్రక్కన కూర్చోగలదన్నమాటే తప్ప అంతకన్న విశేషమేమీ లేదు — నామనసులోనూ లేదు, మణిన డవడిలోనూ లేదు.

ఒకరోజున మణితో అన్నాను "యేం మణీ! సుందరి వెళ్ళి రెండునెలలన్నా కాలేదు. నాకైతే ముందు సంగతేమిటనిగాని, లైపుయొక్క ఫ్యూచర్ యేమిటని గాని యింతవరకు ప్రశ్నలే కల్గటంలేదు. కాని ఇరవై నాలుగు సంవత్సరాల వయసులోవున్న నన్ను వాళ్ళున్న స్వేచ్ఛగా వుండనిస్తారని నాకేమాత్రం నమ్మకం లేదు. దేవుడు మూడు పంక్తులు నుదుట వ్రాశాడంటారు. నాకు యిప్పుడు ఒకపంక్తి చెరిగిపోయింది. రెండోపంక్తికి ముగ్గు రాచి యేమిటో ప్రస్తుతం నేను చూడుకోవాలి. మూడోపంక్తి శ్మశానంలో కట్టైతే కనిపెడ్తయి. నీ వారాత్రి నాచేతికి పెట్టిన వుంగరం యిదుగో చూడుకో. నాసుందరి వున్నప్పుడే నాహృదయంలో తావు కోరినదానవు నువ్వు! తన స్థానమే ఖాళీచేసి సుందరి వెళ్ళిపోయింది. ఆస్థలమంతా పెద్ద అగాధమల్లేనో, పెద్ద శ్మశానమల్లేనో వుంది. యీ అగాధాన్ని భర్తీచెయ్యమనో యీశ్మశానంలో రాజ్యం చేయమనో నాకు యెవరినన్నా కడతా రన్నమాట. దాన్నే 'ద్వితీయం' అనబోతుంది—లోకం. నీవు వుత్తరంలో కోరిన కోర్కెనుబట్టి ఆస్థానం ఆక్రమించటానికి అర్హతగలదానవు అన్నివిధాలా నువ్వు! నీవు శక్తిగల తోటమాలి వయితే యీ అగాధం చక్కనిసరోవరంగా మారిపోవచ్చు, యీశ్మశానం ఉద్యానవనం కావచ్చు. అప్పుడది నామానస సరోవరం అవుతుంది, అందులో విహరించేహంసివి నీవు. ఉద్యానవనంలో సంచరించే వనదేవతవు నీవు. ఆమహాశక్తి నీకు లేకపోతుందా నీ 'రాజు' మరుభూమిని పాలించే 'భూతరాజు', నీవు అందులో 'కాటికాపరివి'. నీ ప్రజ్ఞావిశేషాలు ప్రక

టించుకోటానికి యిది నీకు చక్కని అవకాశము. ఇదే నారాకకు కారణం. ఆలోచించి నాకు సమాధానం చెప్పు. కూడా బయల్దేరి వస్తానంటావా, సరే! లేదు ఆలోచించటానికి వ్యవధి కావాలా, నిరభ్యంతరం!'.. 'రేపు వస్తా'నంది మణి మనునాడు వచ్చేటప్పటికి ద్యూటీనుంచి మణి యింకా తిరిగి రాలేదు. టేబిల్ మీద ఒకకవరు నాకు అడ్రసు చేసి వుంది

కవరులో నా వుంగరం వుంది. కాగితంలో యీ ముక్క లున్నాయి.. ...

నా ప్రియమైన రఘు,

సుందరి ప్రేమరాజ్యంలో నాది సిగ్గుంప్రవేశ మని నాకు తెలుసును. నిన్ను ప్రేమించటానికి సుందరి అనుజ్ఞయివ్వటం నాకు తీరనిసమస్య. ఈ ప్రపంచంలో కూడా దేవత లుంటారని నేను కలలోనైనా అనుకో లేదు. ఆమెస్థానం ఆక్రమించటానికి నాకు యేమాత్రం గానూ అర్హత లేదు. నేను నిన్ను కోరేదల్లా నీఫొటో నాతో పాటు నాసమాధిలోకి తీసుకుపోనిమ్మని నీవుంగరం నీకు పంపేస్తున్నాను. దీనితో నీకు స్వేచ్ఛ. ముద్దులు.

ఎల్లప్పుడూ నీయొక్క

మణి.

ఉత్తరం వుంగరం తీసుకొని నాప్రేలి వుంగరం చిన్నకాగితంలో చుట్టి బల్లమీద విడిచి బయటికి వచ్చే శాను. కాగితంలో 'గుడ్ బై' అనిమాత్రం రాశాను. అంతే! మళ్లా మణిని యింతవరకు చూడలేదు!

మణి నాకు యిప్పటికీ సమస్యే! మణి చెప్పి నట్టు నాసుందరి దేవతేనేమో? లేకపోతే యింత ఆకస్మికంగా మాయమైపోతుందా?

చెవులు చిల్లులు పడేటట్టు ఫోను మళ్లా —
'యెంకి వంటిపిల్ల లేదోయి లేదోయి,
యెంకి నావంకింక రాదోయి రాదోయి'.

వ్యాసలేఖకులకు మనవి

వ్యాసాలు ఎనిమిదిపుటలకు మించకుండా ఉండాలి. వ్యాసరచన రంజకంగా ఉండాలి. శాస్త్రీయవిషయాలనుగురించిన వ్యాసాలుకూడా ఎక్కువ పరిభాషా, ఎక్కువ వివరాలూ లేకుండా సంగ్రహంగాను, సామాన్యపాఠకునికి విషయం బోధపడేటట్టు సులభంగాను, మనస్సును కథలా ఆకట్టేటట్టు ఆకర్షకంగాను ఉండాలి. శాసనవ్యాసాలు పదిహేన్నిందు పుట లకు మించేయెడల రెండుసంచికలలో ప్రకటింపవలసివచ్చును.

దేశాన్ని ఎక్కువగా కలవరపరుస్తున్న సాంఘిక ఆర్థిక, రాజకీయాది విషయాలనుగురించీ, మనఆంధ్రుల ప్రత్యేకసమస్యలనుగురించీ ప్రత్యేకవ్యాసాలు కావాలి. సాధ్యమయినంతవరకు ఎత్తుకునే విషయంలోను, చూచేదృష్టిలోను, రచించేరచనలోను కొత్తదనం కావాలి. మన ఉద్యమాలూ, మనదేశం, మనసంఘం, మనఆశయాలు భారతిలో ప్రతిఫలించేటట్టు చూడ వలసిందని వ్యాసకర్తలకు మనవి.—భా. సం.

జ్వాలాతోరణం

శ్రీ. శ్రీ.

స్వర్గనరకముల ఛాయాదేహళి
తెలి నలి తలుపులు తెరచి, మూసికొని,
సర్గ విలయ హేమంత వసంత
ధ్వాంతకాంతి విశ్రాంతివేళలో,
చావు పుట్టుకల పొలిమేరలలో
ఆవులించె నొక చితాగ్నికుండం :
అనాథజీవుల సమాధు లన్నీ
అఘోరించి ఘోషించాయి.

ఇదేమి? లోకం హిరణ్య నేత్రుని
పదాఘాతమున ప్రతిధ్వనించగ,
కురుక్షేత్రమున క్రుద్ధవృకోదరు
గదాఘాతమున గజగజలాడగ,

జాతిజాతి నిర్ఘాతపాత సం
ఘాతహేతువై, కాలకేతువై,
అదె సంవర్తపు తుపాను మేఘం
తొలి గర్జించెను తూర్యవిరావం.

ప్రదీప్తకీలా ప్రవాళమాలా
ప్రపంచవేలా ప్రసారములలో
మిహిరవాజితతి, మఘవధనుర్ద్యుతి!
పుడమికి నేడే పుట్టినరోజట!

ప్రత్తి

' లాంగ్ స్టేపిల్ కాటన్ '

పి. హెచ్. రామరెడ్డి

[అగ్రికల్చరల్ డైరెక్టరుగారయిన పి. హెచ్. రామరెడ్డిగారు ఈనడుమ మద్రాసు రేడియోద్వారా 'బ్రాడ్‌కాస్టు' చేసిన ఉపన్యాస మిది. ఇందు ప్రత్తియే దూదిఅనియు వ్యవహృతమయినది. భా. సం.]

దూది యేదో యొకవిధముగా, అనగా గుడ్డలు నేయుటకుగాని, మెత్తలుగా కుట్టుటకుగాని, గాయములు పుండ్లను కట్టుటకుగాని, గుడ్డలు కుట్టుటకు దారముగా జేయుటకుగాని, యుద్ధ పరికరములకుగాని వినియోగించని దేశము ప్రపంచములో లేదు. అయినా దూది ప్రతిదేశమునను పైరగుటలేదు. కారణ మేమనగా, ప్రత్తిచెట్టు ఉష్ణదేశములందును సమశీతోష్ణదేశములయందును మాత్రమే పెరుగునుగాని శీతలదేశములలో పెరగదు. ప్రత్తి హిందూదేశమునందును, చీనాదేశమునందును, ఈజిప్టు దేశమునందును చిరకాలమునుంచి పైరగుచున్నది. కాని గడచిన ౧౫౦ - ౨౦౦ సంవత్సరములుగా అమెరికా సంయుక్తరాజ్యములు (United states of Am rica) మొదలగు దేశములలో సయితము యెక్కువగా పైరుపెట్టబడుచున్నది. అంతేగాక గడచిన ౨౦ సంవత్సరములుగా, అనగా యూరోపుమహాయుద్ధము ముగిసినది మొదలు రషియాయందును, తూర్పుఆఫ్రికాయందును, మెక్సికో పెరు అర్జెంటయిను దేశములందును, కొంతమట్టునకు ఆస్ట్రేలియా ఖండమునందును ప్రత్తిపంట ఏటేట హెచ్చగుచున్నది. ఇటీవల, అనగా మూడు నాల్గు సంవత్సరములుగా జపానువారు మంచూరియాయందును ఈ పంటను పైరుచేయుటకు తగినప్రయత్నములు చేయుచున్నారు. దూది ప్రతిదేశమునకును కావలసిన ముఖ్యవస్తువులలో ఒకటి యగుటచే ఏయే దేశములకు కావలసినంత దూదిని ఆయా దేశములలోగాని, ఆయా దేశములకు సంబంధించిన తదితర దేశములందుగాని పైరుచేయుటకు ప్రతిదేశమువారును ప్రారంభించినారు. ఈవిధముగా పండించుటకు వీలుగానిదేశములలో కృత్రిమపుదూదిని, అనగా 'ఆర్టిఫిషియల్ ఫైబర్సు'ను (artificial fibres) తయారుచేయుటకు ప్రారంభించినారు. ఈకృత్రిమపుదూది మొత్తము మూడునాల్గుసంవత్సరములుగా ఏటేట ఎక్కువగుచున్నది. ఈదూది యింకను ఎక్కువకానున్నది. కారణ మేమనగా, కొన్ని విషయములలో ఈదూది సాధారణపుదూదికంటె ఎక్కువ యుపయోగమయినది. అందుకుతోడు వెల తక్కువ. అందువలన ఇది యెంతమట్టునకు ఎక్కువగునో అంతమట్టునకు మన సామాన్యపుదూదికి ధర తగ్గక తప్పదు.

ప్రపంచములో ఏటేట 3 కోట్లబేళ్లకు పైబడి దూది పండుచున్నది. అందులో ౧ కోటి ౪౦ లక్షలవరకు అమెరికాసంయుక్తరాజ్యములలోను, ౬౦ లక్షలు మన హిందూ

దేశమునందును, ౩౫౦ లక్షలు రష్యాయందు ను, ౩౦ లక్షలు చీనాయందును, ఈజిప్టులో ౧౭ లక్షలవరకును, బ్రెజీలులో ౧౫ లక్షల వరకును ఉత్పత్తియగుచున్నది. మిగతదూది తూర్పు ఆఫ్రికాయందును, దక్షిణ అమెరికాలో కొన్ని దేశములయందును, పర్షియా యందును, కొద్దికొద్దిగా మరికొన్ని దేశము లందును పైరగుచున్నది. దూది పైరగు దేశ ములలో అమెరికా సంయుక్తరాజ్యములు మొదటిది. రెండవది హిందూదేశము.

ప్రత్తి విత్తనమునకు అంటుకొనియుండు ఏసెలు లేక పోగులను 'స్టేపిల్' అని అందురు. ఈ'స్టేపిల్'నిడివిని బట్టి'లాంగ్ స్టేపిల్' దూది లేక పొడుగురకపుదూదియనియు,'మీ డియం స్టేపిల్'దూది లేక మధ్యరకము దూది యనియు, 'షార్టు స్టేపిల్' దూది లేక కురుచ రకపుదూది యనియు దూది నంతటిని మూడు విధములుగ విభాగించియున్నారు. ఒక అంగు ళముపొడువుకుమించియుండినదూదిని'లాంగ్ స్టేపిల్' దూది యని అందురు. ఏడింట ౮-వ భాగము, అనగా ౭/౮ అంగుళములకు మించి ౧ అంగుళము వరకు పొడవుగా నుండు దూ దికి 'మీడియం స్టేపిల్'లేక మధ్యరకముదూది యనిపేరు. ౭/౮ అంగుళములకంటె కురుచగా నుండు దూదికి 'షార్టు స్టేపిల్' దూది లేక కురుచరకము దూది యనిపేరు.

'లాంగ్ స్టేపిల్' కాటనులో మిక్కిలి ప్రశస్తమయినదూది అయిలెండ్సు అను ద్వీపములలో పైరగుచున్నది. కాని అది ౪౦౦-౫౦౦ బేళ్లకంటె ఎక్కువగా పండుట లేదు. దీని'స్టేపిల్'పొడవు ౧ ౩/౪ అంగుళము నకు మించియుండును. ఈ రకము ప్రత్తిని ఇతరదేశములలో పండించుటకు ఎన్నియో ప్రయత్నములు జరిగినవి కాని ప్రయోజనము కనబడలేదు. సీ అయిలెండ్సుదూదికి తరువాత వచ్చునది 'ఈజిప్షియన్ కాటన్'. ఈ దూది లో కొన్ని రకములు ౧ ౩/౮ అంగుళము పొడవు నకు మించియుండును. తూర్పు ఆఫ్రికా, బ్రెజీల్ దూది యందియును, సంయుక్తరాజ్య ములు రష్యాదూదిలో కొంతమట్టుకును 'లాంగ్ స్టేపిలు'లో చేరినది. మన దేశములో 'లాంగ్ స్టేపిల్' దూది ౮౦-౯౦ వేల బేళ్లు మాత్రమే తయారగుచున్నది.

మన దేశములో 'లాంగు స్టేపిల్' దూది కొద్దిగా తయారగుటనుబట్టి మనదూది నంత టిని మధ్యరకముదూది (Medium staple) యనియు కురుచరకముదూది(Short staple) యనియు రెండువిధములుగా భాగించ వచ్చును. మన దేశములో పండు ౭౧ లక్షల బేళ్ల దూదిలో ౧౮-౨౦ లక్షల బేళ్లు 'మీడియం స్టేపిల్'దూది. తక్కిన ౪౦-౪౫ లక్షల బేళ్లు 'షార్టు స్టేపిల్' దూది. 'షార్టు స్టేపిల్' దూది చీనాదేశమునందును, కొద్దిగా రష్యా సం యుక్తరాజ్యములు, పర్షియా మొదలగు తదితర దేశములందును పైరగుచున్నది కాని, ఆ దేశములవా రందరును మనవలెనే 'షార్టు స్టేపిల్'దూదిని వదలి 'లాంగ్ స్టేపిల్' దూదిని పైరుపెట్టుటకు ప్రయత్నములు చేయుచున్నారు. 'షార్టు స్టేపిలు' కాటను బాగుగా పండుచోట్లలో 'మీడియం' లేక 'లాంగ్ స్టేపిల్ కాటను' సాధారణముగా చక్కగా ఫలించదు. చక్కగా ఫలింపజేయు టకు బహుప్రయత్నములు కావలెను; అనగా ఆ ప్రదేశములకు అనుకూలమగు 'లాంగ్ స్టేపిల్ కాటనును తయారు చేయవలయును. అటు పిమ్మట ఆప్రత్తి యెక్కువగా ఫలించు

టకు భూమిని ఏవిధముగా సేద్యము చేయవలసినది. ఏమాసములో విత్తనము వేయవలసినది, ఏయే యెరువులను వేయవలసినది అను విషయములను గురించి పరిశోధించవలెను.

మనదేశములో గల దూదియంత్రములకు ఏటేట ౩౦ లక్షలబేళ్లు కావలసియున్నదిగాని అందులో ౨౫ లక్షల బేళ్లు మాత్రమే మనదేశపుదూది. తక్కిన ౫ లక్షలు పరదేశపుదూది.

మనదేశమునందు ఫలించు ౧౮-౨౦ లక్షలబేళ్లు 'మీడియం స్టేపిల్ కాటను'లో చాలాభాగము మనదేశపు దూది యంత్రములలోనే వినియోగమగుచున్నది. మిగిలినది సులభముగా పరదేశములకు ఎగుమతి కాబడుచున్నది.

'షార్టు స్టేపిల్' కాటనులో కేవలము కురుచగానుండు దూదికి 'బెంగాలు కాటను' అని పేరు. దాని 'స్టేపిల్' పొడవు ౩/౮ మొదలు ¾ అంగుళమువరకు. దానిపైరు ౧౩-౧౪ లక్షల బేళ్లు. ఈదూది మనదేశములో డేరాగుడ్డల వంటి ముతకబట్టలను నేయుటకును, ఇతర దేశములలో గొర్రెబొచ్చుతో చేర్చి 'వులన్' గుడ్డలుగా నేయుటకును పనికివచ్చుచున్నది. అందువలన నేటేట పండు ఈ బెంగాలు దూది మనదేశమందును, ఇతరదేశములందును సులభముగా ఖర్చగుచున్నది.

మనదేశములో మిగిలిన ౨౬-౨౯ లక్షల బేళ్ల కురుచదూదికి ఉమ్రాస్ అనియు, ఢోలరాస్ అనియు, సేలమ్స్ అనియు, 'కోకనాడాస్' అనియు, 'మాల్వాస్' అనియు పేర్లు. ఇందులో కొంతమట్టునకు అనగా ౭-౮ లక్షల బేళ్లవరకు మనదేశమునందే వినియోగ మగుచున్నది. తక్కిన దంతయు ఇతరదేశముల కెగుమతి కావలయును.


మనదేశములో ఖర్చుకాబడు 'మీడియం స్టేపిల్ కాటను', 'బెంగాలు కాటను' మొత్తము రమారమి ౩౫-౩౮ లక్షలబేళ్లు పోగా తక్కిన ౨౨-౨౫ లక్షలబేళ్లు ఇతర దేశములకు ఎగుమతి అయిననేకాని మరే విధమునగాని మనదేశములో వాటికి ఖర్చులేదు. ఈ మిగిలిన దూదిలో రమారమి ౧౫ లక్షల బేళ్లు జపానుకు పోవుచున్నవి. ఈమధ్య ఇంగ్లండు దేశమువారు ౫-౬ లక్షలవరకును కొనుచున్నారు. మిగిలిన దూది ఫ్రాన్సు, బెల్జియం, జర్మనీ, యిటలీ దేశములకు పోవుచున్నది. యూరపుయుద్ధమునకు ముందు ఈ నాల్గుదేశములవారును ౭-౮ లక్షల బేళ్లవరకును కొనుచుండిరి కాని ఇప్పుడు వారు మనదేశమునుండి కొనుదూది స్వల్పము.

జపానువారు మనదేశమునుంచి ఏటేట ౧౫ లక్షల బేళ్లవరకు కొనుచున్నారని యింతకుముందే తెలియబరచితిని. ఏదో యొక కారణమున జపానువారు మనదూదిని కొనుటకు మానుకొనినయెడల ఈ ౧౫ లక్షల బేళ్లదూదికి వేరే ఖర్చులేదు. ఏలననగా ప్రపంచమునందంతటను నయమయిన బట్టలకే గిరాకి ఏటేట హెచ్చుచున్నది. ముతకబట్టలకు గిరాకి తగ్గుచున్నది. అందుచేత మన'షార్టు స్టేపిల్ కాటను' జపానువారుతప్ప మరెవ్వరుగాని అంతగా వినియోగించరు. అందువలననే ౫,౬ సంవత్సరములకు ముందు మనదేశమునకు దిగుమతికాబడు పరదేశపు గుడ్డలపై సుంకమును లేక 'యింపోర్టు' పన్నును

ఎక్కువచేసినప్పుడు ఆ పన్నును తగ్గించి ననేకాని హిందూదేశపు దూదిని మేము కొనుటలేదని జపానువారు పట్టుపట్టిరి. మన దూదిని విక్రయించుటకు వేరే సదుపాయము లేనందున వారితో మన దేశ మొక ఒడం బడిక చేసికొనవలసివచ్చెను; అనగా మన దేశమునుంచి వారు సంవత్సరమునకు ఇన్ని బేళ్లు కొనవలయుననియు, అందుకు బదులు మన మా దేశమునుంచి యిన్ని గజముల గుడ్డను కొనవలయు ననియు ఏర్పాటు కాబడెను. ఈ యేర్పాటు ఎంతకాలము జరుగునో తెలియదు. ఈ యేర్పాటునకు ఏ కారణమునగాని భిన్నము కలిగినయెడల అటుపిమ్మట ఈదూదికి ఏగతి పట్టనున్నదో తెలియదు.


ఈ 'షార్ట్ స్టేపిల్' దూది ముఖ్యముగా సెంట్రల్ ప్రావిన్సెస్‌నందును, కొంతమట్టునకు బొంబాయి కోస్తాయందును, హైదరాబాదు సెంట్రల్ యిండియాస్టేటులయందును పైరగు చున్నది. ఆ యన్ని చోట్లయందును ఈ దూదిని వదలి "మీడియం స్టేపిల్' దూదిని పైరు చేయుటకు తగిన ప్రయత్నములు జరుగు చున్నవి. 'మీడియం స్టేపిల్'కు ఎక్కుడయి నను గిరాకి యున్నది.

మన మదరాసుకోస్తా ప్రత్తిపంట మొత్తము ౫,౫౦,౦౦౦ బేళ్లు. అందులో సేలమ్స్ కాటను ౩౮,౦౦౦ బేళ్లును, కాకినాడకాటను ౨౫,౦౭౦ బేళ్లుమాత్రమే 'షార్టు స్టేపిల్' జాతిలో చేరినవి. తక్కినవన్నీ 'మీడియం స్టేపిల్' తరగతిలో చేరినవి; గాని వర్షములు తగ్గి పైరుకు చీడపట్టినదో, వాటి 'స్టేపిల్' పొడవు కొంచెము తగ్గిపోవును. అయినను అగ్రికల్చరల్ డిపార్టుమెంటువారిచే తయారు చేయబడిన హాగరి ౧-వ నంబరు ప్రత్తి కంబోడియా ౨-వ నంబరు ప్రత్తి, క్రొత్తకరుంగన్ని ప్రత్తుల 'స్టేపిల్' ౧ అంగుళమువరకు ఉండడమువలన కాలప్రకృతి ఎట్లుండినను అవి ౭/౮ అంగుళములకంటె తక్కువ ఉండజాలవు. ముంగారిదూదిని, సేలమ్సుదూదిని, కాకినాడ దూదిని వృద్ధిచేయు ప్రయత్నములు జరుగు చున్నవి. ఈ ప్రదేశములకు అనుకూల మయిన 'మీడియం స్టేపిల్' ప్రత్తిరకములు తయారగయిన పిమ్మట మనకోస్తాలో 'షార్టు స్టేపిల్' రకములను పైరుచేయుట బొత్తిగా మానివేయుటకు వీలగును.



గడ్డము - దాని పురాతన చారిత్రము

వి. వి. ఎల్. ప్రభాకర్



గడ్డ ముంచుకొనవచ్చునని, యుంచుకొనరాదని తెలుపుచట్టములు, గడ్డము నాకార మిట్లుంచవలెనని, పరిమాణ మింత యుండవలెనని నిర్ణయించుశాసనములు పెక్కులు లోకములో గలవు. గడ్డమును గూర్చి రాజులు, జమీందారులు, కొన్ని యుద్దేశములు గలిగి వాని నాచరణములో బెట్టి వారితాబేదార్లనుగూడ వారిదారుల నే నడిపించిరి.

గడ్డపుమూలలను గీసివేయరాదని హీబ్రూమతస్థులధర్మనిర్ణయము. మోసెస్ యూదులను గడ్డముతీయరాదనియే శాసించియుండెను. కొన్ని మతములవారు ముండితముఖము ముఖ్యధర్మమని తలచుచున్నారు. కుష్ఠరోగికి గడ్డము తీసివేయవలెనని నియమము గలదు. కార్తేజిలో ప్రాచీనకాలమున జరిగిన ఒకానొకసభలో సభవారు క్లెర్జిమన్ (మతాచార్యులు) తమవెండ్రుకలను బెరుగనీయరాదని శాసించిరి. 'చర్చి'వారికేగాక యితరులకును గడ్డము ఉండరాదని అటు తరువాతిసభలలో నిర్ణయమైనను, అది నమలులోనికి రాలేదు.

గడ్డమును గీసివేయవలెననుశాసనము మధ్యయుగమందెల్ల నాచరణలో నుండెను. టవులూసులో ౧౧౧౯ - వ సంవత్సరములో జరిగిన సభలో "గడ్డము పెంచుకొన్న మతగురువులను వెలివేయవలసిన" దని నిర్ణయించిరి. పోప్ మూడవ అలెగ్జాండరు గడ్డము పెంచుకొన్న మతశాఖకు సంబంధించిన ఉద్యోగులను బలవంతముగా బట్టుకొని వారిగడ్డములను గొఱిగి వేయవలెనని యాజ్ఞాపించియుండెను. 'క్లెర్జీ'కి మేకలకువలె గడ్డములుండరాదని, ద్రాక్షాసవము ద్రాగునపు డడ్డంకిగానుండు మీసముల నుంపరాదని పెక్కునిర్ణయము లైరోపాఖండమున ౧౬-వ శతాబ్దములో గన్పట్టుచున్నవి.

మతబోధకులు గడ్డము బెంపరాదను నియమము ఇంగ్లాండులోగూడ నుండెను. మతబోధకుడు ముండితు డనియే వ్యవహరింపబడుచుండెను. ఆల్ఫ్రెడ్ రాజు "ఒకడింకొకని గడ్డము గొఱిగివేసినయెడల, వాడు ౨౦ షిల్లింగుల దండుగ నిచ్చుకోవలయును. ఎవడైన నొకని గట్టివైచి గడ్డము గొఱిగిన, వాడు ౬౦ షిల్లింగుల దండుగ చెల్లింపవలెను" అని శాసించెను.

ఐదవ ఫిలిప్పు రాజునకు గడ్డము మొలవలేదుగావున, స్పెయినుదేశమువా రానాడు గడ్డములు తీసివైచిరి. పదుమూడవ లూఈ రాజుకూడ నట్టివాడే యగుట ఫ్రెంచిదేశస్థులు గడ్డములు తీసివైచిరి. మొదటి ఫ్రాన్సిసుప్రభువు గడ్డముమీద నొకమచ్చ

యుంటచే అతడు గడ్డము పెంచుకొన్నాడు. ఆతని జూచి ప్రజలు గడ్డాలు పెంచిరి. "యథా రాజా తథా ప్రజా" కదా !

పశ్చిమాఫ్రికాలో గడ్డము లరుదుగా నుండును. ఎక్కడేని ఒకడు గడ్డము గలవా డున్న "బిగ్ డాడీ"యని నలువురు వింతగా బల్కుదురు. ఆస్ట్రేలియావారికి పెద్దగడ్డము లుండును. న్యూగినీలో కృత్రిమపు గడ్డములు సైతము పెట్టుకొందురు. ఈజిప్టులో హీనజాతులవారికి గడ్డము లుండును. ఉన్నతోద్యోగులు, మతబోధకులు మంగళ్లకు జాల పనిచెప్పుదురు. ఆ దేశములో గూడ గొన్ని ముఖ్య సమయములందు కృత్రిమపుగడ్డములు పెట్టుకొందురు. అట్టి యెడల రాజులగడ్డములు చదరముగా గత్తిరింపబడును.

యూదులకు పొడవైన గడ్డము లుండుట యాచారమైనను, పాలస్తీనులో మూడవశతాబ్దమునందే పెక్కుమంది యూదులు గడ్డములు కత్తిరించుకొనుచువచ్చిరి. జర్మనీ, ఫ్రాన్సు, ఇటలీ — ఈ దేశములలో గత్తెరతో గడ్డములు కత్తిరించునాచారముండెడిది. క్రీస్తుపుట్టకముందే గ్రీసులో, రోములో క్షౌరముచేయించుకొనుట వాడుకలో నుండెను. హాడ్రియన్ రాజైనది మొదలు గడ్డములు నాజూకులైనవి. రాజారులోని తొల్లింటిషాలు నడుమువఱకు వ్రేలాడు గడ్డము లుంచుకొనువారు. కాని నాజరుద్దీను, వానిసంతతివారు గడ్డములు క్షౌరము చేయించుకొన మొదలుపెట్టిరి. టిబెటువారు తంటసముతో గడ్డపువెండ్రుకలు తీయించుకొనువారు. లామాలుమాత్రము నిండుగడ్డము లుంచుకొనువారు.

మొదటిమనుజుడు ఆదాము గడ్డముతోడనే సృష్టింపబడెనందురు. జగత్పితయైన జూస్ గడ్డముగలవాడు. త్రిమూర్తులలో మొదటివాడు గడ్డముగలవాడట. అబ్రహాము, అగామెమ్నన్, ఓడన్, ఆర్థరురాజు, చార్లిమేన్ — వీ రందఱు గడ్డముగలవారలే. మహమ్మదు, అతనికి బూర్వులును గడ్డములవారే. పరిషియారాజులు గడ్డపువెండ్రుకల నుంగరములుగా జుట్టించుకొనువారు. నైన్వేప్రభువులు గడ్డమును చక్కని యుంగరములుగా బెట్టుకొని వానికి బరిమళపు తైలము రాచికొనువారు.

కత్తితో గడ్డము తీయుటకు యూదుల నేరములు సమ్మతింపవు. పరమాయన దేవుడు పురుషునికి స్త్రీనుండి భేదము తెల్పుటకై గడ్డము నొసంగెనని వారి నమ్మకము. మధ్యయుగమువారు కత్తెరతోగూడ గడ్డమును గత్తిరింపరాదని, యది మహాపాతకమని నమ్మినవారు గలరు. ఈసాకు లూరియా యనునాతడు తనగడ్డము వెండ్రుక యెక్కడ రాలిపోవునో యని దానిని ముట్టుకొనువాడు కాడట.

గడ్డముల పెంపకమునకు విరోధులు కూడ బూర్వకాలమున పెక్కుమంది గలరు. "జోసెఫ్ సోలోమన్ డెల్ మెడిగో" యిట్లు వచించినాడట.

"If men be judged wise by their beards
and their girth
Then goats were the wisest of creatures
on earth"

ఖలీఫాలలో మొదటిసలీము గడ్డము లేకుండ గనబడినవారిలో మొదటివాడట. ఆతనిమంత్రి యది కూడదనగా నతడు,

"I have cut off my beard, that the Vazier may have nothing to lead me by''

అని జవాబుచెప్పినాడట.

శత్రువులకు దొరకకుండునట్లు, అలెగ్జాండరు తనసైనికులను గడ్డములు గత్తిరించుకొన నాజ్ఞాపించెనట. గ్రీకులు అలెగ్జాండరుకాలమువఱకు గడ్డము లుంచుకొనువారని చరిత్ర తెలుపుచున్నది. క్రీ. పూ. ౨౯౯ ప్రాంతమున రోమనులలో టిసినస్ మేనా యను సిసిలీమంగలి క్షౌరపుపద్ధతి మొదట నెలకొల్పినవాడట. ఆకాలములో మొట్టమొదట సిపియో ఆఫ్రికానస్ అనునాతడే ప్రతిదినక్షౌరపద్ధతి ప్రారంభించినవాడని చెప్పుదురు. మన హిందూదేశములో వలెనే యీ కాలములో ప్రతి యువకునకు కేశఖండనమహోత్సవములు వైభవముతో జేయుచుండిరి. పదునేడవ శతాబ్ది మధ్యమున జర్మనీలోని యూదులు రోమసంహారిగా నొకవిధమగు రాతిని, కొన్ని యోషధులను నుపయోగించువారు. యూరపులో ౧౩, ౧౪ లూయీల కాలములో మాత్రమే నవీనక్షౌరపద్ధతులు ప్రారంభమైనవి. మనదేశస్థులు చిరకాలమునుండి "క్షౌరము"న కలవాటుపడి యున్నారుగదా! ౧౮-వ శతాబ్దములో ఫ్రెంచివారు పరిపూర్ణ క్షౌరపద్ధతులు నెలకొల్పిరి.

పారసీకులకు, తార్తారులకు చిరకాలమువఱకు యుద్ధములు జరుగుచుండెడివి. వానికి గారణము గడ్డములే. పారసీకులకు గడ్డము లుండెను, తార్తారులకు లేకుండెను. బైబిలుయొక్క ప్రాతనిబంధనప్రకారము చూడ నొకప్పుడు ఒకతెగుదారియగు నాస్తికుడు డేవిడ్ రాయబారుల గడ్డములు గొఱిగివేసినట్లును, అయ్యది గొప్పయపమానమని వారు తలచినట్లును తెలియుచున్నది. రాజునకు గనికరము గలిగి తనవారియవమానము నివారింపగోరి,

"Tarry ye at Jericho until your beards be grown"

అని చెప్పిన ట్లున్నది. చెఱసాలనుండి యీవలకు దీసికొనిరాబడిన పిమ్మట జోసెఫునకు గడ్డము గొఱిగించి, మఱి, రాజునెదుటకు గొనిపోయిరట.

౧౭౬౯ – ౧౮౫౯ సంవత్సరములలో జీవించియున్న జేమ్సు వార్డు అనుచిత్రకారు డొకడు "గడ్డము, దానివేదాంతతత్త్వము" అనునొకగ్రంథము రచించినాడు. అందు, మనుజుడు దేవుని ధిక్కరింప దలపు లేకయున్నవాడైన దప్పక గడ్డము బెంచుకొనవలయునని పదునెనిమిదికారణములతో జక్కని హేతువాదముచేయుచు నొకరచన చేసియున్నాడు. ౧౮౬౦ లో థియోలోగోస్ అనునతడు "క్షౌరము సబ్బాతు (Sabbath)నకు, సువార్తవ్యాప్తికి గొప్ప యడ్డంకి" యనుగ్రంథ మొకటి వెలువరించినాడు. గడ్డము దేవుని యపారకరుణచే నేర్పడిన యురసంరక్షిణియని, యది గండభాగములగాక చిబుకముమీదనున్న దాని ప్రయోజన మనుమానింపదగినదని, దానియుపయోగ మపర్ణ్య మని యందు వ్రాసియున్నాడు. జూలియన్ చక్రవర్తి "మిసోపోగోన్" అనుగ్రంథమున ఆంటియాక్ ప్రజలు గడ్డములు తీసివైచుకొని పురుషస్వభావమును గోల్పోయి స్త్రీ లైపోయిరని వ్రాసియున్నాడు.

ఇప్పుడు క్షురకర్మ లోకమంతయు విరివిగా వ్యాపించియున్నను, దానింగూర్చి విసుగుజెందనివా రుండరు. ఇందుగూర్చి బైరన్ మహాకవి రచించిన "డాన్‌జుఆ" చూచునది.

ఎనిమిదవ హెన్రీ యింగ్లాండు నేలు కాలములో 'లింకలన్ ఇన్'వారు గడ్డమున్న మనుజులయొద్ద రెట్టింపుసొమ్ము వసూలు చేయువారు. ఆకాలమున గడ్డముపన్నుండెడిది. ఒకపక్షమునుండి యెదుగుచున్న గడ్డమునకు 3 షిల్లింగుల ౪ పెన్నీలు పన్ను విధించువారు.

రష్యాలో పీటరుచక్రవర్తి యనాగరికపుగడ్డములపై బన్నువిధించువాఁడు. గడ్డముంచుకొనువారిలో కడజాతివా రొక్క "కాక్వెక్కు" (కానివంటిది), తక్కినవారు నూఱు రూబులులు చెల్లింపవలసియుండెనట. ప్రతిపురద్వారములకడను ఈపన్నులు వసూలుచేయుట కుద్యోగులను నియమించువారు.

ఎలిజబెత్తురాణీయొద్ద జార్జి కిల్లింగువర్తు అను నుద్యోగి గలడు. అతనికి ౫ అడుగుల పొడవుగల గడ్డ ముండెనట. దానికంటె గొప్పగడ్డము మూడవ అలెగ్జాండరుచక్రవర్తికుండెనట. మార్షల్ ఐలాండర్సునకు గడ్డము చివర పొడవుగా,— నొక్కొకప్పుడు చీలమండదాకకూడ—వ్రేలాడు సన్నని జడవంటిది యుండెనని చెప్పుదురు. మిక్కిలి పొడవైనగడ్డము పశ్చిమాఫ్రికాలో నొకప్పుడొకని కుండెనట. దానిపొడుగు ౧౮ అడుగులట. దానిని జుట్టగా జుట్టియుంచువాడట.

"సైంటు పాలా" యనునామె ఒకతె గలదు. ఆమె స్పెయిన్‌లో ఆనిలాపురమున నొకపేదకుటుంబములో బుట్టినది. ఆమె చాల సందగత్తె. ఆమెను జూచి యొకయువకుడు మోహించినాడు. కాని యామెకు వానియందిష్టము లేకపోయెను. అత డామెను దఱుముకొని యొకయడవికి బోయెనట. ఆమెను గాపాడువా రెవ్వరు లేనందున, నామె భక్తితో నొకసిలువను శరణుజొచ్చి దానినే కౌగిలించుకొన్నదట. వెంటనే యామెకు మీసమును గడ్డమును మొలచినవట! ఆయువకు డామెను జూచి యానవాలుపట్టలేక విడిచి వెళ్లిపోయెనట.

సైంటు విల్జిఫార్టిస్ అనునామె యింకొకతె గలదు. ఆమె పోర్చుగల్‌రాజునకు బుట్టిన కవలపిల్లలలో నొకతె. తండ్రి యామెను సిసిలీరాజున కిచ్చి పెండ్లిచేయఁగోరెను. కాని యాపిల్ల జీవితకాల మంతయు గన్యగానే యుండవలెనని నిర్ణయించుకొనెను. ఆమె తీవ్రముగా దేవుని బ్రార్థింపగా నామెకు మీసము, గడ్డము మొలచినవట! సిసిలీరా జది చూచి యేవగించుకొని వెడలిపోయెనట.

చారిత్రకముగా గడ్డములుగల కాంతలు:

౧. బార్టల్ గ్రేట్జీ—స్ట్రాస్‌బర్గు పురస్థలము. ౧౫౯౨ లో బుట్టినది.

౨. పండ్రెండవ చార్లీసేనలో నొకయాడుది గలదు. ఆమెకు ౧ ౘ గజముల పొడువుగల గడ్డము గలదట. ౧౭౨౪ సంవత్సరములో 'పుల్టావా'యుద్ధములో నామె చెఱబట్టబడి జార్‌గారికి బహుమానముగా నియ్యబడినది.

3. "మిల్లీ బోయిడీ చెసి" యనునామె జినీవాలో ౧౮3౪లో బుట్టినది.ఆమెను

౧౮౬౨-౬3 సంవత్సరపు లండన్ ప్రదర్శనములోనికి దీసికొనివచ్చిరి. ఆమెకు తలపై పెద్దజుట్టేకాక దట్టమై నల్లగానున్న మీసములు, గడ్డము, చేతులపై నొత్తుగా వెంట్రుకలును నుండెనట.

౮. ౧౮౬౭ లో లండన్‌లో ప్రదర్శింపబడిన జూలియా పాస్ట్రానా యను మఱియొకవనిత యట్టిదేనట.

పలుచని గడ్డముగలవాడు జిత్తులమారియని, యొత్తుగడ్డము గలవాడు మూర్ఖుడని, నిషేయబడినగడ్డము గలవాని నెవ్వరేమి చేయలేరని — ఇత్యాది వచనములు గడ్డములగూర్చి యొకదేశములో జెప్పుకొందురు. మన హిందూదేశములో మెత్తగా, నొత్తుగా, వెడల్పుగానున్న గడ్డములు భాగ్యచిహ్నములని చెప్పుదురు. ఎఱ్ఱని గడ్డముగలవారు దొంగలనియు, గోదుమరంగుగడ్డములు, చెవులదాక వ్యాపించుగడ్డములు భాగ్యసూచకములు కావనియు పల్కుదురు.

పనివాండ్రకు గడ్డములు కాపుదల నిచ్చునని, ధూళి వారిలో నంతగా జొరదని చెప్పుదురు. అది నిజమే.

ముండితముఖ మెక్కుడు సుందరముగా నుండవచ్చును. ముసలితనమును గొంత కప్పిపుచ్చవచ్చును. కాని పండ్లులేనివారికి గడ్డమాలోపమును గప్పివేయును. గడ్డముగల వారిచూపులు భావపూరితములై యుండును. నటకుల కది మిగుల నుపయోగకారి. గొంతుజబ్బులున్నవారు గడ్డములు గొఱుగ గూడదని వైద్యులు నిర్ణయించియున్నారు.

గడ్డము మంచిదని, చెడ్డదని చెప్పుట కెన్నియో హేతువాదములు గలవు. వానిని గొంతవఱకు జెప్పితిని. షేక్స్పియర్ మహాకవి చెప్పినవాక్యములతో నీ వ్యాసము ముగించుచున్నాను.

"He that hath a beard is more a youth, and he that hath no beard is less than a man".



పుస్తక సమీక్ష

గాంధిచరిత్రము - సిద్ధాంతములు

కర్త: కోమాండూరి శఠకోపాచార్యులుగారు, ఎం. ఏ., బి. ఎల్. వెల 8 అణాలు.
చిరునామా — కో. శఠకోపాచార్యులుగారు, వకీలు, కాకినాడ.

మహాత్మ గాంధి కథను తాను స్వయంగా రాసి ప్రకటించినారు కదా! మళ్లీ ఈపుస్తకం ఎందుకని కొంత మంది అడగవచ్చు. వారికి గ్రంథకర్తగారు ఈవిధంగా జవాబు చెప్పినారు—

—'మహాత్ముని జీవితచరిత్ర సమగ్రమైనది ఆంగ్రమం దింతవరకు లేదని తోచినది. 'ఆత్మకథ' 1920 తోనే నిల్చిపోయినది. మరియు అందులో నా మహాత్ముడు సహజముగ ఆధ్యాత్మిక వికాసమునకే ప్రాముఖ్య మిచ్చెను.'

ఆచార్యులుగారు ఆంధ్ర దేశానికి చిరపరిచితులు. మనదేశంలో ప్రస్తుతం ఎక్కువ ఘనతవహించి, భారత జాతి నుద్ధరించుటకు కృషి సల్పుతున్న బోసు, నెహ్రూ గార్లనుసరించినవీరి జీవితచరిత్రలు పాఠకులు ఇదివరకేచదివియుందురు. మహాత్ముడు స్వయంగా తన ఆత్మకథ రాసినమాట నిజమే. అయినా అనేక కారణాల వల్ల మహాత్ముని గురించి వేరే పుస్తకాలు బయలు దేరటం అవసరం. ఎందుకంటే ఆచార్యులవారు చెప్పినట్లు, ఆకథ 1920 వరకే ఆగిపోయింది. మహాత్ముడే స్వయంగా తన మిగిలినకథకూడ పుస్తకంలోకి ఎక్కిస్తాడేమో నని మనమంతా చాలా ఆతురతతో చూస్తున్నాం. కాని వారిందుకై మళ్లీ కలం పట్టలేదు. అదీకాక వారిది ఎంతవరకూ ఆధ్యాత్మికదృష్టికోణం. ఆదృష్టితోనే వారు ఆత్మకథను ప్రారంభించారు. గడచిన ఇరవై యేండ్లనుండీ మన జాతీయాభివృద్ధికై నిరంతరం పాటుపడుచున్న మహాత్మునిజీవితాన్ని ప్రజ లందరూ అర్థం చేసుకోవాలనంటే ఆత్మకథ చాలదు. ఇంకా అనేక గ్రంథాలు, కనీసం వారి ఒక్కొక్క ఉద్యమం—హరిజనులు, గ్రామోద్యోగం, హిందీ, రాజకీయాందోళన, సాంఘికపరివర్తనాలు మొదలైనాటిమీద-ఒక్కొక్క పుస్తకం బయలుదేరాలి; లేనిగో సామాన్యప్రజ వారిని అర్థం చేసుకోలేరు. మహాత్మునకు నాకేమీ క్రొత్త మతం లేదు. సనాతనమతమే నామతం అని ఎప్పుడూ చెప్పతూంటాడు. అయినా వారి ఆత్మకథను ఎక్కువ పరిశీలనాబుద్ధితో చదివినవారికి వారు తమకోరకు హిందూమతంలోంచే ఇంకొకమతాన్ని సృష్టించుకున్నారని బోధపడకపోదు.

కనుక ఇప్పుడు క్రొత్తగా బయలుదేరే పుస్తకాలువారి విశేషాల నన్నిటిని విశదంగా వర్ణించవలసిన బాధ్యత ఉంది. శఠకోపాచార్యులుగారు ఈ దృష్టితోనే ఈ గ్రంథాన్ని సృష్టించారని వేరుగా చెప్పనవసరంలేదు. ఈ పుస్తకంలో గాంధీగారి బాల్యజీవనం ఒక పేజీలలో ఇమిడ్చి, మిగిలిన గ్రంథమంతా 1920 లగాయతు ఇప్పటివరకు మహాత్ముడు మనదేశానికి చేసిన సేవను వర్ణించటంలో వినియోగించారు. అదికాక గాంధిగారి జీవితపద్ధతి, విద్యాభావములు, గ్రామసేవ, మతభావములు, రాజకీయ భావములు, గాంధిగారి మహాత్త్వము, సత్యాగ్రహము, ఖద్దరు, మద్యనిషేధము, అస్పృశ్యతానివారణ, అహింస, సాంఘిక మైత్రి, సామాన్యభావ, గ్రామపరిశ్రమ సంఘము, నిర్మాణకార్యక్రమము, మొదలైన శీర్షికలను, 'గాంధిగారి పద్ధతిలో విశేషాంశములను సత్యాగ్రహము, నిర్మాణకార్యక్రమమునకు సంబంధించిన అనుబంధములను పుస్తకాంతంలో జోడించారు. ఈ శీర్షికలే ఆచార్యులవారి పరిశ్రమకు నిదర్శనములు. ఈ అనుబంధములే ఈ పుస్తకమునకు ఎక్కువవిలువ తెగలిగినవి. అందువల్లనే మహాత్ముని జీవితాన్ని కూలంకషముగా పఠింపగోరువారికి ఈ పుస్తకం కొంతవరకు బాగా ఉపకరిస్తుం దని మామనవి. మహాత్ముని జీవితపద్ధతులనుగురించిన విమర్శనకూడ చాల సరసముగా నున్నది. సోషలిష్టులకు, గాంధీజీకి ఎక్కడెక్కడ భేదాభి

ప్రాయము లున్నవో, దేశభాషలయందు వారికెంత గౌరవముందో, రాత్రింబగలు కార్యభారంతో క్రుంగి ఉంటూ కూడ గుజరాతిభాషకు వారు ఎంతచక్కని సేవ చేయ కలిగినారో, మన హిందూమతాన్ని వారు ఎంతయోగ్యతతో జీర్ణించుకోగలిగారో మొదలైన విషయాలను గురించి ఆచార్యులవారు కొద్దిలో బాగా విమర్శించారు. పిల్లలకు పెద్దలకు అందరికి అర్థం అగులాగు తేలిక భాషలో రాసి, తప్పొప్పులపట్టితో అవసరం లేకుండా జాగ్రత్తగా అచ్చొత్తించిన మన కీపుస్తక మీయగలిగిన ఆచార్యులవారు అభివందనీయులు.

కాని పుస్తకం చివర గ్రంథకర్తగారు ఒకవింతకొల్లు శబ్దాన్ని వాడారు. గాంధీగారు ప్రస్తుతం ఉంటున్న గ్రామంపేరు 'సేవగాం'=సేవాగ్రామం' అనిచెప్పారు. తెలుగులో ఈగ్రామానికి ఎన్నో పేర్లు సృష్టించబడ్డాయి. సైగాం, శివగాష్, సేవగాం, సయిగాం, సేగాన్ మొదలైనవి. దానియథార్థ నామం 'సేగాఁవ్'.

అన్నా

(వెల 0-౮-0లు. విశ్వసాహిత్యమాల, ముంగండ. (వగూ) అంబాజీపేటకు వ్రాసినచో పుస్తకము లభించ గలదు. పుటలు ౨౮౫. పుటల సంఖ్యను బట్టి చూస్తే 0-౮-0 ల వెల చాలా స్వల్పం.

ఇది ఒక నవల. దీనికి కర్త జర్మన్ లేఖకుడు క్లా న్యూక్రాంజ్. అనువదించినది అశ్వినీ కుమార్ దత్తుగారు.

ఈ నవలను గురించి అనువాదకులు ఈ విధంగా రాశారు. "ఈ నవలలో ఉదాహరింపబడిన వ్యక్తులు గాని, వారు చేసిన కృత్యములు గాని సృష్టింపబడినవి కాక, ౧౯౩౯ మేదినములలో కోలిక్ ప్రాన్సీలో జరిగిన వ్యాపారికసంఘటనలనుండి గైకొనబడినవి. వర్గన్యాయము పేరిట యిటుపైని యీ చారిత్రకనవల నాధారంగా తీసుకొని కొందరు వ్యక్తులకు హాని కలుగ

వచ్చునను భయముతో కొన్ని శీర్షమాత్రను మార్చ చేయబడినవి. ముఖ్యముగా దీనిలో వర్ణింపబడిన పోలీసుల దాడులు ఇన్వెస్టిగేషన్ కమిటీవారి డాక్యుమెంట్ల నాధారముగా తీసుకొని వ్రాయబడినవి.”

రాజకీయ కల్లోలములయొక్క రిపోర్టులకు పూర్వాపరసంబంధాలు కలిపించి నవలారూప మిచ్చే ఆచారం పాశ్చాత్యకళాకారులలో ఎక్కువ ఉంది. దీనికి కారణం స్పష్టముష్టాలు. సోషలిజం కమ్యూనిజం పేరిట విదేశాల్లో జరిగిన నరసంహారం తలుచుకుంటే గుండెలు ఝల్లుమంటాయి. మహోగ్రమయిన ఆ హత్యలకు కథారూప మీయజూచు కళాకారుడు ఎక్కువగా రిపోర్టులమీద ఆధారపడకతప్పదు. రిపోర్టులమీద ఆధారపడిన పుస్తకం ఆఘటాలను గురించిన పరిచయమే ఇవ్వగలుగుతుంది కాని వాస్తవానందము నీయజాలదు. మానవీయ భావసంఘర్షణకు దానిలో తావుండదు. మానవుని జీవితచరిత్రను విమర్శించడానికిగాని, లేక మానవుని కారుణిక జీవనాన్ని చిత్రించటానికిగాని అవకాశం ఉండదు. ప్రస్తుత పుస్తకంకూడా అటువంటిదే. కర్ట్ అనే ఒక సామ్యవాది ఉంటాడు. అతని భార్య అన్నా. వారిజీవితం ఆర్థికదుస్థితివల్ల చాల దుర్భరమయి పోతుంది. అప్పుడు కర్ట్ కొంతమంది కమ్యూనిస్టు సోదరులతో పొత్తుచేసుకుని ప్రభుత్వపు శాసనవిధానాన్ని ఎదిరించాలని వాడవాడల ప్రచారం చేస్తాడు. అప్పుడు గవర్నమెంటు ఇదంతా పసికట్టి వేగులవాండ్రను నియమించుతుంది. అయినా వాళ్లను లక్ష్యపెట్టకుండా కర్ట్, అతనిసహచరులు థామస్, హాక్మన్ మొదలైనవారు కలిసి తీవ్రంగా పనిచేస్తారు. ఇంతలో వారు హర్తాళ్ కొరకు నిశ్చయించుకున్న మే ౧-వ తేదీ వస్తుంది. కార్మికు లంతా మహాసమరోత్సాహంతో జయజయగానాలతో నడుములు కట్టి కార్యరంగంలోకి దిగుతారు. కాని పోలీసుదళాలు వచ్చి చేత నయినన్ని హింసలతో ప్రజలను చిందరవందర చేస్తాయి. అయినా కార్మికులు జంకలేదు. వారు దొరికినంతవరకు పాతఆయుధాలను సంపాదించి శత్రువులను చెండాడుతారు. ఎంతచెండాడినా అంతంలో కార్మికులే ఓడిపోతారు. మొదట అన్నా తనభర్త చేస్తూన్న ఆందోళనలో పాల్గొనదు. ఎక రన్నా కర్టును పిలవవస్తే వాళ్లమీద విసుక్కుంటుంది. కాని సమయంవచ్చేసరికి ఆమెకుకూడా ఉద్రేకం కలుగుతుంది. ఎప్పుడూ కర్టుయొక్క యోగక్షేమాలు చూస్తూ యుద్ధంలో అతనివెంట ఉంటుంది. మే రెండవ తేదీ సాయంత్రం పోలీసులకు [illegible] పారిపోతూ, చివరకు వాళ్ల దెబ్బలకుగురియై ఆసుపత్రికి చేర్చబడుతుంది.

క్లుప్తంగా కథ ఇదే. ఆఖరిపరిచ్ఛేదం తీసివేస్తే ఈ కథలో అన్నాపాత్రకు ఏమీ స్థానం లేదు. అన్నాను గురించి మొత్తంపుస్తకంలో మూడునాలుగు పేరాగ్రాపులకంటె ఎక్కువలేవు. అదీకాక తోటకార్మికు లంతా తుపాకిగుళ్లకు ఎర అవుతోంటే అన్నా వెనక ముందు చూడకుండా పరుగెత్తుతుంది. ఇవన్నీ చూస్తే పుస్తకంపేరు అన్నా పెట్టక ఇంకా ఏదైనా పెడితే బాగుండేదనిపిస్తుంది.

అనువాదకుల భాషమాత్రం చాలా సరళంగా ఉందని చెప్పవచ్చు. అనువాదకులు సాధ్యమయినంత వరకు వ్యావహారికభాష వాడాలని ప్రయత్నించారు. అందువల్ల భాష విషయాని కనుగుణంగా ఉండి, పాఠకులకుకూడా మనోరంజనం కలిగించేశక్తి కలిగి ఉంది. వాడుకలో ఉండి, సాహిత్యములోని కెక్కక పోయిన ప్రాణవంతమయిన కొన్ని శబ్దాలు ఈ పుస్తకంలో కనపడుతాయి. మొత్తంమీద చదవదగిన పుస్తక మిది.

గ్రంథస్వీకారము

విశ్వనాథ కవిరాజు వినోదనాటికలు:— ప్రకాశకులు: మల్లాది అవధానిగారు, వేదవ్యాసముద్రణాలయం, విజయనగరం. వెల రు. ౧ ౮-౦ లు.

అపోహ:— కర్త: గాలి బాల సుందరరావుగారు. ప్రకాశకులు: ఉషా గ్రంథావళి- నేలప్రోలు, కృష్ణాజిల్లా. వెల ఆరణాలు. చందాదారులకు ఆగుపుస్తకాలకు పోస్టేజీతో సహా రెండురూపాయలు.

ఇంజెక్షన్ వైద్యము:— ఆంధ్రావళీ గ్రంథమాలలో ఆరవ గ్రంథము. కర్త: డాక్టరు ఆ. సుబ్బారావుగారు, ఎల్. ఎమ్. పి, ఎలమంచిలి. వెల రు. ౧-౦-౦.

'స్వప్నకథ': ఔచిత్య విచార విమర్శ:— పరామర్శకులు: [illegible]. "కుమార" ముద్రణాలయంలో ముద్రితమయి ప్రకటితమైనది. వరంగల్లు.

కళ్యాణకింకిణి:— కర్త: మల్లవరపు విశ్వేశ్వరరావుగారు. ప్రకాశకులు: నవ్యసాహిత్య పరిషత్తు. వెల రు. ౧-౧-౧.

ఏమిచెయ్యాలంటే?:— కర్త: విద్వాన్ విశ్వంగారు. నవ్యసాహిత్యమాలలోని ౨-వ కరపత్రం. వెల అర్ధణా.

పత్రికా స్వీకారము

విజయవాణి:— అనంతపురంనుండి వెలువడిన క్రొత్త వారపత్రిక. ప్రత్యేకంగా రాయలసీమవార్తలూ, విశేషాలూ ప్రకటించడానికీ, అక్కడి రాజకీయ, సాంఘికాది విషయాలను చర్చించడానికీ వెలువడిన పత్రిక. సంవత్సరము చందా రు. 3—౦—౦ లు. దీని ప్రథమ సంపుటము ప్రథమసంచిక దసరాసంచిక అనేపేరున వెల్వడినది.

ఢంకా:— శ్రీ పి. టి. నరసింహాచారిగారి సంపాదకత్వమున వెలువడుతున్న మాసపత్రిక. అక్టోబరు సంచికను వందపూర్వకముగా నందుకొన్నాము.

తెలుఁగుదేశములో ప్రసిద్ధికెక్కిన పండితులగు [illegible] గారు, కవిరాజుగారు, [illegible] మొదలైనవారి రచనలతో [illegible] ఉన్నది. శ్రీ ఆచారిగారి సంపాదకత్వమున ఇది మేలు ప్రతిష్ఠలను సంపాదించి వర్ధిల్లగలదని నమ్ముచున్నాము. సంచిక వెల రెండణాలు.

చిత్రగుప్త:— శ్రీ [illegible] ఆచార్యగారి సంపాదకత్వమున నడచుచున్న ఈ పత్రికకు [illegible] నిండి [illegible] ప్రారంభమయినది. [illegible] సంపుటము [illegible] సంచిక [illegible] యను నలంకరించినది. [illegible] జనాదరణ పొందిన యీపత్రికను గురించి యిదివరకే వ్రాయబడి లేదు. ఈ సంచిక నూతన సంవత్సరారంభంలో పెద్దల ఆశీస్సులు [illegible] 'చలం', [illegible] అవధాని, 'గోపీచంద్' మొదలయిన ప్రసిద్ధ [illegible] వ్రాసిన కథలతోను, వ్యాసములతోను, నాటికలతోను మెప్పుపొందుతూ వెలువడినది.

ప్రజలమన్ననకు పాత్రమై చిరస్థాయిగా ఇంకను గొప్పసేవ చేయగలదని ఆశిస్తున్నాము.

గృహలక్ష్మి:— ఎప్పటివలెనే గృహలక్ష్మి దసరా సంచికను ప్రకటించినది. ఈ సంచిక చక్కని త్రివర్ణ చిత్రములతోను, సాధారణ చిత్రములతోను ముద్దులు మూటగట్టుచున్నది. శ్రీమతులు ఆచంట సత్యవతమ్మగారు, కనపర్తి వరలక్ష్మమ్మగారు, [illegible] సీతాంబగారు, యల్లాప్రగడ సీతాకుమారిగారు, [illegible] మొదలయిన ప్రసిద్ధ రచయిత్రులెందరో యీ సంచికకు చక్కని వ్యాసములు [illegible] దసరా కానుక [illegible] [illegible] [illegible]

బసవపురాణము వెల 2-౮-0

గ్రంథకర్త:—పాల్కురికి సోమనాథకవి పరిష్కర్త:—నేటూరి ప్రభాకరశాస్త్రిగారు

పంద్రెండవ శతాబ్దమున వెలసిన శైవమతప్రతిపాదకమగు ద్విపదకావ్యము. [illegible] మతోద్ధారకుడగు బసవేశ్వరునియు, తత్పూర్వులు తత్సమకాలీనులు నగు శివభక్తుల చరిత్రములను సరసముగను, పాఠకులు మనసుకరగి తన్మయులగునట్లుగను కవి వర్ణించినాడు. గ్రంథము మృదుమధురములగు జానుతెనుగు పలుకుల జాలువారు రచనమున ముద్దులు గురియుచున్నది. గ్రంథము భిన్నభిన్న ప్రాంతములందు దొరికిన పెక్కు తాళపత్ర ప్రతులతో సరిచూచి పరిష్కరింపబడినది. పాఠాంతరములు సూచింపబడినవి. పరిష్కర్త రచియించిన అమూల్యమగు పీఠిక (129 పుటలు) ఇందు గలదు. [illegible] చారిత్రక విశేషములు [illegible] పరిష్కర్త యేర్చికూర్చినారు. ఆధునిక [illegible] ఇది యత్యంతోపకారకము.

మేనేజరు, **ఆంధ్రగ్రంథమాల**, నెం. ౭, తంబుసెట్టివీథి, మదరాసు.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad.

భర్త తనయెడల ప్రేమలేనివాడయి, తనను చూడనైనా చూడక పైని తిరుగుతూ ఉంటే భార్య తన అత్తమామలయెదుట ఎట్లు విలపిస్తుందో చూడండి :

అటునైపు మెడ త్రిప్పు – ఇటునైపు మెడ త్రిప్పు;
నన్ను జూడవు నీదు మిండకొడుకు.
మీయింటివాసాలు – మీయింటి దూలాలు
చూచుటకుమాత్రమే నుండవలెనా ?
మీయిల్లువాకిళ్లు – మీ పెరడు పాకలూ
కాచుకొనియుంటకే నిల్వవలెనా ?
వెళ్తాను మామయ్యా – వెళ్తాను పస్దూలు
వెళ్తాను మావూరు వెళ్తాను నేను
వెళ్తాను అత్తయ్యా – వెళ్తాను మావూరు
కన్నవారింటికే వదలిపోతాను
మీయింటికేడుక్కై – వాదిపోయితినె ?
మీయింటికేహూరకై నేవుంగాడితినె ?
ఉండండి మామయ్యా – ఉండండి మీరు
ఉండండి అత్తయ్యా – ఉండండి మీరు.
చెడిపోతి చెడిపోతి – నేను చెడిపోతి
చనిపోతి చనిపోతి నేను చనిపోతి31.

ఇంటిపని చేయడం కష్టంగా ఉన్న ఇల్లాలు :

ప్రొద్దస్తమానమును వడ్లు దంచగలేను
దంపుళ్లవారింటి బిడ్డ నే గాను,
ప్రొద్దస్తమానమును కట్టె కొట్టగలేను
కట్టెకొట్టేవారి బిడ్డ నే గాను,
ప్రొద్దస్తమానమును బట్ట లుతకగలేను
బట్ట లుతికేవారి బిడ్డ నే గాను,
ప్రొద్దస్తమానమును పసుల కావగలేను
పసులకాపరి యింటి బిడ్డ నే గాను32.

అని దుఃఖపడుతూ మగనితో చెప్తుంది.

అన్యోన్యప్రేమతో సుఖముగా కాపురము చేస్తూ ఉన్న ఆలిమగలకు సంబంధించిన పాటలు సైతము చాలా ఉన్నవి :

నీవు నాకు భార్య వైతి
నేను నీకు భర్త వైతి
కలసి మెలసి ఆడుకొందం
కలసి మెలసి పాడుకొందం
కలసి మెలసి కూడు త్రాగి
కలసి మెలసి అన్నము తిని
కలసి మెలసి కట్టె కొట్టి
దుక్కి పనులు చేసుకొందం
పంటలు పండించుకొందం33.

---

31. ఒత్తెమోడె్త్తె కోన్నె మోకొత్తె పంగదాడిస్సన్.
ఉరున్తానమ్ పోక్ గిగి త్లె దకోనాంగ్ ?
పనోర్నమ్ పోక్ గిగి త్లె దకోనాంగ్ ?
సుక్కోన్నమ్ పోక్ డెడెలె దకోనాంగ్ ?
కరున్నమ్ పోక్ తనస్లె పకోనాంగ్ ?
ఇత్తెకఇయార్ ఇత్తె పన్గుక్ుల్ దెసాఇాే ఎత్తె
ఇత్తెకినార్ ఇత్త కగూడుడ్ దెసాఇాే ఎత్తె
కుమూబెన్ పోక్ మల్గాదాఇఖ్ ఉఆబ్ బెన్ పోక్
మల్గాదాఇఖ్ ?
దకూనా కుఖార్ దకూనాకినార్
సెవ్లిఖ్ నా సెవ్లిఖ్ ఇాన్ నా సెవ్లిఖ్
కరొత్తిఖ్ నా కరొత్తిఖ్ ఇాే నా కరొత్తిఖ్
32. డీతాడ్ ఇాే రత్తి అత్తజాయ్,
ఇాన్ తక్ డిక్ మరన్ అఓన్ తెడ్.
డీతాడ్ ఇాన్ అజలన్ రత్తి అన్నెడాయ్
ఇాన్ గడ్అరా మరన్ అఓన్ తెడ్,
డీతాడ్ ఇాన్ సింద్రీరత్తి అత్తుబాయ్.
ఇాన్ తుబ్కాబ్ మరన్ అఓన్ తెడ్,
డీతాడ్ ఇాన్ తజ్లిఖన్ రత్తి అస్గపాయ్
ఇాన్ సుపామరన్ అఓన్ తెడ్.
33. అమన్ ఇాన్ డుక్రిఇాన్
ఇాన్ అమన్ తనోజ్యాబనమ్
జోక్ జోక్ అతోజ్ సేజ్నె
జోక్ జోక్ కెసెన్ అకెసె
జోక్ జోక్ కుడూన్ అగాయె
జోక్ జోక్ దరజన్ అజుమె
జోక్ జోక్ అజలన్ అఇడె
జోక్ జోక్ ఒరోన్ అఒర్నె
జంద్రుంగంద్రా అ అబ్గూరె.

అడవులలో చెట్లనడుమను నివసించే వారు; గనుక, సవరలు తమయింటివారిని ఒకొక్కరిని ఒకొక్క చెట్టుతో సరిపోల్చి పాడుతూ ఉంటారు. తల్లి కొబ్బరిచెట్టు; పెండ్లాము జీలుగుచెట్టు; కొడుకు పనస చెట్టు; కోడలు ఇప్పచెట్టు; కూతురు అరటి చెట్టు; చెల్లెలు మామిడిచెట్టు. తా నేచెట్టో పాటలో కనబడదు.

ఇంటికి చుట్టం వస్తే సవరలు గౌరవిస్తారు; ఆదరిస్తారు. ఇంట నున్న వాటిలో మంచి దేదో చుట్టాని కిచ్చి తక్కినదే తా మనుభవిస్తారు. ఒక చుట్టమును ఆదరించే విధము వర్ణిస్తూ ఉన్న పాటలో ఒక పేదసవర ఏమంటాడో వినండి :

ఇంట గల దొకచాప;
ఆచాప చినిగినది
ఆచాపమీదనే అతని కూర్చోబెట్టి
నేలపై కూర్చుందు నేను.
నాయింట నున్నవే రెండుమామిడికాయ
లం దొకటి పండినది మరియొకటి పచ్చిదీ;
బాగుగా పండింది అతని కిస్తాను
పచ్చిగా ఉన్న దే తింటాను నేను[34].

తన యౌవనం తగ్గిపోతూ ఉన్నదని విచారిస్తూ ఉన్నవాని విలాపం :

మామిడాకులు పండి యెండిపోయినవి;
ఈ దేహ మొకనాడు ఎండిపోతుంది;
యౌవనము కలకాల ముండునే స్థిరముగా[35]?

మావిపండువలెనె మాగిపోతిని నేను
మాంస మెల్ల తగ్గి మ్రగ్గిపోయె
యౌవనంబు బలము నడగిపోయెను నాకు
ఏడ్చుచుంటి నేను ఏడ్చుచుంటి
మావిపండువలెనె మన దేహములుగూడ
ముదిమి వచ్చినంత ప్రిదిలిపోవు
యౌవనంబు బలము నడగిపోయెను నాకు
ఏడ్చుచుంటి నేను ఏడ్చుచుంటి[36].

సవరలు సాధారణముగా మాటలాడు కొనే మాటలలోనే శబ్దాలంకారము, అర్థాలంకారము గల మాటలు కనబడుతూ ఉంటవి.

కోడాజేజ్ మరన్ (=కొంగకాళ్ల మనిషి); సంతుయ్‌తమ్‌మరన్ (= చుంచుమూతిమనిషి); పైడీబోబ్ మరన్ (= బెంకాయతలమనిషి); కుల్పేడ్ మేబోజన్ (= మారడికాయచనుల పడుచు); కుమాబ్ మడ్ - సాయన్ (= బూది కండ్లసాయబు అనగా ఇంగ్లీషుదొర); కినా తిరన్ (= పులిమేఘము అనగా పులిచారల వలెనే చార లేర్పడిన మేఘము) పెడ్‌సజ్

34. డకోసలాడన్ అబోయ్‌నా సూబన్
అనిన్ ఆతే అతాడ్ సలాడన్
అగ్గొబ్‌గొబ్త్రాయ్ అనిఞ అతాడ్ సలాడఞ
గొబ్త్రాయ్‌ఞాన్ లబోలేజన్.
డకో ఉడాన్‌జి బాగున్ మైసూబన్
అబోయ్ ఆతేగూర్ర అబోయ్‌ఆతె కపీ
తిత్తాయ్ ఞాన్ అగూర్ ఉల్ అనిన్
జుమ్తాయ్ ఞాన్ న అకసీఉల్.
35. ఉడానేబన్ అఓలా అప్రరే
బొడిన్నా కన్నాడోజ్ అస్రరె
డినక్డా కుడ్డుబ్ డిన్నా అడ్గకుపీ
36. ఉడాగూరన్ ఆంబ్రిసోలిఞ్ ఞాన్
కుడ్డుబ్ జెలూఞ స్లైె.
డనాగ్జ్ డాఞేన్ ఞాజ్లె
ఏడాతెనాయ్ ఞాన్ ఏడాతెనాయ్
ఉడా ఉలన్ ఆంబ్రి డోజ్ లెన్
తలైబా డిన్నకీ అస్రరె
డనాగ్జ్ డాఞేన్ ఞాజ్లె
ఏడాతెనాయ్ ఞాన్ ఏడాతెనాయ్

మరన్ (= వేణు స్తాదుమనిషి; అనగా స్తుతి పాఠం చేసేవాడు; పొగడుతూ ఇచ్చకా లాడుతూ తిరిగేవాడు). డజ్జడీబోజన్ అడుబ్ తి' తి' లజ్ శేన్ (= యువతి మనకు పాలు పంచిపెడుతుంది, అంటే, కల్లుచెట్టు—ఈత, ఇప్ప, జీలుగు మొ॥ — మన కందరికీ కల్లు ఇస్తుంది). ఉయుజన్ తరుబన్ యుంకుమ్నే తెన్ (=సూర్యుడు మేఘమును కప్పుకొన్నా డు). డంబంగా మాటలాడేవాడు "ఇాన్ అక్కర్రా తొజ్ యెమ్లెనా ఇాన్ డేన్ పజ్ సిర్తబెన్; సోనబా" (= నేను గట్టిగా ఊపిరివిడి చితే మీ రందరు చెల్లాచెదరై ఎగిరిపోతారు; డాగిఉండండి) అని అంటాడట. అన్ సెలోన్ అతనోజ్బాన్ అబ్రనాబ్ అఇమ్మజేతేన్ఆసన్ అనిన్ తిడేతేన్ (= ఆడుది తన మగనికోపము రాజపెట్టినది గనుక అతడు ఆమెను కొట్టినా డు).సురీకుక్ ఇాన్ బొంగుమ్‌బొంయ్ బరాబ్ తె — డొలైడాతె — అర్గల్ డాతె (= నాకత్తికి చాలా కోపం వచ్చింది — ఆకలి పుట్టింది — దాహ ము వేసినది). కడిబ్ ఇాన్ మల్ జుమ్ జేల్ మర్ తె(= నాఖడ్గమునకు మనిషిమాంసము తిన బుద్ధిపుట్టినది). డిన్నె కాలమ్ కన్ అ మా రా సుడుజన్ గనాయితేన్ అఇమ్‌బా (= ఇంతకాలానికి ఆనెమలిపెట్ట ఇంట్లో దూరి నది పట్టుకొందాం; నెమలిపెట్ట అంటే స్త్రీ అని భావము). కుల్లుమర్ (= నక్కమనిషి అంటే నక్కవలెనే వినయవేషాలు వేసి మోసంచేసేవాడు అని భావం). ఈలాంటి పదములు సవరభాషలో అనేకంగా ఉన్నవి.

సవరల పాటలనైపుణ్యాము, మాటల చమత్కారము దిఙ్మాత్రసూచనగా మాత్ర మే కొన్ని ఉదాహరణములు ఎత్తి చూపించి నాను. లిపిలేని భాషగనుక సవరల సారస్వ తము ఎంత ఉన్నదో ఏవిధంగా ఉన్నదో పూర్తిగా తెలుసుకొనుటకు అవకాశము లేదు. సవరల శ్రుతిస్మృతులలో ఉన్న వాఙ్మయమంతా సంగ్రహించి వ్రాస్తే మహా భారతమంత గ్రంథము కావచ్చునని నా నమ్మకము.



విమర్శనములోని కష్టసుఖములు

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

నిశితపరిశీలనము విమర్శనము. పరిశీలనము సలుపునది మేధ. కన్నుదోయి దీనికి నిమిత్తమాత్రమే! కన్నులెందఱికి లేవు?

తీక్ష్ణపరిశీలనమునకును, గభీరయోచనమునకును అవార్యసంబంధము కలదు. వీని ననుసరించియే విమర్శనము నడువవలెను.

మానవు డనవరతము యోచించియే మాటలాడును. మెదడుపాకము నందక వెడలుమాటలు ఒడుదొడుకు నడకలందు బడిపోవును. ఇట్టి నుడువులు విమర్శనమును చెఱిపివేయును. విమర్శకుడు మితభాషియై యుండవలెను.

సంయమశక్తి నందినవాడే విమర్శకు డగును. క్రమనిష్ఠవలనగాని సంయమశక్తి యలవడదు. ప్రధానమేధాశక్తులలో నిది యొక్కటి. వడవడవాగునా రనేకులు. ఉద్రేకవేగమున మెదడును దొరలిపోనిచ్చువారు బహుసంఖ్యాకులు. విషయపరిశీలనమునుండి దూరస్థులై అమితోద్వేగమున నెందో కొట్టుకొనిపోయి వ్యక్తిదూషణమునకు గడగి, వికృతవిజృంభము సృష్టించువారు పల్వురు.

సంయమ సహనశక్తులు, ధైర్యసాహసములు వెలయునపుడే విజ్ఞానము సార్థకమగును. విశాలదృష్టి తోడైనపు డిది సద్విమర్శనమును గనగలదు.

సద్విమర్శనమునకు వలసిన నైతిక మానసిక ఆధ్యాత్మికశక్తుల నన్నిటిని గమనించినపుడు విమర్శకునికర్తవ్య మెంత కఠినమైనదో గ్రహింతుము.

విమర్శకుడు సూత్రధారుడై నిలిచినపుడే రంగస్థలముమీది ప్రజ్ఞను ప్రజలు గుర్తింతురు. ఈతనికిని, ఈతనిదృష్టి నాకర్షించిన ప్రతిభకును ప్రత్యర్థులైనవారి వాడియీటెపోటుల కీతడు తయారై యుండవలెను.

ఆత్మశక్తిమీది విశ్వాసము వీనిహృదయమున నవిచలితమై యున్నపుడే, వీని నిశ్చయసామర్థ్యము దృఢమై యున్నపుడే నడుముగట్టి యీతడు విమర్శనమునకు గడంగగలడు. తొలుత నీత డనృతమును మార్కొనవలెను. పదపడి దానిదాపునగల ప్రపంచమును ప్రతిఘటింపవలెను. చెత్తకును చెదారమునకును తనమాడ్కిలోని నిప్పు నంటించవలెను. ఆదర్శసత్యాన్వేషి కాగలిగినపుడే సౌందర్యోపాసకుల కీతడు మార్గదర్శి కాగలుగును.

పొగడ్తకు పొంగక, తెగడ్తకు కనలక, ఆశ్రితులనుగాని అరులనుగాని పక్షపాతబుద్ధితో చూడక, సాహిత్యోద్యానమున మేలిపూలు పూయించు వనమాలియై, ఉత్కృష్టసృష్టి నారాధించు మహోత్సుకుడై భావోపాసకుల పురోహితుడై, శారదకు మిగుల గూర్చు నెచ్చెలియై, జిజ్ఞాసువుల హృదయములందు భావబ్రహ్మాంశమును ప్రతిష్ఠించు పరాగ్రశీలియై యీతడు మెలంగజాలును.

సాహిత్యాంగణమున భావోద్వేగమునకు చాల చోటున్నను, విమర్శకుడు ఉద్వేగమునకే గుండె నొగ్గి, హేతుసూత్రమును పుటుక్కున త్రుంపరాదు. కారణనిరూపణము, దృష్టాంతవివరణము, ప్రమాణోల్లేఖనము, తార్కికసూత్రప్రయోగము వీని సిద్ధాంతములను గట్టి పునాదులపై నిలుపును. తనయభిప్రాయములను ప్రజ్ఞావంతుల యుద్దేశములు బలవత్తరములు గావించునవే యైనను, ఈతడు ప్రమాణములచుట్టు భజనసలిపి నైసర్గిక ప్రతిభను, స్వతంత్రప్రజ్ఞను తలవంపులు తెచ్చుకొనరాదు.

తార్కికమూలబంధమునకును, కళాస్వరూపమునకును, స్వకీయశక్తికిని భంగము కలుగనంతదనుక

ఆదరసమన్వితమై [1], ఔదార్యయుక్తమై, ఉత్సాహపూరితమైన విమర్శనము గ్రుడ్డిపొగడ్త యనిపించుకొనదు. గ్రుడ్డిపొగడ్త విమర్శనమందలి మూల్యమును చెఱిపివేయును. ఆత్మగౌరవమును మంటగలిపినవాడును, స్వార్థము నపేక్షించినవాడును మాత్రమే గ్రుడ్డిపొగడ్తకు గడంగును. ఇతడు ప్రత్యక్షముగ తెలుపున దొకటి, పరోక్షముగ పలుకునది వేఱొకటి. వీని యుద్యోగమును, ప్రవర్తనమును కాలక్రమమున నెఱిగి ఈతడు ప్రత్యక్షమైనపుడు ప్రజలు "థూ" యనక మానరు. గ్రుడ్డిపొగడ్త ఒక్కరుని మెప్పును, ఈ మెప్పుతో కొంత పప్పును తెచ్చినను తేకున్నను లోకనిందను తప్పక తెచ్చిపెట్టును. తలకాయనుండి మెదడును తొలగించినవాడే ఇట్టిపొగడ్తకు పొంగి బోర్లపడును. గడుసరిగానైనచో నీపొగడ్త వెనుకగల స్వార్థపంకిలమును గాంచి, దుర్వాసన తన్ను మార్కొనకమున్నె దూరముగ తొలగును; లేదా ఎదుటివాని నెత్తిపొగడ్తను మించిన ఖర్చుకాని పొగడ్తనే వానికి సమర్పించి చిల్లిగవ్వను జారవిడువక తనదారిని తాను పోవును. అతడు గడిదేఱిన దుష్టుడగుచో ఏదో కొంత విదిపి, చిల్లగవ్వలికి దాటి మఱి వానికంట బడకుండు నుపాయము నన్వేషించును. ఆతనివలన దా నపేక్షించిన ఉపకారమేదేని యుండినచో, నీనీతిపొగడ్తలో నది తేలిపోవుచుండుట గ్రహించి, వెంటనే గుండెనుండి తన యాశను తఱిమివేసి ఇతఁడు వెంటనే తనచేతులు కడుగుకొనును. ఈతడు గడుసరి కావున నొడుదుడుకు విమర్శనమునకు గడంగడు. గ్రుడ్డిపొగడ్త దుష్టునకును, అమాయికునకును, అధికారానురాగము కలవానికిని, గ్రుడ్డినమ్మకముగల దాసునకునుగూడ సాధ్యమైన పని యని యెఱిగి వాని ప్రత్యేకవ్యక్తిత్వముపై, ప్రకృతిపై, ప్రవర్తనముపై, గతజీవితవిధానముపై కన్నునిలిపియే, చక్కగ నాతని గుర్తించియే తనగతివిధానము నీతడు నిర్ణయించుకొనును. గ్రుడ్డిపొగడ్త ఎవనికి సాధ్యమో, ఉచ్చరింపరాని దుర్భాషల నుచ్చరించుటకును వానికే సాధ్యము. పొగడి పొగడి తనయుద్దేశము సిద్ధింపని ముహూర్తమున నీత డీరెండవపనికి పూనుకొనును.

గ్రుడ్డిపొగడ్త విమర్శనాంగణమున ప్రవేశింపగూడ దనిన, బలయుతభావమూలబంధముపై నిలిచిన ప్రగాఢప్రశంసకూడ నందు చొరరా దని తలంపరాదు. ప్రశంసింపజాలనివాడు మనుష్యసంఘమునుండి, ముఖ్యముగ సాహితీజగతినుండి దూరముగ తొలగిపోవలెను. పరిమళభారము వహించి కట్టెదుట నగుమోమునన తోచినపుడు, చూడ్కులతో చంద్రకిరణములు చుట్టఱికము సలుపుకొనునపుడు అంతరంగమున స్వర్ణభావసృష్టి సలుపుటకై బాలభాస్కరమయూఖము ఈశ్వరహస్తమట్లు హృదయమును స్పృశించినపుడు, దేవతలకు మేలుబంతి కాజాలు గుణమణిమండితచరిత్ర నాత్మజీవితమున ప్రకటించుమహాపురుషుడు కనులయెదుట దోచినపుడు, నందనమున కెనవచ్చు సృష్టిని స్వీయకావ్యమున ప్రత్యక్షమొనరించి తేజస్వియై కవీంద్రుడు కనులపండు వొనరించినపుడు హృదయ ముత్తాల భావతరంగ సంభరితము కాదా? మహోదధివీచికలకు కట్టుబాట్లు నిర్ణయింపగలఛాందసు డెవరు? ఈతరంగములు గంభీరనినదమున నాత్మప్రకాశము గావించుకొనునుగదా! గంభీరమైన గుండెనుండి, భావోద్వేగ భరితమైన — హృదయమునుండి వెడలువాక్కు దిక్కులందు ప్రతిధ్వనించునుగదా! సముద్రునినోరు మూయగలవా రెవ్వరైననున్నచో భావపూరితమనస్కుని నోరు మూయగలవారును నుందురు. గంభీరవాక్కు కొలతకును, తూనికకును లొంగునది కాదు. బహుళతరంగముల నినదము సాగరసంగీత మగును. గంభీరవాక్సముదాయము గానబంధురమైన ప్రశంస యగును. జగతినుండి జలరాశిని తొలగించుటెట్టిదో, సాహితినుండి ఇట్టి వాక్సముదాయమును దొలగించుటయు నట్టిదే!

---

1. ఈ యాదర మధికానురాగమైనచో, విమర్శకుడు అందమైన అబద్ధమునకు దాసు డగును. అసూయాకుత్సితమైన అబద్ధమును తలమీది కెక్కించును. అబద్ధమెట్టిదైనను, అగ్నిపరీక్షలో బుగ్గి గావలసినదే! మాతృప్రేమ బిడ్డనెరసును చూడనొల్లకుండుటయు, పగతునిఈసునకు ప్రతిభాప్రభ పచ్చనై తోచుటయు, సత్యమీ రెంటికిని దూరస్థ మగుటయు నెఱుంగుదుము.

ప్రశంసించునాతని గుణగణ మెట్టిదో గుఱుతింప వలె ననిన ఈతడు ప్రశంసించు వస్తువెద్ది యని, వ్యక్తి ఎవ్వరని మనము ప్రశ్నించుకొనవలెను. ఆవస్తునాణ్యము ననుసరించియు నీవ్యక్తిగుణము ననుసరించియు వీనిభావ గతి యుండును. ఈతని హృదయగ్రథన మెట్టిదో అపుడు గ్రహింతుము. గుణాన్వితుని ప్రశంసించునాతనికి వాని గుణములందు కొంతపా లుండితీరును. ఎదుటివాని ప్రవర్తనమున గల గొప్పగొనములనే దృష్టిగొని కొలదిపాటి నెరసులను సరకుగొనక తన ప్రశంసను మధురభావపూరిత మొనరించు విమర్శకుడు విశాలహృదయు డని గుర్తింతుము. మెజారిటీ దోషములకు గాక గుణములకే యున్నపుడు అవి చేయగలయె గ్గది? తమకు ననువుగాని చరిత్రమున ప్రవేశించితి మని వెలుగు నుండి శేద్రిమ్మరులు పరుగిడువడువున అల్లన నివి యవ్వలికి తరలిపోయి నిశయమందలి యథాస్థానము జేరుకొనును. ఎవ్వాని చరిత్రలో గుణము లధికముగను, దోషము లల్పముగను నుండునో తన దోసగులకై ఆతడు వాపోవునట్లు అవ్వలనున్న అయ్య లెవ్వరును వాపోవంజాలరు. ఈతనిగుండెలో నేమూలనో చేరుకొనిన మడ్డి ఈతని కన్నీటియందు కరగి ఈవలబడి ఎందేని యంతర్ధానమగును. కుంచెడునిప్పులున్నచోటున గుప్పెడుబొగ్గు లున్ననేమి? నిముసములో వీని కగ్గి తగులదా? ఇవి బుగ్గికావా? మృణాలమును శైవాలమంటుకొనిన దని దానిని విసరివేతుమా? నాచు కడిగి తామరతో పూజామందిరము నలంకరింపమా? అల్పమైన దోసగుచు వీడి సుందరగుణము నిట్టులే హృదయపూజాగారమున నలంకరణసామగ్రి గావించుకొనుట యొప్పకాదా?

ఎదుటివాని గుండెలో చక్కని పరివర్తనమును గనదలచిన మానవుడు ఉన్నదోసమును పెద్దచేయరాదు. స్వకీయభావమును విశేషముగ జేర్చిగాని తీవ్రాంశమును సాధారణ లున్నదున్నట్లుగ తెలుపరు. తనమనసులోని అభిప్రాయమును ఎదుటివాని కాపాదించు నలవాటు పల్వుర కుండును. 'సైకాలజీ' (**Psychology**) లో తెలుపబడిన 'ప్రాజెక్షన్' (**Projection**) ఎందఱందరి మనసుల బనిచేయుదు? దురభిప్రాయము నారోపించితి మేని చేసుఱు చెఱుపు చెప్పరానిదై యుండును. ఉన్నకీడును లేకుండజేయుటకు ముఖ్యమైన ఉపాయము మాటిమాటికి దానిని పెల్లగించి ఉద్రేకమును కలిగించుట కాదు; లేనికీడును అనుమానముచే నేమి, అసూయచే నేమి, అటులుపాటుచే నేమి ఆగ్రహముచే నేమి, ఎదుటివానితలకు గట్టుటకాదు; కట్టెదుట కానంబడు నెరసును పెద్దచేయక సద్భావమును ప్రకాశము గావించు టేయని నొక్కి పల్కెదను. లోపమును "పెనుభూతమా!" యని పిలిచితి మేని ఫణ మెత్తి మఱింత క్రౌర్యము వహించి అది బుసగొట్టును. సద్భావకలితమైన చూడ్కిని దానిపై సారించితి మేని, గుండెలో నెందో యడగిమడగియున్న సదాశ తన్నెవరో పిలుచుచున్నా రని తల యెత్తి అమృతాత్మ నవలోకించి, దొసగును పోద్రోలి మానవుని దేవతను జేసినను జేయును. పెనుభూతమును నిలింపులలోని తలమానికమని ప్రజలలో నెవ్వండుగాని ప్రచారము చేయవలెనని తెలిపితి నని చదువరు లూహింపరాదు. వ్యక్తిగతమైన ఆచరణమువలన నొక యభాగుని మార్చివేయనుంకించుతఱి అవలంబింపవలయువెరవులలో నిది యొక్కండని పేర్కొంటిని. తిట్టి, దండించుటకంటె నిది మిన్నయైన యుపాయ మని వచింతును.

పిశాచమును పిశాచ మని సంబోధించుటచే సంస్కరణోద్దేశమునకు భంగము కలుగు ననిన, పిశాచము కానివానిని పిశాచ మని మాటిమాటికిని పేర్కొంటి మేని, నిక్కముగ నాతడు పిశాచ మై యుగు నేమో! ఆత్మశక్తిగల మహాత్ముడు దూషణము ననుసరించి అధోగతిని బడడు. తనదృష్టి నీత డూర్ధ్వదిశకే, తాను వలచిన ఉత్కృష్టాశయముదిక్కునకే నిబద్ధ మొనరించియుండును. ఇట్టి నిశ్చలశక్తి క్రమసాధనమువలన గాని లభింపదు. ఇట్టివారు మానవులందు నెందఱో యుండరు.

దురారోపణము సామాన్యులందు చెఱుపు దెచ్చితీరును. ఎదుటివానియందు దీనెడుగు గోచరింపదేని, దోషారోపణము చేయువానిలో నిది తప్పక తల యెత్తును. దుర్భావములనే హృదయమున గూడుగట్టుకొననిచ్చువాడు, చేటుచేతలకు మనసిచ్చువాడు ఆత్మజీవితమందైనను ఆర్తినే కాంచునుగాని ఆనందమును

గాదు. విషాక్తమైన తనదృష్టి ననుసరించి, తన యూహాపోహలబట్టి ఈతఁ డెదుటివాని నవలోకించును గావున వీని కాతఁడు నూటికి నూఱుమార్కులు దెచ్చుకొనిన దుర్మతి వలె దోఁచును. చీకటిలో వెల్లగుడ్డను చూచి భూత మనుకొని యులికిపడువా రెందఱు లేరు? త్రాడును త్రొక్కి పాముపై నడుగువేసితిమని యూహాపోహపడి భీతుచే ముప్పు దెచ్చుకొనువా రెందఱు లేరు? ఏవిధమున జూచినను దురారోపణము అనుమానమును, అపెలును, అఘమును, అరిష్టమును దెచ్చును.

విమర్శకుని ప్రధానాశయము సద్గుణ గ్రహణము గాని విధ్వంసము కాదు. ఉత్కృష్టసృష్టికి మార్గదర్శకు డగుట వీని యాదర్శముగాని, తెరువున లోతుగోతులు తీయుట కాదు. గోతులలో నొకఁడు కూలబడుట జూచి కులుకుట కాక గుణసోపానముల నెదుట నిలుపుట విమర్శకుని పవిత్రకర్తవ్యము కాదా? ఆఖననము నరకము లోనికి దారి జేయును; ఈ నిశ్రేణీనిర్మాణము స్వర్గము లోనికి త్రోవ జూపును.

విమర్శనము కేవలము సైన్సుకు సంబంధించినదే యని పలుకువా రనేకు లున్నారు. భౌతికశాస్త్రపు పాలు దీనిలో నధికమై యుండుట నిక్కమే! తీక్ష్ణ పరిశీలనముచే విషయవిభజన మొనరించి, తార్కిక సూత్రముల ననుసరించి సత్యము కనుగొనుట విమర్శనమున గావింపవలయు ముఖ్యకర్తవ్యమైనను, విషయము కళకు సంబంధించిన దగుచో విమర్శనము కూడ కళాసందీపితమై యుండవలె నని వచింతును. విమర్శకుని ప్రత్యేకప్రకృతికూడ నిందు విశేషముగా పనిచేయును. కవీంద్రుడే విమర్శకుడైన, నీతని వాక్కులందు సరసకవితాసామ్రాజ్య ముండును. భట్టబాణునివిమర్శ లిందుకు తార్కాణములుకదా! కళ నెఱుగని భౌతికశాస్త్రవేత్త కావ్యమును విమర్శించుచో కారములను మిరియములను నూరి దానిలో పోయును.

రాళ్లు కొన్నియును పూవులు కొన్నియును నుండులాగున మేధాశక్తికి సంబంధించిన విషయములు కొన్నియును, హృదయవిభూతికి సంబంధించిన విషయములు కొన్నియును గలవు. ఇవి రసపూరితములు; ఉద్వేగసంభరితములు; లలితమైన శైలి నపేక్షించును; సౌందర్యప్రదీప్తమైన శయ్యను కాంక్షించును. పరుసలకును, బెండులకును వీనిలో చోటు లేదు. అవియో? సౌరభాన్వితమైన వాతూలమును గోరవు; లేతనీరెండ నపేక్షింపవు. సౌకుమార్యసౌందర్యములు వాని కక్కఱ లేదు. స్పష్టమై, సంక్షేపమై ఉద్వేగరహితమైన పదములంజే అవి యాత్మప్రకాశము గావించుకొనును.

దృష్టికి స్పర్శకు వస్తువు లొంగును. ఆంతరంగికానుభవమునకే భావము లొంగును. తన్ను బోలినపదార్థమందే, దృశ్యమందే భావము ఆత్మవ్యక్తీకరణము నందును; కావున సుందరదృశ్యములు సుందరభావ బంధురములని, వికృతదృశ్యములు దుర్భావగర్భితములని చెప్పనగును. ఈయంశము నెవ్వరుగాని మననము చేసికొని, పెక్కుమాఱులు పునశ్చరణ మొనరించుకొన నక్కఱ లేదు. దీని నెఱుంగజాలుశక్తి స్వతస్సిద్ధమైన మానసిక నిర్మాణమున గలదు. కనులకు పండు వొనరించు దృశ్యము కట్టెదుట దోచినంతన మానస మానందపూరితమగును. జఘన్యదృశ్య మెదుటబడినంతన నసహ్యభావముకతన యాతనబడును. ఆనందమందే పుష్పసృష్టినిబోలు భావసృష్టి కలుగునుకదా! కలుగుచున్న చుట్టఱికము వస్తుహృదయమునకును మనుష్యహృదయమునకును, వస్తుతత్త్వమునకును మనస్తత్త్వమునకును. ఆంతరంగికగుణ మొకరి యాదేశమునకును ఇష్టానిష్టములకును లొంగదు. గభీరభావమున మునుగీత నీదనేరక తత్త్వపరిశీలన మెఱుగక విషయవిమర్శన మొనరించువాడు అంగప్రత్యంగముల నెఱుగునుగాని ఆయువుపట్టు నెఱుగడు. జిజ్ఞాసువుల కతడు ఆశాభంగమును నిరుత్సాహమును గలిగించును. తన ధోరణిలోనే ఈత డుండును.

ఈతనిప్రకృతి వేఱు, పరిజ్ఞానము వేఱు; విషయప్రకృతి వేఱు, విషయహృదయము వేఱు. వ్యాకరణమునే శరణ్యము చేసికొనినవాడు కావ్యహృదయము నెట్లెఱుంగగలడు? కళాతత్త్వ మెట్లు గ్రహింపజాలును? వైయాకరణ నైణికులకు పంక్తిభోజనము లుండునా? మనుషులతోను, ఇంజనులతోను, మేకులతోను సంపర్కముగలవాడు పూవులను లతలను కెందలిరాకులను ప్రశంసింపగలడా? పెట్రోలుకును, అత్తరుకును చుట్టఱిక మున్నదా? దానిలోనే మునిగితేలువాడు, దీని

యందలి దివ్యహ్రదమున రాజహంసయై యెట్లు హాయి నందగలడు? భౌతికశాస్త్రమునకు సంబంధించిన ప్రకృతి, భావములు, పదార్థములు, పలుకులు వేఱు; కళకు సంబంధించిన ప్రకృతి, భావములు, పదార్థములు, పలుకులు వేఱు. కావున నది మేధకును, ఇది హృదయమునకును సంబంధించిన దంటిని. కళయును శాస్త్రమును ఒక్కటి కానపుడు వీనికి సంబంధించిన విమర్శనము లొక్కటెట్లగును? కాని శాస్త్రమునే యెఱిగినవారు కళననుసరించి పెద్దకబురులు చెప్పుట విందుము. బుద్ధిమంతులు వీనికి వీని లొగ్గకుందురుగాక.

మనోవాక్కాయము లవినాభావసంబంధము గలవి. కావుననే భావ మెట్లుండునో, వాక్కును, వస్తువును నట్లే యుండవలె నంటిని. విషయహృదయమునకును, వ్యక్తిహృదయమునకును అనుకూలసంబంధమున్నతఱి, ఆ యవినాభావసంబంధము అప్రయత్నముగ తనంతదాను చరితార్థతనందును. మాటలాడుతఱి దొలుత భావమును జేర్కొందుము. అవగాహనావసరమున దొలిచోటు నందునది ఇదియే! కాని భావసృష్టి వస్తుదృశ్యమున కనంతరము మనసున దోచును. దృశ్యము భావమును ప్రేరేపించును. మనశ్చక్షుస్సమక్షమందైన నొకరూపమును గాంచి భావమును సృష్టించుకొందుము. ఈ భావము మాటలగుండా పఠితమనసున జొచ్చినంతనే, వాని మానసనేత్రము మ్రోల నిట్టిరూపు తోచితీరును. కావున వస్తువునుండి భావముమీదికిని, భావమునుండి వస్తువుమీదికిని మానసికదృష్టి ఎగయుచుండును. దీని గమనికకు వాక్కు నిమిత్తమాత్రము. ఒక్కొక లలితకళ యొక్కొకనిమిత్తమును నిర్ణయించుకొనును. కావ్యకళ రసపూరితవాక్కును, లలితపదమును తననిమిత్తము గావించుకొనును. మంజుల భావమునకు నిమిత్తము మధురాలాపనము. రూపుకాంక్షించు చిత్రంపుతలంపునకు నిమిత్తము చిత్రలేఖనము. ఆవేగభరితభావమునకు నిమిత్తము తన్మయనృత్యము. జగదీశుని ఊహలకు నిమిత్తములు ప్రకృతిదృశ్యములు, సృష్టిచిత్రములు.

కావ్యకర్త సృష్టికర్త అపరావతారమని వచింతును. బాహ్యనేత్రముల యెదుట ప్రకృతిచిత్రము లెట్లుండునో మానసిక నయనముల మ్రోల కావ్యకర్త సృష్టించుచిత్రములును అట్లే యుండును. ఉదాత్తభావము లుత్కృష్టసృష్టిచిత్రములందే ప్రకాశమగు లీల, కవిసుందరుని ఆశయములు సుందరపదజాలమున ప్రకాశమగు ననుట స్పష్టమాయెనుగదా[1]! తనకును జగదీశునకును, తనసృష్టికిని ఈశ్వరసృష్టికిని గల నేస్తము నెఱిగినవాడు కావ్యకర్త. తనసృష్టి నీశ్వరసృష్టి నీత డొజ్జబంతి గావించుకొనును. ఈశ్వరసృష్టిని తనది గావించుకొని తన సృష్టి నీశ్వరపరము గావించును. ఇరువుర చెవుల కింపై, ఇరువుర మానసముల నలరించువాక్కులందే ఈత డీశ్వరసృష్టిమహిమను గీర్తించును; ఆత్మసృష్టి మహత్త్వమును ప్రకాశము గావించును.

లతాహృదయమందలి లలితభావములే కన్నుగట్టు పూవులై ప్రస్ఫుటించునని, పుష్పమానసమందలి యనురాగభావమే పల్వురహృదయముల నలరించు పరిమళమగునని, చందురునందుగల సద్భావబంధురభావమే వెన్నెలయందు వెల్వడునని, కోకిల మానసమందలి మాధుర్యమే చెవులపండువొనరించు కుహూకుహూలగునని, రవిహృదయస్థ స్వర్ణభావసృష్టియే కనకమరీచులందు ప్రకాశమగునని ఈత డెఱుగును. వస్తుభావములతో పొత్తుగల పలుకులందే వీని నీతడు కీర్తించును.

వివిధవస్తుతత్త్వ మెఱిగిన కవి విమర్శకుడు ఏది సౌందర్యోపేతమైన విషయమో ఏది కాదో త్రుటిలో గ్రహింపగలడు. కాకితపుపూలు భావరహితము లగుటచే వాని పొంతకు బోడు. సుగంధవనమందే ఈతడు మసలును. ఈవంక కోకిలాకలందును, ఆవంక నెమలి కన్నులందును, ఈదెస మసిబొగ్గులలోను, ఆదెస మానిక

1. ప్రకృతిదృశ్యములందలి మొగ్గలును, పూవులును, పండ్లును ఎట్టివో కావ్యదృశ్యములలోని అలంకారములును, శైలీచిత్రములును అట్టివే! ఇవి యతిశయోక్తులని తలపరాదు. ఉత్కృష్టభావప్రకాశమున కివి మిక్కిలి యక్కఱైనవి, తప్పని సరియైనవని వచింతును. భావశూన్యుండును, హృదయరహితుడును మాత్రమే ప్రకృతి చిత్రములనుండియు, వీనినుండియు తొలగిపోవును.

భారతి

సచిత్ర మాసపత్రిక

సంపాదకుడు

శి. శంభుప్రసాద్

ఆంధ్రపత్రికా ముద్రాలయము,
మద్రాసు.
౧౯౩౮

సంపుటము ౧౫, సంచిక ౧౧

ప్రకటన

ఈక్రింది కనబరచిన నెంబర్లవారికి ఈనెల భారతి (1938 సం. నవంబరు నెల)తో ఇదివరకు చెల్లించిన చందా పూర్తి యగుచున్నది. తిరిగి ఇంకొక సంవత్సరమున కగు చందా మాకు చేరునట్లు ఈనెలాఖరులోగా మనియార్డరు చేసినచో తెంపు లేకుండ పత్రికను పంపుచుందుము. అట్లు తమ యొద్దనుండి 30-వ తేది లోపుగ సొమ్ము రానిచో సహజభాషాభిమాను లగు తాము తిరిగి ఇంకొక సంవత్సరమువఱకు భారతి చందాదారులుగ నుందురను నమ్మకముతో 1938 సం డిసంబరు 10-వ తేదిని రూ 6—4—0 లకు వి. పి పంపుచున్నాము. గావున తా మెప్పటివలెనే పత్రికయం దభిమాన ముంచి సొమ్ము చెల్లించి వి. పి. ని గైకొన ప్రార్థితులు. ఒకవేళ తమకీ పత్రిక ప్రస్తుత మనవసరముగ దోచినచో మాకావిషయము వెంటనే తెలియజేసిన యెడల వి. పి. పంపుట నాపుదుము.

A 12. D 6. H 16, 47, 49, 50, 52, 53, 54. K 15. L 9. N 19, 20. P 34, 35. R 12, 37, 38, 39. S 15, 17, 24, 96, 97, 98, 99, 100, 101.

చందాదారులకొక హెచ్చరిక

ఆంధ్రదేశములోని వివిధ ప్రదేశములందు ఆంధ్ర పత్రికను విక్రయించుచున్నవారు 1938 అక్టోబరు 1-వ తే నుండి "న్యూస్ ఏజెంట్సు" అను పేరుతో వ్యవహరింపబడుదురు. ఆంధ్రపత్రిక (దైనిక, వార) సంచికలు, భారతి (మాసపత్రిక) మున్నగునవి సదరు "న్యూస్ ఏజెంట్సు" వారికి నిర్ణయించిన ఆయా ప్రదేశములందు వారిస్వంత బాధ్యతమీద విక్రయించుటకు సంపూర్ణముగా అధికారము పొందియున్నారు. "ఆంధ్ర దైనికపత్రిక" రోజున్నూ అనగా శనివారపు పత్రికలతో సహా విడిపత్రిక 1-కి రూ 0-1-0. న్యూస్-ఏజెంట్లున్న ప్రదేశముల యందు మాత్రము మాసవారీ చందా ప్రతి 1-కి రూ 1-12-0 లు మా కార్యాలయమునుండి నేరుగ పోస్టు ద్వారా పంపవలసిన పత్రికలకు మాసవారీ చందా ప్రతి 1-కి రూ 2-0-0 లు.

వి ష య సూ చి క

చిత్రములు

త్రివర్ణచిత్రము : ఏకాంతసీమ.


చిత్రకారుడు : సి. యల్. నరసింహమూర్తిగారు.

వ్యంగ్యచిత్రము : లోకప్రవృత్తి.

వ్యాసవిలేఖకులకు మనవి

వ్యాసాలు ఎనిమిదిపుటలకు మించకుండా ఉండాలి. వ్యాసరచన రంజకంగా ఉండాలి. శాస్త్రీయవిషయాలనుగురించిన వ్యాసాలుకూడా ఎక్కువ పరిభాషా, ఎక్కువ వివరాలూ లేకుండా సంగ్రహంగాను, సామాన్యపాఠకునికి విషయం బోధపడేటట్టు సులభంగాను, మనస్సును కథలా ఆకట్టేటట్టు ఆకర్షకంగాను ఉండాలి. శాసనవ్యాసాలు పదిపన్నెండు పుటలకు మించేయెడల రెండుసంచికలలో ప్రకటింపవలసివచ్చును.

దేశాన్ని ఎక్కువగా కలవరపరుస్తున్న సాంఘిక ఆర్థిక, రాజకీయాది విషయాలనుగురించీ, మనఆంధ్రుల ప్రత్యేకసమస్యలనుగురించీ ప్రత్యేకవ్యాసాలు కావాలి. సాధ్యమయినంతవరకు ఎత్తుకునే విషయంలోను, చూచేదృష్టిలోను, రచించేరచనలోను కొత్తదనం కావాలి. మన ఉద్యమాలూ, మనదేశం, మనసంఘం, మనఆశయాలు భారతిలో ప్రతిఫలించేటట్టు చూడవలసిందని వ్యాసకర్తలకు మనవి.—భా. సం.



ఏ కాం త సీ మ



సంపు. ౧౫ బహుధాన్య, కార్తికమాసము (నవంబరు 1938) సంఖ్య ౧౧

వేణుగీతారవము

పాకల వేంకట సూర్యనారాయణ

శారదకౌముదీవిమలశశాంకహృదంతరతీవ్రభేదినై
యీ రమణీయగీతి ప్రవహించెడిః రాగమయుండు మోహనా
కారుఁడునైన యే ప్రభుశిఖామణి వేణువునుండి చిందెనో—
యూరక లోఁతులం దడవుచున్నది కోమలమానసంబులన్.

విరిసిన పుష్పకన్నియల వెల్వడు నిశ్వసనమ్ములైన సుం
దరమధుసౌరభంబులను దాల్చి భరంబునఁ దూలిపోవు బం
ధురమలయాచలానిలుని త్రోవల నామురళీస్వరమ్ము క్రి
క్కిరియుచు మారుమ్రోయఁదొడఁగెన్ జలరాశి గభీరఘోషలన్.

చల్లని వెండివెన్నెలకుఁ జక్కని యుయ్యెలఁ గట్టి జోలలన్
మెల్లనఁ బాడు శైవలిని, నిర్మలమంజుల సైకతస్థలుల్,
జిల్లున బండలం ద్రవముఁ జేయు మనోహరవేణునిస్వనం,
బల్లనఁ జేర్చె నన్నమృతభావసుషుప్తితటాంతరంబులన్.

ఏమ్మెయి సడ్డులేని రయమేర్పడ జాలుగఁ దేనెవాఁకచం
దమ్మున సాగిపోయెడు సుధామధురాద్భుతగీతికాస్రవా
హమ్మున నేనెకాదు నిఖిలార్ణవమున్, ధరణీతలంబు, వ్యో
మమ్మును, దారకావళి, సమస్తజగంబును లీనమైచనెన్.

నీలాంభోద మొకండు లేచి యెదుటన్ నిల్వంబడెన్; వెంటనే
తూలంబుంబలె వ్రీలిపోవ నెవఁడో తోఁచెన్ జగన్మోహనుం;
డాలోకింపఁగ నందగోపతనయుం డాతండె కాఁబోలు; కెం
గేలన్ వంశియు, మస్తకమ్మునఁ జెలంగెన్ గేకిపింఛం బదే!

జలరుహాసుందరంబులు విశాలములౌ నయనద్వయాంచలం
బుల వికసించు నాతని యమోఘదరస్మిత దివ్యశోభలం
బాలుపుగ నూగు బర్హమును బోలఁగ నూగెను మన్మనంబులో
పలి ప్రణయోజ్జ్వలంబు లగు భావపరంపర లానుపూర్విగన్.

యమునా నిర్ఝరిణీ విశాల రమణీయప్రాంగణస్థానముల్,
సుమసంతానలతాలయ ప్రకరముల్, సుశ్లోక బృందావన
ప్రమదారామతలంబులున్, మృదుతమాలక్షోణి జాతాంతర
స్థమహానిర్మలశాద్వలంబులును ప్రత్యక్షంబుగాఁ గన్పడెన్.

పాయక మామకాత్మభగవంతునిగా నిరతమ్ముఁ గొల్చు నా
శ్రీయుత నీలనీరదశరీరుఁడు పిల్లనగ్రోవి పింపిళుల్
గూయఁగ నోష్ఠబింబమునఁ గోరికమైఁ దరుణాంగుళీకభా
వాయతలాస్యమున్ నెఱపె నంతట రూపవిధూతకాముఁడై.

మరుజన్మంబున గోపకాంతనయి జన్మంబొంది వర్ధిల్లి నా
చిరవాంఛల్ సఫలం బొనర్చుకొని రాశీభూత మోదాశ్రుని
ర్ఝరనిర్మగ్నసుఖంబునన్ హృదయసర్వస్వంబు నర్పింప శ్రీ
చరణాంభోరుహసీమలన్ నిలిచి హస్తద్వంద్వమున్ మోడ్చితిన్.

మొహమ్మద్ ఇఖ్బాల్-

అతని కవిత్వము

మొహమ్మద్ ఖాసిం ఖాన్

[గద్యము కన్నను పద్యమే హృద్యముగ నుండునుగనుక (ఇఖ్బాల్ భావములను) పద్యమునందే పెట్టితిని. ఒకటిరెండు-చోట్ల యతి కుదరకపోయినను ఆశబ్దమును తీసివేయనిష్టములేక అట్లే వదలితిని. కొన్ని పద్యములు సీసపాద ప్రముఖండమును వృత్తముగా గొని వ్రాసితిని. ఉర్దూగజల్‌లోని భావములు మరొకవృత్తములో సరిగా రావు. సీసపాదప్రముఖండము పాడుటకు చాల అనువుగానుండును.]

ఇఖ్బాల్ అస్తమించినాడు. భారత సాహిత్య వసంతోదయమును తన మధుర గీతామృతముచే పులకరింపజేసిన ఒక బుల్బులి మూగవోయినది. ఒక మహాజ్యోతి చల్లారినది.

ఇఖ్బాల్ మరణము భారతసాహిత్యమునకు ఒక తీరని కొరత. భారతసాహిత్యమునకే కాదు, విశ్వసాహిత్యమునకే లోటు కలిగినది. ఇఖ్బాల్ కేవలము భారతకవియే కాదు; అతనిసందేశము సర్వప్రపంచమునకు.

ప్రాక్సంస్కృతిని పాశ్చాత్య విజ్ఞానముచే మెరుగుపెట్టి, నవ్యరీతుల అమృతగానమొనర్చిన విశ్వకవి ఇఖ్బాల్. అనంతమగు సౌందర్యపిపాసతో బీడువోయిన హృదయక్షేత్రముల సౌందర్యానందప్రదీప్త సుధామధుర గీతావృష్టిని కురిపించిన మహాకవి ఇఖ్బాల్. రసావేశముతో కర్మయోగమునకు పురికొల్పు గీతాళిచే జీర్ణమైన ముస్లిమ్‌సంఘమును పునరుజ్జీవింపజేసిన మహామహుడు ఇఖ్బాల్. సామ్రాజ్యతత్త్వమును తుత్తునియలొనర్చి, 'పుంజీపతిత్వము'ను ఖండించి, స్వార్థజాతీయతత్త్వమును నిరాకరించి, విశ్వాత్త్వమును బోధించిన రాజకీయ తత్త్వవేత్త ఇఖ్బాల్. సన్యాసమే ముక్తిసాధనమను పురాతన వేదాంత సూఫీసిద్ధాంతములను దిద్ది కర్మయోగమే ముక్తిమార్గమని నిరూపించి చూపిన తాత్త్వికుడు ఇఖ్బాల్.

ఇఖ్బాల్ శుష్కవేదాంతమును తీయని మాటలలో అవ్యక్తముగా చెప్పె మిస్టిక్ కవి కాదు. కేవలము ప్రేమయందు, సౌదర్యమునందు లీనమై వ్యవహారప్రపంచమును పూర్తిగా విడిచిన సాహిత్య సన్యాసి కాడతడు. ఇఖ్బాల్ కవి, తాత్త్వికుడు, నాయకుడు. ప్రపంచములో ఒక సౌందర్యరసస్రవంతిని ప్రవహింపజేసి, ప్రపంచసమస్యలపై అపూర్వమగు కాంతిని ప్రసరింపజేసి మనలను తనవైపు అతిశక్తివంతముగ నాకర్షించిన ప్రతిభాశాలి అతడు. ఇప్పుడు భారతదేశములో హిందూస్థానీ తెలిసిన యేవ్యక్తియు ఇఖ్బాల్‌గీతములలో కొన్నిటినైనను కంఠస్థముగ నెఱుగనివాడుండడని తేజ్ బహాదూర్ సప్రూగారనిరి. దీనికి కార

ణము కలదు. ఇఖ్బాల్ ప్రపంచ పునర్నిర్మాణమునకై ఇచ్చిన ఒకమహత్తర సందేశము కలదు. ఆసందేశము నతడు మధురకవితాముఖమున గొంతెత్తి పాడినాడు. అది అందరిని ఆకర్షించినది. అతనితో నేకీభవించినను ఏకీభవింపకపోయినను అతని ఉన్నతాదర్శము ప్రపంచము నటువైపుకు లాగుచునే యున్నది.

ఇఖ్బాలుకు కళ కేవలము రమణీయార్థ ప్రతిపాదకము కాదు. కళాసృష్టి కళకొఱకే యను గ్రుడ్డికళా రాధకుడు కా డతడు. కళ మానవజీవితము నుత్తేజిత మొనర్పవలెను; ఆత్మోద్ధరణమున కుపకరింపవలెను; హృదయ సంస్కారమునకు తోడ్పడవలెను; సంఘము నందలి నిర్మాణశక్తులకు దోహద మీయవలెను; మానవపరిణామమునకు సహాయకారి కావలెను; ఉత్తమాదర్శములను స్థాపించవలెను. అంతేకాని మానవుని భావములను కుంచించి, నీతిబాహ్యు నొనర్చి, సత్యమును ప్రచ్ఛన్న మొనర్చి, మానవుని సర్వతోముఖప్రగతి నరికట్టుటను కవిత హేయమైనదని ఇఖ్బాల్ ఉద్దేశము. "కవిత జీవప్రదాయిని కావలెను" అని అత డొకచో చెప్పినాడు. ఇఖ్బాల్ ఈ ఉన్నతాదర్శమును పురస్కరించుకొనియే కవితాగానమును చేసినాడు.

ఇఖ్బాల్ కవితాజీవితములో మూడు దశలు స్పష్టముగా కన్పించును. ప్రథమదశయం దతని కవితాకన్యకు బాల్యము. ఈ దశలో అతడు రచించిన కావ్యములలో తత్త్వచింతనము కన్పించదు. ప్రకృతియొక్క బాహ్యసౌందర్యమే అతని నప్పు డాకర్షించినది; హిమకిరీటము దాల్చి అంబరమును చుంబించు మిహికాసౌధశిఖరా లతని హృదయము నానందావేశముల ముంచెత్తును; సిమ్మోచుట్టు రెపరెప కొట్టుకొనుచు రెక్కలు కాలుననియైన లెక్కగొనక నీప కళికపై బడి అసువులం గోల్పోవు శలభమును గని అతనిహృదయము చలించును. లేగులాబిని చూచి తహతహలాడు తరుణబుల్బులి చిన్నియెడందరగులు ప్రేమాగ్నిజ్వాలలు అతనిభావన నుత్తేజిత మొనర్చును. మోహపారవశ్యమున గులాబిని కౌగిలించి వ్రణకిణమ్మైన అమాయకపు పికిలిపిట్టను చూచి అతని మెత్తనియెద శోణిత మ్మగును. ఒకప్పుడు ఊసరక్షేత్రములైన మానవహృదయముల తత్త్వామృతముచే సేచన మొనర్చిన ఒకయోగి సమాధిని జూచి సగౌరవస్కృతై ధ్యానమగ్ను డగును. ఇఖ్బాల్ ఈ కాలముననే 'హిమాలయ', 'అనాథగీతి', 'తరానా' మున్నగు కావ్యములను రచించెను.

తరువాతిదశలో ఇఖ్బాల్ కవితాకన్య యౌవనవతి యాయెను. ఆమె ప్రత్యంగము సౌందర్యనికసితమాయెను. భావములలో ఎక్కువ ఆవేశము, ఎక్కువ ఉద్వేగము, భావనలో ఎక్కువ ఔన్నత్యము, రసములో ఎక్కువ సంపూర్ణత, భాషలో ఎక్కువ లాలిత్యము కన్పించును. ఈ కాలముననే ఇఖ్బాల్ అనేక జాతీయగీతములను వ్రాసినాడు. సంఘమునందలి అనేక దురాచారములపై విప్లవధ్వజమెత్తినాడు. భోగములను మరిగి సరళజీవితమును విడనాడిన ముస్లిమ్ సంఘమును ప్రవక్తనాటి సరళత్వము నవలంబింపుమని ఉద్బోధించినాడు. 'షిక్వా',

'జవాబె షిక్వా' అను అతని ప్రఖ్యాత కావ్యము లీ కాలముననే వెలసినవి.

మూడవదశలో ఇఖ్బాల్‌కవితాజీవితములో గొప్ప మార్పు వచ్చినది. ఇఖ్బాల్ పాశ్చాత్యదేశముల కేగి, అక్కడ ఇంగ్లండు, జర్మనీలలో ఉన్నతవిద్య నభ్యసించి, లండన్ విశ్వవిద్యాలయమున ఆచార్యపీఠము నలంకరించిన తరువాత వ్రాసిన కావ్యములలో భావగాంభీర్యము, తత్త్వచింతనము, ఆధ్యాత్మిక వికాసము కన్పించును. 'ఆత్మరహస్యము', 'ప్రాకృందేశము', 'బాంగెదరా', 'బాలెజిబ్రయీల్' మున్నగు మహాకావ్యము లీకాలముననే వెలసినవి.

ఆధ్యాత్మికవిషయములలో ఇఖ్బాల్ పూర్వసూఫీకవుల సంప్రదాయము ననుసరించినవాడు. కాని సూఫీకవులకును ఇఖ్బాలుకును ఒకభేదము కలదు. సూఫీకవులు నివృత్తి మార్గానుచరులు. ఇఖ్బాల్ ప్రవృత్తిమార్గము ననుసరించినవాడు. సన్న్యాసమనిన అతనికి కిట్టదు. సన్న్యాసము వ్యక్తిత్వసిద్ధాంతము(Individualism) పై నిర్మింపబడినది. సంసారము సాంఘికవ్యవస్థ. మానవుడు సంఘజీవి. సంఘజీవియై సంస్కారమును పొంది తాను తరించి, ఇతరులను తరింపజేయుటయే అతని ఆదర్శము. భగవంతుడు మానవుని కారణరహితముగ సృజింపలేదు. సంఘజీవియై ఈ సృష్టియజ్ఞమం దాత్మత్యాగము చేయుట మానవజన్మయందలి పరమార్థము. అంతమాత్రమున ఈ ప్రపంచమే సర్వమునని చెప్ప చార్వాకుడు కాడు ఇఖ్బాల్. ఈ జీవితము క్షణభంగురము.

> జీవితంపు శాఖలఁ జిగిర్చి, కుసుమించి
> వాడి క్షణములో రాలు జీవాళి భూళి;
> ఒక్క కలకంఠ మెందేని నొక్కశాఖ
> వ్రాలి యెగిరిపోవు త్రుటి నొక్క పాటఁ బాడి.

అని ఇఖ్బాల్ అతిరమ్యముగ ఈ భావమును చెప్పినాడు. ఈజీవితము దుఃఖమయము, కంటకావృతము.

> ఈజగత్తు ల్లాఁదోఁ టని యెంతురేమొ
> వనట నిట్టూర్పుల కిది నివాసనగరి
> మలయమందానిలము వీచు మందనిచట,
> ముకుళిముల విచ్చు మ్లానమై భూమి రాల.

ఈ దుఃఖమయప్రపంచము అంతమాత్రమున త్యాజ్యముకాదు. ప్రతిజీవికి జీవితమొక ఆనందము నిచ్చుచున్నది. ఆ ఆనందమే ఆ జీవిజీవితమును సహ్యమొనర్చుచున్నది. ప్రతిజీవి ఆదర్శము ఆ ఆనందము నందే అంతర్లీనమై యున్నది. ఏనాడా ఆనందము క్షీణించునో, ఆదర్శము సఫలమగునో నాడే మానవునకు మరణము సిద్ధించును. ఒక్కొక్కప్పుడా ఆదర్శమునకు ఆహుతియై, ఆ ఆనందానికి ఇంధనమై దేహమును చాలించుకోవచ్చును — ఇఖ్బాల్ ఈతత్త్వమును 'శలభము — దివ్వె' అను ఒక కావ్యమున అతి రమణీయముగ చెప్పినాడు.

> దుఃఖమయమగు ఈజగత్తున భవాదృ
> శమహదానందదజ్యోతి శలభమునకు
> కలిగియుండుటగాదె దాని లలితహృది
> జీవితంపుటాస రగిలి చిందులాడె.

దీపకళికయందు శలభము గాంచు ఆనందమే దాని జీవితంపుటాసను రగిల్చిన దనుచున్నాడు. ఈలోకము దుఃఖమయము, పాపభూయిష్ఠము అని దానిని త్యజించుట భీరుత్వము. దుఃఖమయమగు లోకమున ఆనందజ్వాలను రగిల్చి, పాపమయమగు ఈలోకమును పుణ్యభూమిగ మార్చి మాన

పుడు తనజన్మను సార్థకపరచుకోవలెను. డయ్యాజనీసువలె ఈ దుఃఖ ప్రపంచమున పుట్టితిమే అని విలపింపరాదు.

> ఇపుడు నరుఁడు స్వర్గచ్యుతి కేడ్వనేల[1]
> శృంఖలమ్ముల నన్నింటిఁ ద్రెంచివైచి
> మాలితో నను పూరాదోఁట: "మందు లెన్ని
> నాళ్లు వెదకె దీపూలవ్రణాల కీవు?"

అని ఇఖ్బాల్ మానవుని ప్రబోధించుచున్నాడు — 'నీప్రపంచమును నీవే సృజించుకొనుము. ఇదే నీవు జీవితుడవని తెల్పుచిహ్నము'.

అప్నిదున్యాఁ ఆప్ పైదాకర్ అగర్ జిన్దోఁమేఁ హై
సర్రె ఆదమ్ హై జమీరె కున్ ఫికాఁ హై జిన్దగీ.

'స ఈక్షతు లోకాన్ను సృజాయతి' అనుదానిలో ఈక్షించినవాడవు నీవే అగుము అని ఇఖ్బాల్ చెప్పుచున్నాడు. 'అగుగాక' (కున్)[2]అని భగవంతుడు సర్వసృష్టిని చేసినాడు. నీజీవితమును 'కున్' అనువాడవు నీవే అని ఇఖ్బాల్ చెప్పుచున్నాడు. ఇఖ్బాల్ కర్మయోగమున కిదే పునాదరాయి.

ఇఖ్బాల్ సామాజికతత్త్వము ఇదే మూలసూత్రముపై ఆధారపడియున్నది. మానవునిబ్రతుకు స్వార్థముకొరకు కాదు. అతడు సంఘమున కొక అంగమువంటివాడు. సంఘముకొరకతడు అతనికొరకు సంఘము త్యాగ మొనర్పవలెను. ఈ సృష్టియజ్ఞమున ప్రతిమానవుడును అధ్వర్యుడే. కవియే యీ విషయమున:

> నరుఁడు నరుఁడెయ్యొ సంఘ మాలంబనముగ
> ఎవ్వఁ డేకాకిగా నుండనెంచు జగతి ?
> జలధియందునె అల లుంట కలుగు గాని
> వనధి విడిచి బయట అల యనుట సత్తి

అని చెప్పినాడు. మరియొకచో ఈ విషయమునుగురించి వ్రాయును,

"విశ్వసృష్టిలో మనుజీవితము ఒక విశాల సముద్రమువంటి దందును. దానిలో చిన్న చిన్న కెరటము లసంఖ్యాకముగ నున్నవి. వ్యక్తిపరముగ నీ కెరటములు వేరుగా నుండియు, ఇతర కెరటములతో నెంతో అన్యోన్యముతో అవ్యక్తమగు సౌహార్దముతో మెలగును. ప్రతికెరటము ఒక్కొక్క చిన్న విశ్వము. అయినను అది తక్కిన కెరటములతో ఇట్లన్యోన్యముగ మెలగుచున్నది. సృష్టియందలి యీ రహస్యము ఖుర్ ఆన్ ఇట్లు వాకొనుచున్నది 'వఖలఖ్ నాకుమ్ ఫీ నఫ్సిన్ వాహిద'. (ఒకేఆత్మనుండి ఈ సర్వసృష్టి నొసర్చితిని) అందుకొరకే ప్రతికెరటము సముద్రములో నుండి తన వ్యక్తిత్వమును చాటుచున్నది. సముద్రమునుండి వేరుపడినట్లయిన దాని అస్తిత్వమే లేదు. మానవుని సమస్త భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక జీవితములకు సంఘమే ఆకార మిచ్చినది. అందుచే ఆ సంఘమును విడిచి వైరాగ్యము నవలంబించుట ఆత్మవంచనము" అని ఇఖ్బాల్ వ్రాసినాడు.

---

1. మొదటి మానవుడు ఆదమ్ తన అపరాధముచే స్వర్గమును పోగొట్టుకొనెనని పురాణగాథ కలదు. క్రైస్తవులు మానవు లందరును ఆదమ్ చేసిన మొదటి పాపవాసనతో (Original sin) పుట్టి రందురు.

2. 'ఖుర్ ఆన్'లో 'కున్ ఫయకూన్' (అగుగాక! అన్నంతలో సర్వము నాయెను) అని చెప్పబడినది.

శిశిరమున క్షాంతమునుండి చీలి వృక్ష
శాఖ చిగిరించదొక్కొ వసంతమందు ?

ఒకే ఆత్మనుండి సర్వసృష్టియు నాయె నను ఖుర్ఆన్ వచనమే ఇఖ్బాల్ సమస్త తత్త్వమునకును పునాది. సృష్టియందతడు అద్వైతమును దర్శించెను. దీని నెంత రసవత్తరముగ చెప్పెనో చూడుడు:

మనము పలికెడి మాటల మాడ్పెగాని
పుష్పసౌరభమూ పల్కు బుల్బులిదియు
పాటలందు, కాని మఱుఁగుపడియె సరళ
మైన సర్వైక్యతారహస్యము వివిధము
బహుళము నను ఇట్టి ప్రకృతిభంగిమములఁ.

ఆత్మకు క్షయములేదు. దానికి మరణము లేదు. మరణ మనునది జీవితమునకు మలిమెట్టు. మరణమునకు భయపడువాని కన్న భీరుడు మరొక డుండడు. మరణభీతి కలవాడు విశ్వాసవంతుడు కాజాలడు. ధర్మనిర్వహణమునందసువులం గోల్పోవుటకన్న వీరకార్యము మరొకటి లేదు. ఈభావములను ఇఖ్బాల్ పలుచోట్ల చెప్పినాడు. జీవము, మరణము – వీటి ధర్మము లెట్లు చెప్పినాడో చూడుడు :

మృత్తికాగర్భమున దనిమడియుండియుఁగూడ
కను విచ్చి విరివీథి కనగోరు విరిగింజ;
తద్గుప్తమగు జీవితజ్వాల గొంతెత్తి
ప్రగతిప్రకాశములకయి పరితపించు;
అట నీలా గగన పర్యంతము తనవల
యున్మ్రకు సాచిన ఆత్మకిరణములఁ
బుంజీకృతముఁజేయు పుణ్యభూమి సమాధి;
పర్యాయపదము జీవనవాక్కృతికి మృతి;
చింకిగుడ్డలు విడిచి వినూత్న శుభ్రవ
స్త్రములఁ దాల్చు మనయాత్మ మరణముకతన.

ఇఖ్బాల్ సూఫీ కవులవలె ప్రేమయోగమే ముక్తిసాధనమనువాడు. ప్రేమకు మించినది మరొకటి లేదు. ప్రేమ మృత్యువును సైతము జయించును. ప్రేమవలన కలిగిన ఆనందమువలననే సర్వసృష్టియు స్థిరత్వమును పొందియున్నది. దానివల్లనే ప్రకాశమునకు వచ్చుచున్నది. దాననే అది లీనమైపోవును. "ఆనందాద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే। ఆనందేన జాతాని జీవంతి। ఆనందం ప్రయన్త్యభిసంవిశంతీతి" అను ఉపనిషద్వాక్యములయందలి ఆనందమునకు బదులు ప్రేమ యనినచో అది ఇఖ్బాల్ తత్త్వమునకు పూర్తిగా సరిపడును. సూఫీ కవి సార్వభౌముడగు జలాలుద్దీన్ రూమీ ఈ ప్రేమయొక్క మహత్తు నిట్లు వాకొనుచున్నాడు : [1]

ఐహికకాయమ్ము నైహేయసపథాల
స్వైరయూన మొనర్చె ప్రణయ మహిమఁగాదె,[2]
జడప్రకృతియుఁగూడ చైతన్యమొందె సి
నాయీమహీధ్రప్రణయలాస్యములలోన.[3]

ఉర్దూకవులలో గాలిబ్ యును, పారశీక కవులలో రూమీయును ఇఖ్బాల్ గురుప్రాయులని కొందరు విమర్శకుల మతము. కొంతవర కది నిజమేకాని ఇఖ్బాల్ తన ఉప

1. నాచే తెనిగింపబడుచున్న రూమీకవిచంద్రుని 'మస్నవీ' నుండి ఉద్ధృతము.

2. శ్రీ మొహమ్మద్ ప్రవక్త బొందితో స్వర్గలోకవిహారము సల్పెనను ఒక నమ్మకము కలదు.

3. మూసాప్రవక్త (Moses) సినాయీకొండపై భగవన్మహాజ్యోతిని దర్శించెననియు, దాని కాగలేక సినాయీపర్వతము కంపమొందెననియు ఒకపురాణగాథ కలదు.

జ్ఞచే ఒక క్రొత్త తత్త్వమును స్వంతముగ నిర్మించుకొనెను. ఈ తత్త్వమును ఇఖ్బాలు చెప్పినంత సులభముగను రమ్యముగను అతని గురువులుసైతము చెప్పలే దనవచ్చును. చూడుడు, ప్రేమమహత్తు నెట్లు చెప్పెనో:

ప్రేమ—మృత్యువు

ఒకజీవముకుసుంబు వికసించు నొకచోట
జీవితశాఖాళి విసరించు నొకచోట
తొలిమందహాసమ్ము తొలఁకాడు నొకపూవు
వేణీభరము విప్పి వియదంగన యొకర్తు
నిల్చెనో యనఁదోఁచు నీలనీరద మొండు
ఒకచోట వాంఛాళి ఒకచోట దుఃఖాగ్ని
బుల్బులిదుఃఖమ్ము పువ్వు కానందమ్ము;
ప్రకృతి యిట్లుండ శోభాయమాన మగుచు
స్వర్గోపవనవాటి వాహ్యాళి కేగెను
ప్రేమదేవత, దారి మృత్యుదేవత తటా
స్థపడె; నంత నడిగె 'తా నెవర'ని ప్రేమ.
నేను మృత్యువను; నానిత్యధర్మము ప్రసి
ద్ధము; నాకనులు నాస్తిత్వతంత్రప్రయోగముల్
నాకనుసన్నలు నాశసందేశముల్;
కాని జగాన నొక మహాత్వదార్ఢ్యమ్ము
కలద నొక వహ్నిః; కరిగి ద్రవమగు
దాని సమక్షాన నే; నది మానవు
హృదయస్థమై యుండు; ప్రియతమం బయ్యది
సర్వేశ్వరున' కని జముఁడు నివేదింప
ప్రేమదేవతచిఱుపెదవులపై వర
హాసరోచులు నెగ్గె; అవియె అయ్యమునిపై
అశనిపాతమయిపడె; శమనుఁడు నశించె
అమరత్వమును జూచి యంతకుండె నశించె.

ప్రేమ మృత్యువును జయించుట ఆర్ష సంప్రదాయమున కలదు. అది సతియగు సావిత్రి కథయందు హృద్యముగ చెప్పబడినది. కాని ఇఖ్బాల్ ప్రేమ మృత్యువునే భస్మీభూత మొనర్చుచున్నది. ఇఖ్బాల్ ప్రేమదేవత శివుని కనుచూపుచే నుసియైన మన్మథుడు కాడు. మన్మథుడు కామదేవత. ఇఖ్బాల్ దేవత నిష్కామప్రేమమూర్తి. అది భగవంతునికే ప్రియతమము.

ప్రేమవలెనే సౌందర్య మొకటి సూఫీ కవుల కాలంబనము. "సౌందర్యమే సత్యము, సత్యమే సౌందర్యము. అంతకన్న జ్ఞేయము మరొకటి లేదు" అని ఆంగ్లకవి కీట్స్ చెప్పుచున్నాడు. ప్రేమమే ప్రేమ నుత్పాదించునని అనేకులు సూఫీకవుల మతము. బుల్బులి గులాబిసౌందర్యమునకును, శలభము వెలుగుచెలువునకును పరితపించుచున్నవి.

నిన్నెమ్మెట్టు తిరిగి ప్రదక్షిణము సేసి
రపరప మటంగు రెక్కలల్లార్చుకొనుచు
రాలు; దీనిలేయెద నెప్పురాగమంపు
కలల చెలువు వలపు వేడి వలుగు కలదొ?

అని ఇఖ్బాల్ శలభమును చూచి చెప్పుచున్నాడు. కాని సౌందర్యము ప్రేమవలె శాశ్వతమైనది కాదు. కీట్సుకువలె అది సత్యముకాదు. సత్యమును దర్శించుట కది యొకమార్గము. ఏది సత్యమో దానికి క్షయ ముండదు. సౌందర్యమునకు ప్రగతి క్షయములు కలవు. ఈభావములను ఇఖ్బాల్ 'సౌందర్యము - క్షయము'అను ఒక మధుర కావ్యమున వెలువరచినాడు:

సౌందర్య మొకనాడు సర్వేశు నడిగె
"అక్షయ మొనరింపవైతివే నన్ను?"
"ఈ ప్రపంచమ్ము చిత్రప్రదర్శన భ
వనము; దీర్ఘనిశానశ్వర కథానకము;
వివిధవర్ణపరిణామవిధాన బంధు
ర మిది సకలవిశ్వరచనాక్రమమ్ము,
కాన క్షయమె ధర్మమైనది సుంద
ర"మ్మని ప్రత్యుత్తరమ్మిచ్చె ప్రభువు.

పరిసరమ్మున నున్న తరుణచంద్రముచేసు
వారిసంభాషణవాక్యములు విని
వదియు శ్రుతి విస్రుతమ్మాయెను దివిని ;
తార చెప్పగ ప్రభాతము విని దివ్య
రాగాస్యవృత్తముగా నీహారబిందు
సందోహముల సూచె; సంఫుల్లపుష్ప
ములు విని మిహిరాంశు పూరమ్ము లాయె ;
విరిమొగ్గలేయెద పరివేదనమున
శోణితమ్మాయెను; శోకమ్ముం జేసి
చనె వసంత మ్ముపవనముల నీడి ;
వెనుజూపె వాహ్యాళి వెడలు యౌవనము.

ఇఖ్బాల్ రాజకీయతత్త్వముకూడ అతని ఆధ్యాత్మికతత్త్వముపైననే ఆధారపడి యున్నది. అతని రాజకీయతత్త్వమును రాజకీయ మనరాదు; ఎందు కనగా ఆతత్త్వమందు రాజుకు స్థానము లేదు. "రాజత్వముకూడ విగ్రహారాధనమే" అని చెప్పుచున్నాడు ఇఖ్బాల్.

విశ్వమంతకు దేవుడే విభుడు ; భూమి
విభులు మనము రిల్పుకొనిన విగ్రహాలు.

వంశము, జాతి, కులము, రాజత్వము— ఇవన్నియు మానవుని బానిసత్వపు శృంఖలమునందలి 'లింకు'లని ఇఖ్బాల్ చెప్పినాడు. ఈ శృంఖలమును పూర్తిగ త్రెంచివైచిన గాని స్వాతంత్ర్యము లేదు. ఒకజాతిని, ఒక కులమును, ఒకరంగును, ఒక దేశమును కుంఠిత బుద్ధితో ఆరాధించుట అజ్ఞానము. ప్రపంచమే మన మాతృభూమి : సామ్రాజ్యతత్త్వమునకు దోహదమిచ్చు జాతీయతయు, దురహంకారమునకు తెరువిచ్చు వర్ణవ్యవస్థయు, పరపీడారతికి పురికొల్పు దేశసేవాపరత్వమును, సోదరమానవులయందు నిమ్నోన్నతములు, స్పృశ్యాస్పృశ్యములు అను కృతకకుడ్యముల నిర్మించిన కులములును మానవజాతిని మూలచ్ఛేద మొనర్చు వేరుపురువులని ఇఖ్బాల్ అనుచున్నాడు. పాశ్చాత్యుల ననుకరించుచు జాతీయతావిగ్రహారాధనమువైపున కొరగుచున్న ముస్లిమ్ ప్రపంచము నతడు తన అద్భుతగీతాళిచే ఒక్కసారి చలింపజేసినాడు మనకు కావలసినది జాతీయతయు అంతర్జాతీయతయు కాదు, విశ్వజాతీయత అని ఇఖ్బాల్ వారిని హెచ్చరించినాడు.

చీనా అరబ్ హమారా హిందూస్తాఁ హమారా
ముస్లిమ్ హైఁ హమ్, వతన్ హై సారాజహాఁ హమారా.

(చైనా, అరేబియా, హిందూస్థానము - అన్నియు మనవే. మనము ముస్లిములము. విశ్వమే మన మాతృభూమి.)

ఈ విశ్వభ్రాతృత్వమునందు మతము, జాతి, కులము, వర్ణము అనుభేద ముండరాదు. ప్రేమసూత్రముచే మానవప్రపంచమంతయు బంధింపబడవలెను. ఈ భావములను వెలువరచిన గీతములలో ప్రఖ్యాతగీతము 'నయా శివాల' (క్రొత్తశివాలయము). దాని సంక్షిప్తాంధ్రీకరణము నీ క్రింద ఉదాహరింతును :

వినుము నా స్తవమ్ము వచింతు విప్ర ! అన్య
థా తలంపవేని, నీ దేవతాలయంపు
ప్రతిమ లన్నియు నిప్పుడు ప్రాతగిల్లె;
నేర్చితివి పరస్పరవైరనియతి నీవు
ఆ శిలాలోహకృత విగ్రహాలకడనె;
మౌలవీయును నాహవమంత్ర మభ్య
సింగె అల్లాకడనె; నే విసిగి విడిచితి
నామసీదును, నీప్రతిమాలయమ్ము,
వాని వాదాలు నీదుపురాణగాథ.
ఈ శిలావిగ్రహములందు నీవు తలంచి
నావు నీభగవానుఁ డున్నాఁడటంచు,

వినుము, మాతృభూధూళి ప్రత్యణువునుండ
పావనము నొక్కొక్క దేవతయె నాకు.

రమ్ము! ఈవేలుపాటు తెరలను చించి
వైత మొకసారి, యిట విడివడినవారి
యెడందల గలిపివైతము; హృదయపట్ట
ణమ్ము లేనాటినుండి శూన్యమ్ములై శి
థిలములాయెనో, రమ్ము! ఈ దేశమున న
వీన దేవాలయము నొకదాని గట్టు
ద; మతివైభవోన్నతమై తనరు దీని
తీర్థయాత్ర; ఆకసమంటు దీని కలశ
రాజి; పూజార్హ లిచ్చట ప్రణయమంత్ర
ముల జపింత్రు ప్రేమాసవముగ్ధులగుచు.

ఇఖ్బాల్ తత్త్వము పూర్తిగ వివరించుటకీ చిన్నవ్యాసమున తావులేదు. అతడు మానవ జీవితమునకు వలయు ఒకసంపూర్ణ తత్త్వమును ప్రపంచమున కిచ్చినాడు. అతని తత్త్వము ఖుర్ఆన్ గ్రంథమునకు ఒక కవివ్యాఖ్యానమని చెప్పవచ్చును. రూమీకవి 'మస్నవీ' మహాకావ్యము రెండవ ఖుర్ఆన్ అని ఒక విమర్శకు డనినాడు. ఇఖ్బాల్ కావ్యసర్వస్వమును మూడవ ఖుర్ఆన్ అనిన సత్య దూరము కాదు.

ఇఖ్బాల్ ఉర్దూ పారశీక భాషలందు రెంటను కావ్యము లల్లెను. అతని గురుప్రాయుడైన గాలిబ్ తరువాత ఇఖ్బాల్‌వంటి కవి ఉర్దూవాఙ్మయచరిత్రమున లేడు. ఇఖ్బాల్ భావనాప్రపంచము అతివిశాలము. అందు తలదాచుకొనని వస్తువు భూమ్యాకాశములం దెచ్చటను లేదు. అతని ఉపమానము లత్యంత హృదయంగమములు; అతని భావము లత్యున్నతములు; అతనిభాష ఉర్దూసాహిత్యమునందు నిరుపమానమైనదని చెప్పవచ్చును. అతని భావనాశక్తి విరితోట గనిన మిణుగురుపుర్వు నెంత చిత్రవిధముగ వర్ణించెనో చూచిన తెలియును. అందలి నాల్గయిదు చరణముల నుదాహరించి వ్యాసమును విరమింతును:

వెలుగుచున్నదో చిన్న యీ మిణుగుఱుపురుగు ?
ఎగిరి వచ్చి తారక గోష్ఠు దాగెనో భువిని ?
అమృతకిరణ మొండు సజీవ మాయెనో ?
ఇది నిశారాజ్యమున వచ్చిన సంధి
రాయబారియొ? కాక తగలను దాగి
రవులు నొకపుడు సౌందర్యరాశినుండి
కొలువుకుం గేబసిన యొక వెలుగుపువమొ ?



జీవకారుణ్యము

త్రిపురాన వేంకటకృష్ణా రావు దొర

వనమునఁ గ్రౌంచదంపతులఁ బ్రామిడి వ్రేసిన వ్యాధుఁ జూచి యే
మునికులచంద్రుఁ డాదికవి పొందిన శోకమె శ్లోకమై సనా
తన ఘనకావ్యమై వెలసెఁ దత్కవికావ్యసుధాస్రవంతిలో
ననయము సత్కృపా మధురమై జగమంతయు లోలలాడుతన్.

శ్యేనమునుండి పల్లటిని జేకొని కావఁగ మేనికండలన్
దానికి చేయఁ గోసి సరితూచి పతత్రిని గ్రౌర్యమూర్తి స
మ్మానిత దివ్యమూర్తిగను మార్చిన యా శిబిచక్రవర్తి య
మ్లానదయాగుణంబు నరులన్ గరుణాళులఁ జేయుఁగావుతన్.

కేలన్ జిక్కిన రాజహంసమునకున్ గీడేమి గావింప కు
ద్వేలస్నిగ్ధత దాని వీడిన నలోర్వీనాథు కారుణ్య పూ
ర్ణాలోకామలచంద్రికారుచులు హింసాలోల భూపాల రిం
ఛోళీలోచనవారిలోఁ బ్రతిఫలించున్ గాక యశ్రాంతమున్.

పతగకులాధినాథునకుఁ బాపకొమారునిమాఱు సర్పసం
తతికి ముదంబుగా నెరగఁ దాఁ జని యాతనిఁ బ్రీతుఁ జేసి ము
న్నతఁ డటఁ దిన్న సర్పములఁ బ్రాణులఁ జేసిన ఖేచరేశు నా
తతకరుణామృతం బతులితంబుగ నెల్లెడఁ దొల్కరించుతన్.


కోలన్ వ్రాలిన హంస నెత్తుకొని యల్గున్ దూసి లాలించి యా
కోలన్ దేహమునందుఁ గ్రుచ్చికొని తద్ఘోరవ్యథావిష్టుఁడై
జాలిన్ వందురు శాక్యసింహుకనులన్ జాలై ఝరాలై తరం
గాలై ప్రోగిన బాష్పపున్ రొదలు లోకాలందు మార్మ్రోగుతన్.

పోరున రక్తపూరమున మున్ను మునింగిన యా యశోకరా
డ్దారుణహస్తయుగ్మమును ధౌతముఁ జేసిన యమ్మహీశు వి

స్తారదయానుతాపజనితస్రుతబాష్పజలాలచేతఁ జ
ల్లారుత మీా మహీవరమహాహవహింసన కీలికీలముల్.

సీమము వీడి బాల్యమున నెయ్యురఁగూడి భుజించియున్న మే
షామిష, మాజకప్రకరమై జఠరంబున 'మే' యటంచు మొ
ఱ్ఱోమని యెట్లు గాంధి పలలోదనవాంఛ మరల్చివైచెనో
యామెయి నెల్లవారల పలాశనవాంఛ మరల్పుఁగావుతన్.

తీవను వంచి పూవయిసఁ ద్రెంపఁగఁజాలని, చీమనేనియున్
జావఁగఁ ద్రొక్కఁజాలని విశాల మనస్కులు సత్కృపాపగుల్
పావను లెందరో గలరు వారలకెల్ల నమస్కరింతు స
జీవదయాసుధాఝరులు జీవనదాలయి జాలువాఱఁగన్.



సూరి సీతీ వెంకీ జైలుప్రవేశం

చి ం తా దీ క్షి తు లు

సూరి రాటం తిప్పి నూలుతీస్తోంది. సీతి వాళ్లన్నయ్య రాటం తీసి ఒకయేకు పుచ్చుకొని ముద్దలుముద్దలుగా దారం లాగుతోంది. వెంకి యేకులు సూరికి అందిస్తోంది. వాళ్లన్నయ్య బళ్లోకి వెడతానని చెప్పి ఎక్కడికో వెళ్లిపోయాడు.

"ఏవిటమ్మా యీరాట్టం. అస్తమానం దారం తెగిపోవడమే" అంది సీతి.

"అంత విసుగైతే ఎల్లాగ దారంతీస్తావే, ఓతల్లీ అంది సూరి.

"నువ్వు మహా తీస్తున్నానని లెద్దూ, నన్నాక్షేపించడానికి" అంది సీతి.

"ఇంతట్లోకే అక్షేపించానులే అమ్మా! పోనీ, నీయిష్టం వచ్చినట్లే తియ్యి ముద్దలు ముద్దలుగా! నాకేంకావాలా ఏమిటి ?" అంది సూరి.

"నీకు ముద్దలు రావడం లేదుకామోసు" అంది సీతి.

"నా కెందుకమ్మా! అన్నయ్య వచ్చి చూస్తే సరి" అంది సూరి.

"అన్నయ్య నన్నేమీ అనడు లే! నాన్న నన్ను అన్నయ్యరాటంమీద తీసుకోమన్నాడు" అంది సీతి.

వెంకి రాటం తిరుగుతూ ఉంటే

"తిరుగూ తిరుగూ చెల్లప్పా,

తిరుగూతిరుగూ చెల్లప్పా"

అంటూ కూచుంది.

"చక్రం ముట్టుకోకే వెంకీ! దెబ్బ తగులుతుంది" అంది సూరి.

"ముట్టుకోవే వెంకీ! దెబ్బా తగలదు, ఏమీ తగలదు" అంది సీతి, నవ్వుతూను.

వాళ్లమ్మ వంట వండి మడిగట్టుకు కూర్చుంది. అప్పుడే రెండుజాము లైంది. వాళ్ల నాన్నా అన్నయ్యాకూడా ఇంటికి ఇంకా రాలేదు.

"మీరు తింటారుటర్రా, ఉండలేరేమో ?," అంది వాళ్లమ్మ.

"నాన్న వస్తేనేకాని మేం తినం" అన్నారు సూరీ సీతీని.

"నా న్నొత్తేనేగాని తినం" అంది వెంకి.

"అయితే మీఇష్టం" అంది వాళ్లమ్మ. సూరీ సీతీ చాలాసేపు రాటం తిప్పి ఇంక చెయ్యి నొప్పెడుతోందని మానుకొన్నారు. వెంకి రాటంపిడి పట్టుకొని సరదాగా దాన్ని గిర్రున తిప్పుతోంది.

"కదురు పాడైపోతుం దే. అలా తిప్పకే" అంది సూరి.

"ఆఁ, ఆఁ, ఒక్కటెయ్యనా" అంది సీతి.

"అమ్మతో చెబతా" అంది వెంకి.

అని ఇంకోమాటు గిర్రున తిప్పి వదిలిపెట్టి "అమ్మా! అమ్మా! నా కాకలవుతోంది అన్నం పెత్తవూ" అంది.

"అమ్మా! నాకూ ఆకలౌతోందే" అంది సీతి.

"అయితే కంచాలు తెచ్చుకు పెట్టుకోండి. అన్నాలు పెడతా" అంది వాళ్లమ్మ.

సూరీ, సీతీ, వెంకీ అన్నాలు తింటూంటే వాళ్ల నాన్నకూడా వచ్చాడు.

"ఇంత ఆలస్యమైందేం?" అంది వాళ్లమ్మ.

"ఊరేమీ బాగా లేదు. ఎక్కడబడితే అక్కడ ఎవళ్లనిబడితే వాళ్లని పోలీసులు కొడుతున్నారుట. అబ్బాయి ఎక్కడికి కెళ్లాడో కనిపించక తిరుగుతున్నాను" అన్నారు వాళ్ల నాన్నగారు.

"ఏడీ, అబ్బాయి ఏడీ?" అంది వాళ్లమ్మ.

"ఏమో ఎక్కడికి కెళ్లాడో? బళ్లోకి వెళ్లలేదుట" అన్నాడు వాళ్ల నాన్న.

"రెండుజాము లైంది. ఇంకా ఎక్కడ తిరుగుతున్నాడో? స్వరాజ్యంవాళ్లలోగానీ కలవలేదుగదా?" అంది వాళ్లమ్మ.

"ఏమో" అన్నాడు వాళ్లనాన్న.

"మీరుకూడా మడికట్టుకోండి. వా డెప్పుడు వస్తాడో?" అంది వాళ్లమ్మ.

వాళ్లనాన్నా, సూరీ, సీతీ, వెంకీ భోజనాలు చేశారు.

"అన్నయ్య జండా పట్టుకొని గాంధీటోపీ పెట్టుకొని తిరుగుతున్నాట్టే. మనంకూడా జండా పట్టుకు తిరుగుదామా?" అంది సీతి.

"అమ్మో, నాకు భయమేస్తుందమ్మా" అంది సూరి.

"నాకో జండా యియ్యవు? అక్కా! అంది వెంకి.

"భయ? మెందుకే సూరీ!" అంది సీతి.

"వాళ్లని చూస్తే నాకు భయమే" అంది సూరి.

"ఎవళ్లని? ఏదో టోపీ పెట్టుకుంటారు వాళ్లనా?"

"అవునే. కనిష్టీబుల్ని చూస్తే నాకు భయం" అంది సూరి.

"వాళ్లు కనిష్టీబులు కారు. కనిష్టీబులికి ఎర్ర టోపీ లుంటాయి".

"పిల్లకీ టోపీలున్నాయే".

"ఇవి ఎర్రటోపీలు కావే. లవోమాస్తరు టోపీలే" అంది సీతి.

"అవునే అవునే" అంది సూరి.

"నాకో జండా యియ్యవూ?" అంది వెంకి.

వాళ్ళమ్మ భోజనము చేస్తూఉంటే జండా పట్టుకొని ఒక అబ్బాయి వాళ్లింటికి వచ్చి వాళ్ళన్నయ్యని పోలీసులు కొట్టి ఖయిదులో పెట్టారని చెప్పాడు.

"ఎందుకూ" అన్నాడు వాళ్ళ నాన్న.

"ఎవళ్లో విదేశీబట్టలు కొంటూంటే కొనవద్దని అడ్డంగా నిలబడ్డాడు. అందుకని పోలీసులు కొట్టి తీసుకుపోయారు" అని చెప్పాడు ఆ అబ్బాయి.

"అయ్యో, అయ్యో, కొడకా, ఖయిదులో కెళ్లావురా కొడకా" అని వాళ్ళమ్మ తింటూ తింటూన్న అన్నం వదలిపెట్టి లేచిఏడ్చింది.

"సిగు తెలియ దూరుకో" అని వాళ్ళనాన్న కేకేశాడు.

వాళ్లమ్మను చూచి సూరీ, వెంకీ కూడా ఏడ్చారు. సీతి బిక్కమొహం వేసింది.

"ఎక్కడికి తీసుకెళ్లారు వాడిని?" అని వాళ్ల నాన్న అడిగాడు.

"మీ అబ్బాయినీ, ఇంకో నలుగురినీ కలిపి తీసుకుపోయి ప్రస్తుతం పోలీసు స్టేషనులో పెట్టారు" అన్నాడు ఆ కొత్తబ్బాయి.

వాళ్లనాన్న ఆలోచిస్తూ కూచున్నాడు. వాళ్లమ్మ ఊరుకోమంటే ఊరుకోకుండా ఒకటే ఏడవడం మొదలెట్టింది.

"ఎందుకండీ అలా విచారిస్తారూ? మీఅబ్బాయి ఖయిదులోకి వెళ్లినందుకు సంతోషించాలిగాని! ఎప్పుడెప్పుడని చెప్పి మేం కూచున్నాం."

"నీ కేం నాయనా! నువ్వు అలాగే అంటావు. కన్నకడుపు కాబట్టి ఉండబట్టక..." అంటూ ఏడ్చింది వాళ్లమ్మ.

"అలా అంటా రేమిటండీ అమ్మా! మా అమ్మా మా అక్కయ్యా, మా నాన్నా అప్పుడే ఖయిదులోకి వెళ్లిపోయారు. ఎవరి మట్టుకు వారు ఈగౌరవం తమ కెప్పుడు కలుగునని చూస్తూన్నకాలంలో అలాగ విచారించవచ్చునా? మీ అబ్బాయితోపాటు మీరందరూకూడా వెళ్లారంటే ఎంత కీర్తి, ఎంత పుణ్యం!" అని "నే వెడతానండీ బాబుగారూ!" అని వాళ్లనాన్నతో చెప్పి "గాంధీమహాత్మకీ జే" అని గట్టిగా కేకేసి ఆ అబ్బాయి జండా ఆడిస్తూ వెళ్లిపోయాడు.

సీతి "గాంధిమహాత్మకీ జే" అని నిమ్మళంగా అంది.

సూరీ సీతీ వెంకీ కలిసి గట్టిగా "గాంధిమహాత్మకీ జే" అని కేకలు వేశారు. వాళ్లనాన్న వాళ్లను చూచి చిరునవ్వు నవ్వాడు. వాళ్లమ్మ కళ్లు తుడుచుకొని ఇంట్లోకి వెళ్లిపోయింది.

ఆరోజు మొదలుకొని సూరీ, సీతీ, వెంకీ, వాళ్లనాన్నా, వాళ్లమ్మా అందరూ కలిసి మీటింగులకి వెళ్లేవారు. విదేశవస్త్రాలు కట్టవద్దని దుకాణాలదగ్గిర బోధించేవారు కల్లుపాకలదగ్గిర కూర్చుని కల్లు తాగవద్దని వచ్చేపోయేవాళ్లకి చెప్పేవారు. ఈ విధంగా కొన్నాళ్లు జరిగింది.

సూరీ సీతీ వెంకీ రోజూ ఖద్దరు బట్టలు కట్టుకొని జండాలు చేత్తో పట్టుకొని అత్యుత్సాహంగా బజార్లల్లో పని చేస్తున్నారు.

ఒకనాడు వాళ్లనాన్న ఒక బట్టలకొట్టుమీదా, వాళ్లమ్మ ఒక బట్టల కొట్టుమీదా, సూరీ సీతీ వెంకీ కలిసి ఒకబట్టలకొట్టుమీదా కూర్చుని విదేశీబట్టలు కొనేవాళ్లు వస్తే వాళ్లకు కొనవద్దని బోధచేస్తున్నారు.

సూరీ సీతీ వెంకీ కూర్చున్న కొట్టుదగ్గిరికి ఒక అబ్బాయి వచ్చాడు. గ్లాసుగోమల్లు కట్టుకొన్నాడు. పట్టు ఆఫారం వేసుకొన్నాడు. దానిమీద ఊదాకోటు తొడుక్కొని బంగారుబొత్తాము ఒకటి పెట్టుకొన్నాడు. మెడచుట్టూ ఒక చుక్కలగుడ్డ చుట్టుకొని ముందు భాగాన్ని ముడివేసుకొన్నాడు. ముక్కుమీద ఉండుండీ ఊడిపోయే సులోచనాలు పెట్టుకొన్నాడు. మీసం సగం యిటూ సగం అటూ తీయించివేసుకొన్నాడు. ముందు జుట్టు గొర్రెకొమ్ములాగ మెలివేసుకొనిఉంది.

ఈమనిషిని చూచి సీతి, "చూడే, చూడే వెంకీ! బూచా డొస్తున్నాడు" అని వెంకితో చెప్పింది.

వెంకి ఆమనిషికేసి వేలు చూపిస్తూ "బూచాడు, బూచాడు" అంది.

"సూరీ! చూడే, అల్లా ఉన్నా డేమిటే, ఆ అబ్బి?" అంది.

"దొరకాబోలే ఆఅబ్బి" అంది సీతి.

"దొరకాడే. దొరైతే పంచ కట్టుకొంటాడా?" అంది సూరి.

"అవునే, నల్లగా మసిబొగ్గులాకూ_డా ఉన్నాడే" అంది సీతి.

ఇంతట్లోకే ఆమనిషి కొట్టుదగ్గిరికి వచ్చి కొట్టులో ప్రవేశించబోతూంటే సూరి సీతి వెంకీ ఒకళ్లచేతు లొకళ్లు పట్టుకొని అడ్డంగా నిలబడ్డారు.

"విదేశీబట్టలు కొనకబ్బీ! ఖద్దరు బట్టలు కట్టుకో" అంది సూరి.

"చెబితే వినిపించదూ, సీకే" అంది సీతి.

"సీకే, సీకే" అంది వెంకి.

పిల్లల్ని తోసుకొని లోపలికి వెళ్లిపోబోయేడు ఆమనిషి. కొట్టుముందర జనం మూగి ఈవింత చూస్తున్నారు. ఉండుండీ "గాంధిమహాత్మకీ జే" అని కేకవేస్తున్నారు.

"అడ్డం లెండి, నాయిష్టం" అన్నాడు ఆ మనిషి.

"చెబితే వినిపించదు కామోసు, ఈ అబ్బికి" అంది సీతి.

"అలా తోసుకు వెడతావేం? కొనద్దంటే నీకు కాదూ?" అంది సూరి.

"సీకే, సీకే" అంది వెంకి.

ఆ అబ్బి మోటతనంగా పిల్లలిని తోసివేశాడు. సీతి కింద పడింది. కొట్టుముందర జనం అంతకంతకి ఎక్కు_వై పోతున్నారు. "జే జే" అని అదే అరవడం.

సీతి కిందబడి ఆ అబ్బిమోకాళ్లు గట్టిగా పట్టుకొంది. సూరి రెండు చేతులూ అడ్డంగా చాపి ఎదురుగా నిలబడింది. వెంకి కోటు పట్టుకొని వెనక్కి_ లాగుతోంది.

"ఆపిల్లలిని అలా తోసుకుపోతావేం? మనిషివి కావూ?" అన్నారు గుంపులో ప్రజలు. ముగ్గురుపిల్లలూ మూడువేపులా దుయ్యబుచ్చుకోవడంమూలాన్ని ఆమనిషి తెల్లమొహంవేసి గుంపులోకి ప్రవేశించుకొన్నాడు.

"మంచివాడవే" అంటూ సీతి లేచి నిలబడింది. సూరీ, సీతీ, వెంకీ నవ్వుతూ చప్పట్లు కొడుతూ "అయింది అబ్బాయికి శాస్తి, అయింది" అన్నారు.

గుంపులో ఉన్నవాళ్లంతా "గాంధీకీజే" అని కేకలేశారు.

పెద్దగోల అయింది.

ఈగోలలోనుంచి "కొడుతున్నారు, కొడుతున్నారు" అనే కేకలు బయలుదేరాయి. అందరూ అన్నివైపులకి పారిపోతున్నారు. కర్రలు పుచ్చుకొని పోలీసువాళ్లు అందరినీ చెదరకొట్టేరు.

సూరి సీతి వెంకీ ఇదంతా చూస్తూ కొట్టు మొగదల నిలబడ్డారు.

అందరినీ తరుమగొట్టిన తరువాత పోలీసు వాళ్లు బట్టలకొట్టుదగ్గిర ఉన్నవాళ్లందరినీ పట్టుకొన్నారు. ఒక పోలీసువాడు వచ్చి సూరీ, సీతీ, వెంకీ దగ్గి రున్న జండాలు లాక్కో_బోయేడు. వాళ్లు గట్టిగా పట్టుకు యివ్వలేదు.

"అల్లా లాగుతావేమిటి ఈ అబ్బి, వదులబ్బీ ఇస్తాను" అంది సీతి.

సీతిచెయ్యి వదలి ఆ పోలీసువాడు సూరిదగ్గిర జండా వెంకిదగ్గిరజండా బలవంతంగా లాక్కున్నాడు. వెంకి ఏడవడం మొదలెట్టింది. "ఇంకో జండా ఇస్తా లే, ఊరుకో, వెంకీ!" అంది సూరి.

ఆపోలీసువాడు సీతికోసం యిటుఅటూ చూశాడు. సీతి దూరంగా పారిపోయి నవ్వు

తోంది. వాడు పరుగెత్తుకు వెళ్లాడు పట్టుకొందామని.

"రా, రా, ఇంద జండా" అంటూ సీతి వాడిని ఊరించి వాడు దగ్గిరికి రాగానే ఒక కొట్టులో దూరింది. వాడు కొట్టులోకి వెళ్లాడు. సీతి "దా, దా" అంటూ పక్కకొట్టులోకి వెళ్లి తలుపువేసుకొంది. పోలీసువాడు చుట్టుతిరిగి వచ్చి పక్కకొట్టులోకి వెళ్లడానికి ముందే సీతి ఆకొట్టులోనుంచి పారిపోయి బయటికి వచ్చి "దా, దా అబ్బీ! ఇంద, జండా, జండా అక్కర్లేదూ?" అంటూ పరిగెత్తింది.

పోలీసువాడికి కోపంబదులు నవ్వువచ్చింది. వాడూ పిల్లలుగలవాడే! సీతి పరుగెత్తి వాళ్లమ్మదగ్గిరికి వెళ్లింది. పోలీసువాడుకూడా అక్కడికి వెళ్లి జండా యివ్వమన్నాడు.

"ఎందు కబ్బీ! పిల్లి నల్లిం భయపెడతావు? జండా కావలిస్తే అడిగిపుచ్చుకోరాదూ? ఏమిటా మోటతనం, చిన్నపిల్లలమీద?" అని వాళ్లమ్మ సీతిచేతిలోనుంచి జండా తీసుకొని పోలీసుమీద పారేసింది. సూరి, వెంకీ కూడా వాళ్లమ్మచుట్టూ చేరుకొన్నారు.

పట్టుకొన్నవాళ్లందరినీ పోలీసులు జైలులోకి తీసుకువెళ్లారు.

*　*　*

కటకటాలవతల సూరీ సీతీ వెంకీ కంకర రాళ్లతో గచ్చకాయ లాడుకొంటూంటే దూరంగా ప్రజలు నిలబడి "వాళ్లే, వాళ్లే" అని ముగ్గురుపిల్లలినీ చూపించి ఏమో చెప్పకొంటున్నారు.

ఆవేళ మధ్యాహ్నం మేజిస్ట్రేటుకోర్టులో విచారణ. సూరీ, సీతీ, వెంకీ, వాళ్లనాన్నా, అమ్మా ఇంకా ఆడవాళ్లూ మగవాళ్లూ అందరూ మోటారుబస్సు ఎక్కి మేజిస్ట్రేటుకోర్టుకు వెళ్లారు.

*　*　*

విచారణ జరుగుతోంది. మగవాళ్లకు రెండేళ్లు కఠినశిక్షా, ఆడవాళ్లకు ఆరునెలలు విడిఖైదూ వేస్తున్నాడు మేజిస్ట్రేటు.

వాళ్లనాన్నా, అమ్మా — మేజిస్ట్రేటు ఏమడిగినా కిక్కురు మనలేదు. అది సూరీ సీతీ వెంకీ చూచారు. మేజిస్ట్రేటు వాళ్లకేసి తిరిగి "ఎవ రమ్మాయీ మీపేరు?" అన్నాడు.

"నే మాట్లాడను" అంది సూరి.

"మాపేరు ఏభాషలోనైనా చెప్పొచ్చా?" అంది సీతి.

"నీ కెందుకూ" అని మూతి ముడిచి అడిగింది వెంకి.

"సీతికేసి చూచి నీ కొచ్చినభాషలో చెప్పొచ్చు. చెప్పమ్మాయీ" అన్నాడు మేజిస్ట్రేటు.

"అయితే నాపేరు క-సీ-క-తి. మా అక్కయ్యపేరు క-సూ-క-రి. మాచెల్లాయి పేరు క-వెం-క-కి".

కోర్టులో ఉన్నవాళ్లందరూ నవ్వారు.

"అదేంభాష అమ్మాయీ!" అన్నాడు మేజిస్ట్రేటు.

"అయ్యో తెలివా, ఆభాషే రాదూ?" అంది సూరి.

"ఈఅబ్బికి కాభాషే రాదుట" అంది సీతి.

మేజిస్ట్రేటుకు కోపం వచ్చిందో కోపం నటించాడో "జాగ్రత్తగా మాట్లాడు, అమ్మాయి! ఇది కోర్టు ఎరుగుదువా?" అన్నాడు.

"క-ఎ, క-రు- క-గు- క-దు" అంది సీతి.

"మీరు బజారులో బట్టలకొట్టుదగ్గిర ఏం చేశారు" అన్నాడు మేస్రీటు.

"క-ఖ- క-ద్ద- క-రు- క-క- క-ట్టు- క-కో- క-మ- క-ని —— " అని సీతి గబగిబ చెప్ప బోతూంటే మేసీ్త్రటు కోప్పడి రాసుకోడం మానేశాడు.

"నువ్వు చెప్పు అమ్మాయి" అని సూరికేసి తిరిగి అడిగాడు.

"క-ఏ- క-మో" అంది సూరి.

" క-ఏ-క-మో- " అంది వెంకికూడా.

మేసీ్త్రటుకు కోపం వచ్చి యిక మాట్లా డక పోలీసుసాక్ష్యం తీసుకొని, తల్లితోపాటు వెంకి ఉండాలనీ, సూరీ, సీతీ ఆరునెలలు విడి ఖైదు తల్లితోకూడా అనుభవించాలనీ శిక్ష విధించి లేచిపోయాడు.

* * *

పాపం ఆమేసీ్త్రటుకు సీతిలాంటి కూతు రుందట. అతను యింటికి వెళ్లకముందే అతడు ముగ్గురు ఆడపిల్లలని శిక్షించాడనే వార్త అతని యింటికి వెళ్లింది. ఎంతమట్టుకు నిజమో తెలియదుగాని, ఆయనకీ ఆయనభా ర్యకీ ఆరోజురాత్రి పెద్ద యుద్ధం జరిగిందని లోకులు చెప్పుకొన్నారు. లోకులు పలు గాకులు!

ఆరాత్రి ఆయనకు యింట్లో తిండి లేదట. కొన్నాళ్లదాకా వాళ్లమ్మాయిని పిలిచి ముద్దు పెట్టుకోడానికి మనస్సు ఒప్పింది కా దట! కొన్నాళ్లైనతరవాత తన కూతురుని పిలిచి "అమ్మాయీ! కాభాష ఏమిటమ్మా" అని అడిగాడట.

" కాభాషే రాదు, నాన్నా సీకు ? " అని ఆ అమ్మాయి ఆక్షేపించిందట.

* * *

వేల్బూరుజైలుకి కళకాంతులు సూరి సీతీ వెంకీవల్ల వచ్చినవని నేటివరకూ చెప్పు కుంటారు.

తనపిల్లని యింటివద్ద దిగబెట్టి జైలుకు వచ్చిన ఒక ఇల్లాలు యీపిల్లలిని రోజూ చూస్తూ తనపిల్లనికూడా తీసుకురాలేకపోతినిగదా అని కంట నీరు పెట్టేదిట.



బావినిండా నీరేకాని పిట్టకందదు ఎలుకకందదు; ఏవీ త్రాగలేవు.[12]

రాజుగారి కోటలో నీరు పిట్టా త్రాగలేదు; ఎలుకా త్రాగలేదు.[13]

రాజుగారి ధనము లెక్క బెట్టుదామన్నా లెక్క బెట్టలేము.[14]

కాయకాస్తుంది; పండు పండుతుంది; పువ్వు మాత్రం కనబడదు.[15]

గడ్డి మొదలి మనిషి రాజుగారి కోటలోనికి ప్రవేశిస్తాడు; అతనిని చూచి రాజుగారు చాలా ఆనందిస్తారు.[16]

ఆ మనిషికి ఒడలినిండా బొచ్చే.[17]

అదెవరికండి చేతులనిండా కాళ్లనిండా పళ్లేనట ?[18]

ఆమనిషియెదుట నిలబడితే చాలునండి ఒడలంతా దురద.[19]

ఎద్దేమో కదలక మెదలక పడుకొంటుంది; దాని మెడకుకట్టిన త్రాడుమాత్రం తిరుగుతూ మేస్తుంది.[20]

ఆకాశాన చిన్నచిన్న కత్తులు అనేకంగా వ్రేలాడుతున్నవి.[21]

జంతుజాలమునకు సంబంధించినవి:

అదియేమి వనమో తోకతో త్రాగుతుంది ![22]

దానికున్నది ఒకచేయి.[23]

రాజుగారి కొండమీద జొన్నలు ఎక్కువగా పండినవి.[24]

నీజాతి ఏమిటంటే, ఏమీకాదు; నేను అడవిలో తిరుగుతూ ఉంటానంటుంది.[25]

చెట్టెక్కి పాడుతుంది.[26]

ఆ మనిషికి ఏడు కొమ్ములు.[27]

ఆ మనిషి ఎండకాలం రాగానే నోరు తెరచుకొని ఉంటాడు.[28]

రాజుగారింట్లో పండుకు ముచికాలేదు మూడికా లేదు.[29]

12- సెండాలేజన్ దాన్ కుడ్డుబ్ పకు డో ఒంతిడ్గా-పిట్ జా రప్తి అన్టెజె; అగ్గాయో.[,, ,,]

13. రాజాసూన్ అ డా ఒంతిడ్గా-ఒడ్రెజ్ జా రప్తి అగ్గాయో. [,, ,,]

14. రాజాన్ అ బిత్తి డిడి తాయ్ గాల్లెబెండెన్ జా అప్రత్తిజె. [సకోన్-ధాన్యం]

15. జోడితె; సుకోర్తె డో తర్పాతెడ్. [లాఆన్-అత్తి చెట్టు]

16. గజ్జిడోక్‌మరన్ రాజాన్ అసూన్ ఇత్తె గనె; అనిన్ గిజన్‌గిల్లె రాజాన్ ఆతె బోయ్‌బోయ్ ఇడికాతె. [పడసాగూర్ - పనసపండు]

17. ఉంతే అమంద్రా అడోక్‌లేజన్ కుడ్డుబ్ అ ఉకోన్. [జొన్నగుర్ - జొన్నపొట్ట]

18. ఇతెన్ అమంద్రాడో కుడ్డుబ్ అసీలేజ్ అజేక్‌లేన్ జికితె ? [,, ,,]

19. ఉంతె అమంద్రా ఆతె అమడ్‌బాన్ తనల్లె బెన్ డెన్ గతగతా సిబ్‌సిబ్‌లత్తెన్ డోక్‌లెన్. [రుజ్‌డుల్‌నేజ్ - దూలగొండి]

20. తజ్‌లియన్ ఆతె డిమ్మల్లెసెత్తె; అథనోల్ తోల్‌లుఅపన్‌న ఎండుప్‌లె జుమ్తె. [కిల్లాయ్-సుమ్మడి కాయ-తీగ]

21. ర ఆక్‌లేజన్ కెడెత్తీన్ డొయ్‌లెన్ సెత్తెజి. [తిత్తిజో - చింతకాయలు]

22. ఇశేన్‌కున్ తులబ్‌డో అలాన్‌బాత్తె గాడాతెన్ ? [రఆన్-ఏనుగు]

23. అమూలేజన్ అసీన్. [,, ,,]

24. రాజాన్ అబరూలేక్ కన్నూమన్ బోయ్ బోయ్ బోడితె. [కన్‌జీజన్-ఏరుబంది]

25. "ఇతెన్ అమన్ జాతినమ్ ?" "ఇజ్జా; ఇాన్ కన్‌రెజన్ ఎండుల్లెసెత్తాయ్". [కినాన్-పులి]

26. అరాలేజన్ పజన్ డయ్‌లె కెన్తెన్. [ఒంతిడన్-పిట్ట]

27. ఉంతె అ మంద్రా ఆతె అ డెరెజన్ జి గుల్లిజి. [తడార్ ఈమన్-కోడిపుంజు]

28. ఉంతె అమంద్రా డాగాఈజన్ డేలెండెన్ ఆజ్‌తంటె సెత్తెన్. [కాకాన్-కాకి]

29. రాజాసూజ్ అ గూరన్ అత్తుంతీ రెయె [అప్రెసీమన్-కోడి గుడ్డు]

ఆ మనిషికి పెద్దతలకాయ, పెద్దకండ్లు; పిల్లి కున్నట్లే.30

పెద్దగొడుగాటి మెడ; నడుస్తూ ఉంటే, చాలా ఎక్కువగా ఆడుతూ ఉంటుంది.31

ఆ మనిషికి ఒడలంతా మట్టలే.32

వెన్నెముక నొక కన్ను.33

తన రెండువ్రేళ్లతోను గట్టిగా గిల్లుతుంది.34

చేతితో పట్టుకొందామని ఎంత ప్రయత్నించినా చేతికి దొరకదు.35

ఆ మనిషికి ఎముకే లేదు.36

ఆ బండికి ఎన్ని చక్రాలో లెక్కబెట్టలేము.37

ఇల్లూ వాకలితో కదులుతూ ఉంటుంది; వెళ్లి చూడబోతే తలుపు మూసుకొంటుంది.38

రాజుగారి కోటలోని త్రాడు చాలా పెద్దది.39

ఒక్కనోరు, రెండునాలుకలు.40

అది ఏలాగు చూరింగో ఏలాగపైకి వచ్చిందో! అదొకరహస్యం.41

ఇక్కడనుంచి అక్కడి దాకానూ ఉంటే ఆమడదూరం అంతలో పరుగెత్తుతుంది.42

ఇచ్చేవాడూ అతడే; పుచ్చుకొనే వాడూ అతడే.43

ఆ ఆటకత్తె ఎప్పుడూ నోటిలోనే నాట్యమాడుతుంది.44

ఆ తీగకు రెండే పండ్లు 45.

ఆహారపదార్థములకు సంబంధించినవి:

ఆకో అలమో దానిచేస కొని లోపలికిపోతుంది; ఇల్లంతా శోధించిచూచినా మరి కనబడదు.46

పొట్టులేని పప్పు.47

శవంమీది పొక్కులు చూరారుదిగా ఉంటవి.48

వాడులేకపోతే అన్నంతినలేము.49

---

30. ఉంతె అమంద్రా సుదా బోబన్ సుదా అమడన్; రమేబన్ అంబ్రి. [కంతూజన్-గుడ్లగూబ]

31. అసంకొన్ అ ఇంపం జలేడం; యొరే తేన్ డెన్ అఇంపం డిడ్ డిడ్తె [మారాన్-నెమలి]

32. ఉంతే అమంద్రా అడోక్ లెక్ కుడ్డుబ్ అసప్పాడీన్ [అర్యాన్-ఆళువచిప్పజంతువు]

33. అ కింజా డుక్ లెబన్ అ మ డ న్ [కినాడన్-ఎండ్రిక]

34. అబాగున్ అ ఒండెర్ సీ డో అ ఇంపం సిబ్ సిబ్ లత్తెన్. [,, ,,]

35. సిఈన్ బాత్తె ఇమ్తాయ్ గాణ్ణె డసిక్ గిల్ల బెండెన్ అనబ్ ఇమ్ డమ్ నె [అ గు య్ గొా న్ - బేడిసచేప]

36. ఉంతె అమంద్రా అ జా క్ తె డ్ [శిరీమన్-జలగ]

37. ఉంతె అసగడా అ సక్కడీన్ గి డజిజ్ డో రస్తి అడ్డిడీబె. [కండ డిడ్ డిజ్ బుడెన్-గోకలిబండ]

38. అసూజన్ అసనజన్ బాత్తె పజ్ డం నె తెన్ ఇత్తెగిజే తెన్ డెన్ అ సనజన్ ఇ బ డ్తె. [గున్ లూన్-వత్తి]

39. రా జా సిూ క్ అ లు ఆ క్ జ తే డ న్. [జ ఆ డన్-పాము]

40. అంగాయ్ నాన్ అ తొోడిపెన్ బాగుస్ అలాజన్. [,, ,,]

41. యూస్తెగాణ్ణెగస్లేడే యూస్తెగాణ్ణెడుక్ లెన్ డే అపింతా [గోడిలన్ - పట్టుపురుగుకోసనకాయ]

42. తెన్నెగి గిజన్ గిగిత్తె ఒత్తెన్ గిగిత్తె బెన్ డెన్ సజాయ్ యొర్నె తెన్. [గనిజన్ - దృష్టి]

43. అనిన్ న తిత్తె;అనిన్ న జాతె. [సిఈన్-చేయి]

44. కన్ అతోక్ సెక్ బోజన్ తోడిక్ లేగన్ న తాడా తోజ్ సెత్తె. [అలాజన్ - నాలుక]

45. ఉంతె అలనామ్ బాగున్ న అగూరన్ [మెమె - చన్నులు]

46. అరావితె, వితెవితె, గప్పుయ్ మెతె రప్పడ్డె ఎత్తె; బార్ ఉంతె అనూక్ కుడ్డుగ్ రప్పుయ్ మెతె గిల్ల బెన్ డెన్ జనజ్ డేన్ అగ్గెజె. [డరజన్ - అన్నం]

47. అకుగ్రజ్ తెడన్ అపప్పు [బసుడెన్ - ఉప్పు]

48. మాసూమరన్ అ అంబసు బోయ్ బోయ్ రగాల్ [,, ,,]

49. అనిన్ అగాసాడేన్ డరజన్ గప్తిఅజ్జాంతె [తనోంగాల్ - కూర]

ఆఇల్లాలికి చన్నులయితే లేవుగాని కడుపునిండా పాలుకుడుపుతుంది.50

ఆమనిషికి నాలుగు పిరుదులు.51

తోకతో నాకుతుంది.52

ఆమనిషికి నాలుగుకాళ్లు ; నాలుగు తలలు ; నాలుగుచేతులు ; చేతులుమాత్రం రెండుపొడుగు, రెండు పొట్టి.53

ఆమనిషి అలాగు నిలిచి ఉంటాడు; మరియొకడు తనను పట్టుకొని దారి చేసుకొనిపోతే కదులుతాడు; లేకపోతే కదలడు.54

ఆఎముకల ప్రోగు కప్పున్న ఎముకలప్రోగు.55

ఆమనిషికి రెండే కాళ్లుగాని ఏడుచేతులు.

పిట్ట పిడికెడేకాని, తోక మూరెడు.57

ఆబుడ్డిలోని వడ్లగింజ ఇల్లంతా ప్రాకుతుంది.58

అతని పొట్టమీద కన్ను అరగదీస్తే మండుతుంది.59

పిలకపట్టుకొని గిరగిరత్రిప్పితే ఏరుకుతుంది.60

ఆమనిషి ఒకవైపు తింటూ ఒకవైపు ఏరుకుతాడు.61

పట్నంనుండి ఇద్దరు ఆటకత్తెలువచ్చారు;అక్క కూర్చుంటుంది; చెల్లెలు నాట్యమాడుతుంది.62

అరచేతినిండా ప్రేపకలే.63

ఆ ఆవుదానికి మూడు చన్నులు.64

ఆబిడ్డ చూడడానికి చిన్నదేకాని పెద్దపెద్ద కుండలతో నీళ్లుమోస్తుంది.65

---

50. కస్ అన్నలోన్ ఆతె మెమెతెడ్ బిండో అడుబన్ బెబెగాన్లె తి' తి' లచ్ తెన్. [సలపంనేబ్-కల్లుచెట్టు]

51. ఉంతే అమంద్రా ఆతె ఉంజి అసంబీ. [తొడ్డోడన్ బుట్ట]

52. అలాన్ బాస్తెజాత్తె. [జనోన్-చీపురు]

53. ఉంతే అమంద్రాఆతె ఉం? అడేబన్ ; ఉంజి అబోబన్; ఉంజిఅసీన్; ఒత్తెఅలోక్ బాగు అసీ జలే; బార్బాసు ఆసీ డుయిన్నా. [సండీన్ -మంచము]

54. ఉంతే అమంద్రా ఆతె తనజ్లెసెత్తే; బార్బో మంద్రాఅడోజన్ ఇల్లె తజోర్రెండెన్ అన్జేత్తె; ఎజ్జాలెండన్ ఎజ్జా. [సనజన్-తలుపు]

55. ఉంతేఆతె అజాక్ రుబ్రుబ్ జాక్. [సుడూజన్-ఇల్లు]

56. ఉంతే అమంద్రాఆతే బాగున్న అజేబన్ డో; అసీ ఆతేగుల్జీ [పరడూన్-నిచ్చెన]

57. ఒంతిడన్ ఆతె బొకనున్డుబ్; అలాన్ ఆతె బొసంతీ. [సత్తుఆన్-గరిట]

58. ఉంతే అసీసాఅసనో సుఊజన్ బరిత్తె. [డిప్పాతోడన్-దీపం]

59. అకంపుడ్ లెగన్ అమడన్డో కన్ బిడ్బిల్లెండెన్ తొజెన్ డుజ్జాయ్. [గనోర్తుడన్ - అగ్గిపుల్ల]

60. అమురాడున్ ఇమ్లబెన్డెన్ యుర్దాల జెండెన్ అసోత్తె. [నురిడీ అరన్-తిరుగలి]

61. ఉంతే అమంద్రాకొడి జామ్తెకొడి అసోత్తె [,, ,,]

62. గరాన్సరిజ్ బాగుంజి అలోక్సెజ్బో జన్జి ఇల్లాజి; అకాడున్ గొల్లెసెత్తె; ఆయాన్ ఆతె తొజ్సెత్తె. [గురిడీఅరన్-తిరుగలి]

63. అతల్సీలేగన్ అపన్లయ్డాన్. [డిప్పాతోడన్-వత్తిదీపం]

64. ఉంతే అన్సెలోబోయ్ ఆతె యాగి అమెమె. [అమెమెహూలన్-పొయ్యి]

65. ఉంతేఅపసి అశితిడ్డం బిండో అసుడాసుడా అసలెక్డా తెక్తె. [కుడాన్-పొయ్యి]

దానిపిరుదులు ఎంతకాల్చినా అయ్యోఅనదు ; కుయ్యోఅనదు.66

ముందుగా ఎర్రావు వెళ్తూవుంటే దానివెనుకను నల్లావు వెళ్తూఉంటుంది.67

ఏడాదికి చేయవలసిన పని ఒకదినంలో పూర్తి అవుతుంది.68

వృత్తులకు సంబంధించినవి:

మూడుతలలు; పదికాళ్లు; మూడునాలుకలు ; ఆరుకండ్లు.69

కొంపనమునను బొంష్ బొంష్ మంటుంది.70

పనిముట్లకు ఆయుధములకు సంబంధించినవి:

చిన్నదేకానీ, పెద్దదేకానీ ఒక్కలానునే చెట్టును కరుస్తుంది. 71

అడవిలోనికి వెళ్తేకడుపు నిండుతుంది; ఇంటికి వస్తే ఆకలి అవుతుంది.72

ఆ మనిషి నోటితోనే త్రాగుతాడు; నోటితోనే ఏరుగుతాడు.73

ఆమనిషికి ఒడలినిండా కండ్లే.74

ముక్కుదగ్గరనే తోక.75

ముగ్గురు మగళ్లకు ఒక్కర్తే పెండ్లము.76

తలా, గడ్డమూ మాత్రమే మేక.77

కుబ్జకొడుకు చాలా దారుగా ఉన్నాడు.78

ఆమనిషికి డెబ్బైపళ్లు.79

ఆ గబ్బిలాలు చూచండి.80

పైన ఎముకలు, లోపలమాంసము.81

వెనుకకు పడలకుండా ముందుకు పోదు.82

చిల్లర విషయములకు సంబంధించినవి:

ఇక్కడనుంచి కోల ఎంతదూరమైనాపోతుంది.83

మనమెక్కడికి వెళ్లినా మన వంటబడుతుంది.84

---

66. అసంబీన్ సాయ్‌లబెండెన్ అసయ్‌జా అగాయ్‌జా అగ్గామే. [డంకీన్-కుండ]

67. జెపితాబన్ అమ్క్రత్తెక్; యగాతాబక్ జులూతె. [జుమ్‌తోడ్ సుకుబక్-కాల్తున్న ఇల్లు]

68. బొమిన్ను మక్ అబారా బొడిన్నారేచ్ తెజి. [అల్ సూజక్-ఇంటిసేత]

69. యూగి అబోబక్; గల్జి అజేబక్; యూగి అలాబక్; తుర్రుఅముషక్. [ఒర్రొతొబక్ బాగు; ఒర్రొమరక్ అబొయ్-రెండుదుక్కిటెడ్లు, ఒకమనిషి]

70. తుజార్ బహూలేబక్ బబ్‌బబోంబ్‌లో గడేతె. [ఎడెడ్ అజన్-కట్టెలుకొట్టడం]

71. ఏతేసుడా, ఏతేసన్నా, అరొఏకం రనమ్ రమ్‌తె. [ఎంజుమన్ - గొడ్డలి]

72. తులబక్ ఇల్లెండెన్ బెవితే; సుడుబన్ ఇల్లా రొండెన్ డొలయ్‌డాతే. [,, ,,]

73. ఉంతే అమంద్రా అతొ ఓడన్ బొత్తెగాతే, అతొ ఓడన్ బొత్తె అసోత్తె [బొడాన్ - తుపాకీ]

74. ఉంతే అమంద్రా అడొకన కుడ్డుబ్ అమ డన్‌డను. [జూలాన్ - వల]

75. అమూతేటన్ అలాన్. [ఇత్తుగ్ - నాగలి]

76. యూగి అతనొశ్ బాళ్లి అబొయ్‌నాదుక్రి [ఇత్తుబ్-నాగలిసళ్లు]

77. సత్తా అబోబన్, అకురూతన్ అజనుమ్ జుమ్ [కనకన్ - మంగలికత్తి]

78. కుజ్జీన్ అటీన్ యుగల్‌గల్. [కచత్తిన్ - కొడవలి]

79. అంతే అమంద్రా యూగి కుడి గల్జి అజి కుశ్‌ని. [,, ,,]

80 కింతోరన్ గిబ్బా. [సత్తాన్-గొడుసు]

81. బయేరన్ అజాగన్; అలోటన్ అజెలూన్ [,, ,,]

82. ఎర్‌కిండోళ్లబె అముంకాబాన్ అన్ఇయు. [అఅమన్-బాణము]

83. తన్నెసరిజ్ అటమన్ డణిజ్ సజాయ్‌డే లెజానజ్‌డేన్ ఎత్తె. [గయ్‌బోగోడ్-రోడ్డు]

84. ఓజా రొంద్రెబెండెన్ సన్‌సన్ లత్తెన్. [ముమ్మాడాన్-నీడ]

ప్రాణంపోకపోయినా పగులకొస్తే ఒడ్డలను కంటుంది.85

సవరభాషలో ఇటువంటివి పొడుపుకథలు ఇంకా అనేకంగా ఉన్నవి. నాకు తెలిసిన వాటిలో ముఖ్యమయినవి కొన్ని వర్గములక్రింద ఏర్పరచి చూపించినాను.

లో కో క్తు లు

సామెతలు, లోకోక్తులు సవరభాషలో అంతగా ఉన్నట్లు కనబడదు. పొడుపుకథలు కూర్చడానికి కావలసిన మేధాశక్తికంటె సామెతలు, లోకోక్తులు కూర్చడానికి కావలసిన మేధాశక్తి అధికమయినది. మొదటివి కూర్చడానికి చమత్కృతి ఉంటేచాలును; వస్తులక్షణములలో ఏదో ఒకటి చెప్పినంతనే ఆ వస్తువును స్ఫురింపజేసేది ఆధారంగా పెట్టుకొని కూర్చవలెను; అట్టి కూర్పులో నేర్పు గలవాడు తానుచెప్పినది తానుద్దేశించినదే కాని మరియొకటి స్ఫురించకుండా ఉండేటట్లు కూర్చగలడు. సామెతలు, లోకోక్తులు కూర్చేవానికి మంచి అనుభవము, పరిశీలన శక్తి, సూత్రప్రాయంగా చెప్పేనేర్పు ఉండవలెను. అంతశక్తి సవరలకులేదని తోస్తుంది. అయినా, ఒక్కలోకోక్తి అయినా ఉండక పోతుందా అని ఎంతోశ్రమపడి పరిశీలించగా పరిశీలించగా పది కనబడినవి.

కాకి అరుపు కాకే అరుస్తుంది గాని, నెమలి అరవదు; నెమలి అరుపు నెమలే అరుస్తుందిగాని, కాకి అరవదు.1

వలలోచిక్కినచేప నిప్పుచూస్తుందిగాని తిరిగీ నీరు చూస్తుందా ?2

గ్రుడ్డిదానికి అద్దమెందుకు ?3

పుట్టింది పెరుగదా ? పెరిగింది చావదా ?4

కల్లుత్రాగినవాడు నిన్నే భూషిస్తాడా నన్నే తిడతాడా ?5

ఉదయించిన సూర్యుడు అస్తమిస్తాడు; అస్తమించిన సూర్యుడు ఉదయిస్తాడు.6

ముఖ్యమైనరాట విరిగితే ఇంటికప్పు నిలువదు.7

అడవిలోకి వెళ్లి ముల్లు గ్రుచ్చుకొందంటావు ! 8

రెండుపైపులా సమంగా కాలేదే రొట్టె.9

పశువులు మేయకుండా ఉండవలెనని పొలం చుట్టూ కంచె పెట్టుకొన్నాను; కంచే మేసేస్తే నేనేమి చేసేది? (ఇది తెలుగుసామెత చూచి కూర్చినదేమో?)10

---

85. పురాండా అగాసాడితె జనాక్ డెన్ బెగ్గాజ్జి అప్పాకే తిల్లబెంగెన్ కుడ్డాత్తె. [జాంగన్ సుజాన్-అప్పు]

1. కాకాన్ అగనూగూ కాకొన్నమారాన్ అగ్గూదొ; మారాన్ అగనూగూ మారొన్నకాకాన్ అగ్గూదొ.

2. గన్నేర్రేంగన్ అగత్రేన్ అ అసొ తోటిగిన్ గిత్తె; బార్డఅన్ గిత్తెపోక్ ?

3. కగీబోజన్ అతె తరాగిడ్డుమ్‌నాన్ ఇతెనాసన్ ?

4. అ కు డోక్ లెన్ అమ్మరంగెపోజ్ ? అమర క్లైన్ అక్కుయొడె పోజ్ ?

5. గసాల్ మరన్ అమన్న నెంతెం పోజ్ ? ఇనొన్న కఇ్ తిఇ్ పోక్ ?

6. అమ క్లైనన్ అ ఉయుఇ్ త బుబ్ తె; అ తబు క్లైన్ అ ఉయుఇ్ డు క్లైన్.

7. తిఇ్ జాగ్ సునన్ అల్ డిజ్, లెండెన్ బలేగన్ అత్తనదె.

8. తులబన్ గస్లె ఎబ్బాడే లి ఇ్ గాస్తె అమన్ !

9. బాగన్ అసేక్ ఏకం ఏకం సాయ్‌లబెండెన్ డ్డో పోపాన్ గడెత్తె ?

10. తప్లి ఇన్‌జి జుండ్డో జెతేజుగాస్లె సర్బాన్ అ యర్ యర్ తోర్ తొ్రాయ్‌డోతనోర్ తోరన్ జుస్లెన్ డెన్ యాన్ అమ్మేనాయ్ ?

ప్రణయ వాచికము

కొండూరు వీరరాఘవాచార్యులు

శ్రావణపయోదమాలికార్భటులు సరళ
మృదుతరాత్మీయ సుస్నిగ్ధహృదయవీధి,
పిడుగులైపడ నెటు దురపిల్లినావో!
మదవతీ! ఇట్టి పాషాణ హృదయుకొఱకు.

పంజరమ్మున చవులూర బలుకు చిలుక
అనునయించును నావార్తలను వచించి;
నా మృషాగమనమ్ము నెన్నండయేని,
పలికి వంచించునో యని భయము నాకు.

మమతతో బెంచుకొన్న కూరిమి నెమిళ్లు,
ప్రణయమున సాకుకొన్నట్టి పావురములు,
రాగభరమున జూచు మరాళికలును,
తరుణి! దిగులొందునేమొ నీ దైన్యమునకు?

పరువపుమల్లెతోట నిం
పై బవళించి నెమిళ్లజంటలన్
గరము ప్రియమ్మునం గని య
గాధములౌ మనప్రేమవృత్తముల్
స్మరణకు రాగ నశ్రువులు
జాల్కొను నీ వదనమ్ము జూచి, స్నే
హరసవశమ్మునం గొనవు
గా! తృణమేని కురంగకన్యకల్.

ఎట్టివైరాగ్యశస్త్రికలేని కోయ
నలవిగా కల్లిబిల్లిగ నల్లుకొన్న
వలపుతీగెలు కృశియించి వాడిపోవు
నీవిరహవేదనాగ్ని శమించు టెట్లు?

అగలులేనట్టి కూర్మి ననగి పెనగి,
దీర్ఘవర్షావియోగబాధితు లగుచు,
వసరినారలు యక్షదంపతులు మున్ను;
కర్మగతుల మొనర్చినను భోక్తవ్య మబ్బు.

భావసౌందర్యముగ్ధ నీ ప్రణయము, మున్న
వ్రాసియున్నట్టి ప్రేమసూత్రనవభాష్య
బంధురార్థ రహస్యసంపదల దలచి,
పడయుమీ! నీదుహృది మృదు భావతృప్తి.

మాలతీకన్య నవల రసాలపుత్రు
ప్రోదిసేయుచు దినములు పుచ్చు మతివ!
కొలదిరోజులలో ప్రియు గూడి నిశల
ద్రోయుదువు గాత! వలపులు తొలకరింప.

ఆ క లి

దేవులపల్లి కృష్ణశాస్త్రి

[ఇది కడచిననెల ౧౫-వ తేదిని ఎగ్మోరు 'ఆల్ ఇండియా రేడియో' స్టేషనునుండి శ్రీకృష్ణశాస్త్రిగారు 'బ్రాడ్ కాస్ట్' చేసిన ఉపన్యాసము —భా. సం.]

నువ్వు ఏమి చెబుతావు దీనికి? ఎన్ని కడుపులు ఆకలితో కాలిపోతూవున్నాయి! ఇప్పుడు యీ దేశంలో ౩౬ కోట్లమంది ప్రజవున్నారు. మరి మూడేళ్లలో ౪౦ కోట్లు. ఇప్పుడు రోజుకి మూడణాలఆదాయంఅయినా సరిగ్గాలేదు. అప్పుడు ఎంత వుంటుందో. దీనిలో — తిండికి తిప్పకి చదువుకి సంధ్యకి మనికికి మందుకి అంతా దీనిలోనే. తిండిలేక ఎందరు క్షయరోగులు, పాలులేక ఎంతమంది పిల్లలు చచ్చిపోతూవున్నారు! పాపం, ఎంతమంది! ఇంతకూ ఆపాలకోసం నెలకు ఆరు పైసలుచాలుసుమా! ఆరుపైసలు. అబ్బా! ఎన్ని కడుపులు కాలిపోతూవున్నాయి! అబ్బా! తిండిలేక మానవులు నశించిపోవడమా! కోటిచేతులు చాపి కాటకమ్మే తిరుగు నేటిభారతభూమిలో! నాల్గుదిక్కులనడుమ వెల్గు బంగరునేల నాశమాయె మహాశ్మశానమై — నువ్వు దీనికి ఏమి చెబుతావు? మన దేశం రత్నగర్భ కాదూ? మనదేశం వసుంధర కాదూ? మన దేశంలో ఎన్ని కడుపులు కాల్తున్నాయి! ఎన్ని కడుపులు! దీనికి నీ సంజాయిషీ ఏమిటి? — ఇది ఈ రోజుల్లో అందరూ వేస్తున్న ప్రశ్న. ఎంత పెద్ద ప్రశ్న!

నిజానికి యీప్రశ్నే నేను ఒప్పుకోను. ఊహుఁ! అన్నికడుపులు కాలిపోవాలా? అసలు ఒక్క కడుపైనా ఎందుకు మండాలి? -ఒక్క కడుపు. దానికి నీ సంజాయిషీ ఏమిటి? — దానికి నీ గుండె ఎలాగు మండిపోతుంది?

ఇంత నిశితంగా, యింత సన్నిహితంగా, యింత ఉదాత్తోదారంగా నిన్ను నీవు ప్రశ్నించుకో — లోకంలో ఎక్కడా యింత దారిద్ర్యచ్ఛాయ ఉండదు. అప్పుడే వుండదు. ఒక్క గుండెలో ఆనందమున్నా భగవంతుడున్నవాడు పూర్తిగా కుంగిపోలేదు; ఒక్క గుండెలో దుఃఖమున్నా పొంగిపోనూ లేదు అన్నాడు ప్రేమికుడైనఋషి. ఒక్క పొట్టలో ఒక్కపూట క్షేత్రాగ్ని అంటుకుని రేగిందా మానవుడైనవా డెవ్వడూ లొట్ట వేస్తూ రుచి అనుభవిస్తూ ఒక్క మెతుకు కూడా ఆరగించలేడన్నాడు మహాత్ముడు.

చాలా చిన్నతనంలో చదువుతూవుండేవాణ్ణి ఆంగ్లపాఠపుస్తకంలో ఈ చిన్ని కథ. చదువుతూ గట్టిగా ఏడ్వలేక నోట్లో తలగడ పెట్టుకొని కుమిలిపోయేవాణ్ణి. ఆ దేశంలో చలి కారు. రాత్రివేళ కురిసినమంచులో యిళ్లుకూడా సగం మునిగిపోతాయి. పదేళ్లపిల్ల తిండిలేక తల్లిదండ్రులు నుసిఅయిపోయాక, అనాథ కూడా కాదూ, పగలల్లా తిరిగింది నాలుగు అగ్గిపెట్టెలు అమ్ముకోవాలని. లేకపోతే యీరోజుకూడా జరిగిపోయిన నాల్గుఅయిదు రోజులలాంటిదే కాదూ? పూర్తిగా మోడు అయిపోయిన చిన్న శిశిరతరుశాఖలు—చేతులు

—ఆ చేతులు చాపి ఒక్క అగ్గిపెట్టె కొంటారా అని అడగనైనా లేకపోయింది. ఈ రోజున తిరగనైనా లేకపోయింది. రాత్రి వచ్చింది. ఆ తల్లికి వచ్చింది రాత్రి — ఎంతమంచిది! రాత్రి ఆప్యాయంగా, కాలిపోయేవారిని, హత్తుకుంటుంది. రాత్రితో నిద్రకూడా వస్తుంది. ఏ పంచనో వాలిపోయింది ఆపిల్ల. ఉదయమైంది. సూర్యుని మొదటికిరణం నవ్వుతూవున్న ఆపిల్ల పెదవులమీద వాలింది. వళ్లంతా వేళ్లకొనలదాకా మంచులో కప్పబడివుంది. ఇంక ఆమె అగ్గిపెట్టెల నమ్ముకో నక్కరలేదు.

ఈగాథ చదువుతూ రోజూ నేనూ ఏకాకినైపోయి తిరిగి తిరిగి అలిసిపోయి చచ్చిపోయేవాణ్ణి.

మిసెస్ బ్రౌనింగ్ వేరే సందర్భంలో వ్రాసినట్టు

'They are weeping in the play time of the others'.

అందరూ ఆడుకొంటూవున్నప్పుడు వాళ్లు ఏడుస్తూవున్నారు. మన దేశంలో ఎందరు దరిద్రులో, ఎన్నివిధాలదరిద్రులో — అందరూ అన్నివిధాలా అసహాయులైన పిల్లలే కాదూ?

'They are weeping in the play time of the others'.

అంతేకాదు, ఆమె యింకోమాటకూడా అంది:

“మానవుడు ప్రేమిస్తే దేవుడు ఉన్నాడనిపిస్తుంది; వాళ్లు రెండూ నమ్మలేకపోతున్నారు” అని. అంతేకూడా కాదు. ఆమె యింకోమాట అంది. వాళ్లమౌనవేదన బలశాలి ఆగ్రహంకంటె, ఎక్కువతీవ్రంగా శపిస్తుంది సుమీ అని.

ఇంకొకకవి యిలా అన్నాడు: ఒక మహాముహూర్తంలో ఒక తేలు సగర్వంగా లేచి ఆసూర్యునికి కాంతిభిక్ష పెట్టినవాడే నాకు దినదినమూ తిండిపెడుతున్నాడు అని. ఒకమహాముహూర్తంలో ఒకసర్పం అగ్నిలత లాగ నృత్యం చేసి ఆ చంద్రుడికి శీతలరజతాహారం అనుగ్రహించినవాడే అనునిమిషమూ నాకు తినిపిస్తున్నాడు అని. ఒకమహాముహూర్తంలో నక్షత్రాలన్నీ శతసహస్రకంఠకాంతులు విప్పి ఆపురుగులకు ఆహారం మిస్తున్న వాడే దినదినమూ మేము మరీమరీ మెరసిపోయేటట్టు మాకు ఆహారం అనుగ్రహిస్తున్నాడు అని. ఒక్క మహాముహూర్తమూ లేదు మానవునికి. తాను నిర్మించుకొన్న కారాగారపు నారసాలలోనుండి 'యిదిగో చూడండి నేను ఆకలితో చచ్చిపోతున్నాను,' అంటున్నాడు. ఇది కవి అన్నది. నే నంటాను ఆకలి వుంటే చచ్చిపోము అని. మన దేశములో ఆకలి లేదు. మనం శిలలం. మనం మన్ను. మనం [illegible]. వేనవేలగ్గ అసత్యప్రచారములు, [illegible] ప్రచారములు అసంబద్ధ వైరాగ్యములు మనకు ఆకలి లేకుండా చేశాయి. మనపొట్టకు ఆకలి లేదు; లేదని తెలియదు. మన గుండెకు ఆకలి లేదు; లేదని తెలియదు. మనకు ఆధ్యాత్మిక క్షుధా లేదు; లేదని తెలియదు. దానికి మన్ను, దీనికి బొమ్మ, దానికొక ఆచారము యిచ్చారు. ఉపయోగించుకోని యింద్రియాలు హరించుకుపోతాయి కాదూ? మనం క్రమక్రమంగా నశించిపోయాం.

ఆకలి ఆరోగ్యచిహ్నం. ఆకలికి బలం వుంది. ఆకలికి సాహసం వుంది. ఆకలి వేసే పొట్ట అన్నం తెచ్చుకొనితీసతుంది. ఆకలి వేసేగుండె ప్రియుడో ప్రియురాలో రాలేదని ఊరుకోదు. ఆమహోత్సుకత రేగుతే ఆలయ ద్వారాలు విపరాసం. అనుమతి అక్కర్లేదు; అడుగడుగున ఆలయం సాక్షాత్కరిస్తుంది గనుక.

కాని ఎలాంటి వైరాగ్యం బోధించారు! దారిద్ర్యంలో ఉన్న గొప్పదనం అంటారు. దారిద్ర్యంలో మహత్తేమిటి? తనఐశ్వర్యం లోకానికి పంచిపెట్టేసిన సంయమి ఎప్పుడూ దరిద్రుడు కాడు. రెండువిధాల ఐశ్వర్యవంతుడు. మనదారిద్ర్యం అటువంటిది కాదు. మనకున్న దారిద్ర్యంవంటిది ఉండకూడదు.

భర్తృహరి రెండుశ్లోకాలు వ్రాశాడు. ఒకటి చదివితే నాకళ్లు చెమ్మగిల్లుతాయి. నా'గుండెగొంతుకలో'వచ్చి'కొట్లాడు'తుంది. రెండోది చదివినప్పుడుమాత్రం — క్షమించండి — నేను సిగ్గుపడతాను.

దీనాదీనముఖైః సదైవశిశుకై
రాకృష్టజీర్ణాంబరా
క్రోశద్భిః క్షుధితై ర్నిరన్నవిధురా
దృశ్యేత చే ద్గేహినీ
యాచ్ఞాభంగభయేన గద్గదగల
త్రుట్యద్విలీనాక్షరం
కో దేహీతి వదే త్స్వదగ్ధజఠర
స్యార్థే మనస్వీ పుమాన్

పాపం, తిండిలేనిపిల్లలు దీనులై చిరిగి పోయిన తనకొంగు లాగుతూఉంటే నిరన్న విధురయై దీనముఖయైన భార్యను చూడడం వల్లనుకాని ధీరుడయినా ఎవడయినా...కాలి. పోయే తనపొట్టకోసం గద్గదగళంతో చిరిగి పోయిన మాటలతో ఎవరినయినా యాచిస్తాడా అని. అప్పుడు యాచించడు. అప్పుడూ యాచించకూడదు.

గంగాతరంగహిమశీకరశీతలాని
విద్యాధరాధ్యుషితచారుశిలాతలాని
స్థానాని కిం హిమవతః ప్రళయంగతాని
యత్సావమానపరపిండరతా మనుష్యాః.

ఎంతటిచక్కనిశ్లోకం! ఎంతతీయనిది! కాని యింతకంటె అపాయకరమైనది యీ దేశంలో లేదు. త్రాగడానికి గంగాజలం ఉంది; పరుండడానికి శిలాతలా లున్నాయి. ప్రళయం వచ్చి హిమగిరిస్థానాలు పోలేదే? ఎందుకు మానవులు పరపిండాన్ని ఆశిస్తారు అని. తరువాత కానల్లో పళ్లున్నాయి; ఆకు లున్నాయి; దుంప లున్నాయి అంటూ అంటాడు. మనకు ఇది పనికిరాదు.

ఎంత దిగులుపుట్టిస్తుంది ఈవేదాంతం! ఎంత నీరసంగా చేస్తుంది ఈవేదాంతం! ఆ దేశంలో డెబ్బైయేళ్లు వచ్చినా మానవుడు నృత్యంచేస్తూ నవ్వుతూ నడుస్తాడు. ఈదేశంలో అయిదేళ్లవాడు చివర్లు క్రిందకి వంగినపెదవులతో దీర్ఘముఖంతో పాకుతూ బ్రతుకంతా పూర్వ వర్తమాన భవిష్యత్తులూ కర్మసిద్ధాంతానికి అప్పచెప్పి ఊరకుంటాడు.

నాకు ఐశ్వర్యం కావాలి; సమృద్ధి కావాలి. అందరికీ కావాలి.

ఇది గుర్తించడం అత్యావసరం. మును పు దక్షుడు గుర్తించలేదు; నలిగిపోయాడు.

దక్షుడు బ్రహ్మకొడుకు; ప్రజాపతి; గొప్పవాడు. దక్షుడి అల్లుళ్లుకూడా గొప్ప

వాళ్లు. కశ్యపుడు ఒకడు. యమధర్మరాజు ఒకడు. రాజంటే చంద్రుడు ఒకడు. శివుడు కూడా దక్షుని అల్లుడే. కాని శివునికి బట్ట లేదు. శివునికి తిండి లేదు. శివునికి ఇల్లు కూడా లేదు. శివుడుమాత్రం ఐశ్వర్యానికి అధిపతి. శివుడు ప్రజలదేవుడు. ప్రజాశక్తి శివుడు. దక్షునికికూడా ఐశ్వర్య మిచ్చాడు. దక్షుడు యజ్ఞం చేస్తాడు. లోకాధిపతులు అందరూ వస్తారు. బ్రాహ్మణులు అందరూ వస్తారు. మహర్షులు అందరూ వస్తారు. ముక్కోటి దేవతలూ వస్తారు. యజ్ఞశాల మహావైభవంగా ఉంటుంది. "వింధ్య మాకిడిన ట్లుండె విశ్వసభయు." దక్షుని అల్లుళ్లు అందరూ వస్తారు. శివుడు రాడు. శివుణ్ని దక్షుడు పిలవనూలేదు. యజ్ఞశాలలో దధీచి మహర్షి లేస్తాడు. 'ఐశ్వర్యం శివునిది. శివుణ్ణి అవమానించకూడదు. శివుణ్ణి అవమానిస్తావా ఐశ్వర్యం నీదగ్గర బూడిదై శివుని సాన్నిధ్యానికి పోతుంది. నీవు చితికి పోతావు సుమా' అన్నాడు దక్షునితో. దక్షుడు అహంకారి. ఆ హెచ్చరిక వినబడ లేదు. దక్షునికూతురు సతి నిండుసభలో భస్మమైపోతుంది. శివుడు వింటాడు. శివునికి ఆగ్రహం వస్తుంది. శివుని ఆగ్రహం వీరభద్రుడు. కోట్ల ప్రమధగణాన్ని, అనగా, శివుని అనుచరుల్ని వీరభద్రుడు నడిపిస్తాడు. యజ్ఞశాల గడగడ లాడుతుంది. దేవతలు, ఋషులు అవమానితు లవుతారు, ఒకడి కన్ను పోతుంది. ఒకడి పళ్లు పోతాయి. ఒకడి తల మొగురుతుంది. దక్షుడు నాశమవుతాడు. యజ్ఞశాల శ్మశాన మవుతుంది. ఇది యొక ప్రళయగాథ.

ఇలాంటి ప్రళయసంఘటనాలు పాశ్చాత్యలోకంలో వచ్చాయి. మనకు వద్దన్నారు మహాత్ములు. అవును, మనకు వద్దు. పాశ్చాత్యుల దృష్టి ఈ దేహావరణ, ఈలోకావరణ దాటదు. మనదృష్టి గరుత్మంతుడు. కాని మనకు యీ దేహం వద్దనిగాని, యీ లోకం వద్దనిగాని యేడ్పించే శిథిలవైరాగ్యం వద్దుకదా. మనది పెనుచీకటి కావల నున్న వెలుగులో సజీవ విశ్వాసము గనుకనే ఆ మహాలక్షణాలు ప్రేమవంటివి. కొన్ని మనలో కొంతవరకు అవతరిస్తే లోకంలో బాధ అనేది ఉండనివ్వలేము. "(శ్రీ)రాముడు రాజు కానే కాడు, శిబి కర్ణుడు కానేకారు, చంద్రులు ఆప్త బంధువులు. ప్రాణానికి ప్రాణమైన నెచ్చెలులు. వాళ్ల ఐశ్వర్యం వాళ్లది కాదు. అందు కే అందరిదీని. కనుక వాళ్ళదీని" అన్నారు మన ఋషులు. శరణాలయా లన్నారు, సత్రము లన్నారు. అతిథినే వన్నారు. వీనిలో కొంత అపాత్రు వున్నా యివి ఐశ్వర్యవంతునికి మార్గాలుగా పెట్టారు గాని దరిద్రునికి ఆలంబాలుగా పెట్టలేదు. మనదేశంలో నారయప్పారావుగారి కథలు వినలేదు? చలిలో వడకుతూ వున్న నక్కలకు — నక్కల బాధ సహించుకోలేని ఆయన కరుణార్ద్ర హృదయాన్ని నేటికీ దేశదేశాల బైరాగులు కీర్తిస్తారే! — మన సామాన్యసంసారుల్లో కూడా సత్పురుషులు వున్నారే. భారతంలో చదవలేదూ అతని గాథ? ఒక మానెడు పేలపిండితో సంసారం నిలబెట్టుకో వలసిన శ్రమజీవి కలకాలపు ఆకలితో వచ్చిన అతిథికి తన దంతా ఇచ్చివేస్తాడుకదూ?

కాని — యీ దయాసేవమాత్రం ఎంత కష్టమైంది! సేవ చేస్తున్నాను అని గర్వపడు

వారికంటె దుస్సహమైనవాడు యింకొకడు లేడు. బాగా ఫలించేటట్టు వాడు సేవ చేయనూలేడు.

అన్నిగకాల అహంకారాలకంటె ధర్మ సంబంధమైనది నీతిసంబంధమైనది సేవ సం బంధమైనది మరీ చెడ్డవి.


దేశంలో వర్షాలు లేవు. భయంకర క్షామం వచ్చింది. శ్రావస్తి పట్టణం పొలి మేరలో బుద్ధభగవానుడు ఆసీనుడైనాడు. శరదాకాశంలాగ శాంతనిర్మలమైన ఆయన నేత్రాలు చెమ్మగిల్లున్నాయి. దేశంలో వున్న గొప్పవాళ్ళ నందరినీ రావించాడు. ధనికసమ్రాట్టయిన ఒకనిని పిలిచి ఈ క్షామం ఎలా పోగొడతావు అన్నాడు. "ప్రభూ! నాధనం అంతా నీ చరణసూళి దగ్గర యిది గో సమర్పిస్తున్నాను. సరే కొన్ని లక్షల మందిని కొన్నిరోజులు పోషిస్తుం దది; అంతే" అన్నాడు. "పో" మ్మన్నాడు బుద్ధ దేవుడు. ఒక భూస్వామిని పిలిచాడు. అదే ప్రశ్న. అదే ప్రత్యుత్తరము. పొమ్మన్నాడు బుద్ధదేవుడు. బలశాలియైన సేనాధిపతిని పిలిచాడు. అదేప్రశ్న. అంతకంటె విచిత్ర మైన ప్రత్యుత్తరము. పొమ్మన్నాడు బుద్ధ దేవుడు. జనులు నిశ్చలులై యున్నారు. బుద్ధదేవుని చూపులు, చిరునవ్వు యింకా ఆహ్వానిస్తూనే ఉన్నాయి. సుప్రియ భిక్షుక బాలిక నిలబడింది. ముందుకు వచ్చి బుద్ధ దేవుని చరణాలమీద సాష్టాంగపడింది, లేచింది. "స్వామీ! తమపాదాల నాశ్ర యించినదానను. నేను దేశంలో క్షామం నివారిస్తాను. వీరందరికీ ఎవరికలిమి వారిది. నాది అని అంటారుకూడా. నాకు ఆస్తి లేదు. కనుక అందరికలిమి నాదే. నాబ్రతుకు అక్షయపాత్ర. చిరిగిపోయిన జోలె. లోకం అంతా అక్షయపాత్రేకదా!" అన్నది.

బుద్ధదేవునిహృదయం కరిగింది. రెండు కొలుకుల్లో రెండు చిరుబిందువులు కదిలి రెండు కపోలాలమీదకు దూకాయి. అంత లో ఆకాశంమీదకి ఒక శ్రావణమేఘం వచ్చింది. ఒక అమృతవర్షం కురిసింది. దేశంలో క్షామం పోయింది.

దీనినీతులు. నిజానికి కలిమి అందరిదీని. నాది అంటే సేవచేయలేడు. కాని మానవ ప్రయత్నం మానకు. పోగొట్టు నీదేశంలో దారిద్ర్యాన్ని. పౌరుషప్రయత్నమే పరమే శ్వరభిక్ష. ఏమంటావు దీనికి? ఎన్నికడుపులు నింపాలనా?

అవని అంతా పెద్ద అక్షయపాత్ర.

లోకప్రవృత్తి



పద్యం-అర్థం

భమిడిపాటి కామేశ్వరరావు

[ఆనందం, శేషూ, ఒకబల్లకి ఎడాపెడా కుర్చీలమీద ఉంటారు]

ఆ—నువ్వు ఒక్కవరసని తిడుతున్నావుట!

శే—ఎవర్ని? ఎవడా అన్నవాడు?

ఆ—కవిత్వాలు విమర్శిస్తున్నావుట!

శే—అంటే తిట్టడంఅనా! పోనీ. అయితే నీ కేం?

ఆ—నాకవిత్వం ఎగో నువ్వు చప్పరిస్తున్నావుటగా!

శే—నువు కవిత్వం చేశావా?

ఆ—నీవు తెలియనట్టే అక్కసికి. నాపద్యాలు ఉదహరించావుట.

శే—నీపద్యాలు నేను ఉదాహరించినమాట నిజం. కాని అవి కవిత్వంకిందకి వస్తాయని నేను అనుకోలేదు.

ఆ—అయినాసరే, వాటినిగురించి మాట్లాడ్డానికి నువ్వు ఎవడివి? నీకెవడిచ్చాడు హక్కు?

శే—నిన్ను గౌరవమున్నవాడే!

ఆ—పోనీ అల్లాంటివాక్కు ఉన్నప్పుడు కొత్తసాటి తెలుసువాళ్ళని పొగిడి పెద్దవాళ్ళని చేసి కీర్తి తెప్పించాలిగాని నిరసించుకుంటూండా ఎక్కడైనా?

శే—నేను నీపద్యాల్నిగురించి ప్రసంగించాను గాని నిన్నుగురించి కాదు. అనవసరంగా నువ్వు పూసుకు రావడం ఎందుకు?

ఆ—బిడ్డకి అన్యాయం జరుగుతూంటే చూసి చూసి ఊరుకోలేక!

శే—ఏమిటి ఆఅన్యాయం? ఫలానా అనిపించుకుని జీవించే దిక్కులేని బిడ్డల్ని మెడపట్టుకుని గెంటి జనమధ్యంలోకి తోయ్యడం ఎందుకు? జనకాలే బయల్దేరడం ఎందుకు?

ఆ—ఆపద్యాలన్నీ కలిపి వొర్తి 'భావకవిత్వం' కిందకి వస్తాయని టాకువేస్తున్నావుట నువ్వు?

శే—రామరామ! వొట్టిది! వొట్టిదీ ఉత్తదీకూ! ఆపద్యాల్ని 'కవిత్వం'అని టాకువేస్తూన్నది నువ్వు. వాటి 'భావం'గనక ఏమిటో నాకు బోధపడితే తక్షణం ఆటాకు నేను ప్రారంభిస్తాను.

ఆ—సరిసరి ఇదోటా! నీకు ఇంతా చేసి ఆపద్యాలు తెలియనేలే దన్నమాట!

శే—భస్తే!(అని తల కదిపి చెయ్యి ఊపుతాడు.)

ఆ—(కొంచెం చిరునవ్వుతో) అల్లాంటప్పుడు నువ్వు నోరు మూసుకోడం ప్రశస్తం ఏమో, మన్లో మన మాట! అజ్ఞానంలో ఉంటె అల్లా ఉన్నట్టు తెలిసింతరవాతకూడా, తనఅజ్ఞానంగురించి అల్లరిచేసుకునేనా డుంటాడా సినిమాలో "చెప్పు!"లాగ?

శే—ఎన్ని మాసికలేనాసరి పడి, ఎంత అప్రతిష్టకేనాసరే దోసిపెట్టి, నీమాటల్లోఉన్న సంగతి గ్రహించి తద్వారా తరించవచ్చును!

ఆ—అయితే ఆక్షేపణ ఎందుకూ?

శే—తెలియలేదని చెప్పడం ఆక్షేపణకాదు.

ఆ—కోట్లాది జనంలో నువ్వు ఒకడవ్. నీకు ఒక్కడికే తెలియలేదని నే నేడవనా?

శే—పోనీ కద్దులే!

ఆ—అసలు నాకవిత్వం బంగారం.

శే—కాకి గెప్పాలి, నీదో దాందో!

ఆ—సుగ్రంలా కదంతొక్కేరకం, నాపద్యం.

శే—నీకే తెలియాలి సుగ్రమో మరోటో! నాకు తలా తోకా తెలియలేదు.

ఆ—అయితే, ఓపని చెయ్యాలి, చేస్తాను, సాసామ్మ ఎంతమంది తిన్నారుకారూ!

శే—మొదట్లో! తరవాత నువ్వు వాళ్లనే తినే శావేమో! ఇప్పుడు సామ్మసంగతి ఎందుకు? ఇదా అర్థం?

ఆ—ఓ నిఘంటువు కొని నీకు దానంచేసు సంటే నీకు అర్థం తెలుస్తుందేమో అని.

శే—ఎక్కడి కక్కడికే! పోనీ ఇల్లాపాకెయ్ నిఘంటువు, దక్షిణ అక్కర్లేకుండా దానం పట్టేస్తాను!

ఆ—నీకు సరిగ్గా చూసుగోడం తెలియదేమో?

శే—నే నేదో తంటాలుపడతాను లేస్తూ.

ఆ—అమ్మ! ఎంతాసీ! ఇదా ఎత్తూ!

శే—ఇదా ఎత్తూ, దాటుకుపోడానికే! గంట నేపు ఇతరపన్లు కట్టిపెట్టి ఈపద్యాలు పుచ్చుకుని కూర్చున్నాను. నీదయవల్ల మాటలు తెలిశాయి. తెలియక ఏంజేస్తాయి? "పరిపరిపేలుకర్పూరపురక్షణచుడు", "స్యందనస్థితబిడౌజ" వగైరాలనురించికంటె నీపద్యాల్లో మాటలు ఎక్కువ నిఘంటువులు కోరవు. కాని, వీట్ల భావం ఏమిటో తేలిందికాదు. 'దీనిభావమేమి తిరుమలేశ' అనే పొడుపుకథపద్యాలైనా పెంద్రాళే తేల్తాయికాని, ఇవి తాడూ పేడూ లేలకుండా వచ్చాయి. ప్రతీదీ 'గొర్రె కూ మేక కూ!' అన్నట్టుంది

ఆ—అసలు ఈపద్యాల్లో చూడవలిసింది భావమే, అర్థంకాదు. నేను రసకవిని.

శే—ఏపద్యాల్లోనేనా అంతే. మాటలకి అర్థాలద్వారా, భావం కలగాలి. "అర్థవశంబున నమరును భావంబు" అనేది నమ్మవ్? 'భావసంగతి గనుపట్టు రసము'.

ఆ—నమ్ముతాను. అయితేం? నువ్వు, 'తెలియకూడదు' అని కూచున్నావుగా! నీగ్రహచారం, నీప్రారబ్ధం. నే నేంజెయ్యను? నీకు ఊహ నే నెక్కణ్ణించి తెచ్చిపెట్టనూ! అవగాహనకి అర్హత ఏడవాలి. కవిసమయాలూ సంప్రదాయాలూ తెలియాలి.

శే—తెలుసును.

ఆ—ఇష్టం ఉండాలి. రసికత్వం ఉండాలి. అనూయకూడదు. ఇన్నీ సరిగ్గా ఉన్నా భావం తెలియకపోతే, ఈ కవిత్వానికి ఇన్నినీళ్లు వదులుకో.

శే—తీరోదకమా? అబ్బే! అప్పుడే? ఉండు. ననకాయుంపూ ఆలోచించనీమరి! నువ్వనేది బాగానే ఉంది. నాకు భావం ఆస్వాదించేశక్తి లేదనికాదూ? కావచ్చును. నీశక్తియందు నాభావయిత్రీశక్తి తక్కువ కావచ్చును!

ఆ—కావచ్చేమిటి, రూఢి! నువ్వు ఇంకా కొన్నేళ్లు తంటాలుపడితేగాని ఈకవిత్వపు అంతస్థకి ఎగబ్రాకలేవు. అల్లా ఎగిరితేగాని నీకిది తెలియదు.

శే—కాని, నీలో రెండుతికమకలు ఉండి ఉండవచ్చు నీ ఆలోచనలోనూ, నీ రచనలోనూ...

ఆ—గ్రహింపులేదని తెలిసి ఒప్పుకుంటూ, పైపెచ్చు తప్పులుకూడా ఎంచుకుంటి! నాలాంటివానికి అర్థంకాలేదని తప్పులంటూ ఉండకపోతేగా నీలాంటి వాడు ఎంచుకునేనా? ఛీ, ఛీ!

శే—నీ ఆలోచన స్పష్టంగా ఉండకపోవచ్చు!

ఆ—ఉండకేం!

శే—సక్రమంగానూ సగళంగానూ ఉండకపోవచ్చు!

ఆ—ఉండకేం!

శే—సమగ్రం కాదేమో!

ఆ—కాకేం?

శే—అన్నీ సరిగ్గా ఉంటే, ఎవడికో ఓడికేనా, ఎప్పుడోప్పుడు బోధపడితీరాలి ఎవడైనాసరే. లేక, నీ ఆలోచనని పూర్తిగా బయటపెట్టేరచన కాదేమో నువ్వు ప్రపంచానికి పారేస్తున్నది?

ఆ—నీకు వెంటనే బోధపడితేగాని ఒకరచనలో సరియైన ఆలోచనే లేదన్నమాటా?

శే—ఎంత వట్టిమాట అడావ?

ఆ—నీకు చేతకాదా? నేర్చుగోవాలా?

శే—ఎల్లా గ్రహించావ?

ఆ—ఈకవిత్వాన్ని నువ్వు 'భావకవిత్వం', 'అభావకవిత్వం', 'సుభావకవిత్వం' అన్లేదూ! ఇంకా

శేలిగ్గా 'బావకవిత్వం' అనికూడా అన్నావుట! అక్కకి బావ ఏమవుతాడో తెలుసా?

శే—అమ్మకి నాన్నలాగే అవుతాడు! అన్నీ నువ్వే అనుకుంటున్నావు. వినవచ్చే వార్తల్లో ఉండే అసందర్భాలు చూసుకోడమే కష్టంగదా, పైగా నువ్వ వెళ్లి సంగతులు కొనుక్కొని అసందర్భాలు పెంచుకోడం ఎందుకు? నాకు తెలియంది ప్రతీదీ కవిత్వం కాదు అనుకునే మూర్ఖత్వంలో నేను ఇంకా పడలేదు. నాకు తెలియకపోతే, ప్రాస్థానాలు, గోష్ఠులు, అనుభవజ్ఞులు, రసజ్ఞులు ఉన్నారుగా! నిఘంటువులు ఉన్నాయిగా! నలుముఖాలా చూసి ఎక్కడా సాయం దొరక్కపోతే ఏమవుతుందోగాని ఈ లోపల తొందరపడి ప్రతీదీ కొట్టిపారెయ్యను. కవిత్వకళకి ఉన్న ప్రత్యేకలక్షణం ఒకటి గమనించాలి. మనకి దాని సారస్యం గ్రహించేపాటి తాహతు లేకపోయినా అందులో మాటలకి అర్థాలంటూ తగులుకుంటాయిగనక, సాహిత్యంలో మాటలకి లోకంలో సిద్ధించిన అర్థాలు నిల్చిఉంటాయిగనక, ఎల్లానో అవి సంపాదించి, మనం కూడా, కవియొక్క హృదయగర్భంలో ప్రవేశించలేకపోతే అదేపోయె, అధమం ముఖానికేనా వెళ్లిపడచ్చు. ఇల్లా వెళ్లిపడడం గానంలోనూ చిత్రరచనలోనూ శిల్పంలోనూ అంతగా వీల్లేదు. ఒకవేళ ఒకకవి రచించిన పద్యంయొక్క జీవసారస్యాలు గ్రహించినవాళ్లు భూగోళంమీద లేరనుకుందాం. పోనీ కవి ఉంటాడు. అతనికేనా తన కవిత్వపుమర్మాలు కొంతవరకేనా తెలిసి ఉండవ్? ఇప్పుడు నేను నిన్ను మొహమాటపెడితే నీపద్యానికి నువ్వు అర్థం చెప్పవ్?

ఆ—అసలు అర్థాలు చెబుతూకూచోడం నేను ఒప్పను. కవిత్వం ఆనందించాలంటే ఏకలాటుగా ఆనందించాలిగాని, దాన్ని ముక్కముక్కలు చేస్తే దాని సొగసే పోతుంది. కవిత్వాన్ని చెక్కలు చేసేవాడు, దానిని రక్షించి వదిలేసి ఏవచనమో పట్టుకుంటే మంచిదనుకుంటాను.

శే—నేను ఆస్వాదనలో ప్రథమదశగురించి మాట్లాడుతున్నాను, నువ్వు చరమదశగురించి చెబుతున్నావ్! ఆస్వాదనకూడా తెలిసినవాడవు నువ్వొక్కడవేనా?

ఆ—నా వయస్సు చిన్నదైనా నా హృదయం అఘాతం.

శే—అందరిదీ అంతే.

ఆ—నా హృదయం మరీనూ. ఒక్కొక్కప్పుడు మిక్కిలి పరవశంగా, ఒకవిధమైన ఆనందంగా, చెప్పవీల్లేని ఒకానొకమోస్తరుగా నా మనస్సు అయిపోతుంది. అప్పుడు అమాంతంగా ఈ ప్రకృతిలో సశరీరంగా లీనంఅయిపోవాలని నాకు ఉంటుంది. మళ్లీ పద్యం పూర్తిచెయ్యడంగోల ఉండబట్టి ఆగిపోతూంటాను.

శే—ఒకవేళ నీకు ఎదేనా సుస్తీయేమో ఇదంతా? హృదయకవితై ఆగిపోకూడదూ?

ఆ—పశుప్రాయులు అల్లానే కవితోద్రేకాన్ని నిరసిస్తారు. కాని, నేను అట్టిసమయాల్లో షెల్లీ, కీట్సులాగ అయిపోతాను.

శే—వాళ్లెవరు?

ఆ—నాకుమల్లేనే చిన్నతనంలో...

శే—వాళ్లకిమల్లే నువ్వు అనుకుంటున్నావా, నీకుమల్లే వాళ్లు వెనక అనుకునేవారా?

ఆ—సరిగ్గా నాకుమల్లేనే వాళ్లు అనుకునేవారు పూర్వం!

శే—వాళ్లతో ఆట్టే ఆట్టే సాపత్యం తెచ్చుకోడం నీకు శ్రేయస్కరంకాదు. నువ్వనేదాన్నిబట్టి, చిన్నతనపులక్షణం ఉంటేసరా కవిత్వరచనకి?

ఆ—నీబోటిగాడు కాకుండా ఉంటేసరి! అప్పుడు నామనస్సులో జరిగే పరివర్తనాలు అసలు మాటల్లో అనడానికి వీలే ఉండదు.

శే—పోనీ నువ్వు ఊరుకున్నావుగనకనా! ఊరుకోడానికి వీలుండదుగావును!

ఆ—అంత బ్రహ్మానందదాయకమైన ఆనాచిత్తవృత్తిని నేనొక్కణ్ణే అనుభవించేసి ఊరుకుని పైకి అనకుండా ఉండడంఅనేది చాలా ఒంటెత్తుగా ఉంటుందేమో అని భయం. అంచేత యథాశక్తిగా మాటల్లో అది చెబుతూంటాను. నీఅంత తెలియనివాడికి అది బోధించడం అసాధ్యం.

శే—నువ్వది రాసింది తెలిసినవాడికా? నువ్వు పండితకవినా? పోనీ నాచనసోముడనో, గణపవరపు వేంకటకవినో! ఏపండితుడికీ ఇది తెలియదే! కొరుకుడు పడదే! ఇది బోధపడితేనే పండితుడుగావును నీఉద్దేశంలో! లేకపోతే పండితుడు కాడంటావు తీరిపోతుంది! నీహృదయం సమీపించడానికి ఎంతపండితుడైనా వెళ్లాలోకదా! నువ్విచ్చే పదాలు ఛేదించి అర్థం చూసుకుని అవి సంఘటించేసుకోగలవాడికి భావం పుట్టాలా అక్కర్లేదా, నీకు ముందు పుట్టిఉండడం నిజమేఅయితే? స్పష్టభావం ఏదీ ఇతరులకి నీమాటల వల్ల పుట్టకూడదుఅని రాసిఉంచావుగద!

ఆ—నే చెప్పదలిచింది ఆ సంకల్పాల్లోనే చెప్పేశాను! అవి స్పష్టంగానే ఉన్నాయి.

శే—నువ్వు చెప్పదలిచిందానికీ చెప్పగలిగిందానికీ తేడా ఉంటేనేమో! చెప్పిందాన్లో లోట్లూ సమస్యలూమాత్రం స్పష్టంగా ఉన్నాయి.

ఆ—మెచ్చుకోవలసొస్తుందేమో అని భయపడే వాళ్లమాట అల్లానే ఉంటుంది.

శే—నీమాటలు జనాన్ని దగ్గిరికి లాక్కోవాలి.

ఆ—అవతలవాళ్లు నావంటిహృదయంగలవాళ్లు అవాలి.

శే—అచ్చంగా నీవంటిహృదయం నీకే ఉంటుంది. దేశకాలాలకి ఆక్రమణ గమనాలు ఉండడంచేత ప్రకృతిలో, నాటకపు సంగీతానికిలాగ "వన్సుమోర్"లు ఉండవ్, నీమాటలు బతికున్న మనుష్యులికి రాయి. అందుకని ముందు మానవహృదయం ఏమిటో చూడు.

ఆ—మానవులసంగతి నాకెందుకు? నా ఆనందంకోసం నేను రాసుకున్నాను, రాసుకుంటాను. కోకిల ఆనందం కోకిల పాడుకుంటుంది.

శే—కాకిఆనందం కాకి కూసుకుంటుంది. కాని, ఎవరికేనా చెవినిగానిపడితే 'హూష్' అంటారు. నీయిష్టం వచ్చింది రాసి అట్టేపెట్టుకోక, అది నువ్వు ప్రచురించావెందుకూ, ఇతరమానవులకోసం కాకపోతే?

ఆ—నాయిష్టం; సమకాలీనుల్లో ఎవరేనా మెచ్చుకోగలరేమో చూద్దాం పోనీఅని.

శే—'పోనీ' అంటే?

ఆ—అంటేనా? "ఏగతి రచియించిరేని సమకాలమువారలు మెచ్చరేకదా" అని ఎరుగుదురు.

శే—మంచికవిత్వంకూడా సమకాలంవాళ్లు మెచ్చకపోవచ్చు. అందుచేత, విలోమంగా, సమకాలంవాళ్లు మెచ్చుకోడానికిగాని, మననం చెయ్యడానికిగాని వీలు లేని స్థితిలో ఉండేవల్లా మంచికవిత్వంఅనా నీసిద్ధాంతం? మెప్పు ఉండదని తెలిసి అచ్చేయించుకున్నావ్? అచ్చుపడిందల్లా శాశ్వతం అవుతుందనిగావును నీభ్రమ. మానవహృదయాల్ని పట్టుకుని నిలవాలిగాని ఏదేనా, కాగితాన్నీ తాటాకునీ పట్టుకుకాదు. వేదం ఆదినించీ ప్రెస్సులోంచావస్తా? ప్రపంచంలో కనిగలజనం ఉంటారు. దేనికేనా రచనకి విలవఉంటే అది వాళ్లని ఆకర్షిస్తే, వాళ్లు కంఠపాఠం చేసి దాన్ని నిలబెడతారు.

ఆ—అర్థం తెలియకపోయినా వేదం కంఠతా పట్టడంలేదూ కొందరూ, అల్లానే నాకవిత్వం పడతారు.

శే—తమరికి అర్థం తెలియకపోయినా అర్థం తెలిసినవాళ్లు మానవసంఘంలోకూడా కనిపిస్తూండడం వల్లా, అసలు దానికి అర్థంఅంటూ ఒకటి ఉండితీరడం వల్లా, తమ అల్పప్రజ్ఞల్తో ఆఅర్థం అవగాహన చేసుకోడానికి జీవితాలు చాలవేమో అనేభయంవల్లా కొందరు కంఠతా నేనా పడుతున్నారు.

ఆ—ఎవరో గట్టివాళ్లుండి నాకవిత్వం అంతే చేస్తారు. "విపులా చ పృథ్వీ" అన్నాడు భవభూతి.

శే—భవభూతి అన్నమాట ప్రతీఆషాఢభూతీ కూడా అనడం మొదలెడితే, నువ్వుమాత్రం ఒప్పుకుంటావా? అతడు ఎందుకు, ఏసందర్భంలో, ఏరీతిగా అన్నాడూ?

ఆ—నీది మొండివాదనగాని, నువ్వనేమాటేమిటి?

శే—నువ్వు రాసేది తెలిసేటట్టు, తెలియడానికి, తెలుసుకుని మరీరాస్తే బాగుంటుందని.

ఆ—అయ్యో! మూర్ఖుడా! తెలిసేటట్టు ప్రతీ పనికిమాలిన తెలుగువాడూ రాయగలడు. వెర్రివాళ్లనించి

తెలుసులో ఎంతమంది తెలిసేటట్టు రాయడం లేదుగనకా. నే వచ్చేదాకా ఒక్కడైనా ఇలా రాయడం చేత యిందీ? కవిత్వం అంటే అనేకరకాలది ఉంటుంది. కవిత్వం అనేమాటకి అర్థం పెరాయిస్తూ ఉంటుంది. ఈకవిత్వంలో సంగతి, వస్తువు, పదార్థం ఫలానా ఫలానాఅని ఇదమిత్థంఅని కవికే తెలియదు, కాని గొప్పభావం లోపల ఉంటుంది. "ఏమి టేమిటి?" అంటూ చొప్పదంటు ప్రశ్నలు ఈకవిత్వంలోనూ వెయ్యకూడదు, గానంలోనూ వెయ్యకూడదు.

శే—అందులో ఒక గొప్పభావం ఉంటుందా? లేక, ఉందిఅని మనం ముందే అనుకోవాలా? అల్లా అనుకుంటే, భావం లేంది ఏదీ? అభావమా?

ఆ—ఇటూ అటూ గుడానూ! ఇక నే తెలుసుగోడం గురించా? నేను రచనసమయంలో సమాధిలో ఉంటాను.

శే—ఇప్పుడు స్పష్టార్థం ఇస్తున్నాయి నీమాటలు! నిక్షేపంలా ఉంటూ సమాధికర్మం ఏమిటి నీకు?

ఆ—"ఏకాగ్రత" అన్నమాట. అప్పుడు నేను తన్మయత్వం పొంది ఉంటాను. గొప్పగొప్ప రవీంద్రాదులు అంతా అంతే. నా కప్పుడు మానవులు జ్ఞప్తికి రారు. ఏం పదాలు వస్తాయో, పదాలేవో నాకూ తెలియదు. ఏదో పద్యం ఠక్కా వస్తుంది. గబుంది పాగేస్తాను; బస్.

శే—అల్లాఅయితే, నీ అపూర్వోద్రేకంతో కూడిన నీఉత్కృష్టభావన చల్లారి, నీఅఖండాలోచనతో మిళితమై, నీఅద్భుతతన్మయత్వంలాంటిది ఇతరులకి కలిగించడానికి వీలైన సక్రమభావపరంపర జనించి, ఉచితభావలో గడ్డకట్టి వెలినేవరకూ ఆగకుండానే నీరచన ప్రారంభిస్తావా ఏమిటి?

ఆ—ఓ. తత్క్షణం. అప్పుడే కవిత్వం వేడివేడిగా ఉండడం. అసలు నాకవిత్వం ఉద్రేకపుముద్ద, రసధార. అందుకని దాన్ని వేరే తెలుగుమాటల్లో పెట్టలేం. ఇంకోభావలోకి దాన్ని తర్జుమా చెయ్యడం అసాధ్యం.

శే—బాగానేఉంది. అర్థమై అపోరిస్తేగా తర్జుమాతద్దినం! స్వభావవాళ్లల్లో పెద్దలకిగనక ఇది అభేద్యంగా ఉంటే, తర్జుమాతవాయి కలియుగంలో రాకపోవచ్చు.

ఆ—ఎవరో, వచ్చినాసరే, మానినాసరే. రాయడం అవతల గిరవపెయ్యడం నాపని. అర్థజ్ఞానం లేనివాళ్లు దాన్ని పోషణచేస్తారు. నాకు లెక్కలేదు.

శే—అందుకనేనా ఇతరులిల్ని అంత కనుక్కొని, నన్నింత అడిగావు?

ఆ—అందుకు కాదు. మనుషులికి మాత్సర్యాలు ఎంతవరకుంటాయో చూద్దాంఅని. పోషణకి హద్దుండాలి. నాకవిత్వం విని, కిక్కురుమనకుండా నోరెత్తకుండా ఆగిపోవలసిరావడంచేత, కొందరు జనానికి లోపల ఎంతోంటెగుద్ధ. వాళ్లే అడ్డదిడ్డపుప్రశ్నలు దీన్ని గురించి. పౌరుషం ఉంటే తమరుకూడా ఇల్లాంటిది రాసుకోగూడమా? నువ్వు చెప్పగలిగితే ఇల్లాంటికవిత్వం చెప్పచూస్తానా!

శే—నేనా? శాస్త్రం చెప్పినట్టుంది. నాతరమా నూటికో వెయ్యికో నీబోటివాడు ఉండచ్చు.

ఆ—అంత అపరూపమైంది నేను చెప్పకూడదనా, నీవాదం?

శే—రామరామ! అపరూపం కానిదికుడా చెప్పమనే! తెలిసింతరవాతగాని అది అపరూపమో సామాన్యమో తెలియదు! ప్రతీపుంతా తొక్కిచూడవలసిందే. అదోపుంత!

ఆ—నేను భాషకి సేవచెయ్యడం నీకు అయిష్టమా?

శే—భాష ఏ ఒక్కడిసొమ్మూ కాదు. ప్రతీ మనిషీ భాష వాడతాడు. మామూలుగా మాట్లాడ్డంలోనే కొందరు 'ఆహా!' అనేటట్టు మాట్లాడతారు. అది భాషాసేవ కాదా? ఏదేనా కాగితంమీద రాసింతరవాతా ఏమిటి కవిత్వం అవడం? పత్రికకి రాసినవాళ్లు మాత్రమేనా భాషాసేవ చేస్తున్నది? రాయక్కర్లేదు. భాష ఆడడం వాడడం అసలైన భాషాసేవ. అది జనం అంతా చేస్తున్నారు. వాళ్లు కష్టపడి ఆర్జించింది నొల్లుకుని కవి తందే అంటున్నాడు. భాష సముద్రం లాంటిది. సముద్రంలో అట్టడుగున పడిపోకుండా

పైపైకి తేలగలిగిన ఆంగ్రహహర్మ్యంలాంటిదాన్ని ఆహారంగా చేసుకుని సంగతి సందర్భాల్ని కవ్యంగా చేసుకుని నాలి కలనే తాళ్లతో, జనం అంతా కలిసి మథనంచెయ్యగా చెయ్యగా బయల్దేరే హాలాహలాన్ని లయకర్తకి వదిలేసి అమృతాన్ని మాత్రం తనకి చేతయినంత పట్టి నిలిపేవాణ్ణి కవిఅంటారు. కవి తనజీవితం అంతా ప్రజలు ఆడేమాటలు విని, తన ఆలోచన అంతా ఆపదాలల్లో చేస్తే, తన భావాన్ని జనహృదయాలకి వీలైనంత తక్కువశ్రమతో పాకించవచ్చు. కవి ప్రతిభగలవాడుగనక, ప్రజలభావ నిమిషంలో పట్టగలడు. కాని, కవి వాడినభాష యావత్తూ ప్రజల కందరికీ అబ్బడంఅనేది ఓపట్టాన్ని ఉండదు. ఒకవేళ ఆకవి అఖండుడైతే అబ్బవచ్చు. అప్పుడేనా విశేషకాలం పడుతుంది. అందుకని భాషా సేవనుగురించినప్రసంగంలో ఒకవ్యక్తి చెయ్యగలిగినపని మాత్రమే చెప్పడం అనవసరం అందులో, నీభావ వింతభావకూడానూ!

ఆ—నాకు మామూలు సందర్భాలు తగుల్తాంటే నేను మామూలు భాషలో రాసేసి ఉండేవాణ్ణి. నాకు తారసిల్లేవన్నీ వింతసందర్భాలూ కొత్తసంఘటనలూనూ! వీట్లకి కవిసమయాలూ భాషాకూడా వింతగా ఉండాలి మరి, నే నేం జెయ్యను?

శే—సందర్భాలూ సంఘటనలూ ఎంత వింత రకంవేనా కావచ్చు. అవి, పైకి చెప్పకోగలిగిన, వ్యక్తి వ్యక్తికీ వేరువేరుగాకూడా ఉండచ్చు. కాని ఎల్లాంటి పరిస్థితుల్లోనేనాసరే, ఎవడైనా ఒకమానవుడు, అనగా శిలావిగ్రహంకానివాడు, తనభావ. వాడు, ఎట్లా ఎట్లా ఆలోచించిఉండేవాడో అట్లా ఆలోచించి అప్పటి చిత్తవృత్తిని మాటల్లో బంధించేవాడే కవి. అందుచేతే, ఎప్పుడో పూర్వం ఒకొక్కకవి రాయగా నిల్చి మన దాకా వచ్చినపదాలవల్ల మనకి జనించేభావం, మన మనస్సులోకూడా అనాదినించీ వాసంచేసిఉంటూ, అప్పుడు కవిచేత నిద్దట్లోంచి లేవకొట్టబడ్డట్టు కనిపిస్తుంది. నీకు వింతభావ. బయల్దేరడానికి కారణం నీస్వంతపైత్యం అయిఉంటుంది. స్వంతపైత్యం స్వంతానికి ఖర్చుపెట్టు గోడం మంచిదిగాని, దేశంమీద రుద్దడం ధర్మమా?

ఆ—ఏమిటి నీమాటలూ? కుమిలిపోయిన హృదయంతో మానవజీవితంయొక్క పునాదుల్లోంచి పైకంటా ఉండే ప్రణయాదిరహస్యాలు పెల్లగించి...

శే—ఒప్పుకున్నాం!

ఆ—నా సున్నితమైన మనస్సులో వాటిని భరించలేక...

శే—కావచ్చు!!

ఆ—మనస్సు విప్పి...

శే—విప్పి చెప్పాలనుకుని, భాషతో దాన్ని తాళంవేసేస్తున్నావ్. "ప్రకటయు గూఢయునగు సరస్వతి" అన్నవాళ్ళిద్దర్నీ కూడా ఏమంటానో తెలియదు. నీతరం దాటింతరవాత ఎవళ్లేనా ఎటేనాభావం తమగిదని ప్రకటిస్తే అదికూడా నీపదాలగర్భంలో ఉందని చెప్పీ కూడా చెపతావేమో!

ఆ—అన్నట్టు జ్ఞాపకం వచ్చింది. నేను ముందు ముందు శతాబ్దాల జనంకోసమే రాస్తూంటా!

శే—ఈమాట బాగుంది. వ్యాకరణాలూ నిఘంటువులూ ఎదురుగుండా పెట్టుగుని కొందరు కవిత్వం చెబుతారు. వాళ్లు రాసేది గతించినవాళ్లకోసం. నువ్వు ముందుముందువాళ్లకోసం రాయి. "మనం మాట్లాడు కునేది ఓ తాటాకుగ్రంథంమీద రాసి పాతేశామంటే ఓరెండువందల యేళ్లయేసరికి ఓటాబాకోపనిషత్ అవుతుంది" అన్నగిరీశం మాటలు నీకు జ్ఞాపకంగావును! బతికున్న కవులు కొందరైనా అట్లా వనకాముందూ చూడగలవాళ్లున్నారు నయమే. కాని, బతికున్నవాళ్ల కోసంకూడా రాయడం ధర్మం. ఒకగోళంలో ప్రపంచం బోలెడు సాగిపోతోంది. నిన్నటిదే ఈవేళ అక్కర్లేదు. ముందుముందువాళ్లకి మనమాటలు దిగదుడుపుకేనా పనికిరాకపోవచ్చు. బతికున్నవాళ్లల్లో కొందరేనా హర్షిస్తే వాక్కుసఫలం అనుకోడంలో ద్రోహం లేదు.

ఆ—ఇంత మీమాంసలో పడితే నువ్వు దమ్మిడీ యెత్తు రాయలేకుండాపోతావు చివరకి, జాగ్రత్త! నాకవిత్వం ప్రకృతిని అనుసరించి ఉంటుంది.

శే—అంతే!

ఆ—ప్రకృతికి అర్థంఏమిటి? ప్రపంచానికి అర్థం ఏమిటి? జీవితానికి అర్థం ఏమిటి? ఏదో ఉంటుంది, ఉండితీరాలి, మనంచెప్పలేం! అల్లానే నాకవిత్వంకూడా నూ! ఇదీ, ఒక మిథ్య. పురుషుడికిమల్లే ఇదీ అవాఙ్మానస గోచరం!

శే—అగమ్యగోచరం! అల్లానేకానీ. ఎవరి ఇష్టం వారిది. నీయందుండే మమకారంకొద్దీ ఇంత అనవలిసొచ్చింది.

ఆ—అర్థం అయినా కాకో, తిట్టడానికో దీవించడానికో, ఎందుకైతేం నువ్వు కొంతసేపు నామాటలు పుచ్చుకుని చూడ్డమే నాజన్మకి సార్థకం! నీవంటి వాళ్లు మరి నలుగురు నామాటల్లో అర్థంలేదని గోలచేసిన కొద్దీ నాకు నయం. ఎల్లా అయితేం, నామాటలకి ఒక విధమైన వ్యక్తిత్వం ఏర్పడుతుంది. అంతేగా ఎవరు కోరుకున్నా!

శే—నిందాస్తుతులు నీకు సమం గనక నమస్కారం. అయినా, నీమాటలున్న కాగితం పట్టుకుని ప్రతీ వాడూ నీదగ్గిరికి రాడుకదా!

ఆ—వచ్చినా లాభంలేదు.

శే—మనిషిమనిషిదగ్గిరకే నువ్వూ వెళ్లలేవుకదా!

ఆ—వెళ్లను. నాకేంపనీ!

శే—ఈ మాటల అర్థం ఏమిటి అనినిన్ను, కూడదని తెలిసీ, అడిగాను. ఒకవేళ నువ్వు చెప్పగలిగిఉన్నా అది ఒప్పుకోకపోయేవాణ్ణి. ఎంచేతంటే, చెప్పదలిచింది ఆముక్కలు చెప్పాలిగాని, నువ్వు కాదు. నువ్వైతే, అందులో లేనిపదాలు కొన్ని సర్దడం, ఈపదాలు మాసినప్పుడు పండితుడైనవాడికికూడా స్ఫురించని కమామీషులు కొన్ని జొనపడం లాంటి గారడీలుచేసి ఏదో అర్థం తియ్యొచ్చు.

ఆ—అసలు నేను పద్యం పాడేసరికి నన్ను అర్థమే అడగరు.

శే—క్షమించు. పద్యంలో ఉండగల కవిత్వానికి, అగమ్యత్వం మొదటిపూత! రాగాలు తియ్యడం రెండోపూత!! సగం వినపడి కడంసగం వినిపించకుండా మింగెయ్యడం మూడోపూత!!! పూతమెరుగులు కవిత్వంకిందకి రావు. ఎల్లానో జనాన్ని ఆకర్షించడం కాదు నీపని; ఆకర్షణ సక్రమంగానూ, సవ్యంగానూ ఉండాలి. పాత్రప్రతిష్ఠచేసి ఆకర్షించు. మొదటే నువ్వు అతీతుడవని బయల్దేరకు.

ఆ—జనం అంతా మూర్ఖులు. నే నేంజెయ్యను?

శే—మూర్ఖుల్ని ప్రేమించు. వాళ్లని చూసి జాలిపడు. వాళ్లని హేళనకొట్టకు. ఎవర్ని ఉద్దేశించి రాస్తావో వాళ్లసంగతి గమనించు. వాళ్లభాష వాడు. వాళ్లఅంతస్థులో చేరు.

ఆ—పోదూ! నేను కవిని. కవిత్వం చెబుతాను.

శే—నువ్వు మాటలు చెప్పు. అవి వెళ్లి జనాన్ని ఆకర్షించేటట్టు చూడు. అప్పుడు అవి కవిత్వం అని జనం అంటే, నువ్వుకూడా అనుకో. కాలమే కవిత్వాన్ని నిర్ణయిస్తుంది.

ఆ—మన తెలివి అవతలవాడికి ఏమీ తెలియదు అనడంలోనే ఉంటోంది.

శే—ఎక్కడున్నా సరే, అసలుంటేను. పోతాను.

(అని నిష్క్రమిస్తాడు. తెర.)

కౌసల్యావిలాపము

చిత్రావూరు కామేశ్వరరావు

ఎవని పుణ్యావతారము భవతుషార
హరణకారణమయ్యె, మహాత్ము డతడు,
మార్గశిర శిశిరనిశాసమయములందు,
దిక్కుమాలి సాంద్రాటవిఁ దిరుగవలసె.

స్వర్ణశుద్ధాంతవీథుల సంచరించు,
ఆదిగర్భేశ్వరుండు, రామానుజుండు,
కంటకశిలావృత వనమార్గముల నడచి,
పుష్యమాసశీతున కెంత పొగులునొక్కొ?

దీనదుఃఖమోచనపరాధీనుడైన
భాగ్యశాలి, యమూల్యసంపదలు విడచి,
శల్యసంస్పర్శనముసేయు చలికి నెంత
పరితపించునో మాఘవాసరములందు.

గొల్లుమనుచు నింటింట బగ్గుండియాట
లాడుదురు ఫాల్గునదినములందు ప్రజలు,
మమ్ము విడనాడి రామలక్ష్మణులు సీత,
వనట మున్నిట మము ముంచి,మునిగినారు.

చైత్ర వైశాఖ గ్రీష్మవాసరములందు,
నేతరుచ్ఛాయ లాశ్రయ మిచ్చునొక్కొ,
యఖిలలోకాశ్రయుండై నిరాశ్రయుడగు
రఘుకులానందునకు, రామరాజమణికి ?

భక్తి నెమ్మది భజియించువారి కమృత
ఫలములు విరివిగా నిచ్చు భద్రమూర్తి
కకట! వనఫలాన్వేషణ ప్రాప్తియేమి,
జ్యేష్ఠమాసదినముల, నిస్సీమవనుల.

ఏప్రతాపాంశుమాలిసమీక్షణమున
సకలజీవరాసులదుఃఖజలదపటలి
పంచబంగాళమై యగపడదు మఱల,
అతనికి నితాంతభయదవనాంతరమున,
మేలుకట్టయ్యె నాషాఢమేఘమాల.

వ్యాకులముపడు గన్నీటివాన కెవడు,
కరుణరసమూర్తి రఘుకులాభరణు డతడు,
ఇల్లువాకిలి లేక, యుంటపట్టు లున్న
వాడొ, యవిరళశ్రావణ వర్ష వేళ ?

అతివినిర్మల దశదిశ లరసి చూచి,
నిజహృదంతరాళము గని, నిఖిలలోక
శుభచరిత, భాద్రపదమాసపూస్యదినము
లందు, భూజాత, సీత నోమనుకొనునొకో!

ఆశ్వయుజమాస బహుళసంద్రాగసంబు
అక్కటకట! త్రిభువనమోహనకరంబు;
జాలిపడదె, మా జానకి, జన్మగరిమ,
యడవి గాచిన వెన్నెల యయ్యెననుచు.

నారచీర గట్టిన సుకుమారి, జనక
రాజుకూతురు, కార్తిక రాత్రులందు,
పుడమిసెజ్జ శీతలవాతపోతములకు,
వసరి, వందురి, వడవడ వణకిపోదె ?

కైక ! దుర్దాంత ప్రళయసంకల్పసిద్ధి
నీకు, మృతిలేని యాతన నాకు, మనకు
రాణివాసమే దండకారణ్యమయ్యె,
రాము డెందుండు వైకుంఠధామ మదియె!

దీపావళి

అడవి బాపిరాజు

౧

కటికిచీకటిలో దీపాలు. నల్లటి ఆకాశంలో నక్షత్రాలు. కారుచీకట్లకు దసరం నవ్వితే ముత్యాల పలువరుసలు. అరుగులమీద దీపాలు, వాకిలిముందర మొగసాల్పాసి చెట్లమీద అమరించిన దీపాలు, ఇంటిముందర కర్రలుకట్టిన అంతస్తుల దీపాలు. ఆకాశ దీపాలు. ఇళ్లల్లో దీపాలు. గుళ్లల్లో దీపాలు. బిడ్డల చేతుల్లో బాణసంచా దీపాలు. రంగురంగుల మతాబాలు, విదేశీ బాణాసంచులు స్వదేశీ బాణాసంచులు. టపాకాయల ఫిరంగిమోతలు. చిచ్చుబుడ్లు, చూటాలు, తారాజువ్వలు, దీపాలపండగ, వెలుగువర్షము. అందరికీ సంతోషము. నోట్లో వేలు పెట్టుకొని, ఆదీపాలవెలుగుల్లో మెరిసే కళ్లతో నిలుచున్న ఆవుప్పరి అబ్బాయికిమాత్రం దీపావళి లేదు.

౨

పొద్దున్నుంచీ బాణసంచాలకొట్లదగ్గర చింపిరిజుట్టుతో అల్యూమినియం మురుగులతో, నలీ జేగురూ కలిపిన సంటిరంగు వెలుగుతో ఆవుప్పరిఅబ్బాయి నిలిచి విస్తుబోతూ చూస్తూనేఉన్నాడు. అందరికీ బాణాసంచాలు, అతనికిమాత్రం లేవు.

సాయంత్రందాకా నుంచుంటేమాత్రం, ఒక్కతాటాకు టపాకాయిగాని, సిసింద్రీగాని, మతాబా అగ్గిపుల్లగాని ఆకుర్రవాడి చేతిలో పెట్టే దయతో నిండిపోయిన హృదయంకలవాడు ఒకడూ కనుపించ లేదు. పొద్దున్నించీ లక్షలకొద్దీ టపాకాయ లమ్మిన సాహేబు, "సాలా బాగా పేలుతాయీ అండీ! జర్మనీవాడి ఫిరంగిలాగా వుంటాలీ! మీకీ అయిదువందల్ ఏసుకోండి" అని విచిత్రంగా అమ్మగలిగాడుకాని కొనేవాళ్లకి చూపించడానికి కాలిస్తే, పేలకుండా తుస్సుమన్న టపాకాయినికూడా ఆకుర్రవాణ్ణి ఏరుకోనిచ్చాడుకాడు.

పొద్దున్నుంచీ ఇంటికెళ్లి తిండయినా తినలేదు ఆవుప్పరివాడు. వాళ్లఅమ్మా, నాన్నా 'ఎర్రోడు ఎక్కడికి పోయాడో, గంజినీళ్ల కయినా వచ్చాడుకాడు' అని అనుకున్నారు గాని, ఆకుర్రవాడికోసం వెదుక్కుంటూ వచ్చినవాళ్లు లేనేలేరు.

ఆసాయంత్రంనుంచీ బందరు వీధులన్నీ తిరిగి, ఆకుంకాయి బచ్చుపేటలో బాగా బాణాసంచాలు కాల్చే ఒకమేడముందర నిలబడ్డాడు. ఆఇంటిలో పెద్దలు ఆడపిల్లలచేత మొగపిల్లవాళ్లచేత కాల్పించిన బాణసంచా విదేశీవి, స్వదేశీవి నలభయి రూపాయీల దాకా ఉంటుంది.—పిల్లల కిలకిలలు, పెద్దల నవ్వులు. గుమ్మందగ్గర పళ్లులేని ముసలమ్మ బోసిహాసం. ఆయింటిముందర బాణసంచా కాల్పులు చూడడానికి చేరిన తక్కినబీద వాళ్ల పిల్లలు, వెకిలిగా 'ఇవి యివ్వండీ, అవి యివ్వండీ' అని అడిగి పుచ్చుకొని కాల్చుకొంటున్నారు. భయంచేత పారేసిన సగం కాలు

తూవున్న మతాబులు పుచ్చుకొని కాల్చారు: వీడుమాత్రం చూస్తూనే నిలుచున్నాడు కాని ఒక్క అడుగయినా కదిలాడు కాడు.

వాడిపళ్లు ఉక్కుకడ్డీలాగా గట్టిగా వుంది. మెరుగుపెట్టిన ఎర్రరాయిలా నున్నగా తళతళలాడుతోంది. కనుముక్కుతీరూ కలిగి ఉన్న మొఖంమీద కాంతులు అభినయం చేస్తున్నవి. మతాబులవెలు గాజుబుట్టమీద పడినపుడేల్లా, మబ్బుపింజెలమీద పడిన సూర్యుడి వెలుగులా ఆడిపోయింది. వాడికి పొద్దుటినుండీ కడుపులో కూడు లేదు.

3

సాయంత్రం నాడు ఇంటిదగ్గర నిలుచున్నదగ్గరనుంచీ, ఆ యింటివారి వెధవాడపడుచు ఆ అబ్బాయివైపు తదేకదృష్టితో చూస్తూనేవుంది. ఆవిడకి ఇరవైయ్యేండ్లు. చిన్నతనంలో సౌందర్యం మూటలు కట్టుకొన్న మురిపాలపడుచయినా, సాంగత్యమెరగని భర్తవియోగం సంభవించి, ప్రేమకోసం కుమిలిపోయిన సన్యాసినీరూపం. వైధవ్యంలోనయినా అలంకరించుకొని అంగంగా కనపడేవాళ్లలాంటిదిమాత్రం కాదు. తనజీవితంయొక్క పరమావధి ఏమిటాఅని పుస్తకాలు వెతుక్కొన్న అభాగ్యురాలు. భజనలకు వెళ్లినా, గుళ్లల్లో హరికథలకు వెళ్లినా, పండితుల ఉపన్యాసాలకు వెళ్లినా, సన్యాసుల జ్ఞానబోధకు వెళ్లినా, విధవ అయిన పురుషోత్తమ్మ, అస్పష్టంగా తోచే జీవితసత్యాన్ని కనుగొనడానికే బయలుదేరేది. ఆమెకు ఎప్పుడూ గుండె దడదడా కొట్టింపచేసేదీ, అందమయిన ఆమెకళ్లను ఎప్పుడూ మబ్బులిప్త చేసేదీ, తనచుట్టాలలో చూస్తూవున్న స్త్రీలమాతృత్వం. మంగళసూత్రంలేని ఆడదీ, మాతృత్వంలేని ఆడదీ, భూమిమీద మసలరాదని సాయంకాలపు వెలుగుల్లో కలిసిపోతూ ఎవరూ చూడకుండా చీరకొంగు కళ్లు కప్పుకొనేది. చుట్టాలపిల్లలు — బుజ్జగించి కొందరూ, భయపెట్టి కొందరూ — ఆమె పెట్టెలో ఎప్పుడూ నిలవుండే పిప్పరమెంటు దినుసులూ, మిఠాయి దినుసులూ, పళ్ళలూ లాగేస్తూండేవారు. ఎవరిపిల్ల లేడ్చినా పురుషోత్తమ్మగుండె బద్దలయిపొయ్యేది. చుట్టాలపిల్లలికి పడిశంభారం కింపు చేసినా, తుమ్ములు తగ్గేదాకా, ముక్కు వెంబడి పడిశం ప్రవహించడం మానేదాకా వాళ్లని వదిలేది కాదు. పిల్లలకి ఎవరికయినా పెద్దజ్వరాలు వచ్చాయంటే పెట్టిలో దాచుకొన్న వెన్నముద్ద గోపాలవిగ్రహానికీ, కాశీ అన్నపూర్ణ విగ్రహానికి పెట్టని దణ్ణాలు లేవు; వేల్పులకు మొక్కని మొక్కులూ లేవు.

ఆసాయంత్రంనుంచీ ఇంటి కెదురుగుండా నిలుచున్న ఉప్పరవాళ్ల బ్బాయిమీదనుంచి ఆమెచూపులు మరలిపోనేలేదు. చీకట్లలో కలిసిపోతూ వెలుగుల్లో మెరిసిపోతూ కదలకుండా ఈకాలుమీద వంగి ఒకమాటూ, ఆకాలిమీద వంగి ఒకమాటూ నిలుచుని ఉన్న ఆవాడు ఆమెహృదయాన్ని, ఆలోచనలనూ ఇనుము అయస్కాంతం లాగేసినట్లు లాగేశాడు.

పంచితే ఒక్కొక్క పిల్లవాడికిగాని, పిల్లదానికిగాని వచ్చిన అయిదురూపాయిల బాణసంచా వున్న బుట్టనూ వాడిచేతి కిచ్చి, “నాయనా! కాల్చరా!” అందా మనుకొన్నది.

“ఓసి, పిచ్చిదానా!” అని అందరూ నవ్వరూ? ఏమి టీ పిచ్చిఆలోచన!

౪

ఉన్నట్టుండి కళ్లు తిరిగి ఆ కుర్రవాడు భగ్నమైన ఆశలు కింద కూలినట్లు పడిపోయాడు. ఆ జ్వాలామహోత్సవంలో అరుగుమీద ఉన్నవాళ్లెవరికీ ఆకుర్రవాడు పడిపోవడం గమనించవలసిన అవసరమే లేకపోయింది. అది పురుషోత్తమ్మ చూసింది, ఒక్కపరుగులో మెట్లన్నీ దిగింది. తృణావర్తుణ్ణి హతమార్చి, భూమిమీద వాలిపోయిన శ్రీకృష్ణుణ్ణి ఎత్తుకొన్న యశోదలాగ, పురుషోత్తమ్మ ఆ బాలుణ్ణి ఎత్తుకున్నది. రెండంగల్లో ఇంట్లోకి తీసుకొనిపోయింది. సావిట్లో బల్లమీద పడుకోబెట్టి, యింట్లోకి పరుగెత్తుకువెళ్లి వెండిగిన్నెలో ఇంత మజ్జిగ పోసి, అందులో ఇంత వేడివేడన్నం మెత్తగా పిసికి మెతుకులు పిండి అవతల పారేసి ఆగిన్నె పట్టుకు చక్కా వచ్చింది.

ఆ పిల్లవాడినోట్లో చుక్కచుక్క ఆమె పోయడం మొదలెట్టింది. ఇదంతా చూస్తూ తెల్లబోయి వాళ్లవాళ్లేమీ మాట్లాడలేకపోయారు. అన్నసారం దిగినకొద్దీ ఆపాపడికి ప్రాణం తెప్పరిల్లి నెమ్మదిగా మెళుకువ వచ్చింది.

ఒకముసలాయన:—— ఈ పెధవను తీసుకువచ్చి బల్లమీద పడుకోబెట్టిం దేమిటి? పాడుపని!

ఒకావిడ :—— వీ డెల్లా వచ్చాడు ఇక్కడికి ?

ఒకచిన్నపిల్ల :—— మన యింటిముందర పడిపోతే అత్తయ్య తీసుకొచ్చింది.

"మడిగట్టుకొని ప్రతిపెధవసీ ముట్టుకోడమేనా ? పనివాళ్లచేతి కిస్తే నోట్లో పొయ్యరూ ?"

"ఈ విడగారి కీ పెత్తన మేమిటి ?"

పురుషోత్తమ్మ ఈ మాటలన్నీ వింటమే లేదు. ఆ కుర్రవాడు కళ్లు విప్పేటప్పటికి ఆమె ప్రాణాలు కుదుటపడ్డాయి. చల్లనిగాలిలా సంతోషం ఆమెదేహమంతా ప్రసరించింది. "నాయనా! ఇదంతా తాగు" అని ఆగిన్నె వాడిచేతి కిచ్చింది.

"ఇంక వీణ్ని పంపించు. చేసింది చాలు."

"నీపే రేమిట్రా పెధవా! ఎవరబ్బాయివి ?"

" మే ముప్పరాళ్లమండి. నాపేరు చిట్టిగాడు ".

భోంచేసి చెయ్యి కడుక్కొని వచ్చిన ఇంటియజమాని "వాడిచేతిలో రెండుకానులు పెట్టి పంపించివేయండి. ఎవరైనా ఇట్లాంటివి చూస్తే మన కపఖ్యాతికూడాను".

౫

ఇదంతా జరిగి ఏడాదయింది. మళ్లీ దీపావళిపండుగ వచ్చింది. తాను చిట్టిగాడిని తనగదిలోకి తీసుకువెళ్లి వాడిచేతిలో రహస్యంగా రెండురూపాయలు పెట్టి నాలుగు మతాబు లిచ్చి పంపించిన ఆనాటిసంగతంతా ఆమెకు జ్ఞప్తికివచ్చింది. ఆమెకళ్లనీళ్లు చెమరించినవి. చీకటిపడినదగ్గరనుంచి దీపాలు వెలిగించుకొంటూ, వీధిఅరుగుమీద కూర్చుని వీధిలోకి ఇటూ అటూ పదేపదే చూస్తూన్నది. పురుషోత్తమ్మ మూడేళ్ల మేనగోడలు మొలకు కట్టినబిళ్ల ఇటూ అటూ ఆడుతూండగా తొనలలంటివాళ్లు కధిలిపోతూండగా చేతు లాడించుకొంటూ పురుషోత్తమ్మదగ్గరకు పరుగెత్తుకువచ్చి "అత్తయ్యా! తపాకాయలంతే బయమేత్తుంది. అక్కావాళ్లూ కాల్తే

తప్పాలు నన్నెత్తుకోవూ?" అని పురుషోత్తమ్మ మెడచుట్టూ రెండుచేతులూ పెనవేసింది.

"మా తల్లి! అల్లాగేనమ్మా! ఎత్తుకుంటానులే" అని ఆవిడ ఆబిడ్డను ఒళ్లోకి తీసుకొని ఒళ్లంతా ముద్దులు పెట్టుకొంది.

అప్పుడే చీకటిప్రపంచమంతా రంగు రంగుల వెలుగులతో అలంకరించుకొంటోంది. మతాబాలు వెలుగుతున్నై; ఫటఫట మని టపాకాయలు పేలుతున్నై. అనంత పథాలలో ఉన్న నక్షత్రాల నన్నిటినీ పోగు చేసి, మళ్లీ విశ్వంలోకి వదులుతున్నారా అన్నట్లు చేరుతూటాలు జాజ్వల్యమయిపోతున్నై. ఇంతట్లో చిట్టిగాడు పది దీపావళి పొట్లాలు పట్టుకువచ్చి నెమ్మదిగా ఆవిడదగ్గిర పెట్టాడు.

పేదవాళ్లకు దీపావళిపొట్లాలే మతాబులు, కాకరపువ్వొత్తులు, టపాకాయలు, తూటాలున్నూ. మగతాడిచెట్టుగులకలు పోగుచేసి, కాల్చి బొగ్గుచేసి, గుడ్డలో పోసి పొట్లంకింద చుట్టి, దాని కింత పేడ రాసి తాటికమ్మని నాలుగుబద్దలకింద చీరి మధ్యన ఆపొట్లం పెట్టి, నిప్పులు పోసి బాగా అది కాలినతరువాత దాన్ని తిప్పడం ప్రారంభిస్తారు. ఛిటపటమని పేలుతూ రవ్వలు వర్షం కురుస్తవి. ఆరవ్వలప్రవాహంలో మునిగిపోయిన ఆపిల్లల ఆనందానికి అంతుండదు.

పురుషోత్తమ్మ పొట్లాలు చూసింది; చిట్టిగాణ్ణి చూసింది. చిట్టిగాడు నవ్వుతూ ఆమెకేసి చూశాడు.

పురుషోత్తమ్మగుండె దడదడలాడింది. పురుషోత్తమ్మమేనగోడలు ఆచిన్నపిల్ల కిల గబగబ లోపలికి పరుగెత్తుకువెళ్లి మంచం కింద ఎవరికీ కనబడకుండా దాచిఉంచిన బాణసంచాపొట్లం ఇవతలికి తీసి, పరికొంగుచాటున కనపడకుండా పట్టుకువచ్చింది.

ఆమెను పెదవులు కంపించాయి. ఆమె కళ్లు చెమరించాయి. ఆమెహృదయంలో ఏదో తీపి పుట్టి ఆమెనరాలను ఉప్పొంగ చేసింది.

"ఇది పుచ్చుకుని ఇంటికి వెళ్లి కాల్చుకో! పో!" అని ఆ పురుషోత్తమ్మ ఆపొట్లం చిట్టిగాడిచేతిలో పెట్టింది. చిట్టిగాడిమొహం తళతళలాడిపోయింది. వాడి పెదవుల్లో కన్నుల్లో ఉషఃకాంతులవంటి నవ్వులు పరుగులిడినవి.

ఇంతట్లో ఎక్కడనుంచి వచ్చాడో కాని మేఘంలాగ చిట్టిగాడిదగ్గిరికి ఆ యింటి యజమాని. వాడి చేతిలో పొట్లం లాక్కొని మొహం పగిలిపోయేట్టు చెళ్లున ఒకలెంపకాయ కొట్టినాడు.

"వెధవముండకొడుకికి పెట్టినావు! ఎవ రిమ్మన్నారు ఈ బాణసంచా? ఊళ్లోవాళ్లకందరికీ బాణసంచాలు పంచిపెట్టటట్టయితే ఇల్లూ వాకిళ్లూ కొంపలూ ఆస్తులూ ఆగుతాయా?" అని "పోరా, వెధవా! నిన్న వచ్చావు చాలదూ? మళ్లీ శనిలా దాపురించావా?" అని ఆయింటి యజమాని చిట్టిగాణ్ణి ఒక్క తాపు తన్నాడు.

"అమ్మయ్యో! చంపేశా" డని పురుషోత్తమ్మ ఏమయినా అని ఆలోచించకుండా అరుగుమీదనుంచి ఉరికి వాణ్ణి చివ్వున ఎత్తు

“ఛీ! సాహసమూడా!” అంటూ ఇంటి యజమాని మెడమీదుం బట్ట అరుగుమీద పెట్టడం, చిట్టిగాణ్ణి ఆ మోచేకలోనుంచి లాగడం, ముట్టుకుంటేనే కాసిన పవిత్రత అంతా తగలడిపోతుందేమో అన్నట్లు, వాణ్ణి చేయి పట్టుకొని వీధిమధ్యకి విసరివేయడం అంతా త్రుటిలో జరిగిపోయింది.

౬

చిట్టిగాడికి లోకం తల్లక్రిందులైపోయింది. రోడ్డుమీద రాయి నొసలుకు తగిలి, పగిలి రక్తం ధారగా కారడం మొదలుపెట్టింది. పురుషోత్తమ్మ కెవ్వున అరుస్తూ అరుగుదగ్గరే కూలిపోయింది. ఈగలాభరణు ఇంట్లో వాళ్ళు పిల్లలూ, పెద్దలూ అరుగుమీదకు వచ్చేశారు. పోట్లా లివ్వడం తప్పో, బట్ట తీసుకోవడం తప్పో, ఉన్నవాళ్ళ పుట్టడం తప్పో చిట్టిగాడికి కేమి తెలుస్తుంది? వాడి మొహం అంతా రక్తమయమైపోయింది. ఉగ్రుడైపోయిన ఇంటియజమాని ఆగ్రహం రాజుకన్నులు తన్నుకోసికి పిడికిళ్ళు నులుముకొని, కోరలు నూరుకుంటూ, కాట్లకుక్కలా కస్సుబుస్సుమంటూ వాడిదగ్గరకి నడిచాడు. అరుగుమీద చంటిబిడ్డ ఒకటే గోల. వాడికొమ్ములు చూపిస్తూ, బుస కొడుతూ వచ్చే మహిషాసురుడిలా ఉన్న ఇంటి యజమాన్ని చూచి నమ్మెటపెట్టుగాగ తలమీది బాధఅయినా గమనించకుండా, చిట్టిగాడు లేచి భయంతో కనుపాపలు తిరిగి పోగా కెవ్వుకెవ్వున అరుస్తూ పరుగెత్తడం ప్రారంభించాడు. పురుషోత్తమ్మ లేచింది, మహాశక్తిలా ఉగ్రురాలయిపోయింది. ఈ రాక్షసుడు ఉండే కొంపలో నే నసలే ఉండను అని పొలికేక పెట్టింది. శోకాన్ని దుఃఖం తోసుకొనివచ్చింది. ‘చిట్టిగా! చిట్టిగా!’ అంటూ వాడు వెళ్ళినదారినే తూలుతూ ఆమె ఆ దీపావళి వెలుగుల్లో, చీకట్లల్లో. వీధులూ సందులూ పడి నడచిపోయింది.

‘అత్తయ్య కావాలీ, అత్తయ్య కావాలీ’ అని అరుగుమీద చంటిబిడ్డ మారాం పెట్టింది.



చూచితే?

కుంటిమద్ది శేషశర్మ

మాకందంబుల నెక్కి, మెక్కి చివురుల్, మాధుర్యపూర్ణాసవం
బాకంఠంబుగ గ్రోలి, సోలి, కలరాగాయత్తచిత్తంబవై
నీకుం దోచినయట్లు గూసెదవుగాని కోకిలా! చూచితే
యీ "కూహూ"లకు గుంది, కందిన వియుక్తైణాక్షిచిత్తమ్ములన్?

తూగుపుకొండ కొట్టకొన దోచె నదో రతనాలకాంతి, నా
కూరిమినేస్తగాడు కనుగొట్టినయంతలో వచ్చు, కౌగిటన్
జేరుచు, కోమలాంగుళుల చెక్కిలి దువ్వుని కంచు తామరా!
కోరిక లూగ్తు వంతె, కనుగొంటివె యీ పసివాడు కల్లలన్?

మెరుపుంటీవెలతోడ మింట నెమలీ! మేఘాలు తిండ్రించగా
విరుగన్ బూచిన నీపశాఖపయి నువ్వొయ్యారమున్ వింతగా
పురివిప్పాడెదు, కేకలేసెదు, సరే పో, చూచితే వృక్షకో
టరమున్ జొచ్చి పరాసువట్లు బుసకొట్టన్ లేని యీసర్పమున్?

కాలిని నేల మోపక నికామసుఖంబుల నెండ జూడకే
పాలికి దెచ్చుకొంటివి సెబాస్ సిరిమంతుడ, కాని, చూచితే?
యీలలితంపు సౌఖ్యముల కెన్ని ఉసూరని పేదజీవ దీ
పాలవి యారిపోయె, కొనప్రాణముతో నిక నెన్నియున్నవో?

ఆధునిక గణితశాస్త్రము

ఎంతవరకిది స్వతంత్రసృష్టి?

పిడపర్తి సుబ్బయ్యశాస్త్రి

౧

కుశాగ్రబుద్ధియుతులు, అతినిశ్చలధ్యానైక తత్పరులునగు హిందువుల నెక్కువగా ఆకర్షించింది గణితశాస్త్రం, అత్యంత మేధాశక్తి అవసరమైన శాస్త్రం గనక. దీనికి తార్కాణం మనపూర్వుల చేతుల్లో గణితశాస్త్రం పొందిన అనంతమైన పోషణ. హిందువుల జ్యోతిశ్శాస్త్రం బహు పురాతనమైనదని అందరకూ తెలిసిందే. అందుచే వారిగణితశాస్త్ర పరిచయమంతకంటె ప్రాచీనమై యుండాలని ఊహించవచ్చు. వారి గణితశాస్త్ర పరిచయాన్ని గమనించేటప్పుడు మనం గౌరవించవలసినవారు ముగ్గురు: ఆర్యభట్టుడు, బ్రహ్మగుప్తుడు, భాస్కరాచార్యుడు. వీరిలో భాస్కరాచార్యుడు పన్నెండో శతాబ్దంలోవాడు. మిగిలిన యిద్దరూకూడా అయిదూ ఆరూ శతాబ్దాల్లోవారు. వీరి గణితశాస్త్ర పరిచయమంత ఎక్కువగా ఉండికూడా కొన్నికొన్ని కారణాలవల్ల వీరి పేరు గణితశాస్త్రాధ్యయంలో తగినంత ప్రాముఖ్యంగా నిర్వచింపబడలేదు. అందుకు ముఖ్యమైన కారణాలు రెండు: మనవారు గణితశాస్త్రాన్నసలు అభ్యసించింది ఆశాస్త్రాన్ని ప్రత్యేకంగా అభివృద్ధిచేయడానికి కాదు. ఈ గణితశాస్త్రంలోని ప్రతి ఒక్క అధ్యాయంకూడా మన పూర్వుల జ్యోతిశ్శాస్త్ర పరిశోధనల కుపకరించేవరకే. ఆ తర్వాత ఆ శాస్త్రవిషయాల్ని గురించి ఎక్కువగా కృషి చేయలేదు వారు, వారి జ్యోతిశ్శాస్త్రాభివృద్ధి కవసరంలేక పోబట్టి. అందుచే వారి శాస్త్రాలల్లాగే ఉండిపోయేయి తగినంత అభివృద్ధి లేక. ఇక రెండో కారణం మనవారికి యిప్పటికీ అప్పటికీకూడా బహిరంగత, ప్రసిద్ధి అవసరం లేకపోవడం. తనకు తెలిసిన దాన్నంతాకూడా బహిరంగపరచడు హిందువుడు. కాని తాను చెప్పేదానికన్నా చాలా ఎక్కువే తనకు తెలుసునంటూ ఉంటాడు. నిజంగా తెలిసిఉంటుంది కూడా. అల్లా కొంత కొంత శాస్త్ర మడుగంటిపోయింది. పైన పేర్కొన్న ముగ్గురు గణితశాస్త్రజ్ఞులూకూడా జ్యోతిశ్శాస్త్ర గ్రంథాల్ని రాస్తూ వారిగణితశాస్త్ర పరిచయాన్నారికే వారి గ్రంథరచన కవసరమైనంతవరకు సూచించి వదిలేసేరు. ఇందులో భాస్కరాచార్యుడు మాత్రం లీలావతీ పుస్తకాన్ని వ్రాసేడు, వారి ముగ్గురిలోకి కొంచెం నవీనుడు గనక. ఈ గ్రంథాన్ని[1] చూస్తే మనవారి గణితశాస్త్ర పరిచయం విశదమవుతుంది.

గణితశాస్త్రానికంతటికీ పునాదియైన అంకెలను (Numerals) మన పూర్వులే కనిపెట్టేరంటే వారు ప్రపంచానికి పెట్టినభిక్ష ఎంత విలువైనదో అర్థమవుతుంది. నిజంగా చూస్తే అంతకన్నా గొప్పసేవ శాస్త్రానికింకేదీ లేదు, అక్షరాలు భాషకు చేసిన సేవతప్ప. అంకెలను కనుగొనినవారు హిందువులేనని చెప్పినవారు అనేకమంది పాశ్చాత్యులలో ఉన్నారు.[2]

---

1. ఇది ఈ మధ్యనే "దైవజ్ఞభూషణ" పిడపర్తి కృష్ణమూర్తి శాస్త్రి గారిచే ఆంధ్రీకరింపబడింది.

2. సర్ డబ్ల్యూ హంటరుగారు ఈ క్రిందివిధంగా వ్రాసేరు:

"To them (the Hindus) we owe the invention of the numerical symbols on the decimal scale. The Indian figures 1 to 9 being abbreviated forms of initial letters of the numerals themselves and the zero or (o) representing the first letter of the Sanskrit word for empty (Sunya). The Arabs borrowed from them and transmitted them to Europe".

ప్రొఫెసర్ వెబరుగారు కూడ

స్థాన విలువల నేర్పరచటంలోకూడ మన వారిచేయి పైనే ఉంది. ఇంగ్లీషువారు మిలియన్లు బిలియన్లకన్నా పైకిపోలేదు, కాని హిందువులు పద్మము, శంఖము మొదలగు పేర్లతో సుమారు ముప్ఫయిఅంకెలకు వరుసగా స్థానవిలువల నేర్పరచేరు. నిజంగా చూస్తే గణితశాస్త్రంలో ప్రతి శాఖలోనూకూడా మనవారు ఎక్కువకృషి చేసేరు. వీరి అంకగణిత పరిచయమంతా లీలావతిలో తెలుసుకోవచ్చు. పాశ్చాత్య సంపర్క మేమాత్రం లేకపోయినా ఈశాఖలో మనవారు ఎక్కువగా కృషిచేసేరనడానికి గ్రంథమే సాక్ష్యము. ఈ పుస్తకం నూతనంగా వ్రాయబడిన ఏ అంకగణిత శాస్త్ర గ్రంథానికీకూడా తీసిపోదు.

రేఖాగణితంలో(geometry)కూడా మన పూర్వులు చాలావరకు కృషిచేసేరనే తెలుస్తుంది. ఎంచేతంటే, సిద్ధాంతభాగానికి మూలమైన త్రికోణగణితము (trigonometry)నకు ఆధారం రేఖాగణితమే (geometry) కాబట్టి, మనపూర్వుల భూగోళశాస్త్ర పరిచయాన్ని కనుక గమనించినట్లైతే, వారి చేతుల్లో త్రికోణగణితము (trigonometry) ఎంతవరకు అభివృద్ధి పొందిందో తెలుస్తుంది. ప్రస్తుతం మనం ఆలోచించవలసినది, త్రికోణగణితం (trigonometry) అంతగా వృద్ధి పొందినప్పుడు, రేఖాగణిత మంతయు మనపూర్వులకు పరిచితమై యుండాలనే విషయం. వేలస్ గారు[4] చెప్పినట్లు "శాస్త్రజ్ఞులయొక్క పరిశోధనలు హిందూ దేశంలో కొన్ని పతకాలను (tables) బైటికి తీసుకు వచ్చేయి. ఇవన్నీకూడా రేఖాగణిత సిద్ధాంతాలను ఆధారంగా తీసుకొని చేయబడినవే. కాని అవి తయారుచేసినప్పటి కాలంమాత్రం పూర్తిగా నిర్ధారణ చేయబడలేదు. కొందరు మాత్రము క్రీస్తు పూర్వము 3000 సంవత్సరాలకు ముందుగానే ఈ పతకాలు తయారుచేయబడి ఉన్నాయనే ఉద్దేశాన్ని తెలియపరిచేరు. బెయిలీగారు సోదాహరణంగా నిరూపించేరు కూడాను. అదేకనక నిజమైనట్లైతే రేఖాగణితం పాశ్చాత్యదేశాల్లో పుట్టిన కాలానికంటే ముందుగానే హిందూదేశంలో ఎంతో విరివిగా అభివృద్ధిచేయబడి యుండెననీ, అందలి ముఖ్యమైన ప్రాతిపదికలను గ్రీకులు ఈ దేశంనుండే గ్రహించియుందురనీ విశదమవుతుంది."

ఇదే శ్రీ గొబ్బూరి వెంకటానంద రాఘవరావు గారుకూడా రాస్తూ, పైతాగరస్ థీరమ్ (Pythogoras) అని ఇప్పుడు వ్యవహరింపబడుతూన్నది ఇట్లాంటి ప్రాతిపదికల్లో ఒకటని నిరూపించేరు. ఈసుబోధకమే రేఖాగణితానికంతకూ మూలమైంది. ఇట్లాంటివే

"It is to them (the Hindus) also we owe the ingenious invention of the numerical symbols which in like manner, passed from them to the Arabs and from these again to European scholars. By these latter, who were the disciples of the Arabs, frequent allusion is made to the Indians and uniformly in terms of high esteem, and one Sanskrit word even (uchcha) has passed into the latin translations of Arabian astronomers".

అని వ్రాసేరు. ఇంకా ఇట్లా చాలామంది పెద్దవారు ఈ అంకెలను సృష్టించినవారు హిందువులేనని సోదాహరణంగా నిరూపించేరు.

3. Manning says "Compared with other ancient nations the Hindus were peculiarly strong in all the branches of arithmetic".

4. Professor Wallace says "The researches of the learned have brought to light astronomical tables in India, which must have been constructed by the principles of geometry, but the period at which they were framed has by no means been completely ascertained. Some are of opinion that they were made from observations made at a very remote period, not less than 3000 years before the Christian Era (this has been conclusively proved by Mons. Bailly); and if this opinion be well founded, the science of geometry must have been cultivated in India to a considerable extent, long before the period assigned to its origin in the west, so that many elementary propositions may have been

ఇంకొక ప్రాతిపదిక ఇప్పటి రేఖాగణితశాస్త్రంలో ముఖ్యమైనది, ఒక త్రిభుజంలో మూడుభుజాలు తెలిసినప్పుడు దానివైశాల్యమును కనుక్కోవడం. ఇది పూర్వపు గ్రీకుశాస్త్రజ్ఞులకుకూడా తెలిసినట్లు తోచదు. వృత్తాంతర్గత క్షేత్రాలను (cyclic figures) గురించి శ్రీపతి చెప్పినశ్లోకం ఈ క్రింద ఉదాహరిస్తున్నా.

శ్లో. భుజసమాసదళంహి చతుర్ఘ్నితం
నిజభుజైః క్రమశః పృథగూనితం
అథ పరస్పరమేవ సమాహతం కృతి ప
దం త్రిచతుర్భుజయోః ఫలం.

అదే ఆర్యభట్టును కూ

శ్లో. సర్వభుజైక్యం దళితం చతుర్ఘ్నితం
బాహుభిః క్రమాద్రహితం
తద్ఘాతపదం త్రిభుజే క్షేత్రే స్ప
ష్టం ఫలం భవతి.

ఈ సూత్రము (formula) క్లేరియసుచేత ప్రచురింపబడేదాకా యూరోపులో ఎవరికీకూడా తెలియదు.

ఒకవృత్తంలోని పరిధికిన్నీ (circumference) త్రిజ్యకున్నూ (radius) గల నిష్పత్తికూడా మన హిందువులచే ఇదివరకే అనేక మార్గాలుగా కనుక్కోబడింది. ఈ సూత్రాన్నే యిప్పటి యూరోపియన్లు అధికప్రయాసానంతరం సరియైనదిగా కనుక్కోగలిగేరు. నిజంగా చూస్తే పాశ్చాత్యులచేతిలో రేఖాగణిత మాత్రమే అభివృద్ధిపొందలేదు. గ్రీకులు దాన్ని స్థితిలో వదిలేరో, కొంచెమించుమించుగా అస్థితిలోనే యింకా యిప్పటికీ యూరోపులో ఉంది. గ్రీకులే యిప్పటి పాశ్చాత్యులకన్నా ఎక్కువ కృషిసల్పేరు రేఖాగణితంలో. హిందువులు గ్రీకులకన్నా ఎక్కువగానే పోషించేరని తెలుసుకున్నాంకనుక మనపూర్వు లిప్పటి పాశ్చాత్యులకన్నా రేఖాగణితం విషయంలో ఉచ్ఛస్థితిలోనే ఉండిరని తేలుతుంది.

౨

గ్రీకు దేశస్థులయొక్క గణితశాస్త్రపరిచయాన్నంతనూ తెలియజేసేవాడు డయాఫాంటసు (Diaphantus). ఇతడు క్రీస్తుతర్వాత మూడవ శతాబ్దపు ఆఖరునో, నాల్గవశతాబ్దపు మొదలునో ఉండేవాడు. ఆతర్వాత బీజగణితాన్ని మిక్కిలి ఎక్కువగా వృద్ధిచేసినవారు హిందువులేనని న్యూయార్కునందలి మిచ్చెల్ గారు[5] సెలవిచ్చేరు. హిందువులనూ గ్రీకులనూ వారి బీజగణితశాస్త్రపరిచయంలో పోలుస్తూ ఎలిఫిన్స్టనుగా రంటారు: "ఆశాస్త్రాన్నభివృద్ధికి తీసుకురావడంలో వారిరువురకునూ పోలికయే లేదు. ఆశాస్త్రాన్ని సంపూర్ణమైనదిగాను, లోపములు లేనిదిగాను చేయడంలో హిందువులే గ్రీకులను మించిపోయేరు. ఆర్యభట్టుడు డయాఫాంటసును అనేకవిషయాల్లో మించడమే కాకుండా, అతనూ, అతనితర్వాతవారూకూడా ఇప్పటి బీజగణితశాస్త్రజ్ఞుల పరిశోధనలనుకూడా సమీపించేరని చెప్పవచ్చు. ఉదాహరణకు ఒక్క విషయం.

$ax^2 + b$ అనేది 'కంప్లీట్ స్క్వేర్' అవడానికి x యొక్క విలువ యెంత ఉండాలి అనేదే ఆవిషయం. ముందు డయాఫాంటసు ప్రతిపాదించి కొంతవరకు చర్చించి వదిలేసిన ఈ విషయాన్ని ఆతర్వాత ౧౭-వ శతాబ్దంలో ఫెర్మాట్ (Fermat) విరివిగా పరిశోధించి శాస్త్రజ్ఞుల కందరికీ వింతగా ఉండేలాగ తర్కించేడు. ఆపైన ఫుల్లరు (Fuller) అనే ఆయన పూర్తిగా దాన్ని సాధించేడు. కాని ఫుల్లరు ఇంత పరిశోధనా చేసిచేసిన అంశాన్నే భాస్కరాచార్యుడు క్రీ. శ. ౧౧౫౦ లో సాధించేడుట. ఇంకోవిషయం కోల్బ్రూక్ (Cole-brooke) దొరగారు చెలిపేరు. భాస్కరాచార్యుడు

5.Mitchell writes "Diaphantus represents the highest achievement in algebra of the Greek mind. During the Dark ages which followed, the greatest advances in algebra were made by the Hindus.

సమర్థించిన ఒకప్రశ్నను లార్డు బ్రన్కరుగారు క్రీ. శ. ౧౬౫౭లో కనిపెట్టి కలిగినారనీ, ఆప్రశ్నకే ఆయిలరు (Euler), లెగ్రాంజె (Le Grange) ౧౭౬౭లో మిక్కిలిగా పరిశోధించేరనీ, అదే క్రీ. శ. ఆరవశతాబ్దంలో అంతే విపులంగానూ బ్రహ్మగుప్తునిచే చెప్పబడినదనీ ఆయన వ్రాసేరు. ఇల్లా అనేక ఉదాహరణ లివ్వొచ్చు మనవారి శాస్త్ర పరిచయాతిశయాన్ని గురించి, గ్రంథం పెరిగిపోతుందన్న భయం లేకపోతే.

సంకలనము, వ్యవకలనము మొదలగువాటికి మనవారెట్టి గుర్తుల నుపయోగించేరూ అనేవిషయం చూస్తే చాలా ముచ్చటగా ఉంటుంది. సంకలనము (addition)నకు వేరుగా గుర్తు పెట్టుకోలేదు వారు. రెండురాసులను కలపవలెనంటే ఒకదానితర్వాత నొకటి వ్రాసేవారు. వ్యవకలనం (subtraction) తెలియపర్చ డానికి తీసివేయబడే అంకెపైన ఒకచుక్క నుంచేవారు. గుణకము (coefficient)లను అవి గుణించే ప్రతిరూపంటి రాసుల తర్వాత వ్రాసెడివారు. భిన్నములను వ్రాయునప్పుడు ఒక రాశిక్రిందనే ఇంకొకరాశిని వ్రాసెడివారుకాని మధ్య గీతమాత్రం ఉండేదికాదు. తెలిసినరాశిని (known quantity) "రూ" అనే అక్షరం చేతా, తెలియనిరాశిని (unknown quantity) "యా" అనే అక్షరంచేతా నిరూపించేవారు. "రూ" అనే అక్షరం "రూపం" అనే మాటకున్నూ, "యా" అనే అక్షరం "యావత్ తావత్" అనె మాటలకున్నూ సంజ్ఞారూపకాలట. "వ" అనే అక్షరం వర్గాన్ని (square), "ఘ" అనే అక్షరం ఘనాన్ని (cube) తెలియజేస్తాయి. ఇవన్నీ బ్రహ్మగుప్తునిచే ఉపయోగింపబడిన సంఖ్యాలేఖనము (notation) లోనివే. ఆయనతర్వాతి వారు నాల్గవఘాతాని(power)కి వర్గవర్గ అనీ, ఐదవఘాతానికి వర్గఘనఘట అనీ, ఆరవఘాతానికి వర్గఘనము లేక ఘనవర్గమనీ, ఏడవదానికి వర్గవర్గ ఘనఘట మనీ, అల్లాగే ఎనిమిదవఘాతానికీ, తొమ్మిదో ఘాతానికీ కూడా వర్గ వర్గ వర్గమనీ, ఘనఘనమనీ వాడుకచేశారు. 'సర్డ్'(surd)ను కూడా మనవారు "కరణి" అని వాడేవారు. అందుకే వర్గమూలానికి "క" అని ఉపయోగించేవారు. కరణీయసంఖ్యలు (Irrational numbers) మనవారికి పరిచితమైనవేనని ఇందువల్ల నిర్ధారణ అవుతుంది.

'బ్రహ్మగుప్త, భాస్కరులగణితము'(Arithmetic of Brahmagupta and Bhaskara) అనే పుస్తకంలో కోల్‌బ్రూకు దొరగారిచ్చిన కొన్ని ఉదాహరణలు చాలా జ్ఞానబోధకంగా ఉంటాయి.

సమీకరణంలో సమత్వానికి (equality) వేరేగుర్తు లేదనీ, సమానమైన రెండురాసులనూ ఒకదాని క్రింద ఒకటి వ్రాసేవారనీ తెలుసుకోవచ్చును.

డయొఫాంటసు మొదలగు గ్రీకుశాస్త్రజ్ఞులు అవ్యక్తరాశి (unknown quantity)ని ఒక్కదానినే ఉపయోగించేరు. కాని అప్పటి హిందువులు అవ్యక్తరాసులనేకం ఉపయోగించేరు వారిగణితంలో. వాటన్నిటినీ వారు వివిధవర్ణముల పేర్లతో వ్యవహరిస్తూ ఆయావర్ణముల మొదటి అక్షరాన్ని గుర్తుగా వ్రాసేవారు. బ్రహ్మగుప్తుడు, తెలియనిరాశి రెండవది ఉపయోగింపవలసి వచ్చినప్పుడు దానికి కాలకమనీ, మూడవరాశికి నీలకమనీ, నాల్గవదానికి పీతకమనీ ఉపయోగించేడు. వీటికే "కా", "నీ", "పీ"— ఇత్యాది సంజ్ఞల నుపయోగించేరు. ఈ పై విషయాలనుబట్టి చూస్తే మన పూర్వులచేతుల్లో బీజగణితం చాలా ఎక్కువగా అభివృద్ధిచెందిందని చెప్పవచ్చు.

కరణీయసంఖ్యలు (Irrational numbers) మనపూర్వులకు పరిచితమైనవేనని ఇదివరకు మనవి చేశాను. అపైన వర్గాంతకసమీకరణానికి మూలములు (roots), ఇప్పటి శాస్త్రజ్ఞులకు పరిచయమైన రూపం లోనే హిందువులకుకూడా పరిచయమైనవే. ఋణమూలాలు (Negative roots)కూడా మన పూర్వశాస్త్రజ్ఞులు ఉపయోగించినట్లే కనపడుతుంది. వర్గాత్మక సమీకరణానికి ఋణమూలాలుకూడా ఉంటాయని రాస్తూ భాస్కరాచార్యుడు క్రీ. శ. ౧౧౫౦లో ఉదాహరణగా $య^2 - ౪౫య = ౨౫౦$ అనే సమీకరణానికి $య = ౫౦$, $య = -౫$ అనేటటువంటి రెండుకూడా మూలాలేనని సూచించేడు. ఈ శాస్త్రంలో ఘనపూర్వులు

గణించిన ప్రాముఖ్యము కోల్‌బ్రూక్ గారు వ్రాసిన వ్రాతలు చదివితే విశదమవుతుంది.

ఈ బీజగణితపరిశోధనలలో ఉత్కృష్టత హిందువులు పాశ్చాత్య సంపర్కం లేకుండా స్వతంత్రంగానే సంపాదించేరు7.

హిందువుల ఈ శాస్త్రపరిచయం అరబ్బుల ద్వారా పాశ్చాత్య ప్రపంచంలోనికి ప్రవహించిందని కోల్‌బ్రూక్ దొరగారు నొక్కి నొక్కి సూచించేరు8.

ఈ హిందూశాస్త్రంయొక్క పరిచయం ఆధునిక గణితశాస్త్రి ఎంతగా వృద్ధి చేయుటకాని ఏమాత్రం ఉపకరించదనీ, ఎవరికి వారు స్వతంత్రంగానే సహాయం చేస్తుం దనీ కోల్‌బ్రూక్ దొరగారు కొందరి నొట వ్రాశారు. అతం లైతే, ఈ హిందూ శాస్త్రిలే ఇంతకు కొంత ముందుగానే కనుక పాశ్చాత్యదేశాల్లో విస్తరించినట్లైతే ఆ యూరోపియన్లు స్వతంత్రంగా పరిశోధన చేసి కని పెట్టిన కొంతమంది పాశ్చాత్య శాస్త్రజ్ఞుల శ్రమను తగ్గించియుండి, శాస్త్ర మింకా వృద్ధిపొందడానికి ఉపయోగకరంగా నుండియుండేదని ఆయనే సెలవిచ్చేరు. ఆ బీజవిషయాల్లో పాశ్చాత్యపరిశోధనలు మొదలుపెట్టినవి హిందూశాస్త్రసంపర్కం లేకుండానే స్వతంత్రంగా చేయబడిన వనే నిర్ధారణ కాధారమేదో? మన శాస్త్రిలు గ్రీకుల, అరబ్బుల ద్వారా పాశ్చాత్య దేశాల్లోకి సంపాదించబడ్డాయని అనేకనిర్ధారణలున్నాయి. శాస్త్రిలేకాకుండా కొన్నికొన్ని ఆచారాలుకూడా పాశ్చాత్యదేశాల్లోకి ప్రవహించేయి. అట్లాంటప్పుడు ఆధునికగణితశాస్త్రసృష్టి స్వతంత్రమైనదని ఎట్లా చెప్పగలం?

---

6. "They possessed well the arithmetic of surd roots; they were aware of the infinite quotien- resulting from the division of finite quantity by cipher, they knew the general resolution of equations of the second degree and had touched upon those of higher denomination resolving them in the simplest cases, and in those in which the solution happens to be practicable by the method which serves for quadration, they had attained a general solution of indeterminate problems of the first degree; they had arrived at a method for deriving a multitude of solutions of answers to problems of the second degree from a single answer found tentatively. .....And this was as near an approach to a general solution of such problems as was made until the days of "Le Grange."

7. "Equally decided is the evidence" says Manning, "that this excellence in algebraic analysis was attained in India independent of foreign aid".

8. "No doubt is entertained of the source from which it was received immediately by modern Europeans. The Arabs were mediately or immediately our instructors in this study.'

అంపూ - బాటా

ఈజిప్టు దేశపు పురాణగాథ

వే. సు.

హైందవ సంప్రదాయం ప్రకారం కృతయుగాంతంలో దేవదానవయుద్ధం వర్తిల్లినదనీ, త్రేతాయుగాంతంలో రామరావణ సంగ్రామం ఘటిల్లినదనీ, ద్వాపరయుగాంతంలో కురుపాండవ యుద్ధం జరిగిందనీ ప్రసిద్ధి; అనగా, రామాయణకాలం తరువాతది భారతకాలం. భారతీయసంస్కారం ఎక్కువగా గల ఆంగ్లవిద్వాంసుల్లోనూ అనేకమందికిదే అభిప్రాయం. ఆ కాలంలో అన్నభార్యను తల్లిగా భావించుకోవడం ఒక శిష్టనియమం. అది ఈ ప్రాగైతిహాసిక ఈజిప్టుగాథలోనూ విస్పష్టమై ఉంది.

కథ యావత్తూ అన్నదమ్ముల ప్రేమానురాగప్రదర్శనానికి ఒకచిత్రంవంటిది. మధ్య ఒక అవాంతరఘటనం జరిగినప్పటికీ అంపూ, బాటా లిద్దరూ రామలక్ష్మణులనుకోవచ్చు. ఈగాథ ఆరంభంలో కొంతమేరం సారంగధరుని గాథలాగు నడుస్తుంది. కాని అక్కడ సవతితల్లీ సవతికొడుకుల మధ్య జరిగిన కాండ ఇందులో వదినా మరదుల మధ్య జరిగింది. హిందువులు తప్ప క్రైస్తవులుగాని, మహమ్మదీయులుగాని పునర్జన్మ సిద్ధాంతాన్ని నమ్మరు. కాని ఈగాథ యావత్తూ పునర్జన్మసిద్ధాంతాన్ని స్థిరపరచడానికి వ్రాసిందని కొందరి మతం.

అంపూ, బాటా లిద్దరూ సయానా అన్నదమ్ములు. అన్నకు పెండ్లి పేరంటమైంది. ఇల్లూ వాకిలీ సంపాదించాడు. భార్యతో సుఖంగా కాలం గడుపుతూ వుండేవాడు. అన్నివిధాలా ఉత్తముడని చెప్పకోదగినవాడు. భార్యమాత్రం చిత్తస్థైర్యంలేనిదిగా కన్పడుతుంది. అంతర్యంలో బాటామీద మనస్సుపెట్టుకొనివుంది. కాని తమ్ముడు బాటా అన్నావదినెలను తండ్రీ తల్లిగా భావించుకొని వాళ్లకు సేవిస్తూఉండేవాడు. కల్మషంలేని, స్వార్థంలేని, చాంచల్యంలేని మనస్సు. లోకులందరూ ఇతని నడవడిని గనిపెట్టి దైవాంశం కలవాడని అంటూవుండేవారు. మంచిశరీరసౌష్ఠవం, దానికి దగిన సౌందర్యం, ఆ రెండింటికీ తగిన సద్గుణసంపత్తీ కలవాడు. అన్నావదినెలను సంతోషపెట్టడమే యతని హార్దికమైన యభిలాష. అందుకే పాటుపడుతూ ఉండేవాడు. పశువులపోషణా, పొలాలు దున్ని పైరువేసి పండించడం ఇత్యాది పరిశ్రమసాధ్యమైన పను లన్నింటినీ బాటాయే చేసేవాడు.

తెల్లవారి అన్నావదినెలకంటే ముందుగా లేచి రొట్టెలను తయారుచేసి ఇంట్లో పదిలపరచి తనకు గావలసినవాటిని దీసుకొనిపోయి ఆకలయినప్పుడు పొలంలోనే తినేవాడు బాటా. పగలంతా పొలంపనులను నిర్వర్తించుకొని సాయంకాలం ఇంటికి రావడం మామూలు. ఆ వచ్చేటప్పుడే పశువులనిమిత్తం గడ్డిమోపు నెత్తిన పెట్టుకొని అన్నా వదినలకోసం పాలు పిండి జాగ్రత్తచేసుకొని, మరికొన్ని కూరగాయలను సంగ్రహించుకొని వస్తూవుండేవాడు. పాలూ కూరలను ఇంట్లో ఇచ్చి, అవసరమైన పను లున్నయెడల తీర్చుకొని తాను గొడ్లపాకలోకి బోయి పశువుల కన్నింటికీ మేతవేసి వాటిమధ్యే పండుకొని నిద్రిస్తుండేవాడు. అన్నకు గావలసిన గుడ్డలనుసైతం తమ్ముడే కుట్టి తయారుచేయడం. దేశమంతటిలో ఇంత మంచివాడు లేడని పేరు తెచ్చుకొన్నాడు.

ఎల్లప్పుడూ పశువులవెంట దిరుగుతూ, వాటిమధ్యే పడుకొంటూ, ఏమరక వాటిసేవ చేస్తూ ఉండటంవల్ల బాటాకు వాటిభాషకూడా తెలుస్తూ వచ్చింది.

అవ్యక్తాలైనా వాటి స్వనాలనుబట్టి వాటియందు గల అంతరార్థాన్ని గ్రహిస్తూ వచ్చాడు. మైదానాలమీద మేస్తూ ఒక్కొక్క పర్యాయం పశువులు ఫలానిచోటియలో గలానిగడ్డి మంచి పుష్టిగా వుందని సూచిస్తే అతడు వాటిని అక్కడికి తోలుకొనిపోయి వదులుతూ వుండే వాడు. అవీ అక్కడ హాయిగా మేస్తూ తమ సంతృప్తినీ, సంతోషాన్నీ వెల్లడిస్తూ ఉండేవి. ఇట్లా కొంతకాలం అందరికీ సుఖంగా గడిచింది. పశువులు రెట్టికి రెట్టి అభి వృద్ధిని పొందాయి.

కాని కాలం ఎల్లప్పుడూ ఒకరీతిగా నుండదు.

ప్రతియేటా నైలునదీపరివాహభూముల్లో వరదలు వచ్చి తీసిపోయిన తర్వాత పైర్లు వేయడం జరుగును. అట్లే ఒకమారు నదివరద తీసిపోయినపిమ్మట అన్నా దమ్ములిద్దరూ కలిసి వ్యవసాయంపను ప్రారంభించారు. పగలంతా దున్ని, రెంపులు పల్లె రాత్రి కాపోసుండనగా అంపూ ముందుగా ఇంటికి వస్తూవుండేవాడు. బాటా వెనుకనుండి గిత్తగాండ్రా తోలుకొని, పాలూ, కూరగాయలూ పోగుచేసుకొని వస్తూవుండేవాడు. ఒకనాడు అపరాహ్ణానికే ధాన్యం అయిపోయింది ఇంకా చల్లవలసిన పొలమూ చాలా వుంది. అంతి పెండలాడే పను లాపడం ఎందుకని త్వరగా ఇంటికి పరుగెత్తికెళ్లి మరికొంత ధాన్యం తెమ్మన్నాడు అన్న. సరేనని బాటా ఇంటికి పరుగెత్తుకెళ్లాడు. అంపూ భార్య ఇంటిముంగిట కూర్చొని సావకాశంగా తలదువ్వుకొంటూవుంది. బాటా ఆమెతో సంగతంతా చెప్పి త్వరగా ధాన్యం తెచ్చి ఇమ్మని అడిగాడు కాని ధాన్యం తెచ్చి ఇవ్వకపోవడం అట్లాఉండగా లేవనైనా లేవక అప్పటికప్పుడు లేచి తెస్తే చేతిలోని జుట్టుసంప్రుటకలు చెదరిపోతాయని స్వయంగా కొట్టంలోకి వెళ్లి తెచ్చుకోమంది. బాటా చెప్పిన కొట్లోకి పోయి కావలసిన ధాన్యం మూట గట్టుకొని బయలుదేరాడు. ఇవతల ఈమెమనస్సులో చిలిపిపిల్ల కాయ పలకరిగాడు. ఈమె యతణ్ణి చూసి ఎంతధాన్యం అని అడిగింది ఒక చిట్టునవ్వు నవ్వుతూ. అతడూ సమాధానం చెబుతూ బయటికి వస్తున్నాడు. అపాశంగా ఆమె లేచి రెండుచేతులతో జుట్టు వయ్యారంగా ముడేసుకొంటూ అతని ఎదురుగా పోయి "నీకు చాలా బలం ఉన్నట్లుందే. ఎంతపెద్దమూట నెత్తుకొన్నావు!" అని సమీపించి రాగావేశంతో "బాటా! నిన్నెప్పుడూ నామనస్సులో తలుచుకొని మెచ్చుకొంటూ వుంటాను" అని వారిత దగ్గరకు పోయి "ఆమూట అక్కడ పారేసి నాతో వుండిపో. ఆ రైతు తడిసిన సుద్దలు తీసెయ్యి. మంచిసుద్దలు కట్టుకొందుగాని" అని అభిప్రాయసూచకంగా మాట్లాడింది. ఆవాళకం అంతా గనిపట్టి బాటా "అమ్మా! నిన్నింతవరకూ తల్లిగానూ, మాయన్నను తండ్రిగానూ భావించుకొని సేవిస్తున్నాను. ఇప్పుడు నీవన్నమాటలు నామనస్సును కలచివేశాయి. సరే: అయిందేదో అయింది. ఇకముందు ఎప్పుడూ ఇటువంటి మాటలాడవద్దు ఈ సంగతి మాయన్నతో ఎంతమాత్రం చెప్పను" అని అంటూనే బయటికి పరుగెత్తాడు బాటా. అక్కడ సాయంత్రంవరకూ మళ్లీ విత్తనాలను జల్లి వాడు ప్రకారం అంపూ ముందుగా ఇంటికి వచ్చాడు. తమ్ముడు నిత్యకర్తవ్యాలకోసం అక్కడే వుండిపోయినాడు. అంపూ ఇంటికి చేరేసరికే దేవి కోపాగారం చేరింది. ఎవడో దుర్మార్గుడు వచ్చి బలాత్కరిస్తే కలిగే దుర్దశలో పడివుంది. రోజూ అంపూ ఇంటికి వచ్చేసరికి ఆమె యతనికి కాళ్లూచేతులూ కడుక్కోడానికి నీళ్లం దిచ్చి ఆదరిస్తూ ఉండేది. ఆనాడు ఇంట్లో దీపాన్నైనా వెలిగించలేదు. ఇల్లంతా చీకటిమయంగా నుంది. నాటికి నాడు శ్రీగీలు కోపజ్వాలంతో హోళ్లూపై తెలియకుండా గుసలుకొడుతూ పడివుంది. కట్టుకొన్న బట్టలు ఎక్కడికక్కడ చెదరి తారుమారుగా చిరాకుతున్నాయి. పంద్రుకలు నేలమీదపడి కొట్టుకొంటున్నాయి. ఇట్టిదశలో ఆమెను చూస్తూనే గర్జించి అడిగాడు అంపూ "ఏనాడు మూడినవాడు నాయింట్లో ప్రవేశించాడు"అని.

"నీ తమ్ముడికి తప్ప ఇంకెవరికంత నిబ్బరముంది కడపదాటి లోపలికి రావడానికి? వచ్చి నానా అల్లరిచేసి అనరాని మాటలన్నీ అన్నాడు. నేనెంతో బతిమాలుకొని సముదాయించాలని చూశాను. 'నాయనా! నేను నీకు తల్లివంటిదాన్ని. మీయన్నగారు తండ్రివంటివారు. నాకు అపచారం చేశావని నేనంతగా దుఃఖించను. కాని మీయన్నగారికి మాత్రం ద్రోహం తలపెట్టవద్దు' అని చెబితే వింటేనా? మీదపడి కేశం

ఇదంతా నీతో చెప్పనని వాగ్దానం చేసేవరకూ పట్టుకొని వదల్లేదు. ఇక మీ దగ్గర బ్రతుకనివ్వాలంటే నా చావు నిశ్చయం అని ఏడుస్తూ చెప్పింది తడుముకోకుండా.

ఆమాటలను వినేసరికి అతనికి మతిపోయింది. పెద్దపులిలాగయినాడు. నేనేమీ అనగలేడు. ఇంకొరిని విచారించలేడు. తటాలున ఒక పెద్దబాకు తీసుకొని బాగా పదును పెట్టి గొడ్లపాకలోకి పోయి దాని తలుపు చాటున నక్కి నిలుచున్నాడు, తమ్ముడు లోపల ప్రవేశించగానే వెనుకనుంచి పొడిచి చంపడానికి.

అక్కడ పొలంలో ఏమీ సంగతీ ఎరుగని బాటా సాయంత్రంగానే గొడ్లమేతకు గడ్డిమోపు నెత్తిన పెట్టుకొని, నానారకాల కాయగూరలతోపాటు మజ్జిగా, పాలకుండను చేతిలోనూ సవరించుకొని పశువులను తోలుకొంటూ దీపాలవేళకు పాక చేరాడు. ఒక ఎద్దు లోపల ప్రవేశించింది. వాసన పట్టి కనిపెట్టిందో ఏమో "జాగ్రత్త! చేతిలో బాకు పట్టుకుని నిన్ను చంపడానికి మీ అన్న తలుపుచాటున దాక్కొని వున్నాడు. దగ్గరికి రావద్దు" అని హెచ్చరించింది. బాటా పశువుల భాష ఎరిగినవాడు కావటంచేత దిగ్భ్రమతో ముందడుగువేయడం మాని నిలుచొని చూస్తూ ఉండగానే రెండో ఎద్దు లోపలికిపోయి పైలాగు హెచ్చరించడమే కాకుండా "తత్క్షణం పరుగెత్తు" మని అరిచింది. బాటా తలుపు దగ్గరికి రావడం, తలుపు క్రిందినుంచి అన్నకాళ్లు కన్పడడం, ఎద్దులు హెచ్చరించి పరుగెత్తమనడం అన్నీ ఏకకాలంలో జరిగాయి. తత్క్షణం గడ్డిమోపే ఏమిటి, తనదగ్గర ఉన్నవాటి నన్నింటినీ అక్కడే పారేసి చావుపరుగు పుచ్చుకొన్నాడు బాటా. తమ్ముడు తనను కనిపెట్టాడని అన్న లోపలినుంచి ఒంగుని బయటికి దూకి అతని వెంటబడ్డాడు. తమ్ముడు ముందూ అన్న వెనకా పంచప్రాణాల్లోను పరుగెత్తుతున్నారు వెనక్కు తిరిగి చూడకుండా. చీకటిపడింది. కొంతసేపటికి నెల పొడిచింది. ఎవరికి వారు అలసిసొలసి నిస్పృహులవుతున్నారు. చెమటతో గుడ్డలన్నీ తడిసిపోయినాయి. క్రమంగా ఇళ్లూ, ఊళ్లూ వెనకబడిపోయినాయి. పొలాలు, మైదానాలు వెనుకపడ్డాయి. ఒకటేపరుగు. ఎంతదూరం పరుగెత్తారో తెలియదు. బాటాకు అమితమైన ఆయాసం కలిగింది. ఇక క్రిందపడిపోతానని భయంతో, భగవంతుడు కాదక్క వేరొకగతిక్క లేదనే దృఢవిశ్వాసంతో "రా హొరాఖ్తిస్" అనే సూర్యదేవతను "మానవలోకంలోని సత్యాసత్యాలను తెలుసుకోగలవాడవు నీ వొక్కడివే; రక్షించు ప్రభూ!" యని వేడుకొన్నాడు బాటా. ఆ దేవు డెప్పు డాప్రాంతంలో విహరిస్తూ వున్నందున అతనిమొర ఆలకించి వారిద్దరిమధ్య ఒక పెద్ద మొసళ్ల సెలయేటిని కల్పించాడు. అవతలి ఒడ్డున తమ్ముడూ ఇవతలి ఒడ్డున అన్నా నిలుచొని పోయినారు. ఇద్దరికీ అతివిస్మయం కలిగింది. తమ్ముడికి మనస్సు శాంతించింది. ఒకరికి ఒకరు బాగా కనపడుతున్నారు. ఒకరిమాట ఒకరికి వినపడేటంత దూరమే కాని ఎక్కువలేదు. జరిగిన సమాచారం అప్పుడే అన్నతో చెప్పనందువల్ల ఇంతయనర్థం సంభవించిందను కొన్నాడు బాటా. ఇప్పుడిక అన్నతో కలిసివుండటం అతని అభీష్టం కాదు. కాబట్టి ఉన్న సంగతి యావత్తూ అతనికి తెలియబరచి తాను పుష్పసంభరిత సిదారు లోయకు ఏకప్రవేశానికి పోవాలని నిశ్చయించుకొన్నాడు. తదనుసారం మరునాడు సూర్యోదయం అయిన పిదప బాటా అన్నగారి నుద్దేశించి "అన్నా! నన్నేమీ అడగనిస్తే, నేనేమీ సమాధాన మియ్యనిదే మోసగించి నన్ను చంపాలని తలపెట్టావుగదా! నేను నీపూర్వపు తమ్ముణ్ణే సుమీ. మీ దంపతులిద్దరూ నాకు తల్లిదండ్రులే" అని తనకూ వదినెకూ మధ్య జరిగిన సంగతినంతా తెలియపరిచాడు. అంతా నిజమేనని 'రా హొరాఖ్తిస్' (సూర్యదేవత) సాక్ష్యమిచ్చాడు.

ఇంక సాగకుండ మళ్లీ బాటా "అన్నా! తొందరపడి నీ విట్లా చేశావు. అయినప్పటికీ నీమీద నాకు కోపం లేదు, యథాపూర్వం ప్రేమ ఉంది. అన్యాయార్థం కాక నీకోసం కావలిస్తే నాశరీరాన్ని అవలీలగా కోసి ఇవ్వగలను" అని యతడు తనదేహంనుంచి ఒకమాంసపు కండను పీకి నదిలో వేస్తే దానిని ఒకచేప మ్రింగేసింది. దానితో మూర్ఛవచ్చి బాటా క్రిందపడిపోయినాడు. యథార్థస్థితి తెలియగానే అన్నయొక్క కోపం ఎక్కడికో పోయింది. చేతిలో ఉన్న బాకును నదిలో పారేసి ఏడుస్తూ చూస్తున్న అన్నకు తమ్ముడు క్రిందపడడంతోటే శోకావేగం మితిమీరిపోయింది. పోయి పట్టు

కొండామంటే మధ్య మెుసళ్లు సెలయేరు. అతిదీనంగా విలపిస్తూ చూస్తున్నాడు అన్న. కొంతసేపటికి మూర్ఛ దేరి లేచి కూర్చున్నాడు బాటా.

"అన్నా! నీవు సాహసం చేయబూనుకున్నావు. దైవానుగ్రహంవల్ల అది తప్పిపోయింది. నాకైనా మేలుచేయాలని నీమనసులో వుంటే నీకొక సందేశం చెబుతాను విను. ఆప్రకారం చేశావంటే ఏనాటికైనా మళ్లీ మన మిద్దరం కలుసుకోవచ్చు."

"నీ విప్పుడిక ఇంటికి పో! నేను చేస్తూవచ్చిన పను లన్నింటినీ క్రమంగా నీవు చేస్తూవుండు. సమయం వచ్చి నప్పుడు నాకు సహాయంచేయడానికి సిద్ధంగా వుండు. నా ప్రాణాంశం ఇకమీదట పుష్పసంభరితమైనద వృక్షారామంలోని ఒక్కచెట్టుయొక్క అన్నిటికంటె ఎత్తుగా వుండే పుష్పంలో వుంటుంది. ఎవరైనా, ఎప్పుడైనా ఆచెట్టును నరకడం సంభవిస్తే నాప్రాణం అక్కడిభూమిలో పడిపోతుంది. నేను విగతజీవుడ నవుతాను. అప్పుడు నీవు వచ్చి ఆవృక్షం ఉన్నచోటు కనిపెట్టి అక్కడ నా ప్రాణంకోసం వెదుకు. అది వెంటనే నీకు దొరకదు. దాన్ని కనుగొనడానికి కనీసం ఏడు సంవత్సరాలైనా పట్టవచ్చు సంగానంతో నడకాలి. అది దొరకంగానే దానిని నీళ్లలో వేశావంటే మళ్లీ నేను బ్రతుకుతాను. అప్పుడు నేను నీకు అటుతరువాత చేయవలసిన దానినిగూర్చి తెలియపరుస్తాను. ఇక నీవు నాప్రాణం నిమిత్తం ఎప్పుడు వెదకడానికి రావలెనో అందుకు సూచన చెబుతాను విను. ఏనాడు నీ వుపయోగించ బోయే 'బీరు'లో బుడగలు పుడతాయో, ఏనాడు నీవు త్రాగబోయే ద్రాక్షాసవం చెడుకంపు కొడుతుందో ఆనాడే నేను విగతజీవుడనైనా నని. తత్క్షణం నీవు బయలుదేరి పుష్పసంభరిత వృక్షారామంకొండరానికి రా" అని సందేశం ఇచ్చి బాటా తన దారిని తాను వెళ్లిపోయినాడు.

అంపూ దుఃఖంతో ఇంటికిపోయి తమ్ముడు చెప్పినలాగు సమస్తపనులను నెరవేర్చుకొంటూ వచ్చాడు. అతని భార్యకతిదారుణమైన శిక్ష జరిగింది.

అటు బాటా చేరదలచుకొన్న ప్రదేశం చేరాడు. అక్కడ ఏవృక్షాగ్రమందలి సర్వోన్నతమైన పుష్పంలో తన ప్రాణాంశం వుందో ఆచెట్టుక్రిందే నిలచి వస్యమృగాలను వేటాడి ఉదరనిర్వాహకం చేసుకొంటూ వచ్చాడు. కాలక్రమాన్ని ఒకచిన్న ఆవాసం నిర్మించుకొన్నాడు. అందులో తన కవసరమైన కొన్ని పదార్థాలను సేకరించి పెట్టుకొన్నాడు. ఒకనాడు బాటా బయట సంచరిస్తూ ఉన్న సమయంలో తొమ్మండుగురు దేవతలు మార్గవశంగా వచ్చి కలిశారు. వాళ్లల్లో వాళ్లు ఏదో ముచ్చటించుకొంటున్నారు. వకరు "బాటా నిజంసంగతి అన్నతో చెప్పినందున అన్న అతని భార్యను చంపేశాడుకదా! అయినప్పటికీ ఇతడు అన్నదగ్గరకు పోకుండా వంటరిగా ఇక్కడే వుండటం ఎందుకూ? ' అని వేరొకరిని అడిగాడు. ఆదేవప్రకారం వారు బాటాను ప్రశించారు. బాటా వాటి కేదో జవాబిచ్చాడు. ముత్తంమీద వారి కందరికీ అతనిమీద దయ కలిగింది. అతను వంటరిగా వుండటం బాగా లేదనీ; అతనికి సహాయభూతంగా ఉండడానికి భార్యను సృష్టించి ఇస్తే బాగుంటుందనీ భావించుకొన్నారు. అంత 'ఖ్నుమూ' నామక దేవత ప్రపంచంలోకల్లా సౌందర్యవతియైన దివ్యస్త్రీ విగ్రహాన్ని సృజించి ఇచ్చాడు. ఇంతలో హాథోరులనే అదృష్టదేవత లక్కడికు వచ్చి ఏకగ్రీవంగా ఆమె శీఘ్రమరణానికి గురియవుతుందని పలికారు.

కాని బాటాకు ఆమెను చూస్తే అతిప్రేమ కలిగింది. అతడామెను దీసుకొనివచ్చి ఇంటిలో ఉంచుకొన్నాడు. ఇంటిబయటికైనా ఆమెను రానిచ్చేవాడు కాడు; వస్తే సముద్రుడెక్కడ హరిస్తాడో యని భయం. తాను వేటాడి తెచ్చిన వాటినన్నింటినీ ఆమెకు సమర్పించేవాడు. ఇట్లు సకలవిధాల ఆమెకు వశీభూతుడై ఇతరు లెవరికి తెలియజేయగూడని తన ప్రాణాలనుగురించిన రహస్యాన్నంతా దాచకుండా ఆమెకు చెప్పేశాడు. ఈ ప్రకారం కొంతకాలం గడచిపోయింది. ఒకనాడు వేట నిమిత్తం బాటా ఇల్లు విడచిపోయివున్న సమయంలో అతని భార్య కుతూహలవశాత్తు ఆవృక్షం క్రిందికి వచ్చి తిరుగుతూవుంది. సముద్రుడు తత్క్షణం ఆమెను పట్టుకోడానికి తన తరంగాలను తరిమాడు కాని ఆమె చిక్కకుండా చప్పున ఇంటిలోకి పరుగెత్తుకొనిపోయింది. సముద్రుడు ఊస్సురంటూ ఆవృక్షంక్రిందికి వచ్చి

"అయ్యో! ఆపిల్ల నాకు దొరకలేదే! దొరికితే ఎంత బాగుండేదో" అని ఏడుస్తూ ఉంటే ఖదిరం దయదలచి ఆమె కెంట్రుకల గుత్తి నొకదాన్ని సముద్రుడికి ప్రసాదించింది. అతడూ తరంగహస్తాలతో ఆకేశగుచ్ఛం గ్రహించి కెరటాలు కొట్టటం ఆరంభించాడు. తరంగాలతాకిళ్లకు మెల్లగా కొట్టుకొనిపోయి యా వెంట్రుకల గుత్తి ఈజిప్టు తీరాన్ని అచటి రాజుగారి బట్టలుతికే రేవులో చేరింది. ఆగుచ్ఛపు సువాసన రేవంతటా గ్రమ్మి రాజుగారి వస్త్రాలకూ పట్టింది. ఈ సువాసన ఎక్కడినుంచి వచ్చిందా యని చాకలివాళ్లలో తగాదాలు పుట్టాయి. ఆసువాసన ఎక్కణ్ణుంచి ఎందుకు వస్తున్నదీ కనిపట్టలేనందుకు రాజుగారు చాకలివాళ్లి నందరినీ చీవాట్లు పెట్టారు. చాకలిపెద్దకు మరింత విచారం పట్టుకుంది. ఎందుకంటే అసలు రాజుగారి పురాజాపుష్పాలు పడేది ఇతని నెత్తిమీదే. చివరకు ఎటూ పాలుపోక బట్టలుతికే రేవులోకి పోయి దిగాలుపడి నీళ్లకేసి చూస్తూ నిలుచున్నాడు మడేలుదొర. చూడగా చూడగా వెంట్రుకల గుత్తి వకటి తేలియాడుతూ కన్పించింది నీళ్లమీద. దానిని తీసుకొని రమ్మని నౌకర్లను తరిమాడు అతను. వాళ్లూ దాన్ని తెచ్చిఇచ్చారు. అదే సుగంధం విరజిమ్ముతూ ఉంది. మడేలుదొర బ్రతుకు దేవుడాయని దానిని పట్టుకెళ్లి రాజుగారి కిచ్చాడు. రాజు తన దర్బారీల నందరినీ పిలిపించి వారి కాకేశగుచ్ఛం చూపించి దాని రహస్యమేమిటో బయటికి దీయండని యడిగాడు. వారు దాన్ని బాగా పరీక్షించి అది ఒక రాజకుమారితాలూకు తలవెంట్రుకలగుత్తనీ, చాలా దూర దేశాన్నుంచి వచ్చిందనీ చెప్పారు. రాజుకు ఆమెను వెదకించాలని బుద్ధి పుట్టింది. వా రందులకు సమ్మతించి వేరువేరదేశాలకు కొందరినీ, పుష్పసంభరిత ఖదిరారామప్రదేశాలకు మరికొందరినీ మనుష్యుల నెక్కువగా పంపమని సలహా ఇచ్చారు. అట్లే జరిగింది. దూతలు దేశదేశాంతరాలన్నీ చూచి వచ్చారు. ఎక్కడా ఆచూకి దొరకలేదు. కాని ఖదిరారామప్రదేశాలవైపు వెళ్లినవాళ్లు తిరిగి రానేలేదు. బాటాయే వాళ్లందరినీ గడతేర్చినందున వాళ్లగతి ఏమైనదీ ఎవరికీ తెలియలేదు. అందుచే రాజు మళ్లీ వట్టిమనుష్యులనేగాక సైనికులనుగూడా వారివెంట పంపాడు. వా రందరితోపాటు ఒక స్త్రీకూడా వెళ్లింది. నానావిధసువర్ణరత్నాలంకారాలను దీసుకెళ్లి ఆరాకుమారికి చూపించి మోహపెట్టి రహస్యంగానైనాసరే ఆమెను దీసుకరమ్మని రాజు దూతికకు ఉత్తర్వు లిచ్చాడు. అందుచే ఈతడవ రాజుగారి కోరిక ఫలించింది. నగలలో భ్రాంతికి వశీభూతురాలై రాకుమారి యా దూతిక వెంటబడి రాజనగరికి వచ్చింది. ఆదివ్యవిగ్రహం చూసేసరికి రాజు మోహపరవశుడైనాడు. అతడామెను పెండ్లాడి అంతఃపురంలోకి దీసుకొన్నాడు. రాజు క్రమంగా ఆమెపుట్టుపూర్వోత్తరాలు, ఆమె పెనిమిటిసంగతీ, అతని జీవరహస్యం అడిగి తెలుసుకొని నౌకర్లను బంపి ఆచెట్టును నరికి వేయించాడు. బాటా విగతజీవుడై పడిపోయినాడు.

అక్కడ అన్నా రోజూలాగే చేతులూ కాళ్లూ కడుక్కొని భోజనానికి కూర్చోగా 'బీరు' తెచ్చి ముందు పెట్టారు. అందులోనుంచి బుడగలు బయలుదేరాయి. ప్రాశసవం ఇస్తే అది చెడుకంపు కొట్టింది. అంత నతడు వెంటనే లేచి కాళ్లూ చేతులూ కడుక్కొని తమ్ముణ్ణి స్మరించి దుఃఖిస్తూ ఖదిరారామానికి బయలుదేరాడు. అతిప్రయాసపడి అక్కడికి చేరాడు. తమ్ముడి శరీరం ఇంటిమస్య పడివుంది. నరికిన చెట్టునుబట్టి అది వుండినచోటు కనుపట్టి అక్కడంతా బాటా చెప్పినప్రకారం వెదక నారంభించాడు. దినాలు గడిచిపోయినాయి. వారాలు, పక్షాలు, మాసాలు, చివరకు రెండు మూడు ఏండ్లుసైతం దాటిపోయినాయి. బాటాజీవం దొరకలేదు. చెట్టుక్రింద ముఖ్యంగా ప్రతి అంగుళమూ నేల శోధించాడు. నిష్ఫలమైంది. నిరాశుడైనాడు. బాటా చెప్పినగడువు ఏడు ఏండ్లు. మళ్లీ వచ్చి వెదకుదామనే ఉద్దేశంతో స్వదేశానికి బోవ మరునాడు లగ్న మేర్పరుచుకొని, అయినా ఆఖరు పర్యాయం ప్రయత్నంగా మరల శోధించడం మొదలు పెట్టాడు. వెదకుతూ వెదకుతూంటే పగలంతా గడిచిపోయింది. సాయంకాలానికి సూర్యుడు గ్రుంకబోతుండగా ఒక చిన్న గింజవంటి పదార్థం దొరికింది. అతడు దాన్ని లోపలికి పట్టుకెళ్లి నీళ్లగిన్నెలో వేసి ఏమవుతుందో చూతామని ఎదురుగా కూచున్నాడు. రాత్రిపడింది. గింజ నీళ్లను పీల్చుకొంది. దానితో వడుక పడివున్న తమ్ముడిశరీరం కదిలింది. బాటా కళ్లు తెరిచి అన్నను

మాశాడు. కాని హృదయానందం మాత్రం కలుగలేదు. అప్పుడు అంప్రూ ఆన్నను ఎత్తుకొని యిక్కడి నుంచి పంపిస్తే అతడు వాటిని త్రాగాడు. అంతట వాళ్ళు పూర్వం లేని సంబంధాన్ని తిరిగి కలిగించుకొని, పెద్ద కాలాన్ని గట్టిగా కౌగిలించుకొని ఆనందాశ్రువులు వదిలారు. అటుపిమ్మట జరుగవలసిన కార్యక్రమాన్ని గూర్చి బాటా అన్నకు చక్కగా వివరించాడు.

తదుపరి బాటా వృషభరూపం దాల్చాడు. ప్రాగైతిహాసిక ఈజిప్టునాగరికతలో వృషభం పవిత్రమైంది, పూజనీయమైంది. ఎందుకంటే ఆకాలపు ఈజిప్షియనుల ముఖ్యదేవతయైన "ఓసిరిస్" వృషభాకృతిని పొందెనని వారి నమ్మకం. బాటా వృషభం అన్నను వెంటబెట్టుకొని ఒక్కరాత్రిలో ఈజిప్టు దేశం పోయి చేరింది. అక్కడి జనులందరూ దాని రూపురేఖలూ, ఠీవీ గాంచి చాలా మెచ్చుకొన్నారు. దానిని తెచ్చినందుకు అంపూను మిక్కిలి గౌరవించి బంగారం యిచ్చి సత్కరించాడు అక్కడి రాజు. వృషభాన్ని స్వయంగా కొని దేవమందిరంలో పెట్టించాడు. తరువాత కొన్నాళ్ళక్కడే ఉండి అంప్రూ స్వదేశానికి వెళ్ళిపోయాడు. నాగరికులందరూ మందిరంలోకి పోయి వృషభాన్ని సందర్శిస్తూ పూజిస్తూ వచ్చారు. ఒకనాడు రాణి వెళ్ళి వృషభసందర్శనం చేసుకొని దాన్ని పూజిస్తూవుంది. ఆసమయంలో వృషభదేహాంతర్గతుడైవున్న బాటా తన స్వరూపాన్నంతా చూపించి ఆమె చేసిన ద్రోహాన్ని గూర్చి మహాతీవ్రంగా నిందించాడు. దానితో ఆమెకు దిగ్భ్రాంతి, భయమూ కలిగాయి. తల వంచుకొని తను వెలుపలికి వెళ్ళి అంతఃపురానికి వెళ్ళిపోయింది. ఆమె తన మనస్సులోని దుర్మార్గపు సంగతి రాజుకు తెలియపరచక కొన్నాళ్ళు గడిచిన వెనుక ఏదో విందు ఏర్పాటయివున్న సమయంలో రాజు తన్ను అమితంగా ప్రేమించడం గనిపెట్టి 'ఆవృషభంయొక్క కాలేయం తినాలని మనసవుతున్నది, తెప్పించ'మని అడిగింది. రాజుకు అది విని మహాఖేదం కలుగుతుంది. కాని ఆమెమీదగల మోహంచేత ఎదురుమాటాడలేక 'సరే' యని ఒప్పుకొన్నాడు. వృషభాన్ని బలి ఇవ్వమని రాజుగారి ఉత్తరువైంది. పౌరులకేమో పూజచేసి వృషభాన్ని ఎత్తుకొని వచ్చారు. బలికార్యం నిర్వర్తితం అయింది రాజుగారి సేవకులచేత. ఆసమయంలో వృషభకంఠంనుంచి రెండు నెత్తుటిబొట్లు ఎగిరిపడి ముఖద్వారానికి ఇరుప్రక్కలా పడ్డాయి. కొన్నాళ్ళకు అవి పడ్డస్థలములలో రెండు మొక్కలు మొలిచి క్రమంగా పెరగడం ఆరంభించాయి. రాజూ రాజకుటుంబం వారూ, పౌరులూ ఆవృక్షాలను జూచి చాలా ఆనందించారు. పవిత్రభావంతో వాటిని పూజింపసాగారు. అవి పెద్ద వృక్షాలయినాయి. ఒకనాడు రాజూ రాణీ వచ్చి వాటిని పూజిస్తూ ఉండగా రాణి వెళ్ళి ఒక చెట్టుక్రింద నిలుచుంది. అప్పుడా చెట్టులోనుంచి బాటా యీమాత్ర "కృపి పాపీ! నీవు నన్ను రూపుమాపజూశావు. కాని నేనింకా బ్రతికేవున్నాను" అని ఆమె అంతకు ముందుచేసిన దుర్మార్గపు పనులన్నింటిని ఉగ్గడించింది. రాణి దాన్ని విని మనసులో రేగిన కోపాన్ని దిగమ్రింగుకొని వెళ్ళిపోయింది. మరలనొకనాడు ఏదో విందు జరుగుతూవుంటే రాజు తనమీద ప్రేమవర్షం కురిపించడం కనిపెట్టి ముఖద్వారం ప్రక్కలందున్న వృక్షాలను రెండింటినీ కొట్టించి తమకిద్దరకూ రెండుపీటాలు చేయించమని కోరింది రాణీ రాజును. రాజుకు వాటిని నరికించడం ఎంతమాత్రం ఇష్టంలేదు. కాని ప్రేమాస్పదురాలైన రాణీగారి యభిమతం అది. అట్లే ఉత్తరువైంది.

మరునాడు పనివాళ్ళు వచ్చి గొడ్డళ్ళతో చెట్లను కొడుతూవుండగా కుతూహలంతో చూడడానికో, లేక దైవనిమిత్తమో, లేక తనశత్రునాశనం స్వయంగా కనులారా చూడాలనో రాణి వచ్చి ఎదురుగా నిలువబడి జరుగుతున్నది చూస్తూ ఉంది తదేకధ్యానంగా. అప్పుడా చెట్టు కొట్టడంలో నలుసంత ముక్క వృక్షంలోనుంచి ఎగిరి రాణీనోట్లో పడింది. దాని నామె తెలియకుండా మింగేసింది.

అంత నామెకు గర్భమై సకాలంలో మంచి కొడుకు పుట్టాడు. దాదులు బాలునిపుడు రాజుదగ్గరికి తీసుకువెళ్ళి చూపిస్తే ఆయన సంతోషించి, వారిని దగినట్లు సత్కరించి రాకుమారుని పరిపోషణార్థం కొందరు దాదులను నియోగించాడు.

శిశువుకు నామకరణం చేసే సందర్భంలో రాజ్యమంతటా వేడుకలు జరిగాయి. రాజు కుమారుని ఇథియోపియా దేశానికి యువరాజును చేశాడు. కాలక్రమంగా యువరాజు పెద్దవాడైనాడు. వృద్ధరాజు మరణించాడు, యువరాజుకు పట్టాభిషేకోత్సవాలు జరిగాయి. ఒకనాడు క్రొత్తరాజు సింహాసనంమీద కూచొని తన దర్బారులోని పెద్దలనందరినీ రావించాడు. తరువాత తల్లి రాణినిగూడా పిలిపించాడు నిండు దర్బారులో తన పుత్రకుని సంతతిని వివరించాడు. అందరికీ ఆశ్చర్యమైంది. ఆనాటి ఆకస్మిక గందరగోళంలోనే విగతజీవురాలై పడిపోయింది. పుట్టుకనుండి 'స్వప్న' దేవత ఆమెను సృష్టించినప్పుడు పుణ్యనాశనంగా అదృష్టదేవత తోడు వచ్చి ఆమె పుణ్యఫలాన్ని [illegible]. వారి వాక్యాలు ఈనాడు ఫలించాయి.

ఆనాటినుంచి క్రొత్తరాజు [illegible] పిలిపించి యతనిని తన యుత్తరాధికారిగా నియమించాడు.

తెనుగుతల్లి

శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

మాసిపోయిన తెల్గుమహిమ నూత్నప్రభా
కమనీయమై పెంపు గాంచునట్లు
వాక్శాసనాది కవ్యాత్మలు కవికుమా
రులకు వాదోడుగా నిలుచునట్లు
తెలుగుల పూర్వంపు దివ్యగాధలు కట్టు
కథలు గావని చెప్పగలుగునట్లు
అసమాన శౌర్య సాహసధుర్యలౌ తెల్గు
వీరాంగనలు ప్రభవించునట్లు
అంతరించుచున్న శిల్పాదికళలు
దివ్య తేజస్సుతో ప్రవర్ధిల్లునట్లు
తెలుగుజనుల వ్యక్తిత్వంబు వెలయునట్లు
దీవనల నిచ్చి ప్రోవు మో తెనుగుతల్లి !

పారిశ్రామికాభివృద్ధి:

తద్విధానము, సాధనములు.

శ్రీ సాం గణపతిరావు

క్రిందటి నెల సంచికలోనే హిందూ దేశము పారిశ్రామిక అభివృద్ధిని గూర్చి వ్రాశాను. ఈ ఆశయం కోసం ఏమి ప్రయత్నాలు చేయాలో, ఏమి సాధనాలు అవలంబించాలో తెలిసికోవాలసి వుంది. ఈ వ్యాసంలో కొన్ని ముఖ్యమైన వాటినిగురించి విశదంగా చెప్పేదను.

ఏ దేశమైనా పారిశ్రామికంగా అభివృద్ధి కావాలంటే ముఖ్యంగా మొదట అసలు పారిశ్రామికమైన దృష్టి, పరిశ్రమయందు అభిరుచి, ఉత్సాహము వుండాలి. పూర్వ మెప్పుడో ఇవన్నీ మన దేశంలో ఉన్నవని చారిత్రిక జ్ఞానమున్న ప్రతిమనిషి నిస్సందేహంగా చెప్పవచ్చు. హిందూవిజ్ఞానం సర్వతోముఖంగా ప్రపంచమంతటను విరివిగా వ్యాపించిన రోజులవి. అయితే, ఆ కాలము పోయి, ఆ పరిశ్రమలు పోయె; ఆ ఉత్సాహము పోయె. అన్నీ పోయినవి. ఇప్పుడు వాటినిగురించి ఆలోచించుకోడం అప్రస్తుతం, అనవసరం. వాటితో బాటు మన ఉత్సాహమే పోయింది. మన శక్తిసామర్థ్యములే క్షీణించినవి. మనగతి ఇంతేనేమో యన్న అధైర్యంకూడా అంకురించినది. ఇతర దేశములన్నీ పారిశ్రామికాభివృద్ధిలో అంజలు వేసుకుంటూ పోతూవుంటే మనము మాత్రం అల్లాగే ఉండిపోయినాము. పర్యవసాన మేమిటి ? నేటి నాగరికతలో నేటి విజ్ఞానంలో, నేటి ప్రపంచనిర్మాణంలో నాటి ఔన్నత్యానికి మన స్థితికి హస్తిమశకాంతరం ఏర్పడింది. మన మంటే ఇప్పు డేదేశానికీ లెక్కలేదు. ఎంచేతో, ఆర్థికంగాను, రాజకీయంగాను మన గొప్పదనాన్ని పోగొట్టకొన్నాము కనుక ఇప్పుడు మనమతతత్త్వం, మనఆధ్యాత్మిక చింత అంతా చెబితే ఆర్థికాభివృద్ధియంటే ఏమిటో తెలియని చేతకానివాళ్ల కూతలని అంటారు. ఇది కేవలం అత్యుక్తి అయినప్పటికీ ఈ అవకాశమిచ్చినందులకు కొంతవరకు లోపం మనలోనే వుంది. కాని వకసంగతి మాత్రం ఇక్కడ గమనించాలి. హిందూ దేశం ఆర్థికంగా ఔన్నత్యము కలిగివుండి ప్రపంచానికి మార్గదర్శినిగా వున్నప్పుడు, మనవిజ్ఞానానికి, మన వేదాంతానికి, మన ఆధ్యాత్మికతత్త్వానికి అందరూ ఆశ్చర్యపడి "శభాష్" అన్నారు. ఇప్పుడో హేళన చేస్తున్నారు; వెక్కిరిస్తున్నారు. కాబట్టి ఆర్థికమైన విలువలు ఇప్పుడు కొత్తగా రాలేదని తెలుస్తున్నది. అవి యెప్పుడూ వున్నవి. అనాదినుండికూడ ఆర్థికంగా గొప్పదనం వుంటేనే చెప్పినమాట చెల్లుతూవచ్చింది. కనుక ఆర్థికవిలువలను నొక్కిచెప్పినవాళ్లని అల్పమానవులని త్రోసివేయనక్కరలేదు. కనుక హిందూదేశంలో పరిశ్రమలు అభివృద్ధిపొందాలంటే ముఖ్యంగా మనదృక్పథం మారాలి. దేశమున కంతటికీ బలవత్తర

మైన కాంగ్రెసుకక్షివారు ఈ ఆవశ్యకతను బాగా గుర్తించినట్లు లేదన్న సందేహము ఈమధ్య ఢిల్లీలో జరిగిన కాంగ్రెసు రాష్ట్రాల పారిశ్రామికమంత్రులయొక్క సమావేశం వల్ల తీరుతున్నది. సుభాస్‌బాబుగారి అధ్యక్షోపన్యాసంవల్ల కాంగ్రెసుయొక్క దృక్పథంలో గొప్పమార్పు కలిగినట్లు కనబడుతున్నది. ఈ ఆవశ్యకతను గ్రహించడము, దృక్పథంలో మార్పు రావడమే దుష్కరం. ఇవి వచ్చినతర్వాత కార్యదీక్ష, వలసిన ప్రయత్నాలు కావాలి. పట్టుదలతో పని చేస్తే మన దేశంయొక్క ఆర్థికభవిష్యత్తుకై మన కంతచింత అక్కరలేదు.

అయితే, మన దేశం ఆధునిక యాంత్రాగార పారిశ్రామికవిధానంలో అడుగుపెట్టక పోలేదు. ఈశతాబ్దంలోనే అందులోనూ ప్రపంచయుద్ధమైనతర్వాత, కొంతవరకు మంచిప్రయత్నమే జరిగింది. జయప్రదంగా జరిగిందికూడాను. ౧౯౨౩-వ సంవత్సరము నుండి మన ప్రభుత్వము అవలంబించిన పారిశ్రామిక రక్షణవిధానంవల్ల దేశంలో కొన్ని పెద్దపరిశ్రమలు బాగా వర్ధిల్లినవి. వీటిలో నూలు, నారపరిశ్రమలు; ఇనుము, ఉక్కుపరిశ్రమలు; బొగ్గు, కాగితము, సిమెంటు, పంచదార మొదలైన ఇతరపరిశ్రమలు చెప్పదగ్గవి. అందులో పంచదార మొదలగు పరిశ్రమలలో దేశానికి చాలవరకు స్వయంసంపూర్ణత్వంకూడా వచ్చినది. ఇతర దేశాల మీద పూర్వమువలె పూర్తిగా ఆధారపడి ఉండవలసిన అవసరం క్రమంగా తగ్గుతున్నది. పారిశ్రామిక ప్రాముఖ్యముగల దేశాలలో మన దేశంకూడా వకస్థానం సంపాదించినది. ఈనడుమ మన దేశంలో పారిశ్రామికఉత్పత్తి ఎల్లా అభివృద్ధి అయినదో ఈదిగువ నుదాహరించిన అంకెలవల్ల తెలుస్తుంది.

వస్తువు.		౧౯౨౨-౨౩, ౨౩-౨౪ రెండు సంవత్సరములలో సరాసరిని ఉత్పత్తి.	౧౯౩౬-౩౭ లోని ఉత్పత్తి.
నూలు	...	౬౭౬.౨ కోట్ల పౌన్లు	౧౦౫౪.౪
నూలు బట్టలు	...	౧౭౧.౮ కోట్ల గజాలు	౩౫౭.౨
జనపనార గుడ్డ	...	౧౧౯.౮ ,, ,,	౧౯౩.౧
పంచదార	...	౯౮.౦ వేల టన్నులు	౧౧౧౯.౦
సిమెంటు	...	౧౯౩.౦ ,, ,,	౯౯౭.౦
ఇనుము	...	౮౫౫.౦ ,, ,,	౧౫౫౭.౦
కాగితము	...	౨౫.౦ ,, ,,	౪౯.౦
బొగ్గు	...	౧౯౮.౦ లక్షల టన్నులు	౨౨౬

అయినను మన దేశంలో వుండే సహజసంపత్తు బట్టియు, జనసంఖ్యను బట్టియు, ప్రజలలో వుండే దారిద్ర్యమునుబట్టియు, ఇంతవరకు జరిగిన పరిశ్రమాభివృద్ధి బహుస్వల్పమని చెప్పక తీరదు. ఇటువంటి పరిశ్రమలు ఇంకను ఎన్నియో కావలెను. ఉన్నవికూడా ఇంకా ఎంతయో అభివృద్ధి పొందవలెను. స్వయంసంపూర్ణత్వానికి మన దేశానికి వుండే అవకాశాలూ

సదుపాయాలూ ఏ ఇతర దేశానికీ లేవంటే అతిశయోక్తి గాదు. ఈ మాటలనే ౧౯౧౬ — ౧౮ సంవత్సరములలో మన ఆర్థిక, పారిశ్రామిక పరిస్థితులు నన్నింటిని బాగా విచారించి చేసి ప్రభుత్వానిక నివేదించిన పారిశ్రామికకమిటీ (Industrial Commission)వారు చెప్పరి. ఇప్పుడును వాటినే మళ్లీ చెప్పవలసివస్తున్నది; అంటే పారిశ్రామికంగా మనమునక అంత తాగాలు నడకలాగ నుంటి. ఈ స్థితికి మనం మన ప్రభుత్వాన్ని ఎంత నిందించినా మనలోపాలు గూడ మరచిపోగూడదు. పరిశ్రమలంటే హితవుపుట్టి, పారిశ్రామికంగా వృద్ధి మనం డానికే మన కిన్నాళ్లు పట్టినది ఇంకను పూర్తిగా మళ్లినదని చెప్పలేము. వెనక్కి లాగేవాళ్లు చాలమంది ఉన్నారు. ఇలాంటి తర్కవితర్కాలలో బడి కొట్టుకుంటూవుంటే మనకు కార్యసిద్ధి ఏలాగ వస్తుంది? మన ఆశయమే మనకు తెలియదు.

ఈసందర్భమున ఈనడుమ జరిగిన కాంగ్రెసు పారిశ్రామికమంత్రుల సమావేశములో చేయబడిన తీర్మానములు మిక్కిలి ప్రశంసనీయములు. ఆశయాల, సాధనసామగ్రి కూడ కొంతవరకు నిర్ణయించారు. నేటి ప్రపంచనిర్మాణంలో పారిశ్రామిక అభివృద్ధి యంటే కిట్టని దేశము అంతర్జాతీయ పోటీకి నిలువలేక నశించిపోతుందని అధ్యక్షుడు సుభాస్ బాబు స్పష్టంగా, అక్షరాలా చెప్పినాడు. ఇదీ మనకు కావలసింది. ఈసంగతి ఇదివరకు ప్రత్యేకంగా అనేకవ్యక్తులు చెప్పారు. అయితే, కాంగ్రెసుకే తోచి, కాంగ్రెసువారే ఈ సమస్యను ఎత్తుకొని, భారం వహిస్తున్నారంటే ఇది యెంతో శుభ సూచకం.

ఈ దేశమున పరిశ్రమాభివృద్ధి త్వరితంగా జరగాలంటే ముఖ్యంగా ఒక జాతీయ ప్లానింగు కమీషను (National Planning Commission) ఉండాలి. ఈ సంఘము యొక్క ఆధిపత్యముక్రిందనే పరిశ్రమలను స్థాపించి, వృద్ధి చేయాలి. మొదట దేశమంతటను ఒక ఆర్థిక సర్వే చేయాలి. సహజసంపత్తు బట్టియు, ఇతర సౌకర్యాలను బట్టియు, ఏ పరిశ్రమలు ఎక్కడ స్థాపించినయెడల ఎక్కువ వర్ధిల్లునో యోచించి స్థాపించవలెను. ఇవన్నియు నిర్ణయించుటకు ప్రభుత్వముయొక్కయు, పారిశ్రామిక, వ్యాపారానుభవంగల ప్రత్యేకవ్యక్తుల యొక్కయు, అర్థశాస్త్రజ్ఞుల యొక్కయు, ఇతర శాస్త్రవేత్తలయొక్కయు సాహాయ్యము అవసరము. ఇటువంటి జాతీయ ప్లానింగు కమీషను నొకదానిని, పారిశ్రామిక నిర్ణయ సంఘము నొకదానిని, వెంటనే స్థాపించుటకు ఈమధ్యనయిన పారిశ్రామికమంత్రుల సభలో తీర్మానము జరిగెను. ప్రస్తుతం వాటి కొరకు ఏర్పాటులు జరుగుచున్నవి. ఈ జాతీయ ప్లానింగు కమీషనుకు అధ్యక్షుడు శ్రీ జవహరలాలు నెహ్రూగారు. ఇంత కంటె సంతోషకరమైన వార్త మరియొకటి వుండబోదు. ఆధునిక దృష్టి, నవీనవిజ్ఞానం, ప్రపంచానుభవం, భావౌన్నత్యము — వీటి యన్నిటికి తోడుగా, బంగారానికి సువాసన అబ్బినట్లు అఖండమైన దేశభక్తి, అపారమైన సేవాశక్తి కలసిన మహావ్యక్తి. బుద్ధిమంతుడు; ధీరుడు. ఈయన ఆధిపత్యము క్రింద, మన దేశముయొక్క ఆర్థికాభివృద్ధి

సత్వరంగాను, సవ్యంగాను జరుగుతుందని ఆశించవచ్చు.

మన దేశంలో నిజమైన పరిశ్రమాభివృద్ధి కావాలంటే ప్రస్తుతవిద్యావిధానంకూడా పూర్తిగా మారాలి. పరిశ్రమలకు ఉపకరించే విద్యను ఎక్కువగా నేర్పాలి. కేవలం సారస్వతంగా వుండే విద్య లాభంలేదు. చదువుకొన్న మనయువకులలో ప్రస్తుతంఉండే నిరుద్యోగసమస్య హృదయవిదారకంగా వుంది. పూర్వ మెప్పుడో ప్రభుత్వానికి పాలనా సౌకర్యముకోసం గుమాస్తాలను తయారుచేయడానికి పుట్టబడిన విద్యావిధానమట. నేటికిని అంతకంటె ఉన్నతాశయం లేకుండానే వుంది. ఈలోపం అందటికీ ఇప్పుడే బాగా తెలుస్తున్నది. పారిశ్రామికవిద్య గరపుటకు ఇదే మంచితరుణం. ఈ ఉద్దేశమే కొంతవఱకు వార్ధావిద్యావిధానంలో కనబడుతోంది. అయితే, వారి ఆర్థికభావాలు, వారి అర్థశాస్త్రం అంతా వేరు. అది వేరేసమస్య. దానితో మన కిక్కడ పనిలేదు. ఇక్కడ ఇంకొకసంగతిమాత్రం చెప్పకతీరదు. ప్రస్తుత విద్యావిధానంలోని లోపాలు కష్టంగా కనబడుతున్నా ఆర్థికవిలువలు వచ్చి పారిశ్రామిక విద్య వస్తే, అసలు విద్యాభ్యాసముయొక్క ఆదర్శమే పోతుందనీ, విద్యాభ్యాసం కేవలం విజ్ఞానానికేయనీ, ఈ ఉన్నతాదర్శాలు ఎవరో తప్పు అన్నట్టుగా వాదించే పెద్దలున్నారు. నేటి ఆర్థికపరిస్థితులలో ప్రస్తుత విద్యావిధానంలో విద్య నభ్యసించి, అనుభవం కలిగి, అందులోవుండే లోపాలు బాగా నాటిన పిన్నలమాటలు పాటిచేయరు. విద్యకు ఉండవలసిన పైఆదర్శాలు తప్పని ఎవ్వరూ అనరు. కాని ప్రస్తుతపరిస్థితులకు సంబంధమున్న విద్యకూడా చెప్పమంటారు. పుట్టిన ప్రతిమనిషి బ్రదకాలిగనక ఆర్థికంగాకూడా నిలుపఉండే విద్య చెప్పమంటారు. ఇది తప్పా? చదువుకోనివానికంటె చదువుకొన్నవాడు ఉత్తముడే కావచ్చుకాని చదువుకొన్నదరిద్రునికంటె చదువుకొన్న భాగ్యవంతుడు ఇంకా ఉత్తముడవి; ఇంకా మనోవికాసం కలిగియుంటాడు. ఇదే మాఆశయం. విద్యావిధానంలోవుండే ఈలోపం కప్పిపుచ్చి, ఆర్థికవిలువలకి విద్యావిధానంలో తావులేదని, ప్రస్తుతయువకుల నిరుద్యోగసమస్యకు ప్రభుత్వం కారణమనీ, సంఘం కారణమనీ, ఆర్థికనిర్మాణం కారణమనీ, భారమును ఇతరులపై త్రోసిపుచ్చుటం అసమంజసంగా కనబడుతుంది. ఈదృష్టే తప్పైతే ఆత్మవికాసానికి, సత్కవిత్వానికి (కవిత్వమంటే బాహుళ్యంగా భావసౌష్ఠవమంతా వచ్చేస్తుంది) ఉండాలన్న శారీరక సౌకర్యాలలో "ఆత్మ కింపయినభోజనము"ను కూడా చేర్చిన అల్లసాని పెద్దనను మాలాంటి మూర్ఖులలో కలపాలి. అయితే దారి తప్పవలసివచ్చింది. పాఠకులు మన్నించాలి. ప్రస్తుతవిషయాన్నిగురించి గమనించవలసిందేమిటంటే: మన దేశంలో పరిశ్రమలు అభివృద్ధికావాలంటే పారిశ్రామికవిద్య ఎక్కువగా నేర్పవలెనని.

పారిశ్రామికవిద్యాభ్యాసమేగాక నూతన పరిశ్రమలు పుట్టుటకు, పుట్టినపరిశ్రమలు జీవించి వర్థిల్లుటకును నిరంతరం పారిశ్రామిక పరిశోధన మవసరం. ఈపరిశోధన చేయుటకు ఒకసంస్థ ఉండాలి (Industrial research Council). వ్యవసాయంలో పరిశోధనకై మనకు ఇప్పుడొకసంఘము ఉన్నది. ఇలాం

టిదే పారిశ్రామికపరిశోధనకుకూడ వుండాలి. ఈ పరిశోధనకు నాగే అన్ని అవకాశాలూ కలుగచేయాలి; అన్ని సౌకర్యాలూ సమకూర్చాలి. ఈ పని చేయడానికే మూడు, నాలుగు సంవత్సరములక్రితం మన ప్రభుత్వ మొకసంస్థను ఏర్పాటుచేశారు. ఇండస్ట్రియల్ రిసెర్చి బీరో (Industrial Research Bureau) అనే పేరుతో ఒకటి పనిచేస్తోంది. అయితే అది జాతీయంగా లేదు. ఏకొంటా రిపోర్టులుమాత్రం వస్తున్నాయి. అప్పుడప్పుడు ప్రత్యేక పరిశోధన వ్యాసాలు ప్రకటిస్తున్నారు. కాని దేశానికి ఇది యింతవరకు ఉపయోగంగా వున్నట్టు చెప్పటకు వీలు లేకుండా వున్నది. దీనిని [illegible] మార్చి కొంచెం జాతీయంగా వుండేటట్లూ, దేశపరిశ్రమాభివృద్ధికి నిజంగా తోడ్పడేటట్లూ చేయాలి. శాస్త్రజ్ఞానము పారిశ్రామిక పరిశోధనము ఎక్కువగా ప్రబలియుండుటచేతనే పాశ్చాత్య దేశములలో పరిశ్రమాభివృద్ధి అంత బాగుంది. కనుక ఈ దేశంలోకూడా అది బాగా వ్యాపిస్తేగాని పరిశ్రమలు వృద్ధిలోకి రావు. ఆ దేశపరిశ్రమల పోటీకి నిలువలేవు.

అటుగాక, మన దేశంలో పరిశ్రమలు ఇంకా వృద్ధి పొందాలంటే వాటికి తోడ్పడే బ్యాంకులు, తయారైన వస్తువులను సులువుగాను, క్రమంగాను అమ్మడానికి వీలైన సదుపాయాలూ ఇప్పటికంటె ఎక్కువగా కావాలి. మన దేశంలోని బ్యాంకులసంఖ్య చాలా తక్కువ. జనాభాకు ఎంతో తక్కువ వైశాల్యము గల కొన్ని పశ్చిమ దేశాలలో దీనికి ఎన్నోరెట్లు బ్యాంకులున్నాయి. దేశంలో వున్న బ్యాంకులైనా శక్తివంచనలేకుండా పనిచేస్తున్నాయని చెప్పలేము. ప్రజలకు వున్నవాటిలోనే తగినంత విశ్వాసం లేదు. కాబట్టి ఈ పరిస్థితులు మారాలి. అయితే పరిశ్రమలు వృద్ధిపొందుతూవుంటే క్రమంగా మారగలవు. అప్పుడు ఎన్నియో కొత్త బ్యాంకులు రాగలవు.

ఇంకో విషయం. ఏ దేశమైనా పారిశ్రామికంగా గొప్పదనం సంపాదించాలంటే, అసలు పరిశ్రమలన్నిటికి ఆధారభూతమైనవీ, మూలమని చెప్పదగినవీ కొన్ని పరిశ్రమలు మొదట బలంగా పెరగాలి. వీటినే ఇంగ్లీషులో 'కీ ఇండస్ట్రీస్' ('Key Industries') అంటారు. అవి లేనిదే దేశపరిశ్రమలు స్వయంసంపూర్ణంగా వుండజాలవు; అంటే, మిగిలిన పరిశ్రమ లెన్ని వున్నా వాటియభివృద్ధికినయినను ఇతర దేశములపై ఆధారపడుట తప్పదు. యంత్రపరికరములను తయారుచేసే పరిశ్రమ, గాజు పరిశ్రమ, రైల్వేపరికరాలపరిశ్రమ, అల్యూమినియంపరిశ్రమ, యుద్ధసామగ్రి తయారుచేసేపరిశ్రమ, విద్యుచ్ఛక్తి మొదలైనవి ఇలాంటి మూలపరిశ్రమలు. ఇవి దేశంలో లేకపోతే పరిశ్రమలకు పరాధీనత తప్పదు. ఇవి లేకపోవడమే మన పరిశ్రమలలో పెద్ద లోపం. ఇవి ఇంత ముఖ్యమైనా ౧౯౧౬-౧౮ సంవత్సరములలో మన పారిశ్రామిక అభివృద్ధిని గురించి విచారణచేసిన పారిశ్రామిక కమిటీగాని ౧౯౨౧-౨౨లో మన వ్యాపారశుల్కవిధానసమస్యనుగురించి, పారిశ్రామిక రక్షణనుగురించి విచారణచేసిన ఫిస్కల్ కమిషను (Fiscal Commission)గాని వీటికి తగిన ప్రాముఖ్యము ఇయ్యలేదు. అవి మన దేశంలో వృద్ధిపొందలేదు. కనుకనే మన పరిశ్రమాభివృద్ధి ఇంత నీరసంగా వుంది.

కాబట్టి ఇకముందైనను మనపరిశ్రమలు త్వరగా నాటుకోవాలంటే ఈమూలాధారమైన పరిశ్రమలు మొదట బాగుగా స్థాపించాలి.

ప్రస్తుతమున్న పరిశ్రమలనుకూడ బాగా బాగుపర్చవలెను. ఇందునిమిత్తము పశ్చిమ దేశాలలో ఒకపద్ధతి వాడుకలోవుంది. దానిని "రేషనలైజేషన్" (Rationalization) అని అంటారు; అంటే పరిశ్రమల, నిర్వాహణములో విచక్షణ పూర్తిగా ఉపయోగించి, సాధ్యమైనంత వరకు అన్ని విధములుగాను మితవ్యయంచేసి, ఖర్చులను తగ్గించుట; శాస్త్రవిజ్ఞానమును వినియోగించి ఉత్పత్తి ఎక్కువగాను, శ్రేష్ఠముగాను చేయుట. పరిశ్రమవిధానంలో ఏవిధమైన దూబరా వుండకూడదు. మనదేశంలో ఈపద్ధతి బాగుగా విస్తరించవలెను. పరిశ్రమ నిర్వాహణములోనేగాక పరిశ్రమల స్థాపనలోగూడ విచక్షణ ఉపయోగించి ఏపరిశ్రమలు ఎక్కడ ఉంటే దేశమునకు శ్రేయోదాయకమో విచారించి మరియు స్థాపించవలెను. అల్లాగాక ప్రత్యేక ధనికులయొక్క స్వీయప్రయత్నమునకు వదలిపెడితే దేశముయొక్క ఆర్థికాభివృద్ధి యదేచ్ఛముగా నుండునుగాని నిర్ణీతముగాను, శ్రేయోదాయకంగాను ఉండదు. అలాంటి పరిశ్రమాభివృద్ధిలో కొన్ని అనర్థము లుండును. దేశములోనే రాష్ట్రములలో మనఃస్పర్థలు ఏర్పడును. కనుక పరిశ్రమాభివృద్ధి క్రమంగాను, నిర్ణీతంగాను వుండవలెను.

ఇవన్నియు గాక పరిశ్రమలకు ప్రభుత్వరక్షణముకూడ కావలెను. ఇది ఆఖరున చెప్పటచేత అంత ప్రధానమైనది కాదని అర్థం చేసికోగూడదు. మనదేశంలో నిజమైన పరిశ్రమాభివృద్ధి కావాలంటే ప్రభుత్వరక్షణము అత్యంతావసరము ఈ రక్షణవిధానము అనేకరకాలుగా వుండును. పరిశ్రమలకు విరివిగా విరాళము లిచ్చుట, దిగుమతి సరకులపైన సుంకములు విధించుట మొదలైనవి. అంతర్జాతీయ పోటీలో స్వదేశ పరిశ్రమలు నిలువగలిగియుండుటకు అన్ని అవకాశములను సమకూర్చుటయే వీటి ఉద్దేశము. అయితే ఈ పారిశ్రామికరక్షణసమస్య ఒక మహాగాధ; అతిక్లిష్టమైనది. మన ప్రభుత్వమునకు పారిశ్రామికరక్షణమంటే అంతగా నచ్చదు. మన అర్థశాస్త్రజ్ఞులలో గూడ భేదాభిప్రాయము లున్నవి. ఈ సమస్య ఇక్కడ చర్చించడానికి చాల పెద్దది, వీలు పడదు. మరొకమారు ఎత్తుకొనెదను. ప్రస్తుతం పారిశ్రామికంగా మనదృష్టి మరలినదికనుకను, కాంగ్రెస్సు తీవ్రంగా ప్రయత్నిస్తున్నదికనుకను, మన దేశంలో పరిశ్రమాభివృద్ధి ఇటుపైన జయప్రదంగా జరుగుతుందని ఆశింపవచ్చు.

స్వతంత్ర గ్రామపరిపాలనము

తెన్నేటి విశ్వనాథం

మద్రాసు రెవెన్యూ మంత్రియైన శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారు మంత్రి పదవీస్వీకారము చేసినప్పటినుండి దేశంలో పర్యటనం చేస్తున్నప్పుడు స్వతంత్ర గ్రామ పరిపాలనను(autonomous village administration)గురించి మహిమాన్వితంగా ఇచ్చే ఉపన్యాసాలలో చెపుతూ వచ్చారు. దాని పైని దేశంలో కొంత సంచలనం, కొంత ఉత్సాహం కలిగిన సంగతి అందరికీ తెలిసిన విషయమే.

ప్రప్రథమంలో నెల్లూరు పట్టణములో ఒక బహిరంగసభలో శ్రీయుత పంతులుగారు ఉపన్యాసాలు చేయటానికి పూర్వంగా ఒక యువకుడు యువజనసమితితరఫున సన్మాన పత్రం చదువుతూ, స్వతంత్ర గ్రామపరిపాలనవిధానాన్ని సత్వరంగా అమలులోకి తేవలసిందని నొక్కి చెప్పాడు. చెప్పినప్పుడు అయిదారువేలమంది గల ఆ ప్రేక్షకబృందం లోనుండి హర్షధ్వానాలు, కరతాళ ధ్వనులు చెలరేగాయి. అనేకమందిముఖాలలో ఒక నూతనమైన ఉత్సాహకళ కనిపించినట్టయింది. తరువాత ఉత్తరజిల్లాలలో పర్యటనం కావిస్తూండే వందలకొలది చదువబడిన వచ్చిన సన్మానపత్రాలు ప్రతిదానిలో ఈ స్వతంత్ర గ్రామపాలనవిధానాన్ని అమలులోకి తెచ్చి, మన దేశాన్ని రక్షించవలసిందని ప్రతివారు రాజకీయసంఘాలైతే నేమి, రైతుసంఘాలైతే నేమి, యువజనసంఘాలైతే నేమి అంతమందీ కూడా ఏకగ్రీవంగా ఒకకొత్తయిన ఆవేశంతో, ఆశతో కోరారు.

అది మొదలు మనరాష్ట్రంలో ప్రజానాయకులు కనిపించినప్పుడల్లా ఇదెప్పుడు ఇదెప్పుడని ప్రశ్నిస్తున్నారు. మన దేశంలో ప్రాచీనకాలం నుండీ వస్తూన్న సంప్రదాయాలకి నూతన విధానం అనుగుణమయినదికాబట్టి కావాలని అడిగినవారెవ్వరూ ఈవిధానంయొక్క వివరాలేమిటి, ఈవిధానం అమలులోకి వస్తే ఇప్పుడున్న పద్ధతులగతి, ఉద్యోగస్థుల గతి ఏమవుతుందని ఎవరూ చర్చచేయడానికీ, విమర్శచేయడానికీ ఆవేదనపడలేదు. తమయొక్కగాని, తమ చుట్టాలయొక్కగాని ఇళ్లూ వాకిళ్లూ తడిసి పోతాయనో, మేనమామ కట్టుకునేయిల్లు కట్టడం పాడవుతుందనో, తాము పెట్టుకొన్న ఏదయినా ప్రయాణ ఉత్సాహానికి భంగం వస్తుందనో ఆలోచించుకోకుండా ఏరీతిగా అయితే సకాలమందు సస్యాభివృద్ధికీ, దేశక్షేమానికీ, ప్రాణపోషణానికీ అవసరమైన వర్షాన్ని కోరుతారో ఆరీతిగానే ప్రజలందరూ ఈ నూతనమైన స్వతంత్ర గ్రామపాలనవిధానంయొక్క ఆగమనాన్ని విమర్శన అక్కరలేకుండానే కోరుతున్నారు.

అయినప్పటికీ లక్షలకొద్దీ, కోట్లకొద్దీ ప్రజలయొక్క రాజకీయ జీవనప్రవాహాన్ని కొత్తదారికి మళ్లించేటటువంటి ఈ కొత్త పద్ధతి అమలులోకి తేవలెనంటే దీనివివరాలేలాగు,

దీని సాధకబాధకా లేమిటి, దీని వివరా లేమిటి అని తర్కించేవారియొక్క అనుమానాలు తీర్చడం హితదాయకం; ఎందుచేతనంటే పదిహే నిరవైసంవత్సరాలు హోరాహోరీగా పోరాడి బాధ్యతలేని దొరతనాన్ని తప్పించి, రాష్ట్రప్రభుత్వంలో మంత్రుల స్వాతంత్ర్యానికి అడ్డురాము అని గవర్నరులదగ్గర వాగ్దానాలు పుచ్చుకొని చక్కగా నూటయేభై సంవత్సరాలయి వచ్చిన సంప్రదాయప్రకారంగా చెన్నపట్టణంలో కూర్చుని ౫ కోట్ల ౬౦ లక్షల ప్రజలపైని సర్వాధికారములూ చెలాయించడానికి బదులు తప్పనిసరి అయినా కార్యనిర్వహణంమాత్రం తమ చేతిలో ఉంచుకొని, తక్కిన పరిపాలన కార్యక్రమమంతా స్వతంత్ర గ్రామపంచాయతీలనే ర్పాటు చేసి, వాటికే అధికారం అప్పగించుతామని చెప్పటంలో అధికారాభిలాషులకు ఆశ్చర్యంగానే ఉండవచ్చును. కాని పరదేశీయులవిధానాన్నుంచీ, బానిసత్వం నుండీ తప్పించి మనజాతీయతను పునస్సృష్టి చేసి, సర్వజనసౌఖ్యదాయకమైన రాజ్యాంగ విధానాన్ని నెలకొల్పడంకోసం సత్యాగ్రహ సమరంచేసి ఇంతటికి వచ్చినవారికి ఆశ్చర్యంగా ఉండదు. ఉండకపోవడమేకాకుండా ఇది ఆ సత్యాగ్రహసమరానికి సహజమైనట్టి పరిణామంగా, అపేక్షణీయమై ఆదరించి పెంపు చేయవలసిన ప్రజాస్వత్వంక్రింద అగపడుతుంది.

ప్రాచీనకాలమందు మన దేశముయొక్క శోభాసౌభాగ్యములకు స్వతంత్ర గ్రామ పరిపాలనవిధానమే మూలరహస్య మని యిదివరలో మనమంతా అధికారము లేని కాలమునందు చెప్పిన దేకాని కొత్తది కాదు. అధికారం లబ్ధమైనతరువాత స్వాధికారాపేక్ష విసర్జించి, అట్టి సద్భావాన్ని కార్యరూపంగా అమలులోకి తెచ్చుట ప్రశంసనీయం గదా! అందునే మన ప్రకాశంపంతులుగారు చేయడానికి పూనుకొన్నారు.

మనుస్మృతిలోనూ, నారదస్మృతిలోనూ, వీనికి కొంతకాలం పిమ్మట వ్రాసిన అర్థశాస్త్రంలోనూ, వీటి కింకా చాలాకాలమైన తరువాత వెలసిన విజయనగరసామ్రాజ్యము చరిత్రలోనూ, దక్షిణదేశంలోని తొండమండలం చరిత్రలోనూకూడా స్వతంత్ర గ్రామపాలనజనపదాలనుగురించి, వాటి ఉత్కృష్టతనుగురించి వ్రాసియున్న సంగతి అందరకూ తెలిసినదే. ఆనాటి రాజులుగా ధర్మప్రకారం రాజులు ఈ గ్రామాలయొక్క అంతర్వ్యవహారాలలో ఏమీ జోక్యం కలుగజేసికొన్నట్లు కనిపించదు. ఈ గ్రామాలయొక్క పెంపుగా, వాటి కవసరమైన రక్షణముగా సమకూర్చుట, లలితకళలను అభివృద్ధి చేయుట, వాటికి తగినప్రోత్సాహ మిచ్చుట మాత్రం సామ్రాజ్యాధిపతులు తమయొక్క ఛాయక్రింద చూచుకొన్నట్లు కనిపిస్తుంది. ఈకారణంచేతనే మనగ్రంథాలేవి చూసినా రాజులతాలూకు చరిత్రలలో ఈ మీద చెప్పిన విషయాలు కాక ప్రజలజీవనాన్ని గురించి అట్టే వ్రాసివుండదు. ఈ స్వతంత్ర గ్రామాలయొక్క పటుత్వం ఎంతటిదోగాని తూర్పు ఇండియా వర్తకసంఘంవారు మన రాజధానిని ఆక్రమించుకొనేనాటికికూడా ఈ గ్రామపరిపాలనావిధానం సంపూర్ణంగా సాగుతూన్నట్టు గ్రాంటుదొర వ్రాసిన ఉత్తర సర్కారులచరిత్రవల్లా, విల్క్సు మైసూరు చరిత్రవల్లా, చెన్నపట్టణప్రభుత్వంతాలూకు

ఇతరమైన కారణాలవల్లా గోచరమవుతోంది. ఇదికాక, హౌస్ ఆఫ్ కామన్స్‌వారు నియమించిన సెలెక్టు కమిటీవారు 1812వ సంవత్సరంలో వ్రాసిన అయిదవనివేదికలో గ్రామసంస్థయొక్క విధానాన్ని వర్ణించారు. అందులో పురాతనకాలంనుంచీ కూడా ప్రతిగ్రామంలోనూ గ్రామమునసబు లేక పటేలు, కరణం, వెట్టి, తలారి, నీరుగంటి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, మంగలి, చాకలి, పురోహితుడు, పూజారి, గాయకుడు, పొలిమేరకాపరి మొదలుగాగల గ్రామపరివారం ప్రతిగ్రామానికిన్నీ నియతంగా ఉన్నట్టున్నూ, గ్రామమంతా ముఖ్యగ్రామోద్యోగస్థులయిన మునసబు కరణాల చెప్పుచేతలలో ఉన్నట్టున్నూ, గ్రామాలలో వచ్చే అన్ని వివాదాలను తగాదాలను గ్రామపంచాయతీలో తీర్మానం చేస్తున్నట్టున్నూ, ప్రతిగ్రామంతాలూకు భూమి ఇరుగుపొరుగుదా, సస్యము, అమ్మకము మొదలుగాగల లెక్కలూ, వాటితాలూకు పరిమితి, విలువ, జమాభాగ, పన్నుల లెక్కలు, సాగుచేసే విధానం, సాగుచేసే సాధనాలు, పంటలుండేవి, రైతుభాగము రాజభాగము—వీటితాలూకు అన్ని వివరాలు, ఇతరమైన గ్రామపరిస్థితులనూ కూడా కరణం లెక్కలు వ్రాస్తూ ఉన్నట్టున్నూ, ఈ మాదిరిగా గ్రామంలో లెక్కలన్ని సమగ్రంగా వ్రాయడానికి మండలానికంతా ఒకమండలాధికారి ఉన్నట్టున్నూ, అన్నిమండలములతాలూకులెక్కలూ కేంద్రీకరించి అనువత్సరమున్నూ వ్రాయుటకు ఒక రాష్ట్రాధికారి ఉన్నట్టున్నూ ఆనివేదికలో చెప్పుతున్నది. వీటిమూలంగా రాజునకున్నూ, మంత్రులకున్నూ దేశంలోని పరిస్థితులు పూర్తిగా అవగాహనచేసుకోనేటందుకు అవకాశం ఉండేదనిన్నీ, ఈలెక్కలు ఇన్నిచోట్ల ఉండడంచేత, శిస్తులు పన్నులు వసూలుచేసే ఉద్యోగస్థులు అక్రమాలు చేయడానికి ఆట్టే వీలుండేది కాదనిన్నీ, అక్రమం చేసేవారిని వెంటనే పట్టుకోనేందుకు వీలుగా ఉండేదనిన్నీ, ఈ గ్రామపరిపాలనం ఈకారణముచేత మహోత్కృష్టమయినదనిన్నీ ఆ సెలెక్టు కమిటీ నివేదికలో వ్రాసిఉంది. ఈ పట్టుపాటులో ఉన్న కారణంచేత రాజ్యాలు మారినా రాజులు మారినా, గ్రామాలు కాని గ్రామపొలిమేరలుకాని వారసత్వేనా వచ్చే పరివారంకాని ఎన్నడూ మారలేదు. యుద్ధంవల్ల కాని, కరువువల్ల కాని ఒక్కొక్కప్పుడు గ్రామాలు నిర్జనమైనా, గ్రామాలు వాటి పొలిమేరలు ఎన్నడూ మారలేదు. లేచిపోయిన ప్రజ తమ కనుకూలం వైనప్పుడు తిరిగి వచ్చి తమతమతాలూకు ఆస్తులను సర్వావధిగా ఆక్రమించుకోగా, తిరిగి గ్రామపరివారం యథాపూర్వాది వారిని పునస్సృష్టి అయి, గ్రామపరిపాలన యథామూలంగా జరిగిపోయేది.

ఈస్టిండియా వర్తక సంఘంవారు వర్తకానికని ఆఫీసులుగా, వర్తకులుగా, ప్రతినిధులుగా వచ్చి కాలక్రమేణ మన దురదృష్టంచేతా వారి అదృష్టంచేతా రాజ్యాధిపతులయ్యేనాటికి మనరాజధానిలో అమలులో ఉండే పైన వర్ణించిన గ్రామవిధానం వారియొక్క కార్యసాధనానికి అనేకసాధనాలు అభ్యంతరంగా కనిపించేది. కొన్ని కొన్ని సమయాలలో వీరి జబర్దస్తీకి ప్రతిగా గ్రామాలు గ్రామాలు బీడుపెట్టి గ్రామస్థులు ఇతర స్థలాలలోకి వెళ్లిపోయినట్టున్నూ,

గ్రామస్థులమాట తిరిగి చెల్లేవరకూ గ్రామం లో ఒక 'కాసీ' భూమయినా సాగు కానట్టున్నూ, సాగయినా దమ్మిడీ కంపెనీవారికి చెల్లనట్టున్నూ, ఇందువిషయమై కంపెనీ వారు ఇరుగు పొరుగువారల సహాయమో, సిపాయి సిబ్బంది సహాయమో పొంది వ్యవహారాలు చక్కబరుచుకొనుటకు బాధపడ్డట్టున్నూ పాతకాగితాలలో కనిపిస్తుంది. కంపెనీవారు తమరాజ్యం ఇక్కడ చిరస్థాయిగా, పునాదిబలంగా చేసుకోవలెనంటే ఈ స్వతంత్ర గ్రామపరివారంయొక్క పలుకుబడి తగ్గించినగాని ప్రయోజనంలేదనీ కంపెనీ ఉద్యోగస్తులు కనిపెట్టినట్టుగా కనిపిస్తుంది.

ఇది ఈలాగుండగా కంపెనీవారు పద్దెనిమిదివందల ఒకటవసంవత్సర మధ్యేసరికి చెన్నపట్టణం రాజధానంతా అనేకవిధాలుగానున్నూ, అనేకసాధనాలతోనున్నూ తమ స్వాధీనం చేసుకొన్నారు. వర్తకులు చక్రవర్తిపదారూఢులైనారు. రాజ్యాంగవిధానం యొక్క భారమంతా నిర్వహింపవలసిన అగత్యం అనుకోకుండానే వారిమీదకి వచ్చింది. గతశతాబ్దంలో వారు వారి అనుభవములోనికి వచ్చిన మిత్రలాభ, మిత్రభేదాలూ, సంధి విగ్రహాలూ వారివంట బట్టి దేశము యొక్క బలమంతా గ్రామాలలో ఉందనీ, గ్రామాలబలమంతా స్వతంత్ర గ్రామపరిపాలనవిధానంలో ఉందనీ గ్రహించి ఈ పద్ధతిని మార్చడానికి కావలసినయత్నాలు చేశారు.

రాజ్యాంగవిధానంలో ముఖ్యమైనవిషయాలు . రెండు : ఆదాయశాఖపరిపాలన, న్యాయశాఖ పరిపాలన. ఈ రెండింటినీ గ్రామాలలోనుంచి తప్పించినట్లయితే గ్రామాల యొక్క కట్టుబాట్లు తప్పి వాటియొక్క పలుకుబడి తగ్గుతుందని ఆ కాలపు శాసనకర్తలు గ్రహించినట్లు తోస్తుంది. శిస్తులు వసూలు చేయడానికీ, తీర్పులు కూడా గ్రామం మొత్తంమీద ఇవ్వవలసిన రాజభాగాన్ని గ్రామపెత్తనదారుకర్ణరనుండి వసూలుచేయడానికిమాత్రం ప్రభుత్వంవారు ప్రసక్తి కలుగజేసుకొంటే గ్రామంలో ఉన్న జనుల సాంఘిక బలం, ఐకమత్యం అట్లాగే ఉంటాయి. కంపెనీ వారు వచ్చి 'సివిలు వ్యాజ్యా' లకు లేదనే, పన్ను సివ్యవహారాలనుగురించీ, వసూలు కష్టసుఖాలనుగురించీ గ్రామ పంచాయతీలతో సంబంధం లేకుండా గ్రామస్థులయొక్క అభిప్రాయాలను గ్రహించకుండా అవసరంలేకుండా భిన్నంగా ప్రభుత్వంవారిచేతనే నిర్వహించుకొనవచ్చుననీ, గ్రామస్థులతో సంబంధం అక్కర లేకుండా కొత్తగా నిర్మించే న్యాయస్థానాలలో వివాదాలు పరిష్కరించుకోవచ్చుననీ ఏనాడయితే గ్రామస్థులతో అన్నారో ఆనాడే గ్రామపరిపాలనవిధానానికీ, పూర్వమునుంచీ వస్తూవున్న గ్రామాల కట్టుబాటుకీ ఒక గట్టిదెబ్బ తగిలింది.

ఒకపది, పదిహేనుసంవత్సరాలు మాత్రం ఈ రయితువారీపద్ధతి గ్రామం మొత్తం మీద జరగాలనా? లేక ప్రతిరైతూ కారైతుకు విడదీసి, ఏపొలానికి ఆ పొలం విడమర్చి వ్యక్తిగతంగా జరగాలనా అని ప్రభుత్వోద్యోగుల లో తీవ్రమైన వివాదాలు జరిగాయి. కొంతమంది ఉద్యోగస్తులు అనుస్యూతంగా వచ్చే పాతపద్ధతి, అనగా గ్రామ మొత్తం పైనే వ్యవహరించడం మంచిదని వాదించారు కొంతమంది గ్రామసంఘాలను విడదీసి ప్రత్యేకంగా రైతులతోనే వ్యవహరించడం మంచిదనిచెప్పి వాదించారు. ఈ రెండవపరికంవాదన చేసిన

వారిలో ముఖ్యులు చిన్నపట్టాభిరామారెడ్డిగారు. ఆ రోజుల్లో ఇప్పుడు గ్రహాంగా కలిసి వున్న సర్ థామస్ మన్రో. ఆయన పుట్ట మొదట కలెక్టరుగా ఉండి, తరువాత ఇంగ్లండుపోయి తిరిగి గవర్నరుగా వచ్చి, రైతువారీపద్ధతిని అమలుపరచి ఆ పద్ధతిలోను జమీందారీపద్ధతి చిన్నపట్టాలు కనుపోగా, స్థాపన చేశాడు. ఇంతకుపూర్వం ౧౮౧౬-వ సంవత్సరంలో ప్రకటించినాడు గ్రామపంచాయతీలను ఏర్పాటుచేయించి, జిల్లా న్యాయస్థానాలను, సివిల్ న్యాయస్థానాలను నిర్మాణం చేశాడు. "నా సుఖముకోసం నా గ్రామంలో నా ఇష్టము కనిలేదు. నాకు ప్రతిపత్తి వారున్నారు. నాపొలం పండినా పండకపోయినా ఆ కష్టసుఖాలు నావేకాని నా గ్రామంలో ఉండువారి నాతో జోక్యం కలుగజేసుకోరు; వారి జోక్యం నాకూ అక్కరలేదు. నా ఆస్తి విషయమై ఏమయినా తగాదాలు వస్తే ఈ గ్రామస్థులతో నా కేసు విని జిల్లాకోర్టులో, సదరుకోర్టులో, ప్రివీకౌన్సిల్లో నా హక్కులను కాపాడుకుంటా" అనేటటువంటి స్వతంత్రమైన భావం కలిగి సాంఘిక అన్యోన్యత్వ భావాన్ని పెంపొందించాలి. దురదృష్టవశాత్తూ రాను రాను మనం ఇప్పుడు అనుభవిస్తూ ఉన్న పరిస్థితి. ప్రతి జిల్లా ముఖ్యపట్టణానికీ పల్లెటూళ్లో ఉన్న ప్రజ చిన్నతగాదాలకైనా వస్తేనే కాని పరిష్కారం కాదు. పట్నంలో వచ్చే అనేక వ్యవహారాలు, వివాదాలు గమనించినట్లయితే నూటికి ౯౦ పాళ్లు గ్రామపంచాయతీలు ఉన్నట్లయితే అక్కడ పరిష్కరింపవలసిన విషయంలేకాని అంతకన్న పెద్దవియునవి కావు. ఇంతేకాదు; గ్రామంలో వచ్చే వివాదాలను పరిష్కారంచేయడానికి బుద్ధికుశలతా, వస్తుపరిశీలతా, న్యాయవిచక్షణా, అవకాశమూ గ్రామస్థులకే ఉందని నా అభిమతం. ఫలాని మెరకతగాయిదాలా, పటేలుగాయిదాలు, ఆస్తుల అన్యాయ ఆక్రమణలు, ఇచ్చిపుచ్చుకోవడాలు? — ఇందులో వ్యవహారాలయొక్క నిజానిజం తెలుసుకొనుటకు ఊరు దాటి బయటికి రావలెను? బయటికి ఎంతదూరం వస్తే నిజానికి అంతదూరం అవుతాము. కొంతమంది మిత్రులు 'ప్రీవీకౌన్సిలువారుకూడా నిర్ణయించలేనటువంటి న్యాయసూక్ష్మాలు ఉంటాయిగదా, వాటిని పల్లెటూరి పంచాయతీలు ఏరీతిగా నిర్ణయించగల'వని సందేహపడుతున్నారు. వ్యవహార సూక్ష్మజ్ఞానము, శాస్త్రవిచక్షణగలవారు లేకుండా, వారివారి వాదాలు లేకుండా ప్రీవీకౌన్సిలువారుసహితం ఒక్క తీర్పుకూడా చేయలేరు. అలాంటప్పుడు వివాదస్థలంలోనికే వచ్చి, వివాదంయొక్క వివరాలన్నీ తెలిసిన పంచాయతీవారు ఆ న్యాయసూత్రసూక్ష్మాలని చెప్పడానికి చదువుకొన్నవారి సాయం అక్కరలేదు. ఆస్తులు కలవారు, అనుభవించేవారు, తమయొక్క కష్టనష్టాలను భరించేవారు తమ హృదయంలో గ్రహించలేనట్టి న్యాయసూక్ష్మం ఉందని నే ననుకోను. ఈ కారణంచేత రాజధానిలో గ్రామపంచాయతీలను ఏర్పరచి, గ్రామంలో వచ్చే వివాదలను వాటి తీర్మానంకోసమే వదలివేయడం మంచిదని నా నమ్మకం.

న్యాయస్థానాలనుగురించి హెచ్చుగా చెప్పడానికి కారణం ఏమనగా, దేశంయొక్క జీవనానికి, జీవనప్రవాహానికీ, ప్రజాసమ్మేళనానికీ న్యాయస్థానము లున్న సగ

రాలే ముఖ్యస్థలాలు. అట్టి నగరాలలోనే వాటి నానుకొని ఇతరసంస్థలన్నీ బయలు దేరుతాయి. ఆ కారణంచేతనే పల్లెటూరి పంటా ఫలితమూ ఇట్టి నగరాలకు వచ్చి పని యోగమవుతోంది. పట్టణంలో ఉన్న సంస్థలు బలుస్తాయి; పల్లెటూళ్లు చిక్కుతాయి. చిక్కినంతమాత్రాన అంత విచారం లేదు. గ్రామం యొక్క కట్టుబాటే తప్పిపోతుంది; తప్పి పోయింది ఈపద్ధతి ౧౮౦౩ - వ సంవత్సరంలోనే ఆరంభమయింది. అందుచేత తిరిగి మన దేశానికి స్వప్రభుత్వమున్నట్టయిన పల్లెటూళ్ల సౌభాగ్యం పెంపవలెనంటే వాటిన్యాయ స్థానాలను మాటి కప్పజెప్ప చేయాలి. న్యాయ స్థానాలు తప్పించడమువల్ల గ్రామాలు చెడే యన్న సంగతి కేవలమున్నూ నావంటి గ్రామ జీవనాభిమానుల అభిప్రాయమే కాదు. ౧౯౦౯ - వ సంవత్సరంలో పార్లమెంటు వారు 'డీసెంట్రలైజేషను కమిటీ' అని ఒక సంఘాన్ని ఏర్పరిచారు. అందులో సభ్యులు ఒక్క రమేశచంద్రదత్తు తప్ప మిగిలిన వారందరూ ఇంగ్లీషువారే. వారు మన చరిత్ర చిత్తగించి, 'ఎప్పుడైతే పంచాయతీల బలమణచి, జిల్లాన్యాయస్థానాలను పైకెక్కించారో ఆనాటినుంచే పల్లెటూళ్లసౌభాగ్య మడగినదని వ్రాసిఉన్నారు. ఆ కారణంచేత మీద నే చేసిన మనవి అన్నిపక్షములవారూ ఆలోచించదగ్గదే.

ప్రస్తుతం మన రాజధానిలో భూమిపైని రాబడి దగ్గర దగ్గరగా ౭ ౩ కోట్లు అయి వుంది. ఇది వసూలు చేయుటకు, లెక్కలు వ్రాయుటకు సుమారు ౩౩ వేల మంది కరణాలు, రమారమి అదే సంఖ్యగల మునసబులు ఉన్నారు. ఇతరులైన కొందరు గ్రామోద్యోగస్థులుకూడా ఉన్నారు. వీరి జీతాల క్రింద సంవత్సరమునకు దగ్గరదగ్గరగా కోటి ఇరవైలక్షల రూపాయలు ఖర్చవుతోంది. పైగా రెవిన్యూఉద్యోగస్తులు, తాశీల్దారులు, డిప్టీకలెక్టరులు, కలెక్టరులు, పిరిపైని బోర్డాఫ్ రెవిన్యూవారు ఉన్నారన్న సంగతి కూడా అందరికీ తెలిసిందే. మొత్తం యీవత్తు సిబ్బంది సంవత్సరమునకు ౨ కోట్ల ౭౦ లక్షల రూపాయలు ఖర్చవుతోంది. తాశీల్దారులు డిప్టీకలెక్టరులు, కలెక్టరులు కేవలం రెవిన్యూసంబంధమైన కార్యాలేకాక ఇతరమైనటువంటి కార్యాలుకూడా చేస్తూఉండడం వల్ల వీరి ఖర్చంతా కేవలం రెవిన్యూ వసూలుకే కాదని చెప్పినా మొత్తంమీద ఈ ౭ ౩ కోట్లు వసూలుచేయడానికీ ౧ కోటి ౫౦ లక్షలు పైగా వసూలు ఖర్చు అవుతోందని చెప్పవచ్చును. ప్రజాస్వాతంత్ర్యం రాష్ట్రంలో వచ్చిందని చెప్పేవారు రెవిన్యూ వసూలుచేయడానికిమాత్రమే ఇంత ఖర్చు అవసరమా అని అనిపిస్తోంది. ఇది తగ్గించుటకు మార్గము లేదా అని సంశయం కలుగుతోంది.

పూర్వకాలం గ్రామపరిపాలనపద్ధతిలో గ్రామాలలో పండిన పంటలోనుండి మొట్టమొదట గ్రామోద్యోగస్థుల కివ్వవలసిన భాగం కొలిచిపెట్టినతరువాత రైతుభాగం రైతుకీ, రాజభాగం రాజుకు అప్పజెప్పేవారు. గ్రామఉద్యోగస్థులకు తమపని చేయడానికిగాను మాన్యాలు వంశపారంపర్యముగా వచ్చేవి ఉండేవి ప్రస్తుతం ఈపద్ధతి పోయింది. గతశతాబ్దం మధ్యభాగంలో అమ్ముటకు, కొనుటకు కానటువంటి ఆస్తి నిజమైన ఆస్తి కాదనేవాదం ప్రబలి, సర్వీసుమాన్యాలన్నీ

అమ్ముకొనే హక్కు లేకుండా అవి నిజమైన ఆస్తులు కావని భ్రమించి గ్రామనౌకరులు ఉద్యోగస్థులు అంతవరకు తమ ఈనాములను 'ఎక్స్ ఛేంజ్' చేసుకొన్నారు. ఆ కారణంచేత అనేకగ్రామాలలో నౌకరీభూమి ఒకరిచేతులోను, నౌకరీ మరొకరిచేతులోను ఉండడం తటస్థించి, ఆ స్థితిలేనివారు గ్రామోద్యోగాలు చేస్తూంటే వారికి కష్టంగా ఉండి, భుక్తికి చాలకా అనేకచోట్ల వారు తగాయిదాలు కల్పిస్తున్నారనే ఆరోపణలూ, గ్రామాలలో తగాయిదాలూ హెచ్చుగా మనకు ప్రస్తుతం అనుభవవేద్యంగా ఉన్నాయి. గ్రామాలు ఈ విధంగా పాడయితే, గ్రామాలరాబడి వసూలుచేయడానికి రైతుల యొక్క కష్టార్జితంలో గణనీయమైన భాగం దానంతావసూలు ఖర్చుక్రింద తగులుపోయి నట్లయితే ప్రజల ఉపకారార్థం పనులు చేయడానికి ఏమాత్రం ధనం మిగలగలదు? ఈ సమస్య రానురాను ఇంకా తీవ్రరూపం వహిస్తుంది; ఎందుచేతనంటే, ఎక్సైజువల్ల వచ్చే రాబడి, ఇక రెండు మూడు సంవత్సరాలలో అంతరించిపోతుందంటే, న్యాయస్థానాలలోనుంచి వచ్చే రాబడి కూడా న్యాయంగా తగ్గిపోవలసి వస్తే, మన రాజధానిలో రావలసిన రాబడి అంతా భూమిపైనే ఆధారపడిఉంటే, మన పల్లెటూళ్లలోనుంచి వచ్చేటటువంటి రాబడి పల్లెటూళ్లపైనే ఖర్చుపెట్టవలసిందని ప్రజల యొక్క ఆందోళనకూడా బయలుదేరుతూ ఉన్న ఈకాలంలో వారికి హెచ్చుగా ఉపకారంకాని సంస్థలను పట్టణాలలో మనం ఎన్నింటిని పెంచగలం? ఈకారణంచేత పల్లెటూళ్లకు కావలసినటువంటి ఆదాయవ్యయాలన్నిటినీ కూడా గ్రామపంచాయతీలు నిర్ణయం చేసుకుని, రాజధానియొక్క రాజకార్యాలకూ రక్షణకూ కావలసినధనం రాజధాని బొక్కసానికి ఇచ్చి, మిగిలినది తమగ్రామాలలోనే ఉంచుకొన్నట్లయితే పన్నులవసూలు ఖర్చులు, ఆవచ్చినపన్నును ట్రెజరీలకు పంపించేఖర్చులు, ట్రెజరీలనుండి తిరిగి గ్రామోద్యోగస్థులకు వేతనాలు ఇవ్వడానికీ పుచ్చుకోవడానికీ అయ్యేఖర్చులూ తగ్గుతాయి. ఎంతవరకు ఖర్చులు తగ్గుతాయో అంతవరకు ప్రజలఆదాయం హెచ్చయినట్లే మాట. ఈవిధంగా గ్రామాలు తమఆదాయవ్యయ వ్యవహారాలను తామే చూచుకొంటూ తమ పంచాయతీలలో గ్రామాలలో ఉన్న ప్రజల తాలూకు వివాదాలు పరిష్కారం చేసుకొంటూ ఉంటే తిరిగి గ్రామంలో నూతనమైన పటుత్వం కలుగుటకు తప్పకుండా అవకాశ మేర్పడుతుంది.

పంట పండించినంతమాత్రంచేత తమ పని సౌఖ్యంగా నెరవేరుతుందని గ్రామస్థులనుకోరాదు. పండినపంట చెలామణీఅయ్యే పద్ధతీ, పంటసమయంలో ప్రజలకు కావలసిన పరపతీ లేకున్నట్లయితే వీలులేదు. ఆకారణంచేత గ్రామసహకారసంఘాలు అన్ని అధికారములతోను ఉండినగాని గ్రామంయొక్క జీవనం పరిపూర్ణత పొందనేరదు. ఇందుకుగాను ప్రస్తుతం అమలులో ఉన్నటువంటి సహకారసంఘాలయొక్క పద్ధతులను, సూత్రములను ప్రభుత్వమువారు మార్చవలెను. ఈవిషయమై మార్పు వీలగునని నా గట్టినమ్మకము. వీలు కాదనేవారు కొందరుండడం చేత ప్రస్తుతం తూర్పు గోదావరిజిల్లా ఆలమూరులో ఇటువంటిసంఘం, 'మల్టి పర్పస్

కో ఆపరేటివ్ సొసయిటీ ఒకదాన్ని ఈ మధ్యను సాగిస్తున్నారు. దానికి ప్రభుత్వంవారి అనుమతీ సహాయంకూడా ఉన్నది.

ఈ వ్యవహారములు కాక గ్రామస్థుల యొక్క క్రయవిక్రయాది వ్యవహారములను ఖాయపరుచుటకు, నికరపరుచుటకు రిజిస్ట్రేషను చాలా ముఖ్యమైనది. ముఖ్యమైనదే కాని దీనితాలూకు కచేరీలు పట్టణాలలో నుండవలసిన, దూరస్థములయిన పల్లెటూళ్లి నుండి ప్రజలు తమతాలూకు కాకితాలను రూఢిపరుచుకొనుటకు ఆపట్టణాలకు రావలసిన అగత్యం ఏమిన్నీ కనిపించదు. గ్రామంలో అయినవ్యవహారం, గ్రామంలో ఉన్న క్రయస్థలం, వ్యవహారం చూచిన సాక్షులు గ్రామంలో ఉన్నవారు అవడంచేతను ఆగ్రామపంచాయతీయే అటువంటి రిజిస్ట్రేషనుచర్య జరుపుటకు తగిన సంస్థయై ఉన్నదని నాఅభిప్రాయం. కాగితములు దాచుటకుమాత్రం పట్టణములలో కచేరీలు ఉన్న చాలు.

మన రాజధానిలో ౫౦,౦౦౦ లకు పైగా గ్రామాలున్నాయి. ఈ గ్రామాలు ప్రతిదానికీ పంచాయతీ ఉండవలసినదని నా అభిప్రాయం కాదు. తగినంత రాబడి సముపార్జన చేసుకొనగలిగే ఏనాలుగైదు గ్రామములో అవసరముకొద్దీ కలిపి ఒక పంచాయితీగా ఏర్పడవలెనని నాఅభిప్రాయము. పైని వివరించినట్లు గ్రామ పన్నులవసూలు ఆస్తుల తగాయిదాల పరిష్కారములు, పంటదినుసుల చేర్చి కొనుట, విక్రయించుట, గ్రామస్థులకు కావలసిన ఇతరమైనటువంటి సహకార సహాయములు, గ్రామస్థులు చేసుకొనే దాన, ధమన, విక్రయాది కార్యములను రూఢిపరిచే కాగితాలను రిజిస్ట్రీచేయుట గ్రామాలలోనే జరుగుతూవుంటే గ్రామస్థులు తమ వ్యవహారముల పరిష్కారమునకు పై పట్టణాలకు పోనక్కరలేదు. అక్కరలేని కర్చువెచ్చములు పెట్టనక్కరలేదు. పట్టణవాసాల వెంట వచ్చి తమ పరిసుభ్రతను నగీరారోగ్యములను పాడుచేసుకోనక్కరలేదు.

రాష్ట్రవిషయాలలో ప్రభుత్వానికి ప్రస్తుతం ఏయేఅధికారాలు ఉన్నాయో గ్రామాల అంతర్వ్యవహారాలకు సంబంధించినంతవట్టుకు ఆయాఅధికారాలను గ్రామాలకు సంక్రమింపజేయడమే ఈస్వతంత్ర గ్రామపరిపాలన విధానముయొక్క లక్ష్యం.

ఈవిధంగా గ్రామపంచాయతీలు నేర్పరిచి, వాటికి స్వతంత్రాధికారములను ఇచ్చినట్లయిన ప్రజాబాహుళ్యము హెచ్చుగా ననుటకు సందేహ మేమిన్నీ లేదు. చిన్నపట్టణంలో ఉన్న రాజధానిమంత్రివర్గంవారికి రాజధాని యొక్క మొత్తం అభివృద్ధినిగురించి తగినంత కృషిచేయుటకు ఆలోచనావకాశములు కలుగును; ప్రజలహక్కు - ప్రజలకు చేకూరును. ప్రజలు తమఅధికారము సూచిత్తున్నా పోటుపూర్వకంగా కాంగ్రెసువారికి నచ్చచెప్పి నిలవబెట్టేసి యీకొత్త భవసమస్యమందు ప్రజలస్వాతంత్ర్యం నిర్వాహముచేసి వారి యొక్క అభివృద్ధి ముఖ్యలక్ష్యంక్రింద పెట్టుకొని స్వతంత్ర గ్రామపరిపాలనవిధానాన్ని అమలులోకి తెచ్చుట ప్రథమకర్తవ్యమని మనప్రభుత్వంవారు గుర్తించుట ప్రశంసనీయము; కల్యాణసూచకము.

——— * -

సేవాధర్మం

'[illegible]కుమార్'

అనుకున్న ప్రకారం [illegible], జనవరి నెల ౨౧ తేదీ సోమవారం ఉదయం ఎనిమిది గంటల రైలులో దిగి, టాక్సీమీద ఇంటికి వచ్చాడు — హాతిసింగు. ముందుగా హాతిసింగు టాక్సీ కారూ, ఆ వెనక మోటారు సైకిలులో అతని సామానూ, [illegible] మరొకటి ఇంటి కాంపౌండులోకి వెళ్ళి గుమ్మం ఎదురుగ్గా నిలబడినవి.

ఆరడుగుల ఎత్తు ఆజానుబాహువు మనిషి! ఎర్రగా కాగిన రాగిబిళ్ళలాంటి ముఖం, ముఖంలో పైకి దువ్విన నొక్కుల జుట్టు, ఎర్రజీరగల పెద్ద నేత్రాలు, దట్టమైన కనుబొమలు, నిటారైన నాసిక, నిగనిగలాడే రాగిరంగు [illegible] మీసం, ఛాతీ మిలిటరీ సూటూ, మోకాళ్ళవరకూ కప్పివేసిన ఫుల్ బూట్లూ, నెత్తిన రాజపుత్రపాగా, నడుముకి బెల్టులోనూ జుండాపెట్టుగా తోలుబెల్టూ — అచ్చం యుద్ధభూమిలో ఉరకలు వేసే [illegible] రయిన యోధుడులాగా, మోటారు కారులోనుండి బయటికి వచ్చి వరండా ఎక్కాడు — హాతీసింగు. భార్య రూపారాణి ముఖంలో అంత ఉత్సాహమూ, ఆనందమూ వెల్లివిరియక పోయినా పెదవులమీది చిరునవ్వుతో భర్త నాప్యాయంగానే స్వాగతం ఇచ్చింది.

కాని కొడుకు రామసింగుమాత్రం కనపడడు!

వరాండాలో నిలబడి కాంపౌండు ఆవరణ నాలుగుమూలలూ కలయజూచాడు సింగు. ఓ! అయిదేళ్ళ క్రిందటి స్థలం లాగా లేదు. అప్పటి చిన్న చిన్న పూలమొక్కలు ఇప్పుడు పెరిగి పెద్దవై విరబూసిపోతున్నవి. మరి తన కొడుకు రామసింగు ఇప్పటికి ఎంత ఎత్తు పెరిగినాడో! అతనిఛాతీ ఎన్ని అంగుళాలు వికసించిందో!

కొత్తరకం పూలచెట్లూ ఫలవృక్షాలూ చాలా బయల్దేరినవి ఆవరణలో. తలపైకెత్తి ఇల్లూ, హాలూ, మిద్దె నాలుగువంకలా పరకాయించి చూచుకున్నాడు. తృప్తిపడ్డట్టుగానే ముఖం సంతృప్తి సూచించింది.

లారీలోని సామాను నౌకర్లు ఒక్కొక్కటే దింపి హాల్లో పెట్టుతున్నారు. భద్రంగా దింపవలసిందని వరాండాలో నిలబడి నోటిలో 'స్మోకింగ్ పైపు' పెట్టుకొని నౌకర్లను హెచ్చరిస్తున్నాడు — హాతిసింగు.

"నా ఉత్తరం అందిందా?" అని భార్య నడిగాడు.

"అందకేం. అన్ని ఉత్తరాలూ అందుతూనే ఉన్నవి." అని సమాధానం చెప్పింది భార్య.

"అబ్బాయి ఏడీ?—"

"ఇప్పుడే బజారులో ఏదో పని ఉన్నదంటూ వెళ్ళేడు."

"నే నీరైలుకు వస్తానన్న సంగతి వాడికి తెలుసా ?—"

"అన్నీ తెలుసు—" అంటూ లోపలికి చక్కా వెళ్లింది రాణి.

సామానంతా కిందకి చేరినతర్వాత హాతీసింగుకూడా లోపల ప్రవేశించి, పడక కుర్చీలో 'పైపు' పీలుస్తూ పండుకున్నాడు.

ప్లేటులో కాఫీ టిఫిన్ పెట్టుకొని వచ్చి ఎదుట బల్లమీద పెట్టింది — భార్య.

"అబ్బాయి దగ్గర్నించీ, నీ దగ్గర్నించీ ఆరోగ్యంగా ఉంటున్నదా ?—"

"ఆహా !—"

"వాడు బాగా చదువుకొంటున్నాడా?"

"అదే చదువు. ఎక్కడికి బాగా, రాగానూ."

"ఈ సంవత్సరం ప్యాసవుతాడుగదా?"

"అదృష్టమనేది ఉంటే అవాలి మరి."

"డేరాడూన్ కాలేజీలో సీటు దొరికే ఏర్పాట్లన్నీ చేసివచ్చా! ఈ సంవత్సరం గనక ఈక్లాసు ప్యాసయితే పై సంవత్సరం వాణ్ణి మిలిటరీ కాలేజీకి పంపివేస్తా."

"ఆ మొఖానికి బాగుపడే రాత ఉండొద్దూ—"

"వాడికి ఉండకపోవడమేమిటి? తండ్రిని మించిన కొడుకవుతాడు చూడు —"

"ఏమో, నాడికి మిలిటరీసర్వీసు అంటే, అంత ఇష్ట మున్నట్టు తోచదు."

"తోచక ఏమంటాడేమిటి ?"

"ఏమున్నది అనడానికి. మీరు రాసే ఉత్తరాలన్నీ ఎప్పటికప్పుడు చూపెడుతూనే ఉన్నాను. కాని వాడిఉద్దేశ్యమేమిటో, ఉలకడు, పలకడు—"

"వాడి ఉద్దేశమేమిటో ఒకసారి అడిగి తెలుసుకోలేకపోయావా ?"

"సరే! వాడసలు చెప్పినమాట వింటున్నాడా ఏమిటి? ఒక్కగాక ఒక్క కొడుకయినందువల్ల, ఆపదాన్ని ఏమీ అనడానికి నాకు నోరాడకపోయె! తండ్రి అయిన మీరెక్కడో ఏడు సముద్రాల అవతల పరదేశంలో ఉండిపోతిరి. పసిపిల్లవాడు గనకనా! ఇద్దాద్యాజ్యం అయిపోయింది, వాడి వ్యవహారం—"

నాస్తిమీరాడ పాగా తీసి కొయ్యమీద పెట్టి, కోటు విప్పుతూ—

"అల్లాగా—" అన్నాడు హాతీసింగు.

"అబ్బాయీ! పెద్దవాళ్లమాట కాస్త విను నాయనా! అంతదూర దేశంలో ఉద్యోగం చేసుకొంటూ తండ్రి అహర్నిశలూ నీమీద ప్రాణాలు పెట్టుకొని ఆరాటించిపోతున్నాడు. చెప్పినట్టు వింటే నిన్నింతటివాణ్ణయినా చేయగలరు. నీ చదువేమో, నీ వ్యవహారమేమో, అంతే తప్ప రెండో వ్యాసంగానికి పోవద్దు నాయనా— అని కౌగిలించుకొని చెప్తాను—"

"ఊఁ —" అని కనుబొమలు దగ్గర చేర్చాడు సింగు.

"నాన్ కో ఆపరేషనూ, వల్లకాడూ— ఇట్లాంటి విపర్యాసాలు బయల్దేరి బంగారం వంటి కుటుంబాలని నాశనం చేసేస్తున్నవి.

ఏమో స్వరాజ్యమాట, [illegible]మాట, ఖద్దరుట, కష్టాలట — [illegible] వేధించి వేస్తోంది. [illegible] —".

"ఏమిటీ?" అని [illegible] అడిగాను [illegible].

"ఏమి [illegible]? [illegible] మనిషులు [illegible]. మరి మీరు [illegible], [illegible], మీ కేమయినా [illegible], నా వల్ల కాలేదు [illegible] —".

"మరి [illegible] ఎందుకు [illegible]?"

"ఏమని [illegible]? [illegible] అబ్బాయి [illegible] మీకు [illegible], [illegible] లేనిపోని [illegible] కాలేదుసుమా."

"........................"

"[illegible], [illegible] ఉన్న మీ[illegible]?"

"[illegible] ఇంటికి?"

"ఏమో! వాడికి ఇల్లూ వాకిలీ [illegible] ట్టిందా? మాలకాకి తిరిగినట్లు ఊరుమీంట ఒక టే తిరగడం. వేళకు అన్నమైనా తినడం మానే శాడు. నాలుగు మెతుకులు నోటికి [illegible]. ఇవ్వాళ ఏమో "ఇండిపెండెన్స్ డే" అట. బడికి పోకుండా పిల్ల కాయలందరూ సమ్మెకట్టారట. బజారులో సీమగుడ్డలు కొనవద్దని బడిపిల్లలు పికెటింగు చేస్తారట. తెల్లవారకుండా నే

నిద్రమంచంమీదనుంచి లేచి వెళ్లాడు— ఏమని చెప్పనూ?—"

"ఇండిపెండెన్సు డే ఏమిటీ?"

"ఈ దేశానికి స్వరాజ్యం వచ్చిన రోజు, [illegible] అట కాదూ! నాకేం తెలుస్తాయి, [illegible] ఆడ దానికి—"

"స్వరాజ్యమా!—"

"అయ్యో! మీరు వినలేదుకాబోలు! [illegible] దేశాల్లో తిరిగే మీ కేం తెలు [illegible]? ఈ అగడా అగడం కాదు. [illegible], [illegible] మాన్పిస్తారట! ఉప్పు [illegible] చేస్తారట! సీమగుడ్డలు లేకుండా [illegible]స్తారట! జైళ్లకు వెళ్లుతారట! తెల్లదొర [illegible] ఈ దేశంలో ఉండకుండా తరిమివేస్తా రట! ఏమి అల్లరి, ఏమి అల్లరి!"

"[illegible]!—"

"[illegible], [illegible], యుద్ధాలూ, [illegible] — వీటికి [illegible] లేదట. ఏమిటో [illegible] సత్యాగ్రహమట! [illegible]! జైళ్లట— [illegible] లేను."

"పిల్లకేమయినా [illegible] ఉంటుందా" అను కొంటాను. ఎక్కడికి పోయాడు వీడూ? మనిషిని పంపి ఒక్కసారి పిలిపించు తొంద రగా—".

"ఎక్కడ ఉన్నాడని పిలిపించనూ. [illegible] ముసలిదగ్గ! కాంగ్రెసు ఆఫీసుదగ్గ రనో, ఎక్కడనో ఉంటాడు. గాని అబ్బాయి గారిని, నాన్నగారు వచ్చారని పిలుచు కొనిరా—" అని నౌకరును పంపింది రాణి.

పడకకుర్చీలో కాళ్లు చాచి పండుకొన్నాడు — సింగు.

"వస్తాడు గాని, వాణ్ణేమీ అనకండి. మళ్లా మీరంటే పిల్లి అయిపోతాడు. ఏదో కాస్త నయానా, భయానా మీరు చెప్పితే వింటాడు. వాడికోసర మేమయినా కొత్త వస్తువులు తెచ్చిపెట్టితే, వాటి నిచ్చి కాస్త సంతోషపెట్టండి వాణ్ణి."

"వాడికోసరం ఎన్ని తెచ్చానో చూపిస్తా చూడు —" అంటూ, తెచ్చిన ప్యాకెట్లన్నీ విప్పడం మొదలుపెట్టేడు సింగు. యుద్ధంలో ఉపయోగించే రకరకాల ఫిరంగులూ, బాంబులూ, ఏరోప్లేనులూ, ఇట్లాంటి ఆయుధాలు చూపించే బొమ్మలూ, భూమిమీదా, నీళ్లల్లోనూ, గాలిలోనూ యుద్ధంచేసే మహాయోధుల ఫోటోలూ, అబ్బాయికిగాను తెచ్చిన ఒక కొత్తరకం చిన్నసైజు రైఫిలూ, మిలిటరీసూటూ, హెల్మెట్టూ — ఇట్లాంటివి ఎన్నెన్నో, తెచ్చిన వన్నీ ఒక్కొక్కటీ తీసి భార్యకు చూపెట్టుతున్నాడు — సింగు.

వాటిని చూచి,

"బొమ్మలూ, ఫోటోలూ చూస్తే జ్ఞాపకం వచ్చింది. ఒక్కసారి మేడమీదికి వెళ్లి అబ్బాయిగది చూచిరండి తెలుస్తుంది. ఇట్లాంటి ఫోటోలూ, బొమ్మలూ, వాడు చేత్తో తాకనయినా తాకుతాడా?"

అంటూనే హాతీసింగూ, ఆమే మేడమీదికి వెళ్లేరు.

"ఏమిటీ ఫోటోలూ? ఎవరివి ఇవి?"

"ఈ మహానుభావు లందరూ దేశనాయకులట! అదిగో ఆభోసినోటి — ఆయన్ని మీరు ఎరిగే ఉంటారుగదా!"

"ఆహా! ఎరగ కేమీ? పుట్టాడు, దేశాలు నాశనం చేయడానికి!—"

"కాదుగదా, ఈ బొమ్మ జవహార్లాలు గారట. ఇది ఆయన తండ్రిగారిదట! అదేమో బెంగాలీ ఆయనదట! పేరు నాకు జ్ఞాపకం లేదు. అదిగో! అఫ్ఘన్ గాంధీనో, గిటో అనో చెప్పాడు. ఎవరికి జ్ఞాపకం? అసలు నాకిష్టంలేక ఈ మేడమీదికి రావడమే మానేశాను."

"ఇంత ఘోరం జరుగుతున్నదని నాకు తెలియనే తెలియదుసుమా! అయ్యయ్యో! ఇట్లాంటి ఫోటోలు, మన ఇంట్లోకి ఎందుకు రానిచ్చావు? కొంప మునుగుతుందే!"

"నేను రానిచ్చేదేమిటి? వాణ్ణి గాని అడగండి మీకే తెలుస్తుంది, వాడి వాలకమూ, వైఖరీని. అదుగో! గోడమీది ఈ ఫోటో చూడండి, మీ అబ్బాయి ఎంత బాగున్నాడో తెలుస్తుంది—"

"ఏమిటీ! వీడు మనరాముడూ?"

"నెత్తిమీద ఆ ఖద్దరుటోపీ, అల్లాగా ఆ లాల్చీ, ఆ వేషమూ స్తుకోటూ — ఇట్లాంటి దరిద్రాలికి ఐశ్వర్యాలు పట్టుకుంటే ఎట్లా పట్టునని?"

అదివరదాకా ఏమో అనుకొని కొంత చులకనగా వింటూవచ్చాడు — హాతీసింగు. కాని, అబ్బాయిగదిలో అడుగుపెట్టేవరకతనికి పంచాగ్నులమధ్య నిలబడ్డట్టయింది. వ్యవహారం ముదరి తన చేతికి మించిపోయినట్టు అనిపించింది. తాను వేసుకొన్న ప్లాను ఒక్కటికూడా తుదముట్టేటట్టు అతని కేమీ నమ్మకం కలగలేదు. అయిదేళ్లక్రిందట చూచిన పిల్లవాణ్ణి చూడాలని ఆతురపడ్డాడు.

కాని విషయాలన్నీ స్వయంగా చూచేవరకు, అతనికి కొడుకుమీద పట్టరాని ఆగ్రహం బయల్దేరి, శరీరం ముచ్చెమటలు పోసింది. పది ఎట్లాగున్నా, మిలిటరీ ఉద్యోగి అయిన తన ఇంట్లో ఆ కాగితాలు ఉండడం మరీ ప్రమాదకరం! అబ్బాయి విషయం తర్వాత నిదానంగా ఆలోచించుకోవచ్చునని, మేడమీదున్న గదిలో కాగితాలన్నీ ఒక్కొక్కటే తీసి, కింద రహస్యంగా దాచిపెట్టాడు.

కొడుకుని కాపాడాలని అంతరంగంలో కలిగిన ఆ ప్రేమా, ఆ అసురమైన ఆగ్రహం లోకి, ఆగ్రహంలోనుంచి క్రమంగా భయం లోకి దిగింది మనసు.

కాని, అంతంత గొప్ప మిలిటరీ యోధుడయినా ఏమాత్రం ఏమి చేయగలడు? తన ప్రతాపం, ఇంటిదగ్గర ధైర్యసాహసాలన్నీ సమయానికి పనికిరాకుండా పోయింది. రామసింగయినా సమయంలో ఉంటే ఆ ఉద్రేకంమీద నోటికి వచ్చిన తిట్లన్నీ తిట్టడమో, లేక, అతగాడి చెంపలు వాయించి నాలుగు అంటించడమో, ఏదో శిక్ష విధించి కొంత మనశ్శాంతి కలిగించుకొనేవాడు — కాని దానికైనా అవకాశం లేకుండా పోయింది.

భర్త వైఖరి చూచేసరికి లోపలే భయం ఆరంభించింది. ఆయన స్వయంగా వచ్చినప్పుడయినా, జరిగినవిషయాలు జరిగినట్లు ఆయనకి చెప్పకుండా దాచిపెట్టడానికి ఆమెకెట్లా వీలౌను?

అటు భర్తా, ఇటు భార్యా తెల్లబోయి కొయ్యబొమ్మల్లా నిలబడిపోయారు.

ఇంతలో అబ్బాయి రామసింగుకోసరం పోయిన నౌకరు పరుగు పరుగున వచ్చి, "అమ్మా! అబ్బాయిగారికి పోలీసు కాల్పుల్లో దెబ్బలు తగిలినవి! నెత్తురు పరగ్గలై పోతోంది. ఆస్పత్రికి తీసుకొనిపోయా"రని వర్తమానం చెప్పాడు.

ఆమె వింటూనే, నరికిన చెట్టులాగా కూలిపోయింది. సింగు — 'ఆఁ' అంటూ నిశ్చేష్టుడైపోయాడు.

"అయ్యో రామం!" అంటూ లేచి గొల్లుమన్నది తల్లి. వెంటనే మోటారెక్కి తల్లి తండ్రి ఆస్పత్రికి వెళ్ళిపోయారు.

ఆస్పత్రిగదులలో బల్లమీద మన స్మారకం లేకుండా పడిపోయి ఉన్నాడు రామసింగు.

"అయ్యో! నా గర్భం నా కళ్ళతే చూడ మనసు వచ్చిందిగా నాయనా!" అని పిల్ల వాడిమీద పడి గొల్లుమన్నది తల్లి. తండ్రి ఎన్నెన్నో మహాసంగ్రామాలు చూచిన అనుభవజ్ఞుడు, రణరంగంలో శత్రువుల హతమార్చిన యోధుడు, తన తుపాకి బారికి ఎన్నివందల జీవుల్నో బలిచేసిన రసపుత్రుడు. ఎన్ని రక్తప్రవాహాలలోనో ఈదులాడి విహరించిన శూరుడు — హిమాలయపర్వతంవంటి ధైర్యస్థైర్యాలుగల అతని హృదయం, అతని మనస్సు, అతని సమస్తావయవములూ ఆ బాలుని ముఖంమీద స్రవించే రక్తధారికలు చూచి భరించలేక పోయినవి. కలకలలాడే ఆ లేతముఖబింబాన్ని చూడలేకపోయాడు. తనని నిలువునా ముంచెత్తివేసే ఆ దుఃఖాన్ని ఆపుకోలేక పోయాడు—

తన పేగులో పేగు తనరక్తంలో రక్తం. తనప్రాణంలో ప్రాణం. రామసింగు పెరిగి పెద్దవాడయితే అతనిముఖకట్లు, మళ్లా మూడు మూర్తులా తండ్రి హోతీసింగే!

ఆయువుపట్ల క్రింద చూచిన బిడ్డ! అల్లారు ముద్దుగా పెంచుకొన్న బిడ్డ! ఇంటికి రాగానే కరువుతీరా అక్కున చేర్చుకొని ముద్దాడవలెనని కొండంత ఆశతో వచ్చిన ఆ తండ్రి భరించలేక పోయాడు—

"నాయనా! ఒక్కసారి కళ్లు తెరచి చూడు—" అని తండ్రి ఆవేదనతో అరిచాడు—

డాక్టరు వచ్చి అతనినోరు గట్టిగా మూశాడు.

"అయ్యా! డాక్టరుగారూ! పిల్లవాడు మళ్లీ మాకు దక్కుతాడా?" అని అడిగాడు సింగు.

"మీరు తొందరచేయకండి. మరేమీ పరవాలేదు—" అన్నాడు డాక్టరు.

"గాయం బలమైన గాయమేనా?"

"లేత శరీరానికి ఎంతదెబ్బ కావాలి? అందులో తుపాకీదెబ్బ——" అన్నాడు డాక్టరు.

"నా నాయనకి తుపాకి గుండుదెబ్బే! కాపాడండి డాక్టరుగారూ!" అని తల్లి గోల చేసింది. ఇద్దరు కాంపౌండర్లు ఆమెనూ, హోతీసింగునూ బయట వెయిటింగు రూములోకి తీసుకొనిపోయారు. రామసింగుగది తలుపు లోపల గడియ బిగించాడు డాక్టరు.

"నా కొడుకు నంత దెబ్బకొట్టడానికి వాడు చేసిన పాప మేమిటి నాయనా?—" అని బయట వరండాలో నిలబడ్డ పోలీసు జవాన్ని అడిగింది తల్లి.

"పసివాళ్లకేం తెలుసు, పెద్దవాళ్ల అదుపు ఆజ్ఞల్లో ఉండమంటే ఏం? సర్కారుమీద ఉసి గొల్పితే ఊరుకొంటుందా? సీమగుడ్డలంగళ్ల దగ్గర పికెటింగు చేయకూడదని సర్కారు వారి ఉత్తర్వులుండగా, బజారులో జనం మూగి అల్లరి చేసేసరికి, పోలీసువాళ్లు తుపాకులు కాల్చారు. ఆ దెబ్బలో అందరి కంటె ముందుగా ఉండిన ఈ పిల్లవాడికి మాత్రం బలమైనగాయం తగిలింది" అన్నాడు పోలీసు.

రాజపుత్రుడు హోతీసింగు. వెనుకబడితే వాదమందు అయినా ఒక్కడూ ప్రాణమర్పించగలడు. కాని సముద్రాలు దాటి, కొండలు దాటి, ఖండములు దాటి, పరదేశభూములలో వెలయుతావుండిన అతని ప్రతాపజ్యోతి, అతనిశౌర్యం తన చేతకానితనముకు, ఒక్క పసి పిల్లవాని ఎదుట వెలవెల బోయింది! బిగించబడిన గదితలుపుకు తల జేరవేసి ఒక వర్ణనాతీతమైన స్థితిలో పడిపోయినాడు, హోతీసింగు.

అంతలో ప్రక్కనుంచి ఒక పోలీసు కానిస్టేబిలు చేత నవ రోకటి పట్టుకొని, అక్కడికి వచ్చి,

"ఇక్కడ సరదారు హోతీసింగుగారెవరండీ?" అని అడిగాడు.

ఉలిక్కిపడి నేనే అన్నాడు సింగు.

కవరు తీసుకొని విప్పుకొన్నాడు—

"సరదారు హోతీసింగుకు——

"రామసింగు అనే మైనరుపిల్లవాడు నీ కుమారుడనీ, సిగార్డియన్‌షిప్పులో ఉన్నాడనీ మానోటీసుకు వచ్చింది. అతను చట్ట విరుద్ధమైన సంఘాలలో చేరి ప్రజాశాంతి భంగం కలుగచేస్తున్నాడు. కాబట్టి అతన్ని వెంటనే సిగార్డియన్‌షిప్పులోనుండి తొలగించి, అతనికి నీతో గల సంబంధం తెగ్గొట్టుకొని, ఆవైనం వెంటనే సర్కారుకు తెలియచేయవలెను".

అన్న గవర్నమెంటు ఉత్తర్వు చదువుకొన్నాడు.

అతనికాళ్లల్లో దడ బయల్దేరింది——

"నాయనా!" అని పడిచింది తల్లి.

గదితలుపు తెరచి, డాక్టరు అన్నాడు,

"పిల్లవాడికి మీకూ సంబంధం తెగిపోయింది" అని.

మహాత్ముడు

గుఱ్ఱం వేంకట సుబ్రహ్మణ్యం

కీర్తి దేహ మిది
పూర్ణతేజ మిది—
భావనసమిదిత సత్యాహింసా
సవనదీక్షా బద్ధజీవము
సనాతన శాస్త్రభావిత శాంతి
స్థితప్రజ్ఞానుసారః సేవ్యము
దేశదాస్యనిర్గ్రహతానా
రాని గగనపు టెత్తుల ప్రసహాణమా
శీతాచలమువలె
పూతజాహ్నవివలె
అత్యుచ్చ్రాయమూ
నిత్యగభీరము
ఆద్యమానవసృష్టికి యున
వద్యమూర్తికి మధ్యయుగములు
సాగిన యుగా యుగ తరంగముల్ బలె
వెడ వెడం జను ఖగములుంబలె
కాలాతిక్రమణ మతి
వేలాతిక్రమణోద్యతి
లోకాంతర్లీనాత్ముడు
సాకల్యస్థితికోవిదుడు
భరతోర్విని
ఋషులని
తపోనిష్ఠులని
శాపానుగ్రహదక్షులని
వినియున్నారము
గాంధీ నిప్పుడు కన్నారము.

ఐరోపా ఖండము: విద్యా సమస్యలు

కొచ్చెర్లకోట సత్యనారాయణమూర్తి

గాంధిమహాత్ముని పద్ధతులన్నీ అలాగే విచిత్రంగా వుంటాయి. 'అహింసా తత్వంతో బ్రిటిషుసామ్రాజ్యాన్ని ఓడగొట్టి స్వరాజ్యం సంపాదిద్దాం' అని ఆయన చెప్పినప్పుడు 'ఆయనకు కొంచెం కొసవెర్రి వుంది కాబోలును' అని అనుకున్నాం. నిన్న గాక మొన్న బంగాళా రాజధానిలో, ఏళ్లతరబడి జైళ్లలో మగ్గుతూ వుండిన ఖైదీలను, ౧౬ వందలమందిని విడిపించినప్పుడూ, ఇతర రాష్ట్రాలలో గవర్నర్లనే తన చెప్పుచేతలక్రిందికు తేగలిగినప్పుడూ 'అహింసా తత్వానికింత బలముందా!' అని ఆశ్చర్యపడ్డాం.

మహాత్ముడు ఈ విషయంలో తెలివితేటలు చూపినమాట నిజమే గాని యీ కొత్త నేర్పేమిటి? బొడ్డూడని ఐదేళ్ల కుర్రకుంకలు చేతిపనులు నేర్చుకొని డబ్బు సంపాదించడమేమా? వాళ్ల చదువులు కుదురు రాట్నం తిప్పడంలోకి దిగాలా?

యూనివర్సిటీ చదువులకి దమ్మిడీ ఖర్చుపెట్ట నక్కరలేదా? ఏమిటీ విచిత్రమైన సన్నాహాలు? ఈ సందేహాలు మనల నందరినీ బాధిస్తున్నాయి. ఆయన తెలివి తక్కువవాడనడానికి వీలులేదు గాని ఆయన చెప్పేదిమాత్రం అగమ్యగోచరంగా వుంది. తలక్రిందులుగా కనబడుతోంది.

కాబట్టి కొంతసేపు మహాత్ముణ్ణి, ఆయన విద్యావిధానాన్ని మరచిపోయి, ప్రస్తుతం ఐరోపా ఖండంలోను, అందులో ముఖ్యంగా ఇంగ్లాండులోను చదువులనుసరించి ఏమనుకుంటున్నారో, వారి అనుభవాలేమిటో, అచ్చటి విద్యాధికుల అభిప్రాయాలు ఏవిధంగా వున్నాయో కనుక్కుందాం. అవిసంగానైనా మనకు కొంతవరకు దారి తెన్నూ అగపడవచ్చును.

మన మిప్పుడు గమనించవలసినది పశ్చిమదేశస్థులైన ఒకరిద్దరు వ్యక్తుల అభిప్రాయాలు కాదు; ఆ దేశాల అనుభవాలు. ఇప్పుడు అచ్చట అమలులోకి వస్తూవున్న విద్యాసంస్కరణాలు ఏధోరణిని ఉన్నాయో మనం ఆలోచించాలి. అవి, ౧౯౩౮-వ సంవత్సరపు విద్యా రిపోర్టులలో కొంతవరకు క్రోడీకరింపబడి వున్నాయి. వాటిసారాంశాన్ని ముందు వివరించి అటు పిమ్మట ఇంగ్లాండులో ప్రైమరీ సెకండరీ విద్యలలో జరుగుతూవున్న మార్పులను వివరిస్తాను.

ఈ వ్యాసంలో వ్రాయబడిన ప్రతివాక్యమూ ఐరోపా ఖండానికి సంబంధించినదే గాని మన దేశానికి సంబంధించినది కాదు అచ్చటచ్చట పోలిక లుండవచ్చును గాని యీ వ్యాసంలో మన దేశపు ప్రసక్తి యెక్కడా లేదు. ఆ సంగతిని మనము చివరవరకూ మరవగూడదు.

జినీవాలో ఉన్న అంతర్జాతీయ కార్మిక ఆఫీసు అధికారియైన ఆల్బర్టు థామసుగారు కడచిన తన ఆఫీసు రిపోర్టు చివర వ్రాసిన మాటలు:

> 'ప్రస్తుతం ప్రపంచంయొక్క చిక్కులను విడదీయడానికి, ప్రజలందరికీ సౌఖ్యం ఐశ్వర్యం సమకూర్చడానికీ కావలసిన బాహ్య సాధనాలన్నీ మనచేతిదగ్గర సిద్ధంగానే వున్నాయి. ఆకార్యం సాధించలేక పోయామంటే అందుకు లోపం మన హృదయాలలో వుంది.'

విద్యకు సంబంధించిన సమస్యలను ముందు సాధిస్తేనే గాని రాజకీయంగాను, ఆర్థికంగాను ఐరోపాఖండాన్ని కలవరపరుస్తూవున్న ఇతర చిక్కులు విడవు అన్న నమ్మకం ఐరోపాఖండంలో యేర్పడుతోంది. ఆ చిక్కులన్నిటికీ మూలకారణం మనుష్య స్వభావమే అని క్రమంగా గుర్తిస్తున్నారు. మానవప్రకృతిలో యేదో వక ప్రబలశక్తి తప్పుదారులలో పడింది: పాత విద్యావిధానాన్ని పూర్తిగా మార్చివేసి, అన్ని తరగతులలోను నూతన పద్ధతుల విద్యను నేర్పితేనే గాని ఈ

చిక్కులు విడవు — అని అక్కడి సహృదయులు గ్రహిస్తున్నారు.

మన స్థూలదృష్టికి, చదువులవల్ల కలుగుతూవున్న ఆర్థికనష్టమే ఈ చిక్కులన్నిటికీ ప్రధాన కారణంగా కనపడుతుంది. కాని అది యెంతమాత్రం నిజంకాదు. అన్ని దేశాలలోను చదువులకోసం ఇప్పటికంటె రెట్టింపు డబ్బు ఖర్చుచేసి పరీక్షలలో ప్యాసైనవారందరికీ మంచి వుద్యోగా లిచ్చినప్పటికీ ఈ చిక్కులన్నీ విడతాయా? విడవు. తాత్కాలికంగా కొంతమట్టుకు తగ్గితే తగ్గవచ్చును.

ఐరోపాఖండంలోని ప్రస్తుతపు చదువులు విద్యార్థుల మెదడుకుమాత్రమే పని చెప్తున్నాయి. అందువల్ల మానసికమైన వారి స్వతంత్రశక్తులు హెచ్చడానికి బదులు తగ్గుతున్నాయి. నీతి నియమాలమీదా ధర్మశాస్త్రాలమీదా గౌరవం నశించింది. ఈ విద్య నభ్యసించడంలో తమ చైతన్యాని కంతటికీ ఆయువుపట్టయిన వారి దారుఢ్యము చచ్చిపోయింది. మునుపటివారికన్న యెక్కువ సంగతులు వారు నేర్చుకున్నారు. కాని తక్కువ పనిమాత్రమే చేయగలుగుతున్నారు. పెద్దపెద్ద ఆశలూ ఉద్దేశాలూ వున్నాయి. అందుకు తగినక్రియ మాత్రం లేదు. వారికి స్కూలు అంటే విసుగెత్తిపోయింది. స్కూలులోనుంచి ప్రపంచకంలోకి బైటపడడంతోటే చదువు అంటే తృష్ణా, ఆసక్తి అంతరిస్తున్నాయి. తమ పరీక్షల సర్టిఫికేట్లమీదమాత్రమే ఆధారపడుతున్నారు. ప్రజలను ఆందోళనపరిచే ఏవో పాలిటిక్స్‌కలకు సులభంగా దాసులౌతున్నారు. తమకు తాము చేసుకోవలసినదానిని గుర్తించుకోకుండా ఇతరులు తమకేమీ సహాయం చేయటం లేదని సణుగుతున్నారు; అసంతృప్తిపడుతున్నారు. పత్రికలకు వ్యాసాలు వ్రాయగలరుగాని పనిముట్లను చేయలేరు.

ప్రస్తుతం ఐరోపాఖండంలో ఇంచుమించు అన్ని దేశాలలోను వ్యాపించివున్న వ్యాధికి ముఖ్యలక్షణాలివి.

కొన్ని దేశాలలో యీ వ్యాధి త్వరలో కుదిరే సూచన లగపడుతున్నాయి. మెదడుకుమాత్రమే పని చెప్పడంవల్ల మానవుణ్ణి, అతని ప్రపంచకాన్ని వికసింపచేయవచ్చును అన్నసిద్ధాంతం యథార్థం కాదని అచ్చట రుజువైంది. ఆధునంగా మానవుడి జ్ఞాపకశక్తయినా వృద్ధికావటం లేదని స్పష్టమైంది. మానవ ప్రకృతినిసరించి కొత్త అభిప్రాయాలు తేర్పడుతున్నాయి. మెదడుకు శిక్షణనీయటంతోపాటు మానవుని యిష్టాయిష్టాలకు, నడవడికి, సహజ ఉత్పాదకశక్తికి తగిన ప్రాముఖ్యము నిస్తున్నారు.

ఐరోపాఖండంలో కొన్నిచోట్ల ఇంకా పాత అభిప్రాయాలను పట్టుకుని వ్రేలాడుతూ వున్నప్పటికీ ఇంగ్లాండులో కవెనిన సుప్రెఫ రేంజ్లవంటి గొప్ప గొప్ప విద్యాధికులు కొత్త అభిప్రాయాలను వ్యాపింపజేస్తున్నారు.

పాత విద్యావిధానంలో ప్రత్యక్షంగా కనపడుతూ వున్న గొప్ప లోపం స్కూలుపరీక్షలు. ఈపరీక్షల ఒత్తిడివల్ల చదువుల ఐక్యతా, విద్యార్థుల జీవశక్తి నశిస్తున్నాయని మేష్టర్లు గోలపెడుతున్నారు. చదువుకున్నవారిశక్తి సామర్థ్యాలను కొలవడానికి ఇవి మంచి సాధనాలేనా అని విద్యార్థులూ, వారి తలిదండ్రులూ కూడా సందేహిస్తున్నారు. వీటివల్ల విద్యార్థి ఎన్నిపుటలు చదివాడో తెలుసుకోవచ్చును గాని అతని ఉత్పాదకశక్తిని గ్రహించడానికి ఇవి సాధనాలు కావు. వట్టి జ్ఞాపకశక్తినిమాత్రం కొలిచే యీ సాధనాలను ఇక వదలిపెట్టి అంతకన్న మంచి విధానాన్ని దేనినైనా అవలంబించాలన్న ఉద్యమము కొన్ని దేశాలలో ఇంకా బాల్యావస్థలోనే వుంది. కాని పరీక్షాఫలితాలమీదనే ఆధారపడివున్న ఆ పూర్వకాలపు పద్ధతికి కష్టదినాలు త్వరలోనే రాబోతున్నాయి.

స్కూలుకు ఇదివరలో, సమష్టికుటుంబం, మతం, కులవృత్తి — యీ మూడింటి ఆసరా వుండేది. ఈ ఆసరాలవల్లనే అది ఇంతకాలం అభివృద్ధి చెందింది. దానికి ఇంతకాలం బలం యేర్పడింది. కాని ఇప్పుడు ఆ ఆసరాలు పుచ్చిపోయిన స్తంభాలైనాయి. వాటి బలం పోయింది. సమష్టికుటుంబం, మతం, కులవృత్తి — ఈ మూడూ నామమాత్రావశిష్టమై పోయినాయి. వాటి

పరపతీ, పేరు ప్రతిష్ఠలూ నశించాయి. వాటికి గౌరవం గాని, విద్యావిషయకమైన విలువగాని యిప్పుడు లేదు. అందువల్ల స్కూలు రెక్కలు లేని పక్షివంటి, అంగం లేని ప్రాణివంటి సంస్థ అయింది. అంతేకాదు. ఈ మూడు సంస్థలూ అనవసరమనీ, వాటినుండి నేర్చుకోవలసిన విద్య నంతటినీ స్కూలులోనే నేర్చుకోవచ్చు ననీ మొన్నటి వరకూ చదువుకున్నవారిలో గట్టిగా నమ్మకం వుండేది కాని ఇప్పుడిప్పుడా నమ్మకం నశిస్తూంది. 'ఇంటినుంచీ, మతంనుంచీ, వృత్తిపనినుంచీ నేర్చుకోగల విషయాల నన్నిటినీ స్కూలులోనే గ్రహించవచ్చును. స్కూలు ఈ మూడుసంస్థల స్థానాన్ని సులభంగా ఆక్రమించుకోగలదు' అన్న నమ్మకం పోతోంది. చదువులు చెప్పేవారూ, నేర్చుకొనేవారూ కలిసిమెలిసి వుంటేనే గాని స్కూలు, ఇల్లు, వృత్తిపని, మతము — ఈ యన్నిటి ఉపయోగం సార్థకం కాదని స్పష్టమవుతోంది.

ఈ సమస్యలను విడదీయగల సాధనాలు మామూలు స్కూళ్లలో లేవు. రాజకీయశాస్త్రవిధానం, యువజనోద్యమాలు, రాజ్యాంగ ప్రభుత్వము — ఈ మూడూ, స్కూలులో వున్న లోపాలను తీర్చడానికి కొంత వరకు ప్రయత్నించాయి. విశేషంగా ప్రయత్నం జరిగిన చోట్లల్లా ఇప్పటి చదువులు సరిగా లేవన్న అపనమ్మకం, మధ్యయుగంలో వుండిన పద్ధతులే నయం అన్న భావనే కనబడుతున్నాయి. సనాతనుల దృష్టి తిరిగి కుటుంబం వంకకు మళ్లుతోంది. ఆ సంస్థకు తిరిగి ప్రోత్సాహం కల్పిస్తున్నారు.

ఇప్పటికి విద్యావిధానం పూర్వకాలపు సంప్రదాయా లన్నిటికీ బాహాటంగా వ్యతిరేకంగా వుంది, ఆ సంప్రదాయాలు సంపూర్ణంగా నశించినచోట్ల కూడా సరియైన మానసికశక్తి, హృదయపూర్వకమైన మతభావమూ పోతూవున్నాయి.

ఇక వృత్తివిద్యాశిక్షణను గురించి: ప్రస్తుతం స్కూళ్లలో ఉన్న కార్ఖానాలలో ఇవ్వబడుతూవున్న శిక్షణను కల్పితంగాను అస్వాభావికంగాను వుందని ఇప్పుడిప్పుడే గుర్తించి యథార్థమైన చేతిపనికి, వృత్తి శిక్షణకూ మనఃపూర్వకమైన గణ్యత నిస్తున్నారు. చాలా విషయాలలో స్కూలు కార్ఖానాకంటె పారిశ్రామికపద్ధతులమీద నడపబడే వ్యాపారమే అనేకనియమాలను పద్ధతులను ఎక్కువసార్థకంగా అనుసరింపగలదనీ, నేర్పగలదనీ అందరికీ తెలిసిన విషయమే.

అంతమాత్రాన పూర్వపుపద్ధతుల నన్నిటినీ సంపూర్ణంగా అనుకరించాలనికాదు; ప్రజలదృష్టి వట్టిమాటలలోనుంచి వ్యవహారసరళికీ, సిద్ధాంతాన్నుంచి ఆచరణకూ మళ్లుతోంది.

చదువూ లోకానుభవమూ ఒకదానికొకటి మరీ దూరమైనాయి. స్కూలు కార్ఖానాలు విద్యార్థుల విద్యాతృష్ణను తృప్తిపరచలేకపోతున్నాయి. చరిత్ర, భూగోళం, మొదలైన ఇతరవిషయాలవలె చేతిపనిని కూడా రోజుకు కొన్ని నిముషాలుమాత్రం ప్రత్యేకించి నేర్పడం సాధ్యం కాదనీ, చేతిపనిని బోధించడానికి ఇప్పటికంటె యెక్కువకాలం వినియోగించడంవల్ల యెక్కువ ప్రయోజన ముంటుందనీ గ్రహిస్తున్నారు. యథార్థమైన చేతిపని, లేక వృత్తిపనితో సంపూర్తిగా మిళితమై కాని, లేక దానితో కూడుకొనిగాని యున్న విద్యావిధానంవల్ల ఈ అపాయాలను చాలావరకు తప్పించవచ్చునని అచ్చటి పండితుల అభిప్రాయం. అక్కడ అనేక విద్యాసంస్థలు ఈ కొత్తమార్గాన్ని గ్రహించాయి. ఈవిధంగా అభివృద్ధికావడానికి ముందు ముందు చాలా అవకాశా లున్నాయి. చదువుచెప్పే పద్ధతిని పూర్తిగా పునర్నిర్మాణం చేయవచ్చును. విద్యాభ్యాసం విద్యార్థిదశలోయైన కొద్దిసంవత్సరాలలో ఆగిపోనక్కరలేదు. మనిషికి యావజ్జీవమూ విద్యాభ్యాసానికి అవకాశం కద్దు. మానవుని దినచర్యకు, విద్యాభ్యాసాన్ని ఇంతవిరుద్ధంగా వేరుచేయనక్కరలేదు. మనిషి బ్రతికివున్నంతకాలం విద్యాభివృద్ధి చేసుకుంటూ వుండవచ్చును.

కాని యీకార్యక్రమానికి యిప్పటిస్కూళ్లు పనికిరావు. అందుకు తగిన సాధనసామగ్రి వాటికి లేదు. పైగా వాటి ఆలోచనలు ఎంతసేపటికీ సంప్రదాయసిద్ధమైన పూర్వపు మార్గాలనే పోతున్నాయి. యువకుల దృష్టి, సంఘంయొక్క వ్యక్తులయొక్క స్థితిగతులూ మారిపోయినాయనీ, రోజురోజుకూ ఇంకా నాగ

తున్నాయనీ ఈ స్కూళ్లు ఎంతమాత్రం గుర్తించటం లేదు. ఆటలు, దేశాటనం, సైనికశిక్షణ — స్కూళ్లలో ఈ వుద్యమాలు ముందుకు రావటంవల్ల ఇతర విషయాలు వెనకబడుతున్నాయి.

గొప్పగొప్ప ఆదర్శాలను, ఉద్దేశాలను భక్తితో ఉత్సాహంతో అనుసరించడం యువకులకు సహజం. ఎట్టి త్యాగానికైనా సేవకైనా యువకుడు ముందంజ వేస్తాడు. 'స్కూళ్లలో బాగా చదవాలి; పరీక్షలో బాగా మార్కులు రావాలి; ముందు మంచిమంచి ఉద్యోగాలు సంపాదించాలి' అన్న ఆశలు అతని హృదయవాంఛను తీర్చటం లేదు. అతని దృష్టిలో వాటికి విలువ లేదు.

ఇప్పటికన్న అధికంగా మానవస్వాతంత్ర్యాన్ని సంపాదించడానికీ, భూతదయను ప్రబోధించడానికీ లోకంలో జరిగే ప్రయత్నాలలో పాల్గొనడానికి మానవుడు ముందు కురుకుతున్నాడు.

మానవసంఘానికి సంబంధించిన ఆదర్శాలు యువకుల నాకర్షిస్తున్నాయి. వారి అంతఃకరణలే మారిపోతున్నాయి. ప్రపంచమంటే ఇదివరకున్న నిస్పృహా, నిరసన, విరక్తి అంతరించాయి. తిరుగుబాటు స్వభావం పోయి దానిస్థానే ఆత్మశిక్షణము ఏర్పడుతోంది. వినయము, భయభక్తులు, సేవాసక్తి, తమస్వాతంత్ర్యం వలెనే ఇతరుల స్వాతంత్ర్యం అంటే గౌరవం — ఈ భావాలు పోషిస్తున్నాయి. వారి ఆత్మలకు మునుపటి కన్న ఎక్కువ వికాసం కలుగుతోంది.

ఈ మార్పులు రావడానికి, నాగరి చదువే కాకుండా ఇప్పటి ఆర్థిక సాంఘిక దుస్థితికూడా తోడ్పడింది.

ఇటలీలో ముస్సోలినీ నాయకత్వంకింద ఫాసిస్టుపార్టీ, జర్మనీలో హిట్లరునాయకత్వంకింద నాజీపార్టీ, ఐర్లండులో, డీవెలారా నాయకత్వంకింద స్వాతంత్ర్యోద్యమం, రష్యాలో లెనిను, స్టాలినుల నాయకత్వంకింద కమ్యూనిస్టుపార్టీ — తమతమ దేశాల పునాదులను కదలించివేసిన యీపార్టీలన్నీ ఇట్టి త్యాగమూర్తులైన యువకుల కలయికచేత ఏర్పాటయి నడపబడినవే!

ఇప్పుడిప్పుడే యువకులు ఈ ఆదర్శాల కనుగుణమైన విద్యను సంపాదించగలుగుతున్నారు. 'అందరమూ కలిసి పనిచేద్దాము' అన్న ఒకకొత్త సంఘభావం వారిలో రేకెత్తుతోంది. సరియైన శిక్షణందిన సంఘాలు యువకులలోను, యువతులలోనుకూడా సర్వసామాన్య మౌతున్నాయి. వారు తమ శిక్షణననుసరించి, నడవడిని సరిదిద్దుటకు కావలసిన నియమాలను తామే యేర్పాటు చేసుకుంటున్నారు. వారి జీవితమే మారిపోతోంది. తెరపిగా ఆరోగ్యజీవితానికీ సామాన్యప్రజా జీవనంమీద అభిమానం ఏర్పడుతోంది. ఆత్మనిగ్రహం, అన్యోన్యభావం, సౌందర్యోపాసన — నీతిసూత్రాలు యువకులమనస్సులలో గాఢంగా నాటుకుంటున్నాయి. అందం చందంగల పనిపాటులన్నా, బుద్ధిని తరిమెనబెట్టే పనిపాటలన్నా ఇదివరకు ఎన్నడూలేని కొత్తతృష్ణతో బైలుదేరుతోంది. ఇంతకుముందు ఏయుగంలోను, ఏరాజ్యంలోను విద్యను ఇంతటి మహత్కార్యం, ఇంతటి ఉత్కృష్ట సమస్య ఎదుర్కోలేదు. పైకార్యాలను సాధించడానికి ఇంతకుముందు ఎన్నడూ ఇన్ని అవకాశాలూ ఏర్పడలేదు.

అన్నిటికంటె ముఖ్యం, యువతులకు యువకులతో సమానత్వం, [illegible], విశ్వవిద్యాలయాలలో ప్రవేశము ఇంచుమించు పూర్తిగా ఏర్పడ్డాయి. ఆప్రాచీలను వారు సమర్థతతో నిర్వహిస్తున్నారు. [illegible] వారు ఆగగలిగారు. నేటియుగపు యువతులు [illegible]వుతున్నారు. వారు యువకుల అభివృద్ధికి చాలా తోడ్పడుతున్నారు.

సాంకేతికవిద్య(Technical education)కు మునపటికంటె ఎక్కువ ప్రాముఖ్యము నిస్తున్నారు.

ఈ కాలానికి అన్నిటికంటె ముఖ్యంగా కావలసినది పనిముట్లనూ — యంత్రాలనూ, ఇంజన్లనూ, వాయువిమానాలనూ, సవగ్‌స్టీమరులనూ, ఇతర పారిశ్రామికసంస్థలనూ ఏర్పాటుచేసి, పోషించి, నడపగల ఒకకొత్త రకపు ప్రత్యేకజ్ఞానధనులు. వారు సమర్థతతో, చాతురతతో పనిచేయగలిగినవారై వుండాలి. వారి అభివృద్ధికి కావలసిన అవకాశాలన్నిటినీ ఆ యావృత్తులలోనే వారికి విస్తారంగా కల్పించాలి. అందుకు సంబంధించిన యితర విద్యాశాఖలలోకూడా వారు సక్రమ

మైన అభివృద్ధిని పొందడానికి తగినంత విరామం వారికివ్వాలి. ఆవిధంగా జరిపినయెడల స్వతంత్రముగా ఉత్పాదనచేసేశక్తి, పనిపాటలలో అనుభవపూర్వకమైన నేర్పు గల కొత్తరకపు పనివాండ్రు తయారవుతారు. మెదడుతెరిఫీజునుమాత్రమే పొంది "నల్లకోట్లు"ను ధరించి ఉద్యోగాలకు యాచించే విద్యార్థులకన్న ఈ పనివాండ్రు సంఘంలో ఎక్కువప్రముఖతను వహిస్తారు.

ఈ కార్యక్రమం నెరవేర్చడానికి కావలసిన పరికరాలను సాంకేతికవిద్య (Technical education) ఇప్పుడిప్పుడే సమకూర్చుకుంటోంది. వట్టి మెదడుకసరత్తు అంటే విముఖతా, విరోధభావమూ కనబడుతున్నాయి. యథార్థంగా స్వతంత్రంగా ఆలోచించగల శక్తి అంటే మనఃపూర్వకమైన ఆదరణా గౌరవమూ కలుగుతున్నాయి.

మానసికశిక్షణ, సత్ప్రవర్తన, స్థిరచిత్తము — ఈ మూడూ మానవజీవితానికి బలమైన పునాదులే కాని యోగ్యతలలో సాధించవలసిన కష్టకార్యాలకు అవి మాత్రం చాలవు. యథార్థమైన స్వతంత్రమైన ఆలోచనశక్తి ఈ యన్నిటికంటెను ప్రధానమైనది. ప్రవర్తన ఎంతటి గొప్పదైనా, విజ్ఞానసర్వస్వంలోవున్న విజ్ఞానాన్నంతటినీ మెదడులోకి ఎంతమాత్రముకు ఎక్కించుకున్నా ఆలోచనాశక్తి లేనియెడల ప్రయోజనముండటంలేదు. ఆలోచనాశక్తియొక్క ఔన్నత్యం సంఘంలో తిరిగి స్థాపితమైనప్పుడే స్వేచ్ఛా స్వాతంత్ర్యభావాలకు సరియైన అర్థమూ, విలువా ఏర్పడతాయి.

సమగ్రంగా, స్పష్టంగా ఆలోచించగలవాడు — అతడే ఈ యుగానికి అవతారపురుషుడు; డిక్టేటరు; కొత్తరకపు "వీరుడు".

ఎనిమిదేళ్లకుపూర్వం శిశువుయొక్క విద్యాభ్యాసాన్నిగురించి అంతగా శ్రద్ధతీసుకోనక్కరలేదని అనేకుల అభిప్రాయం. పెద్దవారు బిడ్డలస్వభావాన్ని సరిగా గుర్తించలేకపోవడమే యిందుకు కారణం. శక్తిసామర్థ్యాలలోను స్వభావంలోను బిడ్డలలో తారతమ్యాలుండడం సహజం. కాని సామాన్యంగా పదేళ్ళ శిశువుయొక్క దృష్టి యెప్పుడూ తనమీదా, తనవస్తువులమీదా తనఆటపాటలమీదా తనచుట్టుప్రక్కలమీదా వుంటుంది. తనకు ధైర్యంకోసం వెనకాల పెద్దవారి సహాయం, కాపుదల వుండాలి. ఆరేళ్లు వచ్చేసరికి కొంచెం కాలునిలకడా ధైర్యం యేర్పడతాయి. "నేను పెద్దవాణ్ని అవుతున్నాను" అన్న ధీమా, నమ్మకం, స్వతంత్రం, తనకంటె చిన్నబిడ్డల జాగ్రతను కనుక్కోగల సంరక్షణభావము వృద్ధియౌతాయి. ఇప్పటికీ తనదృష్టి అంతా తనశక్తిసామర్థ్యాలమీదనే వున్నప్పటికీ తన వయస్సుగల ఇతర బిడ్డలతో చేరడానికి, వారితో కలిసిమెలిసి తిరగడానికి, వారివిషయమై శ్రద్ధతీసుకోడానికి కొంతవరకు తయారవుతాడు. మనస్సులోను శరీరంలోను కొంత స్థిరత్వము ఏర్పడేవయస్సది. మునుపటిమోస్తరుగా వస్తువులను కిందామీదా పడవేయడం, దొర్లించడమే కాదు; వాటికొక ప్రయోజనం కల్పించడం, ఒకఆకారం ఏర్పరచడం, నిశ్చయమైన ఒకపని చేయబోవడం,— ఈవిధంగా వుంటాయి బిడ్డప్రయత్నాలు. మునుపటికంటె ఎక్కువ పట్టుదలతో ప్రయత్నపూర్వకంగానే వస్తువులను నిర్మించాలన్న దృష్టి యేర్పడుతుంది. మునుపటికంటె ఎక్కువ జాగ్రత్తగా వస్తువులను పోల్చి చూడడం, పరిశీలించడం, వేరుచేయడం, ఆ అనుభవాలను వాగ్రూపకంగా చెప్పగలగడం — ఈశక్తులేర్పడతాయి. తాను కొత్తగా నేర్చుకొన్న ప్రజ్ఞలను తిరిగి చేయడానికీ, చేసి ఇతరులకు చూపించడానికీ సరదా కలుగుతుంది. ఈవయస్సులో బిడ్డయొక్క శరీరం కూడా గట్టిపడి మునుపటికన్న ఎక్కువబలం చేరుకుంటుంది.

బిడ్డకు ఇట్లా శరీరంలో, మనస్సులో, సంఘంలో స్థిరత్వం ఏర్పడడం చాలా ముఖ్యమైన విషయం. "నేను పెద్దవాణ్నవుతున్నాను" అన్ననమ్మకం, బిడ్డయొక్క ఆత్మవిశ్వాసం వృద్ధికావడానికి సాయపడుతుంది. స్కూలులో ఉపాధ్యాయులకూ, ఇంటిలో పెద్దవారికీ, తనకన్న చిన్నబిడ్డలకూ పనులు చేసి పెట్టడమంటే, వారికి సాయపడడమంటే సరదా. ఆపనులకోసం వారు తనపై ఆధారపడ్డారని గర్వం. ఈ అనుభవాలను శిశువులలో అభివృద్ధిచేయడం అవసరం.

క్రమంగా తనతో సమానవయస్సు గలవారితో స్నేహాలకు మరగడం, తనకంటె పెద్దపిల్లకాయలను అనుకరించడం, దినదినాభివృద్ధి చెందుతూవున్న తన శక్తి సామర్థ్యాలను చూసుకుని గర్వపడడం, తన స్నేహితుల జట్టుఅంటే కొంతఅభిమానం కలగడం, తనను వారితో పోల్చి చూసుకోవడం, — ఈ లక్షణాలు కల్గుతాయి. ఎప్పుడూ తన సంగతి, తనతిండి, తనవస్తువులు అన్న చిన్నప్పటి స్వభావం మారిపోతుంది

బిడ్డలలో కలిగే యీ మార్పు లన్నిటినీ సరిగా గ్రహించి, వారి అభివృద్ధికి కావలసిన సదుపాయాలను ఏర్పాటు చేయడం చాలా అవసరం. ఇంగ్లాండులో కొన్ని స్కూళ్లలో ఇందునుసరించి తగినశ్రద్ధను తీసుకొని మంచియేర్పాట్లు చేస్తున్నారు. అందులో పిల్లలు జట్లుగా జేరి పనిచేయడం నేర్చుకుంటున్నారు. అందువల్ల బిడ్డలొక్కొక్కరు తమసంగతి చూసుకోవడమే కాకుండా వారిలో పరస్పర సాహాయ్యం, ఒకతరగతి, లేక జట్టువా రందరూ కలిసి ఉమ్మడిగా వకపనిని సాగించడం, ఒకరిని చూచి ఒకరు నేర్చుకోవడం - ఈ గుణాలు అలవాటవుతున్నాయి. స్కూలుపిల్లలలో ఎవరో వక రిద్దరుమాత్రం ఈవిధంగా పనిచేయడం, మిగిలినవాళ్లు ఎవరిధోరణిని వా ళ్లుండడం కాదు, ఆ పిల్ల లందరూ ఈకొత్తపద్ధతుల విద్యాభ్యాసం చేస్తున్నారు. పిల్ల లందరికీ అందుకు అవకాశాలు కల్పిస్తున్నారు.

కాని ఇంకా అనేక స్కూళ్లలో శిశువిద్య ఈ పద్ధతులమీద జరగటం లేదు. స్కూళ్లలో చేరిన శిశువులలో చాలామంది స్కూలంటే నరుకంటే, యెడముఖం పెడముఖంగా వున్నారు. సరియైన అనుపాట్లు లేవు, శిక్షణ లేదు, ఆత్మశాసనము(self control) లేదు. వారికి స్కూలుపద్ధతులంటే తృప్తి కలగటంలేదు. స్కూలు ప్రపంచకం, అచ్చటి పరిస్థితులు, వారి వయస్సుకు వారిభావాలకు, ఉత్సాహాలకు అనుకూలంగా లేవు; ప్రోత్సాహకరంగా లేవు. తమకు ఏయేమార్గాల అభివృద్ధి అవసరమో, అందుకు ఏయే అనుకూలపరిస్థితులను కల్పించాలో కనుక్కునేవాళ్లు లేరు. స్కూలుకు వెళ్లడంవల్ల వారి కేమీ ప్రయోజనం కలగడం లేదు. వారి మనస్సుకి స్కూలు ఉన్నా లేనట్లుగానే వుంది. అట్టి బిడ్డలు పైతరగతులకు పోయినా చాలా ఇబ్బంది పడుతున్నారు. ఉపాధ్యాయులకు చాలా శ్రమ కలుగచేస్తున్నారు. వారికి క్రిందితరగతులలో పనిపాటలంటే సరియైన అలవాట్లు చిన్నప్పుడు పోవడమే ఇందుకు కారణం. వారు క్లాసులో వున్నప్పటికి గాలివుగా మేష్టర్ల చేయి దాటిపోతున్నారు. వారిని దారిలోకి తీసుకురావడానికి మాష్టర్లు ప్రత్యేకంగా వారి సంగతి కనుక్కోవలసి వుంటోంది. ఎప్పుడూ వారిని అదిలిస్తూ పాడిస్తూ వాలిస్తూవుంటేనేగాని వారు పాఠాలుచదువులో శ్రద్ధ తీసుకోరు. అంతమందిపిల్లలమీద ఒక్కొక్కరినిగురించి అట్లా చేయడానికి తగిన వ్యవధానంగాని, ఓపికగాని మేష్టర్లకుండదు. అసలు పిల్లల ప్రవృత్తులను కనిపెట్టి ఆలోచనలను సవరించగల ఉపాధ్యాయులూ తీరుబడి తల్లిదండ్రుల కరువైనవి.

పెద్దతరగతులలోనే పిల్లకు పని అంటే సహజమైన ప్రేమ యేర్పడాలి. ఉపాధ్యాయుల భయంతో గాని, పరీక్షల లంపటంతోగాని సంబంధం లేకుండా మనస్ఫూర్తమైన సరదా, సంతోషము, అభిమానము, ఉత్సాహము యేర్పడాలి. ప్రతి విషయంలో శిశువు సహజంగా వుంటుంద అన్నదే యీ వయస్సులో కనుక్కోవలసిన చాలా ముఖ్యమైన విషయం. ... ఉండవచ్చును. నేర్చుకున్న విషయాలలో ఎక్కువతక్కువలుండవచ్చును. కాని ప్రతిక్షణము పిల్లలందరికీ శిశువుకు పనిపాటలంటే ఆసక్తి, సరదా, పెద్దవారి అంచాలతోటి భయభక్తులతోటి సంబంధం లేని సహజమైన తృప్తి — ఇవి యేర్పడాలి.

ఇప్పటి పిల్లల స్కూళ్లు పద్ధతులలో యీ నేరు ప్రత్యేకముగా మొదలైన విధానాలలో అపాయము లున్నాయని విద్యావిషయం గల సంస్థలు హెచ్చరిస్తున్నారు. అనేకవిషయాలనుగురించి బిడ్డలకు తాత్కాలికమైన పైపై ఆసక్తిని కలిగించి ఏవో రెండుమూడు సంగతులతో ఆ ఆసక్తిని తృప్తిపరచడంవల్ల 'ఇవన్నీ మా కిదివరకే తెలుసును' అన్న నిర్లక్ష్యం, ఇకముందు వాటినిగురించి తెలుసుకోడానికి కావలసిన ఉత్సాహము, వింతభావము, కొత్తదనము లేకపోవడం — ఇటువంటి నష్టా లనేకము న్నాయి.

"అనేక విషయాలలో అభిరుచి పుట్టించడమే విద్యయొక్క పరమోద్దేశం కాదు. ఇంకా అధిక పరిశ్రమకు ప్రోత్సాహం కల్పించడమే ఆ అభిరుచి యొక్క ప్రయోజనం"

అని జీనే అనే ఆయన. ఏదైనా ఒకవిషయంలో అప్పటికప్పుడు అంతమయ్యే అభిరుచి కల్పించడంకంటె అసలు కల్పించకపోవడమే నయం. విస్తర్లో వడ్డించిన పదార్థాల నన్నిటినీ రుచిచూసి ఒకదానినీ తృప్తిగా ఆరగించని విందులాగ, కుమ్మరిపురుగు మొదలు ఖగోళం వరకూ విద్యార్థులు అన్ని సంగతులూ ఎరుగుదురు. కాని ఒక్క విషయమూ లేదు వారికి. పరిసరాలతో సంబంధంలేకుండా ఏదో ఒక్క విషయమైనా ఇంకా బాగా గ్రహిద్దాం అన్నకోరిక ఎన్నడో చచ్చిపోయింది.

ఈవిధంగా అభిరుచి పుట్టించి చంపివేయడం కంటె అసలు పుట్టించకపోవడమే మేలు. దైవస్వరూపమైన ఆకలిం ముందుముందు గనుల్లో కనవచ్చును; ఆమహోత్కృష్ట వస్తువైనా లభ్యం కావచ్చును.

అసలు చిక్కేమిటంటే? శ్రమా అదుర్దా లేకుండా లభించిన విద్య విలువ వుండదు. సామ్యవాదులుగా విద్య కూడా కష్టపడి సాధించవలసిన వస్తువు. ప్రయాసపడి ఆర్జించినప్పుడే దాని విలువ తెలుస్తుంది. దానిని పోషించి అభివృద్ధి చేసుకోవాలన్న ఉత్సాహం వుంటుంది. ఎక్కువ ఆడంబరంతో, అలంకారాలతో, పటాటోపంతో, సినిమాలతో, గోడబొమ్మలతో, పెద్ద పెద్ద బాలవిజ్ఞానసర్వస్వాలతో, బహుమతులతో బతిమాలడంతో విద్యార్థుల దృష్టిని బలాత్కారంగా విద్యమీద నిలిపి వారిమెదడులో కొన్ని సంగతులను ఎక్కించగలిగినా జ్ఞానం వికాసం అభివృద్ధి పొందజాలదు. నీడలో పెరిగిన మొక్కవలె ఆవిద్యకు ఎదుగుబొదుగు లుండవు. నిజమైన అభిరుచితో నేర్చిన విద్య కుండే ప్రాణకళ వుండదు.

విద్యార్థులలో అణకువ భయభక్తులుగల కొంత మంది స్కూలు చదువంటే పుస్తకాలు బట్టీపట్టడం, వాటిలోనున్న సంగతులను జ్ఞాపక ముంచుకోవడం అని గ్రహిస్తారు. వారు ఏం చదువుతున్నారో, ఎందుకు చదువుతున్నారో గ్రహించకుండానే చిలుకపలుకుల వలె విద్యాభ్యాసం చేస్తున్నారు. కాని కొత్తపద్ధతుల విద్యాభ్యాసం చేసినవిద్యార్థులవలె వారికి స్వతంత్రపు ఆలోచనా, బుద్ధికుశలతా, కొన్ని సంగతులనుబట్టి మరి కొన్ని సంగతులను గ్రహించడం — ఇటువంటి తెలివి తేట లుండవు. ఎక్కువ తెలివితేటలుగల కొద్దిమంది కేలోపా లుండకపోయినా మిగతా సామాన్య విద్యార్థు లందరూ వెనుకబడుతున్నారు.

ఈ వయస్సులో దేశచరిత్ర, భూగోళం, ప్రకృతిశాస్త్రం, లెక్కలు మొదలైన విషయాలను ఎంతవరకు నేర్పాలి ? ఏవిధంగా నేర్పాలి ? ఇందును గురించి ఇంగ్లాండుదేశపు అనుభవాలను మనకు అవసర మైనంతవరకు వివరిస్తాను.

శిశుతరగతులలో ఈ విషయాలను అచ్చు టచ్చుట కథల రూపకంగా ప్రవేశపెట్టి నేర్పాలిగాని ప్రధానవిషయాలుగా నేర్పరాదు. కథలద్వారా బిడ్డ యొక్క ఊహాపోహలను పురికొల్పి అవిధంగా వీటిలో బిడ్డలకు అభిరుచి కల్పించాలి. తమవూరు, అక్కడి పరిస్థితులు, జీవితవిధానము, యిల్లూ, వాకిలి వీటి నుంచి బిడ్డయొక్క దృష్టిని ఇతర దేశాలకూ, ఇతర పరిస్థితులకూ మళ్లించడానికి ఈ కథలు పునాదులుగా వుండాలి. తన బొమ్మరిల్లు, బొమ్మల దుకాణం, తోట, బొమ్మల సేనలు, యుద్ధాలు — వీటిని యేర్పాటు చేసే టప్పుడు వాటికి సంబంధించిన ఇతర ప్రదేశా లేమిటో, "పట్నవాసానికీ, పల్లెటూరికీ మధ్య వుండే సంబంధ మేమిటో, అవి ఒకదానిమీద ఒకటి ఏ విధంగా ఆధార పడి వున్నాయో", తన ఆటవస్తువులకు పనిముట్లకు సంబంధించిన దేశపటాలను తయారుచేయడ మెట్లో - ఇటువంటి విషయాలనుగురించి బిడ్డలు ప్రశ్నలను అడిగేటట్లు, ఊహించుకొనే టట్లు చేయాలి. ఈ అనుభవాలు బిడ్డ యొక్క ఊహాపోహలను అభిరుచులను వికసింపజేసి హైస్కూలులో దేశచరిత్రను భూగోళాన్ని నేర్పడానికి మంచి అవకాశాలు ఇస్తాయి.

"కాలమూ దేశవిస్తీర్ణమూ అన్న విశాల భావాలు బిడ్డలకు కొంత ఆలస్యంగా గాని యేర్ప డవు. కాబట్టి దేశచరిత్రనుగురించి భూగోళాన్ని

గురించి వారికి ప్రత్యక్షంగా యేసంబంధమూ లేని విడివిడి కథలు చెప్పడంవల్ల వారి లేరి మవస్సులు ఖంగారుపడతాయి. కాబట్టి యీ వయస్సులో దేశచరిత్రను భూగోళాన్ని అవసరం వచ్చినకొద్దీ, అవసరం వున్నంతమట్టుకే నేర్పడం మంచిదిగాదా?"

అబిసీనియాలో కంచరగాడిద లుంటాయనీ, సైబీరియాలో తోలుచొక్కాలు తొడుగుతారనీ,-ఇటువంటి విషయాలను మన స్కూళ్లలో నేర్పుతున్నారు. విప్రవినోదివాని సంచిలో సామానువలె ఏ ప్రయోజనమూ సంబంధమూ లేని ఇటువంటి విషయాలను అనేకం విద్యార్థు లెరుగుదురు. ఆ పాండిత్యంయొక్క ఉపయోగ మేమిటో, ఆ విషయాలను సమన్వయం చేసుకోవడం ఎట్లాగో ఉపాధ్యాయులకే తెలియదు

ప్రకృతిశాస్త్రం, సైన్సు :- మామూలు ప్రకృతి శాస్త్రానికీ సైన్సుకీ ఇంతకన్న అధికంగా వర్తిస్తుంది. అదికాక ఈ వయస్సులో బిడ్డలు సహజంగానే పక్షుల్నీ, పెంపుడుజంతువుల్నీ, మొక్కల్నీ పరిశీలిస్తూ వుంటారు. ఆ పరిశీలనలను విస్తారంగాను, మనసుకు నాటేటట్లుగాను చేయించడమే స్కూలులలో జరగవలసినపని. భూమిలో మొక్కలను నాటడం, పెంచడం, సహజ పరిస్థితులలో అవి పెరుగుతూవుంటే వాటిని పరిశీలించడం బిడ్డలకు నేర్పడానికిబదులు, చిక్కుడు గింజలను అద్దుడుకాగితాల మీదా గ్లాసుపాత్రలలోనూ పెంచడం నేర్పి, ప్రకృతిలో బిడ్డలకు అభిరుచి కలిగించడానికి బదులు మొదటినుంచీ వారిని ప్రకృతికి దూరం చేస్తున్నారు. దానినే సైన్సు, నేచరుస్టడీ అంటున్నారు. సహజమైన ప్రకృతినుంచి పాఠాలు నేర్చుకోడానికి బదులు ఉపాధ్యాయుడిచేత కల్పింపబడిన కృత్రిమపద్ధతులలో బిడ్డ విద్యను అభ్యసిస్తోంది.

కళలు, చేతిపనులు :— "పై తరగతులలో విద్యార్థులకు వ్యవధి చాలదని అనేక స్కూళ్లు చేతిపనులను నేర్పడం మానివేస్తున్నాయి. చేతిపనులలో అర్థితంటే ఒకవృత్తి పనిలో తమజీవితాన్ని గడపబోయే విద్యార్థులను చిన్నప్పటినుంచీ ఆవృత్తిలో తర్ఫీతుచేయడం కాదనీ, విద్యార్థులు స్కూలులలో అభ్యసించే చేతిపనులకూ జీవితంలో అనుసరింపబోయే వృత్తులకూ సంబంధం వుండనక్కరలేదనీ, స్కూలులలో చేతిపనులను అభ్యసించడం నిస్సందేహంగా మెదడుకు విలువయైన విద్యాసాధకమనీ కొన్ని కొన్ని హైస్కూళ్లు శిశుతరగతుల అనుభవాన్ని బట్టి ఇప్పు డిప్పుడే గ్రహిస్తున్నాయి. చాలా పాఠశాలలలో శిశువులకు అనేక విద్యావిషయకమైన వస్తువులను వాడడం నేర్పి విద్యానుభవం కలుగజేస్తున్నా గని విని మేము మిక్కిలి సంతోషిస్తున్నాము."

బిడ్డలు రంగులను తమ యిష్టం వచ్చినట్లు వాడి, వేర్వేరు రంగులను గుర్తించి, తమ ఊహాపోహాలను ఆవేశంగా వ్యక్తంచేయగలిగితే ముందుముందు చాలా ఉపయోగంగా వుంటుంది. రంగులతో బిడ్డలు చేసేపనిని వుపాధ్యాయులు నిర్ణయించడంకంటె బిడ్డలఇష్టానికి వదలడమే మేలు. సంకుచితమైన పద్ధతులతో, స్వల్పపరిమాణాలతో, హ్రస్వదృష్టితో బిడ్డలు పనిపాటలను నిర్ణయించడంకన్న బిడ్డల ఊహాపోహాలకు స్వేచ్ఛ ఇవ్వడంవల్ల యెక్కువ ప్రయోజనం వుంటుంది. శిశువులు తమ పనిముట్లను సంతోషపూర్వకంగా వాడడానికి అలవాటుపడి ఆవేశంగా బుద్ధికుశలతను సంపాదిస్తే పైక్లాసులలో విద్యాభ్యాసం సులువవుతుంది.

శిశువులు తమ బొమ్మలకు బట్టలు కుట్టడం నేర్చుకోవడం అవసరం. సూది, దారం మొదలైన వస్తువుల వాడుకలో వుండే మెళుకువలు తెలుస్తాయి ; అనగా, బిడ్డలు ఇప్పటినుంచీ కుట్టుపనిని వృత్తిగా అభ్యసించడం కాదు. ఆవృత్తిని అభ్యసింప గోరేవారు తరువాత సరియైన వయస్సులో అభ్యసిస్తారు. విద్యాభ్యాసానికి సంబంధించినపలునే యిప్పుడు మన మాలోచించవలసిన విషయం.

చేతిపనులను నేర్పుతూవున్న పాఠశాలలలో శిశువులు కాగితాలు, అట్టలు, జిగురు, రంగులు, కర్ర, సుత్తి, మేకులు మొదలైన అనేకవస్తువులను వాడడం నేర్చుకుంటున్నారు. ఆ వస్తువులను వారు స్వేచ్ఛగా తమ ఊహకు తోచినట్లు వాడుతున్నారు. పనిచేయగా మిగిలిన ముక్కలను దుబారాగా పోనీయకుండా వినియోగించడం, తమ పనిపాటలను నిర్ణయించుకోవడం, — ఇటువంటి

సంగతులనుగూర్చి ఆలోచించడం నేర్చుకుంటున్నారు. వారిశీలాలు వారిశక్తి సామర్థ్యాలను మీరుతున్నాయి. ఒకపనిని కల్పించుకొని, దానిని సాధించి, ఆరితేరంగా విద్య నభ్యసించడాన్ని గురించి సరియైన దృష్టిని బిడ్డలకు కలుగజేయవలసినవిధి శిశుగృహాల ఉపాధ్యాయులది.

వ్రాయడం, చదవడం, లెక్కలు — వీటిసంగతి యేమిటి? వీటిని ప్రత్యేక విషయాలుగా నేర్పడం యేవయస్సులో ప్రారంభించాలి? ఏమంటే, ఇవన్నీ కదా మనవుద్దేశంలో ప్రాథమికవిద్య కంతటికీ పరమావధి? ఇప్పటి విద్యావిధానంలో వీటికి ఎంతో ప్రాముఖ్యం యిచ్చి యింతకన్న ముఖ్యమైన విషయాల సంగతి మరచిపోతున్నాం కదా!

విద్యార్థులకు పనిచేయాలనే సరియైన ఉత్సాహం శ్రద్ధా చిన్నతనంలోనే కలగాలనీ, నాటికి పునాదులు శిశుతరగతులలోనే పడాలనీ, ఇది దశ వయస్సులో బిడ్డలు వ్రాయడం, చదవడం, లెక్కలు చేయడం నేర్వడంకంటె చాలా అవసరమనీ ఇదివరలో చెప్పి వున్నాము.

ఈ మూడూ [illegible] తరగతులలో గడపని మాట నిజమే. మనుష్యుల బుద్ధి విద్యాభివృద్ధికి ఇవి మిక్కిలి అవసరం అన్నమాటకూడా నిజమే. వీటిని నేర్పడం ఏవయస్సులో ప్రారంభించాలి? ఎంత త్వరగా ప్రారంభిస్తే అంత శ్రేయమని కొందరు. ఈ మూడుశాఖలలో ప్రవీణత సంపాదించడమే పిల్లల తెలివితేటలను ప్రమాణమని నమ్మేవారి అభిప్రాయమిది.

బిడ్డకు ఆరేళ్లు నిండినతర్వాత నేర్ప వచ్చునని మరికొందరు. ఆరేళ్లు వచ్చినప్పుడు బిడ్డ ఈ మూడు విద్యలను సులువుగా గ్రహించగలదనీ, వాటిని ఆ వయస్సులో నేర్చుకోవడంవల్ల బిడ్డయొక్క శరీరానికి మెదడుకి కలిగే శ్రమ తగ్గుతుందనీ, లెక్కలు అంటే ఇప్పుడుండే అయిష్టతా కంటకింపూ తగ్గుతాయనీ వారి వాదన.

“సరియైన పద్ధతులమీద నేర్పితే ఒకయేడాదిలో బిడ్డలు చదవడం నేర్చుకోగలరు. ఈ సాధ కొన్ని స్వల్పకాలం ఆపుచేయడంవల్ల తర్వాత బిడ్డలు దానిని ఎక్కువ సులువుగాను ధారాళంగాను నేర్చుకోగలుగుతున్నారని పండితుల అభిప్రాయం.. ఏడో యేట నిశ్శబ్దంగా వాచకాభ్యాసం పూర్తి కావాలి. అంతకు పూర్వమే చాలామంది శిశువులు చదవడం నేర్చుకోడానికి ఆత్రపడుతున్నారు. చదవగలుగుతున్నారుకూడాను.”

వ్రాతవిషయంకూడా అంతే. లెక్కలను ప్రత్యేకంగా నేర్పవలసిన వయస్సునుగురించి తీవ్రమైనచర్చలు జరుగుతున్నాయి. మరీ తొందరగా ప్రారంభించడంవల్ల పిల్లలకు చాలా ఖంగారు, అపకారమూ జరుగుతున్నాయని కొందరు. డాక్టరు బల్లార్డు తన ‘ఫండమెంటల్ అర్థమెటిక్’ (Fundamental arithmetic) అను గ్రంథంలో, ప్రత్యేకం వ్రాతపూర్వకంగా బిడ్డలకు లెక్కలు నేర్పడం ౮, ౯ ఏళ్లు వచ్చేవరకూ ఆపుచేయాలని సూచిస్తూ, అయినా ఇప్పటి ఆచారం ఇందుకు విరుద్ధంగా వుంది కాబట్టి అంతకు తక్కువ వయస్సులోకూడా, స్వల్పస్వల్పంగా క్రమంగా సాచ్చేటట్లు, నేర్పవలసిందని వ్రాశాడు! ఆచారం అంటే ఇంగ్లాండులోకూడా అంత భయమే!

కాని శిశుతరగతులలో ప్రత్యేకం వ్రాతరూపకంగా లెక్కలను నేర్పడం తగ్గించాలి అన్న అభిప్రాయం బలపడుతోంది. బిడ్డలు తప్పులు లేకుండా లెక్కపెట్టడం నేర్చుకోవాలి. అంకెలతో ఆలోచించడం నేర్చుకోవాలి. ఈ లెక్కించడమూ ఆలోచనా బిడ్డలు చేసే యథార్థమైన పనిపాటలకు సంబంధించి వుండాలి. యథార్థమైన అనుభవాలమీద ఆధారపడి వుండాలి. ఇప్పటి స్కూళ్లలో అక్షరాభ్యాసం అయినప్పటినుంచీకూడా అంకెలను లెక్కలను ప్రత్యేకంగా వ్రాతరూపకంగా నేర్పడం అలవాటు. పిల్లలు కూడిక, తీసివేత వగైరాలకు సంబంధించిన మానాలను సరిగానే అప్పగిస్తున్నారు. కాని వాటి అర్థంగాని ఉపయోగంగాని వారు గ్రహించటం లేదు. అందుకు సంబంధించిన పనిని చేతికిస్తే ఆ మానాలను వుపయోగించలేక ఖంగారు పడుతున్నారు.

కొన్ని స్కూళ్లలో యథార్థమైన చేతిపనుల ద్వారా, అంకెలతో సంబంధించిన ఆటపాటలద్వారా లెక్కలను నేర్పి ముందుముందు గణితశాస్త్రాభ్యాసానికి మంచి పునాదులు వేస్తున్నారు గాని, "బిడ్డలు గ్రహించిన విషయాన్ని పట్టిక (Statement) రూపంగా వారిచేత తిరిగీ తిరిగీ చెప్పించి అలవాటు చేయటంలేదు. అది చాలా అవసరం. బిడ్డలు ఒకసారి నేర్చుకున్న పద్ధతిని తిరిగి తిరిగి వాడుకలో పెట్టి, జ్ఞప్తియం దుంచుకోనియెడల పై తరగతులలో శాశ్వతమైన పద్ధతులద్వారా విద్యాభ్యాసం చేయడానికి మంచి అవకాశం దాటిపోతుంది. ఆరూ నాలుగూ కలిసి పది కాబట్టి, ఇరవైఆరూ నాలుగూ ముప్ఫై అని వేళ్లమీద లెక్క పెట్టుకోనక్కర లేకుండా వెంటనే తెలుసుకోగల అంకెలజ్ఞానం కుదిరితే, ఆవస్తువు దీనికంటె పొడుగు లేక పొట్టి, లేక బరువు, లేక తేలిక అని గ్రహించగలిగితే పైక్లాసులలో అంకెల రూపకంగా ఆలోచించడం సులువౌతుంది. విరివిగా వస్తువులను వాడి, ప్రత్యక్షంగా అనుభవం గడిస్తేనేగాని ఈ అలవాటు కుదరదు. ఈ విధంగా పట్టీలను తయారు చేయడంలో, అంకెలను చదవడానికి వ్రాయడానికి అవసరం వుంటుంది. బిడ్డల ఆటలలో ఈజట్టు, ఆజట్టు పిల్లలసంఖ్య, గెలిచినమార్కులు, వారి ఆటవస్తువులు, గోళీలు, గవ్వలు, చింతగింజలు, గచ్చకాయలు, వారు ఖర్చుచేసే పైకం, క్లాసులో అమర్చిన కుర్చీలు, మేజాలు,-వీటి నన్నిటిని లెక్క పెట్టించవలసివుంటుంది. ఈ వయస్సులో వారు నేర్చేగణితం వీటికి సంబంధించి వుంటే, తరువాతక్లాసులలో వారు చేయబోయే లెక్కలు సులభమౌతాయి. 'లెక్కలు' అంటే బ్రతికి వున్నంతకాలం హడలు పుట్టదు.

ప్రత్యక్షానుభవ మొక్కటే మానసికాభివృద్ధికి సరియైన పునాది. అర్థమూ, ఆలోచనా, ఉపయోగమూ లేకుండా లెక్కలు చేయించడం, వాటిలో పిల్లలకు అభిరుచి కలిగించడం కాదు — నిరుపయోగమైన పద్ధతి కోసం అభిరుచిని చంపడం - వాఙ్మయంలో అభిరుచి కలిగించకుండా ఛందస్సు వ్యాకరణాలతో విద్యాభ్యాసం ప్రారంభం చేయడంవంటిది; పాటలలో అభిరుచి కలిగించకుండా సరిగమలతో సంగీతవిద్య ప్రారంభించడంవంటిది.

పై తరగతులలో లెక్కలు నేర్పడాన్ని గురించి చేయబడ్డ సూచనవలన ఈవిషయం ఇంకా స్పష్టం కాగలదు.

"బాలురు చిన్న చిన్న తోటలను ఏర్పాటు చేయడం, వాటిని కొలవడం, వాటికి కావలసిన వస్తువుల ఖరీదు కట్టడం మొదలైన పనులద్వారా లెక్కలను చేసి గణితశాస్త్రంలో చాలా భాగాన్ని అభ్యసించవచ్చును. ఇటువంటి పనులు చేయడమంటే పిల్లలకు సరదాగా వుంటుంది. ఇగ్లాండు దేశంలో చదువులో చాలా వెనుకబడివున్న ఒక ఆడపిల్లల స్కూలులో, పిల్లలకు లెక్కలు రాక మాస్టరుకు విసుగెత్తింది. అందుకని స్కూలులో నేతపనిని ప్రవేశపెట్టి దానికి లెక్కలు నేర్పడంతోటే లెక్కలలో అద్భుతమైన అభివృద్ధి కనపడింది. మగ్గంమీద తప్పులు రాకుండా నమూనాను తయారు చేయవలసివుండడంచేత దారాలను తప్పులు లేకుండా లెక్క పెట్టవలసివచ్చేది. ఎక్కడైనా లెక్క తప్పితే అది వెంటనే మగ్గంమీద కనపడేది."

ఇదే గాంధిగారు చెపితే విశ్వసించముగదా!

అల్లాడరెడ్డి - అలఫ్‌ఖానుడు

డాక్టర్ యన్. వెంకటరమణయ్య

౧

నిశ్శంకకొమ్మనకవి శివలీలావిలాసమునందు, అల్లాడరెడ్డియొక్క విజయముల నెన్నుచు,

'ధారాసురత్రాణ [illegible]
[illegible]'

అని చెప్పియున్నాడు. శ్రీనాథుడుగూడ ధారాసురత్రాణునిపై గెల్చిన విజయమును పేర్కొనియున్నాడు. కాని, యీ విజయమునందువాని అల్లాడరెడ్డియొక్క పుత్రులగు వీరభద్రేశ్వర వేమపృథ్వీధవులని వచించియున్నాడు.

'ధారాసు[illegible]
[illegible]
[illegible]
[illegible]'

— కా., ౫: ౩౩౬.

'ధారాసురత్రాణ[illegible]'

— కాశీ, ౬: ౩౧౯.

ధారాసురత్రాణ[illegible]
[illegible]
...వీరభద్రేశవేమపృథ్వీశ్వరులు"

— — భీమ., ౧: ౨౮.

కొమ్మనయు, శ్రీనాథుడును రాజమహేంద్రరెడ్ల యాస్థానకవులు; మఱియును అల్లాడ వీరభద్రేశ్వర వేమపృథ్వీధవులకు ఆశ్రితులు, సమకాలికులు. కావున వీరు వాస్తవవిషయమును వర్ణించునపుడు పరస్పరవిరోధమునకు ఎడముండదు. స్థూలదృష్టికట్లు తోచినను చక్కగ చింతించి చూచిన వీరిభావము లేకీభవించునుగాని భేదమునందదు. వీరభద్రేశ్వర వేమపృథ్వీధవులకు అల్లాడరెడ్డి తండ్రియగుటచేతను, వారిది యవిభక్తకుటుంబమగుటచేతను, వాస్తవముగ కొడుకులే ధారాసురత్రాణుని నిర్జించి జయము గొన్నను, సేనానాయకుని జయములు రాజును జెందినట్లు, రాజమహేంద్రవర రెడ్డిరాజ్యమునకు సర్వాధికారియై ప్రభుత్వము నెఱపుచున్న తండ్రియని తలచుట సహజమేయగును. కావున అల్లాడరెడ్డియే ధారాసురత్రాణు నోడించి యతని ఘోటకములను కొల్లవట్టెనని నిశ్చయింపవచ్చును.

ఈ ధారాసురత్రాణు డెవ్వడో, వాని కల్లాడరెడ్డికి ఏల విరోధము గలిగెనో విచారింపవలసియున్నది. ధారాపట్టణము మాళవదేశమునకు రాజధానియని భోజచరిత్ర నెఱిగినవారి కందఱకును దెలిసినవిషయమే. భోజుని యనంతరము కొంతకాలమునకు మాళవదేశము మ్లేచ్ఛాక్రాంతమాయెను. అది మొదట ఢిల్లీ సామ్రాజ్యాంతర్గతమై, తురుష్కపాదుషాహుల యేలుబడికి లొంగియుండి కాలక్రమమున వారిశక్తి సన్నగిల్లి యధికారము క్షీణించగా మరల నొకస్వతంత్రరాజ్యమాయెను. మాళవదేశస్వాతంత్ర్యమును పునరుద్ధరించినవాడు దిలావరుఖాన్ అను అఫ్ఘాను మహమ్మదీయుడు. ఇతడు క్రీ. శ. ౧౪౦౫ వఱకు రాజ్యముచేసి దేహము చాలించెను. ఇతనియనంతరము ఇతని

ప్రథమపుత్రుడు సుల్తాను హూషంగ్ ఘోరీ సింహాసనము నధిష్ఠించి క్రీ. శ. ౧౪౦౫ మొదలు ౧౪౩౨ వఱకును రాజ్యమొనర్చెను. అల్లాడరెడ్డిరాజ్యకాలము క్రీ. శ. ౧౪౧౬ మొదలు ౧౪౨౪ (?) వఱకు నగుటచేత, అతనిచే నిర్జితుడైన ధారాసురత్రాణుడు హూషంగు ఘోరీయై యుండవలయును. ఈయూహ సరియైనదేయని శాసనసాక్ష్యము ఋజువు చేయుచున్నది. హూషంగ్ ఘోరీ యనునది యాతని వాస్తవనామధేయము గాదు; సింహాసనము నధిష్ఠించినపుడు వహించిన బిరుదనామము. అతనికి తల్లిదండ్రులు పెట్టిన పేరు అలఫ్‌ఖాను.[1]

అల్లాడరెడ్డి యొక అలఫ్‌ఖానుని ఓడించినట్లు అల్లయవేముని వేమవరము దానశాసనమువల్ల దెలియుచున్నది.

జిత్వా సల్ప వికల్ప కల్పితబలం తం చాల్ఫఖానం రణే
మిశ్రీకృత్య సమాగతం గజపతిం కర్ణాటభూపం చ తం
హత్వా కోమటివేమసైన్యనికరం భూగోపి రామేశ్వరే
ప్రాజ్యం రాజమహేంద్రరాజ్య మకరో దల్లాడపృథ్వీ
శ్వరః[2]

కావున, శ్రీనాథాదులు జెప్పినట్లు అల్లాడరెడ్డియు నతని పుత్రులును ఓడించినది ధారాసురత్రాణుడు అలఫ్‌ఖాను డను నామాంతరము గల సుల్తాను హూషంగ్ ఘోరియే.

౨

ఇక హూషంగ్ ఘోరీతోడ రాజమహేంద్రప్రభువులకు వైర మెట్లు కలిగెనో, వానితో వారెచ్చట పోరి విజయము నందిరో కనుగొనవలసియున్నది. హూషంగ్ ఘోరీ సింహాసనము నెక్కినప్పటినుండియు గుజరాతు సుల్తానగు అహమ్మదుషాహతో ద్వేషించి పలుమా రాతనిరాజ్యముపై దాడి పెట్టియు నాతని జయింపలేకపోయెను. భగ్నమనోరథుడయ్యు నాశ వదలక పునఃపునః ప్రయత్నములు సేయుచుండెడివాడు. అహమ్మదుషాహతోడి పోరున పలుమారు తనకు అపజయము గలుగుటకు దనగజదళదుర్బలత్వమే కారణమని యూహించి, యాలోపమును దొలగించుకొనుట కొకమార్గమును గనిపెట్టెను. ఆకాలమున నేనుగులకు బ్రసిద్ధివహించిన యుత్కళదేశమున నలయు నేనుగులను సులభముగ సంపాదింపవచ్చునని తలచి యప్పటికి నొక సన్నాహము చేసికొనెను. ఉత్కళప్రభువగు నాల్గవ నరసింహగజపతి గుఱ్ఱములను ప్రత్యేకముగ నపేక్షించుచుండువాడు. గంగాగౌణధూసరవర్ణములగు గుఱ్ఱములనాతడు మెచ్చుకొనువాడు. ఈవిషయమును గ్రహించి, అలఫ్‌ఖానుడు గుఱ్ఱపు వ్యాపారివేసమును ధరించి పసగుట్టు వెల్లడి కాకుండుటకై, గజపతిమెచ్చుకొనునట్టివన్నెల గుఱ్ఱములను పెక్కింటిని సేకరించి, ఇంకను ఉత్కళమున సామాన్యముగ లభ్యముగాని సామగ్రులను గొని నెలరోజుల ప్రయాణము జేసి జాజినగరమునకు వచ్చి చేరి రాజునకు తనరాక నెరుకపఱచెను.

"రాజును తనదేశాచారము ననుసరించి, ప్రథమమున తాను వర్తకుడు గొని వచ్చిన వస్త్రములు నొకరోజు వచ్చి తిల

1. ఫెరిష్టా, బ్రిగ్స్ తర్జుమా, సం.౪, పుట. ౧౬౯.
2. ఎపి. ఇండికా, సం. ౧౩, పుట. ౨౪౧.

కించి, వలయువానిని ధన మిచ్చికాని, లేక వానికి ప్రత్యామ్నాయముగ నావస్త్రముల విలువకు సరివిలువగల యేనుగుల నిచ్చిగాని పుచ్చుకొనెదనని తెలియఁబఱచెను. రాజు వస్తువులను జూచుటకై నియమించినదినము వచ్చెను; సామగ్రు లన్నియు వీక్షణసౌకర్యార్థము తగురీతిని పఱచియుంచఁబడెను; ఆకాశ మంతయు మేఘచ్ఛన్నమై వర్షము వచ్చునట్లుండెను; దానిం జూచి సుల్తాన్ హాసంగు (అలఫ్‌ఖానుఁడు) అచ్చటి వారితో వర్షము వచ్చినట్లయిన, నచ్చట పఱచియుంచియున్న వస్తువు లన్నియు తడిసి పాడగు నని చెప్పెను; కాని రాజపరివారము నమ్మప్రభువు వచ్చునర్యంతము వస్తువు లన్నియు పఱచియే యుండవలయునని పట్టుపట్టిరి. మఱియు పరిశీలనార్థము గుఱ్ఱముల కన్నిటికి పల్లములువేసి సంసిద్ధపఱచిరి. కడపట రాజు వచ్చెను; నుఱికొంతతడవునకు గాలివానయు వచ్చెను. ఆయదను వృడిలో రాజుతోగూడ వచ్చిన యేనుగులగుంపు పఱచియుంచిన వస్తువులను త్రొక్కి పాడు చేసెను. సుల్తాన్ హాసంగు పాడైనవస్తువులను జూచి మండిపడి, తనపరివారమును పల్లములువేసి సిద్ధముగ నిలిపియుంచిన యశ్వముల నారోహింపుమని యాజ్ఞాపించి, కొంకు కొసరు లేక రాజపరివారముపై గవిసి యనేకులను వధించి రాజును చెరపట్టెను. తరువాత సుల్తాన్ హాసం గారాజునకు తన్నెఱుకపఱచుకొనెను. ఇట్టి యవస్థయందు చేయునదిలేక జాజినగరప్రభువు తన్ను విడుదలగావించుటకై సుల్తాన్ హాసంగుకు ఱెబ్బదియైదు ఏనుగుల నిచ్చుట కంగీకరించెను; కాని హాసం గారాజును జాజినగరరాష్ట్రపు పొలిమేర దాటువఱకును వదలిపెట్టలేదు; పొలిమేర దాటినవెంటనే యాతనిచే మఱికొన్ని చక్కనియేనుగులను గొని స్వరాష్ట్రమునకు బోవ నతని కనుజ్ఞ యిచ్చెను"[3]

ఈపైకథవల్ల ధారాసురత్రాణుఁడైన సుల్తాన్ హాసంగుఘోరీ క్రీ. శ. ౧౪౨౧ లో ఉత్కళమునకు మారువేసముతో వచ్చి మోసముమీఁద నాదేశపురాజైన నాల్గవ నరసింహుని చెరబట్టి యేనుగుల నాతనివల్ల గొని విడిచిపెట్టెనని తెలియుచున్నది.

శ్రీనాథుఁడును నిశ్శంకు కొమ్మనయు ధారాసురత్రాణుని అల్లాడరెడ్డియు, నాతని పుత్రులును నోడించినట్లు చెప్పుచున్నారు గదా; వారివ్రాతల యాథార్థ్యమును వేమవరతామ్రపట్టిక రుజువుచేయుచున్నదిగదా; అల్లాడరెడ్డియు నాతనికొడుకులును నెచ్చట ధారాసురత్రాణుని జయించిరో కనుగొనవలసియున్నది. పైపేర్కొన్న గ్రంథకర్తల వల్లగాని, శాసనమువల్లగాని వా రాతని నెచ్చట జయించిరో తెలియవచ్చుటలేదు. కాని యావిజయము వారికి కళింగప్రాంతమునసే చేకూడియుండును. ఏలన, రాజమహేంద్రవరపు రెడ్డిరాజులు మాళవదేశముపై దండువెడలిన ట్లెచ్చటను జెప్పబడి బడియుండలేదు. మఱియు నట్లు దండెత్తిపోవుటకు నవకాశము గాన్పించదు. మధ్యాంధ్ర మాళవదేశములకు నడుమ నెన్నియో స్వ

---

౩. ఫెరిష్టా; బ్రిగ్సతర్జుమా, సం. 4, పుటలు. 178-179.

తంత్రరాజ్యము లుండెను. వీని నన్నిటిని దాటి రెడ్డిరాజులు మాళవపర్యంతమును దండయాత్ర సాగించిరనుట నమ్మదగినవిషయము గాదు. కావున జాజినగరమునకు వచ్చినప్పుడే రెడ్లు ధారాసురత్రాణుని నిర్జించియుండిరని తలచుట యొప్పును. జా. నగరమునుండి వెనుదిరిగిపోవునపుడు సుల్తాను రెడ్డిరాజ్యముగుండ ప్రయాణము సల్పియుండును. అప్పు డల్లాడరెడ్డి వాని నడ్డగించి, కయ్యమున నోడించియుండును. ధారాసురత్రాణుని నోడించుటయేగాక యాతనిగుఱ్ఱములను కొల్లపెట్టించెనని కొమ్మన్న చెప్పుచున్నాడు. గజపతి నరసింహునికి చూపి యావనికంట దమ్మువైచుటకు అల్లాఖానుడు వసతో గొనివచ్చిన గుఱ్ఱములే కాబోలు నివి.

ఏరోజు ఎల్లాంటిదో!

కొల్లకూరి దయానిధిరావు

వెంకటసామి కుటుంబానికి నౌకరీ ఐదారు సంవత్సరాలుగా లోకఉద్యోగమయింది [illegible] పనిచేశాడు. వంచిననడుము వంచినట్లైపే ఉండేది; [illegible] అతనికి నల్లే ఉండేవి. కాని [illegible] చేసినా అతనికి మాట తక్కేదికాదు. [illegible] యజమానురాలు మంచివారు కాదు. [illegible] పనిచేస్తేగాని

'సామిగా, యింటి [illegible] పిల్ల యేదుపు వినపడటం [illegible]' అని [illegible] యజమానురాలు తిట్టేది.

'వస్తున్నానమ్మా' అని సామి [illegible] కొన్ని పండలు తిట్లు [illegible] పట్టేది

బజారుపనికి కూడా [illegible] సామికే పంపే వారు. అతను [illegible] ఆలస్యమైతే

'ఇంత ఆలస్యం [illegible] కొట్టుకో' యని [illegible].

తిట్టినప్పుడు తిట్టినా పట్టెడన్నం దాపరించి పెట్టేది కాదు యజమానురాలు. [illegible] ఒకపూటైనా [illegible] కిచ్చేదికాదు. పాయి లేచే కాని కూరా, కమ్మగా పనివాళ్లకు పెట్టడానికి ఆమెకు చేయి వచ్చేదికాదు.

'ఈతల్లి దొక్కాడే పుట్టిందా'. ఈఅమ్మగారు కనడానికి తలిదండ్రు లెన్ని నోములు నోచారో. దరిద్రకుటుంబంలో పుట్టింది కాబోలు. అంచేతే యీవిడకు పెట్టడానికి చేయిరాకపోవడం' అని పనివాళ్లు లోపల తిట్టుకొనేవాళ్లు.

ఇట్టివారిని కాసిపెట్టుకొని ఉండడము వెంకటసామికి విసుగుతోచింది. జీవితము పాడనిపించింది; రోజులు విచారంగా కనడబడేవి. 'సంతోషము లేకపోయాక డబ్బు ప్రధానమా? రెండురాళ్లు తక్కువయిచ్చినా మంచివాళ్లకి సేవచేస్తే నయమ'ని అతనికనిపించింది.

ఆ జీతం తీసికొని వెంకటసామి అక్కడ పని మానుకొన్నాడు. ఊళ్లో ఐదారిళ్లు ఉతుక్కునేవాడు. భార్యకూడా కొన్నియిళ్లు చేసుకొనేది.

గోనుగా కోడికూతతో లేవడము, అన్నం మూట కట్టుకొని భార్యతో చాకలిరేవుకు పోవడ మతనికి సంతోష మనిపించేది.

మిగిలిన చాకళ్లతో కలసి పనిచేయడం అతనికి హాయి అనిపించింది. కట్టినది గోచీఅయినా, చుట్టినది పాగాఅయినా తనకంటె సుఖపడేవాడు ప్రపంచములో యెవరూ లేరని తలచేవాడు. ఉతక పెట్టి ఉతికి బట్ట లారవేసి పన్నెండు, ఒంటిగంటా అయేటప్పటికి ఒక మర్రిచెట్టునీడను చేరి భార్యతోపాటు కులాసాగా మాటలు చెప్పుకుంటూ ఆగంజీ అన్నము, ఉప్పు పంచభక్ష్య పరమాన్నాలుగా తినేవాడు; అదే అతనికి విందనిపించేది.

ఈవిధంగా చాలాయేళ్లు గడిచాయి; అతను కొంచెండబ్బు నిలవవేశాడు. వాడికులానికి తాగీఅలవాటున్నా అతనికి యిష్టములేకో, మరేకారణముచేతో అతను తాగుడికి అలవాటుపడలేదు. అదీ అతనిఅదృష్టమేమో చెప్పలేను. కాని ప్రతిఆదివారం వాళ్లు మంచిచేప కొని కూరవండుకునేవారు. అతనిగుడిసెకూడా శుభ్రంగా వుండేది. ఒక పాతకుర్చీకూడా యెల్లా సంపాదించాడో కాని వాళ్లయింట్లో వుండేది. పిల్లల నెవరినీ దానిమీద కూర్చోనిచ్చేవాడు కాదు. ఎప్పుడైనా సరదా పుడితే తనే కూర్చునేవాడు; తనకోసం యెవరైనా వస్తే కూర్చోమని ఆకుర్చీ చూపించేవాడు.

అతనిభార్య 'సిరి'కూడా యింటికి కళగా వుండేది. సిరిశలకళ్లు, మోకాళ్లవరకూ పడేజుట్టు, చామన

చాయ మొగము, బిగ్గనై చిన్నన్నటిపుట్టుమచ్చ-వీటితో వీరమ్మ యెప్పుడూ పెళ్లికూతురులా కనబడేది. ఆమెను చూచినవాళ్లందరు 'అందం యేశ్రమా, యేశ్రద్ధా తీసికోని బీదలసొమ్ము కాబోలు'నని అనుకొనేవారు.

మొత్తముమీద వాళ్లు కులంలో భాగ్యవంతులుగా వుండేవారు. సలహాలక్కీ, తగాదాలుతీర్చుకోడానికీ మిగిలిన వాళ్లందరూ వెంకటసామివద్దకు వచ్చేవారు. అతనిభార్య కూడా చాకలిచానల నందరినీ చేరదీసేది, సరదాగా కబుర్లు చెప్పేది.

కాని దేవుడు వాళ్లకు రోజులు సుఖంగా వెళ్ల నిచ్చాడు కాడు. వెంకటసామికి పక్షపాతం వచ్చి మంచం యెక్కాడు. ఒకకాలూ, ఒకచెయ్యీ పడి పోయాయి.

డాక్టర్లచేత మందు లిప్పించారు. చివరికి నేయి వచ్చింది. కర్రతో కుంటుతూ యింట్లో నడిచేవాడు వెంకటసామి. అతనికి దారుఢ్యం చేరేటప్పటికి అతనియింటి పరిస్థితులు అధ్వాన్నం అయాయి. బీదవాడనియైనా కనికరం లేకుండా డాక్టరు జోరుగా బిల్లుచేసాడు. బిల్లు తీర్చేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చింది. నిలవ వేసుకొన్న డబ్బంతా అయిపోయింది.

ఇంతకాలమూ కుటుంబానికి 'వీరే'గతి. ఆమెది యెంతమందికని ఉతకకలదు ? చాలాయిళ్లు మానుకుంగి. బట్ట లాలస్యంగా అందించేది. బట్టలువేసే వాళ్లుకూడా బట్టలు వెయ్యమని వీరిని జడిపించేవారు.

'చాకలి యిల్లా పడిపోయాడు. మీరు మానేక పోతే యింకెవరు దిక్కు?' అని యేడిస్తే వాళ్లు దాని చేతే ఉతికించుకొనేవారు. వీరి యీవిధంగా నానా తిప్పలూపడేది. ఈడుకు వచ్చిన కొడుకేనా లేడని వీరీ, వెంకటసామీ కష్టకాలంలో అనుకొనేవారు.

వీరమ్మ చేసే ఉపచారంవల్ల, ఉపశమనపు మాటల వల్ల వెంకటసామి తిరిగి మామూలు మనిషి అయాడు.

'వీరీ! నీరోజు బాగుంటే, నువ్వు వచ్చినవేళ మంచిదయితే నిన్ను సుఖపెడతా'నని వీరిని ప్రేమతో నిమురుతూ అనేవాడు సామి. తిరిగి యేం చేద్దామా అని శాఖికి తలపులు మొదలుపెట్టాయి. ఏమీ, సాలుపోయిం దికాదు. ఇంటింటా తిరిగి బట్ట లుతికిన లాభం లేదని అతనికి తోచింది. తను వున్న పట్టణములోనే 'లాండ్రీ' పెడదామని అతనికి బుద్ధిపుట్టింది. పెళ్లాంవంటిని కొద్ది బంగారం వుంటే దానిని అమ్మేశాడు. ఆడబ్బు తీసికొని మంచిబల్లలూ, అద్దాలూ కొన్నాడు. పట్టణపు మూల లో ఒకచిన్నకొట్టు అద్దెకు తీసికొన్నాడు. అచటనే రాత్రియనక, పగలనక పట్టుదలతో పనిచేశాడు. మంచి పేరు తెచ్చుకొన్నాడు. ఇప్పు డందరూ బట్టలు సామికే వేసేవారు. వీరి బట్ట లుతికి నేవడము; తాను ఇస్త్రీ చేయడం.

కొంతకాలానికి పనిరద్దీ యెక్కువయిపోయింది. ఇద్దరు, ముగ్గురు పనివాళ్లని చేరికించ పెట్టుకున్నారు; రెండు, మూడు యిస్త్రీపెట్టెలు ఎక్కువ కొన్నారు. పనివాళ్లు యింటింటికి మోసుకెళ్లు ఆలస్యం, ప్రయాసా అనిబట్టలు మోయడానికి రెండు గాడ్దులను కొన్నారు.

స్వయముగా పనిచేయవలసిన రోజులు వెంకట సామికి తప్పాయి. ఇప్పు డజమాయిషీ పనే. లాండ్రీసాపు బిల్లులూ, అక్కౌంటులూ చూసుకొనేవాడు; డబ్బు కోసం యింటింటా తిరిగేవాడు. నెమ్మదివల్లా, శాంతం వల్లా అతడు కొన్నివేలు సంపాదించాడు; కొంతమందిని పోషించగలిగాడు. గర్వ మతనిని దుష్టవాణ్ని చేయలేదు. తన పూర్వపు దౌర్భాగ్యపు రోజుల నతడు మరవలేదు. పెద్ద యిల్లొకటి ఆపట్టణంలోనే కొన్నాడు. యజమాను రాలనీ, యింటిపెత్తనం చెయ్యవచ్చునీ వీరి మహాకులికేది.

౨

అప్పుడే సాయంత్రం అవుతోంది. ఇస్త్రీబట్ట లిచ్చిరావడానికి సామి పనివాళ్లని యిళ్లకి పంపించాడు. తీరుబడిగా కూర్చొని యేదో ఆలోచిస్తున్నాడు.

ఆసమయమున సామిదృష్టి లాండ్రీముందరనున్న ఒక వ్యక్తిమీద పడింది పదినిముషాలనుంచి అత డక్కడే నిలబడియున్నాడు. కాని సామి అదే మొదటిసారి చూడడం అతన్ని.

అతనిని చూడడముతోనే సామిమనస్సు చివుక్కు మంది. అతనంటే జాలితోచింది. పాపం ఇంకో రంగు బట్టతో అతుకులు వేసి కుట్టిన చొక్కా; కంకరబూడిదతో

ఎర్రగా తోలయిపున్న పండు. కన్నీయుల గాయపు మచ్చలు పడిన అతని ముఖాన్ని కప్పిపుచ్చుటకా అన్నట్లు జుట్టు మొగంమీద పడుతోంది. నేరస్థుడివలె అతడు సంకటనామి యుండగ నిలబడ్డాడు.

'ఏం, యిలా వచ్చావు? ఎవరవు నీ' వని సామి అతన్ని ప్రశ్నించాడు.

అతడు పెదవులైనా విప్పలేదు. మాట్లాడా లని ఊహ ఉంది కాని నోటంట వచనం లేదు. కళ్లుమాత్రం బాష్పాలతో నిండిఉన్నాయి. సామి అతనికేసి తదేక దీక్షతో చూస్తున్నాడు.

'రెండు మూడు రోజులనుంచి తిండిలేక యీ విధంగా మాడుతున్నాను. నన్ను పోషించుకోవడం నాకే భారమనిపించింది. అయినవాళ్ల, కానివాళ్ల కడుపులా కాళ్లా పట్టుకొన్నాను. ఇంత నౌకరీ చేస్తాను. బట్ట తిండి పెట్టి పోషించరా? అని అడిగాను. కసిరారు. పోపో అన్నారు.

'జీవితమంటే నాకు విసుగనిపించింది. బతికుంటే కష్టాలు సహించు మేకగా. చచ్చిపోతే క్షేమ మనిపించింది. పాడు ప్రాణాలపై తీపిచేత నే నిట్లా తిరుగుతున్నాను. ఎంచేతో కాని దేవుడు నా కాళ్ల నిక్కడికి లాక్కొచ్చాడు'

అని చెపుతూ చెపుతూ ఆగిపోయి కొత్తమనిషి పెదవులు బిగ్గించాడు.

అతను చెప్పేది సామికి నిజమనిపించింది. ఇంటికి తీసికెళ్లి తిండి పెట్టించాడు. కొంచెం ప్రాణాలు చేరుకొన్నతరువాత సామి యాతనివిషయం అడిగాడు. ఆగంతకుడు తన విషాదచరిత్రాన్ని చెప్ప మొదలు పెట్టాడు.

3

"నా పేరు సూరయ్య. నేనూ, యిదివరకు బాగా వెలిగినవాడిని. నాకు కొద్దో, గొప్పో పొలము, రెండు వేల రొక్కము వుండేవి. తిండికి లోటుండేదికాదు. హాయిగా రోజులు గడిపేవాడిని.

"ఇల్లా వుండగా నాకు పక్కనున్న ఊరు వెళ్లడం తటస్థించింది. ఒకపనిమీద ఆఊరు వెళ్లాను. ఒకవారం అచ్చటనే ఉండవలసివచ్చింది. ఆవారం ఒకయింట్లో మకాము చేశాను.

"ఆయింటి ఆమెకు ఒకకూతురుండేది. వితంతువు. మంచివయస్సులో వుండేది. ఆమె బొట్టుపెట్టుకుంటే యింకా యెంత బాగుంటుందో యని అనిపించేది. ఆమె యంత యందకత్తె కాదు. ఆమె చిఱునగవుకే నే నామెను ప్రేమించాను. నన్ను నేను మఱచిపోయేవాడిని. ఆమె నవ్వేటప్పు డామె మొగమంతా లేయెండలో ప్రకృతివలె హాయిగా కనబడేది.

"ఆమెను చూచినప్పటినుంచీ నామనసు తిప్పుకో లేకపోయాను. ఆమెకోసం నేను చాలా ప్రయత్నించేశా. వాళ్ళకుటుంబమూ అంత పేరుప్రతిష్ఠలు కలదికాదు. అది నాకు తరవాత తరవాత తెలిసింది. చివరకు నా కామె లభించింది.

"ఏదో ఒకవంకమీద వారానికి రెండుమూడు సార్లైనా నే నాగ్రామం పోయేవాడిని. నా కింటిదగ్గర తోచేదికాదు. మా ఆవిడ మొగం చూడడమంటేనే నాకు విసుగ్గా ఉండేది.

"అమాయకులాడి వలపులకు మోసపోయి ఆమెకోరినదంతా యిచ్చాను. నా డబ్బు తగలబెట్టుకున్నాను. నా భూములు పోయాయి. ఇంట్లో అందరికీ నేనంటే కోపంగా ఉండేది. అందరూ నన్ను చూచి అసహ్యించుకునేవారు.

"ఒకరోజున నే నొంటరిగా కూర్చొని యేదో ఆలోచిస్తున్నాను. ఎంచేతో చెప్పలేను కాని నాకారోజున వైరాగ్యం తోచింది. జ్ఞానోదయం అయినట్టు నా కనిపించింది. వేదాంతమార్గంగా తలపులు మొదలు పెట్టాయి. అప్పటినుంచీ నా కావూరన్నా, ఆయువతన్నా విసుగుపుట్టాయి. మళ్లీ ఆగ్రామం తొక్కి చూడలేదు. ఆయువతి పేరు తలవలేదు.

"కాని యేం లాభం! చేతులు కాలింతరవాత ఆకులుపట్టుకోడం అయింది. ఒక నచ్చినస్త్రీని భార్యగా చేసుకొని ఆమెతో రోజులు గడపడము ఉత్తమ మనిపించింది.

"అప్పటికి నా కింకా రెండెకరాల మల్లితోట వుంది. అదేనా మా ఊరు కాని ఊర. మా ఆవిడని

వెంటబెట్టుకొని ఆవూరు వెళ్ళాను. ఆతోటలోనే ఒక గుడిసె వేసుకుని కాపరం చేసేవాళ్ళం. మా సంసారానికి కావలసిన కూరా, నారా అక్కడే పండించుకొనే వాళ్ళం.

"నేను తోటలో స్వయంగా పనిచేసేవాణ్ణి. 'ఆనాడు సుఖపడ్డాడు. ఈనాడు కష్టపడుతున్నాడు. ముందరరోజు తెలిసి ఉండొద్దా మరి' యని నన్ను బంధువులూ తిట్టేవారు.

"నా జీవితం అట్టే అంతకష్ట మనిపించలేదు. కాని మా ఆవిడ యీ కొత్తజీవితానికి అలవాటుపడలేక పోయింది.

"పాపం అది యిల్లాంటి విధివిలాసాలెరుగదు కనక నా మతి. నానాటికి అది శల్యం అయిపోయింది. జ్వరంతో మంచంపట్టి అది నా ప్రాణానికి ఉపసంహారంగా వచ్చింది. చచ్చినతరువాత అది మహాసాధ్వి అని నాకు తెలిసింది. దాని సుగుణాలొక్కొక్కటే నాకు జ్ఞాపకం వచ్చాయి. బతికున్నంతవరకూ నోరు తెరిచి ఒకకష్టమైనా నాతో చెప్పలేదు. నే నెంత వేదనతోవ పట్టినా నన్ను మన్నుకు పల్లెత్తుమాటైనా అనలేదు. మనసులో ఏమిటేదేమో నాకు తెలియదు. ఇప్పుడు దాన్ని తలచుకుంటే నాకు యేడుపువస్తుంది. కాపరానికి వచ్చింతరవాత ఒకరోజైనా దానితో మనసిచ్చి మాట్లాడలేదు. సుఖపెట్టవలసిన యువతిని కష్టపెట్టాను. నిజంగా మహాపరాధం చేశాను. ఏశిక్షకేనా నేను పాత్రుడనే."

భార్యనుగురించి చెప్పింతరవాత సూరయ్య కొంత సేపటివరకూ మౌనంగా ఊరుకున్నాడు. కళ్లు చీకట్లు కమ్మాయి; భార్యలేని ప్రపంచకము అంధకారబంధుర ముగా కనబడింది. అనేకతలపులు పొడమినాయి. ఆమె జ్ఞాపకానికి రావడమే అతనికి పడరాని బాధ యనిపించింది.

"ఇంతకీ దేవుడనేవాడొక్కడున్నాడు కాని లేకపోతే యేముంది? అది బతికుంటే యేమి సుఖపడేది? అడుక్కుతినడానికి చిప్పఅయినా ఒకటి లేదుకదా"

అని చివరికి [illegible] సంతాపంతో పెదవులు విరిచాడు, చేతివేళ్లు తిప్పాడు.

సామి అతని సంభాషణనంతా గమనిస్తూ వింటున్నాడు. 'సాధారణపు మనుష్యులు ప్రపంచానికి యింత బాధాపడాలి కదా' అని అనుకున్నాడు. అతను కష్టపడినరోజులు సామికి తలపుకి వచ్చాయి.

తిరిగి సూరయ్య తనవృత్తాంతం మొదలెట్టాడు.

"అది చచ్చిపోయిన తరవాత నామనస్సు తోటకూడా పోయింది. నా అన్నదమ్ములు అన్యాయంచేసి అది నా దగ్గర లాక్కున్నారు. అందుచేత యిల్లా వీధులు పట్ట వలసివచ్చింది. ఒకరోజు అన్నముంటే ఒకరోజు లేక యిల్లా రోజులు కడుపు కట్టుకోవలసివచ్చింది. నిద్రపోవడానికి సత్రపు అరుగులే గతి అయినాయి. ఇల్లా మతిపోయి తిరుగుతున్నాను. 'రా' యని పిలిచి ఆశ్రయమిచ్చే దిక్కు నాకు కనబడలేదు. ఇప్పుడు మీరొచ్చి వుంటే మీరే నా నాయన గారు చెప్తారు. బట్టలు నాలు. లాండ్రీలో పనిచేస్తూ వుంటా."

అని సూరయ్య సామితో దీనంగా చెప్పాడు.

సామి ఒప్పుకున్నాడు. అతనికి చల్లటిమాటలు చెప్పాడు.

'నాయనా! దిగులుపడకు. నే నిదివరకు పడరాని కష్టాలు పడ్డాను. ఆతరువాత సుఖపడుతున్నాను. నా అసలుస్థితిని నేను మరిచిపోను. ఇప్పటికీ నేను యెందుకని యేమి నిశ్చయం? ఇంతేనా పనిమందికి పెట్టే వాడికి జన్మ; పనిమందిని పోషించేవాడికి రోజు. ప రోజు యెల్లాంటిదో—రా! నాయనా!'

అని అతన్ని చేరదీశాడు సామి.

అప్పటినుంచీ సూరయ్య ఆ లాండ్రీలోనే వుండే వాడు. లాండ్రీబాగుకే అతను తన శక్తిని ధారపోశాడు. నీరమ్మ, సామి అతన్ని కొడుకుగా చూచుకొనేవారు. సంతానంలేనివాళ్లకు దేవుడు అతన్ని పంపినట్లుగా వాళ్లు తలచేవారు. సూరయ్య వాళ్లయింట్లో ఒక దగ్గరవాడు. సూరయ్యే లాండ్రీసంతా చూస్తున్నాడు. సామి పెద్దతనంలో యింటిదగ్గరనుంచి కదలక్కర్లేకపోయింది. ఇంతకీ—

———(*)———

భారతకేంద్ర న్యాయస్థానము

(The Indian Federal Court)

సంత్రంగి రాజేశ్వరరావు

ఫెడరల్ రాజ్యాంగమునకు కేంద్రన్యాయస్థానము ముఖ్యాంగము. ఇది రాజ్యాంగాభివృద్ధికి, చట్టము యొక్క భద్రతకు అత్యవసరమైయున్నది. ఫెడరేషను నందు కేంద్ర, రాష్ట్రీయప్రభుత్వముల బాధ్యతలు, హక్కులు కేటాయింపబడవలసియున్నవి. ఆయా ప్రభుత్వములు తద్విధముగ ప్రవర్తింపకుండ చూచుటకై యొక నిష్పక్షపాతమగు సంస్థ అవసరము. అందుచేత పార్లమెంటుచే నియమితమగు ఫెడరల్ కోర్టు రాజ్యాంగశాసనము నిర్వచించుటకు, కాపాడుటకు, రాష్ట్రీయ కేంద్రప్రభుత్వములకు గల తగవు వివాదములను పరిష్కరించుటకు గాను ఉన్నదని చెప్పబడినది.1 ఇంతకాలము రాజ్యాంగమునకు సంబంధించిన రాష్ట్రీయతగవులు న్యాయస్థానములయొక్క ఆధిపత్యము క్రిందకు (Rulu of Law) వచ్చినవి. రాష్ట్రీయ స్వపరిపాలన (Provincial autonomy) అమలులోనికి రాకపూర్వ మిట్టి విషయములన్నియు కార్యనిర్వాహక వర్గముతో సంబంధించిన గవర్నరుగారల ఆధిపత్యముక్రింద నుండెడివి.

మన దేశమందు హైకోర్టులన్నియు స్వాతంత్ర్యము నకు న్యాయవిచారణకు ప్రసిద్ధిగాంచినవి. అవి తమ స్వాతంత్ర్యమును, హక్కులను జాగ్రత్తగ కాపాడుకొనును. అవసరమగునపుడు కార్యనిర్వాహక ప్రభుత్వమును విమర్శించుటకు వెనుదీయవు. అందుచేత అవి జనసామాన్యముయొక్క నమ్మకమును గౌరవమును చూరగొను చున్నవి. ప్రస్తుతము ఫెడరల్ కోర్టుకు ప్రతిపత్తికి తోడు ఎక్కువ అధికారములు అవకాశములుకూడ కలవు. అదియునుగాక ఫెడరేషను బహిష్కరించుటకై ఆందోళన జరుగుచున్నప్పటికి చివరకు సత్వరము గనే అది అమలులోనికి వచ్చు సూచనలు కనుపించు చున్నవి. ఫెడరల్ కోర్టువిషయమై యేరాజకీయకక్షి వారునుండ నింతవరకు కట్టి యభ్యంతరమును చెప్పలేదు. ఈ సందర్భమున ఫెడరల్ కోర్టున కన్ని రాజకీయకక్షుల యొక్క సానుభూతి గలదని సర్ తేజబహదూర్ సప్రూగారు చెప్పిరి.

ప్రస్తుతము ఫెడరల్ కోర్టును సంబంధించిన విష యములు తెలిసికొనుట ప్రాముఖ్యము. 1937-వ సంవ త్సరము అక్టోబరు ఒకటవ తేదీని ఫెడరల్ జడ్జీలు ముగ్గురు గవర్నరు జనరలు సమక్షమున రాజభక్తిప్రమా ణమును తీసుకొనిరి. తర్వాత డిసెంబరు ఆరవ తేదీని కోర్టును ప్రారంభించిరి. అప్పటినుండియు కోర్టుకు సం బంధించిన నియమావళిని నిబంధనలను తయారుచేయుచు వచ్చిరి. పైకి యేమియు కనుపించకపోవుటవలన ఫెడరే షను లేకుండ అనవసరముగ ఫెడరల్ కోర్టు నేర్పరిచి రని కొందరభిప్రాయపడిరి. కాని యిట్టి అభిప్రాయము పొరపాటు. ఫెడరేషనుకు, ఫెడరల్ కోర్టుకు ముడిపెట్ట నవసరములేదు. రాష్ట్రీయస్వపరిపాలన అమలులోనికి వచ్చుటతోడనే కేంద్ర, రాష్ట్రీయ ప్రభుత్వముల కాధారహక్కులను అధికారములను కేటాయింపు చేయ వలసి యున్నది. అపుడీ వివాదముల పరిష్కరించుట కీ కోర్టు అవసరము. దీనికి రాజకీయములతో సంబంధ

---

1. The Federal Court is at once the interpreter and guardian of the Constitution and a tribunal for the determination of disputes between the constituent units of the Federation. —Vide. J. P. C. Report.

ములేదని తేటతెల్లమగుచున్నది. అట్టిన్యాయస్థానము లేనిచో నీవివాదలు గవర్నరుజనరలు పరిష్కారము చేయవలసియుండును. కాని కేంద్రప్రభుత్వముకూడ యీవివాదములందు పార్టీగనుండు సందర్భమున సరిగ న్యాయము జరుగుట కష్టము. పైగ ఇట్టిపని రాష్ట్రీయస్వపరిపాలనసిద్ధాంతమునకు విరుద్ధము. ప్రివీకవున్సిలుకు అప్పీలుచేయవలెనన్న అమితమగు వ్యయప్రయాసలు. ఇట్టివివాదములను హైకోర్టునకు పంపిన వివిధరాష్ట్రముల హైకోర్టులయొక్క తీర్పులు వేర్వేరుగ నుండుట సహజము. అపుడే భేదాభిప్రాయములవల్ల అనవసరమగు కలవరము లేర్పడును. మరియు ఆయా హైకోర్టులు తమ తమ రాష్ట్రములపక్షము వహించుట సహజము. ఇట్టి అనుమానములు కోర్టుయొక్క గణ్యతకు ముప్పుదెచ్చును. ఫెడరల్ కోర్టు ఉన్నపక్షమున దేశమందంతటను ఒకే మాదిరితీర్పు లుండుటయేగాక యిట్టిఅనుమానములు పటాపంచలగును. ఇందుకు విశేషమగుఖర్చు లేదు. పని కూడ త్వరగ జరుగును. అఖిలభారతసంస్థయగుటచే అందరకు నమ్మకముగా నుండును. ఫెడరేషను వచ్చిన తర్వాత దీనిబాధ్యతలు వృద్ధియగును. ఈలోపుగ రాజ్యాంగవిషయములందు అవసరమగుచో ఫెడరల్ కోర్టుయొక్క సలహాను తీసుకొనవచ్చును. ముఖ్యవిషయములందిట్టిసలహాను తీసుకొనవలెనని ప్రజలుకూడ ఆందోళనచేయుట కవకాశముండును. హైకోర్టులనుండి రాజ్యాంగచట్టమునకు సంబంధించిన తగాదాలను (constitutional issues) సులువుగ అప్పీలుచేయవచ్చును.

ఫెడరల్ కోర్టుయొక్క హక్కులమీదకాని, హోదాపైనికాని భారతశాసననిర్మాణసభ కెట్టి అధికారమును లేదు. ఇందుకు సంబంధించిన దంతయు రాజ్యాంగచట్టమందే కలదు. నూతనరాజ్యాంగముక్రింద నేర్పడ్డ సంస్థలన్నిటికంటెను దీనికి అధికమగు ప్రతిపత్తి విశేషాధికారములు కలవని చెప్పవలసియున్నది. దీని అంతస్తును తగ్గించుట కొక్క పార్లమెంటుకు తప్ప మరెవ్వరికిని హక్కు లేదు. అట్లే దీని అధికారములు హెచ్చించుటకు కూడ చట్టప్రకారముతప్ప మరొకవిధముగ వీలులేదు. నూతన రాజ్యాంగప్రణాళికయందు ౨౦౪-వ సెక్షను ప్రకారము విషమపరిస్థితులందు గవర్నరుజనరలుకు ఫెడరల్ సంస్థలనన్నిటిని రద్దుపరుచుటకు అధికారము కలదు. కాని యిట్టి సందర్భమున ఫెడరల్ కోర్టును రద్దుచేయుట కధికారములేదు. ఈసంస్థకగు ఖర్చంతయు ఎవరినిమిత్తము అవసరములేకుండ కేంద్రప్రభుత్వముయొక్క ఆదాయమునుండి వెచ్చింపబడును.

ఇందొక ప్రధానన్యాయమూర్తి యుండును. ఆరుగురకంటె ఎక్కువకాకుండ ఇతరజడ్జీ లుందురు. చక్రవర్తిగారి అనుమతిమీద ఫెడరల్ శాసనసభ కోరుచో వీరిసంఖ్యను హెచ్చించవచ్చును. ఈ న్యాయమూర్తులను చక్రవర్తిగారే నియమింతురు. వీరు అరువది అయిదు సంవత్సరములు పూర్తియగువరకు ఉద్యోగమందుండవచ్చును. న్యాయమూర్తియొక్క నడవడి సక్రమముగ లేనపుడు, మనోవైకల్యము కల్గినపుడు ప్రివీకౌన్సిలుయొక్క జ్యుడిషియల్ కమిటీ విచారించి తమ నివేదికను సమర్పించినపిదప మాత్రమే చక్రవర్తిగారు సదరున్యాయమూర్తిని పదవినుండి తొలగింపవచ్చును. న్యాయమూర్తులు తమనడవడి సక్రమముగనున్నంతకాలము నిరభ్యంతరముగ పదవియందుండవచ్చునా (holding office during period of good behavior) లేక చక్రవర్తిగారి యిష్టమగునంతకాలముండి (at His Majesty's Pleasure) ఎప్పుడైనను తొలగింపవచ్చునా యనెడుసంశయ మేర్పడినది. జాయింటు పార్లమెంటరీకమిటీవారు తమనివేదికయందు న్యాయమూర్తుల నడవడి సక్రమముగా నున్నంతకాలము ఉద్యోగమందుండవలయునని సిఫారసు చేసియుండిరి. కాని రాజ్యాంగచట్టమందు ఈ విషయమై విపులముగ నిర్వచింపబడియుండలేదు. సర్ బి. యల్. మిత్తరుగారుమాత్రము నడవడి సక్రమముగ నున్నంతకాలము పదవియందుండవచ్చునని చెప్పిరి. నడవడి సక్రమముగ లేనపుడే ప్రివీకౌన్సిలు విచారణచేయు ననియును, అట్టి విచారణలు వలసరాజ్యములందు జరిగె ననియు, ఆకేసులను పరిశీలించిచూడగ నడవడి సక్రమముగ నున్నంతకాలము నిరభ్యంతరముగ పదవియందుండవచ్చుననెడు అభిప్రాయమును, సర్ తేజబహదూర్ సప్రూగారు ప్రస్తుతము నూతనరాజ్యాంగ విధానముమీద తాము

వ్రాయుచున్న గ్రంథమందు వెలిబుచ్చిరి. కలకత్తా యందు సుప్రసిద్ధ దినపత్రికయగు "స్టేట్సుమెను" న్యాయమూర్తులందరు చక్రవర్తిగారి చిత్తానుసారము (at His Majesty's Pleasure) ఉద్యోగము చేయవలసియుండు నని ఘంటాపథముగ వ్రాసియుండెను (౮-౧౦-౧౯౩౦ తేది సంచికయందు).

రాష్ట్రీయ హైకోర్టులందుకాని ఫెడరేషనులో చేరినసంస్థానముల హైకోర్టులందుకాని అయిదుసంవత్సరములపాటు న్యాయమూర్తులుగ పనిచేసినవారికి ఫెడరల్ కోర్టు జడ్జీలగుటకు అర్హత కలదు. పదిసంవత్సరములు అనుభవముగల బారిష్టర్లకు, హైకోర్టువకీళ్లకుకూడ ఇట్టి అర్హత కలదు. ఇండియను సివిలు సర్వీసు ఉద్యోగులు కూడ ఈపదవికి అర్హులు. ప్రజాభిప్రాయము మిందుకు వ్యతిరేకముగ నున్నది. కార్యనిర్వాహకశాఖయందు పనిచేసిన సివిలుసర్వీసుఉద్యోగులకు న్యాయమూర్తుల కుండవలసిన నెమ్మది నిష్పక్షపాత ముండదు. అవసరమైనపుడు ఉన్నన్యాయమూర్తులలో నొకరిని తాత్కాలిక ప్రధానన్యాయమూర్తిగా నియమించుటకు గవర్నరు జనరలున కధికారము కలదు. కోర్టు నిబంధనలు చక్రవర్తిగారి ఆర్డరు ననుసరించి యుండును. మామూలుగ ఈకోర్టు ఢిల్లీనగర ముందుండును. కాని కావలసిన ప్రధాన న్యాయమూర్తి గవర్నరుజనరలుతో సంప్రతించి నేర్పరచు స్థలములందు విచారణచేయవచ్చును.

ఇచటి న్యాయవాదివర్గము ఇంగ్లండునందలి విధిగ న్యాయవాదివర్గములను అనుసరించియే యేర్పడవలసి యున్నది. న్యాయవాదులందరు రెండుతరగతులుగ నేర్పరుపబడినవి. వీరిలో మొదటితరగతివారైన సీనియరు అడ్వకేట్లు ఇదివరలో జడ్జీలుగ పనిచేసినవారు కావలయును లేదా హైకోర్టునందు పదిసంవత్సరముల అనుభవముగల వారుగ నుండవలయును. తర్వాత రెండవతరగతికి చెందిన జూనియరు అడ్వకేట్లకు హైకోర్టునందు అయిదుసంవత్సరముల అనుభవమున్న చాలును. ఇంగ్లండునందలి కింగ్సు కౌన్సెలువలె సీనియరు అడ్వకేటు జూనియరు అడ్వకేటు లేకుండా వాదించుటకు వీలులేదు. వ్రాతపనియంతయు జూనియరే చేయును. వచ్చినఫీజును పంచుకొనుటకు నియమావళి, నిబంధనలుకూడ కలవు. కనుక జూనియరు అడ్వకేట్లకుకూడ మంచి అవకాశము లుండునని తోచుచున్నది. కేసు వాదనకు వచ్చువరకు ఇంతవరకు అటార్నీలు, సొలిసిటర్లు చేయుచువచ్చినపనిని ఇకముందు ఏజెంట్లు చేయుదురు. ఒరిజినల్ కేసులందు ఆయా రాష్ట్రములతరఫున అడ్వకేటుజనరలులు కేంద్రప్రభుత్వము తరఫున ఫెడరల్ అడ్వకేటుజనరలు వాదింతురు.

కేంద్రప్రభుత్వము రాష్ట్రీయప్రభుత్వముల హక్కులను త్రోసిరాజనుట కధికారములేదు. రాష్ట్రీయ, కేంద్రశాసనములయొక్క సక్రమాక్రమములవిషయమై వివాద మేర్పడినపుడు తీర్మానించవలసినది ఫెడరల్ కోర్టు. కేంద్రప్రభుత్వముమీద రాష్ట్రములు, రాష్ట్రములమీద కేంద్రప్రభుత్వము ఫిర్యాదుచేయవచ్చును. పౌరులుమాత్రము తిన్నగా ఈకోర్టునందు కేసుపెట్టుటకు వీలులేదు. వారు మామూలుకోర్టులందు న్యాయము పొందవలయును. రాజ్యాంగచట్టమునకు సంబంధించినవిషయ మేదైనను కేసులో మిళితమైయున్నట్టు హైకోర్టు ధ్రువపత్ర మిచ్చినచో అపుడు ఈకోర్టుకు అప్పీలు చేయవచ్చును. స్వదేశసంస్థానములపై ఈ కోర్టుకుగల అధికారము ఆయా సంస్థానములు చక్రవర్తిగారితో నేర్పరచుకొన్న ఖరారుపత్రము (Instrument of accession) ననుసరించి యుండును. ఇందువల్ల సంస్థానములందలి హైకోర్టుల అంతస్తుకు లోటుండదనియు, రాజ్యాంగవిషయమై ఖరారు నామా ననుసరించు వివాదములు పరిష్కారము చేయునపుడు సంస్థానపు హైకోర్టుయొక్క సహాయము కావలసియున్నప్పుడు మతలబిప్రకారము ప్రార్థనా పత్రము (Letters of Request) పంపవలసియుండు నని హైదరాబాదు సంస్థాన ప్రధానామాత్యులగు రైటు ఆనరబుల్ సర్ అక్బరు హైదరీగారు చెప్పియుండిరి. ఖరారునామా ననుసరించి రాజ్యాంగచట్టమందే విషయమైనను మినహాయింపబడిన తత్సంబంధమైన వివాదము పరిష్కరించుట కధికారము లేదు. మరియు 'పారమౌంటు పవరు' అధికారముజోలికి పోవుటకు వీలులేదు (Paramountcy is paramount). ఏవివాద పరిష్కరించినను న్యాయము తెలియజేయుతీర్పునే (Declaratory Judgment) చెప్పెదరు; అనగా,

హక్కులు నిరూపింపబడును. వాటిని అమలుపరుచుటకు వలయు సాధనసామగ్రిమాత్రము లేదు. ఫెడరల్ కోర్టు జారీచేసిన నిర్ణయములను ఫెడరేషనునందంతటనుగల కార్యనిర్వాహక న్యాయశాఖలు సకాలములో అమలు పరచవలెనని రాజ్యాంగప్రణాళికయందు కలదు. ఏ రాష్ట్రముగాని లేక సంస్థానముగాని తననిర్ణీతకర్తవ్యము నెరవేర్పనపుడు చివరకు బలాత్కారము చేయవలసియుండును. సాధారణముగ అట్టిఅవసర ముండదు. సహజముగ రాష్ట్రములు సంస్థానములు ఈ విషయమందు తగుశ్రద్ధ వహించుటకు లోటుండదు.

రాజ్యాంగవిషయమైన హైకోర్టుఅప్పీళ్లు ఇక నిక్కడే రావలయును గాని తిన్నగా ప్రీవీకౌన్సిలుకు వెళ్లుటకు వీలులేదు. ౨౦౬-వ సెక్షను ప్రకారము ఈకోర్టుయొక్క సివిలుఅధికారమును వృద్ధిపరచుటకు ఫెడరల్ శాసనసభ తీర్మానించవలెను. కొన్ని నెలల క్రిత మట్లు చేయవలసినదిగా కోరుచు కౌన్సిలు ఆఫ్ స్టేటు నందు ఒకసభ్యుడు తీర్మానము తేగా ప్రభుత్వమువారందలిముఖ్యసిద్ధాంతము నంగీకరించుటచే సదరుతీర్మాన ముపసంహరించుకొనబడినది. అప్పీలుకు సంబంధించిన క్రిందికోర్టు నిర్ణయము అమలుజరుపకుండ ఆపుటకు కూడ అధికారము కలదు. రైల్వే ట్రిబ్యునల్ యొక్క నిర్ణయములపైకూడ అప్పీలుచేయవచ్చును.

గవర్నరు జనరలు ఫెడరల్ కోర్టుయొక్క సలహాను తప్పక అనుసరింపవలసిన నిబంధన లేదు. కాని ౧౮౩౩ సంవత్సరపు జుడిషియల్ కమిటీఆక్టు ౪-వ సెక్షను ప్రకారము ప్రవర్తిగాగల ప్రీవీకవున్సిలు యొక్క అభిప్రాయము ననుసరించినట్లే కాలక్రమమున గవర్నరుజనరలుకూడ మన దేశమందట్లే ప్రవర్తించునని తలచుటకు అవకాశము కలదు. ఇట్టి అంతస్తుగల సంస్థయొక్క సలహా ననుసరించుటయే సకలవిధముల శ్రేయస్కరము. ఇందువల్ల వృథాకాలయాపన వ్యయప్రయాసలు ఉండవు. అట్లుగాక అప్పీలుమీద అప్పీలు చేసి కోర్టులన్ని తిరిగి చివరకు వచ్చుసరికి అంతయు నష్టమే. ఇట్టివ్యాజ్యములను తగ్గించుటకు రాజ్యాంగ చట్టమునకు విరుద్ధమై కేసు పెట్టుట కొంతకాలపరిమితిలో జరుగవలెనని కొందరి అభిప్రాయము. అంతకంటె ఇట్లు సలహానిచ్చుపద్ధతియే మంచిదిగ తోచుచున్నది.

ఫెడరల్ కోర్టునకు మధ్యస్థముగ వివాదములు పరిష్కరించు అధికారము (Arbitrary Jurisdiction) కూడ కలదు. నీటి సరఫరానుగురించి వివిధరాష్ట్రములకుమ తగాయిదా లేర్పడినపుడు ఈకోర్టు నిపుణులతోకూడి యున్న సంఘమునకు (Commission of experts) సహాయము చేయును. స్టాట్యుటరీ రైల్వే అథారిటీకి సంస్థానమునకు సంఘర్షణ జరిగినపుడు ఫెడరల్ జడ్జి అధ్యక్షతవహించిన రైల్వే ట్రిబ్యునలు పరిష్కారము చేయును. ఇవన్నియు చాల ముఖ్యమగు పనులు. క్రిమినలు కేసులతో ఫెడరలుకోర్టు కేమియు సంబంధము లేదు. క్రిమినలుఅప్పీళ్లు ప్రీవీకౌన్సిలునకు పోవలసియున్నవి. మనదేశమందలి ఫెడరల్ కోర్టుతీర్పులమీద, ఇతర ఫెడరేషనులందు, అనగా కనడా ఆస్ట్రేలియాలలోవలెగాక, ప్రీవీకౌన్సిలుకు అప్పీలు చేయవచ్చును. ఇందువల్ల దీని అధికారము సంకుచితమైనది. నరేంద్రమండలికి సలహాదారుడగు (Legal adviser to rhe Princes chamber) ఇంగ్లండునందు 'కింగ్సు కౌన్సెలు' అగు మి. మాంక్టన్. మార్గమునగా నీపద్ధతి సంస్థానాధీశ్వరుల కనుకూలముగ నున్నదని ఆమధ్య లండను "టైమ్సు"నకు వ్రాసెను. సంస్థానాధీశ్వరు లందరు ప్రవర్తిలోనుంచియున్న ప్రీవీకౌన్సిలుకు అప్పీలుచేయుటకు ప్రయత్నించుట నాతిసహజ స్వభావము. కాని ప్రజాభిప్రాయ మిందుకు వ్యతిరేకమని చెప్పవలసియున్నది.

ప్రస్తుతము అందరకు ఒకప్రశ్న తట్టుచున్నది. ఫెడరల్ కోర్టునకు ఇప్పుడేమాత్రము పనియుండునో తెలిసికొనవలెనని చాలమంది కుతూహలము. మొదట అట్టి పని యుండుట కవకాశము లేదు. ఇట్లుండుట సహజము. అమెరికా సంయుక్తరాష్ట్రములందు సుప్రీముకోర్టు స్థాపించినపిమ్మట మూడుసంవత్సరములవరకు ఏమియు పని లేకపోయినది. నూతనరాజ్యాంగము అమలులోనికి వచ్చినది యిప్పుడేకదా! పైగ అనవసరపు వ్యాజ్యములు వృద్ధికాక తగ్గుట శుభసూచకము. అయినప్పటికి ఫెడరల్ కోర్టు స్థాపించిన ప్రథమసంవత్సరములోపున

చాలపని జరిగినది. ఉభయరాష్ట్రీయుల ప్రభుత్వము పెట్రోలు అమ్మకముపైని విధించిన సుంకమువిషయమై కేంద్రప్రభుత్వముతో ఏర్పడినవివాదవిషయమై ప్రస్తుతము విచారణజరుగుచున్నది. సంయుక్తరాష్ట్రీయుల ప్రభుత్వమువారు కంట్రోలు ఆర్డరు మెజిస్ట్రేటులు విధించు ఆజ్ఞాపత్రాలను తగిన రీతిగానైనను కేంద్ర ప్రభుత్వముమీద కేసు పెట్టుటకు సిద్ధముగా నున్నట్లు తెలియుచున్నది. సర్ పతిభారతిగారు ఇండియామంత్రి (Secretary of State for India) మీద తెచ్చిన కేసు అప్పీలుకూడ విచారణకువచ్చునట్లు ప్రకటించిరి. బీహారు బెంగాలురాష్ట్రీయులందలి జమీందారులు సంయుక్తరాష్ట్రీయులందలి తాలూకదారులు ఆయారాష్ట్రీయులం జరిగిన ఆమోదింపబడిన రైతాంగ చట్టములవిషయమై ఫెడరల్ కోర్టునందు ఫిర్యాదుచేయ నుద్యుక్తులైయున్నారు. సుప్రసిద్ధన్యాయవాదులగు సర్ తేజబహదూర్ సప్రూ, భూలాభాయిదేశాయి, జిన్నా, సర్ అల్లాడి కృష్ణస్వామి అయ్యరుగారలవంటివారిందు అడ్వకేట్లుగ చేరిరి. ఈ సంస్థ దినదినాభివృద్ధినందుటకు వాతావరణము చాల అనుకూలముగ నున్నది.

ప్రస్తుత ప్రధానన్యాయమూర్తితో కలసి ముగ్గురు జడ్జీలున్నారు. వారి గుణగణములను తెలిసికొనుట కొంత అవసరమని తోచుచున్నది. ప్రధాన న్యాయమూర్తియగు సర్ మారిస్ గ్వాయరుగారు పేరుగాంచిన న్యాయవాదియే కాక ఇంగ్లండునందు పార్లమెంటుకి కౌన్సెలుగ పనిచేసిరి. నూతన ఇండియాచట్టమును క్రోడీకరించి తయారుచేసినది వీరే. రాజ్యాంగప్రణాళిక అంతయు వీరికి కరతలామలకమని చెప్పవచ్చును. మిగత హైందవన్యాయమూర్తులిరువురు మనకు చిరపరిచితులే. ముకుందరావు జయకరుగారు బొంబాయిలో న్యాయవాదిగ అఖండవిఖ్యాతిని బడసిరి. రాజకీయములందు, సప్రూగారితో సరిసమానముగ పాల్గొని అటు ప్రభుత్వముయొక్క ఇటు ప్రజలయొక్క మన్ననలకు పాత్రులైరి. సర్ షా మహమ్మదు సులేమానుగారు ఇటీవలవరకు అలహాబాదు హైకోర్టునందు ప్రధానన్యాయమూర్తి పదవిని చాకచక్యముతో నిర్వహించిరి. ఫెడరలు అడ్వకేటుజనరలగు సర్ బ్రజేంద్రలాలు మిత్రగారు ఇదివరలో బెంగాలు అడ్వకేటుజనరలుగను, కేంద్రరాష్ట్రీయప్రభుత్వములకు న్యాయశాఖాసభ్యులుగను పనిచేసి విశేషానుభవమును గడించిరి. వీరందరు తమతమ బాధ్యతలను నిర్వహించుటకు ఎంతయు తగియున్నారు.

ఇందు కార్యక్రమ మెట్లు జరుగునది తెలుసుకొనవలె నని చాలమందికి కుతూహలముగ నున్నది. ఈవిషయమై జోస్యము చెప్పుట కష్టసాధ్యమైనపని. అయినప్పటికి ఈ విషయమున ప్రధానన్యాయమూర్తిగారి ప్రారంభోపన్యాసము చాల ముఖ్యమైనది. ఈసంస్థ సర్వత్ర సహృదయసామరస్యమును సహకారమును పెంపొందించునని చెప్పిరి.

“ఆధునికకాలమందలి వివిధరాజకీయ సిద్ధాంతములు జాగ్రత్తగ పరిశీలింపబడును. చివరకు స్థిరత్వముగల నికరమగు సిద్ధాంతములను పైకి తీసెదరు. ఇవి భారతభావిభాగ్యోదయమున కుపయోగించు నని యూహించెదరు. ప్రభుత్వముతోను, రాజకీయ కక్షలతోను ఎట్టిసంబంధమును ఉంచుకొనక సర్వదా స్వతంత్రముగ నుండెదరు. రాజ్యాంగప్రణాళికా నిర్వచనమందు విశాలదృష్టి, సానుభూతి నిబిడీకృతమైయుండును. దేశకాలపరిస్థితుల కనువగు రాజకీయాచారము లభివృద్ధినొందుట (Evolution of constitutional conventions) కెట్టి యాటంకము నుండదు. రాజ్యాంగచట్టముయొక్క బాహ్యస్థితులను నిర్వచించి యూరుకొనక అంతరార్థమును తీసి దేశాభివృద్ధికి పాటుపడెదరు. సామాన్యపౌరుల హక్కులుకూడ ప్రభుత్వముయొక్క హక్కులతో సరిసమానముగ సంరక్షింపబడును. ఎవరిపక్షమును వహింపక అందరియెడలను సానుభూతితో ప్రవర్తింతురు.”

ఈభావములు సర్వజనాంగీకృతము లని వేరుగ చెప్పనక్కరలేదు. ప్రధాన న్యాయమూర్తులు మాటలలోమాత్రమే కాక చేతలందుకూడ ఈ ఉదారభావముల ననుసరించెద రని నమ్మెదము. ఇంగ్లండునందు లార్డు హైఛాన్సలరు అగు హెయిల్‌షాం ప్రభువు తమ సందేశమందు తెలిపిన ఫెడరల్ కోర్టు గౌరవమర్యాదలను ఉన్నతాదర్శములను దృష్టియందుంచుకొని, తత్కాలమానపరిస్థితుల ననుసరించి నిర్భయముగను నిష్పక్షపాతముగను దేశీయులందరకును న్యాయము జరుగునట్లు పనిచేయునని ఆశించెదము.

౨౦-వ ఆంధ్రమహాసభ - చెన్నపురి

ఆంధ్రప్రముఖుల ప్రసంగములు

ఆంధ్రుల సంగీత సాహిత్యాదులయందలి కృషి

ఆంధ్రసప్తాహ మహోత్సవ ప్రారంభమును గావించుచు సర్. అల్లాడి కృష్ణస్వామయ్యగారు కడచిన నెల ౧౬-వ తేదీని పై విషయమునుగురించి ఇట్లు చెప్పియున్నారు.

మన దేశమునగూడ గద్యయుగము ఆవిర్భవించినది. అయినను, మనరాష్ట్రమున పద్యకవిత్వమున సిద్ధహస్తులైన రచయితలు పెంపొందుచునే యున్నారు. వీరికృషిని ప్రశంసించుచు, గద్య వాఙ్మయవృద్ధికై మహోత్కంఠతో వీ రిక నడుములు కట్టవలెనని నొక్కి వక్కాణింతును. దండిబాణప్రభృతులు సంస్కృతమున సుదాత్తభావగర్భితమైన గద్యము సృష్టించిరి. ఆంధ్రావనిలో గద్య మీవఱలో నంతగా నాదరమంద లేదనుట సత్యమునకు తలవంపులు తెచ్చుట కానేరదు. విపుల వ్యక్తీకరణమునకును, స్పష్ట వ్యక్తీకరణమునకును గద్యమే అనువై యుండును. ఇంతియకాదు. పామరులకు సయితము గద్యము సుబోధకమగును. ప్రజాస్వామ్యపాలనము సమధికప్రాభవ మందుకొలది పామరులకు విద్యాబుద్ధులు కఱపు నావశ్యకముకూడ అధికమగుచుండును. ప్రజాస్వత్వములు విశేషముగా ప్రాముఖ్యమునందు ప్రస్తుత కాలమున సాహిత్యము విశ్రాంతికి నోచుకొనిన ఏ కొందఱి ప్రమోదమునకు మాత్రమే నిర్దేశింపబడరాదు. పామరహృదయమందుగూడ సాహిత్యలక్ష్మి ఆత్మమందిరము నవలోకింపవలెను.

ఆంధ్రగద్య వాఙ్మయవసుంధరలో త్రేతాగ్నులవలె తేజరిల్లిన మహనీయులు చిన్నయసూరి, వీరేశలింగముపంతులు, వేంకటరాయశాస్త్రులును. ఉత్కృష్టమైన వీరిసాహిత్యసేవ సర్వజనసంస్తుతిపాత్రముకదా! రుచులందును, రచనావిధానములందును, ఉద్దేశసిద్ధియందును వీరిలో వ్యత్యాసము లున్ననేమి, ఆంధ్రభారతికి మిగుల గొప్ప విజ్ఞానడింభకులై కీర్తి గనియుండిరి. రమారమి అర్ధశతాబ్దమునుండి సాహితీసేవ సలుపుచు, ఆంధ్రభాషాయోషకు చక్కనిభూషలొసగుచు యశస్విలకులై నేడును ద్విగుణీకృతోత్సాహముతో తమలేఖినులను నడుపు శ్రీపాద చెళ్లపిళ్ల జనమంచి కవీంద్రులను ప్రస్తుతించుటకు మక్కువ పడుచుందును.

ఈ పెద్దల సాహిత్యసేవను ప్రశంసించుచు, తోడ్తోడనే, నవ్యభావములతో నూతనాశయములతో నవయుగమున గాంచి, నవ్యరచనావిధానముల ననుసరించుచు గద్య పద్య వాఙ్మయములకు వేసక్కై సేత లొసగు యువకవుల యత్నములను మిక్కిలి కొనియాడుచున్నాను. ఈయువకులు పల్వురు పట్టభద్రులు. ఆంగ్లసాహితీసూత్రములను హృదయంగమ మొనరించుకొనిన ప్రవీణులు. వీరిలో కొందఱు రవీంద్రాది వంగకవీంద్రుల అడుగుజాడల నంటి నడచుచున్నారు. నవలారచనమందును, కథారచనమందును ఆరితేరిన యువకులు కొందఱు కలరు. అనుకరణ, అనుసరణ, అనువాదములకు అంజలిత్తు రచయితలు అనేకు లున్నారు, పూర్వపశ్చిమవిజ్ఞాన ప్రభలనెఱిగిన విద్యార్థులగుడు, పూర్వప్రస్తుతాశయములకు సమన్వయ మొనగూర్చి భావికాలమున వీరు అపూర్వమైన రచనలను సృష్టింపగలరు.

* * *

మన నాటకములు విశేషముగ పౌరాణికకథాంశములే యని చెప్పకతప్పదు. నాటకప్రదర్శనములు ప్రేక్షకసంఖ్య నాకర్షించుచున్నంతగ నాటకరచన మాడ్కిలో నుండవలసిన ఆశయములు ప్రత్యక్షజీవితశిల్పమనియు వివిధసమస్యాపరిశీలన మనియు అను నంశము మఱువరాదు. ప్రజల అక్కఱ దీర్చుటేకాక, వైజ్ఞానికాదర్శముల చరితార్థతకై కంకణముకట్టుకొనుట ఆదర్శసాహిత్యోపాసకుని కర్తవ్యము. వేంకటరాయశాస్త్రి, కృష్ణమాచార్యులు ఆంధ్రనాటకకళకు వన్నె దెచ్చుట నిక్కమే! వేఱొక తెరవు ననుసరించిన వీరేశ

లింగము, సుప్రఖ్యాత అసాధారణ ప్రజ్ఞలు విజయనగరసామ్రాట్టయు నిక్కమే! కావేరీప్రవంతి ఈ సంగీతము కన్న దయమున ప్రవహించుచున్నది. నవ్యభావములు నవ్య లంపులనుండి యెగురుచున్నవి గనుక ప్రపంచము నందు అపూర్వమైన ప్రతిష్ఠ సంపాదించినవి. పురాణోల్లిఖిత మహారాజులు యితిల దృష్టాంతములను జీవితములందు గాన యువకవులు సంస్కృతపదజాలముల ప్రయోగము హరిశ్చంద్రుల వ్యాపకమైనవి ఉత్ప్రేరించుచు నీగు వెనుక మాపు నిరీక్షింపగు నింబవలేదు. వీరి నాటకములను వ్యాపించుకొనుచు లోనరించుకొని, నంపిత విజ్ఞానమును పురస్కరించుకొని, తమ అంతర్దృష్టినచ్చు స్వతంత్ర గ్రంథరచనా మార్గమున యువకవులు నోటల్ బహుమానము నందు ఆంధ్రనాటకము వసుమాటి గళమున నమర్చెడు గాలిని కట్టుదురు గాక యని ఆశపడుచున్నాము.

నాట్యకళలో, నాటక ప్రదర్శనములో అద్భుతమైన ప్రజ్ఞ ప్రకటించినవారు రఘురామయ్య, స్థానం నరసింహారావు ప్రభృతులు ఆంధ్రవసుంధరలో వెలయు చున్నను, మన రంగస్థలములు అందవలసిన అభ్యున్నతి ఇంకను అందలేదని కలదు. నాట్యరంగప్రదర్శనములో ముఖాభివృద్ధికై చక్కని ఉద్యమములు నిర్వహింపబడుచుండవలసియున్నది. బెర్నార్డ్ షా ఇబ్సెన్ ప్రభృతులరచనలు నూతన విజ్ఞానాంకురముల ప్రతిబింబములందు మొలకలెత్తించుచున్నవి. ఈ యుద్యమములు కేవలము పాశ్చాత్యజగతికై మాత్రము ఉద్దేశింపబడలేదు. వీని లోని పరమార్థమును గ్రహించి, ఆంధ్రకళోపాసకులు అనల్పమైన మేలునందవలెనని అభిలషించుచున్నాము.

* * *

దక్షిణసంగీతము కర్ణాటకసంగీత మన బరగు చున్నది. విశేషముగ కర్ణాటకమునకు సంబంధించిన దయ్యు, ఇందలికృతులు ఆంధ్రకృతులే! కృతు లాంధ్ర కృతులైనను, వైదికసాధనమున వీనికి విశేషప్రాముఖ్య మొసగువారు తమిళులు. ఆంధ్రప్రతిభాసముజ్జ్వలమైన గానకళ ఆంధ్రేతరులహృదయముల నెట్లాకర్షించు చున్నదో వీక్షింపుడు. శ్రీ॥ శ్రీ॥ సంగమేశ్వరశాస్త్రి, శేషణ్ణరమణదాసు; హరి నాగభూషణము, వెంకట న్యాయమునాయకు నున్నను గాయకశిఖామణులు పసిపిన పిల్లల ఉల్లసింపగు ఆంధ్రగానకళయు, — మధుర భావ సిద్ధులకు కన్నతల్లియైన ఆంధ్రగానకళయు నవ్యకళా సామ్రాజ్యమున అద్వితీయమైన స్థానమును చేకూర్ప గలదు.

* * *

నూతన భావోద్యమమున చిత్రలేఖనము ఆంధ్ర దేశమునందు ప్రశస్తినందినది. శ్రీ॥ శ్రీ॥ దామెర్ల రామారావు ఈ కళలో అసామాన్యమైన ప్రజ్ఞను ప్రకటించినాడు. ఆ ప్రతిభావంతుని ఉదాత్త దృష్టాంతముగ తన చిత్రలేఖనము మన దేశములో అత్యంతభవ్య నకీర్తి సంపుచుండె. నాతడకాలమృత్యువుపాలబడుట దుఃఖకరము. సమకాలికులైన ఆంధ్రచిత్రకారుల శక్తిసామర్థ్యముల నుగ్గడించుట కిందు చోటులేదు. ఏ కొందఱినో పేర్కొనుట ఒప్పుకాదు. యూరపుకళాసూత్రములను, వంగ చిత్రకళావిధులను మేలుబంతు లొనరించుకొనుచు, అనుకరణమునకు అంజలెత్తు చిత్రకారులు స్వతంత్రమార్గముల ననుసరింతురని ఆశపడుచున్నాము.



ఆంధ్రుల లలితకళాకృషి.

కడచిన మాసమున ఆంధ్ర లలితకళా ప్రదర్శనమును ప్రారంభించుచు, శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాదు బహాదూరు శ్రీ చల్లపల్లి రాజాగారు ఆంధ్రుల లలితకళాకృషినిగురించి యిట్లు ప్రసంగించి యున్నారు:

ఆంధ్రలలితకళ ప్రపంచ మెరుగనిది కాదు. లోకప్రశంసలకు క్రొత్తగ అంతకన్నను కాదు. ఆంధ్ర కళాలాలిత్యము నాటికిని నేటికిని జగత్ ప్రశంసల నందుచునే యున్నది. అజాంతా, ఎల్లోరా లోనగు ప్రదేశముల ఆంధ్రసంతతివారు రచించి ప్రదర్శించిన కళావిలాసము లోకమున కంతటికిని అలంకారప్రాయము, శాశ్వతాభూషణము. అది మనదే అని తెలిసికొనుట గర్వమునకు కారణము, ఉత్సాహమునకు మూలము.

కాని, అది యెంత గొప్పదయినను ఆ గొప్పతనము నేటిది కాదు, నాటిది; పురాతనము. కళ సజీవము: ప్రతిక్షణమును నూతనోన్మేషము నందుచుండును; నవీన వికాసము నందుచుండును. ప్రతిభ క్రొత్త దారుల నడచును. కళాదృష్టి అపూర్వ అన్వయములకు బోవును. సృష్టికి అధునాతన వ్యాఖ్యానములు కలుగును. ఈ నూతనత్వమంతయు దేశీయ లలితకళలయందు ప్రతిఫలించుచుండును. చిత్రకారుని చేతి తూలిక కవి చేతి కలమును వింత వింతరూపముల పరిణామము చెందుచుండును. దేశకళాసామగ్రి యుచ్ఛిన్నము లేని క్రొత్తదనముతో శోభిల్లును.

ఇట్టి మార్పు ఆంధ్రలలితకళలయందు నాటినుండి నేటిదనుక కలిగినది. ఇంకను కలుగుచున్నది. దీనినే కళాచతురులు రచించుచున్నారు. ఇటీవలి ఆంధ్రచరిత్రయంతయు దీనినే రుజువుచేయును. ఆంధ్రసారస్వతమంతయు దీనికే సాక్షీభూత మగుచున్నది. జగత్ప్రసిద్ధిగాంచిన నిన్న మొన్నటి ఆంధ్రనిర్మాణములు దీనికే తార్కాణలు. వేయేల, లలితలలితమగు ఆంధ్రుల తీరుతియ్యములే దీనికి నిదర్శనములు. కావున ఆంధ్రలలితకళ చక్కని వికాసాభివృద్ధులను కాంచలేదని అనుటకు నేను సాహసించను. ఇతరులు సాహసింపలేరనియే నా నమ్మకము.

కాని, ఇప్పటి ఆంధ్రలలితకళ పూర్వపు దానివలె విశాలప్రశస్తిని కాంచలేదని మాత్రము అంగీకరింతుము. దానికి కారణము ఆంధ్రులయందలి లోపము కాదని గట్టిగా చెప్పగలము. ఆంధ్రకళాదృష్టిలోని గుణరాహిత్యము కాదని నిశ్శంకగ పలుకగలము. కాని, ఆంధ్రులతో పాటు ఆంధ్రకళ ఆదరమునకు దూరమయినది. బహుళప్రకటన సౌలభ్యమునకు నోచుకొనలేదు. ఇతరమండలములనున్న ప్రోత్కృష్టతూర్యారవములు ఆంధ్రులకు లభించలేదు. అన్యభాషాకోవిదుల అభిమాన పూరితరచనల భాగ్యము ఆంధ్రకళకు లేకపోయినది. వంగదేశమునను, కేరళదేశమునను చిత్రకారులకు గల అవకాశములు ఆంధ్రులకు అబ్బలేదు. కావున అన్యులు అగ్రపీఠముల నాక్రమించిరి. వారు గీసిన ప్రతి గీతయు భావగర్భితమట్లుగ పేరుగాంచెను. వారి రచనయంతయు విశేషార్థభరితమన్నట్లు ప్రకటన గాంచెను. ప్రతిభాయుతమే అయినను ఆ ప్రకటనావకాశము లేకపోవుటచే ఆంధ్రకళ వాసికెక్కలేదు. గత్యంతరము లేక ఆంధ్రులు అనుకరణకు పూనవలసివచ్చెను. తెనుగు భావముతో, తెనుగు వర్ణసమ్మేళనదృష్టితో, తెనుగు సంప్రదాయమున కనుగుణముగ తెనుగుతన ముట్టిపడునట్లు రచించిన జీవచిత్రములు నిస్సారములట్లు కనబడవలసివచ్చెను. ఎరవు తెచ్చుకొనిన ఇతరుల రచనావిధానము మంచు కెక్కవలసి వచ్చెను. అది ఒక అంధకార బంధురసమయము, ఒక దుస్సహ అవమానకాలము.

అట్టిదానిని ఆంధ్రతత్వము ఎక్కువదినము లంగీకరించియుండ నేరదు. స్వీయప్రతిభను ప్రదర్శించి అవమానమును రూపుమాపును. స్వస్వరూపమును చూపి అనాంతరములను ఉల్లంఘించును. పనికపాట పాడుటను మాని యుండజాలదు. ఆ పనియే నేడు జరిగినది. ఆంధ్రకళ ఆంధ్రస్వాతంత్ర్యమునకు కంకణము గట్టెను. ఆంధ్రలోకము ఆంధ్రరాష్ట్రమునకు దీక్ష వహించెను. పరుల ప్రాపున బ్రతుకుటకు ఆంధ్రు లెంత విముఖులో పరపద్ధతులతో నడుచుటకు ఆంధ్రకళ అంత పెడమొగ మయ్యెను. ఆంధ్రము ఆంధ్రత్వము అను ప్రత్యేకత వెలువడినది. దామెర్ల రామారావు మొదలగు ప్రముఖచిత్రకారులు ఆంధ్రవిధానమును ప్రకటించిరి. ప్రకటించి ప్రశంసల నొడిసిపుచ్చుకొనిరి. ఆంధ్రత్వమున కొక సముచిత ఉన్నత స్థానమును కల్పించిరి. ఆంధ్రలలితకళామతల్లిని ఆ స్థానమున నెలకొల్పిరి. ఆంధ్రమహాజనులకు అత్యంత గౌరవమును సమకూర్చి ధన్యులయిరి. ఆ మహోజ్జృంభణఫలమే నేడు మనము చూడబోవునది. దానిని చూచినవారందరును నాడే కాదు, నేడు గూడ ఆంధ్రతేజము అకుంఠితమైయున్నదని ఆనందింతురనియే నా విశ్వాసము.

మద్రాసు అరవలదా, ఆంధ్రులదా?

౨౦—వ ఆంధ్రమహాసభ ఆహ్వాన సంఘాధ్యక్షులైన శ్రీ వావిళ్ళ వేంకటేశ్వర

శాస్త్రిగారు ఈ విషయమును గురించి ఇట్లు చెప్పియున్నారు.

మద్రాసు [illegible], ఆంగ్లేయులచేత [illegible] ప్రసిద్ధ. నేటికాలమున మద్రాసు [illegible] ముఖ్యస్థానము [illegible] అంగీకరింపను. నాకు [illegible] కాదన్నను. అది వేరు సంగతి కాని, [illegible] కాదు.

నేటికి ఏడాది [illegible] శతాబ్దముల క్రితము మద్రాసు ఉన్నస్థలము ఇంగ్లీషువర్తకులకు [illegible] నకు ఈయబడెను. శ్రీ దామెర్ల వేంకటాద్రి నాయకుడు [illegible] ఉండెను. అతడు [illegible] పరిపాలకుడు. ఇంగ్లీషువారు [illegible] అని వ్యవహరించుచుండిరి. [illegible] ప్రధాన మంత్రి. [illegible] మొదలగు [illegible] పూనమల్లి, శ్రీరంగపట్నం, [illegible] వద్ద [illegible] సీమలను [illegible] అతడు [illegible]. కాని, [illegible] పట్టు దప్పి కృశించి [illegible].

ప్రసిద్ధుడగు [illegible] సముద్రతీరప్రాంత [illegible] దామెర్ల వేంకటాద్రి పాలకుడై యుండెను. [illegible] — (ఓక, బావమరది!) పూనమల్లి? నాయకుడు — అయిన అయ్యప్ప అనువాని [illegible] ప్రాంతము పరిపాలనా భారము [illegible] వహించినను [illegible] ఇంగ్లీషువర్తకులకు [illegible] అనునతడు ఈ అయ్యప్పనాయకునివద్దనుండి మద్రాసుపట్నమును దరఖాస్తు పెట్టుకొని పొందెను. అప్పుడు అది పోర్చుగీసువర్తకనివేశనమైన శాన్ తోమ్ [illegible] (అనగా సెయింట్ థామస్; మైలాపూరున్న) అనుదానికి ఉత్తరముగా మూడుమైళ్లలోనున్న చిన్న స్థలము. అతడు ఆ అయ్యప్పనాయకునుండి అక్కడ ఒకకోటకట్టుకొనుటకును ఒక ఆంగ్లస్థిరవసతి నెలకొల్పుకొనుటకును అంగీకారముకూడ పొందెను. ఇది ఆగస్టు ౧౬౩౯ సంవత్సరములోనిమాట. ఆ దామెర్ల వంశీయులే ఇప్పటి శ్రీ కాళహస్తిరాజాగారు.

౧౬౫౨ సంవత్సరములో మద్రాసులోనుండు ఆంగ్లప్రతినిధి శ్రీ చంద్రగిరిరాయలదర్శనము గావించి అతని "స్వహస్తలిఖితమైన" దానమును బడసెను. ఆకాలు "కెంటూ (తెలుగు) సమ్రాట్ అయిన శ్రీరంగరాయలు [illegible] చేసిన [illegible] రాజశాసనము" అని వర్ణింపబడియున్నది. దానిలో ఇంగ్లీషువారు నిర్మించినకోట—"శ్రీరంగరాయపట్నము నానగరము" అని వ్యవహరింపబడినది. ఆరు వత్సరముల పూర్వము నాయకు డొసంగిన స్థలదాన శాసనమునకు అది అధికారముద్రయై ఒప్పెను. దానితో, ఇంగ్లీషువారికి క్రొత్తహక్కులును వచ్చెను, క్రొత్త భూములును కలిసెను.

దీనినిబట్టి మద్రాసులో ఇంగ్లీషువారి ప్రతిష్ఠాపనతో తెలుగువారికి మిక్కిలి సంబంధ మున్నదియుండుట మనకు విశదము. ఇదిని భూదానముచేసి యిచ్చియుండినది తెలుగునాయకుడు. దానిని మన్నించి ఖాయపరచినది తెలుగురాజు. వారలే సుక సత్సంకల్పహృదయులును సాహసకార్య ప్రవృత్తిపరులును గాకుండియుండిన ఇంగ్లీషువారు మద్రాసులో అడుగుపెట్టి కుదురుకొని యుండుట కల్లవార్తఅయియుండెడిది.

ఇంతేకాదు. ఇంగ్లీషువారు ఆస్థలములో కుదురుకొన్న నాటాకాలముతరువాతవరకును దాని చుట్టును క్రమక్రమముగ [illegible] పెరిగియుండుటలోనేమి, ఆవూరి యొక్క వర్తకపరిశ్రమాదులు విజృంభింపజేసియుండుటలోనేమి బహుప్రముఖపాత్ర వహించినవారు తెలుగువారే. ఈసందర్భమున గ్లిన్ బార్లో అనువారి గ్రంథమునుండి తీసి అనువదించిన ఈ దిగువవాక్యములను గమనింపుడు.

"ఆ చిన్నకోటచుట్టును లేచినపట్టణము వైట్ టౌన్, బ్లాక్ టౌన్ అను రెండింటిక్రింద చీలిపోయెను. వైట్ టౌన్ యొక్క సరిహద్దులు మాచాయగా కేవలము ఫోర్టుసెంట్ జార్జియొక్క సరిహద్దులే. మొట్టమొదటి బ్లాక్ టౌన్—ఓల్డు బ్లాక్ టౌన్—లో ప్రస్తుతపుకోటకును లా కాలేజికిని నడుమనున్న ఖాళీస్థలమును, లా కాలేజి, హైకోర్టుసన్నగల ఆవరణస్థలములును ముక్తై యుండెను. బ్లాక్ టౌన్ లో ఆసియావాసులే విడియుచుండిరి. ఇచ్చటకు తొలుదొల్త వచ్చి నివాసములు ఏర్పరచుకొనినవారిలో అధికసంఖ్యాకులు అర

వలు కారు; తెలుగువారే! కుంఫినీవారి కాగితాలలో వీరు "జెంటూలు" అని పేర్కొనబడినారు."

రాజశాసనమును ఒకకాలును పైన పేర్కొని యున్నాము. అది పుట్టిన ఒక వందసంవత్సరముల తరువాత, ౧౭౮౯ సంవత్సరములో అది అనువదింపబడినది. దానిపై వ్రాయబడిన వ్యాఖ్యానము మిక్కిలి హృద్యమై మద్రాసు నగరజనాభివృద్ధులగూర్చి జరిగిన కృషిలో తెలుగువారివాటా నిష్కర్షగ తేల్చునదియై ఉన్నది. దేవబ్రాహ్మణాదాయపు హక్కులన్నియును అవిచ్ఛిన్నముగను ఆచంద్రతారకముగను చెల్లుచుండి సాగుచుండవలయుననియు అస్థలము ఎల్లరచేతను సర్వదా మన్నింపబడి జెంటూ (తెలుగు) నగరముగ పరిగణింపబడవలయుననియు ఆపట్టాలోని షరతులును ఉత్తరువులును అయినట్టి ఆవ్యాఖ్యానము చాటుచున్నది.

రాజశాసనమునుబట్టి మద్రాసుపట్నం అను గ్రామమును—కోటచుట్టును క్రొత్తగా బయలుదేరిన పట్నమును రెండును వేర్వేరని బోధపడును. కోటను ఆవరించి లేచిన ఈపేటను 'శ్రీరంగరాయపట్నము' అని రాయలు నామకరణముచేయనెంచెను కాని, స్థానిక పాలకుడైన అయ్యప్ప తనతండ్రియైన చెన్నప్పపేరు మీదుగ నొకపట్నమును స్థాపింపవలెనని తపించువాడగుటను క్రియకువచ్చుసరికి దానికి చెన్నప్పపట్నము అను పేరు ఖాయమయ్యెను. ౧౬౩౯ సంవత్సరములో ఇంగ్లీషువారిస్థిరవసతి ఏర్పాటుకానప్పుడు మద్రాసుపట్నం (మాదరాజుపట్నం, మదరాసుపట్నం!) అనెడిపేరుతో కోట కుత్తరముగ ఒక గ్రామ ముండెడిది— (ఇప్పటి జార్జిటౌన్ అదియే). చెన్నప్పపట్నపు ఆవరణము ప్రస్తుతపుకోట ఆవరణము. కొలదికాలములోనే రెండును గలిసి ఏకనగరమయ్యెను. అస్లోకమైన మహానగరమును ఇంగ్లీషువారు 'మెడ్రాసుపట్నము' అని పిలుచుచుండిరి. హైందవులు 'చెన్నపట్నము' అని వ్యవహరించుటకు ఇష్టపడిరి.

ప్రథమమున స్థలదానకర్తలైన ఇరువురి నాయకులను రాయలను అటుండనిచ్చి మాట్లాడుదమన్నను, దినదినముగ పెరుగుచున్న ఆపట్నముయొక్క పరిపాలన క్రియయందును వృద్ధిసంఘటనయందును ఇంగ్లీషువారికి అంతరంగికులై సర్వసామాన్యముగను ప్రత్యేకపదవులలో నుండియును అనేకకాలము వ్యవహరించినవారు ఎవరు అనగా తెలుగువారే!

ఆంధ్రరాష్ట్రము

కడచిన నెం॥ ౮-వ తేదీని చెన్నపురిలో సమావేశమైన ౨౦-వ ఆంధ్రమహాసభ కధ్యక్షత వహించిన శ్రీ సర్. సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు ఈ విషయమున ఇట్లు నుడివి యున్నారు:

ఆంధ్రరాష్ట్రము కావలయుననే ఆందోళన హఠాత్తుగా పుట్టినదికాదు. దాని కెంతో చరిత్ర యున్నది. మొదటిమహాసభ ౧౯౧౩ లో సమావేశమైనది. ౧౯౧౪ లో బెజవాడ సమావేశములో ఆంధ్రరాష్ట్రతీర్మానము జరిగినది. ఈతీర్మానము ప్రతిసంవత్సరము జరుగుచున్నది. ౧౯౧౭లో కాంగ్రెసులో ప్రత్యేకముగా ఆంధ్రదేశమున రాష్ట్రసంఘమును ఏర్పాటు చేసినారు. మాంటేగు, చెమ్స్‌ఫర్డుప్రభువులవద్దకు ఆంధ్రరాష్ట్రమునుగూర్చి రాయబారము వెళ్లినారు. ౧౯౨౦ మొదలుగా ఆంధ్రనాయకులు సహాయనిరాకరణోద్యమములో, మునిగి తేలుచున్న కాలములో, ఆంధ్రోద్యమము కొంత మందగించినది. కాని ఆంధ్రరాష్ట్రము కావలయుననే కోరికమాత్రము వారు విడువలేదు. ౧౮-౨-౧౯౨౭ సం॥లో స్టేటుకౌన్సిలుసభలో ఆంధ్రరాష్ట్రమునుగూర్చి ఒక తీర్మానము వచ్చినది; కాని ఇది రాష్ట్రశాసనసభలో ప్రవేశపెట్టవలసిన తీర్మానమని త్రోసివేసిరి. ౧౪-౩-౧౯౨౭ లో చెన్నరాజధాని శాసనసభలో భాషాప్రయుక్తరాష్ట్రములనుగూర్చి తీర్మానము చేయబడెను. ౧౯౩౮ లో కరుణ్ మోషన్ ద్వారా మరల యీసిద్ధాంతము స్థిరపరుపబడెను. తిరిగి ౧౯౩౩ లో ఆంధ్ర కర్ణాటకప్రాంతములు ప్రత్యేకరాష్ట్రములుగా చేయవలయునని తీర్మానముచేసిరి. రౌండుటేబిలు కాన్ఫరెన్సులో ఆంధ్రరాష్ట్రమును గూర్చి ప్రశంసచేసినారు; లార్డు లోథియన్‌వద్దకును

కొందరు ఆంధ్రప్రముఖులు రాయబారము వెళ్లినారు. కాని ఈ ప్రయత్నముల కేమీ ప్రతిఫలము కలుగలేదు.

మనకోరిక నెరవేరకపోవుటకు కారణము సంపూర్ణ నిర్లక్ష్యమే.

*   *   *

ఆంధ్రదేశపు వైశాల్యము ౧౪౭,౦౧౦ చదరపు మైళ్లు. జనాభా సుమారు ౧౬౨ లక్షలు. సింధు బెలూచిస్థానములకన్న చాలా పెద్దరాజ్యము; వైశాల్యమున దాదాపు బంగాళారాష్ట్ర మంతటిది. ఆంధ్ర రాష్ట్రమునకు దామాషాప్రకారము కొంత రివిన్యూ రాగలదు; కేంద్రప్రభుత్వముకూడా మామూలు న్యాయముగానే కొంత యివ్వగలదు. ఈ రెండూ కలసిన చాలు మన ఆంధ్రరాష్ట్రం స్వయంపోషకము కాగలదు. ఈమాట చెప్పుటలో నేనేమీ కొందరివలె సంకోచించలేదు. అసలు నేనీసమస్య ధనము, పరిపాలనా సౌకర్యము, అనే వాటినిబట్టి ఆలోచించుటలేదు; నేనెంతసేపటికి దీనికి సంబంధించిన, మానసికదృక్పథము, భావైక్యము ఆలోచించియే దీనిని ఆమోదించుచున్నాను.

ఇచ్చటనే ఒకటిరెండు సంగతులు కొద్దిగా తెల్పెదను. మొదటిది రాయలసీమనుగూర్చి, తెలుగుభూమి ప్రత్యేకరాష్ట్రముగా ఏర్పడుట ఇష్టములేనివారు ఈజిల్లాలలో కొంతమంది ఉన్నారు; కొన్ని సందర్భములలో వారు కోస్టల్ జిల్లాలవారికన్న వెనుక బడియున్నారు. కోస్టల్ జిల్లాలలో ఆంధ్రులు అభివృద్ధి చెంది ఉన్నారు; కోరుకలవారు. అందుచేత వారు తమరిని ఏమి చిన్నచూపు చూచెదరో అని అపనమ్మకము. 'నా రాయలసీమమిత్రులు మనకోస్టల్ జిల్లాల సోదరులను పరాయివారుగా చూడరాదు, తాము తక్కువవారమని భావించుకోరాదు' అని నాకోరిక. అందరూ మాట్లాడునది ఏకభాష; సంప్రదాయములు ఏకమే; ఉభయుల అవసరములును ఒకటిరే. ఇటువంటి మనము ఏకము కాజాలకపోయినచో మనకు సర్వసామాన్యమైన సద్గుణమనిపోరే గుణమే లేదని, ఐకమత్యమే చేతగాదని అందురు. 'శ్రీభాగ్ పాక్టు' మూలకముగా యీ అనుమానము లన్నియు అంతరించినవని విని సంతోషించుచున్నాను. ఏమైనను, ఆంధ్రదేశమున రాయలసీమ ఐర్లండుదేశమున అల్స్టరుప్రాంతమువలె వ్యవహరింపదని ఆశించుచున్నాను.

ఈ చిక్కులన్నియు తొలగుటకు ఒక్కటే ఉపాయమున్నది. రాగల ఆంధ్రరాష్ట్రమునకు మద్రాసును ప్రధాననగరముచేసిన చాలును. మద్రాసు ఆంధ్రదేశమున మధ్య ఉన్నది; కోస్టల్ జిల్లాలను రాయలసీమను కలుపుచున్నది. చిరకాలముగా ఆంధ్ర ప్రముఖులతో, సంస్థలతో సంబంధము కలిగి ఉన్నది. ఆంధ్రుల చేతులలోనే మద్రాసు పుట్టిపెరిగినది. పట్నములో లక్షాయాభైవేల తెలుగువారున్నారు. ఏటుచూచినా మద్రాసే ఆంధ్రదేశానికి సహజమైన కేంద్రమని తోచుచున్నది. ఏ సందర్భముగానైన గవర్నమెంటువారికి ఈపద్ధతి సమ్మతము కాకపోతే, పట్నమును రెండుగా చీల్చి రెండురాజధానులు ఇచ్చటనే ఉంచవచ్చును. బౌండరీలు నిర్ణయించే కమిషనువారు, ఈసంగతి ఆలోచించి, ఆ విభాగము చేయగలరు. మద్రాసును ఆంధ్రరాష్ట్రమునకు రాజధానినగరముగా చేయుటకు, కాన్‌స్టిట్యూషనల్ చిక్కులేమిన్నీ లేవని నాఅభిప్రాయము. ఆచరణ సాధ్యమనికూడా తలచుచున్నాను. ఒకేనగరము రెండుగా చీలి రెండుప్రభుత్వముల అధీనములో ఉండుటము చాలాచోట్ల కలదు. సికందరాబాదు హైదరాబాదు లట్లే ఉన్నవి; బెంగుళూరు కంటోన్మెంటు బెంగుళూరుసిటీలు ఆపద్ధతిగానే ఉన్నవి; బ్రిటిష్ కొచ్చిన్, నేటివ్ కొచ్చిన్‌లుకూడా ఆరీతిగానే ఉన్నవి. వర్తకవ్యాపారములు చేయువారున్నూ మద్రాసు ఆంధ్రరాష్ట్రమునకు కేంద్రస్థానము కావలెనని కోరుచున్నారు; గవర్నమెంటుకును ఖర్చులు తగ్గిపోగలవు.

మచిలీపట్నం రేవుస్థలము

౨౦-వ ఆంధ్రమహాసభా ప్రారంభము సేయుచు శ్రీ సర్. ముత్తా వెంకటసుబ్బారావుగారు ఈ విషయమున ఇట్లు చెప్పియున్నారు:

మద్రాసుకన్నా చాలా పురాతనమైన రేవుస్థలము మచిలీపట్నము. దీనిప్రశంస ౧౪-వ శతాబ్దమునాటి

లేక అంతకుముందు తెలుగుకావ్యముల వ్రాయబడినది. చాలా సంవత్సరములు కోరమండల్ కోస్టులో చాలా ప్రముఖమైన రేవుస్థలము. ౧౮౬౪ లో వుప్పెన వచ్చినది. అంతటినుండి ఈ రేవుస్థలం పాడుబడినది.

అయితే ప్రకృతి తన అధికారమును ప్రతిష్ఠించుకొనును. మచిలీపట్నము స్థలవిశేషముచే దైవికమైన తుపానుపిదప మానవుని నిర్లక్ష్యము జతపడినను తిరిగి రేవుస్థలముగా అమరినది. ఈ రోజున వేరుశనగ గానుగ పిండి బందరులో మద్రాసుకన్న విస్తారముగానే ఎగుమతి అగుచున్నది. ఇదియే బందరు సహజమైన రేవుస్థలమని తగురీతులు చేయించి వలయు సౌకర్యములు కావించినచో ఇంకను వృద్ధికాగలదు అనుటకు ఇదియే ప్రబలసాక్ష్యము.

౧౮౬౪ సం॥రము అనంతరము రేవుస్థలము వృద్ధి పొందుటకు అనుకూల పరిస్థితులు పరిసరస్థలములలో ఎక్కువగా కలిగినవి. గుంటూరున్ను జిల్లా ప్రదేశములున్ను విస్తారముగా అభివృద్ధి చెందినవి. అన్నింటికంటె ముఖ్యము శ్రీ శ్రీ హైదరాబాదు నైజాము ప్రభువు పరిపాలనములోను నున్న తెలంగాణా అభివృద్ధి — ఈ అభివృద్ధి నేటివరకైనది కాదు; ఇంకను కలుగగలదు. ఇటీవల కొలదిసంవత్సరములుగా హైదరాబాదు సంస్థానములో పరిశ్రమలు, వ్యాపారము అద్భుతముగా పెరిగిపోయినవి. మచిలీపట్నం, తెలంగాణాకు సహజమైన రేవుస్థలము. నిజానికి ౧౮౬౪ లో జరిగిన ప్రమాదమును నైజామువారు పూడదీసిరి.

కృష్ణా, గుంటూరు, తెలంగాణాలలోని పంటలు, ఖనిజములు, పరిశ్రమలు, సముద్రమార్గమున పోవుటకు బందరే దారి. ఈరేవులో ముఖ్యముగా జరుగుచున్న వేరుశనగవ్యాపారమునకు మంచూరియా గాని, నైగీరియా మున్నగు దేశములు వ్యాపారము చేయుదేశములు బాగుగా పోటీచేయుచున్నవి. ఈ రేవు నభివృద్ధిపరచుటతో చుట్టుప్రక్కల నుండు గ్రామవాసులు ఆర్థికముగా వృద్ధిచెంద నవకాశము కలుగును.

ఇదివరకు ఈ రేవు అభివృద్ధి చెందకుండుటకు కారణమేమైనను కావచ్చునుగాని, ఇకపై మాటలాడక ఊరకుండుటకు వీలులేదు. పోర్టుట్రస్టు ఆఫీసరుగారు ఒకస్కీము తయారుచేసిరని వినుచున్నాము. అయితే ప్రభుత్వమే ధనవ్యయము పెట్టుకొని, ఈ చిన్నరిపేరు ఆ చిన్నరిపేరుగాక సమస్తం అంతా పూర్తిగా రేవు పునర్నిర్మాణము చేయుటకు స్కీము తయారుచేయించవలెను. [illegible] వెంటనే సరిచేయవలెను.

౧. ప్రస్తుతకాలువలు చాల అసంతృప్తికరముగ నున్నవి. సరుకు పూర్తిగానున్న పడవలు, అనుకూలముగాని అలలవలన ౧౨ గం॥లు [illegible] గంటలుకూడా బాగు [illegible] లేకున్నవి.

౨. అందుచే సరుకు పడవల దొంగతనము, దాచుటయు, ఆలస్యమగుటయు; దీనిఫలితముగా అవశ్యము జరుగు దొంగతనములు.

౩. పోలీసు [illegible] కాలవ పోవుట.

౪. వీటన్నిటి ఫలితముగా ఇతర రేవులకన్న బందరురేవుకు ఇక్కడున్న చార్జీలు ఎక్కువగును.

పుస్తక సమీక్ష

వినోదనాటికలు

కర్త: విశ్వనాథ కవిరాజు గారు, ప్రకాశకులు: వల్లూరి అవధాని గారు, విజయనగరము. వెల [illegible]

ఇన్[illegible]', 'క్రొత్తగాపురి', 'సొంగనాటకం', 'ప్రహ్లాద', 'అపప్రతి' అను అయిదు ఏకాంక నాటికల సంపుటి. [illegible] 'క్రొత్తగాపురి' [illegible]! ఇందు సంభాషణలు మిక్కిలి [illegible] సాగినవి. అల్లుడు [illegible] కాపురము తెలియక, పిల్లనిచ్చుకొనిన తల్లిదండ్రుల [illegible] సహజముగా చిత్రింపబడినది. హాస్యము కేవలముగను, నీరసముగను కానుండు [illegible] తోను, [illegible] తోను నడచినది.

ఇక రెండవది '[illegible]'. ఇందు శాస్త్రుల్లు వారిని విశేషముగా తగిలిన [illegible] కొడుకు [illegible]తో, [illegible] సాగించిన సంభాషణ సరళముగను, సరసముగను నున్నవి.

మూడవది — 'సొంగనాటకం'. దీనిలో మహా వీరుని [illegible] భార్యయొద్ద [illegible] కొట్టిన పోలీసు ఇన్స్పెక్టరు నిజముగా దొంగ తనయింటికే వచ్చినప్పుడు పడిన ఆందోళనము, [illegible] ప్రదర్శింపబడినవి.

నాలుగవది 'అపప్రతి'. ఇందు భార్యాభర్తల ప్రణయకలహములు, [illegible], [illegible] పులు, తుదకు 'గ్రేటు' [illegible]గా చిత్రింపబడినవి. సంభాషణములు సహజముగా సాగినవి.

ఇక — 'ప్రహ్లాద'. [illegible] నాటికలు భావముపైనను, సంఘముపైనను విమర్శనము. ఇందు మాత్రము భాషపై విమర్శనము. గ్రాంథిక గ్రామ్య భాషావాదము నిపుణతతో విమర్శింపబడినది.

ఇవి అయిదు వినోదనాటికలు. ఈ నాటికలను బట్టి చూచిన కవిరాజుగారు ఏకాంకనాటికా రచనయందు ఆరితేరినచేయి యనక తప్పదు!

సంభాషణములందు సిద్ధహస్తులు! హాస్యము మిక్కిలి సున్నితముగా నున్నది. మోటదనము కాని, అశ్లీలములు కాని యెచ్చటను కానరావు.

ఆంధ్ర నాటక సారస్వతమునందు ఏ రెండు— 'కన్యాశుల్కము', 'ప్రతాపరుద్రీయము' నాటకాలో తప్ప మళ్లీ చూస్తామంటే కందుకాగడావేసి వెదకినా ఉత్తమనాటకము కనుపించదు. అందుచేత నేకాబోలు కవిరాజుగారు తన యీసంపుటమును శ్రీ గురజాడ అప్పారావు పంతులుగారికి కృతి యిచ్చేరు. మంచిది. కేవలము కృతినిచ్చిన చాలదు, 'కన్యాశుల్కము'వంటి నాటకమొకటి వ్రాసి ఆంధ్రసారస్వతమునకు అలంకారము చేకూర్చుట కవిరాజుగారి విధియైయున్నది!

దామెర రాజగోపాలరావు

కురాను షరీఫ్

ఇది [illegible] మతగ్రంథమూలమునకు ప్రతి[illegible]. అనువాదకులు ఆంధ్రపాఠకలోకమునకు సుపరిచితులైన శ్రీ డాక్టరు చిలుకూరి నారాయణరావు, ఎమ్. ఏ., పిహెచ్. డి. గారు. ప్రకాశకులు: [illegible]శ్రమము, అనంతపురము. వెల ౪ రూపాయలు.

ఈ గ్రంథమున కిది రెండవకూర్పు. మొదటికూర్పు ౧౯౩౦ లో ఎనిమిదేండ్ల క్రిందట ఖర్చయిపోవుటను బట్టియే దీని ప్రాశస్త్యము నూహించుకొనవచ్చును. మహమ్మదీయులకు వేదమయిన ఈ గ్రంథము ప్రతి [illegible] తప్పక చదువవలసినది.

హిందూ – మహమ్మదీయసమస్య—ఒక్క ఆంధ్రదేశమునకే కాదు, హిందూదేశమునకంతటికి — ఒకగడ్డు ప్రశ్నగా మిగిలిపోవుచున్నది. ఇది ప్రధానముగ మతసమస్యయే. సానుభూతితోను, అఖిలభారతజాతీయదృష్టితోను మహమ్మదీయులు హిందూమతగ్రంథములను, హిందువులు మహమ్మదీయమతగ్రంథములను జదివి, ఒకరినొకరు బాగుగ నర్థము చేసికొన్నగాని ఈ హిందూ – మహమ్మదీయ సమస్య పరిష్కారము కాజాలదు.

మహమ్మదీయమతము నవబోధము చేసికొనుటకు చక్కగా తోడ్పడునది ఈ కురానుషరీఫ్ అనువాదము కంటె మరియొకటి లేదు. గ్రంథమంతయు ప్రతిసామాన్యపాఠకునికిని సులభముగ నర్థమగునట్లు తేటతెలుగున వ్రాయబడినది. ఈ గ్రంథమున మొదట మహమ్మదుల

వారి జీవితసంగ్రహము కలదు. పిదప ఇస్లాము మత విధులు, ప్రార్థనలనుగురించి, అనగా తన్మత స్వరూపమునుగురించి . . . . బడినది. "ఇస్లాం అనగా శాంతిమతము. లోకములోని జనుల హృదయములను సంక్షోభపెట్టు నొప్పియు మున్నగు దుర్గుణములను పారద్రోలి, శాంతినొసగి, సర్వేశ్వరుని ధ్యానమునందు వానిని లీనములుగ జేయుమతమునకే యిస్లామని పేరు". ఇట్టిమతమును గురించి తెలిసికొనుట మనయాత్మ వికాసమునకే యుపకరించునుగదా!

ఇటువంటి గ్రంథములు ఆంధ్రభాషలోని కెన్ని వచ్చిన నంత మేలు. ఈగ్రంథమును రచించి శ్రీ చిలుకూరి నారాయణరావుపంతులుగారు ఆంధ్రులకు, ఆంధ్రభాషకు నెంతయో ఉపకారము కావించి యున్నారు. ఇట్టి యుద్గ్రంథములు మనభాషలోనికి రావలెనన్న శ్రీమంతులును, విశేషించి గ్రంథాలయములవారును ప్రకటనకర్తలకు తగిన ప్రోత్సాహము నీయవలెను. మనదేశమునందలి గ్రంథాలయములను గురించి ప్రకాశకులు వ్రాసిన ఈక్రింది పంక్తులు గ్రంథాలయాభిమానులు గమనింపవలసినవి :

"ఆంధ్రదేశములో గ్రంథాలయోద్యమము బాగుగ సాగినదికాని, అది పుస్తకములు ప్రకటించువారిమీదికి పిడుగుగా పరిణమించినది. గ్రంథకర్త ఎంత కష్టపడి నాడో గమనించుదిక్కు లేదు. గ్రంథ మచ్చుగుటకు ఎంతధనవ్యయ మయినదో గమనించువారు లేరు. దానిప్రకటనమున కెంత ఖర్చు పెట్టవలెనో ఆలోచింపరు. గ్రంథము ప్రకటించగానే ఉచితముగా (పోస్టేజికూడ భరించి) ప్రతులను బంపు డని నూర్లకొలది కార్డులు వచ్చిపడుచుండును. ఇది దేశదౌర్భాగ్యమునకు గుర్తు".

ఈ పరిస్థితులు మారినవనియే విశ్వసించుచున్నాము. ప్రతిగ్రంథాలయమువారును మనదేశమున ప్రకటితములగుచున్న ఉత్తమగ్రంథములను కొని గ్రంథకర్తలకును, ప్రకాశకులకును ప్రోత్సాహ మిచ్చుచున్నయెడల మనయాంధ్రవాఙ్మయము అనతికాలముననే ఉత్తమ గ్రంథరాజవిభూషితమై పెంపుచెందగలదు.

మాతృమందిరము

(ఒకటి, రెండుభాగములు)

ఇది నవలారత్నమాలలోని మొదటి రెండు రత్నములుగ ప్రకటిత మయినది. రచయితలు : శ్రీ వేంకట పార్వతీశ్వరకవులు. ప్రకాశకులు : ఆంధ్రప్రచారిణీ లిమిటెడ్, కాకినాడ. వల ఒక్కొక్క భాగము ౧౨ అణాలు.

శ్రీ వేంకట పార్వతీశ్వర కవులనుగాని, వారు నడిపి నెలకొల్పిన 'ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల' నుగురించుగాని యెరుగనివా రుండరు. రమారమి ఇరవైయేడు సంవత్సరములక్రిందట స్థాపితమై 'ఆంధ్రప్రచారిణి' తెలుగుదేశమునకు చేసినసేవ అపారమైనది; స్మరణీయమైనది. విజ్ఞానచంద్రికతరువాత తెలుగుదేశము నాకాలమున ఆంధ్రప్రచారిణి యంత ఎక్కువగా నాకర్షించినసంస్థ మరియొకటిలేదు. అందునను, విజ్ఞానచంద్రిక ఒక్కనవలలేకాక జీవితచరిత్రములు, శాస్త్రగ్రంథములు ఎక్కువగా ప్రకటించుచుండినప్పుడు ఆంధ్రప్రచారిణి కేవలము నవలలనే అని బంగాళీనవలలకుగాని, మరి వేటికిగాని తర్జుమాలయినసేమి, స్వతంత్రములయినసేమి - ప్రకటించి తెలుగువారిలో గ్రంథపఠనాసక్తిని వృద్ధినొందజేసిన దనుటలో అతిశయోక్తిలేదు. ఆంధ్రవాఙ్మయపరిణామపథములో ఆంధ్రప్రచారిణిది స్మరణీయమయిన ఒక ప్రముఖస్థానము. మరల నిప్పుడు శ్రీ బొలాంత్రపు సత్యనారాయణరావుగారు ఆంధ్రప్రచారిణిని లిమిటెడ్ కంపెనీచేసి దాని నుద్ధరించుట సంతోషకరమయిన విషయము. శ్రీ సత్యనారాయణరావుగారు వెనుకటి ఆంధ్రప్రచారిణీప్రచురణములలో కొన్నిటినేరి, నవలారత్నమాల అను గ్రంథపరంపరలో పునః ముద్రించి ప్రకటింపనున్నారు. ఈ నూతన నవలారత్నమాలలో మాతృమందిరమును మొదట ప్రకటించుట ఎంతయు సముచితముగ నున్నది.

మాతృమందిరము శ్రీ వేంకట పార్వతీశ్వరకవులు స్వతంత్రముగ రచియించిన నవల. ఇందలి ఇతివృత్తము తెలుగుదేశమునకు సంబంధించినది. పాత్రలన్నియు తెలుగువి. కథ ఆంధ్రాభిమానమును బోధించునది. తెలుగువారనేకు లిదివరకే దీనిని చదివి దీని ప్రాశస్త్యమును గ్రహించియున్నారు. చాలకాలము క్రితమే దీని ప్రతు లయిపోయినవి. మరల ముద్రించి దీనిని తెలుగువారి కందజేసినందుకు శ్రీ సత్యనారాయణరావుగారు అభినందనీయులు. వారితోపాటు మేమును "దేశమున ప్రజ్వరిల్లుచున్న నేటి ఆంధ్రోద్యమాభ్యుదయ సమయమున నీయపూర్వమగు సాంఘిక నవల ప్రజాహృదయము నాకర్షించునని తలచెదము."

హరి.

యువకథావళి

ఇది తెనాలి యువ కార్యాలయం వారి [illegible] ప్రచురణం —[illegible] ప్రకాశనం, ఈ ప్రచురణం [illegible]:

ఇందులో మల్లాది రామకృష్ణశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, [illegible] కృష్ణమూర్తి, పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రి, సోదెస, ముదిలి వెంకటసుబ్రహ్మణ్య శర్మగార్లవి [illegible] కథలున్నవి. ఈ కథకులందరూ ఆంధ్రపాఠకలోకానికి చిరపరిచితులే అయినందువల్ల, వీరిని గురించి, వీరి కథలను గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదనుకుంటాను.

అన్ని కథలలోనూ [illegible] చాలా ఆకర్షిస్తున్నవి. [illegible] చిన్నకథయినప్పటికీ ఇంత చాకచక్యంగా [illegible] చేసినందుకు [illegible] చూపినందుకు [illegible] తండ్రి 'పాలన' [illegible] గోచరిస్తూ ఉంటారు.

మల్లాది రామకృష్ణశాస్త్రిగారి [illegible] గా ఉన్నది.

పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రిగారి 'సంధానం' లో కొన్నికొన్ని [illegible] ఉన్నా కథ బాగున్నది.

కొడవటిగంటి [illegible] కథలు బాగా వున్నవి.

ముదిలి వెంకటసుబ్రహ్మణ్యశర్మగారి "పస్తులు చిత్తగించండి" లో [illegible] అని కొంత ప్రయత్నం చేశారు. [illegible] ఫలించింది.

మొత్తానికి యువకార్యాలయం వారు శ్రమతీసుకొని వరుసతప్పకుండా కథాసంపుటములను ప్రచురిస్తూ చౌకధరలకు సద్గ్రంథాలను ఆంధ్రదేశానికి అందచేస్తూ, భాషాసేవ చేస్తున్నందుకు వారు అభినందనీయులు. అ. క.

అపోహ

నాటకము— గణపతి, గాలి బాలసుందరరావుగారు. ఉషాగ్రంథావళి, చీరాల : కృష్ణాజిల్లా. వెల [illegible] అణాలు.

విశ్వాసరావు, మనోహరరావు అన్నదమ్ములు. నిర్మల, మనోహరరావూ కలిసి చదువుకున్నారు. తర్వాత నిర్మలకు విశ్వాసరావుతో వివాహం. నిర్మలతో మనోహరరావును లోకం (వేణుగోపాలం అనే విద్యార్థి రూపంలో) అనుమానిస్తుంది. విశ్వాసరావుకు కూడా చివరకు ఈర్ష్య కలుగుతుంది. ఆ అనుమానానికీ, ఈ ఈర్ష్యకూ ఆధారం లేదని నిరూపించడానికి మనోహరరావు ఆత్మహత్య చేసుకుంటాడు. చివరకు ఇతనిగోరీ (?) వద్ద "మనోహరరావు మహాయోగి" అని నిర్మల తండ్రి నారాయణమూర్తి భరతవాక్యం చెప్పడంతో నాటకం పూర్తి అవుతుంది.

ఇదీ "అపోహ" ఇతివృత్తం. దీనిని ఐదు రంగాలలో గ్రంథకర్త నాటకం చేశాడు. [illegible], సీట్లపేక, సంగీతం, భావకవిత్వం మీదా, స్వేచ్ఛాప్రణయం మీదా (నాత్యగాఢమైన) చర్చలు, ఒకసర్పు, స్వగతాలు (మనోహరరావు ఒక స్వగతంతోనే చనిపోతాడు) ఉన్నవి.

నాటకానికి సంభాషణలు ప్రాణం. "అపోహ" లో సంభాషణలు ఎక్కడా విసుగు కలిగించలేదు. కొన్నిచోట్ల ఉజ్జ్వలంగా ఉన్నవి కూడా.

నాటకానికి కథావేగం (tempo) ముఖ్యం. ఈ సృష్టిని పరుగెత్తేవి, నడిచేవి, నిద్రించేవి అని నాటకాలను ఉత్తమ మధ్యమ అధమవిభాగం చెయ్యవచ్చును.

పర్వాలేదు. "అపోహ" నడుస్తుంది.

మనోహరరావు పాత్రమీద నాటకకర్త చాలా పెట్టుబడి పెట్టాడు. అందువల్ల ఇతరపాత్రల విషయంలో కొంత నష్టపోయాడు. శ్రీ. శ్రీ.

గ్రంథ స్వీకారము

పచ్చిపిల్ల :— ప్రకాశకులు : ము. స. శాస్త్రిగారు, ఆంధ్రీకుటీరము, పల్లిపాలెము, ఇంజరంపోష్టు, తూ. గోదావరి.

స్వప్నకథ ఔచిత్య విచారపరామర్శ :— వెల్లటూర్ల రామకృష్ణరావుగారు. "కుమార"ముద్రణాలయమున దావిష్కృతము. ప్రతులు దొరకుచోటు: కుమార ప్రింటింగ్ వర్క్సు, వరంగల్లు (నైజాము) వెల: మూడు అణాలు.

తొలికానుక :— వెల్లటూర్ల రామకృష్ణరావుగారు. వెల రెండణాలు. పై గ్రంథము దొరకుచోటనే ఇదియును దొరకును.

కాకిసారిను :— (కాల [illegible]) [illegible] ప్రతిభ [illegible] శ్రీ [illegible] [illegible].

సభారంజనము :— ([illegible])

శివధ్యాన సుధానిధి :— ([illegible]) [illegible] పుస్తకములు [illegible] శ్రీ [illegible] వేంకటరత్న కవిగారు. ఇది [illegible] రత్నమాలలో [illegible] పుస్తకము లుగ ప్రకటితమయినవి. వలయువారు, [illegible], కవితా [illegible], (Via) [illegible] ప్రాయవలెను.

[illegible] :— [illegible] (Via) [illegible].

ప్రేమతత్వము :— గ్రంథకర్త : [illegible] శ్రీనివాస [illegible] మూర్తిగారు. తెలప్రోలు. [illegible] [illegible]. వెల రు. ౧-౬-౦ [illegible] పురం, [illegible] ప్రెస్సులో ముద్రితము.

అంతో సామ్యవాదులే :— గ్రంథకర్త : యమ్. ఆర్. [illegible] గారు. వెల రు. ౧-౮-౦. పోస్టేజి రు. ౦-౧-౦. మద్రాసు, బి. యన్. కె. ప్రెస్సులో ముద్రితము.

పరమపదసోపానము :— గ్రంథకర్త : వంగిపురం రంగ [illegible] గారు. [illegible], [illegible] జిల్లా. వెల రు. ౧-౨-౦. [illegible] ప్రెస్సులో ముద్రితము.

పత్రికా స్వీకారము

ఢంకా (గీపావళిసంచిక) :— ఇది శ్రీ [illegible] [illegible], మల్లాదివారు, చలంగారు, విశ్వ నాథ కవిరాజు గారు, కవికొండలవారు మొద లైనవారు వ్రాసిన కథలతోను, హాస్యరస [illegible] వ్యాసములతోను [illegible] [illegible] [illegible] [illegible] గారి [illegible] [illegible] ప్రచురణ [illegible], [illegible] శ్రీ [illegible] వ్రాసిన [illegible] [illegible]. [illegible] ఆంధ్రుల [illegible] ప్రశంసాపాత్రులు. [illegible] [illegible].

మహాశ్రీ :— శ్రీ [illegible] వెంకట సుబ్బయ్యగారి సంపాదకత్వంక్రింద తెనాలినుండి ప్రకటింప బడుచున్న మాసపత్రిక. ఇది [illegible] [illegible] [illegible] అలంకరించినది. ఇది శ్రీ విశ్వ నాథ సత్యనారాయణగారు, [illegible] [illegible] గారు, [illegible] [illegible] మొదలైనవారు [illegible] [illegible] కావ్య ములతోను, [illegible], అవధాని, [illegible] [illegible] [illegible], [illegible] [illegible] [illegible] [illegible], [illegible] [illegible], [illegible] [illegible] ఆకర్షకంగా ఉన్నది. [illegible] [illegible] బాగున్నది.

అడ్వాన్సు [illegible] :— [illegible] ఆంధ్రాంగ్ల మాసపత్రికయొక్క [illegible] సంచిక [illegible] [illegible]. ప్రకటనపద్ధతిని [illegible] [illegible] దీ పత్రిక. ఇంకను ఆకర్షణీయంగా [illegible] [illegible] [illegible] [illegible] ప్రకటనలు దొరకవచ్చు. [illegible] ప్రకటనలకు తో డుగా "సిమెంటు పరిశ్రమ," [illegible], [illegible], [illegible] [illegible], ప్రకటన విధానము ఇత్యాది చిన్న చిన్న వ్యాసా లున్నవి ఉన్నాయి ఇంగ్లీషులో మొదటి [illegible] ఇంగ్లీషులోనూ, తక్కినవి తెలుగులోనూ ఉన్నా యి [illegible] [illegible] [illegible], ఆఖరు [illegible] [illegible] [illegible] [illegible] ఉపక రిస్తాయి విజయనగరం, శ్రీ [illegible] ప్రెస్సులో ముద్రితము. సంపాదకులూ, ముద్రాపకులూ, ప్రచురణకర్తలూ కె. శ్రీనివాసరావుగారు.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty St., Madras. Editor:— S. Sambhu Prasad.

వి ష య సూ చి క

చిత్రములు



మాతృవాత్సల్యము

చిత్రకారుడు: పి. యల్. నరసింహమూర్తి



సంపు. ౧౫ బహుధాన్య, మార్గశీర్షమాసము (డిసెంబరు 1938) సంఖ్య ౧౨

వెన్నెలరేయి

"సంపత్"

ఈ సొగసన్న కాంతు కురియించిన వెన్నెలసన్నతుంపురుల్
మేనికి సోకసన్ వలపుమెత్తని నాయెద పుల్కరించి యే
నో సుమగీసు గిల్లుకొనబోయిన స్వాప్నికసౌఖ్యరేఖలో
తేనెలుకోసమై వలపు తెట్టువ గట్టును లేతవెన్నెలన్.

కులికిన సిగ్గులో పెదవికుంచి వసుంధర నవ్వినట్లు, క్రొ
వ్వాలపులేనిగ్గై నిలిచి వాసకసజ్జిక చూచినట్లు, వె
న్నెలసయ్యగారి లేమెఱుగునీడల జాడల పుక్కిలించు సొం
పులహొయలేగు జాబిలికి, మోహనమూర్తికి మంగళారతుల్.

పలపల వెన్నెలన్ కుముదవల్లరు లీ కొలసిగ్గుపూలన
వ్వులతరితీపుతేనియలు, పుప్పొడులున్, వయసున్ హరించు వె
న్నెలలహొరంగు లేమెఱుగునీటుల జాబిలితేని నెంతగా
వలచినవో యొసంగెడి నుపాయనముల్ మధుకర్ణికాంజలుల్.

ఉరమున గంధపూత చెమరొత్తెడు చల్వలబోలె, చెమ్మలో
పొరలకు కప్రపుం సురటివోలె, జగా జిగి మిన్కు సోయగం
బరుగని కన్నె చెక్కిళుల యౌవన రేఖలబోలె, ఊహలో
విరిసిన తళ్కునోలె చిఱువెన్నెల లందము పంచిపెట్టెడుం.

లేతపసిండితీగ కదలించిన రాలిన పూలజల్లులై
శీతల శుభ్రకాముదులు చిందిన పీ తొలివెల్గుచాలు లా
శాతటులందు, రేవెలుగు జార్చిన వెన్నెలపూలజల్లు లీ
నా తొలికాన్కతో చలువనారులు నాటును మెట్టభూములం.

నవకపు వెల్గురాజనము నాటిన జాబిలికాపు, పంటకుం
దవిలిన చేను కోసి, వసుధాతలమం దొకకళ్లె మూడ్చి, క్రొం
దొవజవరాలు వెల్లువరి దూరుపు బట్టిన కుప్పనోసి, గా
రవమున చూచెనో యన వెలార్చును వెన్నెలకన్నె చూపులం.

కలయని కూరుముల్, మనసుకట్టని లేవలపుందుమారముల్
పొలయని భావముల్, యతుకుపోసెడి వెన్నెల లివ్వి ; కన్నె చూ
పుల పచరించు లేమెఱుగు మొత్తములే సెలకట్టి వచ్చెనో
తళతళ వెన్నెలై వలపుదారుల బోసిన వెల్గునారులై.

* * * * *

నాపసియూహలో నొదిగినట్టిది, మోహనకైశికీసుధా
లాపన లందికో వలపు రాగిలు వెన్నెలరేలరేగు నా
తీపితలంపులో కొదమతేనియ లేరి యొసంగినాను జ్యో
త్స్నా పరిశుభ్రవీథి జలదమ్ముల దారెడు చందమామకుం.

సాహితీ పరిశీలనము

జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి

అనల్పమైన విషయపరిజ్ఞానము; పరితమనసున నవ్యదృశ్యములను, దివ్యభావములను సృష్టింపజాలు సామర్థ్యము; నైసర్గిక ప్రతిభా భాసురమై, స్వతంత్ర భావబంధురమై, సహజప్రజ్ఞాగర్భితమై, స్వీయానుభవసముద్భవమై సర్వసీమలందు సర్వసమయములందు సత్యసందీపితమై సకలమానవుల రసనములపై కాపుర మండజాలు సిద్ధాంతతతిని ప్రకాశము గావింపగల కౌశలము.

కావ్యమునకు సంబంధించిన ఈ భావసామగ్రి రసమందు, ధ్వనియందు, ఔచిత్యమందు, వ్యంగ్యవిభవమందు (వెలుగులో, నిత్యనిరోగములో, పరిమళములో దివియందు తళుకొత్తు వేలు వేలు రంగవల్లికలలో చల్లని హిందోళములలో నిశ్వాస హృదయమందలి భావములు స్వీయవ్యక్తీకరణ మందునట్లు) ఆత్మప్రకాశము నందును.

ఉద్వేగమునకు, గభీరాలోచనమునకు సంయోగము కలిగినపుడే రసము, గంభీరభావము ఉద్భవించును. ఇవి మానుషభావనయందున, గంభీరనినదమున, సుందరరచనమున వ్యక్తమగును. వనధివీచిక నవలోకింపుడు. ఇది యుత్తాలమైనది. ఉదాత్తమైనది గభీర రత్నాకర సముద్భవమై, దిశావలయమును పులకితమొనరింపజాలు ఆనందగీతిక నాలపింపజాలునది. శరధిగభీరత గభీరాలోచనమని, రత్నములు భావరత్నములని, వారాశిహృదయమున నెలగొను చిరశాంతి అవిచలితసమాధి యని సాగరసంగీతపు బుట్టుపూర్వోత్తరముల నరసినపుడు తెల్లమగును. సంగీతసాహిత్యము లేకైకగుణాన్వితములే! గభీరరత్నాకరమును గుండెయందుగల రచయితవాక్కే గంభీరమై, సాగరసంగీతమునకు సహపాఠియై యుండును. సంగీత సాహిత్యములు సామాన్యస్వరమునగాని, కర్కశశబ్దమునగాని వ్యక్తము కావనుట స్పష్టమేకదా!

సామాన్యము కానిభాష సౌందర్యసంశోభితమైన దని, అలంకారవిలసితమైనదని తెలుపుదుము. ఇది అక్కరాల గుంపని కాక, భావభువనముల సమూహమని తలపజెల్లును.

భావభువనములను తక్కెడ రాళ్లవలె తూచ దలచువారును, కావ్యవసుంధరను కొలబద్దలతో గొలువ నుంకించువారును కొందఱు కలరు. వీరికి చేతనైనది వెట్టి ధోరణి. కళాసూత్రముల నెఱుగక శాస్త్రవిధులను గొన్నింటిని పిడికిటబట్టి సాహితిని పరిశీలించువారు కొంద ఱున్నారు. వీరికి శక్యమైనది దుర్విమర్శనము.

భావధారను ధునీధారకు పోల్చవచ్చును.

గిరిశిఖరములపై నెంతో తప సొనరించియే నదీమతల్లులు భావభరితములై, ధారాధారలై స్రవించి విశాలకేదారములందు పైడిపంటలను పండించును. తపసు ననుసరించి, నైసర్గికశక్తి (యిది పూర్వభవ తపఃఫలమనుడు) ననుసరించి ఫలము నిలుచును. మహానదు లన్నియు నొక్క శ్రేణిలో గణింపబడినను, వ్యక్తిగతమైన ప్రాముఖ్యముతో పరగును. వీని గమ్యస్థానము మహోదధియైన నేమి, యివి యొక్కదిక్కున నుదయింపవు. ఒక్కదిక్కుగ ప్రవహింపవు. స్రవంతులే యైనను, ఒక్కరీతినీటితో నొక్కవిధమున స్రవింపవు మహారచయితలును ఇట్టివారే సుడీ; వీరి గమ్యస్థానము మహిమోన్నతమే. వీరిరచన లొక్కతీఱున నుండుననుట కల్ల. ఎవరి ప్రయోగము, ఎవరిశైలి, ఎవరిధోరణి, ఎవరిపాట, ఎవరి యాలాపనము వారిగి. మహాకవులు హోమరు డాంటే షేక్స్పియరు లొకేరీతిగ తమరచనలను సాగించిరా? ఒకే గమ్యస్థానముగల మన కవిత్రయమువా రొకే తెఱగున దమ కలములను నడపిరా? మహారచయిత లందఱు భావోపాసకు లనుటలో, వీరిభావ సౌందర్య సందీప్త మనుటలో నేకత యుండుగాక వీరిలో ప్రత్యే

కతకూడ లేదనందురు. ఒకరి కొకరు "భళాభళి" యను కొనువారు వెఱ్ఱిభాగవతమును సృష్టింతురు కాని కవిత్వ మహత్త్వమును, కళాపటుత్వమును సృజింతురా? కళకును "భళాభళి"కిని కనుచూపులు లేవు. వెనుకతాళములు, "తందానతానలు" స్వాతంత్ర్యప్రియుల ప్రాంగణములందు నయితము వినబడవు. ప్రపంచమున రాజకీయవాదులు పుట్టకమున్నే కవీంద్రులు స్వాతంత్ర్యప్రియులై జగదీశునితో నేకగ్రీవముగ వందేమాతరగీతిక లాలపించిరి. వీరిప్రత్యేక ప్రతిభయందే వీరి స్వాతంత్ర్యము కలదు. ఇందే ఉత్కృష్టమైన,— వ్యక్తిగతమైన సృష్టి కలదు. అందకత్తెల అంతరంగములును, ఆననములును తమలో తాము నకళ్ళై, అనువాదములై, అనుకరణములై, అనుసరణములై యుండనట్లు ప్రతిభావంతుల రచనలును అనురూపములై యుండవు. వ్యాకరణశాస్త్ర అలంకారశాస్త్రములకు వాఙ్మయవసుంధరలో సర్వసాధారణపక్షముల నేర్పరచు కర్తవ్య మున్నను, వ్యక్తిగతప్రతిభ కాంక్షించు వ్యక్తీకరణగతిని నిరోధించుహక్కును, సౌందర్యమాధుర్యములను క్రాసుపరీక్ష జేయు నధికారమును లేవు. ప్రవాహము వరవేగమున బోవుతఱి, నీకట్టునను, అకట్టునను గలకట్టలు దాని గతినిసుడించి హుకుము చెలాయింపగలవా? ఒక్కొక్కపు డివికూడ తెగిపోవు! మహారథులయినట్టి పైన దెలుపబడిన శాస్త్రములు చెప్పనిన బిగువైన సూత్రముల నొక్కొకప్పుడు త్రెంపి, సాహితీవధూటికి నవ్యవాదముల నందిరి. స్వాతంత్ర్య సౌందర్యములు వలచురీతిని, భావగతి కాంక్షించు తెఱగున భాషను ప్రయోగించిన ప్రజ్ఞాధురీణులు వీరు. సాహితీహృది నెఱుగనివారు వీరి ప్రయోగములు దోషభూయిష్ఠము లని కను లెఱ్ఱజేతురు. ఎఱిగినవారు పదునాలుగు భువనములను పొట్టనిడికొనిన దివ్యడింభకుని అక్కున జేర్చికొనిన యశోదవలె, భావభరితమైన వారిప్రయోగపరంపరను మక్కువతో మనసున జేర్తురు.

పదప్రయోగమును, అలంకార సృష్టియును సాహిత్యమున గణింపవలసిన ప్రధానాంశములు. అంతరంగమును పఠింపగల సూక్ష్మదర్శి ప్రభావశీలతమున భావశోభల మహత్త్వమును. గుఱుతింపజాలునట్టి కొందఱొక పదప్రయోగమునందు, కొందఱొక యలంకార సృష్టియందు కన్నులనిల్పి విమర్శకులుగ నయిన వ్యాపియమున దర్శింపగలుగు భావబాహుళ్యమును బట్టిగో గ్రహించి ఆనందసాగరమున నోలలాడుదురు. మానసమలయంతరంగమునుండి స్వయంభువై వెలసిన కేదారేశ్వర లింగములీల, హృదయ గర్భాలయమున స్వయంభువై తలచూపిన ప్రతిభనుండి వెడలు ప్రణవధ్వానము సాహిత్యమున గురుగంభీర ప్రతిధ్వనులను లేపినంతన వీనులొగ్గి విశ్వేశ్వరభక్తునివలె నీ విమర్శకుడు ప్రమథగణమున కిసుగోలుపురీల తన్మయనృత్యము సలుపును.

భావమహత్త్వమును, భాషాతత్త్వమును విపులముగ నుగ్గడించుట కిందు తావు లేదు. భవ్యభావగర్భితమైన భాషాలంకారమును బహుభంగుల వర్ణింపవచ్చును. గ్రీకుల దృష్టి ననుసరించితిమేని యిది రంభవంటిదని చెప్పవచ్చును. బాహ్యసౌందర్యమునేకాక అంతరంగిక మహత్త్వమును (ఆధ్యాత్మికమైన లావణ్య మనుదు)కూడ వలచునారము కావున నిది రుక్మిణిదై యవతరించిన రమాసతి బోలునదని వచింతును. ఈమె గర్భమున మన్మథు డున్నాడు కదా! మన్మథునిబోలు భావమును ధరించువాక్కు ఆదిలక్ష్మికెనదైనదని గ్రహింపనివా రెవరు? దేవి యుచ్చరించు నుడువు అద్భుతసత్యమై యుండునుగదా! కావున కావ్యవాక్కు, ధ్వనితవాక్కు, సుందరవాక్కు, భావభరితవాక్కు, అలంకారసందీపితవాక్కు, ఆత్మ నలరించు వాక్కు గంభీరసిద్ధాంతి బంధురమై కాలగహ్వరమున ప్రతిధ్వనించుచుండు నని తెలుపుదును. ప్రపంచ మహారచయితలరచనల నవలోకింపుడు. వీనియందు రమాసతి ప్రత్యక్షమగుట నెఱిగి పరమపరితోషసంభరితస్వాంతులయ్యెదరు.

సంస్కృతము దేవభాషకావున నందలి శబ్దములపై కన్నుల నిలిపినంతన మానసనేత్రము ప్రోల వివిధ దివ్యదృశ్యములు మిన్కులీనును. బహుళాంశములొండొంటికి చేదోడై యీ వాఙ్మయమున ప్రవేశించి, నైసర్గికమైన దీనివిభవము ననేకమడుంగులు ఘనతరమొనరించినవి. వాణి తొలుత తన వీణాతంత్రులను మీటినపుడు రాలిన సుధాబిందువులును, లక్ష్మీనారాయ

ణులు పంతముతో బంతులాడుచుండ దల్పమునుండి రాలినపుప్పొడులును, కల్పకము చెంతనున్న దీపస్తంభము నుండి రాలిన వెలుగురేకలును, మొయిలుగమిపెనక్క దాగుడుమూతలాడుచు నింగిందు పరువులెత్తుచు, సౌదామినీబాలలు కిలకిల నవ్వ రాలిన రతనము లును, రమాపతితో నింగుమోదమున మేలమాడుచుండ శ్రీపతి చేతినుండి జారిన గంధపుగిన్నెనుండి రాలిన భావభరిత కణములును, మల్లెలత్తుగుత్తగలను తమశిఖలం దలంకరించుకొని దేవభామినీమణులు మహోల్లాసమున నృత్యముచేయుచుండ రాలినముక్కలును, బృందా వనమునుండి జాల్వారిన వేణునినద మల్లన నందనము జేరి ఆవేగభరితసమీరస్పర్శకతన చెదరుటచే రాలిన తీపి తుంపురులును, భగవతియు, భగవంతుడును తలంబ్రాలు వోసికొనుచుండ రాలిన మౌక్తికములును, పతిత సముద్ధ రణమునకై భూతలమున నవతరించు నవసరమున లోక పావని మందాకినీమతల్లి ఆలపించిన ఆనందభైరవి నుండి రాలిన మధురకళలును, ప్రాణపతితో సరస్యాటలాడుచు రోహిణీప్రభృతులు బుగ్గలు పొడువ జందురుని చెక్కిళులనుండి రాలిన చంద్రికలును, మహేశుని హృదయగహ్వరమునుండి వెడలి అజాండమున ప్రతిధ్వనించిన ప్రణవనాదమును, కలకంఠకంఠముల నుండి కల్పకపత్రములనుండా వెలాదువెల్లి "హూహూ హూహూలు"ను, మధుమాసమును నందనమందే కడప నిశ్చయించి, పూలపాన్పుపై శయించి, చిఱునవ్వులు నగుచు, పరస్పరముఖావలోకనమున పరవశులైన పుణ్య దంపతులు పలుకు ముద్దుపెంపు గుసగుసలును, చుక్క నెలంత లాలపించు నిస్తబ్ధ గీతికాశకలములును, కామ ధేనువు "అంబా!" యనినపుడు నాకమున వినవచ్చిన ప్రతిధ్వనియును, నటరాజనృత్యము నవలోకించి అవి రళముగ దేవగణ మొనరించిన కరతాళధ్వనులును, పై శాగరస్ ఉల్లేఖించిన గంభీరనవగ్రహగానమును, పాడుపు గొండెచుట్టు నవిరతముగ జాల్వారు శకుంత గీతికార్భటి మును, ఇందునగరసుందరీమందిరమున నల్లన శ్రుతిగోచర మైన తారకపునర్ఘురణమును, సప్తఋషిమండలము నుండి యేకగ్రీవముగ వెడలు గంభీరసామగానాలాపన మును ఘనీభవించినపిమ్మట ప్రభవించినవినుడీ!

భావమహత్త్వము మిగుల జిత్రమైనది. ఉన్నత మైనకొలది అల్పాక్షరములందే యిది యాత్మప్రకాశము గావించుకొనును. "అల్పాక్షరముల ననల్పార్థరచన కల్పించుటయ కాదె కవివివేకంబు" అనికదా పాల్కు రికి సోమనాథకవి పలికినాడు. ఒక్క కుక్షియందు కుదురుగ విడిసినపుడే పదునాలుగు భువనముల గొప్పం దనము పరిరక్షింపబడినదికదా ! లలితమైన చిన్నిమల్లిక యందే దిక్కామినుల నలరింపజేయజాలు అవధిరహిత సుగంధము కాపురమున్నదికదా! మల్లెలు చేటలంత యుండెనేని, గులాబు లూరంత యుండెనేని అందచం దము తెలుగనిపై "ఇసీ!" యనిపించును. వీనిమూల్యము హూడ కలుగదయగును. పరిమితప్రయోజనములు కలిగి నపుడే పదార్థమునకు మూల్యము కలుగునని అర్థశాస్త్రము తెలుపుచుండుట అనేకు లెఱుగుదురు. ఈసత్యము అలం కారశాస్త్రమునకున్ను చెల్లునని నా వాదన.

కావ్యభాషాతత్త్వము ప్రత్యేకమైనదేకదా! ఈయాశయమును మది నిడికొనువారు రచనావిధానమునకు సంబంధించిన కర్యములకు కాలు ద్రువ్వరు. అంతరంగ మందలి భావబ్రహ్మాండమును వ్యక్తీకరించినగాని కవి దురంతమైన యాతనముచే పొగులును. తన హృదయము కాంక్షించు తెఱగున భావప్రకాశము గావించుకొని నపుడే యాతడానందజలధి నోలలాడును. సంక్షేప వ్యక్తీకరణమునకును, అనల్ప సౌందర్యమునకును, శిల్ప కౌశల్యమునకును, మాధుర్యసృష్టికిని అవినాభావసంబం ధము కలదు. ఈనాల్గు గుణములను సమాకరింపజేయగల రచయితయే హృదయస్థ భావభువనమునకు సముచిత వ్యక్తీకరణపంథను సృజింపగలడు. వ్యంగ్య మంటిని, రస మంటిని, ఔచిత్య మంటిని, ధ్వని యంటిని — యివి యీనాల్గు గుణముల ఆత్మప్రకాశముదాల్చిన అభిధే యములే యని ఋజువొనరింపగలను. ఈగుణము లవార్యముగ నొక యలంకారము, నొక జాతీయము, నొకలలితపదసమాసము నొక ముద్దుపెంపు వాక్యసృష్టిని కాంక్షించును. ఒక్క వెలుగురేక యవనికపై పడినంతన నెంతమేర కాంతివంతము కాగు? కావ్యాక్షరమెందు కంట బడినంతన మానసజవనికపై నెంతో తేజము, వలువలంకుల బరువులెత్తు ఆకాశధారవలె విస్తృత

మగును. చిన్నిదీపిక పెక్కుబెత్తుల గనుపున నిడికొని, విశాలగృహాంగణము నాలోకిత మొనరించులీల, కిరణ రాజి కెనయైన అక్కరముల (యివి క్షరముకావుసుడీ!) నాత్మ హృదిగొనిన కావ్యము పఠితమానసదిశావలయ మును భాసమానము గావించును. నైసర్గికమైన భావ తత్త్వము ననుసరించినభాష ప్రదర్శింపగల మహత్త్వ మెట్టిదో యూహింపుడు. వెలుపల నిలిచి బెత్తము జేబూని దీనినిగుఱించి తీవ్రశాసనములు జారీచేయువారు పుష్పములను ప్రదీపములను శాసింపబూనువారిని పోలు వారేకదా!

సంస్కృత సాహిత్యమున బహుళాలంకార ములు కలవు. ఆంగ్లసాహితిలో నిన్ని యలంకారములు లేవు. ఇట్టినిన విపులాలంకారసృష్టికి హేతువులగు ఉత్కృష్టభావము లాంగ్లవాఙ్మయమున లేవని తలప రాదు. వసుంధర కొక షేక్స్పియరు నొసగిన సాహిత్య ముదాత్త భావాభావమున, భావభరితభవ్యకవితాభావ మున బడియుండెనని తెలుపువా రెవరు? అలంకారము లన్నింటికి నాదిమాతయు ప్రతిభాప్రకాశమునకు మిగుల చేదోడగునదియునైన ఉపమను, దీనికి కడుంగడు సన్నిహితమైన రూపకమును (వీని కనతిమారమున నిలుచు నలంకారములకుగూడ వలసినంత యవకాశ మొస గుచు) ఆంగ్లమహారచయితలు బహుభంగుల ప్రయో గించిరి.

విపుల వివరణముగాని, లెక్కతపిసీలుగాని కావ్యభావమునకు పనికిరాదు కావున నక్షరసంక్షేపము గావించి వ్యక్తీకరణాంగణమును సంకుచిత మొనరించి మహారచయిత వ్యంగ్యవిభవమును ఘనతర మొనరిం చును. విషయమును చెప్పివేయురచయిత వెఱ్ఱివాడు. పఠితయూహకు దానిని వీడువాడు గడుసరి. ఈతడే చేవగల కావ్యకర్త కాగలడు. ఉపమిత మిది యని ఉప మేయ మది యని ఉపన్యాస మిచ్చువా డీతడు కాడు.


ఉపమకంటె రూపకము మనోహరమై యుండు టకు హేతువు వివరణము సంకుచిత మగుటేకదా! "ఇంతి ముఖము చంద్రసఖి" యను వాక్యముకంటె "చంద్రముఖి" యనుపద మెక్కుండు చక్కనై యుండలేదా? పాఠ కుని తలపునకు చేకులు క్రియావకాశ మధికమగు కొలది భావప్రభావ మధికమగును. "మచ్చలేని చంద్రబింబ మీ మెవదన మని" తెలుపక విషయమును చదువరి యూహకు వదలినకవి తనభావమున కెంత గాంభీర్యము నెంత ప్రాభవమును చేకూర్చినాడో విలోకింపుడు:

"శా. పంకేజానన! నేటిరేయి వినుమీ
పంతంబుతో రాహువుల్
శంకాతంకము లేక షోడశకళా
సంపూర్ణు నేణాంకునిం
బొంకం బార్పెదనంచు బల్కిన దగన్
బొంచుండి నే వింటి నీ
వింకం గస్తురిబొట్టు బెట్టకుము త
న్వీ! ఫాలభాగంబునన్."

జంకుగొంకులకు తావీయక కవి తనస్వాతంత్ర్య మును ప్రయోగింపవలెనని వాంఛించియే లోకము లాత నికి నిరంకుశత్వము నొసగినది. భావ మీశ్వరాంశసము ద్భవము కావున ననంతశక్తిగలదియని, ఆశక్తిని ప్రకా శము గావించుభాష అనుచితమైన అంకిలి నెఱుగరాదని అది యెఱుగును. మెఱుపువలె భావము మానసదిగ్వలయ మున దళుక్కునును. మెఱుపుగతిగల భావమును ప్రకాశ మొనరించుభాష కమఠమువలె నడువ నుంకించునా? నిరోధవశమైనగాని, అక్కఱైనగతి నెఱుగక దుర్గతి బడును. తన చిత్తమువచ్చినతెఱగున భావమును భాష గుండా పర్వత్తనియ్యవలె ననిన గ్లిష్టమైన శబ్దములు నేలపాలుకావలెను. నిష్ఠురమైన నిబంధనములు తెగితీర వలెను. ప్రబోధచ్ఛాయను వివరణలక్షణమునుగల అక్క రములు ముక్కముక్కలు కావలెను. స్థైర్యసాహసము లను తన సొమ్ములు చేసికొను రచయిత యిట్లొనరించు టకు సంశయింపడు. "ఏమిచోరవ! ఈరీతి రచన మీ తెఱగుశైలి మనభాషలో లేదు. సంప్రదాయవిరుద్ధ ముగ ప్రవర్తించుచు, తప్పులను ఒప్పులు చేయు చున్నాడు, తెగువ! స్పర్ధ! ఉద్ధతి! దౌష్ట్యము!" అని కను లెఱ్ఱజేయు ఛాందసు లున్నారు. రచనకు సౌందర్య మును, శైలికి మాధుర్యమును చేకూర్చుసహజశక్తియును స్వాతంత్ర్యప్రజ్ఞయును మేటిరచయితలకే ఉండును. వీరే భాషామందిరమున నధివసించిన నారాధకులైననేమి? వీరి భావములను హృదయంగమ మొనరించుకొన్న వీరి

రచనావిచిత్రముల నవగాహము గావించుకొని ప్రసిద్ధమైన వీరిపద్ధతిని మనవాఙ్మయమున ప్రవేశపెట్టినపుడును, ఉత్కృష్ట దృష్టాంతముపై సృష్టిపడినపుడు నవ్యమైన ఊహలు మనసున నుదయింప నాంతరంగికమైన వీనిప్రోత్సాహముకతన నపూర్వోత్సాహము నంది, స్వీయప్రతిభ కదలు వెలిగి సౌందర్య మాధుర్యములకు బన్నముగాక నిరితార్థత జేకూర్పనెంచి స్వతంత్రమైన భాషాప్రయోగములను రచనమున ప్రవేశింపనిచ్చినపుడును దుడుకుతనము జూపుట పండితులమని, భాషాసేవకులమని, కళోపాసకులమని, ఆనంస్రవకుల మని తెలుపుకొనువారికి తగునా?

భావప్రపంచమందు, సాహిత్యవసుంధరయందు జాతిమత ప్రభేదములును, స్వదేశ విదేశ విభేదములును విజృంభింపరాదను నంశము నెఱుగక విదేశభాషలయెడల మన పెద్ద లనేకులు ద్వేషముగానియుండుటచే నవ్యరచనావిధానములయెడల సానుభూతిని, మక్కువను జూపజాలకున్నారు. అన్యభాషారంగకులైననేమి, అమృతభాండములను గుండెలం దిడికొని తమరచనలను సుధాప్లావిత మొనరించినపుడు జగదారాధ్యులు కారా? వీరి జీవితవిధానమును, శైలిచిత్రములను, భావప్రభావమును, రచనాపంక్తులను గమనించినపుడు వీరి యనుభవములవలన నెంతేని విజ్ఞాన మంది, మాఱుమూలలెన్నలందుగాని, పరిచితిలేని యిక్కట్టులబారిగాని బడక విజయశిఖరము నవలీలగ నధిష్ఠింపగలముకదా! దృష్టి యూర్ధ్వమున నున్నపుడు, మానసము విష్ణు విహంగమై విహరించునపుడు అధోగతి పాలగువా రెవ్వరు? సంచితవిజ్ఞానము చానిపదనముకాదు. దీనిపై నాధారపడిన స్వాతంత్ర్యకాంక్ష జిజ్ఞాసువును విచ్చలవిడినడకలో నేల దొంగిలించును? దీనిపై నాధారపడిన స్వప్రయత్నము ఒడుదొడుకు ప్రబుకున నాతని నేల కూలద్రోయును? మనపండితప్రకాండు లీ యంశమును గమనించుట పాడికాదా? గ్రీక్, లేటిన్, ఫ్రెంచి, జర్మన్ మున్నగుభాషల కాంగ్లేయులును, ఆంగ్లమునకు వంగీయులును ఆంతుపెట్టక, వానివలన దా మందిన పరిజ్ఞానముకతన నద్భుతమైన మానసికదార్ఢ్య మంది, స్వతంత్రరచనలను గావించి, నవ్యమైన శైలివిధానములను సృజించి తమవాఙ్మయములను ప్రపంచ మహాజిజ్ఞాసువులందఱికిగూడ మనోహరము లొనరించి తాము దిగంతవిశ్రాంతకీర్తివంతులైరికదా!



ఒక్క పువ్వే?

'వాఘూల్'

ఒక్కపు వ్వేటు చాలునోయ్? నీ
కొక్కన వ్వేటు చాలునోయీ?
వలపులోనో సొలపులోనో
కలుగుతీపియె వలయుఁగాదా;
అందమందే వలపుసొలపులు
అంతటను లోకమునఁ గలవోయ్!
ఒక్కపువ్వే?

అడుగు నిడితివి లోకమందున
హాయికొఱకే కాదటోయీ;
అందఱకు సొత్తయిన లోకము
నందమందే హాయి కలదోయ్! ఒక్కపువ్వే?

ఏకతమ కూర్చుండి యూరక
ఏడ్వ నెటులు సహింతువోయీ?
పవ లనక, రే యనక యీవిధి
బాధనెటులు భరింతువోయీ? ఒక్కపువ్వే?

'కలఁడో, లేఁడో' అయిన స్వామికిఁ
గాల మంతయు రిత్తపుచ్చుచు
ఏల యీగతి సేవ చేయుదు
వెందునా పొందని శ్రమంబున? ఒక్కపువ్వే?

ఆవిభుని నేర్పయిన కృతులగు
ఈవిరుల నందమ్ము లేదా?
ఆవిభుని ప్రతిమూర్తులే యగు
ఈ విరులలో వలపులేదా? ఒక్కపువ్వే?

కలవిరుల నన్నిటిని వలచుము;
వలయుచో లోకమునె వలచుము;
కలవు తీపియు హాయి దాననె!
బదులుకోరెడి స్వార్థపరతను
వదలుమోయ్! అనవసరమోయీ!
ఒక్కపువ్వే?

రావు నీకాశానిరాశలు!
రాదు నీ కిక భగ్నహృదయము!
నిత్య సౌందర్యార్చకుఁడవై
నిత్య మానందమ్ము గ్రోలెడి
సత్యమగు జీవితాశయ మా
చరణమందున నిడఁగదోయీ!
ఒక్కపు వ్వేటు చాలునోయ్!

కవిరాజు కథ

గన్నవరపు సుబ్బరామయ్య

సుందర స్వరూపాన్ని వర్ణిస్తే ఆసౌందర్యం నిండుదనంతో కన్నులయెదుట రూపంకట్టిన ట్లుండి మనస్సుకు పరమానందాన్ని కలిగించకపోతే ఎందుకని ఆవర్ణనచేయడం? వర్ణన ఎంతయుత్కృష్టంగా ఉన్నా వర్ణితవస్తువుయొక్క వాస్తవస్థితిని గోచరింపచేసేదిగా ఉంటేనే రుచికరంగా ఉంటుంది.

సకల సౌభాగ్యాలకు దూరమైపోయిన వితంతువులంటే నాకు పరమాసహ్యం. వికేశలయితే మరీని. సామాన్యంగా వితంతువులు వికేశలుగా ఉండిపోవడానికి మనశాస్త్రాలు ఒప్పుకోవుకదండి! సమయం దొరికినప్పుడల్లా తలకుమాసినముండలు, నాచకమ్మలు, చెడినలు, విశ్వస్తలు, రండలు, వదగుబోగులు, హైనమాలిన పరమ నిర్భాగ్యురాండ్రు — ఇత్యాదిగా తిట్టిపోస్తూ ఉంటాను. అయితే ఒకచోట యీవిషయంలో కొంచెం మోమాటంపడవలసివచ్చింది.

'నిద్రమేల్కాంచి రేపాడి నియమపరత
సహితము భర్తని వీక్షింపకటుకమున్న
తగదు వీక్షింప సరసను పల్లి, వదిన,
నత్తగారిని దప్పించి యన్యసుదతి.

మూలకారుడు వ్యాసుడు ఒకతల్లినిమాత్రమే వీక్షింపతగనన్నాడు. ఆయనకు ఉన్నిందల్లా అమ్మ ఒకతే. తానే పెద్దవాడు కాబట్టి వదిన లేదు. పెండ్లిలేదు కాబట్టి అత్తగారూ లేదు. అందువల్ల అమ్మను చెప్పి ఊరుకున్నాడు అతడు. నాకట్లా కాదు. అన్నగారి భార్య ఒకామె, అత్తగారు ఒకామె ఆనాటికి వితంతువులు ఇద్దరు నాకుతీరని ఉరిగా ఏర్పడ్డారు. ఎలాగూ తప్పుకోలేక వాళ్ళనుకూడ అమ్మతోపాటు మినహాయించక తప్పిందికాదు. మోమాటం చాల చెడ్డది సుమండీ! ఆత్మనుకూడ బలియిచ్చుకోవలసివస్తుంది దానికి తరుచు.

నాసౌందర్యపిపాసను, నాశృంగారరసప్రీతిని ఆధారంచేసుకొని నన్ను కేవలం స్త్రీలోలుణ్ణిగా భావిస్తారు కొందరు. ఏవేవో చాటు పద్యాలు (కొన్ని చాలా బూతుగాకూడా ఉంటవి) చెబుతూఉంటారుకూడ అందుకు ఉపబలకంగా. అవన్నీ నేను చెప్పినవన్న వేనటపైన ఇంకా వారనడం. ఒకపద్యం మాడండి.

హా జలజాక్షి, హా కిసలయాధర,
హా హరిమధ్య, హాశర
ద్రాజనిభాస్య,హాసురతతంత్రకళా
నిధి, యెందుఁ బోయితే
రాజమహేంద్రవీథిఁ గవిరాజు నను౯
గికురించి థర్గకం
తాజిరకాలకూటఘటికాంచితమైన
యమాసచీకటి౯."

ఒకకొందరు లాక్షణికులీపద్యం నాదని తాము సంతరించిన లక్షణగ్రంథాల్లో ఉదాహరించారు. వీళ్లను కాదనలేను. కాని నాకేమో గుర్తులేదు ఈపద్యం చెప్పినట్లు. ఇంకా పుక్కిటి పురాణాలు, నానుడికథలు ఎన్నో వినవస్తూఉన్నవి. ఈవిషయంలో వీటినిబట్టే వచ్చింది నామీద అపోహ. 'అదుగో తోక అంటే ఇదుగో పులి' అనేరకంవారుకదాండి మనవారు! అట్లని నేను మడిగట్టుకుని కూచున్నవాణ్ణని చెప్పడంలేదు. ఇష్టమృష్టాన్న భోజనము, సుఖశయనాసనాదిసౌకర్యము, వస్త్రభూషణాద్యలంకారసమృద్ధి, నిరంతర మహారాజసాంగత్యము, సరసకవితాసంపన్నత, 'సకలకలా ప్రావీణ్యము, ప్రౌఢనిర్భరవయఃపరిపాకము — ఇన్నీ ఒప్పిఉన్న వాణ్ణయితిని. ఇంతో అంతో శృంగార రసాన్ని అనుభవించవలెనన్న అభిలాష లేకపోతుందా?

అదీకాక, చెప్పుకోదగిన దాంపత్యవిషయం లేకపోయినపుడు నాలాటివాడు 'ఇనుపకచ్చడం'

బిగించుకొని ఉండడం సాధ్యం అవుతుందా చెప్పండి? ఇది లోకసహజమైన విషయమే కదా! అలాగని నన్ను విటరాయణ్ణి చేయడంమాత్రం న్యాయంకాదని నా మనవి. నారచనలు ఆమూలాగ్రం చక్కగా పరిశీలిస్తే నాస్వభావం సరిగా ఏలాటిదో తెలిసివస్తుంది.

దక్షారామభీమేశు డున్నాడే, ఆపాతకాలపు జోగిరాయడు — సరసానికి పోయేనన్ను చూచి 'దక్షపురిసానికూతులను' తాను 'తెసులు'కున్నాడు. 'భృంగిరిటి'నో, 'ఢుంఢి'నో, 'నికుంభు'ణ్ణో కైదండచేసుకొని 'అంతఃపురాంగనలను' 'కన్నుమొరగి' 'గన్నేరుకాదారి పొద్దున' 'సానివాడకు' 'ఘూర్జరప్రకారం'తో బయలు దేరేవాడు. ఆ 'పదునాలుగుమహాయుగాల ముదుక'డికి 'సానిపెండ్లి' ఎప్పుడు 'మొగచాలై' యుండేదికాదు. అతడికోసమేకా ఇంద్రుడు నాళ్లను దాన మిచ్చింది!

నా నాటికీ నాకు ప్రాభవం అధికమవుతూ వచ్చింది. కీర్తిప్రతిష్ఠలు మిన్నుముట్టిపోయినవి. నన్ను మించినవాడు మరి లేడన్న ఆత్మవిశ్వాసమూ ఏర్పడింది. ఇందులో అతిశయోక్తి ఏమాత్రంలేదన్న సంగతి తమకు విశదమే ననుకుంటాను. ఇలా వుంటూవుంటే కర్ణాకర్ణిగా పిడుగువంటివార్త ఒకటి వచ్చిపడింది — విద్యానగరాధీశుడు ప్రౌఢదేవరాయల ఆస్థానంలో నన్ను మించినవాడు ఒక డున్నాడని. అతని పేరు గౌడడిండిమభట్టు. అతడు ఉద్దండపండితుడు; కవిసార్వభౌముడు. ఇది అతడిబిరుదులెండి. అతడు ఎందరినో పండితులను వాదాల్లో జయించి తనవిజయదర్పాన్ని కంచుఢక్కను మ్రోయించి ప్రకటించుకొనేవాడు. నాకు ఆతనివార్త హృదయశల్య మయింది. నేను గొప్పపండితుణ్ణి, కవిలోకసార్వభౌముణ్ణి. అతడిగొప్పను ఎట్లా ఓర్చుకో గలను? అతడు నాకు పరమశత్రువన్నభావం ఏర్పడిపోయింది. వింధ్యపర్వతం అన్నట్లు ఎవడికైనా సరే,

'కంటికి నిద్రవచ్చునె, సు
ఖంబగునే రతికేళి, జిహ్వకుఁ
వంటక మిందునే, యితర
వైభవము ల్పదివేలు మానసం
బంటునె, మానవంబుగల
యట్టిమనుష్యున కట్టివానికిఁ
గంటకు డైనశాత్రవు డొ
కండు తనంతటివాడు కల్గగా'

చెప్పండి. అతణ్ణి ఎలాగయినా జయించి కంచుఢక్కను బద్దలుకొట్టించి కవిసార్వభౌమబిరుదాన్ని వూడదీయించేయాలని సంకల్పించాను. వెంటనే విద్యానగరానికి ప్రయాణం కట్టాను. అక్కడ చేరినతరువాత ఎంతకాలానికీ రాజదర్శనం లభించిందికాదు. ఎన్నో వేషాలు వేశాను; ఎన్నోకష్టాలు పడ్డాను; పరమదారిద్ర్యాన్ని అనుభవించాను. అయితే నాదృష్టంతా కార్యసాధనమీదనే. అప్పుడు నేను పద్దపాట్లు

'కుల్లా యుంచితి, కోక సుట్టితి, మహా
కూర్పాసముం దొడ్గితిన్
వెల్లుల్లిం దిలపిష్టముం మెసవితిన్
విశ్వస్తవడ్డింపఁగన్
చల్లా యంబలి ద్రావితిన్ రుచులు గో
సంబంధు పోనాడితిన్'.

'శ్రీనాథుడను' అని, సార్థకమయిన నా పేరును చెప్పుకొని 'నామీద దయలేదా?' అని కన్నడరాజ్యలక్ష్మిని ప్రార్థించాను. చివరకు రాజదర్శనం కలిగింది. డిండిమభట్టుతో వాదం ఏర్పడింది. కవిపండితమండలితో నిండిన రాజాస్థానంలో అతణ్ణి పరాజితుణ్ణిచేశాను. అతడికంచుఢక్కను బద్దలుకొట్టించాను. నాసామర్థ్యానికి మెచ్చుకొని అతడి కవిసార్వభౌమబిరుదాన్ని నా కిప్పించాడు ప్రభువు. డిండిమభట్టంటే సామాన్యుడు కాడు. అతణ్ణి జయించడ మంటే దిగ్విజయం అంతపనన్న మాట. చేసినతర్వాత ప్రౌఢదేవరాయలు నన్ను తన ముత్యాలశాలలో కనకాసనంమీద కూచుండబెట్టి కనకాభిషేకం చేశాడు. కనకాభిషేక మంటే సామాన్యమయిన సత్కారమండీ. ఇలాటి సత్కారం ఎంతటి వారికోగాని జరుగదు. ఈవిధంగా హృదయకంటకమైన శత్రువును నేను జయించాను. నాకు మించినవాడిక లేడన్నప్రసిద్ధిని పొందాను. చాలు, అంతే నాక్కావాలిసింది; ధన్యుణ్ణయ్యాను. ఇదంతా శారదాదేవి కటాక్షంవల్ల అయిందే. అందుచేతనే సర్వజ్ఞసింగభూపతి దర్శనానికి పోయినప్పుడు ఆయన యాస్థానంలో శారదాదేవివిగ్రహం ఉండగా చూచి

"దీనారటంకాల దీర్థ మాడించితి
దక్షిణాధీశుముత్యాలశాల
పగులగొట్టించితి ఉద్భటవివాదప్రౌఢి
గౌడడిండిమభట్టుకంచుఢక్క
చంద్రభూషక్రియాశక్తిరాయలయొద్ద
పాదుకొల్పితి సార్వభౌమబిరుదు
పలుకుతోడై తాంధ్రభాషామహాకావ్య
నైషధగ్రంథ సందర్భమునకు
ఎటుల మెప్పించెదో నన్ను నింకమీద
రావు సింగమహీపాలు ఠీవిగోలు
నిండుకొలువున నెలగొనియుండి నీవు
సరస సద్గుణనికురుంబ శారదాంబ!"

అని స్తోత్రంచేశాను: అక్కడనుంచి నాకు ఆమె కృపవల్ల జయమే కలిగింది. ఆసింగభూపతి మహావిద్వాంసుడు. అతడి మెప్పును పొందడమంటే, ఇంతంత సంగతి కాదు.

నాదగ్గ ఎంతోక ఏమికున్నాగు! నావిద్యాధికారి ఉద్యోగం పోయినాపటంచు తిగవాంతి చాలాకాలం దాకా దానివాసన నాకు పోలేదు. గోదావరితీరాన యోజనత్రయ పరిమితమైన సస్యభూమిని దశగ్రామసమేతంగా భీమమండలమనే పేరుతో యింద్రుడిచేత భీమేశ్వరుడికి దాన మిప్పించాను. ఆదానానికి శాసనం నేనే తయారుచేశాను.

"సురపతి, మార్గశీర్షమున
శుద్ధచతుర్దశినాడు రోహిణిన్
బొరసినసిద్ధయోగమున
భూతలమిచ్చె సరోధి గోతముల్
గరుసుగ దుల్యభాగయును
గండ్రేడు లోనుగ దశవాటికా
వరునకు భీమనాథునకు
వారవధూత్రిశతిద్వయంబుతోన్".

ఇది శాసనంలోపద్యం. ఇంద్రుడు భీమనాథునకు వారవధూత్రిశతద్వయం ఇచ్చినట్టు శాసనప్రమాణం చిత్తగించారా? ప్రతిచరిత్రవిషయానికి శాసనప్రమాణం కోరుతారుకదండీ నేటిచరిత్ర పరిశోధకులు. దీనికింకొక ప్రమాణంకూడ తర్వాత రికార్డయింది. ఇదుగో:

"మహితభక్తి నేభామలమనుమరాంధ్ర,
దక్షిణానందవనమహాస్థానపతికి,
భీమనాథేశ్వరునకు సుత్రాము డిచ్చె,
ననఘ వీరసుమ్మయ్య యయ్యప్సరసలు".

ఈ సంగతి విష్ణుశీల సుశీలురు శివశర్మకు అప్సరోలోకంలో చెప్పినారు.

నేను ఎప్పుడూ అందలాలమీదనే ప్రయాణం చేసేవాణ్ణి. నాతోకూడా వేలకొలది పరివారమూ, శిష్యబృందమూ వుండేవారు. నాకూ నాసిబ్బందికీ ఆతిథ్యం ఇవ్వాలంటే ఏమహారాజులకో, ఏపెద్ద శ్రీమంతులకో తప్ప యితరులకు సాధ్యమయేదికాదు. అయితే, నన్నాహ్వానించేవాళ్లు అలాటివాళ్లే. సామాన్యులు నన్నాహ్వానిస్తారా! ఆహ్వానిస్తేమాత్రం నేను పోతానా! ఈసందర్భంలో నాకోచిన్నవిషయం జ్ఞాపకంవస్తుంది., చెప్పకుండావుందామంటే మనస్కొప్పడంలేదు.

'బాలరసాలసాలనవపల్లవకోమల' మయిన భాగవతాన్ని రచించిన బమ్మెర పోతన్న వున్నాడే, ఆయన మా అక్కగారిభర్త. ఆయనకవిత్వం అమృతధారాప్రవాహంకదండీ.

ఆయన, పాపం, పూటకీ గుడ్డకూకూడా లేని శుద్ధ దరిద్రుడు. 'పుష్కలంగా వున్నవాణ్ణి, ఏదో యింత సాయంచేస్తానయ్యా' అంటే — ఓహ్ — అంగీకరించేవాడా? 'ఏదో కాలం వెళ్లబుచ్చుకుంటూన్నాం లేవోయ్' అనేవాడు. ఆయనకు ఎంత అభిమానం! ఒకమాటు ఆయనదగ్గర ఓచిన్నచమత్కారం పట్టించాను. ఒకనాడురేపట అందలంమీ దెక్కి సపరివారంగా మా బావవూరికి పోయినాను. వూరిదగ్గిరపొలంలో కొడుకు ఏరుసాగిస్తూంటే మాబావ గట్టుమీద కూచునివున్నాడు. అల్లంతదూరాన్నుంచీ చూచాను ఆయన్ను. బోయీలను పల్లకీకొమ్ములను విడిచిపెట్టి తొలగిపొమ్మన్నాను. నేంజేసినపని మాబావ కనిపెట్టాడు. ఏరు కట్టినయెద్దులను విప్పించేశాడు. బోయీలు మోయకుండా నాపల్లకీ సాగిపోతూవుంటే ఎద్దుల్లేకుండా మాబావఏరూ సాగిపోతూవుంది. సరే, యింతలో కలుసుకున్నాము. పరస్పరం కుశలసంప్రశ్న మయింది. తరువాత తనకమ్మని

భాగవతాన్ని సర్వజ్ఞసింగభూపతి కృతిపొంది తన్ను అఖండైశ్వర్యవంతుణ్ణి చెయ్యడానికి సిద్ధంగా వున్నాడని సూచించాను. 'రాజులు హూళో'లంటూ, వాళ్లకు తన కావ్యాన్ని అంకితం యివ్వనంటూ అననట్టుగానే నన్నూ నాభోగాభిలాషనూ గర్హించాడు మాబావ. తెంపపెట్టయింది అది నాకు. ఆయనదగ్గర ఇంక నోరెత్తలేకపోయాను. సరస్వతికృపచేత మాబావ నాకు పరివారానికి సకలోపచారాలతో తృప్తిగా ఆతిథ్యమిచ్చి మావూరికి పంపేశాడు. న్యాయంగా మాబావయింటికి నేను ఒక్కణ్ణే కాలినడకతో పోవలసినవాణ్ణి. కాని, నాఐశ్వర్యాన్ని ప్రకటిస్తూ దర్జాగా పోతే అది చూచి మాబావమనసు మారి లౌకికభోగాలపైపు తిరిగి, తద్ద్వారా వాళ్లదారిద్ర్యం తొలగిపోతుందేమో అన్న ఆశతో నామామూలు పద్ధతితో పోయినాను. నాకు బాగా శృంగభంగ మయింది. మా యిద్దరికీ పాండిత్య కవిత్వాలు, పేరుప్రతిష్ఠలు, మహత్త్వము శారదాదేవి కరుణాకటాక్షంవల్ల లభించినవే. అయితే నాదృష్టి అంతా ఐహికవాంఛలమీదనే. మాబావదృష్టంతా ఆముష్మిక చింతమీదనే. ఆదేవిమాత్రం మాయిద్దరినీకూడా సమదృష్టితోనే అనుగ్రహించింది. ఆయనకాలం అలాగే వెళ్లింది; నాకాలం యిలాగే వెళ్లింది.

ఆముష్మిక విషయపరామర్శ నాగ్రంథాల్లోనూ లేకపోలేదు. అదంతా మూలగ్రంథాల్లోదే. నాకు అల్లాటి విషయాలమీద అంతగా విశ్వాసంలేదు. అవి ఒకతీరూ ఒకతెన్నూ లేనివి. అందులో మళ్లీ ఎన్ని భేదాలు! ఎన్ని మతాలు! వాటిల్లో ఏది విశ్వాస్యం! ఒకమతంవాళ్లు ఇంకోమతంవారిని నిందిస్తూవుంటారుగదా! నిందించటంతోటే పోయిందా! తరుచు ప్రాణాలకుకూడా అపాయం కలుగుతూవుంటుందే! అందుచేతనే నాకు వాటిమీద నమ్మకం లేకపోయింది. నేను 'బహుధా విప్రతిపత్తిధీవిహితముల్ వాదైనశాస్త్రార్థముల్' అని నా అభిప్రాయాన్ని మనవిచేశాను. ఎవరేమనుకున్నా సరే, వేదాలు, శాస్త్రాలు, ఆగమాలూ, పురాణాలు అన్నీ ఆమూలం చక్కగా పరిశీలించినతరువాత నా మనస్సుకు వాటిమీద విశ్వాసం నశించింది.

నాజీవితం యిలాగా ఏఒడుదొడుకులూలేకుండా ఆప్యాయంగా నల్లేరుమీదిబండిలాగా చాలాకాలం నడిచింది. ఇంతిలో నాకు వార్ధకంవచ్చింది. నన్ను మన్నించి ఆశ్రయంయిచ్చిన రాజులకూ ప్రధానులకూ వారిరాజ్యాలకు అపాయం సంభవించింది అక్కడక్కడ చిన్నచిన్నరాజులు చిల్లరశ్రీమంతులు కొందఱు మిగిలారు. వారిఆదరంతో కొన్నాళ్లు గడిచింది. అప్పుడుకూడా నాదర్జాకు అంతగా లోటుకలగలేదు. ఇంతలో మనదేశంమీద వడ్డెరాజులు వచ్చిపడ్డారు. రాజ్యాలను ఆక్రమించుకున్నారు. వాళ్లకు తెలుగే రాదు. ఇక తెలుగుసాహిత్యం వాళ్లకెందుకూ? వాళ్లు నాముఖమైనా చూచారుకాదు. అంతటితో నాకవిత్వ పాండిత్యాలను మూటకట్టిపెట్టేయవలసివచ్చింది. ఇంక నాకు జీవనోపాయం! నన్ను ఆదరించేవాళ్లెవరూ లేరాయెను. అందులో ముసలితనం బాగా పైకొంది. నేనేమో మొదటినుంచీ మహారాజభోగాలకు అలవాటు పడ్డవాణ్ణయితిని. ఇంతతో అంతతో గడుపుకోగల నా జీవితాన్ని? దర్జాకు లోటురాకూడదు. ఆలోచించి చూచాను. వడ్డెరాజులను కలుసుకొన్నాను. వాళ్లవద్ద ఒకగ్రామాన్ని గుత్తకుతీసుకున్నాను. దానిపేరు బొడ్డుపల్లె. ఏడాదికి ఏడునూర్లటంకాలు దానిసిస్తు. ఎత్తు పెద్దదే! దాంట్లో వేలకొలదీ లాభం వస్తుందనీ, సుఖంగా వెనకటివలెనే జీవనం జరిగిపోతుందనీ ఆశపడ్డాను. సిబ్బందినిపెట్టి సేద్యం సాగించాను. ప్రయోజనం ఏమీ లేకపోయింది. నేను కవిసార్వభౌముణ్ణిగాని కర్షకసార్వభౌముణ్ణి కాకపోతిని. 'బాపనసేద్యం నూకలకురాదు' అన్న సామెత ఉండికదా! పదోవంతైనా పంట తేల్లేదు. గ్రామం కృష్ణఒడ్డున వుంది. కృష్ణవరద వచ్చింది. ఆ పండినమాగాణిపంట రవ్వంతా ఆవరదలో కొట్టుకొని పోయింది. నువ్వులు, పెసలు మొదలయిన మెట్టపంటలను పక్షులు, పురుగులూ, ఏరుకుతిని పోయినవి. ఈలాగా నాసేద్యం మొదలెత్తింది. సిస్తుకోసం రాజోద్యోగులు కస్తీచేశారు. నాదగ్గర సొమ్మెక్కడుంది? ఒకటా, రెండా?—ఏడునూర్లటంకాలు! నే నెక్కడతేగలను? రాజోద్యోగులు నిర్బంధించారు; అవమానించారు; దండించారు. అంత గొప్పబతుకు

బతికి నేను చివరకు ఆవిధంగా వడ్డెవాళ్లచేత అవమానాన్నీ దండననూ పొందానండీ. వెనుకటి నాగొప్పను తల్చుకుంటూ,

'కవిరాజు కంఠంబు కౌగిలించెను గదా
పురవీథి నెదురెండ పొగడదండ,
ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబున
దగిలియుండెను గదా నిగళయుగము,
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేతి
వియ్యమందెను గదా వెదురుగొడియ,
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెను గదా
నగరివాకిటనుండు నల్లగుండు.'

అని వాపోయినాను. నా స్థితికి ఎవరు ఖునాసరే కంట తడిపెట్టకుండా వుండలేరు. అంతటితో నా కీలోకంలో జీవితంమీద రోత పుట్టింది.

'కాశికావిశ్వేశు గలసె వీరారెడ్డి
రత్నాంబరంబు లేరాయ డిచ్చు ?
కైలాసగిరి బండె మైలారు విభుడేగె
దినవెచ్చ మేరాజు దీర్చగలడు ?
రంభగూడె తెనుంగురాయ రాహుత్తుండు
కస్తూరి కేరాజు ప్రస్తుతింతు ?
స్వర్గస్థుడయ్యె విస్సనమంత్రి మరి హేమ
పాత్రాన్న మెవ్వని పంక్తి గలదు ?
భాస్కరుడు మున్నె దేవుని పాలికరిగె'

అని నన్ను ప్రాభవం ఆపాదించి సత్కరించిన ప్రభువులనూ, నాశ్రీప్రాభవాన నేను అనుభవించిన భోగాలనూ, ఒక్కమారు స్మరించుకొన్నాను. వారులేకుండా యీకలియుగంలో వుండడం నాకు సాధ్యంగాదనుకున్నాను. అమరపురికి ప్రయాణంకట్టాను. పునరావృత్తిరహితాలయిన కైలాస వైకుంఠాలకు కాకుండా, అమరపురికి పోవడం ఎందుకంటారేమో, ఏదో అక్కడయింత దివ్యభోగం అనుభవిస్తూ అచ్చరలగోష్ఠిని సుఖంగా కాలం వెళ్లబుచ్చుకోవచ్చునని నాభావం. నేను యింకా ఇక్కడ ప్రయాణం అయ్యీకాకముందే దివిజకవివరుడికి 'గుండెలు దిగ్గురు' మన్నవట. నేను ఇక్కడ గౌడడిండిమభట్టును ఓడగొట్టి పదభ్రష్టుణ్ణి చేశానుకాదూ ! నేను అక్కడికి వస్తే తనకూ అలాటిగతే పడుతుందేమోననే భయంకాబోలాయనకు ! పిచ్చివాడు ! నే నెలాగూ పోనేపోయాను అమరపురికి. ఆయనజోలికిమాత్రం పోలేదు. అక్కడ నాకు అన్నిభోగాలూ అమరినాయి, నా కేమిటా కొరత లేకపోయింది. ఏలోకంలో ఉంటే నేమి ! నేను 'శ్రీనాథుణ్ణి' కదా ! మాతాతపెట్టినపేరు ఎన్నటికయినా నిరర్థకం అవుతుందా !

నాస్వభావాన్ని తెలుసుకోడానికి చెప్పింది చాలనుకుంటాను. తాము చాలసేపు ఓపికపట్టి నాకథ విన్నారు. ఇంక ఇప్పుడు తొందరపెట్టను. సెలవుదయచేయండి. మళ్లా సావకాశంగా వచ్చి తమదర్శనం చేస్తాను. అప్పుడు నాగ్రంథాలలో నా అనువాదానికి, మూలగ్రంథాలకు ఉండే తారతమ్యాన్నిగురించి మనవిచేసుకుంటాను.



విహ్వాల ప్రేమ

జనమంచి కామేశ్వరరావు

విరహాన బడి వేగి
తృష్ణకరముల నెత్తి
దాహా మని పరువ్వాలిడ,
కసరి బుసకొట్టితివి;
లేదనకు ! లేదనకు !

కసరి బుసకొట్టితే
నడలు తడబడు నంతే !
లోనిదీపము కొంత
సుడులు తిరుగును అంతే !

ఈతృష్ణ కిక తృప్తి
ఘటనయే లేదా ?
ఈవిహ్వాలప్రేమ నిటు
హాడులెత్త జేతువా ?

యిటులనే ! యిటులనే !
చిటిలు కన్నీటితో,
కుటిల చిర్నటునతో,
లో కుమిలి ఖేదిస్తు
ఈయాత్ర సాగింతు !

ఈనడలు తూలువడి
పడిపోయిన నపుడు నీ,
ప్రే మూతకర్రగా
ఎటులో మెల్లగ లేచి

నీవెలుగ ఆసించి,
నీవైపె కనులెత్తి,
నీవైపె పదమెత్తి,
నీకై నా కేల్మోడ్తు.

తెలుగు కథాసాహిత్యం

ఎం. నాగేశ్వరరావు

పూర్వాంధ్ర సారస్వతంలో కథాగ్రంథాలు చాలా తక్కువ. స్వతంత్ర పౌరాణిక గ్రంథాలు లేవనే చెప్పవచ్చు. ఉన్నవి అనువాదాలు. ఇవికూడా ఎక్కువగా పద్యరూపాలు; క్లిష్టభాషలో వున్నాయి. ప్రాచీనసంస్కృతకవులవలె పూర్వాంధ్రకవులుకూడా గద్యకథాభివృద్ధివిషయమై శ్రద్ధవహించలేదనే చెప్పవచ్చు. తెలుగుసాహిత్యంలో మధిర సుబ్బన్న దీక్షితులుగారి "కాశీమజిలీలు" సర్వప్రథమ కథాగ్రంథమని చెప్పవచ్చును. ఈగ్రంథం ఆకారంలో చాల పెద్దది. ఇందులో అద్భుతఘటనలు విచిత్రకల్పనాదృశ్యాలు వున్నందువల్ల ఉచ్చకథాసాహిత్యంలో చేరదు. ఆకారంకూడ పెద్దది. హిందీసాహిత్యంలోకూడ ప్రథమ కథాగ్రంథాలు యిటువంటి అద్భుత, అసంభవ కల్పనలతో నిండి వున్నాయి.

ఆంధ్రంలో ౨౦-౨౫ సం॥లనుండి కథాసాహిత్యం వృద్ధిపొందుతున్నప్పటికీ ఉత్తమకథలు చాల తక్కువ వున్నాయి. ఈకథలు కలుషితకామవాసనతో నిండి వున్నాయి. యువతీ-యువకులు, ముద్దులు, ఆలింగనాలు ......కన్న రెండో 'కథావస్తువు' లేనేలేదు. తెలుగు కథాకారులకు యువతీయువకుల.........ల్లోనే సౌందర్యం కనిపించింది!

తెలుగుకథాసాహిత్యం పురుడుపోసుకొని పసికందు. ప్రాపంచిక విషయాలతో పరిచయం కాలేదు. విస్మయనేత్రాలతో నలుదిక్కుల చూస్తున్నది. తల్లిదండ్రులెవరో, అన్నదమ్ములెవరో గుర్తించలేకుండావున్నది. తెలుగుతల్లి పాలను త్రాగటానికికూడ తడబడపడుతుంది. తనచిట్టిచేతులతో లోకాన్ని తడవుతుంది; కాని లోకరహస్యాన్ని కనుక్కొన లేకపోతుంది. లోకాన్ని చూచి ముసిముసినవ్వులు నవ్వుతుంది. పగడాలవంటి పెదవులమీది చిరునవ్వును చూచి మనం మంత్రముగ్ధులమవుతున్నాం. ఈపసికందుభావి ఉజ్జ్వలమో, అంధకారమో చెప్పజాలము; భావి ఉజ్జ్వలంగానే వుండేటట్లు కనిపిస్తుంది. కాని తెలుగుకథాకారులు ఈపసికందును అశ్లీలనఖశిఖవర్ణనకై వుపయోగించారు; యింకను వుపయోగిస్తున్నారు.

హిందీలో సర్వశ్రేష్ఠసాహితీపత్రిక "మాధురి" (కహానీసంచిక, మార్చి ౧౯౩౬) లో తెలుగుకథాసాహిత్యాన్ని గురించి ఒకవ్యాసం ప్రకటన అయింది. రచయిత శ్రీయుత వ్రజనందనశర్మగారు. ఈ వ్యాసాన్ని చూచినప్పటినుండి కథాసాహిత్యంమీద తెలుగులో వ్రాద్దామని ప్రయత్నించాను; కాని కొన్ని కారణాలవల్ల ఇంతవరకు వ్రాయజాలకపోతిని. ఇక్కడ శర్మగారివాక్యాలు వుదాహరణగా యివ్వటం అనుచితంగాదని తలంచుతాను. శర్మగారు వ్రాస్తున్నారు:

"తెలుగుసాహిత్యంలో ప్రకాశితమగు కథల్లో నూటికి ౧౦ - ౧౨ కథలకుమినహా మిగిలిన వన్నియు థర్డ్‌క్లాసువి. వాటిలో చుంబనం, ఆలింగనం...... విషయవాసనను పురికొల్పే ఘాసలేటీచరిత్రచిత్రణ(?) వుంది. యథార్థవిషయం రవ్వంతైనా లేదు. బొత్తిగా కొన్ని అశ్లీలకథలుకూడా.........ప్రాయశః అధిక సంఖ్యలో......ప్రకటన అవుతున్నాయి. ఈ కథల్ని సాహిత్యాధికారి అగు పత్రికాసంపాదకుడు పబ్లిషు చేయడు; మరియు రుచిసంపన్నుడగు పాఠకుడు చదువడుకూడాను. ఇంతకు యీ దురాచారం యింతటితో అంతరించేటట్టు లేదు. ఈ 'దువన్నీ' (బేడ)పత్రికలు పాలిషు ఎక్కించుకొని.........అనగా కథానురూపంగా అశ్లీలచిత్రాలతో.........ప్రకాశితమై పాఠకుల శాంతచిత్తాన్ని విషయవాసనతో వుద్రేకింపజేస్తున్నాయి. నేను ఘాసిష్టును కానప్పటికీ, పత్రికాసంపాదకులకు, కథాకారులకు 'ఒకహిట్లరు అవతరిస్తే బాగుండును' అని ఒక్కొక్కప్పుడు అనుకొంటూఉంటాను...."

శర్మగారి పైవాక్యాలు యథార్థంకావా ? సురుచి సంపన్నుడగు సాహితీప్రేమి యథార్థంకావని వాదింప జాలడు. రఫ్ పేపరుమీద ప్రింటుసు 'దువన్నీ' (బేడ) మాసికకథాపత్రికలు చాల వెలువడుతున్నాయి తెలుగులో. వీటిప్రచారంకూడ అధికంగా వుంది. స్లీపర్ల చేతుల్లోను, హైస్కూలువిద్యార్థులచేతుల్లోను యీ పత్రికలు విశేషంగా కనిపిస్తుంటాయి. వీటివల్ల ఆంధ్రుల'కురుచి' బయలుపడుతోంది. ఈ పత్రికలపేర్లు గణించుట అనవసరం. సాహితీసేవ వీటిముఖ్యోద్దేశము గాదు; ఆలింగన చుంబనాలతో పాఠకుల్లో వాసనాజన్య ప్రేమను పురికొల్పుతూ, తమవ్యాపారలాభాన్ని వృద్ధి చేసుకోవటమే ముఖ్యం. ఈ కురుచివల్ల తెలుగుకథా సాహిత్యానికి గొప్పముప్పు వాటిల్లుతుంది. తెలుగుకథా కారులు తెలుగుసాహిత్యమాతను కురుచిపూర్ణ వాసనామయ సౌందర్యాలంకారాలతో శృంగారిస్తున్నారు. తెలుగుసాహిత్యమాతకు అన్యభారతీయ సాహిత్యాల ముందు సిగ్గుచే తలవంచుకోవలసి వస్తున్నది.

కొన్ని దినాలకుపూర్వం ఒక 'దువన్నీ'పత్రికలో ఒకకథ ప్రచురణమయినది. దానిని చూచి నేను నివ్వెరపోయాను. కథాకారునకు ఇంతకన్న మంచి కథావస్తువు దొరకలేదా అనిపించింది. కథావస్తువుయీవిధంగా వుంది:

"హైస్కూలులో ఒకక్లాసులో ఒకయువతీ యువకుడూ చదువుకున్నారు. పరిచయం ఎక్కువైన కొలది వారిద్దరిలో ప్రేమ(వాసన) గాఢమవుతుంది. ఒకనాడు వారిద్దరికి గుప్తసంభాషణ జరుగుతుంది. 'ప్రేమమిల'నానికి సంకేతస్థలం ఏర్పరుచుకొంటారు. పానకంలో పుడకలా వీరిద్దరిప్రేమాలాపాన్ని 'క్లాస్ మేట్' అగు మరొకయువకుడు వింటాడు. ఈయువకుడు ఆసంకేతస్థలానికి వెళ్లి కూర్చుంటాడు.

సంజవేళ. కనుచీకట్లు క్రమ్ముతూంటాయి. యువతి స్వర్ణస్వప్నాల్ని చూస్తూ సంకేతస్థలానికి వస్తుంది. రావటంతోనే ప్రేమోన్మత్తురాలై యువకుని కౌగిలించుకొంటుంది. యువకుడు యువతిని చేతుల్లో ఎత్తుకొని మరొకస్థలానికి పరుగెత్తుతాడు. యువతి ముద్దులవర్షాన్ని కురిపిస్తూనేవుంటుంది. తరువాత యువతి యువకుని గుర్తించి నివ్వెరబోతుంది."

ఇంతటితో కథ సమాప్తమవుతుంది. కథాకారుడు తనకల్పిత పాత్రలకు యీవిధమైన పరిణామం గల్పించి సంతోషిస్తాడు. ఆంధ్రభావలోకాన్ని మురికి నీటితో నింపివేస్తాడు.

కథాకారునకు ఇంతకన్న మంచి కథావస్తువు దొరకలేదా ? ఈకథ కథాకారుని మనోవృత్తిని చాటుటలేదా ? సాహిత్యంలో యీమాదిరి కథలకు స్థానంవుందా ? సాహితి ఔన్నత్యాన్ని పొందగలదా? ప్రగతిశీలసాహిత్యంలో దీనిని చేర్చుకోవచ్చునా ? దీనిని నపుంసకసాహిత్య మంటాను నేను. ఇది నపుంసకవిచారధార. తెలుగుకథాకారులలో నపుంసకవిచారధార ప్రవహిల్లుతుందా ?

స్త్రీ పురుషులలో ప్రాకృతిక ఆకర్షణ వుంది. ఒండొరుల ప్రేమ సహజమైంది; ప్రేరేపింపు పొందనవసరం లేదు. స్త్రీహృదయం పురుషునితోను, పురుషహృదయం స్త్రీతోను కలియుటకై ఆతురత చూపిస్తుంటాయి. స్త్రీపురుషుల అన్యోన్యప్రేమ అనాదినుండి వస్తున్నది. సృష్టి వున్నంతవరకు వుండగలదు. ఈ సృష్టిలో ప్రతిజీవకోటిలోను స్త్రీపురుషాన్యోన్యప్రేమ సామ్రాజ్యం వ్యాపించివుంది. అందువల్ల శృంగారరసంలో ఎక్కువ ఆకర్షణ వుంది. మానవహృదయంలో శృంగారరసానికై విశేషస్థానం ఏర్పడివుంది. అది అధిక ప్రియమైంది. శృంగారరసం నగటువస్తువ గాదు. శృంగారరస మంటే నాకు ఏవగింపు లేదు. కాని అది శ్లీలాన్ని మీరిపోగూడదు. అశ్లీలత ఏమాత్రం రాగూడదు. శృంగారసాహిత్యాన్ని చదివేటప్పుడు రవ్వంత కామవికారంకూడ మనస్సులో వుత్పన్నం కాగూడదు. కామవికారం పుట్టిందా కళాకారుడు (కథకుడు) కళను అత్యాచారాల పాలుచేశా డనవలసిందే. "ఉత్తమ ప్రకృతియుక్తమైనరసం శృంగారరసం." 1 పవిత్రము లయిన సుందరవస్తువులను వర్ణించుటకే శృంగారరసాన్ని వుపయోగించాలి "యత్కించిత్ లోకే మేధ్యం సుం

1. సాహిత్యదర్పణము.

పరం తత్ సర్వం శృంగారరసే నోపపూయతే"2. శృంగారరసం చాల పవిత్రమైంది, కాని మనకవులు కథా కారులు శృంగారరస ఘంటికను మురికినీటితో నింపుతూ వచ్చారు.

కొన్ని అశ్లీలక థాంశాల్ని ఉదాహరణగా ఇస్తున్నాను. మంచి గెడుసులను పొగకునే ఊహించుకో గలరు.

"......వెళ్లి పోలేంగా. ఆసాంతాని నన కౌగ పమిటకొంగట్టుకొని లాగా. అమాంతంగా నా ఒళ్లో వచ్చిపడింది.

"అంతా నాంగి నేను పే. యుగాలనా పిల్చింద అబ్బ......ఉంపొండి మరి.. .. ఏమిటి పంటు కాన కళ్లేదు...

"రాజ్యాం చేత రక్కులిగాగున్న ఆవిరు సమా బిందువుల్లో,......" ఇంకా కాగుడా శృంగారంగా అనుభవి స్తున్నదిగానుండ సాహిత్యాన్ని మురికినీటితో నింపట మెందుకో?

మరొక ఉదాహరణ:

"......నాకళ్లలో గాఢనిద్రలో నాళ్లంపడిలో ఎవరో ఓ అమ్మాయి నాను ఒళ్లు పరవశమైపోయి టంత వయ్యారంగా, కులుకులూ ఎనుబడింది. అంత టితో అయ్యగారు నీళ్లుగారిపోతారు.

"మాతాను అటూ యిటూ లభించలేదు. మిస మిస లాడిపోతున్న పిల్లగనుక ప్రతిఆళ్ల మాపులకీ ఆ అమ్మాయే గురి.........

"అయితే నేం చెయ్యమంటావురా? ఈతట పటాయింపులతో పుణ్యకాలం కాస్త గడిచిపోతుంది.

"......నాభుజం తట్టి, నీగొట్టె నేతిలో పకు తుందిలేరా. ......నీవు పడ్డశ్రమంతా రట్టింపుకు ఫలి స్తుంది.........

"ఆవేళప్పుడు అసలు ఎన్నడూ లోపలికిరావడం ఆమెకు మామూలు లేదు..........నా కోసమే వచ్చిందికదా అనుకునేటప్పటికల్లా మనసు పొంగి పోయింది.......కౌగిలిలోకి లాక్కుంటే అభ్యంతర పెట్టదు.........." ఇంకా......

భారతీయసంఘం పరాధీనతలో అన్నివిధాలా మలమలమాడిపోతున్నది! గర్భదరిద్రులు పట్టెడన్నా నికై 'అన్నమో రామచంద్రా' అని మొరపెట్టుతున్నారు! భారతదేశంలో ఏమూల చూసినా నిరాశ, హాహా కారం, సంఘర్షణ కానవస్తున్నది! తెలుగుకథాకారులు యక్షగానాలే వింటున్నారు. వారికి చీమైనా కుట్టడం లేదు!

ఇటు రెండోవైపుకుచూపు దృష్టి మరల్చండి. ౧౯, డిశంబరు ౩౭ తేదీన ఆంధ్రవారపత్రికలో "అడవి ప్రేమ" అనేకథ వెలువడింది. లేఖకుడు ఇంద్రకంటి సత్య నారాయణగారు. ఈకథ తెలుగుకథాసాహిత్యంలో ప్రముఖస్థానాన్ని పొందగలదు. ప్రాచీనార్యులసభ్యత, ప్రకృతిప్రేమ, పవిత్ర అన్యోన్యప్రేమ మనకండ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. కొన్ని అంశాలు చూడండి:—

"ఆమెలేడి ఇసుకలో తిరిగి ఆడుకొంటున్నది. ఒకరిమాత్రం ఆమెతొడపై తలపెట్టుకొని చంద్రుణ్ని చూస్తున్నది. నేను సుగాత్రశేమం అందుకున్నాను. ఆమెపారవశ్యమై వింటున్నది. బాతు మెల్లగా ఆడు కొంటూ వెళ్లి ఆమెవల్కలమును తినచంచుపుటంతో పట్టుకొంది. ఆమె అదిరిపడి విదుల్చుకోబోతే వదలడం లేదు. నే చప్పున ఆమెపక్కగా జరిగి విదర్చబోతే అరుస్తూ నదివంపు నడిచింది. ఈలోందరలో కురంగి నాచేతులమధ్యకు వచ్చేసింది. నాచేతిమీద తల ఆనించు కొని,

"అబ్బా ఏంబాతోయ్, చంపేసింది" అంది నవ్వుతూ సిగ్గుగా.

"ఆమెతలలోని మొగలిపువ్వులవాసన గుప్పుగు ప్పునకొట్టి నాకు తల దిరిగింది. శ్రీరామస్పర్శతో పాషాణత్వం వదిలి జగన్మోహిని పుట్టినట్లు ఎన్నడు స్త్రీస్పర్శ ఎరుగని నాజడప్రకృతిని చీల్చుకొని ఒక

---

2. భరతముని నాట్యశాస్త్రము.

రసత్వము పై కుబికింది. ఆమె ముట్టుకున్నంతమట్టుకూ నాశరీరంలో రక్తం గడ్డకట్టుకుపోయింది. శుకుడు వచ్చాడు. ఇంక ఆశ్రమానికి వెడలుదామా" అంటూనే కూచున్నాడు.

"ఏమిటి తొందర ? మనం ముగ్గురం ఎక్కడ వుంటే అదే ఆశ్రమం" అన్నది కురంగి.

"తాతపాదులు కోప్పడుతారు. ఇంక తొందరగా వెళ్లాలి" అంటూ లేవబోయాడు.

"పోనీలేండి నేను మీతో రాను. ఇవిగో మొగలిపువ్వులు" అంటూ అతనిమీద విసరి కొట్టింది.

"................."

"ఏంపని ఇదీ ?" అని నవ్వుతూ ఆమెచేతులు పట్టుకున్నాడు. పకపక నవ్వి వెన్నలా కరిగిపోయింది అతనివెచ్చనివేళ్లు తగిలి కురంగి.

* * *

"వాత్సల్యామృతమునకు ఆలవాలమైన హ స్తము విశాలనేత్రములను చలింపజేస్తూ "దీర్ఘాయుష్ యా యం భవత ! నాయనా ! ఇంత చీకటిపడేవరకు ఇక్కడే వున్నారేమి ? మార్గాలు సరిగా వుండవు.......... ......ఇదిగో కురంగి. అమ్మా నీలేడిపిల్ల లేవి ?" అంటూ అమ్మాయిని దగ్గరకు తీసుకొన్నారు. ఆయన కౌగిలిలో కులుకుతూ ఆమె సిగ్గుతో తలవంచుకొని "నాకు ఉపన్యాసాలు చెప్పరూ ?" అంది మహానందంగా. ".........ఇక రండి. వెళ్లాలమ్మా" అని ఆయన ముందు నడుస్తున్నారు. వెనక నేనూ శుకుడూనూ. నావెంట కురంగి. రేపణ్నుంచి గురుదేవులు శ్యామశర్మగారూ ! నమస్కారం అంటూ నా ఉత్తరీయం లాగింది కొంటెపిల్ల."

ఈకథలో అశ్లీలత వుందా ? ఇటువంటి శృంగారరసాన్ని ఎవడు ఏవగిస్తాడు ? ఇటువంటికథలు మానవప్రగతికి పాటుపడతాయేగాని అధోగతిపాలు చేయవు.

'కల్పన' సత్యాధారంమీద నిర్భరమైవుంటుంది. 'సత్యం' లేకుండా 'కల్పన' కలుగజాలదు. దానిమూలాధారం యీలోకంలోనే వుంటుంది. భావంకూడ ప్రాపంచిక స్థూలవస్తువులమీదనే ఆధారపడి వుంటుంది. ప్రకృతిసౌందర్యాన్ని చూచి 'ప్రకృతి ప్రేమభావం' మనహృదయంలో ఏర్పడుతుంది. కూటికై మలమల మాడుతున్న గర్భదరిద్రుణ్ణి చూచి 'కరుణ' ఉత్పన్నమగుతుంది. బాహ్యప్రకృతిప్రతిబింబము మానవహృదయంలో ఏర్పడుతుంది. ఈప్రతిబింబము నేత్రేంద్రియ, శ్రవణేంద్రియాలద్వారాగూడ హృదయంలో వుత్పన్నం గావచ్చు. ఈ ప్రతిబింబంతోబాటు సంవేదన (దుఃఖమూలక, సుఖమూలక) పుట్టుతుంది. ఈ సంవేదనలో వికారం పుట్టుతుంది. ఈవికారాన్నే భావమంటారు. ఈభావాన్ని ప్రభావంగాను, మనోరంజనకనుకూలంగాను అలంకరించటానికి 'కల్పన' సహాయం తీసుకోవాలి. ఈకల్పన దైవీ(ప్రాకృతిక) సంపత్తి. ఎవరూ ప్రసాదించనూలేరు, హరించనూలేరు. కల్పనమీద పరిస్థితులప్రభావం పడగలదు. కాలానుసారంగా కల్పనకు నవీనవిషయాలు దొరుకుతాయి. సమయానుసారంగా కల్పన వృద్ధి పొందుతుంది. 'కల్పన' వట్టికల్పనని త్రోసిరా జనరాదు. కల్పనాత్మ సత్యం. ఇది మానవుని జన్మసంపత్తి, 'కథ కల్పనాప్రధానమైంది. కథలో మూలతాత్త్వికసత్యం దాగుంటుంది. కథలో ఒకసత్యమే గాదు, మరొకతత్వంగూడ వుంటుంది. అది కథాకారుని వ్యక్తిత్వం. కథావస్తువు, ఘటన, వార్తాలాపం,సమాలోచన(పాత్రలవిమర్శ)లలో అణువణువున కథాకారుని వ్యక్తిత్వం దాగుంటుంది. ఒకానొకరచనలో కథాకారుని వ్యక్తిత్వం స్పష్టంగా కన్పింపకపోవచ్చు. కాని కథాత్మను సూక్ష్మంగా పరిశీలించిన 'వ్యక్తిత్వం' కన్పించగలదు. వ్యక్తిత్వాన్ని ఎవ్వరూ దాచలేరు. కథకుని నైయక్తికజీవనప్రభావం రచన(కథ)మీద తప్పక పడుతుంది. రచనాశైలిని కూడ సూక్ష్మంగా పరిశీలించిన కథకునివ్యక్తిత్వాన్ని, అతను ఏభావాలు కలవాడో వాటిని కనిపెట్టవచ్చు. వివిధరచనలలో వివిధరీతుల వ్యక్తిత్వం కనిపించవచ్చు. కాని సూక్ష్మంగా పరిశీలిస్తే 'వివిధత్వం' ఏకత్వం కాగలదు.

సంఘంలో కథాకారుడు (కవిగూడాను) ఒక వ్యక్తి. వీని వాణిద్వారా జాతి'ఆత్మ' అమరత్వాన్ని

పొందుతుంది. కవిగాని, కథాకారుడుగాని సంఘానికి ప్రతినిధులు. వీరిద్వారానే ఏజాతి అయినా తన ఆత్మను భవిష్యత్ సంతానానికి ఆదర్శంగా వదిలిపెట్టి వెళ్లిపోతుంది.

తెలుగుకథాకారుల ఆలింగనచుంబనాలరచనలలో వారివ్యక్తిత్వం ఉట్టిపడుతుందా? నేడు ఆంధ్రజాతి నపుంసకమైందా? లేదు. తెలుగుజాతిలో వీరత్వం నశించలేదు. అనేకమంది వీరు లున్నారు; త్యాగధను లున్నారు. 'ఆంధ్రరత్న'వంటివాళ్లు ఎంతోమంది వున్నారు. కాని మనం పరాధీనులం. దైహికపరాధీనతతో మన స్వతంత్రభావాలు యింకిపోయినాయి. శిక్షితులు నపుంసకశిక్షణాలయాలనుంచి వెలువడుతున్నారు. చెట్టు ఎండేటప్పుడు కుక్కమూతిపిందెలు పుట్టుతవట. మొగల్ సామ్రాజ్యకాలంనుంచే మన విచారధారలో నపుంసకత్వం ఏర్పడింది. రానురాను వృద్ధిపొందుతూనే వచ్చింది. ఈ నపుంసకవిచారధార రాష్ట్రానికి చాల హానికరం. నపుంసక కవులసామ్రాజ్యంగాగ రససాహిత్యం మన విచారాన్ని కుంఠితం చేస్తున్నది. దీనిని వెంటనే రూపుమాపాలి. ఇది సంఘర్షణయుగం; క్రాంతియుగం. భారతీయయువకులు "క్రాంతి-క్రాంతి" అని గొంతులు పెట్టుకున్నారు. స్వాతంత్ర్యంకోసమై బలివేదిక (ఉరికంబం) ఎక్కుతున్నారు. సాహిత్యకారుడు కూడా భారతీయశిక్షణాన్ని స్వాతంత్ర్యప్రియుడైన క్రాంతియువకుని ప్రేమిస్తూ. ఆ వీరుని భావాలతో సాహిత్యకారుడు కూడా ఏకీభవించాలి. అప్పుడే మనరాష్ట్రసంఘటన బలవత్తర మవుతుంది. స్వాతంత్ర్యానికి పోరాడు సిపాయియువకునికి ప్రోత్సాహము కలుగుతుంది. ఆ యువకజీవనం రసామృతంతో సిక్తమవుతుంది. సాహిత్యంలోకూడా క్రాంతి(పరివర్తన) తీసుకరావాలి. భారతయువకుని "క్రాంతి" ప్రతిధ్వనించాలి.

తెలుగుకథాకారులకు ఈ నపుంసకకథావస్తువే దొరికిందా? ఇంతకన్న ఉత్తమకథావస్తు వలభ్యమా? కాదు. అలభ్యమని ఎవరనగలరు? భారతీయఇతిహాసంలో మూలమూలల ఎన్నో ఘటనావిషయాలు పడివున్నాయి. వీటికి ప్రతిభాకల్పనతో కథాకారుడు మెరుగుపెట్టవచ్చును. ఐతిహాసికఘటనల్ని తీసుకొని కల్పనాసహాయంతో సుందరములైన భావపూర్ణకథలు వ్రాయవచ్చు. ఈ కథలు జాతిహృదయాన్ని కరిగించివేస్తాయి. హృదయంమీద అధికప్రభావం పడుతుంది. జాతిలో రాష్ట్రీయత్వం ప్రబలుతుంది. దేశప్రేమ, జాతిప్రేమ వృద్ధిపొందగలవు. కాని ఐతిహాసికకథలు వ్రాయుట తేలికపని కాదు. ప్రతిభాపూర్ణుడగు లేఖకుడే వ్రాయగలడు. అదీగాక ఐతిహాసికజ్ఞానం అందరికి వుండదు. అయినప్పటికి ఇంకను అనేకవిషయా లున్నాయి. కథాకారుడు నివసించే దేశంలో, వుండే సంఘంలో ఎన్నో అత్యాచారాలు జరుగుతున్నాయి. ఎందరో యువకులు వురికంబాల నెక్కుతున్నారు; ఎందరో కూటికి మలమలమాడుతున్నారు. కథాకారుని హృదయంలో సంవేదన(దుఃఖమూలక) ఉత్పన్న మవుట లేదా? అతనిది పాషాణహృదయమా? 'పుంజీపతుల'శోషణ, మిల్లుయజమానుల దుండగాలు, కార్మికులగోడు, కిసాను జమీన్‌దారులసంఘర్షణ, సంఘంలో దుర్బలులపై అత్యాచారాలు, పోలీసుల నిరంకుశత్వం; ఇది అది అన నేల?—ఇది సంఘర్షణయుగం. ఏమూల చూచినా సంఘర్షణ. ఈ సంఘర్షణలో నిప్పురవ్వలు లేస్తున్నాయి. ఈ నిప్పురవ్వలు మానవత్వంయొక్క ప్రాచీనత్వ(రూఢితత్వ)మనే ఎండుటాకుల్ని కాల్చివేయగలవు. వీటికి సాహిత్యకారుడు సహాయపడాలి. తన సంవేదనాన్ని ప్రకటించాలి. సాహిత్యమనే నిప్పుగొట్టంతో వూదాలి. అప్పుడు మన రూఢిపూర్ణమగు ప్రాచీనత్వం మాడిపోగలదు. నవీన ప్రాచీనవిచారసంఘర్షణలో నవ్యవిచారం, స్వాతంత్ర్య పారతంత్ర్య ఘర్షణలో స్వాతంత్ర్యం జయం పొందగలవు. ఈ సంఘర్షణయుగంలో యిన్నివిషయాలు పడివున్నప్పటికి మన తెలుగుకథాకారులకు నపుంసకవిచారమే శరణ్యమవుతున్నది.

గర్భదరిద్రుని మనోవైజ్ఞానికవిశ్లేషణతో భావపూర్ణకథను నిర్మించవచ్చును. చీరాలకాల్పుల్నిగురించి కథానిర్మాణం చేయలేమా? ప్రతిభావంతుడు తనలేఖినితో పెద్దనవలను రచింపగలడు. ఈ సంఘర్షణక్రాంతియుగంలో ఆలింగనచుంబనాలతో మనస్సును రంజింపజేసుకొనుట నపుంసకత్వంకాకపోతే ఏమిటి? కవిగాని,

కథాకారుడుగాని తన మనోగతభావాల్ని సాహిత్య రూపంలోకి మారుస్తాడు తెలుగుసాహిత్యంలో యీ నపుంసకభావాలే అంకితమవుతున్నవే? ఆంధ్రయువకునిలో స్వాతంత్ర్యభావాలు బొత్తిగా నశించినవా?

నేడు ఆంధ్ర(భారత)మాతను సభ్యప్రపంచ సంఘంలో మానభంగము చేయబడుతోంది; శాసకులు నిర్బంధించి బలాత్కారం చేస్తున్నారు! దేశమాత కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నది! మనం విలాసత్వంలో మునిగి తేలుతున్నాం. కథాకారుల్ని ఏమైనా కుట్టుట లేదు. వారిహృదయంలో 'సంవేదన' ఉత్పన్నమగుట లేదు!

ఇట్లని ప్రేమకథల్ని వ్రాయకూడదనను. కథాసాహిత్యంలో ప్రేమకథలు అగ్రస్థానమే వహిస్తవి. ఈప్రేమగాథల్లో అశ్లీలత రాగూడదు. మనకర్మనిష్ఠకు బాధ కలగగూడదు. ప్రేమగాథలవల్ల మనస్వాతంత్ర్య పోరాటంలో ప్రోత్సాహం దొరకాలి. మానవజీవనాన్ని 'కర్మ'నుండి పతితంచేయగూడదు. మనకార్య సాఫల్యానికి అడ్డురాకుండా, మనకు స్ఫూర్తిని గలిగించే ప్రేమకథలు గౌరవనీయాలు. అట్టివి ప్రథమ స్థానాన్ని అలంకరిస్తాయి. సాహిత్యంలో విషయవాసనోద్రేకం కలిగినకొద్దీ మన మానసికప్రవృత్తులు నపుంసకాలైపోతాయి. విషయవాసనప్రేమపూర్ణమగు సాహిత్యాన్ని (కథను) చదివినప్పుడు క్షణికకలుషిత భావావేశం కలుగుతుంది; కాని అది వెంటనే చల్లారిపోతుంది. మానసికప్రపంచంలో శిథిలత్వం ఏర్పడుతుంది. కార్యవిముఖులమైపోతాము. ఉన్నవుత్సాహం కాస్తా మట్టికొట్టుకు పోతుంది.

తెలుగు కథాసాహిత్యం కాలప్రభావాన్నుండి నిర్లిప్తంగా ఎట్లా వుండగలదు? నేడు తెలుగుకథాసాహిత్యం రాత్రింబవళ్లు ప్రగతి పొందుతూవస్తూంది. నాలుగైదేండ్లనుండి యీప్రగతిశీలప్రవాహం అతివేగంగా ప్రవహిస్తూంది. (కాని కావలసినంత ప్రగతి పొందలేకపోయింది.)

అనున్నతసాహిత్యంమీద ఉన్నతసాహిత్యాల ప్రభావం తప్పక పడుతుంది. తెలుగుకథాసాహిత్యం మీద హిందీ, వంగసాహిత్యాల ప్రభావం, పాశ్చాత్య సాహిత్యాల ప్రభావం పడింది మొట్టమొదట ఫ్రాంసు ప్రభావం మనకథాసాహిత్యంమీద పడింది. అందుచే అర్ధనగ్నంగా (అశ్లీలతతో) వుండేది. ఈప్రభావం ఇంకనూ పోలేదు. ఇప్పుడు రష్యాప్రభావం ప్రబలమవుతోంది. ఈప్రభావాన్ని, అనుకరణాన్ని మనభాషలో, మనసాహిత్యంలో జీర్ణింపజేసుకోవాలి. అప్పుడే మనసాహిత్యం ప్రగతిని పొందును. అంధానుకరణగా అనుసరించినందువల్ల సాహిత్యానికి ముప్పు వాటిల్లుతుంది.

కథాసాహిత్యోన్నతితోబాటు ఇతరభాషల నుండి అనువాదాలుకూడా జరుగుతున్నాయి. అనువాదాలవల్ల కూడా సాహిత్యానికి లాభమే కలుగుతుంది. ఇతరుల భావాల్ని తెలుసుకుంటాం; భావవినిమయం జరుగుతుంది. కాని సత్సాహిత్యానువాదాలే గ్రాహ్యం. చెత్తచెదారం అనువదించినందువల్ల విపరీతనష్టం కలుగుతుంది.

తెలుగు అనువాదాల్లో ఘోరఅన్యాయం జరుగుతూంది. అనువాదకులు మూలలేఖకుల పేర్లు యివ్వరు. 'హిందీనుండి'—బస్. ఇందులో అనువాదాలని అయినా తెలుస్తుంది. ఇంతకన్న పూర్తిగా గ్రంథచౌర్యాలు జరుగుతున్నాయి. 'ప్రేమసూత్రము', 'క్రిస్మసు కానుకలు' యిటువంటివి చోరీచేయబడినకథలే. సుప్రసిద్ధలేఖకుడగు స్వర్గీయ ప్రేమచందుకథల్నికూడా దొంగిలిస్తున్నారు! సాహిత్యంలో యిటువంటి చౌర్యాలు జరుగుతున్నందువల్ల చౌర్యలేఖకునికేగాదు, సంపూర్ణ ఆంధ్రజాతికే తలవంపులు! సిగ్గుచేటు! దుఃఖం! ఆంధ్రజాతిలో గ్రంథచౌర్యాలు జరుగుతున్నాయి! అస్తు.

నేడు తెలుగులో ప్రగతిశీల నవ్యలేఖకులసంఖ్య చాల తక్కువగా వుంది. వీరిసంఖ్య ఆంధ్రదేశానికి చాలదు. భారతప్రసిద్ధ కథారచయిత తెలుగులో ఒక్కడైనా లేడు. 'కరుణకుమార', కొడవటిగంటి కుటుంబరావు, కవికొండల వెంకటరావు, పద్మరాజు, శివరామం, మల్లాది రామకృష్ణశాస్త్రి, హనుమచ్ఛాస్త్రి, జి. కె. ఆచార్య, పూడిపెద్ది వెంకటరమణయ్య,

ఇంద్రకంటి సత్యనారాయణ, సంపటి నాగభూషణం ఆదిలేఖకులు తమకథలతో తెలుగుకథాసాహిత్యాన్ని నింపుతున్నారు. వీరికథలు చాలవరకు ప్రగతిని కలిగి వున్నాయి. 'కరుణకుమార'ను జనసాహిత్యనిర్మాతగా ఎన్నుకోవచ్చు. వీరికథలు భావప్రాగల్భ్యంగా వుంటాయి. కథాపాత్రల్ని శోషితజనసమూహాన్నుండే ఎన్నుకుంటారు. నిజంగా వీరివ్యక్తిత్వం, సహృదయం కథల్లో వుట్టిపడుతుంటాయి. వీరికథలకు కథాసాహిత్యంలో ప్రథమస్థానం లభించగలదు. దీన్ని భవిష్యత్తే నిర్ణయిస్తుంది.

సంపటి నాగభూషణంగారు ఇప్పుడిప్పుడే ప్రగతివేపుకు వస్తున్నట్లు కనిపిస్తుంది. 'వింతపోకడలు' అనే కథ దీనికి నిదర్శనం.

'కథాంజలి' ఉన్నతిశీలకథాసాహిత్యాన్ని తీసుకొని మనముందు హాజరవుతున్నది. కాని దీనిశరీరం ఇంకా పుష్టికావాలి. ఈ సన్నని దుర్బలశరీరంతో సాహిత్యసేవ చేయలేదు.

దుఃఖమైనా, — కథాసాహిత్యం కొద్దిగా వున్నతి పొందుతున్నప్పటికీ నవలాసాహిత్యం అనున్నతదశలోనే వుంది! ఉన్నతిలక్షణాలు కనిపించుటలేదు! అస్తు.

నవ్యకథాసాహిత్యంమీద మరొకమారు.

దశరూపకం

భమిడిపాటి కామేశ్వరరావు

౧

మందపిల్లి,
౧౯-౧౧-౩౮.

రసరాట్టుగారికి నమస్కారములు—

మహాశయా! నాన్నగారు మా తోటారం భూములమీదికి శిస్తువసూలు వగైరాలకి వెళ్లారు. పదిరోజులక్రితం తమపేరట ఒక వచనరచన పంపిఉన్నాను. మరి ఆలస్యం కాసీయక దానిమీద తమ సదభిప్రాయం పంపండి. తిరుగుటపాలో పంపాలి.

ఇట్లు,
గోపీనాథం.

జవాబు

పేరారం,
౨౦-౧౧-౩౮.

గోపీనాథానికి ఆశీర్వచనాలు —

అబ్బాయీ! ఏదో ఆలస్యం అయింది. ఏమీ అనుకోకు. నాకు మీ నాన్నగా రొకటీ నువ్వొకటీ కాదు. ఇదుగో:

ఈగ్రంథం ఆంధ్రానికి ఒకఆస్తి. అక్కడక్కడ దీంట్లో మామూలుదోషాలు లేకపోలేదు కాని, కొన్నిపట్ల ఇది ఎంతో హృద్యంగా ఉంది. ఇటీవలిదిన్నీ మాండలికమున్నూ అయిన పోతభాష వాడితే నేంపోయె, చేతభాషకూడా పాళంగానే పడింది. అతితెలివిసంకరసమాసాలు బళ్లే విరివిగానూ మహాజోరుగానూ లేవని చెప్పలేంకాని, జటిలత్వం నిండుకుంది అనడానికీ వీలులేదు. పాండిత్యంలో లోటుకీ కథలోని నీటుకీ ఉర్జీ సరిపోయింది. ఇది ఉత్తమోత్తమం అని వ్రాయజాలం కాని, దీన్ని నీచకావ్యంఅని కొట్టి పారెయ్యడానికీ మనస్కరించకుండా ఉంది. మొదలు ఎట్లా ఉందో చివరంటా అంతే.

ఇట్లు,
రసరాట్.

౨

మందపల్లి,
౨౧-౧౧-౩౮.

రసరాట్టుగారికి నమస్కృతులు—,

ఆర్యా! తమజవాబు చేరింది. క్షమించవలె. మొన్న నేను తమకు వ్రాసిన ఉత్తరం పొరపాటు. తమకు ఆరచన పంపినట్టుగా జ్ఞాపకముండి అట్లా రాశాను. ఈవేళ తీరా చాకలితెచ్చిన కోటు తొడుక్కోగా, నా కోటు జేబులోనే ఆరచనకూడా ఇస్త్రీఅయి ఉండిపోయింది. ఇప్పుడే వేరొకకవర్లో పెట్టి ఆరచన మీకు పంపాను. ఆకాగితాలు విప్పేటప్పుడు జాగ్రత్త. నామీద దయ ఉంచి మంచి అభిప్రాయం పంపండి.

ఇట్లు,
గోపి,

జ బా బు

పేరారం,

౨౨-౧౧-౩౮.

గోపీ! మహాశయునికి పంపవలసిన ఉత్తరం నీకు వేశాను. నువ్వు కొంచెం అసాధ్యపు పిల్లకాయలా ఉన్నావు. నువ్వు కవిత్వం కూడా రాస్తావని ఊహించ నే నెరగను. ఇదిగో:

ఈకవి సుప్రసిద్ధవంశపుత్రుడు. ఇతివృత్తం ఒక మహాపురాణంలో అసలైనట్లు. కాని, ఈరచనలో అనుభవం తక్కువ. ఆవేశానికి తుల్యమైన ఆదరింపా లేకపోవడం సహజంగనక లేదు. ఏం కాని అదిగాదూ! ఉన్న తప్పులు కుర్రతనాలు గనక క్షమించవచ్చు. ఈకవికి భవిష్యంలో మంచి విలువ వస్తుంది. ఇప్పుడైనా, రచన సహసనోన్మేషం, మహా మెత్తనిశయ్య, పరిశుభ్రమైన ధార. పాండిత్యంలో కనబడేలోటుకూడా కాలక్రమాన్ని, అన్నీ సర్దుకున్నట్టే, సర్దుకుంటుంది. మాంచి అక్కరకొచ్చే చెయ్యి, సవ్యసాచి. భరతమాతకి ఇల్లాంటి సంతానం అవసరం.

ఇట్లు,

రసరాట్.

3

మందపిల్లి,

౨౩-౧౧-౩౮.

రసరాట్టుగారికి వందనాలు. తమజాబు అందింది. ఆరచన నాది కాదు. సలాం.

ఇట్లు,

గోపి.

జ బా బు

పేరారం,

౨౪-౧౧-౩౮

గోపీ! నువ్వింకా ఏమిటో అనుకున్నాను. తగ్గవాడివే. ముత్తంమీద చణకశాస్త్రుల్లుగారి అబ్బాయి ననిపిస్తున్నావ్. ఆ రచన చెయ్యడంపాటి తెలివితేటలు నీదగ్గిర లేకపోతే పోనీ అది ఎవరు రాశారో ఆసంగతేనా నాకు రాయవలిసిఉంటుం దనేనా నీకు ఇంగితజ్ఞానం ఉండకూడదూ! ఇదుగో:

ఈరచన మంచిది. భాష చక్కనిది. వస్తువు అందమైనది. రీతి కులాసాగా ఉంది. వృత్తి గౌరవముకలది. ఈకవికి హిందూస్తానీ కూడా తెలుసు. వెల స్వల్పం. ఫల మధికం, చక్కనిసైజు.

ఇట్లు,

రసరాట్.

౪

మందపిల్లి,

౨౫-౧౧-౩౮.

ఆర్యా! మా నాన్నగారు గ్రామాంతరం వెళ్లేటప్పుడు ఈ రచనమీద అభిప్రాయం కోసం ఇది మీపేర పంపించమని నాతో చెప్పారు. అన్నట్టు, మీరు వారికి బాకీఉన్న లెఖ్ఖగురించి వ్రాయమనికూడా అని వెళ్లారు.

ఇట్లు,

గోపి.

జ బా బు

పేరారం,

౨౬-౧౧-౩౮.

గోపీ! అల్లా చెప్పుమరీ! అందుకనే, ఈ రచన మిక్కిలి ఉత్కృష్టం. కవి కేవలఛాం

దసుడు కాడు. ఒకటోరకమైన చాదస్తంలా పైకి కనిపించేది యావత్తూ షట్టు చేవ, గుంజు. ఇందులో అపారపాండిత్యం గంగాతరంగాల వంటి నిమ్నోన్నతభావాలలో చదువర్ని ముంచి లేవనెత్తుతుంది. పాండిత్యం ఇంత సద్వినియోగం చేసినవాళ్లు లేరు. ప్రాచీన సంప్రదాయం ఇక్కడే నిల్చింది. మారుమూల పదాలకి ఈరచన కాణాచి, అపరూపకార కాలకి ఈరచన దిక్కు, పురాణేతిహాసాలకి ఈరచన ధర్మసత్రం. నేలబారు రోకలిబండలు ఎగర్లేని మహోన్నత కవితాగిరిశిఖరాల లోనే ఈకవివాణి విహరిస్తుంది. గ్రహించే బుర్ర లుండాలిగాని, నవీనవిజ్ఞానం అనబడేది కూడా చణకశాస్త్రిగారి యీ క్రొత్త రచనలో ఉంది. నాడ్ పూచీ!

ఇట్లు,
రసరాట్.

౫

మందపిల్లి,
౨౭-౧౧-౩౮.

అయ్యా, రసరాట్టుగారూ! తమజాబు అందింది. మానాన్నగారు కవిత్వం రచించగలరని మాకు తెలియదు. ఈరచన ఆయనది కాదేమో! అయినా, నమస్కారం.

ఇట్లు,
గోపి.

జవాబు

వేరారం,
౨౮-౧౧-౩౮.

గోపీ! ఇహ నేమ్మరీ! నేను అప్పుడే అనుకున్నాను. అందుకనే ఈరచన రమ్యంగానూ గంభీరంగానూమాత్రం ఉంది. శైలి మృదుమధురంగానూ, ప్రాయశః భయజనకంగానూ, సర్వత్రా న తికమకపదభూయిష్ఠంగానూ ఉంది. కవి ఇటువంటి రచనలు ఇంకా మేట్లకొలది రాసి, బతికుండగానే అచ్చుకొట్టి, చదివో చెడో అందరికీ ఉచితరీతిని వాటిని అందజేసి ధన్యుడై తరించునుగాక.

ఇట్లు,
రసరాట్.

౬

మందపిల్లి,
౨౯-౧౧-౩౮.

రసరాట్టుగారూ! ఇంతటితో ఊరుకుందాం అంటే వీల్లేనిపరిస్థితి ఏర్పడ్డది. నిన్న మాయింటికి నే లేనప్పుడు ఒకాయన మా నాన్నగారికోసం వచ్చారని మా అమ్మ చెప్పింది. ఆయన తాలూకు ఒకరచనమీద అభిప్రాయం రాయించి యిస్తానని మానాన్నగారు వారికి వాగ్దానంచేసి రచన పుచ్చుకున్నారట. ఆయన పేరు తెలియదు. చూపులకి కొత్తసంఘీభి బిగ్యేలా ఊరుకున్నాడని మాఅమ్మ అంది. మీకు నేను పంపింది ఆయన రచనేమో!

ఇట్లు,
గోపి.

జవాబు

వేరారం,
౩౦-౧౧-౩౮.

గోపీ! అసలు నేను మొదట్లోనే అల్లా అనుకున్నాను. ఈకవి ఇంగ్లీషులు చదివినవాడు. ఇంగ్లీషులో తను చదువుకున్నదంతా ముక్కికిముక్కి ఇందులో ఫొటోగ్రాఫు దింపేశాడు. ఈసరుకు ఎక్కణ్ణించి దిగుమతీ చేస్తున్నాడో చెప్పడు. ఆసంగతి తెలుగుఘటాలు ఎక్కడ కనిపెట్టొచ్చారని ఇతనిఊహ. రచ

నంతా ఇంగ్లీషుకంపే. ఉద్యోగసగాని ఉత్తే జనగాని ఇందులో లేపడం సాహసం. భాష మాత్రం ఆంగ్లాంధ్ర గ్రాంథికపంగ ధప్పళం.

ఇట్లు,
రసరాట్.

౭

మందపల్లి,
౧-౧౨-౩౮.

రసరాట్టుగారూ! మీపేర వ్రాయడం ఏముహూర్తాన్ని ప్రారంభించానో గాని సంగతి తెమిలేట్టు కనపడదు. మరోచి కొచ్చింది. పొద్దున్న ఒకాయన నే ఉండగానే మాయింటి కొచ్చారు. ఆయనపేరు ఘంటారావుట. ఆయనట తనరచన మానాన్న కిచ్చింది. మీకు నేను పంపినరచన తనదేనని ఆయన పట్టుపడుతున్నాడు. వెనక మీఎన్ని కల్లో మీతరఫున పనిచేసింది ఈయనేట.

ఇట్లు,
గోపి.

జవాబు

పేరారం,
౨-౧౨-౩౮.

అబ్బాయి, గోపీనాథం! అల్లా చెప్పు మరీ! అందుకనే తీవ్రంగా చూసినమీదట ఈరచన నడుంగడు ప్రౌఢంగా ఉంది. కొన్ని స్ఖాలిత్యా లున్నాయి. ఉంటే ఏంఅన్నావు! కొన్ని స్ఖాలిత్యాలు ఉండాలి అనికూడా, నేనువాదిస్తాను. లేకపోతే రచన మానుషమే అనిపించుకోదు. ఇది యథార్థభావాలతోనూ, ఉన్నతాదర్శాలతోనూ నిండి ఉంది. రసం ఇందులో కేవలం ఆవకాయి ఊటలాగ ఊరిపోవడమే కాకుండా సముద్రపు పోటులాగ ఉబ్బి మీద పడిపోతోంది. భాష అతిమధురం. శైలి మనోహరం. వట్టివేళ్లయొక్క చల్లదనం, వనసంతర్పణపోపుయొక్క ఘుమఘుమ, చలిమిడియొక్కపాకం ఏకకాలంలో ఇక్కడ దొరుకుతాయి. వేయేల? ఈరచనలోని మాటలు అన్నజిహ్వే జిహ్వ, విన్నచెవే చెవి, తస్కరించినకవే కవి.

ఇట్లు,
రసరాట్.

౮

మందపల్లి,
౩-౧౨-౩౮.

రసరాట్టుగారూ! శాస్త్రం చెప్పిన తరవాయిగా వచ్చింది. ఎప్పటికప్పుడు మీతో ఉత్తరప్రత్యుత్తరాలు జరపడం కట్టేద్దాం అనుకుంటూండడం, ఏదో పిల్లసమ్మేరీ వస్తూండడం జరుగుతోంది. మీ రేమన్నా అనుకుంటారేమో అని ఇదవుతున్నానుకూడానూ! ఈవేళ మరోఆయన వచ్చాడు. ఇతగాడిపేరు కేతయ్యట. ఆయనకూడా మానాన్నగారిచేతికి అభిప్రాయంనిమిత్తం తన రచన ఇచ్చాట్ట. మా నాన్న ఊళ్లో లేరని చెప్పేసి మెల్లిగా ఆయన్ని వొదిలించుకున్నాను. ఘంటారావురచనమీద అభిప్రాయం నిన్న మరొకరిదగ్గిర్నించి నాకు వచ్చేసింది. మీదగ్గిరున్న రచన కేతయ్యదే. ఏదో ప్రసంగం వచ్చి, మీకూ తనకీ పచ్చగడ్డేస్తే భగ్గుమంటుందని కేతయ్య అన్నాడు.

జ బా బు

పేరారం,
౪-౧౨-౩౮.

గోపీ! ఈసంగతి రాశావు నయమే. ఇంకా దాచుగుని ఊరుకున్నావుకావు, చచ్చిపోదుం. నాకూ అనిపించింది, ఏమిరా! కొన్నిలక్షణాలు ప్రశంసార్హంగా కనిపిస్తూ ఉన్నా, ఈరచన మొత్తంమీద ఏడిసినట్టుందేమిటి అని. అల్లా అనిపించడానికి కారణం ఇప్పుడు బోధపడ్డది.

ఇంత దరిద్రగొట్టురచన భూమిమీద గాని, అంగారకుడులోగాని లేదు. బుద్ధిగలవాడెవడూ ఇది చివరంటా చదవడు. అందుకనే నే చదవలేదు. ఇందులో, గాఢంగా చూస్తే, అర్థం వ్యర్థం, భావం అభావం, రసం నీరసం, శైలి గాలి, భాష ఘోష, రీతి కోతి, వృత్తి మిత్తి, శయ్య కొయ్య, ధార నార. కొన్నిపట్ల కవి ఏడవబోయాడు. ఆ ఏడుపు ఉచితరీతిగా—అనగా, ఏడుపు ఏరీతిగా ఉండాలో అల్లా లేదు. నన్నడిగితే నేనేనా చెబుదును. చాలా బేస్థలాల్లోకుడా నవ్వు తెప్పించడానికి ప్రయత్నించి రచయిత చచ్చిచెడ్డాడు. నేనెంత బిగపట్టుగుని కూర్చున్నా ప్రాణంమీదికొచ్చిందిగాని నవ్వు రాలేదు. సహజమైన మాటపొందికా సమయస్ఫూర్తీ ఇందులో మృగ్యం. రచననీ, రచయితనీ వేరువేరుగా పుతాలేసినా ఈరచన యింతే. నుడికారం సుడిలోపడింది, కారకం మారకం చెందింది. నాబోటి గొప్పవాళ్లనీ కొన్ని గొప్పసంస్థల్నీ నిరసించడం తప్ప ఇతరం ఏమీ ఇందులో లేదు. ఈరచనలో కొంత-చివరదాకా అసలే చదవలేకపోయాను!-చదివి నేను చాలా పాడైపోయాను. నే కాక తక్కినవాళ్లు చదివితే ఎక్కడ చెడిపోతారో అని బెంగతో తీసుగుంటున్నాను. ఇది ఎవరేనా చదివితే పెద్ద ఒట్టు! జాగర్త!

ఇట్లు,
రసరాట్.

౯

మందవల్లి,
౫-౧౨-౩౮.

రసరాట్టుగారూ! క్షమించాలి. మా నాన్నగారు ఉత్తరం రాశారు. రేపో నేడో ఇక్కడికి వచ్చేస్తార్ట. ఒక పని జరిగిందిట. నాలుగైదు రచనలు మా నాన్నగారు తమ బోంట్లకి విడివిడిగా అభిప్రాయంకోసం పంపించారట. అందులో ఒకటి శ్రీనాథుడి రచన కూడా ఉందిట. కడం అభిప్రాయాలన్నీ వచ్చేశాయి. ఒకవేళ, దిక్కుమాలి ప్రాలుద్ధం, మీకు నే పంపింద అదే కావచ్చు!

ఇట్లు,
గోపి.

జ బా బు

పేరారం,
౬-౧౨-౩౮.

గోపీ! అదా కమామీషూ! హారి! చెప్పవేం మరీ! అందుకనే, కిందనమాటు నేనెంత ఏకుతూ రాసినట్టు ఉన్నా, అప్పుడు కూడా ఈ రచనలోని ఆ రసస్ఫూర్తీ, ఆ పదసౌష్ఠవమూ, ఆ భావవిశేషమూ, ఆ గుట్టుపునడకా, ఆ భాషామేళవం, ఆ వగైరాలూ—అవన్నీ తొంగిచూస్తూనే ఉన్నాయి. పెద్దవాళ్ల రచనలు అనేకం ఇతరుల చేతుల్లో పడి పాడైపోయాయి.

ఇట్లు,
రసరాట్.

౧౦

మందపిల్లి,

౭-౧౨-౩౮.

రసరాట్టుగారూ! నాన్నగారు వచ్చారు. మీరు ఏమీ అనుకోకుండా ఉంటే మీకు ఒక సంగతి రాసేసి ఇక్కడితో ఊరుకో మన్నారు. మీ పేర నేను పంపిన రచన ఒక పుష్కరంక్రితం మీరే రచించిందిట. అది మీ రచనలో కల్లా గొప్పదనే ఆప్యాయం కొద్దీ నాన్నగారు స్వహస్తంతో లిఖించి, ఆ కాగితం తనదగ్గర అట్టేపెట్టుగున్నారట. నేను పంపిన రచన అదే అయిఉంటుం దని చెప్పారు. క్షమించండి.

ఇట్లు,

గోపీనాథం.

జబాబు

వేరారం,

౮-౧౨-౩౮.

గోపీనాధానికి అనేక ఆశీర్వచనాలు. నేనూ ఊరెళ్లి ఈ ఉదయమే వచ్చాను. లోగడ నీకు వచ్చిఉన్న జాబులన్నీ, నేను ఊళ్లో లేకపోబట్టి మా అమ్మాయి రాసింది. జాబుల్లో ఉన్న వృత్తాంతం యావత్తూ, నువ్వు పంపించిన కాగితాలమీద రాసిఉన్న దే. ఆ రచనా, దస్తూరీకూడా మీ నాన్న గారిదే. అందులో వారు విమర్శనమోనాలు రాసి అట్టే పెట్టుగున్నారు. అది పొరపాట్న ఇక్కడికి వచ్చింది. నా రచన అన్నావే! అది కుంభయ్యగారిచేతికి నిరుడు మీ నాన్నే యిచ్చారు, జ్ఞాపకం చేసుగోమను. అయితే నీకు పెండ్లి అయిందా?......

ఇట్లు,

రసరాట్.



హృదయేశ్వరి

(సమీక్ష)

వట్టికోండ రంగయ్య

౧

ఇది శ్రీ తెల్లావఝ్ఝల శివశంకరశాస్త్రిగారు వ్రాసిన తొమ్మిది ఉచ్ఛ్వాసాల ఖండికాసముచ్చయము. ఈ ఖండకావ్యసంపుటి ఉపకావ్యశ్రేణిలో చేరుతుంది. గీనిలో నాయిక లక్ష్మీపదాంకిత. ఇది తన ప్రేయసికి నాయకుడు పెట్టుకొన్న పేరై ఉంటుంది. నాయకునినామము నిర్దిష్టముకాలేదు. అట్లు కాకపోయినా లోపంలేదు. పాత్ర లెక్కువైనప్పుడు చిక్కు వస్తుందిగాని రెండు, మూడుపాత్ర లుంటే చిక్కులేదు. మేఘసందేశంలో యక్షునికి ఏం పేరుంది? నాయకుడు పద్యాలు పలికిన వ్యక్తియే అని అనుకోవలసి వస్తుంది. కవే నాయకుడన్నా ప్రమాదం లేదు. లౌకిక ప్రపంచం వేరు — కావ్యప్రపంచం వేరు. కవే నాయకుడుగా ఉన్నప్పుడు కవికి లౌకికప్రపంచంతో సంబంధం ఉండదు. కావ్యజగత్తుతోమాత్రం సంబంధించి ఉంటాడు. కవి స్వానుభవాలుగాని లోకానుభవాలుగాని నాయకుడిద్వారా పలికించి ఉండవచ్చు. లోకానుభవాలయితే కవి చాలావరకు ఊహించి రాయవలసి ఉంటుంది. ఊహించిరాసినరాతలైతే ఇంత సహజంగా, హృదయరంజకంగా, ఇంత పెద్దగ్రంథము రాయడానికి వీలులేదు. కాబట్టి కవి స్వానుభవంవల్ల హృదయం బాధపడి నాయకుడుద్వారా పలికించి ఉంటాడు. అందువల్ల ఈ కావ్యంలో కవికి నాయకునికి అభేదం పాటించవచ్చు.

౨

ఈ రకం కావ్యం తెలుగులో ఇదే మొట్టమొదటిది. పాశ్చాత్యుల ఆంగ్లసాహిత్యంలో ఈ కావ్యం 'సానెట్లు' (Sonnets) అనే రూపాన్ని పోలినదని చెప్పవచ్చు.

* * *

మొట్టమొదట ఈ 'సానెట్లు' అనే పద్యాలను, ఏ విషయాన్ని గురించి రాశారో, ఎందుకని రాశారో కొంచెము వివరించాలి.

'సానెట్' మొదట పుట్టినది ఇటలీదేశంలో. క్రీ.శ. ౧౩౦౪ నుంచి ౧౩౭౪ వరకున్న సుప్రసిద్ధకవి ఇటలీవాడైన ఫ్రాన్సిస్కో పెట్రార్క్. ఈ కవి వివాహితురాలైన ఒకస్త్రీని ప్రేమించి తన ప్రేమను వ్యక్తీకరించటానికి ఆమెను గురించి కొన్ని పద్యాలు రాశాడు. ఒక్కొక్క పద్యానికి 'సానెట్'1 అని పేరుపెట్టాడు. ఈ 'సానెట్'కు ౧౪ పాదాలు ఉంటవి. పెట్రార్క్ ప్రేమించిన స్త్రీపేరు లారా (Laura). ఆమె తననుగురించి పెట్రార్క్ పద్యాలురాయడానికి ఒప్పుకొన్నదిగాని, అతనిప్రేమనుమాత్రం సఫలం చేయలేదు. పెట్రార్క్ తనకు 'లారా'తో సంబంధించిన ప్రేమవిషయంలో అన్నీ 'సానెట్లు' రాశాడు. అందుచేత తరువాతికవులు ఈ పద్యాలకు ఒక్కొక్కదానికి ౧౪ పాదా లుండాలనీ, ఇవి విఫలీకృతమైనప్రేమ (disappointed love) విషయమై రాయాలనీ నియమం పెట్టుకొన్నారు.

1 This Sonnet consists of an Octave of two quatrains followed by a sestet of two tercets.

ఈ 'పెట్రార్కన్ సానెట్టు'ను ఇంగ్లీషులో మొదట ప్రవేశపెట్టినవాడు సర్ టామస్ వైయట్. థామస్ వైయట్‌కు స్నేహితుడూ, శిష్యుడూ అయిన సర్రే ఈ పద్యపాదాల్ని ఆంగ్ల భాషానుకూలంగా మార్చాడు. [Surrey's sonnet consists of three quatrains followed by a final couplet (ab, ab, cd, cd, ef, ef—gg).] దీనినే తర్వాత సిడ్నీ, షేక్స్పియరు అనుసరించారు. కాని, స్పెన్సరు పద్యపాదాలు మాత్రం 'సర్రే' సానెట్టు పద్ధతినే అవలంబించి విషయం (Subject-matter) మాత్రం మార్చాడు. విగ్రహీకృతమైన ప్రేమకంటే వివాహితమైన ప్రేమకొరకే ఈ 'సానెట్లు' ఎక్కువగా రాశాడు. తర్వాత మిల్టన్ మెట్రికల్ ఫారంలో ఇటాలియన్ సానెట్‌నే వాడాడు; అ కావ్యవస్తువు మాత్రం పూర్తిగా మార్చాడు.

శాస్త్రిగారు గ్రీకు, లాటిన్, ఇంగ్లీషు భాషా చరిత్రములూ, ఆ యా భాషల సుప్రసిద్ధ కవులననుసరించి శ్రద్ధగా చదివి, చక్కగా అవగాహనం చేసికొన్నారు.

* * *

ఈ కావ్యం వ్రాయబడిన అయినప్పటికీ వీరికి దాంటీ పెట్రార్క కవులమీద ఉన్న అభిమానం చూస్తే ఆ కవుల ప్రభావాధిక్యమే (distant influence) ఈ గ్రంథం రాయడానికి కారణమేమో అనిపిస్తుంది. దాంటీ కవుల జీవితాలు, 'వీటా నోవా' అనే పుస్తకం శాస్త్రిగారికి ఎక్కువగా ప్రీతిపాత్రము లట. వీరు ఇటువంటి నవ్య కావ్యం ఆంధ్రభాషలో సృష్టించి, కొత్తమార్గం తొక్కి ఈ నాటి 'రొమాంటిక్కు పొయెట్సు'కు ఆద్యప్రాయులయ్యారు. పెట్రార్కమీద వీరికి ఎంత అభిమానముందో, "పెట్రార్క" అను మకుటముతో ఉన్న వీరు రాసిన గేయం చూస్తే తెలుస్తుంది.

"నీపేరు చెవి సోక - నిండుసూర్యుని లేగి
పొటమరించును ప్రేమ - Petrarca
నిరుపమానంబైన - నీచరిత్రము నన్ను
ముగ్ధమానసు జేయు - Petrarca
నీ దేశమా ఇటలి - నా భూమి ఇండియా
ఇన నీయెడ ప్రీతి - Petrarca"

మనసాంప్రదాయాల్ని బట్టి పరస్త్రీమీద ప్రేమపూరితమైన పద్యాలు రాయడం తప్పైనా, ఇటాలియన్, ఇంగ్లీషుసాంప్రదాయాల్ని బట్టి చూస్తే తప్పేమీ లేదు. పైగా ఆమె భర్తకు గౌరవం కూడా. ఇటువంటి విషయాల్ని గురించి తెలుగులో ఇదివరకు రాయడం లేకపోవడంచేత, 'సానెట్టు' అంటే ఏమిటో అర్థం కావడానికై ఈ ఉపోద్ఘాత మంతా రాయవలసి వచ్చింది.

3

ఒకానొక కవిభావాలు, కవిత్వం నచ్చినదంటే, ఆ కవిమీద అభిమానం కలగడం సహజం. ఆ కవిజీవితానికి మన జీవితానికి సామ్యంకూడా ఉంటే మరీ ఎక్కువ సంతోషిస్తాము. అలాగే శివశంకరశాస్త్రిగారికి మనకు ఎంతోదూరంలో ఉండే ఇటలీదేశపుకవి అయిన పెట్రార్కమీద గాఢాభిమానం కలగడానికి కారణం ఇద్దరిజీవితాలకు కొంత పోలికుండడమే. ఇద్దరూ మహిళామణి కటాక్షం సమకూర్చారు.

"మనకటాక్షప్రభా - మండితాంగనలెల్ల
నిర్జరత్వము గనిరి - Petrarca"

అన్నారు; అంటే ఆ స్త్రీలు చిరకాలం బ్రతికుంటారని కాదు అర్థం. వీ రిద్దరు తాము ప్రేమించిన స్త్రీలపై పద్యాలు రాసి, ప్రియురాండ్రపేర్లు సారస్వతంలో ఆచంద్రతారార్కం ఉండేటట్టు చేశారని అభిప్రాయం. సాధారణంగా ఏకవీ వృద్ధురాండ్రజోలికి పోకుండా, నిండుయౌవనమందున్న స్త్రీలనే ప్రేమించి, వారి అప్పటిసౌందర్యాన్ని వర్ణించుతూ పద్యాలు రాస్తారు. కాబట్టి పాఠకులు ఎప్పుడు చదివినా యువతీవిగ్రహమే గోచరిస్తుంది. అందువల్ల వారికి నిర్జరత్వం ప్రాప్తమైందనికూడా చెప్పవచ్చు.

"అన్నారు దైవజ్ఞు - లాయుఃప్రమాణమ్ము
నాకు నీయంతె యని - Petrarca."

పెట్రార్క డెబ్బై (౧౩౦౪ నుండి ౧౩౭౪ వరకు) సంవత్సరాలు జీవించాడు. దైవజ్ఞుల్ు శాస్త్రిగారుకూడా డెబ్బైసంవత్సరాలే జీవించుతారని చెప్పినట్లు కనిపిస్తుంది.

కవికి తగినట్లుగా గ్రంథభాండారంలో పెట్రార్కా తనువు చాలించాడు.

"శిరసు గ్రంథముమీద - చేత కావ్యముతోడ
పోసెంతు నీలాగ - Petrarca."

ఈ పాదం వీరికోర్కెను తెలియజేస్తుంది. వీరు కూడా పెట్రార్కామాదిరే దివంగతులు కావాలని కోరుకొంటున్నారట. సాహితీసంపన్నమైన వంశంలో పుట్టారు, సాహితీసమితి కాధారభూతులై పెరిగారు, తుదకు సాహితీమయమైన పుస్తకభాండాగారంలో తనువు త్యజించాలని కోరుకొన్నారు. మహాకవి కింతకంటె గొప్పకోర్కెముంది? అయితే పెట్రార్కకు, శాస్త్రిగారికి కొంచెం భేదం ఉంది. పెట్రార్కా వివాహితయైనస్త్రీని ప్రేమించాడు. వీరు ప్రేమించినది కన్య. పెట్రార్కా ఇటలీకవుల్లో ఎంతగొప్పవాడో శాస్త్రిగారు ఆంధ్రకవులలో అంతగొప్పవారు. నిజంగా జన్మపరంపరేఉంటే పెట్రార్కాయే శాస్త్రిగారై పుట్టారేమో! ఎవరికి తెలుసు?

౪

వాల్మీకి, కాళిదాస, భవభూతులు హృదయవాదులు. శాస్త్రిగారినికూడా హృదయవాదకవుల్లో చేర్చవచ్చు. అందువల్ల వీరికి పైకవులమీద గాఢాభిమాన మున్నట్లు తెలుస్తుంది. హృదయవాదకవి కావడంచేతనూ, స్త్రీత్వముమీద ఉండే ఆదరంచేతనూ పుస్తకానికి "హృదయేశ్వరి" అని పేరు పెట్టివుంటారు. కొంతమంది వృద్ధవిమర్శకులు గనిలో వుండే ప్రేమస్వరూపం గ్రహించక అసభ్యశృంగారానికి ఇందులో పద్యాలు ఉదాహరణ యివ్వడానికి ప్రారంభించారు. అది సరసం గాదు.

౫

ఈకావ్యాన్ని హృదయేశ్వరికే అంకితమిచ్చారు. ఎందుకంటే ఆమెనుగురించి వినడంచేతా, చూడడంచేతా, ఆమెమీద ప్రేమ కలిగి హృదయం పరితప్తమై ఈ గ్రంథం రచించడం సంభవించి ఉంటుంది. నిజంగా ఒకవిషయాన్నిగురించి హృదయంలో అఖండవేదన కలిగితేగాని ఆ విషయంమీద చక్కనికవిత్వం చెప్పలేదు. సముద్రమథనం కలిగితేనేగాని జగదాహ్లాదకరుడైన చంద్రుడూ, అమరత్వం ప్రాప్తింపజేసే అమృతమూ పుట్టవు. ఆనందాతిశయం దోలలాడుతుంటేతప్ప కైత నల్లడానికి వీలులేదన్న అల్లసాని పెద్దన్నమాట అంత అంగీకారంగా కనిపించడంలేదు. కాబట్టి సుఖంగా ఉన్నప్పుడు చెప్పినకవితకంటే కష్టా లనుభవించిన తరువాత చెప్పినకవనమే భావప్రదిక్తమై సహజంగా, సరళంగా, హృదయంగమంగా వుంటుంది. అందువలన,

"మనస్సమున్నత గీనమై మాటిమాటికి
విమలకవితాప్రవాహము వెల్లగింగు
నిన్ను వర్ణింప నెంచిన నిమిషమందు:
నీవు నాకు సరస్వతీదేవివమ్మ!"

అని శాస్త్రిగారు వనడం సమంజసంగా ఉంది. ఏ గీతి మార్గాన వీరికి కవిత్వం వెల్లివిరిసిందో ఆ గీతికే అంకితం యివ్వడం ఇంకా ఎక్కువ సరసం.

౬

సంస్కృతమందు నాగినందం శ్రీ హర్షుడు నాటకరచనచేతనూ, నాగికాభాష్యయందు ప్రతిచేతనూ పుస్తకం చాలావరకు సంస్కృతసమాసయుక్తంగా వుంది. అయినా పాండిత్యప్రకర్ష చూపించడానికై మారుమూలలమాటలు ప్రయోగించకపోవడంచేత సామాన్యవిద్యాసంపన్నులకు కూడ అర్థమవుతుంది. వీరిపద్యాలు శ్రీనాథునిపద్యాలవలె సుప్రసిద్ధపదసమాయుక్తమై అనర్గళధారాశుద్ధితో గంభీరమాధుర్యంగా నడుస్తవి. పుస్తకములో సమాసాలు ఎక్కువగానే ఉన్నవి. కాళిదాస శ్రీనాథులకావ్యాల్లోమాదిరిగా ఉపమాలంకారము చాలాపద్యాల్లో కనిపిస్తుంది. కావ్యమంతా కథ లేకుండా వర్ణనలతో నింపి ఉన్నప్పటికీ, విసుగు పుట్టించక చదివినకొద్దీ ఇంకా చదువుదామనే అభిలాష కలిగిస్తుంది. వీరిగీతపద్యాలు అనన్యసామాన్యములు. గీతపద్యాలు బాగుండవనీ, గీతాలు రాస్తే మంచికవి గాడనీ, వృత్తాలే బాగుంటవనీ, యిప్పటికీకూడా చాలమంది కున్నది అటువంటి అపోహ. అలాంటివారందరికీ ఈ కావ్యంలోనిగీతాలు చూస్తే ఆ అనుమానం నివారణ మవుతుంది. వీరిమాదిరిగా గీతాలు వేలకువేలు రాసిన

వారెవ్వరూ లేరు. తేటగీతి, [illegible], ముత్యాలసరం మాత్రం ఈ [illegible] ముత్యాల సరం [illegible] లేలిక. అట్లు [illegible] [illegible] కానీ శాస్త్రిగారు [illegible] పద్యా న్ని [illegible] ఇది తెలుసుకు [illegible]:

"[illegible]
[illegible]
[illegible]
[illegible] !
"[illegible]
[illegible]
[illegible]
[illegible] !
"[illegible]
[illegible]
[illegible]
[illegible] !"

౨

[illegible] అప్పారాయకవి సృష్టించాడని [illegible] బాగాలు [illegible]. ఈ పద్యం [illegible] లక్షణం [illegible] భావించుకున్నారు. [illegible] వృషభగతిరగడనే [illegible] మాత్రలు తగ్గించితే ముత్యాలసరం అవుతుం[illegible].

"[illegible]
[illegible]
[illegible]
[illegible]"

—(అప్పకవీయము)

"బాల, బాల[illegible] [illegible]
[illegible]

"గేలిఁ గే లిడి గ్రుచ్చఁ గడు రా
గిల్లు గిల్లుము త్రత్త్వవాలము
కొమ్మ కొమ్మఁ గదల్చి నన్నగై
కొనక కొన కని యేల నిక్కెదు
ర మ్మురమ్మన మోపఁ గురవక
రాజి రాజిలు నెంతపొక్కెదు"

—(వసుచరిత్రము)

కర్ణాటకభాషలో షట్పదిలో రెండుపాదాలు తీసివేసినా ముత్యాలసరం అవుతుంది. ఈ పేరుమాత్రం అప్పారాయకవి పెట్టిందే!

ముత్యాలసరాన్ని గురజాడ అప్పారావు సృష్టించాడని చెప్పడంకంటె ఆయన దీనిని విద్యావంతుల్లో ఎక్కువప్రచారంలోకి తీసికొచ్చాడంటే బాగుంటుంది. దీనిని శాస్త్రిగారు సర్వాంగసుందరంగా, సకలలక్షణ లక్షితంగా, సమస్తాలంకారశోభితంగా చేశారు. వీరి కవిత్వంలో బిగువూ, పటుత్వమూ ఎక్కువగా కని పిస్తని. వీటికొరకు పద్యంనడకమాత్రం చెడగొట్టకుండా హుందాగా నడిపిస్తారు. వీరివాణి పాతపోకడలతో నూతన అలంకారాలకు పొందిక కుదర్చి గంభీరంగా కని పిస్తుంది.

"గుమ్మడేడే గోపిదేవీ
గుమ్మడేడే కన్నతల్లీ
గుమ్మడిని పొడచూపగ ద మా
అమ్మ గోపమ్మ!

అని వీరిచిన్నతనమందు తల్లి పాడుతూఉండగా వినే వారట. సామాన్యంగా బాల్యమందు మనస్సులో నాటుకొన్న బీజములే వార్ధక్యంలోకూడా దృఢముగా పాదుకొనిఉంటవి. అందువల్ల శైశవములో విన్న తల్లి పాడేపాట ననుసరించే వీరు ముత్యాలసరం ఎక్కువగా రాస్తున్నారట.

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పైతా శికము (గీతావళి) అనే ఉచ్ఛ్వాసం విని, నడకలు బాగున్నవని సంతోషించి నవ్వుతూ "దండాడింపులు" అని నామకరణంచేసి తాను "గీతసీతారామము" అనే కావ్యంలో ఈఛందస్సు అవలంబించారట.

౮

ఈ గ్రంథంలో హఠాత్తుగా మొదటిపద్యంలోనే వస్తునిర్దేశంతో కథ ప్రారంభమైంది. ఈకావ్యంలో కథాసంధి లేదు. కథాసంఘటనలు కనబడవుగాని విడివిడిగా ఘట్టాలు సక్రమంగా చదువుకుంటూపోతే కథాసూత్రాన్ని అనుమేయించవచ్చు. ఈగాథ ఒకనాటిది కాదు. కొంతకాలం నడిచినట్లు కనిపిస్తుంది. అందుచేతనే 'ఈ యుపకావ్యమును చదువునప్పు డొక్కొక్క పట్టున జనుటకన్న ఘట్టము ఘట్టముకడను కొంతతడవు నిలుచుండుట యుక్తము. వివిక్తప్రదేశము విభావరీ వేళయు ఈ కావ్య రసాస్వాదమున కనుకూలములు.'

౯

ప్రాకృతభాషలో కొన్నికావ్యాలకు ఆశ్వాసకములు అనేవిభాగం ఉన్నది. దానినే మార్పుచేసి తెలుగుకావ్యా లన్నింటిలో విభాగాలకు ఆశ్వాసములను పేరు పెట్టుకొన్నారు. ఈ గ్రంథం ప్రాచీనపద్ధతి ననుసరించకుండా తొమ్మిది ఉచ్ఛ్వాసములుగా మాత్రం విభాగింపబడింది. దండిమతంలో కావ్యానికి హీనపక్షం ఎనిమిదిసర్గలైనా ఉండాలి. దండి అలంకారశాస్త్ర ప్రకారం ఈ కవి లెక్కపెట్టి తొమ్మిదిభాగాలుగా విభజించకపోయినప్పటికీ దానంతట అదే కథారేఖ తొమ్మిది ఉచ్ఛ్వాసాలుగా ఏర్పడ్డది. ఒక్కొక్క భాగంతరువాత హృదయం ప్రేమోద్రిక్తమై పరితప్తమై నాయకుడు ఒక్కొక్క పెద్ద నిట్టూర్పు విడిచిఉండవచ్చును; లేదా పాఠకులైనా ప్రతిఘట్టంచివర విరహంవల్ల పరితపించే నాయకుణ్ణిగురించి చదివి ఒక నిట్టూర్పు విడువవచ్చు. అందువల్ల ప్రతిభాగానికీ ఉచ్ఛ్వాసం అనే పేరు పెట్టారు.

౧౦

నాయకుడు నాయికను మామూలు ప్రేయసిగా చూడకుండా దేవతగా భావించుకొన్నాడు.

"నీవు నాదృష్టిలో మహాదేవివమ్మ!"

ఆమెకు అధికగౌరవ మిచ్చాడు. తనహృదయేశ్వరి స్త్రీజాతిలో జన్మించుటవలన సమస్త స్త్రీజాతియందు కవికి పూజ్యభావం వుం దన్నాడు. ఇదివరకెవ్వరూ తెలుగుకవుల్లో ప్రాచీనుల్లో గాని, ఆధునికుల్లోగాని ప్రియురాలి కింత గౌరవ మిచ్చినట్లు కనిపించదు. ఇవ్వడానికికూడా అందరి మనస్సొప్పదు. ఈనాటి యితర కవులవలె ప్రియురాలికి నాలుగైదుగీతాలు కాకుండా తాను ప్రేమించిన హృదయేశ్వరిపై ఈకవి ఒక నిండుకావ్యం అల్లుకొన్నాడు. తక్కిన కవులకూ ఈ కవికీ ప్రేయసిమీదఉండే ప్రేమలో తారతమ్యం పద్యాలసంఖ్యనుబట్టే తెలుసుకోవచ్చు. ప్రియురాలిని గురించి వందలకొలది రసవంతమైన పద్యాలు రాయడాన్నిబట్టి ప్రియురాలివియోగంచేత ఈ కవిహృదయం ఎంత బాధపడిందో తెలుస్తుంది.

"పద్మావతీచరణచారణచక్రవర్తి" అనుపద్యనాటికను రాయడంవల్లా, పంచమోచ్ఛ్వాసమైన "సుఖస్వప్నం"లో కుమారునికి జయదేవుడని పెట్టుకోడంవల్లా ఈ కవికి గీతగోవిందకారుడైన జయదేవుడంటే చాలా ఇష్టమున్నట్లు తెలుస్తుంది. అందుచేతనే జయదేవుడు తనభాగ్యదేవత పద్మావతిని ఎంతగౌరవంగా చూచాడో అంతకంటె గౌరవంతో పూజ్యభావంతో ఈ కవి తన హృదయేశ్వరిని చూచాడనే అనిపిస్తుంది.

శివశంకరశాస్త్రిగారు శివారాధకులైనప్పటికీ రాధాకృష్ణులయెడ అధికానురాగ మున్నట్లు ద్యోతకమవుతుంది.

"నిన్ను ధ్యానించుకొలది నిర్నిద్ర మనుచు
ప్రమదయున వేగు మానసబంధగంధ
రాధికా నాగపాదనీరజయుగమ్ము:
వింతగ గ్రహించి నాముక్తికాంతవమ్మ!
—(హృదయేశ్వరి)

"కల్మ సుస్నిగ్ధ నీలాంశుకమ్ము దాల్చి
ఎదురుపడితివి దేవి నీ వింపులొలుక
కోమలాంబుదసన్నిభశ్యామగాత్రు
లలితసంశ్లేషమందలి లక్ష్మిభాతి.
—(హృదయేశ్వరి)

"............కేలను మక్కువముం గ్రహించి లక్ష్మిదయితా, కృపాకలిత
చిత్తముతో నికనైన బ్రోవవే!
—(ఆవేదన)

రాధికాప్రణయసౌరంభమునం బున్న
గోవిందుపోలిక గోచరించినది.”

—(పద్మావతి)

హృదయేశ్వరిని ధ్యానించినప్పుడల్లా రాధాకృష్ణులు జ్ఞప్తికి వస్తున్నారు. తాను తన హృదయేశ్వరి రాధాకృష్ణులవలె అనశ్వరప్రణయం కలిగి వుండాలని కోరుకునేవాడేమో అనిపిస్తుంది.

“విశ్వగానాలోకమంతటి నిస్తబ్ధిని
వేణువటుల మన ప్రేమ సౌధంబులు
దివ్యగానపటిమలయందు
తేలిపోదాము నేము !”

౧౧

ఒకనాడు రాత్రి సమయమున చుక్కలు మెరుస్తూవుండగా, చిరుమబ్బులు ఆకాశాన్ని ఆవరిస్తూవుండగా, పిల్లగాలులు వీస్తూవుండగా, కృష్ణాతరంగిణీవీచి కామాలికాధ్వనులు చల్లచల్లగా వినిపిస్తూవుండగా విజయవాడలోనున్న కొండకొమ్మల్లోని ఒకబండ మీద నాయకుడు తన ప్రియమిత్రునితో కలిసి కూర్చున్నాడు. అటువంటి సమయమందు మిత్రుడు మృదుమధుర గానస్వరాలతో తన హృదయేశ్వరిని స్మరించాడు. హంససందేశాలచేత నలునికి దమయంతిపైన ప్రేమ జనించినట్లుగా, ఆ స్తవవాక్యాలచే నాయకునికి ప్రేమ అనురాగ మంకురించి క్రమేణా కోరికలేర్పడి, కుసుమితంగా అయింది.

“హంససందేశములచే నలభూపతికి
క్షితిపభూపాలపుత్రిపై ప్రేమగల్గె”

అన్న ఉపమానాన్ని బట్టి నలునికి దమయంతిపై ఎంత ప్రేమగలదో నాయకునికి నాయికపై అంత ప్రేమ కలదనీ, నల దమయంతుల ప్రేమవలె నాయికా నాయకుల అనురాగం మిక్కిలి పవిత్రమనీ తెలుస్తుంది. మాటవల్లా వినడంవల్లా ప్రేమ కలుగుతుంది. ఇందులో వినడంవల్లనే కలగడంచేత పూర్వజన్మ విశ్వాసం గనక వుంటే జన్మాంతరబాంధవ్యం అంగీకరించాలి.

ఆ తర్వాతనే నాయకుడు నాయికను చూచినట్లు కనిపిస్తుంది.

“సుందరద్వారదేశమునందు నపుడు
సత్రపంబుగనున్న నీగాత్రవల్లి
పటగతంబయి యావృత్తిబద్ధమైన
ప్రతిమపోలిక నాకు విభ్రమము గొలిపె !”

నాయకుడు ప్రియమిత్రునితో కలసి రాజవీథిని వెళ్లుతుంటే, ద్వారబాధముకడ నిల్చుండి హృదయేశ్వరి వీరిద్దరిని చూచినట్లుగా తెలుస్తుంది. ఇదివరకే నాయకుని హృదయంలో నాటుకొన్న ప్రేమబీజములు మొలకెత్తినవి. అప్పటినుంచీ దినదినప్రవర్ధమాన మవుతూవున్న ప్రేమ హృదయేశ్వరీకటాక్షవీక్షణము ప్రసరించక పోవడంచేత క్రమేణా విరహతాపంగా మారింది. చివరకు ప్రథమోచ్ఛ్వాసాంతమునకు ప్రేమ మిక్కుటమై నాయకుడు ఆమెను దేవతాస్వరూపిణిగా భావించి ఆమెలో ఐక్యము కావాల్సినదిగా అనుకొన్నాడు.

౧౨

“ప్రేయసీ, యేల వింటి నీపేరు నేను !
ఆలకించినదాది నామాక్షరముల
నేమివింతయొ కాని మదీయహృదయ
దుగ్ధవార్ధిని మథన ముద్భూతమయ్యె.
అధికమైన కొలందిని మథన మకట
ఉద్గమించెను కాలకూటోగ్రవిషము
ప్రేయసీ, నిల్పితిని దాని బిగియబట్టి
కంఠకుహరమ్మునందు శంకరునిభాతి.
ఉత్సుకతతో నిరీక్షించుచున్నవాడ
భవ్యలక్ష్మీసమాగమప్రాప్తికొరకు
పూర్ణనిరతావ్యయసుధానుభూతికొరకు
ఎన్నటికి నాకు లభియించు నిది యెరుంగ !”

ఈమూడుపద్యాల్లో అర్థం చాలా మనోహరంగా సందర్భానుసారంగా, సమంజసంగా ఉంది. రెండవ పద్యంలోని ఉపమానం మరీ అందంగా, ఉచితంగా వుంది. నాయకుని హృదయం పాలసముద్రంతోనూ, ప్రేయసీనామము మందరపర్వతంతోనూ, నామాక్షరాలు స్మరించడం సముద్రమథనంతోనూ, లక్ష్మీనామ స్మరణవలన పుట్టినవ్యథ మథనంవల్లపుట్టిన కాలకూట విషంతోనూ, నాయకుడు శివునితోనూ పోల్చబడ్డారు.

హాలాహలంతరువాత లక్ష్మీదేవి, అమృతము పుట్టుతవి. లక్ష్మీదేవి విష్ణుమూర్తికి లభ్య మవుతుంది. అమృతం దేవతలకు లభిస్తుంది కాని శివునికి ఈరెంటిలో ఏదీ ప్రాప్తించదు. అందుచేత శంకరునితో పోలిక చెందిన నాయకునికి లక్ష్మీసమాగమం కలుగదని కావ్యార్థసూచన అప్రయత్నంగా అయింది. ఇందులోని విరహం పగు వరి, రసికుడు ఇరవయ్యోశతాబ్దపు నవనాగరికుడైన ఒక వ్యక్తి అనుభవించినదానిమాదిరిగా వర్ణింపబడింది. విద్యావంతులైన రసజ్ఞులుమాత్రం యీవిరహంలో వుండే స్వారస్యాన్ని గ్రహించగల్గుతారు. అలంకారశాస్త్ర రీత్యా చూచినా యీవిరహం సరసంగా వుంది. రెండ వది—నార్మల్, అండ్ ఎబ్నార్మల్ సైకాలజీ ప్రకా రం చూచినా సక్రమంగా వుంది.

ద్వితీయోచ్ఛ్వాసాంతంవరకు నాయకుడు విర హంలో వేగిపోయాడు. హృదయేశ్వరి తనజీవిత సర్వ స్వం అనుకొన్నాడు. లక్ష్మిపై నాయకునికిగల ప్రేమ భక్తి మితిమీరిపోయినవి.

"తలచుచున్నాను నాప్రియతమ వటంచు
ఎంచుచున్నాను నీ హృదయేశ్వరిగను
వలచుచున్నాను జీవితేశ్వరిగ నిన్ను
భావనము సేయుచుంటి నీ జీవికిలి.

"నీవు ప్రాణాధికవు నాకు నిశ్చయముగ
వాంఛనీయసుఖాధ్యక్షివతము నీవు
సాటిగానని నాసరస్వతివి నీవు
వాస్తవమ్ముగ భాగ్యదేవతవు నాకు.

"నిన్ను ప్రేమించుచున్నాను నిస్తులముగ
నీయెడ చెలంగు నాప్రేమ నిగ్రహింపు
నిండు హృదయంబుతో నన్ను నీకునున్న
అర్పణము చేసికొంటి సహర్షముగను."

నాయిక నాయకునియందు అనురాగము కను పరచినట్లు స్పష్టము.

"అంత మేము భాషించెడి యవసరమున
మామకీనస్వరాకృష్యమాణ వనుచు
వల్గుకమునమ్మనో జేరవచ్చి నావు
జీవితేశ్వరి, నన్ను వర్ణించుకోరికా!"

"నీకు నామీఁద నవనవస్నేహరక్తి
జెప్పకయె చెప్పుచుండె నో స్నిగ్ధహృదయ!
ఆననమ్మున విగళితమానకాంతి
తరల నయనోచ్ఛలత్సుఖోత్కంఠదృష్టి."

"నీవు నన్ను వరింపగా నేనె త్రి
లోకములగల్గు నిల్వ వసువు నీ లభ్యమగును".

ఇంతటిరక్తి కలిగింది నాయకునికి నాయికపై.

విరహావేదన ఆతనికి ఉన్మాదావస్థలోకి దిం పింది. రాత్రనక పగలనక సర్వకాలసర్వావస్థలయందు కళ్లు తెరచినప్పుడైనా మూసినప్పుడైనా హృదయేశ్వరి రూపమే కళ్లకు కట్టినట్టుగా కనిపించేది. ఎన్నిరోజులు నిరీక్షించినా హృదయేశ్వరినుంచి ప్రణయవార్త రాలేదు. అందుచేత ఆమెకు తనమీద ప్రేమపోయిందేమో అను సంశయముకూడా నాయకుని బాధించింది. భక్తు లకు, కవులకు, కాముకులకు, కామినులకు నిత్యస్మర్తవ్యులు అగుచూనే వుంటారు.

"కరములు కదల్పకున్న నకారణముగ
జారిపడు నంగుళీయకమ్ము నేడు."

అనుపద్యభావం కాళిదాసు మేఘసందేశంలోని

"కనకవలయభ్రంశరిక్తప్రకోష్ఠః"

అను శ్లోకభాగాన్ని గుర్తుకు తెస్తుంది. అప్పటి కా లంలో వలయాలు ధరించటం వుండేది. ఇప్పుడో వుంగరాలు పెట్టుకోవటం వుంది. కాబట్టి కాళి దాసు శ్లోకాన్ని అనుకరించి వ్రాసినా, సహజ కాలానుగుణ్యంగా మార్పు చేసి వ్రాసినట్లుగా వా డాడు. ఇందులో నాయకుని అనుభూతులు నిజంగా జరిగినవే వుండవచ్చు.

౧౩

తృతీయోచ్ఛ్వాసంలో నాయకుడు ఒక శ్లోకం మూస ప్రభాతసమయాన నాయికయింటికి వెళ్లాడు. తరువాత మెల్లగా ఏవో మాటలతో మాట్లాడటం తటస్థించింది. అప్పటినుంచి నాయకునికి కొంత హృదయశాంతి కలిగింది.

"కర్మపరిపక్వమై యిటువంటి
దైవకృప ఫలప్రదమాయె"

పాణి [illegible] కి ని[illegible]స్వర్ల[illegible]
లక్ష్మి! నీని [illegible]!"

గిన్ని బట్టి నూస్తే నైసర్గికాని ఇంద్రియశక్తి గలిగి కూడా ఇంకా [illegible] కర్మపరి పక్వమై [illegible] ఆమె పాశ్చాత్య[illegible] మే.

౧౪

గార్హస్థ్య[illegible] నాయికానాయకుల సంబంధాలు కారణభూతమైనా, [illegible] గారి [illegible], [illegible] హృదయేశ్వ రిని గవాక్షంగా [illegible] ఆమె యింటికి [illegible] ఆమను మేలు కొల్పడానికై [illegible] తన వంట [illegible] మాని గానీ, [illegible] మాని గానీ, [illegible] మాని గానీ, [illegible] కేవలం తన [illegible] బోధిస్తారు. ఆమెను [illegible] ప్రాణ మైనా [illegible] పితా నవీ, కాబట్టి [illegible] స్థైర్యం [illegible]. [illegible] వర్ణింపబడి వుంది. [illegible] కాళ్ళ ముందా? [illegible] (balcony) [illegible] (Serinades)[2] [illegible] [illegible] నాయకునా నాయికా [illegible] అంగు కుద్దేశించి వుంటవచ్చును. [illegible] మేలు కొల్పినట్లు కవులు [illegible] ప్రియులు [illegible] మేలుకొల్పినట్లు మనభా షలో [illegible] ఒకకొత్త పద్ధతే!

౧౫

ఇది స్వప్నము. కవులకు, కాముకులకు కలవ రింతలు మామూలు. ఇందులో నాయికకు పుట్టినరోజు పండుగ. దీనిలో నాయికా నాయక సంయోగప్రాప్తి వలన ఒకపుత్రుడు ఒకపుత్రిక కల్గుతారు కుమారుడు పేరు జయదేవుడు. కుమార్తె పేరు మణికర్ణిక. ఈ ముద్దు బిడ్డలను జూచుకొని తల్లిదండ్రులు అమితానందం పొందు తారు ఈ స్వప్నాన్ని బట్టి, తనకు తన ప్రేయసికి ప్రణయబాంధవ్యం కొద్దికాలంగాకుండా జీవితాంతము వరకు అవినాభావసంబంధం గలిగి వుండాల్ననీ, ఆమెతో గార్హస్థ్యసుఖాలయం దోలలాడాల్ననీ, ఒకపుత్రుడు ఒకపుత్రికమాత్రం కలగాల్ననీ, ఈనాయ కుడు భావించినట్లు కనిపిస్తుంది. ఈ ఉచ్ఛ్వాసం మొదటనే భార్యాభర్తలు గాఢాలింగన సౌఖ్యపార వశ్యంలో మునిగిపోతారు. కౌగిలి వదలలేనంత ప్రేమతో వున్నారు

"మేరమీరుచు నున్న నిర్వ్యాప
పారవశ్యము హృదయనాథా!
భూరితావక వాక్సుధారస
ధార గావి సోకకా."

"పొంగిపోవును నున్న దోహలో
తుంగభంగము గాగ నాహృ
ద్గంగ మీయనురాగవార్నిధి
సంగతిని నాథా!"

ఈ వినంగా భక్తితో పల్కిన భార్యమాటలు మాస్తే వారిప్రేమ అపారం, అనుపమానం, అద్వితీయం అని గోచరిస్తుంది. నాయికప్రేమ గంగానదివలె నిర్మ లము, పవిత్రము, లోకపూజ్యము. నాయకుని అను రాగము సముద్రంవలె అపారము, గభీరము, శాశ్వతము. గంగానది సముద్రుని పట్టముహిషి కావడంవల్ల ఇక్కడ ఈవుపమానం చాలా యుక్తంగా వుంది. "గురుతుప్రభర్త అయిన మీరు మీపాదదాసినైననన్ను ఇంతప్రేమతో

---

2 Music sung or played at night below person's window especially by lover.

చూపడం మీకరుణను సూచిస్తుంది" అని భార్య పల్కగా

"పలుకదగునె యిట్లు ప్రాణేశ్వరీ నీవు!
కరుణ గాదు నాకు గౌరవంబు!
కనికరము దీనజనములయెడలె నా
మతమునందు భార్య మాన్యురాలు!"

అన్నాడు భర్త. దీనినిబట్టి నాయికకు నాయకుని యందు గురుభావంకూడా వున్నది. నాయికా నాయకుల, బిడ్డల సంభాషణవల్ల ఈ కవికి చిత్రకళ, సంగీతము, సంస్కృతము, హిందీయింగు అమితప్రీతి ఉన్నట్లుగాను, బాలికలకుకూడా సంస్కృతభాష నేర్పి, విదుషీమణులుగా, కవయిత్రులుగా చేయాలనీ ఉద్దేశ మున్నట్లు తెలిసికోవచ్చు[3].

---

3. ఇది పూర్వార్ధము. పరిష్కృత, పరివర్ధిత, సంపూర్ణపాఠా న్ననుసరించి యీ వ్యాసం వ్రాశాను.

పంట

పెమ్మరాజు లక్ష్మీపతి

మొసలు దేరిన కోటాకుకొనలు నిగుడ
నాలు వెన్నెల వరిపైరు పండబారె,
రోజు కొనక క్రొత్తచాయ దేరుచును, నీదు
కృషికి రవలబంగారు కిరీట మమరె.

పొలములలోన పండి పడిపోయిన యీ వరిపైరు పైడి దు
వ్వలువనిగాగముల్ మెరయ, పంటవలంతిపోలంతి, వింత వ
న్నె లొలయు సంజలందు శయనించెను; కల్గినవారి యింటి కో
డలివలె, తాను గాంచెడు కలానికలల్ నిజమై వెలుంగగాన్.

పండిన కంకుల డాలు నెకసక్కెము లాడగజాలుమైసిరుల్
పండెను కర్షకకాంతుకలచే గడించిన పైడితోడ నీ
కంఠపుగుబ్బలపై రిమదు నంచు వహించిన బాసలెంచి నీ
సుందరి సిగ్గునై యెదురుచూచెడు ధాన్యము జేర్పు మింటికిన్.

పంటకుగర్భజానందు కనుపండువులై తనయింట నందముల్
పంతగ గుమ్మముల్ పసుపువన్నియ లీనగ ముద్దబంతి పూ
దండలు త్రిపోల తమ్మిబిళదండలు చూపుల గ్రాల నీదు కై
దండ గొనంగ నున్న నిజదారకటాక్షములన్ గరంగుమా!


చిందుల్ ద్రొక్కెడు భంగుభంగుమని రాసిం జుట్టి కందోయికిన్
విందుల్ గూర్చుచు లేగదూడ లవె యుద్వృత్తప్రమోదక్రియా
మందావార్యరసప్రవాహమధురోన్మాదోత్థకల్లోలముల్
చిందుల్ ద్రొక్కె నపూర్వ నర్తనకళాసీమావధుల్ దాటుచున్.

పసిడి లేదమ్మితూడుల మెసవుచున్న
రాజహంసియువోలె, యీ రాసికెలన
పరకలను గొరుకు నీ నందివాహనంబు
పరమ సంతృప్తిలో మన బ్రతుకు నిలిచె.

పండిన పంటతో కసవుపండిన ముద్దియలతోడ, నేడు కల్
నిండిన యింటిలో నగుమొగంబుల పిల్లలతోడ, కమ్మగా
వండిన పిండివంటలును పాల్పెరుగుల్ భుజియించి, హాయిగా
పండుగ రోజులన్ శ్రమము వాయ సుఖంబుల మున్గి తేలుము!

చేతన దాగియున్న జడసృష్టికి పుట్టువునాడు సైకతంబుగా
ధాత్రితలిలోపలన్ సారవగాహములై వెలిగించు ...
లోతులలోని లోహములలో వెలుగొందు హిరణ్మయంబు మీ
రీతిని భూమిపై వెలుగనించితివోయి కృషీవలాగ్రణీ!

మలినభూయిష్ఠ మగు నల్లమట్టి నిట్లు
స్వర్ణముగ మార్చినట్టి ...
చేయగాలేదె జనులు జేజేలు గాగ
మర్త్యభూమి స్వర్గజగతిగా మార్చ్పలేదె!



'నల్లప్రజ'

డాక్టరు యన్. వెంకటరమణయ్య

కృష్ణరాయలవారు తమ కొలువున నున్న "నల్లప్రజ లక్షకున్ను నెలనెలకు తప్పక సంబళ మిస్తా మని వ్రాఖ కర్ణీకం యేర్పాటు చేసి"నట్లు రాయవాచకమున జెప్పబడి యున్నది. ఈ 'నల్లప్రజ' యెవ్వరు? లక్షమందిని రాయలవారు నెలజీతము లిచ్చి తమ కొలువున నేల యుంచుకొనిరి? అను విషయమును రాయలరాజ్యాంగచరిత్రను రచియించునప్పటికి నా కంత తెలియగదగినవి. ఒక రాయవాచకమున దప్ప మఱి యేచరిత్ర గ్రంథమునను 'నల్లప్రజలు' పేర్కొనబడలేదు. కాని తెనుగుకాలపు ప్రబంధవాఙ్మయమున వీరి ప్రస్తావము కొంత కలదు. ప్రబంధములు మూలమున వీరినిగూర్చి విశేషాంశము లేమైనను కనుగొనవచ్చునో చూతము.

పైగా రాజు 'వేంకటనాథకృతపంచతంత్ర మున నుక్కళరాజగు పుష్కరనృపాలుడు వేటకు బోవు సందర్భమున నల్లప్రజ లా రాజు ననుసరించిన ట్లీ క్రింద పద్యమున జెప్పబడి యున్నది.

క. ఏలల పాడుచుఁ దగ విలు
   కోలలు గొని నల్లప్రజలు గుములై నడువన్
   నీలాంబరుఁడై విభుఁ డు
   ద్వేలాశ్వారూఢుఁ డై వేటకు గ్రాలెన్.
                                                        —(పం, ౨: ౧౫౫.)

'నల్లప్రజలు' విలుకోలలు గొని రాజు తోఁగూడ వేట కేగెడు సహచరులని ఈ పద్యమువల్ల తెలియవచ్చుచున్నది. చంద్రాంగదచరిత్రయందును వీరినిగూర్చి కొంత చెప్పబడియున్నది. వనవిహారవర్ణనయం దీ క్రిందిరీతిని నల్లప్రజలు పేర్కొనబడియున్నారు.

గీ. 'విరహిజనుల నొంచ నంభోజశరుఁడు మరుఁడు
    పరభృతంబుల నచ్చోట పౌఁజు దీర్చి
    నల్లప్రజ నిల్పె నొడ్డు గుంటలో యనంగ
    నళుల యడఁకువ గల పూల లలన గంటె.'
                                                        —(చంద్రాంగ, ౪: ౨౧౦.)

ఇచ్చట రాజో లేక దండనాయకుఁడో యుద్ధరంగమున శత్రుభంజనార్థమై సైన్యమును పన్నుటను అనుసంధించుకొనవలసి యున్నది. మరుడు రాజు లేక సేనాధిపతి. వనస్థలము యుద్ధరంగము; పరభృతములు పౌజులు; అళులు నల్లప్రజలు; పూలలలనలు ఒడ్డుగుంటలు, విరహిజనులు శత్రులు, కావున 'పౌఁజు'లతోఁబాటు 'నల్లప్రజలు'ను సేనయందు భాగ మని తెలియుచున్నది. మఱియు, పై గ్రంథకర్తయే వసంతర్తువర్ణనా సందర్భమున 'నల్లప్రజల'ను మరల పేర్కొని యున్నాఁడు.

సీ. 'ఇగురుకై జీతంపు టెక్కటీలను గుజ్జు
    పరపుమామిడి కట్టుబడిగఁ జేసి

15.   12-   6

చలువపూ దేనెఁ గాసపు నల్లప్రజలకు
వల కుటీరము లుమ్మలిక కొసంగి
పాలుపొంగు పండు కావలి పాళెగాండ్రకు
గున్న దాడిమ మిచ్చి కుసుమ సరణి
వలతాని యేర్పాటు వడిగల దొరలకుఁ బు
ష్పాది తిన్నగము మేలుబడిగఁ జేసె (?)
తలిరువిలుకాడు కెరలి సాంద్ర ఘటించి
హత్తి విరహులనోడించ వెంటఁ దిరిగి
రతియుఁ బసప్రాంతలఁ గాపాడి గుసుమల వెల
బంతి మాడునాఁ డాల వసంత వేళ.'

—(చంద్రాంగద, ౪ ఆ.)

ఇందు వసంతరాయని సేనావిభాగవిధానము వర్ణింపబడినది. వసంతరాయని ఫౌజులు నాలుగు తెరగులవి: కైజీతపు శుక్లకీటేంద్ర సముదాయము మొదటిది; నల్లప్రజ రెండవది; కావలిపాళెగాండ్ర సమూహము మూడవది; వడిగల దొరలగుమి నాల్గవది. ఈనాల్గు తెగల ఫౌజులకును వసంతరాయడు గ్రాసార్థము తగువిధమున నేర్పాట్లు గావించెను. ఇగుళ్లను తిను కైజీతపు శుక్లకీటేంద్రకు గుజ్జుమామిడిని కట్టుబడి చేసెను. చలువపూదేనె గాసము గాగల నల్లప్రజలకు కుటీరములను ఉమ్మళిక కొసంగెను. పండ్లు ఆహారముగా గల కావలి పాళెగాండ్రకు గున్నదాడిమను పాళెపట్టుగ నిచ్చెను. ఉదాహృత సీసపద్యమున 'పాళెపట్టు' పేర్కొనబడలేదు. కాని చంద్రాంగదచరిత్ర యందే 'పాళెపట్టు' నొసగు నాచారము కల దనుటకు నిదర్శన మున్నది.

"కమలాకరమ్ముఁ బాళెముఁ బట్టు కొసంగెద
నెంచుడీ నాదెస నంచలార." (౪: ఆ.)

అను సీసపాదము ఇందుకు తార్కాణ. కావలి పాళెగాండ్రకు పాళెపట్టొసగుట సహజమే కదా. వలతావియే జీవనాధారముగాగల వడిగల దొరలకు పుష్పాదితిన్నగములను ఏలుబడిగ, అనగా అమరముగా చేసెను. ఇందువల్ల వసంతరాయని సేనయందు అమరపు దొరలు, కైజీతపుబంట్లు, పాళెగాండ్రు, నల్లప్రజ యను నాల్గుతెరగుల సైనికు లుండిరనియు, వారు గ్రాసార్థము వసంతరాయని కడ అమరములు (ఏలుబళ్లు), కట్టుబళ్లు, పాళెపట్లు, ఉంబళికలను గొను చుండిరనియు తెల్లమగుచున్నది.

అమరము, పాళెపట్లు, కట్టుబడి, ఉంబళిక పదములు నాగరాజుల శాసనములలో అనేకములలో నున్నట్లు శాసనములవల్ల తెలియవచ్చుచున్నది. ఇట్టి అమరనాయకులు, కైజీతముబంట్లు, పాళెగాండ్రుగూడ శాసనములయందును చారిత్రగ్రంథములయందును పేర్కొనబడియున్నారు. 'నల్లప్రజలు' ప్రస్తావనము రాయవాచకమున నున్నందుచేత వారును రాయసైన్యమునందలి యొకవిభాగమునకు చెందినవా రనుట నిశ్చయము. ప్రబంధకర్తలు స్వవిరచిత గ్రంథములయందు సమకాలీన రాజకీయ మత సాంఘికమర్యాదలను జొప్పించుట స్వాభావికమగుటచేతను, అమరనాయకులు, పాళెగాండ్రు, కైజీతగాండ్రవలె నల్లప్రజయును ప్రబంధములకును రాయరాజ్యాంగపద్ధతికిని సామాన్య మగుటచేతను ప్రబంధములలో నల్లప్రజనుగూర్చి చెప్పియున్న విషయము లన్నియు రాయసేనయందలి నల్లప్రజలకు చెల్లునని తలచెదను. కావున, ప్రబంధవోదిత వృత్తాంతము ననుసరించి రాయసైన్యములోని నల్లప్రజ కావే రేల వచ్చెనో కనుగొనఁ బ్రయత్నము సల్పెదను.

నల్లప్రజ లనగా బోయవారు. ఈవిష యము హారిభట్టకృతమగు ఉత్తరనారసింహ పురాణములోని బోయ నిక్కణనివాసు లను గూర్చి చెప్పబడిన ఈక్రింది వచనము వల్ల తెలియుచున్నది.

"అనిన వాఁడు వల్లెయని నభల్లంబుగ విల్లెక్కుద్రోచి పల్లియలోని నల్లమందిం గొందఱఁ బిలుపించుకొని...గోవలికిం జాలి యుండె."

—(ఉ. నా, ఆ ౫: ౧౮౯.)

'మంద' యనగా ప్రజాసమూహము;- కాన 'నల్లమంద' యనన 'నల్లప్రజ' యనుట తెల్లము. ఇక బోయవారికి 'నల్లప్రజ' యన్న పే రేల వచ్చెనో కనుగొందము. దేహ చ్ఛాయవల్లనే వీరి కా పేరు వచ్చెనని యూహ పొసగుచున్నది. ఈ యూహకు గారణము ప్రబంధములలోని ఈ క్రిందిపద్య ములు:

'నల్ల [illegible] బోయలు [illegible]
[illegible] నల్ల [illegible]
[illegible] నల్ల [illegible]
నల్ల [illegible] నల్ల [illegible].'

(వసు. ౪: ౮౧)

మఱియు,

"[illegible] నల్ల [illegible]
[illegible]
[illegible]
[illegible] నల్ల [illegible] బోయ బల్లిగుల్."

---(రాజవా., ౧: ౬౧).

ఈ పద్యములవల్ల బోయలు మైచాయ నల్లనిదని తెలియుచున్నది. ఈ కారణము వననే వీరికి 'నల్లమంద', 'నల్లప్రజ'లను పేర్లు వచ్చియుండునని తలచుట యసమంజసము గానేరదు.

ఇక రాయసైన్యమునందలి నల్లప్రజల నియమితకృత్యముల నారయుదము. 'లక్ష' మంది బోయలకు నెలజీతము లిచ్చి తన కొలువున కృష్ణరాయ లేల యుంచుకొనెను? వారు రాయల కొనర్చిన సేవ యెట్టిది? ఈ ప్రశ్నలకు రాయలే జవాబిచ్చి యున్నాడు.

"క్షమఁ గుఱుమన్నెపుం గహనచారిజనం బెడవోపదృష్టికు ఢ్యము గడుగంగఁ బూనిక; దెగదర్గిన సర్వము; బాసనీగవ శ్యముగనొనర్ప దాడికను నాగడికొల్లలకు, న్నతాపరా ధమును సహింపమునతిర్వ్యము సర్వము లేలువానికిన్"

—(ఆముక్త: ౪: ౨౫౭).

బోయలచే రెండు కార్యములను నిర్వ ర్తింపఁ జేయుటకై వారిని దన కొల్వున నుంచుకొంటి నని రాయలు జవాబిచ్చు చున్నాడు: (౧) దండెత్తి పోవుటకు (౨) గడికొల్లలకు. ఈకార్యముల నొనర్చుటకై వీరు రాయల దండయాత్రలయందు నియో గింపఁబడుచు వచ్చి రని రాయవాచకము లోని ఈక్రింది వాక్యములవల్ల తెలియు చున్నది.

"గనక, ఆ దేరీతికి అప్పాజి రాయలవారి తోను తురకాణ్యంమీాదికి దళ మెత్తే టప్పుడు బోయదొరలు నల్గురిని రప్పించి పదు నేనువేలకప్పణాలు వారికిన్ని నగరవిందు బెట్టిగించి హరి బలం కుమాళ్లతోను కార్యము ఖానకు తురకాణ్యం శీమలోను మునకలుగా పోయి దగి మూడేసి ఆమడదూరం సారి సరాళం పోయి మనుష్యుల, పసలం, ప్రాయ ములు, గొఱెలు, మేకలు, గుఱ్ఱాలు వుండ్డ కుండ్డ" కొళ్లబెట్టమనిన్ని...ఉత్తరపు శేశి...

—(రా. వా., పుటలు, ౬౩-౪).

మఱియు,

"బోయలు ఏదునెనిమిది కష్ణాల వారున్ను, మూడులక్షల పాయదళమున్ను కొండవీడు, కొండపల్లి, బెల్లంకొండ, వినికొండ, నాగార్జునకొండ, మొదలైన దుర్గాలకు యేలుబడియైనసీమ లాద్యంతం నివాసం చేస్తూవున్నారు. గనక ఆయాసీమలో గల ప్రజ లందరున్ను సకలమును కొల్లయిచ్చి మిక్కిలి అందుపడియైన దుర్గాలు చేరినారు."

—(రా. వా, పుట, ౯౧).

కావున దండయాత్రలయందు నల్లప్రజ, అనగా, బోయమూక శత్రుదేశములను కొల్లగొట్టి ప్రజాక్షోభము గల్గించెడివా రనుట నిశ్చయము. నల్లప్రజవల్ల రాయలు పడయుచుండిన ముఖ్యసేవ ఇదియే.

ఈపైచర్చవల్ల తేలిన ముఖ్యసారాంశము లెవ్వియనగా,

౧. నల్లప్రజ అనగా బోయవారు; దేహచ్ఛాయచే వారి కాపేరు వచ్చెను.

౨. వారు రాయల సైన్యమున ఒక శాఖ. అమరగాండ్రవలె, కైజీతగాండ్రవలె, పాళెగాండ్రవలె నల్లప్రజలును ఒక ప్రత్యేకశాఖగ నేర్పడి యుండిరి.

3. వారి ముఖ్యకర్తవ్యము, దాడిపెట్టి శత్రువులు గల దేశములను కొల్లగొట్టి ప్రజాక్షోభము గల్గించుట.

"అది లేకపోతే-"

కవికొండల వేంకటరావు

కొన్నివిషయాల్లో శరీరచ్ఛాయ అందతివిషయంలోను నెత్తురుపారుదల భాగ్యవంతులకు బీదవాళ్లకు సరిసమానమేమో కాని మిగతా అంగాంగసౌభాగ్యాలున్నాయే అవి ఎవరివి వారివే. ఆ తేడా పట్నవాసాల్లో మరీ సుస్పష్టంగా చెప్పాలంటే కొట్టొచ్చినట్టగపిస్తుంది.

ఒక పెద్దభవనం ఏ నాలుగు అంతస్తుల్లో వుంటుంది — పై అంతస్తుమీద పూలతోట కూడా నెలకొల్పబడి — ఆ భవనంపక్కనో భవనానికి ఎట్టయెదుటనో ఒక గుడిసె నిట్రాటమీద తూలిపోతూ వుంది అన్నట్టు తాటాకు లెగిరి పక్కకి రిత్తగా వుంటుంది. భవనం, గుడిసె నుంచి వచ్చే సూత్రప్రాయంగా, తననీడ బూజును అంతా ఆ గుడిసెమీదనే మోపి, ఆ గుడిసెలోకి గాలిగాని వెలుతురు గాని పోనీకుండా చేస్తుంది.

అయితే ఈ వ్యత్యాసం చాలాచోట్ల ఆయా ఇండ్లల్లో నివసించే మనుష్యుల్ని బట్టి వచ్చివుంటుందనీ, కట్టడాల్లో లేదనీ, ప్రతిప్రతిపాదనకూ మినహాయింపు లుండక తప్పదనీ, మనం అనుకునేటట్టు, ఓ గులాబి రంగుగోడలమధ్య మేడయందు లేడీడాక్టరు ఒకావిడ విద్యానగరంలో కాపురంవుంటూ, ఆ మేడపరిసరాల్లో వుండే పాటకజనంమీద జాలిచూపులు బఱపుతూ వారికి తనచేతనైనంతలో సర్వేసర్వత్ర ఉచితంగా వైద్య సాహాయ్యం చేస్తూ వుండేది. అజ్ఞానులకు ఆరోగ్యపంథా బోధిస్తూ వుండేది.

ఆమెపేరు కుముద్వతి. పేరు కుముద్వతి అని చెప్పి ముఖం చంద్రబింబంలా వుండక పోతుందా అని వూహించేరుకనక : ఆమె ముఖం కేవలం రాక్షసిబొగ్గు వర్ణం. నవ్వితే మాత్రం ఆమెచుట్టూ వెన్నెల. ఓ వేళ చంద్రు నిలోకూడా ప్రాధాన్యం వహించేది నలుపే అయి ఆనలుపు పోలుపుగా నవ్వడంలో పుట్టిందే తెలుపని వొనిశ్చితాభిప్రాయానికి రాగల్గుతూ, ఈమె ముఖం కూడా చంద్ర బింబమే! అయినా మన కీకథలో ఆమె సౌందర్యంతో నిమిత్తం ఎంతమాత్రం లేదు. కొంతటి మతంలోకూడా నలుపురంగు బహూ కలుపుకోలుతనం గొలిపే మంచిరంగే అని—. అలాంటప్పుడు అందునుగుఱించి పూర్వ పక్ష సిద్ధాంతాలు చేస్తూ కాలయాపనం గావించుకునే కన్న, ఆమె కాశరీరచ్ఛాయ వుండడంవల్ల జరిగిన లోకోపకారం ఎట్టిదో కించిత్కథానకంగా వెంటనే తెలుసుకోవడమే ప్రశస్తం.

కుముద్వతి నివసించే మేడ కెదూరు గుండా రాజబాట కవతల "కిరోసీన్ డిపో" వొకటి వుంది. ఆ"డిపో" కాంపౌండు యొక్క లోపల్లంలో ఒక ప్రాకృతకుటుంబం వసియిస్తూ ఆ "డిపో" నంటిపెట్టుకు జీవిస్తూవుండడం కద్దు. కుటుంబం అని పెద్దది కాదు. ఒక ఇస్తోగు. మగడూ పెళ్లాం! వాళ్లు వాళ్లి

ద్దతికే సరిసడా వోతాటాకు చుట్టుగుడిసె కట్టు క్కూపరం వుండేవారు. వాళ్ల కుటీరాన్ని అంటి, పక్కనే వొక నల్లతుమ్మమొలక పెరుగుతూ చూచేవాళ్లకు కానవాలుగా కనిపిస్తుంది.

కుముద్వతి మొట్టమొదట్లో తనచూపులా నల్లతుమ్మమొలకమీదనే వాల్చింది. ఆదికారణం దానిచాయ తనచాయను వొకటిగా వుండడమే! మరి వర్షాకాలం వచ్చేసరికి ఆమొలకబెరడు నల్లన, పత్రం ఆకుపచ్చన, పువ్వు పసపువన్నె, యీ మూడు రంగులు ముచ్చటగా చూపిస్తూ వానగాలి కూగుతూవుంటే కుముద్వతి తనమేడమీదనుంచి కొన్ని వేళ్లుగా దాన్ని తన్మయసంభ్రమంతో తలపోసింది. రెండుమూడేండ్లు గడచినాక క్రమేసు, ఆచెట్టు సరసనే ఒకగుడిసె వుండని, ఆ గుడిసెలో పామరు లిరువురు దాంపత్యం కుదిరి నివాసంగా వుంటూ వున్నారని ఆమె తెలుసుకో కలిగింది. అప్పటికీ ఆమె వాళ్ల పేళ్లుగాని ఊళ్లుగాని పూర్తిగా కనుక్కోనే లేదు. ఊరికేనే ఆమె వాళ్లను చూడ్డాని కలవాటుపడింది.

వాళ్లిద్దరూ బసివీ బసవయ్యలు. బసివి భార్య: బసవయ్య భర్త. ఆశ్చర్య మెక్కడున్నదంటే వాళ్లిద్దఱూ శరీరంయొక్క అసిత వర్ణంలో పరస్పరం వారిలో వారు తీసిపోక పోవడమే కాకుండా, కుముద్వతిరంగుకు గాని, నల్లతుమ్మ కుంచపువ్వుకై వారపు కొమ్మ వన్నెగ్గాని ఏ మాత్రమూ తీసిపోరు. కాలు నలుపువాడల్లు వాళ్లిద్దఱి యొడళ్లూను.

వారియొక్క దైనిక జీవనవిధానం కూడా అర్థం చేసికోవడం మనవిధి. బసవయ్య గొడ్డ లుచ్చుకు పుల్లలు పగలకొడతాడు. వాని గొడ్డలి బలువాయి, మహానిశితం. ఆ గొడ్డలిపిడి మామూలు గొడ్డళ్ల పిడిలాగు ఏ బిల్లుకర్రతోనో [illegible] కాబడింది కాదు. నల్లని [illegible] తెచ్చి సాపు చేసి [illegible] దగ్గ[illegible] గొడ్డలి అది. దాంతో అతను [illegible] పగలగొట్టినా [illegible] లాంటి [illegible], [illegible]లాంటి [illegible] అనుకోండి. [illegible] ప్రయోగాలి. [illegible] గొడ్డలి మోసి [illegible] సరి[illegible], [illegible] [illegible] [illegible] ఎన్ని [illegible] [illegible] [illegible] పెరుగుతూ [illegible] [illegible] మూకీ [illegible] [illegible]! [illegible] మహా[illegible] కుముద్వతి [illegible] [illegible] [illegible] [illegible] ఎంత మాత్రమూ [illegible].

బసివి [illegible] [illegible] [illegible] ఆవాకు [illegible] ఆ ఆవల [illegible] [illegible] పెట్టి, వానిరొంటిమీద [illegible] [illegible] వాని వీపు [illegible] వుంటే బసవయ్య అడిగేవాడు "[illegible] ఎన్నిప్రవమ్ములు మోశావు?" అని—

అనీ వాళ్ల రోజువారి కుశలప్రశ్న!

***

బసివికి నెలతప్పింది. క్రమంగా నెలలు నిండినయి. తొమ్మిదినెలలూ పూర్తి అయి పదోనెలకూడా ఆక్రమింపున్నానికి చొరబడింది. ప్రస్తుతం సాయంకాలం కూడా ఆమె కిరోసీన్ [illegible]లూ డబ్బాలూ నాలుగో అయిదో ఎక్కడెక్కడి సందుల్లో [illegible] దించి తన గుడిసెకొచ్చి [illegible] [illegible] [illegible] మెచ్చింది. బసవయ్య [illegible] తన భార్య ముఖం [illegible] కనుగొనుకుల్లోకి చూస్తుకుంటానే, గబగబ గుడిసెలోంచి కూడదట్టు కొచ్చి, [illegible] [illegible] పెడుతూ అంది: “[illegible]! [illegible]! నాకీరోజు చాల గాబరగా వుంది” అంది. [illegible] “అన్నింటికి నారాయణమూర్తే వున్నాడు” అని [illegible] [illegible] [illegible] చీకటిలోనే ఎక్కడికో [illegible] పోయినాడు.

ఒక గంటన్నరసేపట్లో ఆ ప్రాంతం అంతా సద్దణిగింది. పక్షి లేదు, గువ్వ లేదు. గుడ్ల గూబకూడా గూడే ప్రధానంఅని అనుకొన్నట్టు ఎక్కడనూ పైకివచ్చిన జాడలేదు. గబ్బిలాలు కూడా యేఎక్కడ కెగిరిపోయినాయో గాని వాళ్లగుడిసె పక్కకు వెళ్లిన అజపజ కానరాదు.

***

ఏకాకిగా కిరోసీన్ డిపోకాంపౌండులో తన సొంతగుడిసెలో బసివి నొప్పులుపడుతూ వుంది. ఆకాశంమీదను “స్వైరవిహారధీరలై” సాంద్రనీలమేఘశకలాలు ముందు కొత్తగా ప్రయాణంసాగిస్తూ ఆగుడిసెమీదనే ఆగడియకు నిలిచి అంధకారాన్ని నివిడీకృతం గావిస్తూ విస్తరించుకు పోతూవుంది. దివ్వెలేదు, నువ్వు లేదు. గుడ్లగూబకూడా గూడేప్రధానం అని అనుకొన్నట్టు ఎక్కడనూ పైకి వచ్చిన జాడలేదు. గబ్బిలాలుకూడా యేఎక్కడకెగిరి పోయినాయో వాళ్లగుడిసెపక్కకు వెళ్లిన అజ పజ కానరాదు.

***

కుముద్వతి సహజంగా స్త్రీ అవడమే కాకుండా వైద్యురాలుకూడా అయి వుండడంచేత పెరివారి మూలుగుగాని మొఱగాని వినబడితే ఎంత నిద్రలో వున్నా ఏపుట పరిస్తూ వున్నా లేచి తెలిసికోవడం పరిపాటి.

తన మేడింటి గదిలో తాను కూర్చున్న సోఫాలోంచి లేచింది కుముద్వతి. “ఎవరా ఆ నొప్పులు పడేది?” అని వివేచన చేయ దొడగింది. బసివి అని నిర్ధారణకు వచ్చింది. ఆమె తన గదిలోని ఎలెక్ట్రిక్ దీపం స్విచ్ వేసి కిటికీ తీసి, కిటికీలోంచి బసివియొక్క దళకు టీరంమీదకు చూచింది. తనదీపపు వెలుక్కి-తా నచ్చుండకపోతే తిన్నగా వెలుగు వెళ్లి ఆకుటీరప్పుడు పడ్డమే కాకుండా, కుటీరద్వారం గుండా కుటీరంలోనికంటా ప్రసరిస్తూ వుండడం కనిపెట్టింది. ఆ వెలు గాలాగే అట్టేపెట్టి, కిటికీతలు పాలాగే తీసివుంచి, కుముద్వతి స్వీయసింహద్వారంబయట తాళంవేసికొన్న పైని నిర్గమించింది.

ఆమె తిన్నగా బసివివున్న చాయకు వెళ్లి, ఆకుటింటివాకిట నిలబడి “బసివీ!” అంది. బసివి ఆక్రితందాకా చీకట్లోపడి ఏంసద్దుకు ఏంచికాకు పడిందో, తదితర ప్రపంచానికి అగోచరం. కాని కుముద్వతి తన మిద్దె మీద లైట్ వేసికొన్న వెలుతురు గుడిసెలోకి జొరబారినప్పటినుంచీ, ఓ, గోగునార

నులకమంచం వాల్చుకు దానిమీద, కూర్చుండి పండీ, పండీ కూర్చుండి, బసివి నిసఃగు లేని ప్రసవవేదన పడుతూవుంది.

"అమ్మో" అని తన చనిపోయిన మాతృదేవతను స్మరించుకుంది. ఉత్తరక్షణమందే "భగవంతుడా! శ్రీ మన్నారాయణ మూర్తీ!" అని కేక వేసింది. ఒక్క నిమేషం ఊరుకుంది. మళ్లీ "నాయనో! ఈ బాధ భరించలేనుబోయి! ఎవరల్లా! అక్కడ?" అని ఎవరో చెంతనున్నట్టు అతిగా మతిలేని దానికిమల్లే సినాలాపం గావించింది.

గుమ్మందరిని కుముద్వతి రెండుసార్లు "బసివీ!" అని పిలిచి "తో డెవరూ లేరు? మంత్రసానినన్నా కబురెట్టకున్నావు కావేం?" అని సంబోధనతో వాక్యాన్ని సమైక్యంగానించి మిక్కిలి చనువుగా పలకరించింది.

ఆ పలకరింపు వినబడిందేమో బసివికి ప్రాణం లేచొచ్చినట్టయింది. కాని అప్పుడు ఎవరు పలకరించిందీ గుర్తింపు కానలేదు. అట్టే మంచంమీదమనిషి. మంచంమీదనే ఉసులుకోసం లేస్తూ, పైనుంచి వేలాడుతూ వున్న ఒకానొక తాటినారమోచి నాసరాగా పట్టుకోవడాని కుద్యుక్తురాలైంది. ఉద్యుక్తురా లౌతూ వొక్కకూ కెట్టింది. "ఒరే! మాంవా! నామాంవా! సమయానికెక్కడికో పోయినావుగదరా! చస్తూ వున్నాను. నన్ను మళ్లీ ప్రజల్లో పడేశే దిక్కు లేదటోయి! అబ్బా! అబ్బా! పగవాళ్లకన్నా వద్దు యీ ఆరాటం" అని కూకలోనే మూర్ఛై తనలో తనే శాంతించుకున్న మోస్తరుగా నిశ్శబ్దస్థాయికి వచ్చింది. మంచం మీద ఎదో వీలుగా తొంగుపుంది.

ఆకాశమ్మీాన మేఘం డబాడబా ఉఱుముడం ప్రారంభించింది. డబడబా ఉఱిమిందంటే, ఊరుమును సూచాగా మెఱిసిన మెఱపుల్ని నేతో ఉటంకించ నవసరం లేదుగా! ఏమోంపును కేయుంమో భోగసడవంతటి ప్రబోధ గావిస్తూ ఏతన్నిశీథసువాతావరణం చినుకుపినా మేఘంల్లో అలుముకుపోయింది. "ఈ కనబడే కాదంబినియొక్క సూదిమొన, ఆ కనబడే కాదంబినియొక్క దిమ్మాకారం లోని కెలా వెచ్చారు మాలంమాలం సమగ్రంవాలయమైయున్నని నల్లగన్నుమాదరిగా ఆవరించుకున్నాదో ఆకాశాన్నంతనూ!" అన్న ఆశ్చర్యమే నిద్రపట్టని ప్రతీప్రాణికి ఆరాత్రి!

అర్థం కాన్పైనా, అభ్యాసమైనా, ఆర్ద్రంగా వున్నదనో ఏమో అనకాశంకేసి చూసుకుంటూ బసవయ్య ఆచీకటిలో ఈ లేసుకుంటూ కరోసిన్ డిపో గేటుగుమ్మం దాటి తన గుడిసె చెంతకు వచ్చేడు;...

"సూరప్ప సికోక చుక్కల్లకోక"

అని ఎదో ఎక్కడ పట్టుబడిందో వో గాలిపాట విసిగేడు.

కుముద్వతి వాని రాగాలాపం వాని గొంతూ ఆలకిస్తూ, మాన వతీనివరహస్యాన్ని గుఱించి గర్భంగా పర్యాలోచించ సాగింది. "అరే! వీనిభార్య పడరాని నొప్పులు భరిస్తూవుంది. వీడు ఎక్కడికో పోయి, తన కూడా మంత్రసానినన్నా వెంటబెట్టుకు రాకుండా వొక్కడూ తిరిగి వచ్చినాడే! వీనిసట్టింట దీపంగాని చిపటీగాని లేదు.

ఏతట్టు చూచినా కుమారుడే కూడవే! ఇదీ! ఏమి వీని కేపాటు! ఏమి వీనికీ నిశ్చింత!" అని అత్యాగాన పడ్డపోయింది. లోలో మధ్య మధ్య తనలో ప్రాపవుతూవున్న జడిమ నుడుపుకోవటంకోసంగాను కుముద్వతి అలా తన ప్రాణుపోకలూ పినలించుకుంది. ఆవిదలింపుల్లో ఆత్మీయమైన ఆభరణాలు రెండు కంకణాలు మూడు గాజులూ చప్పుడు కాగా (రాత్రింబగలు ఆమె కంకణాలూ గాజులూ పెట్టుకుంటుంది. నగలు సర్వసాధారణంగా ఆరోజుల్లో కుముద్వతి మిక్కిలిగా చేయించుకుంది) ఆచప్పుడు విని ఆ నగలు తన చెంగున ముడి వేసుకుంది.— ... "ఎవరు నువ్వు?" అంటు ... అదలించేలాగ.

బసవయ్య ఆశ్చర్యపడి చూస్తున్నాడు. కంఠధ్వని ఆకర్షించుకున్నాడు. కనిపించకపోయినా "అమ్మగారూ! ఏందరా? దణ్ణాలు. పిల్లపుట్టినాడా ఏంటి?" అన్నాడు. కుముద్వతి వెంటనే "ఓరి బసవయ్యా! కట్టెలమోస్తూవున్న పిల్లాణ్ణి పడిచిపెట్టి ఆలస్యం చేస్తున్నావు! ఇప్పుడు ఈ అడుకూతురు ... ఇంకా దిగంతపు దిగువాయువు ... వుంది. విను విను. ఇప్పటి దగ్గర ... కట్టిన దాన్ని కనిపెట్టి చూడు. దీపం వెలిగించు" అంది విశాలమైన తనదృష్టి నిగిడ్చి.

బసవి కేంచి ... పై సంభాషణ పోల్చి అనుసంధించుకున్న దానిలా, చేయి విసిరింది తనని పేదసంజ్ఞ చీకట్లో కనబడక పోయినా, "అక్కర్లేదండమ్మా! వాణ్ణేం అనకండమ్మా! బిడ్డ పుట్టినట్టున్నాడు" అని అంది.

కుముద్వతి గుండెలు దడదడ కొట్టు మిట్టాడినయి ఆనుడి వినడంతోనే. "పిల్ల ఏడ వడం లేదు. చచ్చి పుట్టివుంటాడుకూడాను. ఓరి మొద్దూ! ఓరి మొఱకూ! నీవు మగవా డవు కావురా! దీపం వెలిగించు. అగ్గిపుల్ల గీయి! వేడెక్కించాలి బిడ్డకు" అంది కుము ద్వతి.

బసవయ్య చేతులు నులుపుకుంటూ "తల్లీ! యీ కిరోసీన్ డిపో కాంపౌండులో మేం కాపరం వుండేది, మేం పాటుపడేది అగ్గి పుల్ల వెలిగించుకొనిపద్ధతి కొడిగట్టే! నిప్పు చేసికొని పరతుకు లోబడే! దీపం పెట్టుకొని పాపాని కొడబడే తల్లీ! తల్లీ! రక్షించు! రక్షించు నిన్ను భగవంతు డిలా చూపిం చాడు మా కీర్తి దేవుడులా!" అని అన్నాడు నుడికారం పొడిగిస్తూ, పొడిగింపు లో బేలతనం వెలిబుచ్చుతూ, వెలిబుచ్చడం లో కాలంయొక్క విలువ తెలీక ఏమరిల్తూ.

కుముద్వతి కా తరుణమందు వాని మనినీ మన్ననా కావాలీ? ఆమె వానిని విసివిననిదానిలా గ్గమనిస్తూ "యీలోకంలో బ్రహ్మ మీ యిరువురి దంపతుల్ని జ్ఞాన మార్జించుకోని పద్ధతిని అవతరింపజేశ్శాడు అను! కిరోసీన్ డిపో యజమానిమీద నెపం మోపుతా వెందుకు? అగ్గిపుల్ల గీయరాని పద్ధతి నంటా వెందుకు? ఆలా రా! ఆమంచం యీ వెలుగులోకి పట్టు!" అని పిల్లాతల్లీ వున్నమంచం తానూ బసవయ్యతోపాటు సాయంపట్టి, మెల్లిగా దించింది,— తన కిటికీ గుండా వచ్చి పడుతూవున్న విద్యుద్దీపకాంతి బిడ్డని నాభీకమలంమీద పడేటట్టు: స్వకీయ సహజకవోష్ణర క్తరాగాంకితమృు లైన మెత్తని అరచేతు లా శిశువుమీద ఆంచింది. కుము

ద్వతి నిసువును నిమిరింది. ఎత్తుకొని రాచి తల్లినెత్తురు పల్లలోనికి ధారాళంగా ప్రవహింపుగానేటట్టు పొడుగుతూ గీచి కొంత పరిశ్రమ గావించింది. పై ఆకాశం ఆమెకు తోడ్పాటవుతూ, కంచు అరిణేణాం మోగింపులా, సిత్తళిపళ్లెం వాయింపులా ఉఱిమింది. బిడ్డడు ముజ్జగాలకూ బ్రహ్మానందా గలిగేటట్టు కేర్ మన్నాడు. ఆగలే. కేర్ కేర్ మన్నాడు. పట్టరాని ఏడు పేడ్చాడు.

"బసవయ్యా" నీవు అదృష్టవంతుడివి వోయి!" అని కుముద్వతి తాను తెస మొగ నెప్పుడూ తాళంచెవుల్తో పాటు ఉంచుకునే శస్త్రచికిత్స సంబంధమైన పరిశుద్ధపు గూరిక తీసి, బొడ్డుకోసి, తగు దారాలతో ముడివేసి "నీనీళ్లూ నిప్పులూ నీవు చూచుకో ఇంక" అని తెలతెలవారుతూ వుండే వచ్చి తన యింట విశ్రాంతి పొందింది.

***

ఏడెనిమిది నెలలైనతరువాతి సంగతి యీపైని విలిఖించేది. నగరంలో ఒక ఉపన్యాసకురాలు స్త్రీజనానికి అతిగంభీరంగా వుపన్యసిస్తూ వుంది. ఆసభకు బీదాసాదా అన్నిరకాల ఆడవాళ్లూకూడా వచ్చి కూర్చున్నారు. లేడీడాక్టర్ కుముద్వతి అధ్యక్షత వహించింది — బసివి నానాటికీ పూర్వంకన్న లోకజ్ఞానం అంతో ఇంతో శ్రుతపర్చుకుంది. కాని పేదరాలు కావడంచే మాట చాకచక్యమే చూపించగలిగేది కాని కట్టుబట్టల్లో ఎప్పటి చొప్పే ఉప్పు లేని ముప్పొద్దు బతుకే.

బసివికి కలిగిన కుఱ్ఱ ఏడెనిమిదినెల్లవాడైనాడు. ముద్దుగా బొద్దుగా పెరిగి చాయలో తల్లిగ్గాని తండ్రిగ్గాని బిరుదియ్యనన్నట్టు పాకుతూ లేస్తూ కనబడేవాడు.

ఆ బిడ్డడికి మెళ్లో ఆకాశపలప్పూసల పేరొకటి వేసి ఆబిడ్డనెత్తుకు బసివికూడా ఆసభకు వచ్చి సభామధ్యమందు కూర్చుని ఉపన్యాసకురాలు చెప్పేముక్కలు నాలుగూ చెవిని పడేసుకుంటూన్నది.

ఉపన్యాసకురాలు చివర మఱచిపోరాని ముఖ్యాంశంగా యీ వాక్యం చెప్పింది. ఇంకా స్ఫూర్తిగా చెప్పితే. "మీరు వెలుగు కొంగనిష్ఠరిలో జీవించేటప్పుడు (అనగా ఆమె అభిప్రాయం వెలుగు అంటే విజ్ఞానం అని) మీరు మానుష్యజాతి సంఖ్య పెరగనివ్వరాదు. మీకు పిల్లలు పుట్టని మీరు మీమీ మగవారిచేత ఎంతమాత్రం చేయించుకోకూడదు; అనగా ఏమి? మనకు సంభోగ ప్రక్రియ నశింపవలాలి!" అని ఖచ్చితంగా గ్రాహ్యంకరించి చెబుతూ వుంది.

అట్టి రసకందాయపట్టులో బసివి తన పిల్లడిని సమోదంగా పైకి లేచినిలిచి "ఓ ఉపన్యాసమ్మగారూ! అదీ లేకపోతే మేం చచ్చిపోతాం తల్లీ ఈ అంధకారబంధురంలో పడి. తల్లీ! మాకు భాగ్యభోగ్యాలు లేనే లేవు. అదైనా వుంచండి" అని నమస్కారం చేసింది. ఉపన్యాసకురాలు గుడ్లెఱ్ఱచేస్తూ "అదంటే?" అంది. బసివి "మగవాని ప్రేమ! మగవాని పరిమళం! మగవానిఅండ!" అంది.

సభంతా నవ్వుతూ కరతాళధ్వనులు గావించి లేచారు. బసివి చంకనున్న బుడుతడుకూడా తన చిట్టిచేతులు తట్టుకోబోయినాడు కాని వాని చేతులకు వాని మెడలోని పూసలదండ అడ్డొచ్చింది. అయినా వాని కరతాళధ్వనికి ప్రత్యామ్నాయంగా వాని మీది మహదాకాశం సరళంగా ఉఱిమింది;

అందఱూ పైకి చూచేరు. ఆసభమీద ఒకా నొక చల్లని మొయిలు నిరంతరయానం గావిస్తూ కుముద్వతిమీద అమృతపు చినుకు కురిసింది.

కుముద్వతి బసివితో "నాటికి నేడు విన్నాను మళ్లీ నీ గొంతు బసివీ!" అంది. బసివి "అవునంటారా! కాదంటారా! అగ్గి పుల్లా లేక అదీ లేకపోతే చచ్చిపోమండీ మేం. సొప్పండీ!" అంటూ వెకిలి నవ్వులు నవ్వుకుంటూ, బిడ్డని పెదవుంకు తన చేపొచ్చిన పాలిండ్లందిచ్చుకొంటూ "సెలవు తల్లీ"! అని వెళ్లిపోయింది.

బసివిబిడ్డడు తనను పెనుదిరిగి చూస్తూ వుంటే కుముద్వతి అభినందనపూర్వకంగా "రా! రా" అంది కాని వస్తాడా? కావాలంటే కలుగుతారా బిడ్డలు?

ఫలశ్రుతి

దామెర రాజగోపాలరావు

నిన్న రాతిరి లేత వెన్నెలలు విరిసి
పుష్యరాగకాంతు లొలుకబోసినట్లు;
హాయిగా విహంగములు కులాయములను
బెదరు తొణకని గాఢంపు నిదుర మునిగె;

విరుల నెత్తావి ముత్తాల బరువు మోసి,
అలసటను సోలి, సుప్తి పత్రాళి నొదిగి,
సుంత కనుమోడ్పుగాడ్పులు శాంతి కుసర
మధుర మలయ సమీరకుమారమూర్తి!

ప్రేమమయి నిశాసఖి శశిప్రియునితోడ
ప్రణయ కలహాన కంఠహారములు త్రెంచి
పారజల్లిన మౌక్తికహారమట్లు
గగనవీథి నెల్లెడ తారకలు రహించె!

ప్రేయసియు నేను వాహ్యాళి వెడలినాము,
విమల కోమల కౌముదీ వీథులంట;
అరుగుచున్నంత నాప్రియురాలు చెంత
కొలని కొలువున వికసించు కలువ జూపి,

'ప్రియతమా! చూచితివ, యిది? ప్రేమతోడ
మన విహారప్రదేశము సమాగమమున్న వేళ,
ఈ కొలని కలువను కోసి నాకు, నిచట,
నవ్వు కానుకగా నర్పించినావు నాడు;

మరల నీరేయి నిచట నీ విరిసి కలువ,
కొలనిలో సోలగ మరచికొనుము' యనియె;
విని నీరేయి మరల నిద్దాని నేను
ప్రియతమా! నీకు కానుక - నర్పింతు నంటి;

* * * *

* * * *

'ఈ రజని శూన్యమున శయనించి శశికి
నవ్వు కానుక లేని గాఢ సుషుప్తి జెందె,
అలుగ బోయు నిద్రాభంగ మగునో, యేమొ!
లేప వలదు, ప్రియా!' యని యాపె నన్ను!

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు*

నండూరి బంగారయ్య

౧

ప్రసిద్ధికి తగిన మాహాత్మ్యము అడుగడుగున కనవచ్చును. "దూరపుకొండలు నునుపు" అను సామెతగ కొందరు ప్రసిద్ధపురుషులసయి దూరమునుండి చూచినపుడున్న [illegible] వారితో నిత్యము మెలగు నవకాశము లభించినవారికి [illegible]. అదివరకు మనకు తెలియని యవలక్షణము లెన్నో గోచరించి "అయ్యో! మోసపోతిమి" యనిపించును.

కాని చిలకమర్తి లక్ష్మీనరసింహముగారినిగూర్చి నన్నో స్నేహము చేసినకొలది మనకు గౌరవ మధికమగును. "[illegible]" అను [illegible] నాటినుండి వారు సగము నేత్రహీనులై యుండెను. ఇప్పుడు నేను రాజమహేంద్రవరమున నివాసముగ [illegible] నాలుగుసంవత్సరములనుండి వారితో కలసిమెలసి తిరుగు నవకాశము మిక్కుటముగ లభించెను. ప్రతిదినము [illegible] ఒకటి రెండుగంటలయినను వారితో 'నిష్టాగోష్ఠి' సలుపకున్నచో మనస్సులో నొక విధమగు దిగులు. హృదయమున నొకవిధమయిన వెలితి తలచూపును. ఈ నాలుగు సంవత్సరములలో వారి చరిత్రమును గాఢముగ తరిచి చూచితిని. తరిచినకొలది దాని శోభ పెరుగుచున్నదిగాని తరుగుటలేదు.

౨

చిలకమర్తివారిలో లోపములే లేవా యని ప్రశ్నించుకొని రంధ్రాన్వేషకు లెవ్వరయినను వారి చారిత్రమును సూక్ష్మదర్శినీయంత్ర సాహాయ్యమున పరీక్షించుటకు పూనుకొన్నను వారిలో లోపములుగ గానవచ్చు లక్షణము లొకటి రెండింటికంటె గానరావు. సూక్ష్మముగ విచారింపబోయినచో వానిని లోపములుగ గణించుట సమంజసమా కాదా యను ప్రశ్నకు సమాధానము చెప్పుటకూడ కష్టము.



చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు

ఈనడుమ నొకసారి వారు జీవితములో తాము గడించిన ధనమునంతయు లెక్క చెప్పబోగా లక్షరూపాయలకు పయిగా తేలినది. శ్రీ పిఠాపురము మహారాజావారికి లక్ష్మీనరసింహముగారి సత్ప్రవర్తన మన్నను రచనాకౌశలమన్నను గౌరవము మెండు. ఎప్పుడిచ్చిననేమి వారు ఇంచుమించుగ నలువదివేల రూపాయలవరకు నిచ్చియుందురని లక్ష్మీనరసింహముగారే నాతో చెప్పిరి. రాజులయొద్ద నుండియు జమీందారులయొద్ద నుండియు అపారమైనధనము గ్రహించుట మనకవులకాచారమేగాని పుస్తక విక్రయమువలన లక్ష్మీనరసింహముగారు సంపాదించినంత ధనము సంపాదించిన కవు లింతవరకు మనవాఙ్మయమున లేనేలేరని చెప్పవచ్చును.

---

* డెబ్బదిరెండవ జన్మదినోత్సవమున కుద్దేశింపబడినది. — సం. బం.

ఒక్కొక్క పుస్తకము ఎనిమిదితొమ్మిది ముద్రణములకు తక్కువ పొందలేదు. పాఠశాలలలో పఠనీయగ్రంథము లుగ నిన్న మొన్నటివరకు వారివలనే నిర్ణయింపబడు చుండెడివి. పఠనీయగ్రంథములుగ చేయవలసిన యోగ్యత్యము లేకుండకూడ ప్రజాదరణము వానికి మెండుగ నుండెను. ఈవయస్సునకూడ ఇంకను కష్టపడి గ్రంథ ములు వ్రాయుచు ధన సంగ్రహించుచునే యుందురు. ఇప్పటికిని రాబడిపన్ను చెల్లించునంతటి రాబడియము వారి కున్నది — అయిన నేమి? ఈయార్జన మంతయు నేమయిపోవుచున్నదోగాని యీవార్ధకమున సయితము వారికి దారిద్ర్యదుఃఖ మనుభవింపక తప్పుటలేదు. ఎప్పటి కప్పుడే చేతకాసులేనివానివలె నిబ్బందిపడక తప్పుటలేదు.

మరల వ్రేలుపెట్టి చూపవలసిన ఒక్కదుర్వ్యసనము వారికి లేదు. పెద్ద పెద్దవానిమాట నటుండనిండు చివరకు పొడుముపీల్చుటగాని, చుట్టకాల్చుటగాని వారి కభ్యాసములేదు. రెండుపూటలను భోజనముతప్ప నిరు తిండియయిన నలవాటులేదు. శరీరతత్త్వముకూడ మంచిది. శాశ్వతమయిన వైకల్యము లొకటిరెం డున్నను చీటికి మాటికి "పప్పు దిన్నచో పైత్యము, చారు ద్రావినచో శైత్యము"అను తత్త్వముకాదు వారిది. అయినప్పు డార్జించినధన మంతయు నేమయిపోయినది? హృదయము నవనీతమువంటిది. అనాథులకు సాయము చేయుటలో వారిధనము హారతికర్పూరమువలె కరించి పోయినది. "నాదగ్గర నున్నప్పు డిచ్చినాను. ఇప్పుడు నేనే యిబ్బంది పడుచున్నానుగదా! వారికర్మము వారిది" అని (యీనాడుకూడ) సరిపెట్టుకొనలేదు వారు. ఎక్కడనయిన అప్పు తెచ్చియయినను సాయము చేయవలెను. ఈహృదయ మార్దవమును లోపముక్రింద గణింపవలెనా? గుణముక్రింద గణింపవలెనా?

౩

ఒక్క బంధువుల విషయమునసే గాదు. ఎవ రిబ్బందిపడుచున్నను "అయ్యో చూచి యూరకుండ వలసి వచ్చుచున్నదే. సాయము చేయలేకపోవు చున్నానే"యని వారు పడుపరితాపమునకు మేరలేదు. పేదవిద్యార్థులకు స్కూలుజీతము నిప్పించియు, ఇచ్చియు — నిరుద్యోగులకు ఉద్యోగము లిప్పించియు, ధనిక లయిన తమమిత్రులతో చెప్పి — యవస్థపడుచున్న కవులకు పండితులకు — ధనసాహాయ్యము చేయించియు తుదకు వీరియు వీలుపడనిచో సభాముఖమున వారిని ప్రశంసించి ప్రసిద్ధి గల్పించియు — ఈతీరున నేదోయొక సాయము చేయనిదే వా రుండలేరు.

సాధారణముగ కవులలో గనవచ్చునసూయ వీరి కడ లేదని చెప్పవచ్చును. తనకంటె చిన్నవారును అభివృద్ధిలోనికి రాదగినవారును అనువాజ్మయసేవకులను మెచ్చుకొని వారికి ఉత్సాహముగల్పించుటలో నంతగ విశేషము లేదు. తనతో సమవుజ్జీలుగ పరిగణింపబడ నంతవరకు ఇతరులను మెచ్చుకొనుగుణమును కొంత వరకు మనము మరికొందరుకవులయందును చూడవచ్చును. సమవుజ్జీలను మనసార మెచ్చుకొని గౌరవించుట యందే యౌదార్యము నిరూపితమగుచున్నది.

పానుగంటివారి కేదయిన సన్మానము రాజమహేంద్రవరములో చేయింపవలెనని వీరు తమయాంతరంగికమిత్రులను ప్రబలముగ ప్రోత్సహించుట నాకు తెలియును. ఆ యుద్యమము నిపుడు ఫలింపకపోయినచో అది వారిలోపము కాదు ... అంతేకాదు. వెనుక సీతాపురములో పానుగంటివారి డెబ్బదవజన్మదినోత్సవము జరుపవలెనని ఉత్సాహపూరితులు కొందరు యువకులు తలపెట్టినప్పుడు దేహములో ననారోగ్యముగ నున్నను వీరు దాని కధ్యక్షత వహించుట కొప్పుకొనిరి. అధ్యక్షత వహించిన శ్రమవలన అనారోగ్య మధికమయి వీరు తరువాత ఎంతో బాధపడుటకూడ నాకు తెలియును. ఇప్పటికిని పానుగంటివారికి జరుగవలసినరీతిని సన్మానము జరుగలేదే యనుచింత వీరి కున్నది.

కవులలో ననూయకంటెను తరచు గనవచ్చు నవలక్షణము అహంభావము. నిన్నగాక మొన్న కన్నులు తెరచి గణములు నేర్చుకొనుచు తప్పులతడికగీతపద్యము లల్లుచున్న బాలకవికిసైతము నన్నయ తిక్కనలతో సహా ఆంధ్రసారస్వతమున తనతో సమానమయినకవి లేడను నభిప్రాయము — నలుగురు పిచ్చివానిగ పరిగణింతురేమో యని పైకి ప్రకటింపకపోయినను — లోలోపల మన

స్సులోనయిన నడిగియుండును. తనతో సమానుడు ఇంకొక డున్నాడని యంగీకరించుటయే దుర్ఘటమై నపుడు అధికు డున్నాడని యంగీకరించుట అసంభవమని వేరె చెప్పవలెనా ?

ఈ స్వాతంత్ర్యము లక్ష్మీనరసింహముగారిపట్ల వర్తింప దని నేను మనస్సాక్షిగ వచింపగలను. నిజమునకు లక్ష్మీనరసింహముగారి గ్రంథముల కున్నవ్యాప్తి ఏ యితరాంధ్రగ్రంథములకును లేదు. ౧౯౨౧-వ సంవత్సరమున అప్పటికి గయోపాఖ్యానము డెబ్బదియైదువేల ప్రతులు కర్చయిన వని వీరు నాతో లెక్క చెప్పిరి ఒక్క గయోపాఖ్యానము మాత్రమే గాదు — నాటకములలో ప్రసన్నయాదవము, పారిజాతాపహరణము, చంద్రహాసము మున్నగువానికిని నవలలో హేమలత, అహల్యాబాయి, రామచంద్రవిజయము, కర్పూరమంజరి మున్నగు గ్రంథములకును ఇంచుమించుగ గయోపాఖ్యానమున కున్నంతవ్యాప్తియు నున్నది. — ఒకప్పుడు వీరిపుస్తకముల కున్నవ్యాప్తి పూర్వమందుగాని ప్రస్తుతమందుగాని ఏయితరాంధ్ర గ్రంథమునకు లేదన్నచో అతిశయోక్తి కాదు. "అల్లుడా రమ్మని", "అరగినాడను కొండంత 'గూళతోడ", "ఆడుచున్నవాడె యభిమన్యు డలనొక", "కసిచుని రొన్నడైన" ఇత్యాది వీరిపద్యములు బండిదోలుకొనువాడు, పశువులనుగాచుకొనువాడు మొదలుకొని నటశేఖరుడు, నటచక్రవర్తి వరకు నందరును పఠించి యానందించువారే- ఇంత ప్రజాదరణ మున్నందులకు మరియొక కవికయినచో నెంత తలతిరిగిపోయి యుండెడిదో ! ఇట్టిచో కొందరు మిత్రులు వీరికి "కవిచక్రవర్తి" అనుబిరుదము నియ సంకల్పింపగ "ఆబిరుదమునకు నేను తగను. నాకు ఏ బిరుదులును వలదు" అని వీరు వారించిరి.

ఈసందర్భమున వ. సు. రాయకవిగారిపయి వీరికున్న గౌరవమునుగూర్చి కూడ వ్రాయవలసి యున్నది. —శాఖాభిమానమును పురస్కరించుకొనియు వాదాభిమానమును పురస్కరించుకొనియు వాఙ్మయ విమర్శనము విజృంభించుచున్న యీదినములలో "గుణాః పూజాస్థానం గుణిషు న చ లింగం న చ వయః" అను వార్యోక్తి నాచరణములోనికి దెచ్చు లక్ష్మీనరసింహముగారివంటి సజ్జనులను తలంచుకొనినపుడు ఏయాంధ్రునికి గర్వ ముదయింపకుండును? నిజమునకు వ.సు.రాయకవిగారి గ్రంథములలో — భక్తచింతామణి, వేణీసంహారముతక్క — తక్కినవాని కంతవ్యాప్తి లేదు. వానికయినను లక్ష్మీనరసింహముగారి గ్రంథముల కున్న వ్యాప్తి లేదు. అయిననేమి? "ఒకశతాబ్దము ఈ మధ్య సుబ్బారాయడుగారితో సమానమైనకవి లేడు" అని సభాముఖమున వీరు పదేపదే ప్రకటించుచుండురు. తన కంటెను, తనకు గద్యరచనమునను సంస్కరణోద్యమమునను మార్గదర్శకుడయి ఆధునికాంధ్రవాఙ్మయ నిర్మాతయని పేరువడసిన వీరేశలింగముగారికంటెనుకూడ[1] స్వతంత్రకవిత్వమున సుబ్బారాయడుగా రధికులే యని వీరు తరచు నాతో చెప్పుచుండెడివారు. ఈ యభిప్రాయమున సార మున్నదా లేదా యనుట మన కప్రస్తుతము. చిలకమర్తివారి నిరహంభావశీలమునకు మాత్రమే అది మంచియుదాహరణము.

వ.సు.రాయకవిగారి చిత్రపటమునురచించువరకు వీరు గుండెపెడ సుబ్బారావుగారిని నిలువనీయలేదు. దానిప్రదర్శనోత్సవము జరుపువరకు నన్ను నిలువనీయ లేదు. సహస్రమాసోత్సవముకూడ వీరిప్రోద్బలముననే జరిగినది. ఆ యుత్సవము జరుగువరకు సుబ్బారాయడుగారు జీవింపరేమో యని వీరు పడినయాందోళనము, ఆ యుత్సవము జరిగినవెనుక వీరు పొందినయానందము చూచితీరవలెను. "ఇక మనకు ఏ బెంగయును లేదు. సుబ్బారాయడుగారికి జరుపవలసినఉత్సవము లన్నియు జరపితిమి" అని వీరు ఎన్నిపర్యాయములు సంతోషించిరో లెక్క చెప్పలేను. ఇట్టిసౌజన్యనిధికి నిలయమైన రాజమహేంద్రవరమును ఆంధ్రదేశమును ధన్యములు గదా !

౪

లక్ష్మీనరసింహముగారి రచనములకు వాఙ్మయమున నెట్టిస్థాన మీయదగును ? అనుప్రశ్న మీవ్యాస

---

1. భాషాంతరీకరణకౌశలమున వీరేశలింగముపంతులుగారిదే పైచేయి యని వీరి యభిప్రాయము.

మునకు అప్రస్తుతము. వారి సహవాససౌఖ్యము లేని వారికి తెలియని యంశములనమాత్రమే కొన్నిటిని ఇట సూచింతును.

వారితో నొక్కనిముసము గూర్చున్నను వారి ధారణాశక్తి యద్భుతముగ తెలుపును. వారు సంస్కృతమును స్తోత్రవర్గము వచ్చినవెనుకనే నేర్చుకొనిరి. ఏశ్లోకమయినను వినికివలన కంఠతః పట్టవలసినదేగాని చూచి చదువుటకు వీలులేదుగదా. అట్టిచో వేనవేలు సంస్కృతశ్లోకములు — కాళిదాసు భవభూతి మున్నగు మహాకవులవి — వారు కంఠస్థము గావించుకొనిరి. ఇక వారికి వచ్చిన తెలుగుపద్యముల సంఖ్యకు పరిమితియే లేదు. ఇంతేకాదు తమస్నేహితులలో నెవరియింట నేశుభకార్య మెప్పుడు జరిగినదో, ఏయేపిల్లలు ఎప్పుడు పుట్టిరో తేదీవారిగా చెప్పగలరు. హిందూదేశ చారిత్రమునందలి తేదీలనుగాని కాంగ్రెసుసభల తేదీలను ఆతేదీలను అధ్యక్షతవహించినవారి పేర్లను గబగబ గ్రుక్కతిప్పుకొనకుండ వారు చెప్పునపుడు బహువినోదముగ నుండును. కందుకములను పైకి క్రిందికి ఎగురవేయుచు క్రీడించు గారడీవానివలె వీరు ధారణాశక్తిని ప్రదర్శించుచు ఇతరులను ఆశ్చర్యమగ్నులనుగా జేయుచుందురు.

వీరికడ ప్రతిభకంటె ధారణయే అధికమేమో యని నాయనుమానము. ప్రాచీనకవులగూర్చి ముచ్చటింపవలసి వచ్చినపుడు ఆకవుల లోపాలోపములను గాని ప్రత్యేకలక్షణములనుగాని వీరు గ్రహించిరో లేదో చెప్పుటకు వీలులేనంతటి యుత్సాహముతో ఆయా కవితావాహినులలో జలక్రీడ లాడుచుందురు.

ఇటీవల నుపన్యాసోద్యమము వచ్చినవెనుక దేశమున నెక్కడ చూచినను తెనుగులో మనోహరముగ నుపన్యసించువారు గనవచ్చుచున్నారుగాని మాచిన్నతనములో నుపన్యాసకులనగ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారే యనునంతటివాడుక యుండెను. నేను మొట్టమొదట వీరియుపన్యాసమును ౧౯౧౬ లో కాకినాడ బ్రహ్మసమాజవార్షికోత్సవసమయమున వింటిని. అప్పుడు దానికి 'నయాగారా' జలపాతమునకువలె నొక్కవేగము. ఇప్పు డావేగమును తగ్గించి సభ్యులందరు తాము చెప్పినదానిని గ్రహింపదగినధోరణిలోమాత్రమే మాటాడుచుందురు. నడుమ నడుమ హాస్యరసపూర్ణములయిన కథలతో విషయమునకు సంబంధమునుగనే మాటాడుచుందురు, గాని ఓపికతీరునట్లుగ నుపన్యసించుపద్ధతి వీరియందు లేదు. చక్కని యంగోపాంగవిభజనము చూపుచుందురు. ఎటువచ్చినను వారిలో నేర్పుగానడచిన భావగాంభీర్యముగాని కళాసౌందర్యముగాని కానరావు.

సాధారణముగ కవులు నిర్గర్వబలవత్ జనసంఘమునకు దూరముగ నుందురు. సభ్యులలో గలసిమెలసి యుండ నేరరు వారిట్టివారు. "ఏదో దుర్గమునకు వారే సేనాపతులు" అనినట్లుగ వారిసరి నక్షత్రమానమున్నవారతో వారియింటికి పోయి సంభాషింపవలసినదే. అదియయినను వారి గోత్రప్రవరలు ఫలాపేక్షలు మొదలగు నుపన్యాసములను తెలియజెప్పి యనుమతింపవలసినదేగాని మరమాటాడినచో ప్రమాదజన్యము. ఇతరుల ద్వారా యినను మాటాడునప్పుడు నిమ్నకంఠము విని యనుకరింపగల శక్తికూడ కవులకు లేదు. లక్ష్మీనరసింహముగారి లక్షణము లన్నియు వీనికి విపరీతములు. ఆయనకు స్వర్గ్యారు పోనిచే విద్యాగర్వములు. హిందూసమాజమునుండి వారి యింటికి ఇంచుమించుగ మైలుదూరము. అంగవైకల్యముచే నడచుట కంతకష్టముగ నున్నను ప్రతిదినము వారు నడచి సమాజమునకు వచ్చువారు. వారున్నదును అపభ్రంశముగ మాటాడరు. ఒకవేళ నితరు లపభ్రంశముగ మాటాడినను దానికి సహించుకొనియుండని మానవసాంగత్యమునందలి వారివృత్తిని గ్రోలుచుండువారు.

వీరేశలింగముగారి చరిత్రమునందువలెనే వీరి చరిత్రమునందుకూడ స్వార్థత్యాగ మెక్కువగ నున్నది. తక్కినకవులవలె కవిత్వమునమాత్రమే ఆశ్రయించుకొని యూరకుండక విద్యాసంస్థలను నిర్మించుటయందును, పంచములను బాగుచేయుటయందును, బ్రాహ్మమతమును ప్రచారముచేయుటయందును, "దేశమాత", "మనోరమ" మున్నగుపత్రికలకు ప్రచురణకర్తలయి ప్రజలలో వాఙ్మయాభిరుచి దేశభక్తి పెంపొందించుటయందును — అత్యుత్సాహముతో పనిచేసి ఎన్నో కష్టములకు లోనయిరి. వీరేశలింగముగారు రాజకీయములలో

సాధారణముగా సరిపడకుండెను. అట్లుగాక వీరు "వందేమాతరము" దినములు మొదలుకొని ఇప్పటివరకు ప్రజాపక్షవాదులు. అయితే వీరేశలింగముగారికిని వీరికిని స్వభావములో నొక పెద్దతారతమ్య మున్నది. వీరిస్వభావము వారిస్వభావముకంటె మృదువు. అందుచే నెవరినయినను నొప్పించుటకు వీరు వెనుదీయుచుందురు. వారివలె వీరు యోధులు కారు. ఎంతటి యున్నతస్థానము నాక్రమించినవానినయిన నెదుగమెదుట త్రోలనాడగల శక్తి వారి కుండెడిది. అందువలననే వారు సాధించ గలిగినంత కార్యసాఫల్యమును వీరు సాధింపలేకపోయిరి.

వారు సంపాదించినంత ప్రబల శత్రువర్గముకూడ వీరికి లేదు. — ప్రజానురాగమును సంపాదించుటలో వీరికి స్వభావమాధుర్యము సర్వతోముఖాభిమానమును ఎక్కువ తోడ్పడుచున్నవి. స్నేహితులను సంపాదించుటలో వీరికున్న సాంకేత్యము అపురూపము. ఒక్కసారిగా పరిచయము చేసిన వానినయినను జ్ఞాపకముంచుకొని ఎప్పుడు కనబడినను తిరమంత తామే యనురాగము తొలకాడనట్లు పలకరించుచుందురు. హిందూనాటక సమాజమును నెలకొల్పిన స్థాపకులలో 'గాడీలు' మొదలుకొని శ్రీ కీ. శే. పిఠాపురము మహారాజా వారు, గౌ|| ప్రకాశము పంతులుగారు మున్నగు సంస్కర్తలు, జమీందారులు, దేశనాయకులవరకు నందరు వీరికి మిత్రులే. ఉన్నదియున్నట్లు అనురాగముతోపలుకు ఎవ్వరి మనస్సును నొప్పింపకుండు మాటామాధుర్యము వీరిస్వభావమున నున్నది. అట్లని తాము మెచ్చుకొనని నియమముల నుల్లంఘించుటకాని మాటలలో నసభ్యోక్తులకు దిగుటగాని ఎన్నడును గానము. మిత్రుల ఇండ్లలో జరుగుశుభకార్యములకు దయచేసినప్పుడు వీరిపక్కని కూర్చున్నచో వీరి ఇష్టాగోష్ఠి ఎంతమనోహరముగ నుండునో బోధపడును.

౬

నా కెబ్బదిరెండవ జన్మదినోత్సవము సంతాపహేతువుగ నున్నదికాని సంతోషహేతువుగ లేదు. ఒక్కొక్క జన్మదినోత్సవము వచ్చినదనగనే వీరిసహవాసభాగ్యము మన మనుభవింపదగినకాలములోనుండి ఒక్కొక్కయేడు తరిగిపోవుచున్నదనిన మాట. వీరు నాపయి గురియుచువచ్చిన వాత్సల్యమునకు వడ్డీయయినను ఇంతవరకు నేను జమకట్టలేకపోతిని. జమకట్టుటకు శక్తిగాని ఇచ్ఛగాని రెండును లేవు. కానిండు, ఈ ఋణము జన్మాంతరమునకుగూడ నిలుచుట నాకు లాభదాయకమేగదా !

ఎక్కడనయిన నేనుపన్యసింతునని తెలిసినచో దానికి వీరు హాజరగుచుండువారు. ఏదయిన నేను వ్రాసితినని తెలిసినచో అది తమకు వినిపించువరకు వదలువారు కారు. అనంతరము దానినిగూర్చి ఏ సుబ్బారావు పంతులుగారితోనో ఏ వ. సు. రాయకవిగారితోనో చెప్పి కుమారుడు విద్యాబుద్ధులు నేర్చుచున్నందులకు ఆనందించు తండ్రివలె హర్షాతిరేకమున నుప్పొంగువారు.

వెనుక నేను "విశ్వనాథశర్మ" అనువ్యాసమున హిందూసమాజ సభ్యులనుగూర్చి హాస్యమునకు కొన్నివాక్యములు వ్రాయగ నవి కొందరకు రుచింపలేదు. ఆరోజులలో నొకనాడు వాదోపవాదములు పెరిగి — ఒడలు మరపించుకోపమునకు తావిచ్చుటగాని అసభ్యోక్తులు పలుకుటగాని నాకలవాటు లేకున్నను, నాదుర దృష్టవశమున ఆనాడు లక్ష్మీనరసింహముగారు వినుచుండగ ఒకరినిగూర్చి అసభ్యముగ నిందించితిని. అది లక్ష్మీనరసింహముగారి చెవికి పిడుగుపడినట్లయ్యెను. "అయ్యా! మీ రాడినమాటలు బాగుగ లేవు. మీరు తొందరపడినారు" అని వారు నన్ను మందలించిరి. ఆనాడురాత్రి నాకు నిద్దురపట్టలేదు. మతిపోయినట్లయినది. మరునాడు ఉదయముననే లేచి లక్ష్మీనరసింహముగారి యింటికి పోయి వారిక్షమాపణ వేడుకొనుదాక నాకు మనశ్శాంతి లేకుండెను.

ఈ నడుమ వారు హిందూసమాజములో నడుగుపెట్టగనే నేనును వారును మరికొందరమును గలసి తరచు వాఙ్మయమునుగూర్చియే ముచ్చటించుకొనుట జూచి హాస్యమున నొకమిత్రుడు మాకు "బంగారయ్యనూకాలు"లో మేష్టరు లని పేరుపెట్టెను. "బంగారయ్యనూకాలు" అనుటలో నా కాధిక్య మీయవలెనని అభిప్రాయమునియుద్దేశము కాదు. మా యార్డిలో నా పేరుతో

నొక ఎలిమెంటరీపాఠశాల యున్నది — క్లబ్బులోని మా "బంగారయ్య స్కూలుకు" లక్ష్మీనరసింహముగారు — కవిరాజులు గనుక — రాజపోషకులు.

వారితో గలసి ఎక్కిన యుపన్యాసవేదికలు, సభాపఙ్క్తిని కూర్చుండి యారగించినవిందులు, అంతకంటె మిన్న మాధుర్య మొలుకుచుండగ నారగించిన హిందుస్థానాజములోని ఇష్టాగోష్టులు - ఇవన్నియు సినిమాచిత్రములవలె నా కనులయెదుట దిరుగుచున్నవి.

*   *   *

పవిత్రజీవితముకంటె మహోత్కృష్టకావ్యము లేదు. ఈ కావ్యనిర్మాత పరమేశ్వరుడే యగుటచే మానవులు రచించిన ఎట్టి యుత్కృష్టకావ్యమును దీనికి సరి రానేరదు తాము తమకావ్యములలో ప్రతిబింబింప జేసిన పవిత్రాశయములు కొంతవరకయిన తమజీవిత కావ్యములోగూడ ప్రతిబింబింపజేసికొను మహాభాగ్యము ఎక్కడనో కాని పట్టదు — అట్టి నిరుపమానభాగ్యమున కొప్పగులయిన లక్ష్మీనరసింహముగారికంటె పుణ్యపురుషులను సమాహారగము అర్పించుచు ఈ వ్యాసమును ముగించుచు.

చంపకం

కావలి శ్రీరామమూర్తి

పాత్రలు.

చంద్రగుప్తుడు
చాణక్యుడు
బిందుసారుడు – చంద్రగుప్తుని కుమారుడు
చంపకం – బిందుసారుని ప్రేయసి
సేవకుడు.

[చాణక్యుడు ప్రవేశిస్తాడు. మనిషి పొట్టిగా సన్నంగా ఉంటాడు. పొడుగైన గడ్డం అతని తెలివిని గంభీరాన్ని తెలుపుతోంది.]

“ నేను దరిద్ర బ్రాహ్మణుడను. మగధ దేశాధీశ్వరుని మంత్రిని. మామూలు మంత్రినా ? నే నెలా చెపితే అలా వింటాడు రాజు. నేనే రాజు, రాజే నేను. మాకు భేదం లేదు.

నన్ను కుమారుడు బిందుసారుడు ఎదిరిస్తాడా ? నామాటకు అడ్డుచెపుతాడా ? గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించినట్లుంది పాపం! అతనికేం తెలుసు రాజ్యపు స్థితి. ఇంకా యువరాజు కుర్రవాడు. అందుచేత మాటల్లో తొందరపడ్డాడు. అందుకే ఊరుకున్నాను. ఇంకోళ్లు అలా అంటే ఊరుకుంటానా ?

నందు డేమయ్యాడు ? నన్ను అవమానపరిచాడు – వాడు మట్టమయ్యాడు. వాడే కాదు, వాడివంశమే నశించిందని చెప్పాలి.

చంద్రగుప్తుడు మంచివాడు. నేనంటే ఎంతో అభిమానం. గౌరవం ఈమధ్య – అతను రాజ్యం వదలి సన్యసిస్తాడని తెలిసింది. నాతో ఇంకా చెప్పలేదేమో ? నా ఆజ్ఞ లేకుండా ఏదీ చెయ్యడే.

సేవకుడు

[వంగి నమస్కారంచేసి]

స్వామీ ! మహారాజుగారు వస్తున్నారండి.

చాణక్యుడు

సరే.

[చంద్రగుప్తుడు ఆజానుబాహుడు. రాజఠీవి తాండవమాడుతోంది అతనిలో. రాజలాంఛనా లన్నీ ఉంటాయి.]

గురువుగారికి నమస్కారం

చాణక్యుడు

విజయోస్తు.

చంద్రగుప్తుడు

ఏదో ఆలోచిస్తున్నారు గురువులు.

చాణక్యుడు

ఆలోచన కేముంది? కుమారా! రాజ్య విషయాలే. రాజకార్యాలన్నీ ధర్మంగా జరుగుతున్నాయా ?

చంద్రగుప్తుడు

తమవంటి ధర్మపరు లుండగా అధర్మానికి చోటేది ?

చాణక్యుడు

చంద్రగుప్తా! నువ్వేదో పనిమీద వచ్చినట్టున్నావే ?

చంద్రగుప్తుడు

[తలవంచుకొనును.]

చాణక్యుడు

నాదగ్గర సందేహమేమిటి నాయనా!

చంద్రగుప్తుడు

సందేహం కాదు. తమరు కోప్పడతారేమో అని

చాణక్యుడు

హార్యా! నీవొకటీ నేనొకటీనా? అలా తేడాయే వుంటే ఇన్నాళ్లుంటూనా? భయం లేదు చెప్పు.

చంద్రగుప్తుడు

నేను రాజ్యభారం ఇంక మొయ్యలేనండి. పెద్దవాణ్ణి అవుతున్నాను. ఏ అరణ్యంలోకో పోయి మిగిలిన కాలం ప్రశాంతంగా గడపాలని వుంది. కుమారుడికి యుక్త వయస్సు వచ్చింది. మీ ఆజ్ఞ!

చాణక్యుడు

అన్నీ స్థిరపరచుకొన్నావు. ఇంక నా సలహాతో ఏం నిమిత్తం?

చంద్రగుప్తుడు

గురువుగారికి ఆగ్రహం వచ్చింది.

చాణక్యుడు

లేదోయ్!

చంద్రగుప్తుడు

స్థిమితపడింది మనస్సు. కుమారుని మీకు అప్పగించి వెడదామని, తమరిని అందుకు ఒప్పుకోమని ప్రార్థిస్తున్నా.

చాణక్యుడు

[ఆలోచించుచు]

ఒక్కమాట.

చంద్రగుప్తుడు

మహాప్రసాదం.

చాణక్యుడు

యువరాజు - కాదు - కాబోయే రాజు నేను మంత్రిగా వున్నంతకాలమూ నా చెప్పుచేతల్లో వుండాలి. నాకు వ్యతిరేకంగా...

చంద్రగుప్తుడు

అదెంతపనిగనక. నాకొడుకు కాడూ నాడు?

చాణక్యుడు

[illegible]. చంద్రగుప్తా! బాగా ఆలోచించుకో నామాటలు. అలా నే చెప్పినట్లు వింటే అతన్ని ఈ సామ్రాజ్యాధికారానికి సార్వభౌముడుగా చేస్తా. వినకపోతే నేను ఆ నిముషమే సర్వనాశనం చేస్తా. నాకు అవమానం కలిగితే నావారు ఏమవుతుందో నీకే......

చంద్రగుప్తుడు

తెలుసును స్వామీ! కుమారుని చెప్పి గుండా ఒప్పిస్తాను.

చాణక్యుడు

ఎంత నిబ్బరం!

చంద్రగుప్తుడు

నామీద అనుమానమా గురుదేవులకి?

చాణక్యుడు

అక్కే.

చంద్రగుప్తుడు

సెలవు.

[తెర]

* * * * *

[చాణక్యుడు, చంపకం.]

చాణక్యుడు

చంపకం!

చంపకం

ఏం స్వామీ ?

చాణక్యుడు

నిన్ను వివాహం చేసుకుంటానన్నాడుట యువరాజు, నిజమే ?

చంపకం

చిత్తం.

చాణక్యుడు

అలా వీలుపడదు.

చంపకం

ఎలాగ స్వామీ!

చాణక్యుడు

యువరాజుని పెళ్లి చేసుకోకూడదు నువ్వు.

చంపకం

ఎంచేత దేవా ?

చాణక్యుడు

న న్నదిరిస్తున్నావా ?

చంపకం

ఎంతమాట ! మిమ్మల్ని ఎదిరించి బతకగలనా ?

చాణక్యుడు

నా కిష్టంలేదు మీవివాహం.

చంపకం

కారణం అడుగవచ్చా ?

చాణక్యుడు

నువ్వెవరో అత నెవరో తెలుసునా ?

చంపకం

ఆ ! నేను యువతిని. అతను యువకుడు.

చాణక్యుడు

ఆగు ! జాతి ?

చంపకం

ప్రేమకు జాతేమిటి ?

చాణక్యుడు

ఎంత గర్వం !

చంపకం

[వినిపించుకోక]

మీా రెప్పుడైనా ప్రేమించారా ?

చాణక్యుడు

ఆ ! నేను మౌర్యవంశాన్ని ప్రేమించాను. చంద్రగుప్తుని శిరస్సుమీాద సార్వభౌమకిరీటాన్ని మోపినది నా ప్రేమే !

చంపకం

అది ప్రేమ కాదు. నందవంశంపై నున్న మీా కోపం. మీాలో ప్రేమ నశించిపోయింది. ప్రేమంటే మీాకు అర్థం కానే కాదు.

చాణక్యుడు

[వి న క]

జాగ్రత్త ! నేను మంత్రిగా వున్నంత కాలం యువరాజు నిన్ను వివాహమాడడు.

చంపకం

[ఊరుకొనును.]

చాణక్యుడు

అతడు మగధసామ్రాజ్యానికి రాజు. భారత దేశానికి సార్వభౌము డవుతాడు. నీవో, ఒక వేశ్యవు. అతనికీ నీకూ సాటేమిటి ?

చంపకం

ప్రేమకు హెచ్చుతగ్గు లున్నవా స్వామీ !

చాణక్యుడు

నీవు వేశ్యవని కుమారునితో చెప్తాను. వదిలేస్తాడు.

చంపకం

నే నిదివరకే చెప్పి క్షమాపణ వేడేను. నన్ను విడిచిపెట్టదు. అదీకాక......

చాణక్యుడు

హుం! ఏమి టది?

చంపకం

మా ప్రేమబంధాలు మరింత బిగిసాయి మా కుమార్తెవల్ల.

చాణక్యుడు

[నవ్వుతూ]

కుమార్తె...కుమార్తె......

అయితే! నీపట్టుదల విడువవన్న మాట!

చంపకం

[మాటాడదు]

చాణక్యుడు

ఇంతకీ వేశ్యతో వివాహం శాస్త్ర సమ్మతం కాదు.

చంపకం

ప్రేమకు శాస్త్రాలు లేవు. ప్రేమకంటె పెద్ద ధర్మశాస్త్రం లేదు.

చాణక్యుడు

అయినా హిందుసామ్రాజ్యానికి చక్రవర్తి వేశ్యను పెళ్లిచేసుకున్నాడంటే ఎంత అవమానం! ఎంత అగౌరవం! రాజు ఆదర్శప్రాయుడుగా వుండాలి. తనే నీచజీవితం గడుపుతుంటే ప్రజలు ఎలా గౌరవిస్తారు? భక్తి ఏముంటుంది? రాజ్యపాలన ఎలా సాగుతుంది? నీమూలాన్ని బిందుసారుడు తల ఎత్తుకోలేడు ప్రజలలో.

చంపకం

యువరాజుకు అవమానం కలిగేది ఏమీ చెయ్యను. ఆయనకోసం ప్రాణమైనా ఇచ్చేస్తా. ఆయన కయిష్టమైన పని చేస్తానా?

చాణక్యుడు

నేనూ చూస్తా. ఎంతవరకు సాగుతుందో, మీ రెలా వివాహం చేసుకుంటారో.

చంపకం

నా హృదయం కలచిపెట్టకండి. యువరాజు నన్ను తిరస్కరిస్తే పోతాను. జీవితం సమాప్తిచేస్తాను. అతను నన్ను ప్రేమించినా ప్రేమించకపోయినా నేను ప్రేమించకుండా ఉండలేను.

చాణక్యుడు

ప్రేమ! ప్రేమ అని కలవరిస్తున్నావు. పో! నీ వెలా వివాహం చేసుకుంటావో చూద్దాం.

చంపకం

[ఇవతలకు వచ్చి]

నా హృదయం ఎంత కలవరపడింది. ఇంకా గుండెలు ఎలా కొట్టుకుంటున్నాయో? ......భయంకరుడు చాణక్యదేవులు. ప్రేమ అధికారానికి లొంగుతుందా? పిచ్చిబ్రాహ్మణుడు' అతని కేం తెలుసు ప్రేమతత్వం...... నా వివాహంవల్ల యువరాజుకి నష్టం వస్తుందిట. అలా నష్టమొచ్చేపని చేస్తానా నేను? ఇది నిజమో కాదో యువరాజుని ఇవాళే అడుగుతాను. అబ్బ. మనస్సెంత ఆందోళన పడుతోంది...నీచజీవితంట. మేము పెళ్లి చేసుకుంటే నీచజీవిత మెలా అవుతుంది?... పాపం! యువరాజుకి నావల్ల నష్టమా? ఏమో!

బాబూ! ఈ ఊహాలతో నాతల బద్ద లయిపోతోంది.

[పోర]

*   *   *

[యువరాజు సోఫామీద పడుకుని ఉంటాడు. చంపకం వీణ వాయిస్తూ పాడుతూవుంటుంది. యువరాజు ఊహల్లో ఊగ్యాల లూగుతున్నాడు]

బిందుసారుడు

చాణక్యులు నన్ను పిలిచి చంపకాన్ని పెళ్లిచేసుకోవద్దన్నారు. నాన్నగారుకూడా మా వివాహానికి ఇష్టపడలేదట. వారి ఇష్ట మేమిటి నా పెళ్లికి? పెళ్లిచేసుకొనేది నేనా వారా?......చంపకాన్నికూడా బెదిరించిన ట్లున్నారు మహామంత్రులు. పాపం! స్త్రీ హృదయాన్ని ఎంత నొప్పించారో? లేక పోతే నా దగ్గర అలా ఏడుస్తుందా? నాదగ్గర మాట్లాడ లేకపోయింది, మంత్రికి ఎలా జవా బులు చెప్పింది? చంపకం భయపడుతోంది. మంత్రిమాటలవల్ల కుమారైకు ఏదైనా అపాయం కలుగుతుందని. నే నుండగా అటు వంటిది జరుగుతుందా? నాకు అవమానంట మా వివాహం. ప్రజలు ఇష్టపడాలిట. ఇ వెక్కడిమాటలు? ప్రజలు నాతో చెప్పి వివాహాలు చేసుకుంటున్నారా? ... ఇ దెలా అంతం అవుతుందో తెలియడం లేదు. ఈ రోజున అటో ఇటో తేలిపోవాలి.

[ఇంతలో చంద్రగుప్తుడు ముందు, అతని వెనక చాణక్యులు వస్తారు. బిందుసారుడు లేచి నిలబడతాడు.]

బిందుసారుడు

నమస్కారం.

చంద్రగుప్తుడు

కుమారా! ఎప్పుడు పట్టాభిషేకం.?

బిందుసారుడు

[తెల్లపోవును.]

చంద్రగుప్తుడు

రాజ్యకార్యాల్లో నిమగ్నుడ వవలసిన వాడవు ఇలా వృథాగా కాలం గడుపు తున్నావు. ?

బిందుసారుడు

పెద్దలు మీ రున్నారుగదా అని.

చాణక్యుడు

ఆ పెద్దతనం మామీద వుంచావుకన కనా?

బిందుసారుడు

మీ ఆజ్ఞ ఎప్పుడు తలదాల్చ లేదు?

చంద్రగుప్తుడు

నీ వివాహంమాట?

బిందుసారుడు

అది స్వవిషయం. రాజ్యవిషయాలకీ దానికీ ఏమీ సంబంధము లేదు.

చంద్రగుప్తుడు

కుమారా! అట్లు కాదు. రాజు వివాహమే ప్రజకు చాల చాల ముఖ్యమైనవిషయం. రాజువైనదగ్గరనుంచీ ప్రజలదే నీమీద అధికారం. వారికి మాతృమూర్తి రాణి. ఆ రాణి ఎటువంటిదై యుండాలి? వేశ్యను రాణిగా పరిగణిస్తారా ప్రజలు?

చాణక్యుడు

[ఒక పెద్దనవ్వు నవ్వుతాడు.]

బిందుసారుడు

[చలించక]

ప్రజకు కావలసింది రాణి అవచ్చు. నాకు కావలసింది అర్ధాంగి, ఆత్మేశ్వరి.

చంద్రగుప్తుడు

ఎంత నేర్చుకున్నావ్.

బిందుసారుడు

....

చంద్రగుప్తుడు

గురువుగారిఆజ్ఞ జవదాటకూడదు నాయనా! నేను ఛాయను వివాహమాడనా?

బిందుసారుడు

ఆమెను మీరు ప్రేమించలేదో, మీకు హృదయమే లేదో. మీ ప్రేమకే బలముంటే, మీ మనసుకే ధైర్యముంటే ఆనాడే మీ ప్రణయమూర్తి ఛాయను పట్టపుదేవిని కావించియుందురు. మీ రాజ్యానికి ఏం లాభించింది ఆమెను వివాహమాడకపోవడం?

చంద్రగుప్తుడు

[పాతసంగతులు జ్ఞాపకంరాగా మనస్సు చివుక్కుమంటుంది. పైకి గంభీరంగా]

ఎవరితో ఈ మాటలు?

బిందుసారుడు

ఒక ప్రేమైకజీవి ప్రేమతత్వం తెలియని వారితో.

చంద్రగుప్తుడు

ఎంత ధిక్కారం! నన్నెదిరిస్తావా? మూర్ఖా!

చాణక్యుడు

చంద్రగుప్తా! తొందరపడకు. కుమారుడు యువకుడు... బిందుసారా! గురువుని తండ్రిని ఎదిరించకూడదు. అది నీకు శ్రేయస్సు కాదు. పితాజ్ఞ జవదాటనివాడే సుఖిస్తాడు. నిన్ను ఏదో ఒక సార్వభౌమునిగా చేద్దామనుకొన్నాను. నీ పట్టువిడు. నా మాట విను.

బిందుసారుడు

రాజ్యవిషయంలో మీ ఆలోచన లేకుండా ఏ పనీ చెయ్యను. కాని, నా వివాహం గురించి మీరు ప్రశ్నించడం న్యాయంకాదు. మీ రెంత చెప్పినా వినలేను...వినను.

చాణక్యుడు

చంద్రగుప్తా! యువరాజా! నే నీ దేశంలో ఇక వుండలేను. ఏ రాజుకోసం నా నెత్తురుబొట్లు పిండి నందవంశాన్ని నిర్ధూమధామం చేశానో, నా శక్తిని ధారపోసి రాజ్యాన్ని సంపాదించి సార్వభౌముని చేశానో, అతనికుమారుడు నన్నెదిరించాడు. ప్రశ్నించుట కధికారమే లేదన్నాడు. ఇంక నిలువలేను......

[సేవకుడు పరుగు పరుగున వస్తాడు.]

సేవకుడు

యువరాజా! యువరాజా!

బిందుసారుడు

[విసుగ్గా]

ఏం కొంప మునిగిందిరా?

సేవకుడు

అమ్మాయిగారు...

బిందుసారుడు, చంపకం.

ఏమయింది? ఏమయింది? త్వరగా చెప్పు.

సేవకుడు

గాఢమైనగాయాలు తగిలాయి.

చంపకం

ఆఁ! ఆఁ!

[మూర్ఛిల్లుతుంది. బిందుసారుడు ఆమెను తన తొడపై పడుకోబెట్టి విసురుతూ సేవకులకోసం కేకలు వేస్తాడు.]

సేవకుడు

మహామంత్రుల రథం అమ్మాయి కాలి మీదనుంచి పోయింది.

[బిందుసారుడు చంపకం తలను చేతితో పట్టుకొని చాణక్యునివైపు దహించేటంత కోపంతో చూస్తాడు. కళ్లమ్మట నిప్పులు రాలుతుంటాయి. ఏదో అనబోగా]

చంద్రగుప్తుడు

ఆఁ! ఆఁ! కుమారా! కుమారా!

చాణక్యుడు

[గంభీరంగా]

యువరాజా! తొందరపడకు. నాకు కోపం తెప్పించకు. తెలుసుగదా నందుడి సంగతి. రాజ్యంలోంచి వెళ్లిపోమను, పోతాను. అంతేగాని నన్ను అవమానించకు...

నాచేతితో పెంచిన మొక్కను నేనె తెంపియ్యలేక ఇన్నిసార్లు చెప్పాను.

[గబగబ నడచిపోతాడు.]

చంద్రగుప్తుడు

మీరులేని రాజ్యం నా కక్కరలేదు. నేనూ వస్తున్నా మీతో. ఈ ఉన్మత్తుడి రాజ్యంలో ఎవ రుంటారు ?

[పరుగుపరుగున పోవును.]

బిందుసారుడు

[ఒకనిట్టూర్పు విడిచి]

చంపకం! చంపకం!

చంపకం


ఊఁ! ఊఁ!

బిందుసారుడు

అమ్మాయిని చూద్దాం రా!

[తెర.]

[అన్ని నాటకాలూ మూర్తివి.]



అన్నా!

బొడ్డు బాపిరాజు

విను మో యన్న ప్రభాతభేరి మొరసెన్ వీనుల సుమాళింప; తూ
ర్పున బంగారుహజారపుస్వాలలుగ [illegible] సూరోదయం, బాం
ఛెను విశ్వంభర నాయన్న [illegible], [illegible] గ్రామము
పున లోలోన గుణింపుటకు [illegible]! సహో[illegible]త్సాహివై.

తెలుగుంగడ్డను బుట్టి తెన్గనుచు నీవే యన్న [illegible]యుం
గలనైనం దలయుత్తి వేమిర ? సమాజాఖ్యాల ఖలత్వ[illegible] చే
రల ద్రవ్యమ్ము గడించుకొంటి, [illegible] గల్లాస్పత్రులు [illegible]యు సే
వలు చాలై మ్మరుపెమ్ము! ముందడుగు మాసెన్ సిరుల్ మృన్నిటన్.

తన సౌందర్యము వంశగౌరవసరిత్రాణార్థమై తానటగా
అనలజ్వాలల కాహుతిన్ సలుపు కన్యాదేవి సౌశీల్యముల్
'తనయా! మేల్కొను మోయి!' యంచు జగియాసంధ్యావేళలన్ రక్తకాం
తిని యానాటిచితిం దలంపులకు నందించున్ గనుల్ విప్పరా!

ప్రతివీరస్మయహారి దక్షిణభుజాగ్రమ్మందు విశ్వంభరా
సతి విశ్రాంతికి నిల్లుకట్టిన యశశ్శాలుల్ సదార్థిప్రజా
స్తుతచింతామణు లైన గుప్తధరణీశుల్ పూర్వజుల్ నీకు, సం
తతిలోనం దలవంపు నీవలన ప్రాప్తంబయ్యెపో తల్లికిన్.

కవిరాజన్యుల కావ్యకన్యలకు శుల్కం బిచ్చి కొండంత పం
దువుగా పెండిలి పుస్తె గట్టిన గుణాఢ్యుల్ నీకుల శ్రేష్ఠులై
భవసాఫల్యము నొంద నీవా తనఖాపత్రా లసల్ ఫాయిదాల్
వ్యవహారంబులెదక్కి నొక్కి రసవత్పద్యమ్ము చేబట్టితే ?

'అన్నా'

చిరకాలమ్మున నుండి లోకములు లక్ష్మీపుత్రు డంచున్ సమా
దరముల్ సేయును నీవు వేలిడక లే దా దానధర్మమ్ము! ని
ద్దురలో నున్న కులప్రతిష్ఠకును మత్తుం దెల్పి కల్యాణ మం
దిరమందున్ నెలకొల్ప నీ దినమె నాందీపూజ గావింపుమా!

భువనమ్ముల్ నవజీవనోద్గతికి నాపోశించె, నూత్నస్వర
ప్రవణమ్మయ్యె వనప్రియామ్ము, అణువుం బ్రహ్మాండమున్ శోభన
చ్ఛవి తుల్యస్థితి దూగె; మైకపు తెరల్ జారన్ కులశ్రీ విప
న్నినహామ్ముల్ సడలింప నేడె తొలిబోణీ సేయ విచ్చేయరా!

శేరసారమ్ము లుడిగి ఫకీరు వగుట
అభిమానము గాదు! మొదల గృహమ్ము చక్క-
దిద్దుకొని సంసుమున కాత్మదేశమునకు
కీడు తొలగింప నడుము బిగింపు మన్న!



అవ్యక్త మధురిమలు

వెంపటి నాగభూషణం

ఆమె... ఒంటరితనము—

ఉషస్సుషమారాగములలో రాగసంపదలు అలవరించుకుని మధుపకుమారుని ప్రణయమున పులకించే శుభావసరమున... విధివిధానమున... ఇనకరగ్రీష్మ శనికారణమున... పద్మినికి... ఒంటరితనము—

ఆశ్రయగా పొత్తమున... వసివాడి, నేల కొరగి పోయే నవవల్లరి...

—ఇరువంకలా, తొమ్మనతింపరగా, ఆ అమ్మాయికి బంధువులు, నా అన్నవారు ... ఉన్నారు ... ఆ నాడు ఉదయమువరకూ... కొదువ ఏమీ కనుపించ లేదు; సాయంకాలము తిరుగకముందే... మిగిలినది ఏమీ లేదు: ఆమె ...ఒంటరిది;

ఇంట్లో అందరూ... తిరిగి వచ్చి, అనుభవించ లేని యమయాతనను నిద్రలో బలవంతముగా ముంచివేసి అవశులుగా పడిఉన్నారు. ఆమెను ఊరడించడానికి... సంగతి విచారించడానికి తగిన స్వాస్థ్యము ఎవరికున్నది? కడుపుదుఃఖము... ఆజన్మాంతమూ కోత; అందులో వయసు మళ్లినవాళ్లు... ఇక, ఆపదలో ఆదుకునేందుకు వచ్చిన ఇతరులు... కావలసినవాళ్లు... పవలంతా, అలసిపోయి...

అంతేకాబోలు—ఎవరున్నా, అయిన ఆడు[illegible]డూ లేకపోతే... ఇల్లు బావురుమంటూండదూ? గదిలో ...అలంకారము లన్నీ చీకటి కబళించివేసినది; ఎవరూ దీపము తీసుకురాలేదు అక్కడికి; అవసరమున్నా లేదు; ఆనందంలో వన్నెలలో మునిగితేలే లోకానికీ, ఆమెకూ మధ్య అడ్డుకట్ట. అంధకారము...

చిరిచాపమీద, కాళ్లు కెడ్డిగంవేసుకుని...కూర్చుని ఉన్నది; ఏడ్పు రావడంలేదు. ఆసంగతే మరచిపోయింది...పవలంతా, గుండె పగిలిపోయేటట్టు...అనిశ్చిత మూర్తిపాదములదగ్గర పడి... వెక్కివెక్కి...సోలిపోయి ఏడువడానికి ఓపికలేక... కన్నీళ్లు [illegible]పోగా... ఇప్పుడు... [illegible]... కన్నీరు, హృదయంలో [illegible] గడ్డకట్టిపోయిన [illegible] ఇగిరిపోయింది...

ఉదయం కాఫీ త్రాగి... [illegible]... మామూలుగానే, బయటికి వెళ్ళాడు [illegible] నుంచి... [illegible] వచ్చేటంతవరకూ [illegible]... [illegible] అయిపోయింది.

నోచిననోములలో ఏమికొరత వున్నదో... కాపురమునకు వచ్చినలగాయితు, [illegible], ఆమెను కన్నెత్తి [illegible] చూడలేదు. మరి [illegible] మనసులో కోరికలను... [illegible]... మనసులోనే మాటుపరచుకుని... [illegible] ఆతనికి ఏనాటికైనా మనసు తిరుగక పోతుందా అని; రోజులు గడిచి... నెలలు మళ్లిపోయి నవి: ఆతనిలో మార్పు ఏమీ కలుగలేదు, సరి, ఆనాటి కానాడు [illegible] మైపోతూవచ్చినాడు. ఆమె నేరము ఏమిటో తెలియదు...

తెలివితేటలు లేవా, అందగత్తె కాదా. [illegible] ఇచ్చినే ఆతనికి మనసువచ్చినట్టు నడుచుకోలేనిదా... ఆమెవల్ల లోపము ఏమిటి?

ఎన్నాళ్లో ఓపికపట్టి చూసింది. లాభము లేదని తోచినతరువాత ... చొరవచేసుకుని స్వయంముగా తన్ను అర్పించుకొనేందుకు సిద్ధమైనది... కులపాలికా సహజమైన లజ్జను విడిచి కాళ్లంటి బతిమాలుకున్నది... ఆతనిమనసు కరుగలేదు...

ఇంకొకరిని... ఎవరినన్నా ప్రేమించుతూన్నాడా? అసంశయము అనుక్షణమూ తోస్తూండేది. కాని,

అతనిప్రవర్తనలో... ఏదో మచ్చునకూ తావు కనపడ లేదు... మరి...?

ఉన్నట్టుండి, తలవనితలపుగా, ఆమె భాగ్య రాశి.. పండిపోయింది. ఆనాళ్ళ, రోజులాగానే ఆయనగదిలో, పాలూ, మంచినీళ్లూ ఉంచడానికి తీసుకు వెళ్లింది; సాధారణంగా, నిద్రపోతూండేవాడు... మీద చెయివేసి మెలకువ తెప్పించడానికి ఆమెకు... ఇది వరకు స్వాతంత్ర్యము లేదు... వచ్చినక్రొత్తలో అలా చేసినప్పుడు నిగురకనులతోనే... ఆతడు చూచిన చూపు... మనసున నాటుకుని ...ఎన్నటికీ కుదరని గాయం చేసింది;

—ఇంకా మేలుకునే ఉన్నాడు. దీపం వెలు గులో పడకకుర్చీలో కూర్చుని ఏదో చదువుకుంటూ... ఆమె ప్రక్కనుంచి అడుగులో అడుగు వేసుకుంటూ, తల పైవునఉన్న మేజామీద చేతఉన్నవి ఉంచి, ఓమారు ఓరగా ఆతను చూడకుండా... చూసి, నిట్టూర్పును అరికట్టుకుంటూ... తిరిగి వచ్చేస్తున్నది... గుమ్మా సమీ పంలోకి వస్తూండగా... దాటిపోకముందు, చేయిజాపి ఆమెచేతిని పట్టుకున్నాడు.

భయం వేసింది, ఒళ్లు ఝల్లుమని... పారవశ్యం గా మారిపోయి... ఆతనిచేతితో బాటు జరిగి వెళ్లి... కుర్చీ చూపుమీద కూర్చునిపోయింది... చాలా సంతోషంగా వెర్రి అయిపోయి, కంపించిపోతూ, ఆతనివంక చూడ లేక, తలవంచుకునే...అలా ఉన్నది...

లేచి కూర్చుని, వంచినతలను, చేతితో చుబుక మునకు అంగుళులు అన్చి ఎత్తి... కళ్లలోకి కళ్లు పెట్టి అవి చూపులా... ఘూర్ణిలుతూన్న ప్రేమవనధులు... అలా... అలా... దగ్గరకు జరిగి... మీదకు వాలి పోయి... ఆమె అప్రయత్నంగా అందించిన పెదవి మీద... పలుమొనచురుకు...

—వదలివేశాడు... పట్టు సడలినదే వ్యవధాన ముగా అక్కడ నిలువకుండా... బయటకు ఎలా వచ్చి పడ్డదో? విరహమున కాగిపోయిన... ఆమె కౌమారము అంతకన్న యెక్కువ తీయదనమును... భరించ లేదు...! ఆరాత్రి...

...తనగదిలోకి వెళ్లిపోయి...ఒంటరిగా రాత్రి వేగిరించడానికి— నిత్యమూ ఆమె పడే ఉసురుపాటు, ఆవేళ... తన్మయత్వంలో కలిసిపోయింది... ఎక్కడ లేని సత్తువా, సంతోషమూ... అడుగు ముందుకు పడనీయకుండా వెళ్లి ఆతనికౌగిలిలో ప్రాలమని... రెక్కలుపుతూన్నవి... కాని, వెనుదిరిగి ఆచాయలకు పోవడానికి, ఆమెకు ధైర్యం చాలలేదు... గదిగుమ్మం దగ్గిర, ద్వారబంధముమీదుగా నిటారుగా చేయిచాపి ఆనుకుని నిలిచి... మధురభావనల పునశ్చరణలో... స్థాయి చిక్కించుకుంటూ మొగమంతా వెన్నెలల మయమైపోగా... ఎదుటఉన్న భవానీమూర్తికి...ఇంత కాలమునకు వరదానమిచ్చిన కృతజ్ఞతను... అంజలితో నివేదించుకున్నది...

—అంతకాలము... ఎందుకు విముఖుడుగా ఉన్నాడు... ఆవేళ అనుగ్రహించడానికి... కారణం ఏమిటి?... మరునాడు ...మరల ఆశుభవేళను...తెలిసి పోతుంది... లాలించి... ఆతనిచేత, పలికించలేక పోతుందా... ఇక ఎన్నటికైనా... విడువనిస్తుందా... కాని...

ఉదయం, ఆతడు కనపడీకూడా పలుకరించ లేదు; అదివరకు, ఆమెకు అది క్రొత్తగా తోచేదికాదు ...కాని, గడచినరాత్రి, జరిగినది ...అస్ఫురణ, ఆతని చూపులలో చూచాయగానైనా గోచరించలేకపోవడం ...మనస్సు చివుక్కుమన్నది...

ఊరిచివరనున్న తోటకు, స్వారి బయలుదేరే అలవాటున, ఆనాడూ, కాఫీతీసుకుని, వెళ్లిపోతూం డగా... ఆమె చూసినచూపు ...అంతే... అదే ఆఖరు...

వెళ్లినపదిహేను నిమిషములకల్లా అప్పటి కప్పుడే స్పృహతప్పిపోయిన ... నిస్పందమూర్తిని ...లోపలకు ...పడిపోవడం చూసి, సాయమునకు వచ్చినవారు ...తీసుకునివచ్చి ...పరుండబెట్టినారు; గుర్రము బెదరి లార్రీక్రిందకు విసిరివేసింది ...గాయములు కనుపించడం లేదుగాని, స్పృహలేని స్థితిలోనుకూడా, ఉండి, ఉండి, మెలికలారిపోతూన్నాడు ...తలితండ్రులు మొదలంట కూలిపోయినారు...

—వైద్యసహాయము ...అవసరములేకుండానే ...మూసినకనులు శాశ్వతముగా ముగించుకునిపోయి నవి. ఇక ఆతరువాత...

వేయిపిడకలలు ప్రత్యక్షంగా అనుభవించిన యాతన ...కన్నీరుకు, రోదనమునకు అంతని ...దుఃఖము...

భోజనము చేయలేదు... ఎవరో, అలా పడి ఉండగా, ఒకమారు వచ్చి పలుకరించి, ఆమాట అన్నారు కాని... వినిపించుకోలేదు, వాళ్లూ మళ్లా రెట్టించ లేదు...

ఆమె ప్రణయజీవనము ... విచ్ఛిన్నమైపోవ డం ...బ్రతికిఉంటే ...ఎంతసుఖపడేదో ...ఎన్ని విధముల భోగములు అనుభవించేదో ...అవి అన్నీ తలచుకుని, ఏడ్చిఏడ్చి బరువు తగ్గించుకొనేందుకన్నా ఆమెకు ఓపిక లేదు...

అతడు ...పోయినాడా ...ఇంకా కన్నులలో మెలగుతూనే ఉన్నాడు... ఇక ఆజన్మకు కనపడడేనే? ...మనసిచ్చిన మచ్చికలో, అంతకాలము అలా అల యించడానికి కారణము, అతనితోటివంట తెలుసు కునేందుకు, ఇక అవకాశము లేదనే...

అతడు...లేకపోవడమేమిటి... అదుగో ఎదుట ...నవ్వుతూ... ఎంత ప్రసన్నంగా ...ప్రేమ ఉట్టి పడే చూపులతో... సమీపించుతూన్నాడో...! చీకటు లెక్కడ, గది అంతా వెన్నెలలమయమై కలకలలాడి పోతూండగా...

సమీపించి... మంచిదగ్గరకు వచ్చి... కౌగిలిలోకి తీసుకుని... రాత్రిఅంతా... ఆమెను ఎడబాయకుండా ఉండి... తెల్లవారి మేలుకొనేసరికి... కనపడక పోయినామాత్రం ఏమి? ... ఇదివరకుమాత్రం పవలు... మాటాడుతూండేవాడా?...

తెల్లవారినతరువాత... ఇంటిలోవా రందరూ మెలకువరావడం తడవుగా రోదనం ప్రారంభించారు... ఆమె, కనుకొలుకులలోనైనా... నీటిబొట్టు కనుపించ లేదు; మళ్లా ఎప్పుడు ...రాత్రి అవుతుంది... ఎంత త్వరగా, కనుపించుతాడు...

ఒకరోజూ... రెండురోజులు ...దశాహము కూడా అయిపోయింది. కడసారిగా, నిత్యమూ ఆమెకు అలంకారములుచేసి సుమంగళీభామినికను అభినయింప చేసినారు... రాత్రులు ...దానికి విని యోగమును... ఇంటినారు, కలలోనైనా తలచిఉండరు.

మాసమైనాడు... ఆపిడుగువంటివార్త తెలుసు కుని ఆమెతలితండ్రులు ఊరకేలు సరాసరిగా వచ్చి చేరుకున్నారు... కూతురిని కౌగిలించుకుని, వాళ్లూ, వాళ్లను చూసి... ఇంటిలోకూడిన బంధువులూ, ఘొల్లుమన్నారు... ఆ అన్యాయికి... నవ్వు వచ్చింది. ...ఎందుకు వాళ్లంతగా అలా ఏడవటం... తాను సుఖపడిపోతూన్నదనా?...

కాని, ఇది నవ్వుతాలా?... వాళ్లకు అర్థం అవుతుందా? పుట్టింటివారు, తీసుకువెళ్లారు ...అలా అయిపోయిందికదాఅని కూతురిని చూసుకుంటూ, మన సులో క్రుంగిపోతూ ...ఎరుగనంగా బావురుమంటే పిల్లదానికి గుండె చెదిరిపోతుందేమోనని .. పుట్టెడు దుఃఖమూ దిగమ్రింగి ...చిన్నపిల్లగా చూసుకుంటూ కాలక్షేపము చేద్దామనుకుని ...సమాధానపడుతున్నా రు మనసును. ఆమె, అంతగా విచారించకపోవడం చూసి ...కొంతచోద్యంగా ఉన్నమాట నిజము, కాని, పసిదిగదా ...లోకానుభవము చాలకపోవడంవలాన ...వచ్చిన కష్టముపరిమితి తెలుసుకోలేకపోతూన్నదను కున్నారు. క్రమముగా, మరచిపోయి ...నాలుగు కాలాలపాటు బ్రతికి వాళ్లకళ్లఎదుట బాగుండడమే, కావలసింది.

కాని... అక్కడ ఎంతోకాలం ఉండలేక పోయింది ...బ్రతికిఉన్నరోజులలో, అత్తవారిమీద విరోధాన ...వాళ్లగుమ్మం ఎన్నడూ తొక్కనూ లేదు: ఇప్పుడూ ఆపగ మరచిపోలేదన్నమాట. ప్రతి రాత్రి, అతనికోసం ప్రతీక్షించేది. కనపడేవాడు కాదు; అతన్ని చూడకుండా ఉండటం దుర్లభం ...అక్కడే ఉండిపోతే, తనమీదకూడా కోపంవచ్చి ...ఎన్నటికీ కనబడకూడదని పంతముపడితే ...ఏలా బతిమాలు కోవడం?— వెళ్లిపోవడమే మంచిది.

తలిదండ్రులను బతిమాలుకుని తిరిగి అత్తవారియింటికి వెళ్లిపోయివచ్చేసింది; బెంగపోయేందుకు అడిగేవాడే తడవుగా ...ఏపని చెప్పినా వారు చేస్తూండటంచేత, వెళ్లిపోవాలని ఉన్నదని చెప్పగానే ...తండ్రి వెంట పెట్టుకుని తీసుకువెళ్లి దిగవిడిచాడు; విప్రలంభం తీరిపోయినతరువాత నాథుని సాన్నిధ్యం లభించబోయే మహోత్కర్షం ఆ ముఖవళికలో కానుపించడం, ఆయనకు ఒక క్రొత్తవింతగా తోచింది, కాని, ఏమీ అనలేదు.

నిట్టూర్పులు విడుస్తూ, ఒకరిని చూసి ఒకరు, కోడలిని చూసి అత్తగారూ ...మళ్లా శోకంలో పడిపోయినారు. ఆమెకుమాత్రం, అంతా నవ్వుగా... ఖులాసాగా ఉన్నది; ఎప్పుడు ప్రొద్దు గ్రుంకుతుందా ...ఎప్పుడు ఒంటరిగా అతనితో ఉండిపోవడానికి వీలవుతుందా...

ఏలాగా?... ఇంకా కోపం ఎందుకూ, ఎదురుగుండా ఉంటే, ఆహ్వానించకపోయినా, మనసులో పొంగే పూచే ఆలోచనలకు అన్నిటికీ అతని ప్రాపకం ఉన్నదని, ఆమెకు తెలుసును... ఎలా నడుచుకోమని బుద్ధి పుట్టిస్తే అలా మెలగుతూన్నది.

వచ్చాడు... అతనిభావనామూర్తిలో అనురాగఝరులు, మగ్గి, తరంగితము చేస్తూన్నవి: అతనికిన్నీ ఈవిరహము దుస్సహమైపోయిన దన్నమాట:

క్రమముగా... ఆమెధోరణిలోకూడా మార్పు కనిపించింది: విషాదరేఖలు ఏనాడో మాయమైపోయినవి: చూసేవారికి... ఆమెదుర్దశ అవగతము కాకపోవడమే కాకుండా మీదుమిక్కిలి, అనుకూలుడైన అనురూపునితో హాయిగా కాపురం చేస్తూన్న ఇల్లాలి... తృప్తి ముఖమున నిత్యమూ తాండవించుతూండేది.

సాయంకాలము కాగానే... చక్కగా వేషము దిద్దుకుని... సరదాగా అటూ ఇటూ తిరుగుతూ... ఇంకా ప్రొద్దు మళ్లకముందే గదిలోకి పోయి తలుపువేసుకునేది... తెల్లవారేదాకా మళ్లా కనబడేదికాదు. ఒంటరిగా పడుకోలేదుకదా అని అత్తగారు ఆమెకు సాయం ఉంటానంటే అక్కరలేదని చెప్పేసింది...

ఎంతకాలం ఈవైఖరి చూస్తూ ఊరుకుంటారు? మొదట్లో... ఏమీ అనుకోలేదు... ఆమీద, కాలం గడచినకొద్దీ... అనుమానం తోచినా మళ్లా వెంటనే ఉపసంహరించుకునేవారు... ఇక నిశ్చయమని తోచింది. ...ఏమీ లేకపోతే ఆమెవర్తన నిష్కళంకమయితే... ఎందుకు అలా ...ఎవరైనా చేస్తున్నారా?...ఆవేషమేమిటి, ఆసరదా లేమిటి, ఏకోశానా రవంతవిచారమైనా ఉన్నట్టు కనుపించనిదే?... పోనీ, మనిషితత్వము అది అని ఊరుకున్నా... హద్దుమీరి పోతూంటే...చూస్తూ ఎలా సహించి ఉండటం? లోకులు ఏమనుకుంటూ రన్నే సంగతి ఎలా ఉన్నా... వంశగౌరవం మంట గలిపి ...ఎంత అప్రతిష్ఠ ...హమ్మో; వాడు పోయి ఇంకా మూడునెలలైనా దాటలేదే...!

—ఏమైనా సరే... ఈవిషయమునకు అంతు ఏదో కనుక్కొని ...కులనాశకురాలిని ఇంట్లోనుంచి తక్షణం తరిమివేయవలెనని ...మామగారు తీర్మానించుకున్నాడు ...ఆవేళనే తేలిపోవాలి.

అర్ధరాత్రి కావచ్చింది; ఇల్లంతా ఎక్కడికక్కడ మాటుమణిగింది. ఆయన, ఆఅమ్మాయిపడుకునే గది గుమ్మందగ్గర చెవులు ఓరచేసుకుని నిలుచున్నాడు... లోపలనుంచి ...మాటలు చాలా తగ్గుగొంతులో వినబడుతూన్నవి ... పరకాయించి... చెవులు మరీ ఒగ్గి విన్నాడు... బతిమాలుకుంటూన్నది... అప్పుడే వెళ్లిపోవద్దని... ఇంకా కొంచెంసేపైనా ఉండమని...

హాఁ...హాఁ...పాపిష్ఠిది ...ఇదా జరుగుతూన్న నాటకం ...ఇల్లు మాలకొంప అయిపోయిందే... ఇందుకా, ఈవేషాలు అన్నీని ...ఇందుకోసమేనా అక్కడ నిలువకుండా వచ్చేసింది ...ఈఘనకార్యానికా... ?

తామసం ...ఆగిందికాదు ...తలుపుమీద ధడధడ మోదాడు ...తలుపు తీయకుండాఉన్నదా ఉతికలు ఎత్తేసిఅయినా, లోపల జొరపడి వాళ్ల ఇద్దరినీ ఖూనీచేసేయవలసిందే!... తెగించి ...ఎన్నిగుండెలతో, ఎంతనిర్భయంగా వచ్చాడూ ...వాడెవరో ...తప్పించుకుని ...ఎక్కడికి పోతాడు? ఆగదికి రెండోగుమ్మం లేదు ...అయినా దయ్యాలలాగా ఇంటి నిండా ఇంటెడుమంది ఉండగా అందరినీ కనుబ్రామి

ఎలా వచ్చాడు... ?కానీ...ఇవాళతో వాడిఆయుస్సు, సరి...

తీయకపోవడం చూసి, కాలితో తలుపును తన్నాడు... తెరుచుకున్నది... ఆమె ఘడియ తీసింది. చూపులతోనే కబళించి వేసేఅంతతీవ్రముగా చూశాడు. ఆమె ఏమాత్రమూ బెదరక ...ఎందుకు ఆవేశపడ్డాడు ఆయన అంతధీమాగా తలుపు పిలిచాడో తెలియక కలవరపడుతుంతప్ప తప్పు చేసినదానిలాగా లేనేలేదు. అవును... ఎంతకైనా తగిన దే!

"ఎవరు?"

—ఆగర్జనలోని భావ మేమిటో బోధపడలేదని ఆమెచూపులే ప్రత్యుత్తర మిచ్చినవి.

'ఎవరు... లోపల?'

'నేనే.'

'ఇంకా ఎవరూ లేరా?'

ఏదో సమాధానం చెప్పబోయి నాలుక మడత వేసుకుని ఊరుకున్నది... దాన్ని ఆయన మరోఅర్థము చేసుకున్నాడు...

'మాట్లాడవేం?'

—ఏంఉన్నది మాట్లాడటానికి... ఆయన ఘాటుడుగా లోపలికి వెళ్లి, దీపం వెలిగించి... నలుమూలలా వెదికాడు ...ఎక్కడా ఎవరూ లేరు... కాని, ఆయనకు అనుమానం పోలేదు... స్వయంగా విన్నాడు కాదూ?

'ఎక్కడ దాచావు... చెప్పు... చెప్పవేం...'

జుట్టు పట్టుకుని... దవడమీద సాచి కొట్టాడు ...మాటాడకపోవటంతో మరింత రేగి పట్టువిడిచి ఎడా పెడా, రెండు చెంపలూ, వాయించాడు... బాదేశాడు... ఆమె, తిరిగి బేలై పడిపోయింది... ఇక పలుకుతూన్నది... అప్రయత్నంగా, ఆమె ఇష్టం ఏమీ లేకుండానే...

'వెళ్లిపోయినారు...'

'అలుచ్చా ఎవడో... చెప్పు...'

'మీ అబ్బాయి...'

'ఆఁ...ఆఁ...'

'అవును...'

'ఎంత తెగించావే... నీగలసందుపసులా... పోయినవాడి... ఉసురు, నీకు తగులదు లే... వాడి పేరు అడ్డంపెట్టుకుని ఇంత అనాగ్యపుపని చేస్తూ... నీముఖ మీడ్చా...'

—చేసిన నిర్వ్యాఖ్యానము నాలుక, పడిఉన్న ఆమెను కసదీరా తన్ని హూనంహూనం చేశాడు. చెప్పు... నా దైవగో అని, ఒకప్పుడు తిసులనిస్తూ ఉండటం; ఆతాపు తిని... ఆమె, నూతిగానుసుసఉన్న మనిషి గొంతుతో... 'మీ అబ్బాయి'... అని జవాబు చెప్పుతూండగానే చీదరింపుగింతో... మరోతన్నుకు ఆయన సిద్ధపడటం...

నిరవధిగా, అగోచరత్వం ఎంతవరకూ సాగిపోయేదో కాని ఇంతలో, అత్తగారు వచ్చి, అడ్డుపడి, ఆయనను దక్కపట్టుకుని అవతలకు తీసుకువెళ్లింది... ఆమె ఎదుట ఆయన, నోటికి వచ్చినట్లు నానాదుర్భాషలూ ఆడి... చివరకు అలసిపోయి సణుసకుంటూ, గాద్గద కంఠంతో దుఃఖం పెల్లుబుకుతూ, పోయి పడుకున్నాడు.

ఆ అమ్మాయి... పడినచోటనే... అలాగే ముద్దయిపోయింది. అత్తగారు వచ్చి, సాయంఇచ్చి లేవదీసి, మెల్లిగా నడిపించుకుంటూ, గదిలోకి తీసుకువెళ్లి మంచముమీద పడుకోబెట్టి... మంచినీళ్లు త్రావడానికి ఇచ్చి... చేయి తడిచేసుకుని, కళ్లూ, ముఖమూ తుడిచి చెంపలమీద జుట్టు, పక్కలకు తుడిచి...

'ఏంపనిచేశావే తల్లీ... అటు ఏడు, ఇటు ఏడు తరాలా మన ఇంటా వంటా... ఎన్నడూ లేనిది' —అంటూ కొంత్రెం సముదాయింపుగా, కొంచెం నిష్ఠురంగా ...మాటలతో గోరు లాగవలసిన అంచనా వేసింది... ఆ అమ్మాయి ...ఏమీ జవాబు చెప్పలేదు. ...ఎవరూ నమ్మనప్పుడు ... ఏమిచెప్పిమాత్రం ప్రయోజనం ...ఏం ఉంటుంది?

"అవునులే ...మాఖర్మంకనుకాకే, నీకు ఇలాంటి దుర్బుద్ధి పుట్టింది ...నిన్ను అనవలసినపనేముంది...?" అని దుంబాడుకుంటూ; అక్కడనుంచి వెళ్లిపోయింది...

చేసినహితబోధ అంతా వ్యర్థమైపోయి ...వేసినపాచిక ఏదీ పారక, ఆఅమ్మాయినోటి వెంబడి మాటరాకపోవడం మూలాన!

—ఒళ్లు తెలియకుండా, పడిఉన్నపాటు... ముసిరిపోయి .. జ్వరం ముంచుకు వచ్చేసింది: ఇక అందులో, పిచ్చికేకలూ, వెర్రికేకలూ...

డాక్టరును పిలుపించుతే ...బండారం ఎక్కడ బయటపడి ...తమ నెత్తిమీదకు వస్తుందోఅని .. ఊరుకునిఉండటానికి మనస్కరించక ...దంపతులు ఇద్దరూ కూడబలుకుకుని ...తప్పకుండా, అదేదో గాలిలక్షణమే అని, నిర్ణయించేసి, ఆ మొతలితండ్రులకు 'తక్షణం రావలసినది' అని, టెలిగ్రాం ఇచ్చారు. వారు వచ్చేలోపున, భూతవైద్యానికి ఎవరిని కుదర్చవలెనా అనేవిమాంసలో ఏమీ తేలక ...లంఘనములుమాత్రం కడుతూ ఉన్నారు:

మూడవనాటి సాయంకాలానికి, పిల్లతలిదండ్రులు ఇద్దరూ వణుకుతూ అక్కడికి చేరుకొన్నారు; అప్పటికి, ఆమె సుకిశరీరం, లోపడిపోయి. కళ్లల్లో ప్రాణాలతో ఉన్నది. వియ్యంపకుని చూడగానే మామగారు, చెప్పవలసిన ...కొండెములు అన్నీ కక్కేద్దామనుకున్నారు. కాని, ఆ మనుమరాలి ముఖం చూసి, నోరు రాక పోయింది ...తండ్రి వెళ్లి డాక్టరును పిలుచుకువచ్చాడు దెబ్బలు అప్పటికి మాతిరిగి ఉండటంగమనిక ... శరణం లేదని అత్తమామలు ఎంతా అడ్డు చెప్పలేదు. డాక్టరు వచ్చి,రోగిని పరీక్షచేసినమీదట... మహో ద్రోత్రసంగతి... ఆమె గర్భముతో ఉన్నది!

—అంతవరకూ గృహస్థమర్యాదను పాటించో, మరి ఏమనుకునో, మొదలకుండా ఊరుకునిఉన్న మామగారు, తెగబడి, చెప్పవలసినది నాలుగూ చెప్పాడు. తక్షణం — ఒకనిమిషం ఆలశ్యం చెయ్యకుండా, వాళ్ల పిల్లా వాళ్లూ పోయి గంగలో కలవమన్నాడు... ఆ అమ్మాయితండ్రి ముగమింతచేసుకుని ...మారుమాటాడకుండా ...భార్యనూ కూతురినీ తీసుకుని ...వాళ్లఊరు వెళ్లిపోయినాడు.

ఆ అమ్మాయికి ...ఇక, ఆయింట అడుగుపెట్టే అర్హతి లేదు. ఎంత చెప్పినా, ఎవరూ నమ్మరు. తనవర్తనలో ఏమీ దోషములేదనీ ...శాభునిలాలనలో బుజ్జక్రమమున పొడచూపి వర్ధిలుతూన్న అంతర్వత్నిత్వమే కాని...పరపురుషసహవాసకళంకము లేదనీ వాళ్లు నమ్మడానికి...ఆధారము ఏదీ...బతికిఉన్నన్నాళ్లూ, వారిది పృసక్చగూఢ్యవ్రతమని, ఇరుకుటుంబములవారికినీ తెలుసును. చనిపోయిన తరువాత... ఎంతో అపేక్షగా ఆవరిస్తూన్నావనే అసామాన్య విపరీతస్థితిని... ఎవరు విశ్వసించుతారు. చార్రిత్రమును శంకించుచున్నారని, ఆ మెకు బాధలేదు... నిజమును... నిజమని తాను చెప్పినా నమ్మలేకపోతున్నారనే తప్ప!

ఏ మున్నది.. అంతా, మళ్లా మొదటికి వచ్చింది. ఆతడు అక్కడ కనుపించడు... చేరరాడు. తిరిగీ అత్తవారింటికి వెళుదామంటే, వారు రానీయరు... ఆతన్ని చూడనిదీ... ఉండలేదు...

ఈదింతతో, చిక్కి శల్యమైపోతూన్నకొద్దీ గర్భధారణలక్షణములు మరింత ప్రస్ఫుటిస్తూన్నవి. వేకటి నిజము కాదేమో... వ్యాధిలక్షణమేమోనని అనుకున్నారుకాని, ఏవిధమైన ఔషధసేవనమునకు ఆమె ఒప్పుకోలేదు; జబ్బు వేరే ఇంకొకటైయుండగా ...ఇతర ఉపచారములు,దానికికాక ఎన్నిచేసినా నిష్ప్రయోజనమని ఆమెకు తెలుసును.

చూడగా, చూడగా, ఆమె తల్లి దండ్రులకు కూడా.. గ్రహబాధ ఉన్నదనే నమ్మకము కుదిరింది. సలహా అడిగిన మంత్రశాస్త్రవేత్తకూడా, తప్పకుండా, అదేననీ... గర్భిణిగా ఉండటముకూడా ఆలక్షణము తప్ప వేరు ఏదీ కాదనీ... తాను బాగుచేస్తాననీ, వారం దరినీ ఒప్పించాడు... పైగా ఆమెతల్లికి పూనకంలాగా వచ్చి... అల్లుడిగొంతుతో... తాను, భార్యమీద మమకారంచేత వచ్చాననీ, పట్టుకుని వదలకుండా, తనదగ్గరకు తీసుకువెళ్లిపోతాననీ... ఘంటాపథంగా ఘోషించింది. సామాన్యసంసారులకు... ఇక అంతకన్నా నిదర్శనం, ఏమి కావాలి?...

ఆమెకు, ఈకలాపమంతా, ఇష్టమా, కాదా? ...అని ఆలోచించలేదు నారెవరూ, ఆమెను అడుగలేదు... ఎద్దును అడిగి గంతలు కడుతారా?...

—పట్టువేసి ...దానిమీద తల్లితండ్రులూ, ఇంకా బంధువులూ పట్టుకుని కూర్చోపెట్టి...మంత్రోచ్చారణలో ...భూతము కట్టుపడి ...వెళ్లిపోతానని చెపుతుందేమో, మీదికి వచ్చి అని ...హ్రాం, హ్రీం,

సాధనలు ...బహుమతీ ఆశతో ...మొగమంతా కళ్లు చేసుకుని, ఆనాటి కానాను [illegible] పెద్ద[illegible] చేస్తూ, ఆమహానుభావుడు తాంత్రిక ప్రక్రియలన్నీ వినియోగించి చూశాడు...

ఎంత గడుసరి ప్రయత్నమైనా .. ఎంత పెటగట్టుకుని [illegible]నేరకమైనా .. మంత్రోపకరణము [illegible] పోతుందా?...

చివరకు...ఆనాడు, జపాలోకి [illegible]...సీసాలో పెట్టి .. భూతమునా భూస్థాపితము చేయుటానికి తగిన [illegible] వచ్చిందని ...మాంత్రికుడు [illegible] జరుగ వలసినతంతు ఇసుమంతైనా [illegible] కనుక, [illegible] కడవనే, కూర్చొనవలసి ఉంటుంది.

పెళ్లికన్న ఎక్కువ [illegible]గా... ఉన్న అమర్చుకుంటూ... [illegible] గాజంతా [illegible]గా ఉన్నది... పలుకరించటానికైనా, [illegible] చాయలకు రాలేదు... అదీ కొంత మేలే!..

ఏకాగ్రదృష్టితో... ఏదో ఆలోచించుతూ, ఆమె పడుకుని ఉన్నది; మొదటికే, ఇప్పటికి [illegible] వాలే లేదు; రూపే మారిపోయింది: క్రమంగా...ముఖంలో కరడుకట్టుకుపోయిన విషాదము విరిసిపోతూ, ఆశావుల... ఆనందజ్యోత్స్న [illegible] ... సముద్రమధ్యమున పడి... ఆధారము లేక అల్లాడిపోయే ఆప్తురాలికి... ఆసరి చిక్కింది... బహు[illegible]తో, ఎక్కడలేని సత్తువతో... లేచి... వచ్చి, తలుపు గడియవేసుకున్నది... కొంచెం సేపటికి తీసి... ఇవతలకు ... వెళ్లిపోయింది:

వేళ అయేసరికి, ఆమె అజ వచ్చి... తల్లి, గది దగ్గరకు వచ్చి, లోపలకు తొంగిచూసింది... లేదు; ఇంట్లో ఏమూలనన్నా ఉన్నదేమోనని వెదికింది... కనబడలేదు; పెనిమిటితో చెప్పింది... గాభరాపడుతూ, ఆయనా, ఆవిడా కలిసి మళ్లా ఇంకోసారి కలయవేసి వెదికారు; ఊహు... ఏమైంది... ఏమీ పాలుపోలేదు... ఆయనకు ఏమి తోచిందో కాని, గదిలోకి వెళ్లి... బల్లమీద రేకెత్తుకుని ఉన్న కాగితం ముడతను ఒక్క అంగలో అందుకుని... పైన...'నాన్నగారికి...' అని ఉండటం చూసి... మగి ఆదుర్దాతో ఒక్కలాగుతో విప్పదీసి... చదువుతూ...

— చదువుతూంటేగా... [illegible]లో కళ్లు [illegible]... ఆయన [illegible]... [illegible] నాలుగు...

"నాన్నగారికి..

"నా [illegible]... [illegible]... [illegible].

"[illegible] నా [illegible] కన్నతి [illegible]

"[illegible] ఇక [illegible]... [illegible]...

"నేను... [illegible] ఎన్నడో [illegible]... నాయందు [illegible] ఏమని... [illegible], నన్ను [illegible] మీ తప్పు... [illegible] ఎన్నడో [illegible] లేదు;

"ఇక మగ్గడు [illegible] నిండుకవి అనగా... [illegible]... నన్ను దగ్గరకు తీసుకున్నారు... ఎందుకు అంత [illegible]వచ్చిందో... ఆనాటినుంచి మా సంసారము [illegible]...

"ఎంతో ఆశపడ్డాను... ఎన్నో కోరుకున్నాను ...నామీద అంతదాకా కోపానికి కారణం ఏమిటో మర్నాడు ఆయననోటనే పలికించుదాం అనుకున్నాను ... కాని, ఎక్కడిది! నామాంగల్యం తెరిగిపోయింది ... ఎక్కువనోములు నోచి, ఎక్కువ ఫలాలకు ఆశపడితే ఎక్కడనుంచి వస్తాయి...

"ఆయనకు భూమిమీద అనోన్య దికములు కర వై... ఈ పాపప్రపంచము వదిలిపెట్టారు, కాని ఎందుచేతనో, మొదటినుంచీకూడా, నన్ను విడువరనే మనసుకు తోస్తూనేఉంది... మీకందరికీ పోయినాడు, నాకుమాత్రం... ఆయన [illegible] న్నట్టే...

"ఆ రాత్రి...ఆయన...కనిపించి...కనుపించడ మేమిటి... ప్రత్యక్షంగా... మంచమ్మకు దక్కడను కున్న సుఖం [illegible] నేను! అది మొదలు... ప్రతి రాత్రీ... ఎంతో [illegible]... అనురాగంతో, నన్ను ఏలుకుంటూవచ్చారు..

"మీ ఇంటికి వచ్చాను... బ్రతికి ఉండగా ఎన్నో [illegible]... ఇక ఆపట్టింపు ఉండ [illegible], కాని... మీరు ఆయన మనసు ఎంత నొప్పించారో, చచ్చి బ్రతికున్నడా, ఒక్కటే [illegible] లేదు...

"[illegible] నాకొనికి [illegible] లేక, మావాళ్ళు ఇంటికి [illegible]... అక్కడ ఇద్దరము సుఖంగా ఉన్నాము.

"[illegible]... నా విషయంలో చాలా [illegible] అని ఏం [illegible] నిజే... కన్నవారు మీరే [illegible] చేసుకో లేకపోయినప్పుడు? [illegible]... [illegible]... [illegible]...

"ఇంటిలోనుంచి వెళ్ళిపొమ్మన్నాడుకాని ... నా దంపతులకు ఏపాటు చేస్తూన్నానన్న స్ఫురణే లేదుకదా !... ఇక మీరు...

"బ్రతికివున్నన్నాళ్ళు ... ఆయనకు, మనసు కలు గకపోయింది... ఇప్పుడు, మేము ఏకోభావంగా సుఖ పడటం మీకు ఇష్టములేదు; ఘోరాలో, భూతాలో, ఏమై నా కానీం...ఏరూపాన అయినా, ఆయన నన్ను అంటి పట్టుకుని ఉండటంకన్న కావలసింది ఏమున్నది ... నన్ను ఇచ్చినది ఎందుకు ? ఒకరి నొకరు ఎడబాయ కుండా ఉంటామనేనా ?...

"లోకంలో మగవాళ్లకు దైవం రక్షించినే నిల వపలడంలేదు... నాఒక్క దైవుఖాన్నే ప్రొద్దుపొడి చిందా... నాపెనిమిటితో నేను కాపురం చేస్తూన్న ప్పుడు... ఆయన మీకు కనబడినంతమాత్రాన నా కమపు ఫలించడం... పెద్దవిడ్డూర్యమా, తలవంపుల మారిపనా... కులానికి అప్రతిష్ఠా ?

"చనిపోయి ఏలా మారిపోతారో, మంత్రాల ప్రభావం ఏమిటో నాకు తెలియదు, కాని, ఒకవేళ నిజంగా వాటికి అంతశక్తి ఉండి, ఆయన ఎన్నటికీ నా సమీపానికి రావడానికి వీలులేకపోతే, ఇక ఈ బ్రతుకు ఎవరికోసమండీ !

"భ్రూణహత్య మహాపాప మని తెలుసును... కాని...దయ్యపుపిల్లే అవుతుందికాదూ, ఆపుట్టేశిశువు? మీ మామూలుమనుష్యులు... దాన్ని చేరనిస్తారా...? అది బయటపడి... ఎలా బ్రతుకుతుంది ?

"ఆయిన... నన్ను పట్టుకుని ఉన్నాడనే కాదూ మంత్రాలు చదివి... బాధించి చివరకు సీసాలో కుక్కి ఉక్కిరిబిక్కిరిచేసి నేలలో పూడ్చిపెడ తారూ?...అవును, మీ కూతురిని ప్రేమతో చూస్తున్న మహాపరాధమునకు అంతశిక్ష మీరు చేయించవలసిందే! అంతటితోనైనా మీకు శాంతి కలుగుతుందా ?...

"నా పెనిమిటి ఎక్కడ ఉన్నాడో నేనూ అక్కడకే వెళుతున్నాను; పతివ్రత అయినస్త్రీ, భర్తను ఎన్నడూ విడిచిఉండరాదనీ... ఆయనమాటకు ఎదురు చెప్పకూడదనీ, చిన్ననాడు నాకు నేర్పలేదూ మీరు...? ఆయన భూత మైపోయినప్పుడు, సహధర్మ చారిణికూడా... అంతే అయిపోతుంది... బ్రతికి ఉన్నప్పుడు, గ్రహచారం చాలక... సిరిసంపదలు హరించిపోతే...నేనూ బీదదాన్నే అయిపోయేదాన్ని కాదూ, అందుకు మీరు ఏమన్నా అనేవారా ?...

"మీ ఇంటిపైపుకు ఎన్నడూ రాము... మా మీద ఏమీ అనవసరమైన మంత్రాలు ప్రయోగాలు చేయించి... అక్కడనైనా సుఖంగా ఉండకుండా చేయబోకండి ... మీపుణ్యమాయెను; ఇంకా ఎక్కడి ఆపేక్షలు... మీ మతంలో బ్రతికి ఉన్నవారే మను ష్యులుకాని... మనస్సుల్లో ఎంతెంత కావేషాలు దాచు కున్నా ఎన్నివంచనలు చేసినా...మీకు నచ్చుతుంది... చచ్చిపోగానే దయ్యములై ఎక్కడ పట్టి పీడించుకు తింటారో అని... తగనిభయమాయెను...

"ఇక ఉంటాను... ఎన్నడన్నా మమ్మల్ని దయతో తలచుకోండి... ఎక్కడ ఉన్నా, మీ వాళ్లమే...

మీ అమ్మాయి."

ఉద్బోధన

కందుకూరి రామభద్రరావు

రాజకోటలు పసి మెఱయు రత్నఖచితస్తంభమ్ము
మానమే కోసగంగా
ప్రాణమే తీసగంగ
మసలుకొనినదిన నేనెరుగనోయి ?
మఱగిపోయిన దినాలెన్నోయి ?

సిరిబంగారు సంద్రమున తెలుగునగరాలు తేలగ
[illegible]
[illegible]
బ్రదుకుకంచెలు తెగెనకోయి !
హృదయభాండము తెగెనకోయి !

ప్రాసంగువరిచేల బసరుత్తుకపుతాయి
పాటతేటలు తేన్చు
పూటపాటలు తీన్చు
జీవనము నడుప రావోయి !
జీవితము గడుప బోవోయి !

పుణ్యస్రోతస్వినీపులినసింహాసనము
స్వాతంత్ర్యతాండవము
స్వర్లోకవైభవము
అధివసింపగ వంతివోయి !
అమృతభాక్కులు కొలుతురోయి !

అశ్మకదేశనిర్ణయము

ముట్నూరు వేంకటరామయ్య

పాణిని[1] అష్టాధ్యాయిలో చతుర్థాధ్యాయ ప్రథమపాదమందలి ౧౭౩ సూత్రమున 'అశ్మక' మను పదము క్షత్రియకులమునకును, వారి రాష్ట్రమునకును రాజునకును కూడ నామముగా వ్యవహరింపవచ్చునని చెప్పబడియున్నను, సంస్కృత వాఙ్మయమునందును, బౌద్ధ గ్రంథములలోను గల ప్రస్తావములవలనను, శాతవాహనరాజుల ప్రాచీన శాసనప్రమాణముల సాయముచేతను, ఈ దేశము ఎచట నుండెనదియు సులభముగా నిర్ణయింప వీలగుచున్నది. దొరకిన ఆధారములచేత అశ్మకదేశము గోదావరీ జలప్రక్షాళిత పుణ్యదేశమనియు దానికి రాజధాని పోతన లేక పోతలి యనబడుచుండినట్లును తెలియుచున్నది[2]. మఱియు వాఙ్మయమునందును శాసనములందును ఇది ముళకరాష్ట్రముతో కూడ వ్యవహరింపబడుచున్నది. గౌతమీపుత్ర శాతకర్ణియొక్క నాసిక గుహాలోని శాసనమున[3] నా రాజు యేలుబడియందలి రాష్ట్రములను చెప్పు వరుస చూడగా అశ్మకదేశము ముళక రాష్ట్రమునకు చేరువ నున్న ప్రదేశ మని యూహించుట కనువగుచున్నది. ముళక రాష్ట్రమునకు పైఠాను (ప్రతిష్ఠాన నగరము) రాజధాని యనియు, దానికి సరిగా దక్షిణ పార్శ్వమున గోదావరీతీరమున అశ్మక దేశము కల దనియు సుత్తనిపాతగ్రంథము[4] ఈ అంశమును స్పష్టపఱుచుచున్నది. వీని చేత అశ్మకదేశము గోదావరీ ప్రాంతమునను ప్రతిష్ఠానమునకు దక్షిణమునను లేక ఆగ్నే

1. పాణిని, IV, i. ౧౭౩.

2. జాతకకథలు, II సం. ౨౦౭ (అస్సకజాతకము); III, పుటలు, 3–౫; చూ. ఎస్. శ్రీకంఠశాస్త్రి గారి వ్యాసము—'ముళక'; Q. J. H. S. XXI పుట ౬౨ ; బి. సి. లాగారి Geography of early Buddhism, పు. ౨౧–౨ ;

3. నాసికగుహాశాసనము. A. S. W. I. IV. P. 108.

4. సుత్తనిపాత. పాలిమూలము. V. పారాయణవగ్గ. శ్లో. ౯౭౬–౭., 1010, 1011 ; ఈ శ్లోకములు, బావరి అను బ్రాహ్మణుడు కోసలనుండి వచ్చి దక్షిణాపథమున ముళకకు చేరువను గోదావరీతీరమున అస్సకలో స్థిరపడి అక్కడనుండి తన శిష్యులను ఉత్తరాభిముఖముగా తొలుత ముళకలో ప్రతిష్ఠానమునకును అటనుండి మాహిస్సతికిని, తర్వాత ఉజ్జయినికిని పంపెనని తెలుపుచున్నది.

1010. బావరిం అభివాదేత్వా కత్వా చ నం పదక్ఖిణం,
జటాజినధరా సబ్బే పక్కాముం ఉత్తరాముఖా.

1011. ముళకస్స పతిట్ఠానం పురిమం మాహిస్సతిం తదా,
ఉజ్జేనిం చాపి గోనద్ధం వేదిసం వనసవ్హయం ||

యమునను కల ప్రసిద్ధ ప్రదేశమున నుండిన దని నిర్ణయింపవచ్చును.

అశ్మకమునకు పోతన రాజధాని యని తెలిసినది. ఈ నగరమును, కళింగదేశమందలి దంతపురమును బౌద్ధవాఙ్మయములో సమాన ప్రసిద్ధిని వహించియున్నవి. ఏలన, ఈ రెండు నగరములును మహాగోవిందునిచే నిర్మింపబడినవి.[5] అశ్మకు డను రాజుయొక్క రాజ్యమునకు రాజధాని పౌదనమని మహాభారతము చెప్పుచున్నది. పౌదన యనునది పోతనకు రూపాంతరము. రాజునకు ఆనామము దేశముచే కలిగినది. ఈనామము రాజునకును వాని రాజ్యమునకును కూడ వ్యవహారింప వచ్చునని కదా పాణిని చెప్పినాడు. ఆధునిక దేశపటములలో పోతననగరము ఎచట నున్నదో నిర్ణయించిన అశ్మక దేశమును నిర్ణయించినవార మగుదుము.

పంపకవి (క్రీ. శ. ౯౪౦) కన్నడమున రచించి చాళుక్య వంశజుడైన రెండవ యరికేసరి కంకిత మిచ్చిన విక్రమార్జున విజయ మను భారతములో పోదన యను నగరమును పేర్కొనియున్నాడు.[6] ఈ రాజే నైజాము రాష్ట్రమందలి కరీంనగరు జిల్లాలోని వేములవాడయందు తాను వేయించిన శాసనమున నీ నగరమును ప్రశంసించి యున్నాడు.[7] ఈ పంప భారతమునందును పై శాసనమునందును ఈ నగరమును గూర్చియు దాని ఉనికిని గూర్చియు చెప్పబడియుండు విషయములచేత ఇది ఎచట నున్నదని నిర్ణయించుటకును, అశ్మక దేశమందలి పోతన నగర మిదియే యని నిర్ణయించుటకును వీలగుచున్నది.

పంపకవి తన భారతములో, తన ప్రాపకుడైన అరికేసరియొక్క పూర్వపురుషుడైన మొదటి యుద్ధమల్లుడు ఏలిన సపాదలక్ష యను దేశమున పోదన నగరము కలదని నుడివియున్నాడు. ఈ మొదటి యుద్ధమల్లుడు పోదనమందు రాజుల పట్టపు టేనుగుల విహారార్థము నిర్మిం

5. మహావస్తు; III 208, 209. దీఘనికాయ II 235; Dialcgues of the Buddha Vol. II 270.

దంతపురమ్ కళింగనమ్ అస్సకానాంచ పోతనమ్ |
మాహిస్సతి అవంతీనమ్ సోవీరానంచ రోరుకమ్ ||
... ...
... ... ఏతే గోవిందమాపితా ||

6. పంపభారతము, I పద్య. 16-7. Department of Public Instruction వారిచే ముద్రితము, మైసూరు.

7. భారతి, సం. VIII, పుట. 267 మూలము పంక్తులు 13-15; J. A. H. R. S. Vol VI. p. 149; తెలింగానా శాసనములు. పు. 173. రెండుమూడు పంక్తులు పరిష్కరింపబడినను ఈశాసనము ఇంకను చక్కగా పరిశోధించి పరిష్కరింపవలసియున్నది. 13-వ పంక్తి యిట్లు చదువవలయును.

"యశ్శోపదనే సౌధమయీ గజానాం
విధాయ వాసీమపి తైలపూరైః".. దీనిచే పోతనయొక్కయు దానియందలి బావులయొక్కయు ప్రస్తావము వచ్చుచున్నది. ఈనగర మీచాళుక్యవంశముయొక్క రాజధాని యగునేమో ?

పబడిన బొప్పరాలను (శ్లోకలను ?) పరిమళించు సువర్ణముతో నింపి వానిలో స్నానమాడినని వర్ణించియున్నాడు. ఈ విషయమునే ఎక్కువ వర్ణనతో గాంభీర్యముతో వేములవాడ శాసనము వర్ణించుచున్నది. ఈ విషయమును అరికేసరి రాజవంశావళియు రెంటియందును ఇంచుమించుగను భేదము లేక పొందుపడియున్నవి. వీనిచే పంపకవి వాక్యమునకు ప్రామాణ్యము మెండుగ కలుగుచున్నది. మరియు, వేములవాడ శాసనకర్త పంపకవి సోదరుడు జినవల్లభుడని సంశయముకూడ కలుగుచున్నది.[7] ఈ బోధన ఎచటనున్నదో నిర్ణయించుటకు నాకు మొదట దూరము పోవలసిన అవసరములేదు. కరీంనగరము జిల్లాకు చేరిన సరిహద్దుగా నున్న నైజామాబాదు జిల్లాలో, గోదావరికి కొన్ని మైళ్లు దక్షిణమున ప్రాచీన శిథిలములతో[8] నిండిన పట్టణము బోధన అనునది కలదు.[8] పంపకవి చెప్పిన బోధనగరము యిదే యని చాళుక్య రాజు త్రైలోక్యమల్లుడు (క్రీ. శ. ౧౦౫౬) ఈ నగరమును చేయించిన యొక శాసనములోని వివరములచేత తెల్లము కాగలదు.[9] ఈశాసనమున రాష్ట్రకూటచక్రవర్తి ఇంద్రవల్లభుడు బోధనలో కట్టించిన ఇంద్రనారాయణుని దేవాలయము శిథిలము కాగా ఆహవమల్లుని (అనగా త్రైలోక్యమల్లుని) ప్రెగ్గడ జోగపయ్య దానిని శా. శక ౯౭౮ (క్రీ. శ. ౧౦౫౬) సంIIలో నుద్ధరించె నని కలదు. నరసింహాచార్యులవా రూహించినట్లు బహుశః ఈ రాష్ట్రకూటరాజు మూడవ ఇంద్రుడు (క్రీ. ౯౧౫-౧౭) గానే యుండును; ఏల యన ఇతని సేనాపతులలో నొకడు చాళుక్యనరసింహు డనువాడు ఇతనితో కలిసి ఘూర్జరులతోను, కన్యాకుబ్జేశుడైన మహీపాలునితోను యుద్ధము[10] చేసినవాడు పంపకవి వర్ణించిన రాజవంశమునకు చెందినవాడును రెండవ అరికేసరియొక్క తండ్రియు, బోదన రాజధానిగా నేలిన మొదటి యుద్ధమల్లుని వంశస్థుడును అగుచున్నాడు. ఈ చాళుక్యులు కొన్ని తరములు రాష్ట్రకూటులకు సామంతులుగా నుండినట్లు తెలియుచున్నది. ఈ కుటుంబము

7. D. L. Narasimha Chari, J. A. H. R. S. VII, p. 164.

8. Lat. 18°40', Long. 77°53', హైదారాబాదునకు దాదాపు 204 మైళ్లు ఆగ్నేయమున నున్నది.

9. R. నరసింహాచార్యులవారు: త్రైలోక్యమల్లుని బోధన్ శిలాశాసనము. Hyd. Arch, series, No. 7

10. అల్టేకరు: రాష్ట్రకూటులు, పుట. 102; పంపభారతము, I శ్లో. 26-9; ఈయుద్ధమును గురించియే క్షేమీశ్వరుని చండకౌశికమున ప్రస్తావన కలదని నేను నమ్ముచున్నాను. నాంది శ్లోకములలో మహీపాలుడను రాజు మ్రోల నీనాటకమాడినట్లును, అతడు కర్ణాటకులను తఱిమి తన సింహాసనమును స్థిరము చేసికొన్నట్లును కలదు. ఈకర్ణాటకులు చాళుక్య నరసింహుని సైన్యముగాను తొలుత మహీపాలుని దఱిమినట్లును, పిమ్మట నతనిచే తరుమబడినట్లును తోచుచున్నది. చాళుక్యులను కర్ణాటులని వ్యవహరించినందులకు శాసనప్రమాణము గలదు. ఉదా. దంతిదుర్గుని సామన్‌గడ్ తామ్రశాసనము కీర్తివర్మ II వల్లభుని సైన్యమును కర్ణాటసైన్యమని పేర్కొనుచున్నది. ఈ యంశములు ఆచార్య శ్రీ. ఏ. నీలకంఠశాస్త్రిగారు చండకౌశికము కాలమును గురించి చేసిన నిర్ధారణమును (చోళులు I. పు. 289-8) బలపఱుచుచున్నవి.

వారిలో మొదటి అరికేసరి నిరుపమదేవ ధ్రువునికి (క్రీ. శ. ౭౮౦-౯౪) సామంతుడు.[11] రెండవ యరికేసరి నాలుగవ గోవిందునికిని (క్రీ. శ. c. ౯౧౮-౩౫) అమోఘవర్ష బద్దెగ దేవునకును సామంతుడు.[12] రెండవ యరికేసరియొక్క కుమారుడు వాఘురాజు, (వ్యాఘ్రరాజు?) అతని యాస్థానములోని సోమదేవుడు రచించిన యశస్తిలకముయొక్క గద్యములో చెప్పినట్లు, మూడవ కృష్ణుని సామంతుడు (క్రీ. శ. ౯౩౯-౬౮). ఈ చాళుక్యులకును రాష్ట్రకూటులకును గల యీ సమీప సంబంధముచేత మూడవ ఇంద్రుడు దేవాలయము నిర్మించినది నైజామాంబాదలోని బోధన్ నగరమునం దనియు పంపకవి వర్ణించినదియు దీనినే యనియు చక్కగా తెలియుచున్నది. రెండవ యరికేసరియొక్క శాసనము దొరకినస్థలము వేములవాడ యనునది, నగుతము బోధనకు చాల దూరమున లేదు; ప్రక్క-జిల్లాలోనే యున్నది. నరసింహాచార్యులవారు వర్ణించిన ప్రకారము బోధన్‌లో పురాతనములైన జైన హిందూ శిల్ప శిథిలములును శకలములును విస్తృతములై యుండుటచేతను, మూడు పెద్దగోటాకములు ప్రాగ్దక్షిణ ఉదీచీదిశలయం దుండుటచేతను, నగరముచుట్టును మృణ్మయ ప్రాకారము ప్రాచీనమైన కోటయొక్క శిథిలములుండుటచేతను బోధన మొదటి యుద్ధమల్లునికాలము (అనగా క్రీ. శ. ౮-వ శతాబ్దము) కన్నను కడుప్రాచీనమైన దని యూహించవచ్చును.

సింహకవియు, వేములవాడ శాసనకర్తయు, మొదటి యుద్ధమల్లుడు పాలించిన సపాదలక్ష యను దేశమున బోధన నగరము గల దని చెప్పుచున్నారు. చరిత్ర పరిశోధకులకు కలిగిన సహాయ కారణము యశస్తిలక వ్యాఖ్యలో శ్రుతసాగరసూరి 'అశ్మకాంత' శబ్దమునకు 'సపాదలక్షునామ' అని అర్థము వ్రాసినాడు[13]. ఈవ్యాఖ్యానముయొక్క కాలము

11. ఫ్లీటు. D. K. D., పు. 380-1. తప్పులతో నచ్చుపడిన కన్నడభాషా కర్ణాటికా పంపభారత ప్రతి నాధారము చేసుకొని ఫ్లీటుగారు మొదటి అరికేసరి వేంగీమండలములో గూడుకొని నిరుపముని రాజ్యముమీదికి దండెత్తివచ్చె నని చెప్పెను. అల్టేకరుగారు (రాష్ట్రకూటులు పు. 51.) ఈ పై విషయముచే నిరుపమధ్రువునికిని వాని యన్న యగు రెండవ గోవిందునికిని యుద్ధసూచన యను విషయము ధ్రువపడుచున్నదని తలంచుచున్నారు. కాని, ఇప్పుడు పరిశుద్ధమైన భారతప్రతి వెలువడినంతట నిరుపమునిం గూర్చిన పదములో నట్టి విషయ మేమియు లేదని తెలియుచున్నది. నిజము చూడగా నిరుపముని కాలమున మొదటి అరికేసరి వేంగీ కళింగములను రెంటిని ఒక్కమారుగా జయించి తన నామధేయమును దిగంతములయందు లిఖించె నని చెప్పుచున్నది. రెండవ గోవిందునికి వేంగీరాజు సాయము చేయుటచే ధ్రువుడు వాని సోదరునికి సాయము చేసినవారిని తాను సింహాసనమునకు రాగానే ఎదిర్చెను. ఈ సందర్భమునందే అరికేసరి దండయాత్ర వచ్చెను. నిరుపమునికిని అరికేసరికిని యేవిధమైన విరోధ మున్నట్లు సూచన లేదు. సామంతుడుగానే అరికేసరి ఈ భాగములను జయించె నని యూహించుట కవకాశ మున్నది.

12. అల్టేకరు, రాష్ట్రకూటులు పు. 107-8: పంపభారతము, IX పర్వము. 52 పద్య. తర్వాత వచనము.

13. యశస్తిలక, I శ్లో. 207-8 వ్యాఖ్య.

తెలియక పోయినను ఈ యంశము సమ్మదగి యున్నది. బోదన (ఈకాలపు బోధన్) అను నగరము చాల పురాతన మైనదిగా, అశ్మక దేశమునకు సరియగు సపాదలక్ష దేశమున నుండినందున ఇదియే బౌద్ధవాఙ్మయమున తెలియవచ్చు అశ్మక రాజధాని, పోతన అని నిర్ణయించుట సమంజసముగా నున్నది. ఈ ప్రదేశమున దొరకు ప్రాచీన శిథిలముల చేతనే గాక దాని పేరిచేతను సైతము ఇది కడు ప్రాచీన మనియు, అశ్మక దేశ రాజధాని యనియు తెలియనగుచున్నది. గోదావరీతీరముననే ప్రతిష్ఠానమునకు ఆగ్నేయమున నున్నది. సుత్తనిపాత గ్రంథములలో చెప్పినట్లు, అశ్మక దేశము గోదావరీ ప్రాంతమునను, ప్రతిష్ఠానము రాజధానిగా గల ముళకకు దక్షిణమునను కలదను వాక్యములకు సరిపోవుచున్నది.

నిజామాబాదు జిల్లాయు, దానికి దాపున నుండు జిల్లాలును అశ్మక దేశమనియు దానికి, నేను బోధన్ అనబడు పోతన రాజధాని యనియు నిర్ణయించుటచేత ప్రాచీన గ్రంథములలోని వర్ణనలకును శాసనములలోని వివరములకును సరిగా అతికిపోవుచున్నది. ఇంకను ఈ ప్రదేశమున త్రవ్వి పురాతత్త్వశాస్త్రజ్ఞులు పరిశోధించినయెడల పురాతన కాలమున మన దేశమున నుండిన గొప్పనగరములలో నొకదానిని గుర్తించిన నా యీ నిర్ణయము ఇంకను బలపడునని నమ్ముచున్నాను.

శాసన ప్రమాణములును ఆధారములును తక్కువగా నుండుటచే ఈ దేశము యొక్క హద్దులు ఇవి యని ఇప్పుడు చెప్పుటకు సాధ్యము కాదు. కాని జాతక కథలలోని 'చుల్లకళింగ' జాతకములో అస్సక రాష్ట్రాధిపతి అరుణునికిని కాళింగునికిని జరిగిన యుద్ధములను వర్ణించునెడ చూడగా అస్సక రాష్ట్రపు హద్దులు కళింగదేశపు పడమటి ఎల్లలను తాకినట్లు తెలియుచున్నది. అట్లయిన ఇప్పటి నైజాము రాష్ట్రముయొక్క తూర్పు హద్దులలో దక్షిణముఖముగా ప్రవహించు గోదావరీనది బహుశః అశ్మకము యొక్క తూర్పు ఎల్లగా నుండియుండును. కాని శాసనపరిశోధకులు నైజాము రాష్ట్రములో సంచరించి విశేషముగా తనిఖీచేసి ఇతర ప్రాచీన ప్రదేశములను, సాతవాహనుల శాసనములలో పేర్కొనబడినవియు వారి పాలనకు లోబడియుండినవియు నైన అసిక, అసక, ముళక యనువానిలో ముఖ్యముగా అసిక[14]ను గుర్తించి పనిచేసిన విశేష విషయములు తెలియగలవు.

---

14. ఈ 'అసిక' రాష్ట్రము ఖారవేలుని హాతిగుంఫశాసనములో ౪-వ పంక్తిలో పేర్కొనబడియున్నది. ఈ శాసనపరిశోధకులగు జయస్వాలుగారు (J. B. O. R. S., XIII (1927)) బారువగారు (Old Brahmi Inscriptions, P. II) ఈ పదమును 'మూసిక', 'అసక' అని వేర్వేరుగ చదివిరి. కాని బాగుగ పరిశోధించిన 'అసిక' యనియే రూఢిగా చదువనగును. ఈ దేశము కళింగమునకు పడమట నున్నట్లు శాసనములోని వర్ణన సందర్భమున తెలియుచున్నది.

వీడ్కోలు

కుందుర్తి నరసింహారావు

నా సను తెలియు నావలి ప్ర[illegible] నిష్ట [illegible]
నా ప్రియసఖి గా[illegible] పుణ్యముల [illegible]
[illegible], [illegible] మాలి[illegible] [illegible]
[illegible], [illegible] మ్మ[illegible] యు [illegible].

నే నన్ ప్రియసఖిగా [illegible]
క్రోసుల [illegible] ప్రమాదముల [illegible]
[illegible] సంబంధ[illegible] [illegible]
లాసమ్ము[illegible] మదిలో[illegible] [illegible].

నాకు[illegible] [illegible]
లం కేళీ[illegible] నుపాద[illegible] [illegible], [illegible]
నాకుం [illegible] వ్యజించి[illegible] [illegible] ప్ర[illegible]
[illegible] కన్పట్టెట బూర్వ[illegible] [illegible].

కల యనుకొంటి [illegible], [illegible]
డంపరిభూత భూరిపికట[illegible] దగ్గగా[illegible]
హ్వాంతకు నామన మ్మహలి 'నా[illegible]' [illegible]
అలిగెనో నాపయి[illegible] [illegible] మన సంతసముగా [illegible] పోయెనో !

ఈ సంక్షోభము నా[illegible]పునకు మూడే [illegible]నో, నాకు నీ
నే నన్ ప్రియసఖిగాన సంభవమాటం చీరిటి [illegible]మనో,
నా సంకోచము జూచి నవ్వునో "[illegible] [illegible]మే [illegible]నో
మోస మ్మింతయు లేక ని న్విడిచిపోవ[illegible] తొందగే !" [illegible].

జర్మనీదేశంలో నాజీఉద్యమం

కొచ్చెర్లకోట సత్యనారాయణమూర్తి

భాషా, ఆచారవ్యవహారాలు, ఇతరసంప్రదాయాలు వేరుగా వుండటంతోబాటు ఇరుగుపొరుగు దేశాలభయంకూడా వుంటేనేగాని స్వదేశాభిమానం ప్రజలలో గాఢంగా నాటుకోదు. ఆంధ్రోద్యమం యెప్పుడూ తెలుగుదేశంలో వున్న సరిహద్దుజిల్లాలు ముమ్మరంగా వుండటం, ఇతర ప్రాంతాలు నిమ్మళంగా వుండటం, దీనికి నిదర్శనంగా చెప్పవచ్చును.

సముద్రంవల్లగాని ప్రత్యేకసముదాయాలలో తప్ప సామాన్యంగా ఇంగ్లాండు ఫ్రాంసు రష్యా దేశాలలో జాతీయభావం విస్తారంగా పైకి అగపడదు. మొన్నటి ఐరోపాయుద్ధంలోను, అంతకుపూర్వం నెపోలియను రోజులలో ఇంగ్లాండు రష్యాలలోనూ, బిస్మార్కు రోజులలో ఫ్రాంసులోనూ, జాతీయభావం ప్రత్యక్షంగా కనబడేది. కాని ఇప్పటి జాతీయోద్యమాలకి యీ మూడుదేశాలు పుట్టినిళ్లు కావని చెప్పాలి. పరరాజులచేతులలో తిని స్వాతంత్ర్యమూ ఐకమత్యమూ కోల్పోయిన ఇటలీ, ఫ్రాంసుదేశమంటే సింహస్వప్నమైన జర్మనీదేశం, రష్యా జర్మనీదేశాలమధ్య నలిగిపోతూవున్న పోలండు, జెకోస్లోవేకియా దేశాలు, ఇంగ్లాండుపరిపాలనక్రింద అణిగిపోయిన ఇండియా, ఈజిప్టు, ఐర్లాండు దేశాలు — ఇటువంటిదేశాలే ఇప్పటి జాతీయోద్యమాలకు జన్మస్థానాలు.

గాఢమైన ఇట్టి జాతీయాభిమానాలు, ఇందుకు సంబంధించిన పొలిమేరల తగవులు, — ఇవి గడచిన ఐరోపాయుద్ధానికి ప్రధానకారణాలు. అందులో ముఖ్యంగా నష్టపడ్డ స్లావుజాతి — జెకోస్లావకుజాతిని ఆస్ట్రియా హంగరీదేశాలు పంచుకోవడంవల్ల ఆ జాతికి ప్రత్యేకజీవనానికి యోగ్యత లేకపోయింది. పోలిషు జాతిని మూడుసామ్రాజ్యాలు పంచుకున్నాయి. చిరకాలంనుంచీ స్వాతంత్ర్యంకోసం, ప్రత్యేకరాష్ట్రంకోసం పరితపిస్తూవున్న ఆ జాతిని ఆ విధంగా వేరుచేసి అణగదొక్కడమే ఆ సామ్రాజ్యాల ఉద్దేశం. యుగోస్లావు జాతికి సెర్బియా మాంటినీగ్రోలని రెండురాష్ట్రాలు లున్నప్పటికీ ఆ జాతివారింకా కొంతమంది ఆస్ట్రియా, హంగరీదేశాలలో మిగిలిపోయారు. బల్గేరియావారిలో కొంతమంది టర్కీక్రింద వుండిపోయారు. రష్యావారిలో 3½ లక్షల మందిని ఆస్ట్రియా, హంగరీదేశాలు ఆక్రమించుకున్నాయి. గ్రీకు, రుమేనియనుల గతికూడా ఆవిధంగానే వుంది. జర్మను లందరూ వక్క ప్రత్యేకరాష్ట్రంకింద వుండేయోగ్యత ఇంకా పట్టనేలేదు.

ఈ అశాంతితో, అసంతృప్తితో, కడుపుమంటలతో, మనోవేదనలతో ౧౯౧౪-వ సంవత్సరపు మహాయుద్ధం ప్రారంభమైంది.

'ప్రజాప్రభుత్వం నశించింది' అని మనం పాట పాడుతూవున్న ఇంగ్లాండు ఫ్రాంసు బెల్జియం దేశాల రాజ్యాంగవిధానాలుమాత్రమే ఆ అగ్నికుండంలోనుంచి మునుపటిరూపాలతో బైటపడ్డాయి. అందులో ప్రవేశించిన తక్కిన సామ్రాజ్యాల రాజ్యాంగవిధానాలు రూపూ రేఖా అగపడకుండా మారిపోయినాయి.

రష్యాదేశం, యుద్ధంలో దెబ్బతిని అంతఃకలహాలతో సంఘవిప్లవాలతో విసిగి, కమ్యూనిస్టుపద్ధతుల మీద కొత్తనాగరికతను సృష్టించుకోడానికి ప్రారంభించింది. ఇటలీదేశం, పేరుకుమాత్రం యుద్ధంలో గెల్చినా ఆగెలుపువల్ల యేలాభమూ పొందకపోవడమే కాకుండా మునుపున్న జవసత్వాలుకూడా నశించి, అంతఃకలహాలతో కుంగిపోయి, ముందుదారి తెలియక తొక్కులాడి, తుదకు తన అంతఃశక్తిని తేజస్సును బైటపెట్టుకుని జీవించడానికి ప్రబలప్రయత్నం చేస్తోంది.

జర్మనీదేశం, తన తప్పేమీ లేకపోయినా అప్పటి రాజ్యతంత్రజ్ఞుల లోపంవల్ల ప్రారంభమైన యుద్ధంలో, భారతయుద్ధంలో [illegible] కలిసి [illegible] వంటరిని చేసి పొడిచి చంపినట్లు, బలంకల దేశాలన్నీ కలిసి, ఆక్రమించి, వారియుద్ధపుఖర్చులన్నీ తనవద్ద వసూలుచేసినప్పుడు, ఆ అవమానంలో కుంగిపోయి, 'జర్మనుజాతి'ని పునరుద్ధరించుకొని తన అభిమానం నిలుపుకోవడానికి ప్రయత్నంచేస్తోంది. ఇతర చిల్లరరాష్ట్రాలుకూడా యీ విధంగానే, [illegible]మైన తమచిక్కుల్ని పరిష్కరించుకునే ప్రయత్నాలతో నలిగిపోతున్నాయి.

ఈ దేశాలన్నిటిలోనూ, అందు ముఖ్యంగా రష్యా ఇటలీ జర్మనీ దేశాలలో జరుగుతూవున్న ప్రయత్నాలలో దేశకాలపాత్రాదులనుబట్టి భేదాలున్నాయికాని కొన్ని పోలికలుకూడా వున్నాయి. ఇంతకాలం యూరపుఖండంలో అమలులో వుండి పేరుపొందిన పాతపద్ధతులపై తిరగబడి, వాటిని కాలకింద తొక్కి, తమతమ పరిస్థితులకు అనుకూలమైన కొత్తపద్ధతులలో తమ జాతులను పునరుద్ధరించుకోవడానికి ప్రయత్నించడమే యీమూడు దేశాలకు సామాన్యమైన మొదటిలక్షణం.

ప్రజాప్రభుత్వమన్నా, వ్యక్తిస్వాతంత్ర్యమన్నా, ముఖ్యంగా రష్యా జర్మనీ ఇటలీదేశాలలో గౌరవం నశించింది. ఈ మూడు దేశాలవారి అభిప్రాయంలోను, ప్రజాప్రభుత్వాలలోవుండే వ్యక్తిస్వాతంత్ర్యం యథేచ్ఛలోకి దిగింది. బహునాయకత్వం, కక్షలు, కుట్రలు, అన్యాయాలు, అంతఃకలహాలు, ప్రజలదారిద్ర్యం — వీటికింద పరిణమించింది. అడ్డుపడేవాళ్లు లేకుండా పెద్దచేప చిన్నచేపను తినే 'మాత్స్యన్యాయం' ప్రబలించింది. స్వేచ్ఛపేరా, ఎన్నికలపేరా, పార్టీప్రభుత్వాలపేరా జరుగుతూవున్న కొట్లాటలలో జాతియొక్క జవసత్వాలు, ధైర్యస్థైర్యాలు నశించడం, ప్రజలు దారిద్ర్యబాధతో కుంగిపోవడం — ఇట్టి అనర్థకాలు సంభవిస్తున్నాయి. సాంఘికపౌరాణికులూ నీతిశాస్త్రవేత్తలూ దేనిని దేశానికంతకూ మహా అరిష్టంగా భావించి భయపడేవారో అట్టి "అరాజకం" అనేక ప్రజాప్రభుత్వాలలో వ్యక్తిస్వాతంత్ర్యం పేర చాలావరకు ఏర్పడింది.

కాబట్టి ఆ మూడు దేశాల నాయకుల అభిప్రాయంలో, ప్రజాప్రభుత్వాలలో కనపడుతూవున్న ఆ విచ్చలవిడితనాన్ని అరికట్టి వ్యక్తిస్వాతంత్ర్యం పేరచెల్లాచెదురైన ప్రజల జవసత్వాలను ధైర్యస్థైర్యాలను కూడగట్టుకొనిన్నీ, ఏకోన్ముఖానికి తెచ్చి, జాతిని పునరుద్ధరించాలి. బలవంతులు బలహీనుల్ని పీడించకుండా ధర్మసంస్థాపన చేయాలి. జాతియొక్క ఐశ్వర్యానికి విజ్ఞానానికి [illegible] వ్యక్తిస్వాతంత్ర్యాన్ని రూపుమాపాలి. ప్ర[illegible]తత్వం, [illegible]స్థానం ప్రభుత్వంయొక్క నిరంకుశాధికారాన్ని తిరిగి స్థాపించాలి. మతప్రవృత్తులు, [illegible] జాతిని సృష్టించాలి. పునాదులవద్దనుంచి కొత్తజీవనాన్ని నిర్మించాలి; ఎందువల్లనంటే పాత వ్యక్తిప్రధానం, అజ్ఞానంలోను దారిద్ర్యంలోను మునిగితేలుతూవున్న గుంపుసమష్టం గాని వ్యక్తిస్వాతంత్ర్యానికి నోచుకోలేరు. కాబట్టి పాశ్చాత్యపద్ధతులను, విద్యావిధానాలను, వాణిజ్యాన్ని, [illegible] సరిదించి నాటిలోనుండి జాతీయతానిర్మాణానికి అనుకూలమైన విధానాలను ఏర్పాటుచేస్తూ ప్రోత్సహించాలి; [illegible] చేయాలి. అందుకు వ్యతిరేకమైన అభిప్రాయాలను [illegible].

నాజీపద్ధతిప్రకారం, ప్రజాసామాన్యంయొక్క జీవితక్రమాన్ని [illegible] కేంద్రప్రతినిధ్యంలో, [illegible], మిలటరీ పద్ధతులమీద, నడిపిస్తేనేగాని జాతిని పునరుద్ధరించడం సాధ్యంకాదు. వ్యక్తుల బొట్టు, కట్టు, వేషభాషలకుకూడా నీతినియమాలను [illegible]. పూర్వపద్ధతులలో జాతిని క్రిందికి దిగలాగుతూవున్న కుటుంబం మతం, వాస్తవ్యం - వీటివలలలోనుంచి యువకులను తప్పించి కొత్త అభిప్రాయాలలో వారికి మిలటరీపద్ధతులమీద శిక్షణ ఇవ్వాలి.

ఈ పద్ధతులలో హృదయప్రధానకమైన సానుభూతికల ఒక్కపార్టీ, ప్రభుత్వాధికారాన్ని గుత్తగా ఆక్రమించుకుని, సమర్థుడైన ఒక నాయకుని [illegible]కింద యీ కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టాలి. అంతేకాని ప్రజాప్రభుత్వాలలో అమలులో వున్న పార్టీగవర్నమెంటు పద్ధతులు దేశాభ్యుదయానికి అనుకూలం కాదు.

రష్యా ఇటలీ జర్మనీదేశాలలో నేడు ప్రబలుతూ వున్న రాజకీయపద్ధతుల సామాన్యలక్షణాలివి.

కుంగిపోతూవుండిన హిందూసంఘాన్ని మత సంస్కరణాలచేత తిరిగి తిరిగి ప్రాణంపోసి పునరుద్ధరించిన బుద్ధుడు శంకరుడు రామానుజుడు మొదలైన సంస్కర్తలయొక్క, హిందూచక్రవర్తుల నిరంకుశాధికారాన్ని స్థాపించి బలపరచడానికి పాటుపడిన చాణక్యుడు మొదలైన హైందవ నీతిశాస్త్రవేత్తల యొక్క ఆశయాలూ పద్ధతులూ కొంతవరకు ఇటువంటివే అని చెప్పవచ్చును.

ఇప్పుడు మనం జర్మనీదేశపు వృత్తాంతాన్ని గమనిద్దాం. అభిమానధనులైన జర్మను లన్నిపక్షాలవారూ వర్సైల్సుసంధిని తీవ్రంగా నిరసించారు. తమపూర్వులు చేసిన తప్పుకోసం తమమీద మిత్రమండలివారు ఈవిధంగా నిర్దాక్షిణ్యంగా కసితీర్చుకోవడం అన్యాయమనీ క్రూరమనీ భావించారు. యుద్ధానికి జర్మనులొక్కరే కారకులన్న సంధిమాట, అపజయపరాభవంతో కుంగిపోయిన జర్మనుల మనస్సులకు, పుండుపై కారం చల్లినట్లైంది. అంతే కాదు. మిత్రమండలివారు నిర్బంధంగా తమ దేశంలో కొంతభాగాన్ని లాక్కున్నారు. జర్మనులలో కొంతమందిని ఇతరరాష్ట్రాలకు పంచిపెట్టి, జర్మనుజాతిని చీల్చివేశారు. అసలే యుద్ధంవల్ల తమ వృత్తులూ వ్యాపారాలూ నశించిన దుస్థితిలో మిత్రమండలియొక్క యుద్ధపు ఖర్చులనుకూడా తమవద్ద వసూలు చేశారు. ఈసందర్భాలలో తక్కిన యూరోపియను రాష్ట్రాలయెడల జర్మను లన్నిపక్షాలవారికీ తీవ్రమైన వైరభావమూ, "ఈపగను ఎన్నటికైనా సాధించాలి" అన్న కసీ యేర్పడ్డాయి. పైగా దేశంలో ఆర్థిక దుస్థితి దుర్భరమైంది. తినడానికి తిండీ, చేయడానికి పని పాటులు లేక ప్రజలు బాధపడ్డారు. మధ్యతరగతి ప్రజ సంపూర్ణంగా నాశనమైంది. ఈమహాకష్టాలలో నిరాశలో కైజరుచక్రవర్తినాటి జాతీయాభిమానం ప్రజల ఆకలిబాధను తీర్చలేకపోయింది. 'ప్రపంచంలో వున్న బీదసాద లందరూ ఏకంకావాలి' అన్న రష్యను సామ్యవాదుల బోధనలు వారికి ముక్తిమార్గం చూపలేకపోయాయి. ఈస్థితిలో హిట్లరు తనజాతీయ సామ్యవాదప్రచారం ప్రారంభించినప్పుడు దేశమంతా అతని వెంట పడింది.

ప్రజాజీవితాన్ని కొత్తపద్ధతులమీద నడపడానికి సంపూర్ణాధికారం వహించిన రష్యా ఇటలీదేశాలు హిట్లరుకు దారి చూపాయి. ఇటాలియన జాతీయభావాన్ని పురికొల్పి ముసోలినీ ఇటలీదేశాన్ని ఒకటిగా చేశాడు. రష్యాలో బీదవాళ్లప్రభుత్వం స్థాపించి, 'ఉన్నవారు, లేనివారు' అన్న తరగతులవిభజనపై లెనిన్ రష్యాదేశాన్నంతటినీ ఏకంచేశాడు. రష్యాదేశంలో వున్న బీదవాళ్లూ భాగ్యవంతులూ అన్నతరగతుల విభజన, ఇటలీవా రందరూ ఏకజాతివారై యుండాలి అన్న దేశీయభావము, — ఈ రెంటినీ హిట్లరు తన 'జర్మనుజాతి' అన్న భావంలో సమన్వయం చేశాడు.

సోవియటు రష్యాలో కమ్యూనిస్టు పద్ధతులను అంగీకరించిన అన్ని తెగలూ అన్ని జాతులూ సమాన హక్కులు అనుభవించవచ్చును. ఇటలీలో పౌరు లందరూ ఇటాలియనుజాతివారు కావాలి. ధనార్జనకోసం చేసే తాత్కాలికపౌరులకు ఆసభ్యతలో స్థానం లేదు. జర్మనీలో, నాజీపక్షంవారి సిద్ధాంతంప్రకారం, స్వచ్ఛమైన ఆర్యసంతతికి చెందినవారమని రుజువుచేసుకోలేని వారికి పౌరసత్వపుహక్కులు లేవు. 'పవిత్రమైన' 'ఆర్య' రక్తం శరీరంలో లేనివారిని కేటాయించి ప్రత్యేకంగా వుంచాలి. జర్మనువిజ్ఞానంలో ప్రవేశించిన విదేశీయమైన, అజాతీయమైన సంప్రదాయాలను అన్నిటినీ ఏరి నిర్మూలం చెయ్యాలి. "జర్మను సామ్యవాదులు కోరేది విద్యావిధానాన్ని సంస్కరించడం కాదు; దానికి కొత్తపునాదులు వేయడం, పునాదుల వద్దనుంచీ దానిని కొత్తగా సృష్టించడం, ఇది వారి వుద్దేశం. విద్యావిధానంలో అంతకు పూర్వంనుంచీ వుండిన ఇతర 'మంచి' భావాలను వారు మార్చకపోయినా, 'నాజీ' పార్టీకి వ్యతిరేకమైన అభిప్రాయాలను మాత్రం వారు దయాదాక్షిణ్యాలు లేకుండా నిర్మూలం చేస్తారు" అని ఆపార్టీతరపు పత్రికాధిపతి ౧౯౩౪ లో వ్రాశాడు.

రష్యా ఇటలీదేశాలలోమాదిరిగానే జర్మనీలోకూడా యువజనోద్యమా లన్నీ ప్రభుత్వాధికారం

కింద కేంద్రీకరింపబడ్డాయి. స్కూళ్లలోనే కాకుండా బైటకూడా జాతీయోద్యమానికి అనుకూలమైన తర్ఫీతును విద్యార్థుల కిస్తున్నారు. యువకు లందరూ నాజీ సిద్ధాంతాలను నేర్చుకోవాలి; అనుసరించాలి; జర్మను రక్తాన్ని శుచిగా వుంచాలి. పట్నవాసపు విద్యార్థు లందరూ నిర్బంధంగా కొంతకాలం గ్రామాలలో పొలం పనులు నేర్చుకోవాలి. ఎనిమిదేళ్లు స్కూళ్లలో నిర్బంధవిద్య; అటుపిమ్మట ఒకయేడు నిర్బంధంగా పల్లెటూరి నివాసం, అక్కడ సుశిక్షితులైన నాజీ ఉపాధ్యాయుల క్రింద గ్రామజీవనం, గ్రామపనిపాటులు, నాజీసిద్ధాంతాలు నేర్చుకోవడం—ఈ విధంగా విద్యార్థు లందరూ మిలటరీ పద్ధతులమీద శిక్షను పొందుతున్నారు. సైనిక పద్ధతులుగాని మిలటరీపద్ధతులు కావు అని నాజీపార్టీవా రంటున్నారుగాని ఆరెండుమాటలకూ వ్యత్యాసం స్పష్టం కాదు.

హిట్లరుపరిపాలన ౩౦ జనేవరి ౧౯౩౩ తో ప్రారంభమైంది. ఫిబ్రేవరి ౪-వ తేదీని ప్రజల బహిరంగసభలు ఊరేగింపులు, ప్రచురణాలు ప్రభుత్వాధికారంకిందకు తేబడ్డాయి. ఆనెల ౨౭-వ తేదీని రీకుస్టాగు భవనాన్ని యెవరో తగలబెట్టారు. ఆవంకబెట్టి ప్రజల వ్యక్తిస్వాతంత్ర్యం, వాక్స్వాతంత్ర్యం, పత్రికాస్వాతంత్ర్యం, సభలస్వాతంత్ర్యం, ప్రజలు తమలో తాము ఇష్టం వచ్చినట్లు రహస్యంగా వుత్తరాలు రాసుకునే స్వాతంత్ర్యం, టెలిఫోనులద్వారా మాట్లాడుకునే స్వాతంత్ర్యం, వీటిని రద్దుచేశారు. ప్రభుత్వం తన కిష్టంవచ్చిన ఇళ్లను సోదాచేయవచ్చును; ఇష్టంవచ్చిన ఆస్తిని వేలంవేయవచ్చును. మరొకచట్టప్రకారం, కమ్యూనిస్టులను అందరినీ అరెస్టుచేయవచ్చును. మార్చి ౮-వ తేదీ చట్టప్రకారం ఇట్టిచర్యలలో నేరాన్ని రుజువుచేసే తంతును లుప్తపరిచారు. ఆనెల ౨౪-వ తేదీని శాసననిర్మాణసభలతో నిమిత్తం లేకుండా హిట్లరుకు నాలుగేళ్లకాలం సంపూర్ణాధికారం ఈయబడింది. హిట్లరు ఆజ్ఞలకు శాసనాధికారం ఏర్పడింది. తనపార్టీకి వ్యతిరేకమైన అభిప్రాయం వున్నవారిని అణిచివేయడం ఆ అధికారంతో అతడుచేసిన మొదటిపని. జాతీయసామ్యవాదుల పార్టీ వక్కటే జర్మనీలో శాస్త్రసమ్మతమైన పార్టీ అనీ, దేశానికి సంబంధించిన ముఖ్యవిషయాలను గురించి ప్రజాప్రతినిధులతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రజలను ప్రత్యక్షంగానే వోటును అడగవచ్చుననీ, ఆయేడు జూలై నెల ౧౪-వ తేదీని హిట్లరు ఆజ్ఞాపించాడు. ఆవిధంగా ప్రజాప్రతినిధుల సభలద్వారా గాక ప్రత్యక్షంగా ప్రజలను వోట్లు అడిగేపద్ధతిని ప్రత్యక్షమైన 'ప్రజాప్రభుత్వం' అన్నారు. దాన్నే 'రెఫరెండం' అనికూడా అంటారు.

ఇక హిట్లరు తనప్రభుత్వాన్ని బలపరుచుకోడానికి ప్రారంభించాడు. ప్రెసిడెంటు హిండెన్‌బర్గు రేపు చనిపోతాడనగా ఆముందురోజున అతని ప్రెసిడెంటు అధికారాన్ని ఛాన్సలరైన హిట్లరువశం చేశారు. నాజీపక్షంవారు కారనీ, 'ఆర్య'సంతతివారు కారనీ, అనుమానంగా వున్న ఉద్యోగులను మొత్తం ఉద్యోగుల సంఖ్యలో సుమారు ఐదోవంతుమందిని తీసివేశారు. ప్రభుభక్తినిసూచించి ఉద్యోగులు తీసుకునే ప్రమాణంలో మార్పులు వచ్చాయి డిసెంబరు ౧, ౧౯౩౩-వ తేదీని అమలులోకి వచ్చినప్రమాణం "నేను ప్రమాణం చేస్తున్నాను. జర్మనుజాతి, దేశం, రాజ్యాంగవిధానం, చట్టాలు వీటి యెడల విశ్వాసంతో వుంటాను; నాఉద్యోగధర్మాలను మనఃపూర్తిగా నిర్వర్తిస్తాను. ఈవిధంగా భగవంతుడు నాకు సహాయం చేయునుగాక" అని వుంది. ఎనిమిది నెలల తర్వాత, అనగా ౨౦-వ ఆగస్టు ౧౯౩౪-వ తేదీని ఆప్రమాణంలో "జర్మనుజాతి", "జర్మను దేశం" అన్నపదాలను తీసివేసి "అడాల్ఫు హిట్లరు"కే ప్రాధాన్యమిస్తూ కొన్ని పదాలను చేర్చారు. ప్రభుత్వోద్యోగి రాజ్యాంగవిధానాలను చట్టాలను గౌరవించనక్కరలేదు; తన ఉద్యోగధర్మాలను మనఃపూర్తిగా నిర్వర్తిస్తే చాలును. ఈమార్పు జరిగిన మూడువారాలకు పూర్వమే ప్రెసిడెంటు హిండెన్‌బర్గు గతించాడు.

జర్మను పౌరసత్వపు హక్కుల్ని ఎవరి కీయవచ్చునో ఎవరి కీయగూడదో నిర్ణయించే అధికారం కూడా హిట్లరుపరమైంది. ౧౯౩౩-వ సంవత్సరం జూలై నెల ౧౪, ౨౬ తేదీల శాసనాలప్రకారం, జర్మను పౌరులుగా ఉండదగనివారి పౌరసత్వపు హక్కులన్ను

రద్దుచేసి వారి ఆస్తులను ప్రభుత్వం లాక్కోవచ్చును. ఇవి 'జ్యూ'జాతినిగురించి ఉద్దేశింపబడ్డ చట్టాలు. ౧౫-వ సెప్టెంబరు ౧౯౩౫ తేదీ శాసనప్రకారం, జర్మను పౌరస్వత్వపుహక్కులు 'ఆర్య' సంతతివార మని ఋజువుచేసుకోగల జర్మనులకుమాత్రమే యని ప్రత్యేకించారు. రాజ్యాంగవిధానంలో అదివరకుండిన అరాజకచిహ్నాలను అణిచివేసి అధికారాన్నంతటినీ కేంద్రీకరించారు. నిర్జీవంగావున్న స్థానికప్రభుత్వ సంస్థలకు కొత్తప్రాణం పోసి వాటికి కార్యోత్సాహం కల్గించారు. నాజీప్రభుత్వంయొక్క కార్యక్రమం ఆచరణలో పెట్టడంలో స్థానికసంస్థలన్నీ సహాయంచేయాలి. జర్మనుజాతిని ఉద్ధరించడమే వాటికికూడా గమ్యోద్దేశం కావాలి. ౧౯౩౩-వ డిసెంబరు ౧౫-వ తేదీని జరిగిన స్థానికసంస్థల సభలో జర్మను ప్రభుత్వంయొక్క లక్ష్యం ఈవిధంగా వర్ణింపబడింది. "వ్యక్తి" కంటె స్థానికసంస్థని, వ్యక్తుల స్వార్థలాభంకంటె స్థానిక సంస్థలలాభాన్ని యెక్కువగా చూసుకోవాలి' అన్నదృఢ సంకల్పంతో జాతి అంతా ఏకం కావాలి. ఉత్తమనాయకత్వంకింద, 'మనమందరం ఒక్కటే' అన్న ఉదార సమభావంగల యథార్థమైన ప్రజాసంఘాన్ని ఇప్పటి యువకులలోనుంచి తయారు చెయ్యాలి. స్థానికసంస్థను సేవించడ లో వ్యక్తి తనసంగతిని మరిచిపోవాలి; జాతిని సేవించడంలో స్థానికసంస్థ తనసంగతిని మరచిపోవాలి. జాతీయప్రభుత్వంద్వారా జాతి పునర్జన్మను పొందాలి." ఇవి వారి ఉద్దేశాలు.

నిరుద్యోగసమస్యను పరిష్కరించడానికని చేయబడ్డ యేర్పాట్లలో కొన్ని మనకు చిత్రంగా కనబడతాయి.

(౧) చదువుకున్న ఆడవాళ్లు మగవాళ్లతో సమానంగా ఉద్యోగాలకు తయారుకాకుండా పెళ్లిళ్లు చేసుకుని ఇంటిపనుల్ని చక్కపెట్టుకునేటట్టుగా వారిని ప్రోత్సాహం చెయ్యడం; ఈ విధంగా జనసంఖ్య హెచ్చడం నాజీపక్షంవారి మిలటరీనీతికికూడా అనుకూలమైన విషయం.

(౨) మగవిద్యార్థులుకూడా మామూలు స్కూళ్లలోను కాలేజీలలోను విరివిగా చేరకుండా వారికి అనేక ఆటంకాలు కల్పించడం.

(౩) 'ఆర్యులు', 'జర్మనులు' కాని ఉద్యోగుల్ని ఉద్యోగాలనుంచి తొలగించడం.

(౪) ఇతరవృత్తులలోనుంచికూడా యీవిధంగానే ఏదో వంకపెట్టి జర్మనులు కానివారిని శేవగొట్టడం, అనగా, అటువంటివారిని, ప్లీడరీపని, సినీమా వాఙ్మయం, వార్తాపత్రికలు, రేడియో, నాటకశాలలు, సంగీతశాలలు, కళలు మొదలైన వృత్తులలోనుంచి తప్పించడానికి అనేకనిబంధనా లున్నాయి.

ఉదాహరణ: అధికారుల అనుమతి లేకుండా ఎవ్వరూ పాటకచ్చేరీలనుగాని సంగీతపాఠశాలల్నిగాని నడపరాదు. ఆ అనుమతిని జర్మనులు కాని వారి కియ్యరు.

(౫) ప్రజలకు పనిపాటుల్ని కల్పించడం కోసం కొన్నికొన్ని పరిశ్రమలలో చేతిపనిసేగాని మరలను వాడకూడదు. (Rgb ౪౯౩-౧౫-౭-౧౯౩౩.)

(౬) నిరుద్యోగులికి ఉద్యోగాలను వృత్తులను ఏర్పాటుచేసి సహాయంచేయడానికి ఒకకేంద్ర సంస్థను ౧౯౩౫ లో ఏర్పాటుచేశారు.

(౭) పరిశ్రమలలో సమ్మెలు రాకుండా పెట్టుబడిదార్లకూ పనివాళ్లకూ సఖ్యతను కుదర్చడానికి అనేకసంస్థలను ఏర్పాటుచేశారు.

(౮) యూనివర్సిటీలలో చేరడానికి ముందు ౨౫ ఏళ్లు లోపువయస్సువిద్యార్థు లందరూ (స్త్రీలు కూడా) ఆరునెలలు నిర్బంధంగా ఒక వృత్తిలో పనిచెయ్యాలి. స్త్రీ విద్యార్థినులు పొలంపనిలోగాని, విమానదళంలోగాని, దాదులుగాగాని, వార్తాపత్రికా విలేఖరులుగాగాని పనిచేసి యుద్ధకాలంలో దేశసేవకు సిద్ధంగా వుండాలి. నిరుద్యోగసమస్యను కొంతవరకు తీర్చడంతోబాటు విద్యార్థు లందరూ సైనిక తర్ఫీతును పొందడానికీ, నాజీ సిద్ధాంతాలను

నేర్చుకోడానికీ ఈ ఆరునెలలతర్ఫీఖు మంచి అవకాశం ఇస్తోంది.

యుద్ధకాలంలో దేశసంరక్షణ, విద్యార్థిసంస్థల ప్రధానోద్దేశంగా ౧౯౩౩ లోనే నిర్ణయమైంది. దేశసంరక్షణదృష్టి జర్మనుయూనివర్సిటీ చదువు లన్నిటిలోను ప్రవేశించింది. ప్రజ లందరూ మిలటరీతర్ఫీతును పొందాలన్న నియమం ౧౯౩౫ లో వచ్చింది. విద్యాసంబంధమైన పత్రికలలోకూడా దేశసంరక్షణ శాస్త్రాన్ని గురించిన చర్చలు కనపడుతున్నాయి ౧౯౩౬ లో విద్యార్థుల నిర్బంధమిలటరీ తర్ఫీఖుకాలాన్ని యేడాదినుంచి రెండేళ్లకు హెచ్చించారు. యుద్ధానికి జర్మను స్కూళ్లూ యూనివర్సిటీలూ సిద్ధంగా వుండాలన్న నాజీపార్టీవారి ఉద్దేశం చదువులలో స్పష్టంగా కనబడుతోంది.

ఉదాహరణకోసం జర్మనీలో ఎలిమెంటరీ స్కూళ్లలో వాడుకలోవున్న లెక్కల పుస్తకంలోనుంచి కొన్ని లెక్కలను ఇచ్చట వ్రాస్తున్నాను.

(౧) "బాంబులను వేసే మనవాయువిమానాలలో వకటి, పగలు గంటకు ౨౫౧ కీలో మీటర్లచొప్పునా, రాత్రిళ్లు గంటకు ౨౪౦ కీలో మీటర్లచొప్పునా గాలిలో యెగరగలదు. బెర్లినునగరంనుంచి ప్రేగునగరానికీ, మ్యూనిచ్‌నుంచి స్ట్రాస్‌బర్గుకూ, కొలోనునుంచి మెట్జ్‌నగరానికి అది ప్రయాణం చేయడానికి ఎంతకాలం పడుతుంది?"

(౨) "బాంబులను వేసే ౪౬ వాయు విమానాలదళం వకటి ఒకశత్రునగరంమీద బాంబులను వేస్తోంది. ఒకొక్కక్క వాయువిమానం ౫౦౦ బాంబులను మోసుకొనిపోతోంది. ఒకొక్కక్క బాంబుయొక్క తూనిక ౧౼ కీలోలు బాంబులన్నిటి మొత్తపుతూనిక యెంత? మూడింటికొక బాంబుచొప్పున నిప్పంటించగలిగితే, ఎన్ని మంట లేర్పడతాయి?

(౩) "కడచిన ప్రపంచయుద్ధంలో జర్మనీ దేశంయొక్క స్నేహితులు ౧ కోటి౧౦ లక్షల మంది మనుష్యులనూ, జర్మనీదేశం ౧ కోటీ ౩౦ లక్షలమంది మనుష్యులనూ యుద్ధానికి సమకూర్చారు. జర్మనీ దేశపు శత్రువులు ౪ కోట్ల ౭౦ లక్షలమందిని సమకూర్చారు. జర్మనీయొక్క, ఆదేశంస్నేహితులయొక్క ప్రతిపదిమంది సిపాయీలు ఎంతమంది శత్రువులను యుద్ధంలో ఎదుర్కొన్నారు?"

(౪) "కడచిన ప్రపంచయుద్ధం ౧,౫౬౩ రోజులు జరిగింది. రోజు ౧-కి ఎంతమంది, గంట ౧-కి ఎంతమంది, నిముషం ౧-కి ఎంతమంది జర్మను సిపాయీలు పితృదేశంకోసం తమప్రాణాలను వదిలిపెట్టారు?"

(మనం మనదేశాన్ని తల్లినిగా భావించినట్లే జర్మనులు తమదేశాన్ని తండ్రినిగా భావిస్తారు.)

(౫) "౧౯౩౪ లో ౪ కోట్ల ౨౦ లక్షల జనసంఖ్యగల ఫ్రాన్సుదేశం యుద్ధానికి సిద్ధంకావడానికి ౧౦౫౦ కోట్ల ఫ్రాంకులను ఖర్చుపెట్టింది. ఆరుకోట్ల ౬౦ లక్షల జనసంఖ్యగల జర్మనీదేశం ఆయేడు అపనికోసం ౬౫ కోట్ల మార్కులను ఖర్చుపెట్టింది. యుద్ధానికి తయారు కావడానికి తల ౧కి ఫ్రాన్సులో ఎంత మొత్తం ఖర్చుపెట్టారు? జర్మనీలో ఎంత మొత్తం ఖర్చుపెట్టారు?"

(౬) "౧౯౩౫ మార్చి ౧౬-వ తేదీని ౨౮౦౦ కిలోమీటర్లు పొడుగున్న సరిహద్దును కాపాడడానికి జర్మనీదేశానికి ౧ లక్షమంది సిపాయీలుండిరి. అదేపొడుగుగల సరిహద్దును కాపాడడానికి ఫ్రాన్సుదేశానికి ౬ లక్షలమంది సిపాయీ లుండిరి. ఫ్రాన్సుదేశంలో కిలోమీటరు ౧-కి ఎంతమంది సిపాయీ లుండిరి? జర్మనీలో ఎంతమంది వుండిరి? అదేవంతున జర్మనీలో ఇంకా ఎంతమంది సిపాయిలు వుండాలి?"

జర్మనుజాతిని పరిశుద్ధంగా వుంచడానికి తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జర్మనులు జ్యూమతస్థులను వివాహ మాడగూడదు. రోగం మొదలైన

కారణాలవల్ల బిడ్డలను కనగూడనివారికి నిర్బంధంగా వంధ్యత్వ మిప్పిస్తున్నారు. (౧౪-౭-౩౩; ౧౫-౯-౩౫)

ప్రజలలో కుటుంబాభిమానం జాత్యభిమానం పురికొల్పేటందుకు, వారు తమ వంశచరిత్రలను సమకూర్చుకోడానికి ప్రభుత్వం ప్రోత్సాహ మిస్తోంది (R M B xiii—౯౯—౧౯౩౫) యువకుల పరిసరాలను మార్చడానికి చేసే ప్రయత్నాలను ఇదివరకే సూచించివున్నాము.

(౧) పన్నెండు పుస్తకాలు పూర్తి చేసిన తరువాత ఒక యేడాదికాలం గ్రామాలలో విద్యాభ్యాసం చేయడం (P G S ౭౪౩; ౭౯—౩—౧౯౩౪).

(౨) ౨౫ ఏళ్ల వయస్సులోపు యువకులు, యువతులు, ఆరు నెలలు నిర్బంధంగా వృత్తులలో పని చేయాలి.

(౩) విద్యార్థు లందరికీ రెండేళ్లపాటు నిర్బంధంగా మిలటరీ శిక్షణ.

(౪) జాతీయవిద్యార్థిసంఘాలు. నాజీపక్షం వారి పద్ధతుల ప్రకారం సత్ప్రవర్తనగల యువకులను, యువతులను ఏరడం ఈసంఘాలపని.

(౫) వృత్తులలో పోటీపరీక్షలు.

(౬) యూనివర్సిటీలలో మొదటి ౧౨ మాసాలు నిర్బంధశరీరవ్యాయామం.

(౭) హిట్లరు యువజనసంఘాలు, జర్మను బాలికల సంఘాలు మొదలైన బాల, బాలికల రాజకీయసంస్థలు.

స్కూళ్లలోను యూనివర్సిటీలలోను చేరే విద్యార్థులు ఈసంస్థలలో చేరాలి. ఈపరీక్ష లన్నిటికీ ఆగగలవారే స్కూళ్లలోను యూనివర్సిటీలలోను పైతరగతులకు పోగలవారు. ౧౯౩౪ మార్చినెల చట్టంప్రకారం స్కూళ్లలో చేరే విద్యార్థులు నాలుగువిధాలైన పరీక్షల కాగాలి.

(౧) ఆరోగ్యం.

(౨) నీతినియమాలు — నాజీపక్షానికి నచ్చినవి అని అర్థం.

(౩) తెలివితేటలు.

(౪) జర్మను 'జాతి'కి సంబంధించిన పరీక్ష.

ఈవిధంగా జర్మనుపౌరులుగా వుండతగినవారిని ఏరి కొత్తజాతిని సృష్టించేప్రయత్నం విద్యాశాఖలో విద్యార్థియొక్క బాల్యంలోనే ప్రారంభమై, యూనివర్సిటీచదువులతో ముగుస్తోంది. పునాదులవద్దనుంచీ ప్రజల చిత్తవృత్తులు మారితేనేగాని విప్లవాలు కొనసాగవని ఒక జర్మనుచరిత్రకారుడు వ్రాశివున్నాడు. విరివిగా ప్రచారం జరిపి ప్రజలమనస్సులను మారిస్తేనేగాని సంఘాన్ని సంస్కరించడం సాధ్యంకాదని నాజీపక్షంవారి ఘట్టినమ్మకం. జర్మనుప్రచారమంత్రియైన గోబెల్సు తనకు హిట్లరుతో మొదటిసారి జరిగిన చర్చల సారాంశాన్ని యీవిధంగా వర్ణించాడు:

> "జనసామాన్యంలో ప్రబోధానికి ప్రత్యేకంగా వకమంత్రి వుండాలనీ, చదువులు, సినీమా, రేడియో, కళ, విజ్ఞానం, ప్రచారం — ఇవన్నీ అతని అధికారంకింద వుండాలనీ మావుద్దేశం.
>
> ....అది విప్లవకరమైన మార్పులను తెచ్చే జర్మనీయొక్క ఐక్యంకోసం పాటుపడే ఆఫీసు. అది వక బ్రహ్మాండమైన ప్రయత్నం. అటువంటిది, ఇదివర కెన్నడూ జరిగియుండలేదు. ... మాపార్టీయొక్క అధికారానికి మానసికంగాను ఆధ్యాత్మికంగాను పునాదులువేసి ప్రభుత్వాధికారాన్నే కాకుండా ప్రజల నందర్నీ కూడా స్వాధీనం చేసుకోడానికి అది ఉపయోగపడాలి."

ఈ మంత్రిని ౧౩-వ మార్చి ౧౯౩౩ తేదీని నియమించారు. ఇంతకాలం "స్వతంత్రంగా", విచ్చలవిడిగా, విరగబాటుగా ప్రవర్తకమవుతూవుండిన వృత్తులను కళలను ప్రభుత్వంయొక్క అధికారంకిందకు, అదుపాజ్ఞల కిందకు తేవడానికి ఇతడు నియమింపబడ్డాడు. క్రమంగా ఒకొక్కకళకు వృత్తికి నియమాలు యేర్పడ్డాయి. అన్నిటికంటె ముందు అదుపాజ్ఞలకు వచ్చింది సినీమా ౧౪ జూలై ౧౯౩౩ తేదీని. ౪-వ అక్టోబరు ౧౯౩౩ తేదీగల పత్రికానిర్వాహకచట్టాన్ని ఉదాహరణగా తీసుకుందాం. జర్మనీలోవున్న వార్తాపత్రికాధిపతు లం

దరూ 'జర్మను' పౌరులుగా వుండాలి, అనగా, 'ఆర్యులు' గా వుండాలి; వారు 'అనార్యు'లను వివాహమాడరాదు. వా రందరూ ప్రచారకమంత్రియొక్క అధికారానికి లోబడివుండాలి. పత్రికలకు సంబంధించిన అపచారాలను విచారించడానికి ప్రత్యేకంగా న్యాయస్థానా లున్నాయి. పత్రికాధిపతుల్ని నియమించడం, ఆపదవులనుంచి వారిని తొలగించడం, వారు తమధర్మాలను సరిగా నెరవేరుస్తున్నారో లేదో కనుక్కోడం, వారికి సంబంధించిన ఇతరతగువులు — వీటి నన్నిటినీ ఈ ప్రత్యేకన్యాయస్థానాలు విచారిస్తాయి. కాని ప్రచారకమంత్రి తన ఇష్టంవచ్చిన పత్రికాధిపతిని తీసివేయవచ్చును. ఈ ప్రకారంగా పత్రికఆఫీసులలో అక్షరాలను కూర్చే కంపాజిటర్ల దగ్గరనుంచి ప్రధానపత్రికాధిపతులవరకూ పత్రికానిర్వాహకవర్గ మంతా ప్రచారకమంత్రియొక్క యెదురులేని నిరంకుశాధికారంకిందకు తేబడింది.

వాఙ్మయం, వార్తాపత్రికలు, రేడియో, నాట్యకళ, సంగీతం, లలితకళలు, సినీమా — వీటిని అదుపాజ్ఞలలో వుంచడానికి, ప్రచారకమంత్రికి లోబడిన 'విజ్ఞానభవనం' అని వకసంస్థను ౧౯౩౩ సెప్టెంబరులో యేర్పాటుచేశారు. ఈ సంస్థను అతిక్రమించి ఆ యీ శాఖలలో యేపనీ జరగగూడదు. ఈ సంస్థయొక్క నిరంకుశాధికారం అన్నివిధాలా తృప్తికరంగా వుండడంచేత పూర్వకాలపు 'సెన్సార్' ఉద్యోగం అనవసరమని భావించి ౧౯౩౫ ఏప్రిలునెలలో దానిని రద్దుచేశారు.

ప్రజల జీవితంలోని సామాన్యహంశాల విషయంలోకూడా 'ఈవిధంగా నడుచుకోవాలి' అని నియమాలేర్పరిచారు. ఒకరికొకరు దణ్ణం పెట్టుకునేవిధం, కరసంచాలనం చేసేవిధం, ఇటువంటి స్వల్పవిషయాలలో కూడా నాజీపక్షంవారు ప్రత్యేకవిధాలను నిర్ణయించారు.

చదువుల వాతావరణాన్ని అంతటినీ రాజకీయమయం చేశారు. 'హేల్ హిట్లరు' అనే రాజకీయ స్వాగతాన్ని అమలులో పెట్టారు. దానిని వాడడంలో రాజకీయఉద్యోగులు ఉపాధ్యాయులు ఇతరులకు దారి చూపాలి. తప్పులు లేకుండా దానిని వాడేవిధానాన్ని విపులంగా వర్ణించారు (౨౨—౧—౩౫). 'స్వస్తిక' జాతీయచిహ్నం; ఆ చిహ్నన్ని జర్మను లందరూ పవిత్రమైనదిగాను, అతిక్రమించరానిదిగానూ చూసుకోవాలి; దానిని దుర్వినియోగం చేయరాదు (౧౯—౫—౩౩). అన్నిస్కూళ్లగదులలోను ఆఫీసులలోను హిట్లరుబొమ్మ లుండాలి; వీలైతే "రాష్ట్రాన్ని గురించి జాతీయసామ్యవాదుల అభిప్రాయాలప్రకారం ప్రజలను తర్ఫీదుచేయడానికి" రాజకీయస్వభావంగల ఇతరచిత్రాలు, పటాలు, జెండాలు వగైరాలను ఉంచవచ్చును (౫—౯—౧౯౩౩). ఉపాధ్యాయులందరూ ఒక్క "జాతీయసామ్యవాదపక్షం"యెడలమాత్రమే భక్తివిశ్వాసాలను చూపాలి (౧౫—౯—౧౯౩౫). 'మెసానిక్ లాడ్జి'వంటి సంఘాలలో వారు సభ్యులుగా వుండరాదు (౧౦—౮—౧౯౩౫). స్కూళ్లలో ఉపయోగించవలసిన పుస్తకాలను ప్రభుత్వమే నిర్ణయిస్తుంది (౨౩; ౨౭—౧౧—౧౯౩౩, ౧౨—౨—౧౯౩౪). ఉపాధ్యాయులదృష్టి ఎప్పుడూ నాజీపక్షంవారి జాతీయవిప్లవమిూదనే వుండాలి (౧౧—౮—౧౯౩౩). పైకి నాజీపక్షసిద్ధాంతాలను బోధిస్తున్నట్లు నటిస్తూ, లోపల పూర్వకాలపుసిద్ధాంతాలను బోధించే పుస్తకాలను వారు వాడగూడదు (౨—౧౦—౩౩). అన్నిటికంటె ముఖ్యం, అన్నిదేశాలతో సమానహక్కులు సంపాదించడంకోసం జర్మనీదేశం చేస్తూవున్న రాజకీయపోరాటంలో, స్కూళ్లు జర్మనుప్రభుత్వానికి తోడ్పడేటట్లుగా ఉపాధ్యాయులు చూడాలి (౨౬—౧౦—౩౩). యుద్ధంలో పోగొట్టుకున్న జర్మనువలసదేశాలను సంపాదించడానికికూడా స్కూళ్లు ఆ విధంగానే తోడ్పడాలి (౧౬—౭—౩౩). ప్రతిశనివారం స్కూళ్లలో ప్రత్యేకంగా జాతీయసంబంధమైన రాజకీయబోధన జరుగుతుంది.

ఈ ప్రకారంగా చదువులవాతావరణ మంతా రాజకీయమయం చేయడంమాత్రమే కాదు; విద్యాప్రణాళిక యావత్తూ కొత్తభావాలతో నిండివుంది. ప్రతివిషయంలోను పాతవిధానాలను కొంతవరకు మార్చారు; నేర్చుకోవలసిన విషయాలను కొన్నింటిని కొత్తగా చేర్చారు; అన్నింటిలోను విద్యార్థులకు నొక్కి చెప్పవలసిన సంగతులను ప్రత్యేకంగా సూచించి

హెచ్చరించారు. ౧౯౩౩, మేనెలలో బవేరియా రాష్ట్రపు విద్యాశాఖమంత్రి, స్కూళ్లలో ఆధునిక చరిత్రను నేర్పడానికి ఒకకొత్తప్రణాళికను ప్రవేశపెట్టాడు. అందులో ముఖ్యంగా నేర్పవలసిన చరిత్రభాగం ౧౯౧౪ మొదలు ౧౯౩౩ వరకూ! అనగా, యుద్ధం తరవాయివృత్తాంతం! అందులో ముఖ్యంగా నేర్పవలసింది, జర్మనీదేశం అప్పటి కష్టాలలోనుంచి తిరిగి బైటపడడాన్ని గురించి! ఆ ప్రణాళిక యావత్తూ విద్యార్థులలో 'జాతీయభావం పురికొల్పడానికి' ఉద్దేశింపబడినది (౩—౫—౩౩). జర్మను'జాతి'యొక్క శుచిత్వాన్ని గురించిన కొత్తసిద్ధాంతాలను స్కూళ్లలో విరివిగా ప్రవేశపెట్టారు. మొదటియేడు జీవశాస్త్రంతో ప్రారంభించి ఆఖరియేడు పిండోత్పత్తి, జాతివృత్తాంతం, జాతి ఆరోగ్యం, వంశచరిత్రలు, జనసంఖ్యకు సంబంధించిన రాజనీతి — వీటితో ముగించాలి. అవసరమైతే యీ విషయాలను నేర్పడానికి లెక్కలను, విదేశభాషలనుకూడా వదిలివేయవచ్చును (౧౩-౯-౧౯౩౩).

ఈ రెండువిధాలప్రయత్నాలు — చదువుల వాతావరణమంతా రాజకీయమయం చెయ్యడం, చదువులప్రణాళికలలో కొత్తసిద్ధాంతాలను విరివిగా ప్రవేశపెట్టడం — ఇవి, ఉన్నతవిద్యావిధానంలో ఇంతకంటె స్పష్టంగా కనపడుతున్నాయి. న్యాయశాస్త్రం, వార్తాపత్రికానిర్వాహకశాస్త్రం, అర్థశాస్త్రం, వ్యవసాయశాస్త్రం మొదలైనశాస్త్రాలను కొత్తపద్ధతులతో నేర్పుతున్నారు. మానవవిజ్ఞానాన్ని యావత్తునూ, నాజీప్రభుత్వంయొక్క ఆర్థిక, సాంఘిక, మిలటరీనీతికి అనుకూలంగా, ఒక్క పద్ధతికి, ఒక్కదారికి, ఒక్కలక్ష్యానికి తెచ్చారు. ఒక్కఉద్దేశానికి సమన్వయంచేశారు. ఒక్కపంథాను ఒక్కపనికి వినియోగిస్తున్నారు. అది మహోత్కృష్టమైన విషయమని చెప్పకతప్పదు. ఆధునిక వేదాంతశాస్త్రానికికూడా ఆ పని యిదివరలో సాధ్యంకాలేదు.

నాజీప్రభుత్వానికి పూర్వం జర్మనుయూనివర్సిటీలు ఒకప్పుడు వ్యక్తిత్వమూ, స్వాతంత్ర్యమూ, విదేశీయవిజ్ఞానాన్ని బహిష్కరించడమూ, మరొకప్పుడు అంతర్జాతీయత, విశ్వసోదరత్వం, సర్వసమత మొదలైన ఉన్నతాశయాలతో, పెద్దపేర్లతో విదేశీయవిజ్ఞానాన్ని బానిసబుద్ధితో అనుకరించడం — యీ రెండుపాయల మధ్యా ఊగులాడుతూ వుండేవి. కాని ౧౯౩౨ నాటికే, అనగా, హిట్లరుహయాంకు పూర్వమే, విదేశీయ విజ్ఞానాన్ని బహిష్కరించడానికి జర్మనువిజ్ఞానంయొక్క విశిష్టతను కాపాడడానికి ప్రయత్నాలు జరిగాయి. విదేశీయవిజ్ఞానమంటే తిరగబాటూ, అసహ్యతా కనబడ్డాయి. తమ విజ్ఞానంలో విదేశీయుల పలుకుబడి మరీ అధికంగా వుందని జర్మనులు గ్రహించారు. జర్మనుభాషలో ప్రవేశించిన విదేశీయపదాలను ఏరి తీసివేయడానికి జరిగినప్రయత్నాలు ఇందు కొక నిదర్శనం.

జర్మనుజాతియొక్క వ్యక్తిత్వమన్నా ఆత్మగౌరవమన్నా జర్మనులకు అభిమానం మెండు. స్వదేశం, స్వజాతి, స్వభాష, స్వధర్మం, స్వజ్ఞానం — వీటిని వారు పూజిస్తారు "మేము నిజమైన జర్మనులం" అన్న వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం తమ పరమావధిగా చూసుకుంటారు. అందుకోసమై వారు తమదేశంలో ఎంతటి నిరంకుశాధికారానికైనా లోబడతారు. వారికి కావలసింది స్వార్థపరులైన బహునాయకులతో కొట్లాడుకునే ప్రజాప్రభుత్వం కాదు. స్వజాతిని స్వధర్మాన్ని నిలబెట్టి ప్రజాక్షేమం గమనించి పాలించే దక్షతగల నాయకుని పరిపాలన, అదుపాజ్ఞలు, అధికారం. 'స్వధర్మే నిధనం శ్రేయః' అన్నసూత్రాన్ని జీర్ణంచేసుకొని, స్వజాతిని స్వధర్మాన్ని నిలబెట్టడంకోసం తమ సర్వస్వం ధారపోయడానికి సిద్ధంగా వుండి, ధైర్యమూ, పట్టుదలా, ప్రభుభక్తీగల జాతిని జయించడం సులభసాధ్యమైనపని కాదు, తాత్కాలికంగా జయించగలిగినా ఎల్లకాలం అణిచివుంచలేము.

"సారంలేని వట్టి మేధాసంబంధమైన పిప్పిచదువుల్ని స్కూళ్లలో నేర్పేదేశాలు ధైర్యమూ పట్టుదల ప్రభుభక్తీ అనేసుగుణాలుగల హిట్లరుయొక్క రాష్ట్రంవంటి రాష్ట్రాన్ని ఓడించడం సాధ్యమా?" అని జర్మను విద్యాంగమంత్రి అడిగాడు.

హిందూదేశంలో మనం అలవాటుపడివున్న యూనివర్సిటీల వుద్దేశం విద్యాభివృద్ధిమాత్రమే. ప్రాచీనగ్రీకులలో అరిస్టాటిలు మొదలైన కొందరు వేదాంతుల ఉద్దేశంకూడా యిదే. వారిమతంలో విద్య విద్యకొరకే సాధించతగ్గ వస్తువు. విద్యాభ్యాసమే

పరమావధి. అంతేకాని మరొకప్రయోజనాన్ని సాధించడానికి విద్య సాధనం కాదు. విద్య సంఘానికీ మానవధర్మానికీ అతీతమైనది. వాటితో సంబంధం లేనిది ప్లేటో మొదలైన మరికొందరు వేదాంతుల ఉద్దేశమది కాదు. వారిమతంలో విద్య, అంతటికన్నా విలువయైన వస్తువును సాధించడానికి సాధనముమాత్రమే కాని అదినేర్వడమే పరమావధి కాదు. సంఘంలో వున్న వ్యక్తు లందరూ తమధర్మాన్ని సర్తింపజేయడమే, వ్యక్తులను ఆవిధంగా రక్షితుచేయడమే విద్యయొక్క ప్రయోజనం. విద్య దానిని సాధించలేనినాడు, ఆలోపంవల్ల వ్యక్తి సంఘంలో తనధర్మాన్ని అతిక్రమించిననాడు విద్యకు ప్రయోజనం లేదు.

మొత్తంమీద నేటి ఇంగ్లాండు, ఫ్రాంసు, అమెరికా, ఇండియాదేశాలలో విద్యావిధానం అరిస్టాటలు పద్ధతులమీద అభివృద్ధిచెందిందనీ, ఆపద్ధతులపై తిరగబడి కొత్తపద్ధతు లవలింబించిన నేటి రష్యా, ఇటలీ, జర్మనీ, జపాను, టర్కీ మొదలైనదేశాల విధానాలు ప్లేటోయొక్క ఉద్దేశాలను అనుసరిస్తున్నాయనీ, ఈదేశాలు విద్యను రాజకీయ సాంఘిక వాతావరణంలోకి దింపుతున్నాయనీ చెప్పవచ్చును.

నాజీప్రభుత్వంవారు జర్మనీలో ఉన్నతవిద్యను ఏయేపద్ధతుల అభివృద్ధిచేస్తున్నారో ముందుముందు వివరిస్తాను.

ఇంతవరకు వ్రాసినవిషయాల సారాంశం: నాజీపక్షంవారు అధికారానికి వచ్చినప్పటినుంచీ తమకార్యక్రమాన్ని అతివేగంతో అమలులో పెట్టుతున్నారు. హిట్లరుకు సంపూర్ణాధికారం వచ్చిన యేడాదిలోనే, అనగా, ౧౯౩౩ లోనే, వ్యవధి యేమాత్రం లేకుండా అనేకక్రొత్తనియమాలను ప్రవేశపెట్టారు. జాతీయపునరుద్ధరణకు వారు చేస్తూవున్న ప్రయత్నాలు ఐదువిధాలు:

(౧) ప్రభుత్వాధికారమంతా ఒక్కనాయకుడి చేతికింద కేంద్రీకరించారు. ఇది పరిపాలన విధానంలో మార్పు.

(౨) వృత్తులతో సంబంధం లేకుండా మామూలు పుస్తకపుచదువులనుమాత్రం నేర్పే స్కూళ్లలోను యూనివర్సిటీలలోను విద్యార్థుల సంఖ్య తగ్గించారు. వాటిలో ఉన్నతవిద్యకు పనికిరానివారిని ఏరివేయడానికి కొత్తపద్ధతు లేర్పరిచారు. ఉపాధ్యాయులలోను ఇతర ఉద్యోగులలోను జర్మనుజాతికి చెందనివారిని తీసివేసి జర్మనులకు ఎక్కువ అవకాశాలు కల్పించారు. ఆర్థికసంస్కరణలలో ఇది ఒకభాగ.

(౩) యువకులకు మిలటరీశిక్షణ నిస్తున్నారు. నాజీపక్షంవారి కార్యక్రమానికి అనుకూలంగా వున్నంతమట్టుకు జర్మనుజాతియొక్క పూర్వ సంప్రదాయాలను గౌరవించడం యువకులకు నేర్పుతున్నారు. విద్యాప్రణాళికను యావత్తూ ఈ కొత్తభావాలతో నింపుతున్నారు. ఇది వారి మిలటరీసంస్కరణాలలో ఒకభాగ.

(౪) జర్మను'జాతి'వారుగా ఉండే అర్హతలు కానివారిని ఏరివేయడానికి, ఆవిధంగా జర్మను 'జాతి'ని పునరుద్ధరణచేయడానికి, ఇప్పటి యువకులలోనుంచి ముందుకు జాతీయనాయకుల్ని తయారుచేయడానికి విద్యావిధానాన్ని సాధనంగా ఉపయోగిస్తున్నారు. ఏమంటే, జాతీయసామ్యవాదుల ఉద్దేశంలో, ఇంతవరకు సంఘంలో నాయకులుగా వుండిన ధనస్వాములూ ఇతరధనికులూ తమరాజకీయధర్మాలను సరిగా నిర్వర్తించలేదు. కాబట్టి వారిస్థానే జాతీయభావంగల కొత్తనాయకుల్ని తయారు చెయ్యాలి.

ఇది 'జాతి'కి సంబంధించిన సంస్కరణలలో ఒకభాగ.

(౫) నాజీపక్షంవారు ప్రారంభించిన కొత్తఉద్యమాలకు అభిప్రాయాలకు స్కూలు చదువులూ యూనివర్సిటీచదువులూ తోడ్పడాలి. జర్మనుజాతియొక్క అవసరాలను తీర్చడానికి సైన్సులూ, సాంకేతికవిద్యా (Technical education) తోడ్పడాలి.

ప్రజల అభిప్రాయాలను మార్చడానికి చేసే ప్రయత్నాలలో ఇది ఒకభాగ.

జిజా జోల

పుట్టపర్తి నారాయణాచార్యులు

అన్నా! యెన్నడు నీవు దిట్టమగఁడై యార్యామహాదేవి, నీ
సన్నజ్జేకొని నిల్వఁగా, నవకము ల్జార్వారుగేస్తుండవై,
కన్నుల్చల్లఁగ జేతువో! యెపుడు దిక్కాంతల్ భవత్త్యాగసం
పన్నత్వంబు నుతింతురో! మృదులకల్పానల్పపత్రంబులన్.

రాజసలక్షణోర్ణాసమంచితఫాల
పీఠికి నిండు దీవెనలు సుమ్ము
చిలికించులేతనవ్వుల గొంత విడబారు
వ్రాలుగన్నులకు శ్రీరామరక్ష
నవనవభావనా నటకరంగస్థల
శ్రీకి కెంబెదవి కాశీశ్శతంబు
వరశిరీషసుమంబువలె నిండుగా విచ్చి
యలరు నీపాలబుగ్గలకు జయము
ఖడ్గకోటి స్రవించుభాగ్యములు నమ్మి
కోటిదినములు తపియించుకులము మనది
పుడమి నెల్లను పిడికిట బూని, తేజ
మించి, దిక్కుల నెల్ల బాలించవయ్య!

ఎదురైనవెంటనే, యొదిగి యల్లన ప్రేమ
మున జేరి చేసిన జనకసేవ,
ఒకసారి ననుగూర్చి, యుసురన్న పాపంబు
మది దోఁపనీని నామాతృసేవ
బందుగులకు నోముపంటలై నాదుజీ
వము బంచి చేసిన భర్తృసేవ
అనదనై, యరమూతకనులతో వేడిబా
ష్పముల జేసినశివాపాదసేవ
జీవవంతమై ప్రతిఫలించినది నీదు
చిన్నిహృదయాంతరారామసీమయందు
ఒలుకుకోర్కుల, తొమ్మిదినెలలు మోసి
ప్రాణమిచ్చినముక్తాఫలంబ వీవు.

తళుకున్బెడిసమీాలచెంగులను దిద్దజ్ఞాలునీకంటిచూ
పులలో, దివ్యమహాత్వతత్వములు సొంపుల్సూపు, నేరాజ్యల
క్ష్మలు లేబుల్కలు గండభాగముల పై బుష్పింప శీర్షంబుపై
దల్బ్రా ల్వోసి, వరింతురో నిను, మహాత్మా ! భావిలోకంబునన్.

ఎద దూరి పీపులో నెక్కుకత్తిని జూచి
మనసుడిందని మీాదుమగతనంబు
ప్రేవులు నెముక లర్థికి నిచ్చిపంపునా
చారంబు మీా త్యాగసౌరభంబు
మిన్నులుబడిన, భూమి వడంకినను మీావ
చస్సు దప్పని గొప్పసత్వశుద్ధి
అపచార మనునదెన్నడును గానక త్రాసు
వలె జూపు మీా న్యాయవర్తనంబు
లీల, పాటలుగా నల్లి, పాలతోడ
గిన్నెలో బోసి నీకు ద్రాగించినాను,
పున్నెములపంట, నీ చిరుబొజ్జయందు
గలవు నాతండ్రి యామూలికావ్రజంబు.

నీ కత్తికొాన రాతునెఱకుత్తుకలకు పా
వనస్వర్గగీతు లుపన్యసింప
నీదుకంఖాణపాదాధూత తానంబు
జయభేరికలకు హెచ్చైచ్చ వెలుంగ
వలకరంబున నీవు బట్టిన కేడెంబు
పరరాజులకు గుండె బరువుగాగ
సిదు శిరస్సుపై నెగురుకుచ్చులపాగ.
కుమతులకన్నులు గోరగింప
పెదవిపై జిందు క్రీగంటిపిన్ననవ్వు,
మనసునందలి యభిమానమహిమ జాట,
కదనమున కేగు నిన్ను, నే గనుల జూచి
యెన్నడాశీర్వదింతు, మాయన్న ! చెప్పుమ.

క్రిస్టమస్ పండుగ

వే. సు.

పండుగ లంటే ఒకవిధంగా ఆయా జాతులవారి ఆర్థిక సాంఘిక అభివృద్ధులను సూచించేవి ; అంటే, ఏ జాతి ఎంత ఎక్కువ జ్ఞానవంతమై, భాగ్యవంతమై యుంటుందో అంత ఎక్కువగా ఆ జాతిలో పండగలూ, పర్వాలూ వెలుస్తూ ఉంటాయి. బొత్తిగా అజ్ఞానంలో బడి, కూటికీ, గుడ్డకూగూడా లేకుండా కష్టపడుతూ వుండేవాళ్లకి పండగలూ పబ్బాలూ చేసుకోడానికి ఎక్కడవుతుంది ? సకలవిధాలా సంపన్నమైవుంటేనే, ఆ సంపత్తికి కారణభూతులైన జ్ఞానులూ, వీరపురుషులూ, మహాత్ములూ ఆవిర్భవిస్తూ ఉంటేనే, వారి పుట్టుకలను అంటబెట్టుకొనీ, వారు చేసినమహాత్కార్యాలను ఆధారం చేసుకొనీ పండుగలూ పుడుతూవుంటాయి. ప్రస్తుతం ప్రపంచమంతటా వ్యాపించివున్న మతాల్లో హిందూ, మహమ్మదీయ, క్రైస్తవ మతాలు మూడూ ప్రధానమైనవి. ఈ మూడింటిలోనూ మీదవచించిన పరిస్థితులు బాగా అభివృద్ధి పొందివుండడంచేతే వాట్లల్లో అనేక ఉత్సవాలూ వెలిశాయి. ఆ వెలిసిన వాట్లన్నింటిలో హిందువుల దసరా, మహమ్మదీయుల మొహర్రం, క్రైస్తవుల క్రిస్టమస్ చాలా ముఖ్యమైనవి. ఈ మూడింటిలో సైతం ప్రపంచమంతటా వ్యాపించి ప్రపంచ ఖ్యాతిని గడించింది క్రిస్టమస్. హిందువుల దసరా ఆసియాఖండ మంతటనైనా తెలియదు, మూడు వేపులసముద్రాలనూ, ఉత్తరాన పర్వతాలనూ దాటి పోవడానికి శక్తి చాలిందేకాదు, భారతవర్షాన్నుంచి దస రాకు. మహమ్మదీయుల మొహర్రం రెండు మూడు ఖండాలవారికి తెలుసుకాని క్రిస్టమస్ అంటే అయిదు ఖండాలవాళ్లకీ అవగతమే.

క్రిస్టమస్ — మ్యాస్ ఆఫ్ క్రైస్ట్ (Christmas — mass of Christ) అనగా క్రీస్తుపుట్టినరోజు పండుగ, క్రీస్తు జన్మజయంతి. ఈ పండుగ వస్తున్నదంటే ప్రపంచమంతా సరే; ముందు భారతవర్షం యావత్తూ కలకలలాడిపోతుంది ; ఎందుకంటే దీనిని పురస్కరించుకొని నెలరోజుల పర్యంతం దీర్ఘావకాశాలు సర్కారువారి కచేరీలకుగూడా దొరుకుతాయి. రాజ్యతంత్ర నిర్వహణ మనే బండిచక్రాలను ద్రిప్పడంలో నానా వస్థలూ పడుతూవుండే జనులకు వరసగా వక్క నెలరోజులు హాయిగా గడపవచ్చునన‌డం మహానందం గాక మరేమిటి ?

ఇప్పుడింత వ్యాపకంలో ఉండి, ఇంత ప్రఖ్యాతి కెక్కివున్నప్పటికీ మొదట్లో దీనికింతటి ప్రచార ముండినట్లు గానరాదు. ౪ శతాబ్దాలవరకూ దీనిని ఎప్పుడు ఆచరించాలో వకనిర్దిష్టమైన తిథి అయినా ఏర్పడలేదు. ౬ జనవరి, ౨౫ మార్చి, ౨౫ డిశంబరు ఈ తేదీల్లో దేనియందు జరిగించాలా అని వాదవివాదాలు చెలరేగాయి. ఇంతేకాదు. కొం

దరు కాలానుక్రమణికకార్లు (Chronologists) క్రీస్తుపుట్టింది మేనెల ౨౦ - వ తారీఖనీ, మరికొందరు ౧౯, ౨౦ యో ఏప్రిల్ నెలనీ ప్రతిపాదించారు.

అలెగ్జాండ్రియాలోని క్లెమెంటునామక మతాచార్యుడు ౧౭ - వ నవంబ రని వ్రాశాడు. మరికొందరు అనుక్రమణికకారులు మార్చినెల ౨౮ దో తారీఖును నిర్ధరించారు. వారు చెప్పేది ఏమనగా "సృష్టియావత్తూ సంపూర్ణవికాసస్థితిలో వెలిసింది. అట్టి సంపూర్ణవికసనం వసంతర్తువునందే కలిగేది. మార్చినెల ఆ ఋతువులోదే. కాబట్టి క్రీస్తు పుట్టుకవంటి ఉత్తమఘటనంకూడా ఆ నెలలోనే జరిగివుండాలి" అని. సిరియనులూ, ఆర్మీనియనులూ జనవరి ఆరో తారీఖున జన్మదినోత్సవం చేయడం మొదలిడి ౨౫-వ తేదీని జరిపే రోమనులను నిందిస్తూవచ్చారు; ఎందుకంటే ౨౨ - వ డిశంబరున దక్షిణాయనం పూర్తియై సూర్యుడు ఉత్తరాయణానికి తిరుగుతాడు దానిని ఆధారంగా గొని క్రైస్తవులుకాని అన్యమతస్థులు బ్రుమాలియా (Brumalia) అనే పండుగను చేసుకొంటూ వుండేవారట. ఆ పండుగను మనస్సులో ఉంచుకొనే రోమనులు డిశంబరు ౨౫ - తేదిని క్రిస్టమసునిమిత్తం ఏర్పరచుకొన్నారనీ, అందుచేత వారూ ఒకవిధంగా మూర్తిపూజకులనీ సిరియనుల ఆర్మీనియనుల ఆక్షేపణ. బ్రిటన్ దేశంలో క్రైస్తవమతం ప్రవేశించకపూర్వాన్నుంచే ౨౫-వ డిశంబరు వకవిధంగా పండుగక్రింద గణింపబడుతూ వచ్చింది. ప్రాచీన ఆంగ్లికులు డిశంబరు ౨౫-వ తేదిని ఉగాదిగా నుంచుకొని ఆ నాటి రాత్రిని 'మాతృ - రాత్రి' (Mother's night) అని పిలుచుకొంటూ ఆరాత్రిఅంతా జాగరంచేస్తూ వుండేవారట. ఇదీ వక కారణం పడమటి చర్చివారు ౨౫-వ డిశంబరును క్రీస్తు జన్మదినంగా తీసుకోడానికి. ఏవంవిధ వాదవివాదాలు క్రీస్తు పుట్టుకదినం గురించి జరుగుతూవచ్చాయి. ఇట్లు నిశ్చితమేమీ తేలకపోయినప్పటికీ క్రిస్టసు కాలానికి పడమటి చర్చివారు ౨౫-వ డిశంబరునే నిర్ధారణగావించి ఆనాడే వేడుకలూ మొదలైనవాటిని చేయిస్తూవచ్చారు. అది క్రమంగా ౬-వ జనవరిని జరిపే తూర్పుచర్చికీ, దాని ద్వారా దేశమంతటికీ వ్యాపించిపోయింది. ఇప్పుడు దీనిని రోమనుకాథలిక్కులు, గ్రీకు, ఆంగ్లికన్, లూథరన్ చర్చిలవారు అందరూ ఆచరిస్తారు గాని స్వల్పభేదంమాత్రం ఉంటుంది. ఇందలి ముఖ్యకర్తవ్యం మ్యాస్ (mass). ఇది వకవిధమైన ధర్మానుష్ఠానం. ఇందులో లఘ్వనుష్ఠాన మనీ, (Low-mass) గుర్వనుష్ఠాన మనీ రెండుభేదాలు. లఘ్వనుష్ఠానం సాధారణ మార్గంలో సంగీతం ఏమీ లేకుండా జరుగుతుంది. గుర్వనుష్ఠానం (High mass) అయితే డీకన్ (Deacon), సబ్-డీకన్ (Sub-Deacon), ఇతర పాదిరీలు (Clergy), గాయకులు (Choristers) మున్నగు వారితో సంగీతసమేతంగా అట్టహాసంగా జరుగుతుంది. అనుష్ఠానాన్ని పురోహితుడే (Priest) చేయాలి. సాధారణంగా అన్ని సందర్భాల్లోనూ వక్క అనుష్ఠానమే జరుగుతుందికాని క్రిస్టమస్ సందర్భంలో మూడు అనుష్ఠానాలనుగూడా చేయవచ్చు. అనుష్ఠానానికిముందు పురోహితుడు ఉపవాసంచేయాలి. భగవత్ సంప్రార్థనలూ (Prayers), బైబిలు మంత్రపాఠాలు (Recitation of hymns)

క్రీస్తు జీవితాంతం ముఖ్య సంఘటనాల ప్రదర్శనాలు, భక్తితాత్పర్యాలతో ప్రభుసంకీర్తనం, బలి (Sacrifice), సమర్పణం (Consecration), ప్రసాద నైవేద్యాలను పంచడం (Communion) ఇత్యాదులన్నీ జరుగుతాయి మ్యాసులో.

హిందువుల దీపావళినాడువలె ఆనాడు గృహాలంకరణాలూ, దీపాలంకారాలూ జరుగుతాయి. కొన్ని గృహాల్లో వారివారికి ప్రత్యేకమైన గృహోత్సవాలను (Household festivities) చేసుకొంటారు. మిత్రులు, బంధుబాంధవు లందరూ పోగై ఆదరసన్మానాలతో, బహుమతుల నిచ్చి పుచ్చుకోడాలతో కాలం గడుపుతారు. పెద్దపెద్ద పట్నాల్లో పదిరోజులు వరుసనీ మహోత్సవాలు సంపన్నమవుతాయి. రైల్వేవారి ధర్మంవల్ల గమనాగమనాల సౌకర్యాలు కూడ కలుగుతాయి. బీదసాదలకు దానధర్మాలు చేస్తారు. ఇక పిల్లలకు ఇంతకంటే ఆనందంగూర్చే పండుగ ఇంకోటిలేదు. ఎందుకంటే వాళ్లకు కావలసిన బంధుగులు, మిత్రులూ అందరూ వారికి బహుమతులు పంపిస్తారు. క్రీస్తు పుట్టినప్పుడు ముగ్గురు జ్ఞానులు వచ్చి ఆ శిశువుకు కానుకలను అర్పించారట. ఈ ఘటనాన్ని ఆధారంగా దీసుకొని పిల్లలకిపుడు బహుమతులను పంచిపెడుతుంటారు. ఈ బహుమతు లందచేయడంలో సాంటాక్లాజ్ (Santa claus) అనే వక వ్యక్తి వచ్చి రాత్రిపూట బిడ్డలు నిద్రలో వుండగా కానుకలను పంచిపెట్టి పోతాడని వాడుక. నిజానికి ఈవ్యక్తి అసలుపేరు సెంట్ నికోలస్ (Saint Nicholus). ఈ శబ్దము డచ్చిభాషలో అపభ్రంశమై సాంటాక్లాజ్ గా మారింది. ఇతడు నాలుగో శతాబ్దివాడు. దయాళువైన సాధువు- లోకప్రియుడు. తాను లోకాన్నంతా ప్రేమిస్తూ వుండేవాడు. అలౌకికాలను (miracles) చేస్తూవుండేవాడట. యూరోపులో ఇతని గౌరవార్థం, స్మరణార్థం పండుగలు జరుగుతూవుంటాయి. ఇతని మృత్యుతిధి డిశంబరు ౬-వ తేది. క్రిస్టమసు నెలయందే ఇతని వార్షికోత్సవం రావడం చేత ఈ పండుగతో సంబంధం ఏర్పడింది. పిల్లలను ప్రేమించి వారికి కానుక లిస్తాడని వాడుక ఏర్పడింది. పిల్లలు పడుకొని నిద్రపోతూ వుంటే ఇతడు చప్పుడు గాకుండా మెల్లగా వచ్చి పరుపులక్రిందా, తలగడలక్రిందా బహుమతులుగా దెచ్చిన బొమ్మలూ మున్నగు పదార్థములను పెట్టిపోతాడని బాలికా బాలకుల ధారణ. అవి ఇంట్లోని బంధుగులో, తలిదండ్రులో ఎవ రుంచినాసరే పిల్లలు మరునాడు తమప్రక్కలక్రింద వుండే వస్తువులనుజూచి సాంటాక్లాజే ఇచ్చిపోయినాడని ఆనందం పొందుతూవుంటారు. ఇక యువావస్థలోవుండే ఆదాం ఈవులకు క్రిస్టమస్ పండుగలంటే అమృతపానమే. దీనికి సంబంధించిన ఒకచిన్నికథను వ్రాస్తాను.

ఒకానొక దంపతులు. వా రిద్దరికీ పరస్పరం అపరిమితమైన ప్రేమ. ఒకరి కొకరు అనుకూలంగా, ఇష్టంగా మెలగుతూ వుండాలని ఇద్దరూ ప్రయత్నిస్తూ వుంటారు. ఎక్కువ భాగ్యవంతులు గారు కాని కూటికీ గుడ్డకూ చాలని దరిద్రులు గారు. సాధారణంగా ఇద్దరూ కలిసి సాయంకాలపు సమయాల్లో బజారుల్లో పచారుచేసి వస్తూవుండేవారు. పెద్దపెద్దషాపుల్లో, విద్యుద్దీపాల తరంగాల్లో, అద్దాల అల్మారీల్లో నానావిధ వస్తు

జాలాలూ మహా ఆకర్షణీయంగా వెలిగి పడుతూ వుండేవి. ఆ వస్తువు లన్నింటిలో వీరి దృష్టి నాకర్షించినవి రెండువస్తువులు. ఒకటి తళతళలాడే బంగారపు దువ్వెన; రెండోది బంగారపు వాచీగొలుసు. పురుషుడిదగ్గర యాభై, అరవైరూపాయలు చేసే మంచిజేబు గడియారం వుంది కాని దానికి తగిన గొలుసు లేదు. అందుకని ఆగొలుసును కొనుక్కోవాలనుకొన్నాడుకాని డబ్బు లేదు. భార్య తలవెంట్రుకలు చాలా పొడుగైనవి, అందమైనవి. తల దువ్వుకోడానికి ఆ బంగారపు దువ్వెన వుంటే బాగుంటుందని మోజుపడ్డది. కాని డబ్బెక్కణ్ణుంచీ? ఇద్దరి అభిలాషలూ ఇద్దరికీ తెలుసు. ఇట్లా ఉండగా క్రిస్టమసుపండుగలు వచ్చాయి. ఈసందర్భంలో భార్యకు ప్రియమైన వస్తువు దువ్వెనను ఎట్లాగయినా కొని ఇవ్వాలని భర్తా, భర్తకు ప్రియమైన వాచిగొలుసును కొనిఇవ్వాలని భార్యా మనస్సులో నిశ్చయించుకొన్నారు కాని పైకి చెప్పుకోలేదు. భర్త ఎక్కడికో వెళ్ళివుండగా తానంతవరకూ కూడబెట్టినడబ్బు ఎంతఅవుతుందో అని భార్య లెక్కపెట్టుకొని చూస్తే గొలుసుఖరీదు కెంతమాత్రం చాలిందిగాదు. అంతటితో వక మనోనిశ్చయం చేసుకొని బజారుకెళ్ళి ఒక వెంట్రుకల వ్యాపార కొట్లో ప్రవేశించి తన తలవెంట్రుకల బేరంపెట్టింది. అతడూ వెంటనే కత్తిరించుకొని ఈమెకు కావలసిన దానికంటే ఇబ్బడిసొమ్ము చేతిలో పెట్టాడు. దాన్ని తీసుకొని బంగారపు అంగడికిపోయి గొలుసు కొనివచ్చి తనప్రియుడు రావడంతోటే ఇవ్వాలని మహా ఉత్సాహంతో కూర్చుంది అతనిరాకకు ఎదురు చూస్తూ. ఇక ఇక్కడ భర్త భార్య నిమిత్తం దువ్వెనకొనడానికి వేరే మార్గంగానక తన జేబుగడియారాన్ని అమ్మి ఆ వచ్చినడబ్బుతో దువ్వెనను కొనుక్కొని దుర్గం జయించినంత సంతోషంతో ఇంటికి పరుగెత్తుకొని వచ్చి తలుపు తట్టాడు. భార్య గొలుసు చేతబట్టుకొనే వచ్చింది, తలుపు తెరవంగానే భర్త గడియారానికి తగిలించి అతన్ని ఆనందపరచాలని. ఇతడూ ఇదుగో దువ్వెనఅని తలుపు తెరవంగానే ఆమెకు ఇవ్వాలని జేబులో నుంచి పైకి దీసి చేతపట్టుకొన్నాడు. వక్కనిమిషమాత్రంలో తలుపు తెరవడం, ఇద్దరి నోటివెంట మాటలూ, ఇద్దరిచేతుల్లోని వస్తువులూ, ఇద్దరిమొగాల్లో ఆనందం, మరుక్షణంలో ఇద్దరిమొగాలూ వెలవెలబోవడం జరిగింది. ఆ మరుక్షణంలో సంఘటిల్లిన కౌగిలింతలో ఇద్దరూ ఏకమైపోయారు. ఈలాటి దివ్యదృశ్యా లెన్నింటికో ఆశ్రయం క్రిస్టమస్ పండుగ.



ముస్తాఫా కెమాల్

యస్. జగన్నాథ్

[ముస్తాఫా కెమాల్ పాషా ఒక అద్భుతవ్యక్తి. ఇతనొక్కడి సాహసపరాక్రమాలే కొత్తటర్కీ రాజ్యాన్ని సృష్టించాయంటే అది అతిశయోక్తికాదు. ఈనడుమనే ఇతను పరలోకగతుడైనాడు. ఈ వ్యాసంలో జగన్నాథ్ గారు కెమాల్ పాషా తత్వాన్ని చక్కగా విశదీకరించారు. భా. సం.]

"తక్షణమే కాన్‌స్టాంటినోపిలుకు రావలసినది" అని సుల్తానువద్దనుంచి వచ్చినతంతి. "టర్కీదేశమునకు స్వాతంత్ర్యమురానిదే నేను అనటోలియా వదలి రాను" అని కెమాల్ జవాబు.

* * *

'కెమాల్‌ని సేనానాయకపదవినుంచి తొలగించినా' మని సుల్తానుఫర్మానా.

ముస్తాఫా అన్నాడు తనసహచరులయిన ఇతర నాయకులతో:

"మన మీసమయమున విడిపోవలసి వచ్చేలాగున కనిపిస్తోంది. నాతో కలసి పనిచేయాలని ఉన్నవారికి ఆపదలు రావచ్చు, సుల్తాను వారిని కఠినంగా శిక్షించవచ్చు; అయినప్పటికి ఇప్పుడు నన్ను నాయకునిగా కోరి మీరు ఒప్పుకున్నట్లయితే — చివరవరకూ నాతో ఉండాలి మధ్యలో విడిచిపోగూడదు.

"ఒకసంగతిమాత్రము నిశ్చయము. మీ కందరకూ నాయకుడుండాలి — ఒక్కసమర్థుడయిన నాయకుడు.

"సుల్తానుని బ్రిటిషువారు ఆడిస్తున్నారు. అతనివల్ల టర్కీకి, స్వాతంత్ర్యానికి ఏమాత్రమూ లాభము లేదు. పైగాపెచ్చు సుల్తాను ఈప్రయత్నానికి అడ్డుతగిలి శాయశక్తులా విఘ్నమొనరిస్తాడు. ఈసందర్భంలో మంచినాయకుని ఎన్నుకొని టర్కీకి స్వాతంత్ర్యము చేకూర్చండి మీ రిదివరలో కంకణము కట్టుకున్నప్రకారము.

"నన్ను మీరు ఎన్నుకుంటే అంతులో ఉన్న ఆపదలు ఆలోచించుకోండి" అని.

ముస్తాఫా ఎటువంటి నాయకుడో మిగిలిన సైనికఉద్యోగులకి బాగా తెలుసు. అతని పరాక్రమము, ధైర్యము, నిపుణత వారికి ప్రపంచయుద్ధములో అతను చేకూర్చినవిజయాలు బాగా తెలియపర్చినయి. అతన్నే ఎన్నుకున్నారు అతను కోరిన "నేను ఏమిచెప్పినా మీ రాచరించాలి. నే నేమిచేసినా మీరు మాట్లాడకూడదు" అనేషరతుకికూడా ఒప్పుకొని; అతనియందు కొందరికి అంతనమ్మకము లేకపోయినా, అతనిదేశభక్తి, ఎట్లా ఆచరించినా దేశము మేలుకోసమే నని అందరికీ తెలుసుకనుక.

ప్రపంచయుద్ధ మయినవెంటనే ముస్తాఫా ఎదుర్కొనవలసివచ్చిన దేశశత్రువులు సుల్తాను, అతనివెనుక తంత్రాలు పన్నుతూన్న బ్రిటిషువారు.

ప్రతిజిల్లాకి కబుర్లు వెళ్లినయి, "కాన్‌స్టాంటినోపిలులోని రాజ్యాంగము బ్రిటిషువారు నడుపుతున్నారు తెరచాటునుంచి. మనదేశము మనకు ఒకఅంగుళమయినా మిగులనివ్వరు — దీనికి ప్రతిగా మన మొకరాజ్యాంగము స్థాపించాలి. ప్రతిజిల్లాయూ కొద్దిరోజుల్లో జరుగబోయేసభకు అభ్యర్థులను గూఢముగా పంపించవలసినది" అని.

* * *

సుల్తాను కనుబొమలు ముడిపెట్టాడు. "ముస్తాఫా! న న్నెదిరిస్తాడుగా! సుల్తానుమాత్రమే అనుకున్నాడుగాబోలు". వెంటనే ఖిలాపతు (మతగురువు) పదవిని స్మరించుకున్నాడు — మహాస్త్రము ప్రయోగించాడు. "ముస్తాఫాని చంపినవారికి ఈ జన్మలో సకలైశ్వర్యాలూ, చనిపోయినతరువాత స్వర్గమూ కలుగుతా" యని ఆశపెట్టాడు.

తురుష్క ప్రజలకి మతమూఢత్వము ఎక్కువ— ముస్తాఫా ఎవరిచేతుల్లో పడతాడా అని ఉవ్విళ్లూరుతున్నారు.

ప్రపంచయుద్ధంలో ౮౦,౦౦౦వేల మందిఅని వార్తలు వచ్చినసేనలను ౨౦౦౦మందితురుష్కులతో ఎదుర్కొని ఒకసంవత్సరము యుద్ధము జరిపిన ముస్తాఫా అప్పుడు—సుల్తానుకి ప్రజలకీ "పాషా" అయాడు.—

ఇప్పుడు — స్వర్గాపేక్షతో బిగిసిన పిడికిళ్లలోని బాకులు అతనివేపు వెతుకుతున్నాయి.

* * *

ప్రజలని తనవైపు త్రిప్పటానికి పంపినవారిల్లో ఇద్దరిని సుల్తాను ఉరితీయించాడు. ముస్తాఫా మక్కాం చేసిఉన్న ఇంటిచుట్టూ ఎవరో అనుమానం కలిగించే వ్యక్తులు తిరుగుతున్నారని అతనితో చెప్పాడు. కావలిసిపాయి.

ముస్తాఫా నిన్నటివరకు సేనాని — ఈనాడుశిరము వంచి చీకట్లో నిశ్శబ్దంగా కూర్చున్నాడు. అతని ప్రియతములుమాత్రం ఉన్నారు చుట్టూ.

అప్పుడప్పుడు వార్తలు వస్తున్నాయి, గ్రీకులు స్మిర్నాలో దిగుతున్నారనీ, ప్రజలని హింసిస్తున్నారనీ.

టర్కీ ధ్వంసమైపోతోంది. అది తనప్రయత్నాలు, తన ఆశయాలు అన్నీ అడుగంటేసమయ మనిపించింది. తనదేశము తగలబడిపోతూంది. గ్రీకులచేతుల్లో బ్రిటిషుతంత్రాల్లో.

టర్కీని ఒకగొప్పస్థితికి తీసుకొనిరావాలనీ, స్వతంత్ర్యరాజ్యము చేయాలనీ తను చిన్నప్పుడు సైనికశిక్షణ పొంది, ఐక్యత — అభివృద్ధిసంఘములో సభ్యుడైనప్పటినుంచీ అతని ఆశయము. ఈరోజుకి ఈనిరాశ తనకి తగనిది. "చేసినప్రయత్నములు సఫలం కావాలి, లేకపోతే ఆయత్నములో చచ్చిపోవాలి" అన్నే అతని సూత్రము.

ఫ్రెంచువారి దీపాలు పెట్టించి చుక్కలుగా పనిచేసుదలు పెట్టాడు. స్వాతంత్ర్యక్రమ మంతా ప్రారంభించాడు; తెల్లవారేవరకూ ఆలోచనలే — చుట్టూఉన్న అనుచరులలో ఒక తెదగ్గిర రివాల్వ రుంది; — ఒక సేవకునియొద్ద మంచి విష మున్నది. కలీఫ్ తనని సజీవంగా పట్టుకోలేడు.

* * *

జిల్లా, జిల్లానుంచీ వచ్చిన అభ్యర్థులు అతికష్టముతో చేరుకున్నారు. ఆసభని 'జాతీయసభ' అన్నారు. సుల్తానుయొక్క చర్యలూ, కాన్స్టాంటినోపిలులో పార్లమెంటు తీసివేయడము, ఇంగ్లీషువారికి లొంగిపోయినా సుల్తాను ఊరుకోవడమూ ప్రజలకి తెలిసినయి. అంతా ముస్తాఫాదే సరియైన ఆలోచనఅనీ, సుల్తాను అప్రయోజకుడనీ కనిపెట్టారు. ముస్తాఫా ఈ జాతీయసభకి ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన అగ్రాసనాధిపతి అయిపోయినాడు.

సుల్తానుయొక్క రాజ్యపాలన సరియైనది కాదు గనుకను, అతడు విదేశీయులకు లొంగిఉండుటచేతను ఇకనుంచి ఈజాతీయమహాసభయే రాజ్యపాలన చేయును. ఈ మహాసభయే టర్కీయొక్క సరియైన రాజ్యాంగము అని తీర్మానించారు.

ఈతీర్మానాలు చేయడము, ఇదివరలో ముస్తాఫా, ఇంగ్లీషువారికి యుద్ధానంతరము స్వాధీనము చేయవలసిన ప్రదేశాలు స్వాధీనము కానీయకుండా నిరోధము కలిగించడము — మొత్తముమీద ముస్తాఫాయొక్క ప్రవర్తన ఏమీనచ్చలేదు యూరోపియను ప్రభుత్వాలకి. టర్కీ ఓడిపోయిన దేశము. ఇలా ఆక్రమణలో అభ్యంతరాలు కలిగించటం అపాయకరము. మిగిలినదేశాలుకూడా అలాగే చేస్తే ఇక యుద్ధములో విజయ మేమి ఉపయోగము? కాని ఈ ముస్తాఫాని యెదుర్కోవడానికి మళ్లా చెదరిపోయిన ఇంగ్లీషుసైనికులని పోగుచేసుకోవాలి; లేకపోతే టర్కీలో రావలసిన ప్రదేశాలు దక్కవు — జీడిగింజలు కాలిపోతున్నాయి. ఇంగ్లండు తనచేయి నిప్పులో ఎలా పెట్టడము? గ్రీసుదేశపు సేనానాయకుడు పక్కనే ఉన్నాడు. అతనిచేత్తో తీస్తే జీడిగింజలు. గ్రీకుసైన్యాపతికి కష్టంగయినా టర్కీని కొంతవరకైనా లాగుకోవాలెనని ఆశ.

ప్రపంచయుద్ధము పోవటకు ఫ్రెంచిసేనలు కొంచెము ఇంకా కాన్స్టాంటినోపిలుదగ్గర ఉన్నాయి.

టర్కీ సైన్యాలు విజయోత్సాహంతో ఒక్కొక్కటే పట్టుకుని సుల్తానురాజ్యాన్ని జాతీయోద్యమప్రతాపోజ్జ్వలంగా చేస్తున్నాయి. ఈ సమయంలో వచ్చినయి బలవంతమయిన గ్రీకుసేనలు. వచ్చి ఈ తురుష్కసేనలని తరిమివేసినయి.

వెంటనే మహాసభ అభ్యర్థులలో అందరికీ వేరు వేరు ఉద్దేశాలు తట్టినయి, సంధిచేసుకొందామనీ, మన సేనలు తరిమివేయబడటానికి కారణం ముస్తాఫాతప్పనీ అనేక విధాల.

మొదటినుంచీ ఈసభ్యులవైఖరి ముస్తాఫాకి తెలుసు. పూనుకున్న పని సవ్యంగా జరిగితే పంచుకోటానికి చేరతారు; లేకపోతే తిట్టి తరిమివేయడానికి ప్రయత్నం చేస్తారు, నాయకుణ్ణి అయినాసరే.

కాని తనని నిందించిన వెంటనే, తన ప్రయత్నం నిరుపయోగమైనదని సభ్యులన్నప్పుడు తనసంజాయిషీ మొదలుపెట్టాడు. కొన్నినిమిషాల్లో అందరికీ అర్థమయేలాగున చెప్పాడు:

“గ్రీకుసేనలు పెద్దవే అవచ్చు; ఇంగ్లీషువారి మాటసహాయంతప్ప మరేం చెయ్యరు.

“ఇంకా రాజీఏమిటి గ్రీకులు మొన్నటివరకు మన తురుష్కసామ్రాజ్యంలో ఒదిగిఉండినవారు; ఈరోజున సంధి అని ఎవరనేవాళ్లో? మనలో తురుష్క రక్తము లేదూ?

“గ్రీకులతో సంధిచేసుకొని, మొన్నటివరకూ మనకి బానిసలయివుండిన వాళ్లక్రింద ఈరోజున మనం చిత్తముని చేతులు కట్టుకుంటామా...”అని.

ఒక్క పెట్టున మహాసభ్యు అంతా ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు, యుద్ధమే ముఖ్యమని.

అతని అనుచరులలో, సహాయులలో ముఖ్యుడు ఇస్మెట్; ధైర్యశాలి. గ్రీకులని ఎదిరించేపని అతని పాలబడినది. తను సైన్యంతో కాపాడుతూన్న ఎస్కిషహర్ అనే ముఖ్యమైన పట్టణానికి చుట్టూ గ్రీకులు చేరుతున్నారు. ఆ ఊరు విడిచిపెట్టి వెనక్కి వెళ్లిపోతే మళ్లా సైన్యము కూడదీసుకొని గ్రీకులని ఆ ప్రదేశంలను దగ్గరగా లేదు. ఆస్థలము విడుస్తే గ్రీకులు అనటోలియా అంతా ఆక్రమిస్తారు. విడువకపోతే కొంచెం బలంగాను, ముఖ్యముగాను వున్న తనసైన్యము అంతా ఆహుతి అయిపోతుంది. ముస్తాఫా టెలిఫోనులో విన్నాడు ఇస్మెట్ పరిస్థితి. వెంటనే తమసైన్యము నడపడానికి వెళ్లి సంగతిసందర్భాలు స్వయంగా పరీక్షించాడు.

ఒకవైపున వార్తలు వింటూ మ్యాపుమీద స్థలాలన్నీ పరీక్షిస్తున్నాడు, చదరంగమాడినట్లు, జెండాలు మారుస్తూ కొన్నేపు ఆలోచించాడు. 300మిటర్ల వెనుక వున్న నదిఒడ్డుకి టర్కీసేనలు చేర్చమని, తను మళ్లా అంగోరా వచ్చి భయపడుతున్నవారికి ధైర్యము చెప్పి, సభలో తనకి ఈ ఆపత్సమయంలో సకలఅధికారమ్ము ఉంటేనేకాని వీలుకాదని, తనని ముఖ్యసేనాని చేయమని సభని అడిగాడు.

ముస్తాఫాకి ఒకసారి అనుభవమయింది, ఎన్వర్ మరి త్రివర్గముతో. వాళ్లు తనని యుద్ధాలుచేయటానికి ఉపయోగించుకునేవారు. తరువాత రాజ్యాంగమునుంచి దూరంగా తరిమేసేవార్లు. సుల్తానుమట్టుకు సుల్తాను —, ప్రాణం తెగించి అనేకమాట్లు టర్కీని రక్షిస్తే చివరకి పాషా అని బిరుదు ఇచ్చి వీపుమీద తట్టి, ఈరోజున మరణశిక్ష విధించాడు. అంతా అంతే, అవసరము తీరేవరకూ నీఅంతవాడు లేడంటారు. కాని తాను జాగ్రత్తగా ఉండాలి. అంచేతనే ముఖ్యసేనాని అధికారము కోరాడు. సభ ఒప్పుకున్నారు. ఒప్పుకోక ఏంచేస్తారు అని ముస్తాఫాకి బాగా తెలుసు. అతని నాయకత్వంక్రింద సైనికులంతా క్రొత్త ఉత్సాహముతో నిండిపోయారు. ఏ యుద్ధములోనైనా అంతే ముస్తాఫా అంటే ఉన్న ఉత్సాహము మరో అప్పుడు ఉండదు.

ముస్తాఫానాయకత్వముక్రింద ౧౮రోజులు గ్రీకులు తురుష్కులు అతి తీవ్రముగా తరతరాలనుంచి ఉన్న కసి తీర్చుకుంటూ యుద్ధముచేశారు. అయితే ముస్తాఫా నూరిపోసిన దేశభక్తి తురుష్కులని ఎంత తీవ్రమయిన సమయంలో అయినా ముందుకే నడిపించి, టర్కీలో ఒక అంగుళమైనా ఇతరులకి వదలకుండా చేసింది. చివరకి సమర్థత చూచి ముస్తాఫా ౧౮రోజులు గ్రీకులతో తమబలం అంతా ఉపయోగించి నీరసిస్తున్నా

రని తెలిసి, తనసైన్యాన్నంతనూ వినియోగించి మీన పడ్డాడు. గ్రీకులు తాళలేకపోయారు, పారిపోయారు. ఆ తరమటను మొదలు ౧౫౦ మైళ్లు పరిగెత్తి ఓడలు ఎక్కి ప్రాణాలు దక్కించుకొనేవరకూ గ్రీకులని వదల లేదు టర్కీ సేనలు.

*　　　*　　　*

ఇంకా ఈ అలసట తీరకముందే గ్రీకులు మళ్లా కూడుకొని కాన్‌స్టాంటినోపిలుని ముట్టడించడానికి తయారవుతున్నారని వార్తలు వచ్చినయి.

ముస్తాఫాకి ఓడలు లేవు. అంచేత తనసైన్యాన్ని ఇంగ్లీషువారి స్వాధీనములో ఉన్న భూసంధిద్వారా నడపాలి. దానికి అచ్చట ఇంగ్లీషుసేనాని ఒప్పుకోలేదు; ఈ సేనాని చొరవలేనివాడని తెలుసుకున్నాడు ముస్తాఫా, అతనికి ఇంగ్లండునుంచి వస్తున్న టెలిగ్రాములు రహస్యంగా తెప్పించి చదివి. వెంటనే తన ౨,౦౦౦ సుఱ్ఱపు దళాన్ని బ్రిటిషువారిస్వాధీనములో ఉన్న ప్రదేశము లోంచి వెళ్లమన్నాడు ఇంగ్లీషువారు ఆపుచేశారు.

వ్యవహారము ముదురుతూన్నట్లు కనిపించింది. అయినా ఇంకోసారి చొరవచేసి చూద్దా మనుకొన్నాడు. తనకాల్బలాన్ని యుద్ధసంకల్పం లేదని సూచిస్తూ తుపాకులు తిరగవేసి పట్టుకొని ముందరకి వెళ్లమన్నాడు; వెళ్లారు.

ఇంగ్లీషుసేనలు గాభరాపడ్డారు. వారికి యుద్ధములో దిగమని ఆజ్ఞలులేవు. తురుష్కులని ఆపవలసిందనిమాత్రమే ఆజ్ఞ. ఈ తురుష్క సేనలు యుద్ధము చేయవు, ఆగవు. వెంటనే ఒకకబురు వచ్చింది; మనము శాంతిగా సందర్భాలు తేల్చుకుందామనీ, మీరు గ్రీకులతో దెబ్బలాడాలని వెళుతున్నారుగనుక మేమే గ్రీకులని అచ్చటనుంచి పంపించివేస్తామని ఒప్పుకుంటూ. ముస్తాఫా జయముపొందిన ధీరుడులాగా, 'సరే, మా ఇస్మెట్‌తో మిగిలినవిషయాలు మాట్లాడి సంధి ఏర్పరచండి' అని సైన్యాన్ని మరలించాడు.

ఈ విజయముతో తురుష్కులందరికీ ముస్తాఫా అవర్ణవీరుడై పోయాడు. అతన్ని ఘాజీ— 'మ్లేచ్ఛవినాశకుడు' — అన్నారు. ఇంతటినుంచి ఘాజీ ముస్తాఫా కెమాల్ పాషా; అతను తనకి చిన్నతనములో బడిలోంచి పారిపోయి ఎవరితోను చెప్పకుండా సైనికశిక్షణ నేర్చుకుంటున్నప్పటినుంచీ తెలుసు తను ఎప్పుడో ఒకరోజు పెద్దసేనాని అవుతాననీ — తనతలిదండ్రుల ఇష్టప్రకారము తాను మతగురువుగాని గుమాస్తాగాని తనజన్మలో కాననీ. —

ఒకఆశయము నెరవేరింది. ఇక మిగిలినది త్వరలోనే సాధించాలి. అప్పుడే అందరూ తనచేతిలో ఉన్న అధికారాన్ని చూసి భయపడుతున్నారు, అనుమానిస్తున్నారు. ఒకరోజున సభ్యులు కొందరు తనతో మొదటినుంచీ పనిచేసి తనఉద్దేశాలు కొన్ని కొంతవరకు ఎఱిగినవారు "పాషా! నీకు సుల్తానుని, కలీఫని తీసేయాలని ఉందిట నిజమేనా ?" "మీ రేమంటారు ? అలా చేయటం మంచిదేనా ?" అని తిరుగుప్రశ్న వేసి తప్పించుకొన్నాడు. వారికి అట్లు చేయటము ఇష్టంలేదన్నారు; తానుకూడా "అబ్బే! అలా చేయనని కావలిస్తే రేపు మనరాత్రిసభలోకూడా చెబుతాను" అన్నాడు.

కాని అట్లా అన్న కొద్దిరోజుల్లోనే అవకాశం దొరికింది. ముస్తాఫాకి మొదటినుంచీ సుల్తానుని తీసివేయాలని ఉద్దేశం; కాని ఇంతవరకూ ఇది మనస్సులోనే ఉంచుకొని పొంచిఉన్నాడు. ఆ అవకాశం మళ్లా ఇంగ్లీషువారిప్రవర్తనవల్లే. సంధిపత్రముమీద సుల్తానుని సంతకముపెట్టడానికి రమ్మన్నారు, జాతీయప్రభుత్వానికి తెలియబరచి.

వెంటనే తురుష్కులంతా, ముఖ్యంగా ముస్తాఫా కోపెం అందిచ్చేటప్పటికి, రేగిపోయారు. "సుల్తాను ఎవరు ? యుద్ధముచేసి గ్రీకులందరిని తరిమిన దెవరు ? సుల్తానా ? ఇంగ్లీషువారిని సంధిచేసుకునేటట్లు చేసిం దెవరు ? సుల్తానా ? ఈ రోజున సంధిపత్రముమీద సంతకముచేయటానికి జాతీయమహాసభకంటే సుల్తాను ముందరికిరావడము ఏం న్యాయము ?" అని ప్రజలంతా అల్లరి ఆరంభంచేశారు.

ఈ సమయం చూసి ముస్తాఫా సభలో ఈసలంగతి లేవనెత్తాడు. 'సుల్తానుపదవి ఖిలాపతుపదవి రెండుట విడదీయుంచి తరువాత సుల్తా , దివ్వైలోపల్ల ఉన్న న్యాయంగా ఇంగ్లీషువారు అతనిఐనవాల చేర్తి నుసలో

మనకు దెబ్బలాటలు పుట్టిస్తారు. అంచేత సుల్తానుని తీసి వేయటం మంచిది.'

అందుకోసం ప్రత్యేకము కూడిన సభ ఎంతసేప టికీ ఆలోచించటమూ మాటలూ తప్ప ఏమీ తేల్చలేక పోయింది. ముస్తాఫాకు ఈకాలవ్యవధి,— నిజంగా నిరుప యోగమై చచ్చిపోయిన సుల్తానుపదవిని కుళ్లిన ఆకు లాగా లాగ్గిపారవేసేదానికి బదులు గంటలకొద్దీ ఆలో చించటం — విసుగుపుట్టించింది.

"ఆట్టామనుసుల్తాను తనపదవిని ప్రజలవద్దనుంచి మొదట్లో బలవంతంగా భయపెట్టి తీసుకున్నాడు. ఈరోజున ప్రజలు ఆ పదవిని అదేవిధముగా తీసికోవ డంలో ఆక్షేపణలేదు. మీరు ఒప్పుకున్నా ఒప్పుకోకపో యినా ఆపని ఎలాగా జరుగుతుంది. మీ నిర్ణయంమీదనే మీ క్షేమం ఆధారపడివుంది."

సభ్యులు సుల్తానుపదవి తీసివేయడానికి ఎస్సెంబ్లీ నిర్ణయించవచ్చుని బయటపడ్డారు. ఎస్సెంబ్లీలో ముస్తా ఫా తనసహచరులతో ఒకప్రక్క నుంచుని ఈతీర్మానము వచ్చేటప్పటికి 'ఏకగ్రీవంగా ఆమోదించబడుతుందని అనుకుంటాను' అని అగ్రాసనాధిపతిచేత అనిపించాడు. చేతులెత్తమన్నారు. ఏవో కొన్ని చేతులు లేచినయి. "ఏక గ్రీవంగా ఆమోదింపబడినది" అని అన్నాడు అగ్రాస నాధిపతి. "లేదు" అన్నారు ఎవరో ఒకరిద్దరు. "నోరుమూయి" అన్నారు ముస్తాఫామనుష్యులు. బల వంతంగా ఈతీర్మానము నడిచింది.

సుల్తానుని మూటగట్టి దేశమునుంచి పంపించే శారు. వెంటనే దేశములో సరియైన ప్రభుత్వము నడప టానికి రిపబ్లికు స్థాపించారు; తను నయభయాల మొదటి నియంత అయాడు.

తనపట్టు నెరవేరింది చాలామట్టుకు. ఇక కలీఫ్‌ని కూడా వెళ్లగొట్టి స్వాంఘికముగా తీసుకొనిరావలసిన మార్పులు తీసుకొనిరావాలి. ముస్తాఫాకి మొదటినుంచీ తాను చేయవలసినవన్నీ ఇద్దీ అని ముందర ఆదర్శముగా ఉంచుకున్న అది నెరవేరడానికి ఎన్నివిధాలయినా సరే ఏమార్గముతోనైనా సరే ప్రయత్నాలు చేసేవాడు.

తను ఇప్పుడు తనదేశాన్ని పునరుద్ధరించాలి. బల వంతమయినా, ఇతరదేశాలల్లో తనని తను కాపాడుకునే టట్లు చేయాలి. ఇతరులతో టర్కీకి జోక్యము అక్క ర్లేదు. ఇతరదేశాలవారు జోక్యము కలిగించుకోవాలని వస్తే వారించేలాగు ఉండాలి.

టర్కీ, టర్కీవారికే.

అందుచేతనే అతను నియంత అయినకొద్దికాలము లోనే తనదేశములో తరతరాలనుంచి టర్కీలో నివ సించిఉన్న పదిహేనులక్షల గ్రీకులను గ్రీసు పంపించి అచ్చటనున్న సుమారు అదేసంఖ్యగల తురుష్కులని టర్కీకి పిలిపించివేశాడు.

నియంత అయిన కొన్నిసంవత్సరాలవరకు తనకు ప్రతికూలంచేయడానికి పూనుకున్నవారిని అణచటం లోనే సరిపోయింది. ఈతిరుగబాటుదారు లందరినీ నిర్దాక్షిణ్యంగా చంపించివేశాడు. ప్రజలు తమమంచిని తెలిసికోలేకపోతే బలవంతంచేతనైనా వారికి నేర్పాలనే అతనితత్వము; కాని తనమనసులో ఉన్న ఊహలన్నీ ఆచర ణలో పెట్టడానికి దేశములో ఏమాత్రమూ తిరగబాటు సమూహాలుండగూడదు. సుల్తాను వెళ్లిపోయినప్పటి నుంచి ఊరికే నామమాత్రావశిష్టముగా ఈరెండేండ్ల నుంచీ ఉంటూన్న కలీఫ్ చుట్టూ కొంతమంది చేరి తనకి వ్యతిరేకముగా కుట్రలుచేస్తూన్నట్లు తెలిసింది: కాని ఖిలాఫతు తీసివేయాలంటే ప్రజలంతా తిరగబడతారు. అంచేత ఊరూరా ప్రజాకక్షి అని తనవైపు వాదించే కక్షిసంస్థలు ఏర్పాటుచేశాడు. కేవలమూ యుద్ధము రోజులలో తెగబడిపోరాడడం స్వంతంగా సేనలు నడిపి శత్రువులని జయించటం మాత్రమే గాదు; శాంతి సమ యంలోకూడా ఏవిధమయిన ఏర్పాటులు చేసి తన అధికారము కాపాడుకోవాలో అలా చేయ డంలో నేర్పరి. ముస్తాఫా అలా పొంచి ఉండిఉండి, మిగిలిన కట్టుదిట్టాలు చేసుకొని, ఏదో మిషమీద, ఆగాఖానుఅనే ముస్లిమునాయకునివద్దనుంచి కలీఫ్‌ని సమర్యాదగా చూడవలసినదని వచ్చిన విన్న పాన్ని కుట్రకింద ప్రజలకు కనబరచి, ఇంగ్లీషువారు మరల ఖిలాఫతుని అడ్డుగాపెట్టుకుని ఆగాఖానుద్వారా దేశంలో విభజనలు పుట్టించాలని చూస్తున్నారని పెద్ద ఆందోళనచేసి బలవంతంగా ఖిలాఫతును తీసివేశాడు, ఈ లాటికుట్రలు రాకుండా.

అంతవరకూ ముస్తాఫా చేసినది దౌర్జన్యమువలె కనిపించినప్పటికీ, అతను సేనానాయకుడుగా ఉండినప్పటినుంచీ తనతో ఒకప్పుడు సహచరులుగా ఉండి ఆచరణలో పెట్టడానికి వీలయిన ఆశయాలు ఏమీ లేక పోయినప్పటికి రాజకీయంగా అధికారం సంపాదించి ఎన్వర్ మంత్రివర్గము ఏమేమిపనులు చేశారో అంతా గమనిస్తూనే వుండేవాడు. ఏదేశానికైనా రాజకీయము లైన మార్పులు కలిగినప్పుడు వ్యతిరేకకక్షి ఉండటం సహజము. ఆవ్యతిరేకాన్ని చతుర్విధోపాయాలా అణచి వేయడం నూతనరాజ్యాంగానికి అవసరము, దేశానికి ఏవిషయముగానైనాసరే అభివృద్ధిమార్గాలు ప్రవేశపెట్టే ముందర.

ముస్తాఫా కేవలము యోధుడుమాత్రమే కాడు; రాజ్యాంగవిధానములోకూడా నేర్పరి; అంతకంటే కూడా ఉత్కృష్టమైనది అతను జాగ్రత్తగా ఆలోచించి నెరవేర్చిన దేశపునరుద్ధరణము.

కలీఫ్ని తీసివేసినప్పటికి ఆరువందల సంవత్సరాలు అట్టామన్ సుల్తానులచేతుల్లో ఉన్న తురుష్క ప్రజలలో, మతమూఢత్వము నాటుకుని ఉన్నదని తెలుసు అతనికి. అది నిర్మూలము చెయ్యాలి ముఖ్యమైన సంస్కరణ ఏ దయినా ప్రవేశపెట్టే ముందర. అంచేత ఈ మతమూఢత్వానికి చిహ్నమయిన చిన్న అంశముమీద ఆరంభించాడు సంస్కరణ. దేశములో ఎవరూకూడా 'ఫెజ్'టోపీలు ధరించకూడ దన్నాడు. చాలామందిజనము ఒప్పుకో లేదు. అది శాసనముచేసి దానికి విరుద్ధముగా నడిస్తే దండిస్తానన్నాడు. కొన్నిప్రాంతాల్లో ప్రజలు దౌర్జన్యముగా నిరోధించటానికి మొదలుపెట్టారు. వెంటనే నిర్దాక్షిణ్యంగా సేనలతో వారిని అణచివేశాడు. కొద్దిమాసాల్లో ప్రజలు అలవాటయిపోయారు దానికి. ప్రజల మానసికతత్వము మారింది.

ఆ తరువాత మిగిలినసంస్కరణలు ప్రవేశపెట్టడము సులభమయింది. మతప్రోక్త అందరినీ వారివారి నివాసాలలోంచి పంపించివేశాడు. వారివిశాలగృహాలు మూసేయించి వారిని జీవనముకోసము పనిచేసి పొట్టగడుపుకోమని శాసనంచేశాడు. మతవిద్యాలయకంగా ఉన్నాయి

పన్నడానికి అవకాశము పోయింది ఇందువల్ల; సామ్యవాదములో ముఖ్యసూత్రమయిన "మనో దేహదార్ఢ్యాలు ఉన్నవా రందరూ పనిచేయాలి" అన్నపద్ధతి స్థాపించాడు. అయితే అతనిసామ్యవాదఅనుసరణ ఇతరుల విషయంలోనే కాదు. తనుకూడా తనకు వచ్చిన బిరుదులన్నీ త్యజించాడు. ఘాజీ, పాషా ఇవన్నీ విడిచి సాధారణపు ముస్తాఫా కెమాల్ అనే వ్యవహరించాలన్నాడు.

దీనితరువాత ఘోషాని తప్పించేశాడు. ఆడవారికి విద్యార్హత, వోటింగుహక్కు, ఉద్యోగార్హత అన్నీ ఉన్నాయని తీర్మానించేశాడు. అంతకుముందు టర్కీ స్త్రీలు తనబాల్యంలో ఎంతచాటున ఒదిగిఉండేవారో, నల్లటిముసుగులు కప్పుకుని వీథుల్లో సంచరిస్తూంటే మనుష్యులవలె కాకుండా భూతాలవలె ఉండటం అతనికి జ్ఞాపకమే. అప్పటి ఆడవారు, తనతల్లి, తనజీవితములో ప్రతి విషయంలోనూ తనని అర్థంచేసుకొన్న తన తల్లికూడా ఖైదులాంటి చీకటయిన ఇంట్లో ప్రతి గంటా ప్రతిరోజూ జీవితమంతా 'ఇలాగే ఉండాలి గదా' అనే నిర్వేదముతో ఉండటముకూడా అతనికి జ్ఞాపకమే.

ఈరోజున టర్కీరాజ్యాంగములో వోటు చేయడానికి హక్కుగలవారు ౨౦ లక్షలమంది స్త్రీలున్నారు. ౧౯౩౫-వ సంవత్సరములో ౧౭ గురు స్త్రీలు పార్లమెంటులో సభ్యురాండ్రుగా ఎన్నుకొనబడ్డారు.

పూర్వపురోజుల్లో ఉండిన గుడిసెలు, ఖైదులాంటి ఇళ్లు పీకేసి మంచి 'కాంక్రీటు' ఇండ్లు నగరనిర్మాణశాస్త్రములుగల ఇంజనీయర్ల తనిఖీక్రింద కట్టించాడు.

ఇక చదువు అందరికీ రావాలంటే ప్రాతకు కష్టమయిన లిపి మానేసి రోమనులిపి ప్రవేశపెట్టాలని దేశదేశాలనుంచి నిపుణులని రప్పించి రెండు సంవత్సరాలు వారితో తనుకూడా పనిచేసి, తను స్వయంగా ఊరూరా తిరిగి ప్రజలకి బోధించి, ఆలిపి ప్రవేశపెట్టి, తురుష్కభాషలో ఉన్న అరబ్బీ, పారసీకమాట అన్నితీసి వీలయినంతవరకు తప్పించి తురుష్కమాటలు ప్రవేశపెట్టారు

ఆసందర్భంలో దేశములో వాడుకలోఉన్న పేర్లు వందలకొద్దీ మారిపోయినయి. తన పేరులోకూడా 'కెమాల్' అనే అరబ్బీమాటకి బదులు 'కమాల్' అనే తురుష్క పదమే ఉపయోగిస్తూ వచ్చాడు.

ఈముఖ్యవిషయాలేగాక చిన్నవిషయాల్లోకూడా సలాము మానేసి కరస్పర్శచేయడమే ఉండాలనీ, బడులలో ఏ ప్రత్యేకమతమూ బోధించరాదనీ, ప్రతివారికి ఇంటిపేరు వుండాలనీ అన్నీ శాసనా లయిపోయినయి. దాన్ని అనుసరించి తను 'ఆటాటర్క్' అని ఇంటిపేరు పెట్టుకుని చివరకు 'కమాల్ ఆటాటర్క్' అనే వ్యవహరించబడుతున్నాడు ఇప్పటికి.

ఇంతవరకూ చరిత్రలో కమాల్‌వంటి వ్యక్తి లేడని చెప్పవచ్చు. — కేవలమూ సైనికుడుగా ఉండి నియంత అయాడని గాదు, రాజ్యాంగ విషయాలలో అతితెలివితేటలు చూపాడని కాదు, ఇన్ని సంస్కరణలు ప్రవేశపెట్టాడని కాదు; — కాని అతను చెబుతూ ఉండిన ప్రకారము "టర్కీ టర్కీవారికే," అన్న తన ఆశయాన్ని తనజీవితకాలములోనే సాఫల్యముచేసికొని, తన ఉద్దేశముప్రకారము ఆదేశము ఎంత చిన్నదయినా మిగిలిన ప్రభుత్వాలు ఎప్పుడు దీన్ని కలుపుకుందామా అనే దృష్టితో చూడడానికి వీలులేకుండా జేశాడు ముస్తాఫా. అదీ అతని చతురత. అధికారము వచ్చి తనకాళ్లదగ్గర పడినప్పుడు — ప్రపంచకములో ముసల్మానులంతా ముస్తాఫాని తమనికూడా రక్షించమని అడిగినప్పుడు నెపోలియన్‌లాగా అధికారదాహము పొందక, "టర్కీ తన స్వాతంత్ర్యము సంపాదించుకుంది; మిగిలిన దేశములు కూడా అలాగే చేయాలి" అని తనపనిమీదనే తనదృష్టి నిలుపుకున్నాడు.

రాబియా బసరి

కె. అన్నమరాజ శర్మ

ఓజగజ్జ్యోతి! రాబియా! యుర్విజనులు
భక్తురాలంచు నిను పొరబాటుపడిరి,
చిత్కళాపరంపరల రోచిస్సులీను
దేవదూతివినా నిన్ను దెలియరయిరి.

త్యాగము, పవిత్రశీలత, నైవరతియు
చేవదాల్చెను తావకజీవితమున
భక్తిపీయూషమున 'మజా'[1] బడయు దనుచు
ఎంతమధురంబుగా వచియించినావె.

దుఃఖము, విపత్తు, నరునకు దుస్సహములు
భక్తునకు నివి యమృతసోపానపఙ్క్తి-
యవనయోషిన్మణీ! యీరహస్యమెంత
రమ్యగతి లిఖించితివె నీబ్రతుకు తెరను.

భౌతికశరీరమును మట్టిపాలుజేసి
మర్త్యలోకంబునం దాత్మమహిమ మిగుల
నెచటికేగితివమ్మ, పూర్ణేందువదన!
భక్తిగంధానిలమువీచె స్వర్గభూమి.

అంబురుహలోచనా! ప్రణయైకసుమము
భగవదర్చనకొరకు నర్పణము జేసి,
భక్తిశృంఖలాబద్ధవై పడినవెతల
పాటులను విన్న గద్గురుపాటుకలుగు.

ఆఅమాయికదరహాస మౌముఖంబు
కరుణవెన్నెలనెవ్వాడు కన్నుగవయు
ప్రేమరుచిపెంపుసొంపు కెంబెదవిసొబగు
కాంచుభాగ్యంబు మాకయో కలుగదాయె.

పెళ్లిళ్లు రిజిస్టరు చేయుట అవసరము

శ్రీమతి బి. కామేశ్వరమ్మ

ఈ నవంబరు నెలంతా ఎక్కడచూచినా హిందూదేశమం దంతటా అఖిలభారత మహిళా సభకు అనుబంధించిన సభలు (Constituent Conferences) జరిగాయి. స్త్రీలకు సమానహక్కు బాధ్యతలకు సంబంధించినవి ఇంకా అనేకమైన తీర్మానాలు చర్చింపబడ్డాయి. వాటిలో ముఖ్యమైనది ఒకటి పెళ్లిళ్లు రిజిస్టరుచేయుట ఆవశ్యకమని. దీనినే శ్రీమతి రాధాబాయి సుబ్బరాయన్ గారు భారతశాసనసభలోకూడా ప్రతిపాదింప బోతున్నారు.

శారదాబిల్లు ఎప్పుడైతే అమలులోకి వచ్చిందో అప్పటినుంచీ అతిబాల్యవివాహాలు దేశంలో తగ్గిపోతున్నాయి. ప్రాజ్ఞత వచ్చేకే పెళ్లి అవుతూవుండడంచేత, చాలా చోట్ల స్వయంవరాలే జరుగుతున్నాయి. ఎప్పుడైతే వరించి కోరి వధూవరులు ఒకరిని ఒకరు వివాహమాడుతున్నారో అప్పుడే వారియొక్క బాగోగులకు వారే ఎక్కువ బాధ్యు లవుతున్నారు. ఇటువంటిస్థితిలో స్త్రీలకు చట్టసహాయము అవసరము.

ప్రస్తుతము మనశాస్త్రములు ఆచారములు స్త్రీలపట్ల చాలా పక్షపాతాన్ని చూపిస్తున్నాయన్నమాట అందరకు తెలిసిన విషయమే. స్త్రీఅంటే వట్టి అబల, ఎప్పుడూ ఒకరిమీద ఆధారపడవలసిన ఒకవస్తువుగా పరిగణింపబడుతున్నది. చిన్నతనంలో తలిదండ్రుల అదుపుఆజ్ఞలలోను, పెండ్లిఅయిన తరువాత భర్తఆజ్ఞలోను, తరువాత కొడుకుల అదమాయింపులోను వుండవలెనట స్వాతంత్ర్యము అనేది కల్లోకూడా లేదు. పోనీ,ఆస్తిపొందడానికి అర్హత వుందా అంటే, అదీ లేదు. అన్నదమ్ములు లేనియెడల తండ్రిఆస్తి ఆడది అనేలోటుచేత కూతురుకుకాక మొగబిడ్డలుగావున్న దాయాదులకు చెల్లుతుంది. భర్తఆస్తికేనా హక్కుదారురాలా అంటే అందుకు అర్హతలేదు, మనువర్తికి తప్ప. వేరుదారి లేదు.

పైగా కట్టుబాట్లలోనా, ఎక్కడలేని చరాశైదు ఆడదానికే. ముక్కుపచ్చలారని మూడేళ్లపిల్లయినా పెళ్లిచేశాక ఆ మొగుడు పోతే ఆజన్మానికి అది వెధవ: బొట్టు పెట్టుకోకూడదు. మంచిబట్ట కట్టుకోకూడదు. రవిక తొడుక్కోకూడదు. జుట్టు తీసివేసి-వికారిగా ఎవరింట్లోనో చాకిరీ చేస్తో ఏడుస్తో జీవితం గడపాలి. డెబ్బైఏళ్ల ముసలాయనైనా పెళ్లాం చస్తే పెళ్లికొడుకు. అందరూ పోగై బలవంతపెట్టి ఫెళ్లుమంటో వూరేగుతోకూడా పెళ్లిచేస్తారు. మొగవారికి వెధవరికము లేదు. ఆడదిమాత్రం, ముసుగువేసుగుని కూర్చోటం శాస్త్రవిధాయకం.

ఇంక మొగరాజు, ఎందరినైనా, ఏజాతివారినైనా, శాస్త్రయుక్తంగా వివాహమాడ

వచ్చును. అందంగా లేదని, చెప్పినట్టు వినలేదని, మామగారు డబ్బివ్వలేదని ఏదో మిష పెట్టి అన్యాయంగా, ఏతప్పూ చేయని భార్యను ఒదిలేసి ఇంకొక పెళ్లి ఏమీ ఆక్షేపణలేకుండా చేసుకోవచ్చు. కాని ఆడది మాత్రం పిచ్చివాడైనాసరే, కుష్ఠువాడైనాసరే, తాగుబోతైనాసరే, తుంటరి అయినాసరే, వాడితోటే అన్ని బాధలకు ఓర్చి కాపురంచెయ్యాలి. స్త్రీలకు పురుషులకు వున్న తేడాలు ఇవి. ఇవి సర్దుబాటు చేసుకోవటం అవసరమో కాదో వివేకవంతులైనవారే ఆలోచించుకోవలెను.

౧౮౭౨-వ సంవత్సరమునుంచి సివిల్ మారేజి చట్టము (Civil marriage act) ఒకటి వుంది. ఇది అనాచారపద్ధతిగా వివాహము చేసుకొనేవారికి రక్షణ. హిందూ ధర్మశాస్త్రానికి వ్యతిరేకముగా పెళ్లిచేసుకున్నట్టయితే అది పెళ్లికాదు. కాబట్టి ఎవరైతే వర్ణాంతర, మతాంతర వివాహాలు జరుపుకొంటారో వారికి ఈచట్టము అధికారము (Legal sanction) ఇస్తుంది.

నాగరికత హెచ్చుతోన్నకొలది ఆచారపద్ధతులుకూడ మారుతోన్నవి. విదేశాలలో ఈరిజిస్ట్రేషను పుట్టుకలకు, పెళ్లిళ్లకు, చావులకు అన్నిటికీకూడ అవసరము. సంఘములోని లోటుపాట్లు చట్టములవల్లనే సరిచేసుకోవలెను. మన దేశములోకూడా సాంఘికముగా చాలా మార్పులు వస్తున్నాయి; వచ్చాయి. అయినా, ఇంకా స్త్రీ పురుషులకు సరిసమానహక్కులు అన్నివిధాల రాలేదు. కమాల్‌పాషావంటి డిక్టేటర్లు మనదేశములో అవసరము.—

ప్రస్తుతము హిందూశాస్త్ర ప్రకారముగా జరుగుతోన్న వివాహాలవల్ల స్త్రీకి తగినంత రక్షణ లేదు. భర్త అకారణముగా తగినంత తప్పులేకుండగనే భార్యను నిర్హేతుకముగా వదలివేయుటకు హక్కుగలదు. మనకళ్లారా ఎన్నోచోట్ల భర్త వదలివేస్తే దిక్కులేక, పంచలపాలవుతూవున్న భార్యలను అనేకులను చూస్తున్నాము. వారికి తిరిగీ వివాహము చేసుకొనుటకుకూడ హక్కులేదు—సంఘమూ ఆదరించదు. ఇటువంటిస్థితిలో ఒకచట్టరూపముగా, ఈ అన్యాయాన్ని తొలగించవలెను. ప్రతిపెండ్లి రిజస్టరుచేసినట్టయితే తగినంతకారణం లేనిదే భార్య భర్తనుగాని, భర్త భార్యనుగాని త్యజించుటకు వీలుండదు. ఈ రిజస్ట్రేషనువల్ల సాధారణపు పెళ్లితంతుకు ఏమీ ఆటంక ముండదు. యథావిధిగా, వాయిద్యాలతో, సంభావనలతో, వేదాధ్యయనముతో చేసికోవచ్చును. దానివల్ల సంఘానికి ఉపకారమేకాని అపకారము లేదు. ఈ బిల్లు త్వరలో రాధాబాయి సుబ్బరాయన్‌గారు ఢిల్లీ భారతశాసనసభలో ప్రతిపాదింపబోతున్నారు. స్త్రీసంఘములు, స్త్రీలు చేరి దానికి తగినంత చేయూత ఇచ్చి శీఘ్రకాలంలో అది అమలులోకి వచ్చేటట్టు చూస్తే చాలావఱకు స్త్రీలకు జరుగుతోన్న అన్యాయం తొలగుతుంది.

విమర్శనము

ఆంధ్రగణితశాస్త్రజ్ఞులు

పర్వతనేని నారాయణరావు దొరగారు

౧

శ్రీ పిడపర్తి సుబ్బయ్యశాస్త్రిగారిచే వ్రాయబడిన "ఆధునిక గణితశాస్త్రము: ఎంతవరకిది స్వతంత్ర సృష్టి" అనువ్యాసమును చదివినాను. భారతీయ గణితశాస్త్రజ్ఞులలో ప్రధాన స్థానమునుపొందిన శ్రీ భాస్కరాచార్యులు ఆంధ్రుడు.

క్రీస్తు పూర్వము ౨౨౫-వ సం॥నుండి క్రీ॥ శ॥ ౨౨౫-వ సంవత్సరమువరకు (౪౫౦ సంవత్సరములు) భారతదేశమున ఆంధ్రసామ్రాజ్యము ప్రకాశించియుండెను. ఆ కాలములోనే, సమస్తశాస్త్రాభివృద్ధియు భారతీయులు గావించియుండిరి. ఆర్యభటుడు, వరాహమిహిరుడు మొదలగు గణిత, జ్యోతిషశాస్త్రజ్ఞులు అప్పుడే విలసిల్లిరి. ఆంధ్రసామ్రాజ్యపతనానంతరము దేశమున స్థిరమైన ప్రభుత్వము నెలకొల్పబడని కారణముచే రాజపోషణలేక నూతనపరిశోధనలు సన్నగిల్లి, ఆనాటి శాస్త్రములనే వేదములుగా మనవారు తీసికొనుట కారంభించిరి. భాస్కరాచార్యుడు తదుపరివాడైనను, గణితశాస్త్రములో తన వ్యక్తిత్వమును చూపెను.

౧౩-వ శతాబ్దములో శ్రీ వావిలాల కూచన్న యను గొప్ప ఆంధ్రగణితశాస్త్రజ్ఞుడుకూడ నుండెను. ఈయన గ్రహసిద్ధాంత శాస్త్రవిషయములో చాలా కృషిచేసి, స్వతంత్రముగ పతకములను తయారుచేసిరి. ఈగ్రంథము యింతవరకు తెలుగులో ప్రచురింపబడియుండలేదు. వారన్ అనే ఒక ఆంగ్లయుద్యోగి యీ పతకములను "Warren's tables" అనుపేర యింగ్లీషులో ప్రచురించెను. ఈవారన్ తూర్పు గోదావరి జిల్లాకు కలెక్టరుగా నున్నప్పుడు, ఒకపండితుని వద్దనుండి యీ పతకములను గ్రహించెనని విన్నాను. ఈపతకముల మూలకముగా అధికమాసములు, గ్రహణములు, గ్రహస్థితి బహుసూక్ష్మములో తెలిసికొనవచ్చును. విశేషించిన గణితశాస్త్రజ్ఞానమున్నగాని యిట్టిపతకములను కూర్చుట పొసగదు. ఇట్టిస్వతంత్రపతకములను నిశ్చయింపగలిగిన సిద్ధాంతి యింతవరకు తిరిగి జన్మించియుండలేదు.

నే నీవిషయము తెలియజేయుటకు కారణ మిది. భారతదేశ గణితశాస్త్రజ్ఞులలో ఆంధ్రులు వన్నెకెక్కియుండిరి. స్వతంత్ర గణితసృష్టికి కేవలము ఆంధ్రులు కారకులు. ఆంధ్రప్రభావము దేశమున తగ్గినటులనే, ఆయా శాస్త్రముల పరిజ్ఞానముకూడ, ఆంధ్రులలో తగ్గినది.

---

15. 12 16

ఆంధ్రలిపి సంస్కారము

కా. రా. వేంకటకృష్ణం

ఇప్పటి యంత్రయుగమున ఆంధ్రలిపిని సంస్కరింపక తప్పదని ఆంధ్రభాషాభిమాను లందరును సమ్మతింతు రనుట నిస్సందేహము.

హరిసర్వోత్తమరావుగారు జూన్ నెల సంచికలో "ఆంధ్రులకు ధైర్యముకలదేని రోమనులిపిని అంగీకరించి ప్రపంచములో నేడు జరుగుచుండు తీవ్రతర ప్రగతిని మనము నడచుట శ్రేయస్కర"మని యన్నారు. తెలుగు లిపిని పారదోలి అన్యలిపిని తెచ్చుకొను డనుచున్నారు. వీరు ప్రయోజనమే ముఖ్యకారణ మనున ట్లున్నది; భాషగతి యేమగునో చెప్పలేదు. లిపిస్వాతంత్ర్యము లేనిభాష భాష యగునా ? అన్యలిపిని పొందిన భాష స్వాతంత్ర్యమును ఘనతను కోల్పోయి ఒకటిరెండు శతాబ్దములలో అంతరించునని నాయభిప్రాయము. మనదేశమున సెన్సస్కమిషనురిపోర్టుప్రకారం రెండువందల ఇరువది రెండుభాష లున్నవి. ఈ భాష లన్నియు రోమనులిపి యందు వ్రాయబడిన లిపిని చూచినమాత్రాన లిపిభాషను కనుగొనుటకు వీలుండదు. సాంస్కృతభాషలను కొంత భాగము చదివినగాని తెలుసుకొనుట కష్టము. రోమను లిపియందు ౨౬ అక్షరములు కలవు. అందు ౫ అచ్చులు మాత్రమే. ఇందువలన తెలుగులోని శబ్దము లన్నియు వీర్పడనేరవు. రోమనులిపి ననుసరించుటయన్న అక్షరములను, అక్షరములవత్తులను తగ్గించుటయేకాని వేరు కాదు. మనదేశములోని భాషలం దెల్ల తమిళమునకే అక్షరములు తక్కువ. స్వల్పాక్షరములున్నందున టైప్రైటర్స్,లినోటైపులకు దించుట సులభముగా నుండవచ్చును గాని అన్యభాషలను తమిళములో వ్రాయుటకు వీలు లేదు. ఇంతకన్నను విశేషమగు వింతయొక టున్నది. తమిళము తమిళమునందుగాక ఆంధ్రమున వ్రాయబడు చున్నది. తమిళ వైష్ణవగ్రంథము లనేకములు తెలుగులిపి యందు వ్రాయబడి, ముద్రింపబడి తమిళదేశములో విస్తారముగా చదువబడుచున్నవి. దీనికి కారణ మేమన సంస్కృతపదములను తమిళమున వ్రాయుటకు వీలులే నందున. ఆగ్రంథముల సరియైన ఉచ్చారణ చెడిపోకుండ స్థిరముగా నిలుచుటకు తమిళము ఆంధ్రలిపిసహాయమును పొందియున్నది.

తెలుగులిపిని సంస్కరించుప్రయత్నమున అక్షరములమొత్తమును తగ్గించిన నది భాషాసంస్కారమగునే గాని లిపిసంస్కారము కానేరదు. టైప్రైటర్స్ కుపయుక్తమగునట్లు స్వల్పమార్పులచేతనే సాధించి సంస్కరింపబడినలిపిని సామాన్యులుగూడా శ్రమలేకయే చదువగలరు. నాబుద్ధికి తోచినకొన్నిమార్పులను క్రిందవివరించుచున్నాను. ఈమార్పులలో కొన్నిమాత్రము వేరుభాషల మీద ఆధారపడియుండును; కాని చాలమట్టుకు తెలుగు అక్షరములకును, సంజ్ఞలకును స్వరూపములను మార్చక సంస్కారము సూచించుచున్నాను.

తలకట్లు:—హరిసర్వోత్తమరావుగారు హల్లుల ఆకారమును సూచించుటకు తలకట్లకుబదులుగా చిన్న అడ్డగీతను గ్రహించమన్నారు. కుంటిమద్ది శేషశర్మగారు హల్లురూపమునకు ప్రక్కన తలకట్టు నిలుపమన్నారు. ఈరెంటిలో దేని ననుసరించినను టైపురైటరులో ప్రతిహల్లునకును రెండు'కీ' లొత్తవలయును. హల్లు రెండుస్థానముల నాక్రమించును. తలకట్లు లేకున్న హల్లుల స్వరూపమున కేహానియు కలుగదు. తెలుగుభాషకు తలకట్లక్కరలేదని నాయభిప్రాయము. తలకట్లు తీసివేసిన ఇంపుగాని సొంపుగాని తగ్గిపోదు. మన అక్షరములు తోకలవంటి తలకట్లను విసర్జించి మరియు గుండ్రములయి చిత్రత్వమును పొందగలవు. ఇట్లు తలకట్లసమస్య తీరిపోవును. టైప్రైటరులో హల్లు ఒక్కటే స్థానము నాక్రమించును. గుజరాతిభాషకు తలకట్లులేవు. ఈకారణమువల్ల గుజరాతీలు తమభాష వ్రాయుటకును ముద్రించుటకును చాలసులభమనియు, హిందీ,మహా

రాష్ట్రీయము, బంగాళీము మొదలగుభాషలకుగల తలకట్లబరువు వారిభాషకు లేదనియు చెప్పుచున్నారు.

ు; వ, ష; వా, హా; ర, ం; య,యిలకు భేదము తెలియ దనవచ్చును. తలకట్టుకు అడ్డగీత వాడినను, లేక తలకట్టుప్రక్కననిలిపినను న, స, వ, షలకు భేదము తెలియదు. స, ప, హ, య, ర లకు చుక్కలిమిడ్చి స ప హా యి ం యనివ్రాసిన తొందరతీరిపోవును. కన్నడభాషలో స, ప లు వ్రాయునప్పుడు చుక్కను అక్షరమునకు పైనను తలకట్టు క్రిందను పెట్టి న, స, వ, షలకు గలభేదము సూచించుచున్నారు— (సప)

ప్రాకృతవర్ణములగు ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, ధ, థ, ఫ, భ లలో ఛ, ఢ, ధ, ఫ,భలు మనతెలుగువర్ణములకు పొక్కిలిడినమాత్రాన కల్గుచున్నవి. ఈ అక్షరములను గుర్తించుటకు ప్రక్కన శేషశర్మగారు వ్రాసినట్లు ఒకబిందువు నుపయోగించుటయే మంచిది. హిందూదేశమందు కొన్నిభాషలలో చుక్కల నుపయోగించుచున్నారుగాని హరిసర్వోత్తమరావుగారు సూచించునట్లు అక్షరసంజ్ఞలేని త్రికోణబంద మెచటను కానరాదు. హిందీలో చుక్కను తెలుగులోని పొక్కిలికి సమానముగా వాడుచున్నారు.

ఉదాహరణము :

ఉర్దూశబ్దములు Kh = ख़
,, Zh = ज़
,, fha = फ़

క, గ, ట, జ, తలు వత్తక్షరములగునప్పుడు వాటిరూపములు మారి ఖ, ఘ, ఠ, ఝ, థ లవుచున్నవి.

ఈ ౫ అక్షరములలో ఝ ఉపయోగము చాల తక్కువ గనుక మానివేయవచ్చును; లేకున్న జ ప్రక్కని చుక్క నుపయోగించవచ్చును. ఠ సులభముగా ర కడుపున సున్న పెట్టిన కల్గుచున్నది. ఖ, ఘ, థలు తెలుగున విస్తారముగా వాడుచున్నందున, ఈ మూడక్షరములకును వేరురూపములు కల్పింపక మానుట యుక్తమని తోచుచున్నది. హిందీటైప్‌రైటరులో వత్తక్షరములను వాటిసంజ్ఞలను కొంచెముకూడా మార్పక యథావిధిగా వాడుచున్నారు.

అచ్చులవత్తులు:— ఆంధ్రలిపిసంస్కారములో అచ్చువత్తుల సంస్కారమే ముఖ్యాంశము. మరియు వివాదాంశముకూడా. సాధ్యమైనంతవరకును అన్యభాషాశ్రయము లేక మనవత్తులకు (Positional Changes) స్థానికమార్పులు కల్గించి వ్రాసికొన్నలిపి ఆంధ్రత్వమును గోలుపోక గౌరవనీయ మగును. తమిళ అచ్చువత్తులేమాత్రమును మనభాష కుపయుక్తములు కానేరవు. ఇందులకు కారణములు చెప్పుచున్నాను. తెలుగున అచ్చువత్తు లన్నియు అక్షరరూపమునకు పైననో లేక కుడివైపుననో అతికించుచున్నాము. అక్షరమున కెడమవైపున వత్తుసంజ్ఞ వ్రాయుటలేదు. టైపురైటర్ల కుపయుక్తము కావలయునన్న, ఈవిషయము చక్కగా గమనింపవలయును. అక్షరములు, వత్తులు మొదలగునవన్నియు యెడమతట్టునుండి కుడివైపునకే పారుచుండవలయును. భాషలన్నిటను మొదటఅక్షరమును తరువాత అచ్చును వ్రాయుదురు. అరవములో అందరును పోయిన దారిని పోక మొదట అచ్చును సూచించి వెనుక అక్షరమును వ్రాయుచున్నారు.

తెలుగుభాష సాంస్కృతము. అచ్చుదీర్ఘమును వేరుభాషనుండి దిగుమతిచేయక సంస్కృతమునుండి దీర్ఘమునుమాత్రము గ్రహించిన అచ్చుదీర్ఘము లన్నింటిని సూచింపవచ్చును.

దీర్ఘము= ।, ఇత్వము = ●, ఇత్వదీర్ఘము= ●।, ఉత్వము = V, ఉత్వదీర్ఘము = V।, ఋత్వము = [illegible], ఋత్వదీర్ఘము = [illegible], ఒత్వము = [illegible], ఒత్వదీర్ఘము= [illegible]. ఎత్వమున కొక చిన్నయేటవాలుగీత, ఎత్వదీర్ఘమునకు రెండుచిన్న యేటవాలుగీతలు అక్షరముతలపైన కనుపరచిన బాగుండును. ఉదాహరణము, కె= S′, కే= S″. ఐత్వమును (తెలుగు లవత్తు - ‿)ను తమిళములోవలె వ్రాయవచ్చునని కొందరనుచున్నారు. మనఐత్వమును యేటవాలుగా వ్రాసికొన్నయెడల వేరొకభాష నాశ్రయింప నక్కరలేదు. ఉదాహరణము : కై = S/. ఏటవాలుగా ఐత్వమును వ్రాసిన హల్లుల వత్తులను ప్రక్కన వ్రాసిన ట్లగపడును. మరియు అక్షరముతో నంటి వ్రాసిన ట్లుండును. ఇదేప్రకారము తవత్తునుకూడా

యేటవాలుగా అక్షరమునకు కుడివైపున వ్రాయవచ్చును (క్త = S/). ఇక మిగిలియుండునది ఔత్వముమాత్రము. దీనిని విడుదలచేసి పంపవచ్చును. ఔ, అవ్ నకు సరిసమానము. 'అవ్' లో 'వ్'ను ప్రక్కన వచ్చునట్టి అక్షరములతో చేర్చి వ్రాయవచ్చును.

ఉదాహరణములు:—

పౌరుషము = పవ్ రుషము = పవ్రుషము.

గౌతముడు = గవ్ తముడు = గవ్తముడు.

ఔరంగజేబు = అవ్ రంగజేబు = అవ్రంగజేబు.

సౌలభ్యము = సవ్, లభ్యము = సవ్లభ్యము.

ఇట్లు వ్రాసిన ఉచ్చారణ యేమాత్రమును చెడదు.

తెలుగుభాషలోని హల్లులవత్తు లెట్లున్నవో అట్లే వ్రాయక తప్పదు. వీటిని వదిలివేసి హల్లురూపమునే వాడుటలో సౌలభ్య మేమియు కానరాదు. టైప్‌రైటరులో యెట్లైనను వత్తును సూచించుట కొక కీలొత్తి కావలయును. హల్లునకు బదులు వత్తునే వాడిన మంచిది. టైప్‌రైటరులో అక్షరముక్రిందనే వత్తునుకూడా యిముడ్చవచ్చును. హిందీటైప్‌రైటరులో వత్తుల నన్నిటిని యిముడ్చియున్నారు. వత్తులు తెలుగుభాషకు చాల ప్రధానమైనవి. ఇవి తెలుగుభాషలోమాత్ర ముండి తృప్తిచెందక సులయాళభాషకును, తమిళగ్రంథలిపికిని ప్రయాణములుం గావించి వాటి నల్లుకొనియున్నవి. రవత్తు తక్కినవత్తులవలె కుడివైపున వ్రాసిన టైప్‌రైటరునకును, అచ్చునకును సౌకర్యముగా నుండును.

వ్యాసవిలేఖకులకు మనవి

వ్యాసాలు ఎనిమిదిపుటలకు మించకుండా ఉండాలి. వ్యాసరచన రంజకంగా ఉండాలి. శాస్త్రీయవిషయాలనుగురించిన వ్యాసాలుకూడా ఎక్కువ పరిభాషా, ఎక్కువ వివరాలూ లేకుండా సంగ్రహంగాను, సామాన్యపాఠకునికి విషయం బోధపడేటట్టు సులభంగాను, మనస్సును కథలా ఆకట్టేటట్టు ఆకర్షకంగాను ఉండాలి. శాసనవ్యాసాలు పదిపన్నెండు పుటలకు మించేయెడల రెండుసంచికలలో ప్రకటింపవలసివచ్చును.

దేశాన్ని ఎక్కువగా కలవరపరుస్తున్న సాంఘిక ఆర్థిక, రాజకీయాది విషయాలనుగురించీ, మనఆంధ్రుల ప్రత్యేకసమస్యలనుగురించీ ప్రత్యేకవ్యాసాలు కావాలి. సాధ్యమయినంతవరకు ఎత్తుకునే విషయంలోను, చూచేదృష్టిలోను, రచించేరచనలోను కొత్తదనం కావాలి. మన ఉద్యమాలూ, మనదేశం, మనసంఘం, మనఆశయాలు భారతిలో ప్రతిఫలించేటట్టు చూడవలసిందని వ్యాసకర్తలకు మనవి.—భా. సం.

పుస్తకసమీక్ష

స్వదేశసంస్థానములు

కర్త: నార్ల వెంకటేశ్వరరావుగారు. ప్రకాశకులు: నవయుగప్రచురణాలయం, పెదసనగల్లు, కృష్ణా.

ఇటీవల కొంతకాలంనుంచి మన దేశంలో ప్రజల దృష్టి స్వదేశ సంస్థానములవంకకు మరలింది. ఇందుకు రెండు కారణాలు: (౧) ఫెడరేషనులో సంస్థానప్రజల ప్రాతినిధ్యం ముఖ్య ; (౨) మైసూరు, తిరువాన్కూరు, నిజాంరాజ్యాలలో ప్రజలు సాగించిన, సాగిస్తూవున్న సత్యాగ్రహోద్యమమూను. ఆ సంస్థానాలవా రవలంబిస్తూవస్తున్న నిర్బంధవిధానాన్ని బట్టి ఆఖరుకు కాంగ్రెస్సుకూడా ఈ సంస్థానముల సమస్యవిషయమై ప్రత్యక్షంగానో, అప్రత్యక్షంగానో కలుగజేసికోక తప్పనిసరి అవుతున్నది. ఏదో ఒకవిధంగా ఈనిర్బంధవిధానం పెద్దసంస్థానాలలోనూ, చిన్న సంస్థానాలలోనూ ఉంటూనే ఉన్నది. కొన్నికొన్ని సంస్థానాలలోని ప్రజలు సంస్థానాధిపతుల నిరంకుశ, నిర్దాక్షిణ్యపరిపాలనమును సహింపలేకా, ఆ నిర్బంధవిధానానికి ఓర్చుకోలేకా మహాత్ముడు ప్రసాదించిన సత్యాగ్రహాయుధముతో జన్మసిద్ధములైన తమ హక్కు స్వత్వములకోసం, స్వామ్యములకోసం పోరాడుతున్నారు. ఇంకా కొన్ని సంస్థానములలో ఆ విధంగా తలయెత్తడానికికూడా ఓపికలేక పడి ఊరుకొంటున్నారు. సంస్థానాలలోని ప్రజలు సత్యాగ్రహంకూడా జరుపవలసిన స్థితిగతులు ఎందువల్ల కలిగినవో, ఈ సంస్థానాలను పాలించు పాలకుల చర్యలెట్టివో నార్లవారి యీ గ్రంథాన్ని చదివితే చక్కగా బోధపడుతుంది.

స్వదేశసంస్థానాలలోని ప్రజల స్థితిగతులు, పన్నుల భారము, దైనికజీవితానికి ప్రజల కవసరమయ్యే వస్తువులనుకూడా ఇజారా కిచ్చేపద్ధతి, ప్రజల విద్యా దారిద్ర్యము, సంస్థానాధీశుల విలాసజీవనము, వారి నిరంకుశ, అమానుష, విలాసచర్యలు. ఈ మొదలైనవాటి నన్నిటిని శ్రీ నార్లవారు ఈ చిన్నపుస్తకంలో ప్రసిద్ధములైన పత్రికలలోని, విఖ్యాత గ్రంథకర్తల గ్రంథాలలోని రచనలను, అంకెలను, అంశములను ఉదాహరిస్తూ సప్రమాణంగా తేటతెల్లముగా వ్రాశారు. ఈ పుస్తకమును చదివినతరువాత 'ఈవిధంగా ఉండేసంస్థానపాలనావిధానం ఎంతత్వరలో మారితే అంత మంచిది' అని అనుకోనివాడుండడు.

ఈ సంస్థానాలలో ప్రజ లెట్టి కష్టాలపా లవుతున్నారో ఈ పుస్తకం చదివితే కొంత తెలుస్తుంది. "నవానగరు సంస్థానమునందు పొగాకు, కిరసనాయలు, పెట్రోలు, అగ్గిపెట్టెలు వగైరాలను ఇజారా పాడినవారే అమ్మకోవలెను!!" "ప్రత్తిమరలుకూడ ఈ సంస్థానమున ఇజారాలో నున్నవి!!" "ఇక్కడి మరలలో పట్టించక ఎవరైన ప్రత్తిని బయటికి ఎగుమతి చేసినచో వారికి మణుగు ఒకటికి అయిదురూపాయలు జరిమానా!" "నవానగరు సంస్థానమునకూడ మించినది గోండల్! ఈ సంస్థానము అమలుజరుపుచున్న ఇజారా లివి: పంచదార, బెల్లము, కలప, మంచుగడ్డ, కిరసనాయల్, పెట్రోల్, సబ్బు, రాయి, సున్నము, తోళ్లు, నూనెగానుగలు, కట్టెమోపులు, మోటార్‌లారీ సర్వీస్, సినిమా, పచ్చికబయళ్లు, కల్లు — సారాయములు, నల్లమందు, భంగ్ గంజాయలు." కొన్నికొన్ని సంస్థానాలలో ప్రత్యేకమైన కొన్నిరోడ్లమీద నడచినవారికీ, వెళ్లిన బండ్లకికూడా పన్నే! సంస్థానాలలోని బేగారి పద్ధతి, వెట్టిచాకిరీలను గురించి వేరే చెప్పనక్కరలేదు. శిస్తులను వసూలుచేయడం విషయంలోను, శిస్తులను పెంచడం విషయంలో కొన్ని కొన్ని సంస్థానములలో ఎట్టెట్టి పద్ధతు లవలంబింపబడుతున్నాయో తెలుసుకోవాలంటే లోహార్, సికార్ సంస్థానాల కథలు చదివితే చాలు. ఏ సంస్థానంలోనూ ప్రజలకు వాక్స్వాతంత్ర్యం లేనేలేదు. సభలు జరుపుకోడానికి, తీర్మానములు చేయడానికి ప్రజలు ముందుగా సంస్థానాధిపతుల అనుమతి పుచ్చుకోవడంమాట అటుండగా ఆసభలలో చేసే ఉపన్యాసాలనూ, తీర్మానాలనుకూడా వ్రాసి ముందుగా అధికారులకు చూపాలి. పత్రికా స్వాతంత్ర్యా

అంతకుమునుపే లేదు. సంస్థాన ప్రజలు వైద్య సహాయమునకుగాని, విద్యా సౌకర్యములకు గాని నోచుకోవడం లేదనే చెప్పాలి. ప్రజలు ఇట్టి దిక్కుమాలినస్థితి అనుభవిస్తూ ఉండగా సంస్థానాధిపతుల చర్యలు మహాఘోరంగానూ, హేయంగానూ ఉన్నవి. వారినిగురించి తెలిపేకొన్ని కథలిందులోవి చదివితే ఒళ్లు కంపరమెత్తుతుంది. తాము ఖర్చుపెట్టే అడ్డమైన ఖర్చులకూ సంస్థానాధీశులు ప్రజలనుండి నయానభయాన డబ్బు గుంజుతున్నారు. ఏకొద్ది విషయాలలోనో ఏకొద్ది భేదాలతోనో తప్ప సంస్థానాలన్నీ కొంచెమించుమించుగా ఇట్లాగే ఉన్నాయి.

ఇట్టి సందర్భాలలో ఈపుస్తకాన్ని వ్రాసినందుకు నార్లవారినీ, ప్రకటించినందుకు ప్రకాశకులనూ అభినందించాలి. ప్రతివారూ తప్పక చదువవలసిన పుస్తకం ఇది.

దీనికి శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు విపులమయిన, అమూల్యమయిన పీఠిక వ్రాశారు. వారు తమ పీఠికలో చెప్పినట్లు "ముఖ్యంగా హైదరాబాదుసంస్థానంలోని తెలుగువారిలో ఈ పుస్తకం ప్రచారం" కావాలని కోరుతున్నాము.

మ. సో. శర్మ

తోరణము

[గ్రంథకర్త:— మధునాపంతుల సత్యనారాయణమూర్తిగారు. ప్రకాశకులు: ఆంధ్రకుటీరము వారు, పల్లెపాలెము, Via, కాకినాడ, తూర్పు గోదావరిజిల్లా.]

ఇది పద్యగ్రంథము. ఇందలి శిల్పశిక్షలో, దుర్మార్గ వర్తనుడగు కొడుకును మంచిమార్గములోనికి తేవలెనని తండ్రిపడినబాధ వర్ణితమైనది. మధువర్గునందు జరాభారమున గలుగుదశలు బాగుగ వర్ణింపబడినవి. పరిత్యక్త, సందేశము మొదలయినవి చదువదగినవి. దీనికి పీఠిక వ్రాసిన శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు వ్రాసినట్లు "శిల్పి రచనలో కంటినడక యుండదు. చక్కని శయ్యకలదు."

గోభూమి

[కర్త: నాగేశ్వరరావుగారు: కిసాన్ ప్రెస్, 23 స్ట్రింగర్‌వీధి, మద్రాసు, వెల, ౪ అణాలు.]

ఇది గోగణాన్నిగురించి రైతుపరంగా వ్రాసిన చక్కనిపాటల పుస్తకం. దీనికి శ్రీమతి భారతీదేవి గారు పీఠిక వ్రాయుచు ఇట్లనుచున్నారు: "గోభూమి" మన రైతులకేగాక ప్రజానీకమున కంతకు అభిమానమును, ఆత్మగౌరవమును, జీవకారుణ్యమును, స్వాతంత్ర్య ప్రియత్వమును కల్గించుచున్నది." గోభూమి లలితమైన భావాలు గల పాటలతో రంజకంగా ఉంది.

ఆవేదన

శ్రీ బి. యస్. మూర్తి (పార్లమెంటరీ కార్యదర్శి) గారు రచించిన హరిజన ప్రబోధ కావ్యము. భారతమాతృస్తవము, గాంధీస్తుతి, అస్పృశ్యతా నిరసనము, మేలుకొలుపు, మతపరివర్తనము, హరిజనకుమారి మొదలైన శీర్షికలతో ఇందు చక్కనిపద్యములు కలవు. ధారాళమైన కవిత్వము. సరళమయిన రచన. గాంధీమహాత్ముడు రాజకీయరంగమున కవతరించినపిదప హరిజనులలో ఎట్టిప్రబోధము కలిగినదో, హరిజనహృదయము అస్పృశ్యతా కళంకమున కెంత కందురుచున్నదో ఈ 'యావేదన' చదివిన కొంత బోధపడగలదు. ఇది హరిజన ప్రబోధమున కెక్కుడుగ తోడ్పడు నని నమ్ముచున్నాము.

గ్రంథస్వీకారము

శివానందలహరి :— శ్రీ మచ్ఛంకర భగవత్పాదాచార్య కృత శ్లోకములకు ఆంధ్రపద్య తాత్పర్యములు. అనువాదకులు: విద్యాభూషణ నూరాచత్తుల సూర్యనారాయణగారు, రాజమహేంద్రవరము. వెల రు ౧-౮-౦లు.

సిద్ధిగణపతినీతులు :— రచయిత : అల్లక వీరభద్ర కవిగారు, లక్ష్మీవారపుపేట, రాజమహేంద్రవరము. వెల రు. ౦-౬-౦ లు.

వేదము వేంకటరాయశాస్త్రి సంస్మృతి :— రచయిత: గుత్తిం వేంకట సుబ్బరామయ్య, యం. ఏ గారు;. ప్రకాశకులు 'సాధక్ అండ్ మూర్తి' గారలు, ట్రంకురోడ్డు, నెల్లూరు. వెల రు. ౦-౧౨-౦ లు.

వాణీ నిబంధమణిమాల (సంస్కృత వ్యాసములు) :— లేఖకుడు : కర్ణవీర నాగేశ్వరరావుగారు, హిందీభవన్, జాండ్రపేట, చీరాలపోస్టు, గుంటూరుజిల్లా.

రత్నపరీక్ష :— భైరవ కవి విరచితము. వేదునూరి గంగాధరంగారు తాత్పర్యము వ్రాసిరి. ప్రకాశకులు: సత్యనారాయణ బుక్ డిపో, రాజమండ్రి. వెల, రు. ౦-౮-౦లు.

కుక్కుటశాస్త్రము (కోడిపందెములప్రతి) :— గ్రంథ సంధాత: వేదునూరి గంగాధరంగారుతాత్పర్యము వ్రాసిరి. ప్రకాశకులు: సత్యనారాయణ బుక్ డిపో, రాజమండ్రి. వెల, రు. ౦-౮-౦లు.

బ్రిటిష్ మహాయుగము :— గ్రంథకర్త: మానికొండ సత్యనారాయణశాస్త్రిగారు. (మేజర్ బి. డి. బాసు, ఐ. యమ్. యస్. గారి 'Rise of the Christian Power in India' అను గ్రంథము ననుసరించి వ్రాసినది. మొదటిసంపుటము వెలువడినది. రెండవసంపుటము త్వరలో వెలువడనున్నది. ప్రకాశకులు : సేవాశ్రమము, పెదపాలెము, Via, దుగ్గిరాల, గుంటూరుజిల్లా. రెండుసంపుటములు కలిసి రు. ౬-౦-౦. వలయువారు, పాతూరి నాగభూషణంగారికి సేవాశ్రమమునకు వ్రాయవలెను.

హంసవింశతి :— కర్త: అయ్యలరాజు నారాయణామాత్యుడు. శృంగారకావ్యగ్రంథమండలి ప్రబంధ పరంపరలో ఇది నాలుగవగ్రంథము. ప్రకాశకులు : శృంగారకావ్య గ్రంథమండలివారు, మచిలీపట్టణము, కృష్ణాజిల్లా.

పతంజలి చరిత్ర :— కర్త : మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారు, ఆంధ్రీకుటీరము, పల్లెపాలెము, ఇజరంపోస్టు, కాకినాడతాలూకా, తూర్పు గోదావరిజిల్లా. ఇది పదిహేను పుటల చిన్నిపొత్తము. 'త్రిలింగ' పత్రికనుండి పునర్ముద్రితము. రామభద్ర దీక్షితులు సంస్కృతమున కావ్యరూపముగా వ్రాసినదాని ననుసరించి వ్రాసిన దిది.

మాచరల చెన్నకేశవ శతకము :— కర్త : 'కవితా కోవిద' రావిపాటి లక్ష్మీనారాయణగారు, గురజాల, గుంటూరుజిల్లా.

సుకుమారి :— కీర్తిశేషురాలు శ్రీమతి మాగంటి అన్నపూర్ణాదేవిగారి జీవితమును 'సుకుమారి' యను పేర కావ్యముగా రచింపబడినది. కర్త: కొత్తపల్లి సుందరరామ కవిగారు: ప్రకాశకులు: అన్నపూర్ణాదేవి స్మారకసంఘము, బెజవాడ; వెల రెండణాలు.

ప్రేమలత :— కర్త: టి. కొల్లప్పగారు, తలమర్ల, కొత్తచెరువు పోస్టు, అనంతపురం జిల్లా. వెల రెండణాలు. ఇది పదిహేను పుటల చిన్నిపొత్తము.

"అన్ టాస్ట్ అన్ టచబిలిటీ" :— కర్త : పి. వెంకయ్యగారు. హిందూదేశంలో పాఠశాలలలో చదివే విద్యార్థులను డిటెయిన్ చేయకూడదనీ, పరీక్షలు తీసివేయాలనీ, సరిగా పాఠశాలకు హాజరవడమూ, పాఠశాలలో చదవడమే పైతరగతిలోకి 'ప్రమోషన్' చేయడానికి తగిన యోగ్యతగా గణింపవలసిందనీ ఉద్బోధిస్తూ వ్రాసినపుస్తక మిది. వెల ౨ అణాలు; వలయువారు, పి. పరశురామయ్య అండ్ కో వారికి గుంతకల్లు (అనంతపురంజిల్లాకు) వ్రాయవలెను.

పత్రికా స్వీకారము

తెలుగు కలావిలాసిని :— లయొలా కలాశాలలోని "ఆంధ్రవాఙ్మయ సమితి" సభ్యులు 'తెలుగు కలా విలాసిని' యను పేర వార్షిక సంచికలను నాలుగు సంవత్సరములనుండి యేటేట ముద్రించి ప్రకటిస్తున్నారు. వీనిని నిర్వహించు సంపాదకవర్గ మొకటి కలదు; కలాశాలా ప్రధానాంధ్ర పండితులగు శ్రీ ఆకుండి పరబ్రహ్మశాస్త్రిగారు సంపాదకులుగను ప్రతి తరగతికి ప్రతినిధిగ ఒక్కొక్క సభ్యుడును ఏర్పడి దీనిని కొనసాగిస్తున్నారు. ఇందు విద్యార్థులు గ్రాంథిక, వ్యావహారిక భాషలలో రచించినపద్య, గద్య రచన లున్నవి. సంచిక సాంఘిక, చారిత్రకాది వ్యాసములతోను, కావ్య విమర్శలతోను, ఖండ కావ్యములతోను, నాటికలతోను హృదయాకర్షకముగ ఉన్నది. ఇందలి పద్య, గద్యవ్యాసములను చదివినప్పుడు ముందు ముందు అభివృద్ధికి వచ్చి దేశమునకు పేరు ప్రతిష్ఠలార్జింపగల యువజనులు అనేకులు బయలుదేరుతున్నారని మనస్సునకు ఆనందము గలుగుతున్నది. తెలుగుకలావిలాసిని లయొలా విద్యార్థి సంఘాభ్యుదయమునకు తోడ్పడి వన్నెకెక్కవలెనని కోరుచున్నాము.

బసవపురాణము

గ్రంథకర్త:—పాల్కురికి సోమనాథకవి

పరిష్కర్త :—వేటూరి ప్రభాకరశాస్త్రిగారు. వెల ౨-౮-౦

పన్నెండవ శతాబ్దమున వెలసిన శైవమత ప్రతిపాదకమగు ద్విపదకావ్యము. ఇందు శైవమతోద్ధారకు డగు బసవేశ్వరునియు, తత్పూర్వులు తత్సమకాలీనులు నగు శివభక్తులయు చరిత్రములను వరసముగను, పాఠకులు మనసు కరగి తన్మయు లగునట్లుగను, కవి వర్ణించినాడు. గ్రంథమున మృదుమధురములగు జానుదెనుగు పలుకుల జాలువార్చి రచనమున ముద్దులుగురిపించినాడు. గ్రంథము భిన్న భిన్న మండలములకు జెందిన పెక్కు తాళపత్ర మాతృకలతో సరి చూచి పరిష్కరింపబడినది. పాఠాంతరములు సూచింపబడినవి. పరిష్కర్త రచియించిన అమూల్యమగు పీఠిక (129 పుటలు) ఇందు గలదు.